OWNER OF BOOK :DURGA CHARAN NELABHOTLA

వేదాలలో నిర్దేశించిన విహితకర్మలు,
ధర్మాలు, ఆచరించవలసిన విధానాలు,
సామాన్యులకు తెలియజేసే
అపూర్వ ధర్మశాస్త్ర గ్రంథం

# ధర్మసింధు



OWNER OF BOOK : DURGA CHARAN NELABHOTLA

శ్రీ మద్విజయగర సంస్థానాస్థ విద్వాంసులగు

**శ్రీ బ్రహ్మశ్రీ కొల్లూరి కామశాస్త్రిగారిచే పరివర్తితము**

OWNER OF BOOK : DURGA CHARAN NELABHOTLA

ఓం

# ధర్మసింధు

OWNER OF BOOK : ND CHARAN

**శ్రీమద్విజయనగర సంస్థానాస్థన విద్వాంసులగు**
**బ్రహ్మశ్రీ కొల్లూరి కామశాస్త్రిగారిచే పరివర్తితము**

OWNER OF BOOK: DURGA CHARAN NELABHOTLA




పబ్లిషర్స్ : ☎ 246 2565

**మోహన్ పబ్లికేషన్స్**

**అజంతా హోటల్ ఎదురుగా,**
**కోటగుమ్మం, రాజమండ్రి -533 101.**

**2016** వెల : **300-00**


DURGA CHARAN NELABHOTLA

DURGA CHARAN NELABHOTLA

**Like us on follow Face book / Mohan publications**
**google play android app / Mohan publications**
**www.granthanidhi.com / *www.mohanpublications.com***
***e-books at :- www.kinige.com***

# విషయ సూచిక


ఉపోద్ఘాతము 12

**ప్రథమపరిచ్ఛేదము**

సంక్రాంతి భేదములు 17
ప్రతిపదాది తిథి నిర్ణయము 26
తదియ మొదలగువాని నిర్ణయము 27
విదియ మొదలగువాని నిర్ణయము 27
చతుర్థీ నిర్ణయము 27
పంచమీ నిర్ణయము 27
షష్ఠీ నిర్ణయము 27
సప్తమీ నిర్ణయము 28
అష్టమీ నిర్ణయము 28
నవమీ నిర్ణయము 28
దశమీ నిర్ణయము 28
ఏకాదశీనిర్ణయము 29
ఏకాదశీ వ్రతప్రయోగము 32
ఎనిమిదిమహాద్వాదశీలనిర్ణయము 33
త్రయోదశీనిర్ణయము 35
చతుర్దశీ నిర్ణయము 35
పూర్ణిమా నిర్ణయము 36
ఇష్టికాల నిర్ణయము 36
చతుర్విధ సంధులు 37
పౌర్ణమాసియందు విశేషము 38
అమావాస్యలయందు కాకతీయులకు విశేషము. 39
సామగుల కిష్టి నిర్ణయము 40
పిండపితృయజ్ఞకాలము 40
శ్రాద్ధమందమావాస్య నిర్ణయము 41
ఇష్ట్యాదుల ప్రారంభ నిర్ణయము 42
వికృతికర్మలకు కాలనిర్ణయము 43
చాతుర్మాస్యకాలము 43
కామ్యనైమిత్తికేష్ట్యాదుల నిర్ణయము 44
ఆధానము 44
గ్రహణ నిర్ణయము 45
గ్రహణవేదివిచారము 48
గ్రస్తాస్తమయ విచారము 48
సముద్రస్నానవిధి 49
తిథినక్షత్రాదులయందు విధినిషేధములు 50

**ద్వితీయ పరిచ్ఛేదము**

మంగళాచరణము 51
చైత్రశుక్లప్రతిపదయందు సంవత్సర ప్రారంభము 52
ప్రపాదానము 52
ఉదకకుంభదానము 52
ఆందోళినీ వ్రతము 53
దశావతార జయంతులు 53
చైత్రశుద్ధచతుర్థియందు గణేశుని దమనపూజ 54
పంచమియందు నాగపూజ 54
శుక్లనవమీ రామనవమీ –వ్రతప్రయోగం 54
దేవీనవరాత్రి సమాప్తి 56
చతుర్దశియందుశివునికి –దమనోత్సవము 56
చతుర్దశియందు నృసింహ –డోలోత్సవము 58
వైశాఖశుక్లతృతీయయందు గంగా స్నానము 60
వైశాఖశుక్లసప్తమియందు –గంగోత్పత్తి 62
వ్రతవిధానము 62
జ్యేష్ఠమాసకృత్యము 63
నిర్జల వ్రతము 67
ఆషాఢమాసము 68
చాతుర్మాస్యారంభము 69
నిత్య వ్రతములు 70
గ్రామ్య వ్రతములు 71
వామనపూజ 71

శ్రావణమాసము 73
ఉపాకర్మకాలము 76
యజుర్వేదుల కుపాకర్మనిర్ణయము 77
అధర్వణవేదుల కుపాకర్మనిర్ణయము 78
సామవేదుల కుపాకర్మనిర్ణయము 78
బ్రహ్మచారులకు ప్రథమో
-పాకర్మనిర్ణయము 79
రక్షాబంధనము 80
పూర్ణిమ నిర్ణయము 80
శ్రవణాకర్మసర్పబలి 80
సంకష్టహరణ వ్రతము 81
జన్మాష్టమీ వ్రతనిర్ణయము 81
జన్మాష్టమీ జయంతుల నిర్ణయము 81
వ్రత ప్రయోగము 84
నందపూజ 86
కుశసంగ్రహణము 88
భాద్రపదమాసము 89
సిద్ధివినాయక వ్రతము 89
శుక్ల చతుర్థిలో చంద్రునిజూచిన
– మిథ్యాపవాదము 89
ఋషిపంచమీ వ్రతము 90
సూర్యషష్ఠి 90
శుక్లాష్టమి, దూర్వాష్టమి 90
జ్యేష్ఠాదేవీపూజా 90
విష్ణుపరివర్తనోత్సవము 91
శ్రవణద్వాదశీవ్రతము 91
పారణ నిర్ణయము 93
వామన జయంతి 93
అగస్తి పూజనము 95
మహాలయము 95
భరణీశ్రాద్ధనిర్ణయము 99
సన్న్యాసిమహాలయము 101
మఘాయుక్త త్రయోదశీశ్రాద్ధము 101
శస్త్రహత మహాలయము 102
యమాగజచ్ఛాయ 103
దౌహిత్ర శ్రాద్ధము 103
కపిలాషష్ఠి 103
సూర్యవ్రతవిధి 103
దేవీ నవరాత్రారంభము 104
నవరాత్ర్యమం దనుకల్పములు 106
కలశస్థాపనవిధి 106
సప్తశతిపఠించువిధి 107
కుమారీపూజ 109
ఉపాంగలలితా వ్రతము 110
సరస్వతీపూజ 110
మహాష్టమీ నిర్ణయము 111
మహానవమీ నిర్ణయము 112
నవమి యందే హోమము
బలిదానము 113
జాతమృతాశౌచనములో దేవత
-కుద్వాసన నిర్ణయము 113
ఛత్రాదిపూజ 113
పారణకును దేవతావిసర్జనమునకును
గాల నిర్ణయము 114
విజయదశమీ నిర్ణయము 114
శమీపూజనము 115
కార్తికస్నానము 117
తులసీపూజ 117
ధాత్రీ మహాత్మ్యము 118
హరిజాగరవిధి 118
కార్తికమందు వర్జ్యములు 119
వ్రతాంతమందు దానములు 119
ఆకాశ దీపదానము 120
ఆశ్వయుజకర్మ 121
అగ్రయణకాలము 121
కృష్ణచతుర్థి లేక కరక చతుర్థీ వ్రతము 123
గోవత్సద్వాదశి 123
నరకచతుర్దశి నిర్ణయము 124
యమతర్పణము 125
అమావాస్యయందభ్యంగము 125
కార్తికమాసము 126
బలిపూజ 127

లక్ష్మీకుబేరపూజ 127
గోవర్ధన పూజ 128
అపరాహ్ణమందుమార్గపాళీబంధనము 128
భీష్మ పంచకవ్రతము 129
తులసీకాష్ఠమాలాధారణము 129
ధాత్రీ కాష్ఠమాలాధారణము 131
ధాత్రీమూలయందుదేవపూజ 131
ద్వాదశియందుబారణనిర్ణయము 132
విష్ణుప్రబోధత్సవ తులసీవివాహముల ప్రయోగము 132
వైకుంఠచతుర్దశి 134
కార్తిక శుక్లద్వాదశియు పౌర్ణమాసియ -మన్వాదులు 135
కార్తికేయుని దర్శనము 136
వృషోత్సర్గము 136
కార్తిక కృష్ణాష్టమి కాలాష్టమి 136
మార్గశీర్ష మాసము 136
దత్తాత్రేయోత్పత్తి 137
పౌషమాసకృత్యము 138
శివపూజా వ్రతము 139
మాఘస్నానము 140
పౌషమావాస్యయందర్ధోదయ -యోగము 142
మాఘమాసము 143
తిలదానవిధి 143
సాలగ్రామ హిరణ్యాదానములు 144
ప్రయాగమందు వేణీదానము 144
రతికాముల పూజ 145
మాఘశుక్లాష్టమి భీష్మష్టమి 146
మాఘశుక్ల ద్వాదశియందుతిలోత్పత్తి 147
మాఘస్నానోద్యాపనము 147
అష్టకాశ్రాద్ధములు 147
శివరాత్రి నిర్ణయము 148
పారణ నిర్ణయము 148
శివరాత్రి వ్రత ప్రయోగము 148
పార్థివలింగపూజావిధి 152
లింగ విశేషముచే ఫలవిశేషము 152
ఫాల్గుణమాసము 153
హోళిక పూజ 153
భద్రాముఖ పుచ్ఛలక్షణము 154
హోళికాపూజావిధి 154
శుభకార్యమునకు వర్జ్యములు, అందు వచనము 155
చంద్రాదులకు సంక్రమణమైనచో -ఋణ్యకాలము 156
గ్రహస్నానములు 157
గ్రహదానములు 157
శనివ్రతము 158
శనిస్తోత్రము 158


**తృతీయ పరిచ్ఛేదము-పూర్వార్థం**


మంగళాచరణము 159
గర్భాదానసంస్కారము 159
ప్రథమ ఋతువున పసుపు -కుంకుమను ధరించుట 160
సర్వరజస్వలకు సాధారణనిర్ణయము 160
భువనేశ్వరీశాంతి 164
సామాన్యముగ స్మార్తకర్మలకు కావలసిన పూర్వంగపరాంగములు 164
గర్భాధాన కాలము 165
ఋతువునందు సంగమము జేయని దోషమున కపవాదము 166
గర్భాదానహోమవిధి 167
అగ్నిద్వయసంసర్గము 167
గర్భాదానప్రయోగము 167
నాందీశ్రాద్ధవిచారము 168
జీవత్పితృకుడువృద్ధిశ్రాదముజేయుట 169
గర్భాదాన సంస్కారము 171
నారాయణబలి 172
నాగబలి 173
హరివంశ శ్రవణాదివిధానము 176
ప్రాజాపత్య ప్రత్యామ్నాయములు 177
ప్రాజాపత్యము 177

ప్రాయశ్చిత్త ప్రయోగము 178
భస్మస్నానము 178
గోమయస్నానము 179
మృత్తికాస్నానము 179
జలస్నానము 179
సంతతివృద్ధికై ప్రకారాంతరము 180
సంతతివృద్ధికై విధానంతరములు 181
దత్తకునియందు
(గ్రాహ్యాగ్రాహ్యవిచారము) 181
ఋగ్వేదులకు ఋత్రప్రతిగ్రహము 183
యజుర్వేదములకు
భేదాయనోక్తరీతిని ప్రయోగము 184
దత్తోపయోగినిర్ణయము 185
పుత్రకామేష్ఠి 186
కపుంసవనము 187
సీమంతకాలము 187
సీమంతోన్నయనము 188
సీమంతాన్నభోజన ప్రాయశ్చిత్తము 188
గర్భిణీధర్మములు 189
గర్భిణీ పతి ధర్మములు 189
గర్భిణీపతికి నిషేదించినవానిలో
నపవాదము 190
గర్భస్రావహరమైన కాంచన
యజ్ఞోపవీతధారణవిధి 190
సూతికాగృహప్రవేశము 191
సుఖప్రసవమునకుపాయము 191
జాతకర్మ 192
జాతకర్మకు నక్షత్రములు 193
జన్మదేవతలపూజ 193
అశౌచమందు కర్తవ్యనిర్ణయము 194
అన్వాధానసూతక నిర్ణయము 195
సూతికకు శుద్ధి 196
గోప్రసవశాంతి 196
కృష్ణచుతర్ధశి జననకాంతి 197
సినీవాలీ, కుహూ, దర్శ అను నమా
వాస్యలో భేదములకు శాంతులు 198
దశదానముల పరిమాణము 199
దర్శశాంతి 199
నక్షత్రశాంతి 200
సర్వశాంతులకు నుపయోగించు
నిర్ణయము 201
అభుక్తమూల జననశాంతి ప్రయోగము 202
ఆశ్రేషాజననశాంతి 204
జ్యేష్ఠా నక్షత్రఫలము 205
చిత్రాది నక్షత్రజననశాంతి 206
వ్యతీపాత వైధృతిసంక్రాంతిశాంతులు 206
వైధృతి శాంతిలో విశేషము 207
ఏకనక్షత్ర జననశాంతి 207
గ్రహణశాంతి 208
నక్షత్ర గండాంత జననశాంతి 208
వాగీశ్వరీదానము 209
తిథిగండాంత లగ్న
-గండాంతములకుశాంతి 209
దినక్షయాది శాంతి 210
వర్జ్యఘటికలకు శాంతి 210
యమళ జననశాంతి 211
ప్రసవశాంతి 212
దంతజననశాంతి 212
ప్రసవవైకృతశాంతి 213
నామకరణము 214
స్త్రీలకు నామకర్మ 216
డోలారోహణము 217
దుగ్ధపానము 217
జలపూజనము 217
సూర్యావలోకన నిష్క్రమణములు 217
అన్నప్రాశనము 218
కర్ణవేధ 218
దృష్టిదోషక నివారక రక్షావిధి 219
వర్ధాపన విధి 220
షష్ఠీదేవీ ప్రార్థన 220
చౌలము-చూడాకర్మము 221
కూశ్మాండహోమము 222

| | |
|---|---|
| విద్యారంభము | 223 |
| అనుపనీతధర్మములు | 223 |
| ఉపనయనము | 224 |
| ఉపనయనకాలములు | 224 |
| తిథి విచారము | 225 |
| నిత్యానధ్యాయములు | 226 |
| నైమిత్తికానధ్యాయములు | 227 |
| వారములు | 228 |
| నక్షత్రములు | 229 |
| లగ్న గ్రహములకు ఫలములు | 229 |
| లగ్నగ్రహఫల శాంతి | 230 |
| పదార్థసంపాదనము | 230 |
| ఉపనయన విశేషములు | 233 |
| పాదోపసంగ్రహణ ప్రకారము | 233 |
| ప్రత్యభివాదనము | 234 |
| వినాయక శాంతి | 234 |
| బృహస్పతి శాంతి | 235 |
| ఉపనయనాదులందు సంకల్పములు | 237 |
| శాంతి ప్రయోగము | 239 |
| వటువ్రతము | 240 |
| మండపదేవతోద్వాపనము | 240 |
| ఆయుద్వాసన ముపర్యంతము నిషేధములు | 241 |
| మూగవానికి బధిరునికి గాయత్రి జెప్పుట | 241 |
| ఋగ్వేదీయ పునరుపనయన త్రివిధప్రాయశ్చిత్త ముపనయన విశేషములు | 242 |
| ఋగ్వేదీయ పునరుపనయన ప్రయోగము | 244 |
| యజుర్వేదులకు పునస్సంస్కారము | 246 |
| బ్రహ్మచారి ధర్మములు | 246 |
| అనధ్యాయములు | 247 |
| అధ్యయన ధర్మములు | 248 |
| వ్రతములు | 248 |
| సమావర్తనము | 249 |
| సమూవర్తనకుకాలము | 250 |
| సమావర్తనాధికార ప్రధానహోమము | 250 |
| సమూవర్తన సంకల్పములు | 251 |
| స్నాతకవ్రతములు | 252 |
| సమావర్తనమున కనుకల్పము | 253 |
| సమావర్తనమైన పైని యాశౌచనిషేధము | 253 |
| వివాహమందు గ్రహమైత్రి | 254 |
| గుణవిచారము | 254 |
| గణములు | 255 |
| గుణములు రాశికూటము | 255 |
| నాడీవిచారము | 255 |
| వధూలక్షణము | 256 |
| అసపిండనిర్ణయము | 256 |
| గోత్రప్రవర నిర్ణయము | 257 |
| గోత్ర ప్రవర గణనము | 263 |
| మాతృగోత్రము వర్జించుటకు నిర్ణయము | 270 |
| సగోత్రకన్యావివాహ ప్రాయశ్చిత్తము | 270 |
| వివాహమందితరములైన నిషేధములు | 271 |
| నిషేధమున కపవాదము | 272 |
| మండన ముండనవిచారము | 272 |
| ప్రతికూల విచారము | 274 |
| వివాహము | 274 |
| వివాహాది ప్రతిబంధము దాని కపవాదము | 275 |
| శ్రీపూజనాది శాంతి | 275 |
| వివాహాదులందు రజోదోషసూత కాదుల నిర్ణయము | 278 |
| వివాహమునకును, కన్య రజస్వల యైనచోక్షయపక్షనిర్ణయము | 279 |
| వధూవరులకు గ్రహబలవిచారము | 279 |
| ఆరుసంవత్సరములకు వివాహము చేయకూడదనుట | 279 |
| ఎనిమిది వివాహ భేదములు | 280 |

వాగ్దానమైన పైని వరుడు దేశాంతర గతుడైనచో పరివేదన నిర్ణయము 281
పరివేత్తకు ప్రాయశ్చిత్తము 281
పరివేత్త కపవాదనిర్ణయము 281
కన్యాదాతృనిర్ణయము 282
మూలాదినక్షత్రములయందు పుట్టిన వధూవరుల వివాహము 282
అవివాహయోగ్యమాసనిర్ణయము 283
లగ్నమందు గ్రహబలము 283
ఏకవింశతి మహాదోషములు 285
చంద్రతారాదిబలములేనిచోదోషము 285
మండపనిర్మాణ విచారము 286
కన్యాజన్మలో గ్రహాదులచే సూచింపబడిన వైధవ్య పరిహారము 286
వైధవ్యహరమైన కుంభవివాహము 287
వరునికి మృతభార్యత్వముపోవుటకుపాయములు 287
మృతపుత్రత్వదోషమందు బ్రాహ్మణవివాహము 288
కన్యాగృహమందు తలిదండ్రులకు భోజన నిషేధము 288
వాగ్దానాదివిచారము 288
వివాహసంకల్పము 289
జీవత్పితృకుడు జేయునాందీశ్రాద్ధము 290
తండ్రికంటెనితరుడు కర్తయైనచో నాందీశ్రాద్ధము 291
గర్భాదానప్రకరణము 293
లగ్నమందుగౌరీహరులపూజ 293
మధుపర్కము 294
లగ్నఘటీస్థాపనము 294
ఘటికావిచారము 295
కన్యాదానమున కంగముగజేయు గోదానముమొదలగువానిమంత్రములు 297
అక్షతారోపణము 298
వివాహహోమము 298
గృహప్రవేశనీయహోమము 298
నాల్గవదినమందైరిణీదానము 299
వధూవరులతల్లులు రజస్వలలైనచో నిర్ణయము 299
వివాహమైనపైగా నాశౌచము వచ్చుచో నిర్ణయము 299
మండపోద్వాపనమైన పై గార్యాకార్య నిర్ణయము 299
వధూప్రవేశము 301
రెండవమారు వధూప్రవేశము 301
వధూప్రథమాబ్ద నివాసనిర్ణయము 302
పునర్వివాహము 302
అగ్నిద్వయ సంసర్గప్రయోగము 303
ద్వితీయాది వివాహమునకు గాలము 304
అర్కవివాహము 304
ఆహ్నికవిచారము 306
మూత్రపురీషోత్సర్గము 306
ఆచమనవిధి 307
ఆచమననిమిత్తములు 308
సంక్షేపస్నానవిధి 308
గృహమందుష్ణోకస్నానవిధి 309
ప్రాతఃకాలిక నిత్యస్నానము 309
గౌణస్నానములు 310
తిలకాదివిధి 310
భస్మత్రిపుండ్రము 310
సంధ్యాకాలము 311
సంక్షేపముగ సంధ్యాప్రయోగము 311
మంత్రాచనము 312
తైత్తిరీయులకు సంధ్యాప్రయోగము 314
కాత్యాయనుల సంధ్యాప్రయోగము 314
ఔపాసనహోమము 316
అశ్వలాయనస్మార్త హోమప్రయోగము 316
హిరణ్యకేశీయుల హోమప్రయోగము 317
కాత్యాయనుల హోమప్రయోగము 318
హోమద్రవ్యములు 318
హోమాతిక్రమమందుప్రాయశ్చిత్తము 318
పక్షహోమము 319

| | |
|---|---|
| సమారోపవిధి | 320 |
| యజమానుని ప్రవాసమందుకృత్యము | 320 |
| ఔపాసనాగ్ని యుపశమించినచో ప్రాయశ్చిత్తము | 321 |
| వివాహమైన పైనిగాని యాధానోత్తర ముందుగాని పూర్ణిమయందు స్థాలీ పాకమున కారంభము | 321 |
| అగ్న్యుపఘూతము నిమిత్తములు | 323 |
| అగ్నినాశకములు | 325 |
| అరణివిచారము | 328 |
| నిత్యదానము | 329 |
| ప్రధమభాగకృత్యము | 329 |
| ద్వితీయాభాగకృత్యము | 329 |
| సంక్షేపముగ దేవపూజావిధి | 330 |
| తృతీయభాగకృత్యము | 332 |
| చతుర్థభాగమందు మాధ్యాహ్నిక స్నానము | 333 |
| మధ్యాహ్న సంధ్యావిధి | 333 |
| కాత్యాయనమాధ్యాహ్నికసంధ్య | 334 |
| బ్రహ్మయజ్ఞము | 334 |
| తర్పణము | 335 |
| హిరణ్యకేశీయుల బ్రహ్మ యజ్ఞతర్పణము | 337 |
| కాత్యాయనబ్రహ్మయజ్ఞ తర్పణము | 338 |
| పంచమభాగకృత్యము | 339 |
| ఋగ్వేదులకు వైశ్వదేవము | 340 |
| ప్రాతస్సాయం వైశ్వదేవములకు సహప్రయోగము | 340 |
| బలిహరణము | 342 |
| పితృయజ్ఞము | 342 |
| మనుష్య యజ్ఞము | 343 |
| తైత్తిరీయులకు శ్రాద్ధదినమందు భిన్నపాకముచే వైశ్వదేవము | 343 |
| దేవయజ్ఞాది చతుష్టయము | 344 |
| కాతీయులకు దేవయజ్ఞాదులు | 344 |
| సర్వసాధారణభోజనాదివిధి | 345 |
| సాయంసంధ్య | 349 |
| కామ్యనైమిత్తిక కర్మప్రారంభము | 351 |
| ఆధానవిచారము | 351 |
| శూద్రసంస్కార విచారము | 352 |
| వాపీకూపాద్యుత్సర్గము | 353 |
| తోటలు మొలిపించుట | 354 |
| మూర్తి ప్రతిష్ఠ | 354 |
| పంచసూత్రీ నిర్ణయము | 356 |
| రుద్రాక్ష తులసీ జపమాలా సంస్కారము | 359 |
| విష్ణ్వాదిపంచాయతనములు | 360 |
| కేశవాదినామకమూర్తిధ్యానశ్లోకములు | 360 |
| దేవప్రతిష్ఠా ప్రయోగము | 361 |
| స్థిరచరార్చలకు సాధారణమైన ప్రయోగము | 362 |
| స్థిరార్చయందు విశేషము | 366 |
| సంక్షేమముగ చలమూర్తిప్రతిష్ట | 370 |
| పునః ప్రతిష్ఠ | 371 |
| సంప్రోక్షణవిధి | 372 |
| జీర్ణోద్ధారము | 372 |
| శివనిర్మాల్య గ్రహణవిధి | 377 |
| వస్త్రాదుల ధరించుట | 378 |
| రాజదర్శనము అంగడిపెట్టుట పశుగమనము ఋణముతీయుట | 379 |
| క్షౌరమునకు విధి | 381 |
| రోగమువచ్చిన నక్షత్రములఫలము | 382 |
| సకల నక్షత్రములకు శాంతిప్రయోగము | 383 |
| సర్వరోగములు పోగొట్టుజపాదులు | 383 |
| అభ్యంగదిన నిర్ణయము | 384 |
| వాస్తు ప్రకరణము | 384 |
| గృహప్రవేశము | 386 |
| యాత్రాప్రకరణము | 386 |
| బల్లిపడుటకు తొండపాకుటకుశాంతి | 390 |
| గ్రామ్యారణ్య మృగపక్షులకు వికారమందు శాంతి | 390 |

కాకినిముట్టిన కాకుల సంభోగముల
జూచినను శాంతి 390
రోలు తిరగలి మొదలగునవి
హఠాత్తుగా బ్రద్ధలైనచో శాంతి 391
గాయత్రిపురశ్చరణ ప్రయోగము 391
అశ్వత్థమున కుపనయనము 393
సకలకర్మలకు సాధారణమైనపరిభాష 395
కర్మభేదములలో నగ్నికినామములు 397
జుహువు మొదలగుయజ్ఞపాత్రలు
చేయు నిర్ణయము 397
కర్మాంగ దేవతలు 397
కలియుగమందు కార్యాకార్య
విచారము 398
కలిలో నిషిద్ధములు 400
స్వప్నఫలవిచారములు 403
అనిష్టఫలస్వప్నములు 404
జాగ్రదవస్థయందలి అనిష్టములు 404
ఇష్టఫల స్వప్నములు 405
దుస్స్వప్ననివారణవిధి 406


## తృతీయపరిచ్ఛేదము

## ఉత్తరార్థము


మంగళాచరణము 407
జీవత్పితృకులకు గర్భాధికారవిచారము 407
ప్రేతకర్మకు ప్రతిప్రసవము 411
శ్రాద్ధాదికాలనిర్ణయము 412
స్త్రీలకు దాహాద్యధికారనిర్ణయము 414
శ్రాద్ధశబ్దమున కర్థము 417
శ్రాద్ధభేదములు 417
శ్రాద్ధ దేశములు 419
నిషిద్ధ దేశములు 419
శ్రాద్ధ కాలములు 420
ప్రత్యాబ్దికమాసికాదుల నిర్ణయము 421
ప్రతిసాంవత్సరిక మాసికాను
మాసికముల నిర్ణయము 421
విశ్వేదేవులు 424
శ్రాద్ధమందు బ్రాహ్మణులు 424
శ్రాద్ధార్హ ద్రవ్యములు 428
శ్రాద్ధమందు హవిస్సు 429
వర్జ్యములు 430
శ్రాద్ధ బ్రాహ్మణుల సంఖ్య 435
శ్రాద్ధములకు సాధారణపరిభాష 437
ఆచమనములు 438
దర్భలు 439
ఊహమంత్రవిచారము 439
ఋగ్వేదులు మొదలగువారికి
సంక్షేపముగ శ్రాద్ధప్రయోగము 440
పాద్యము 441
ఆసనములు 442
అర్ఘ్యము గల్పించుట 443
వర్జ్య పుష్పములు 445
ధూపము 445
దీపము 445
ధాతుమయములైనధూపదీపాది
పాత్ర లిచ్చుట 446
అర్ఘ్యసాధనము 447
ఆగ్నౌకరణము 449
పాణి హోమము 450
అన్నపరివేషణము 451
శ్రాద్ధబ్రాహ్మణునికి వమనమైనచో
నిర్ణయము 455
పిండదానము 456
పిండోపఘాతమందుప్రాయశ్చిత్తము 458
పిండనిషేధము 459
శ్రాద్ధదినమందు వైశ్వదేవనిర్ణయము 461
నిత్యశ్రాద్ధము 461
శ్రాద్ధాను కల్పములు 462
నామశ్రాద్ధము 462
హిరణ్యశ్రాద్ధము 463
సాంకల్పికవిధి 464
అనుకల్పములు 464
శ్రాద్ధభోజనమందుప్రాయశ్చిత్తములు 464
మృతదిన శ్రాద్ధమందువిశేషము 465
మృతాహస్సుదెలియనిచో నిర్ణయము 466

శ్రాద్ధవిఘ్నమందు నిర్ణయము 467
భార్యకు రజోదోషమందు
శ్రాద్ధనిర్ణయము 468
శ్రాద్ధసంపాతమందునిర్ణయము 469
శ్రాద్ధములు అనేకములుగలసినచో
నిర్ణయము 470
తిలతర్పణములు 470
శ్రాద్ధాంగమైన తిలతర్పణములు 471
తిథ్యాది నిషేధములకపవాదము 472
నాందీశ్రాద్ధ ప్రయోగము 472
విభక్తానిభక్త నిర్ణయము 473
తీర్థశ్రాద్ధము 473
తీర్థయాత్రకువిధి 474
తీర్థమందు పరులకై స్నానము 475
ఆశౌచనిర్ణయము 476
గర్భనాశజననాద్యాశౌచము 476
మృతా శౌచనిర్ణయము 478
క్రాంతాశౌచము 483
అనేకాశౌచములుగలసినచో
నిర్ణయము 486
శవస్పర్శానుగమనాదులచే
నాశౌచ నిర్ణయము 488
శవమును మోయుచో నాశౌచము 488
రోదనమందాశౌచ విచారము 489
అశౌచాన్నముదిన్నచో బ్రాయశ్చిత్తము 490
అయిదు విధముల యాశౌచము 491
నారాయణబలి 499
సర్పహతునికి వ్రతము 500
పాలాశవిధిచే దహనాదివిధి 500
అతీతప్రేతునికి సంస్కారకాలము 501
పునస్సంస్కారకాలము 502
ఘటస్ఫోటమైనను దిరుగ
కలుపుకొనువిధి 503
పతితునకు ఘటస్ఫోటవిధి 503
పిత్రాదుల మృతికాలమందు
పుత్రాదుల సార్థాబ్ధప్రాయశ్చిత్తవిధి 503
తిలపాత్రదాన విధి 505
వైరతరణీ దానవిధి 505
ఉత్క్రాంతి ధేనుదానము 506
శవమును శూద్రాదులుముట్టినచోశుద్ధి 506
అగ్నిహోత్రికి విశేషము 507
ప్రేత్రాధానము 508
శవమునుగొనిపోవు ప్రకారము 510
పదిరోజులలోపున నమావాస్యవచ్చి
నచో నిర్ణయము 513
ప్రథమదినాదికృత్యము నవశ్రాద్ధము 513
శ్రాద్ధవిధి 514
అస్థులుంచెడువిధి 515
పదునొకొండవదినమందు కృత్యము 517
ఏకాదశాహమహైకోద్దిష్టము 518
రుద్రగణశ్రాద్ధము 519
అష్ట వసుశ్రాద్ధము 520
శయ్యాదానము 520
ఉదకుంభ శ్రాద్ధము 522
పదియారు మాసికములు 522
నూనశ్రాద్ధములలో పర్జ్యములు 523
సపండీకరణవిచారము 524
పండ్రెండవదినమున కృత్యము 526
వ్యుత్క్రమమృతిలో విచారము 526
స్త్రీలకు విశేషము 527
అనుమాసికములు 528
ప్రథమాబ్దమందు నిషిద్ధములు 528
బ్రహ్మచారి మృతినొందినచోవిధి 531
కుష్ఠరోగముచే మృతినొందినచోవిధి 531
రజస్వలాదిమరణమందువిధి 532
గర్భిణీమృతియందు విధి 532
సహగమనమునకు విధి 533
విధవ స్త్రీకి ధర్మములు 535
సన్న్యాసము 536
సన్న్యాసము గ్రహించువిధి 537
పర్యంకా శౌచప్రయోగము 543
శ్రౌతాగ్నిగలవానికి విశేషము 544
ఆతురసన్న్యాసవిధి 545
మృతినొందినయతికి సంస్కారము 546
నారాయణబలి 548
ఆచారముచొప్పుననారాధనము 549
యతిధర్మములు 550

DURGA CHARAN NELABHOTLA

# ఉపోద్ఘాతము

ఓ విద్వాంసులారా ! వివేచనశక్తిగల మనుష్యజన్మము లభించి నందుకు "ఉద్ధరేదాత్మనాత్మానమ్" అన్నట్లు తనయుద్ధారము గనిపెట్టుకొనుట తనకావశ్యక మైనపని గదా ? ఎట్లనిన; ప్రత్యక్షసిద్ధమైన ప్రపంచముయొక్క సృష్టి స్థితిలయములకు సర్వకర్తగా పరమేశ్వరుడు సిద్ధించినను నాతనికి వైషమ్య నైర్ఘృణ్యములు లేకుండుట, ముఖ్య ధర్మమైనందున, సుఖదుఃఖ తారతమ్యములచే నెల్లరకు దెల్లంబైన నీచోత్తమ భావముగల సురనరతిర్యక్స్థావరజన్మముల వైషమ్యమున కంతరంగకారణ ముండక తీరదు. ఇక దేహారంభకములైన సూక్ష్మభూతములు సర్వజీవసాధారణములైనందున వానిచే నిర్వాహము గానేరదు. కాబట్టి యట్టి యనాదిసిద్ధమైన ధర్మాధర్మ వాసనాతార తమ్యము ముఖ్యకారణమై యనుభవగోచరమైనందున ఫలకామనా విశేషముచే నీచోత్తమగతులును, నిష్కామకర్మాచరణముచే సార్వాత్మ్య జ్ఞానమున ముక్తియును గల్గునని వ్యవస్థ సిద్ధింపుచుండగా జనన మరణసంఖ్యావైషమ్యమునం బ్రలపించుచు బీజముల కనాదిత్వము గల్పించి ఘటకుడైన యీశ్వరుడుండిన అతనికి పక్షపాత దోషము లేకుండగ ముక్తిలభించుట యట్లుండగ సుగతియే దుర్లభము గనుక ముందు సంగతి మనకేమియు తెలియదని జగదాంధ్యము గల్పించుట ప్రత్యక్షాపలాపము జేయు నాస్తికులకు తప్ప నితరుల కేరికి నశక్యము. ఇట్లు యుక్తిసిద్ధమైన ముఖ్యకారణ మునే శ్రుతులును వచించి చెప్పుచున్నవి. "పుణ్యోవై పుణ్యేన కర్మణా భవతి పాపః పాపేన, రమణీయచరణా రమణీయాం యోనిమాపద్యంతే, కపూయచరణాః కపూ యాం యోని మాపద్యంతే, ఉభాభ్యాం మనుష్యలోకః యోని మన్యే ప్రపద్యంతే శరీరత్వాయ దేహినః స్థాణుమన్యేను సంయంతి యథాకర్మ యథాశ్రుతం, గురుం హుం కృత్యత్వంకృత్య విప్రం నిర్జిత్య వాదతః, శ్మశానే జాయతే వృక్షఃకంకగృధ్రోప సేవితః" అని మొదలగునవి. కాబట్టి లోకమునందు తెలిసి యాచరించిరేని మను ష్యుల కందరకు సుద్ధారకములని శ్రుతిస్మృతులచే విధింపబడిన వర్ణాశ్రమ ధర్మములు విప్రకీర్ణము లగుటచే యథాకాలముగ వాని స్మరించుట యర్వాచీనుల కెంతటివారికి

నశక్యముగనుక ప్రాచీన నిబంధకారులచే వాని వ్యవస్థలు స్పష్టముగ వివరింపబడి నను నవి సంస్కృతభాషావకుంఠనముచే నెల్లరకు నుపయోగింపకుండెను. మరియు నీదేశమునకు సహజమైన యాంధ్రభాషయందలి గ్రామ్యత్వదోషము నివర్తింప జేయు టకు మాత్రము యత్నించి ప్రాచీనవిద్వాంసులగు నన్నయభట్టారకుడు దిక్కనసోమ యాజియు పెద్దనార్యుడు మొదలగువారు కట్టుదిట్టములచే నీభాషకు సంస్కృతమంత ఘనతదెచ్చియు దమ రసజ్ఞతను పాండిత్య ప్రకర్షమును వెల్వరించు ప్రౌఢభాషతో మహా ప్రబంధములజేసిరి కాని యొకరైనను సాక్షాజ్జగదుద్ధారకమైన శాస్త్రములలో నొకటియైన దెనుగించుటకు నుత్సహింపరైరి. ఆధునికులునట్టె గతానుగతిక మార్గము ననుసరించిరి. కనుక నాంధ్రభాషయందు శాస్త్రవాణి యొకింతయు గాన రాదయ్యె. ఇట్లనన్యగతిక మైనజగము నుద్ధరించుటకు శాస్త్రములలో ముఖ్యమగు ధర్మశాస్త్రమును సర్వసాధారణమైన స్పష్టభాషతో దెనుగించుటకు నుత్సహించి శ్రీమద్విజయ నగరసంస్థాననిరతిశయోదయ ప్రతిష్ఠాపననిష్ఠాగరిష్ఠులును, వసిష్ఠగోత్ర పవిత్రీకరణధురీణవరచరిత్రులును, సప్రతిమ ప్రతిభానికషకషితసర్వశాస్త్రసిద్ధాంత విశేషులును, శ్రీపూషవాడ్వంశపయః పారావారరాకాసుధా కరులును, శ్రీ మహేంద్రాది చక్రచూడామణి మహోదధీశకళింగ దేశాధిపతి మీర్జామన్నే సుల్తాన్ బహదూరిత్యాది బిరుదవిశేష భూషితులును, హిజ్ హైనెస్ ది మహారాజా ఆఫ్ విజయగనం, కే.సీ.ఐ. ఈ., వారునగు శ్రీమదానంద గజపతి మహారాజచంద్రు లాజ్ఞాపించిన దత్స భామాన్య మానుడగు కొల్లూరి కామశాస్త్రిచే రచింపబడిన ఈ యాంధ్రభాషారూపమగు ధర్మ సింధుసారము లోకమందాచంద్రతారకముగ వారియుద్దేశము ఫలింపజేయుచు సర్వోప కారకంబై వెలుంగుగాక !

మ. క్షమయున్ సత్యము సాహసంబు దయయున్ గాంభీర్యమున్ ధైర్యమున్
శమయున్ జ్ఞానము మానమున్ సమతయైశ్వర్యాదులెల్లన్ సమ
గ్రముగాగం దననుండి లోకమునకెక్కన్ లెస్స వ్యత్యస్త య
త్న మవద్యంబ యటన్న నీతిగతు లానం దేంద్ర నీకే తగున్.

శుభమస్తు

OWNER OF BOOK: DURGA CHARAN NELABHOTLA

ఓం నమో భగవత్యై శ్రీ దుర్గాంబాయై నమః

# ధర్మసింధు

## ప్రథమ పరిచ్ఛేదము

క. శ్రీనించు భువనజననిం, ధ్యానించితి నల సువెల్ల ధర్మవిదులుగా
నానందేంద్రునియాజ్ఞను, బూనితి ధర్మాబ్ధిసారముందెనుగింపన్.

అవతారిక. మొదట గ్రంథకర్త నిర్విఘ్న సమాప్తి కొరకు మంగళము చేయు చున్నాడు.

ఎట్లనిన; దయాసముద్రుడును, శీఘ్ర ప్రసాదియు, దీనుల యభీష్ట ములు పూరించువాడును, పాప సముద్రమును శోషింప జేయువాడును, శ్రీ రుక్మిణీదేవికి మనోహరుడును, పరమపురుషుడును, దుర్బోధమయిన చరిత్రగలవాడును, సర్వభూతములకు అంతర్యామియునైన పండ్రాపురి శ్రీ విఠ్ఠలస్వామిని నమస్కరించె దను. పాపములను నశింప జేయు శంకరుని నమస్కరింతును. ఆతడు నా శిరముపై అభయహస్తము నెప్పుడు నుంచు గాక. పార్వతిని విఘ్నేశ్వరుని బ్రహ్మదేవుని సరస్వతిని భజించెదను. లక్ష్మీదేవిని, గరుడుని, అనంతుని, ప్రద్యుమ్నుని, ఈశ్వరుని, హనుమం తుని, సూర్యాది నవగ్రహములను, కుమారస్వామిని, ఇంద్రాది దేవతలను, విద్యా గురులను, తల్లిని అనంతభట్టుడను తండ్రిని, ధర్మశాస్త్రకర్తలగు మాధవా చార్యుడు మొదలగు వారిని నమస్కరింతును.

అవ. ఇట్లు ధ్యానించి ప్రకృత గ్రంథ ప్రతిజ్ఞను జేయుచున్నాడు :-

ప్రాచీనమైన నిబంధన గ్రంథములను విమర్శించి ప్రమాణవచనముల యొక్క ఖండన మండనములచే తేలిన సిద్ధాంతములను మాత్రము బాలబోధ కొరకు నిర్ణయ సింధూక్త క్రమమున దెలుపు నీ ధార్మబ్ధిసారమను గ్రంథమును రచింపు చున్నాను. కాలము పరమేశ్వర స్వరూపమగుటచే అఖండమయినను కార్య స్వరూపముచే క్షణఘటికాద్యనంత భేదములయినది. అందు కర్మాచరణమునకు నిమిత్తముగా సంకల్పాదులయందు ఉపయోగపడునవి యారుభేదములు. ఎట్లనిన వత్సరము, అయనము, ఋతువు, మాసము, పక్షము, దివసము అని అందు వత్సరము చాంద్రా, సౌర,సావన,నాక్షత్ర, బార్హస్పత్యములని మానభేదముచే నైదువిధములు. అందు

చాంద్రమానవత్సరమునకు శుద్ధప్రతిపత్తు మొదలుకొని కృష్ణామావాస్యతో నంతమగు మాసములు చైత్ర వైశాఖాది సంజ్ఞలతో పండ్రెండుండును. దినములు మూడువందల యేబదినాలుగు గగను. అధికమాసము వచ్చెనెడ పదుమూడుమాసములగును. ఈ చాంద్రమాన వత్సరమునకే ప్రభవ, విభవ, శుక్లాదిగ నరువది సంజ్ఞలను వాడు చున్నాము. ఇక సౌరమానవత్సరమునకు సూర్యుడు మేషము మొదలు పండ్రెండు రాసులను అనుభవించుసరికి పండ్రెండు మాసములకును దినములు మున్నూట యరువదినాలుగగును. సావనమానవత్సరమునకు మున్నూటయరువదియే దినములగు. నాక్షత్ర మానవత్సరమునకు ముందు చెప్పెడు నాక్షత్ర మాసములతో పూర్తియగు దినములు మున్నూటయిరువదినాలుగగును. మేషము మొదలగువాటిలో నొకరాశిని బృహస్పతి యనుభవించుసరికి బార్హస్పత్యమానవత్సర మగును. దానికి దినములు మున్నూటయరువదియొకటి యగును. ఇట్లు వత్సరమైదు విధములైనను కర్మాచరణమందు చాంద్రమానవత్సరమునే సంకల్పించ వలెను. ఇక అయనము దక్షిణము, ఉత్తరము అని రెండువిధములు. సూర్యుడు కర్కటరాశిని ప్రవేవించి క్రమముగ ఆరు రాసులనుభవించుసరికి దక్షిణాయన మనబడును. మకరసంక్రాంతి మొదలుకొని ఆరు సంక్రాంతులయ్యెడు సరికి ఉత్తరాయణ మనబడును. ఇక ఋతువు సౌరము, చాంద్ర మునని రెండువిధములు. అందు మీనముగాని మేషముగాని యారంభించి సూర్యుడు రాశిద్వయము అనుభవించుకాలము సౌర ఋతువు, చైత్రము మొదలు రెండేసి మాసములకు వసంతాదిసంజ్ఞ లారింటితో జెల్లునది చాంద్ర ఋతువు. అధికమాసము కలసినచో కొంచెము తక్కువ తొంబది దినములతో చాంద్రఋతువగును. శ్రౌతస్మార్తాది కర్మలయందు చాంద్రమాన ఋతు వును స్మరించుటయే ప్రశస్తము. నాలుగు విధములు. ఇక మాసము చాంద్రము, సౌరము, సావనము నాక్షత్రమునని, అందు శుక్ల ప్రతిపద మొదలు అమావాస్య వరకుగాని, కృష్ణ ప్రతిపదమొదలు పూర్ణిమ వరకుగాని చాంద్రమాస మనబడును గాని యందు మొదటిదే ముఖ్యము. రెండవది వింధ్యమునకు నుత్తరమగు దేశముననే గ్రహించునది. ఇదియే చైత్రాది నామములతో కర్మాది యందు స్మరింపబడును. కొందరు మీనాది సౌర మాసములకును చైత్రాది సంజ్ఞలు వాడుదురు. సౌరమాస మనగా నొక సంక్రాంతి మొదలుకొని రెండవ సంక్రాంతి వరకునగు కాలము సరిగా ముప్పది దినములుగలది సావనమాసము. అశ్వినిమొదలు నక్షత్రము లిరువ దేడిటిని చంద్రుడనుభవించు కాలము నాక్షత్రమాసము. ప్రతిపద మొదలు పూర్ణిమ వరకు శుక్లపక్షము. ప్రతిపద మొదలుకొని యమావాస్య వరకును కృష్ణపక్షము, దివసము, అరువదిగడియలు పరిమితిగల కాలము. ఇట్లు ధర్మసింధుసారమందు ప్రథమోద్దేశము ముగిసెను.

అవ. ఇక సంక్రాంతి నిర్ణయము చెప్పబడును :-

మేషమందు సూర్యుడు ప్రవేశించుటకు ముందును వెనుకయును బదునయిదు పదునయిదు గడియలు పుణ్యకాలము. కొందరు పదిపది గడియలందురు. అట్లు

వృషభ సంక్రాంతికి పరమందు పదియారును, కర్కటమునకు ముందు ముప్పది యును, సింహమునకు ముందు పదు నారును, కన్యకు పరమందు పదియారును, తులకు ముందు వెనుకయు పదునయిదు పదునయిదు గడియలును పుణ్యకాలము. పదిపదియే యని కొందరందురు. వృశ్చికమునకు ముందు పదునారును, ధనుస్సునకు వెనుక పదునారును, మకరమునకు వెనుక నలువదియును, కుంభమునకు ముందు పదునారును, మీనమునకు పదునారును గడియలు పుణ్యకాలము. సంక్రాం తికి వెనుక ప్రొద్దు రెండుగడియలకు తక్కువ యుండునెడ మిథున, కన్యా, ధనుర్మీన ములకును మకరమునకు సహితము ముందు గడియలే పుణ్య కాలము. ఇట్లు ప్రాతఃకాలమందు రెండు గడియలకులోగా సంక్రాంతి యైనచో వృషభ, సింహ, వృశ్చిక, కుంభములకును కర్కటమునకు సహితము పైగడియలే పుణ్య కాలము. కొందరు కర్కటకమునకు కపుడు పూర్వదినమందే పుణ్యకాలమని చెప్పుదురు. మకర కర్కటకములు తప్ప తక్కినవి రాత్రియందు నిశీథమునకులోగా వచ్చినచో పూర్వదినార్థమును, పైగావచ్చినచో పరదినార్థ ములు పుణ్యకాలము. అర్థరాత్రమందే వచ్చినయెడ పూర్వపరదినార్ధములు రెండును పుణ్యములు. మకరసంక్రాంతి రాత్రివచ్చినచో పరదినమందే పుణ్యకాలము. కర్కటక సంక్రాంతి రాత్రియందైన యెడ పూర్వదినముననే పుణ్యకాలము. సూర్యాస్తమయానంతరము మూడు గడియలు. సాయంసంధ్య అప్పుడు మకర సంక్రాంతియైనచో పూర్వదినమే పుణ్యము. ఇట్లు సూర్యో దయమునకు ముందు మూడుగడియలు ప్రాతస్సంధ్య అపుడు కర్కట సంక్రాంతియైనచో పరదినమందే పుణ్యకాలమని జ్యోతిశ్శాస్త్రమందు సంధ్యా సంక్రాంతి కిట్లు విశేషము విధింపబడినది. ఇట్టి పుణ్యకాలమందు జేయు దానముల నిర్ణయము. మేషమందు మేకదానము, వృషభమందు గోదానము, మిథునమందు వస్త్రాన్నాది దానములు, కర్కటకమందు ఘృతధేనుదానము, సింహమునందు ఛత్రసువర్ణదాన ములు, కన్యయందు గృహవస్త్రదానములు, తులయందు తిలగవ్యక్షీరఘృతాది దాన ములు, వృశ్చికమందు దీపదానము, ధనుస్సునందు వస్త్రమునుయానమును, మకర మందు కర్రలును అగ్నియును, కుంభమందు గోవును జలమును, తృణమును, మీనమందు భూమియును మూలికలును, దానపాత్రుల కీయవలయును. ఇట్లు మరికొన్ని దానములు గ్రంథాంతరమందు తెలియవలెను. మకర కర్కటములందును మేషతులా సంక్రాంతులందును ముందు మూడు రాత్రులుగాని యొకరాత్రిగాని యుపవాసముజేసి స్నానదానాది పుణ్యకార్యములు సేయవలయును. చిట్టచివర యుప వాసము సంక్రాంతి ప్రవేశదినమందుగాని, పుణ్యకాలమందుగాని జరుగవలయును. ఇట్టియుపవాసము పుత్రవంతులగు గృహస్థులు తప్ప దక్కువారు పాపక్షయము కొరకు జేయదగినది; నిత్యముగాదు కామ్యము. సంక్రాంతులన్నిటియందును పిండదానము లేకుండను శ్రాద్ధము జేయవలెను. కర్కటక మకరములందిది నిత్యము. అనగా మానగూడదు. సంక్రమణ ప్రవేశము గొన్ని దినములకు వచ్చుననగా ముందే అయనాంశము ప్రవేశించును. అప్పుడును సంక్రాంతియందువలె స్నానదానాదికము

జేయ వలెను. అయనాంశములు జ్యోతిశ్శాస్త్రమందు ప్రసిద్ధములు. అనగా అరువది సంవత్సరముల కొక్కొకయయనాంశము పెరుగును. ఇట్లు ముప్పదికాగా దిరుగ ప్రారంభమగును. కాబట్టి ప్రకృతమందు పదునెన్మిది నూరుల తొమ్మిదవశతాబ్ది మగుటచే నిరువది రెండయనాంశముల నలుబదెన్మిది లిప్తలు గుణిత ముచే వచ్చును గనుక సంక్రమణమునకు పూర్వమిరువది రెండవదినమే యయనాంశ పర్వపుణ్య కాలమగును. ఇట్లు అయనాంశము లెక్కువయగుచో నూహించునది.

## సంక్రాంతి భేదములు

వృష,సింహ,వృశ్చిక, కుంభములయందు సంక్రమణము విష్ణు పద మన బడును. మిథునకన్యా ధనుర్మీనములయందు సంక్రమణము షడశీతి యనబడును. మేష తులా సంక్రమణములు విషువమనబడును. కర్కటక మకరములు అయనమన బడును. వీటిలో నుత్తరోత్తరము పుణ్యత మము. మంగళకార్యము జేయదలచినయెడ నన్నిసంక్రాంతులకు ముందును వెనుకయును పదునారేసిగడియలు విడిచి చేయ వలెను. ఇట్లు చంద్ర కుజ బుధ గురు శుక్రుల సంక్రాంతులందును పూర్వోత్తర భాగముల గలపి క్రమముగా రెండును, తొమ్మిది, రెండు, ఎనుబదినాలుగు, ఆరు, నూట యేబది గడియలు త్యాజ్యములు, రాత్రి సంక్రాంతి ప్రవేశమగుచో నపుడే స్నానదానాదికము జేయవలెనని కొందరందురు. కాని రాత్రి గూడదు. పగటియందే చేయవలెనని సర్వసమ్మతము. అట్లనే బహుదేశాచారమునగలదు. మరియు జన్మనక్షత్రమందు సంక్రమణమయినచో ధనహాని మొదలగు పీడగలుగును. కనుక పద్మపత్రములతో గూడినజలముచే స్నానము చేయవలెను. మేష తులా మకర కర్కటలు పగలు ప్రవేశమయినచో నా దినమందును దానికి ముందు వెనుక రాత్రులందును వేదాధ్యయనము మానవలెను. రాత్రి ప్రవేశమయిన యెడ నా రాత్రి యందును దానికిముందు వెనుక పగళ్ళయందును నధ్యయనము మానవలెను. కనుకనే యిది పక్షిణి సంక్రాంతి యనబడును. పండ్రెండు జాములు ననధ్యాయము అయన సంక్రాంతికి మరియొక విశేషము చెప్పబడును. ఇట్లు సంక్రాంత్యుద్దేశము రెండవది ముగిసెను.

అవ. ఇపుడు తులమాసము విచారింపబడును :-

అది అధికమాసము క్షయమాసమునని రెండువిధములు. అందులో రవి సంక్రాంతిలేనిది అధికమాసము. రెండు రవి సంక్రాంతులు గలది క్షయమాసము. ఒక అధికమాసముపైని ముప్పదిమాసములుగాగా మరియెనిమిది తొమ్మిది మాసము లలో ఒకటి తిరుగ అధికమాసమగును. క్షయమాస మిట్టి స్వల్పకాలములో రానేరదు. మరియేమనిన; నూటనలుబది వత్సరములకుగాని, పందొమ్మిదివత్సరములకుగాని తిరుగనగును. అదియు కార్తీక మార్గశీర్ష పౌషమాసములలో నొకటియే యగునుగాని తక్కిన మాసములలో కానేరదు. క్షయమాసమువచ్చు సంవత్సరమందు రెండధికమాస ములు రాకతప్పదు. క్షయమాసమునకు ముందొకటియు వెనుక నొకటియు నగును. అధికమాసమున కుదాహరణము – చైత్ర కృష్ణామావాస్యయందు మేష సంక్రాంతియై

శుక్ల ప్రతిపత్తు మొదలుకొని యమావాస్య పర్యంతము సంక్రాంతి, లేక పై శుక్ల ప్రతిపత్తు నందు వృషభ సంక్రాంతియైనచో జరిగిన సంక్రాంతి లేనిమాస మధిక వైశాఖ మనబడును. వృషభ సంక్రాంతితో గూడిన మాసము శుద్ధవైశాఖ మనబడును. ఇక క్షయమాసమున కుదాహరణము–భాద్రపద కృష్ణామావాస్యయందు కన్యా సంక్రాంతియగును. అనంతర మాశ్వయుజమాసమధికము. శుద్ధాశ్వయుజ శుక్ల ప్రతిపత్తునందు తులాసంక్రాంతియు కార్తికశుక్ల ప్రతిపత్తునందు వృశ్చిక సంక్రాంతియు, నాపై మార్గశీర్ష శుక్లప్రతిపత్తునందు ధనుస్సంక్రాంతియు, నామాసమందే యమా వాస్యయందు మకర సంక్రాంతియునగు. ఇట్లు ధనుర్మకర సంక్రాంతులు రెంటితో గూడిన మాసము క్షయమాసమనబడును. అది మార్గశీర్ష పౌష మాసముల కర్ధనారీశ్వరరూపమువలె తాదాత్మ్యము నిచ్చును. కనుక నీ మాసమందు ప్రతిపదాది తిథుల పూర్వార్ధము మార్గశీర్షము. ఉత్తరార్ధము పౌషము. కాబట్టియే యీ మాస మందు తిథిపూర్వార్ధమందు మృతినొందిన వానికి మార్గశీర్షంబునను పరార్ధమందు మృతినొందిన వానికి పౌషమాస మందును ప్రత్యాబ్దిక శ్రాద్ధము జేయవలెను. ఇట్లనే జన్మించినచో వర్ధంతియును జేయవలెను. అటుపై మాఘమావాస్య యందు గుంభసంక్రాంతి యగును. అనంతరము ఫాల్గుణమాస మధికమగును. శుద్ధఫాల్గుణ శుక్ల ప్రతిపత్తు నందు మీనసంక్రాంతి యగును. ఇట్లు పూర్వోత్తరాధికమాసము లతో గూడిన క్షయమాసముగల సంవత్సరమునకు పదుమూడు మాసము లును కొంచెము తక్కువ మున్నూటతొంబది దినములు అగును. అందు క్షయమాసమునకు పూర్వముగవచ్చు అధికమాసము సం సర్పమనబడును. అది సర్వకర్మలకు యోగ్యము. శుభకర్మలయందు విడువనక్కరలేదు. క్షయ మాసమునకు నంహస్పతి మాసమనిపేరు. దాని యనంతరమున వచ్చు అధికమాసము సర్వకర్మలకు త్యాజ్యము. ఈలాగుననే మూడు సంవత్సరములకులోగా వచ్చు అధికమాసముగూడ సమస్త కర్మలకు విడువ దగును. అందుజేయరానివి చేయవలసినవి కర్మలు విమర్శించెదము. కాలాంతర మందవకాశములేనివి నిత్యకర్మలు, నట్టి నైమిత్తిక కామ్యకర్మలును క్షయమాసమం దును, అధికమాసమందును జేయవచ్చును. అవకాశము గల్గిన నిత్యనైమిత్తిక కామ్య కర్మ లాచరింపగూడదు. ఎట్టనిన; సంధ్యాగ్ని హోత్రాది నిత్యకర్మలును గ్రహణ స్నానాది నైమిత్తిక కర్మలును వర్షము గురియుటకుజేయు కారీరిష్టి, బ్రహ్మరక్షస్సువట్టిన వాని బాగుకొరకు జేయు రక్షోఘ్నేష్టి మొదలగు కామ్యకర్మలును మలమాసమందు సహితము జేయవచ్చును. మరి జ్యోతిష్టోమాదినిత్య కర్మలును జాతకర్మ మొదలగు నైమిత్తికము లును పుత్ర కామేష్టి మొదలగు కామ్యకర్మలును జేయగూడదు. పూర్వమే యారం భించిన కామ్యకర్మ మేదియైనను మలమాసమందు నాచరింపవచ్చును గాని నూతనా రంభము సమాప్తియుజేయు గూడదు. ఇట్లు పూజాలోప నిమిత్తకమైన దేవతామూర్తి పునః ప్రతిష్ఠను అవసరప్రాప్తమైన గర్భాధానము మొదలన్న ప్రాశనము వరకు కర్మలను అగతికములైన జ్వరాది రోగశాంతికర్మలును అలభ్య యోగనిమిత్తకములైన శ్రాద్ధవ్రతాదులను నైమిత్తిక ప్రాయశ్చిత్త కర్మ యును నిత్యశ్రాద్ధమును ఊనమాసికాది

శ్రాద్ధములును దర్శశ్రాద్ధమును మలమాసమందైనను జేయవలెను. మరియు మలమాసమందు మృతులగు వారికి ప్రత్యాబ్ధికము తిరుగ నట్టి మలమాసము దొరకిన యెడ నప్పుడే జరిగింప వలయును. శుద్ధమాసమందు మృతులయినచో వారికి శ్రాద్ధము మలమాసమందు జేయగూడదు. శుద్ధమాసమందే చేయవలెను. శుద్ధమాస మందు మృతి నొందినను ప్రథమాబ్ధికము మలమాసము వచ్చినచో నప్పుడే చేయవలయును. సంవత్సరపూర్తికి జరుగవలసినది గనుక శుద్ధమాసమందు గూడదు. ద్వితీయాబ్ధికము మొదలుకొని శుద్ధమాసమందే చేయవలెను. మృతి బొందినపైని పండ్రెండు దినముల జరిగించుకర్మలు మలమాసమైనప్పటికి అప్పుడే జరిగించవలెను. ద్వితీయమాసికము మొదలైనవి మలమాసము వచ్చినచో నావృత్తిచే రెండుమారులు జరిగించవలెను. ఇట్లు పండ్రెండవ మాసము మలమాసములో వచ్చినయెడ రెండిటిలో, రెండుమారులు జరిగించి ఊనాబ్ధకాలమం దూనాబ్దికముజేసి పదునాలు గవ మాసమందు ప్రథమాబ్దికము జేయవలెను. మీద జెప్పినట్లు క్షయమాసమునకు పూర్వము వచ్చిన యధికమాసమనగా నాశ్వయుజము మలమాసమైనప్పటికి గర్మా ర్హాము కనుక ప్రత్యాబ్ధికము రెండిటి యందును జరిగించవలయును. ఇట్లు క్షయ మాసమున కవ్యవహితముగా పూర్వాధికమాసము వచ్చెననగా కార్తిక మాసమే అధిక మాసము. తదుత్తరమాసము వృశ్చికధనుస్సంక్రాంతులతో గూడినందున క్షయమాస మయినచో కార్తికమందలి ప్రత్యాబ్దికము అధిక కార్తీక మందును క్షయమాసమందును రెండుమారులు జరిగించవలెను. కర్మార్హాత రెంటికి సమమని తోచుచున్నది. మలమాసమునకు వ్యవహితమైన క్షయమాసమందలి ప్రత్యాబ్దికము క్షయమాసమందే చేయవలెను. అనగా మీద జెప్పినట్లు మార్గశీర్షము క్షయమాస మైనచో మార్గశీర్ష పౌషముల ప్రత్యాబ్ధికములు తిథి పూర్వార్ధాది విభాగ మక్కరలేకుండ జేయవచ్చునని తాత్పర్యము.

అవ. ఇక మలమాసమందు త్యాజ్యములు :-

ఉపాకర్మయు, ఉత్సర్జనము, అష్టకాశ్రాద్ధములును, అధికమాసమందు వర్జ్య ములు, చూడాకర్మ, ఉపనయనము, వివాహము, తీర్థాదియాత్ర, వాస్తు కర్మ, గృహ ప్రవేశము, దేవప్రతిష్ఠ, కూపము, తోట మొదలగువాని ప్రతిష్ఠయు నూతన వస్త్రాలంకా రాదుల ధరించుట, తులాపురుషాది మహాదానముల జేయుట, యజ్ఞము, ఆధానము, అపూర్వమైనతీర్థ దేవతల దర్శనము, సన్యాసము, కామ్యవృషోత్సర్గము, రాజాభి షేకము, వ్రతములు, సావకాశమైన యన్న ప్రాశనము, సమావర్తనమనగా బ్రహ్మచారి గురుదక్షిణనిచ్చి వెడలుట, అతిక్రమించిన నామకర్మాది సంస్కారములు, పవిత్రా రోపణము, దమనపూజ శ్రవణాకర్మయు, సర్పబలి మొదలగు పాకసంస్థలు, భగవంతుని శయనాద్యు త్సవములు, ప్రతిజ్ఞ, ప్రమాణము చేయుటయు నివి మలమాసమందు జేయగూడదు. రజోదోషశాంతియు, విచ్ఛిన్నాధానము, పునఃప్రతిష్ఠ మొద లగు నైమిత్తక కర్మలు నిమిత్తము గలుగగానే చేయదలచినచో మలమాసాది దోషము లేదు. కాలమతిక్రమించిన యెడ శుద్ధమందే చేయవలెను. ఆగ్ర యణము

దుర్భిక్షమైనచో మలమాసమందు జేయవచ్చును. లేనిచో శుద్ధ మందే చేయవలెను. యుగాది మన్వాదిశ్రాద్ధములు రెండుమాసముల యందును జరిగించవలెను. మీద జెప్పినట్లు క్షయమాసమునకు పూర్వమైన సంసర్పాధి మాసమునందు చూడాకర్మయు, వివాహోపనయనములు, ఆధానము, యజ్ఞము, మహాలయము, రాజాభిషేకము తప్ప తక్కినవి చేయ వచ్చును. సపూర్వమాఘస్నానాదికమునకు క్షయమాస మందైన నారంభ సమాపులుగా వచ్చును. మకర సంక్రాంతిగల క్షయమాసములో మాఘ పూర్ణిమను స్నానమారంభించి కుంభ సంక్రాంతిగల మాఘపూర్ణిమయందు సమాప్తి జేయవలెను. ఇట్లు కార్తికమందూహించునది. వైశాఖాదిమాసము లధికమైనప్పుడు వైశాఖస్నానాది మాసవ్రతములు చైత్రశుక్ల పూర్ణిమ నారం భించి శుద్ధవైశాఖ పూర్ణిమను సమాప్తిగా రెండుమాసములు జరిగించవలెను. అధికమాసమందు వర్జ్యములన్నియు గరుశుక్రుల యస్తమయ బాల్యవార్ధక ములందును జేయగూడదు. అందులో నస్తమయ మునకు ముందు సప్త దినములు వార్ధకము. ఉదయానంతరమందేడు దినములు బాల్యమునని మధ్యమ పక్షము. పదునైదు దినములు మూడుదినములు నను పక్షములు ఆపదనాపద్విషయములనిగాని, దేశవిశేషాచారములనిగాని యూహించ వలెను. ఇట్లు వర్జ్యావర్జ్య నిర్ణయము బృహస్పతి సింహమందున్నపుడును గ్రహించ వలెను. మరియు విశేషముగలదు. కర్ణవేధ, చౌడ, మౌంజీబంధ వివాహ, దేవయాత్రా, వ్రత, గృహారంభ దేవప్రతిష్ఠా సన్యాపములు ముఖ్య ముగా వర్జింపవలయును. ఇక సింహస్థత్వదోషమునకపవాదము. గురుడు మఖానక్షత్రమందున్న వరకును, సింహాంశ యందున్నంత వరకును సర్వ దేశములయందు శుభకర్మలు నిషిద్ధములు, సింహాంశ యందున్నంత వర కును సర్వదేశములయందు శుభకర్మలు నిషిద్ధములు సింహాంశము దాటిన పైని గోదావరికి దక్షిణమందును, భాగీరథికి ఉత్తరమందును, సింహస్థత్వ దోషములేదు. గంగాగోదావరీ మధ్యదేశమందు సింహము యావత్తు దాటెడు పర్యం తము వివాహోపనయనములు నిషిద్ధములు. తక్కిన కర్మములు సింహాంశము దాట గానే చేయవచ్చును. ఇట్లు మేషమందు సూర్యుడుండెనేని సర్వదేశములందును సర్వ శుభకర్మలకును సింహస్థత్వ దోషమేలేదు. కొన్ని గ్రంథములలో సూర్యుడు వృషభమందున్నపుడు నిట్లనే దోషములేదని చెప్పబడినది. మరియు గురుడు సింహస్థు డగునపుడు గోదావరీస్నానమును, కన్యయందుండునపుడు కృష్ణానదీస్నానమును పుణ్యములు, అపుడు గోదావరీ యాత్రకు వెళ్లిన పై దేశస్థులకు మాత్రము ముండనోప వాసములు ముఖ్యములు. తీరవాసుల కక్కరలేదు. అట్టిముండనము భార్యగర్భిణి యైయుండి నను వివాహాది మంగళకర్మానంతరముననైనను నిషిద్ధముకాదు. గయా గోదావరీ యాత్రలయందు మలమాస శుక్రాస్తాది దోషములేదు. మలమాస మందు వ్రతవిశేషము గ్రంథాంతరమున దెలియవలెను. ఇట్లు మలమాస గురు శుక్రాస్త సింహస్థ గురువర్జ్యావర్జ్య నిర్ణయమును తృతీయోద్దేశము ముగిసెను.

అవ. ఇక తిథినిర్ణయమునకు సామాన్య పరిభాష విచారింపబడును:-

తిథి, పూర్ణ, సఖండ యని రెండువిధములు. అందు పూర్ణతిథి సూర్యో దయము

మొదలుకొని యరువదిగడియలు వ్యాపించియుండునది. అంతకు తక్కువ వ్యాపించునది సఖండతిథి యనబడును. అదియు రెండువిధములు; శుద్ధ,విద్ధ, యని. అందు సూర్యోదయము మొదలుకొని యస్తమయ పర్యంత ముండునదియు శివరాత్రి మొదలగు వ్రతములకు అర్ధరాత్ర పర్యంతము వ్యాపించునదియు శుద్ధతిథి యనబడును. తక్కినది విద్ధయనబడును. అనగా వేధ కలదనుట. మరియొకథితో గలయుట వేధ యనబడును. అది రెండు విధములు; ప్రాతర్వేధ, సాయంవేధయునని, సూర్యోదయా నంతర మారుగడియల వరకు మరియొకతిథి గలయుట ప్రాతర్వేధ, సూర్యాస్తమయమునకు మున్ను షడ్ఘటికాపర్యంతము మరియొకతిథిగల యుట సాయంవేధ, ఏకాదశీ వ్రతవిషయమైన వేధ ముందు జెప్పబడును. కొన్ని తిథులలో వేధ యధికముగావలయును. ఎట్లనిన; షష్ఠికి పంచమీవేధ పండ్రెండుగడియలు, ఏకాదశీతిథికి దశమివేధ పదునైతుగడియలు, పూర్ణిమకు చతుర్దశీ వేధ పదునెనిమిది గడియలు. ఇట్లువిద్ధలై అతిథులు కొన్ని కర్మలకు గ్రహ్యాములు, కొన్నింటికి నిషిద్ధములు. అందు సంపూర్ణతిథియు శుద్ధతిథియు సందేహము లేకుండుటవలన నిర్ణయము నపేక్షింపవు. అట్లు సఖండ తిథియునునిషేధము విషయమై నిర్ణయింపనక్కరలేదు. ఎట్లనిన; శ్లో॥ "నిషేధస్తు నివృత్త్యాత్మా కాలమాత్రమపేక్షతే"యని యున్నందున అష్టమి మొదలగు తిథులయందు నారికేళాది భక్షణ నిషేధమునకు తత్కాలమాత్ర వ్యాపితిథియే కావలెను. కనుక విహితములైన వ్రతాదుల విషయమే తిథి నిర్ణయము చెప్పబడును. అక్కడ యేకర్మ యెప్పుడు చేయవలయునో అప్పటి పర్యంతము వ్యాపించుతిథి కర్మకు గావలెను ఎట్లనిన; వినాయక వ్రతాదుల యందు మధ్యాహ్నాది కాలమున పూజదికము విధింపబడినందు తత్కాల తిథియే గాహ్యాము. పూర్వపర దినములు రెంటియందు మధ్యాహ్నాది వ్యాప్తి యుండినను, లేకున్నను తదేకదేశ వ్యాప్తియున్నను యుగ్మవాక్యమేదనిన,

శ్లో॥ "యుగ్మాగ్ని యుగభూతానం షణ్మున్యర్వసురంధ్రయోః, రుద్రేణ ద్వాదశీ యుక్తా చతుర్దాశ్యాచ పూర్ణిమా, ప్రతిపద్యప్యమావాస్యా తిథ్యోర్యుగ్మం మహాఫలమ్. అని. అందు యుగ్మమనగా ద్వితీయ, అగ్నియనగా తృతీయ, ఈ రెండును పరస్పర విద్ధలై గ్రాహ్యాములు. ఇది యొకయుగ్మము. ఇట్లు చతుర్థీపంచమీ యుగ్మము, షష్ఠీసప్తమీయుగ్మము, అష్టమీ నవమీ యుగ్మము, ద్వాదశ్యేకాదశీయుగ్మము, చతుర్దశీ పౌర్ణమాసీయుగ్మము, అమావాస్యా ప్రతిపద్యుగ్మము మహాఫల మిచ్చునని అర్థము. కొన్నిసమయములలో శ్లో॥ "చతుర్థీ గణనాథస్య మాతృవిద్ధా ప్రశస్యతే" యను విశేష వచనములచే గ్రాహ్యాత్వము నిశ్చయించవలెను. మాతృవిద్ధ యనగ తృతీయతో గలసిన చతుర్థి ప్రశస్తమనుట. వచన ప్రామాణ్యముచే, గ్రహింపవలసి వచ్చిన తిథి యొకవేళ కర్మకాలమందు లేకపోయినను తత్సాకల్యమును బోధించు వచన ములచే అది యున్నట్లుభావింపవలెను. వచనము లెవ్వియనిన శ్లో "యాం తిథిం సమనుప్రాప్య ఉదయం యాతి భాస్కరః సా తిథిస్సకలా జ్ఞేయా స్నానదానాదికర్మసు." ఇత్యాదులు. అనగా నే తిథిలో సూర్యోదయ మగునో యా తిథి పరమందు లేకున్నను, తత్ప్రయుక్త

కర్మల విషయమది పూర్తిగా నున్నట్లు భావింపవచ్చునని యర్థము. కాని యిట్టి వ్యాప్తి ఉదయానంతరము రెండుముహూర్తములకంటె అధికముగా నున్నప్పుడును ఉదయశబ్దముచే ఉపలక్షణముగా సప్తమయము గ్రహింపబడును గనుక దానికి పూర్వమందు మూడు ముహూర్తములకంటె నెక్కుడుగా నున్నపుడును గ్రహింపబడును. అంతకు తక్కువగా నున్నపుడు గ్రహింపబడదు. ఇట్లు తిథి విషయ సామాన్య నిర్ణయరూపమైన నాల్గవయుద్దేశము ముగిసెను.

అవ. ఇక కర్మ విశేషముల నిర్ణయము విచారింపబడును.

కర్మలు దైవములనియు, పిత్ర్యములనియు రెండువిధములు. అందు దైవ కర్మములారువిధములు. ఏకభుక్తము, నక్తము, అయాచితము, ఉప వాసము, వ్రతము, దానము అని. మధ్యాహ్నమందొక్క మారే యేకజాతీయ మైన అన్నము భుజించుట యేకభుక్తము. రాత్రి యందే ప్రదోషకాలమున భుజించుట నక్తము. యాచన సేయ కుండ నాదినమందు సంప్రాప్తమైన యన్నాదికము భుజించుట ఆయాచితము. దినాంతరలబ్ధమైనను వండెడు స్త్రీపుత్రాదికము అడుగక భుజించుటయు నయాచిత మని కొందరందురు. అహోరాత్రమందు భుజింపకుండుట యుపవాసము. పూజమొద లగు కర్మ విశేషము వ్రతము. దేయమైన వస్తువునందు తనస్వత్యము వదలి పరునికి స్వత్వము పుట్టించుట దానము. ఇట్టియేకభుక్తాదులు కొన్ని యెడల వ్రతాంగ ములై విధింపబడునవి. కొన్ని యెడల నేకాదశ్యుపవాసాదులకై ప్రతినిధిగా విధింపబడునవి. కొన్ని యెడల నేకాదశ్యుపవాసాదులకై ప్రతినిధిగా విధింపబడినవి. కొన్ని స్వతంత్ర ములు. కనుక మూడువిధములు. అందులో నితరాంగములకును, ప్రతినిధి భూతములకును వాటి ప్రధానకర్మలనుబట్టి నిర్ణయము. ఇంక స్వతంత్రములకు నిర్ణయము చెప్పబడును. దినమానము బట్టి పగలంతయు నైదుభాగములుగా జేసిన వాటికి సూర్యోదయము మొదలుకొని క్రమముగా ప్రాతఃకాలము, సంగవకాలము. మధ్యాహ్నము, అపరాహ్ణము, సాయాహ్నము అని సంజ్ఞలు. అస్తమయానంతరము మూడు ముహూర్తముల పర్యంతము ప్రదోష మనబడును. అందు మధ్యాహ్నకాల మును వ్యాపించు తిథి యేకభుక్తమునకు కావలయును. అందులోను పగలు సగము దాటినపై ననగా ముప్పదిగడియలు దినమానమగుచో పదియారవ గడియ మొదలు కొని మూడు గడియలు ముఖ్యభోజనకాలము. అటుపై సాయంకాలము వరకు గౌణకాలము. ఇచట తిథినిర్ణయమునకు పక్షము లారుగలవు. ఎట్లనిన; పూర్వదిన మందే ముఖ్య కాలవ్యాప్తి యుండుట, పర దినమందే యట్లుండుట, రెండుదినముల యందు అట్టి వ్యాప్తియుండుట, రెండిటి యందును లేకుండుట, రెండుదినము లందును సమముగా నేకదేశ వ్యాప్తి విషమముగా నేకదేశవ్యాప్తియునని అందులో మొదటి రెండుపక్షములకును పూర్వమందున్న యెడ పూర్వదినమే పరదినమందున్నచో పరమే ముఖ్యముగనుక సందేహము లేదు. రెండు దినములందును కర్మకాల పూర్ణ వ్యాప్తిగల్గినచో మీదచెప్పిన యుగ్మవాక్యమునుబట్టి యేయుగ్మములోనిదో ఆ యుగ్మము రెండవతిథిలో కలసినదానినే గ్రహించవలెను. రెండు దినములందును వ్యాప్తిలేనిచో

పూర్వదినమునే గౌణకాలవ్యాప్తి యుండుటచే గ్రహించునది. రెంటియందు సమముగా నేకదేశవ్యాప్తి యున్నయెడ పూర్వ దినమే గ్రహించునది. విషమముగా నేకదేశ వ్యాప్తిలో దినద్వయమందును కర్మకు చాలునంతతిథి దొరికినయెడ యుగ్మవాక్యముచే నిర్ణయించునది. అట్లు చాలినంత లభించనియెడఁ బరదినమునే గ్రహించ వలెను. ఇట్లు యేకభుక్తి నిర్ణయము. ఇక నక్తమునకు సూర్యాస్తమయానంతరము త్రిము హూర్త పరిమితమైన ప్రదోషకాలము వ్యాపించు తిథి కావలెను. రెండిటిలో నొకదిన మందు వ్యాప్తి యుండినను, నేకదేశ వ్యాప్తియుండినను నదియే గ్రహించ వలెను. భోజనము సూర్యా స్తోత్రమందు మూడుగడియలు సంధ్యా కాలము విడిచి చేయునది ఏమనిన; భోజన, మైథున, నిద్రాధ్యయనములు సంధ్యాకాలమందు నిషిద్ధ ములు. సన్యాసులు, పుత్రులు లేనివిధురులు, విధవ స్త్రీలును సాయాహ్నవ్యాప్తిగల పగలిటి యెనిమిదవభాగమందు భుజింపవలెను ఏమనిన; వారికి రాత్రియందు భోజనము నిషిద్ధము. ఇట్లు సౌరనక్తముగూడ సాయాహ్నవ్యాప్తి తిథియందు పగటి యందే చేయవలెను. దినద్వయ మందును ప్రదోషవ్యాప్తి కల్గినచో పరదినమే యగును. లేకున్నను పరమేయగును. సమముగా నేకదేశ వ్యాప్తియుండినను పరదినమే. విషమ ముగ నేకదేశవ్యాప్తిలో పూజాభోజనములకు తగుకాలము లభించునెడ పూర్వ దినమే గ్రహించునది. లేనియెడ సామ్యపక్షము నట్లుత్తరదినమే యగును. ఇట్టి నక్త వ్రతభోజ నము శాస్త్రవిహితము గనుక భానువార సంక్రాంత్యాది దినములందు గూడ రాత్రియందే చేయవలెను. రవి వారాదులలో రాత్రిభోజన నిషేధము రాగప్రాప్తమైన నిత్యభోజనమునకే కాని వీనికికాదు. ఉపవాసమునకు ప్రతినిధియైన నక్తము దానికి నిర్ణీతమయిన దినమందే చేయవలెను. అయాచిత మహోరాత్ర సాధ్యము గనుక నుపవాసము నకువలె నిర్ణయము. పితృకర్మలకు తిథినిర్ణయము వాటి ప్రకరణములో జెప్పబడును. ఏకభుక్త నక్తాయాచితోపవాసములు చేసిన మరునాడాతిథి యొక్క యంతమందు పారణ జేయవలెను. అతిథి యామత్రయము దాటియున్న యెడ ప్రాతఃకాలమందే పారణ జేయవచ్చునని మాధవాచార్యులనిరి. ఇట్లు లేక భుక్తాది నిర్ణయరూపమైన యైదవయుద్దేశము ముగిసెను.

అవ. ఇక వ్రత పరిభాషవిచారింపబడును :-

అందు స్త్రీ శూద్రులకు రెండు రాత్రులకంటె నెక్కుడు కాలముప వాసము చేయుట కధికారములేదు. స్త్రీలకు భర్తఅనుజ్ఞ లేకుండగ నుపవాసాదుల యందధి కారములేదు. అట్టి యుపవాసదినమందును శ్రాద్ధ దినమందును పుల్లతో దంతధావ నము జేయగూడదు. మరి పండుటాకుచేతగాని పంద్రెండుమారులు పుక్కిలించి నీళ్లువిడుచుటచేగాని ముఖశుద్ధి జేసు కొనవలెను. జలపూర్ణమైన రాగిపాత్రము గొని యాచమనజేసి యుత్తరాభి ముఖముగా ఉపవాస సంకల్పము జేయవలెను. వ్రతప్రారంభముగాని సమాప్తిగాని మలమాసమందును, గుర్వాద్యస్తమందును, వైధృతి, వ్యతీ పాతాది దుర్యోగమందును, విష్టియందును, క్రూరవారమందును, నిషిద్ధమైన దర్శాదితిథులందును జేయగూడదు. ఇట్లు ఖండతిథియందును గూడదు. ఇట్లు

సత్యవ్రతవచనము గలదు. శ్లో॥"ఉదయస్థా తిథిర్యావా న భవేద్దినమధ్య భాక్, సాఖండా నవ్రతానాం స్యా దారంభశ్చ సమాపనమ్."అని. అనగా ఉదయకాలమందున్న తిథి మధ్యాహ్న పర్యంతముండనియెడ వ్రతారంభముగాని యుద్యాపనముగాని చేయగూడదనుట. మరియు క్షమ, సత్యము, దయయు, దానము, శుచిత్వము, నింద్రియ నిగ్రహము, దేవపూజయు, హోమము, సంతోషము, దంభము, వదలుటయు నివి సర్వవ్రతములందా వశ్యకములు. అందు హోమము కామ్యవ్రత విశేషమందు మూడు వ్యాహృతు లచే జేయవలెను. ఏ దేవత నుద్దేశించి యుపవాసవ్రతము చేయబడునో యా దేవతను ధ్యానించుటయు, తన్మంత్రము జపించుటయు, తత్కథా శ్రవణము, తత్పూజయు, తన్నామశ్రవణ కీర్తనాదికము జేయవలెను. ఉపవాసదినమందన్నాది దర్శనము, గంధాదికము, నభ్యంగస్నానము, తాంబూలము, ననులేపనమును వర్జ్యములు. సభర్తృక స్త్రీలకు వరలక్ష్మీ వ్రతాది సౌభాగ్య వ్రతములందు గంధ తాంబూలాదులు గ్రాహ్యములు. వ్రతభంగము జేయనివాటికి వచనము, శ్లో."అష్టైతాన్య వ్రతఘ్నాని ఆపో మూలం ఫలం పయః, హవిర్బ్రాహ్మణ కామ్యా చ గురోర్వచన మౌషధం." అని అనగా జలము, కందమూలాదికము, ఫలము, పాలు, హవిస్సు, బ్రాహ్మణుని కోరిక, గురువాక్యము, నౌషధసేవయు నివి యెనిమిదియు వ్రత ఘ్నములు కావనుట. మరియు ప్రమాదము మొదలగువానిచే వ్రతాచరణము మానినచో మూడురోజులుపవాసముచేసి క్షౌరము జేయించుకొని తిరుగ వ్రతమచరింపవలెను. ఉపవాసము జేయ నశక్తుడైన యెడల ప్రతినిధిగా నొక బ్రాహ్మణునకు భోజనముగాని భోజనపరిమిత ద్రవ్యదానముగాని సహస్ర గాయత్రీ జపముగాని పంద్రెండు ప్రాణాయామములగాని చేయవలెను. ఆరంభించిన వ్రతము జేయ నశక్తుడైన యెడ ప్రతినిధిచే జేయింపవచ్చును. పుత్రుడు పత్ని, భర్త, భ్రాత, పురోహితుడు, చెలియలునను వీరు ప్రతినిధులు. ఇట్టి పుత్రాదులు పిత్రాదుల నిమిత్తము వ్రతము చేసినచో వ్రతఫలము వారును బొందెదరు.

వ్రతభంగకరముల వచనము :- శ్లో॥ "అసకృజ్జలపానాచ్చ సకృత్తాం బూల చర్వణాత్, ఉపవాసః ప్రణశ్యేత దివాస్వాపాచ్చ మైథునాత్, స్మరణం కీర్తనం కేళిః ప్రేక్షణం గుహ్యాభాషణం, సంకల్పో వ్యవసాయ శ్చనిశ్చయో మైథునక్రియా" అని. అనగా మాటిమాటికి జలపానము నుంచిగాని, యొకమారు తాంబూలము భక్షించుటచేగాని, పగలు నిద్రించుటనుంచిగాని, యష్ట విధములలో నొక మైథున క్రియచేగాని యుపవాసము చెడిపోవును. అష్టవిధము లెవ్వియనిన:-స్త్రీనిస్మరించుటయు, పిలుచుటయు, మాటలాడుటయు, ప్రేమతో జూచుటయు, నర్మాభిలాషము, రతిసంకల్పము, యత్నించుటయు, క్రియజేయుటయు నని. ప్రాణోపద్రవముతోచునపుడు పలుమారు జలపానము దోషము కాదు. చర్మ పాత్రలోనుండు జలము గోవ్యతిరక్త జంతువుల క్షీరము, మొసరిపప్పు, నిమ్మపండు, గుల్లసున్నము నను నీయా మిషగణమును వ్రతమందు వర్జింపవలెను. అశ్రుపాతము, క్రోధము మొదలగునవి సద్యోవ్రతభంగకరములు. పరాన్నభోజనము చేసినచో వ్రతఫల మన్నదాతకు జేరును. నువ్వులు, పెసలు

తప్ప తక్కిన సెనగలు మొదలగు పొరగల ధాన్యములును, మాసాదికము మూలకము మొదలగునవి క్షారగణమును లవణ మధుమాంసాదికమును వర్జింపవలెను. చామలు నీవార ములు గోధూమములు వ్రతమునకు హితములు. వ్రీహి తిల ముద్గ యవ తిల కంగుకలాపాది ధాన్యములును, రక్తవర్ణముగాని మూలకము, సూర ణము మొదలగు దుంపలు, సైంధవసాముద్ర లవణములును, గోవుయొక్క పాలు పెరుగు నెయ్యి మొదలగునవియు, పనసఫలము, మామిడిపండు, నారికేళము,కరక, పిప్పలి, జీరకము,శుంఠి,చింతపండు, అరటిపండు, లవలీఫలము, ఉసిరిక పప్పు, గుడము తప్ప తక్కిన యిక్షువికారములును, నివియు తైలపక్వముగాని హవిష్య ములు, గోతక్ర మును హితములు కొన్ని యెడల మహిషీ ఘృతమును గ్రాహ్యము. వ్రతవిధిలో ప్రతిమస్పష్టముగా లేనిచో మాషపరిమిత సువర్ణ రజతాది ప్రతిమయును హోమ ద్రవ్యము జెప్పనిచో నాజ్యహోమమును దేవత జెప్పనిచో ప్రజాప్రతియు, మంత్రము జెప్పినచో సమస్త వ్యాహృతియును, సంఖ్యను జెప్పనిచో నూటయిరువదెని మిదిగాని యిరువదెనిమిదిగాని యెనిమిదిగాని హోమసంఖ్యయును గ్రహించునది. ఉపవాస వ్రతానంతరము సాంగతాసిద్ధికి బ్రాహ్మణభోజనము జరిగించవలెను. ఉద్యాపనము జెప్పనిచో గోవునుగాని సువర్ణమునుగాని యీయవలెను. మరియు విప్రవాక్యముచే సాంగతాసిద్ధి యగునుగాని దక్షిణయిచ్చి విప్రవాక్యమును గ్రహించ వలెను. ఆరంభిం చిన వ్రతమును విడిచినచో చండాల సామ్యము వచ్చును. మరియు విధవాదులు వ్రతము జేయునపుడు చిత్రరక్తాది వస్త్రములను ధరింపగూడదు. సూతకాదులు వచ్చునపుడును స్త్రీలకు రజోదోషము మొదలగువాటియందును జ్వరాదికము గలుగునప్పుడును పూర్వగృహీత వ్రతముయొక్క శరీరనియమములనగా నుపవాసా దులు స్వయముగానే చేయవలెను. పూజాదికము బ్రాహ్మణునిచే జేయించ వలెను. వ్రతము కామ్యముగా జేయునపుడు ప్రతినిధియుంచ గూడదు. నిత్యకర్మ యందును నైమిత్తికమందుననది యుండవచ్చును. ఇందునకప వాదము, శ్లో॥ "కామ్యేప్యుపక్రమా దూర్ధ్వం కేచిత్ప్రతినిధిం విదుః, న స్యాత్ప్రతి నిధిర్మంత్ర స్వామిదేవాగ్ని కర్మసు." యని అనగా కామ్య వ్రతమందును ప్రారంభించిన పైన ప్రతినిధియుండ వచ్చునని కొందరందురుగాని మంత్రజపమందును, స్వామికార్యమందును, దేవకార్యమందును, అగ్ని కార్య మందును ప్రతినిధి కూడదని తాత్పర్యము. ప్రతినిధి యంచునపుడును "నైవ ప్రతినిధాతవ్యం నిషిద్ధం వస్తుకుత్రచిత్" అని యున్నందున నిషిద్ధ వస్తువు నుంచగూడదు. ఇక వ్రతదినమందు రెండు మూడు వ్రతములు సంభవించినచో దానము హోమము మొదలగు పరస్పర విరోధము లేని కార్యములు క్రమముగా జేయవలెను. విరుద్ధమైన నక్త భోజనోపవాసాదులలో నొకదాని స్వయ ముగాజేసి యితరము భార్యాపుత్రాదులచే జేయించవలెను. చతుర్దశి,అష్టమి మొదలగు తిథు లందు దివా భోజనమునకు నిషేధమును పూర్వదినమందు జేసిన వ్రతమునకు బారణయు ప్రాప్తించునపుడును పారణ విధి ప్రాప్తమైనందున భోజనమే చేయవలెను. నిషేధము నిత్యభోజనమునకే యని మీద జెప్పబడినది. ఇట్టు సంకష్టచతుర్థి మొదలగు

వానియందు రవి వారాదికము ప్రాప్తించినను రాత్రిభోజనమే చేయవలెను. మరి యష్టమి మొదలగు తిథులందుపగలు భోజన నిషేధమును రవివారమగుటచే రాత్రియు భోజన నిషేధము ప్రాప్తించినచో నుపవాసము కోరని కోరికగా సిద్ధించునది. మరియు పుత్రవంతుడగు గృహస్థునకు సంక్రమణాదులం దుపవాసము నిషిద్ధము. అపుడు భోజనమున కష్టమ్యాది ప్రయుక్త నిషేధముగలిగినచో ఫలాహారముజేసి యుపవాసమే చేయవలెను. చాంద్రాయణ వ్రత మధ్యమం దేకాదశ్యాదికము వచ్చినను దిన సంఖ్యా నియమముచే ప్రాప్తమైన కబళమును భుజింపవలెను. ఇట్లు కృఛ్రాది వ్రతమందును గ్రహించునది. అనగా నేకాంతరోపవాస ప్రయుక్తమైన పారణ యేకా దశి నాడు వచ్చినచో జలపారణచేసి యుపవసించవలెను. ఇట్లు ద్వాదశియందు మాసోపవాస శ్రాద్ధప్రదోషాదుల వలన బారణకు ప్రతిబంధము వచ్చినయెడ జలపార ణయే చేయవలయును. ఇట్లు సంక్రమణదినమందు పుత్రవద్గృహ స్థునకుపవాస నిషేధము నేకాదశ్యుపవాసమును వచ్చినచో ఫలమూలాదుల భక్షించి యుపవసించ వలెను. రెండుపవాసములుగాని, రెండు నక్తములుగాని రెండేకభుక్తములుగాని యొక దినమందు సంభవించునపుడు "అము కోపవాసమము కోపవాసం చ తంత్రేణ కరిష్యే" యని రెండిటిని కలిపి సంకల్పించి పూజాహోమాదులన్నియు కలిపి యొక్క మారే చేయవలెను. ఉపవాసైక భుక్తము లొక్కదినమందు ప్రాప్తించినచో ఖండతిథి యగునపుడు గౌణకాలవ్యాప్తినిబట్టి పూర్వదినమందొకటియు, మరునాడొకటియు జేయ వలెను. అఖండ తిథియైనచో నొకటి పుత్రాది ప్రతినిధిచే జేయింపవలెనని మీద జెప్పబడెను. ఇట్లు "కామ్యం నిత్యస్యబాధకమ్" అని మొదలగు వచనములచే కామ్య నిత్యముల బలాబలములను, బాధకా బాధకములను, సంభవా సంభవములను విచారించి జరిగించవలెను. ఇదిసామాన్య వ్రతపరిభాషారూపమైన ఆరవయుద్దే శము.

## ప్రతిపదాది తిథి నిర్ణయము

శుక్ల ప్రతిపద ఖండమగునపుడు పూజా వ్రతాదులందునపరాహ్ణ వ్యాప్తి గలిగినచో పూర్వదినమునే గ్రహింపవలెను. సాయాహ్నామందుండినను పూర్వదినమే యని మాధవాచార్యులనిరి. అట్లు గానిచో ద్వితీయతో గలసిన దినమునే గ్రహించ వలెను. కృష్ణ ప్రతిపత్తిథి యెప్పుడును ద్వితీయతో గూడినదే గ్రహింపవలెను. ఉపవాస మందు రెండు పక్షముల ప్రతిపదయు పూర్వవిద్ధయే గ్రహింపవలెను. ప్రతిపదయప రాహ్ణామం దుండినను ఉపవాస సంకల్ప ముదయమందే చేయవలెను. అప్పుడు ప్రతిపదనే స్మరించవలెను. ఇట్లు ద్వాదశీవృద్ధిచే ద్వాదశియందేకాదశ్యుప వాసము. శ్లో "ఉపోష్యాద్వాదశీ శుద్ధే" త్యాదివచనములచే సంభవించినను నేకాదశి యనియే సంకల్పించవలెను గాని ద్వాదశీసంకల్పము గూడదు. సంధ్యాగ్ని హోత్రాది కర్మ విశేషములందు తత్కాలతిథినే సంకల్పించవలెనని నాకుదోచుచున్నది. సంక ల్పించుట యును సూర్యో దయమునకు పూర్వమైన యుషఃకాలమందుగాని, యుద యానంత రము నాల్గుగడియలలోగాని చేయవలెను. తృతీయముహూర్తము సంకల్ప మునకు నిషిద్ధము. ఇది ప్రతిపత్తిథి నిర్ణయరూపమైన ఏడవ యుద్దేశము.

## విదియ మొదలగువాని నిర్ణయము

కృష్ణద్వితీయ పగలు పూర్వార్ధమం దనగా రెండు జాములలోగా ప్రవేశించినచో పూర్వదినమే గ్రహింపవలెను. కానిచో పరవిద్ధనే గ్రహింప వలెను. ఇది ద్వితీయా నిర్ణయ మెనిమిదవయుద్దేశము.

## తదియ మొదలగువాని నిర్ణయములు

ఇతర వ్రతములయందు తొలిరోజున మూడు ముహూర్తములు విదియ గలిగియు, అవిరోజున మూడు ముహూర్తములు తదియ యున్న యెడ పరదినమే గ్రహింపవలెను. అంతకు తక్కువ యున్నప్పటికి ద్వితీయా వేధయు తక్కువయైనచో పూర్వదినము గ్రహించునది. లేనిచో పరదినమే గ్రహింపవలెను. గౌరీవ్రతమందు తదియకు విదియ లేశమాత్రము గలసినను గూడదు. మలిరోజున లేశమాత్ర మున్నను గ్రహించునది. పరదినమందు స్వల్పమైనను తదియలేనిచో విద్ధయైనను పూర్వతిథియే గ్రహింపవలెను. విద్ధగాకున్నను తిథివృద్ధినుంచి మరునాడు గడియయున్నను పరదినమే గ్రహించునది. ఇది తృతీయానిర్ణయరూపమైన తొమ్మిదవయుద్దేశము.

## చతుర్థీ నిర్ణయము

గణేశ ప్రతాతిరిక్తమైన యుపవాస వ్రతమందు పంచమీయుక్తమే గ్రహింప వలెను. గౌరీవ్రతమందును, వినాయకవ్రతమందును మధ్యాహ్న వ్యాపినియే గావలెను. దినద్వయమందును మధ్యాహ్న వ్యాప్తియున్నను, లేకున్నను సమముగాగాని విషమముగాగాని యేకదేశ వ్యాప్తియున్నను తృతీయ గల్గుటచే పూర్వదినమే గ్రహించునది. పరదినమందే మధ్యాహ్న వ్యాప్తియున్నచో పరదినమే గ్రహించునది. నాగవ్రతమునకు పూర్వదినమందే మధ్యాహ్న వ్యాప్తియున్నచో పూర్వదినమే గ్రహించునది. ఉభయ దిన మధ్యాహ్న వ్యాప్తి మొదలగు నాలుగు పక్షములందును పంచమీయుతమే గ్రహించునది. సంకష్ట చతుర్థీ వ్రతమందు చంద్రోదయ కాలవ్యాప్తి కావలెను. అట్టి వ్యాప్తి పరదినమందేయున్నచో పరదినమే గ్రహించునది. ఉభయదిన ముల యందును గల్గినచో తృతీయాయుతమే గ్రహింపవలెను. రెండింటియందును లేనియెడ బరదినమే గ్రహించునది. ఇది చతుర్థీ నిర్ణయరూపమైన పదియవ యుద్దేశము.

## పంచమీ నిర్ణయము

పంచమి పక్షద్వయమందును సర్వకర్మలకును చతుర్థీ యుక్తమే గ్రహింపవలెను. స్కందోపవాస వ్రతమునకు షష్ఠీ యుక్తమే కావలెను. నాగ వ్రతమందును పరవిద్ధనే గ్రహించునది. పూర్వదినమందు చతుర్థి యారు గడియలున్న యెడ స్వల్పమైనను పరదినమే గ్రహింపవలెను. చతుర్థి యంతకు తక్కువయైనచో పూర్వదినమే గ్రహించునది. ఇది పంచమీ నిర్ణయ రూపమైన పదునొకొండవ యుద్దేశము.

## షష్ఠీ నిర్ణయము

షష్ఠి స్కంద వ్రతమందు పూర్వవిద్ధ గ్రహించునది. అన్యవ్రతములకు పరవిద్ధనే గ్రహింపవలెను. పూర్వదినమందు పండ్రెండు గడియలకు, తక్కు వగా పంచమీవేధ

యున్నచో పూర్వమే గ్రహింపవలెను. షష్ఠికి సప్తమికి రవివారము గలసినయెడ పద్మక యోగము. ఇది షష్ఠీనిర్ణయరూపమైన పంద్రెండవ యుద్దేశము.

## సప్తమీ నిర్ణయము

సప్తమి సర్వకర్మలయందును షష్ఠీయుక్తమే గ్రహించునది. పూర్వదిన మందస్తమయపర్యంతము షష్ఠి యున్నయెడ నష్టమీవిద్ధయైనను బరదినమే గ్రహింపక తప్పదు. ఇటులన్యతిథులకు నూహించవలెను. ఇది సప్తమీ నిర్ణయరూపమైన పదు మూడవ యుద్దేశము.

## అష్టమీ నిర్ణయము

శుక్లాష్టమి యన్ని వ్రతములకు పరదినమే యగును. కృష్ణ పక్షమందు పూర్వదిన మగును. అర్ధనారీశ్వరోత్సవమందు గృష్ణపక్షమైనను పరదినమే గ్రహించునది. బుధాష్టమీ వ్రతమునకు శుక్లపక్షమందు ప్రాతఃకాలము మొదలుకొని యపరాహ్ణ పర్యంతములో ముహూర్తమాత్రమునకైన నష్టమికి బుధవార యోగము గల్గినదినము గ్రహింపవలెను. సాయాహ్నమందును, చైత్రమాసమందును, శ్రావణాది మాస చతుష్టయమందును, కృష్ణపక్షమందును గ్రహింపగూడదు. సకల కృష్ణాష్టముల యందును, భైరవునుద్దేశించి యుపవాసము జేతురు. అందునకు మార్గశీర్ష కృష్ణాష్టమి భైరవజయంతి గనుక దాని నిర్ణయము చొప్పున మధ్యాహ్న వ్యాపిని గ్రహింపవలెను. దిన ద్వయమందట్లుండిన పూర్వదినమే గ్రహించునది. ప్రదోష వ్యాపిని గావలెనని కౌస్తుభమం దున్నది గనుక రెండుదినముల ప్రదోష వ్యాప్తియున్నచో వాక్య ద్వయ విరోధము పరిహరించుటకు పరదినమే గ్రహించునది. పూర్వదిన మందు ప్రదోష వ్యాప్తియు పరదినమందు మధ్యాహ్న మాత్రవ్యాప్తియునున్నచో బహుశిష్టాచార సమ్మతిచే పూర్వదినమే గ్రహించునది. మరియు శ్లో॥ "అర్క పర్వద్వయే రాత్రౌ చతుర్దశ్యష్టమీ దివా." యనువచనమువలన అనగా రవి వారమందు నమావాస్యా పూర్ణిమలను, రాత్రిభోజనముగూడదు. చతుర్దశి, అష్టమిని పగలు భోజనము గూడదు. అను నిషేధముచే వ్రతమేమియు లేకున్నను భోజననిషేధమును మాత్రము పరిపా లించువారికి మధ్యాహ్న వ్యాపినియు నిషేధమునకు కాలమాత్రము కావలెనని మీద జెప్పినటులు గ్రహించి అష్టమి యుపవసించవలెను. సప్తమిగాని, నవమి గాని భోజనము సేయవలెననితోచుచున్నది. సప్తమిగాని,నవమినిగాని భోజనము సేయవలెననితోచుచున్నది. ఇది అష్టమీ నిర్ణయరూపమైన పదునాలుగవ యుద్దేశము.

## నవమీ నిర్ణయము

నవమి సర్వవ్రతములకు నష్టమీయుక్తమే గ్రహింపవలెను. ఇది నవమీ నిర్ణయరూపమైన పదునైదవ యుద్దేశము.

## దశమీ నిర్ణయము

దశమి యుపవాసాదులకు నవమీయుక్తమే గ్రహించునది. అది దొరుకనిచో బరవిద్ధయు గ్రహింపవచ్చును. ఇదిదశమీనిర్ణయరూపమైన పదియారవయుద్దేవము.

# ఏకాదశీ నిర్ణయము

అందేకాదశ్యుపవాసము రెండువిధములు. భోజననిషేధ పరిపాల నాత్మక మునుల వ్రతస్వరూపమునని మొదటియుపవాసమందు పుత్రవంతు లగు గృహస్థుల కును, కృష్ణపక్షమందును అధికారముగలదు. రెండవది పుత్రయుక్తులగు గృహస్థులు చేయగూడదు. కృష్ణపక్షమందును గూడదు. మఱియేమనిన; మంత్రపూర్వకముగ వ్రతసంకల్పము మాని, యథాశక్తి నియమములతో భోజనవర్జనమును మాత్రము చేయవలెను. ఇట్లు తిథి క్షయము వచ్చినచో శుక్లైకాదశియందును దెలియునది. ఆషాఢశుద్దైకాదవి మొదలుకార్తిక శుద్దైకాదశివరకు మధ్యమందువచ్చు కృష్ణైకాదశుల యందు పుత్రవద్గృహస్థులకు సహితము వ్రతాధికాము గలదు. విష్ణుసాయుజ్యమును ఆయుఃపుత్రాదికమును గోరువారు కామ్యవ్రతమును పక్షద్వయమందును జేయవలెను. దానికి నిషేధమేమియు లేదు. పితృపితామహక్రమమున పాంచ రాత్రాదిసంస్కారముల నొందినవారు వైష్ణవ గృహస్థులు వారికి గృష్ణైకా దశియు నిత్యముగా నుపోష్యమే. ఈ యేకాదశీవ్రతము శైవవైష్ణవ సౌరాది మతస్థులకందరకును నిత్యమే. కనుకనే చేయనియెడ ప్రత్యవాయము విధింపబడినది. సంపత్తి మొదలగు ఫలములను జెప్పుటవలన కామ్యమునగును. కొందరు రెండుగడియలు మొదలు దశమియున్న యెడ దశమి యందే భోజనము చేయవలెననియు, సూర్యోదయమునకు పూర్వమే యేకాదశి ప్రవేశించి శుద్ధాధికాధిక ద్వాదశి గల్గినచో నుపవాసద్వయము చేయవలెనని యాతిథి పాలనము గూడ జెప్పుదురు. అదియ ప్రామాణికము. ఎనిమిది వత్సరముల వయస్సు మొదలుకొని, యెనుబదివత్సరముల వయస్సు పర్యంత మేకాదశీవ్రత మందధికారము. శక్తియున్నచో నామీదనుం జేయవచ్చును. సభర్తృక స్త్రీలకు భర్త యొక్కగాని, పిత్రాదులయొక్కగాని యనుజ్ఞలేకుండ నుపవాసాది వ్రతములజేయుచో నవి విఫలమగును. భర్తయొక్క యాయుస్సు క్షీణమగును. నరకమును గలుగును. అశక్తులకు ముందుజెప్పెడు పక్షములలో నొకటి చేయవలెనుగాని వ్రతము విడువగూడదు. పక్షము లెవ్వియనిన: శ్లో॥ "నక్తంహవిష్యాన్న మనోదనంవా ఫలం తిలాః క్షీరమథాంబుచాజ్యం, యత్పంచ గవ్యం యదివాపివాయుః ప్రశస్త మత్రోత్తర ముత్తరంచ" అని. అనగా, పగులమాని రాత్రి భుజించుట, పగలైనను హవిస్యాన్నమే తినుట, లేక యన్నమువిడచి యటుకులు మొదలగునవి తినుట, లేక ఫలము లేక తిలలు తినుట, లేక క్షీరముద్రాపుట, లేక నీళ్లుద్రాగుట, లేక నేయిద్రాగుట, లేక గోవుయొక్క క్షీరదధి ఘృతమూత్ర పురీషములు సమభాగములు కలిపి పంచగవ్యము భక్షించుట, లేక వాయుభక్షణము మాత్రము చేయుట, వీటిలో నుత్తరోత్తరము శ్రేష్ఠమని చెప్పబడి నది. ప్రమాదముచే నేకాదశ్యుపవాసము మానినయెడ ద్వాదశియందైనను జేయవలెను. అప్పుడును జేయనిచో యవ మధ్య చాంద్రాయణ వ్రతము ప్రాయశ్చిత్తము జేసుకొనవలెను. నాస్తికమత ముచే జేయనియెడ పిపీలికామధ్య చాంద్రాయణ వ్రతము ప్రాయశ్చిత్తము. అశక్తులగు పతి పుత్రాదులకై భార్యాపుత్ర భగినీ భ్రాత్రాద లేకాదశ్యుప వాసము జేసినచో నూరుయజ్ఞములు చేసిన పుణ్యము లభించును. ఇక వ్రతదినము

యొక్క నిర్ణయము ఇక్కడ వ్రతాధికారులు వైష్ణవులు స్మార్తులు నని రెండు విధములు. అందు వైష్ణవదీక్షగలవారు వైష్ణవులు తద్భిన్నులు స్మార్తులు నని మహానిబంధములందు జెప్పబడినదిగాని వంశ పారంపర్యముచే వచ్చినదే వైష్ణవత్వమునను స్మార్తత్వమునను నిర్ణయ సింధూక్తమే సర్వదేశములందు సర్వశిష్టులకు సమ్మతము. ఏకదాశికి దశమీ వేధయు రెండువిధములు అరుణోదయవేధ సూర్యోదయ వేధయునని. సూర్యోదయము నకు పూర్వము నాలుగుగడియలరుణోదయము, సూర్యోదయము స్పష్టము. కనుక తొలి రోజున నేబదియారు గడియలలోగా ఫలమాత్రమయినను దశమి యున్న యెడ నరుణోదయవేధ యగును. యిది వైష్ణవవిషయము. అరువది గడియల పూర్తికి సూర్యోదయము. ఆ పైన ఫలమాత్రమయినను దశమి యున్నయెడల సూర్యోదయ వేధ యగును. ఇది స్మార్తవిషయము. జ్యోతిషికుల వివాదచే వేధ మొదలగువానికి సందేహము కలిగినచో, శ్లో॥ “బహువాక్య విరోధేతు బ్రాహ్మణేషు వివాదిషు, ఏకాదశీం పరిత్యజ్య ద్వాదశీం సముపోషయేత్.” అనువచన మున్నందు ననగా ప్రమాణవచన విరోధముచే జ్యోతిర్విదులు వివాదపడునపుడు ద్వాదశియం దుపవాసము చేయవలె నని యున్నందున నట్లు చేయవలెను. కాబట్టి యేకాదశి శుద్ధయు విద్ధయు నని రెండు విధములు :- అరుణోదయ వేధగలది విద్ధ యనబడును. దానివిడచి వైష్ణవులు ద్వాదశియందుపవాసము జేయునది. అరుణోదయ వేధ లేనిది శుద్ధ యన బడును. అది నాలుగువిధములు :- ఏకాదశి మాత్రమే యధికమగు నదియు, ద్వాదశికి మాత్రమే యధికమగుననియు, రెండిటి కాధిక్యము గలదియు రెండిటి కాధిక్యము లేనిదియు నని. ఆధిక్యమనగా; సూర్యోదయా నంతరము దుండుట, ఉదాహరణము:- దశమి 55, ఏకాదశి 60-1, ద్వాదశికిక్షయము 57, ఇది యేకాదశిమాత్ర మధిక ముగా గల శుద్ధవైష్ణవు లకు బరదినము గ్రాహ్యము. స్మార్తగృహస్థులకు పూర్వదినము గ్రాహ్యము. ఇక దశమి 55, ఏకాదశి 57, ద్వాదశి 60-1, ఇది ద్వాదశిమాత్ర మాధిక్య ముగల శుద్ధ. అందు వైష్ణవులకు ద్వాదశియందుపవాసము. స్మార్తులకు పూర్వదినమందే యుపవాసము మరియు; దశమి 55, ఏకాదశి 60-1, ద్వాదశి 5, ఇది యుభయాధిక్యముగల శుద్దైకాదశి. ఇందుసర్వవైష్ణవులు స్మార్తులును పరదినమందే యుపవాసము చేయవలెను. మరియు; దశమి 55, ఏకాదశి 57, ద్వాదశి 58. ఇది యుభయాధిక్యములేని శుద్ధ. వైష్ణవులుస్మార్తులును పూర్వదినమందే యుపవసింప వలయును. ఇది సంక్షేపముగ వైష్ణవనిర్ణయము. ఇక స్మార్తనిర్ణయము విచారింప బడును. అందు సూర్యో దయ వేధగలది విద్ధ. యదిలేనిది శుద్ధ. ఈ రెండును ప్రత్యేకముగ నాలుగేసి విధములు. ఎట్లనిన; ఏకాదశి మాత్ర మధికమగు నదియు ద్వాదశిమాత్ర మధికమగునదియు రెండిటి కాధిక్యము గలదియు రెండిటి కాధిక్యము లేనిదియు నని యెనిమిది విధములయినది. వీటి కుదాహరణములు:- దశమి 57, ఏకాదశి 60-1, ద్వాదశికి క్షయము 58, ఇది యేకాదశి మాత్రమున కాధిక్యము గల శుద్దైకాదశి. దశమి 4, ఏకాదశి 2, ద్వాదశికి క్షయము 58, ఇది యేకాదశీ మాత్రాధిక్యముగల విద్దైకాదశి. ఈ రెండిటియందును స్మార్తగృహస్థులకు

పూర్వదినమందుపవాసము. యతులు, నిష్కామగృహస్థులు, వానప్రస్థులు, విధవలు, వైష్ణవులును పరదినము గ్రహింపవలెను. విష్ణుప్రీతిని గోరు స్మార్త గృహస్థులు రెండుపవాసములు చేయవలెనని కొందరు, ఉభయాధిక్యముగల శుద్ధ యెట్లనిన - దశమి57, ఏకాదశి 60-1, ద్వాదశి 4, ఉభయాధిక్యముగల విద్ధ యెట్లనిన-దశమి2, ఏకాదశి 3, ద్వాదశి 4. ఈ రెంటియందును వైష్ణవులును స్మార్తులును పరదినమందే యుపవసింపవలెను. ద్వాదశిమాత్రమున కాధిక్యముగల శుద్ధైకాదశి కుదాహరణము:- దశమి 58, ఏకాదశి 57, ద్వాదశి 60-1, ఇది శుద్ధైకాదశి గనుక స్మార్తులేకా దశి దినమందే యుపవసింపవచ్చును. ద్వాదశియం దక్కరలేదని మాధవ మతము. హేమాద్రి మతమం దందరును పరదినమందే యుపవసింపవలెను. మోక్షేచ్ఛగల స్మార్తులు మాత్రము పర దినమందు జేయవలయునని కొందరిమతము. ద్వాదశికి మాత్రమే యాధిక్య ముండు విద్ధైకాదశి యెట్లనిన; దశమి 1, ఏకాదశికి క్షయము 58, ద్వాదశికి వృద్ధి 60-1, ఈయేకాదశి విద్ధయగుటచే స్మార్తులకును ద్వాదశియందే యుపవాసము. కాబట్టి యుభయాధిక్యమందును ద్వాదశీ మాత్రాధిక్యమందును మాత్రమే స్మార్తులకు విద్ధాత్యాగము. అన్యపక్షముల నక్కరలేదు. వైష్ణవులకు నాధిక్యముగల షడ్విధములను విడచి ద్వాదశియందే యుపవాసము. ఉభయాధిక్యములేని శుద్ధైకాదశి యెట్లనిన; దశమి 57, ఏకాదశి 58, ద్వాదశి 59 అని. అందు స్మార్తుల కేకాదశిదినమందే యుపవాసము.వైష్ణవులకు విద్ధయగుటచే ద్వాదశి యందే యుపవాసము. ఉభయాధిక్యము లేని విద్ధ యెట్లనిన; దశమితిథి 2, ఏకదాశికి క్షయము 59, ద్వాదశి 55. ఇక్కడగూడ స్మార్తుల కేకాదశి దినమందే యుపవాసము. వైష్ణవులకు ద్వాదశి యందుపవాసము. విద్ధైకాదశి మొదటి భేదద్వయ మందువలె నీచ రమ భేదమందును యతులకు ముముక్షువులకు విధవలకును ద్వాదశియందుపవాసము. విష్ణుప్రీతికాముల కుపవాసద్వయమని గ్రహించునది. ఇపుడు శిష్టులు హేమాద్రిమతము నాదరించక మాధవమతముచేతనే సర్వస్మార్త నిర్ణయము జేతురు. ఎచ్చటనైన నుపవాసద్వయము జెప్పరు. శుద్ధాదిక ద్వాదశిక యందు నందరికొక యుపవాసమునుగాని పరదినోపవాసమును గాని చెప్పుదురు. కనుక మాధవమత మునకే సర్వదేశములందు ప్రచారము. ఇట్లేకాదశీ వ్రతనిర్ణయముచే వైష్ణవాష్టాదశ భేదములు, స్మార్తాష్టాదశ భేదములును గతార్థములని తెలియవలెను. వాటివిస్తారము గ్రంథాంతరమందు దెలియవలెను. అష్టాదశ భేదములు, వాటి కుదాహరణములు, వాటి నిర్ణయములు ప్రత్యేకముగా వ్రాయబూనినచో బాలురకు వ్యామోహమాత్ర మగునుగాని ఫలమేమియు లేదు. మరియు నారదోక్తములైన వేధభేదములు గల వెట్లనిన; అర్ధరాత్రమునకు పైని దశమియుండినచో కపాలవేధ, 52 గడియలున్నచో ఛాయావేధ, 53 గడియలుండినయెడ గ్రస్తవేధ, 54 గడియ లున్నచో సంపూర్ణవేధ, 55 గడియలున్న యెడ నతివేధ, 59 గడియలున్న యెడ మహావేధ, 57 గడియలున్న యెడ ప్రలయవేధ, 58 గడియలున్నయెడ మహాప్రలయ వేధ, 59 గడియలున్నయెడ ఘోరవేధ 60 గడియలున్న యెడ రాక్షసవేధ యని. ఇందులోగొన్ని యే మధ్వాది

మతాంతరస్థులు గొందరిచే వాడబడునుగాని మాధవాది సర్వసమ్మతవేధ 59 గడియలు మొదలుకొనియే యని తెలియవలెను. దశమి పదునైదు గడియలచే నేకాదశి దూషించునను వచన ముపవాసవ్యతిరిక్త వ్రతవిషయము. అనగా నితర వ్రతాంగ సంకల్పాదులు మధ్యాహ్నోత్తరమందు జేయవలెననిగాని యట్టివేధచే నాదిన మంతయు వదలుమనుట కాదు. ఇది ఏకాదశీనిర్ణయ రూపమైన పదునేడవ యుద్దేశము.

## ఏకాదశీ వ్రత ప్రయోగము

ఉపవాసదినమునకు పూర్వదినమందు ప్రాతఃకాలనిత్యకర్మ లాచరించి శ్లో॥ "దశమీదిన మారభ్య కరిష్యేఽ హం వ్రతంతవ, త్రిదినం దేవదేవేశ నిర్విఘ్నం కురు కేశవ." యను మంత్రముతో సంకల్పించి మధ్యాహ్నమం దేకభుక్తము జేయవలెను. అపుడు నియమములు, కాంస్య పాత్రము, మాంసము, మొసరిపప్పు, దివాస్వాపము, నతిభోజనము, నతిజలపానము, పునర్భోజనము, మైదునము, క్షౌరము, సనృతభాష ణము, సెనగలుకోద్రవ శాకము, పరాన్నము, ద్యూతము, తైలము, తెలకపిండి, తాంబూలము నివి వర్జించుట మొదలగునవి. ఏకభుక్తము జేసిన పైని కాష్ఠముతో దంత ధావనము జేయవలెను. రాత్రి భూమియందే శయనించి ప్రాతఃకాలమందేకా దశి గనుక పత్రాదికముచేతనే దంతధావనముజేసి స్నానాదినిత్య కర్మలుచేసిన పైని పవిత్రము ధరించి యుత్తరాభిముఖుడై జలపూర్ణమైన తామ్రపాత్రముతో నాచమనము జేసి సంకల్పించవలెను. ఎట్లనిన; శ్లో. "ఏకాదశ్యాం నిరాహారో భూత్వాహ మపరేహని, భోక్ష్యామి పుండరీకాక్ష శరణం మే భవాచ్యుత."యనుమంత్ర ముచ్చరించి పుష్పాంజలిని దేవునికి సమర్పించవలెను. ఏకాదశి యందు నిరాహారుడనై రేపు ద్వాదశీపారణ చేసెదను గనుక 'యో భగవంతుడ నిర్విఘ్నముగా నాయందు దయజేయు'మని మంత్రమున కర్థము. అశక్తుడు ఏకాదశియందు మీద జెప్పిన నక్తము ఫలాహారము మొదలగు వానిలో దనకు శక్యమైనదాని నుచ్చరించి సంకల్పించవలెను. శైవులకు రుద్రగాయత్రితోను, సౌరులకు నిత్యగాయత్రితోను సంకల్పము. ఇట్టి సంకల్పము సూర్యోదయోత్తర మందు దశమియున్నచో స్మార్తు లేకాదశి రాత్రియందు జేయవలెను. అర్ధరాత్రానంతరము దశమి కనువృత్తియున్నచో నందరు నేకాదశినాడు మధ్యాహ్నోత్తర మందు సంకల్పించవలెను. సంకల్పో త్తరమందష్టాక్షరితో నభిమంత్రించిన జలము త్రావవలెను. అనంతరమందు పుష్పమంటపమందు, పుష్పములచేతను, గంధముల చేతను, ధూపదీప దివ్య నైవేద్యములచేతను, నానావిధ స్తోత్రములచేతను, గీతవ్యాము లతో దండ ప్రణామముల జేయుచు జయశబ్దములుచ్చరించి విధిప్రకారముగ హరిని బూజించి రాత్రి జాగరణము జేయవలెను. ఇకనేకాదశియందు నియమ ములు. పాషండులనగ వేదబాహ్యులు వారితో సంభాషణమును దర్శన మును, స్పర్శనమును విడుచుట, బ్రహ్మచర్యము సత్యభాషణము దివాస్వాపము లేకుండుట మొదలగునవి. పరిభాషలో మీదజెప్పినవియును ఇట్లు చండాల రజస్వలా సూతికాదులయొక్కయు

సంభాషా శ్రవణదర్శన స్పర్శ నాదులు వర్జ్యములు. ఇందునకు ప్రాయశ్చిత్తము :- శ్లో॥ "పాషండి దర్శనా దౌ తు సూర్యంపశ్చే త్తత శ్శుచిః" సంస్పర్శే తు బుధస్నాయా చ్ఛుచిరా దిత్య దర్శనాత్, సంభాష్యతానే శుచిదం చింతయే దచ్యుతం బుధ." ఇత్యాదు లచే ననగా పాషండులను జూచుటకు సూర్యదర్శనమును, స్పర్శనమునకు నదియు, స్నానమును, సంభాషణమునకు నవియు, భగవంతుని స్మరించు టయు ప్రాయశ్చిత్త మని చెప్పినందునట్లు చేయవలెను. ఉపవాస దినమందు శ్రాద్ధమువచ్చినచో శ్రాద్ధ శేషమైన యన్నాదులన్నియు నొకపాత్రలో వడ్డించి యాఘ్రాణించి గోవున కదిపెట్ట వలెను. ఫలాహారము చేయదలచినచో నట్టి ఫలములు పితృపాత్రల వడ్డించి శేషము భక్షింపవలెను. ఉపవాస దినమందు శ్రాద్ధము మానుటకు వచనములు :- శ్లో॥" ఏకాదశ్యాం యదా భూప మృతాహ స్స్యాత్కదాచన, తద్దినం తు పరిత్యజ్య ద్వాదశ్యా మేవ కారయేత్." ఇత్యాదులు యథాచారముగ వైష్ణవ పరములని తెలియ వలెను. వైష్ణవులు పదియారు మహాలయములు చేయునపుడేకాదశి ద్వాదశి మహా లయములు రెండును "తంత్రేణ కరిష్యే" యని సంకల్పించి ద్వాదశియందే చేయ వలెను. కామ్యోప వాసమందు సూతకము వచ్చినచో శారీరనియమములను స్వయముగాజేసి సూత కాంతమందు పూజాదాన బ్రాహ్మణ భోజనాదికము చేయ వలెను. నిత్యోపవాసమందు సూతకము. వచ్చినచో శారీరనియమములట్లు చేయుచు స్నానముచేసి హరికి నమస్కరించి పూజాదికము బ్రాహ్మణునిచే జేయించవలెను. దానాదులకు లోపమే కాని సూతకాంతమందు జేయనక్కరలేదు. ఇట్లు రజస్వలాది దోషములందును దెలియునది.

## ఎనిమిది మహాద్వాదశీల నిర్ణయము

ద్వాదశినాడు ప్రాతఃకాలమందు నిత్యపూజాదికము జేసి భగవంతునికి వ్రతమర్పించవలెను. అపుడీ మంత్రము పఠించవలెను. శ్లో. "అజ్ఞాన తిమిరాంధస్య వ్రతేనానేన కేశవ, ప్రసీద సుముఖోనాథ జ్ఞానదృష్టి వ్రతోభవ" అని. అనగా వ్రతము సమర్పించితిని. అజ్ఞానమను చీకటిచే నంధుడనగు నాకు దయజేసి జ్ఞానదృష్టి యీవలెనని యర్థము. దశమ్యాదుల జెప్పిన నియమములకు భంగమనగా దివా స్వాపము, ముహుర్జలపానము, మిథ్యా భాషణము మొదలగునవి జరిగినచో దాని దాని నుద్దేశించి యష్టాక్షరిజపము నూటయెనిమిదేసి మారులు చేయవలెను. స్వల్పదోషమైనచో నామత్రిశతి పఠించవలెను. రజస్వలాచండాలాదివాక్య శ్రవణాదులు జరిగినచో సహస్ర గాయత్రీ జపము, అనంతరమందు నైవేద్య తులశీమిశ్రితమయిన యన్న మును బారణసేయవలెను. అపుడామలకి యనగా సుసిరకకాయభక్షించినచో నసంభాష్య సంభాషణదోషము శమించును. పారణకు ద్వాదశి దాటినయెడ మహా దోషము శమించును. పారణకు ద్వాదశి దాటినయెడ మహాదోషము ద్వాదశి స్వల్ప ముగానున్నప్పటికిని మధ్యాహ్న పర్యంతము జేయవలసిన కృత్యముల నపకర్షించి యప్పుడే చేయవచ్చును. గాని, యగ్నిహోత్ర హోమము నకపకర్షములేదని కొందరు.

ఇట్లు శ్రాద్ధమునకును నపకర్షములేదు. ఏమనిన; రాత్రి శ్రాద్ధము నిషిద్ధము. అతి సంకటమగుచో శ్రాద్ధమందును తీర్థజలముచే బారణ చేయవచ్చును. ద్వాదశి చాలా గడియ లున్నచో హరి వాసరసంజ్ఞగల ద్వాదశీ ప్రథమ పాదము దాటినపైని పారణ జేయవలెను. కలామాత్ర మైనను ద్వాదశిలేనిచో త్రయోదశి యందేపారణము. ద్వాదశి మధ్యాహ్నము దాటియున్న యెడ బ్రాతః కాలమందు మూడు ముహూర్తములలోగా పారణముగాని మధ్యాహ్నాదికమం దక్కరలేదని చాలామంది యనిరి. చాలా కర్మ కాలములకు బాధగలుగును. గనుక యపరాహ్ణమందే యని కొందరు. అన్ని మాసములలో శుక్ల ద్వాదశికిగాని కృష్ణ ద్వాదశికి గాని శ్రవణ నక్షత్రయోగమున్నచో శక్తిగలవాడే కాదశీ ద్వాదశుల రెండిటి నుపవసింపవలెను. అశక్తుడైనచో నేకాదశి ఫలాహారముచేసి ద్వాదశి నుపవాసము జేయవలెను. విష్ణుశృంఖల యోగమున్న యెడ నేకాదశి యందే శ్రవణద్వాదశీ ప్రయుక్తమైన యుపవాసము గూడజేసి శ్రవణ యోగములేని ద్వాదశియందు బారణ జేయవలెను. శ్రవణమునకంటే ద్వాదశి తక్కు వగా నున్నయెడ శ్రవణయుక్తమైనను ద్వాదశియందే పారణము. ద్వాదశి నుల్లం ఘించుట దోషమని మీద జెప్పబడినది. విష్ణు శృంఖల యోగాది నిర్ణయము భాద్రపద మాసమందలి శ్రవణద్వాదశీ ప్రకరణములో జెప్పబడును. నియమములు :-

శ్లో॥ "దివా నిద్రాం పరాన్నంచ పున ర్భోజనమైథునే, క్షౌద్రం కాంస్యా మిషం తైలం ద్వాదశ్యా మష్టవర్జయేత్ ద్యూతక్రోధచణక కోద్రవ మాసతిలపిష్ట మసూర నేత్రాంజన" మిథ్యాభాషణలో ఛాయా సప్రవాస భారవహనాధ్యయన తాంబూలా దీనివర్జయేత్. అని-అనగా మీవ్రాయబడినట్లు దివాస్వా పాదులు వర్జింపవలెననుట. ఈ నియమములు కామ్యవ్రతమం దావశ్యకములు. నిత్యవ్రతమందు గొన్ని వికల్పిత ములు.

శ్లో ॥ "శక్తిమాం స్తు పుమానీ కుర్యాన్నియమం సవిశేషణం,విశేషనియ మాశక్తో ఉ హోరాత్రం భుజివర్జితః, నిగృహీతేంద్రియ శ్శ్రద్ధాసహాయో విష్ణుతత్పర, ఉపోష్యై కాదశీం పాపా న్ముచ్యతేనాత్రసంశయః" అనిః అనగా సామర్థ్యముగలవాడు సర్వ నియమములను విశేషముగ జేయవలెను. విశేష నియమము జేయ నశక్తుడును, నింద్రియ జయముగలిగి శ్రద్ధతో భగవద్భక్తి జేయుచు నేకాదశి యహోరాత్రుల యందు భోజనము మానినచో వాడును పాపము వలన ముక్తుడగు. సంశయము లేదనుట, ఆకరణమందు ప్రత్య వాయము :-

శ్లో॥ అన్యం భుంక్ష్వేతి యోబ్రూయా ద్భుక్ష్వేవాయస్సనారకీ
ఏకాదశీ వ్రతాద్విష్ణు సాయుజ్యం లభతే శ్రియం అని.

అనగా తాను భోజనముచేసినను నొకరిని భుజింపుమని చెప్పినను నరకము వచ్చును. ఏలాగుననైన నేకాదశీ వ్రతాచరణమువలన విష్ణుసాయు జ్యము నిహలోక మున శ్రీయుగలుగునని యర్థము. ఇది యేకాదశీ వ్రత నిర్ణయము. కర్మాంతరములం దేకాదశి ద్వాదశీయుక్తమే యేకాదశీ విద్ధయే గ్రహించవలెను. ఇది యేకాదశీనిర్ణయో

ద్దేశము. సప్తదశము ద్వాదశి గ్రహింపవలెను. ఇది నెనిమిదిమహాద్వాదశులు, శుద్ధాధికైకాదశీయుక్త మైన ద్వాదశి యన్మీలనియనబడును. ద్వాదశియే శుద్ధాధికయై వృద్ధినొందినచో వంజులి యనబడును. సూర్యోదయమం దేకాదశియు ఆపైని క్షయ మొందిన ద్వాదశి ద్వితీయ సూర్యోదయమందు త్రయోదశి. ఇటులొక యహోరాత్ర మందు తిథి త్రయస్పర్శయున్నందున త్రిస్పర్శి ద్వాదశి యన బడును. దర్శకుగాని పౌర్ణమాసికిగాని వృద్ధి గలిగినచో బక్షవర్ధిని యనబడును. పుష్యమితో గూడిన జయ ద్వాదశి, శ్రవణముతో గూడిన విజయ, పునర్వసుతోగూడిన జయంతి, రోహిణితో గూడిన బాపనాశని యనబడును. వీటియందు పాపక్షయము మోక్షమును గోరు వారుపవాసము జేయవలెను. శ్రవణయుక్తమైననేకాదశివలె నిత్యము, ఈ యెనిమి దిటిలోనేకాదశి ద్వాదశియు, నొకదినమందైనరో దంత్రముచే నొకయుప వాసమే. వేరుగ వచ్చినచో నుపవాసద్వయము. వ్రతమారంభించిన వాడుపవాస ద్వయము జేయలేని యెడ ద్వాదశి నుపవాసము రెండిటిపుణ్యము నిచ్చును. అందుశ్రవణ యోగము ముహూర్తమాత్రమయినను జాలును. పుష్యాదియోగము సూర్యో దయము మొదలుకొని యస్తమయ పర్యంతమున్నచో నుపవాసము, పారణము తిథినక్షత్ర సంయోగోపవాసమయినచో నుభయాంతమందుగాని యన్యత రాంతమందుగాని చేయవచ్చునని సర్వసామాన్య నిర్ణయము. ఇది ద్వాదశీనిర్ణయరూపమైన పదునెనిమి దవయుద్దేశము.

## త్రయోదశీ నిర్ణయము

త్రయోదశి శుక్లపక్షములో పూర్వదినమును, కృష్ణపక్షములో ఉత్తర దినమును గ్రహింపవలెను. శనివారాదులతోగూడిన యొక శుక్లత్రయోదశి మొదలుకొని సంవత్సర పర్యంతము ప్రతిపక్షమందును శనివారాదులతో గూడినది మాత్రమేయైనను లేక శుక్లత్రయోదశి మాత్రమే యిరువదినాలుగింటి పర్యంతమయినను ప్రదోషకాల మందు శివపూజయు నక్తభోజనము మొదలగు నియమములగల ప్రదోష వ్రతము జేయవలెను. నక్తము ఛాయా సక్తమని మీద జెప్పబడెను. అందు సూర్యాస్తమయా నంతర మారుగడియల వరకునుండు త్రయోదశికావలెను. దినద్వయమందును ప్రదోషవ్యాప్తి యున్నను సమముగా నేకదేశవ్యాప్తియున్నను పరదినమే గ్రహింపవలెను. విషమముగా నేకదేశ వ్యాప్తి గలుగునపు డాధిక్యమున్నయెడ పూర్వదినము; అనగా పూజాభోజనాదికమునకు తగునంత కాలమున్నచో పూర్వదినమే లేనిచో సామ్యపక్ష మందువలె పరదినమే, రెంటియందు నేమియు ప్రదోష వ్యాప్తి లేకున్నను పరదినమే గ్రహింపవలెను. ఇది త్రయోదశీ నిర్ణయరూప మైన పందొమ్మిదవయుద్దేశము.

## చతుర్దశీ నిర్ణయము

చతుర్దశి శుక్లపక్షమందు ఉత్తర దినకృష్ణపక్షమున పూర్వదినమును గ్రహించు నది. ప్రతికృష్ణ చతుర్దశి యందును శివరాత్రి వ్రతము కామ్యము జేయుచో మహాశివ రాత్రికివలె అర్ధరాత్ర వ్యాప్తియే కావలెను. రెండిటియందు నిశీధ వ్యాప్తియున్నచో

ప్రదోష వ్యాప్తియు గలుగుటచే పరదినమే గ్రహించునది. కొందరు దీనికి ప్రదోష వ్యాప్తి మాత్రమే కావలెనందురు. అందునకు ప్రమాణము విచారింపవలెను. చతుర్దశి యందు భోజన నిషేధమును మాత్రము పరిపాలించుచో మధ్యాహ్నకాల వ్యాపినియైన చతుర్దశిని విడచి త్రయోదశి యందును పూర్ణిమయందును భుజింపవలెను. శివరాత్రి వ్రతము సేయువారు చతుర్దశిలోనే పారణ సేయవలెను. అట్టి పారణ విధి ప్రాప్తము గనుక చతుర్దశ్యష్టమీదివాయను నిషేధము తగులదు. ఇది చతుర్దశీ నిర్ణయ రూపమైన ఇరువదియవ యుద్దేశము.

## పూర్ణిమా నిర్ణయము

పూర్ణిమయు అమావాస్యయు సావిత్రీ వ్రతము దప్ప నితర మందు పరదినమే గ్రహించునది. శ్రావణీకార్తిక పూర్ణికులు కులధర్మాదుల యందు పూర్వవిద్ధ గ్రహింప వలెనని చెప్పియున్నందున అన్ని పూర్ణిమలట్లనే గ్రహింప వలెనని కొందరం దరు గాని ప్రమాణము విచారింపవలెను. ఒకవేళ చతుర్దశి పదునెనిమిది గడియలకు తక్కువయున్నచో 'భూతోష్టాదశనాడీభిః' అను వచనముచే వేధ దగులదు గనుక యపుడు కులధర్మాదులయందు పూర్వ దినము గ్రహింపవచ్చును. లేనిచో గ్రహింప కూడదని తోచుచున్నది. సోమ మంగళవారములలో నొకదాని గూడిన యమావాస్య స్నానదానాదులయందు మహాపుణ్యమైనది. ఇట్లు భానువారముతో గూడిన సప్తమియు, మంగళ వారముతో గూడిన చతుర్థియు పుణ్యములు. సోమవారముతో గూడిన యమావాస్యయందశ్వత్థ పూజాది స్వరూపమైన సోమవతీ యమావాస్యా వ్రతము జేయుచో నమావాస్య యపరాహ్ణ పర్యంతము ముహూర్తమాత్ర యోగమున్నను వ్రతము జేయవచ్చునుగాని దినాంతమందైన షడ్ఘటికా స్వరూపమైన సాయాహ్నా మందుగాని రాత్రిగాని యోగమున్నచో వ్రతము జేయగూడదని శిష్టాచారము. యతు లకు క్షౌరాదికము విషయమై పూర్ణిమ యుదయమం దారుముహూర్తము లుండ వలెను. మూడవ ముహూర్తము స్పృశించనిచో చతుర్దశీ యుక్తమునే గ్రహించవలెను. ఇది పౌర్ణమాసీ నిర్ణయరూపమైన ఇరువదియొకటవ యుద్దేశము.

## ఇష్టికాల నిర్ణయము

పక్షాంతమయిన పర్వమం దన్వాధానమును పక్షాదియైన ప్రతి పద యందు యాగమును జేయవలెను. దీనికి వచనము :-

శ్లో॥ 'పర్వణోయ శ్చతుర్థాంశ ఆద్యాః ప్రతిపదస్త్రయ=
యాగ కాలస్సవిజ్ఞేయః ప్రాతరుక్తోమనీషిభిః
ప్రతిపత్తుర్య చరణేన యష్టవ్యమితి స్థితిః' అని.

అనగా పర్వముయొక్క నాలుగవపాదమును ప్రతిపదముయొక్క మొదటి మూడుపాదములును గలసి యాగకాలము. కనుక ప్రతిపత్తు నాలగవపాదమందు జేయగూడదనుట. అపుడు పర్వము ప్రతి పదయు పూర్ణతిథులైనయెడ పర్వమం దన్వాధానమునకును, ప్రతిపదయందు యాగమునకును యథోక్తకాలము లభించును.

గనుక సందేహములేదు. పర్వము ఖండతిథియైనచో పర్వమునకంటె ప్రతిపదకు గలిగిన హ్రాసవృద్ధుల గడియలను లెక్కబెట్టి యందులో సగమును హ్రాసమగునపుడు పర్వమందు దీసివేసియు, వృద్ధియగునపుడు పర్వమందు గలిపియు సంధికాలము దెలిసికొని యన్వాధానాది కాలము నిర్ణయింపవలెను. హ్రాసవృద్ధులు లేనిచో యథాస్థిత మయిన సంధి స్పష్టమయ్యే యుండును. అందు సంధి నాలుగు విధములు:- పూర్వాహ్ణసంధి, మధ్యాహ్ణసంధి, యపరాహ్ణసంధి, రాత్రిసంధియునని. పగలంతయు రెండు భాగములజేసి యందు పూర్వార్థము పూర్వాహ్ణమనియు, పరార్ధ మపరాహ్ణ మనియు గ్రహింపవలెను. అట్టి పూర్వా హ్ణాపరాహ్ణములకు మధ్యమందుండు రెండుగడి యలు మధ్యాహ్నమని యెరుంగునది. దీనికే యావర్తనమను నామాంతరము కౌస్తుభమందున్నది. ఉభయ సందియు నొకపలమాత్రకాలమే మధ్యాహ్నముగాని రెండుగడియలు కాదని యిప్పటి శిష్టాచారము. కనుక మీద జెప్పినరీతిని హ్రాసవృద్ధ్యర్థ సంయోజన వియోజన ములచే నిర్ణీతమయిన పర్వప్రతి పత్సంధిపూర్వాహ్ణ మందుగాని, మధ్యాహ్నమందుగాని పడినచో సంధిదినమున కంటె పూర్వ దినమంద న్వాధానమును సంధి దినమందు యాగమును జేయవలెను. అపరాహ్ణమందుగాని, రాత్రిగాని పడినచో సంధి దినమం దన్వాధానమును పరదినమందు యాగమును జేయవలెను. సంధికి నుదాహరణము:- పర్వము పదునేడు గడియలు. ప్రతిపద పదునొకొండు గడియలున్నచో ప్రతిపత్తు క్షయ మారుగడియలు. అందు సగము మూడుగడియలును పర్వ ములో దీసివేసినందున సంధి పదునాలుగు గడియలకు వచ్చినది. ఇది పగలు. ముప్పదిగడి యలు మానమగుచో పూర్వాహ్ణసంధి యగును. ఇరువదె నిమిదిగడియలు దినమాన మగుచో నిదియే మధ్యాహ్న సంధియగును. అపుడు సంధిదినమందే యాగము పూర్వదినమం దన్వాధానము. మరియు పర్వము. 14గడియలు, ప్రతిపద19 గడియలున్నచో నైదుగడియలువృద్ధి. అందుసగము రెండు గడియల నరపర్వమందు కలిపిన సంధి పదియారుగడియలు వరకువచ్చును. ఇది యపరాహ్ణసంధి. అందుసంధిదినమందన్వాధానము పరదినమందు యాగము నగు.

## చతుర్విధ సంధులు

ఇక్కడ బాలబోధనిమిత్తము ప్రకారాంతరము జెప్పబడును:- ఎట్లనిన, సూర్యోదయానంతర మందున్న పర్వపుగడియలును ప్రతిపద గడియలును గలపినచో నవి దినమానమునకంటె దక్కువయైన యెడ పూర్వాహ్ణసంధి యగు. దినమానమునకు సమానమైనయెడ మధ్యాహ్నసంధి యగు. అంత కంటె అధికమైనచో అపరాహ్ణసంధి యగునని. ఇట్లు సూర్యోదయానంతర మందుండు పర్వప్రతిపత్తులయొక్క క్షయ వృద్ధులను బట్టియే సంధి నిర్ణయించుట శిష్టాచారమందు ప్రసిద్ధము. కౌస్తుభాది గ్రంథములయందు వేరు రీతిగలదు. ఎట్లనిన, ఉదయమున కంటె పూర్వము చతుర్దశీ దినమందుండు పర్వపుగడియలును, ఉదయానంతరమందుండునవియును గలపి

యిట్లు ప్రతిపదకుం పూర్వదినమందును బరదినమందు నుండుగడియలు గలపి పర్వమునకంటె ప్రతిపత్తునకు, వృద్ధిక్షయములు దెలియవలెను. ఎట్లనిన, చతుర్దశి 22, పర్వము17,చతుర్దశి యందున్న పర్వపుగడియలు 38, ఉత్తరదినమందున్న గడియలు17, కలిపినచో బెరసి 55, పర్వదినమందు ప్రతిపత్తుగడియలు 43, ఉత్తరదినమందు 11, కలిపినచో బెరసి 54,ఇక్కడ ప్రతిపత్తునకొక గడియ క్షయము. అందుసగము నరగడియను పర్వములో నుండి తీసివేసినచో బదియారుగడియల వరకు సంధియగు. ఇది యపరాహ్ణ సంధి. మొదటిమతములోనిది పూర్వహ్ణసంధి యైనది. ఇట్లుచతుర్దశి24, పర్వము 17, ఇట్లు వెనుక జరిగినగడియలు 39, బెరసి 53, ప్రతిపద11, గతమైనవి 43, బెరసి54, ఇక్కడ పూర్వోక్తరీతిచే క్షయోదాహరణమం దొకగడియ వృద్ధియందలి యరగడియ గలిపినచో బదునేడుగడియలు నరక పరాహ్ణ సంధి యగును. కనుక రెండుమతములకు నత్యంతవిరోధము వృద్ధిక్షయాదుల కన్నిం టికి వైపరీత్యమగును. మరియు నీమతమందు క్షయముగాని వృద్ధిగాని రెండుగడియల కంటె నెక్కువ సంభవింపదు గనుక "పరేష్ణి ఘటికామ్యానా స్తథైవాభ్యధి కాశ్చయా" అను వచనమందలి బహువచనమసంగత మగునని పురుషార్థ చింతామణిలో నిచ్చిన దూషణమును గూడ గ్రహించునది.

## పౌర్ణమాసియందు విశేషము

సంగమకాలానంతరముపదమూడవగడియ మొదలగునవి ప్రారంభించి యర్ధదినమునకు పూర్వమే సందియయినచో సద్యస్కాలపౌర్ణమాసి యనబడును. అపుడు సంధిదినమందే యన్వాధానము యాగమును జేయవలెను. ఇట్లు పౌర్ణమాసి సద్యస్కాలమగుట వైకల్పికమని కొందరు. అమావాస్య కైనచో నెప్పుడును సద్యస్కాలత యనగా రెండునొకదినమందే జరిగించుటలేదు. మరియు నమావస్యయందు గాని పౌర్ణమాసియందుగాని యపరాహ్ణసంధి యగునపుడు ప్రతిపదయొక్క నాల్గవపాద మందును యాగము జేయవచ్చును. దోషము కొరకుగాదు. ఇక బౌధాయనులు మొదలగువారి కమావాస్యయందపరాహ్ణసంధియైనను ప్రతిపదయందు నారుగడియల కంటె నెక్కుడుగా ద్వితీయ ప్రవేశించినచో చంద్రదర్శనమగును గనుక యాగము నిషిద్ధమగుటచే నమావాస్యయందిష్టియు, జతుర్దశియం దన్వాధానమును జరుగును. ఋగ్వేదులకు యజుర్వేదులకును చంద్రదర్శన నిషేధము లేనం దున ప్రతిపదయందే ఇష్టియగును. సంధిదినమం దిష్టియగుచోనది ప్రతిపదయందే సమాప్తి జేయవలెను గాని పర్వమునందు గూడదు. అట్లు జరిగించినచో దిరుగ యాగము జేయవలెను. ఈ యిష్టికీలాగునేస్మార్తాగ్నికి పర్వ మందు జేయుస్థాలీపాకమునకును నిర్ణయము. కొందరు స్థాలీపాకమునకు ప్రతిపదయందే సమాప్తియని నియమములేదు. మరే మనిన, పూర్వాహ్ణ మందే స్థాలీపాకము సమాప్తిజేసి సంధియనంతరము ప్రతిపదలో బ్రాహ్మణభోజనము మాత్రము చేయవలెననియు జయంతుడను గ్రంథకర్తయు సంధికి సమీపమగు ప్రాతఃకాలమందే స్థాలీపాకము జెప్పెరనియు బలుకుదురు. పురుషార్థ

చింతామణిలో శ్రౌతాగ్నికిని బ్రాహ్మణ భోజనము మాత్రమే ప్రతిపద యందు జేయవలెను. తక్కిన తంత్రము పూర్వాహ్ణమందే జరిగించవలెనని యున్నది. కాత్యాయన శాఖీయులకు పూర్వోక్తమైన సాధారణ నిర్ణయమే కాని విశేషము లేదు. ఇట్లు నిర్ణయ సింధువు మొదలుగ బహుగ్రంథములకు సమ్మతము. కొందరు కాతీయులకు పూర్వాహ్ణసంధిలో సంధిదినమం దన్వాధానమును పరదినమందు యాగమునని విశేషము జెప్పిరి.

## అమావాస్యలయందు కాకతీయులకు విశేషము

అమావాస్య పగలు మూడు భాగములుచేసి మొదటి భాగము పూర్వాహ్ణముగను రెండవది మధ్యాహ్నముగను మూడవది యపరాహ్ణముగను గ్రహింపవలెను. అక్కడ రాత్రి సంధియగుచో ప్రతిపదయందు చంద్రదర్శన మున్నప్పటికి నితర శాఖీయులకు వలె వీరికిని సంధిదినమందే పిండపితృ యజ్ఞము నన్వాధానము అగును. పరదినమం దిష్టి యగును. దీని కేమియు వివాదము లేదు. పూర్వాహ్ణమందును దిన ద్వితీయ భాగమయిన మధ్యాహ్నమందును సంధియగుచో సంధిపూర్వదినమం దన్వాధాన పిండ పితృయజ్ఞములును సంధి దినమందిష్టియునగు. అపుడు చతుర్దశీదినమం దమావాస్యకు దినతృతీయ భాగమైన యపరాహ్ణమందు పూర్ణ వ్యాప్తియున్నచో నమావాస్యతో గూడిన యపరాహ్ణమందు పిండపితృయజ్ఞమునకు సందేహములేదు. కనుక తృతీయభాగాత్మకమయిన యపరాహ్ణముయొక్క యంతిమ భాగమైన యేకదేశమం దమావాస్య దగిలినచో నమావాస్యవచ్చిన పైని పిండపితృయజ్ఞముగాని చతుర్దశి యందుగాదని యొకపక్షము, చంద్రుడు మిక్కిలి క్షీణించినందున చతుర్దశి యంత్యభాగమున పిండ పితృయజ్ఞమని రెండవపక్షము. ఇక నపరాహ్ణ సంధియందు నాలుగు పక్షములు. సందినమందేదిన తృతీయభాగమయిన యపరాహ్ణమం దమావాస్యకు పూర్ణ వ్యాప్తియని మొదటి పక్షము, ఎట్లనిన; చతుర్దశి 29, అమావాస్య 30, ప్రతిపద 29, దినమాసము 30. అని అపుడు సంధిదినమం దన్వాధాన పితృయజ్ఞములును పరదినమందు యాగమును జేయవలెను.

సంధి పూర్వదినమందే మీద జెప్పిన యపరాహ్ణమందమావాస్యకు పూర్ణ వ్యాప్తియని రెండవపక్షము:-ఎట్లనిన; చతుర్దశి 20, అమా 22, ప్రతిపద 24 అని. అపుడు సంధిదినమునకు పరదినమందు ముహూర్తత్రయమగు ప్రాతఃకాల ములో ప్రతిపద మూడుపాదములలో భాగము సంభవించినందున సంధిదినమం దన్వాధాన పితృయాగములును పరదినమందిష్టియునని కౌస్తుభమతము.

శ్లో॥ 'త్రిముహూర్తా ద్వితీయాచే త్ప్రతిపద్యాపరాహ్ణికీ, అన్వాధానం చతుర్దశ్యాం పరత స్సోమదర్శనాత్.' అను వచన మున్నందున ననగా ప్రతిపదయొక్క యపరాహ్ణమందు విదియ యారుఘడియలున్నచో పైని చంద్రదర్శనమగుటచే చతుర్దశియందే యన్వాధాన మని చెప్పబడినందున చతుర్దశియందే పిండపితృయజ్ఞోన్వాధానములును సంధిదినమందిష్టియు నని పరమతము. ద్వితీయపక్షమునకు మరియొక యుదాహరణము:- చతుర్దశి18, అమా18, ప్రతిపద 19, దినమానము 27. అని ఇపుడు

ప్రతిపద్దినమందు ప్రాప్తమైన మూడుపాదములలో కాలము దొరకనందున సంధిదిన మందే యన్నిమతములను కాత్యాయనులకుయాగము. పూర్వదినమందు పితృయజ్ఞా న్వాధానములు. ఇక దినద్వయమందును సమముగాగాని విషమముగాగాని యేక దేశవ్యాప్తియని మూడవపక్షము :– చతుర్దశి 25, అమా 25, ప్రతిపద24, దినమానం 30. ఇది సమముగాన పరాహ్ణవ్యాప్తి ఇపుడు మీద జెప్పిన రెండుమతములచే రెండు విధములుగ నిర్ణయము. మరియు చతుర్దశి 25, అమా 20, ప్రతిపద 17, దినమానము27, ఇదియు సమముగా వేకదేశవ్యాప్తియే. ఇచట సర్వమతములను సంధిదినమందేకాతీయేష్ఠి, పూర్వదినమం దన్వాధ్యానపితృయజ్ఞములు. ఇక వైషమ్య ముచే నేకదేశ వ్యాప్తియెట్లనిన, చతుర్దశి 25, అమా23, ప్రతిపద 23, దినమానము 30. ఇచటను పూర్వోక్తమతములచే రెండువిధములుగ నిర్ణయము. మరియు చతుర్దశి 25, అమా 22, ప్రతిపద18, దినమానం 30. ఇచట సంధిదినమండే యన్వాధాన పితృయజ్ఞములు. ప్రతిపద యేందిష్టి సంధిదినమందే యేకదేశ వ్యాప్తియని నాలుగవ పక్షము :–ఎట్లనిన; చతుర్దశి 31, అమా 29, ప్రతిపద 23, దినమానము 30. మరియు; జతుర్దశి 28, అమా 22, ప్రతిపద 17, దినమానము 27. ఈ రెండు చోట్లను సంధిదినమందే పిండపితృ యజ్ఞాన్వాధానములు. పరమయిన ప్రతిపదలో యాగము. ఇట్లు కాత్యాయునులకైనను సర్వలక్ష్యములందును చంద్రదర్శన నిషేధ ప్రతిపాలనము సంభవింపదు. మరియేమనిన; క్వచిత్తుగా నిషేధము నవలంబించి పూర్వదినమందు యాగము నొకచో చంద్రదర్శనముగల దినమందే యగును. ఇట్లు పిండపితృయజ్ఞమునని తెలియవలెను. దర్శశ్రాద్ధమున కమావాస్యా నిర్ణయము సర్వ సాధారణమై ప్రత్యేకముగ ముందు జెప్పబడును.

## సామగుల కిష్టి నిర్ణయము

అచట పౌర్ణమాసిమీద జెప్పినట్లు సర్వసాధారణమయినదే అమావాస్యయందు రాత్రిసంధియైనయెడ ప్రతిపదయందు జంద్రదర్శనమున్నప్పటికి నిష్టియగును. అపరాహ్ణసంధియైనచో నుదయ మారుగడియలలో ప్రతిపద మొదటి మూడు పాదము లలోని యాగార్హకాలము లభించునపుడు ప్రతిపదయందు జంద్రదర్శ మున్నప్పటికి నిష్టికావచ్చును. సంధిదినమం దన్వాధానపితృ యజ్ఞములు. యాగకాలము దొరకనిచో సంధిదినమందే యాగము పూర్వమయిన చతుర్దశియం దన్వాధాన పితృయోగములు. కాబట్టి సామగులకును కాత్యాయనులకువలె జంద్రదర్శన నిషేధప్రతిపాలనము యథా సంభవముగ నగునని తెలియునది. ఇది యాగకాలనిర్ణయోద్దేశము.

## పిండపితృ యజ్ఞ కాలము

అందు ఋగ్వేదులకు నమావాస్యా ప్రతిపత్తులకు సంధియగు దినమందు నైదుభాగములలో నాలుగవదియగు నపరాహ్ణమందు పిండ పితృయజ్ఞము. అదియు నపరాహ్ణసంధియగుచో నన్వాధానదినమందగును. మధ్యాహ్నమందుగాని పూర్వాహ్ణ మందుగాని సంధియగుచో యాగదినమందు యాగానంతర మపరాహ్ణమందుగాని

సంధియగుచో యాగదినమందు యాగానంతర మపరాహ్ణమనందగును. అహోరాత్ర సంధికాలమున తిథి సంధియగుచో నన్వాధానదినమందే పిండ పితృయజ్ఞము. ఇట్లు యజుర్వేదులకును హిరణ్య కేశిశాఖీయులకును సంధి దినమందే పిండపితృ యజ్ఞము. అది యపరాహ్ణమందైనను మధ్యాహ్నమందైనను జేయవలెను. ఇచ్చట నపరాహ్ణమనగా నైదుభాగములలో నాలుగవదియైనను దొమ్మిది భాగములలో సప్తమ భాగమైనను గ్రహించునది. సామవేదులకును కాత్యాయనులకును సాంఖ్యాయనులకు నన్వాధానదినమందే పిండపితృయజ్ఞమని మీద జెప్పబడినది. అవియు మూడు భాగములైన పగటి తృతీయభాగమగు నపరాహ్ణమందగును. గృహ్యాగ్ని గల ఋగ్వేదు లకు దర్శశ్రాద్ధము పిండ పితృయజ్ఞము. నొకదినమందు ప్రాప్తించినచో వ్యతిషంగ ముచే ననగా సహప్రయోగము జేయవలెను. ఖండపర్వమైనయెడ పూర్వదినమందు కేవల దర్శశ్రాద్ధము నుత్తరదినమందు కేవల పిండపితృయజ్ఞము నగును. శ్రౌతాగ్ని కలవారు కేవల పిండపితృయజ్ఞమునే దక్షిణాగ్ని యందు జేయవలెనుగాని వ్యతిషంగ ముచే జేయగూడదు. శ్రౌతాగ్ని గలవారికి సంపూర్ణదర్శయందు గ్రమము చెప్పబడును. మొదట యన్వాధానము, అనంతరము వైశ్వదేవము, ఆపైని పిండపితృయజ్ఞము, చివర దర్శశ్రాద్ధమునని, అట్టికాలమందేకాని సాగ్నికుడైన జీవత్పితృకుడు హోమాంత మందుగాని తండ్రియొక్క పితృపితామహులనుద్దేశించి పిండసహితమైన పిండపితృ యజ్ఞము జేయవలెను. లేదా, పిండ పితృయజ్ఞారంభమేమానవలెను. ఇష్టి యొకటి లోపించినచో బాదకృఛ్రము, ప్రాయశ్చిత్తము రెండులోపించినచో నర్ధకృఛ్రము, మూడు లోపించినచో అగ్నినశిచును గనుక పునరాధానముజేసుకొనవలెను. పిండపితృ యజ్ఞము లోపించినచో వైశ్వానరేష్టి జేయవలెను. ఇష్టిస్థానమందు "సప్తహోతారం హోష్యామి" యని సంకల్పించి తన్మంత్రముచే నాలుగు మారులు గ్రహించిన యాజ్య ముచే పూర్ణాహుతియైనను జేయవలెను.

## శ్రాద్ధమందమావాస్య నిర్ణయము

దర్శశ్రాద్ధమునకు దినమైదుభాగములలో నాల్గవ భాగమగు నపరాహ్ణమందు వ్యాపించు నమావాస్యకావలయును. పూర్వదినమందు మాత్రమే సంపూర్ణవ్యాప్తిగాని ఏకదేశ వ్యాప్తిగాని యున్నచో పూర్వదినమే గ్రహించునది. పరదినమందు మాత్రమట్లు న్నచో పరదినమే గ్రహించునది. రెండుదినములందును విషమముగ నేకదేశవ్యాప్తి యున్నచో నధికమున్న దినము గ్రహించునది. సమముగానదియున్నచో తిథి క్షయ మందు పూర్వదినమును తిథివృద్ధియందు సామ్యమందును పరదినమును గ్రహించు నది. దీనికి నుదాహరణములు :- చతుర్దశి 18, అమా 23, దినమాసము 30. ఇచ్చట దినద్వయమందును సమముగా నైదుగడియలు వ్యాప్తియున్నను చతుర్దశికంటె నమావాస్యకు నాలుగు గడియలు వృద్ధియున్నందున నుత్తరదిశమే గ్రాహ్యము. అట్లు చతుర్దశి23, అమా 29. ఇచటనొకగడియ సమవ్యాప్తియున్నను నాలుగు గడియలు తిథిక్షయము గనుక పూర్వదినమే గ్రహింపవలెను. మరియు జతుర్దశి 21, అమా 21. ఇచట దినద్వయమందును మూడుగడియలు సమముగా నేకదేశ వ్యాప్తియున్నను

తిథికి వృద్ధిక్షయములు లేకుండుటచే సమముగనుక పరమే గ్రహింపవలెను. దిన ద్వయమందును సంపూర్ణముగా నపరాహ్ణవ్యాప్తియున్నచో తిథివృద్ధి గనుక పరమే గ్రహించునది. దినద్వయమందు నపరాహ్ణస్పర్శలేనిచో గృహ్యాగ్ని గలవారు శ్రౌతాగ్ని గలవారును సినీవాలీసంజ్ఞగల చతుర్దశీమిశ్రమయిన పూర్వదినమే గ్రహించునది. నిరగ్నికులును స్త్రీశూద్రాదులును కుహూసంజ్ఞ గలిగి ప్రతిపదతోగూడిన యమా వాస్యనే గ్రహించునది. ఇట్లు మాధవాచార్యులకు సమ్మతమయిన దర్శనిర్ణయము శిష్టులందరు గ్రహింపుచున్నారు. పురుషార్థ చింతామణిమతమందు ఋగ్వేదులుగాని యజుర్వేదులుగాని, సాగ్నికులైనచో నపరాహ్ణవ్యాప్తి లేకున్నను నిష్టిదినమునకు పూర్వ దినమందే దర్శశ్రాద్ధము జేయవలెను. దినద్వయమందును సంపూర్ణముగ నపరాహ్ణ వ్యాప్తియున్నచో పరదినమందే దర్శశ్రాద్ధము. ఏకదేశ వ్యాప్తియున్నచో ప్రతిపదకు వృద్ధియగుటచే నా దినమందే యిష్టియగును. గనుక యుత్తరదినమందే దర్శశ్రాద్ధము. ద్వితీయదినమందే యపరాహ్ణ వ్యాప్తియున్నచో ప్రతిపదకు క్షయమగుటవలన దర్శన దినమందే ఇష్టిప్రాప్తించినయెడల ఋగ్వేదులకు సినీవాలి యనగా జతుర్దశిగలసిన యమావాస్యయును, యజుర్వేదులకు గుహువనగా ప్రతిపదతో గూడిన యమా వాస్యయు గ్రహింపనగును. సామవేదులకు వికల్పముచే రెండింటిలో నేదియైనను గ్రహింపవచ్చును. పూర్వదినమం దపరాహ్ణవ్యాప్తి యధికముగాను, పరదినమందు స్వల్పముగాను నున్నయెడ సామవేదులకు పూర్వదినమును యజుర్వేదులకు నుత్తరదిన మును గ్రహింపదగును. రెండిటిలో నపరాహ్ణస్పర్శ లేకున్నను సామవేదులకు పూర్వ దినమును యజుర్వేదులకు పరదినమును గ్రహింపదగినదని వ్రాయబడినది. సామ వేదులకు పూర్వదినమును యజుర్వేదులకు నుత్తరదినమును గ్రహింపదగును. రెండిటిలో నపరాహ్ణ స్పర్శలేకున్నను సామవేదులకు పూర్వదినమును యజుర్వేదులకు పరదినమును గ్రహింపదగినదని వ్రాయబడినది. సామవేదులకు నారంభించి చెప్పిన యీ మతము విచారింపవలసియున్నది. కాకతీయులకు పిండపితృయజ్ఞ దినమందే దర్శశ్రాద్ధమని ముందు జెప్పబడును. ఇక దర్శదినమందు దర్శశ్రాద్ధముతో నాబ్ధికము గాని మాసికముగాని యుదకకుంభ శ్రాద్ధముగాని ప్రాప్తించిన యెడ దేవతా భేద మున్నందున వేరువేరుగా రెండును జేయవలెను. అందు మొదట నాబ్ధికాదిశ్రాద్ధము నంతమందు మరియొక పాకముచే దర్శశ్రాద్ధమును జేయవలెను. వైశ్వదేవము దర్శ శ్రాద్ధమునకు ముందు శ్రాద్ధ శేషముచేగాని పాకాంతరముచేగాని చేయవలెను. ఆహితాగ్నియైనచో వైశ్వదేవమును బిండపితృయజ్ఞమునం జేసి యాబ్ధికము జేయునది. దర్శశ్రాద్ధము ననుపనీతుడును విదురుడును ప్రవాసస్థుడు సహితము జేయవలెను. అమావాస్య శ్రాద్ధము నక్రమించినచో స్వ్యాష్యవాచ మనుమంత్రమును నూరు మారులు జపించుట ప్రాయశ్చిత్తము.

## ఇష్ట్యాదుల ప్రారంభ నిర్ణయము

ఇష్టియు స్థాలీపాకమును బౌర్ణమాసయందే యారంభించవలెనుగాని దర్శ యందుగూడదు. ఆ ధానముయొక్క గృహప్రవేశ నీయహోమముకాగానే అనంతర

పౌర్ణమాసియందే దర్శపౌర్ణమాస కర్మలారంభించునెడ మలమాసమనియు పౌష మాసమనియు శుక్రవాస్త మనియు మొదలగు దోషములులేవు. అది దాటినచో శుద్ధమాసము ప్రతీక్షించవలెనని కొందరిమతము ఎప్పుడును శుద్ధకాలమందే చేయ వలెనని యితరుల మతము.

## వికృతి కర్మలకు కాలనిర్ణయము

నిత్యములైన ఆగ్రయణచాతుర్మాస్యాదులు నైమిత్తికములైన జాతేష్టి మొదలగు నవియు, కామ్యములైన సౌర్యము మొదలగునవియునని వికృతులు మూడు విధ ములు. ఇవి పురుష సంస్కారార్థములు. ఇట్లు క్రత్వంగకర్మలును నిత్యము నైమిత్తికము నని రెండువిధములు. ఇట్టి వికృతులకు సద్యస్కాలపక్షముగగాని ద్వ్యహకాలపక్షముగ గాని చేయవచ్చును. ఇట్లు పర్వమందుగాని శుక్లపక్షమున దేవనక్షత్రములందుగాని చేయవచ్చును. అందు పర్వమందు జేయదలచినచో నపరాహ్ణాదిసంధి గల్గునపుడు సంధి దినమందు సద్యస్కాలముగగాని ద్వ్యహకాలముగగాని వికృతికర్మజేసి ప్రకృతి కర్మ కన్వాధానము జేయునది. మధ్యాహ్నమందుగాని పూర్వాహ్ణమందుగాని సంధి యయినచో సంధిదినమందే ప్రకృతిని సమాప్తిజేసి సద్యస్కాలముగ వికృతిని జేయ వలెను. కృత్తిక మొదలు విశాఖవరకు పదునాలుగు నక్షత్రములు దేవనక్షత్రము లనబడును. ఆ గ్రయణములో విశేషము రెండవ పరిచ్ఛేదమున జెప్పబడును. అన్వా రంభణీయేష్టి చతుర్దశియందు జేయవలెను. ఇది వికృతి సామాన్యమునకు నిర్ణయము.

పశుయాగము వర్షఋతువులో శ్రావణి మొదలగు నాల్గుపర్వములలో నొకటి యైన దక్షిణాయన దినమందైన నుత్తరాయణ దినమందైనను జేయవలెను. అప్పుడు ఖండపర్వమగుచో వికృతి సామాన్యమందు జెప్పినటుల నిర్ణయము. ఇది పశుయాగో ద్దేశము.

## చాతుర్మాస్య కాలము

దాని ప్రయోగమునకు నాల్గుపక్షములు. ఫాల్గుణ పౌర్ణమాసియందుగాని చైత్ర పూర్ణిమయందుగాని వైశ్వదేవపర్వముజేసి ఆషాఢ పౌర్ణమాసి మొదలగు పర్వముల నాలుగేసి మాసముల కొక్కొక పర్వముగా యావజ్జీవ మాచరించుట యావజ్జీవపక్షము. ఆ రీతినే సంవత్సర పర్యంతమాచరించి సవనేష్టిచేతగాని పశుయాగముచేగాని సోమ యాగముచేగాని సమాప్తినొందించుట సంవత్సరపక్షము. ప్రథమదినమందు వైశ్వదేవ పర్వము, నాల్గవదినమందు వరుణప్రఘాసపర్వము, అష్టమనవమ దినములందు పాకమేధ పర్వమును, ద్వాదశదినమందు శునాసీరియపర్వము నని ద్వాదశాహపక్షము, అయిదు దినములతో సమాప్తియయినచో యథాప్రయోగపక్షమునని, అందు ద్వాదశా హయథాప్రయోగ పక్షముల నుత్తరాయణమందు శుక్లపక్షములో దేవనక్షత్రములందా రంభించి శుక్లపక్షమందే సమాప్తికావలెనని చాలామంది మతము. కృష్ణపక్షమందైనను సమాప్తిగా వచ్చునని కొందరు, ద్వాదశాహ పక్షమందును పంచాహపక్షమందును సవనేష్టి మొదలగువానిచే సమాప్తిజేయునెడ నొక్కమారేచాలును. లేనిచో ప్రతిసంవ

త్సరమును జేయవలయును. ఒకానొకచో నేకదినపక్షముగూడ జెప్పబడినది. అదియు చైత్రపూర్ణిమ మొదలు నాల్గుపూర్ణిమలలో నొకదానియందగును. మరియొకచో నేడు దినముల పక్షముగూడ నున్నది. ఎట్లనిన; రెండుదినములు వైశ్వదేవపర్వము, మూడవ దినమందు వరుణప్రఘాసపర్వము, నాల్గవదినమందు గృహమేధీయము, పంచమదిన మందు మహాహవిస్సులు, ఆరవదినమందు పితృయజ్ఞము మొదలగు సాకమేధపర్వము శేషము. సప్తమదినమందు శునాసీరీయపర్వమునని దీనికి పంచాహపక్షములో జెప్ప బడిన శుక్లపక్షాదికమే కాలము.

## కామ్యనైమిత్తికేష్ట్యాదుల నిర్ణయము

కామ్యేష్టులు వికృతి సామాన్యమునకు జెప్పిన నిర్ణయము చొప్పున పర్వమందు జేయవలెను. లేక శుక్ల పక్షస్థ దేవనక్షత్రమందైనను జేయవచ్చును. జాతేష్టిమాత్రము భార్యకు వింశతిరాత్రుల గర్మానధికారరూపమైన జాతాశౌచము నివర్తించినపైని చేయ వలెను. గృహదాహాదినిమిత్తికములైన నైమిత్తికేష్టులు నిమిత్తసమనంతరమందే చేయు నెడ బర్వాదులనపేక్షించనక్కరలేదు. వ్యవధానమైనచో పర్వమందే చేయవలెను. యజ్ఞాంగములైన నిత్యకర్మలకు యజ్ఞముతోగూడనే యాచరణము. కనుక వాటికి వేరుగా సమయమక్కరలేదు. హవిర్దోషము మొదలగువాని నుద్దేశించి చేయు నైమిత్తి కేష్టులు స్విష్టకృత్తుచేసిన పైని సమిష్టయ జుస్సునకు ముందు దోషస్మృతివచ్చినయెడ నపుడే యాతంత్రము ననుసరించి నిర్వాపనము మొదలుకొని చేయవలెను. అనంతర మందు స్మృతివచ్చినయెడ నా ప్రయోగము సరిపుచ్చి తిరుగ నన్వాధానము మొదలు కొని చేయవలెను.

## ఆధానము

ఆధానము పర్వమందు నక్షత్రమునందును మీద జెప్పబడినది. అపుడు సంకల్పము మొదలుకొని పూర్ణాహుతి పర్యంతము ప్రయోగమునకు చాలినపర్వము గ్రహించునది. అట్లు దొరకనిచో గార్హ పత్యాధానము మొదలుకొని యాహవనీయా ధానము పర్యంతముండునదియైనను గ్రాహ్యము. ఇట్లు నక్షత్రమునకు నిర్ణయము. దినద్వయమందును కర్మకాలవ్యాప్తి పర్వమునకు గల్గుచో నుక్తనక్షత్రయోగము గల్గిన దినము గ్రహింపవలెను. వసంతఋతువు నుక్త నక్షత్రము పర్వము నీమూడునుగల సినచో మిగుల ప్రశస్తము. ఋతువుగలయనిచో మధ్యమము. కేవలనక్షత్రమును గేవల పర్వమునైననచో నధమము. నక్షత్రము లెవ్వియనిన; కృత్తికా, రోహిణీ, ఉత్తరా, మృగ, పునర్వసు, పుష్య, పూర్వఫల్గుణీ, పూర్వాషాఢా, హస్త, చిత్రా, విశాఖానురాధా శ్రవణ జ్యేష్ఠారేవతులని సూత్రాంతరోక్తములును, కృత్తికా, రోహిణీ, విశాఖాపూర్వ ఫల్గుణీ, ఉత్తరఫల్గుణీ, మృగోత్తరాభాద్రపదేయను నాశ్వలాయన సూత్రోక్తములును గ్రహించునది. సోమపూర్వాధానమయినచో "సర్తుంపృచ్ఛేన్న నక్షత్రం" అని వచన మున్నందున ననగా ఋతువును నక్షత్రము నపేక్షించ నక్కరలేదని చెప్పినందున సోమకాలముననుసరించియే యాధానమగును గనుక వేరుగ కాలవిచారమక్కరలేదు.

# గ్రహణ నిర్ణయము

చంద్ర సూర్య గ్రహణము దర్శనయోగ్యమగు కాలమంతయు పుణ్యకాలము. మేఘాది ప్రతిబంధముచే గానుపించుట సంభవించకపోయినను శాస్త్రాదికముచే స్పర్శమోక్షములను తెలిసికొని స్నానదానాదిక మాచరింపవలెను. రవివారమందు సూర్యగ్రహణమును సోమవారమందు చంద్రగ్రహణమును చూడామణి యనబడును. అపుడు దానాదికమనంతఫలము గ్రహస్పర్శ తగులునపుడు స్నానమును, మధ్యకాల మున హోమమును, దేవార్చనమును, శ్రాద్ధమును, విడుపుజూపుచుండగ దానమును విడుపంతయుకాగానే స్నానమును క్రమముగ జేయవలెను. అపుడు స్నానార్థమైన జలమునకు దారతమ్యము. ఇందువచనము :– శ్లో॥ "శీతముష్ణోదకాత్పుణ్య మపార క్యం పరోదకాత్, భూమిష్ఠ ముద్ధృతాత్పుణ్యం తత ప్రస్రవణోదకం. తతోఽపిసార సంపుణ్యం తతఃపుణ్యం నదీజలం, తతస్తీర్థనదీగంగా పుణ్యాపుణ్యస్తతోంబుధి."యని. అనగా నుష్ణోదకమునకంటె శీతోదకమును, అందులో పరకీయోదకమునకంటె స్వకీయోదకమును,అందుతోడుకొనిన కూపాదిజలమునకంటె భూమియందు ముందు సిద్ధమైయున్న జలమును దానికంటె కొండమొదలగువాటినుంచి స్రవించి పారుగడ్డల యుదకము నంతకంటె సరోవరమున నుండుజలమును నంతకంటె నదీ జలమును దానికంటె తీర్థజలమైన గంగానదియు దానికంటె సముద్రమును క్రమముగా పుణ్యత మములని గ్రహణస్నానము కట్టిన బట్టలతోనే జేయవలెను. ఇది ముక్తిస్నానపరమని కొందరు. ముక్తిస్నానము చేయనిచో సూతకము నివర్తించదు. గ్రహణస్నానము మంత్రపూర్వకముగ నక్కరలేదు. సువాసినులగు స్త్రీలు కంఠస్నానము చేయవచ్చును. శిష్ట స్త్రీలుమాత్రము సశిరస్నానము చేయుచున్నారు. జాతాశౌచము గాని మృతా శౌచముగాని గలిగియున్నప్పటికిని గ్రహణ నిమిత్తకమైన స్నానదానాది కము జేయనే వలయును. ఇట్లు రజస్వలయు, అందు వచనము :– "శ్లో॥ స్నానేనైమిత్తికే ప్రాప్తే నారీయదిరజస్వలా, పాత్రాంతరితతోయేన స్నానంకృత్వా వ్రతంచరేత్, నవస్త్రీ పీడనంకుర్యా న్నాప్యద్వాసశ్చ ధారయేత్." అని. అనగా గ్రహణాదినైమిత్తిక స్నానము ప్రాప్తించినపుడు స్త్రీ రజస్వలయైయున్నను పాత్రలు వేరువేరుగానున్న జలముతో స్నానముజేసి వ్రతమాచరింపవచ్చును. తడసినబట్ట పిడువగూడదు. మరియొకవస్త్రము ధరింపగూడదని యర్థము. గ్రహణమునకుముందు మూడురోజులుగాని యొకరోజు గాని యుపవాసముజేసి గ్రహణస్నానదానాదులు చేసినయెడ మహాఫలము. ఏకరాత్ర పక్షమందు గ్రహణదినమునకంటె పూర్వదినమందుపవాసము జేయవలెనని కొందరు గ్రహణసంబంధముగల యహోరాత్రముల నుపవాసమని యన్యులు పుత్రవంతుడగు గృహస్థునికి గ్రహణ సంక్రాంత్యాదులం దుపవాసమక్కరలేదు. పుత్రవంతుడనగా; కన్యా వంతుడను గ్రహింపబడునని కొందరు. గ్రహణమందు దేవపితృతర్పణము చేయవలెనని కొందరు. "సర్వేషామేతవర్ణాణాం సూతకం రాహుదర్శనే"యని గ్రహణ దర్శనమందు సర్వవర్ణముల వారికి జాతాది శౌచముందును గనుక నపుడు ముట్టిన వస్త్రాదుల దడపవలయును. గ్రహణకాలమందు గోభూహిరణ్యాది దానము మహా

ఫలము. తపస్సును విద్యయుగల దానపాత్రము ముఖ్యము. సత్పాత్రమందు దానము పుణ్యాతిశయము నిచ్చును. శ్లో॥ సర్వ గంగాసమంతోయం సర్వేవ్యాప సమాద్విజాః సర్వం భూమి సమం దానంగ్రహణే చంద్రసూర్యయోః" అనువచనము సామాన్యముగా పవిత్రతను దెలుపును. సర్వజలమును గంగాసమము.సర్వద్విజులు వ్యాసాచార్యులతో సములు సర్వదానములు భూదానతుల్యములు. గ్రహణకాలమందని యర్థము. ఇది సామాన్యవచనము గనుకనే దానపాత్రములో ఎట్లనిన; దారతమ్య మన్యస్థలమందు జెప్పబడినది. శ్లో॥ 'సమనుబ్రాహ్మణేదానం ద్విగుణంబ్రాహ్మణబ్రువే, శ్రోత్రియే శత సాహస్రం పాత్రే చానంత్యమశ్నుతే.' యని.అనగా నమస్కారాదులు లేక జాతి మాత్రముచే బ్రాహ్మణుడగువాడు అబ్రాహ్మణుడనబడును. వానికి దానమిచ్చినచో యథాస్థిత ఫలము వచ్చును. గర్భాధానాది సంస్కారములు గలిగి వేదాధ్యయనాధ్యాప నాదులులేనివాడు బ్రాహ్మణ బ్రువుడు వానికిచ్చు దానమునకు ద్విగుణఫలము. వేదాధ్యయనాదులును గల్గినచో శ్రోత్రియు డనబడును. వానికిచ్చు దానమునకు సహస్ర గుణఫలము. విద్యయు సముదాచారసంపత్తియు గలిగినచో బాత్రమనబడును. వానికిచ్చుదాన మనంతఫలదమని యర్థము. గ్రహణ శ్రాద్ధమామద్రవ్యము చేతగాని హిరణ్యముచేతగాని చేయవలెను. సంపన్నుడైన యెడ పక్వాన్నముచేతనైనను జేయ వచ్చును. గ్రహణశ్రాద్ధము తీర్థయాత్రాంగ శ్రాద్ధమువలె ఘృతప్రధానముగ జేయ వలెను. గ్రహణ శ్రాద్ధమందు భోక్తకు మహాదోషము. గ్రహణమందు తులాపురుషాది మహాదానములు సంపన్నుడు చేయవలెను. గ్రహణకాలమందు మంత్రపురశ్చరణము మొదలగు దీక్షలకు వచనము. శ్లో॥ 'చంద్ర సూర్యగ్రహేతీర్థే మహాపర్వాదికే తథా, మంత్రదీక్షాం ప్రకుర్వాణో మాసర్క్షాదీన్న శోధయేత్.' అని. అనగా చంద్రసూర్యగ్రహణ కాలమందును తీర్థమందును మహాపర్వము మొదలగుదానియందును మంప్రురశ్చరణ దీక్షనుగాని యుపలక్షణముచే మంత్రోపదేశమునుగాని చేయువారికి మాసనక్షత్రాది శోధన మక్కరలేదు. దీక్షాక్రమమును మంత్రశాస్త్రోక్త ప్రకారముగ దెలియవలెను. శ్లో॥ 'యుగే యుగే తు దీక్షాసీ దుపదేశః కలౌయుగే, చంద్రసూర్యగ్రహేతీర్థే సిద్ధక్షేత్రే శివాలయే, మంత్రమాత్ర ప్రకథన ముపదేశస్స ఉచ్యతే' యని. అనగా ప్రతియుగ మందును మంత్రోపదేశము దీక్షారూపమై యనేకనియమములు గలిగియుండును. కలియుగమందు మాత్రము మంత్రకథనమేయై యుండును. అదియును చంద్రసూర్య గ్రహణములలో దీర్థమందును సిద్ధక్షేత్రమందును శివాలయమందును జేయవలెను. అందు మంత్ర గ్రహణ విషయమై సూర్యగ్రహణమే ముఖ్యము. చంద్రగ్రహణమందై నచో దారిద్ర్యాదిదోషములు చెప్పబడియున్నవని కొందరు. పురశ్చరణమునకు వచ నము. శ్లో॥ 'చంద్రసూర్యోపరాగే చ స్నాత్వాపూర్వ ముపోషితః, స్పర్శాది మోక్షపర్యం తం జపేన్మంత్రం సమాహితః,జపాద్దశాం శతోహోమస్తథా హోమాచ్చతర్పణం, హోమా శక్తౌ జపంకుర్యాద్ధోమసంఖ్యా చతుర్గుణం.' అని. అనగా చంద్రసూర్యగ్రహణ దిన మందు భోజనమువిడచి స్పర్శకాకముందే స్నానముచేసి అది మొదలుకొని శుద్ధమోక్ష మగునంతకు మంత్రమేకాగ్రతతో జపించవలెను. అట్టి జపసంఖ్యకు పదియవవంతు

హోమమును దానికి పదియవవంతు తర్పణమును జేయునది. హోమము జేయలేని యెడ దానిసంఖ్యకు చతుర్గుణముగ జపమే చేయవచ్చును. తర్పణము జేయునపుడు మూలమంత్రము నుచ్చరించి మంత్రదేవత నామమును ద్వితీయాంతముగ నుచ్చరించి "అముకాం దేవతాం తర్పయామి" యనుచు యవాదులతో గూడినజలము దోసిలితో నర్పించవలెను. ఇట్లు నమశ్శబ్ద మంతమందుండునట్లు మూలమంత్ర ముచ్చరించి, "అముకాం దేవతా మహమభిషించామి" యని దన శిరస్సునందు జల్లుకొనుటయనే మార్జనము తర్పణమునకు పదియవ భాగముగ జేయవలెను. మార్జన సంఖ్యకు దశమభాగము బ్రాహ్మణ భోజనము. ఇట్లు జపహోమతర్పణమార్జన విప్ర భోజనరూపముగా నైదుభాగములుగలది పురవ్చరణమనబడును. తర్పణాదులలో నేదియైన సంభవించనియెడ దాని సంఖ్యకు చతుర్గుణముగ జపమే చేయవలెను. ఇట్టి పురశ్చరణము గ్రస్తోదయ గ్రస్తాస్తమయములందు సంభవించదు. పురశ్చరణాంగ మైన యుపవాసమును పుత్రవంతుడైన గృహస్థుడును జేయవచ్చును. పురశ్చరణము జేయువానికి స్నానదానాది నైమిత్తికలోపముచే ప్రత్యవాయము గలుగును. కనుక నవి భార్య పుత్రుడు మొదలగు ప్రతినిధులచే జేయింపవలెను.. ఇక పురశ్చరణము జేయువిధాన మెట్లనిన :- స్పర్శకుముందే స్నానము నాసనబంధమునుజేసి, "అముక గోత్రోఽ ముకశర్మాహం రాహుగ్రస్తే దివాకరే నిశాకరే వా అముకదేవతాయా అముక మంత్రసిద్ధి కామోగ్రాసాదిముక్తిపర్యంత మముకమంత్రస్య జపరూపం పురశ్చరణం కరిష్యే" యని సంకల్పించి స్పర్శ మొదలుకొని మోక్షపర్యంతము జపముజేయవలెను. ఆపై బరదినమందు స్నానాది నిత్యకర్మలుచేసి, "అముక మంత్రస్య కృతైతద్గ్రహణ కాలికాముక సంఖ్యాక జపసాంగతాసిద్ధ్యర్థం తద్దశాంగహోమతద్దశాంశతర్పణ తద్దశాంశమార్జన తద్దశాంశ విప్రభోజనాని కరిష్యే" యని సంకల్పించి, హోమాదు లైనను తత్తచ్చతుర్గుణ మంత్రజపమైనను జేయవలెను. ప్రతినిధిగా ప్రేరణచేయబడిన పుత్రాదులు గ్రహణకాలమందే, "అముకగోత్రస్యాముక శర్మణో గ్రహ స్పర్శస్నాన ప్రయుక్త శ్రేయః ప్రాప్త్యర్థం స్పర్శస్నానం కరిష్యే" యని సంకల్పించి స్నానదానాదికము జేయవలెను. పురశ్చరణము జేయనివారును తమతమ యిష్టదేవతా మంత్రజపమును గాయత్రీమంత్రజపమును జేయకతప్పదు. లేనిచో మంత్రమునకు మాలిన్యమగును. గ్రహణకాలమందు శయనించినచో రోగము. మూత్రము విడిచిన యెడ దారిద్ర్యము. పురీషము విడిచినచో కృమిజన్మము, మైధునము జేసినచో నూరపందిజన్మము. అభ్యంగము జేసికొనినచో కుష్ఠరోగము, భోజనముచేసిన నరకమువచ్చును. గ్రహణ మునకు ముందు వండినయన్నము గ్రహణోత్తరమందు భుజింపగూడదు. ఇట్లు గ్రహణకాల స్థితమైన జలమును ద్రావినచో బాదకృఛ్రము ప్రాయశ్చిత్తమని యున్నం దున నదియును త్యాజ్యము. మీగడ, మజ్జిగ, తైలపక్వము, క్షీరమును పూర్వసిద్ధ మైనను గ్రహణోత్తరమందు గ్రహింపవచ్చును. గాని గ్రహణ కాలమందు వాటిలో దర్భఖండము వేయవలెను.

## గ్రహణ వేధి విచారము

సూర్యగ్రహణమందు స్పర్శ గనుపించు యామమునకంటె పూర్వము నాలుగు యామములు వేధగలిగి యుండును. చంద్రగ్రహణమందు మూడు యామములు. కాబట్టి సూర్యగ్రహణము ప్రాతఃకాలమందైనచో, పూర్వరాత్రి నాలుగు జాములలో భుజింపగూడదు. రెండవజాములో పగలు సూర్యగ్రహణమయినచో పూర్వరాత్రి రెండవ యామము మొదలుకొని భుజింపగూడదు. ఇట్లు రాత్రి తొలిజాములో చంద్ర గ్రహణమైనచో పగలు రెండవజాము మొదలుకొని భుజింపగూడదు. రాత్రి రెండవ జాము మొదలగు వాటిలో చంద్రగ్రహణమగునో పగలు మూడవజాము మొదలుగ భుజింపగూడదు. బాలవృద్ధాతురులైనచో వారికి గ్రహణమునకు ముందొకజాము గాని యారుగడియలుగాని భోజననిషేధము. సమర్థుడు వేధకాలమందు భుజించినచో మూడురాత్రులుపవాసము సేయవలెను. గ్రహణకాలమందే భుజించినచో ప్రాజాపత్య కృచ్ఛ్రము ప్రాయశ్చిత్తము. చంద్రునికి గ్రస్తోదయమైనచో పూర్వమైన యామచతుష్టయ మునకును వేధగలుగును. గనుక పగలుపవాసమే యగును. కొందరు చంద్రునికి పూర్ణగ్రాసమయినచో మాయచతుష్టయ వేధయనియు, నేకదేశగ్రాస మయినచో మూడు యామముల వేధ యనియు జెప్పుదురు.

## గ్రస్తాస్తమయ విచారము

శ్లో॥ 'గ్రస్తావేవాస్తమానం తురవీందూ ప్రాప్నుతోయది, పరేద్యురుదయే స్నాత్వా శుద్ధోభ్యవహరేన్నరః' అని. అనగా సూర్యచంద్రులు గ్రస్తులై యస్తమయము నొందిన యెడ పరదినమందు శుద్ధబింబముజూచి స్నానముజేసి శుద్ధుడై భుజింపవలెనని యర్థము. కాబట్టి శుద్ధబింబము జూడకముందు శుద్ధిలేనందున జలాహారణము మొదలయినవియును జేయగూడదని తోచుచున్నది. పుత్రవంతుడయిన గృహస్థునికి సూర్యగ్రస్తాదులయందుపవాస నిషేధమున్నందున నారుగడియలు వేధకాలమువిడచి యతడు భుజింపవచ్చునని కొందరు చెప్పిరి.

పుత్రవంతుడైన గృహస్థుడు నుపవసింపవలెనని మాధవాచార్యాది శిష్టసమ్మ తము. సూర్యగ్రస్తాస్తమందును, చంద్రగ్రస్తోదయమందు నాహితాగ్ని యన్వాధానము జేసి జలముచే వ్రతము జేయవలెను గాని భోజనము గూడదు. చంద్రగ్రస్తాస్తమందు నుత్తరదినమున సంధ్యాహోమాదికమును నిషేధములేదు. మరియేమనిన; అల్పకాల ముక్తియగునెడ శాస్త్రముచే ముక్తిదెలసి స్నానముజేసి హోమాదికము జేయవలెను. చిరకాలముక్తియగుచో హోమకాలాతిక్రమము గూడదు గనుక గ్రస్తోదయమందువలెనే గ్రహణకాలమందే హోమాదికముజేసి శాస్త్రముచే ముక్తిదెలిసి స్నానముజేసి బ్రహ్మ యజ్ఞాదిక మాచరింపవలెనని తోచుచున్నది. దర్శయందు గ్రహణ శ్రాద్ధము సంభ వించినచో దానిచేతనే దర్శశ్రాద్ధమునకును సంక్రాంతి శ్రాద్ధమునకును ప్రసంగసిద్ధి యగును. గ్రహణదినమందు పిత్రాదుల యాబ్దికము ప్రాప్తించినచో సంభవించినయెడ నన్నముచేతనే జేయవచ్చును. బ్రాహ్మణాదులు దొరకకుండుటచే నసందర్భమైనయెడ

నామద్రవ్యముచేగాని హిరణ్యముచేగాని చేయవలెను. తనజన్మ రాశికి తృతీయమందును షష్ఠమందును ఏకాదశమందును దశమరాశియందును గ్రహణముపట్టినచో శుభప్రదము. ద్వితీయమందును సప్తమమందును నవమమందును, పంచమమందు నైనచో మధ్యమము. జన్మమునందుగాని చతుర్థమందుగాని, యష్టమమందుగాని, ద్వాదశమందుగాని పట్టినచో అరిష్టప్రదము. ఇక జన్మరాశియందును జన్మనక్షత్రమందును గూడనైనచో గర్గాద్యుక్తమైన శాంతి జేసికొనవలెను. లేదా బింబదానము జేయవలెను. అది యెట్లనిన; చంద్రగ్రహణమందు వెండిచే జంద్రబింబమును సువర్ణముచే నాగబింబమును జేయించియు సూర్యగ్రహణమందు సువర్ణముచేతనే సూర్యబింబమును నాగబింబమునుజేసి ఘృతముచే నిండిన తామ్రపాత్రయందైనను కంచుపాత్రయందైన నుంచి తిలలు వస్త్రము దక్షిణముగలపి, "మమ జన్మరాశి జన్మనక్షత్ర స్థితాముక గ్రహణసూచిత సర్వారిష్టశాంతిపూర్వక మేకాదశస్థాన స్థిత గ్రహణసూచిత శుభఫలావాప్తయే బింబదానం కరిష్యే" యని సంకల్పించి సూర్యుని చంద్రుని రాహువును ధ్యానించి నమస్కరించి, శ్లో॥ 'తమోమయ మహాభీమ సోమసూర్య విమర్దన, హేమతారప్రదానేన మమశాంతి ప్రదోభవ. విధుం తుద నమస్తుభ్యం సింహి కానంద నాచ్యుత, దానే నానేన నాగస్య రక్షమాం వేధజాద్భయాత్' అను మంత్ర ముచ్చరింపుచు:- "ఇదం సౌవర్ణం రాహుబింబం నాగం సౌవర్ణం రవి బింబం రాజతం చంద్రబింబం వాఘృతపూర్ణ కాంస్యపాత్రనిహితం యథాశక్తి తిలవస్త్రదక్షిణా సహితం గ్రహణసూచితారిష్టవినాశార్థం శుభఫలప్రాప్త్యర్థం చ తుభ్యమహం సంప్రదదే' యను దానవాక్యముచే పూజించిన బ్రాహ్మణునికి దాన మీయవలెను. ఇట్లు చతుర్థాది స్థానములందు పట్టినను దానము చేయవలెను. స్వజన్మరాశి మొదలగు రాసులలో గ్రహణముపట్టినపుడు గ్రస్తబింబము చూడగూడదు. ఇతరజనులకైనను వస్త్రజలాదివ్యవథానముచేతనే గ్రహణము చూడవలెనుగాని సాక్షాత్తుగా చూడగూడదు. పూర్ణగ్రాసముగా చంద్రగ్రహణము. వచ్చునపుడు ముందు ద్వాదశి మొదలుకొని ఆపైని తదియ పర్యంతము దినసప్తకము మంగళ కార్యములకు నిషిద్ధము. సూర్యునికి పూర్ణగ్రాసమయినయెడ నేకాదశి మొదలుకొని చతుర్థిపర్యంతము శుభకార్యమునకు నిషిద్ధము. ఖండగ్రహణమయినచో జతుర్దశి మొదలు దినత్రయము వర్జ్యము. జ్యోతిర్నిబంధమందు గ్రాసముయొక్క పాదతారతమ్యమునుబట్టి నిషిద్ధదినములకు న్యూనాధికత్వము జెప్పబడినది. గ్రస్తాస్త గ్రహణమందు పూర్వదినత్రయము వర్జ్యము. గ్రస్తోదయమందు నుత్తర దినత్రయము వర్జ్యము. పూర్ణగ్రాస మగునపుడు గ్రహణనక్షత్రము ఆరుమాసముల పర్యంతం వర్జ్యము. పాదాదిగ్రాసమందు మాసము నరమొదలుకొని యూహింపవలెను. పూర్వమందు సంకల్పించిన ద్రవ్యము గ్రహణానంతరమందు నీవలసి వచ్చినచో ద్విగుణముగ నీవలెను.

## సముద్ర స్నాన విధి

సముద్రమందు పూర్ణిమయమావాస్య మొదలగు పర్వములందే స్నానము చేయవలయును. శుక్రవారమందును మంగళవారమందును స్నానము జేయగూడదు.

ఇట్లు వచనము :- శ్లో॥'అశ్వత్థ సాగరౌసేవ్యౌ న స్పర్శ్యస్తు కదాచన, అశ్వత్థం మంద వారేచసముద్రం పర్వణిస్పృశేత్, నకాల నియమస్సేతౌ సముద్ర స్నానకర్మణి.' అని. అనగా నశ్వత్థ వృక్షమును సముద్రమును సర్వదా సేవింపవలెనుగాని స్పృశింప గూడదు. శనివారమయినచో నశ్వత్థమును బర్వమయినచో సముద్రమును స్పృశింప వచ్చును. సేతువునందయినచో నెప్పుడును నిషేధము లేదని సముద్రస్నాన విధి గ్రంథాంతరముచే దెలియవలెను.

## తిథి నక్షత్రాదులయందు విధి నిషేధములు

అవ:- ఇక తిథివిశేషమందును నక్షత్రవిశేషమందును వారాదులయందును విధి నిషేధములు విచారింపబడును.

ఇందుల వచనములు :- శ్లో॥ 'సప్తమ్యాం నస్పృశేత్తైలం నీలవస్త్రం న ధారయేత్, న చాప్యామలకైస్స్నానం న కుర్యాత్కలహం నరః, సప్తమ్యాం నైవ కుర్వీత తామ్రపాత్రేణ భోజనం.' అని. అనగా సప్తమతి తిథియందు తైలమును స్పృశింప గూడదు. నీలవస్త్రము ధరింపగూడదు. ఉసిరికపప్పుతో స్నానము చేయగూడదు. కలహము చేయగూడదు. రాగిపాత్రతో భోజనము కూడదని యర్థము. ఇట్లు నంద తిథులందభ్యంగమును రిక్తతిథులందు క్షౌరమును జయతిథులందు శూద్రాదులకు మాంసమును, పూర్ణతిథులందు స్త్రీసంగమును వర్జ్యములు. ఇట్లు రవివారమందభ్యంగము, మంగలవారమందు క్షౌరము, బుధవారమందు స్త్రీసంగమును వర్జ్యములు. చిత్రా హస్త శ్రవణములందు తైలము వర్జ్యము. విశాఖాప్రతిపత్తులయందు క్షౌరము గూడదు. మఘా కృత్తికాత్త్యుత్తరలయందు స్త్రీసంగము గూడదు. సప్తమియందు తిలభక్షణమును తిలతర్పణమును గూడదు. అష్టమియందు నారికేళమును, నవమి యందానబకాయయు, దశమియందు పొట్లకాయయు, నిష్పావధాన్యమేకాదశి యందును, మొరిపప్పు ద్వాదశియందును, వంగకాయ త్రయోదశియందును వర్జ్యములు. శ్లో॥ 'పూర్ణిమా దర్శసంక్రాంతి చతుర్దశ్యష్టమీషు చ, నరశ్చండాలయోనౌస్యా త్తైల స్త్రీ మాంససేవనాత్' అని. అనగా పూర్ణిమయందును దర్శయందును సంక్రాంతి దినమందును చతుర్దశియందును నష్టమి యందును, తైలముగాని, స్త్రీనిగాని మాంసమునుగాని సేవించినచో చండాలజన్మము వచ్చునని యర్థము. పూర్ణిమ, దర్శ, సంక్రాంతి, ద్వాదశి, శ్రాద్ధదినము. వీటిలో వస్త్రము బిడువగూడదు. రాత్రియందు మృత్తిక, గోమయము, ఉదకము వీనిని దేగూడదు. ప్రదోషకాలమందు గోమూత్రము బట్ట గూడదు. అమవాస్య మొదలగు పర్వములలో నవశ్యము శాంతినిమిత్తము తిలహోమము చేయవలెను. ఆత్మరక్షణము కొరకు దానాదికమును జేయవలెను. పర్వములందు వేదాధ్యయనము గూడదు. శౌచాచమనము బ్రహ్మచర్యము మొదలగు నియమముల సేవింపవలెను. ప్రతిపత్తు, దర్శ, షష్ఠి, నవమి వీటియందును శ్రాద్ధదిన మందును జన్మదినమందును వ్రతదినమందు నుపవాసదినమందును రవివారమందును మధ్యాహ్న స్నానసమయమందును పుల్లతో దంతధావనముగూడదు. మరియేమనిన; శ్లో॥ 'అలాభేదంత కాష్ఠానాం నిషిద్ధేపిది నేతథా, అపాం ద్వాదశ గండూషైః

పత్రై ర్వాశోధయేన్ముఖం.' అని. అనగా దంతకాష్ఠము దొరకనపుడును నిషిద్ధదినము లందును పండ్రెండు మారులు జలము పుక్కిలించుటచేనైనను పండుటాకులచేనైనను ముఖశుద్ధి జేసుకొనవలెనని యర్థము. ఈ నిషేధములన్నిటికిని తిథి మొదలగునవి తత్కాల వ్యాప్తిగల్గునవిగ గ్రహించునది.

ఈ గ్రంథము పూర్వగ్రంథముల శాస్త్రార్థము దెలిసికొను పాండిత్యముగల వారి కొరకు గాదు. మరియేమనిన; నట్టి పాండిత్యము లేకున్నను సిద్ధాంత ధర్మములను దెలియుట గోరువారలకు వ్రాయబడినది గనుక ప్రమాణవచనములు కౌస్తుభము నిర్ణయ సింధుమాధవ నిబంధము మొదలగువానియందు దెలియవలెను. ఇట్టి ధర్మ సింధు సారముచే శ్రీ విఠ్ఠల స్వామి సంతసింపవలయును. గ్రంథములో ప్రమాద దోషములున్నను సజ్జనులు ప్రేమచే వానిని శోధించి శ్రీకృష్ణస్వామికుచేలుని అటుకులు గ్రహించినట్లు గ్రహింతురుగాక.

ఇది యనంతోపాధ్యాయపుత్రుడగు కాశీనాథోపాధ్యాయులచే రచియింపబడిన ధర్మసింధుసారమందు ప్రథమ పరిచ్ఛేదము సంపూర్ణము.

శ్రీ దుర్గాంబాయై నమః

# ద్వితీయపరిచ్ఛేదము

## మంగచళాచరణము

అవ. ఇపుడు గ్రంథకర్త మంగళముజేసి ప్రతిజ్ఞ చేయుచున్నాడు :-

ఎట్లనిన; విద్వాంసుల యంతరంగమందుండెడి పాండురంగ విఠ్ఠల స్వామిని అతని హృదయమందు నివసించిన లక్ష్మీదేవిని సత్పురుషులకు హితమునే పలుకు పూజ్యుడగు ననంతభట్టును శ్రేష్ఠురాలగు తల్లిని నమస్కరించి ప్రథమపరిచ్ఛేదములో సామాన్యముగ నిర్ణయింపబడిన కాలమును విశేషముగా నిర్ణయింపుచున్నాను. గనుక పునరుక్తిదోషముకానేరదు. పూర్వమందు మాసవిశేషాపేక్ష లేకుండ సామాన్యముగ తిథ్యాదినిర్ణయము చెప్పబడినది. ఇపుడు చైత్రాదిమాసములలో ప్రతిపదాది తిథుల యందు విధింపబడిన సంవత్సరకృత్యములు యావత్తును సారముగా సంగ్రహింపు చున్నాము. ఇక్కడ మాసము శుక్ల ప్రతిపద మొదలుకొని యమావాస్యతో నంతమగు నదియే గ్రహింపబడును. దాక్షిణాత్యుల కిదియే సమ్మతము. ఇందు పూర్వోక్తమైన కొన్ని యంశములను వచించినను విశేషోక్తులచే వాటిని దృఢము చేయుటకేయని యూహించునది. అందు మేషసంక్రాంతి యందు ప్రవేశమునకు ముందు పదిగడియ లును వెనుకపదిగడియలును పుణ్యకాలము. రాత్రియం దర్ధరాత్రమునకంటె ముందు ప్రవేశమగుచో పూర్వదినమందుత్తరార్ధము పుణ్యము. అర్ధరాత్రానంతర మందు సంక్రాంతియైన యెడ పరదినార్ధము పుణ్యము. అర్ధరాత్రమందే ప్రవేశమైనచో పూర్వో త్తరదినార్ధములు రెండును పుణ్యములు.

## చైత్రశుక్ల ప్రతిపదయందు సంవత్సర ప్రారంభము

అపుడు ప్రతిపదకు నుదయవ్యాప్తికావలెను. దినద్వయమందు నుదయ వ్యాప్తి యున్నను లేకున్నను పూర్వదినమే గ్రహించునది. అపుడు చైత్రమాసమధికమాస మయినను సంవత్సరాదిని జేయు తైలాభ్యంమును సంకల్పాదులయందు నూతన వత్సరము నుచ్చరించుట మొదలగు నారంభమును మలమాసమందే చేయవలెను. ప్రతిగృహమునందు ధ్వజారోహణమును నింబపత్ర భక్షణమును సంవ్సరాధిఫల శ్రవణమును వాసంత నవరాత్రారంభమును తన్నిమిత్తకమయిన యభ్యంగస్నానాదిక మును శుద్ధమాసమునందే చేయవలెను. వత్సరాదిప్రయుక్త తైలాభ్యంగము కూడ శుద్ధమాసప్రతిపదయందే యని మాయూఖమందున్నది. అట్టి తైలాభ్యంగమునిత్యము. కనుకనే చేయనిచో ప్రత్యవాయము విధింపబడినది. ఈ ప్రతిపదయందే దేవీనవరాత్రా రంభము. ఇక్కడ పరదినమందు ముహూర్తమనగా "ముహూర్తమహ్నో రాత్రేశ్చ ప్రోచుః పంచదశలంలప"మనియున్నందున దినములో పదునైదవభాగమని, యంత టను తెలియునది. పారణాది విశేషనిర్ణయము శారదనవరాత్రమునందువలె నెఱుంగు నది.

## ప్రపాదానము

ఈప్రతిపదయందే ప్రపాదానమనగా మార్గస్థులకు నియతముగ జలాది దానము. అక్కడ మంత్రము:- శ్లో॥ 'ప్రపేయం సర్వసామన్యా భూతేభ్యః ప్రతిపాదితా, ప్రదానా త్పితరస్సర్వే తృప్యంతు చ పితామహాః, అనివార్య మితోదేయం జలంమాస చతుష్టయంః' అని. అనగా సర్వప్రాణులకు సాధారణముగా నీచలివెందర యుంచ బడినది. సమస్త పితృదేవతలు తృప్తినొందుదురు గాక ఇది మొదలుగ నాలుగు మాసముల పర్యంత మవిచ్ఛిన్నముగ నీబడునని యర్థము.

## ఉదక కుంభదానము

అట్టి ప్రపాదానము జేయలేనివారు ప్రతిదినమందు నొకయుదక కుంభము ద్విజగగృహమం దీవలయును. అపుడు మంత్రము :- శ్లో॥ 'ఏషధర్మఘటోదత్తో బ్రహ్మవిష్ణు శివాత్మకః, అస్యప్రదానాత్సకలా మమసంతు మనోరథాః'అని. అనగా బ్రహ్మాది సమస్తదేవతాస్వరూపమైన యీధర్మఘటము నిచ్చుచున్నాను గనుక నా మనోరథములన్నియు సమకూరవలెనని యర్థము. ఈ ప్రతిపదయే కల్పాది యన బడును. ఇట్లు వైశాఖ శుక్ల తృతీయ ఫాల్గుణ కృష్ణతృతీయయు, చైత్రశుక్లపంచమియు మాఘశుక్ల త్రయోదశియు కార్తికసప్తమియు మార్గశీర్షనవమియు గల్పాదులని యెరుంగునది. అపుడు పితృతృప్తికై శ్రాద్ధము జేయవలెను. చైత్ర శుక్లప్రతిపదయందే మతస్స్యజయంతి యని కొందరు. చైత్రమందు దదిక్షీర ఘృతమధువులు వర్జించి దంపతి పూజారూపమైన గౌరీవ్రత మాచరింపవలెను. చైత్రశుక్ల ద్వితీయయందు ప్రదోషమందు బాలచంద్రుడు పూజాద్విస్వరూపమయిన చంద్రవ్రతము జేయవలెను. ఆ దినమందే దమనముచే గౌరీశివపూజనము.

## ఆందోళినీ వ్రతము

చైత్రశుక్ల తృతీయయందు శివసహితముగ గౌరీదేవిని పూజించి మాసపర్వత మాందోళనవ్రతము జేయవలెను. అందు పరదినమందు తృతీయ ముహూర్తమాత్ర మున్నప్పటికి నదియే గ్రహ్యము. ద్వితీయాయుక్తము గూడదు. ఈ నిషేధము ప్రబలము గనుక చతుర్థీయుక్తమందు వైధృతియున్నప్పటికి నదియే గ్రహించునది. ఈ తృతీయయందే శ్రీరామచంద్రుని డోలోత్సవ మారంభించి మాసపర్యంతము పూజా పూర్వకముగ నాందోళనము జేయవలెను. ఇట్లితర దేవతలకును జరిగింపవలెను. ఈ తృతీయయే మన్వాదియు నగును. ఇక్కడనే సకల మన్వాదులకు నిర్ణయము జెప్పఁబడును. అందు మన్వాదు లెవ్వియనిన; చైత్ర శుక్ల తృతీయము పూర్ణిమయు, జ్యేష్టమందు బూర్ణిమ, ఆషాఢ శుక్ల దశమియు పూర్ణిమయు, శ్రావణ కృష్ణాష్టమి, భాద్రపద శుక్ల తృతీయ, అశ్విని శుక్లనవమి, కార్తికశుక్లద్వాదశి, పౌర్ణ మాసియు, పౌషము నందు శుక్లైకాదశి, మాఘమందు శుక్లసప్తమి, ఫాల్గుణమందు బూర్ణిమయు. నమావాస్యయు, నీపదునాలుగు మన్వాదులు. ఇవి శుక్లపక్షమందు దైవపిత్ర్యకర్మలకై పూర్వాహ్ణవ్యాప్తిగా గ్రహింపవలెను. పూర్వాహ్ణమనగా దినపూర్వా ర్థము. అపుడే శ్రాద్ధాదికము విధింపబడినది. దైవవశముచే నది సంభవించినచోనపర్హ్వా వ్యాప్తి గ్రహింపవలెను. అనగా దినపూర్వార్ధమందుగాని యపరాహ్ణమందు గాని శ్రాద్ధాదికము జేయవలెనుగాని దినోత్తరార్ధగత మధ్యాహ్నాభాగమందు జేయగూడదని తాత్పర్యము. కృష్ణపక్షమందు మన్వాదులు దిన మైదుభాగములలో నాలుగవభాగమై యపరాహ్ణమును వ్యాపించినవి కావలెను. మన్వాదిశ్రాద్ధము పిండరహితముగా జేయవలెను. అట్టి మన్వాది శ్రాద్ధముచే పితృదేవతలకు రెండు వేలసంవత్సరములు తృప్తియగును. ఈశ్రాద్ధము నిత్యము. కనుక దాని నతిక్రమించిన యెడ “త్వం భువః ప్రతిమానం” అని మొదలగు ఋక్కును జలమందుండి నూరుమారులు జపించ వలెను. ఇట్లు షణ్ణవతి యనగా సంవత్సరములో తొంబదియారు శ్రాద్ధములు. అవికూడా నిత్యములే. అవి యేమనిన : అమావాస్యలు 12, యుగాదులు 4, మన్వాదులు 14, క్రాంతులు 12, ధృతులు 12, వ్యతిపాతలు 12, మహాలయములు 15, అష్టకాశ్రాద్ధములు 5, అన్వష్టకలు 5, పూర్వేద్యుశ్రాద్ధములు 5, బెరసి 96. ఇవి షణ్ణవతిశ్రాద్ధములు.

## దశావతార జయంతులు

చైత్రశుక్ల తృతీయయం దపరాహ్ణమున మత్స్యోత్పత్తి, వైశాఖపూర్ణిమయందు సాయంకాలమున గూర్మావతారము, భాద్రపద శుక్లతృతీయయందపరాహ్ణమున వరాహావతారము, వైశాఖశుక్ల చతుర్దశియందు సాయంకాలమున నృసింహావతారము, భాద్రపదశుక్ల ద్వాదశియందు మధ్యాహ్నమున వామనావతారము, వైశాఖశుక్ల తృతీయ యందు మధ్యాహ్నమున పరశురామోద్భవము, ప్రదోషకాలమందని కొందరు, చైత్ర శుక్ల నవమియందు మధ్యాహ్నమున శ్రీరామావిర్భావము, శ్రావణ కృష్ణాష్టమియం

దర్థరాత్రమందుఅశ్విని శుక్లదశమి యందు శ్రీకృష్ణావతారము, అశ్విని శుక్లదశమి యందు సాయంకాలమున బుద్ధావతారము, శ్రావణ శుక్లషష్ఠియందు సాయంకాలమున కల్క్యవతారము, ఆయాతితులకు నవతారకాలవ్యాప్తి కావలెను. వీటిలో మత్స్య కూర్మవరాహ బుద్ధకల్క్యవతారముల కాషాఢాది మాసంతరములును నేకాదశ్యాది తిథ్యంతరములును ప్రాతఃకాలాది కాలాంతరములును వచనాంతరములలో జెప్పబడి యున్నవి. వాటిని కల్పాంతరపరములుగ గ్రహింపవలెను. ఆ అవతారముల నుపాసన జేయువారు తాము మున్నవలంబించిన పక్షానుసారముగ నాయాతిథులం దుపవాస పూజాదుల జేయవలెను.

## చైత్రశుద్ధ చతుర్థియందు గణేశుని దమనపూజ

శ్రీరామకృష్ణ నృసింహజయంతులే నిత్యములు గనుక నందరు నుపవసింపదగినవి చైత్రశుక్ల చతుర్థియందు మధ్యాహ్నవ్యాప్తిని జూచి లడ్డుకములు మొదలగు వానిచే శ్రీగణాధిపతిని పూజించి దమన మర్పించవలెను. దానివలన విఘ్ననాశమును సర్వకామాప్తియు నగును.

## పంచమియందు నాగపూజ

చైత్రశుక్ల పంచమియందనంతాది నాగపూజచేసి క్షీరము ఘృతమును నివేదన జేయునది ఈ పంచమియందే లక్ష్మీపూజనము. మరియు నాతిథియందే యుచ్చైశ్రవాదుల పూజించుట మొదలగు హయవ్రతము విధింపబడినది. ఈ వ్రతము లన్నిటియందు పంచమి సామాన్య నిర్ణయము చొప్పున గ్రహించునది. ఇట్లు ముందును విశేషము జెప్పనియెడ సామాన్యనిర్ణయమునే గ్రహించునది. షష్ఠియందు స్కరందునికి దమనసమర్పణము. నవమియందు దేవికిని పూర్ణిమయందు సర్వదేవతలకును దమనారోపణమని మరియొక స్థలమున దెలియునది. చైత్రశుక్లాష్టమియందు భవానీ దేవియవతారము. అపుడు నవమితో గూడిన యష్టమి గ్రహించునది. అట్టి యష్టమి పునర్వసు నక్షత్రముతో గూడినపుడశోక వృక్షము మొగ్గల నెనిమిది భక్షింపవలెను. అందునకు మంత్రము :- శ్లో॥ "త్వామశోక నరాభీష్ట మధుమాససముద్భవ, పిబామి శోకసంతప్తో మామశోకం సదా కురు"అని. అనగా వసంత మందుబుట్టి సమస్త జనులకు ప్రియమైన యో యశోకమా! నేను శోకతప్తుడను. నిన్ను నియమముతో భక్షించుచున్నాను. నన్ను శోకరహితుని జేయుమని యర్థము. ఈ తిథియందే యోగ విశేషమున్నచో జేయుకృత్యమునకు వచనము. శ్లో॥ "పునర్వసు బుధోపేతా చైత్రేమాసి సితాష్టమీ, ప్రాతస్తు విధివత్స్నాత్వా వాజపేయఫలం లభేత్" అని. అనగా చైత్రశుక్లాష్టమి బుధవారముతోను పునర్వసు నక్షత్రముతోను గూడినపుడు యథావిధిగా ప్రాత స్స్నానము జేసెనేని వాజపేయ యాగము జేసిన ఫలము లభించునని యర్థము.

## శుక్లనవమీ రామనవమీ వ్రత ప్రయోగము

చైత్రశుక్ల నవమియందు పునర్వసు నక్షత్రమున మధ్యాహ్నముకాగా కర్కటక లగ్నమందు సూర్యుడు మేషమందును నైదుగ్రహము లుచ్ఛస్థానములయందుండగా

శ్రీరామావిర్భావము జెప్పబడినది. కనుక మధ్యాహ్న వ్యాప్తియున్నచో నవమి నుప వాసము జేయవలెను. పూర్వదినమందే మధ్యాహ్నము వ్యాప్తియైనచో నాదినమందే చేయవలెను. రెండుదినములును మధ్యాహ్న వ్యాప్తియున్నను నట్లులేకున్నను పరదినమే గ్రహింపవలెను. కాని యష్టమీవిద్ధకూడదు. కనుక పూర్వదినమందు మధ్యాహ్న మంతయు వ్యాపించినను పరదినమందు మధ్యాహ్నైక దేశమందున్నను పరదినమే గ్రహించునది. కొందరు విశేషము జెప్పుచున్నారు. పూర్వదినమందు మధ్యాహ్నవ్యాప్తి గలిగిన పునర్వసుయుక్తమైనప్పటికీ నష్టమీ విద్ధయగుటచే దానివిడిచి పరదినమందు మూడు ముహూర్తములు మాత్రము నవమియున్నను దానినే గ్రహింపవలెను. ఒకవేళ దశమికి క్షయమువచ్చి పారణదినమందు స్మార్తుల కేకాదశియగునేని వారు పూర్వదిన మునే గ్రహింపవచ్చును. వైష్ణవులు ముహూర్త త్రయముగల నవమినే గ్రహింపవలెను. అష్టమీవిద్ధగాని నవమి దొరకకుండినను ముహూర్తత్రయమున కంటె తక్కువ యున్నను సర్వమతస్థులు నష్టమీవిద్ధయందే యుపోషణము జేయవలె నని, జయంతీ వ్రతము నిత్యము కామ్యమునగు. ఇక వ్రతము జేసెదు ప్రకారము. అష్టమియందా చార్యుని పూజించి శ్లో॥ 'శ్రీరామ ప్రతిమాదానం కరిష్యేహం ద్విజోత్తమ, తత్రాచార్యో భవ ప్రీత శ్శ్రీరామోసి త్వమేవమే.' అని ప్రార్థించి యనగా శ్రీరామమూర్తి నుద్దేశించి నేను ప్రతిమాదానము చేసెదను. దాని కాచార్యుడవు కావలెను. నీవే శ్రీరామమూర్తివని భావించుచున్నానని యర్థము. ఇట్లు బ్రార్థించి శ్లో॥ 'నవమ్యా అంగభూతేన ఏకభుక్తేన రాఘవ, ఇక్ష్వాకు వంశతిలక ప్రీతోభవ భవప్రియ'అని యేక భుక్తముసంకల్పించి, యనగా నవమీవ్రతమున కంగముగా నీరోజు ననేక భుక్తము జేసెదను. "శ్రీరామచంద్ర యిక్ష్వాకుకులతిలక! శివునికి ప్రియుడా!" నా యందు ప్రేమయుంచు మని యర్థము. ఇట్లు సంకల్పించి యాచార్యులతో హవిష్యము భుజింపవలెను. పూజామండపమును వేదికను నిర్మించి నవమిరోజున ప్రాతఃకాల మందు సంకల్పమునకు శ్లో॥'ఉపోషచాం నవమీత్వద్య యామేష్వష్టసు రాఘవ, తేన ప్రీతో భవత్వం మే సంసారాత్త్రాహి మాం హరే"యని. అనగా నీ నవమితిథి యెనిమిది జాములు నుపవాసము జేసెదను. నీవు ప్రీతుడవై నన్ను సంసారమునుండి రక్షింపవలె నని సంకల్పించి, శ్లో॥ 'ఇమాం స్వర్ణమయీం రామప్రతిమాం త్వాం ప్రయత్నతః, శ్రీరామప్రీతయే దాస్యే రామభక్తాయ ధీమతే.' అనగా శ్రీరామచంద్రుడా! స్వర్ణ ప్రతిమారూపుడవైన నిన్ను నీ ప్రీతిగా నీభక్తునికి దానముజేసెదనని సంకల్పించి "శ్రీరామనవమీ వ్రతాంగభూత షోడశోపచార పూజాంకరిష్యే" అని పూజను సంక ల్పించి, వేదికయనగా సర్వతోభద్ర మండప ప్రదేశమందు గలశము స్థాపించి వస్త్ర ముతో గూడిన పూర్ణపాత్రమం దగ్న్యుత్తారణము మొదలగు విధిచే బ్రతిమయందు శ్రీరాముని ప్రతిష్ఠజేసి పురుష సూక్తమంత్రములతో షోడశోపచార పూజచేసి పుష్ప పూజాంతమున శ్లో॥ "రామస్య జననీచాసి రామాత్మక మిదంజగత్, అతస్త్వాం పూజ యిష్యామి లోకమాత ర్నమోస్తుతే." అనగా నో కౌసల్యా! జగత్తు రామస్వరూ పము. అట్టిరామునికి జననివైతివి గనుక లోకమాతవైన నిన్ను బూజించెదనని కౌసల్యను

"ఓం నమో దశరథాయ" యని దశరథుని పూజించి సర్వపూజను సమాప్తి నొందించి మధ్యాహ్నమందు ఫలపుష్ప జలములతో పూర్ణమైన శంఖముచే నర్ఘ్య మీయవలెను. అపుడు మంత్రము. శ్లో॥ "దశాననవధార్థాయ ధర్మసంస్థాపనాయ చ, దానవానాం వినాశాయ దైత్యానాం నిధనాయచ, పరిత్రాణాయసాధూనాం జాతో రామస్స్వయం హరిః, గృహాణార్ఘ్యం మయాదత్తం భ్రాతృభిస్సహితోనఘ' అని. అనగా రావణుని యొక్కయు దైత్యదానవులయొక్కయు నాశము కొరకును సాధువుల రక్షించి ధర్మము స్థాపించుటకును సాక్షాత్తుగా శ్రీహరివే రాముడవైతివి. తమ్ములతో గూడి యీ యర్ఘ్యము స్వీకరింపుమని యర్థము. రాత్రి జాగరణముజేసి ప్రాతఃకాల మందు నిత్యపూజ చేసి మూలమంత్రముచే బాలు నూటయెనిమిదిమారులు హోమము జేసి పూజాంతమందాచార్యులకు ప్రతిమాదానము చేయవలెను. అపుడు మంత్రము. శ్లో॥" ఇమాం స్వర్ణమయీం రామప్రతిమాం సమలంకృతాం, శుచివస్త్రయుగచ్ఛన్నాం రామోహం రాఘవాయతే, శ్రీరామ ప్రీతయేదాస్యే తుష్టోభవతు రాఘవః"అని. అనగా స్వర్ణమయమై యలంకరించిన యీ ప్రతిమను శుభ్రమైన వస్త్రయుగ్మముతో గూర్చి శ్రీరామభావనతో దానమిచ్చుచున్నాను. దీనిచే శ్రీరామప్రీతియగుగాక యని యర్థము. శ్లో॥"తవ ప్రసాదం స్వీకృత్య క్రియతే పారణామయా, వ్రతేనానేన సంతుష్టః స్వామిన్ భక్తిం ప్రయచ్ఛమే" అని అనగా నీ ప్రసాదము స్వీకరించి పారణ జేయుచున్నాను. ఈ వ్రతముచే ననుగ్రహించి సదా భక్తిదయచేయవలెనని ప్రార్థించి నవమియంత మున బారణ జేయవలెను. ఈ వ్రతము మలమాసమందు గూడదు. ఇట్లు జన్మాష్ట మ్యాది వ్రతము అని తెలియవలెను.

## దేవీ నవరాత్రి సమాప్తి

నవమియందే దేవీనవరాత్ర వ్రతమునకును సమాప్తి జేయునది. దీని నిర్ణయ మాశ్వీననవరాత్ర నవమికివలె నెరుంగునది. చైత్రశుక్లైకాదశియందు కృష్ణున కాందోలనోత్సవము. దీనిఫలము – శ్లో॥ "డోలారూఢం ప్రపశ్యంతి కృష్ణం కలిమలాప హం, అపరాధసహస్రైస్తు ముక్తాస్తే ధూననేకృతే, తావత్తిష్ఠంతి పాపాని జన్మకోటి కృతాన్యపి,క్రీడంతే విష్ణునాసార్ధం వైకుంఠే దేవపూజితాః" అని. అనగా ఉయ్యాలోనున్న కృష్ణమూర్తి దర్శనమాత్రముచే గలిదోషములు పోవును. ఉయ్యాల నూపినచో వేయి యపరాధములు క్షమింపబడును. జన్మకోటులలో జేయబడిన పాపములన్నియు దత్క్షణ మందే నశించును. అంతమందు విష్ణుసాలోక్యము గలుగును. చైత్రశుక్ల ద్వాదశి యందు విష్ణువునకు దమనోత్సవము. అదియు బారణ జేయుదినమందే యందు వచనము. శ్లో॥ "పారణా హేనలభ్యేత ద్వాదశీ ఘటికాపిచేత్, తథాత్రయోదశీగ్రాహ్యా పవిత్ర దమనార్పణే" అనగా బారణదినమందు గడియయైనను ద్వాదశిలేనిచో దమన పూజకును పవిత్రారోపణమునకును త్రయోదశియే గ్రహింపవలెనని యర్థము.

## చతుర్దశి యందు శివునికి దమనోత్సవము

చతుర్దశియందు శివునికి దమనార్పణము జేయవలెను. ఇక దమనార్పణము నకు విధి. ఉపవాసదినమందు నిత్యపూజజేసి దమనస్థానమును ప్రవేశించి క్రమముగా

దాని స్వీకరించి చందనాదికముచే పూజించి; “శ్రీకృష్ణపూజార్థం త్వాంనేష్యే” యని ప్రార్థించి నమస్కరించవలెను. ఇట్లితరదేవతలకు నూహించునది. అనంతరము దమనము గృహమునకు దెచ్చి పంచగవ్యముచేతను శుద్ధోదకముచేతను గడిగి దేవుని ముందుంచి యశోకకాల వసంతకాలములనుగాని యొక్క కామధేనువునేగాని యందు గంధాదులచే పూజింపవలెను. అందు మంత్రము. శ్లో॥ “నమోస్తుపుష్పబాణాయ జగదాహ్లాదకారిణే, మన్మథాయ జగన్నేత్రే ! రతిప్రీతిప్రియాయతే. అనగా జగదాహ్లా దము జేయుటచే జగద్రక్షకుడును రతిప్రియుండు పుష్పబాణుడైన మన్మథునికి నమస్కారమని యావాహనము జేసి శ్లో॥ “కామభస్మసముద్భూత రవిభాష్పపరిప్లుత, ఋషిగంధర్వదేవాది విమోహక నమోస్తుతే’ అని. అనగా మన్మథుని భస్మములో బుట్టినదానా! సూర్యునికన్నీరుచే దడసినదానా ! ఋషులు గంధర్వులు దేవతలు మొదలగువారి మోహపెట్టిన నీకొరకు నమస్కారమని దమనమును స్తుతించి “ఓం కామాయనమః” అను మంత్రముచే సపరివారముగ కామదేవస్వరూపమైన దమన మును గంధాదులచే పూజించి రాత్రియందు దేవునిపూజించి యధివాసమును జేయ వలెను. అది యెట్లనిన; దేవునియెదుట చతురశ్రముగ సర్వతో భద్రమండలముజేసి యందుగలశములు స్థాపించి యందు ధౌతవస్త్రాచ్ఛాదనముతో వెదురువేళ్ళతో నిర్మిం చిన సజ్జ మొదలగువాటిలోనున్న దయమనమునుంచి – శ్లో॥ “పూజార్థం దేవదేవస్య విష్ణో ర్లక్ష్మీపతే ప్రభో, దమనత్వమిహాగచ్ఛ సాన్నిధ్యం కురు తే నమః’ అనగా దేవ దేవుడైన లక్ష్మీపతియొక్క పూజనిమిత్తము సాన్నిధ్యము చేయు మోదమనమా! నీకు నమస్కారమని దమనదేవత నావాహనముజేసి తూరుపు మొదలుకొని యెనిమిది దిక్కులందును – క్లీం కామదేవాయనమః హ్రీం రత్యై నమః 1. క్లీం భస్మశరీరాయనమః హ్రీం రత్యైనమః 2. క్లీం అనంగాయనమః, హ్రీం రత్యైనమః 3. క్లీం మన్మథాయ నమః హ్రీం రత్యైనమః 4. క్లీం వసంతసుఖాయ నమః, హ్రీం రత్యైనమః 5. క్లీం స్మరాయనమః, హ్రీం రత్యై నమః 6. క్లీం ఇక్షుచాపాయ నమః, హ్రీం రత్యైనమః 7. క్లీం పుష్పబాణాయనమః, హ్రీం రత్యై నమః. 8 అని పూజింపవలెను. మంత్రః– “తత్పురుషాయ విద్మహే, కామదేవాయ ధీమహి, తన్నోనంగః ప్రచోదయాత్” అను గాయత్రిచే దమనమును నూటయెనిమిదిమారు లభిమంత్రించి గంధాదులచే పూజించి ‘హ్రీం నమః’ అని పుష్పాంజలి యిచ్చి “నమోస్తు పుష్పబాణాయ” యని మీద జెప్పిన మంత్ర ముచ్చరించి నమస్కరించవలెను. మరియు శ్లో॥“క్షీరోదధి మహానాగ శయ్యావస్థితవిగ్రహ, ప్రాతస్త్వాం పూజయిష్యామి సన్నిధౌ భవతే నమః అనగా క్షీర సముద్రమందు శేషతల్పముపై శయనించిన యోపరమేశ్వరుడా ! ప్రాతఃకాలమందు నిన్నుపూజించెదను. అంతవరకును సాన్నిధ్యము దయసేయుము. నీకు నమస్కారమని ప్రార్థించి దేవునికి పుష్పాంజలి యిచ్చి యేకాదశి రాత్రియందు జాగరణము జేయ వలెను. ప్రాతఃకాలమందు నిత్యపూజను జేసి తిరుగ దేవుని పూజించి దూర్వాగంధాక్ష తలతో దమనకమంజరిని తీసుకొని మూలమంత్రము పఠించి శ్లో॥ “దేవదేవ జగన్నాథ వాంఛితార్థ ప్రదాయక, హృత్థాన్‌పూరయ మేవిష్ణో కామాన్ కామేశ్వరీప్రియ, ఇదం

దమనకం దేవ గృహాణ మదనుగ్రహాత్, ఇమాం సాంవత్సరం పూజాం భగవన్ పరి పూరయ' అను మంత్రముచే ననగా దేవదేవుడవును, జగన్నాథుడవును, కోరిన వన్నియు నిచ్చువాడవు నయిన యోపరమేశ్వరుడా! నామనోరథముల పూరించవల యును. నాయందనుగ్రహించి యీదమనము స్వీకరించి యీ సంవత్సర పూజను పూర్తి జేయవలెను. ఆపై నలంకారమునకు గావలసినంతయు నర్పించి యంగదేవత లకుగూడ దమనమర్పించి నమస్కరించవలెను. దేవప్రార్థన మంత్రము. "మణివిద్రు మమాలాభిర్మందార కుసుమాదిభిః, ఇయం సాంవత్సరీపూజా తవాస్తు గరుడధ్వజ, వనమాలాం యథాదేవ కౌస్తుభం పతతం హృది, తద్వద్దామనకీం మాలాం పూజాం చ హృదయేవవహ, జానతా జానతా వాపి న కృతం యత్తవార్చనం, తత్సర్వం పూర్ణతాం యాతు త్వత్ప్రసాదా ద్రమాపతే, జితంతే పుండరీకాక్ష నమస్తే విశ్వభావన, హృషీకేశ నమస్తేஉ స్తు మహాపురుష పూర్వజ, మంత్రహీనం క్రియాహీనం భక్తిహీనం జనార్దన, యత్పూజితం మయాదేవ పరిపూర్ణం తదస్తుతే" అనగా మణులు పగడములు కల్పవృక్షకుసుమములు వీనితో సంవత్సరము జేసినపూజయే యిదిగావలెను. వనమాలికను కౌస్తుభమును సదా హృదయమందు ధరించిన ట్లీదమనమాలికను నేజేసిన పూజను హృదయమందు ధరించవలెను. జ్ఞానముతోగాని యజ్ఞానముతో గాని లోపింపజేసిన నీపూజనమంతయు నీ ప్రసాదముచే పూర్ణమగుగాక. యోపుండరీ కాక్షుడా! నీకే జయము. విశ్వపాలకుడ, హృషీకేశుడ, మహాపురుషుడ, సృష్ట్యాదినుండు వాడ, నీకు నమస్కారము. మంత్రశుద్ధియు క్రియాసిద్ధియు భక్తిపరిపాపకములేని యీ నాపూజ నీకు వాటితో పూర్ణమైనదే యగుగాక యని ప్రార్థించి తిరుగ పంచోప చారములచే పూజించి నీ రాజనమిచ్చి బ్రాహ్మణులకు దమనప్రసాదమిచ్చి మిగిలినది తానుధరించి మిత్రులతో బారణజేయవలెను. మంత్రదీక్షలేనివారు నామ ముచ్చరిం చియే దమన మర్పించవలెను. దీనికి శ్రావణమాసపర్యంతము గౌణకాలము. ఇది యధికమాసమందు జేయగూడదు. శుక్రాస్తాదులున్నను జేయవచ్చును. ఇది దమనా రోపణవిధి. మరియు శ్లో॥"అహోరాత్రేణ ద్వాదశ్యాం చైత్రే విష్ణురితిస్మరన్, పుండరీక మవాప్నోతి దేవలోకం చ గచ్ఛతి" అనగా నీ చైత్రశుద్ధ ద్వాదశియందే పగటియందు రాత్రియందును విష్ణునామమును స్మరించినయెడ శ్వేతచ్ఛత్రము ధరించు సంపదయు అంతమందు స్వర్గమును గలుగునని భారతవచనార్థము. చైత్రశుక్ల త్రయోదశియం దనంగ పూజనవ్రతము. అపుడు త్రయోదశి పూర్వవిద్ధయే గ్రహింపవలెను.

## చతుర్దశియందు నృసింహ డోలోత్సవము

ఇపుడే శివునకు నేకవీరాదేవికిని భైరవునికిని దమనపూజనము. అందు చతుర్దశి పూర్వవిద్ధయు, నపరాహ్ణవ్యాప్తిని గావలెను. అపరాహ్ణవ్యాప్తి లేనిచో నపరాహ్ణ స్పర్శగలిగిన పూర్వవిద్ధయే గ్రహింపవలెను. అంతమాత్రములేనిచో పరదినము గ్రహించునది. చైత్రపూర్ణిమ సామాన్య నిర్ణయముబట్టి పరదినము గ్రహింపవలెను. పూర్వమందు జెప్పిన యాయాదినములందు దమనపూజ జేయనిచో నీ తిథియందే

సర్వదేవతలకు దమనపూజచేయునది. చైత్రపూర్ణిమ చిత్రానక్షత్రముతో గూడినయెడ చిత్రవస్త్రదానము సౌభాగ్యమిచ్చును. రవి గురు శనివారములతో గూడెనేని ప్రాత స్నానశ్రాద్ధాదులచే నశ్వమేధ పుణ్యము. చైత్రశుక్లైకాదశియందుగాని పూర్ణిమయందు గాని మేష సంక్రాంతి మొదలుగగాని వైశాఖస్నాన మారంభించవలెను. అపుడు మంత్రము. శ్లో॥ "వైశాఖం సకలం మాసం మేషసంక్రమణం రవేః, ప్రాతస్సన్ని యమస్స్యాస్యే ప్రీయతాం మధుసూదనః మధుహంతుః ప్రసాదేన బ్రాహ్మణానా మను గ్రహాత్, నిర్విఘ్నమస్తు మే పుణ్యం వైశాఖస్నానమన్వహం, మాధవే మేషగేభానౌ మురారే మధుసూదన, ప్రాతస్స్నానేన మే నాథ ఫలదో భవపాపహన్." అని. అనగా రవి మేషసంక్రాంతియగు వైశాఖమాసము యావత్తునందును నియమముతో ప్రాత స్నానముజేసెదను గనుక మధుసూదనుడు ప్రీతినొందుగాక. ఆ దేవుని యనుగ్రహ మున పవిత్రమగు నా వైశాఖ స్నానము ప్రతిదినమందును నిర్విఘ్నముగా జరుగ వలెను. మేషసంక్రాంతి వైశాఖమందు నేజేయు ప్రాతస్నానమున నోపరమేశ్వరుడా! నాకు పాపములుబాపి ఫలము దయసేయుమని యర్థము. అపుడు హవిష్యాశనము బ్రహ్మచర్యము మొదలగు వ్రతనియమములజేయవలెను. ఇట్లు సంపూర్ణ స్నానము జేయలేనియెడ త్రయోదశి మొదలు దినత్రయపర్యంతమైనను జేయవలెను. ఈ పౌర్ణమాసి మన్వాదియని మీద జెప్పబడినది. చైత్ర కృష్ణత్రయోదశి శతభిషలగ్న నక్షత్రముతో గూడినచో వారుణి యనబడును. అది స్నానాదికృత్యములకు గ్రహణ తుల్యము. శుభయోగశనివార శతతారకా నక్షత్రములు మూడును గలసినచో మహా వారుణి యనబడును. ఇట్లమాంతమాసపక్షముచే వ్రాయబడినది. పూర్ణిమాంతమాస పక్షమైనచో ఫాల్గుణకృష్ణత్రయోదశి గ్రహించునది. చైత్రకృష్ణ చతుర్దశియందు శివ సన్నిధిలో స్నానముజేసినను పిశాచత్వము పోవును. ఇట్లు ధర్మసింధుసారమందు చైత్రమాస కృత్యనిర్ణయోద్దేశము ముగిసెను.

అవ. ఇక వైశాకమాసమును విచారించుచున్నాడు :-

అందు వృషభసంక్రాంతికి పూర్వము పదియారు గడియలు పుణ్యకాలము. రాత్రియందైనచో నిర్ణయము ప్రథమపరిచ్ఛేదములో జెప్పబడినది. అపుడు ప్రాతస్నాన మును తిలతర్పణమును ధర్మఘటనదానమును జేయవలెను. ఈమాసమందు బ్రాహ్మణులకు గంధమాల్యపానక కదలీఫలాదులచే వసంతపూజ జేయవలెను. వైశాఖ మందుగాని జ్యేష్ఠమందుగాని యెండయెక్కువై బాధించినచో నపుడు ప్రాతఃకాలిక నిత్యపూజ జేసి విష్ణుమూర్తిని గంధోదక పూర్ణపాత్ర మందుంచి పంచోపచారములచే పూజించి సూర్యాస్తమయపర్యంత మాజలమందే యుంచి రాత్రియందు స్వస్థానమందు స్థాపించి పంచోపచారములచే పూజింపవలెను. ఆతీర్థోదకముచే గృహద్వారాదికమును తనును మార్జనముచే పవిత్రము జేసుకొనవలెను. ఇది ద్వాదశియందైనయెడ పగలు చేయగూడదు. రాత్రియందే కొంతకాలము జలమందుంచి పూజించి స్వస్థానమందు

స్థాపించవలెను. ఈ మాసమందు కృష్ణతులసీ దళములచే విష్ణువును త్రికాలముల యందు పూజించినచో ముక్తి ఫలము గలుగును. మరియు ప్రాతస్స్నానముజేసి విస్తార మైన యుదకముచే నశ్వత్థ వృక్షమూలముదడపి ప్రదక్షిణములు చేసినచో అనేక పురుషులతో దనకులము తరించును. ఇట్లు గోవులకు ప్రత్యహము కండూయనము జేసిననదియే ఫలము. ఈ మాసమందేకభుక్తముగాని నక్తముగాని యయాచితము గాని చేసినచో సర్వకామావాప్తియగును. ఈ మాసమందు పానీయశాలలు గాని శివుని కభిషేకమునకై సంతత ధారగా సుపరిభాగమందు గలంతికను గాని యుంచుట యును వ్యజనములు ఛత్రములు పాదరక్షలు మొదలగునవి యిచ్చుటయు మహా ఫలము. ఈవైశాఖ మధికమగుచో గామ్యవ్రతములకు సమాప్తి నిషిద్ధము గనుక వైశాఖ స్నానములు హవిష్యాశనము మొదలగు నియమములు రెండుమాసములును జేయవలెను.

## వైశాఖ శుక్లతృతీయయందు గంగాస్నానము

చాంద్రాయణాది ప్రాయశ్చిత్త వ్రతములు మలమాసమందును నంతపుచ్చ వచ్చును. వైశాఖశుక్ల తృతీయయందు గంగాస్నానమును, యవలచే హోమమును, యవాశనమును జేసిన సర్వపాపములు నశించును. మరియు శ్లో॥ "యః కరోతి తృతీయాయాం కృష్ణం చందనభూషితం, వైశాఖస్య సితే పక్షే సయాత్యచ్యుతమందిరం" అనగా వైశాఖ శుక్ల తృతీయయందు శ్రీకృష్ణమూర్తికి చందనానులేపన మిచ్చిన విష్ణు సాలోక్యము గలుగును. ఇదియే యక్షయ్యతృతీయ. ఈ దినమందు కొంచమైనను జపహోమపితృతర్పణదానాదుల జేసిన నవి యక్షయ్యమగును. రోహిణీ నక్షత్రము బుధవారము గూడిన నీతిథి మహాపుణ్యము. జపహోమాదికృత్యమందును నక్షయ్య తృతీయ యగుటకును తిథి నిర్ణయము యుగాది నిర్ణయమువలె తెలియునది. ఇది కృతయుగమున కాది. అందు యుగాదిశ్రాద్ధము పిండరహితముగ జేయవలెను. శ్రాద్ధము సందర్భించకున్నచో దిలతర్పణము జేయునది. ఇందు శుక్లపక్ష యుగాది కర్మలు పూర్వాహ్ణమందే చేయవలెను. సంభవించినచో నపరాహ్ణమందును జేయ వచ్చును. కృష్ణపక్ష యుగాదికృత్యము లపరాహ్ణమందే యని మొదలగు నిర్ణయము. మన్వాదుల ప్రకరణమందు జెప్పినటుల దెలియునది. దినము రెండుభాగములలో పూర్వార్ధైకదేశము వ్యాపించునది కావలెను. రెండుదినములు నట్లున్నచో మూడు ముహూర్తములధికమగునెడ పరదినమే గ్రహించునది. అంతకు దక్కువయైనం బూర్వ దినమే గ్రహించునది. ఇక్కడ "సా తిథిస్కలాజ్ఞేయా" యను సాకల్య వ్యాప్తివచనమున కపవాదము–శ్లో॥"మన్వాదౌ చ యుగాదౌ చ గ్రహణే చంద్రసూర్యయోః, వ్యతీపాతే వైధృతౌ చ తత్కాల వ్యాపినీక్రియా." అనగా మన్వాదిశ్రాద్ధములందును యుగాది శ్రాద్ధము లందును సూర్యచంద్రగ్రహణము లందును గర్మకాలవ్యాపి తిథికి గావలెనని యర్థము. శ్రాద్ధాదికము తృతీయామధ్యమందే చేయవలెను. పురుషార్థ చింతామణి యందు విశేషము. గాంధర్వకుతపరౌహిణ సంజ్ఞలు గల పగటి సప్తమాష్టమ నవమ

ముహూర్తములు శ్రాద్ధకాల మగుటచే శుక్లపక్షమందు దినమానము ముప్పదిగడియల గుచో బదుమూడవ గడియమొదలు పదునైదవ గడియవరకు వ్యాపించినచో శ్రాద్ధము జేయనగును. కృష్ణపక్షమందు పదియారవ గడియ మొదలు మూడుగడియల వ్యాప్తి కావలెను. దినద్వయమందట్టి వ్యాప్తియున్నను లేకున్నను శుక్లపక్షమందు పరదినమే గ్రహించునది. పరదినమందు బదుమూడవగడియకు ముందే సమాప్తియై పూర్వదిన మందు మూడు ముహూర్తములందుగాని యేకదేశ మందుగాని యున్నచో కర్మకాల వచనము ప్రబలము గనుక పూర్వదినమే గ్రహించునది. యని యున్నది. ఇదియే యుక్తమని తోచుచున్నది. ఈతిథియందే దేవతల నుద్దేశించియు పితృదేవతల నుద్దేశించియు నుదకుంభదానము విధింపబడినది. అందు "శ్రీపరమేశ్వర ప్రీత్యర్థముదకుంభ దానోక్త ఫలావాప్త్యర్థం బ్రాహ్మణా యోదకుంభదానం కరిష్యే తదంగ కలశ పూజనాదికం చ కరిష్యే" యని సంకల్పించి గంధ ఫలయదవాదులతో గూడిన సూత్రము. జుట్టిన కలశమును బ్రాహ్మణుని పంచోపచారములచే పూజించి శ్లో "ఏష ధర్మఘటో దత్తో బ్రహ్మావిష్ణుశివాత్మకః, అస్య ప్రదానాత్సకలా మమ సంతు మనోరథా" యని మీద వ్రాసినమంత్రముచేనీవలెను. పితృప్రీతికై చేయుచో "పితౄణా మక్షయ్య తృప్త్యర్థముదకుంభదానం కరిష్యే" యని సంకల్పించి యెప్పటివలె సకల శము తిలఫలాదియుక్తముగ పూజించి, బ్రాహ్మణ పూజానంతరము "ఏషధర్మ ఘటో దత్తో బ్రహ్మావిష్ణు శివాత్మకః అస్యప్రదానాత్తృప్యంతు పితరస్సపితామహాః, గంధోదక తిలైర్యుక్తం స్నానం కుంభం ఫలాన్వితం, పితృభ్యస్సంప్రదాస్యామి అక్షయ్య ముపతిష్ఠతు" అను మంత్రముతో నివ్వవలెను. యుగాదియందు సముద్ర స్నానము జేయునెడ మహాఫలము. వైశాఖ మధికమగుచో యుగాది శ్రాద్ధము మాసద్వయమం దును జేయవలెను. యుగాదులం దుపవాసము మహాఫలము. యుగాదులందును మన్వాదు లందును రాత్రిభుజించినచో "నభిస్వవృష్టి"మ్మని మొదలగు మంత్రము జపింపవలెను. యుగాది శ్రాద్ధము లోపించినయెడ "యుగాది శ్రాద్ధలోపజన్య ప్రత్య వాయ పరిహారార్థమృగ్విదానోక్తం ప్రాయశ్చిత్తం కరిష్యే"యని సంకల్పించిన "నవసద్యావ" యను ఋక్కును నూరుమారులు జపించవలెను. ఈ నిర్ణయ మన్నియుగాదులకు నెరుంగునది. ఇదియక్షయ్య తృతీయానిర్ణయము. ఈతృతీయయే పరశురామ జయంతి. అపుడు రాత్రిప్రథమయామము వ్యాపించునది కావలెను. అట్లు పూర్వదిన మందేయున్నచో నదియే గ్రహించునది. దినద్వయమందును ప్రథమ యామమందు నంటగాని సామ్యవైషమ్యములచే నేకదేశ వ్యాప్తిగాగాని యున్నచో పరమే గ్రహించ వలెను. అపుడు ప్రదోషమందు పరశురాముని పూజించి యర్ఘ్యమీయవలెను. అందు మంత్రము "జామదగ్న్య మహావీర క్షత్రియాంతకరప్రభో, గృహాణార్ఘ్యం మయాదత్తం కృపయాపరమేశ్వర" అనగా క్షత్రియులకంతముజేసిన మహావీరుడవైన యో పరశు రామమూర్తీ ! పరమేశ్వరుడా ! నేనిచ్చిన యర్ఘ్యము దయచేస్వీకరింపుమని యర్థము.

## వైశాఖశుక్ల సప్తమియందు గంగోత్పత్తి

అతిథి మధ్యాహ్నకాలము వ్యాపించినచో గంగాపూజజేయవలెను. దినద్వయ మందట్టి వ్యాప్తియున్నయెడ పూర్వదినము గ్రహించునది. మరియు శ్లో॥ "వైశాఖమాసే ద్వాదశ్యాం పూజయేన్మధుసూదనం, అగ్నిష్టోమ మవాప్నోతి సోమలోకంచ గచ్ఛతి" యనగా వైశాఖశుక్ల ద్వాదశియందు మధుసూదనమూర్తిని పూజించిన అగ్నిష్టోమ మనగా యజ్ఞము జేసిన ఫలము సిద్ధించు నంతమందు చంద్రలోకావ్యాప్తి గలుగునని. వైశాఖశుక్ల చతుర్దశి నృసింహజయంతి. అతిథి సూర్యాస్తమయ కాలవ్యాప్తిగా నుండ వలెను. దినద్వయమందట్టి వ్యాప్తియున్నను వ్యాపింపకుండుట యున్నను పరదినమే గ్రహించునది. స్వాతీనక్షత్రము శనివారము మొదలగువానితో గూడిన నధిక ప్రశస్తము.

## వ్రత విధానము

త్రయోదశియందేక భుక్తముజేసి చతుర్దశి మధ్యాహ్నమందు తిలలతో నుసిరక పిండితోను స్నానముజేసి శ్లో॥ "ఉపోష్యేఽహం నారసింహ భుక్తిముక్తీ ఫలప్రద, శరణం త్వాం ప్రపన్నోఽస్మి భక్తిం మే నృహరేదిశ" అనగా నో నరసింహమూర్తి భోగమోక్షములిచ్చు నిను శరణుజొచ్చితి. నీ జయంతి నుపవాసముఁజేసెదను. నాకు భక్తి దయజేయుమని సంకల్పించి యాచార్యుని వరించి సాయంకాలమందు ఉదకుంభపూర్ణపాత్రను ధ్యానమందుంచి యందు సువర్ణప్రతిమయందు షోడశోప చారములచే దేవునిఁబూజించి యర్ఘ్యమీవలెను. అపుడు మంత్రము "పరిత్రాణాయ సాధూనాం జాతో విష్ణుర్నృకేసరీ, గృహాణార్ఘ్యం మయాదత్తం సలక్ష్మీర్నృహరే స్వయం" అని. అనఁగా సజ్జనుల రక్షించుటకు నృసింహరూపుఁడై యవతరించిన శ్రీమహా విష్ణువు నేనిచ్చెడి యర్ఘ్యము లక్ష్మీదేవితో స్వీకరించుగాక యని అర్థము. రాత్రి జాగర ణముఁజేసి ప్రాతఃకాలమునదిరుగ దేవునిఁ బూజించి విసర్జించి యాచార్యునికి ధేనువులతోగూడ నా ప్రతిమను దానమీవలెను. అపుడు మంత్రము. "నృసింహాచ్యుత గోవింద లక్ష్మీకాంత జగత్పతే, అనేనార్చాప్రదానేన సఫలాస్స్యుర్మనోరథా" అనఁగా నచ్యుతుఁడవు, గోవిందుఁడవు, లక్ష్మీప్రియుఁడవు, జగన్నాథుఁడవు నైన యోనృసిహ మూర్తీ! ఈ ప్రతిమాదానముచే నా మనోరథములు సఫలములుగావలయునని యర్థము. ఇఁక ప్రార్థన "మద్వంశే యేనరా జాతాయే జనిష్యంతి చాపరే, తాన్‌సముద్ధర దేవేశ దుస్సహాద్భవసాగరాత్, పాతకార్ణవమగ్నస్య వ్యాధి దుఃఖాంబువారిధేః, నీచైశ్చ పరిభూతస్య మహాదుఃఖగతస్య మే, కరావలంబనం దేహి శేష శాయిన్ జగత్పతే, శ్రీనృసింహరమాకాంత భక్తానాం భయనాశన, క్షీరాంబుధి నివాస్త్వం చక్రపాణే జనార్దన వ్రతేనా నేన దేవేశ భుక్తిముక్తిప్రదోభవ" అనఁగా నా వంశమందు పుట్టిన వారిని పుట్టగలవారిని దుస్సహమైన సంసార సముద్రమువలన దరింపజేయుము. పాపసముద్రమునను వ్యాధి దుఃఖసముద్రమునను మునిగి నీచులచే బరాభవము నొందుచు దుఃఖించుచున్న నాకు హస్తావలంబమిమ్ము. శేషశాయి, జగన్నాథుఁడ'

శ్రీనృసింహ,లక్ష్మీప్రియుఁడ, భక్తులకు భయముఁదీర్చువాడ, క్షీరాబ్ధి యందు నివసించు నీవు నా వ్రతము నంగీకరించి నాకు భోగమోక్షములు దయసేయు మోచక్రహస్తుఁడ, జనార్దనుడ, దేవేశుఁడా యని యర్థము. ఇట్లు ప్రార్థించి బ్రాహ్మణు లతో తిథ్యంతమందు బారణఁజేయవలెను. తిథి మూఁడు యామములు దాటి యున్నచో బూర్వాహ్ణమందే పారణఁ జేయవచ్చును. ఈ పౌర్ణమాసి యందు పక్వాన్న సహితమైన యుదకుంభము దానమిచ్చినచో గోదానఫలము సిద్ధించును. స్వర్ణము తిలలు గూడిన యుదకుంభములు పంద్రెండు దానమిచ్చినచో బ్రహ్మహత్యా పాపము నశించును. యథావిధిగా గృష్ణాజినము దానమిచ్చినయెడ భూదానఫలము గలుగును. స్వర్ణము, తేనె, తిలలు, నేయి, వీనితోగూడ కృష్ణాజినదాన మిచ్చినచో సర్వపాప నాశము. మరియు నీదినమందునే తిలస్నానము,తిలహోమము, తిలపాత్రదానము, తిలతైల ముచే దీపదానము, తిలలచే బితృతర్పణమును, తేనెతోగూడ తిలలు దాన మిచ్చు టయు, మహాఫలమిచ్చును. అందులిపాత్ర దానమునకు మంత్రము శ్లో॥'తిలా వై సోమదేవత్యాస్సురై స్సృష్టాస్తు గోసవే, స్వర్గప్రదాస్స్వతంత్రాశ్చ తే మా రక్షంతు నిత్యశ' అనఁగా సోమదేవతాకములైన తిలలు గోయజ్ఞమందు దేవతలచే నిర్మింపఁబడినవి. స్వతంత్రముగ స్వర్గమిచ్చునవి. నన్ను రక్షించుఁగాక యని యర్థము. వైశాఖ శుక్ల ద్వాదశియందుగాని పూర్ణిమ యందుగాని వైశాఖస్నానముల కుద్యాపనము. అపుడేకాదశియందుగాని పూర్ణిమయందుగాని యుపవశించి కలశమందు సువర్ణ ప్రతిమయుంచి లక్ష్మీసహితుఁడైన శ్రీమహావిష్ణువునుఁ బూజించి రాత్రిజాగరణము జేసి ప్రాతఃకాలమందు గృహపూజాపూర్వముగ పాయసముగాని తిలలు ఘృతము గాని యవలుగాని నూటయెనిమిదిమారులు హోమము–"ప్రతద్విష్ణు ఇదంవిష్ణుః" అను మంత్రములలో నొకదానితో జేయవలెను. సాంగతాసిద్ధికి గోదానము పాదుకలు, జోడు, ఛత్రము, వ్యజనము, నుదకుంభము వీటిదానములును శయ్యాదిదానములును జేయవలయును. అశక్తుఁడైనచో పులగము మొదలైనయన్నముచే బదిమంది బ్రాహ్మణు లకు దృప్తిజేయవలెను. ఈ పౌర్ణమాసి మొదలుకొని జ్యేష్ఠశుక్లైకాదశి పర్యంతము జలమందున్న విష్ణువునుఁబూజించుచు నుత్సవము జేయవలెను. వైశాఖామావాస్య భావుకదినము దానిపరదినము కరిసంజ్ఞగలది. యీ రెండును శుభకార్యములందు వర్జ్యములు. ఇది ధర్మసింధుసారమందు వైశాఖమాస కృత్యోద్దేశము ముగిసెను.

## జ్యేష్ఠమాసకృత్యము

మిథునసంక్రాంతికి నుత్తరమందు పదియారుగడియలు పుణ్యకాలము. రాత్రి యైనచో మీఁద జెప్పినరీతినే జ్యేష్టమాసమందు పిష్టముచే బ్రహ్మమూర్తిని జేసి వస్త్రాదు లచే బూజింపవలెను. సూర్యలోక ప్రాప్తిఫలము. ఈ మాసమందు జలధేనుదానము విధింపఁబడినది. జ్యేష్ఠశుక్ల ప్రతిపత్తియందు కరవీరవ్రతము. ఈ తృతీయ యందు రంభావ్రతము. అందు తిథిని బూర్వవిద్ధనే గ్రహింపవలెను. అదియు అస్తమయము నకుఁ బూర్వము రెండుముహూర్తములకంటె నధికమున్నచో గ్రహింపవలెను. లేనిచో గూడదు. ఒకవేళ బరదినమందు సూర్యాస్తమయ పర్యంత మాతిథి యుండెనేని

నది యఖండము శుద్ధము గనుక బూర్వవిద్ధనువిడచి పరదినమే గ్రహించునది. ఇట్లు బూర్వదినమందు రెండు ముహూర్తములకంటె దక్కువయైనను బరదినమే. ఇట్లంతటను నూహించునది. రంభావ్రతమందు పంచాగ్ని తపస్సు జేసెడు స్త్రీగాని పురుషుఁడు గాని పార్వతిని స్వర్ణప్రతిమయందుఁ బూజించి విధిప్రకారము చొప్పున హోమాదికముఁజేసి సపత్నీకుఁడైన బ్రాహ్మణునకుపకరణములతో గూడిన గృహము నీవలయును. దంపతుల ననేకుల భోజనముచే తృప్తినొందించవలెను. విశేష విధానము వ్రతగ్రంథమునందుఁ దెలియునది. చతుర్థియందుమావతారము. అపుడుమాదేవిని బూజింపవలెను. అష్టమియందు శుక్లాదేవినిబూజించి నవమియందుపవాసముఁ జేసి తిరుగ దేవినిఁ బూజింపవలెను. జ్యేష్టశుక్ల ద్వాదశియందు గంగావతరణము. ఇదియే దశహరాసంజ్ఞ గలది. దీనికి యోగములు పదిచెప్పబడినవి. జ్యేష్ఠే మాసి, సితే పక్షే, దశమ్యాం, బుధహస్తయోః వ్యతీపాతే, గరానందే, కన్యాచంద్రే, వృషే రవౌ. అనఁగా జ్యేష్ఠమాసము, శుక్లపక్షము, దశమి, బుధవారము, హస్తానక్షత్రము, వ్యతీపాత, గరకరణము, బుధవార హస్తలున్నందున నాసందయోగము. కన్యయందు చంద్రుడు, వృషభమందు రవి, యీపదియు గూడినపుడు దశహరావ్రతముఁ జేయ వలయును. ఇందు దశమీవ్యతీపాతయోగము ముఖ్యము కనుక కొన్ని యోగములతో గూడి దశమి పూర్వాహ్ణమందు లభించునపుడు దశహరావ్రతముఁ జేయవలెను. దినద్వయమందును బూర్వాహ్ణమందున్నయెడ మీఁద జెప్పినయోగము లనేకము లుండునది గ్రహించవలెను. జ్యేష్ఠమాస మధికమైనప్పటికిని నప్పుడే యీ వ్రతము చేయవచ్చును. శుద్ధమాసాపేక్ష యక్కరలేదు. ఏమనని "దశహరాసునోత్కర్షశ్చతుర్ష్వపి యుగాదిషు" అని హేమాద్రియందు ఋశ్యశృంగవచనము. అనఁగా నాలుగు యుగాదులందును దశహరావ్రతములందు నధికమాసనిషేధము లేదని యర్థము. అందు గాశీవాసులు దశాశ్వమేధ తీర్థమందు స్నానముఁజేసి గంగాపూజనముఁ జేయవలెను. ఇతరదేశస్థులు సన్నిహితనదియందు స్నానముజేసి గంగాపూజనముఁ జేయునది. ఇఁక వ్రతానుష్ఠానప్రకారము దేశకాలముల నుచ్చరించి "మమైతజ్జన్మ జన్మాంతర సముద్భూతత్రివిధకాయిక చతుర్విధ వాచికత్రివిధ మానసిక స్వరూప స్కాందోక్త దశవిధ పాపనిరాసత్రయస్త్రింశచ్ఛతపితృుద్ధార బ్రహ్మలోకావాప్త్యాది ఫల ప్రాప్త్యర్థం జ్యేష్టమాశుక్ల పక్షదశమీ బుధవాసర హస్తానక్షత్ర గరకరణవ్యతీపాతానంద యోగకన్యాస్థ చంద్రవృషస్థసూర్యేతి దశయోగపర్వణ్యస్యాం మహానద్యాం స్నానం తీర్థపూజనం ప్రతిమాయాం జాహ్నవీపూజాం తిలాది దానం మూల మంత్రజపమాజ్య హోమం చ యథాశక్తి కరిష్యే" యని సంకల్పించి యథావిధిగ బదిమారులు స్నానము జేసి పదిమారులుగాని యొకమారుగాని ముందు జూపించు స్తోత్రము బఠించి వస్త్రము కట్టుకొని పితృతర్పణాంతము నిత్యకర్మఁజేసి తీర్థపూజచేసి నేయి గలపిన నల్ల నువ్వులు పదిచేరలు దోసిలితో తీర్థమందు జల్లి బెల్లముతో గలపి సత్తుపిండియుం డలు పదివేయవలెను. అనంతరమందు గంగాతీరమున రాగిదిగాని మృణ్మయముగాని పాత్రయుంచి సువార్ణది ప్రతిమయందు గంగాదేవత నావహింపవలెను. అప్పుడు

మంత్రము "నమోభగవత్యై దశపాపహరాయై గంగాయై నారాయణ్యై రేవత్యై శివాయై దక్షాయై అమృతాయై విశ్వరూపిణ్యై నందిన్యై తే నమో నమః" అని. అనఁగా జ్ఞానైశ్వర్యాది షడ్గుణవతియు, దశవిధపాపముల హరించునదియు, నారాయణపాదోద్భవయు, రేవతియు, శివయు దక్షయు, నమృతయు, విశ్వరూపిణియు, నందియు నగు గంగకొరకు నమస్కారమని యర్థము. ఇది స్త్రీలు మొదలగువారికందరకు నుపయోగించునది. ఇఁక ద్విజులకు మంత్రమే యిరువదియక్షరములు గలది. ఎట్లనిన–"ఓం నమశ్శివాయై నారాయణ్యై దశపాపహరాయై గంగాయై స్వాహా" అను మంత్రముతో నావాహనముజేసి నారాయణుని రుద్రుని బ్రహ్మను, సూర్యుని భగీరథుని, హిమవంతుని, వారినామములచే నావాహనముజేసి, మూలమంత్రము నుచ్చరించి శ్రీగంగాయైనారాయణ్యై బ్రహ్మవిష్ణురుద్ర సూర్యభగీరథ హిమవత్సహితాయై ఆసనం సమర్పయామి. అని యిట్టి వాక్యములచే షోడశోపచారములచే బూజింపవలెను. పది విధములు పుష్పములచే బూజించి దశాంగ ధూపము సమర్పించి దశవిధ నైవేద్యముల యంతమున తాంబూలదక్షిణలనిచ్చి దశవిధ ఫలములర్పించవలెను. దశదీపములిచ్చి పూజాసమాప్తిఁజేయవలెను. పదుగురు బ్రాహ్మణులకు ప్రత్యేకముగ పదియారుచేరలు నువ్వులును దక్షిణయునిచ్చి యిట్లు యవలుగూడ నిచ్చి పదిగోవులను గాని యొకదానిగాని దానముఁ జేయునది. చేపలు, తాబేళ్లు, కప్పలు వీని స్వర్ణముచేగాని రజతముచేగాని చేసి పూజించి తీర్థమందు విడువవలెను. ఇట్లు దీపములు దొప్పలోనుంచి జలమందు విడువవలెను. జపము హోమముఁ జేయునెడఁ బూర్వమందు జెప్పిన మూలమంత్రము నైదువేలు జపించి దశాంశచే హోమముఁ జేయునది. యథాశక్తియైనను సరియే. అపుడు "దశాహరావ్రతాంగత్వేన హోమం కరిష్యే" యని సంకల్పించి స్థండిలమం దగ్నిప్రతిష్ఠఁజేసి "చక్షుషీ ఆజ్యేన" యను మట్టుకన్వాధానముఁ జేసి "శ్రీ గంగామముకసంఖ్యయాజ్యేన నారాయణాదిషడ్దేవతా ఏకైక యాజ్యాహుత్యా వేషేణ స్విష్టకృత"మ్మని మొదలగు సంకల్పముతో ప్రోక్షణి మొదలగు షట్పాత్రముల నాసాదించి యాజ్య సంస్కారముఁజేసి యన్వాధానము ననుసరించి హోమము జేయునది. పదుగురు బ్రాహ్మణులకు సువాసినులకు భోజనము పెట్టునది ప్రతిపత్తి మొదలుకొని స్నానాది పూజాంతవిధిఁ జేయవలెనని కొందరు. స్తోత్రమెట్టులనిన, స్కాందమందు బ్రహ్మోవాచ – "నమశ్శివాయై గంగాయై శివదాయై నమో నమః, నమస్తే రుద్రరూపిణ్యై శాంకర్యైతే నమో నమః నమస్తే విశ్వరూపిన్యై బ్రహ్మమూర్త్యై నమోనమః సర్వదేవ స్వరూపిణ్యై నమో భేషజమూర్తయే సర్వస్య సర్వవ్యాధీనాం భిషక్ శ్రేష్ఠ్యై నమోనమః, స్థాణుజంగమ సంభూతవిషహంత్ర్యై నమోనమః భోగోపభోగదాయిన్యై భోగవత్యై నమోనమః మందాకిన్యై నమస్తేస్తు స్వర్గదాయై నమోనమః నమస్త్రైలోక్యభూషాయై గజద్ధాత్ర్యై నమోనమః నమస్త్రిశుక్లసంస్థాయై తేజోవత్యై నమోనమః, నందాయై లింగధారిణ్యై నారాయణ్యై నమోనమః నమస్తే విశ్వముఖ్యాయై రేవత్యైతే నమోనమః బృహత్యైతే నమస్తేస్తు లోకధాత్ర్యై నమోనమః నమస్తే విశ్వమిత్రాయై నందిన్యైతే నమోనమః, పృథ్వ్యైశివామృతాయైచ సువృషాయై

నమోనమః శాంతాయై చ వరిష్ఠాయై వరదాయై నమోనమః, ఉస్రాయై సుఖదోగ్ధ్ర్యైచ సంజీవిన్యై నమోనమః, బ్రహ్మిష్ఠాయై బ్రహ్మదాయైదురితఘ్న్యై నమోనమః ప్రణతార్తి ప్రభంజిన్యై జగన్మాత్రే నమోస్తుతే సర్వాపత్ప్రతిపక్షాయై మంగలాయై నమోనమః, శరణాగతదీనార్తపరిత్రాణ పరాయణే, సర్వస్యార్తిహరేదేవి నారాయణి నమోస్తుతే, నిర్లేపాయై దుర్గహంత్ర్యై దక్షాయైతే నమోనమః పరాత్పరతరే తుభ్యం నమస్తే మోక్షదే సదా, గంగే మమాగ్రతోభూయా గంగే మే దేవి పృష్ఠతః, గంగేమేపార్శ్వయో రేహిత్వయి గంధేస్తు మే స్థితిః, ఆదౌ త్వమంతే మధ్యే చ సర్వం త్వం గాంగతే శుభే, త్వమేవ మూలప్రకృతి స్త్వం హి నారాయణః పరః, గంగేత్వం పరమాత్మా చ శివస్తుభ్యం నమశ్శివే, యఇదం పఠతిస్తోత్రం భక్త్యానిత్యం నరోపి యః,శృణు యాచ్ఛ్రద్ధయాయుక్తః కాయవాక్చిత్తసంభవైః, దశధాసంస్థితైర్దోషై స్సర్వైరేవ ప్రముచ్యతే, సర్వాన్ కామానవాప్నోతి ప్రేత్య బ్రహ్మణి లీయతే, జ్యేష్ఠే మాసి సితే పక్షే దశమీ హస్తసంయుతా, తస్యాం దశమ్యా మేతచ్చ స్తోత్రం గంగా జలేస్థితః, యః పఠేద్దశ కృత్వస్తు దరిద్రోచాఽపి చాక్షమః సోఽపి తత్ఫలమాప్నోతి గంగాం సంపూజ్య యత్నతః, అదత్తానాముపాదానం హింసా చైవావిధానతః, పరదారోపసేవా చ దాయికం త్రివిధంస్మృతం, పారుష్యమనృతంచైవ పైశున్యం చాఽపి సర్వశః అంసం బద్ధ ప్రలాపశ్చ వాఙ్మయం స్యాచ్చతుర్విధం, పరద్రవ్యే ష్వభి ధ్యానం మనసాఽ నిష్టచింతనం, వితథాభినివేశ్చ మానసం త్రివిధం స్మృతం ఏతాని దశ పాపాని హరత్వం మనుజాహ్నవి, దశపాపహరా యస్మాత్తస్మాద్దశహరాస్మృతా, త్రయస్త్రింశచ్చ తం పూర్వాన్ పితలానథ పితామహాన్, ఉద్ధరత్యేవ సంసారాన్మంత్రేణా నేన పూజితా, నమో భగవత్యై దశపాపహరాయై గంగాయై నారాయణ్యై రేవత్యై శివాయై దక్షాయై అమృతాయై విశ్వరూపిణ్యై నందిన్యైతే నమోనమః సితమకరనిషణ్ణాం శుభ్రవర్ణాం త్రినేత్రాం కరధృతకలశోద్యత్సోత్పలాభీత్యభీష్టా, విధిహరిహరరూపంసేం దుకోటీర జూటాం కలితసితదుకూలాం జాహ్నవీం త్వాం నమామి, ఆదావాది పితామ హస్య నిగమ్యవ్యాపారపాత్రే జల, ంపశ్చాత్పన్న గశాయినో భగ పాదోదకం పావనం, భూయ శ్శంభుజటావిభూషణమణిర్జహ్నోర్మహర్షేరియం, దేవీ కల్మషనాశినీ భగవతీ భాగీరథీ దృశ్యతే, గంగా గంగేతియో బ్రూయా ద్యోజనానంశతైరపి, ముచ్యతే సర్వ పాపేభ్యో విష్ణులోకం స గచ్ఛతి” అని అనఁగా మంగళస్వరూపిణివి శుభప్రదురాలవు. రుద్ర రూపిణివి శాంకరివి విశ్వస్వరూపవు బ్రహ్మమూర్తివి సర్వదేవమయివి ఔషధ రూపవు సర్వవ్యాధులకు వైద్యుడవు స్థావర జంగమ విషముల హరించుదానవు భోగములిచ్చు భోగవతివి మందాకినివి స్వర్ణమునిచ్చుదానవు. మూడులోకములకు భూషణమై జగత్తుకు తల్లివై గంగాద్వారము ప్రయోగము సాగరసంగము నీమూడు శుద్ధ స్థలము లందుండి నంద లోకధాత్రి లింగధారిణి నారాయణి విశ్వముఖ రేవతి బృహతి తేజోవతి విశ్వమిత్ర నందిని పృథ్వి శివ అమృత సువృష శాంత వరిష్ఠ వరద ఉస్ర సుఖదోగ్ధ్రి సంజీవని బ్రహ్మిష్ఠ బ్రహ్మద దురితఘ్ని ప్రణతార్తిభంజని జగన్మాత సర్వాపతుల్ల బోగుట్టునది. మంగళ యను నామములొందిన నీకు నమస్కా రము.

శరణాగతులైన దీనులం(బోచుటకు సర్వాపత్తులను హరించునారాయణి నీకు నమస్కారము. ఓ గంగా నాకు ముందు వెనుక పార్శ్వములను నిలువుము. నా స్థితి నీ కధీనము. సృష్టిస్థితిలయములందు నీవే యుంటివి. నీవే మూలప్రకృతివి. నీవే నారాయణుం(డవు. నీవేశివుం(డవు. నీవేపరమాత్మవు. ఈస్తోత్రమును భక్తితో బఠించి నను వినినను కాయవాక్చిత్తములగు పదివిధముల పాపములం(బాయును. సర్వకామ ముల నొందును. నంతమున ముక్తినొందును. జ్యేష్ఠశుక్లదశమి హస్తతో గూడినపుడీ స్తోత్రము గంగాజలమందుండి పదిమారులు పఠించినను మీం(దజెప్పిన ఫలమొం దును. దశవిధపాపము లెవ్వియనిన, ఒకరివస్తువును వారివ్వకున్నను స్వీకరించుట, శాస్త్రమువిధింపనిహింసజేయుట పరస్త్రీసంగము ఇవి కాయికములు పరుషము అసత్యము. కొండెము ఆసంబద్ధాలాఫము ఇవి వాచికములు. పరద్రవ్య మందభి లాషము పరులకనిష్టముదలచుట వ్యర్థమైన యహంకారము ఇవి మానస ములు. ఇట్టి దశవిధ పాపములహరించునదిగనుక యీ వ్రతముదశహరాసంజ్ఞ గలది. మూడువందల ముప్పదిముగ్గురు పురుషుల పర్యంతము తనకులస్థుల దరింప జేయును. తెల్లటి మొసలివాహనమును శుభ్రవర్ణముగలిగి మూడునేత్రములు నాలుగు హస్తములయందు కలశము. కలువ అభయము. వరమును గలిగి చంద్రకలమకుట మందు వెలుగ తెల్లపట్టుదు కూలము ధరించి బ్రహ్మ విష్ణు రుద్రరూపిణివైన నిన్ను నమస్కరింతునో జాహ్నవి యని ధ్యానము. మొదట వేదకృత్యముల కుపయోగించి సృష్టికర్తయొక్క కమండలువునందున్న జలమై యనంతరమున బలిచక్రవర్తిని గ్రహించు త్రివిక్రమమూర్తి పాదోదకమై యనంతరమున శంభు జటాజూటమునకు భూషణ మయి భగీరథుయత్నమున భూమికి డిగి భాగీరథియు జాహ్నవియునై గంగమనకు గానుపించుచున్నది. ఇట్టిగంగను నూరుల కొలది యోజనములదూరమున నుండియు స్మరించిన నతనిపాపములు పోవును. విష్ణులోకము ప్రాప్తించునని యర్థము. ఇట్లు స్తుతించి హోమాంతమందు దిరుగ ప్రతిమను పూజించి మూలమంత్రముతో నాచార్యు లకు దానమీయవలెను. ఇది దశహరావిధానము.

## నిర్జల వ్రతము

జేష్ఠశుక్లైకాదశి. నిర్జలైకాదశి ఈదినమందు నిత్యాచమనాదులందుతప్ప వేరు జలపానము విడిచి యుపవాసముజేసె నేని బం(డెండేకాదసులుపవసించిన ఫల మగును. ద్వాదశియందు "నిర్జలోపోషితైకాదశీ వ్రతాంగత్వేన సహిరణ్యశర్కరోద కుంభ దానంకరిష్యే"యని సంకల్పించి – శ్లో॥ "దేవదేవ హృషీకేశ సంసారార్ణవతారక ఉదకుంభ ప్రదానేన యస్యామి పరమాంగతిమ్" అను మంత్రముచే సువర్ణము శర్కరయు గూడ నుదకుంభదానము జేయునది. జ్యేష్ఠశుక్ల ద్వాదశియందహోరాత్ర మున త్రివిక్రమమూర్తిని బూజించిన గవామయన మను క్రతువుజేసిన పుణ్యము గలుగును. జ్యేష్ఠపూర్ణిమయందు దిలలుదానమిచ్చినచో నశ్వమేధఫలము సిద్ధించును. అది జ్యేష్ఠానక్షత్రముతో గూడునపుడు ఛత్రము పాదరక్షలు నిచ్చిన నాధిపత్యము గలుగును. ఈ పూర్ణిమయందు బిల్వత్రిరాత్రి వ్రతము. దానియందు బరవిద్ధ గ్రహింప

వలెను. ఈతిథియందే వటసావిత్రీ వ్రతము. ఈ వ్రతమందు త్రయోదశిమొదలు దినత్రయ ముపవాసము. అశక్తుండైనచో త్రయోదశినక్తము చతుర్దశియం దయా చితము పూర్ణిమయం దుపవాసము. ఇక్కడ పౌర్ణమాసీనిర్ణయము ననుసరించి మూడు దినము లగునట్లు త్రయోదశి మొదలు దినత్రయము స్వీకరించవలెను. అపుడు పూర్ణిమ సూర్యాస్తమయమునకు బూర్వము మూడు ముహూర్తములపై వ్యాపించి చతుర్దశీ విద్ధయగుదాని గ్రహింపవలెను. అంతకు తక్కువయయినచో బరదినమే. శ్లో॥ "భూతోష్టాదశనాడీభిర్దూషయత్యుత్తరాం దిశం" అనువచనమనగా చతుర్దశి పదునెనిమిది గడియలచే పూర్ణిమ విద్ధయగును గనుక నిషిద్ధమనువచనము వట సావిత్రి వ్రతమునకంటె నన్యమునకుగాని దీనికిగాదు. విద్ధతిథియందే యుపవాసము విధింపబడినది. కేవల పూజాస్వరూపమై యుపవాస మక్కరలేని సావిత్రీ వ్రతము స్త్రీలందరు జేయుదురు. అక్కడ వ్రత దానాదులకు పదునెనిమిది గడియల చతుర్దశీ వేధ గూడదని మాధవాచార్యమతము. నిర్ణయ సింధువులో నున్నందున అట్టి వేధ గలిగినచో నా వ్రతమునకు బరదినమే గ్రహించునది. ఇక్కడ పారణము పూర్ణిమాంత మున జేయవలెను. అపుడు రజస్వలాదిదోషము ప్రాప్తించినచో బ్రాహ్మణునిచే బూజాది కము జేయించునది. స్వయ ముపవాసాదికము జేయవలెనని మొదలగు స్త్రీ వ్రత విశేషములు ప్రథమ పరిచ్ఛేదమందు దెలియునది. ఇక్కడపజోద్యాఽనాదివిధి వ్రత గ్రంథ మందు దెలియవలెను. ఈ జ్యేష్ఠ పూర్ణిమయందు జ్యేష్ఠానక్షత్రమున బృహస్పతిచంద్రులును రోహిణి నక్షత్రమందు సూర్యుడున్నచో మహాజ్యేష్ఠి యనబడును. అపుడు స్నానదానాదికముప్రశస్తము. ఇది మన్వాదిగనక పిండరహిత శ్రాద్ధము చెప్పబడెను. దాని నిర్ణయము చైత్రములో జూడవలెను. ఈ మాసమందు జందనవ్య జనోదకుం భాది దానములు విప్రుల కీవలయును. త్రివిక్రమ ప్రీతియగును. ఇది ధర్మసింధు సారమందు జ్యేష్ఠమాస నిర్ణయోద్దేశము ముగిసెను.

## ఆషాఢమాసము

ఇఁక నాషాఢమందు దక్షిణాయన మనబడు కర్కటక సంక్రాంతి. దానికి బూర్వమున ముప్పదిగడియలు పుణ్యకాలము. అందులో సంక్రాంతికి సమీపమం దున్న గడియలు పుణ్యతమములు. రాత్రియం దర్ధరాత్రమునకు పూర్వముగాని పర మందుగాని సంక్రమణమైనప్పటికి పూర్వదినమందే పుణ్యకాలము. అందు మధ్యాహ్న మునకంటె బరమందు బుణ్యతమత్వము. సూర్యోదయానంతరము రెండుగడియల లోగా సంక్రాంతి యయినచో బరదినమందే పుణ్యకాలము. జ్యోతిర్గ్రంథ మందు సూర్యోదయమునకు పూర్వము మూడుగడియలు ప్రదోషకాలము. అందు సంక్రాంతి యయినను బరదినమేయని చెప్పబడినది. అపుడు దానోపవాసాదికము ప్రథమ పరిచ్ఛేదమం దున్నది. కర్కటకమందు కన్యయందు ధనస్సుయందు కుంభమందు సూర్యుడున్నపుడు, చూడాకర్మ మొదలగునవి నిషిద్ధములు. ఆషాడమాసమం దేకభక్త వ్రతముజేసినచో బహుధన ధాన్యములు పుత్రులు లభించుదురు. ఈ మాసమందు బాదరక్షలు ఛత్రము లవణము ఉసిరికఫలము వీనివామన ప్రీతికై దానము జేయ

వలెను. ఆషాడశుక్ల ద్వితీయ పుష్యనక్షత్రముతో గూడినచోనైనను లేకున్నను శ్రీరాము నికి రథోత్సవము. ఈ శుక్లపక్షమున దశమియు పూర్ణిమయు మన్వాదులు. వీని నిర్ణయము మీఁద జెప్పఁబడినది. ఇఁక నేకాదశియందు విష్ణుశయనోత్సవము. అపుడుపకరణములతో గూడిన తల్పమందు శయనించి శంఖాది చతురాయుధముల ధరించి లక్ష్మీదేవి పాదములొత్తుచుండగ బండుకొనియున్న విష్ణుప్రతిమను నానావిధో పచారములచే బూజించి "త్వయి సుప్తే జగన్నాధ జగత్సుప్తం భవేదిదం, విబుద్ధేత్వయి బుధ్యేత తత్సర్వం స చరాచరమ్" అని ప్రార్థించి యనఁగా నో జగన్నాధుడ నీవు నిద్రించ జగమునిద్రించును. నీవు మేల్కాంచిన జగము దెలివి నొందు నని ప్రార్థించి ఉపోషణమునురాత్రి జాగరణమునుజేసి ప్రాతఃకాలమున దిరుగబూజించి త్రయోదశి యందు గీతనృత్యవాద్యాదికము సమర్పించవలెను. ఇది యిట్లు మూడుదినములు చేయవలసిన వ్రతము. అందు స్మార్తులు వైష్ణవులును దమతమ యేకాదశీ వ్రతదిన మందే శయనవ్రతమారంభించవలెను. రాత్రియందు శ్సయనోత్సవము పగటియందు ప్రభోదోత్సవము ద్వాదశియందు బారణ దినమందే శయన ప్రబోధోత్సవములని కొందరు దేశాచారముచే వ్యవస్థ యగును. ఇది మలమాసమునందు జేయగూడదు. ఆషాఢశుక్ల, ద్వాదశియందనూరాధ లేనిచో బారణ జేయవలెను. అందులో ననూరాథా ప్రథమ పాదమే వర్జ్యము. ఒకవేళ ద్వాదశిస్వల్పమై వర్జ్యనక్షత్రయోగము దాని దాటియుండెనేని అపుడు నిషేధమును లక్ష్యపెట్టక ద్వాదశియందేపారణ జేయవలెనని కౌస్తుభమతము. సంగమకాలము విడిచిప్రాతఃకాలమందుగాని మధ్యాహ్న కాలమందు గాని పారణజేయ వలెనని పురుషార్థచింతామణి మతము. ద్వాదశియందు బారణా నంతరమున సాయం కాలపూజజేసి చాతుర్మాస్య వ్రతసంకల్పము జేయవలెనని కౌస్తుభమతము. ఏకాదశి యందే చేయవలెనని నిర్ణయసింధుమతము.

## చాతుర్మాస్యా రంభము

చాతుర్మాస్య వ్రత ప్రథమారంభము గురు శుక్రాస్తాదులందును నాశౌచాదిక మందును గూడదు. ద్వితీయాద్యారంభ మపుడును జేయవచ్చును. చాతుర్మాస్య వ్రతము శైవాదిమతస్థులునుజేయవలెను. వ్రతగ్రహణ ప్రకార మెట్లనిన. జాజిపుష్ప ములు మొదలగువాటిచే భగవంతునికి మహాపూజచేసి – శ్లో॥ "త్వయి సుప్తే జగన్నాధ జగత్సుప్తం భవేదిదం, విబుద్ధే చ విబుధ్యేత ప్రసన్నో మే భవాచ్యుత, చతురోవార్షి కాన్ మాసాన్ దేవస్యోత్థాపనావధి, శ్రావణే వర్జయేచ్ఛాకం దధిభాద్రపదే తథా, దుగ్ధమాశ్వయుజే మాసి కార్తికే ద్విదలంత్యజేత్, ఇమం కరిష్యే నియమం నిర్విఘ్నం కురు మే ఒచ్యుత, ఇదం వ్రతం మయాదేవ గృహీతం పురతస్తవ, నిర్విఘ్నం సిద్ధి మాయాతు ప్రసాదాత్తే రమాపతే, గృహీతేఒస్మిన్ వ్రతే దేవ పంచత్వం యది మే భవేత్, తదా భవతు సంపూర్ణం ప్రసాదాత్తే జనార్ధన" అని ప్రార్థించి యనఁగా నో జగన్నాధుడ నీవు నిద్రించిన జగము నిద్రించును. నీవు మేల్కొనిన జగము దెలివి నొందును. నాయందు ప్రసన్నుడవు గమ్ము. వార్షిక మాసములు నాల్గింటియందు

భగవంతుని ప్రబోధము పర్యంతము శ్రావణమందు శాకము భాద్రపదమందు పెరుగును. ఆశ్వినమందు పాలును కార్తికమందు ద్విదల ధాన్యమనగా పెసలు మొదలగు గింజ రెండుభాగములుగా బుట్టు ధాన్యము విడువవలయును నను నీవ్రతము నీ యెదుట నాచే ప్రారంభింపబడినది. దీని నిర్విఘ్నముగా ననుగ్రహింపుము. ఒకవేళ వ్రతమధ్యమందు మరణము నొందితినేని నది సంపూర్ణమగునట్లు లనుగ్రహింపుమని ప్రార్థించి దేవునికి శంఖముచే నర్ఘ్యమీయవలెను.

## నిత్య వ్రతములు

ఈ వ్రతములు నిత్యములు హవిష్యవ్రతము మొదలగు మరియొక వ్రతము జేయదలచినచో "హవిష్యాన్నంభక్షయిష్యే" యని సంకల్ప మూహించవలెను. శాక వ్రతమును వ్రతాంతరమును రెంటిని జేయదలచినచో గ్రమముగ శాకవ్రత శ్లోకమును వ్రతాంతరశ్లోకమును బఠించవలెను. ఇట్లు గుడవర్జనము మొదలైనవి ధారణా పారణాది వ్రతములును జేయునపుడు "వర్జ్జయిష్యే గుడం దేవ మధుర స్వరసిద్ధయే, వర్జయిష్యే తైలమహం సుందరాంగత్వసిద్ధయే, యోగాభ్యాసీభవిష్యామి ప్రాప్తుం బ్రహ్మ పదంపరం, మౌనవ్రతీభవిష్యామి స్వాజ్ఞా పాలనసిద్ధయే,ఏకాంతరోపవాసం చ ప్రాప్తుం బ్రహ్మపదం పరం" అని యాయా వ్రతముల కాయాసంకల్ప శ్లోకము లూహించునది. నిషిద్ధవస్తువులు మాత్రమే వర్జింపదలచినచో "వృంతాకాది నిషిద్ధాని హరే సర్వాణి వర్జయే" అని సంకల్పమంత్రము. ఇఁక చాతుర్మాస్య వ్రతమందు నిషిద్ధము లెవ్వి యనిన. ప్రాణ్యంగచూర్ణము చర్మపాత్రస్థ మైనయుదకము జంబీరము బీజపూరము యజ్ఞశేషభిన్నము విష్ణువుకు నివేదన చేయని యన్నము దగ్ధాన్నము మొసరిపప్పు మాంసమునను నీ ఎనిమిది విధములైన యామిషములు వర్జింపవలెను. నిష్పావ ధాన్యము అనుములు బొబ్బరలు ధాన్యమందైన లవణము వంగకాయ కళింగఫలము పుచ్చకాయ అనేక బీజఫలము నిర్బీజము మొల్లంగి గుమ్మడికాయ ఇక్షుదండము క్రొత్త రేగుపళ్ల క్రొత్తయుసిరికపప్పు చింతపండు మంచముపై శయనము ఋతుకాల మైనను భార్యాసంగము పరాన్నము తేనె పొట్లకాయ మినుము ఉలవలు తెల్లయావాలు నివి వర్జింపవలెను. వృంత్తాకము బిల్వము ఉదుంబరము భిస్సటయు అనగా వూడు నివి వైష్ణవు లెప్పుడును విర్జంచునవి. మరియొకరీతిగ నామిషగణము చెప్పబడినది. ఎట్లనిన గోవు మేక గేదె వీనిదప్ప నన్యజంతువుల పాలు చలిదియన్నము విప్రుల వద్ద కొనిన రసద్రవ్యములు చవిటియుప్పు రాగిపాత్రలో నుంచిన గోవుక్షీరము మొదలగునవి. చిన్నగుంటలో నున్నజలము తనకడుపునకే యుద్దేశించి వండిన యన్నము మొదలగునవి యామిషగణమని-శ్లో॥ "చతుర్ష్వపి హి మాసేషు హవిష్యాశీ న పాపభాక్" అనఁగా చాతుర్మాస్యలలో హవిష్యము దినువారిపాపము నశించును. హవిష్యము లెవ్వియనిన. వ్రీహులు యవలు పెసలు తిలలు కందులు కలాయములు చామలు గోధూమములును రక్తముగాని మూలకము కందపెండలము మొదలగు దుంపలు సైంధవము సాముద్రమునైన లవణము గోవుయొక్క పాలు మొదలగునవి.

పనసమామిడి కొబ్బరి మొదలగు ఫలజాతులును కరక పిప్పలి జీరకము శొంఠి చింతపండు అరిటి లవలి యుసిరిక ఫలములు గుడభిన్నమైన యిక్షురస వికారములు మొదలగు నవియ తైలపక్వములు. గోతక్రము ఘృతము మాహిష మైనను క్వచిత్తుగా గ్రహింపవచ్చును.

## గ్రామ్య వ్రతములు

బెల్లమువిడిచిన మధురస్వరసిద్ధి నూనెవర్జించిన నంగ సౌందర్యము యోగాభ్యాసముచే బ్రహ్మపదము తాంబూలమువిడిచిన భోగసిద్ధి ఘృతము వర్జించిన నునుపగు దేహము శాకము త్యజించిన పక్వాన్నసిద్ధి పాదాభ్యంగము విడిచిన సుగంధ దేహసిద్ధి దధి దుగ్ధము తక్రము విడిచిన విష్ణుసాలోక్యము స్థాలియందు వండిన యన్నము విడిచిన మిగులవంశాభివృద్ధి భూమిపై దర్భశయ్యను శయనించిన విష్ణుభక్తుడగు భూమియందు భుజించిన నృపత్వము మధుమాంసములు విడిచిన ముని యగును. ఒకదినము విడిచి మరియొక దినమందుపవాసము చొప్పున ధారణాపారణావ్రతము జేసినచో బ్రహ్మలోకసిద్ధి నఖకేశములు ఖండించకుండిన ప్రతిదినము గంగాస్నానము. మౌనముజేసిన నాజ్ఞ యప్రతిహతము. విష్ణువందనముచే గోధాన ఫలమగును. విష్ణుపాద స్పర్శచే గృతార్థత్వము. దేవగృహమందు సంమార్జనము మొదలగు వాటిచే నృపత్వము. నూరుప్రదక్షిణములు జేసిన విష్ణులోకము. ఏకభక్తాశనము జేసిన నగ్నిహోత్రకర్మఫలము. అయాచితముజేసిన వాపీకూపాదుల ప్రతిష్ఠించిన పుణ్యము. పగలారవకాలమందు భుజించిన చిరస్వర్గము. పర్ణములలో భుజించిన గురుక్షేత్ర వాసఫలము. శిలా భోజనముచే ప్రయాగ స్నానఫలము. ఇట్లు నాలుగు మాసములలో జేయు వ్రతముల సంకల్ప మేకాదశియందుగాని ద్వాదశియందుగాని చేసి శ్రావణమాస వ్రతవిశేష సంకల్పము నిపుడే చేయవలెను. శ్లో॥ "అహం శాకం వర్జయిష్యే శ్రావణే మాసి మాధవ" యని ఇక్కడ శాకమనఁగా లోకప్రసిద్ధములగు కాయలు పండ్లు దుంపలు ఆకులు చిగుళ్లు కాడలు త్వక్కు మొదలగునవి వర్జింపవలెను గాని యన్న సాధనమంతయుగాదు. శొంఠి పసుపు జీలకర్ర మొదలగునవియు వర్జ్యములు. అప్పుడు కాచిన కూరలును వరుగులుగూడ వర్జ్యములు. ఈ చాతుర్మాస్య వ్రతములకు సమాప్తియందు దానములు కార్తికములో జెప్పబడును. శయనీబోధన్యేకాదదసులయందుఁ దప్తముద్రాధారణము రామార్చన చంద్రికలోఁ జెప్పఁబడినది. ఈ తప్తముద్రాధారణము విషయమై ప్రశంసావచనములును నిందావచనములును బహుతరముగా గానుపించుచున్నవి. గనుక కులాచారము ననుసరించి వ్యవస్థ జేయవలెను. అనగాఁ బితృపితామహాది క్రమముగ దప్తముద్రాధారణము జేయబడి యుండువారికి విధింపఁబడినది. అట్లు లేనివారికి నిషేధింపఁబడినదనియు ననుట.

## వామనపూజ

ఆషాఢశుక్ల ద్వాదశియందు వామనమూర్తి బూజించిన నరమేధఫలము. పూర్వాషాఢాయుక్త మగు పూర్ణిమయందన్న పానాది దానముచే నక్షయ్యముగ నన్న

పానాది ప్రాప్తి. ఈ పౌర్ణమాసి ప్రదోషవ్యాపిని యగుచోశ్రీ శివుని శయనోత్సవము. ఈ దినమందే కోకిలా వ్రతము. అపుడు శ్లో॥ "స్నానం కరిష్యే నియతా బ్రహ్మచర్యే స్థితా సతీ, భోక్ష్యామి నక్తం భూశయ్యాం కరిష్యే ప్రాణినాం దయాం" అని అనగా నియమముతో బ్రహ్మచర్యమునందుండి ప్రాతస్స్నానము జేయుచు నక్తభోజనము జేయుచు భూమియందే శయనింపుచు నొక మాసము భూతదయగలిగి యుందునని సంకల్పించి కోకిలాస్వరూపిణి యగు దేవిని నిత్యము పూజించి నక్తము జేయవలెను. ఆషాఢ మధికమగుచో శుద్ధమాసమందు జేయవలెనను నాచారమునకు ప్రమాణము గానరాదు. ఆషాఢమందైనను శ్రావణమందైనను పూర్ణిమ, చతుర్దశి, యష్టమి, వీనిలో నొకదినమందు శివునికి పవిత్రారోపణము చెప్పఁబడినది. ఈ పౌర్ణమాసియందు సన్యాసులకు చాతుర్మాస్యనివాసమునకు సంకల్పాంగముగా క్షౌరము వ్యాసపూజ మొదలగునది విధింపబడినది. ఈకర్మకు సూర్యోదయము మొదలారుగడియల వరకు వ్యాపించు పూర్ణిమకావలెను. శ్లో॥ "చాతుర్మాసస్య మధ్యే తు పవనం వర్జయేద్యతి, చతుర్మాసం ద్విమాసం వా సదైకత్రైవ సంవసేత్" అనఁగా నీనాలుగు మాసములయం దును యతి విశ్రమించవలెను. నాలుగు మాసములను గాని రెండు మాసములనుగాని యొకస్థలమందే నివాసము చేయవలెను. అందు మొదట క్షౌరము జేసుకొని పండ్రెండు మృత్తికాస్నానములు చేసి ప్రాణాయామాదివిధి యంతమున వ్యాసపూజ జేయవలెను. ఇక సంక్షేపముగ విధానము జెప్పఁబడును. దేశకాలముల స్మరించి యుచ్చరించి "చాతుర్మాస్యావాసం కర్తుం శ్రీకృష్ణ వ్యాసభాష్యకారాణాం సపరివారాణాం పూజనం కరిష్యే" యని సంకల్పించి మధ్యమందు శ్రీకృష్ణుని నతనికిఁ దూర్పు మొదలు ప్రదక్షిణముగ వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్నానిరుద్ధుల నావాహన ముజేసి శ్రీకృష్ణుడు మొదలైదుగురి దక్షిణభాగమందు వ్యాసుని నతనికిఁ దూర్పున నుంచి బ్రదక్షిణముగ సుమంతు, జైమిని, వైశంపాయన, పైలులను నిట్లైదుగుర నావాహనముజేసి శ్రీకృష్ణా దుల కెడమభాగమున భాష్యకారులగు శ్రీశంకరుని నాయనకు దూర్పు మొదలు ప్రదక్షిణముగఁ బద్మపాద, విశ్వరూప, త్రోటక, హస్తామల కాచార్యుల నావాహనము జేసి శ్రీకృష్ణుని పార్శ్వములందు బ్రహ్మరుద్రులను పూర్వాదు లైన నాలుగు దిక్కులను సనకాదులను శ్రీకృష్ణ పంచకము నెదుట గురు, పరమగురు, పరమేష్ఠిగురు, పరాపర గురువులను, బ్రహ్మ,వసిష్ట,శక్తి, పరాశర, వ్యాస,శుక, గౌడపద, గోవిందపాద, శంకరాచార్యులనియెడు బ్రహ్మనిష్ఠులను నావాహనముజేసి, ఈ మూఁడు పంచకముల కాగ్నేయదిక్కున గణేశుని నీశానదిక్కున క్షేత్రపాలుని వాయవ్యదిక్కున దుర్గను నిర్బృతి దిక్కున సరస్వతిని దూరుపు మొదలెనిమిది దిక్కుల నింద్రాద్యష్ట దిక్పాలకులను నావాహనముజేసి పూజింపవలెను. అందు నారాయణాష్టా క్షర మంత్రముచే శ్రీకృష్ణపూజ యన్యులకు నోంకార మాదిగ నమశ్శబ్దమంతముగ దత్తన్నామమంత్రము లచేఁ బూజచేయునది. పూజాంతమందు "అసతి ప్రతిబంధకే చతురోమాసానిహ వసామి" యని సంకల్పించి శ్లో. "అహం తావన్నివత్స్యామి సర్వ భూతహితాయ వైప్రాయేణ ప్రావృషి ప్రాణిసంకులం వర్త్మదృశ్యతే, అతస్తేషా మహింసార్థం పక్షాన్వై

శ్రుతిసంశయాన్, స్థాస్యా మశ్చతురో మాసానత్రైవాసతి బాధకై” యని వాచిక సంకల్పము జేయవలెను. అనగా వర్షాకాలమందుఁదరుచుగ మార్గము ప్రాణిసంకులమై యుండును. గనుక భూతహితముగోరి నాలుగు మాసములు నిచ్చటనే నివసించెదను. అనివాక్కుతో సంకల్పించవలెనను. అనంతర మున గృహస్థులు ప్రత్యుత్తరమీయవలెను. శ్లో॥ “నివసంతు సుఖేనాత్ర గమిష్యామః కృతార్థతాం, యథా శక్తి చ శుశ్రూషాం కరిష్యామో వయం ముదా”యని. అనగా తాము సుఖముగ దయజేసి యుండవలసినది. మేము కృతార్థులమగుదుము. యథాశక్తి శుశ్రూషజేసెద మనుట. ఆపైని వృద్ధానుక్రమమున గృహస్థులు యతులకును యతులు వారిలో వారికిని నమస్కరించవలెను. ఈ విధి పౌర్ణమాసియందు సందర్భించకున్నచో ద్వాదశి యందు జేయవలెను. ఆషాఢ శుక్ల ద్వితీయయం దశూన్యశయనవ్రతము. అందు లక్ష్మీదేవితోగూడ విష్ణువును శయ్యయందుఁ బూజించి – శ్లో॥ “పత్నీభర్తుర్వి యోగం చ భర్తా భార్యాసముద్భవం, నాప్నువంతియథా దుఃఖం దాంపత్యాని తథా కురు” అనఁగా భర్తృవియోగము భార్యకును భార్యావియోగము భర్తకును లేకుండఁగ జేయుమని ప్రార్థించవలెను. అటుపైన చంద్రుని కర్ఘ్యమిచ్చి నక్తభోజనము జేయవలెను. ఇట్లు నాలుగు మాసముల కృష్ణద్వితీయలయందును బూజించి సపత్నీ కుఁడైన బ్రాహ్మణునికి శయ్యాదానముఁజేసి యుపకరణములతో ప్రతిమనుగూడ నీయవలెను. ఈ వ్రతముచే నక్షయ్యమగు దాంపత్యసుఖమును పుత్రధనాద్య వియోగ మును గార్హస్థ్యావియోగమును సప్తజన్మముల పర్యంతమగును. ఈ వ్రతమునకు చంద్రోదయ వ్యాప్తి తిథికి గావలెను. పూజా కాలమదియే విధింపఁబడినది. దినద్వయ మందట్టి వ్యాప్తి గలిగినను లేకున్నను బరదినమే గ్రహించునది. ఇట్లు ధర్మసింధు సారమందాషాఢమాస నిర్ణయోద్దేశము ముగిసెను.

## శ్రావణమాసము

సింహసంక్రమణమున కుత్తరమందు బదియారుగడియలు పుణ్యకాలము. రాత్రి ప్రవేశమైనచో మీఁద జెప్పఁబడినది. ఈ మాసమందేక భుక్తము నక్తవ్రతము విష్ణునకు శివునకు నభిషేకము విధింపఁబడినది. మరియు శ్లో॥ “సింహరాశిగతే సూర్యేయస్య గౌస్తు ప్రసూయతే” సూర్యుఁడు సింహస్థుఁడైనపుడు తన గోవు ప్రసవించిన యెడ ఘృతముగల పినయావాలను పదివేలమారులు హోమముఁజేసి యా గోవును బ్రాహ్మణున కీయవలెను. ఇట్లు నిశీథమందు గోవు మొరవెట్టినను మృత్యుంజయ మంత్రముచే హోమము మొదలగు శాంతిజేయవలెను. ఇట్లు శ్రావణమున పగటిసమయమందాడ గుఱ్ఱము ప్రసవించినను నిషిద్ధము. అందుకు వచనము. “మాఘే బుధే చ మహిషీ శ్రావణే బడబా దివా, సింహేగావః ప్రసూయంతే స్వామినో మృత్యుదాయకాః” అనఁగా మాఘ బుధవారమందు గేదెయు శ్రావణమందుఁబగలు గుఱ్ఱము సింహమందు గోవులు ప్రసవించిన స్వామికి హానియగునని యున్నందున వానికిఁ దగిన శాంతి జేయవలెను. మరియు – శ్లో॥ “సోమవార వ్రతం కార్యం శ్రావణే వై యథావిధి, శక్తేనోపోషణం కార్యమథవా నిశి భోజనం” అనఁగా శ్రావణ

మాసమందు యథావిధిగా సోమవారవ్రతము జేయవలెను. అపుడు శక్తుఁడయ్యేనేని యుపోషణము చేయవలెను. లేనిచో నక్తభోజనము చేయవలెను. ఇట్లు శ్రావణమందు మంగళవారమున గౌరీపూజ విధింపబడినది. శ్రావణశుక్ల చతుర్థి మధ్యాహ్న వ్యాపినియుఁ బూర్వవిద్ధయుఁగావలెను. శ్రావణ శుక్లపంచమి నాగపంచమి. ఇది సూర్యోదయమందారుగడియలు వ్యాపించు పరవిద్ధగావలయును. పరదినమందు ముహూర్త త్రయమునకు న్యూనమై పూర్వదినమందు ముహూర్తత్రయమున కంటె న్యూనమై పూర్వదినమందు ముహూర్తత్రయమున కంటె న్యూనమైన చతుర్థితో గూడిన యెడ బూర్వమే గ్రహించునది. త్రిముహూర్తములకంటె నధికము చతుర్థియైనచో ద్విముహూర్తములున్నను బరమే గ్రహించవలెను. ముహూర్తమాత్రమే యున్నచో నట్లు గ్రహింపఁగూడదని తోచుచున్నది. అపుడు గోడయందు వ్రాయఁబడినవిగాని మృత్తికాదులచే నిర్మింపఁబడినవిగాని సర్పములు పూజింపవలెను. శ్రావణ శుక్లద్వాదశి యందు మాసము యావత్తునుజేసిన శాకవ్రతమునకు సాంగతాసిద్ధికై "బ్రాహ్మణాయ శాకదానం కరిష్యే" యని సంకల్పించి బ్రాహ్మణుని బూజించి– శ్లో॥ "ఉపాయనమిదం దేవవ్రత సంపూర్తి హేతవే, శాకంతు ద్విజవర్యాయ సహిరణ్యం దదామ్యహం."అను మంత్రముచే వండినదిగాని పచ్చిదిగాని శాకమీవలెను. అనంతర మందు శ్లో॥" దధి భాద్రపదే మాసి వర్జయిష్యే సదాహరే" అని దధి వ్రతము సంకల్పించవలెను. ఇచ్చట దధిమాత్రము వర్జ్యము. తక్రాదులకు నిషేధము లేదు. ఇఁక పారణదిన మందు ద్వాదశియందు విష్ణువునకు పవిత్రాధిరోపణము. పారణదినమందు ద్వాదశి లేనిచో త్రయోదశియందే పారణదినమందు జేయవలెను. అపుడును సందర్భించినచో శ్రవణ నక్షత్రమందుగాని పూర్ణిమయందుగాని చేయవలెను. శివుని పవిత్రారోపణము చతుర్దశి, అష్టమి, పౌర్ణమాసి వీనిలో నొకదినమందు జేయునది. ఇట్లు దేవీగణేశ దుర్గాదులకు చతుర్థశీ, చతుర్థి, తృతీయ, నవమి మొదలగునవి కులాచారము ననుస రించి తిథులు గ్రహించునది. ఆయా తిథులందు సంభవింపనిచో సర్వదేవతలకు శ్రావణపపూర్ణిమయందుఁ బవిత్రారోపణము. అపుడును గానిచో కార్తికపూర్ణిమ పర్యంతము గౌణకాలము. ఇది నిత్యము కనుకనే– శ్లో॥ "అకుర్యాణో వ్రజత్యధః తస్య సాంవత్సరీపూజా నిష్ఫలా" యని యధోగతియు సంవత్సరపూజకును వైఫల్యముఁ జెప్పఁబడినది. మరియు గౌణకాలమందును జేయనియెడ. శ్లో॥ "తదాయుతం జపేన్మంత్రం స్తోత్రం వాఽపి సమాహితః" అని పదివేలు తద్దేవతా మూలమంత్ర జపముగాని స్తోత్రజపముగాని ప్రాయశ్చిత్తమనియున్నది. ఈ పవిత్రారోపణమునకుఁ బూర్వదినమందు దేవునికధివాసనము. పరదినమందు పవిత్రారోపణము. ద్వ్యహ కాలము సంభవింపనిచో నారోజుననే రెండునుఁ జేయవలెను. ఇఁక సంక్షేపముగ ప్రయోగము. నూలు తొమ్మిదిపోగులు పోసిన నవసూత్రి అని నూటయెనిమిది దేవ మూర్తికి మణుకుల పర్యంత ముండునటుల నిరువది నాలుగు ముళ్లువేసినచో నుత్తమ పవిత్రము. యేబదినాలుగు నవసూత్రిచే తొడలుమట్టుకు వ్రేలునట్లు పంద్రెండు గ్రంథులతోఁజేసిన మధ్యమ పవిత్రము. ఇరువదియేడు నవసూత్రిచే నాభిపర్యంతముగ

నెనిమిది గ్రంథులు గలది. కనిష్ట పవిత్రము. వీనిజేసి నూట నలువదిగాని డెబ్బదిగాని నవసూత్రిచేఁ బాదములవరకు వ్రేలునట్టు లష్టోత్తరశతము గాని యిరువదినాలుగు గాని గ్రంథులుగలదిగా వనమాలికనుజేసి పండ్రెండు నవ సూత్రిచే గంధపవిత్రమును బండ్రెండు గ్రంథులతోఁజేసి యిరువది యేడు నవసూత్రిచే గురుపవిత్రము త్రిసూత్రిచే నంగదేవతా పవిత్రమును చేయవలెను. శివునికి బవిత్రములు లింగముయొక్క విస్తారమునను సరించి యుండవలెను. పవిత్రములన్నియుఁ బంచగవ్యముచే దడపి ప్రణవముచేగడగి మూలమంత్రముచే నూటయెనిమిదిమారు లభిమంత్రించి గ్రంథు లకు కుంకుమఁబూసి సర్వ పవిత్రములను చేట మొదలగు వంశ పాత్రమందుంచి బట్టగప్పి దేవుని యెదుట నుంచి– శ్లో॥ "క్రియాలోపవిధానార్థం యత్త్వయా విహితం ప్రభో, మయైతత్క్రియతే దేవ తవ తుష్ట్యై పవిత్రకం, న మే విఘ్నో భవేద్దేవ కురునాథ దయాం మయి, సర్వథా సర్వదా విష్ణో మమ త్వం పరమాగతిః" అనఁగా కర్మలోప పూర్తికై నీచే విధింపఁబడిన పవిత్రమును నీ ప్రీతికొరకు జేసెదను, విఘ్నమురాకుండగ నాయందు దయజేయుము. సర్వప్రకారములచే నెల్లపు డును నీవేదిక్కునుట. ఇట్లు ప్రార్థించి దేవుని కధివాసనముఁ జేయవలెను. అందు దేశకాలముల నుచ్చరించి "సంవత్సరకృత పూజాఫలావాప్త్యర్థ మధివాసనవిధిపూర్వ కం పవిత్రారోపణం కరిష్యే" యని సంకల్పించి దేవునియెదుట సర్వతోభద్రమండల మందు పూర్ణకలశముంచి దానిపై వెదురుపేళ్ల జంగెడతో బవిత్రములుంచి వాటి యందు – శ్లో॥ "సంవత్సరస్య యాగస్య పవిత్రీకరణాయభో, విష్ణులోకాత్పవిత్రాద్య త్వాగచ్ఛేహ నమోస్తుతే" యనఁ గా సంవత్సరపూజను పవిత్రముజేయుటకు విష్ణు లోకమునుండి దయజేయుమో పవిత్రమా నీకు నమస్కారమును నర్థముగల మంత్రముచేతను మూలమంత్రము చేతను నావాహనముజేసి త్రిసూత్రియందు బ్రహ్మ రుద్రులను నవసూత్రియం దోంకారము, వహ్ని,బ్రహ్మ,నాగేశుని, సూర్యుని, శివుని, విశ్వదేవులను నుత్తమమధ్యమ కనిష్ఠ పవిత్రములందు బ్రహ్మ విష్ణు రుద్రులను సత్వరజస్తమోగుణములను నావాహ నముజేసి వనమాలయందు ప్రకృతిని నావహించి మూలమంత్రముచే, "శ్రీపవిత్రా ద్యావాహితదేవతాభ్యోనమః" యని గంధాద్యుపచార ములఁబూజించునది. అనంతర మున సిద్ధము చేయఁబడి పండ్రెంగుళములు పరిమితి యన్నియే గ్రంథులుగల గంధపవిత్రము గ్రహించి – శ్లో॥ "విష్ణు తేజోద్భవం రమ్యం సర్వపాతకనాశనం, సర్వకామప్రదం దేవ తవాంగే ధారయామ్యహం" అనఁగా విష్ణుతేజమునబుట్టి సర్వపాపములఁగొట్టి సర్వకామములనిచ్చు నీపవిత్రము నీదేహ మందర్పించెదనని యర్థముగల మంత్రము మూలమంత్రముతో సంపుటిజేసి దేవుని పాదముల సమర్పించునది. దేవుని కరమందు గట్టవలయునని కొందరు. ఆపైని దేవుని పంచోప చారములఁబూజించి – శ్లో॥"ఆమంత్రితోసి దేవేశ పురాణ పురుషోత్తమ ప్రాతస్త్వాం పూజయిష్యామి సాన్నిధ్యం కురు కేశవ, క్షీరోదధి మహానాగ శయ్యావస్థిత విగ్రహా, అతస్త్వాం పూజయిష్యామి సన్నిధౌ భవతే నమః" అనఁగా నోదేవేశ, పురాణ పురుషో త్తమ, ప్రాతఃకాలమందు నీ పూజ జేసెదను.సాన్నిధ్యము జేయుమను నర్థము గల

మంత్రముచే సాష్టాంగ ప్రణామముజేసి పుష్పాంజలి నీవలెను. ఇట్లధివాసము. ఇచటనంతటను మూలమంత్రమనగ గురూపదిష్టమైన వైదిక మంత్రముగాని తాంత్రిక ముగాని దేవగాయత్రి రూపముగాని గ్రహించునది. రాత్రి సత్కథతో జాగరణముజేసి ప్రాతఃకాలమందు సద్యోధివాసనమైనచో గోవును బిదుకునంతకాలమైన యనంత రము "పవిత్రారోపణాంగభూతం దేవపూజనం పవిత్రపూజనం చ కరిష్యే" యని సంకల్పించి దేవుని బవిత్రమునను ఫలనైవేద్యంతముగ గందాద్యుపచారములఁ బూజించి గంధదూర్వాక్షతలలో గనిష్టపవిత్రము గ్రహించి – శ్లో॥"దేవదేవ నమస్తుభ్యం గృహాణేదం పవిత్రకం, పవిత్రీకరణార్థాయ వర్షపూజాఫలప్రదం, పవిత్రకం కురుష్వాద్య యన్మయా దుష్కృతం కృతం, శుద్ధోభవామ్యహం దేవ త్వత్ప్రసాదాత్సురేశ్వర" అనగా సంవత్సరపూజాఫలమునిచ్చు నీపవిత్రము సమర్పించెదను. నా పాపము బాపుము. నేను శుద్ధుడనగుదునను, నర్థముగల మంత్రము మూలమంత్రముతో సంపుటిజేసి యుచ్చరించి పవిత్రము నీయవలెను. మధ్యమోత్తమపవిత్రములు వనమాలయు నిటులనే మంత్రముఁ జదివి సమర్పించునది. అంగదేవతలకు నామము నుచ్చరించి సమర్పించి మహానైవేద్యము నర్పించి నీరాజనమిచ్చి ప్రార్థింపవలెను. – శ్లో॥"మణి విద్రుమమాలాభిర్మందారకుసుమాదిభిః, ఇయం సాంవత్సరీ పూజా తవాస్తు గరుడ ధ్వజ, వనమాలాం యథా దేవ కౌస్తుభం సతతం హృది, తద్వత్పవిత్రతంతూం స్త్వంపూజాంచ హృదయే వహ. జానతాజానతా వాపి యత్కృతం న తవార్చనం, కేన చిద్విఘ్న దోషేణ పరిపూర్ణం తదస్తు మే మంత్రహీనం క్రియాహీనం భక్తిహీనం సురేశ్వర, యత్పూజితం మయాదేవ పరిపూర్ణం తదస్తు మే. అపరాధ సహస్రాణి క్రియంతేఽ హర్నిశంమయా, దాసోఽ యమితి మాం మత్వాక్షమస్వ పరమేశ్వర" యని ప్రార్థించవలెను. దీనియర్థము మీఁద వ్రాయఁబడెను. శివాదిపవిత్రారోపణ మందు గరుడధ్వజ యనుటకు వృషభధ్వజయని యూహించునది. వనమాలా మను శ్లోకమక్కరలేదు. దేవికైనచో దేవదేవసురేశ్వరి యని స్త్రీలింగము లూహించునది. తక్కునది సమానము. అనంతరమున గురువును బూజించి పవిత్రమిచ్చి బ్రాహ్మణు లకు సువాసినులకు నితరములిచ్చి తాను సకుటుంబముగా ధరించవలెను. అటుపైని బ్రాహ్మణులతో భుజించి బ్రహ్మచర్యాది నియమములతో త్రిరాత్రము పవిత్రములు సమర్పించునది. దేవునికి స్నానాద్యుపచారములు పవిత్రములు తొలగించిచేయునది. ద్రిరాత్రాంతమందుఁ దిరుగ బూజించి పవిత్రములు విసర్జించవలెను. శివాది పవిత్రా రోపణమందు చతుర్దశి పూర్వవిద్ధ గ్రహించునది. ఇట్లు పూర్ణిమయుఁ ద్రిముహూర్త ములు సాయహ్నామందు వ్యాపించు పూర్వవిద్ధయే కావలెను. అష్టమి మొదలగు తిథులును పవిత్రారోపణమునకుఁ బ్రథమపరిచ్ఛేదమందలి సామాన్య నిర్ణయము ననుసరించియే గ్రహించునది. ఇట్లు పవిత్రారోపణవిధి ముగిసెను.

## ఉపాకర్మ కాలము

అందు ఋగ్వేదులకు శ్రావణశుక్లపక్షమున శ్రవణ నక్షత్రము పంచమిహస్త నక్షత్రముననని మూడుకాలములు. అందు శ్రవణనక్షత్రము ముఖ్యము. అది దొరకనిచో

పంచమి మొదలగునది. ఇందులకు కాలతత్త్వ వివేచనమందు సంగ్రహ కారికగలదు. ఎట్లనిన – శ్లో॥“పర్వణి శ్రవణే కార్యం గ్రహసంక్రాంత్య దూషితే, అధ్వర్యుభిర్బహ్వృచైశ్చ కథం చిత్తదసంభవే, తత్రైవ హస్తపంచమ్యాం తయోః కేవలయోరపి” యనగా గ్రహణ ముగాని సంక్రాంతిగాని లేకుండిన పర్వమందుఋగ్వేదులు యజుర్వేదులు నుపాకర్మచేయునది. అవిసంభవింపనిచో హస్తపంచమీ యోగమందైనను కేవల పంచమిఁ గేవలహస్త యందైనను జేయవచ్చునని దినద్వయ మందు శ్రవణ నక్షత్ర మున్నచో ననగాఁ పూర్వదినమందు సూర్యోదయము మొదలు కొని పరదినమందు సూర్యోదయానంతరము మూఁడు ముహూర్తముల పర్యంతమున్న యెడ బరదిన మందే యుపాకర్మ ఏమనిన, ధనిష్ఠాయోగము ప్రశస్తమని యున్నది. త్రిముహూర్తము లకు దక్కువయైనచోఁ బూర్వదినమే సంపూర్ణ వ్యాప్తిగలుగుటచే గ్రహింపదగును. పూర్వదినమందు సూర్యోదయమునకు లేనిచోఁ బరదినమందు రెండు ముహూర్తము లున్నను నదియే గ్రాహ్యము. పూర్వమందు త్తరాషాఢా యోగము నిషిద్ధము. ఇక పూర్వదినమందుత్తరాషాఢా వేధయుఁ బరమందు రెండుముహూర్త ములకంటెఁ దక్కువయునగుచో బంచమ్యాదిగౌణ కాలమే గ్రహించునది. పంచమియు హస్తయు నుదయమున ముహూర్తత్రయవ్యాప్తిగలిగిన ముఖ్యము. అదిలభింపనిచోఁ బూర్వవిధ మును గ్రహింపవచ్చును. ఇట్లు భాద్రపద శుక్లపక్షమందును శ్రవణము పంచమి హస్త యను కాలత్రయనిర్ణయము గ్రహించునది. అట్లు ఋగ్వేదులు పూర్వా హ్ణమందు చేయవలెను.

## యజుర్వేదుల కుపాకర్మ నిర్ణయము

అందు ఋగ్వేదులకు శ్రవణమువలె యజుర్వేదుల కందఱకును శ్రావణ పూర్ణిమ ముఖ్యకాలము. అది ఖండతిథియైనచో ననగాఁబూర్వదినమందుదయాంతర ముహూర్తముపై బ్రవేశించి పరదినమందారు ముహూర్తములమట్టుకునున్నచో సర్వ యజుర్వేదులకు బరదినమే. ఒకవేళ శుద్ధాదికమై దినద్వయమందు సూర్యోదయవ్యాప్తి గలిగెనేని నపుడిందఱకునుఁ బూర్వమే. ఇఁక పూర్వదినమందుదయముహూర్తా నంతరమున బ్రవేశించి పరదినమందారుముహూర్తములకు దక్కువగా రెండు మూడు న్నచోనపుడు తైత్తిరీయు లుత్తరదినము గ్రహించునది. యితర యజుర్వేదులు పూర్వము గ్రహించునది. ఒకవేళ పూర్వదినమున ముహూర్తానంతరమందుఁ ప్రవేశించి పరదినమున రెండు ముహూర్తములకును దక్కువ యయ్యెనేని క్షయవశ మున నేమియులేకున్నను నందరు యజుర్వేదులు పూర్వమునే గ్రహించునది. హిరణ్యకేశీ తైత్తిరీయులకు శ్రావణపూర్ణిమ ముఖ్యకాలము. గ్రహణాదులచే నది సంభ వింపనిచో శ్రావణమందుహస్త గ్రహింపవలెనుగాని పంచమి వారివారి సూత్రముల విధింప కుండుటచే గ్రహింపఁగూడదు. ఇట్లు భాద్రపదమందును కాలద్వయమే యని గ్రహింపవలెను. ఖండతిథియగుచో మీదఁజెప్పిన నిర్ణయమే. హస్తనక్షత్రమయినను సూర్యోదయము మొదలు సంగమకాలము వరకు వ్యాపించినచో, గ్రాహ్యములేనిచో, బూర్వవిద్ధనేగ్రహించునది. ఆపస్తంబ సూత్రస్థులకు శ్రావణపౌర్ణమాసి ముఖ్యము.

అదిలేనిచో భాద్రపద పూర్ణిమ గావలెనని విశేషము బౌధాయనులకును శ్రావణపూర్ణిమయే ముఖ్యము. దోషసంభావనచే నదిలేనిచో, నాషాఢపూర్ణిమ గ్రాహ్యము. వీరికి గూడ ఖండతిథియగు నపుడు మీఁదఁజెప్పినటులనే నిర్ణయము. ఇఁక కాణ్వులు మాధ్యందినులు మొదలగు కాత్యాయనులకు శ్రవణయుక్తముగాని, కేవలముగాని, శ్రావణపూర్ణిమయును హస్తయుక్తముగాని కేవలముగాని శ్రావణ పంచమియును ముఖ్యకాలము. కనుక కేవలశ్రవణమందును గేవల హస్తయందును వారు చేయఁ గూడదు. శ్రావణమందు విఘ్నదోషమున్నచో భాద్రపదపూర్ణిమా పంచముల జేయ వలెను. తిథిఖండమైనపుడు షణ్ముహూర్తములకంటె నాధిక్యముగల పరదినము గ్రహించునది. తక్కువయైనచో బూర్వమే గ్రహించునది యని మీఁదఁజెప్పఁబడినది. ఇఁక సామవేదులకు భాద్రపదశుక్ల పక్షమున హస్తనక్షత్రము ముఖ్యకాలము. సంక్రాంత్యాదులచే నది సంభవింపనిచో శ్రావణమాసమందు హస్త గ్రహింపవలెనని నిర్ణయసింధువు. మరికొందరది సంభవింపనిచో శ్రావణపూర్ణిమయందు ఉపాకర్మ జేసి భాద్రపదహస్తవచ్చు వఱకు బఠింప గూడదు. అటుపైని బఠింపవలె నందురు. హస్తఖండమైనచో ననఁగా దినద్వియమందు నపరాహ్ణపూర్ణ వ్యాప్తిగాని తదేక దేశ స్పర్శగాని యున్నచో బరదినమే యుపాకర్మకాలము. అపరాహ్ణ పూర్ణవ్యాప్తి పూర్వదిన మందు మాత్రమేయైన బూర్వదినమే గ్రాహ్యము. సామగుల కపరాహ్ణమే యుపాకర్మ కాలమువిధింపఁబడినది. పూర్వదినమందే యపరాహ్ణైకదేశ స్పర్శయుండినను దిన ద్వయమందును లేకుండినను బరదినమే గ్రహించునది. ప్రాతస్సంగమము లుపాకర్మ కాలమని సూత్రముగల సామవేదులకు పూర్వమందపరాహ్ణవ్యాప్తియున్నను విడిచి పరదినమందు సంగమకాలము పైవ్యాపించిన హస్తగ్రహింపవలెను. సూర్యుఁడు సింహస్థుఁడైనయపు దుపాకర్మయని విధించుట శ్రావణమందు హస్తగాని పూర్ణిమగాని సూర్యుఁడు సింహస్థుఁడై యుండఁగా నైనచో నుపాకర్మచేయవలెనుగాని కర్కటకమం దున్నపుడు గూడ దని సామగులకు శ్రావణమందలి హస్తపర్వములకు వ్యవస్థజేయు తాత్పర్యముగలది. ఇతరశాఖులకు రవి సింహస్థుఁడగుచో విధియులేదు. నిషేధమును లేదు.

## అధర్వణవేదుల కుపాకర్మ నిర్ణయము

అధర్వణవేదులకు శ్రావణపూర్ణిమగాని భాద్రపదపూర్ణిమగాని గ్రాహ్యము. ఖండతిథిలో నుదయము మొదలు సంగమకాల వ్యాప్తిని గ్రహించవలెను. సర్వశాఖులకు శ్రావణ భాద్రపద మాసములలో దమతమ శాఖలకు సూత్రోక్తకాలమందు గ్రహణ సంక్రాంత్యాశౌచాది దోషసంభావనగలుగుచో సర్వథా కర్మలోపమువచ్చును గనుక యితర శాకోక్తకాలమునైన గ్రహించుట యావశ్యకము.

## సామవేదుల కుపాకర్మ నిర్ణయము

అపుడాపస్తంబులు బౌధాయనులు సామగులు మొదలగువారికి శ్రావణ భాద్రపదగత పంచమిపూర్ణిమాదులు సాధారణముగ గ్రహించుట ప్రాప్తింపగా నర్మదానది

కుత్తరదేశమందు సూర్యుడు సింహస్థుడుకాగా పంచమి మొదలగునవి గ్రహించుటయు, నర్మదా దక్షిణభాగమందు రవికర్కటకస్థుడు కాగా బంచమి మొదలగునవి గ్రహించుటయు ననివ్యవస్థ కౌస్తుభమందున్నది. కనుక ఋగ్వేదులకును సర్వదా కర్మలోపమువచ్చునపుడు పూర్ణిమయుగూడ సింహస్థితుఁడును కర్కస్థితుఁడును వ్యవస్థచే గ్రాహ్యమని నాకుఁదోచుచున్నది. సమస్త శాఖలవారును శ్రావణమాసము యొక్క ముఖ్యకాలమందు వర్షములేకుండుటచే వ్రీహ్యాదు లంకురించకున్నను నాశౌచాదులు వచ్చినను భాద్రపద శ్రావణాదులయందు జేయకతీరదు. ఓషధిప్రాదుర్భావము లేకున్నను శ్రావణమందే చేయవలెనని కర్కాదిమతము. సర్వశాఖలవారికిని గృహ్యసూత్రమందుక్తమైన ముఖ్యకాలనిర్ణయతిథియందు గ్రహణముగాని సంక్రాంతిగాని యున్నచో నవిలేని పంచమ్యాదులు గ్రహింపవలెను. అట్టి గ్రహణముగాని సంక్రాంతిగాని యుపాకర్మతిథికి బూర్వదినమందైన యర్ధరాత్రము మొదలుకొని యాతిథి యర్ధరాత్రమువరకు నెనిమిది జాములలోగా నుండెనేని శ్రవణనక్షత్రముచేగాని పూర్ణిమచేగాని స్పృశింపఁబడకున్నను వాని నిషిద్ధముచేయును. కొందఱు మీఁదఁ జెప్పిన యామాష్టకమును దప్పియున్నను సంక్రాంత్యాదు లుపాకర్మకునిర్ణీతములైన తిథినక్షత్రముల స్పృశించినచో నిషేధమువచ్చు ననిరి.

## బ్రహ్మచారులకు ప్రథమోపాకర్మ నిర్ణయము

గురు శుక్రాస్తాదులందును మలమాసాదులందును బృహస్పతి సింహస్థుఁడగునపుడును చేయఁగూడదు. ద్వితీయాద్యావృత్తిలో మలమాసముదప్ప గురుశుక్రాస్తాదులందు జేయవచ్చును. రెండవపర్యాయమయిన యుపాకర్మయు మలమాసమందు నిషిద్ధము. ప్రథమోపాకర్మ స్వస్తివాచనము నాందీశ్రాద్ధము మొదలైనవి చేసి చేయవలెను. నూతనోపనీతులకు శ్రావణమాసమందలి పంచమీ హస్త శ్రవణాదికాలమున గురుశుక్రాస్తాది ప్రతిబంధముచే నుపాకర్మారంభములేనిచో భాద్రపదగతములైన పంచమ్యాదులు గ్రహింపవలెను. బ్రహ్మచారికి విశేషము. శ్లో॥"మౌంజీం యజ్ఞోపవీతం చ నవదండం చ ధారయేత్, అజినం కటిసూత్రం చ నవవస్త్రం తథైవచ" అనఁగా ముందు దర్భత్రాడును జన్నిదమును పలాశదండమును లేడిచర్మమును మొలత్రాడును వస్త్రమునివి ప్రతిసంవత్సరము క్రొత్తవిధరింపవలెనని యర్థము. ఉపాకర్మయునుత్సర్జనమును బ్రహ్మచారికిని సమావర్తనమనగా గురుదక్షిణనిచ్చి విద్యాస్నానము జేయుటలిట్టి వ్రతస్థుఁడును గృహస్థుఁడును వానప్రస్థుఁడును జేయకతప్పదు. ఉత్సర్జనకాలమిచట విస్తరింపఁబడదు. శ్లో॥"ఉపాకర్మదినేథవా" యనఁగా ఉపాకర్మదినమందు నుత్సర్జనము విధింపఁబడినందున నిపుడు సర్వశిష్టులు నుపాకర్మదినమందే యుత్సర్జనము జేయుట యాచారమైయున్నందునను దాని నిర్ణయమున కుపయోగములేదు. ఈ యుపాకర్మయు నుత్సర్జనమును నొకవేళ మరికొందరు ద్విజులతో గలసి చేసినచో లౌకికాగ్ని యందే చేయవలెను. తానొకడే చేసెనేని తనస్మార్తాగ్ని యనఁగ నౌపాసనాగ్ని యందే చేయవలెనుగాని లౌకికాగ్ని యందుగూడదు. ఇఁక ఋగ్వేదులు మొదలగు వారిలో దాను చతురవదానపక్షమైన వారును దనవంటి చతురవదానపక్షము వారితో

గలసి యుపాకర్మాదులు సేయుచో నందొకఁడైన జామదగ్న్యాదిగోత్రుఁడు పంచావ దానపక్షమువాఁడు గలసినచో దానును నతనిననుసరించి పంచావత్తమే జేయవలెను. చతురవత్తులకును బంచావత్తిపక్షము వికల్పముగ విధింపఁబడినందున కర్మవై గుణ్యము లేదు. ఈయుపాకర్మోత్సర్జనములు చేయనిచో దోషము విధింపఁబడినందున నివినిత్యములు. కొందఱు నిర్ణయసింధునందు మాత్రమే యకరణమందు ప్రాజాపత్య కృచ్ఛ్రముగాని యుపవాసముగాని విధింపఁబడినది. మఱియే గ్రంథమందును గాన రాదనిరి. మఱియు నీరెంటింయదును ఋషిపూజయు విధింపఁబడినది. అట్టి ఋష్యాది నిర్ణయముత్సర్జనమందే గావలయును. ఇక్కడ వివాహానంతరము తిలతర్పణ మందు దోషములేదు. దీనికి సంకల్పము "అధీతానాం ఛందసామాప్యాయన ద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం ఉపాకర్మదినే అధ్యోత్సర్జనాఖ్యం కర్మ కరిష్యే" యని ఉపాకర్మకు "అధీతానామధ్యేష్యమాణానాం చ ఛందసాం యాతయామతానిదాసేనాప్యాయనద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థముపాకర్మ కరిష్యే"యని మిగిలిన సర్వప్రయోగ విశేషముదమ తమ గృహ్యసూత్రానుసారముచే దెలియవలెను. ఇక్కడనదులకు రజోదోషములేదు. బ్రహ్మాదిదేవతలకు ఋష్యాదులకును జలమందు సాన్నిధ్యము గనుక స్నానముజేసిన సర్వదోషక్షయము. ఋషిపూజన స్థానమందున్న జలమును స్పృశించి ద్రావినచో సర్వపాపక్షయము సర్వకామావ్యాప్తియు ఇది సర్వశాఖలకు సాధారణ నిర్ణయము.

## రక్షాబంధనము

ఈ పూర్ణిమయందే భద్రలేకుండినచో నుదయము మొదలారు గడియలకు నెక్కుఁడుగా వ్యాపించునపు డపరాహ్ణమందైనను ప్రదోష మందైనను జేయునది. మూఁడు ముహర్తములకు దక్కువయైనచో బూర్వదినమందు భద్రలేనిచో బ్రదోషాదు లందు జేయవలెను. ఇది గ్రహణ సంక్రాంతి దినమందును జేయవచ్చును. దీనికి మంత్రము శ్లో॥"యేన బద్ధోబలీ రాజా దానవేంద్రో మహాబలః, తేన త్వామభి బధ్నామి రక్షమాచలమాచల" అనఁగా మహాబలుఁడైన రాక్షసేంద్రుఁడు బలిచక్రవర్తిని గట్టిన వానిచే నిన్ను గట్టుచున్నాను. ఓ రక్షాబంధవమా ! నీవు చలింపకుమని యర్థము. ఈ పూర్ణిమయందే హయగ్రీవోత్పత్తి.

## పూర్ణిమ నిర్ణయము

శ్రావణపూర్ణిమ కులధర్మాదులకు ద్రిముహూర్తములు, సాయాహ్న వ్యాప్తి గల్గినచో బూర్వవిద్ధయే గ్రహించవలయును. అంతకుతక్కువయైనచో బరదినమే గ్రహించునది. ఈ శ్రావణపూర్ణిమయందే ఋగ్వేదులకు శ్రవణాకర్మయు సర్పబలియు రాత్రి విధింపఁబడినది. తైత్తిరీయులకు సర్పబలిమాత్రమే. కాత్యాయనులకు సామగు లకు రెండును విధింపఁబడినవి.

## శ్రవణాకర్మ సర్పబలి

ఆశ్వయుజ పూర్ణిమాప్రత్యవరోహణము మొదలగు పాకసంస్థలును వాటి కాలములో జేయనియెడ ప్రాజాపత్య కృఛ్రము ప్రాయశ్చిత్తము చేసుకొనుటయేగాని

కాలాంతరములేదు. శ్రవణాకర్మ మొదలగు సంస్థలు పత్ని రజస్వలయైనను జేయ వచ్చును. ప్రథమారంభమునిషిద్ధము. ఇక్కడ పూర్ణిమ యస్తమయము మొదలుకొని ప్రవర్తించుకర్మ కాలమంతయు వ్యాపించినచో పూర్వదినమే గ్రాహ్యము. దినద్వయ మందట్లు సంభవించినను లేకున్నను బరదినమే ప్రయోగము తమతమ సూత్రమున దెలియవలెను.

## సంకష్టహరణ వ్రతము

కృష్ణచతుర్థులన్నిటనుయావజ్జీవముగగాని యిరువదియొక వర్షములుగాని యొక సంవత్సరముగాని సంకష్టచతుర్థీ వ్రతము జేయవలెను. అశక్తుండైనచో బ్రతి వర్ష శ్రావణచతుర్థి జేయవలెను. అపుడు చంద్రోదయ వ్యాప్తితిథికి గావలెను. ఉద్యాపన ముతో వ్రతానుష్ఠాన ప్రయోగము కౌస్తుభమున దెలియవలెను.

## జన్మాష్టమీ వ్రత నిర్ణయము

అపుడష్టమి రెండువిధములు. శుద్ధయు విద్ధయునని, పగలుగాని రాత్రిగాని సప్తమీ యోగము లేక యెపుడెంతయుండునో యపుడంతయు శుద్ధయనఁబడును. అట్లు సప్తమీ యోగముగల్గి యెపుడెంతసంభవించునో యపుడంతయే విద్ధయగును. అదియు రెండువిధములు.

## జన్మాష్టమీ జయంతుల నిర్ణయము

రోహిణీ యోగముగలదియు లేనిదియునని అందు రోహిణీయోగములేని కేవలాష్టమికి భేదములు. సప్తమి 59–59. అష్టమి 58–5. ఇది శుద్ధాష్టమియందు సందేహములేదు. యేమనిన; రెండవకోటిలేదు. సప్తమి 2. అష్టమి 55. ఈవిద్ధ యందును సందియములేదు. దినాంతరమందు లేకుండుటచే రెండవపక్షము లేదు. మఱేమనిన; దినద్వయమందును గేవలాష్టమియున్న యెడ నాలుగు పక్షములు. యెట్లనిన; పూర్వదినమందే నిశీథవ్యాపిని 1. పరదినమందే యట్టివ్యాప్తి 2. దినద్వయ మందునట్టి వ్యాప్తి 3. రెండుదినముల నట్టి వ్యాప్త్య భావముండుట 4. నిశీథమనగ రాత్రి మధ్యమభాగము స్థూలదృష్టిచేననగా నందాజుగా నెనిమిదవముహూర్తమగును. అందు పూర్వదినమందే నిశీథ వ్యాప్తియెట్లనిన; సప్తమి 41. అష్టమి 42. అపుడుసప్తమి గలసిన యష్టమియు పోషణము జేయదగినది. మఱియు నష్టమి 60–4 ఇది శుద్ధాధిక. పూర్వదినమే గ్రహించునది. పరదినమందే నిశీథవ్యాప్తి యెట్లనిన; సప్తమి 47. అష్టమి 46. అపుడు పరదినమేయుపోషణార్హము దినద్వయమందు నిశీథవ్యాప్తి యెట్లనిన; సప్తమి 42. అష్టమి 46. అపుడును పరదినమే గ్రహించునది. దినద్వయ మందు నిశీథ వ్యాప్తి లేకుండుట యెట్లనిన; సప్తమి 47. అష్టమి 42. అపుడును బరదినమే గ్రహించునది. అందు సప్తమీయుక్తమైన యష్టములన్నియు రాత్రి పూర్వార్థ మునంతమునగలామాత్రమైన నష్టమియుండునవియే గ్రహింపబడును. ఇట్లు నవమీ యుతాష్టములును రాత్రియుత్తరార్ధమునకు బూర్వము కలామాత్రమైన నష్టమి గలుగుచో బరనిశీథవ్యాపిను లనబడును. లేనిచో లేదు. అనగా పూర్వదినమున పూర్వ

భాగమందే పరదినమున పరభాగమందే యష్టమియున్నచో నిశీధ వ్యాప్త్యభావపక్షమని యెఱుంగునది. ఇట్లు చెప్పఁబోయెడు రోహిణీయుక్త భేదములందును దెలియునది. రోహిణీ యోగమునకును మూఁడుపక్షములు. యెట్లనిన; పూర్వదినమందు మాత్రము నిశీధమందష్టమీరోహిణులకు యోగము 1. అట్లు పరదినమందే యోగము 2. రెండు దినములందు నట్టియోగముండుట 3. పూర్వదినమందే యుండుట యెట్లనిన; సప్తమి 40. కృత్తి. 35. అష్టమి 46 రోహిణి 36 అపుడు పూర్వవిద్ధయగునష్టమియే యుపోషణార్హము. పరదినమందే నిశీధమున రోహిణీయోగ మెట్లనిన; సప్తమి 42. కృత్తిక 50. అష్టమి 47. రోహిణి 46. అపుడు పరదినమే గ్రహించునది. రెండు దినములను నిశీధమందు రోహిణీయోగ మెట్లనిన; సప్తమి 42. కృత్తిక 43. అష్టమి 47. రోహిణి 48. అపుడు పరదినమే గ్రహించునది. ఇక రోహిణీయుక్తాష్టమిలో దిన ద్వయమందును నిశీధమున రోహిణీ యోగాభావము బహువిధములుగా సంభవించును. యెట్లనిన; పరదినమందే నిశీధ వ్యాపినియగు నష్టమి యాదినమందే నిశీధము కంటె నన్యకాలమున రోహిణీయోగము గలదియని యొకపక్షము. యెట్లనిన; సప్తమి 47. అష్టమి 50. కృత్తిక 46. ఈ పక్షమందు పరమయిన యష్టమియే గ్రాహ్యము. ఇట్లు పూర్వదినమందే నిశీధవ్యాపినియగు నష్టమి యాదినముననే నిశీధముకంటె నితరకాలమున రోహిణీయోగముగలదియను పక్షమునందును ప్రథమ పక్షతుల్యమగుటచే పూర్వదినమే గ్రాహ్యము. దినద్వయమందును నిశీధము కంటె నితర కాలమున రోహిణీ యోగముగలదియుపరదినమందే నిశీధ వ్యాపినియు నని రెండవపక్షము. యెట్లనిన; సప్తమి 48. కృత్తిక 30. అష్టమి 48. అపుడును బరమే గ్రహించునది. ఇట్లు దినద్వయమందును నిశీధముకంటె నితరకాలమున రోహిణి యోగము గలిగి పూర్వదినమందే నిశీధ వ్యాపినియగు నదియును పక్షమునను ననగా సప్తమి 25. కృత్తిక 48. అష్టమి 20. రోహిణి 43. అపుడును పరమే గ్రహింపవలెను. రోహిణీ యోగము సమముగానున్నప్పటికిని పూర్వము సప్తమీ వేధచే నిషిద్ధము. మఱియు అష్టమి 60-4. కృత్తిక 50. ఇపుడు పూర్వమే గ్రహించునది. అహోరాత్రముల రోహిణీయోగము రెండిటికి సమానమై పూర్వము శుద్ధము సంపూర్ణ వ్యాప్తిగలదియు ననియెఱుంగునది. దినద్వయమందు నిశీధ వ్యాప్తిగలిగి పరదినమందే నిశీధాతిరిక్త కాలమున రోహిణీ యోగమున్నదని నాల్గవ పక్షము. యెట్లనిన; సప్తమి 43. అష్టమి 49. కృత్తిక 46. అపుడు పరదినమే గ్రహించునది. ఇట్లు దినద్వయమందును నిశీధవ్యాప్తిగలిగి పూర్వదినమందే నిశీధాతిరిక్త కాలమున రోహిణీయోగము గలిగినదని యైదవ పక్షము. యెట్లనిన; సప్తమి 41. రోహిణి 43. అష్టమి 47. ఇపుడు పూర్వదినమే యుపవాసార్హము. ఇఁక దినద్వయమందును నిశీధవ్యాప్తిగలిగి దినద్వయమందును నిశీధాతిరిక్త కాలమున రోహిణీ యోగము గలది. యని యారవపక్షము. యెట్లనిన; సప్తమి 42. కృత్తిక 48. అష్టమి 58.అష్టమి 42. అపుడు పరమైన యష్టమియే గ్రహించునది. ఈ పక్షమందే పరదినమందు మాత్రముగాని దినద్వయమందునుగాని నిశీధాతి రిక్తకాలమున రోహిణియుక్తమైనను

పరదినమే గ్రహించునది యని చెప్పకుండఁగనే సిద్ధించును. పూర్వదినమందే నిశీథ వ్యాప్తి గలిగి పరదినమందే నిశీథాతిరిక్త కాలమున రోహిణియుక్తమని చరమపక్షము. యెట్లనిన; సప్తమి 30. అష్టమి 25. కృత్తిక 59 మరియు అష్టమి 60–4. అష్టమీ శేషదినేకృత్తికా 5. ఈరెంటియందు పరమయినయష్టమియే గ్రహింపదగును. స్వల్ప మయినను రోహిణియోగము ప్రశస్తము గనుక ముహూర్తమాత్రమయినను పరాష్టమీ గ్రహించి పూర్వదినమందలి నిశీథవ్యాప్తిని గూడ విడువవచ్చును. అన్ని పక్షముల యందును బరదినమందు ముహూర్తమనగ రెండుగడియలకు తక్కువ యష్టమియుండె నేని పూర్వమే గ్రహింపవలయును. పరమక్కరలేదని పురుషార్థచింతామణిలో నున్నది. పరదినమందే నిశీథ వ్యాపినియై పూర్వదినమందే నిశీథాతిరిక్త కాలమున రోహిణీ యుక్తమనిపక్షము. యెట్లనిన; సప్తమి 48. రోహిణి 55. అష్టమి 48. ఇపుడుపరమే గ్రహించునది. విద్ధయందు నిశీథానంతరమున రోహిణీయోగ మప్రయోజకమని యెఱుంగునది. ఇట్లు విస్తరించి చెప్పినపక్షములన్నిటికి సంక్షేపముగ నిర్ణయము పురుషార్థచింతామణిలోనున్నది. శుద్ధ సమాష్టమియందును శుద్ధన్యూనాష్టమియం దును మరియు విద్ధసమయందును విద్ధన్యూనయందును గేవలాష్టమియందును సందేహములేదు. శుద్ధాధిక యయినను గేవలాష్టమి పూర్వదినమే గ్రహించునది. దినద్వయమందును నిశీథ వ్యాప్తియున్నను తదభావమున్నను పరదినమే యని. ఇక రోహిణీయోగమందును శుద్ధసమకును శుద్ధన్యూనకును గొంచమయినను రోహిణీ యోగమున్నచో సందేహములేదు. శుద్ధాధికయందు పూర్వదినమందు గాని దిన ద్వయమందుగాని రోహిణీయోగమున్నచో బూర్వదినమే పరదినమందే రోహిణీ యోగమున్నచో ముహూర్త మాత్రమయినను బరదినమందే రోహిణీ యోగమున్నచో ముహూర్తమాత్రమయినను బరదినమేయని గ్రహించవలెను. ఇక విద్ధాధికయందు బూర్వదినమందే నిశీథమునకు బూర్వముగాని నిశీథమందుగాని రోహిణీ యోగ మున్నచో బూర్వదినమే దినద్వయమందునుగాని పరదినమందు మాత్రమే కాని నిశీథ మందైనను తదితర కాలమందైనను రోహిణీయోగమున్నచో బరదినమే యనియు సంగ్రహము. ఇట్లు కౌస్తుభాది గ్రంథములచేననుసరింపఁబడిన మాధవ మతానుసారమున జన్మాష్టమి నిర్ణయింపఁబడెను. ఇక్కడ గొందఱు కేవలాష్టమి జన్మాష్టమియనియు నదియే రోహిణితో గూడిన జయంతి యగుననియు వ్రతైక్యమును జెప్పిరి. మరికొందరు జన్మాష్టమివేరు జయంతివేరనియు రోహిణీయోగము లేనిచో జయంతిలోపించునుగాని జన్మాష్టమీవ్రతము చేయవలసినదే. ఒకవేళ శ్లో॥ "యస్మి న్వర్షే జయంత్యాఖ్యయోగో జన్మాష్టమీ తథా, అంతర్భూతా జయంత్యాంస్యాత్"అని. అనగా జన్మాష్టమిలో జయంతియోగము వచ్చునపుడు జన్మాష్టమి జయంతిలో నంత ర్భూతమగునని యున్నందున జయంతీ దినమున నిశీథ మనేకర్మకాలమందష్టమి లేకున్నను "సాతిథిస్సకలా జ్ఞేయా"యని సాకల్యవచనముచే వ్యాప్తిని గ్రహించి వ్రత ద్వయమును జయంతీదినమందే తంత్రముచే జేయవలెను. వ్రతద్వయమునకును చేయనిచో ప్రత్యవాయమునుచేసినచో నిష్టావ్యాప్తియు విధింపఁబడినందున నిత్యకామ్య

స్వరూపముల నిగ్రహించునది. కనుక నిశీథవ్యాప్తిగల పూర్వదినమందు జన్మాష్టమి జేసి జయంతీదినమందు బారణసేయగూడదని చెప్పిరి. నిర్ణయ సింధువు నందు మీఁద జెప్పినట్లు మాధవమతముజెప్పి హేమాద్రిమతముచే జన్మాష్టమీ వ్రతమే నిత్యము జయంతీవ్రతము నిత్యమైనను కలియుగమందు లోపించినది. కనుక కొందరు చేయరని చెప్పి తనమతమున బూర్వదినమందే నిశీథమం దష్టమియు బరదినమందే నిశీథాతిరిక్త కాలమున జయంతీయోగ మున్నచో నుపవాసద్వయము చేయవలెను. చేయనియెడ వ్రతద్వయము నిత్యము గనుక ప్రత్యవాయము వచ్చును. ఇఁక జయంతియందంతర్భావము జెప్పుట మూర్ఖుల వంచనసేయుట మాత్రమే యని చెప్పఁబడినది. అయినను కౌస్తుభాది నవీన గ్రంథము లనుసరించిన మాధవ మతముచే జయంతి కంతర్భావముజేసి జన్మాష్టమియే జేయవలెనని నాకుఁదోఁచు చున్నది. ఈ వ్రతమందు బుధసోమవార యోగు ప్రాశస్త్యమును మాత్రము జెప్పును గాని రోహిణీయోగువలె పూర్వపరనియామకముగాదు. ఇఁక ద్వితీయదినమందు భోజనరూపమయిన పారణము వ్రతాంగముగ విధింపఁబడినది. దానికి కాలము విచారింపఁబడును. కేవలతిథ్యుపవాసమయినచో తిథ్యంతమున బారణము. నక్షత్ర యోగముగల తిథినుపవసించినచో రెండిటియంతమున బారణము. ఒకవేళ నుభయాంతము రాత్రియందే కలిగి పగలొక్కదానియంతమే దొరకిననపుడే పారణముగాని రాత్రి నర్కరలేదు. పగ లొకదాని యంతము దొరకనిచో రాత్రి నిశీథములోగా నేది లభించిన నదఁగా తిథి నక్షత్రోభయాంతముగాని యేకతరాంతము గాని దొరికినపుడే భుజింపవలెను. ఇట్లర్ధరాత్రమునకు సమీపక్షణమందు దొరికి నపుడే పారణము. భోజనకాలము సంభవింపనిచో బారణ ప్రతినిధిగా ఫలాహారము జేయవచ్చును. కొందరట్టిచో నిశీథమందు బారణనిషిద్ధము గనుక నుపవాసము జేసి తృతీయదినమందు భోజన మనిచెప్పుదు రదియుక్తముగాదు. అశక్తుఁడైనచో నొకదాని యంతము లేకున్న నుత్సవాంతమందు బ్రాతఃకాలపూజాంతముననే పారణము చేయవలెను.

## వ్రతప్రయోగము

ఇఁక సంక్షేపముగ వ్రతవిధి జెప్పఁబడును. ప్రాతఃకాలమున నిత్య కర్మజేసి ప్రాఙ్ముఖుఁడై దేశకాలముల నుచ్చరించి యపుడు సప్తమ్యాదులున్నప్పటికిని ప్రధాన మైన యష్టమినే యుచ్చరించి "శ్రీకృష్ణప్రీత్యర్థం జన్మాష్టమీ వ్రతం కరిష్యే" యనియు జయంతీ యోగమున్నచో "జన్మాష్టమీవ్రతం జయంతీ వ్రతం చ కరిష్యే" యని సంకల్పించవలెను. రాగిపాత్రయందు జలము గ్రహించి శ్లో॥ "వాసుదేవం సముద్దిశ్య సర్వపాప ప్రశాంతయే, ఉపవాసం కరిష్యామి జన్మాష్టమ్యాం నభస్యహమ్" అని సంకల్పించిఅశక్తుఁడైనచో "ఫలాని భక్షయిష్యామి" యని యూహించునది. శ్లో॥"ఆజన్మ మరణం యావద్యన్మ యాదుష్కృతం కృతం, తత్ప్రణాశాయ గోవింద ప్రసీద పురుషోత్తమ" అనఁగా జన్మ మొదలు మరణ పర్యంతమగు నాపాపములు నశించుటకే వ్రతమాచరించెదను. నాయందు ప్రసాదింపు మోపురుషోత్తమ! యని పాత్రస్థమైన

యుదకము విడుచునది. అనంతరమున సువర్ణము, రజతము, మృత్తు మొదలగు వానిలో నొకదానిచే నిర్మింపఁబడినదిగాని గోడ మొదలగు వానిపై వ్రాయఁ బడినదిగాని ప్రతిమను కులాచారము చొప్పున జాగ్రత్త పెట్టవలెను. ఎట్లనిన; శయ్య యందు బండుకొనియున్న దేవకి స్తనముపానము చేయుచున్న శ్రీకృష్ణ ప్రతిమను జయంతీ యోగమున్నచో మఱియొక దేవకి యుత్సంగముపై మఱియొక శ్రీకృష్ణ ప్రతిమనుంచి పర్యంకమందున్న దేవకిపాదము లొత్తు లక్ష్మీదేవినుంచి గోడ మొదలగు వానియందు ఖడ్గధరుఁడైన వసుదేవుని నందుని గోపీగోపకులను లిఖించి మఱియొక ప్రదేశమందు మఱియొక శయ్యపై బ్రసవించిన కన్యకతోఁ గూడినయశోదను మఱియొక శయ్యపై బ్రసవించిన కన్యకతోఁగూడిన యశోదను మఱియొక పీఠ మరు వసుదేవదేవకీనంద యశోదా శ్రీకృష్ణ రామచండికల ప్రతిమలేడిటి నుంచ వలెను. ఇన్ని ప్రతిమల జేయుట కశక్తుఁడగుచో వసుదేవాది చండికాంతములైన సప్త ప్రతిమలను మాత్రమేనియు యధాచారముగను యధాశక్తిగనుజేసి తక్కిన వారిని ధ్యానించవలెనని తోచుచున్నది. అర్ధరాత్రమునకు ముందు స్నానముజేసి "శ్రీకృష్ణ ప్రీత్యర్థం సపరివార శ్రీకృష్ణపూజాం కరిష్యే" యని సంకల్పించి న్యాసములను శంఖాది పూజను నిత్యమువలె జేసి శ్లో॥"పర్యంకస్థాం కిన్నరాద్యైర్యుతాం ధ్యాయేత్తు దేవకీం, శ్రీకృష్ణబాలకం ధ్యాయేత్పర్యంకే స్తనపాయినం, శ్రీవత్సవక్షసంశాంతం నీలోత్పలదళచ్ఛ విం, సంవాహయంతీం దేవక్యాః పాదౌ ధ్యాయేచ్చ తాం శ్రియమ్" అనఁగా మీఁ ద జెప్పినరీతిని తల్పమందుపండుకొని లక్ష్మీదేవిచే పాదములొత్తఁబడుచున్న దేవకీస్తన మును పానముజేయు నీలోత్పలశ్యాముఁడు శ్రీవత్సాంకుఁడైన శ్రీకృష్ణమూర్తిని ధ్యానించి "దేవక్యైనమః" యని దేవకీ నావాహనముజేసి మూలమంత్రముచే గాని పురుషసూక్త ఋక్కుచేగాని నామముచే "శ్రీకృష్ణాయ నమః" యని కృష్ణు నావాహన మును లక్ష్మ్యా వాహనమునుజేసి "దేవక్యైనమః, వసుదేవాయ నమః, యశోదాయై నమః, నందాయ నమః, శ్రీకృష్ణాయనమః, రామాయనమ,. చండికాయైనమః" యని తత్తన్నామములచే నావాహనముజేసి లిఖిత దేవతలను "సకలపరివార దేవతాభ్యో నమః" యని యావాహనముజేసి మూలమంత్రముచేగాని సూక్త ఋక్కుచేగాని "అత్రావాహిత దేవక్యాది పరివారదేవతా సహిత శ్రీకృష్ణాయ నమః" యని యాసన పాద్యార్ఘ్యాచమనీయాభ్యంగస్నానముల నిచ్చి పంచామృతస్నానాంతమున జందన లేపనముఁ జేయునది. శుద్ధజలాభిషేకాంతమున వస్త్రయజ్ఞోపవీత గంధపుష్పములు ధూపదీపములును. శ్లో॥"విశ్వేశ్వరాయ విశ్వాయ తథా విశ్వోద్భవాయ చ, విశ్వస్య పతయే తుభ్యం గోవిందాయ నమో నమః యజ్ఞేశ్వరాయ దేవాయ తథాయజ్ఞోద్భ వాయ చ, యజ్ఞానాం పతయే నాథ గోవిందాయ నమోనమః" అను మంత్రముల మూల మంత్రముతో గలపి యుపచారము లీవలెను. శ్లో॥ ॥జగన్నాథ నమస్తుభ్యం సంసారభయనాశన, జగదీశ్వరాయ దేవాయ భూతానంపతయే నమః" అను మంత్ర ముచే నైవేద్యము. మూలమంత్రము మొదలగునవి యన్ని యుపచారములలో గలుప వలెను. తాంబూలాదికము ప్రదక్షిణ నమస్కారములు పుష్పాంజలి యొనర్పించవలెను.

మరియు నుద్యాపనమందుఁ జెప్పఁబడిన విధిచే నైనను పూజింపవలెను. ఎట్లనిన; మీఁద జెప్పినటుల ధ్యానావాహనములుజేసి శ్లో॥ "దేవా బ్రహ్మాదయో యే చ స్వరూపం న విదుస్తవ, అతస్త్వాం పూజయిష్యామి మాతురుత్సంగవాసినమ్" అనుమంత్రమును "పురుషఏవేద" మను ఋక్కును బఠించి యాసనము. శ్లో॥ "అవతార సహస్రాణి కరోషి మధుసూదన, నతే సంఖ్యావతారాణాం కశ్చిజ్జానాతి తత్వతః" అను శ్లోకమంత్రమును "ఏతవానస్య" యను ఋక్కునుపఠించి పాద్యము. శ్లో॥"జాతః కంసవధార్థాయ భూభారోత్తారణాయ చ, దేవానాం చ హితార్థాయ ధర్మసంస్థాపనాయ చ. కౌరవాణాం వినాశాయ పాండవానాం హితాయ చ, గృహాణార్ఘ్యం మయాదత్తం దేవక్యా సహితో హరే." యను శ్లోకమంత్రమును "త్రిపాదూర్ధ్వ" యను ఋక్కును బఠించి యర్ఘ్యమును. శ్లో॥ "సురాసుర నరేశాయ క్షీరాబ్ధి శయనాయ చ, కృష్ణాయ వాసుదేవాయ దదామ్యాచమనం శుభమ్." అను శ్లోకమంత్రముతో "తస్మాద్విరా"ట్టను ఋక్కునుబఠించి యాచమనీయమును. శ్లో॥ " నారాయణ నమస్తేస్తు నరకార్ణవతారక, గంగోదకం సమానీతం స్నానార్థం పరిగృహ్యతామ్." అను శ్లోకమంత్రముతో "యత్పురుషేణ" యను ఋక్కునుం బఠించి స్నానమును, శ్లో॥ "పయో దధిఘృతం క్షౌద్రం శర్కరా స్నానముత్తమం, తృప్త్యర్థం దేవదేవేశ గృహ్యతాం దేవకీసుత" అనుమంత్రముచే పంచామృతము శుద్ధోదకస్నానము నాచమనమును, శ్లో॥"క్షౌమం చ పట్టసూత్రాఢ్యం మయా నీతాంశుకం శుభమ్, గృహ్యతాం దేవ దేవేశ మయాదత్తం సురోత్తమ"అను శ్లోకమంత్రముతో "తం యజ్ఞ" మను ఋక్కును బఠించి వస్త్రమును, శ్లో॥"నమః కృష్ణాయ దేవాయ శంఖ చక్రధరాయ చ, బ్రహ్మసూత్రం జగన్నాథ గృహాణపరమేశ్వర" అను శ్లోకమంత్రముతో "తస్మాద్యజ్ఞాత్తమ" ఋక్కును బఠించి యజ్ఞోపవీతమును, శ్లో॥"నానాగందసమాయుక్తం చందనం చారుచర్చితం, కుంకుమాక్షైర్యుక్తం గృహాణ పరమేశ్వర"యను శ్లోకమంత్రముతో "తస్మాద్యజ్ఞాత్సర్వహుత"యను ఋక్కునుబఠించి గంధమును, శ్లో॥"పుష్పాణి యాని దివ్యాని పారిజాతోద్భవాని చ, మాలతీకేసరాదీని పూజార్థం ప్రతిగృహ్యతామ్" అను శ్లోకమంత్రముతో 'తస్మాదశ్వా' యను ఋక్కును బఠించి పుష్పమును సమర్పించునది.

## నంద పూజ

'శ్రీకృష్ణాయ నమః' యని పాదములను 'సంకర్షణాయ నమః' యని గుల్ఫములను 'కాలాత్మనేనమః' యని జానువులను, 'విశ్వకర్మణేనమః' యని జంఘలను, 'విశ్వనేత్రేనమః' యని కటిని, 'విశ్వకర్త్రేనమః' యని మేహనమును, 'పద్మనాభాయ నమః' యని నాభిని, 'పరమాత్మనేనమః' యని హృదయమును, 'శ్రీకంఠాయనమ' యని కంఠమును 'సర్వాస్త్రధారిణే నమః' యని బాహులను, 'వాచస్పతయేనమః' యని ముఖమును, 'కేశవాయనమః' యని లలాటమును, 'సర్వాత్మనే నమః' యని శిరస్సును, 'విశ్వరూపిణే నారాయణాయనమః' యని సర్వాంగములను బూజింపవలెను. శ్లో॥"వనస్పతిరసోద్భూతై" అను శ్లోకమంత్రముతో "యత్పురుష"మ్మను ఋక్కు బఠించి ధూపమును, శ్లో॥ "త్వం జ్యోతిస్సర్వదేవానాం తేజస్త్వ తేజసాం

పరం, ఆత్మజ్యోతిర్నమస్తుభ్యం దీపోయం ప్రతిగృహ్యతామ్" అను శ్లోకమంత్రముతో 'బ్రాహ్మణోஉస్య' యను ఋక్కును బఠించి దీపమును శ్లో॥"నానాగంధ సమాయుక్తం భక్ష్యభోజ్యం చతుర్విధం, నైవేద్యార్థం మయాదత్తం గృహాణ పరమేశ్వర" యను శ్లోక మంత్రముతో "చంద్రమా" యను ఋక్కును బఠించి నైవేద్యమును శ్లో॥"తాంబూలం చ సకర్పూరం పూగీఫల సమన్వితం, ముఖవాస ఆచనమును కరోద్వర్తకరంరమ్యం ప్రీతిదం ప్రతిగృహ్యతామ్' అను శ్లోక మంత్రముతో 'నాభ్యాఆసీ'త్తను ఋక్కును పఠించి తాంబూలమును, శ్లో॥"సౌవర్ణం రాజితంతామ్రం నానారత్న సమన్వితం, కర్మసాద్గుణ్యసిద్ధ్యర్థం దక్షణాం ప్రతిగృహ్యతామ్. రంభాఫలం నారికేళం తథైవామ్ర ఫలాని చ, పూజితోసి సురశ్రేష్ఠ గృహ్యతాం కంససూదన." అనుమంత్రముతో "వేదాహ"మ్మను ఋక్కునుబఠించి నీరాజనమును 'యానికానిచ' యను శ్లోకముచే బ్రదక్షిణములను "యజ్ఞేన" యని మొదలగు వేదమంత్రములచే పుష్పాంజలిని 'అపరాధసహస్రాణి' యని నమస్కారములను పూజానివిఏదనమును గ్రమముగ సమర్పించవలెను. ఇట్లు సర్వోపచార పూజయు సంపూర్ణమైన పైని పంద్రెండంగుళములు విస్తారముగలది రజత వికారమైనను స్థండిలమందు లిఖింపఁబడినదైనను రోహిణితోఁ గూడిన చంద్రబింబమును "సోమేశ్వరాయ సోమాయ తథా సోమోద్భవాయచ, సోమస్య పతయే నిత్యం తుభ్యం సోమాయ వైనమః"అనఁగా నుమామహేశ్వర స్వరూపుఁడవు, సోమలతాస్వరూపుఁడవు, సోమకారణము సోమాధిపతివి. సోమనామకుఁడవైన నీ కొరకు నమస్కార మనునర్థముగల మంత్రముచే బూజించి పుష్పములు దర్భ చంనము వీనితోఁ గూడిన జలము శంఖముతో బట్టి శ్లో॥"క్షీరోదార్ణవ సంభూత అత్రిగోత్ర సముద్భవ, గృహాణార్ఘ్యం శశాంకేదం రోహిణ్యాసహితో మమ, జ్యోత్స్నాపతే నమస్తుభ్యం జ్యోతిషాం పతయే నమః, నమస్తే రోహిణీకాంత అర్ఘ్యం నః ప్రతిగృహ్యతామ్." అను మంత్రములచే చంద్రుని కర్ఘ్యమర్పించవలెను. అనంతరము శ్రీకృష్ణునికి శ్లో॥"జాతః కంసవధార్థాయ భూభారోత్తారణాయ చ, పాండవానాం హితార్థాయ ధర్మసంస్థాపనాయ చ, కౌరవాణాం వినాశాయ దైత్యానాం నిధనాయ చ, గృహాణార్ఘ్యం మయాదత్తం దేవక్యా సహితో హరే." యను మంత్రముచే నర్ఘ్యమర్పించవలెను. అనంతరమున శ్లో॥"పాహిమాం సర్వలోకేశ హరే సంసార సాగరాత్, త్రాహి మాం సర్వపాపఘ్న దుఃఖశోకార్ణవాత్ప్రభో, సర్వలోకేశ్వర త్రాహి మాం సర్వ పాపఘ్న దుఃఖశోకార్ణవాత్ప్రభో, సర్వలోకేశ్వర త్రాహి పతితం మాం భవార్ణవే, త్రాహి మాం సర్వదుఃఖఘ్న దుఃఖ శోకార్ణవాద్ధరే, దుర్గతాంస్త్రయ సే విష్ణో యే స్మరంతి సకృత్సకృత్, త్రాహి మాం దేవదేవేశ త్వత్తో నాన్యోஉస్తి రక్షితా, యద్వాక్వచన కౌమారే యౌవనే యచ్చ వార్ధకే, తత్పుణ్యం వృద్ధిమయాతు పాపం దహ హలాయుధః" అనఁగా నో సర్వలోకేశ్వరుఁడా ! సర్వపాపములను సంహరించి నరకసముద్రమందును దుఃఖసముద్రమందును పడియున్న నన్ను రక్షింపుము. నీకంటె రక్షకులు లేరు. అనేక దీనులను స్మరణమాత్రమున రక్షించినావు. నన్నును రక్షింపుము. యెప్పుడే మత్రము సుకృతము జేసిన నది వృద్ధినొందవలెనని ప్రార్థన జేయునది. ఇట్లు

పూజజేసి యనంతరము జేయు కృత్య మగ్నిపురాణముఁ జెప్పుచున్నది. శ్లో.॥"ఇత్యేవం పూజ యిత్వాతు పురుషసూక్తేస్స వైష్ణవైః, స్తుత్వా వాదిత్రనిర్ఘోషైర్గీత వాదిత్రమంగలైః సుకధాభిర్విచిత్రాభిస్తథా ప్రేక్షణకైరపి, పూర్వే తిహాసైః పౌరాణైః క్షిపతాం శర్వరీం నృప." అనఁగా పూజానంతర మందు సత్కథాగోష్ఠిచేతను భగవత్కథానాటకదర్శనము మొదలైనవాటిచే జాగరణముచేయవలెనని. అందు కథావైచిత్ర్యము దేశభాషచే కావ్యములు మొదలగువానిచేనగును. ఇట్లు వైదికలౌకిక కథా శ్రవణాదులచే జాగర ణము వర్ణత్రయమువారికి విధింపఁబడినది. శూద్రులకు వైదికమంత్రములుతప్ప దక్కినవాటిచే జాగరణము విష్ణుభక్తులు గోకులస్థ జన్మలీలాదులు విన్న పైని దధిక్షీరాదు లచే నేచనము జేసుకొనవలెను. అందుకు వచనము. శ్లో॥"దధిక్షీరఘృతాదిభిః; ఆసిం చంతో విలింపతః" అని మొదలగు భాగవతవచనమే. యీ యుత్సవమే మహారాష్ట్ర దేశమున 'గోపాలకాల'యని వ్యవహరింపఁబడుచున్నది. ఇట్లు కౌస్తుభమందున్నది. ఇట్టి కథాజాగరణము రామనవమి యేకాదశి మొదలగు వ్రతములందును జేయ వలెను. పూజా జాగరాదులతోఁగూడినయుత్సవము భయవిధ వ్రతములకు సమా నమే. మహారాష్ట్ర దేశమందట్టులాచరింపఁ బడుచున్నది. భగవంతునియందు నిర్వ్యాజ ప్రేమగల భాగ్యశాలికి 'సర్వశిష్యమతాన్వహ' మ్మను న్యాయముచే ప్రతిదినమట్లనే జరుగును. అనంతరమున వమియందు బ్రాహ్మణులను భోజన దక్షిణాదులచే దృప్తి నొందించి యుక్తకాలమందు బారణసేయవలెను. యీ జయంతీ వ్రతమునకే సంవత్స రము చేయవలసిన ప్రయోగము. శ్రావణ కృష్ణాష్టమి మొదలుకొని ప్రతి మాసకృష్ణా ష్టమి నిట్లు పూజాజాగరణాదులు సేయుటపురాణాంతరమందు జెప్పఁబడినది. దీని యుద్యాపనవిధి గ్రంథాంతరమందు దెలియునది. ఇది జాన్మష్టమి నిర్ణయోద్దేశము.

## కుశ సంగ్రహణము

శ్లో॥"నభోమాసస్య దర్శేతు శుచిర్దర్భానుపాహరేత్, అయాతయామాస్తే దర్భా వినియోజ్యాః పునః పునః" అనఁగా శ్రావణ కృష్ణమావాస్యయందు శుచిగా దర్భలు కోసి తేవలయును. అవి 'అయాతయామములు' అనఁగా వినియోగించినవియే మాటి మాటికి వినియోగింపవచ్చును. కొందరు భాద్రపదామావాస్య యందు దర్భ సంగ్రహమును జెప్పిరి. శ్లో॥॥కుశాః కాశాయ వాదూర్వా ఉశీరాశ్శ్వసకుందకాః, గోధూ మాహ్రీహయో ముంజా దశదర్భాస్స బల్బజాః" కుశ, రెల్లు, యవతృణము, దూర్వ, వట్టివేళ్లు, కుందకములు, గోధూమతృణము, వరిచొప్ప, ముంజగడ్డి, ఉలపతృణము యీపదియు దర్భలనఁబడును. శ్లో॥"విరించినా సహోత్పన్న పరమేష్ఠినిసర్గజ, నుద సర్వాణి పాపాని దర్భస్వస్తి కరోభవ." యనఁగ నోదర్భ! నీవు బ్రహ్మతోఁబుట్టితివి. అనఁగా సృష్ట్యాదియందు పరమేష్ఠియొక్క స్వభావ సంకల్పమునఁబుట్టితివి. కనుక పాపము లన్నిఁటి దహింపుము. స్వస్తిజేయు మనుమంత్రమునుచ్చరించి "యేవం మంత్రం సముచ్చార్యతతః పూర్వోత్తరాముఖ, హుంఫట్ కారేణ మంత్రేణ సకృచ్ఛిత్వా సముద్ధరేత్" అనగా అట్లుచ్చరించి

యీశానదిక్కున కభిముఖుఁడై 'హుంఫట్' అను మంత్రముచే మొదటి కొక్కమారే కోసితీయవలెను. అట్టిదర్భలు నాలుగింటిచే బ్రాహ్మణులకు బవిత్రముచేయవలెను. క్షత్రియాదులకు గ్రమముగ నొక్కొక్కటి తగ్గించవలెను. లేక రెండింటిచే నన్నివర్ణముల వారికి జేయవచ్చును. గ్రంథిలేకుండ ధరించినను యుక్తమే.

## భాద్రపదమాసము

అందు గన్యాసంక్రమణమునకు బరమయినగడియలు పదియారు పుణ్య కాలము. భాద్రపదమాసమందేకాన్నాహారవ్రతముఁజేసిన ధనారోగ్యాది ఫలము. యీ మాసమందు హృషీకేశప్రీతికై గుడోదనలవణాదిదానము. భాద్రపదశుక్ల తృతీయ యందు హరితాలికావ్రతము. అందు ముహూర్తమాత్రమైన నంతకుదక్కువయైనను బరదినమే గ్రహించునది. క్షయవశమువల్ల పరదినమందులేనిచో ద్వితీయాయుక్తమే గ్రహించునది. శుద్ధాధికయైనపుడు పూర్వదినమం దరువది గడియలున్నను విడిచి స్వల్పమైనను చతుర్థీయుక్తమే గ్రహించునది. గణయోగము దానికి ప్రశస్తమని చెప్పఁ బడినది. యీ వ్రతమందు పార్వతీ పరమేశ్వరుల పూజనము నుపవాసమును స్త్రీలకు నిత్యము అపుడు శ్లో॥"మందార మాలాకులితాలకాయై కపాలమాలాంకిత శేఖరాయ, దివ్యాంబరాయై చ దిగంబరాయ నమశ్శివాయై చ నమశ్శివాయ" అని మొదలుగాగల పూజామంత్రములం దెలియవలెను.

## సిద్ధివినాయక వ్రతము

అందు మధ్యాహ్న వ్యాప్తిని గ్రహింపవలెను. దినద్వయమందును సంపూర్ణముగ మధ్యాహ్నవ్యాప్తియున్నను లేకున్నను పూర్వమే. దినద్వయమందును సమముగగాని విషమముగగాని యేకదేశవ్యాప్తి యగునపుడును పూర్వదినమే వైషమ్యవ్యాప్తిలో నధిక మున్నయెడ బరిదినమగునని కొందరు. పూర్వదినమందు బొత్తిగ మధ్యాహ్నవ్యాప్తి లేక పరదినమందే మధ్యాహ్న స్పర్శయున్నచో బరదినము గ్రహింపవచ్చును. పూర్వ దినమందేకదేశ వ్యాప్తియు బరదినమందు సంపూర్ణ మధ్యాహ్నవ్యాప్తియు నున్నచో బరదినమే గ్రహించునది. ఇట్లు మాసాంతరమందును నిర్ణయము.

## శుక్లచతుర్థిలో చంద్రునిజూచిన మిథ్యాపవాదము

ఇది రవి భౌమవారములతోగూడినయెడ బ్రశస్తము. యీచతుర్థియందు జంద్రునిజూచినవారికి మిథ్యాపవాదము వచ్చును. కనుక చతుర్థియందుదయించి చంద్రుని బంచమి యందుఁజూడవలెను. అట్లు వినాయకవ్రతదినమందు సంభవించి నను దోషములేదు. కనుక పూర్వదినమందు సాయంకాలము మొదలుకొని ప్రవర్తిం చిన చతుర్థియందు వినాయకవ్రతములేకున్నను నా రాత్రి చంద్రదర్శనము నిషిద్ధమని లభించును. చతుర్థియందుదయించిన చంద్రుని జూడనేగూడ దనుపక్షముననైదారు ముహూర్తములు శేషించిన చతుర్థీ దినమందును నిషేధమువచ్చును. లోకులిపుడొక పక్షము నాశ్రయించి వినాయకవ్రతదినమందే చంద్రునిజూడరుగాని యుదయకాల మందైనను దర్శనకాలమందైనను చతుర్థి తప్పక యుండవలెనా? లేదా యని

విచారింపరు. దర్శనమయినచో నాదోషముపోవుటకు శ్లో॥"సింహః ప్రసేనమవధీ స్సింహో జాంబవతా హతః, సుకుమారకమారోదీస్తవ హ్యేషస్యమంతకః' అను శ్లోక మంత్రము జపింపవలెను. అనఁగా సత్రాజిత్తుతమ్ముని ప్రసేనుని సింహముచంపి నది. దాని జాంబవంతుఁడుచంపి యీ స్యమంతకమను మణిని నీకిచ్చెను. శోకింప వద్దని జాంబవత్పుత్రుని నుయ్యాలనుంచి దాసి పాడినది. దానివలన శ్రీకృష్ణస్వామి మణినపహరించినాడను మిథ్యాభిదూషణము పోయెనని శ్లోకతాత్పర్యము. ఇఁక నీ వ్రతమందు మృణ్మయాదిమూర్తియందు ప్రాణప్రతిష్ఠాదిపూర్వముగ వినాయకుని షోడశోపచారములచే బూజించియొక మోదకముచే నైవేద్యము సమర్పించి గంధ సహితముగ నిరువదియొక దూర్వలనుగ్రహించి "గణాధిపాయనమః, ఉమాపుత్రాయ నమః, అఘనాశనాయనమః, వినాయకాయనమః, యీశపుత్రాయనమః, సర్వసిద్ధిప్రదాయకాయనమః, ఏకదంతాయనమః, ఇభవక్త్రాయనమ, మూషకవాహ నాయనమః, కుమారగురవేనమః, యను దశనామములలో నొక్కకనామము నుచ్చ రించి రెండేసిదూర్వలచొప్పున నిరువది సమర్పించి తక్కినయొక్కటియు నాపదినామ ములునుచ్చరించి సమర్పింపవలయును. పదిమోదకములు బ్రాహ్మణునికి వాయన దానమిచ్చి పదిమోదకములను దానుభుజింపవలెను. ఇట్లు సంక్షేపముగ వ్రతప్రయో గము.

## ఋషిపంచమీ వ్రతము

భాద్రపద శుక్లపచంమి ఋషిపంచమి దానికి మధ్యాహ్నవ్యాప్తికావలయును. దినద్వయమందును మధ్యాహ్న వ్యాప్తియున్నను తదభావమున్నను బూర్వదినమే. అందు ఋషులనుబూజించి దున్నుట, త్రవ్వుట మొదలగు వ్యాపారము లేకుండు భూమిలో స్వయముగా పుట్టినశాకము నాహారముగ జేసుకొనవలెను.

## సూర్యషష్ఠిం

శ్లో॥"శుక్లభాద్రపదే షష్ఠ్యాం స్నానం భాస్కరపూజనం, ప్రాశనం పంచగవ్యస్య చాశ్వమేధపలాదికమ్." అనఁగా నీషష్ఠియందు స్నానము జేసి సూర్యారాధన మాచ రించి పంచగవ్యప్రాశనముజేసిన నశ్వమేధమునకంటె నెక్కుడుఫలము గలుగునని యీ సూర్యషష్ఠి సప్తమితో గూడినదికావలెను. యీ దినమందు గుమారస్వామి దర్శనము బ్రహ్మహత్య పాపమును నశింపఁజేయును.

## శుక్లాష్టమి, దూర్వాష్టమి

అది పూర్వదినమే గ్రహింపవలయును. ఇది జ్యేష్ఠామూలనక్షత్రములతో గూడె నేని త్యాజ్యము. తద్రహితము లభింపనిచో నదియే గ్రాహ్యము. యీదూర్వాపూజన వ్రతము సూర్యుఁడు కన్యయందుండి ననుగ్రస్తోదయమందును వర్జ్యము.

## జ్యేష్ఠాదేవీపూజ

ఇది స్త్రీలకు నిత్యము. ఇక్కడ జ్యేష్ఠాదేవీ పూజనవ్రతము కేవలాష్టమీ ప్రాధాన్య ముగను, కేవల జ్యేష్ఠానక్షత్రప్రాధాన్యముగను విధింపఁబడినది. అందు దాక్షిణాత్యులు

కేవల నక్షత్రమందే చేయుచున్నారు. అదియు ననూరాధయం దావాహనము, జ్యేష్ఠ యందు బూజయు, మూలర్షమందు విసర్జనము నని మూఁడుదినముల వ్రతమని తెలియునది. ఆవాహనవిసర్జనదినములకు బూజాదినము ననుసరించియే నిర్ణయము. అందు పూర్వదినమధ్యాహ్నము మొదలుకొని జ్యేష్ఠానక్షత్రము రెండవదినమందు మధ్యాహ్నమునకుగాని దానికిముందుగాని సమాప్తమైనచో బూర్వదినమందే పూజ నము. పూర్వదిన మధ్యాహ్ననంతరము ప్రవేశించి మరునాఁడు మధ్యాహ్నమునకు సమాప్తియయ్యెనేని యష్టమియోగమును బట్టి పూర్వమయినను పరమయినను గ్రహ్యము. రెండుదినములందష్టమీ యోగమున్నచో బూర్వదినమే గ్రాహ్యము. పూర్వ దినమున మధ్యాహ్నమందుగాని యా పైనిప్రవేశించి పరదినమందు మధ్యాహ్నము దాటి యపరాహ్ణమును స్పృశించెనేని నష్టమియోగములేకున్నను పరదినమే గ్రాహ్యము.

## విష్ణుపరివర్తనోత్సవము

భాద్రపద శుక్లైకాదశియందుగాని ద్వాదశియందుగాని పారణజేసిన పైని విష్ణుపరివర్తనోత్సవము. అందు "శ్రుతేచ్ఛమధ్యే పరివర్తమేతి" యను వచనమువలన శ్రవణనక్షత్రము మూఁడుభాగములలో మధ్యభాగమేకాదశియందు సంభవించినపుడే యాయుత్సవము ద్వాదశయందు సంభవించెనేని యాదినమందే చేయవలెను. రెండు దినములను నక్షత్రయోగములభింపనిచో బరదినమందే యని మొదలగు వ్యవస్థ దెలియవలెను. అందు సంధ్యాకాలమున విష్ణువును బూజించి, శ్లో॥"వాసుదేవ జగన్నాథ ప్రాప్తేయం ద్వాదశీ తవ, పార్శ్వేన పరివర్తస్య సుఖం స్వపిహి మాధవ" అనఁగా వాసుదేవ! జగన్నాథుఁడ! నీ ద్వాదశి ప్రాప్తమైనది. ప్రక్కకు మళ్లుము. సుఖముగఁ బండుకొనుమని యర్థముగల మంత్రముచే బ్రార్థింపవలెను.

## శ్రవణద్వాదశీ వ్రతము

అందు ముహూర్తమాత్రము మొదలు స్వల్పమయినను ద్వాదశికి శ్రవణయోగ మున్నదినముననుపవాసము జేయవలెను. శ్రవణముననుత్తరాషాఢ గలసినచో విద్ధ మగును. కనుక నిషిద్ధమనువచనములు నిర్మూలములు. ఇక పూర్వదినమందేకాదశీ విద్ధయగు ద్వాదశి పరదినమందున్నచో మరియు శ్రవణయోగము దినద్వయమం దుండెనేని బూర్వదినమం దేకాదశీద్వాదశి శ్రవణము. నీమూఁడిటి యోగమున్నం దున విష్ణుశృంఖలయోగముగనుక పూర్వదినమందే యుపవాసము. ఎట్లనిన; ఏకాదశి 18, ఉత్తరాషాఢ 6, ద్వాదశి 20, శ్రవణము 12, మరియును ఏకాదశి 18, ఉత్తరాషాఢ 25, ద్వాదశి 20, శ్రవణము 18. అందు ద్వితీయోదాహరణమున నేకాదశికి శ్రవణము లేకున్నను శ్రవణముతోగూడిన ద్వాదశి స్పృశించుటమాత్రము ననే విష్ణుశృంఖల యోగము. రెండువిధములైన యావిష్ణుశృంఖల యోగమును పగలే యుండవలెను. రాత్రికాదని పురుషార్థచింతామణి చెప్పుచున్నది. రాత్రియం దును నర్ధరాత్రమందును నట్టియోగము గ్రాహ్యమని నిర్ణయసింధువు. రాత్రియందు

మొదటిజాములోగా నైనచో నట్టియోగము గ్రాహ్యముగాని యటుపైని కాదని కొందరు. ఇక్కడచరమపక్షమే యుక్తమని తోఁచుచున్నది. ఈ యోగము సంభవించుచో వ్రతద్వయముయొక్క యుపవాసములు తంత్రముచే నేకాదశియందే చేసి ద్వాదశి యందు జెప్పఁబోయెడి నిర్ణయముననుసరించిపారణజేయవలెను. ఇంక విష్ణుశృంఖల యోగము సంభవింపకున్నపుడే ద్వాదశి శుద్ధాధికయై దినద్వయమందును శ్రవణ యోగమును బూర్వదినమందుదయమున శ్రవణాభావమును గలిగెనేని యుత్తరదినమే గ్రహ్యము. మరియు దినద్వయమందును ద్వాదశికుదయమున శ్రవణయోగముండె నేని పూర్వదినమే గ్రాహ్యము. విద్ధాధికయందును పరదినమందేయుదయమునగాని యనంతరమునగాని శ్రవణయోగమున్నచో బరదినమే యగుటకు సందియములేదు. రెండుదినములను శ్రవణయోగమును చెప్పఁబడిన విష్ణుశృంఖల యోగమున్నచో బూర్వదినమే గ్రాహ్యము. లేనిచో నుత్తరదినమేయని దెలియవలెను. కాఁబట్టి యేకా దశీ శ్రవణద్వాదశులయుపవాసములు రెండును చేయుట ప్రాప్తించునపుడు సమర్థుఁ డయ్యెనేని రెండును జేయవలయును. వ్రతద్వయమునిత్యమగుటచే నొకదానికఇ లోపము రాగూడదు. వ్రతద్వయమునకు దేవతయొకటే గనుక పారణాలోపముచే దోషములేదు. ఇక నసమర్థుఁడు దనయశక్తిని వ్రతసంకల్పమునకు ముందెరింగినచో నేకాదశియందు సంకల్పానుసారముగ ఫలాహారము జేసి ద్వాదశి శుద్ధోపవాసము జేయవలెను. అపుడేకాదశీవ్రతలోపదోషములేదు. ఏమనిన; శ్లో॥"ఉపోష్య ద్వాదశీం పుణ్యాం విష్ణుఋక్షేణ సంయుతాం, ఏకాదశ్యుద్భవం పుణ్యం నరః ప్రాప్నత్యసంశ యమ్." అని నారదవచనము. అనఁగా శ్రవణముతోగూడిన ద్వాదశి నుపవాసము జేసిన నేకాదశ్యుపవాస పుణ్యముగూడ లభించునని యర్థము. మరియు శ్లో॥"శ్రవణేన యుతా చేత్స్యాద్ద్వాదశీ సాహి వైష్ణవ్యై, స్మార్తైశ్చ పోషణీ యాస్యా త్త్యజేదేకాదశీం తదా" అనిమాధవవచనము. అనఁగా శ్రవణముతోగూడిన ద్వాదశి వచ్చెనేని వైష్ణవులు స్మార్తులు సహితము నేకాదశివిడిచియయినను ద్వాదశినుపవాసము చేయ వలెను. ఏకాదశివిడుచుట యనఁగ ఫలాహారముచేయుటగాని భోజనముకాదు. ఇంక నేకాదశీ వ్రతసంకల్పమునకు ముందు తన యశక్తిదెలియక యుపవాసముజేసి రెండవయు పోషణమున కశక్తుఁడయ్యెనేని. ద్వాదశియందు విష్ణుపూజనము చేసి పారణజేయ వలెను. అపుడు వ్రతాంగపూజనుజేసి "ఉపవాసా సమర్థ ఉపవాస ప్రతినిధి భూతం విష్ణుపూజనం కరిష్యే" యని సంకల్పించి పునఃపూజజేయవలెను. ద్వాదశి యందు శ్రవణయోగములేక యేకాదశియందే యవియున్నచో శ్రవణద్వాదశీ వ్రతము గూడ నేకాదశియందే యవియున్నచో శ్రవణద్వాదశీ వ్రతముగూడ నేకాదశియందే చేయవల యును. విద్ధైకాదశియందు శ్రవణయోగమున్నచో నేకాదశీవ్రత మాదిన మందే సంభ వించినవారికి నుపవాసములు రెండునుగలిపి తంత్రముచే యాచరణము. ఇతరులకు శ్రవణాద్వాదశీవ్రతమున్నచో నాదినమందాయుప వాసమును మరునాడే కాదశియుప వాసమును జేయుట. రెంటిటిజేయుట కశక్తులైనచో బూర్వదినమందు పలాహారము పరదినమందుపవాసమునని తోఁచుచున్నది.

## పారణ నిర్ణయము

ద్వాదశీ శ్రవణములు రెంటిసమాప్తియందు బారణము ముఖ్యపక్షము. ఒకదాని యంతమునబారణము గౌణపక్షము. అందు విష్ణుశృంఖలయోగము లేనపుడు త్రయోదశియందు రెండిటియంతమున బారణము. విష్ణుశృంఖలయోగము సంభవించినచో బూర్వదినమందుఁ దంత్రముచే రెండుపవాసములుచేసి బరదిన మందు శ్రవణ నక్షత్రమునకంటె ద్వాదశియధికముగనున్నయెడ శ్రవణము దాటి ద్వాదశియందు బారణము. ద్వాదశికంటె శ్రవణమే యధికమగుచో నేకాదశీ వ్రత పారణకు ద్వాదశిదాట వలనుకాదు గనుక ద్వాదశియందే పారణము జేయవచ్చును. అన్యతరముయొక్క యంతము బ్రతీక్షింప నక్కరలేదు. అపుడు సంభవించినచో శ్రవణ మధ్యభాగముననఁగా నిరువదియవగడియ మొదలగుభాగము విడిచి పారణ జేయ వలెను. ఎట్లనిన; ఏకాదశి 30, ఉత్తరాషాఢ 29, ద్వాదశి 25, శ్రవణము 29. అపుడు పూర్వదినమందుఁదంత్రముచే నుపవాసద్వయముజేసి పరదినమందు శ్రవణ మధ్యభాగములో మిగిలిన తొమ్మిదగడియలు విడిచి శ్రవణ చరమభాగమయిన ఇరువదియవగడియలో ద్వాదశియందు బారణము. ఇట్లు చెప్పిన యుదాహరణమందే ఏకాదశి10, ద్వాదశి 8 గడియలుండినను ద్వాదశి 15, శ్రవణము 40 గడియలుండి నను శ్రవణమధ్యభాగము విడిచినచో ద్వాదశి దాటిపోవును. కనుక సంగమ కాలము ననఁగా నారుగడియలు విడిచియు రెండవయుదాహరణమున బంద్రెండు ఘడియలు విడిచియు శ్రవణమభ్యభాగమైనప్పటికిని బారణ జేయవచ్చును. ఇట్లు మధ్యభాగము విడుచుట భాద్రపదమాసములో శ్రవణద్వాదశికే యని యెఱుంగునది. తక్కిన మాఘ ఫాల్గుణాది మాసములలో శ్రవణభాగమున విష్ణుపరివర్తనము లేనందున నపుడక్కర లేదు. కొందరు భాద్రపద మాసమందు శ్రవణమధ్యభాగము విడిచినందుచేతనే నిషేధము సార్ధక మనితలఁచి విష్ణుశృంకలయోగము లేకున్నను శ్రవణమధ్యభాగ మును మాత్రము విడిచి శ్రవణద్వాదశిని భుజింతురు. వారు నిత్య శ్రవణ ద్వాదశీ వ్రతమాహాత్మ్య మెఱుఁగనివారు భ్రాంతులు. ఇట్లు సర్వ నిర్ణయమును మాసాంతర మందలి శ్రవణ ద్వాదశీ వ్రతమందు నూహించునది. శ్రవణద్వాదశీ వ్రతమందు నదీ సంగమమున స్నానముజేసి కలశమందు స్వర్ణమయమైన జనార్దనమూర్తిని బూజించి వస్త్రము, యజ్ఞోపవీతము, ఛత్రము, పాదుకలు మొదలగునవి సమర్పించి యుపవసించి పారణదినమందు దధ్యోదనముతోగూడిన జలఘటమునకు వస్త్రము జుట్టి దానిని వెనుకపూజించిన యుపకరణములతో బ్రతిమను దానము చేయవలెను. అపుడు మంత్రము శ్లో॥"నమోనమస్తే గోవింద బుధ శ్రవణ సంజ్ఞక, అఘౌఘసంక్ష యం కృత్వా సర్వసౌఖ్యప్రదో భవ" అనఁగా నో గోవిందుడ! బుధ శ్రవణానామము గలవాడవు. నా పాపము నశింపఁజేసి సర్వసుఖములు దయసేయుమని యర్థము.

## వామన జయంతి

భాద్రపదశుక్ల ద్వాదశియందు శ్రవణనక్షత్రమున మధ్యాహ్నామందు వామనావ తారము. కనుక మధ్యాహ్నవ్యాప్తిగల ద్వాదశికినపుడైనను మరియొకప్పుడైనను శ్రవణ యోగము గలిగెనేని గ్రహించునది. దినద్వయమందును శ్రవణయోగమున్నచో

బూర్వమే. పరదినమందు ద్వాదశికి శ్రవణయోగములేనియెడ నేకాదశియందు శ్రవణ మున్నచో మధ్యాహ్నవ్యాపినియైనను ద్వాదశివిడిచి యేకాదశియందే జయంతీ వ్రతము. శుద్ధైకాదశికి శ్రవణయోగము లేనిచో విద్ధైకాదశియయినను శ్రవణయుక్త మగునెడ వ్రతముజేయునది. పూర్వదినమందు మధ్యాహ్న వ్యాప్తిగలిగి పరదినమందు మధ్యాహ్నాతిరిక్తకాలమున శ్రవణయోగము ద్వాదశికున్నచో పూర్వదినమే వ్రతార్హము దినద్వయమందును శ్రవణయోగము. లేనిచో మధ్యాహ్న వ్యాపినియైన ద్వాదశియందే వ్రతము. దినద్వయమందును మధ్యాహ్న వ్యాప్తియున్నను నట్లు లేకున్నను నేకాదశీ యుక్తమే గ్రహించునది. పారణము మీఁదజెప్పిన చొప్పున నుభయాంతమునందైనను నొకదానియంతమునందైనను జేయవలెను.

## వ్రతాచరణ విధానము

మధ్యాహ్నమందు నదీసంగమమున స్నానముజేసి సువర్ణప్రతిమ యందు వామనమూర్తినిబూజించి సువర్ణపాత్రచే నర్ఘ్య మీవలెను. అందు పూజామంత్రము. శ్లో॥"దేవేశ్వరాయ దేవాయ దేవ సంభూతికారిణే, ప్రభవే సర్వదేవానాం వామనాయ నమో నమః" అని పూజయు శ్లో॥ "నమస్తే పద్మనాభాయ నమస్తే జలశాయినే, తుభ్యమర్ఘ్యం ప్రయచ్ఛామి బాలవామనరూపిణే, నమశ్శార్ఙ్గధనుర్బాణ పాణయే వామనాయ చ, యజ్ఞభుక్ఫలదాత్రే చ వామనాయ నమోనమః" అని యర్ఘ్యము నీయవలయును. పరదినమందు బూజించి సపరివారముగ వామనమూర్తిని దానము జేయవలెను. దానమంత్రము. శ్లో॥"వామనః ప్రతిగృహ్ణాతి వామనోఽహం దదామితే, వామనం సర్వతోభద్రం ద్విజాయ ప్రతిపాదయే" యని యీ ద్వాదశి యందే రాత్రి యందు దేవపూజచేసిగాని యట్లు సంభవింపనిచో పగటియందేగాని దధివ్రతము దేవుని కర్పించి దధిదానముజేసి దుగ్ధవ్రతమును సంకల్పించవలెను. యీపయో వ్రతమందు పాలువిడిచినట్లనే పాలుతో జేసిన పాయసము మొదలగునవియు పాలతో వండినయన్నమును విడువవలెను. పయోవికారమయినను పెరుగు మొదలగునవి విడువనక్కరలేదు. ఇట్లు దధివ్రతమందు తక్రము మొదలగనవి విడువనక్కరలేదు. అయినను ప్రసవించినగోవునకు బదిరోజులలోగాని సంధిని మొదలగు నవస్థనొందిన దానియొక్క గాని క్షీరము దధి మొదలగునవి యన్నియు వర్జ్యములు.

## అనంత వ్రతము

భాద్రపద శుక్లచతుర్దశియందనంత వ్రతము. అపుడదయమందు మూడు ముహూర్తములు వ్యాపించు చతుర్దశికావలెనని ముఖ్యపక్షము. అది లభింపనిచో ద్విముహూర్తమైనను గ్రహింపవచ్చునని యనుకల్పము. అంతకు దక్కువయైనచో బూర్వదినమే గ్రహించునది. దినద్వయమందును సూర్యోదయ వ్యాప్తియుండెనేని పూర్ణమగుటచే బూర్వదినమే. ఇఁక పూర్వాహ్ణము ముఖ్యకాలము. అది లేనిచో మధ్యాహ్నమును గ్రహింపనగు. యీ వ్రతమందిరువది నాలుగు గ్రంధులు గల దోరకమనఁగ బట్టుత్రాడునందనంతుని బూజించుట మొదలగు విధియు, దాని

యుద్యాపనవిధానమును కౌస్తుభాది గ్రంథమున దెలియునది. పూజచేసిన దోరకము పోయినచో నాచార్యునివరించి యాతనియనుజ్ఞచే యథావక్తి కృచ్ఛ్రాదిప్రాయశ్చిత్తము జేసికొని యాజ్యముచే నష్టోత్తరశతమున నూటయెనిమిదిమారులు వాసుదేవద్వాదశాక్షర మంత్రము నుచ్చరింపుచు జేయవలెను. ఆపైని గేశవాదినామములతో నొక్కొక్క మారు హోమముజేసి సమాప్తిజేసి నూతనదోరకమందు బూర్వమువలె బూజమొదలుగ జేయవలెను.

## అగస్తి పూజనము

సూర్యుఁడు వృషభమందు ప్రవేశించినపైని సప్తమదినమందగస్త్యుఁడస్తమించి సింహసంక్రమణానంతర మిరువదియొకటవ దినమందు దిరుగ నుదయించును. అపుడు కన్యాసంక్రాంతికి పూర్వము సప్తదినములలోగా నగస్త్యపూజనము తదర్ఘ్యము మొదలగునవి చేయవలెను. భాద్రపదపూర్ణిమయందు దనతాత తండ్రికిపై వారికి ముగ్గురనువారి భార్యలతో వసురుద్రాదిత్య రూపులను మాతామహుఁడు మొదలుకొని ముగ్గురనువారి భార్యలతోగూడ నుద్దేశించి శ్రాద్ధము జేయవలెను. ఇది పార్వణము గనుక నపరాహ్ణమందు బురూరవార్ద్రవదేవయుక్తముగ పిండదానముతో జేయవలెను. కొందరు ప్రపితామహుని పిత్రాదులనుమాత్రమే యుద్దేశించి నాందీశ్రాద్ధమువలె సత్యవసుసంజ్ఞకులైన విశ్వేదేవతలతో శ్రాద్ధము చేయవలెను గాని మాతామహాదుల నుద్దేశించ నక్కరలేదనిరి. యీ ప్రోష్ఠపదీశ్రాద్ధమున ఒక్కదినమందే మహాలయము పెట్టువారికిని పక్షము యావత్తునందును మహాలయములు జరిగించువారికిని నావశ్యకమే. పంచమి మొదలుకొని మహాలయము జేయువారికి వైకల్పికము.

## మహాలయము

అందు శక్తుఁడైనచో భాద్రపద కృష్ణప్రతిపద మొదలుకొని దర్శపర్యంతము పదునైదు తిథివృద్ధియగునో బదియారు మహాలయములు జేయవలెను. తిథిక్షయము వచ్చునపుడు పదునాలుగేయగును. అశక్తుఁడయినచో బంచమిగాని షష్ఠిగాని యష్టమి గాని దశమిగాని యేకాదశి గాని మొదలుకొని దర్శాంతముగఁజేయవలెను. అందు నశక్తుఁడయినచో నిషిద్ధముగాని యొకదినమందు సకృన్మహాలయము జేయవలెను. ప్రతిపదమొదలుకొని పక్షమహాలయములజేయువారు చతుర్దశి విడువగూడదు తక్కిన పంచమ్యాది దర్శాంతపక్షములైదింటను జతుర్దశి విడిచి యితరదినములందే మహాలయముల జేయవలెను. సకృన్మహాలయమందును జతుర్దశికూడదు. మరియును ప్రతిపద,షష్ఠి, ఏకాదశి, శుక్రవారము, జన్మనక్షత్రము, దానికిదశమము, పందొమ్మిదవదియు నక్షత్రము, రోహిణి, మఖ, రేవతియు సకృన్మహాలయమునకు నిషిద్ధములు. కొన్ని గ్రంథములలో సప్తమి, త్రయోదశి, రవివారము, మంగళవారమును వర్జ్యము లనియున్నది. పితృమృతతిథియందు సకృనహాలయముచేయుచో నందాది నిషేధము లేదు. శ్లో॥"అశక్తః పితృపక్షేషు కరోత్యేకదినే యతః, నిషిద్ధేపి దినే కుర్యా త్పిండదానం యథావిధి" అని అనఁగా నశక్తుఁడు పక్షమంతటికి నొక్కరోజుననే చేయును.గనుక

నిషిద్ధదినమందైనను యథావిధి శ్రాద్ధము చేయవచ్చునని యర్థము. ఇది మృతతిథి విషయము. అపుడు సందర్భింపనిచో నిషేధము లేనిదినమందు జేయవలెను. అపుడును ద్వాదశి, యమావాస్య, యష్టమి, భరణి, వ్యతీపాత వీనిలోనొకటిసంభవించి నచో మృత తిథిగానున్నను నిషేధమేమియు లేదు. సన్న్యాసులకు మహాలయ మపరాహ్ణ వ్యాప్తిగల ద్వాదశి యందు పిండదానముతో జేయవలెను. మరియొక తిథియందు గూడదు. చతుర్దశి మృత తిథియయినను నాదినమందు మహాలయముగూడదు. శ్లో॥"శ్రాద్ధం శస్త్రహతస్యైవ చతుర్దశ్యాం ప్రకీర్తిత" మ్మని. అనఁగా జతుర్దశియందు శస్త్రహతునికే శ్రాద్ధము జేయవలెనని ప్రబలవచనమున్నందున నాదినమందు ప్రత్యాబ్దికముదప్ప నితరశ్రాద్ధమేదియు జేయగూడదు. ఇట్లు పౌర్ణమాసియందు మృతుఁ డగువానికి బూర్ణిమ యందు మహాలయము జేయగూడదు. కృష్ణపక్షమందు మహా లయము విధింపఁబడినది. అందు పూర్ణిమలేదు గనుక చతుర్దశినిగాని పూర్ణిమను గాని మృతుఁడైనవానికి ద్వాదశి యమావాస్య మొదలగు తిథులందుజేయవలెను. యీ మహాలయపక్షమునకు సూర్యుఁడు కన్య యందుండినచో ప్రాశస్త్యమేకాని నిమిత్తముగాదు. శ్లో॥"ఆదౌ మధ్యేవసానే వాయత్రకన్యాంవ్రజేద్రవిః,సపక్షస్సకలశ్శ్రేష్ఠ స్సశ్శ్రాద్ధషోడశకంప్రతి" అని. అనగానీ మహాలయపక్షమందు మొదటగాని మధ్య మందుగాని యంతమునగాని కన్యా సంక్రాంతియైనచో శ్రేష్ఠమనియర్థము. దర్శలోగా మంచిదినము లభించనియెడ నాశ్వినశుక్లపంచమిలోగా జరిగింపవచ్చును. అపుడును సంభవింపనిచో వృశ్చిక సంక్రాంతి పర్యంతములో వ్యతీపాతాది పర్వదినమందు మహాలయము చేయవచ్చును. మృతాహమనగ నాబ్దిక శ్రాద్ధమును మహాలయశ్రాద్ధ మును పక్వాన్నముచేతనే చేయవలెనుగాని యపక్వతండులాదికముచే జేయగూడదు. ఏమనిన, శ్లో॥"మహాలయే గయాశ్రాద్ధే మాతాపిత్రోర్మృతేహని, కృతోద్వాహోఽపి కుర్వీత పిండదానం యథావిధి" అనివచనము. అనఁగా మహాలయశ్రాద్ధమునను గయా శ్రాద్ధమునను బ్రత్యాబ్దికమునను వివాహితుఁడైనను యథావిధిగా పిండదానము చేయవలెనని యర్థము. మహాలయ శ్రాద్ధమునందు పిత్రాదిపార్వణ త్రయమనగ పితృపితామహత్రయ మొక పార్వణము. మాతృపితామహప్రపితామహత్రయ మొక పార్వణము. సపత్నీకమాతా మహమాతృపితామహమాతృ ప్రపితామహత్రయమొక పార్వణము. యీపార్వణత్రయమును భార్యమొదలగు నేకోద్దిష్టపితృగణ సహితసర్వ పితృదేవతల నుద్దేశించుట యొకపక్షము. సపత్నీక పిత్రాదిత్రయ మనియు సపత్నీక మాతామహాదిత్రయ మనియు పార్వణ ద్వయముగ షడ్దైవతముల మాత్ర ముద్దేశిం చుట రెండవపక్షము. షడ్దైవతములను నేకోద్దిష్టగణము నుద్దేశించుట మూడవపక్షము. అందొక పక్షమున ప్రతిదినమును మహాలయము చేయునది. ఇట్లు పంచమ్యా పక్షములందును గ్రహించునది. సకృన్మహాలయముజేయుచో సర్వపిత్రుద్దేశము చేతనే దేవతా సంకల్పము. ఎట్లనిన – "పిత్రుపితామహ ప్రపితామహానాం మాతృ తత్సపత్నీ పితామహీతత్సపత్నీ ప్రపితామహీతత్సపత్నీ నామస్మత్సా పత్న్యమాదుతిది వామాతా మహా మాతుః పితామహమాతుః ప్రపితామహానాం సపత్నీకానాం యథా నామ

గోత్రాణాం వసురుద్రాదిత్య రూపాణాం పార్వణవిధినా పత్న్యాః పుత్రస్య కన్యాయాః పితృవ్యస్య మాతులస్య భ్రాతుః పితృష్వసుః మాతృష్వసురాత్మభగిన్యాః పితృవ్యపుత్రస్య జామాతుర్భాగినేయస్యశ్వశురస్య శ్వశ్ర్వా ఆచార్యస్య ఉపాధ్యాయస్య గురోః సఖ్యుశ్శిష్యస్యై తేషాం యథానామగోత్రాణాం పురుషవిషయేసపత్నీకానాం స్త్రీవిషయే సభర్తృకసాపత్యా నామేకోదిష్టవిధి నామహాలయాపరపక్షశ్రాద్ధం సకృన్మహాలయాపరపక్ష శ్రాద్ధం వాసదైవం సద్యః కరిష్యే" అని. ఈ యుద్దేశించినవారిలో నెవ్వరైన జీవించి యున్న యెడ వారిని విడిచి యన్యుల నుద్దేశించవలెను. మాతామహాదుల స్త్రీలు జీవించినచో సపత్నీకానాం అనుశబ్దమును విడువవలెను. భర్తజీవించినచో స్త్రీకి సభర్తృకశబ్దోచ్చారణ మక్కరలేదు. శ్లో॥"మహాలయే గయాశ్రాద్ధే వృద్ధౌ చా న్వష్టకాసు చ, నవదైవతమత్రేష్టం శేషం షాట్పౌరుషంవిదుః, అన్వష్టకాసు వృద్ధౌచ ప్రతిసంవత్సరే తథా, మహాలయే గయాయాం చ సపిండీకరణాత్పురా, మాతుశ్శ్రాద్ధం పృథక్కార్య మన్యత్ర పతినాసహ." అనఁగా మహాలయము గయాశ్రాద్ధము నాందీశ్రాద్ధము అన్వష్టకా శ్రాద్ధములు వీటియందు మీఁద జెప్పినటుల తొమ్మండ్రు పితృదేవతలు తక్కిన శ్రాద్ధములందు నలుగురేయని మొదటి శ్లోకమున కర్థము. మరియు మీఁదఁ జెప్పిన శ్రాద్ధములందును ప్రత్యాబ్ధికమందును సపండీకరణమునకు ముందుజేయు శ్రాద్ధమందును మాతృశ్రాద్ధము వేరుగా నుద్దేశించవలెను. తక్కిన శ్రాద్ధములలో తండ్రితో కలపి యుద్దేశించవలెనని రెండవ వచనము నున్నందున పార్వణత్రయ ముద్దేశింపఁబడినది. కొందరు మాతామహాదులతో వారి భార్యల గలవక వేరుగ నుద్దేశించి పార్వణచతుష్టయ మందురు. అపుడు పండ్రెండు గురుపితృదేవతలని సిద్ధించును. ఇట్లు మహాలయమందుద్దేశించిన దేవతలనే గంగాతీర్థ శ్రాద్ధమందును నిత్య తర్పణమందును నుద్దేశించవలెను. ఇఁక మహాలయమందు విశ్వేదేవులు ధురిలోచనను లనఁబడుదురు. ఇక్కడ విభవముగలిగినచో విశ్వేదేవతల కిద్ద రిద్దురను విప్రులను మూడుపార్వణములకు నొక్కొకదానికి ముగ్గురేసి చొప్పున దొమ్మండ్రను భార్య మొదలగు నేకోద్దిష్టగణములో ప్రతిదేవత కొక్కొక బ్రాహ్మణునికి మంత్రణ జేయవలెను. అశక్తుఁడైనచో విశ్వేదేవుల కొకరిని పార్వణత్రయమునకు ముగ్గరను నేకోద్దిష్టగణ మంతటికి నొకబ్రాహ్మణుని నిట్లైదుగురను నియంత్రించునది. విశ్వేదేవుల కిద్దరువిప్రుల నియమించుకొనినపుడు పితృపార్వణములకుఁ దొమ్మండ్రే కావలెను గాని ముగ్గురు కాగూడదు. అట్లు తొమ్మండ్రును పార్వణములకు నియమించకొని నపుడు విశ్వేదేవుల కొక్కని నిమంత్రింపఁగూడదు. ఇట్లమావాస్య శ్రాద్ధము మొదలగు వానియందు నూహింపవలయును మిగుల నశక్తుఁడైనచో పారణద్వయమున కొక బ్రాహ్మణునైన నిమంత్రించవలెను. మహాలయమందంతమున విష్ణువు నిమిత్తమొక బ్రాహ్మణుని నియమింపవలెను. కౌస్తుభమందు జీవన్మాతృకుఁడైనచో సపత్నీమాత కేకోద్దిష్టమేగాని పార్వణ మక్కరలేదని యున్నది. సవతితల్లు లనేక సంఖ్యలైనచో సర్వమాతల నుద్దేశించి యొక్క బ్రాహ్మణునే నియమింపవలెను. పిండము నొక్కటియే. అర్ఘ్య పాత్రము వేరువేరుగ నీవలెను. తనతల్లిని గూడ గలపినచో తనతల్లితో నందరు

సవతితల్లులకును నొకబ్రాహ్మణుని నిమంత్రించి యర్ఘ్యము పిండము నని పార్వణమే యగునుగాని ప్రత్యేకముగ నుద్దేశముగాదు. లేదా, సపత్నీమాత లందరకు నేకోద్దిష్ట మైననుగావచ్చును. లేక యొక్క కసపత్ని మాతకు ప్రత్యేక మేకోద్దిష్టమనియైనను గావచ్చును. మహాలయమందు బార్వణత్రయము నిమిత్తమే యగ్నౌకరణముగాని యేకోద్దిష్టము నక్కరలేదుగాని చేసినను దప్పులేదు. చేయునపుడు యేకోద్దిష్టగణార్థమై యగ్నౌకరణాంతము పృథక్పాత్రయందు గ్రహింపవలెను. మహాలయమందు సర్వ పార్వణములకు నేకోద్దిష్టమునకును పిండదాన ముత్తరణ మగుసకృదాచ్ఛిన్న బర్హిస్సు నేకముగానే గ్రహించునది. దర్శాదులలో ప్రతిపార్వణమునకు భిన్నముగానే యది యుండును. తక్కిన శ్రాద్ధ ప్రయోగమునుననేక మాతలగుచో నభ్యంజనాదిమంత్రము నూహించుటయు శ్రాద్ధసాగరమందుగాని తమతమ శాఖల గృహ్యసూత్రమునగాని తెలియవలెను. సకృన్మహాలయము జేసినపుడు శాద్ధాంగమైన తిలతర్పణము పరదిన మందే సర్వపిత్రుద్దేశముజేసి ప్రాతస్సంధ్యకు పూర్వమేగాని యనంతరముగాని బ్రహ్మ యజ్ఞాంగ తర్పణముగాక వేరుగ జేయవలెను. ప్రతిపదాది పంచమ్యాది పక్షముల యందు విప్రుల విసర్జించిన పైని శ్రాద్ధపూజితులైన పితల నుద్దేశించి యపుడే తర్ప ణము జేయవలెను. భార్య రజస్వలయైనచో మహాలయశ్రాద్ధము గూడదు. కాలాంతర మందు జేయవచ్చును. అమావాస్యయందు రజోదోషమైనను నాశ్విన శుక్లపంచమి లోగా జరుపవచ్చును. ప్రతిపదాది పక్షములలో ప్రారంభదినమందు పాకముగాక ముందు పత్ని రజస్వలయైనచో నుత్తరోత్తరపక్షము స్వీకరింపవలెను. ప్రారంభమైన పైని రజస్వలయైనచో నామెను గృహాంతరమందు నిరోధించి మహాలయము జరిగింప వలెను. ఇట్లు విధవస్త్రీ భర్తకుఁ జేయునపుడును నిర్ణయము దెలియునది. అపుడు సంకల్పము. "మమ భర్తృపితృపితామహ ప్రపితామహానాం మమ భర్తృమాతృపితా మహిప్రపితామహీనాం మమ పితృపితామహ ప్రపితామహానాం మమ మాతృపితా మహిప్రపితామహీనాం మమ మాతామహ మాతృపితామహమాతృప్రపితా మహీనాం తృ ప్యర్థం సకృన్మహాలయాపరపక్షశ్రాద్ధం కరిష్యే" యని స్వయముగ సంకల్పించి యవికృతముగ దక్కిన ప్రయోగమంతయు బ్రాహ్మణునిచే జేయించవలెను. బ్రాహ్మణుఁ డు "అముకనామ్న్యా యజమానాయా భర్తృ పితృపితాహ ప్రపితామహ" యని మొదలుగ నుచ్చరింపుచు ప్రయోగము నడిపించవలెను. అశక్తియైనచో "భర్త్రాది త్రయము స్వపిత్రాదిత్రయము స్వమాత్రాదిత్రయము స్వమాతామహాది త్రయము సపత్నీక"మ్మని పార్వణ చతుష్టయమునకే యుద్దేశము. అంతకు నశక్తియైనచో "స్వభర్త్రాది త్రయం స్వపిత్రాదిత్రయం"అని పార్వణద్వయమునే యుద్దేశించునది. మహాలయము జీవత్పితృకుఁడు సహితము తండ్రి సన్న్యసించినను పాతిత్యాది దోష యుక్తుఁడై నను తండ్రియొక్క పిత్రాదుల నందర నుద్దేశించి పిండదానము లేకుండఁ గ సంకల్పవిధిచే శ్రాద్ధము జేయవలెను. ఇట్లు వచనము. శ్లో॥"వృద్ధౌతీర్థేచ సన్యస్తే తాతేచ పతితే సతి, యేభ్య ఏవ పితా దద్యాత్తేభ్యో దద్యాత్స్వయం సుతః" అన అనఁ 0గా నాందీశ్రాద్ధాదులందును తీర్థ శ్రాద్ధమందును తండ్రి సన్యసించినను పతితుఁ

డైనను తండ్రియొక్క పిత్రాదుదుల నుద్దేశించి కొడుకు శ్రాద్ధము జేయునది యని యర్థము. శ్లో॥ "ముండనం పిండదానం చ ప్రేతకర్మ చ సర్వశః న జీవత్పితృకః కుర్యాద్గుర్విణీపతి రేవచ" యని యనఁగా క్షౌరము. పిండదానము సర్వవిధమయిన ప్రేతకర్మయు జీవత్పితృకుండును గర్భిణీపతియును జేయఁగూడదని వచనమున్నం దున సంకల్పవిధి విధింపఁబడినది. పిండదానాది విస్తారము జేయుట కశక్తుఁ డైనను నట్టిసంకల్పవిధి జేయవచ్చును. సంకల్పిక విధియందర్ఘ్యదానము, సమంత్ర కావాహనము, అగ్నౌకరణము, పిండదానము, స్వధావాచనసంకల్పము, ఓం స్వదేత్యాధిక మయిన స్వధావాచన ప్రయోగమును వర్జింపవలెను. అనేక బ్రాహ్మణులు లభింపనిచో దేవస్థానమందు సాలిగ్రామాది దేవమూర్తిని స్థాపించి శ్రాద్ధము జేయ వలెను. బొత్తిగ బ్రాహ్మణుఁడు లభింపనిచో దర్భలచేత వటువునుజేసి శ్రాద్ధము తలితండ్రులమృతియందు ప్రథమాబ్దమున మహాలయము వైకల్పికము. మల మాసమందు మహాలయము జేయఁగూడదు. యీ మహాలయపక్షమందు ప్రత్యాబ్దికము ప్రాప్తించినచో మృతవిధియందు వార్షిక శ్రాద్ధముఁజేసి పాకాంతరముచే మహాలయము జేయవలెను. దర్శయందు ప్రత్యాబ్దికమైనచో బూర్వము వార్షికమున ననంతరమున సకృన్మహాలయమును తదనంతరమున దర్శశ్రాద్ధమును భిన్న భిన్న పాకములచే జేయవలెను. సకృన్మహాలయము మాత్రము వచ్చినను పూర్వము మహాలయము తదనంతరమున దర్శశ్రాద్ధము నట్లుజేయునది. మృతతిథియందు సకృన్మహాలయము మాత్రము వచ్చినను పూర్వము మహాలయము తదనంతరమున దర్శశ్రాద్ధము నట్లు జేయునది. మృతతిథియందు సకృన్మహాలయ మనుపక్షమున దర్శకువలె నా తిథికపరాహ్ణవ్యాప్తి కావలెనని తోఁచుచున్నది.

## భరణీ శ్రాద్ధ నిర్ణయము

ఈ పక్షములో భరణి నక్షత్రమున శ్రాద్ధము గయాశ్రాద్ధఫలదము. భరణీ శ్రాద్ధము సపిండకము షడ్దైవతము సంకల్పవిధిచే జేయునది. విశ్వేదేవులు ధురివి లోచనులైనను పురూరవార్ద్రవులైనను గావచ్చును. యీ శ్రాద్ధము కామ్యము. కనుక గయా శ్రాద్ధఫలము గోరువారు ప్రతిసంవత్సరమును జేయునది. కొందరు పిత్రాది మరణానంతరము ప్రథమవర్షమందే జేయుదురు. ద్వితీయాదులజేయరు. అక్కడ ప్రమాణముగానరాదు. సరియేగదా "న దైవం నాపి వా పిత్ర్యం యావత్పూర్ణో నవత్సర" యని ప్రథమాబ్దమందు దేవపితృకర్మలకు దర్శాదులకు సహితము నిషేద మున్నందున సంవత్సరాంతమందుగాని పితృత్వసిద్ధి కానందునను ద్వితీయాదుల యందే చేయవలెనని నాకుఁదోచు చున్నది. మరియును తలిదండ్రులు గాక తక్కిన మృతులగువారికి గూడ ప్రథమాబ్దమందు భరణీ శ్రాద్ధము జేయుదురు. దానికిని ప్రమాణము జూడుము. గయా శ్రాద్ధఫలకాములై జేసిరేని మృతుఁడు మొదలుకొని యొక్క పార్వణమునే యుద్దేశించి దేవసహితముగ జేయవలెను. అందు సపిండముగా జేయు నాచారమును విచారణీయము. యీ యపరపక్షమందు సప్తమి మొదలు మూఁడు దినములందును గ్రమముగ "మాఘ్యావర్షశ్రాద్ధం కర్తుంపూర్వేద్యుశ్రాద్ధం

కరిష్యే" "మాఘ్యావర్ష శ్రాద్ధం కరిష్యే" "అన్వష్టక్యాశ్రాద్ధం కరిష్యే"యని సంకల్పించి సమస్తమైన యష్టకాశ్రాద్ధవిధియు నాశ్వలాయనులు జేయవలెను. ఆశ్వలాయనుల కీయష్టకా వికృతిరూప మొక యష్టకజేయునపుడును జేయవలెను. "ఇతర శాఖలవారి కష్టకారూపమే గనుక పంచాష్టకలు జేయు పక్షమున నష్టకాశ్రాద్ధంకరిష్యే" యని సంకల్పించి చేయవలెను. యే కాష్టకారణపక్షమందు జేయనక్కరలేదు. నవమియం దన్వష్టక్య శ్రాద్ధము నవసంఖ్య దైవతము. సర్వశాఖలవారు నష్టమియం దష్టకాశ్రాద్ధము జేసినను గృహ్యాగ్నియందు యథోక్తవిధిచే జేయవలెను. ఏమనిన; అష్టకాశ్రాద్ధమం దన్వష్టక్య శ్రాద్ధము ముఖ్యము. గృహ్యాగ్ని లేనివారు పూర్వము తల్లియు వెనుకతండ్రియు మృతులైన యెడ నట్లు మాతాపితృరహితులు పాణిహోమాదివిధిచే నవదైవతముగ జేయవలెను. తండ్రి జీవించియున్నను దల్లిలేనిచో దా ననుపనీతుండైనప్పటికి తల్లి మొదలగు ముగ్గురమాత్ర ముద్దేశించి యొక పార్వణము పురూరవార్ద్రవదైవములతో బిండదాన సహితమయిన శ్రాద్ధము జేయవలెను. తన తల్లి జీవించియున్నను సవతి తల్లి మొదలుకొనియు ముగ్గుర నుద్దేశించిచేయవలెను. తనతల్లియు సవతి తల్లియు మృతులయినచో మాతృశబ్ద మందు ద్వివచన ప్రయోగముచేతను సవతితల్లులు పెక్కండ్రు మృతులైనచో బహువచన ప్రయోగముచేత నొక విప్రునియందు దొక్కక క్షణము నర్ఘ్యము నొకపిండము నీవలెను. "పితామహి ప్రపితామహి" వీరిద్దరకు నిద్దరు విప్రులు రెండు పిండములును నిట్లు పార్వణమావశ్యకము. కొందరు మాతృ బహుత్వమందు నొక్కొకమాత బ్రాహ్మణుని నియమించి యొక్కొకపిండమీయవలె నందురు. తనతల్లియు సవతితల్లియు జీవించియున్నచో దండ్రిలేనివాండయినను గృహ్యాగ్ని లేనిచో చేయనక్కరలేదు. ఏమనిన; అన్వష్టక్యశ్రాద్ధమందు మాతృజనమే ముఖ్యము. కనుకనే కొందరీశ్రాద్ధమందు మాతృపార్వణము ప్రథమమని చెప్పిరి. పూర్వమున దండ్రియు వెనుకతల్లియు మృతులైనచో గృహ్యాగ్ని గలవారలీనవమియం దన్వష్టక్య శ్రాద్ధమవశ్యము జేయవలెను. గృహ్యాగ్ని వారికి వెనుక మాతృమృతియైనచో చేయనక్కరలేదు కొందరు నవమియందు పూర్వము మృతినొందిన మాతృశ్రాద్ధము "మృతే భర్తరిలుప్యతే" యనువచనమున పితృమరణానంతరమందు చేయుచున్నారు. భర్తకంటె ముందు మృతిగాని భర్తతో దహనమునుగాని పొందినవారు మాతామహి, సోదరి, దుహిత, పినతల్లి, మేనత్త మొదలగువారు పుత్రహీనలయినచో మరియు పితృమాతృకులములలో సౌభాగ్యవతులయి మృతిబొందినవారెవ్వరున్నను వారికిని నవమీ శ్రాద్ధము చేయవలెను. ఈ శ్రాద్ధమునకు మహాలయమునకువలె వృశ్చిక సంక్రాంతి పర్యంతము గౌణకాలము. ఇట్లు దౌహిత్రుండు చేయు ప్రతిపద శ్రాద్ధమున కును దెలియవలెనని కాలతత్వవివేచనము చెప్పుచున్నది. ఈ నవమీ శ్రాద్ధమందువలె సౌభాగ్యవతులై మృతినొందిన వారి ప్రత్యాబ్ధికమందును సువాసినీ భోజన మావశ్య కము. ఇట్లు వచనము, శ్లో॥"భర్తురగ్రే మృతానారీసహదాహేన వామృతా, తస్యాస్థానే నియుంజీతవిప్రైస్సహ సువాసినీం" అని మార్కండేయవచన మున్నది. ఈ నవమీ శ్రాద్ధమందుపిండదానము జీవత్పితృకుండైనను గర్భిణీపతియయినను చేయవలెను.

నవమీ శ్రాద్ధము సంభవించనియెడ, "మమాన్వష్టక్యాకరణజనిత ప్రత్యవాయ పరిహారార్థం శతవారం ఏభిర్ద్యుభిసువసనా ఇతి మంత్రజపం కరిష్యే" యని సంకల్పించి యామంత్రము నూరుమారులు జపించవలెను. అన్వష్టక్యమందు సామవేదులు పితృపార్వణమే చేయవలెను. మాతృపార్వణము మాతామహపార్వణమును జేయ గూడదని నిర్ణయ సింధువు చెప్పుచున్నది.

## సన్యాసి మహాలయము

ద్వాదశియందు సన్యాసులకు మహాలయము. అది యపరాహ్ణవ్యాప్తిఁ గలుగు నపుఁడని చెపఁబడినది. అందపరాహ్ణవ్యాపినియైన ద్వాదశి వైష్ణవుల కేకాదశీవ్రత దినమందైనచో స్వల్పమైన ద్వాదశి యందుగాని, లేక త్రయోదశి యందేకాని వ్రత పారణదినమందు సన్యాసి శ్రాద్ధమువారు జరిగింతురుగాని యిట్టివిషయములో సన్యాసి శ్రాద్ధమమావాస్యయందు చేయుటయుక్తమని తోఁచుచున్నది.

## మఘాయుక్త త్రయోదశీ శ్రాద్ధము

త్రయోదశి మఘానక్షత్రముతో గూడినను లేకున్నను శ్రాద్ధము నిత్యము కేవల మఘానక్షత్రమందైనను శ్రాద్ధము విధింపఁబడినది. ఈ శ్రాద్ధమందు బహుపక్షములు యెట్లనిన; పుత్రవంతుఁడైనన పుత్రరహితుఁడైనను గృహస్థుఁడు సపత్నీకపితృపార్వణ మును సపత్నీక మాతా మహ పార్వణమును పితృవ్యభాతృమాతుల పితృష్వసృమాతృ ష్వసృభగినీ శ్వశురాదిపార్వణములను గలపి యుద్దేశించి పిండరహితమైన శ్రాద్ధము సంకల్పవిధిచే చేయవలయును. లేక పిత్రాది పార్వణద్వయమును మహాలయ మందు వలె పితృవ్యాదులయిన యేకోద్దిష్టగణము వారినిగూడ నుద్దేశించి సంకల్పవిధిచే శ్రాద్ధమును చేయవలెను. లేదా నిష్కాముఁడైన పుత్రవంతులు విధిచొప్పున శ్రాద్ధ విస్తారము చేయఁగూడదు. మరియేమనిన; పిత్రాది పార్వణములు రెండును పితృ వ్యాధులతో గలసియైనను లేకుండనైన నుద్దేశించి "ఏతేషాం తృప్త్యర్థం బ్రాహ్మణ భోజనం కరిష్యే" యని సంకల్పించి "పితృరూపిణే బ్రాహ్మణాయ గంధం సమర్ప యామి." యని పంచోపచారములు సమర్పించి "బ్రహ్మార్పణం బ్రహ్మహవి" యను శ్లోకము పఠించి "అనేన బ్రాహ్మణ భోజనేన పిత్రాది రూపీశ్వర ప్రీయతా" మ్మని యన్నము విడిచి పాయసాదిమధురాన్నముచే బ్రాహ్మణులఁదృప్తిఁజేసి దక్షిణచే సంతోష పెట్టి తాను భుజింపవలెనని పుత్రరహితుఁడు సకాముఁడైన వానికి పిండదానరహిత మైన సంకల్పవిధి శ్రాద్ధము దోషకరముగాదు.కొన్ని యెడల సపుత్రునికి పిండదానము గూడ విధింపఁబడినది. ఇట్లు చెప్పిన పక్షములలోనొక పక్షముచే మఘాత్రయోదశీ శ్రాద్ధము చేయకతప్పదు. లేనిచో బ్రత్యవాయము విధించినందున నిది నిత్యము. హస్త నక్షత్రమందు సూర్యుఁడున్నపుడు మఖానక్షత్రముతో గూడిన త్రయోదశి గజ చ్ఛాయయనఁబడును. అపుడు శ్రాద్ధ మధికఫలదము. మహాలయము యుగాదియు రెండును బ్రాప్తమైనచో "మఖాత్రయోదశీ మహాలయయుగాది శ్రాద్ధాని తంత్రేణ కరిష్యే" యని సంకల్పించి యట్లు చేయవలెను. దర్శశ్రాద్ధముచే నిత్యశ్రాద్ధమునకు

దేనికిని బ్రసంగసిద్ధిలేదు. ఇచ్చట నిట్లు తోఁచుచున్నది. అంగముల కన్నిటికైక్యము ప్రదానములకు మాత్ర భేదమునైననో దంత్రము. కనుక విశ్వేదేవులు పాకము మొద లగు నంగములకైక్యము. బ్రాహ్మణులకును నర్ఘ్యమునకును పిండమునకును భేదమే లేదని తెలియవలెను. త్రయోదశీశ్రాద్ధమం దపర పక్షముగనుక హరిలోచన సంజ్ఞి కులు విశ్వేదేవులు. శ్రాద్ధసాగరమందుఁజెప్పఁబడిరి. అవి భక్తభ్రాతలు సహితము నీమ ఘాత్రయోదశీ శ్రాద్ధము. ప్రత్యేకముగ జేయవలెనని సింధుకౌస్తుభాదులు చెప్పు చున్నవి. విభక్తులుగూడ గలిపి పెట్టవలెనని శ్రాద్ధసాగరము. ఇఁక చతుర్దశియందు పిత్రాదులు ముప్పురిలో నొకరైనను శస్త్రవిష అగ్ని జలాది శృంగి వ్యాఘ్రాది వీనిలోనొక దానిచే దుర్మరణమునొందిన నేకోద్దిష్ట విధిచే శ్రాద్ధము జేయవలెను. పితృపితామహు లిద్దరు శస్త్రహతిచే మృతినొందినచో రెండకోద్దిష్టములు చేయవలెను. తండ్రి మొదలు కొని ముగ్గురు శస్త్రాహతులైనచో బార్వణమే చేయవలెను. కొందరేకోద్దిష్టత్రయమే చేయవలెనందురు. సహగమన మందును ప్రయాగాది మృతియందును వానప్రస్థులకు విధించిన జలాగ్న్యాది మృతియందును జతుర్దశీ శ్రాద్ధ మక్కరలేదు. యుద్ధమందును ప్రాయోపవేశనమందు నట్టిమృతి విధింపఁబడినను జతుర్దశీ శ్రాద్ధము జేయవలెను.

## శస్త్ర హత మహాలయము

అపుడు శస్త్రాదులచే మృతినొందిన పినతండ్రి సోదరుఁడు మొదలగువారికి సహితము పుత్రులులేనిచో దాను జేయవలయును. ఈయేకోద్దిష్టము ధురివిలోచన సంజ్ఞిక దేవసహితము. అపుడు సంబంధము గోత్రము నామము నుచ్చరించి, "అముక నిమిత్తే నమృతస్య చతుర్దశీ నిమిత్త మేకోద్దిష్టం శ్రాద్ధం సదైవం సపిండకం కరిష్యే" యని సంకల్పించి ప్రతియేకోద్దిష్టమునకును నొక యర్ఘ్య మొక పవిత్ర మొకపిండముల గల శ్రాద్ధముఁ జేయవలెను. పిత్రాదులు శస్త్రహతులైనచో మమాలయమువలె పృథ క్పాకాదికముచేనైనను, లేదా తంత్రముచే నొక్కమారైనను నేకద్దిష్టద్వయము మొదలగు నవి చేయవలెను. ఇట్లు చతుర్దశియం దేకోద్దిష్టద్వయము జేసినను పిత్రాదుల నందర నుద్దేశించి మరియొక తిథియందు సకృన్మహాలయము జేయవలెను. మరియు నీచతుర్దశి యందే శస్త్రాదిహతులైన తలిదండ్రుల మృతదినమైనచో జతుర్దశీనిమిత్తక మైన యేకోద్దిష్టము జేసిన పైని తిరుగ పిత్రాది త్రయము నుద్దేశించి పార్వణవిధిచే సాంవత్సరిక శ్రాద్ధము జేయవలెనని శ్రాద్ధసాగరము చెప్పుచున్నది. కౌస్తుభాదికము సాంవత్సరిక శ్రాద్ధము చేతనే చతుర్దశీ శ్రాద్ధము సిద్ధించును. మరి చేయనక్కరలేదని చెప్పినది గాని దినాంతరమందు సకృన్మహాలయము తప్పదు. ఇచట చతుర్దశీశ్రాద్ధ మున కెట్లని విఘ్నము వచ్చినచో నీపక్షమందుగాని ముందుపక్షమందుగాని దినాంతర మందది పార్వణ విధిచేతనే చేయవలెను. ఏకోద్దిష్టము గూడదు. ఈ యేకోద్దిష్టము నకు జతుర్దశి యపరాహ్ణవ్యాపిని గావలయునుగాని యితరైకోద్దిష్టమునకువలె మధ్యాహ్న వ్యాపిని మాత్రమే కాదని కౌస్తుభమందున్నది.

## యమాగజచ్ఛాయ

హస్త నక్షత్రమున సూర్యుఁడుండఁగ హస్తనక్షత్రముతో గూడిన యమావాస్య గజచ్ఛాయ. అపుడు శ్రాద్ధము దానము మొదలగునవి చేయవలెను. ఇది యమాగజ చ్ఛాయ యనఁబడును.

## దౌహిత్ర శ్రాద్ధము

అశ్విన శుక్లప్రతిపదయందు దౌహిత్రుఁ డనుపనీతుఁడైనను సపత్నీకుఁడైన మాతామహునికి పార్వణము తనకు మేనమామ లున్నప్పటికిని చేయవలెను. మాతా మహి జీవించియున్నచో నొక్కమాతా మహపార్వణమే చేయవలెను. ఇది జీవత్పితృకుడై నను చేయఁగూడును. ఇది పిండాదానీ సహితముగగాని పిండరహితముగాగాని చేయవచ్చును. ఇక్కడ విశ్వేదేవులు పురూరవార్ద్రవ సంజ్ఞికులు ధురివిలోచన సంజ్ఞికు లని కొందరు. ఈ ప్రతిపత్తిథి యపరాహ్ణవ్యాపిని గావలెనని బహుసమ్మతము. సంగవవ్యాప్తి చాలునని కొందరు, ఈ శ్రాద్ధమునకు వృశ్చికపర్యంతము గౌణకాల మని కాలతత్వవివేచనము. ఇట్లు మహాలయ నిర్ణయోద్దేశము.

## కపిలాషష్ఠి

భాద్రపద కృష్ణపక్షమున మంగళవారము వ్యతీపాత, రోహిణీ నక్షత్రము వీనితో గూడిన షష్ఠి కపిలాషష్ఠి యనఁబడును. అపుడు సూర్యుఁడు హస్తయందున్న యెడ ఫలాతిశము. ఇది సూర్యపర్వము గనుక నీ యోగము పగలే సంభవింపవలెనని తోఁచుచున్నది. శ్లో॥"అస్యాం హుతం చ దత్తం చ సర్వం కోటి గుణం భవేత్." అనఁగా నీషష్ఠియందు చేయు హోమము దానమును కోటిరెట్ల ఫలమిచ్చునని శ్రాద్ధము చేయవలెనని మాత్రము ప్రమాణముగానరాదు గాని యలభ్యయోగములందు శ్రాద్ధ విధియున్నది. గనుక దర్శవలె షడ్దైవతమైన శ్రాద్ధము చేయవలెను.

## సూర్య వ్రతవిధి

సూర్యునుద్దేశించి యుపవాసము సంకల్పించి, దేవదారుచెక్క, వట్టివేళ్ళు, చందనము, ఏలకులు, మనశ్శిల, పద్మకాష్ఠము, తండులములు వీటిని తేనెతోను నావుపాలతోను నూరిక్షీరముగలపి యాపిండి బూసుకొని స్నానము చేయవలెను. అపుడు మంత్రము. "అతస్త్వం మసి దేవేశ జ్యోతిషాం పతిరేవచ, పాపం నాశయ మే దేవ వాఙ్మనః కాయకర్మజం" అనఁగా ఉదకస్వరూపుఁడవు జ్యోతిస్సులన్నిటికి నధిపతివి యోదేవేశుఁడ! సూర్యుఁడ! నాదుకరణత్రయముచే గలిగిన పాపమును హరింపుమని యర్థము. ఇట్లు పఠించి పంచగవ్యముచే స్నానముచేసి పంచ పల్లవము లచే మార్జనము చేసుకొని మృత్తికబూసుకొని స్నానము చేయవలెను. తర్పణాదినిత్య కర్మలు చేసిన పైని వరుణుని పూజించి సర్వతో భద్రమండపమునకు మధ్యమందు కలశము తండులాదులనింపి యందు పద్మములిఖించి దాని యెనిమిది దళములం దును తూర్పు మొదలుకొని "సూర్యం, తపనం, స్వర్ణరేతసం, రవిం, ఆదిత్యం, దివా కరం, ప్రభాకరం, సూర్యమావాహయామి" యని యావాహనముచేసి మధ్య

మందు సువర్ణరథముపై సూర్యుని నగ్రమందు వరుణునావాహనముచేసి గన్నేరు మొదలగు పుష్పములచేతను ధూపాదులచేతను పూజించునది. దిక్పాలకాది దేవతలను బూజించి పం(డెడర్ఘ్యములు సూర్యునికీవలెను. తక్కిన పూజావిస్తారమునర్ఘ్యమంత్రము లును కౌస్తుభాదులయందు దెలియునది. సూర్యునియెదుట– శ్లో॥"ప్రభాకర నమస్తు భ్యం సంసారాన్మాం సముద్ధర, భుక్తిముక్తి ప్రదో యస్మా త్తస్మాచ్ఛాంతి ప్రయచ్ఛమే నమోనమస్తే వరద ఋక్సామయజుషాపంతే, నమోస్తు విశ్వరూపాయ విశ్వధాత్రే నమోఽ స్తుతే" అని ప్రార్థించి; యనఁగానో ప్రభాకరుఁడ! నీకు నమస్కారము భోగ మోక్షము లిచ్చువాడవు నీవే. నాకు శాంతినిచ్చి సంసారమునుండి తరింప చేయుము. నీవే మూఁడు వేదముల కధిపతిని జగద్రూపుఁడవు. జగత్పోషకుఁడవును. నీకు మరియు నమస్కారమని యర్థము. ఉదుత్యమని మొదలగు సౌరసూక్తముల జపించి రాత్రి జాగరముచేసి "ప్రాతఃకాలమందాకృష్ణేన" యను మంత్రముచే జిల్లేడు సమిధలు చరువు నాజ్యముతిలలు వీనిచేప్రతి ద్రవ్యము నష్టోత్తర శతమగునట్లు హోమముచేసి ఘంటలు మొదలగు సర్వాలంకారములతో గూడిన కపిల గోవును మంత్రములచే బూజించి బ్రాహ్మణుని కీయవలెను. గోపూజా మంత్రములు కౌస్తుభ మందు దెలియునది. దానమంత్రము: "నమస్తే కపిలే దేవి సర్వపాప ప్రణాశిని, సంసారార్ణవ మగ్నం మాం గోమాతస్త్రాతు మర్హసి" అనఁగా నోకపిలా! నీవు గోవుల కెల్ల తల్లివి. సర్వపాపముల సంహరించుదానవు. సంసార సముద్రమున మునుఁగు నన్ను రక్షింపుమని ప్రార్థించి "వస్త్రయుగచ్ఛన్నాం స ఘంటాంరౌప్య ఖురయుతాం స్వర్ణశృంగీ మిమాం కపిలాంగాంతుభ్య మహం సంప్రదదే" యని దానముచేసి సువర్ణ దక్షిణ నీయవలెను. అనంతరమున నా విప్రునికే రథమును సూర్యప్రతిమను నీయవలెను. అపుడు మంత్రము : "దివ్యమూర్తిర్జగచ్చక్షు ర్ద్వాదశాత్మా దివాకరః కపిలా సహితో దేవో మమ ముక్తిం ప్రయచ్ఛతు, యథాత్వం కపిలే పుణ్యా సర్వలోకస్య పావనీ, ప్రదత్తా సహసూర్యేణ మమ ముక్తిప్రదా భవ" యని. అనఁగా దేవతా మూర్తియు జగత్తుకు దృగ్రూపుఁడు పం(డెండు రూపములుగల సూర్యుఁడు కపిలతో గూడ నాకు ముక్తి నీవలయును. ఓకపిలా! నీవెట్లు జగత్పావనివో అట్లు సూర్యునితో దానము చేయఁబడితివి నాకు మోక్షప్రదురాలవు గమ్మని యర్థము. ఇంక కపిలాప్రార్థ నాది విస్తారము కౌస్తుభమందు తెలియునది అశక్తుఁడైనచో నుపవాసము జాగరము హోమము మొదలగునవి విడిచి షష్ఠియందే స్నానము రథాదిపూజనము కపిలాదానాది కము చేయవలెను. ఇట్లు సంక్షేపముగ గపిలాషష్ఠీ వ్రతవిధి ముగిసెను.

ఇది ధర్మసింధుసారమున భాద్రపదమాసకృత్య నిర్ణయోద్దేశము ముగిసెను.

## దేవీ నవరాత్రారంభము

తులాసంక్రాంతియు మేషసంక్రాంతియు విషువమనఁబడును. అట్టి విషువము నకు పూర్వమునను ననంతరమునను పదునైదుగడియలు పుణ్యకాలము. విశేషము జెప్పఁబడినది. అశ్విన శుక్లప్రతిపదయందు దేవీనవరాత్రారంభము. నవరాత్రశబ్దము శుక్లప్రతిపద మొదలుకొని మహానవమి పర్యంతము చేయుకర్మమునకుఁబేరు. ఆ

కర్మయందు పూజయే ప్రధానము. ఉపవాసాదీకము స్తోత్రజపాదికము నంగము. కనుక కులాచారము ననుసరించి యుపవాసము. ఏకభుక్తము, నక్తము, అయాచితము వీనితో నొక వ్రతముతో కులాచారము చొప్పున సప్తశతి లక్ష్మీహృదయము మొదలగు స్తోత్రములజపముతో ప్రతిపద మొదలు నవమి పర్యంతమయిన పూజయను తొమ్మిది దినములచేయు కర్మనవరాత్రమనఁబడును. పూజ ప్రధానమగుటచేతనే కొన్ని కుల ములందుపవాస జపాది నియమము గానరాదు. పూజచేయకుండుట నవరాత్రము. చేయు కులమందెచ్చటను గనఁబడదు. అట్టి నవరాత్రారంభము ప్రతిపత్తిథి సూర్యో దయానంతరమున నారుగడియలవకు నున్నచో చేయవలెను. లేక రెండు ముహూర్త ములున్నను చేయవచ్చును. కొన్ని గ్రంథములలో ముహూర్తములున్నను గ్రహింప వచ్చునని యున్నది. యెట్లైనను నమావాస్య గూడిన ప్రతిపదయందు చేయఁగూడ దని బహుగ్రంథ సమ్మతము. ముహూర్తమునకు దక్కువయైనచో నమావాస్యా విద్ధయు గ్రహింపకతీరదు. మరియు పూర్వదినమందరువదిగడియలుండి మరునాడు నాలుగు గడియలవరకు ప్రతిపదయున్నచో బూర్ణమగుటచే బూర్వదినమే గ్రహించునది ద్వితీయతో గూడినపుడు నిషేధము నీరెండు పక్షములిందేయని తెలియవలెను. పురుషార్థ చింతామణిలో బూర్వదినమందు నాలుగుగాని యైదుగాని ముహూర్తము లైన ప్రవేశించి మరునాడు రెండు ముహూర్తములు మొదలగు పరిమితిగలదై యున్న యెడ పరదినము క్షయగామి యగుటచే నిషిద్ధము గనుక నమావాస్యతో గూడిన దైనను, బూర్వదినమే గ్రహింపవలెనని యున్నది. అందు సూర్యోదయానంతరము పదిగడియల పర్యంతములోగా ప్రారంభము సంభవింపనిచో మధ్యాహ్నమునందభి జిన్ముహూర్తమందు చేయవలెనుగాని యపరాహ్ణమందు చేయఁగూడదు. కాఁబట్టి ప్రతిపద యొక్క మొదలిటి పదియారుగడియలు గూడదను నిషేధమును చిత్రావైధృతి యోగనిషేధమును మీఁద జెప్పిన కాలమునకు బాధకము గానిచో నంగీకరింప వలెనుగాని నిషేధము నవలంబించి పూర్వాహ్ణరూపమైన ప్రారంభకాలము గాని ప్రతిపత్తిథిగాని యతిక్రమింపగూడదు. ఈ నవరాత్ర కర్మయందు బ్రాహ్మణాది వర్ణ చతుష్టయమునకును మ్లేచ్ఛాదులకు సహితమధికారము. అందు బ్రాహ్మణుఁడు జప హోమాన్న బలి నైవేద్యములచేతను సాత్విక పూజచేయవలెను. “నైవేద్యశ్చనిరామిషైః మద్యం దత్వా బాహ్మణస్తు బ్రాహ్మణ్యాదేవహీయతే, మద్యమ పేయ మదేయం” అని మొదలగు వచనములచే మద్యమాంసములు నిషిద్ధము లగుటచే వాటితోగూడిన రాజస పూజయందు బ్రాహ్మణున కధికారమే లేదు. మరియును మద్యపానము మరణాంతప్రాయశ్చిత్తమును మద్యము ముట్టినయెడ నాయవవయము ఛేదించు టయు ప్రాయశ్చిత్తముగ విధింపఁబడినందున తక్కువ ప్రాయశ్చిత్తముచే దోష పరిహారముగాక పతిత్వము సంభవించును. ఇటులనే ప్రాచీనులైన నిబంధనకారు లందరు. దమతమ గ్రంథములలో వ్రాసిరి. నవీనులు నట్లనే వ్రాయుచున్నారు. నవీనతరులైన భాస్కర రాయాదులు సహితము సప్తశతీ టీకాదులందిట్లనే పరిష్కరింపు చున్నారు. సభయందు నిట్టిమతమునే శ్లాఘింపుచున్నారు. ఆచరణము మాత్రము

మరియొక విధముగ చేయుచున్నారు. అట్లు దాఁచుట తాను దుర్దైవవశముచే బాతిత్యము నొందితిని. నావలె నన్యులును చెడకపోదురు గాక యని భూతదయ చేతనో లేక తన పాతిత్యము దాఁచుకొనుటలో లేక యన్యులైన కలికాలవిప్రుల కధి కారము లేదనియో, మనము యథార్థము దెలసికొనజాలము. క్షత్రియాదులకైనచో మాంసాదిసహితమైన రాజసపూజయందుగూడ నధికారము. అవి కేవలము కామ్యమే గాని నిత్యముగాదు. నిష్కాములైన క్షత్రియాదులు సహితము సాత్వికపూజ చేసిరేని మోక్షప్రాప్తి మొదలగు ఫలాతిశయము గలుగును. ఇట్లు శూద్రాదులకు నూహించునది. శూద్రాదులకు మంత్రహీనమై మాంసాది సహితమైన తామసపూజయును విధింపఁ బడినది. శూద్రులు సప్తశతి మొదలగు వానియొక్క జపహోమాది సహితమైన సాత్విక పూజ బ్రాహ్మణునిచే జేయింపవచ్చును. స్త్రీశూద్రాదులు స్వయముగా పురాణ మంత్ర ములనైన పఠించుట కనధికారులు. కనుకనే "శూద్రస్సుఖమవాప్నుయాత్" అను శ్లోకమున భాష్యమందు స్త్రీ శూద్రులకు వినుటనుండి యే ఫలము సిద్ధించును. పఠన మక్కరలేదని చెప్పఁబడినది. కనుక స్త్రీ శూద్రులు గీతావిష్ణు సహస్రనామాదికము పఠించిరేని దోషమని తెలియవలెను. కొన్నిటిలో పురాణమంత్రయుక్త పూజాదికమందు స్త్రీ శూద్రులకు నధికారము చెప్పఁబడినది. అయినను జపహోమాదికము బ్రాహ్మణుని చేతనే కావలెను. మ్లేచ్ఛాదుల కయినచో బ్రాహ్మణుని జపహోమపూజాదులందు వరించుటకు నధికారము లేదు. మఱి యేమనిన, దేవి నుద్దేశించి పూజోపచారము లకుఁ దగిన ద్రవ్యము నిచ్చుటయే చేయవలెను.

## నవరాత్ర్యమం దనుకల్పములు

తృతీయ మొదలుకొని నవమిపర్యంతము సప్తరాత్రమయినను పంచమి మొదలుకొని యయిదు రాత్రులయినను సప్తమి మొదలుకొని మూఁడు రాత్రులయి నను నష్టమి మొదలు రెండు రాత్రులయినను కేవలాష్టమియందుగాని కేవలనవమి యందుగాని యొకరాత్రియైనను జేయవచ్చును. యీ పక్షములలో కులాచారమును పట్టియైనను ప్రతి బంధాదులచే మొదటిపక్షము సంభవింపకున్నను వ్యవస్థ యని తెలియవలెను. అందు తృతీయాపంచమీ పక్షములకు ప్రతిపదకువలె నిర్ణయము సప్తమి మొదలగు పక్షముల నిర్ణయము ముందుఁ జెప్పఁబడును.

## కలశస్థాపన విధి

ఈ నవరాత్రి మొదలగు పక్షములలో తిథివృద్ధి క్షయములచే నాధిక్యము న్యూనత్వము గలుగునపుడు పూజాదుల కావృత్తి చేయవలెను. అనఁగా క్షయించిన తిథియొక్క పూజాదులు రెండుమారులు చేయవలెననుట. కొందరు దినక్షయమం దెనిమిదియే పూజలు చండీపాఠములును చేయుచున్నారు. ఈ దేవీ పూజనరూపమైన నవరాత్ర కర్మనిత్యము. కనుక చేయనిచో దోషము విధింపఁబడినది. ఫలము గూడ విధించినందున గామ్యమునుం గావచ్చును. యీ నవరాత్రమందు కలశస్థాపనమును, ప్రాతఃకాలము మధ్యాహ్నము ప్రదోషమునను నీ మూఁడుకాలములందుగాని రెంటి

యందుగాని యొక కాలమందుగాని తమ తమకులదేవతను బూజించుటయు సప్తశతి మొదలగు వాని జపము నఖండదీపము నాచార ప్రాప్తమైన మాలాబంధనము నుప వాసనక్తైక భక్తాదులలో నొక నియమము సువాసినీ భోజనము కన్యాభోజన పూజనాది కము నంతమందు సప్తశతి మొదలగు స్తోత్రములకు మంత్రములకు హోమము మొదలగునవియు విధింపఁబడినవి. ఇందులో గలశస్థాపనము మొదలు రెండు మూఁడుకర్మలు మాత్రమే కొందరాచరింపుచున్నారు. మరికొందరు కలశస్థాపనాదులు మాని తక్కినవి యాచరింపుచున్నారు. అన్నిటి నాచరించువారరుదుగ నున్నారు. కనుక కులాచారము ననుసరించి వాటికి సముచ్చయమును వికల్పము నూహింప వలెను. కులపరంపరచే ప్రాప్తమైన దానికంటె నధికము దనుకు శక్తిగలిగిను జేయఁ గూడదని శిష్టాన్నను జేయుచున్నారు. అట్టి కలశస్థాపనము రాత్రిఁజేయఁగూడదు. అందు కలశస్థాపనమునకు శుద్ధమైన మృత్తికచే వేదిక నిర్మించి పంచపల్లవములు దూర్వలు ఫలములు తాంబూలములు కుంకుమము ధూపద్రవ్యము మొదలగు సంభారములు సంపాదించవలెను. ఇఁక సంక్షేపముగా ప్రయోగవిధి చెప్పఁబడును. ప్రతిపదయందు ప్రాతఃకాలమున నభ్యంగ స్నానముచేసి కుంకుమ చందనాదులచే దిలక ముంచుకొని పవిత్రము ధరించి భార్యతోగూడ పదిగడియలలోగా నైనను నభిజిన్ముహూర్తమందైనను దేశకాలము లుచ్చరించి “మమ సహకుటుంబస్యాముక దేవతా ప్రీతి ద్వారా సర్వాపచ్ఛాంతిపూర్వక దీర్ఘాయు ర్ధనపుత్రాదివృద్ధి శత్రుజయకీర్తి లాభ ప్రముఖచతుర్విధ పురుషార్థ సిద్ధ్యర్థ మద్య ప్రభృతి మహానవమీ పర్యంతం ప్రత్యహం త్రికాల మేకకాలం వాముక దేవతాపోజాముపవాస క్తైక భక్తాన్యతమ నియమ సహిత మఖండదీపజ్వాలన కుమారీపూజన చండీసప్తశతీ పాఠసువాసినీ భోజనాది రూపం శారదనవరాత్రోత్సవాఖ్యం కర్మకరిష్యే” యని సంకల్పించి “దేవతా పూజాంగత్వేన ఘటస్థాపనంకరిష్యే” యను సంకల్పముతో గలశస్థాపనము జేయునెడ “మహాద్యౌ” అను మంత్రముచే భూమిని ప్రార్థించి స్పృశించి యా భూమియందంకు రారోపణము కొరకు శుద్ధమృత్తిక నుంచి “ఓషధయస్స” మను మంత్రముచే నామృత్తిక యందు యవాదులను జల్లి, “ఆకలశేషు” అను మంత్రముచే గలశమునుంచి, “ఇమం మే గంగే” యనుమంత్రముచే జలము నింపి “గంధద్వారా” మనుమంత్ర మున గంధము, “యాఓషధీః” అను మంత్రముచే సర్వోషధులను “కాండాత్కాండా” త్తను మంత్రమున దూర్వలును “అశ్వత్థేవః” అను మంత్రమున బంచపల్లవములును “స్యోవాపృథివీ” యనుమంత్రమున సప్తమృత్తికలను “యాఃఫలినీః” అను మంత్రమున ఫలమును “సహిరత్నాని హిరణ్యరూపం” అను మంత్రముచే రత్న హిరణ్యములును సమర్పించి “యువాసువాసా” యను మంత్రమునఁ బట్టజుట్టి “పూర్ణాదర్వి” యను మంత్రమున బూర్ణపాత్రముంచి “తత్త్వాయామి”యనుమంత్రమున వరుణుని బూజించి యాకలశముపై నిగుల దేవతా ప్రతిమనుంచి పూజింపవలెను. లేదా స్వస్థానమందేయుంచి యైనను పూజింపవచ్చును. అది యెట్లనినన; “జయంతిమంగలా కాళీ భద్రకాళీ కపాలినీ, దుర్గాక్షమా శివాధాత్రీ స్వాహాస్వధ నమోస్తుతే, ఆగచ్ఛ

పరదేవేవి దైత్యదర్పనిషూదని, పూజాంగ్ర్పహాణ సుముకి నమస్తే శంకరప్రియే"అను నీ మంత్రములచేతను శ్రీసూక్త పురుషసూక్త ప్రథమ ఋక్కులచే తను నావాహనము జేసి జయంతీ యను శ్లోకమంత్రమును సూక్తములపై ఋక్కుల నుచ్చరింపుచు నాసన పాద్యాది షోడశోపచారములచే బూజింపవలెను. "సర్వమంగల మాంగళ్యే" ఇత్యాదులచే ప్రార్థించి ప్రత్యహము బలిదానము జేయుపక్షమున మాషాన్నము చేతగాని కూశ్మాండమనఁగ గుమ్మడికాయచే గాని బలి దానమీయవలెను. ఇట్లు బలిదానమంతమందు మాత్రమైనను చేయవచ్చును. చేయకుండడమును గలదు. బ్రాహ్మణుఁడు దీక్షానంతరపారణదినమందు కూశ్మాండ బలిదానము చేయవలెను. "కూశ్మాండో బలిరూపేణ మమభాగ్యా దవస్థితః, ప్రణమామి తతస్సర్వ రూపిణం బలి రూపిణం, చండికా ప్రీతి దానేన దాతురాప ద్వినాశనం, చాముండా బలిరూపాయ బలేతుభ్యం నమోస్తుతే" అని. అనఁగా నోబలిదానమా! నా భాగ్యముచే గూశ్మాండ రూపమై యుంటివి. దేవికి బ్రీతియొనర్చి నాయాపదల నశింపఁజేయుము. బలి రూపముచే సర్వస్వ రూపివగు నీకు నమస్కారమనిప్రార్థించి "యజ్ఞార్థం బలయస్సృష్టా స్స్వయమేవ స్వయంభువా, తస్మా త్త్వాం ఘాతయిష్యామి తస్మాద్యజ్ఞే వధోఽవధః "ఓం హ్రీం, ఐం హ్రీం కౌశికీ కూశ్మాండరసేనాప్యాయతాం" అను మంత్రముచే గూశ్మాండము ఖండించి పాదములు గడిగికొని యాచమనముజేసి "శాంతాపృథివీ" యను "శాంతిశ్శాంతి శ్శాంతిః" అని పఠించి 'అఖండదీపకందేవ్యాః ప్రీతయే నవరాత్ర కం, ఉజ్జ్వాలయేదహోరాత్ర మేకచిత్తో దృఢవ్రత" యనుమంత్రముచే తొమ్మిది రాత్రుల నఖండముగ వెలుగున ట్లఖండదీపము స్థాపించవలెను.

## సప్తశతి పఠించు విధి

ఇఁక చండీపాఠప్రకారము "యజమానేన వృత్తోఽహం చండీ సప్తశతీపాఠం నారాయణహృదయలక్ష్మీ హృదయ పాఠంవా కరిష్యే" యని మొదలుగ సంకల్పించి యాసనాదుల సిద్ధముజేసి పీఠమందితరుల హస్తముచే లిఖింపఁబడిన పుస్తకమునుంచి "ఓం నారాయణాయ నమః, ఓం నరాయనరోత్తమాయ నమః, ఓం సరస్వత్యై నమః, ఓం వ్యాసాయ నమః" యని నమస్కరించి యోంకారము నుచ్చరించి పాఠమం తయు నంతమగునపుడు నోంకార ముచ్చరింపఁవలెను. పుస్తకము చదువునపుడు నియమములు : పుస్తకము చేతిలో ధరింపఁగూడదు. తాను గాని బ్రాహ్మణ బిన్నుఁ డుగాని లిఖించిన పుస్తకము విఫలము. "అధ్యాయం ప్రాప్యవిరమే న్నతు మధ్యే కదాచర, కృతే విరామే మధ్యేతు అధ్యాయాది పఠేత్పునః" అనఁగా అధ్యాయ మంతయు పూర్తిఁజేసి విడువవలెనుగాని మధ్యమందు విరామముగూడదు. అట్లైనచో దిరుగ నాయధ్యాయము మొదలునుండి పఠించవలెను. గ్రంథార్థమును బోధించుకొనుచు నక్షరోచ్చారణము స్పష్టముగ నతివేగము నతిమందము గాకుండగ రసభావానుకూల మైన స్వరముతో జదువవలెను. త్రివర్గఫలమును గోరువారు చండీపాఠ మెల్లప్పుడును జేయవలెను. ఇందుకు వచనము – "తస్మాన్మమైత న్మాహాత్మ్యం పఠితవ్యం సమాహితైః శ్రోతవ్యంచ సదాభక్త్యా" యని మొదలగువచనము లున్నవి. నైమిత్తిక పాఠమును

విధింపఁబడినది. ఎట్లనిన; "శాంతికర్మణి సర్వత్ర తథా దుస్వప్నదర్శనే, గ్రహపీడా సుచోగ్రాసు మాహాత్మ్యం శృణు యాన్మమ" యనఁగా శాంతికర్మ జేయునపుడును దుష్టస్వప్నమైనపుడును సుగ్రమైన గ్రహావేశములందును నామాహాత్మ్యము వినినచో నరిష్టముబోవునని దేవీవచనమున కర్థము. మరియు "నరణ్యేప్రాంతరేవాపి దావాగ్ని పరివారితః,దస్యుభిర్వ్యావృతశ్శూన్యే గృహీతో వాపిశత్రుభిః" అని యాపదల నుద్దేశించి యనఁగా జలము జనులు లేనియడవిలో దావాగ్ని చుట్టు ముట్టినపుడును దొంగలు దనను ముట్టడించినపుడును శత్రువు లాక్రమించునపుడు నిట్టి యాపదల నుద్దేశించి "సర్వబాదాసు ఘోరాసు వేదనాభ్యర్ధితోஉపివా, స్మరస్మమైత న్మాహాత్మ్యం నరోము చ్యేతసంకటాత్" అనఁగా నట్టియాపదలచే వేదననొందుచున్నప్పుడును నామాహాత్మ్య ముస్మరించు మాత్రము ననాబాధశమించును. అసుఖియగునని చెప్పఁబడినది. ఉపద్రవము శాంతించుటకు మూఁడు పాఠముల జేయవలెను. గ్రహపీడానివృత్తికైదు చేయునది. మహాభయమువచ్చునపుడేడు పాఠములు, శాంతికై వాజపేయ ఫలమునకై తొమ్మిది పాఠములు, రాజవశ్యమునకు పదునొకండు, శత్రునాశమునకు బండ్రెండు, స్త్రీ పురుషవశ్యతకై పదునాలుగు, పుత్రపౌత్ర ధనధాన్యార్థము పదియారు, రాజభయ నాశమునకు పదునేడు, ఉచ్చాటనమునకు పదునెనిమిదియు, వనభయమునందిరు వది, బంధము విడుపించుకొనుట కిరువదియైదు, అసాధ్యరోగము కులచ్ఛేదము, నాయుర్నాశము, వైరివృద్ధి, వ్యాధి, దివ్యభామాంతరిక్ష రూపములైన త్రివిధోత్పాతములు మొదలగు మహోపద్రవ్యములు పోవుటకు రాజ్యవృద్ధికిని నూరుమారులు పాఠములు చేయవలెను. వేయిమారులు చేసినచో శతాశ్వమేధ ఫలము సర్వమనోరథ సిద్ధియు మోక్షప్రాప్తియు నని వారాహితంత్రమునఁ జెప్పఁబడినది. కామ్య పాఠమందాది యందు సంకల్పపూర్వముగ బూజయు నంతమున బలిదానమును జేయవలెను. మరియు నాచారముండుటవలన వేదపాఠమును జేయవచ్చును. దాని విధి బోధాయ నునిచే జెప్పబడినది. కౌస్తుభము జూడుఁడు.

## కుమారీపూజ

"ఏకవర్షాతు యాకన్యా పూజార్థం తాం వివర్జయేత్" అనఁగా నొకసంవత్స రము వయస్సుగల కన్యనుదప్ప రెండు సంవత్సరములు మొదలుకొని పదిసంవత్సర ముల పర్యంతము వయస్సుగలిగిన కన్యకలకు నామములు. కుమారి, త్రిమూర్తి, కల్యాణి, రోహిణి, కాళి, చండిక, శాంభవి, దుర్గ, భద్రయని తొమ్మిది విధములు. యీ కుమారికలకు ప్రత్యేకముగ బూజా మంత్రములు ఫలవిశేషములు లక్షణములు నన్యగ్రంథములఁ దెలియునది. బ్రాహ్మణునికి బ్రాహ్మణకన్యకలు పూజార్హలు. ఇట్లు సవర్ణకన్యకలే ప్రశస్తము. విజాతీయులుకూడ గామనావిశేషమందు జెప్పఁబడిరి. ఏకైకవృద్ధిచేగాని ప్రత్యహమొకకుమారినిగాని పూజింపవలెను. "మంత్రాక్షర మయీం లక్ష్మీం మాతౄణాం రూపధారిణీం, నవదుర్గాత్మికాంసాక్షాత్కన్యా మావాహయా మ్యహం, జగత్పూజ్యే జగద్వంద్యే సర్వశక్తి స్వరూపిణి, పూజాం గృహాణ కౌమారీ జగన్మాతర్ణమోస్తుతే" అనఁగా మంత్రాక్షరస్వరూపురాలును సప్తమాతృకలై యవతరించి

నదియు నవదుర్గాత్మకమై లక్ష్మీదేవిని కన్యారూపముగ నావాహనము జేయుదును. జగత్తుచే బూజించి నమస్కరింపఁబడు నోజగజ్జనని కౌమారి నీకు నమస్కారము. నే జేయు పూజను గ్రహింపుమని ప్రార్థించి పాదప్రక్షాళన పూర్వముగ వస్త్రకుంకుమ గంధధూపదీప భోజనములచే బూజింపవలెనని సంక్షేపము. కుమారీపూజవలె దేవీ పూజయు చండీపాఠమును నేకోత్తరవృద్ధిగను విధింపఁబడినది. లలితా సహస్రనామ పాఠముగూడ గొన్నిటియందు విధింపఁబడినది. యీ శారదనవరాత్రోత్సవము మల మాసమందు నిషిద్ధము. శుక్రాస్తమయాదులందు జేయవచ్చునుగాని ప్రథమారంభము గూడదు. జాతాశౌచమృతాశౌచాదులందు గలశస్థాపనము మొదలుగ నన్నియు బ్రాహ్మణునిచే జేయింపవలెను. కొందరు ప్రారంభానంతరమందాశౌచము వచ్చునేని యారంభించిన పూజాదికమును దానే చేయవలెనందురు. శిష్టులాశౌచము వచ్చు నపుడు పూజయు దేవతాస్పర్శనము దాను జేయుట లోక విద్విష్టము గనుక నన్యుల చేతనే జేయింపుచున్నారు. ఇతరులు తృతీయాదిపక్షములున్నవి గనుక ప్రతిపద యందాశౌచమధ్యము వచ్చినను తృతీయా పంచమ్యాది పక్షముల నవలంబించు చున్నారు. సర్వథాలోపము సంభవించునేని బ్రాహ్మణునిచే జరిగింపుచున్నారు. అపు డుపవాసాది శారీరనియమముదానే చేయవలెను. ఇట్లు రజస్వలయు నుపవాసాదికము దానేచేసి పూజాదుల నన్యులచే జేయింపవలెను. ఇపుడు సభర్తృకస్త్రీల కుపవాసమందు గంధతాంబూలాది గ్రహణము నిషిద్ధము కాదని చెప్పుదురు.

## ఉపాంగ లలితా వ్రతము

ఇఁక పంచమియందు యుపాంగలలితావ్రతము. దానికి పంచమి యపరాహ్ణ వ్యాపిని గావలయును. అపరాహ్ణకాలమే యందు పూజార్థము. దినద్వయమందును సంపూర్ణముగ నపర్వావ్యాప్తి యుండినను సమముగగాని విషమముగగాని యపరాహ్ణైక దేశవ్యాప్తియున్నను యుగ్మవాక్యమునుబట్టి పూర్వదినమే గ్రహించునది. పరదినమందే యపరాహవ్యాప్తి యున్నచో బరదినమే గ్రహించునది. కొందరు రాత్రి వ్యాపినియైనచో గ్రహింతురు. రాత్రియందే పూజచేయుదురు. అట్లు ప్రమాణము మాత్రము విచారింప వలెను. ఈవ్రతబూజవిధి గ్రంథాంతరమున బ్రసిద్ధము గనుక వ్రాయనక్కరలేదు.

## సరస్వతీపూజ

ఆశ్వీన శుక్లపక్షమున మూలనక్షత్రమందు పుస్తకముల సరస్వతీ దేవి నావాహ నముజేసి పూజింపవలెను. శ్లో॥"మూలేషు స్థాపనం దేవ్యాః పూర్వాషాఢా సుపూజనం, ఉత్తరాసుబలిం దద్యా చ్ఛ్రవణేన విసర్జయేత్" అనఁగా మూలనక్షత్రమందు సరస్వత్యా వాహనమును పూర్వాషాఢానక్షత్రమున బూజయు ఉత్తరాషాఢయందు బలిదానము శ్రవణ నక్షత్రమున నుద్వాసనము నని యున్నదిగాని "పూజయేత్ప్రత్యహమని" రుద్ర యామిళవచనమువలన "మూలే ఆవాహనం తదంగభూత పూజనం కరిష్యే" యని సంకల్పించి యావాహనపూజనములు రెండును జేయవలెను. "పూర్వాషాఢా సుపూజ నం కరిష్యే" యని సంకల్పించి యావాహనముజేసియే యున్నందున తద్రహితమైన

పూజమాత్రమే జేయవలెను.” ఉత్తరాషాఢా సురాబలిదానం తదంగ పూజాం చ కరిష్యే”యని సంకల్పించి పూజయు బలిదానమును జేయవలెను. శ్రవణేన విసర్జనం కర్తుం తదంగభూతాం పూజాం కరిష్యే” యని సంకల్పించి యట్లు పూజించి యుద్వాసన జేయవలెనని మూడురోజులకు క్రమము దెలియవలెను. అందు మూలనక్షత్రము ప్రథమపాదమందు సూర్యాస్తమయమునకు ముందు మూఁడు ముహూర్తములు వ్యాపించి యున్నయెడ సరస్వత్యావాహనము. మూఁడు ముహూర్తములకు దక్కువ యున్నను రాత్రియందే ప్రథమ పాదమున్నను విశేషవచనము లేనందున నది గ్రహింపవలనుకాదు గనుక పరదినమందు ద్వితీయాది పాదమందే యావాహనము. ఇట్లు పూర్వషాఢాది పూజలయందును దినవ్యాప్తినే గ్రహించునది. విసర్జనము మాత్రము శ్రవణ ప్రథమపాదము రాత్రియందైనను నపుడే చేయవలెను. అట్లు విశేషవచనమున్నది. అదియు రాత్రి ప్రథమయామములోగానే యనితోఁచుచున్నది. ఇఁక సప్తమి మొదలు దినత్రయమందును పత్రికాపూనము విధింపఁబడ్డది. అందు సప్తమి మొదలు తిథిత్రయము సూర్యోదయానంతరము ముహూర్తమాత్రమున్నను గ్రహించునది. అపుడధివాసనము మొదలగు ప్రయోగవిస్తారము కౌస్తుభాదులయందు జూడవలెను సప్తమి మొదలు మూఁడు దినములందు నవరాత్రకర్మజేయుదురను పక్షమందు సప్తమి సూర్యోదయానందరమున ముహూర్తాధిక వ్యాప్తియుండెనేని గ్రహింపవలెను. ముహూర్తమునకు దక్కువయైనచో బూర్వదినమే గ్రహించునది.

## మహాష్టమీ నిర్ణయము

ఇఁక మహాష్టమి సూర్యోదయకాలమందు గడియయున్నప్పటికిని నవిమీ యుక్తమునే గ్రహింపవలెను. స్వల్పమైనను సప్తమిగలసినచో గ్రాహ్యముగాదు. ఇఁక పూర్వదినమందు సప్తమీవిద్ధయై బరదినమందు సూర్యోదయమందుండినను గడియకుఁ దక్కువయైనచో పూర్వదినమందు సప్తమీ విద్ధనే గ్రహించక తీరదు. ఈ యష్టమి మంగళవారమందు ప్రశస్తము. ఇఁక పూర్వదినమందష్టమి యరువది గడియలుండి మరునాఁడు ముహూర్తాదివ్యాపినియైనను పూర్ణిమయగుటచే బూర్వదినమే గ్రాహ్యము. ఇట్లు నవమికి క్షయముగలిగి దశమియందు సూర్యోదయానంతరమేమియు నవిమ లేనిచో నవమీయుక్తమైన యష్టమి యుదయకాలవ్యాప్తి గలదియైనను దాని విడిచి పూర్వదినమందు సప్తమీవిద్ధనే గ్రహింపవలెను. అష్టమియందు బుత్రవంతుఁడుపవాసము జేయఁగూడదు. కులాచారప్రాప్తమైనచో నేదియైన ఫలాహారముజేసి యుపవసింపవలెను. మహానవమి బలిదానాతిరిక్తమైనపజ యుపవాసము మొదలగు వాటివిషయమై యష్టమీవిద్ధయే గ్రాహ్యము. అదియు సాయంకాలము మూడు ముహూర్తములు వ్యాపించియున్నచో గ్రహింపవలెను. అంతకుఁ దక్కువయైనచో బరదినమే గ్రహింపవలెను. నవమీప్రయుక్తమైన మహాబలిదానము విషయమై నవమిదశమీ యుక్తమే గ్రాహ్యము.

## మహానవమీ నిర్ణయము

ఇంక నవమి అరువదిగడియలుండి శుద్ధాధికయైనచో బూర్ణమైనది గనుక పూర్వదినమే గ్రాహ్యము. అనఁగా బలిదానము నపుడే జేయవలెననుట. అష్టమీ నవమీల సంధియందు బూజ విధింపఁబడినది. అది అష్టమీనవమీలు వేరుగ నున్నపుడు పగటియందుగాని రాత్రియందుగాని యష్టమి చివరగడియయు, నవమి మొదటిగడియయు నీరెండిటియందు జేయవలెను. ఒకవేళ నష్టమికిని నవమికిని మధ్యాహ్నమందుగాని యపరాహ్ణమందుగాని యోగము గలిగెనేని యష్టమీ నవమీ పూజలు రెండు నొకదినమందే ప్రాప్తించినందున "అష్టమీ నవమీ పూజాం తత్సంధి పూజం చ తంత్రేణ కరిష్యే" యని సంకల్పించి యట్లు తంత్రము నొకసారియే చేయవలెను. ఇంక నష్టమి యరుదివగడియలుండి శుద్ధాఇకయైనచో బూర్వదినమం దష్టమిపూజయు మరునాఁడు తత్సంధిపూజయు నవమీపూజయు తంత్రముచే జేయ వలెను. ఈ నవరాత్రకర్మయందు స్వయముగాజేయుట కసమర్థుఁడయ్యేనేని యన్య నిచే జేయింపవలెను.

## నవమి యందే హోమము

షోడశోపచారములు మొదలగు పూజావిస్తారము జేయుట కశక్తుఁడయ్యేనేని పంచోపచారములచే బూజింపవలెను. నవమీపూజజేసి హోమము జేయవలెను. కొందరష్టమియందే హోమమనిరి. మరికొందరష్టమియందు ప్రారంభించి నవమి యందు హోమము సమాప్తిఁజేయవలెను. అదియును నరుణోదయము మొదలుకొని సాయంకాలములోగా నష్టమికి నవమికిని సంధి సంభవించినయెడనగును. ఆ పైని సంభవించినను రాత్రియందు హోమము నిషిద్ధము గనుక నవమియందే హోమ ప్రారంభము సమాప్తియుగాక తప్పదనిరి. అందు గులాచారము చొప్పున వ్యవస్థ జేసుకొనవలెను. ఆ హోమము దుర్గానవాక్షరీమంత్రముచే జేయవలెను. లేక "జయంతీ మంగలాకాళీ" యను శ్లోకముచేనైనను జేయునది. లేక "నమో దేవ్యై మహాదివ్యై" యను శ్లోకముచేనైనను గావచ్చును. మరియు సప్తశతియందలి శ్లోకము లచేనైనను; లేక సప్తశతమంత్రములచేనైనను జేయవలెను. అట్లు చేయునపుడు కవచార్గళకీలక ములు రహస్యత్రయము. వీటిశ్లోకములతోగూడ జేయవలెను. సప్తశతక మంత్ర విభాగము తద్వ్యాఖ్యానములందు దెలియవలెను. ఈ హోమవికల్పములందును గులాచారము చొప్పున నిర్ణయము. హోమద్రవ్యము నేతితోను తెల్లనువ్వులతో గలిపిన పాయసమని యెఱుంగునది. కేవలముగ తిలలచేనైన జేయ వచ్చును. కొన్ని గ్రంథములలో మోదగుపువ్వులు, దూర్వలు, ఆవాలు, పేలాలు, పోకచెక్కలు, యవధాన్యము, మారేడుపండ్లు, రక్తచందనఖండములు, మరియు నానా విధ ఫలములు బాయసములోగలిపి హోమము చెప్పఁబడినది. హోమసంఖ్య జప సంఖ్యలో పదియవభాగము గావలెను. కులాచారప్రాప్తమైనచో నృసింహభైరవాది దేవతా

మంత్రజపమునకు హోమమును జేయవచ్చును. ఇక్కడ సవిస్తరమై గ్రహ ముఖముతో గూడిన హోమప్రయోగము కౌస్తుభాదులం దెఱుంగునవి.

## బలిదానము

బ్రాహ్మణుఁడు మినుములపప్పు మొదలగునవి గలిపివండిన పులగముచే నైనను గుమ్మడికాయచేనైనను బలిదానము చేయవలెను. లేక ఘృతముచేనైనను యవధాన్యముయొక్క పిండిచేనైనను సింహవ్యాఘ్రనరమేషాది ప్రతిమలుచేసి ఖడ్గముచే నరుకవలెను. అంతియేకాక ప్రత్యక్ష పశుమాంసమద్యాదులచే బలిదానము జేసెనేని బ్రాహ్మణ్యము నుండి భ్రష్టుఁడగును. ఫలకాములైన క్షత్రియాదులట్టి ప్రత్యక్షసింహ వ్యాఘ్రనరమహిషచ్ఛాగసూకర మృగపక్షిమత్స్య నకులగోధాదిప్రాణులను స్వదేహరక్త మును బలిదానములో నీవచ్చును. కృష్ణసార మృగమనఁగా మొగలేడి దానిని క్షత్రి యాదులైనను బలిగా జేయరాదు. ఇక్కడ బలిదానమంత్రాది ప్రకారము నిర్ణయ సింధువునందు దెలియునది.

## జాతమృతాశౌచములలో దేవతకుద్వాసన నిర్ణయము

ఇచట శతచండీ సహస్రచండీ ప్రయోగము కౌస్తుభాదులలోఁ దెలియునది. జాతాశౌచాదులందు నవమీహోమము దేవతో ద్వాసనము బ్రాహ్మణునిచే జేయించి తాను పారణమునుజేసి యాశౌచాంతమున బ్రాహ్మణ భోజనము దక్షిణాది దాన మునుఁ జేయవలెను. ఇట్లు రజస్వలయును పారణకాలమందు పారణముజేసి శుద్ధ దినమందు దానాదికము జేయునది. విధవకు రజోదోషమందు భోజనము నిషిద్ధము గనుక పారణయు శుద్ధదినమందే చేయవలెను.

## ఛత్రాదిపూజ

ఇట్లు వ్రతాంతరమందు నూహింపవలయును. ప్రతిపద మొదలుకొని యష్టమి పర్యంతము లోహాభిసారికమనుకర్మ రాజులకు విహితము. అందు ఛత్రచామరాది రాజచిహ్నములకును గజాశ్వాదులకును దుందుభి మొదలగు వాద్యములకును పూజా హోమాదికముఁ జేయవలెను. హయుల సంపాదించిన రాజభిన్నులైనసామంతులను స్వాతీ నక్షత్రముతోగూడిన యాశ్విన శుక్లప్రతిపదగాని ద్వితీయగాని మొదలుకొని వాజినీ రాజన మనుకర్మ జేయవలెను. అపుడుచ్చైశ్రవమనునింద్రుని గుఱ్ఱమునకు నురైవతునకును ప్రతిమయందుఁ బూజచేయవలెను. ప్రత్యక్షముగ నశ్వపూజయు నీరాజనమును చేయవలెను. యీ రెండు కర్మలకు బూజా మంత్రములు హోమాది మంత్రములును ప్రయోగవిస్తరమును గౌస్తుభాదులందుఁ దెలియవలెను. ఇపు డశ్వ ములుగల ప్రాకృతజనులు విజయదశమియందు నశ్వములు స్నానము జేయించి పుష్పమాలలచే నలంకరించి యశ్వశాలయందు బ్రవేశము మాత్రము చేయుచున్నారు. అందు శ్లో॥"గంధర్వ కులజాతస్త్వం మాభూయాః కులదూషకః, బ్రహ్మణస్సత్య వాక్యేన సోమస్య వరుణస్య చ, ప్రభావాచ్ఛహుతాశస్య వర్ధయత్వం తురంగమాన్, రిపూర్విజిత్య సమరే సహభర్త్రా సుఖీభవ" అని. అనఁగా నీవశ్వకులమందుపుట్టితివి. బ్రహ్మ

యొక్కయు సోముని యొక్కయు వరుణి యొక్కయు సత్యవాక్యముచేతను నగ్నిదేవుని ప్రసాదముచే నీకుల నాశముగాకుండగ నశ్వములవృద్ధి చేయుము. శత్రువుల జయించి స్వామితో సుఖింపుమని యర్థముల మంత్రముతో గవలాశ్వపూజయు చేయవలెననుట యుక్తము.

## పారణకును దేవతా విసర్జనమునకును గాలనిర్ణయము

అందు విసర్జనము దశమియందు జేయవలెను. దినద్వయమందు దశమి యున్నచోఁ బూర్వదశమియందు శ్రవణాంత్యపాదయోగమున్న యెడ నపుడు విసర్జ నము. లేనిచో బరదశమియందే చేయవలెను. పరదినమందులేనిచో దశమియందు నక్షత్రయోగమున్నను లేకున్నను జేయవచ్చును. నక్షత్రయోగమునుబట్టి చేయునపుఁ డపరాహ్ణమందునుఁ జేయవచ్చును. కానిచో బ్రాతఃకాలమందే యగును. అందు మృదాదులచే జేసిన ప్రతిమను దేవతోద్వాసనమైన పైని జలమందు విడువవలెను. వంశపరంపరచే బూజింపఁబడిన ధాతుప్రతిమకు ఘటాది స్థాపనమైనది గనుక "ఉత్తిష్ఠ"యని మొదలగు మంత్రములచే నుత్థాపనమాత్రమే చేయునది గాని విసర్జన మక్కరలేదు. విసర్జనదినమందే నియమము విడుచుట యుక్తము గనుక విసర్జనా నంతరమున నాదిన పారణము జేయునది. కొందరు "నవమ్యాం పారణం కుర్యా ద్దశమ్యామభిషేకం కృత్వా విసర్జయే" త్తను వచనమున నవమియందే పారణము జేయవలెనందురు. ఇక్కడ నిట్లు వ్యవస్థ. పూర్వదినమందు స్వల్పమైన నష్టమితోగూడిన దశమియు నాపై దినమందు శ్రవణయుక్తమై దేవతా విసర్జనమునకుఁ దగిన దశమియు నున్నచో నష్టమి నవమియుపవాసములు. ప్రథమదినమందు సిద్ధమైనం దున నవశిష్టనవమియందు పారణము, నవశిష్టదశియందు విసర్జనమునుజేయ వలెను. ఇట్లుగాక యవశిష్ట నవమియందే శ్రవణయుక్త దశమి విసర్జనార్హమైయున్నచో విసర్జనోత్తరమందే పారణము. మరియుఁ బూర్వదినమందష్టమి యరువదిగడియ లుండి మరునాఁడు శేషించిన యష్టమితో గలసిన నవమియునాపై దినమందు నవమీ శేషముతో గలసిన దశమియునున్నచో నవమీయుక్త దశమియందే విసర్జనా నంతరమందుపారణము. మరియు నవమి యరువది గడియలుండి పరదినమందు నవమీశేషముగలసిన దశమియున్నపుడును నవమీయుక్త దశమియందే విసర్జనము పారణమును జేయవలెను. ఇకవష్టమియు,నవమియు, దశమియు మూఁడును సూర్యోదయము మొదలస్తమయము పర్యంత మఖండములై యాయాకర్మములకు బర్యా ప్తమైనచో దాక్షిణాత్యులకు నవమియందే పారణజేయు నాచారమున్నందున నాదినమందే పారణ విసర్జనములు. దశమియందే యాచారముండు వారికి దశమి యందే యారెండు నగు.

## విజయదశమీ నిర్ణయము

అది పరదినమందపరాహ్ణ వ్యాప్తమైనచో బరమే యగును. దినద్వయమందు నపరాహ్ణవ్యాప్తి యున్నచో దినద్వయమందు శ్రవణయోగమున్నను లేకున్ననుఁ బూర్వ

దినమే గ్రాహ్యము. ఇట్లు దినద్వయమందపరాహ్ణవ్యాప్తి లేనియెడను శ్రవణయోగము రెంటికినున్నను లేకున్నను బూర్వదినమే. ఇంక దినద్వయమందు నపరాహ్ణవ్యాప్తియుం డుట యనుపక్షములలో నొకదినమందు శ్రవణయోగమున్నచో నట్టిదినమే గ్రాహ్యము. ఇట్లపరాహ్ణైక దేశవ్యాప్తియందు నూహించునది. ఇంక పూర్వదినమందే యపరాహ్ణ వ్యాప్తిగలిగి పరదినమందు శ్రవణయోగ రహితమైనచో బూర్వదినమే గ్రాహ్యము. మరియు బూర్వదినమందే యపరాహ్ణవ్యాప్తి గలిగి పరదినమందు మూండు ముహూర్త ములైన నున్నదశమికి శ్రవణయోగమున్నచో బరదినమే గ్రాహ్యము. యేమనిన; నపరాహ్ణకాలమందు దశమిలేకున్నను "యాం తిథిం స మనుప్రాప్య" యను వచన ముచే కర్మకాలవ్యాప్తి భావింపవచ్చును. నిర్ణయసింధువునందట్టి స్వల్ప దశమియు నపరాహ్ణమందు శ్రవణయోగ ముండెనేని గ్రహింపంబడును. లేనిచో బూర్వదినమే గ్రాహ్యమని యున్నది. అదియే యుక్తము. మరియు బరదినమందే యపరాహ్ణవ్యాప్తి గలిగి పూర్వదినమందు సాయంకాలమందు శ్రవణయోగ మున్నప్పటికి బరదినమే గ్రాహ్యమని నాకుం దోంచుచున్నది. యీతిథియందపరాజితా దేవీపూజనము సీమోల్లం ఘన మనంగా గ్రామమువదలి మేరదాటుటయు విధింపంబడినవి. మరియు శమీ పూజనమును దేశాంతరయాత్ర జేయువారు నిర్గమముంచుటయు నీదినమందే శమీ పూజాప్రకార మెట్లనిన; నపరాహ్ణమందు గ్రామమున కీశాన దిక్కుగా వెళ్లి యచట శుచి ప్రదేశమున భూమియలికి చందనాదికము చేత నష్టదళపద్మము లిఖించి "మమ సకుటుంబస్య క్షేమసిద్ధ్యర్థ మపరాజితా పూజనం కరిష్యే" యని సంకల్పించి మధ్య మందు "అపరాజితాయైనమః" యని దేవి నావాహనముజేసి యామెకు దక్షిణమున "క్రియాశక్త్యై నమః" యని జయాదేవిని వామమందు "మాయైనమః" యని విజయా దేవిని నావాహనముజేసి "అపరాజితాయైనమః, జయాయైనమః, విజయాయై నమః అను నామమంత్రములచే షోడశోపచార పూజలసమర్పించి ప్రార్థించవలెను. శ్లో॥ "ఇమాం పూజాం మయాదేవి యథాశక్తి నివేదితాం, రక్షార్థంతు సమాదాయ వ్రజ స్వస్థాన ముత్తమమ్" అని. అనంగా నోదేవీ! నాయథాశక్తిగ సమర్పించిన పూజను లోకరక్షార్థము గ్రహించి స్వస్థానమునొందుమని మంత్రార్థము. రాజులు సంకల్పించు నెడ "యాత్రాయాం విజయసిద్ధ్యర్థ" మ్మని విశేషము. మీంది సంకల్పములో గలుప వలెను. పూజానమస్కారములుచేసి యనంతరము శ్లో॥"హారేణ తు విచిత్రేణ భాస్వ త్కనకమేఖలా, అపరాజితా భద్రరతా కరోతు విజయం మమ" యను మంత్రమున బ్రార్థించవలెను. అనంగా మంచిహారముతోడను కళుకుబంగారు కటి సూత్రముతోను మంగళకారిణియైన యపరాజితాదేవి నాకు విజయమిచ్చుగాక యని యర్థము. మీంద జెప్పినటులుద్వాసనము జేయవలెనని సంక్షేపము.

## శమీ పూజనము

అనంతరమున సర్వజనులు గ్రామమునకు వెలుపల నీశానదిక్కున నున్న జమ్మిచెట్టునుజేరి పూజింపవలెను. సీమోల్లంఘనము శమీపూజకు ముందైన

వెనుకనైన జేయవచ్చును. రాజులు హయారూఢులై మంత్రి పురోహితులు వెంటనంటి వచ్చుచుండఁగ శమీమూలము నొంది వాహనముడిగి స్వస్తి వాచనపూర్వముగ శమీపూజజేసి కార్యోద్దేశముల మంత్రులతో సెలవిచ్చుచు బ్రదక్షిణము జేయవలెను. పూజాప్రకార మెటులనిన "మమ దుష్కృతామంగలరాసార్థం యాత్రాయాం విజయార్థం చ శమీపూజనం కరిష్యే" యని సంకల్పించి శమీమూలమందు దిక్పాల పూజను వాస్తుపూజను జేయవలెను. శ్లో॥"అమంగలానాం శమనీం శనీం దుష్కృత స్యచ, దుస్వప్ననాశనీం ధన్యాం ప్రపద్యేహం శమీంశుభాం" అని పూజామంత్రముచే పూజజేసి యంతమందు "శమీ శమయతే పాపం శమీలోహిత కంటకా, ధరిత్ర్యర్జున బాణానాం రామస్య ప్రియవాదినీ, కరిష్యమాణయాత్రా యాం యథాకాలం సుఖం మయా, తత్రనిర్విఘ్న కర్త్రీత్వం భవశ్రీరామపూజితే" అని ప్రార్థించవలెను. అనఁగా నెఱ్ఱనిముళ్ళుగల శమీవృక్షము పాపము నశింపజేయును. పాండవుల యజ్ఞాతవాస మునందర్జునుని దివ్యాస్త్రములఁ దాచినది. అట్టి యో శమీవృక్షమా! నీవు రామునిచే రావణవియజార్థము పూజింపఁబడి ప్రియమునిచ్చితివి. నేజేసెడు యాత్రయందు నిర్విఘ్నముగ సుఖమిమ్మని యర్థము. అశ్మంతకవృక్షపూజనమందు–శ్లో॥"అశ్మంతక మహావృక్ష మహాదోష నివారణ, ఇష్టానాం దర్శనం దేహి శత్రూణాం చ వినాశనం" అని ప్రార్థింపవలెను. రాజుశత్రువును ప్రతిమగజేసి ఖడ్గముచే ఛేదింపవలెను. ప్రాకృత జనులు శమీశాఖలను ఛేదించితెత్తురు. అందు ప్రమాణముగానరాదు. శ్లో॥"గృహీత్వా సాక్షతామార్ద్రాంశమీ మూలగతాంమృదం, గీతవాదిత్రనిర్ఘోషై రానయేత్స్వగృహం ప్రతి, తతోభూషణవస్త్రాది ధారయేత్స్వజనైస్సహ, నీరాజ్యమానః పుణ్యాభిర్యువతీభిస్సు మంగలం" అని. అనఁగా రాజు శమీపూజానంతరమందు దాని మొదటియందక్షత లతోగూడ తడిసియున్న మృత్తికదీసి పాత్రలోనుంచి గీతవాద్య ములతోగూడ నింటికిదెచ్చి మంచి వస్త్రభూషణాదుల స్వజనులతో ధరించి పుణ్యస్త్రీలచే మంగళమగు నీరాజనము గొనవలయునని యర్థము. దేశాంతరమునకు వెళ్లువా రీ దశమియందు విజయముహూర్తమున జంద్రతారాబలము లేకున్నను బ్రయాణము జేయవచ్చును. అందు విజయముహూర్తము రెండువిధములు. శ్లో॥"ఈషత్సంధ్యామ తిక్రమ్యకించి దుచ్ఛిన్నతారకః, విజయోనామకాలోయం సర్వకామార్థ సాధకః, ఏకాదశో ముహూర్తో౭ పి విజయః పరికీర్తితః, తస్మిన్ సర్వైర్విధాతవ్యా యాత్రా విజయ కాంక్షిభి" అని. అనఁగా సంధ్యాకాలమందు గొంచెము నక్షత్రములు గనబడి నపుఁడది విజయముహూర్తము సర్వమైన యిష్టార్థముల సాధించుననియు, మరియు పదునొకం డవ, ముహూర్తమనఁగ నిరువదిగడియల ప్రొద్దుపైని రెండుగడియలు విజయముహూర్త మదియు యాత్రయందు విజయము నిచ్చుననియు నున్నది. కనుక నీ రెంటిలో నొకముహూర్తమున బ్రయాణము జేయవలెను అదియు దశమి యున్న యెడనేకాని యేకాదశిగడియలలో గూడదు. శ్లో॥ "ఆశ్వయుచ్ఛుక్లదశమీ విజయాఖ్యా ౭ ఖిలేశుభా, ప్రయాణేతు విశేషేణ కిం పునశ్శ్రవణాన్వితా"యని. అనఁగా నాశ్విన శుక్లదశమి విజయనామముగలది సర్వకార్యములకు శుభమే ప్రయాణముకు చెప్పెడి దేమి

శ్రవణాన్వితమైనచో మరియు మంచిదనిజ్యోతిశ్శాస్త్రమం దున్నందున మాస విశేషము నపేక్షించని యితర కార్యములు నిపుడే జేయవలయును. మాసవిశేష నియమము నపేక్షించు చూడాకర్మ, విష్ణుప్రతిష్ఠ, మొదలగునవి చేయగూడదు. రాజులకు పట్టాభిషే కము విషయమె నవమితోగూడిన దశమి శ్రవణయోగమున్నప్పటికి గ్రాహ్యము గాదు.

## కార్తిక స్నానము

మరియు దయవ్యాపినియే గ్రహింపవలెను. ఆశ్వయుజ శుక్ల దశమియందైనను నేకాదశియందైనను బూర్ణిమయందైనను ప్రారంభించి రాత్రి రెండుగడియలు శేషించి యుండఁగనే మేల్కొని తీర్థాదికముజేరి ప్రతిదినమును మాసపర్యంతము కార్తిక స్నానము జేయవలెను. తత్ప్రకార మెట్లనిన; విష్ణువును స్మరించి దేశకాలము లుచ్చ రించి శ్లో॥"నమః కమలనాభాయ నమస్తే జలవాయినే, నమస్తేస్తు హృషీకేశ గృహా ణార్ఘ్యం నమోస్తుతే" యను మంత్రముచే నర్ఘ్యమిచ్చి "కార్తికేహం కరిష్యామి ప్రాత స్స్నానం జనార్ధన, ప్రీత్యర్ధంతవ దేవేశ జలేస్మిన్ స్నాతుముద్యతః" తవ ప్రసాదా త్పాపం మే దామోదర వినశ్యతు" అను మంత్రములచే స్నానముజేసి తిరుగ నర్ఘ్య మీయవలెను. అందు మంత్రములు :– శ్లో॥"నిత్యేనైమిత్తికే కృష్ణకార్తికే పాపనాశనే, గృహాణార్ఘ్యం మయాదత్తం రాధయా సహితోహరే" యనఁగా నిత్యమును నైమిత్తికము నగు పాపనాశకమైన యీ కార్తికమందు నేనిచ్చు నర్ఘ్యము రాధాసహితుఁడవై గ్రహింపు మో శ్రీహరీ! కార్తీకమందు నియమస్థుఁడనై ప్రాతస్స్నానము జేయు నేనిచ్చు నర్ఘ్యమును స్వీకరింపుమని యర్థము. కురుక్షేత్రము, గంగ, పుష్కరము మొదలగు తీర్థవిశేషమందు ఫలాతిశయము గల్గును. మఱియు విశేషముగలదు. శ్లో॥"కార్తికం సకలం మాసం నిత్యస్నాయీ జితేంద్రియః, జపన్ హవిష్యభుక్శాంత స్సర్వపాపైః ప్రముచ్యతే, స్మృత్వా భాగీరథీం విష్ణుం శివం సూర్యం జలం విశేత్, నాభిమాత్ర జలేతిష్ఠన్ వ్రతేస్నాయా ద్యథావిధి" అనఁగా నీకార్తికమాసము యావత్తును ప్రాతస్స్నాననియమముతో హవిష్యము భక్షింపుచు జితేంద్రియుఁడై జపమొనరింపుచు నడపినచో సర్వపాపములు నశించును. గనుక భాగీరథిని విష్ణువును శివుని సూర్యుని స్మరించి జలములో నాభి మునుగునంతవరకు దిగి యథావిధి స్నానము జేయునది యని యర్థము. ఇట్టి కార్తికస్స్నానము ప్రాతస్నానము ప్రాతస్సంధ్యయు జేసి యనంతరమున జేయవలెను. అవి చేయనిచో నేకర్మకు నధికారమురాదు. విచారించినచో బ్రాతస్సంధ్య సూర్యోదయా నంతరము సమాప్తమగును. అయినప్పటికిని వచన ప్రామాణ్యమునుండి సూర్యో దయమునకు పూర్వమే సంధ్యాసమాప్తిఁజేసి కార్తికస్నానము జేయవచ్చునని నిర్ణయ సింధువునం దున్నది. ఇట్లు గ్రంథాంతరమందు గానంబడదు.

## తులసీపూజ

ఇట్లు మాసస్నానమందశక్తుఁడయ్యేనేని మూఁడుదినములు జేయవలెను. ఇతర మైన కార్తికవ్రతములకు నిపుడే ప్రారంభము. అవి యెట్లనిన శ్లో॥ "తులసీదళ

లక్షేణ కార్తికేయోర్చ్యేద్ధరిం, పత్రేపత్రే ముని శ్రేష్ఠమౌక్తికం ఫలమశ్నుతే" అను వచనముచే తులసీమంజరులచే హరిహరుల నర్చించినచో ముక్తిఫలము. తులసి చెట్టు పాతుట,పెంచుట, స్పృశించుట వీనిచే పాపక్షయము. తులసిచెట్టు నీడను శ్రాద్ధము చేసినచో బితృతృప్తియగు. తులసిచే నలంకృతమైన గృహమునకు యమ కింకరులు రానేలేరు. ఇది మొదలగునది తులసీ మాహాత్మ్యము.

## ధాత్రీ మాహాత్మ్యము

ధాత్రి యనఁగ నుసిరికిచెట్టు. దాని మాహాత్మ్యమును గలదు. శ్లో॥"కార్తికేధాత్రి వృక్షాధ శ్చిత్రాన్నైస్తోషయే ద్ధరిం, బ్రాహ్మణాన్ భోజయేద్భక్త్యా స్వయంభుంజీత బంధుభిః " అనఁగా ధాత్రీ వృక్షము క్రింద చిత్రాన్నములు హరికి నివేదించవలెను. బ్రాహ్మణ భోజనము జేయింపవలెను. బంధువులతో దాను భుజింపవలెనని. మరియు నచట శ్రాద్ధము ధాత్రీ పత్రములచే హరిపూజనము జేసినచో మహాఫలము. దేవతలు ఋషులు సర్వతీర్థములు నచటనే యుండునని చెప్పఁబడినది. ఈ మాసమందే హరి జాగరము విధింపఁబడినది.

## హరిజాగరవిధి

శ్లో॥ జాగరం కార్తికేమాసి యః కుర్యా దరుణోదయే, దామోదరాగ్రే సేనానీర్గో సహస్రఫలం లభేత్, శివవిష్ణు గృహాభావే సర్వదేవాలయేష్వపి, కుర్యాదశ్వత్థమూలేషు తులసీనాం వనేష్వపి, విష్ణునామప్రబంధాని యోగాయేద్విష్ణుసన్నిధౌ, గోసహస్ర ఫలమాప్నోతి మానవః, వాద్యకృత్పురుషశ్చాపి వాజపేయఫలం లభేత్, సర్వతీర్థావ గాహోత్థం నర్తకః ఫలమాప్నుయాత్. సర్వమేతల్లభేత్పుణ్యం తేషాం తు ద్రవ్యదః పుమాన్, అర్చనాద్దర్శనాద్వాపి తత్ష డంశమవాప్నుయాత్." అనికౌస్తుభము. అనఁగా కార్తికమాసమందరుణోదయ కాలమున హరియెదుట జాగరముసేయుట గో సహస్ర దానఫలమిచ్చును. శివవిష్ణ్వాలయములు లభించనిచో నితరదేవాలయ మందును నశ్వత్థమూలమందును తులసీవనమందును విష్ణునామ ప్రబంధములు పాడినచో గోసహస్రదాన ఫలము. వాద్యమును మ్రోయించు పురుషునికి వాజపేయ ఫలము.నృత్యముచేసిన సర్వతీర్థ స్నానఫలము వ్రతముజేసిన నన్నిఫలమును సిద్ధించును. చూచువారికి నారవభాగము సిద్ధించును. ఏవియు సందర్భింపనిచో విష్ణు భక్తులైన బ్రాహ్మణులగాని యశ్వత్థవటవృక్షములగాని సేవింపవలెను. శ్లో."సరోరుహాణి తులసీమాలతీమునిపుష్పకం, కార్తికేవిహితాన్యేవం దీపదానంచ పంచమం" వీటి పుష్పములు కార్తికమాసమందు దేవపూజకు బ్రశస్తము దీపదానమునట్టిదే. మరియు నిపుడు మాసోపవాసము వానప్రస్థులకు యతులకు విధవలకు విధింపఁబడినది. గృహస్థులు చేయఁగూడదు శ్లో॥"కృచ్ఛ్రం వాప్యతికృచ్ఛ్రం వా ప్రాజాపత్యమథాపి వా, ఏకరాత్ర వ్రతం కుర్యాత్త్రి రాత్ర వ్రతమేవవా, శాకాహారం ఫలాహారం పయోహార మధాపి వా, చరే ద్యవాన్నాహారం వా సంప్రాప్తే కార్తికేప్రతి" అనఁగా కార్తికమందు కృచ్ఛ్రము అతికృచ్ఛ్రము ప్రాజాపత్యము వీనిలో నొకటి గాని యేకరాత్ర వ్రతముగాని

త్రిరాత్ర వ్రతముగాని చేయవలెను. శాకము ఫలము పాలు యవబియ్యపు నన్నము వీనిలో నొకటి నియమముతో భక్షించుట వ్రతము.

## కార్తికమందు వర్జ్యములు

రెండువిధముల యుల్లియు నింగువ పుట్టకొక్కు గంజాయి మొల్లంగి యానబ కాయ మునగకాడలు వంగకాయ గుమ్మడికాయ వాకుడు పుచ్చకాయ వెలగపండు నూనె లవణశాకము చద్దిమొదలగు నవియు, రెండుమారులు వండిన యన్నము చలిదియన్నము మాడన్నము మినములు పెసలు మొసరులు సెనగలు ఉలవలు అనుములు కందులు మొదలైన ద్విదళ ధాన్యములును వర్జ్యములు. మరియు సప్తమి యందు నుసిరికెపండు తిలలును, నష్టమియందు కొబ్బరి, రవివారమందుసిరికపప్పు నివి యప్పుడును వర్జ్యములే.

## వ్రతాంతమందు దానములు

కంచుపాత్రయందు భోజనవర్జనము జేసినచో ఘృతపూర్ణమైన కాంస్యపాత్ర మీయవలెను. మధుత్యాగముజేసి ఘృతము పాయసము శర్కరయు నీయవలెను. తైలత్యాగమందు తిలదానము, కార్తికమందు మౌనభోజనవ్రతము జేయుచో దిలలతో ఘంటాదానము చేయవలెను. సువర్ణముతోను మినుములతోను గూడిన తెల్లగుమ్మడి పండ్లు ముప్పది దానము చేయవలెను. కార్తికమందు కంచుపాత్రలో భుజించిన గృమిభక్షకజన్మము. మరియు ఫలవర్జనమందు ఫలరసము, వర్జించిన రసము, ధాన్యము, వర్జించిన ధాన్యము నీయవలెను. అన్నిటియందును గోదానమైనను జేయ వచ్చును. శ్లో. “ఏకతస్సర్వదానాని దీపదానం తథైకతః, కార్తికేదీపదానస్య కలాం నార్హంతి షోడశీం” అనcగా నన్నిదానములు గలసి దీపదానమునకు సమములు గావు. కార్తికమందు ప్రదానమునకు సరియైన దానములేదని. ఇట్లన్ని వ్రతములు చేయుట సంభవింపకున్నను నేదియైన నొకవ్రతము చేయకతప్పదు. శ్లో. “అవ్రతః కార్తికో యేషాం గతోమూఢధియామిహ, తేషాం పుణ్యస్యలేశోఽపి నభవేత్సూకరాత్మ నాం” అని. అనcగా నీకార్తికమందేమియు వ్రతముజేయని మూఢులకు పుణ్యము లేశమైనను లభింపదు. వారు సూకరసమానులని సాలగ్రామది దేవతాస్థలమునందు స్వస్తిక మండలాది రూపముగా ముగ్గులు పెట్టిన స్త్రీ స్వర్గాదిఫలము నొంది సప్త జన్మల పర్యంతము వైధవ్యమొందదు. కార్తికమందు పురాణేతి హాసములయొక్క శ్రవణమారంభించుటయు గ్రంథసమాప్తి నొందించుటయు విధింపcబడినది. తత్ప్రకార మెట్లనిన.

శ్లో॥“బ్రాహ్మణం వాచకం కుర్యాన్నాన్యవర్ణజమాదరాత్, శ్రావణయేచ్చతు రో వర్ణాన్ కృత్వా బ్రాహ్మణమగ్రతః” విస్పష్ట మద్రుతంశాంతం స్పష్టాక్షరపదం తథా, కలాస్వరసమాయుక్తం రసభావసమన్వితం, బ్రాహ్మణాదిషు సర్వేషు గ్రంథార్థం చార్ప యేన్నృపయ ఏవం వాచయేద్రావన్ సవిప్రో వ్యాస ఉచ్యతే, సమాప్తేషు పురణేషు శక్త్యాతంతర్పయే న్నృప, వాచకః పూజితో యేన ప్రసన్నాస్తస్య దేవతాః శ్రాద్ధే యస్య

ద్విజో భుఙ్తే వాచకశ్శ్రద్ధయాన్వితః, భవంతి పితరస్తస్య తృప్తావర్ష శతంనృప” యని. అనఁగా బురాణము జదువుటకు బ్రాహ్మణుఁడే గావలయు. నితరులు కూడదు. బ్రాహ్మణుని ముందుంచుకొని నాలుగు వర్ణములవారికిని పురాణార్థము వినిపింప వచ్చును. స్పష్టముగ నక్షరములు త్వరలేకుండ నుచ్చరింపుచు కళగట్టినట్టి స్వరముతో రసభావములు వెల్లడిగ గ్రంథార్థము దెలుపుచు జదువువాఁడు వ్యాససమానుడు, గ్రంథసమాప్తియందు యథాశక్తిగ వాని బూజించునది. అట్లయిన సమస్తదేవతలు ప్రసన్నులగుదు. శ్రాద్ధమరాతనికి భోజనమిడినచో బితృదేవతలకు నూరు సంవత్సర ములు తృప్తియగునది. కార్తికస్నాన కాలమంభిలాషాష్టకము కాశీఖండమందు జెప్పినది. పుత్రకాముఁడు పఠించవలెను. ఈ దినమందే దుగ్ధవ్రతమును దేవునికి సమర్పించి దుగ్ధదానముజేసి ద్విదళవ్రతము సంకల్పించవలెను. అపుడు పుట్టినపుడే ద్వంద్వముతో గానుపించునవి వర్జ్యములని కొందఱు. మరికొందరట్లు వచనము లేనందున స్వరూపముచే భక్షణార్హ దశయందు ద్విదళముగా నుండునవి వర్జ్యములు గాని అన్యమైన పత్రపుష్పాదికము కాదనిరి.

## ఆకాశ దీపదానము

ఇట్లితరములయిన తాంబూలవర్జనము కేశఖండనవర్జనము మొదలగు వ్రతములు దెలియునది. అందాకాశదీపము విధింపఁబడినది. సూర్యాస్తమయ కాల మందు గృహమునకు సమీపముగ యజ్ఞార్హమయిన కఱ్ఱను చేయెత్తుపొడవుగలదాని పాతి, దానిపైని యష్టదళాద్యాకారముగ నిర్మించిన దీపయంత్రమందు మధ్యమున ముఖ్యదీపమును దానిచుట్టు నెనిమిదినియుంచి సమర్పించవలెను. శ్లో॥“ దామోద రాయనభసి తులాయాందోలయా సహ, ప్రదీపంతే ప్రయచ్ఛామి నమో ఉ నంతాయ వేధసే”. యని మంత్రము. అనఁగా ననంతుఁడు సృష్టికర్తయునగు శ్రీవిష్ణునకు నంతరిక్షమున నుయ్యలనూగు దీపమిచ్చితినని. ఇట్లు మాసపర్యంత మాకాశదీప మిచ్చినచో మహాసంపత్తి గలుగును. అశ్వినపూర్ణిమయందు కోజాగర వ్రతము. అందు పూర్వదినమందే నిశీథవ్యాప్తి యున్నచో బూర్వదినమే ఉత్తరదిన మందే యైనను దినద్వయమందైనను నిశీథవ్యాప్తి యుండెనేని దినద్వయమందును నట్టి వ్యాప్తిలేకున్నను బరదినమే గ్రాహ్యము. కొందరు పూర్వదినమందు బ్రదోష వ్యాప్తి మాత్రమున్నచో బరదినమే యందురు. అపుడు లక్ష్మీదేవిని నింద్రుని బూజించి జాగరణము నక్షక్రీడ యనగ బాసికలయాటయు విధింపఁబడినది. అపుడు పద్మాసన స్థురాలైన లక్ష్మీదేవిని ధ్యానించి “ఓం లక్ష్మ్యై నమః” యని యక్షతలచే నావాహనాది షోడశోపచారముల పూజచేసి శ్లో.॥నమస్తే సర్వదేవానాం వరదాసి హరిప్రియే, యాగతి స్త్వత్ప్రపన్నానాం సామేభూయాత్త్వదర్శనాత్” అని. అనఁగా శ్రీహరికి బ్రియ మైన యోలక్ష్మీ! నీవే సర్వదేవతలకు వరమిచ్చుదానవు. నీభక్తులకెట్టి గతిగలుగునో నాకది దయసేయుమని పుష్పాంజలినిచ్చి నమస్కరింపవలెను. శ్లో॥“చతుర్దంత సమా రూఢో వజ్రపాణిః పురందరః, శచీపతిశ్చ ధ్యాతవ్యో నానాభరణభూషితః’ అని అనఁ గా నైరావతమునెక్కి వజ్రహస్తుఁడై శచీదేవితో నానాభరణముల ధరించి యున్నాఁ

డని ధ్యానించి యక్షతలచే "నింద్రాయ నమః" యని బూజించి శ్లో" విచిత్రైరావతస్థాయ బాస్వత్కులిశపాణయే, పౌలోమ్యాలింగితాంగాయ సహస్రాక్షా యతే నమః" యని పుష్పాంజలినిచ్చి నమస్కరించునది. శ్లో॥"నారికేరోదకం పీత్వా అక్షక్రీడాం సమారభేత్, నిశీధే వరదాలక్ష్మీః కోజాగర్తీతి భాషిణీ, తస్మైలిప్తం ప్రయచ్ఛామి అక్ష క్రీడాం కరోతి యః, నారికేరాన్ పృథుఃకాంశ్చ దేవేభ్యః పితృభ్బ్సు మర్ప్య బంధుభిస్సహ భక్షయేత్" అనఁగా గొబ్బరికాయ నీళ్ళుత్రాగి యక్షక్రీడ నారంభించునది. నిశీధమందు లక్ష్మీదేవి వరమిచ్చునదియై యెవ్వరీరాత్రి నక్షక్రీడచేయుచు మేల్కొనియెదరో వారికి సంపదనిత్తు నని పలుకుచువచ్చును. కనుక కొబ్బరికాయలును నడుకులును నివేద మునకు బితృదేవతలకు సమర్పించి బంధువులతో దాను భుజింపవలెను.

## ఆశ్వయుజకర్మ

ఈ పౌర్ణమాసియందే యాశ్వయుజకర్మ ఋగ్వేదులు చేయునది. అదియు పర్వము ద్వివిధమైనచో పూర్వాహ్ణసంధియందు శేషపర్వమున ప్రకృతీష్టిచేసి చేయ వలెను. అపరాహ్ణసంధిలో వికృతీష్టియగు దీనిచేసి ప్రకృతికన్వాధానము. దాని ప్రయోగ మన్యగ్రంథమున దెలియునది.

## ఆగ్రయణ కాలము

ఆశ్వయుజకార్తికములం దమావాస్యయందుగాని పూర్ణిమ యందుగాని శుక్లపక్ష గతకృత్తికాది విశాఖాంతనక్షత్రములలోనైనను శుక్లపక్షమందలి రేవతీ నక్షత్ర మందైనను వ్రీహిధాన్యము కాగ్రయణము. ఇట్లు శ్రావణ భాద్రపదములందు మీఁ ద జెప్పిన పర్వములలోను నక్షత్రములలోను చామధాన్యమున కాగ్రయణము. చైత్ర వైశాఖములలో యవధాన్యమున కాగ్రయణము. అందులో పూర్ణిమ యందు సంగమ కాలమునకు బూర్వము సంధియైనచో బూర్వదినమందాగ్రయణముచేసి ప్రకృతి కన్వా ధానము. మధ్యాహ్నమునకు బైని సంధియయినచో సంధిదినమందాగ్రయణముచేసి ప్రకృత్యన్వాధానము చేయునది. సంగమ కాలముఁదాటి మధ్యాహ్నమునకు ముందు గాని వెనుకగాని సంధియైనచో సంధిదినమందాగ్రయణేష్టి చేసి ప్రకృతీష్టి పూర్వాహ్ణమం దేని యపరాహ్ణమందేని సంధియగునో విహితకాలమందు దర్శేష్టిజేసి ప్రతిపదమధ్య మం దాగ్రయణేష్టి చేయునది. ఇట్లు నక్షత్రమందాగ్రయణము చేయు పక్షమునను పూర్ణిమేష్టికి ముందగునట్లును దర్శేష్టికి వెనుకనగునట్లును నాగ్రయణేష్టి జేయవల యును. అట్లు దీపికావచనము. "దర్శేష్ట్యాః పరముక్తమాగ్రయణకం ప్రాక్పౌర్ణమాసాచ్చ తత్" అని విచారించినచో "అథో పూర్వాహ్ణపర్వక్షయ" యని యుపక్రమించుట వలన బూర్వాహ్ణసంధియందే యీ క్రమమని హేమాద్రి సిద్ధాంతమునసరించు దీపికామతము. అయినను సంధిపర్వావస్థలలో నిట్లనే క్రమమును కౌస్తుభ సిద్ధాంతము ననుసరించినది యీ సిద్ధాంతమని తెలియవలెను. యీ పక్షమం దథోయను దానిఇకి చకారార్థమని యోజించునది. పూర్వాహ్ణపక్షమందును నని యర్థము. కాబట్టి కృష్ణపక్ష మందుగాదని సిద్ధించినది. యీదీపికాకార మతము. దర్శయం దాగ్రయణవిధి

కఖండతిథియయినచో వైయర్థ్యము వచ్చును. కనుక యుక్తము కదాని గృహ్యాగ్నిసాగ రోక్తియే యసంగతము. ఇతర వికృతులకు ఖండపర్వ ములో బ్రకృత్యనంతరమున త్రిపదలోచేసినను బర్వాను గ్రహస్మృతియైనట్లనే యఖండ దర్శయందును బ్రతిపత్తు నందుచేయు నాగ్రయణమునకు దర్శపర్వానుగ్రహ సమ్మతి కావచ్చును. దర్శయందు విధికి ఖండపర్వమందు సార్థక్యము గలుగవచ్చును. శ్రావ ణాదిమాసములలో చామధాన్యమున కాగ్రయణము జరుగనిచో శరత్కాలమున వ్రీహ్యా దుల యాగ్రయణ ముతో సమాన తంత్రముగ చేయవచ్చును. అందు "స్మార్తే వ్రీహ్యాగ్ర యణంశ్యామా కాగ్రయణం చ తంత్రేణ కరిష్యే" యని సంకల్పించి, ఇంద్రుఁడు, అగ్ని, విశ్వేదేవులు వీరికై యెనిమిది పిడికిలి వ్రీహిధాన్యము చేటలోనుంచి మరియొక చేటలో చామ ధాన్యము సోమదేవతకై నామచే నిరూపించి తిరుగ మొదటిచేటలో ద్యావాపృథివీ దేవతలకై వీహులుంచవలెను. ఇట్లు హోమమందును విశ్వేదేవుల హోమము ననంతరమున సోమదేవతకు శ్యామాకచరువును హోమముచేసి ద్యావా పృథివీదేవ తల హోమము చేయునది ఆశ్విన పౌర్ణమాసియం దపరాహ్ణాది సంధిలో నాగ్రయణము చేయుచో నాశ్వయుజీకర్మకును సమానతంత్రత చేయవలెను. కనుక పాతవ్రీహి ధాన్యపు చరువు క్రొత్తవ్రీహుల చరువు క్రొత్త చామధాన్యపు చరువునని మూడు స్థాలులయందు మూడుచరువుల ఇఁక పూర్వాహ్ణాది సంధియైనచో సంధిదిన మందు బ్రకృతియాగముపైని యాశ్వయుజపూర్వదినమందు గాని సంధిదినమందు గాని ప్రకృతియాగమునకు బూర్వమే యాగ్రయణమని కాలభేదమున్నందున నేకతంత్రత లేదు. చామబియ్యపు చరువు దొరకనియెడ చామగడ్డి పుస్తకముచేసి స్రువమున కుత్తరముగబరచి యక్కడ స్రుక్కునుంచవలెను. అంతమాత్రముననే శ్యామా కాగ్రయణము సిద్ధించునని వృత్తికారుఁడు నారాయణుఁడు చెప్పెను. యవాగ్ర యణము వైకల్పికము. వ్రీహ్యాగ్రయణమునకు వసంతఋతువు పర్యంతము. ఆపత్తు లేకున్నను గౌణకాలపర్యంతము జేయునప్పుడు చేయుచో కాలాతిపాత ప్రాయశ్చిత్తము చేసుకొని చేయవలెను. ఆపత్తుగల్గినచో గౌణకాలమందు చేసినను ప్రాయశ్చిత్త మక్కర లేదు. గౌణకాలముగూడ నతిక్రమించినచో వైశ్వానరేష్టినిచేసి యతిక్రమించిన యాగ్ర యణము చేయవలెను. స్మార్తమందయినచో వైశ్వానరదేవతాకమైన స్థాలీపాకము గ్రహించునది. ఏమనిన నాహితాగ్నికే విపురోడాశములో యదియె యౌపాసనాగ్ని గలవారికి చరువులని యున్నది. ప్రథమాగ్రయణము శరత్కాలము నతిక్రమించినచో విభ్రష్టేష్టినిగాని తద్దేవతాకమైన స్థాలీపాకముగాని చేసి ముందువచ్చెడు ముఖ్యకాల ములో నాగ్రయణారంభము చేయవలెను. గౌణకాలమందు బ్రథమాగ్రయణము గూడదు. ఆరంభించకమున్ను దర్శపూర్ణమాసాగ్రయణాదులకు ప్రాయశ్చిత్తము వైకల్పి కము గనుక మీఁదజెప్పిన విభ్రష్టేష్టి వికల్పితమని తెలియునది. అగ్రయణముచేయక నూతన సస్యము భక్షింపగూడదు. అందువచనము. శ్లో॥"అకృతా గ్రయణోశ్నీయాన్న వాన్నం యదివైనరః, వైశ్వానరాయకర్త్యశ్చరుః పూర్ణాహుతిస్తుయా, యద్వాస మింద్ర వాయేతి శతవారం జపేన్మనుం" అనఁగా నాగ్రయణముచేయక నవాన్నము భక్షించు

నరుడువైశ్వానరచరువు పూర్ణాహుతియు చేయవలెను. లేక సమింద్ర రాయ యను ఋక్కును నూరుమారులు జపించవలెనని యర్థము. ఇఁక నాగ్రయణమున కనుకల్ప ములు వేరుగ నాగ్రయణము చేయలేనియెడ బ్రకృతీష్టితో తంత్రముగ చేయవచ్చును. అందు పౌర్ణమానేష్టితో తంత్రము చేయుచో నాదియందాగ్రయణము ప్రధానము. అనంతరము ప్రాకృతము ప్రధానము. ఇఁక దర్శేష్టితో నేకతంత్రమగునపుడు మొదట దర్శేష్టి ప్రధానయోగము అటుపైని యాగ్రయణ ప్రధానయోగము. ఇతరమైన పూర్వోత్త రాంగములు నాగ్రయణ వికృతి సంబంధులనే చేయవలెను. ఏమనిన, విరోధే వైకృతం తంత్రమని సిద్ధాంతము. ఇట్లు సంభవింపనిచో నవశ్యామాక వ్రీపా యవలచే బురోడా శముచేసి దర్శపూర్ణమాసములు చేయునది. లేదా నవవ్రీహ్యాదులచే నగ్ని హోత్ర హోమము చేయునది. లేక నవాన్న మాహితాగ్నిగోపునకు బెట్టి దానిపలచే నగ్ని హోత్రము చేయునది లేదా నవాన్నముచే బ్రాహ్మణ భోజనముచేసి భక్షింపవలెనని సంక్షేపము. ఇది మలమాసమందు చేయఁగూడదు. గుర్వాద్యస్తమయ మందును చేయ గూడదని కొందరు. పాతధాన్యము దొరకనిచో మలమాసమందును చేయ వచ్చును. ఈ పూర్ణిమయందే జ్యేష్ఠాపత్యమునకు నీరాజనము మొదలగునది పరవిద్ధ యందు చేయునది.

## కృష్ణచతుర్థి, లేక కరకచతుర్థీ వ్రతము

అశ్విన కృష్ణచతుర్థి కరకచతుర్థి, అది చంద్రోదయ వ్యాపిని గ్రహించునది దిన ద్వయమం దష్టవ్యాప్త్యాదులున్నచో సంకష్టచతుర్థికివలె నిర్ణయము. ఈ కృష్ణాష్టమి యందు రాధాకుండమున స్నానము మధురామండపమందుండు వారు జేయునది. అది యరుణోదయవ్యాపిని గావలయును. అట్లు సంభవింపనిచో సూర్యోదయవ్యాపిని గ్రహింపవచ్చును.

## గోవత్సద్వాదశి

ఆశ్వినకృష్ణద్వాదశి గోవత్సద్వాదశి. అది ప్రదోషవ్యాపినియై యుండవలెను. దినద్వయమందట్లు వ్యాపింపనిచోఁ బరదినమే. ఏమనని సాయంకాలమను గౌణ కాలమందు వ్యాప్తిగల్గును. ఉభయత్ర వ్యాప్తిగల్గినచోఁ బూర్వదినమే యని బహు సమ్మతము. పరదినమని కొందరు, అందు వత్సతోసమానవర్ణముగల్గి వత్సతోగూడి యున్న గోవును బూజించి తామ్రపాత్రతో దానిపాదమర్ఘ్యమియావలెను. అపుడు మంత్రము. “క్షీరోదార్ణవ సంభూతే సురాసురనమస్కృతే, సర్వదేవమయే మాతర్గృ హాణార్ఘ్యం నమోస్తుతే” అనగా క్షీరసముద్రమున కామధేనువవైపుట్టి దేవాసురులచే పూజింపబడి సమస్త దేవతారూపిణివగు నీకు నమస్కార మియార్ఘ్యము గ్రహింపుమని, అనంతరమున గారెలు చిట్టిబూరెలు మొదలగునవి పెట్టి ప్రార్థించవలెను. ఎట్లనిన, శ్లో. “సర్వదేవమయే దేవి సర్వదేవైరలంకృతే, మాతర్మమాభిలషితం సఫలం కురు నందిని” దీనియర్థము స్పష్టము. ఆదినమందు తైలపక్వమును స్థాలీపక్వమును గోవు సంబంధమైన క్షీరదధిఘృతాదులన్నియు వర్జించునది. రాత్రి మాషాన్నము భుజించుట

భూమియందే శయము బ్రహ్మచర్యము జేయునది. ఈ ద్వాదశినే యారంభించి యైదుదినములందు రాత్రి మొదటిభాగములో నీ రాజనవిధి నారదునిచే జెప్పబడినది. శ్లో॥"నీరాజయేయు ర్దేవాంశ్చ విప్రాన్ గాశ్చతురంగమాన్, జ్యేష్ఠాన్ శ్రేష్ఠాన్ జఘన్యాంశ్చ మాతృముఖ్యాశ్చ యోషితః" అని అనగా దేవతలకును బ్రాహ్మణులకును గోవులకును గుఱ్ఱములకును పెద్దలకును శ్రేష్ఠులకును స్వల్పులకును తల్లి మొదలగు స్త్రీలకును నీరాజన మీయవలయునని, త్రయోదశియందపమృత్యువు నశించుటకు యముని నుద్దేశించి బలిదీప మీయవలయును. ఈ త్రయోదశి మొదలు కొని గోత్రి రాత్రవ్రతము చెప్పఁబడినది. దానిప్రయోగవిధి కౌస్తుభమందు జూడ వలెను.

## నరకచతుర్దశి నిర్ణయము

అశ్వినకృష్ణచతుర్దశి చంద్రోదయ వ్యాపిని యైనచో నరకమునకు భయపడు వారు తిలతైలముచే నభ్యంగస్నానము జేయవలెను. అందునకు రాత్రి చతుర్థయామము మొదలుకొని యరుణోదయ పర్యంతము నదిమొదలు చంద్రోదయ పర్యంతమునది మొదలు సూర్యోదయ పర్యంతమునని కాలత్రయమందు బూర్వపూర్వము జఘన్యము ఉత్తరోత్తరము శ్రేష్ఠము కనుక చంద్రోదయోత్తరము ముఖ్యకాలము. ప్రాతఃకాలము గౌణము. అపుడు పూర్వదినమందే చంద్రోదయవ్యాప్తియున్నచోఁ బూర్వమే గ్రాహ్యము. పరదినమందే యదియున్నచోఁ బరదినమే గ్రాహ్యము. ఈ పక్ష మందు నాదినమందే యస్తమయాదికాలమున నుల్కాదానము దీపదానము విధింపబడినది. తత్కాలమందు జతుర్ధశి లేకున్నను జేయునది. రెండుదినములందును జంద్రోదయవ్యాప్తియున్నచోఁ బూర్వదినమే, ఇఁక దినద్వయమందును చంద్రోదయ వ్యాప్తికభావమున్నచో మూడుపక్షములు సంభవించును. ఎట్లనిన, పూర్వదినమందు చంద్రోదయానంతర ముషఃకాలముగ నైదుగడియలరాత్రి శేషించిన కాలమును సూర్యోదయకాలమును వ్యాపించి మరునాడు చంద్రోదయమునకు ముందే సమాప్తి నొందిన చతుర్ధశియొకటి. ఎట్లనిన, త్రయోదశి 58,5 చతుర్థశి 57. ఈ ప్రథమ పక్షమందు మీదవ్రాసిన యుషఃకాలైకదేశమందు జతుర్దశీ ప్రయుక్తమైన యభ్యంగ స్నానము జేయునది. ఇక పూర్వమందు సూర్యోదయ మాత్రమును వ్యాపించి ప్రవర్తించి పరమందు చంద్రోదయమునకు ముందే సమాప్తి నొందిన చతుర్దశి. రెండవది లేక సూర్యోదయమును స్పృశించక క్షయమొందు చతుర్దశి. రెండవది లేక సూర్యోదయమును స్పృవించక క్షయమొందు చతుర్దశి. ఎట్లనిన, త్రయోదశి 59-59. చతుర్దశి 57. మరియును త్రయోదశి 2. ఆ దినమందె చతుర్దశి 54. ఈ పక్షద్వయమందును పరదినమందు చంద్రోదయమందభ్యంగస్నానము. ఏమనిన చతుర్థయామాదిజఘన్యకాలమందు జతుర్దశీ వ్యాప్తి గలిగియున్నది. కొందరీపక్షద్వయ మందు నరుణోదయమునకు బూర్వమైనను జతుర్దశి మధ్యమందే యభ్యంగ స్నాన మందురు.

## యమతర్పణము

మరికొందరరుణోదయానంతరమున జంద్రోదయాదిలకామందు నమావాస్యా యోగ మున్నప్పటికి నభ్యంగస్నాన మనియందురు. మరియు గొందరు చతుర్దశికి క్షయమగుచో త్రయోదశియందే చంద్రోదయకాలమున స్నానమనిరి. అది యుక్తము గాదు. అట్టి యభ్యంగ స్నానమున విశేషము. శ్లో॥"శీతలోష్ణ సమాయుక్త సకంటక దశాన్విత, హర పాప మపామార్గ భ్రామ్యమాణః పునః పునః" అను మంత్రముచే నాగలిచే దున్నిన మంటిపెల్లగట్టునదుచ్చునచెట్టుగాని యానబతీగెగాని యామిదపు చెట్టుశాఖగాని మూడుమారులు స్నానమధ్యమందు త్రిప్పవలెను. అభ్యంగస్నానానంత రమున దిలకాదికము ధరించి కార్తిక స్నానముజేయునది. విధింపబడిన కాలములో స్నానము సంభవింపనియెడ సూర్యోదయముపైని గౌణకాలములోఁజేయవలెను. ఇచట యతులు మొదలగువారు నభ్యంగస్నానము జేయునది. కార్తికస్నానోత్తర మందు యమతర్పణము జేయునది. ఎట్లనిన, "యమాయ నమః యమం తర్ప యామి" యని యుచ్చరింపుచు నువ్వులతో మూడుజలాంజలులను సవ్యముగనైన నపసవ్యముగనైన దేవతీర్థమనగ వ్రేళ్ళకొసలనుండి యైననుబితృతీర్థమనగ నంగుష్ఠ తర్జనీమధ్యమునుండియైనను దక్షిణాభిముఖుడై యీయవలెను. ఇట్లు ముందు నూహించునది. "ధర్మరాజాయ నమః, మృత్యవేనమః, అంతకాయనమః, వైవస్వతాయ నమః, కాలాయ నమః, సర్వభూతక్షయాయ నమః, ఔదుంబరాయ నమః, దధ్యాయ నమః, నీలాయనమః, పరమేష్ఠినే నమః, వృకోదరాయ నమః, చిత్రాయనమః, చిత్ర గుప్తాయ నమః" అనియుచ్చరింపుచు నట్లు తర్పణమీయవలెను. జీవత్పితృకుడైన యెడయవలతో సవ్యముగ దేవతీర్థముచే నీయవలెను. శ్లో॥" తతః ప్రదోషసమయే దీపాన్ దద్యాన్మనోరమాన్, దేవాలయే మఠే వాపి ప్రాకారోద్యాన వీథిషు, గోవాజిహస్తి శాలాయా మేవం ఘస్రత్రయేపిచ. తులాసంస్థే సహస్రాంశౌ ప్రదోషే భూతదర్శయోః ఉల్కాహస్తానరాః కుర్యః పితౄణాం మార్గదర్శనం" అనగాఁ జతుర్దశిమొదలు మూడు దినముల పర్యంతము ప్రదోషమున మనోహరమైనదీపములను దేవాలయమందు మఠములందును, ప్రాకారములందు వీధులందును, గోశాల హస్తిశాల గుఱ్ఱపుశాల మొదలగు వానియందు నుంచవలెను.

## అమావాస్యయందభ్యంగము

మరియు సూర్యుడు మేషమందుండగా జతుర్దశియందు దర్శయందును ప్రదోషమున నుల్కలనగా కొరవులు ధరించి నరులు మహాలయపక్షమున వచ్చిన పితృదేవతలకు మార్గము జూపించవలెను. అపుడు మంత్రము శ్లో॥"అగ్ని దగ్ధాశ్చ యే జీవాయే ప్యదగ్ధాః కులేమమ, ఉజ్జ్వలజ్జ్యోతిషా దగ్ధాస్తే యాంతు పరమాం గతిం. యమలోకం పరిత్యజ్య ఆగతా యే మహాలయే, ఉజ్జ్వలజ్జ్యోతిషా వర్త్మ ప్రప శ్యంతు వ్రజంతుతే." అని దీనియర్థము స్పష్టము. ఈ చతుర్దశియందు వక్త భోజనము మహాఫలదము. ఇక నాశ్వినామావాస్యయందు బ్రాతఃకాలమున నభ్యంగము ప్రదోష

మున దీపదానము లక్ష్మీపూజయు మొదలగునది విహితము. అందు సూర్యోదయము మొదలస్తమయానంతరము రాత్రిగడియవరకు వ్యాపించి యమావాస్యయందు సందేహమే లేదు. అందు ప్రాతఃకాలమున నభ్యంగము దేవపూజయు మొదలగునవి జేసి యపరాహ్ణమందు బార్వణ శ్రాద్ధముచేసి ప్రదోషసమయమందు దీపదానము నుల్కాదర్శము లక్ష్మీపూజయుజేసి భోజనము చేయవలెను. ఈ దర్శయందు బాలురు వృద్ధులు నాతురులుతప్ప నితరులు పగలు భుజింప గూడదు. రాత్రియందు విశేష వచన మున్నందున గూడును. అట్లు పరదినమందేయైనను దినద్వయమందునైనను ప్రదోషవ్యాప్తి గలుగుచో బరదినమే గ్రాహ్యము. పూర్వమందే ప్రదోషవ్యాప్తియున్నచో లక్ష్మీపూజాదికమందు బూర్వదినమే అభ్యంగస్నానాదికమునకు బరదినము. ఇట్లు రెండు దినములను బ్రదోషవ్యాప్తి లేకున్నను బరదినమే. మరి పురుషార్థచింతామణి మాత్రము పూర్వమందే వ్యాప్తియనుపక్షమున పరదినమందు యామత్రయ మధికముగ వ్యాపించు దర్శయందు దర్శకంటె ప్రతిపత్తునకు వృద్ధియున్నచో లక్ష్మీపూజాదికము సహితము పరమందే యని చెప్పుచున్నది. ఈ మతమందు రెంటియందు బ్రదోష వ్యాప్తియున్నపుడును పరమందు దర్శమూడుజాములనర యధికముగ వ్యాపించినది గనుక పరమే యుక్తమని తోచుచున్నది. చతుర్దశి మొదలు దినత్రయమందును దీపావళి సంజ్ఞ యున్నందున వాటిలో స్వాతీయోగమున్న దినములన్నియు బ్రశస్తతమ ములు. ఈయమావాస్యయందే యర్ధరాత్రమైన పైని నరగస్త్రీలు తమగృహాంగణముల నుండి యలక్ష్మీనిస్సరణము చేయవలెను. అనగా నపుడిళ్లు వాకిళ్లు దుడిపింపవలె ననుట.

## కార్తికమాసము

వృశ్చిక సంక్రాంతియందు పూర్వము పదియారుగడియలు పుణ్యకాలము. తక్కినది పూర్వమువలెనని తెలియునది. ఇక కార్తిక శుక్లప్రతి పదలో కృత్యము. అపు డభ్యంగస్నానమావశ్యకము. ఇట్లు మూడు దినముల నభ్యంగస్నానము జేయనిచో నరకము ప్రాప్తించుననియున్నది. చేసినచో లక్ష్మీప్రాప్తియు నలక్ష్మీపరిహారము నగునని చెప్పబడినది. గనుక నిది నిత్యము కామ్యముగూడ నగును. ఈ ప్రతిపదయందు బలిపూజనము దీపోత్సవము గోక్రీడనము గోవర్ధన పూజా మార్గపాళీబంధనము వష్టికాకర్షణము నవవస్త్రాది ధారణము మొదలగు నుత్సవమ ద్యూతము స్త్రీలు నీరాజనమిచ్చుట మంగళమాలికయు నివి మొదలగునవి చేయవలసినవి. అపుడుద యము మొదలు పదిముహూర్తముల పర్యంతము ప్రతిపదయున్నచో జంద్ర దర్శనము కాదు గనుక చంద్రదర్శనముబట్టి వచ్చిన ద్వితీయావేధదగులనందున సర్వకార్యములు పరమైన ప్రతిపత్తుయందే కాదగును. ఇష్టి నిర్ణయ ప్రకరణమందు మూడు ముహూర్త ములు ద్వితీయాప్రవేశమైనచోఁ జంద్రదర్శనమని చెప్పబడినది. అది సూక్ష్మ దర్శన మగునని చెప్పుట. ఇక్కడ స్పష్టదర్శనమే నిషేధమునకు హేతువగును. అట్టి దర్శనము నారుముహూర్తములు ద్వితీయా ప్రవేశమైనచో గలుగునని తోచుచున్నది.

## బలిపూజ

తొమ్మిదిముహూర్తములైన నుండినచో బలిపూజా గోక్రీడన గోవర్ధనపూజా మార్గపాళీబంధనవష్టికాకర్షణములు పూర్వప్రతిపద యందే చేయవలెను. అభ్యంగన వస్త్రాది ధారణ ద్యూతనారికర్తృక నీరాజనమంగళమాలికాదు లుదయమందు ముహూర్తము వ్యాపించి యున్నను జేయవచ్చును. బలిపూజ మొదలగు వాటికి ప్రతిబంధకముచే బూర్వవిద్ధయందు సంభవములేనిచో బరదినమందు జేయవలెను గాని చేయకుండుటయు మరియొకదినము గ్రహించుటయుఁ గూడదు. బోధాయన శాఖీయులు దమతమ సూత్రమందలి కర్మల కనుష్ఠానము సంభవింపనిచో నాపస్తంబీ యాది సూత్రోక్తముగ ననుష్ఠానము జేతురుగాని మానివేయరుగదా. యట్లనే యిదియు నని మాధవునిచేఁ జెప్పబడినది. అపుడు రాజు పంచవర్ణముల ముగ్గులచే బలిని రెండు భుజములుగలుగ వ్రాసియు, నితరజనులు తండులములచే రచించియు పూజింపవలెను. అపుడు మంత్రము శ్లో॥"బలిరాజ నమస్తుభ్యం విరోచన సుతప్రభో, భవిష్యేంద్ర సురారాతే పూజేయం ప్రతిగృహ్యతాం." అనగా ఓ బలిచక్రవర్తీ ! నీవు విరోచను డనువానిపుత్రుడ వింద్రాధిపత్యమును ముందు పొందువాడవు. నేజేయు పూజను గ్రహింపుమని బలిచక్రవర్తి నుద్దేశించి యేదినయైన దానము చేయుచో నక్షయ్యముగ విష్ణు ప్రీతియగును. మరియు శ్లో॥"యో యాదృశేన భావేన తిష్ఠత్య స్యాం మునీశ్వర, హర్షదైన్యాది భావేన తస్య వర్షం ప్రయాతిహి" అనగా నీ దినమం దేయసవ్థతో ననగ హర్షముతోగాని దైన్యముతోగానియున్నచో నట్లనె సంవత్సరము వెళ్లును. శ్లో॥"అస్యాం దూత్యం ప్రకర్తవ్యం ప్రభాతే సర్వమానవైః, తస్మిన్ ద్యూతే జయో యస్య తస్య సంవత్సరం జయః విశేషతశ్చ భోక్తవ్యం ప్రశస్తైర్బ్రాహ్మణైస్సహ, బలిరాజ్యే దీపదానాత్సదా లక్ష్మీస్థి ్సరా భవేత్. దీపైర్నీ రాజనాదత్ర సైషా దీపావళీ మతా, బలిరాజ్యం సమాస్యాద యైర్నదీపావళిః కృతా, తేషాం గృహే కథం దీపాః ప్రజ్వలిష్యంతి కేశవ. అనగా నుదయమందందరు ద్యూతమాడవలెను. అందు జయ మగువారికి సంవత్సరమును జయమే, భోజనముగూడ మంచిబ్రాహ్మణులతోఁ బక్వాన్న విశేషము గలుగ జేయవలెను.

## లక్ష్మీ, కుబేర పూజ

బలి రాజ్యమందు దీపదానము జేయుచో లక్ష్మిస్థిరమగును. దీపదానము చేయనివారి గృహమందు దీపము వెలుగదని అందు లక్ష్మిపూజయుఁ గుబేరపూజయు విధింపబడినది. శ్లో॥"లక్ష్మీర్యాలోకపాలానాం ధేను రూపేణ సంస్థితా, ఘృతం వహతి యజ్ఞార్థే మమపాపం వ్యపోహతు. అగ్రతస్సంతు మే గావో గావో మే సంతు పృష్ఠత" గావో మే హృదయే సంతు గవాం మధ్యే వసామ్యహం." అనగా లోకపాలకులందర యొక్క లక్ష్మి గోరూపముధరించి యజ్ఞార్థమై ఘృతమిచ్చుచున్నది. ఆమె నాపాపము హరించుగాక. నాకు ముందు వెనుకను హృదయమందు గోవులే యుండుగాక. నేను గోవులమధ్యమున నుండెదనని యర్థముగల మంత్రములతో గోవులను వృషభ

ములను బూజించి యలంకరించి పాలుబిదుకుట భారము వేయుట మొదలగునవి వర్జింపవలెను.

## గోవర్ధనపూజ

ముఖ్యమైన గోవర్ధనపర్వతము సాన్నిధ్యము లభించినచో నచటనే పూజచేయ వలెను. లేనిచో గోమయముచేగాని యన్నకూటముచేగాని గోవర్ధనము గల్పించి తత్సహితముగ గోపాలపూజజేయునది. అందు "శ్రీకృష్ణ ప్రీత్యర్థం గోవర్ధన పూజనం గోపాల పూజనం కరిష్యే" యని సంకల్పించి "బలి రాజ్ఞో ద్వారపాలో భవానద్య భవ ప్రభో, నిజవాక్యార్థ నార్థాయ సగోవర్ధనగోపతే"అనగా నీవిచ్చినవరము సార్థక ముగ బలిచక్రవర్తికి ద్వారపాలుడవుగమ్ము. గోవర్ధన గోపకులతోగూడి "యోకృష్ణుడ" యనునర్థము గలమంత్రముచే గోవర్ధన గోపాలుర నావాహనము జేసియుంచవలెను. అటుపైని శ్లో॥"గోపాలమూర్తే విశ్వేశ శక్రోత్సవవిభేదక, గోవర్ధనకృతచ్ఛత్ర పూజాం మే హర గోపతే. గోవర్ధనధరాధార గోకులత్రాణకారక, విష్ణుబాహుకృతచ్ఛాయ గవాం కోటిప్రదో భవ." అనగా నోగోపాలమూర్తీ ! జగన్నియామకుడ! ఇంద్రుని యాగము మాన్పి గోవర్ధనము ఛత్రముగబట్టి రక్షించితివి. నా పూజను గ్రహింపుము. ఓ గోవర్ధనపర్వతమా! నీవు గోకులము రక్షించుటకు భగవంతుని బాహువు నలం కరించితివి. నాకు గోసమృద్ధినిమ్మని యర్థముగలమంత్రములతో గోపాలగోవర్ధనముల షోడశోపచారములచేఁ బూజింపవలెను. అనంతరమున వైభవానుసారముగ మహా నివేదన జేయునది. ఆపైని దానికంగముగ బ్రత్యక్ష ధేనువునందైన మృద్ధేనువునందైన బూర్వోక్తమంత్రములచే గోపూజనుజేసి, "ఆ గావో అగ్మన్ పై తేవదంతు" అను ఋక్కులచే గృహసిద్ధమైనచరువును వేల్చవలెను. బ్రాహ్మణుల కన్నదానము గోదానము జేసి గోవులకు దృణదానము గిరికి బలిదానమును జేయునది అటుపైని గోవులకు విప్రులకు హోమాగ్నికి గిరికి ప్రదక్షిణము గోవులతో జేయునది.

## నపరాహ్ణమందు మార్గపాళీబంధనము

అందు దూరుపుదిక్కున కుశలు రెల్లుచే నిర్మించినత్రాడు గులాచారము చొప్పున బొడవైన స్తంభమందును వృక్షమందునుగట్టి శ్లో॥"మార్గపాలి నమస్తేస్తు సర్వలోక సుఖప్రదే, విధేయైః పుత్రదారాద్యైః పునరేహి వ్రతస్యమే." అనగా నోమార్గపాలకురాల! సర్వలోకమునకు సుఖమిచ్చుదానవు నీకు నమస్కారము. విధేయులైన పుత్రదారాదు లతో గూడిన నాకు దిరుగ వ్రతమందు రమ్మని యర్థముగలమంత్రముతో బ్రార్థించి నమస్కరించి దాని క్రింది భాగమునుండి బ్రాహ్మణసహితముగ గోగజాశ్వాదులతో రాజులు వెళ్లవలెను. ఇట్లు కాశాదితృణములచే గట్టి మోకువేసి యొకవైపు రాజపుత్రులు రెండవభాగమున హీనజాతులును జయమును దెలిసికొనుటకు లాగవలయును. అందు హీనజాతులకు జయము వచ్చినచో రాజులకు ముందు జయమగునని యెరుంగునది. ప్రాతఃకాలమున ద్యూతమని చెప్పబడినది. ఇట్లు స్త్రీలు నీరాజనమిచ్చు టయు ప్రాతఃకాలమందే కావలెను. రాత్రియందు గీతవాద్యాద్యుత్సవము జేయవలెను.

"నవైర్వస్త్రైశ్చ సంపూజ్యా ద్విజసంబంధి బాంధవాః" అనగా బ్రాహ్మణులకు సంబంధులకును బంధువులకును వస్త్రము లీవలెననుట. ఇక ద్వితీయ శ్లో॥ "యమో యమునయా పూర్వం భోజితస్స్వగృహే స్వయం, అతో యమద్వితీయాసా ప్రోక్తాలోకే యుధిష్ఠిర" అనగాఁ బూర్వమందు యముఁడు తనచెలియలైన యమునయొక్క గృహమందు యమున వండి వడ్డింపగ నీ దినమున దాను భోజనము చేసెను గనుక నిది యమద్వితీయ యనబడునని యున్నందున నీ దినమందు స్వగృహములో భుజింపక యత్నముతో భగిని హస్తముచే భుజింపవలెను. దానిచే ధనధాన్యసుఖలాభము గలుగును. వస్త్రములు నలంకారములు నందరు చెలియండ్రకు నీవలయును. తనకు చెలియలు లేనిచో పిత్రాదుల భగినులను బూజించునది. అట్లు భగినియు భ్రాతను బూజించెనేని యవైధవ్యమును భ్రాతకు చిరజీవనమును గలుగును. అదిచేయనిచో దొమ్మిది జన్మముల పర్యంతము భ్రాతృనాశ మగును. ఈ విదియ కపరాహ్ణవ్యాప్తి పూర్వదినమందే యైనచోఁ బూర్వమే గ్రాహ్యము. ఉభయదినములయందును వ్యాప్తి నవ్యాప్తియు మొదలగుపక్షములలో బరమే గ్రాహ్యము. ఈ విధియయందపరాహ్ణమున యమునలో స్నానముజేసి చిత్రగుప్తులతో దూతలతో యముని పూజించి యర్ఘ్యమీయవలెనని విధింపబడినది. కార్తిక శుక్లషష్ఠి యందు వహ్నిని బూజించి తత్ప్రీతికై విప్రభోజనము జేయునది. కార్తిక శుక్లాష్టమి గోష్టాష్టమి అపుడు గోపూజనము గోప్రదక్షిణము గోవుల వెనుక వెళ్లుట వీనిచే నిష్టకామావాప్తి కార్తిక శుక్ల నవమియందు మధురాప్రదక్షిణము చెప్పబడినది. ఈ యష్టమి యుగాదియు నగును. ఇది పూర్వాహ్ణవ్యాప్తిగనున్నఁచో బిండరహితమైన శ్రాద్ధము చెప్పఁబడెను.

## భీష్మపంచక వ్రతము

ఇచటి విశేషము వైశాఖమాస ప్రకరణమందుక్తము. ఏకాదశి మొదలుకొని దినము లైదిటను భీష్మపంచకవ్రతము విధింపబడినది. అది విద్ధగాని యేకాదశియందారంభించి చతుర్దశివేధలేని యుదయవ్యాపినియైన పూర్ణిమయందు సమాప్తిజేయవలెను. శుద్ధైకాదశి నారంభించునపుడు తిథిక్షయముచేఁ బూర్ణిమకు దినపంచక స్వరూపమైన వ్రతము సమాప్తికానిచో విద్ధైకాదశియందును బ్రారంభింపవచ్చును. శుద్ధైకాదశియం దారంభించినను దినవృద్ధిచే నారుదినములు సంభవించెనేని చతుర్ధశీ విద్ధయగు పూర్ణిమయందును సమాప్తిజేయవచ్చును. ఇక వ్రతప్రయోగము కౌస్తుభాదుల యందు దెలియవలెను. కార్తికమాసమందేకాదశి మొదలగు పర్వమందు చంద్రతారాబలములజూచి శివవిష్ణ్వాది మంత్రగ్రహణము మొదలగు దీక్షచేయవలెను.

## తులసీకాష్ఠామాలా ధారణము

శ్లో॥"కార్తికేతు కృతా దీక్షా నృణాంజన్మవిమోచనీ." అనఁగా కార్తికమందు మంత్రదీక్ష జన్మరాహిత్యము గలుగ జేయునని నారదవచన మున్నందున నది ప్రశస్తము. మరియు తులసిపూసలమాలధరించుటయు నీమాసమందు మంచిదని స్కాందమందు ద్వారకామాహాత్మ్యమందు విష్ణుధర్మోత్తర ఖండమందు నున్నది.

శ్లో॥"నివేద్య కేశవే మాలాం తులసీకాష్టసంభవాం, వహతే యో నరోభక్త్యా తస్య నైవాస్తి పాతకం, తులసీకాష్ఠసంభూతే మాలే కృష్ణజనప్రియే, బిభర్మిత్వా మహం కంఠే కురు మాం కృష్ణవల్లభం, ఏవం సంప్రార్థ్య విధివన్మాలాం కృష్ణగళేర్పితాం, ధారయే త్కార్తికే యోవై సగచ్ఛే ద్వైష్ణవం పదం." అనగా తులసి పూసల మాలికను దేవునికి సమర్పించి తాను ధరించినచో పాతకమేమియు నంటదనియు ఓ తులసీ కాష్టమాలిక ! నీవు విష్ణుభక్తులకు ప్రియమైనదానవు. నిన్ను కంఠమందు ధరించెదను. నన్ను గృష్ణభక్తునిజేయుమని ప్రార్థించి కార్తికమందు దేవునికి సమర్పించినమాలికను ధరించినచో విష్ణుస్థానము లభించుననియు నర్థము. ఇట్లు నిర్ణయ సింధువునందు స్పష్టము. ఇక నేమనిన, నా గ్రంథమందే మాలాధారణ ప్రకరణము కొసగు నొకా నొక పుస్తకమందు "అత్ర మూలం చింత్య" మని గనబడుచున్నదిగాని యది మాలా ధారణ వాక్యముల కప్రామాణ్యమను తాత్పర్యముచే గాదు అట్లైనచో దాను చూపించిన పురాణవచనములకు తానే యప్రామాణ్యము చెప్పినట్లగును. గనుక స్వవచన వ్యాఘాత మనుదోషము వచ్చును. మరియును శ్లో॥"తులసీ కాష్ఠఘటితై రుద్రాక్షాకార కారితైః, నిర్మితాం మాలికాం కంఠే నిదాయార్చన మారభేత్, తులసీకాష్ఠమాలాయా భూషితః కర్మఆచరణ్, పితౄణాం దేవతానాంచ కృతం కోటిగుణం భవేత్." అని పద్మ పురాణములో పాతాళఖండమందు డెబ్బది తొమ్మిదవ యధ్యాయమందు ప్రత్యక్ష ముగ గానుపించుచున్న వచనమునకు విరోధముగూడ సంభవించును. వచనార్థ మేమనిన రుద్రాక్షాకారముగ తులసీకాష్ఠముచే పూసలు నిర్మించి యట్టిమాలను ధరించి దేవార్చనము జేయవలయుననియు నట్టిమాలికను ధరించి కర్మజేయుచో దేవతలకుఁ బితృదేవతలకు దృప్తియగుననియు నర్థము. కాబట్టి యాషాఢమాస ప్రకరణమందు శుద్ధద్వాదశి దినమున ననూరాధానక్షత్రము "ఆషాఢా సితపక్షేషు మైత్రశ్రవణరేవతీ, మైత్రాద్యపాదేస్వపి తీహవిష్ణుః" అని భవిష్యస్థ విష్ణుధర్మస్థాది వాక్యముల బఠించియు నంతమందెట్లు నిర్మూలమని వ్రాసెనో యట్లనే ప్రకరణాంతరమందును అనగా నది మాధవాది గ్రంథముల గానరాదని తాత్పర్యము. నిర్ణయసింధువునందిట్లు సంకేత మని గ్రహించునది. అట్లుగాక యావచనముల కప్రామాణికత్వమే యైనచో భాద్రపద కార్తికములయందు తద్వాక్యానుసారముగ బారణానిర్ణయము వ్రాయుట యసంగత మేయగును. కౌస్థుభాది సర్వ నవీన గ్రంథములందలి యట్టి నిర్ణయమున కసాంగ త్యము గూడ వచ్చును. సర్వశిష్టులావచనము ననుసరించి జేయు పారణాచారమునకు విరోధమునగును గనుక నట్లుకాదని యెరుంగునది. అయినను మాధవాదుల గ్రంథ మందు గానంబడనందుననే యప్రామాణ్యమనగూడదు. ఏమనిన మాధవాది లిఖితముగాని బహువాక్యములకు నాచారములకు ప్రామాణ్యమనవలసివచ్చును. మరియు నిర్ణయసింధువునందంతట నిట్టి తాత్పర్యము నిశ్చయింపగూడదు. మరియే మనిన గొన్ని చోట్ల 'యత్రతుయత్తు' అని యచ్ఛబ్ధఘటితముగ బ్రారంభించి యంత మున "తాని నిర్మూలాని"యని మొదలగు రీతిని దూషింపబడును. ఎట్లనిన శ్రవణ ద్వాదశీ ప్రకరణములో శ్రవణమున కుత్తరాషాఢ వేధనిషేధకవచనములు. అక్కడ

నవి ప్రమాణములనియె తాత్పర్యమని సూక్ష్మబుద్ధులు విచారింపవలెను. ఒకవేళ మాధవాది గ్రంథముల గానబడకుండుటచేగాదు. నిషేధవాక్యము లున్నందున నప్రామాణ్య మనియెదరేని నట్టి నిషేధవాక్యములు సామాన్యముగ గాష్ఠమాలను నిషేధించి నచో దులసీకాష్ఠమాల ధరింపవలెనని యావిశేషవచనమువలన వాటికే బాధ గలుగును. ఇక తులసీకాష్ఠమాలనే నిషేధించువచనములుండినను, "అత్రి రాత్రే షోడశినం గృహ్ణాతినాతిరాత్రౌ షోడశినం గృహ్ణాతి" యను రెండు శ్రుతులు నతిరాత్రమందు షోడశిగ్రహించుటను గ్రహింపకుండుటను జెప్పుచున్నందున నవిరుద్ధములైనను సమబలము లగుటచేత బరస్పరము బాధింపలేక వికల్పమును జెప్పును. అట్టి వికల్పము వైష్ణవ విషయమై ధారణమనియు శైవుల విషయమై ధారణముగూడదనియు వ్యవస్థజేయవచ్చును. కనుకనే హరివాసర నిషేధవచనములు వైష్ణవులకే యావశ్యకములు గనుక మాధవగ్రంథములో వ్రాయలేదని పురుషార్థచింతామణిలో నున్నది. అట్లనే యూహింపవచ్చును. ఇట్లు ధాత్రీకాష్ఠ మాలాధారణవిధియు నెరుంగునది. రామార్చనచంద్రికాది బహు గ్రంథములందు "తులసీకాష్ఠఘటితై ర్మణిభి ర్జపమాలికా" ఇత్యాది విధివచనము లనేకములు గానబడుచున్నవి. సర్వదేశముల వైష్ణవుల యందు దులసీ కాష్ఠమాల ధరించు నాచారము స్పష్టముగనున్నది. కాబట్టి కేవలము భస్మ ధారణద్వేషములుగల వైష్ణవులతో స్పర్ధచేత శైవాగమములం దాగ్రహము గలవారు ద్వేషించుచున్నారని తోచుచున్నది.

## ధాత్రీ కాష్ఠమాలాధారణము

ఇక ధాత్రీమూలమందు దేవతా పూజకు విధి "సర్వపాపక్షయ ద్వారా శ్రీ దామోదర ప్రీత్యర్థం శ్రీదామోదర పూజాంకరిష్యే"యని సంకల్పించి పురుషసూక్తముతో షోడశోపచారములచేఁ బూజించి గంధపుష్పఫలములతో నర్ఘ్యమీయవలెను. శ్లో॥"అర్ఘ్యంగృహాణభగవన్ సర్వకామప్రదో భవ, అక్షయా సంతతిర్మేస్తు దామోదర నమోస్తుతే." అనగ నోదామోదర! యీ యర్ఘ్యము గ్రహించి సర్వకామముల పూరింపుము. అక్షయమైన సంతతి నిమ్మని యర్థము.

## ధాత్రీ మూలమందు దేవపూజ

అటుపై "నపరాధ సహస్రాణి" యని ప్రార్థించి ధాత్రీ వృక్షమును గంధకుంకుమాదులచే నలంకరించి పుష్పములచేఁ బూజించునది. "ధాత్ర్యై నమః" శాంత్యై, మేధాయై, కాంత్యై, ప్రకృత్యై, విష్ణుపత్న్యై, మహాలక్ష్మ్యై, రమాయై, కమలాయై, ఇందిరాయై, లోకమాత్రే, కల్యాణ్యై, కమనీయాయై, సావిత్ర్యై, జగద్ధాత్ర్యై, గాయత్ర్యై, సుధృత్యై అవ్యక్తాయై, విశ్వరూపాయై, సురూపాయై, అబ్ధిభవాయై" అని నామములు అనంతరమున ధాత్రీ మూలమున సవ్యముతో తర్పణము జేయవలెను. శ్లో. పితాపితా మహాశ్చాన్యే అపుత్రా "యేచ గోత్రిణః, తే పిబంతు మయాదత్తం ధాత్రీమూలేఽక్షయంపయః" ఆ బ్రహ్మాస్తంబపర్యంత మిత్యాది. "దామోదరనివాసాయై, దేవ్యై ధాత్ర్యై నమోస్తుతే, సూత్రేణానేన బధ్నామి సర్వదేవనివాసినీం." అనగా దండ్రి తాత మొదలగు

వారును నపుత్రులైన సగోత్రులును బ్రహ్మాది స్తంబపర్యంతము వారు ధాత్రీమూల మందు నేనిచ్చు నక్షయోదకము ద్రావవలెనని తర్పణమంత్రార్థము. అటుపైని దామో దరునికి నివాసమైన యోధాత్రి! నీకు నమస్కారము. ఈ సూత్రముచే నిన్ను కట్టు చున్నానని యర్థముగల రెండవ మంత్రముతో సూత్రము జుట్టవలెను."ధాత్ర్యై నమః " యని నాల్గుదిక్కులను బలులనిచ్చి యెనిమిది దీపములుంచవలెను. ఎన్మిదిమారులు ప్రదక్షిణముజేసి నమస్కరించవలెను. శ్లో॥"ధాత్రీదేవి నమస్తుభ్యం సర్వపాపక్షయంకరి, పుత్రాన్ దేహి మహాప్రాజ్ఞేయశో దేహి బలంచమే ప్రజ్ఞాం మేథాం చ సౌభాగ్యం విష్ణుభక్తించ శాశ్వతీం, నీరోగం కురుమాం నిత్యం నిష్పాపం కురు సర్వదా." అనగా నోధాత్రీదేవి ! నీకు నమస్కారము పుత్రులను యశస్సును బలమును ప్రజ్ఞను మేధసు సౌభాగ్యమును శాశ్వతమైన విష్ణుభక్తిని యారోగ్యమును పాపనాశన మును నాకెప్పుడు నీవలెనని ప్రార్థించి ఘృతపూర్ణమైన కాంస్యపాత్రమును దానము చేయవలెను.

## ద్వాదశియందు బారణ నిర్ణయము

కార్తిక శుక్లద్వాదశియందు రేవతిలేనిచోఁ బారణచేయవలెను. అపుడపరిహార్య మైన యోగమున్నచోఁ జతుర్థపాదము మాత్రము విడువవలె ననువిశేషము శ్రవణా నిర్ణయ ప్రకరణములోఁ జెప్పబడెను. ఇక ప్రబోధోత్సవము దులసీ వివాహమును అందు బ్రబోధోత్సవము కార్తిక శుక్లైకాదశియందని కొన్నిటిలోనున్నది. రామార్చన చంద్రికాదులలో ద్వాదశియందని చెప్పబడినది. ఉత్థాపనమంత్రములో ద్వాదశియని యున్నందున నదియే యుక్తము. అపుడును ద్వాదశికి రేవత్యంతపాదయోగమున్నచో రాత్రి ప్రథమ భాగమందు ప్రశస్తము. అదిదొరకనిచో నా రాత్రి రేవతీనక్షత్ర యోగ మెపుడున్నను గ్రాహ్యము. అట్లు రాత్రి ప్రథమభాగమందుఁ గేవల ద్వాదశియైనను గేవల రేవతీ నక్షత్రమైనను గ్రహింపవచ్చును. ద్వాదశియు రేవతియు రెండును రాత్రి లేనియెడ పగలును గ్రహింపవచ్చును. అనగ ద్వాదశిమధ్యమందు జేయునది యని కౌస్తుభము చెప్పుచున్నది. అయినను "పారణాహే పూర్వరాత్రౌ" అని వచన మున్నందున పారణదినమందు రాత్రి పూర్వభాగము ద్వాదశిలేకున్నను త్రయోదశి యందే ప్రబోధోత్సవమని దేశాచారము.

## విష్ణుప్రబోధోత్సవ తులసీ వివాహముల ప్రయోగము

ఇట్లు తులసీవివాహమునకు నవమి మొదలు దినత్రయమందు నేకాదశి మొదలు పూర్ణిమవరకు లోగా నొకదినమందును వివాహయోగ్య నక్షత్రయోగ మాత్రము నందైనను విధింపఁబడినందున కాలనియమములేదు. అయినను పారణ దినమందు బ్రబోధోత్సవముతోఁ దంత్రముగ సర్వదేశములం దాచరింపఁబడుచున్నం దున బారణదినమందుఁ బూర్వరాత్రమందే జేయవలెను. ప్రబోధోత్సవముకంటె వేరుగ జేయవలసినచో గాలాంతరమున జేయవలెను. అందు బుణ్యాహవాచనము నాందీశ్రాద్ధము వివాహహోమము మొదలగు నంగములతో గూడిన తులసీవివాహము విధి కౌస్తుభాది గ్రంథమున దెలియునది. సంక్షేపముగ బ్రబోధోత్సవముతోగూడ

దంత్రముగజేయు శిష్టాచారము ననుసరించి వ్రాయబడును. దేశకాలముల నుచ్ఛరించి "శ్రీదామోదర ప్రీత్యర్థం ప్రబోధోత్సవం సంక్షేపత స్తులసీ వివాహంచ తంత్రేణ కరిష్యే. తదంగతయా పురుషసూక్తేన షోడశోపచారై స్తంత్రేణ శ్రీమహావిష్ణు పూజాం కరిష్యే" యని సంకల్పించి న్యాసాదులుచేసి శ్రీవిష్ణువును తులసిని ధ్యానించి "సహస్ర శీర్ష"యను మంత్రముచే నా వాహనముజేసి "పురుష ఏవ" యని మొదలగు మంత్రములచే "శ్రీమహావిష్ణవే దామోదరాయ శ్రీదేవ్యై తులస్యై నమః" యని యాసనము మొదలగునవి స్నానాంతమందు మంగళవాద్యములతో సుగంధితైలము పసుపును నాగవల్లీ రసముచే గ్రహించి యుష్ణోదకముచే తులసీ విష్ణువులకు మంగళస్నానము జేయవలెను. పంచామృతస్నానము సమర్పించి శుద్ధోదకస్నానము జేయించి వస్త్రము యజ్ఞోపవీతము చందనమునిచ్చి తులసికి హరిద్రాకుంకుమ కంఠసూత్రాద్యలంకారము లిచ్చి మంత్రపుష్పాంతపూజను సమాప్తి నొందించి వాద్యఘోషముచే దేవుని మేల్కొల్పునది. అపుడు మంత్రము "ఇదం విష్ణుః" అని "యోజాగార" యను మంత్ర మాచారప్రాప్తము. శ్లో॥ "బ్రహ్మేంద్ర రుద్రాది కుబేర సూర్యసోమాదిభిర్వందితవందనీయ, బుధ్యస్వదేవేశ జగన్నివాస మంత్రప్రభావేన సుఖేన దేవ. ఇయంచ ద్వాదశీ దేవ ప్రబోధార్థం తు నిర్మితా, త్వయైవ సర్వలోకానాం హితార్థం శేషశాయినా. ఉత్తిష్ఠో త్తిష్ఠగోవింద త్యజ నిద్రాం జగత్పతే, త్వయి సుప్తే జగత్సుప్తముత్థితే చోత్థితం జగత్." అనగా బ్రహ్మరుద్రాదులచే వందితుడైన యోజగన్నివాసుడ! యీ ద్వాదశి ప్రబోధముకొరకు నీచేతనే సృజింపబడినది. ఓ శేషసాయి! జగత్పతీ! మేలుకొనుము. నీవు నిద్రించినచో జగము నిద్రించును. మేల్కొనిన తెలివినొందును. అని ప్రార్థించి "చరణంపవిత్రం" శ్లో॥ గతా మేఘా వియచ్చైవ నిర్మితం నిర్మలాదిశః శారదానిచ పుష్పాణి గృహాణ మమ కేశవ." అనఁగా మేఘములన్నియుఁ బోయినవి. యాకాశము నిర్మలమైనది. దిక్కులు విశదమైనవి, శరత్కాలపుష్పము లివిగో గ్రహింపు మోకేశవుడ యను శ్లోకార్థము. ఈ మంత్రములచేఁ బుష్పాంజలి నీవలెను. అనంతరమున నాచారముబట్టి శ్రీకృష్ణప్రతిమను తులసి కభిముఖముజేసి మధ్యమందు తెరవేసి మంగలాష్టకశ్లోకముల బఠించి తెరదీసివేసి యక్షతలు జల్లి దామోదరునిహస్తమందు తులసీ దానము జేయవలెను. "దేవీం కనక సంపన్నాం కనకాభరణైర్యుతాఁ, దాస్యామి విష్ణవే తుభ్యం బ్రహ్మలోకజిగీషయా" సువర్ణాభరణములతోగూడ కనక సంపత్తిగల దేవిని సాక్షాద్విష్ణువవైన నీకొరకు బ్రహ్మలోకార్థమై యిచ్చెదనని యర్థము. ఈ మంత్రములచే "మయా సంవర్ధితాం యథా శక్త్యలంకృతామిమాం తులసీదేవీం దామోదరాయ శ్రీధరాయ వరాయ తుభ్యమహం సంప్రదదే" యని దేవు నెదుట సాక్షతజలము విడువవలెను. "శ్రీమహావిష్ణుః ప్రీయతాం" అనిపలికి "ఇమాం దేవీం ప్రతిగృహ్ణాతు భవాన్" అనవలెను. అటుపైని తులసికి దేవుని హస్తస్పర్శజేసి "క ఇదం కస్మా అదాత్ కామః కామయ, కామోదాదా, కామః ప్రతిగ్రహీతా, కామగ్ సముద్రమావిశ, కామేవత్వా ప్రతిగృహ్ణామి, కామైతత్తే, వృష్టిరసిద్యౌస్త్వా దదాతు, పృథివీ ప్రతిగృహ్ణాతు" అనుమంత్ర మన్యులచే బఠింపించవలెను. యజమానుఁడు పఠించు శ్లోకము "త్వం

దేవి మేగ్రతో భూయా స్తులసీదేవి పార్శ్వతః” దేవి త్వం పృష్ఠతో భూయాస్త్వద్దానా న్మోక్ష మాప్నుయాం” అనగ నోతులసీదేవి! నా యెదుటను పార్శ్వముల వెనుకను నీవు రావలెను. నీదానముచే మోక్ష మొందెదననుట. ఇట్లు పఠించి “దానస్య ప్రతిష్ఠా సిద్ధ్యర్థం ఇమాం దక్షిణాం తుభ్యమహం సంప్రదదే” యని దేవుని ముందు భాగమున దక్షిణ నర్పించునది. అటుపైని “స్వస్తినో మిమీతాంశంసః” యని మొదలగు శాఖోక్త ములైన శాంతిసూక్తములను విష్ణుసూక్తములను బఠించవలెను. తులసీ సహితుఁ డైన విష్ణువునకు మహానీరాజనమిచ్చి మంత్రపుష్పమిచ్చి పత్నీ సహితుడై బంధువులతో సంబంధులతో నాల్గు ప్రదక్షిణములను జేయునది. బ్రాహ్మణులకు దక్షిణనిచ్చి యథా శక్తిగ బ్రాహ్మణభోజనము సంకల్పించి కర్మ నీశ్వరుని కర్పించవలయును. ఇట్లు దేవుని ప్రబోధోత్సవముజేసి కార్తికమందు వ్రతముగ దాను వర్జించిన వస్తువుల నుక్త విధమున ద్రవ్యాంతరములను దానముజేసి వ్రతపూర్తిని ప్రార్థించునది. “ఇదం వ్రతం మయాదేవకృతం ప్రీత్యై తవ ప్రభో! న్యూనం సంపూర్ణతాం యా తు త్వత్ప్రసా దాజ్జనార్దన” అనగ నోజనార్ధనుడ నీ ప్రీతికై నేజేసిన యీ వ్రతము నీయనుగ్రహముచే సంపూర్తి నొందుగాక యని ప్రార్థించి వ్రతమర్పించవలెను. చాతుర్మాస్య వ్రతమందు సమాప్తియు నీదినమందె యనికొందరు కార్తికమాస వ్రతోద్యాపనమును చాతుర్మాస్య వ్రతోద్యాపనమును జతుర్దశియందుగాని పూర్ణిమయందుగాని యగునని యితరులు నందరు.

## వైకుంఠ చతుర్దశి

పూర్వదినమందుపవాసముజేసి యరుణోదయ వ్యాపినియైన చతుర్దశియందు శివునిబూజించి ప్రాతఃకాలమున బారణము జేయునది. అట్లు చతుర్దశితోగూడిన అరుణోదయమగు యహోరాత్రమునందుపవాసము సిద్ధము. రెండుదినముల నరుణో దయవ్యాప్తియున్నచోఁ బరమైన యరుణోదయమందు పూజ పూర్వమందుపవాసము ఉభయమందును వ్యాప్తిలేనిచో జతుర్దశీయుక్తాహోరాత్రమందే యరుణోదయమున పూజ పూర్వమందుపవాసము కొందరు విష్ణుపూజయందిది నిశీథవ్యాపినిగా గ్రహింప వలెను. దినద్వయమందట్టి వ్యాప్తియున్నచో నిశీథము ప్రదోషము రెంటిని వ్యాపించు దాని గ్రహింపవలెనందురు. ఈ చతుర్దశియందే యమావాస్య గలయునపుడు కార్తిక మాసవ్రతోద్యాపసమున కంగముగా నుపవాసముజేసి యధివాసనమునుంచి “రాత్రౌ జాగరణం కుర్యాద్గీత వాద్యాదిమంగళైః, నరాణాం జాగరే విష్ణోర్గీతం నృత్యంచ కుర్వతాం, గోసహస్రంచ దదతాం ఫలంచసముదాహృతం”అనగా గీతనృత్యాది మంగళ కార్యములచే రాత్రి జాగరణము జేయువారికి గోసహస్ర దానఫలము గల్గు నని యున్నందున గీతనృత్యవాద్య విష్ణుచరితపఠన స్వేచ్ఛాలాప లీలానుకర్షములచే హరిజాగరముజేసి పరవిద్ధయనగ ప్రతిపదత గలసిన పూర్ణిమయందు సపత్నీకుడగు నాచార్యుని వరించి, “అతో దేవ” యను మంత్రద్వయముచేఁ దిలపాయసమును వ్రేల్చి గోదానముచేయవలెనని మాసవ్రతోద్యాపనము.

## కార్తిక శుక్లద్వాదశియు పౌర్ణమాసియు మన్వాదులు

అపుడు పూర్వాహ్ణవ్యాప్తిగావలెను. తక్కినది పూర్వము చెప్పబడినది. దీని యందు చాతుర్మాస్యవ్రతసమాప్తి జేయునది. ఆ సమాప్తి యందు దానములు, నక్త వ్రతమందు వస్త్రద్వయము, ఏకాంతరోపవాసమనగ ధారణబారణజేయుట, అందు గోదానము, మధుదధిఘృతములవర్జించుటయు పయోవ్రతము, అందు గోదానము, మధుదధిఘృతములవర్జింపుచో వస్త్రదానము గోదానము, బ్రహ్మచర్యముజేసినచో సువర్ణదానము తాంబూలత్యాగవ్రతమందు వస్త్రయుగదానము మౌనమందు ఘంటా దానము ఘృతకుంభదానము వస్త్రద్వయదానమును,ముగ్గులుంచినచో గోదానము సువర్ణపద్మమును దీపదానవ్రతే దీపికాదాన వస్త్రద్వయదానములు భూమియందు భుజించుట వ్రతమైనచో కాంస్యపాత్రదానము గోదానమును, గోగ్రాసమందు గోవృష ములు ప్రదక్షిణాశతమందు వస్త్రము అభ్యంగవర్జనమందు దైలపూర్ణఘటము, నఖకేశ ధారణమందు వస్త్రము అభ్యంగవర్జనమందు దైలపూర్ణఘటము, నఖకేశధారణమందు మధువు ఘృతము సువర్ణము నీవలెను. ఇట్లు దానవిశేషము జెప్పనిచో సువర్ణ గోదానములు గుడము వర్జించినచో గుడమునింపి సువర్ణముతో తామ్రపాత్రమని నీవలెను. ఇట్లు లవణము వర్జించినచో లవణపూర్ణమైన తామ్ర పాత్రమని కొందరు ఈ దినమందే లక్షప్రదక్షిణల నమస్కారాది వ్రతములకు నాషాఢపౌర్ణమాసి నారంభించిన వాటి కుద్యాపనము జేయవలయును. ఇట్లు తులసీలక్షపూజను కార్తిక మందుగాని మాఘమందుగాని ఆరంభించి ప్రతిదినమందును వేయొచొప్పున లక్షయు సమాప్తి నొందించి మాఘపూర్ణిమయందుగాని వైశాఖ పూర్ణిమయందుగాని యుద్యాప నము జేయవలయును. ఇట్లు పుష్పాదిలక్ష పూజయు నెరుంగునది. అందు బిల్వపత్ర లక్షపూజచే నాయుష్యము, అతసీలక్షపూజచే విద్య, తులసీలక్షపూజచే విష్ణుప్రసాదము గోధూమములు తండులములు మొదలగు ప్రవస్తధాన్య లక్షపూజచే దుఃఖనాశము. ఇట్లు సర్వపుష్పములచే సర్వకామావాప్తి ఇట్లు లక్షవర్తి వ్రతము మాసత్రయముచేసి కార్తికమందు గాని మాఘమందుగాని వైశాఖమందుగాని యుత్తరోత్తరము ప్రశస్తము. అందు సమాప్తి చేయవలెను. ఇట్లు ధారణపారణ వ్రతోద్యాపనమును పూర్ణిమయందే కావలెను. మాసోపవాసము మొదలగు కార్తికమాసవ్రతములకు ద్వాదశియందే సమాప్తి. యపుడు సంభవింపనిచోఁ బూర్ణిమయందు జేయవలెను. ఇట్లు గోపద్మ వ్రతమాషాఢశుక్లైకాదశి నారంభించి ప్రతిదినమందును ముప్పదిమూడు గోపద్మము లను వ్రాసి గంధపుష్పములను బూజించి యన్నిటికిని అర్ఘ్యములను నమస్కారము లను ప్రదక్షిణములనుజేసి కార్తిక ద్వాదశియందు ముప్పదిమూ డపూపములు వాయన మీయవలెను. ఇటులైదు సంవత్సరములుచేసి యుద్యాపనము చేయవలెను. లక్ష ప్రదక్షిణములు మొదలుకొని గోపద్మవ్రత పర్యంతము మీదజెప్పిన వ్రతముల కాచరణ ప్రకారము కౌస్తుభాదులందుఁ దెలియవలెను.

## కార్తికేయుని దర్శనము

కార్తికపూర్ణిమకు కృత్తికా నక్షత్ర యోగమున్నచో మహాపుణ్యము రోహిణీ యోగమున్నచో మహాకార్తికి యనఁబడును. కార్తిక పూర్ణిమకు కృత్తికాయోగమున్న పుడు కుమారస్వామిదర్శనముచే సప్త జన్మలయందు ధనాఢ్యుఁడైన విప్రుఁడై పుట్టును. వేదపారంగుడగును. సూర్యుడు విశాఖయందున్నపుడు దిననక్షత్రము కృత్తిక యగుచో పద్మకయోగము. ఇది పుష్కరతీర్థమందతి ప్రశస్తము. అపుడు త్రిపురాఖ్యమైన దీప దానము విధింపఁబడినది.

## వృషోత్సర్గము

కార్తిక పౌర్ణమాసియందు గామ్యవృషోత్సర్గము ప్రశస్తము. ఇట్లు గజాశ్వరథ ఘృతధేన్వాదిదానములును ప్రశస్తములు. వృషోత్సర్గమున కాశ్వినపౌర్ణమాసియు సూర్య చంద్రగ్రహణములు కర్కటమకర సంక్రాంతులు మేషతులా సంక్రాంతులు నివియుక్తకాలములు. గ్రంథాంతరమందు మాఘచైత్ర వైశాఖఫాల్గుణషాఢముల పూర్ణిమలును రేవతి నక్షత్రము వైధృతివ్యతీపాతములును యుగాదులు మన్వాదులు సూర్యసంక్రాంతులు పితృమృతతిథియు నష్టశ్రాద్ధతిథియు నివి వృషోత్సర్గకాలము లని చెప్పబడినవి. ఈవృషోత్సర్గయోగము మిగుల విస్తృతము. నానాశాఖాభేద భిన్నము కౌస్తుభమందుఁ జూడవలెను.

## కార్తిక కృష్ణాష్టమి కాలాష్టమి

ఇది పూర్ణిమాంతమాసపక్షమందు మార్గశీర్షకృష్ణాష్టమి యనబడును. ఇది మధ్యాహ్న వ్యాపిని గావలెను. దినద్వయమందును మధ్యాహ్న వ్యాప్తియున్నచోఁ బూర్వమే యని నిర్ణయసింధునందు జెప్పబడినది. ప్రదోష వ్యాపిని గావలెనని కౌస్తుభ మందున్నది. దినద్వయమందును బ్రదోష వ్యాప్తియున్నచో లేక యేకదేశ స్పర్శ యున్నచోఁ బరదినమే ఇక పూర్వమునందు బ్రదోషవ్యాప్తియే పరదినమందు మధ్యాహ్న వ్యాప్తియే యున్నచో బహుశిష్టాచారము ననుసరించి ప్రదోష వ్యాప్తిచేతనే నిర్ణయముగాని మధ్యాహ్న వ్యాప్తిచేగాదని తోచుచున్నది. అపుడు కాలభైరవపూజచేసి మూడర్ఘ్యము లీవలెను. ఉపవాసము జాగరమును జేయవలెను. ఇది ధర్మసింధు సారమునగార్తిక మాసకృత్యనిర్ణయోద్దేశము ముగిసెను.

## మార్గశీర్ష మాసము

ధనుస్సంక్రాంతియందుత్తరమైన పదియారుగడియలు పుణ్యకాలము, తక్కినది మీద జెప్పబడినది. మార్గశీర్ష శుక్లపంచమియందు నాగపూజ విధింపబడినవి. అది దాక్షిణాత్యులందు ప్రసిద్ధము. ఇది షష్ఠీయుక్తము గ్రహింపవలెనని విశేషము ప్రథమ పరిచ్ఛేదమందున్నది. మార్గశీర్ష శుక్ల షష్ఠీ చంపాషష్ఠీ మహారాష్ట్రులందు ప్రసిద్ధము. అందు ఖండతిథి యగునపుడు రవివారము భౌమవారము శతభిష నక్షత్రము వైధృతి వీటిలో నధిక యోగముండు షష్టిపూర్వముగాని పరముగాని ముహూర్తత్రయ ముండెనేని గ్రహింపవలెను. దినద్వయమందును యోగము లేనిచో

మూడు ముహూర్తములుండు పరషష్ఠియే గ్రాహ్యము. ఇదియే స్కంధషష్ఠియు, అపుడు పూర్వమే గ్రాహ్యము. ఇక సప్తమియందు సూర్యవ్రతము దాని ప్రయోగము కౌస్తుభ మందు దెలియవలెను. మృగశిరతోగూడిన పూర్ణిమయందు లవణదానమునకు సౌందర్యము ఫలము.

## దత్తాత్రేయోత్పత్తి

ఈ పూర్ణిమయందే దత్తాత్రేయోత్పత్తి. ఇది ప్రదోషవ్యాపిని గావలెను. మార్గ శీర్ష శుక్లచతుర్దశియందుగాని పూర్ణిమయందుగాని యాశ్వలాయనులు ప్రదోషమున బ్రత్యవరోహణము జేయవలెను. అపుడు తిథికి గర్మకాలవ్యాప్తిగావలెను. దాని ప్రయోగము ప్రయోగరత్న కౌస్తుభాదులలోఁ దెలియునది. మార్గశీర్షము మొదలు నాల్గు మాసములలోఁ గృష్ణపక్షాష్టములయందష్టకాశ్రాద్ధము. తత్పూర్వసప్తములందు పూర్వేద్యుశ్రాద్ధము తదుత్తరనవములం దన్వష్టక్య శ్రాద్ధమును జేయవలెను. ఇట్లు భాద్రపద కృష్ణమందు నష్టకాశ్రాద్ధము జేయవలెనని పంచాష్టకాపక్షము. ఇది యాశ్వలా యనభిన్న శాఖీయులకు మరి యాశ్వలాయనులకు మార్గశీర్షాదులందే యని చతురష్ట కాపక్షమే కనుక భాద్రపద కృష్ణాష్టమియందు "మాఘ్యావర్షశ్రాద్ధం కరిష్యే" యని సంకల్పించి యంతయు నష్టకాశ్రాద్ధమునకువలె జేయునది. సప్తమియందు "మాఘ్యా వర్షశ్రాద్ధం కర్తుం పూర్వేద్యుశ్శ్రాద్ధం కరిష్యే" యని సంకల్పము నవమియం "దన్వష్టక్య శ్రాద్ధం కరిష్యే" యని సంకల్పమున విశేషము. కాబట్టి భాద్రపద కృష్ణాష్టమీ శ్రాద్ధము మాఘ్యావర్షశ్రాద్ధమని పేరుగలది. గనుక చతురష్టకాపమాశ్వలాయనులకని తెలియు నది. మరికొందరికి పౌషాదిత్ర్యష్టకాపక్షమును గలదు. ఇట్లు సర్వాష్టకలను జేయ నశక్తుడగుచో నొక్కయష్టకయే చేయవలెను. అదియును మాఘపూర్ణిమ కనంతర కృష్ణపక్ష సప్తమియందు నష్టమియందు నవమియందునని దినత్రయమందు జేయ వలెను. అట్లు చేయుట కశక్తుడగుచో మాఘకృష్ణాష్టమి శ్రాద్ధ మొక్కటియే చేయవలెను. అష్టకాశ్రాద్ధమున కష్టమి యపరాహ్ణవ్యాప్తిగలది కావలెను. దినద్వయమందట్టి వ్యాప్తియు నవ్యాప్తియు నున్నచో దర్శకువలె నిర్ణయము. అష్టమి నిర్ణయము ననుసరించియే పూర్వపరదినములం బూర్వేద్యు శ్రాద్ధమును నన్వష్టక్య శ్రాద్ధమును జేయవలెను. గాని సప్తమి మొదలగువాని కపరాహ్ణవ్యాప్త్యపేక్ష యక్కరలేదు. అట్లొక దినమందును శ్రాద్దముజేయ నశక్తునికి ప్రత్యామ్నాయములు. వృషభమునకుతృణ గ్రాస మీయవలెను. అగ్నిచే గుల్మము దహించవలెను. లేక వేదవేత్తల కుదకుంభ మీవలెను. లేదా శ్రాద్ధ మంత్రములు జపింపవలెనని గ్రంథాంతరమందుపవాసము గూడ జెప్పబడినది. ఇట్లు శ్రవణాకర్మ మొదలగు పాకసంస్థలులో దించినను ప్రతిపాక యజ్ఞమున కొక ప్రాజాపత్యకృఛ్రము ప్రాయశ్చిత్తము మలమాసమం దష్టకాది శ్రాద్ధ ములు చేయగూడదని నారాయణవృత్తి. అష్టకాది శ్రాద్ధ ప్రయోగము కౌస్తుభయోగ రత్నాదులందు జూడవలెను. ఈ యష్టమీ శ్రాద్ధమందు కామకాల సంజ్ఞికులు విశ్వేదేవులు సప్తమీ నవమీ శ్రాద్ధములందు పురూరవార్ద్రవ సంజ్ఞికులని తెలియవలెను. ఆహితాగ్నికి పూర్వేద్యుశ్రాద్ధాంగ హోమము నష్టకాంగ హోమము

నన్వష్టక్యాగ్నౌ కరణహోమమును దినత్రయమందు హవిశ్శ్రపణమును దక్షిణాగ్నియందే యగునని విశేషము. తక్కినది యనాహితాగ్నికివలెనే యగును. అష్టకాశ్రాద్ధమునకు లోపమగుచో ప్రాజాపత్య కృఛ్రముగాని యుపవాసముగాని ప్రాయశ్చిత్తము. అన్వష్టక్య లోపమగుచో నాదినమందు "ఏభిర్ద్యుభి స్సుమనా" యను మంత్రము నూరుమారులు జపించవలెను. మార్గశీర్షాదులలో రవివారమందు కామ్యమగు సౌరవ్రతము విధింప బడినది. అందు భక్ష్యములు. మార్గశీర్షమందు మూడుతులసిదళములు, పుష్యమందు మూడు పలాలఘృతము మాఘమందు మూడు పిడికిళ్ళనువ్వులు, ఫాల్గుణమందు మూడుపలాలయెత్తు పెరుగు, చైత్రమందు మూడుపలములు పాలు,వైశాఖమందు గోమయము, జ్యేష్ఠమందు మూడుదోసిళ్ల జలము. ఆషాఢమందు మూడు మిరియాలు, శ్రావణమందు మూడుపలముల సత్తుపిండి, భాద్రపదమందు గోమూత్రము, అశ్విన మందు శర్కర, కార్తికమందు మంచిహవిస్సు. ఇది ధర్మసింధు సారమందు మార్గశీర్ష కృత్యనిర్ణయోద్దేశ కృత్యము ముగిసెను.

## పౌషమాస కృత్యము

దినమందు మకరసంక్రాంతియైనచో ననంతరమందు నలువదిగడియల పర్యంతము పుణ్యకాలము గడియమొదలుకొని యల్పమైనదివశేషముండగ సంక్రాంతి యైనచో సంక్రాంతిని సమీపమైన పూర్వపు గడియలలో స్నానదాన శ్రాద్ధములు భోజనమును బగటియందే చేయవలెను. కానిచో రాత్రియందు శ్రాద్ధనిషేధము బాధించును. స్వల్పదిన శేషమందు స్నానశ్రాద్ధ దాన భోజనములు చేయ శక్యము కావుగదా. మరియు రాత్రియందు భోజనము నిషిద్ధము మానివేసినచో పుత్రవద్గృహ స్థుని కుపవాసము నిషిద్ధము కనుక నిట్టి విషయములో పరపుణ్యకాలత్వము విడచి మకర సంక్రాంతికి బూర్వమే పుణ్యకాలమని యెరుంగునది. రాత్రి పూర్వభాగమున పరభాగమున నిశీథమునగాని సంక్రాంతియైనయెడ నుత్తరదినము పుణ్యము. అందు దినపూర్వార్ధము పుణ్యతరము. అందు సూర్యోదయము మొదలైదు గడియలు పుణ్య తమములు. ఇట్లు రాత్రి సంక్రాంతి విషయమందు నితర స్థలమందును పూర్వదిన మందుత్తరార్ధము పుణ్యమగుచో సాయంకాలమందైదు గడియలు పుణ్యతమము లనియు నుత్తరదిన పూర్వార్థము పుణ్యమగుచో నుదయము దైదుగడియలు పుణ్యతమ ములని తెలియునది. ఇట్లు దినమందు సంక్రాంతియైనచో సన్నిహితమైనగడియలు మకరాదులకు పూర్వములు కర్కటకాదులకు పరములును పుణ్యతమములని తెలియు నది. అందు వచనము. "యాయాస్సన్నిహితా నాడ్యస్తా స్తాః పుణ్యతమాస్మృతాః" అనఁగా సంక్రాంతి సమీపమైనకొలది పుణ్యాతిశయము గడియల కని యర్థము ముహూర్త చింతామణిలో సూర్యాసమయానంతరము మూడుగడియలు సంధ్య. అపుడు సంక్రాంతియైనచో బూర్వదినమే పుణ్యమనియున్నది. ఇట్లు గ్రంథాంతర ముల గానరాదు. శ్లో."శుక్లపక్షే తు సప్తమ్యాం సంక్రాంతిర్గ్రహణాదికా." యనఁగా శుక్లసప్తమి యందు సంక్రాంతియైనచో గ్రహణమునకంటె నధికము. అపుడు కృత్యము. శ్లో॥ "రవిసంక్రమణే ప్రాప్తే న స్నాయాద్యస్తు మానవః, సప్తజన్మ సురోగీ

స్యాన్నిర్ధనశ్చైవజాయతే.” అనఁగా రవి సంక్రాంతియందు స్నానము చేయనినరుడు సప్తజన్మముల రోగియు నిర్ధనుడు నగునని యున్నదిగనుక మనుష్య మాత్రునికి స్నానము నిత్యము. ఇట్లు శ్రాద్ధము నధికారికి నిత్యము. అదియు పిండరహితము. శ్లో॥“ సంక్రాంతౌ యానిదత్తాని హవ్యకవ్యాని దాతృభిః తాని నిత్యం దదాత్యర్కః పునర్జన్మని జన్మని. అనఁగా సంక్రాంతియందు నేయే దానములు నేయేకర్మలు చేయు దురో వారు తిరుగ ప్రతిజన్మమందట్టి ద్రవ్యములు నట్టికర్మలును సూర్యప్రసాదమున నొందుదురని కర్కటక మకర సంక్రాంతులందు త్రిదినోపవాసము విహితము. లేదా సంక్రాంతి ప్రవేశమగు నహోరాత్రమందైనను బుణ్యకాలమైన యహోరాత్రమందైన నుపవాసముజేసి మీదనిర్ణయించిన పుణ్యకాలములో స్నానాదికము చేయునది. ఈ యుపవాసము పుత్రవద్గృహస్థుడు చేయవచ్చును. శ్లో॥ ధేనుం తిలమయీం రాజన్ దద్యాచ్చైవోత్తరాయణే,తిలతైలే దీపాశ్చ దేయాశ్శివగృహే శుభా. సతిలై స్తండులై శ్చైవపూజయే ద్విధివచ్ఛివం, తస్యాం కృష్ణతిలై స్స్నానం కార్యం చోద్వర్తనం తిలైః తిలాదేయాశ్చహోతవ్యా భక్ష్యాశ్చైవోత్తరాయణే.” అనగ నీయుత్తరాయణమందు తిల ధేను దానము తిలతైలముచే శివాలయమందు దీపదానము తిలలు తండులములు గలిపి శివుని బూజించుటయు నల్లనువ్వులచే స్నానము నభ్యంగమును తిలదానము తిలహోమము తిలభక్ష్యము జేయవలెనని, తెల్లనువ్వులచే దేవతర్పణము నల నువ్వులచేఁ బితృతర్పణము జేయునది. అందు శివునికి ఘృతముచే నభిషేకము మహాఫలము.

## శివపూజా వ్రతము

మరియు సువర్ణముతో తిలతామ్రపాత్రదానము చేయవలెను. దాని ప్రయో గము ముందు జెప్పఁబడును, మరియు శివపూజావ్రతము విహితము, పూర్వదిన మందుపవాసముజేసి సంక్రాంతి దినమందు తిలోద్వర్తనము తిలస్నానము తిలతర్పణ మునుజేసి శివుని కావునేతిచే నభ్యంగముజేసి శుద్ధోదకముచే గడిగి, వస్త్రాద్యుపచార ములచే బూజించి సువర్ణము వజ్రము నీలము పద్మరాగము ముత్తెము ననుపంచరత్న ములైనను కర్షార్ధపరిమాణమైన సువర్ణమైనను సమర్పించి తిలదీపములచేతను సువర్ణ ముతో నక్షతలతోగూడిన తిలలచేతను బూజించి ఘృతకబలమునిచ్చి వితానము చామరములు నిచ్చి విప్రులకు సువర్ణతిలలనిచ్చి తిలహోమముజేసి విప్రులకు యతుల కును భోజనముపెట్టి దక్షిణనిచ్చి తిలసహితమైన పంచగవ్యమును భక్షించి పారణము జేయవలయునని. ఈ మాసమందు వస్త్రదానము మహాఫలము. “తిలపూర్వమనడ్వా హం దత్వా రోగైః ప్రముచ్యతే” అనఁగా తిలలతోగూడ వృషభదానము చేసిన నారోగ్య మగుననుట. మరియు క్షీరముచే సూర్యుని స్నానముచేయించిన సూర్యలోక ప్రాప్తి పగలు విషువ సంక్రాంతియైనచో నాదినమందును బూర్వరాత్రి యందును భావి రాత్రియందు నవధ్యాయము. రాత్రియందాసంక్రాంతి యగుచో నా రాత్రి యందును పూర్వదినమందు నాగామిదినమందు నవధ్యాయము. ఇది రెండు పార్శ్వముల రాత్రు

లగుగాని దివసములగాని గ్రహించును గనుక పక్షిణ్యనాధ్యాయము. రాత్రి సంక్రమమైనచో గ్రహణమందువలె రాత్రియందే స్నానదానాదికమని కొందరు వ్రాసిరి గాని సర్వశిష్టసమ్మతముగాదు. అయనదినమును దానికి పరమగు కరిసంజ్ఞికదినమును శుభకార్యమందు వర్జ్యములని మీదజెప్పఁబడినది. అపుడర్ధ రాత్రమునకు లోపుగా నయిన సంక్రాంతియైనచో నా దినమును పరదినమును వర్జ్యములు. అర్ధరాత్రమందు గాని యాపైనిగాని యైనచోఁ బరదినమును నాపై దినమును వర్జ్యములని తోచుచున్నది. ఇట్లు గ్రహణమందు నూహించునది. పౌషశుక్లాష్టమి బుధవారముతోగూడెనేని స్నానజపహోమ తర్పణ విప్రభోజనములు చేయవలెను. అందు భరణీ నక్షత్ర యోగ ముండెనేని మహాపుణ్యమని కొందరు. రోహిణిగాని యార్ద్రగాని యుండవలెనని యితరులు. పౌషశుక్లైకాదశి మన్వాది. దీని నిర్ణయము మీఁద జెప్పఁబడినది.

## మాఘస్నానము

పౌషశుక్లైకాదశియందుగాని పూర్ణిమయందుగాని యమావాస్యయందు గాని మాఘస్నాన మారంభించునది. మాఘమందు ద్వాదశిగాని పూర్ణిమయందుగాని సమాప్తిజేయునది. లేదా మకరసంక్రమణము మొదలు కుంభ సంక్రమణమువరకు మాఘస్నానము చేయవలెను. ఇక స్నానకాలము అరుణోదయము మొదలుకొని ప్రాతఃకాలపర్యంతమునగును. అందు నక్షత్ర సహితకాలముత్తమము. లుప్తనక్షత్రమైనది మధ్యమము. సూర్యోదయమైన పైని హీనము. శ్లో॥"మాఘమాసేరటంత్యాపః కించిదభ్యుదితేరవౌ, బ్రహ్మఘ్నం వా సురాపం వా కంపతంతం పునీమహే." అనఁగా మాఘమాసమందు సూర్యోదయము కాబోవుననఁగా జలములన్నియు బ్రహ్మహత్యను సురాపానమును సహితము పోగొట్టి పవిత్రునిజేయుదుమని చాటింపుచున్నవని. అందు నధికారులు "బ్రహ్మచారీ గృహస్థో వా వానప్రస్థోఽథ భిక్షుకః,బాలవృద్ధయువానశ్చ నరనారీనపుంసకాః" అనఁగా నాలుగాశ్రమములవారును నేవయసులో నున్నప్పటికి పురుషులు స్త్రీలు నపుంసకులు సహితము నందరు నధికారులే యని. ఇక జలతారతమ్యముచే ఫలము. శ్లో॥ "తప్తేన వారిణా స్నానం యద్గృహే క్రియతే నరైః" షడబ్ధం ఫలదం తద్ధి మకరస్థే దివాకరే" అనఁగా మాఘమకరమందు నుష్ణోదకముచేనైనను గృహమందు స్నానముచేసిన నారు సంవత్సరముల స్నానఫలము, వాపి మొదలగు వానియందు స్నానమున బండ్రెండు సంవత్సరముల ఫలము, తటాకమందుజేసిన నాఫలము ద్విగుణము, నదియందు జేసిన జతుర్గుణము, మహానదియందు శతగుణము, మహానదీసంగమమందు నదిచతుర్గుణము, గంగయందు సహస్రగుణము, గంగా యమునా సంగమమందు నదిశతగుణమగును. ఎక్కడ స్నానముజేసినను ప్రయాగస్మరణము జేయునది. ఈ స్నానము సముద్రమందు నతిప్రశస్తము. ఇక స్నానవిధి. శ్లో॥"మాఘమాస మిమం పుణ్యం స్నాస్యేహం దేవ మాధవ, తీర్థస్యాస్య జలే నిత్య మితి సంచింత్య చేతసి." అనఁగా నోదేవ మాధవ యీ తీర్థ జలమందు మాఘమాసము యావత్తును ప్రత్యహము స్నానముచేసెదనని

సంకల్పించి యని యున్నందున నొక తీర్థము నుద్దేశించి శ్లో॥"దుఃఖదారిద్ర్య నాశాయ శ్రీవిష్ణోస్తోషణాయ చ, ప్రాతస్స్నానం కరోమ్యద్య మాఘే పాపవినాశనం, మకరస్థే రవౌ మాఘే గోవిందాచ్యుత మాధవ, స్నానేనానేన మే ఏదేవ యథోక్తఫలదో భవ." అనఁగా శ్రీవిష్ణు ప్రీతిపూర్వముగ దుఃఖములు దారిద్ర్యము నశించుటకై పాపనాశక మైన మాఘప్రాతస్నానము జేయుచున్నాను గనుక నోగోవిందుఁడ యచ్యుతుఁడ బిందుమాధవుఁడనే జేయు నీ స్నానమునకకు యథోక్తఫలమిమ్మనుట. ఈ శ్లోకములు పఠించి మౌనముతో స్నానము చేయవలెను. ప్రత్యహము సూర్యార్ఘ్యమునకు మంత్రము, "సవిత్రే ప్రసవిత్రే చ పరంధామ జలే మమ, త్వ త్తేజసా పరిభ్రష్టం పాపం యాతు సహస్రధా" అనఁగా సృష్టికర్త యగు సూర్యుని కీయర్ఘ్యము ఓపరం జ్యోతిస్స్వరూపుఁడ నీ తేజస్సుచే నా పాపము వేయు విధములుగా భ్రష్టమై జలమందు బడుఁగాక యని యర్థము. పితృతర్పణాది నిత్యకర్మ చేసుకొని మాధవుని బూజింప వలెను. భూమియందు శయనింపవలెను. తిలలతో నేయిహోమము చేయవలెను. హవిష్యాశనము బ్రహ్మచర్యము మాఘమాసమందు మహాఫలము. మరియు నింధన ములు, కంబలములు, వస్త్రములు, పాదరక్షలు, ఛత్రము, తైలము, ఘృతము, తిల పూర్ణఘటము, సువర్ణము, నన్నము నివి దానముజేయుట మహాఫలము శ్లో॥"న వహ్నిం సేవయేత్స్నాతో హ్యస్నాతోఽపి వరాననే,హోమార్థం సేవయేద్వహ్నిం శీతా ర్థంన కదాచన. అహన్యహని దాతవ్యాస్తిలాశ్శర్క రయాన్వితాః" త్రయోభాగాస్తిలానాంచ శర్కరాయాశ్చతుర్థకః" అనఁగా నీ మాఘమాసమందు స్నానముజేసిగాని జేయకగాని శీతనివారణమున కగ్నిని సేవింపఁగూడదు. హోమార్థమై సేవింపవచ్చును. మరియు ప్రతిదినమందు నొకవంతు శర్కరయు మూడువంతులు తిలలును గలపి యందరకు నీవలెను.

ఈ మూఁడు స్నానమందభ్యంగము గూడదు. శ్లో॥"మాఘే మాన్యుషసి స్నానం కృత్వా దాంపత్యమర్చయేత్, మాఘే యత్నేన సంరాజ్యం మూలకం మదిరోపమం, పితౄణాం దేవతానాం చ మూలకం నైవ దాపయేత్." అనఁగా మాఘస్నానముజేసి దంపతి పూజజేయవలెననియు మాఘమందు ప్రయత్నముచేసి ముల్లంగి విడువ వలెను. ఏమనిన, నది దేవతలకుఁ బితృదేవతలకు నీగూడదు, అది మదిరాతుల్య మనియు తాత్పర్యము. మాఘమాసము మలమాసమైనచోఁ గామ్యవ్రతముల కపుడు సమాప్తి గూడదు. గనుక మాఘస్నానమునందలి నియమములును రెండు మాసముల జేయవలెను. మాసోపవాసములు చాంద్రాయణము మొదలగునవి మలమాసమం దును సమాప్తములు గావచ్చునని మీఁదజెప్పఁబడినది. ఈ మాఘస్నానము నిత్య కామ్యోభయాత్మకము, మాసపర్యంతము స్నానము చేయుట కశక్తుడు మూడు దినములుగాని యొకదినముగాని చేయవచ్చును. అందు మొదటి మూడు దినములని కొందరు త్రయోదశి మొదలుకొని దినత్రయమని బహుసమ్మతము. పౌషపూర్ణిమ కనంతరమున వచ్చు సప్తమి యష్టమి నవమి యీ మూఁడిటియందష్టకాశ్రాద్ధములు మీఁదజెప్పఁబడినది.

# పౌషామావాస్యయందర్థోదయ యోగము

శ్లో॥“అమార్కపాత శ్రవణైర్యుక్తా చేత్పౌషమాఘయోః, అర్థోదయస్సవిజ్ఞేయః కోటిసూర్యగ్రహైస్సమః కించిన్న్యూనంమహోదయః” అని కొందరు పఠింతురు. అనఁగా పుష్యమాఘములలో నవమావాస్య, ఆదివారము, వ్యతీపాత, శ్రవణము వీనితో గూడినయెడ నర్థోదయ మనఁబడును. అది కోటి సూర్యగ్రహణములకు సమము. పాఠాంతరమునందీమూఁడిటిలో నొక్కటి తప్పిపోయినచో మహోదయ మనఁబడు నని యర్థము. కొందరు “పుష్యమాఘయోః” అనుదానికి పుష్యమాఘముల మధ్య మున నుండునది గవలెనని యర్థము జెప్పిరి. అనఁగా పౌషపూర్ణిమానంతరమైన యమావాస్యకే యీ యోగమనుట. మరి కొందరమాంత మాసపక్షమున పుష్య మందును బూర్ణిమాంతమాస పక్షమున మాఘమందు నని యర్థమనిరి. ఎట్లైనను మాఘపూర్ణిమకుఁ బూర్వమైన యమావాస్యయే యగును. శ్లో॥“దివైవ యోగశ్శస్తో యం న తు రాత్రౌ కదాచన, అర్థోదయే తు సంప్రాప్తే సర్వం గంగాసమంజలం. శుద్ధాత్మానో ద్విజాస్సర్వే భవేయుర్బ్రహ్మసన్నిభాః యత్కించిద్దీయతే దానం మేరుసన్నిభం.” అనఁగా నీయర్థోదయయోగము పగటియందే ప్రశస్తము రాత్రిగాదు. అర్థోదయము రాగానే సర్వదేశముల జలము గంగాతుల్యమగును. సమస్త ద్విజులు శుద్ధాంతః కరుణులై బ్రహ్మతుల్యులు. అపుడెంత మాత్రము దానము జేసినను మేరుతుల్యమగు నని యర్థము. ఇఁక నమత్రమనఁగ భోజనపాత్రము దానియొక్క దానవిశి చెప్పఁబడును. దేశకాలముల నుచ్చరించి “సముద్రమేఖలాయాః పృథ్వ్యా స్సమ్యగ్దానఫలకామోఽహ మర్థోదయవిహితా మత్రదానం కరిష్యే” యని సంకల్పించి యలికి శుద్ధిచేసిన ప్రదేశమందు శ్వేతతండులములచే నష్టదళపద్మము వ్రాసి యక్కడ నరువది నాలుగు పలములుగాని నలువది పలములుగాని యిరువదైదు పలములుగాని యెత్తు గల కంచుపళ్లెముచేసి యగ్న్యుత్తారణముగ స్థాపించవలెను. అందు నెనిమిదిగురి గింజల యెత్తుమాషము నలువది మాషములు కర్షము నాలుగు కర్షములు పలము అమరసింహుని మతమందు నెనుబది గుంజలయెత్తు కర్షము. నాలుగు కర్షములు పలము.

అట్టి కాంస్య పాత్రయందు పాయసముంచి పాయసమందష్టదళము లిఖించి దానినడుమ గర్ణికయందు కర్షముగాని యందులో సగముగాని సగములో సగముగాని యెత్తుగల సువర్ణలింగమునుంచి కంచుపళ్లెమందు బ్రహ్మను పాయసమందు విష్ణువును లింగమందు రుద్రుని యథాధికారముగ వైదికమంత్రములచే గాని నామములచేగాని యావాహనముజేసి షోడశోపచారములచేఁ బూజింపవలను. అటుపైని విప్రుని వస్త్రాదులచేఁ బూజింపవలెను. శ్లో॥“సువర్ణపాయసామత్రం యస్మాదేతత్త్రయీమయం, అవయోస్తారకం యస్మా త్తద్గృహాణ ద్విజోత్తమ.” అనఁగా నీ సువర్ణపాయస మాత్రము త్రిమూర్తులకు స్థానమైనది గనుక త్రయీమయము. కాబట్టి మనకిద్దరకు తారకము దీని స్వీకరింపుమో ద్విజశ్రేష్ఠుఁడ యనునర్థముగల మంత్రము బఠించి “అముకగోత్రా

యాముకశర్మణే తుభ్య మిదం సువర్ణలింగసహిత పాయసయుక్తమమత్రం సముద్ర మేఖలాపృథ్వీ దానఫలకామోఽహం సంప్రదదే నమమ" యని విప్రహస్తమందు జలము విడువవలెను విప్రుడు "దేవస్యత్వా" యనుమంత్రము పఠించి ప్రతిగ్రహింప వలెను. దానము పూర్తికై "ఇమాం దక్షిణాం సంప్రదదే" యని యథాశక్తి హిరణ్యా మీయవలెను. హేమాద్రి మొదలగు గ్రంథములందు వేరొక విధముగ సర్వోదయ వ్రతప్రయోగమున్నది. అది బ్రహ్మాదులు ముగ్గురితోను తిలపర్వతములతోను శయ్యా శ్రయముతోను గోవులు మూడిటితోను దాన హోమాది సహితమై కౌస్తుభమందు జెప్పcబడినది. ఇది ధర్మసింధుసారమున బౌషమాసకృత్య నిర్ణయోద్దేశము ముగిసెను.

## మాఘమాసము

కుంభసంక్రాంతికి బూర్వము పదియారు గడియలు పుణ్యకాలము మాఘమున వేణీస్నానమహిమ, "సితాసితే తు యస్నానం మాఘమాసే యుధిష్ఠిర, న తేషాం పునరావృత్తిః కల్పకోటిశతైరపి కురుక్షేత్ర సమాగంగా యత్ర కుత్రావగాహితా, తస్మా ద్దశగుణాం వింధ్యేకాశ్యాం శతగుణాతతః కాశ్యా శ్శతగుణా ప్రోక్తా గంగా యమున యాన్వితా, సహస్రగుణితా సాపి మాఘే పశ్చిమవాహినీ" అనcగా గంగా యమునా సంగమస్థలమున మాఘమాసమందు స్నానముజేయువారికి కోటి కల్పములకైనను తిరుగ జన్మబంధములేదు. ఈ గంగానదిలో నెక్కడ స్నానముజేసినను కురుక్షేత్ర సమానము. వింధ్యవాసినియందంతకు పదిరెట్లు పుణ్యము, కాశి యందంతకు నూరు రెట్లు పుణ్యము, కాశికంటె గంగాయమునాసంగమమున నూరురెట్లు పుణ్యమని యర్థము.

## తిలదానవిధి

ఇcక మాఘమందు తిలపాత్రదానము ప్రశస్తము. దాని ప్రయోగము. శ్లో॥ "తామ్రపాత్రే తిలాన్ కృత్వా పలషోడశనిర్మితే, సహిరణ్యం స్వశక్త్యావా విప్రాయ ప్రతిపాదయేత్."అనcగా పదియారుపలములచే నిర్మించిన రాగిపాత్రలో నువ్వులు పోసి హిరణ్యముతోనైనను విప్రునికి దానమీయవలెననుట. "వాఙ్మనః కాయజ త్రివిధ పాపనాశపూర్వకం బ్రహ్మలోకావాప్తికామస్తిల పాత్రదానం కరిష్యే" యని సంకల్పించి మీదజెప్పిన పరిమాణముగల రాగిపాత్ర యందు మానెడు నువ్వులు పోసి కర్షము యెత్తుసువర్ణముతోగాని యథాశక్తి సువర్ణముతోగాని విప్రుని పూజించి, శ్లో॥"దేవదేవ జగన్నాథ వాంఛితార్థఫలప్రద, తిల పాత్రం ప్రదాస్యామి తవాగ్రే సంస్థితో హ్యాహం." అనగా నోదేవదేవుcడ జగన్నాథుcడ నీయగ్రమందుండి తిలపాత్రదానము జేసెదను. నావాంఛితములు సమకూర్పుమని యర్థముగల మంత్రముతో నీవలెను. "ధాన్యమానంతు కుడవో ముష్టీనాం స్యా చ్చతుష్టయం, చత్వారః కుడవాః ప్రస్థశ్చతుః ప్రస్థస్తథాఢకం, అష్టాఢకో భవేద్ద్రోణ ద్విద్రోణ శ్శూర్య ఉచ్యతే. సార్ధశూర్పోభవేద్ధారీ" యను రీతిచేతనైనను అనcగా ధాన్యపుకొల్త నాలుగుచేరలు కుడవము, నాల్గుకుడవ ములు, ప్రస్థము, నాల్గుప్రస్థము లాఢకము, ఎన్మిది యాఢకములు ద్రోణము, రెండు

ద్రోణములు శూర్పము, అదియొకటియు నందుసగము గలసినచో ఖారియనఁబడునని చెప్పిన ప్రకారముచేనైనను "పలం సువర్ణాశ్చత్వారః కుడవం ప్రస్థమాఢకం, ద్రోణం చ ఖారి కాచేతి పూర్వపూర్వా చ్చతుర్గుణం." అనగా సువర్ణమనుయెత్తు నాల్గురెట్లు పలమనఁబడును. నాలుగు పలములు కుడవము. ఇట్లు పూర్వపూర్వమునకంటె నాలుగురెట్లు క్రమముగా ప్రస్థము, ఆఢకము, ద్రోణము, ఖారి యనఁబడునని చెప్పిన ప్రకారము చేతనైనను మీదజెప్పిన ప్రస్థము గ్రహించునది. మరియొకరీతిని తిలపాత్రదానము. హిరణ్యమక్కరలేదు. తిలలు మాత్రమే రాగిపాత్రలో నుంచి, "తిలాః పుణ్యాః పవిత్రాశ్చ సర్వపాపహరాస్మృతాః, శుక్లా శ్చైవ తథాకృష్ణా విష్ణుగాత్ర సముద్భవాః యానికానిచ పాపాని బ్రహ్మహత్యాసమానిచ, తిలపాత్ర ప్రదానేన తాని నశ్యంతు మే సదా."అనఁగా తెల్లనివిగాని నల్లనివిగాని తిలలన్నియు విష్ణువుదేహము నుండి పుట్టినవి గనుక పుణ్యములు పవిత్రములు పాపము హరించునవియు నిట్టి తిలపాత్రదానముచే నా పాపములన్నియు నశించుగాక యను నర్థము గల శ్లోక మంత్రము బఠించి "ఇదం తిలపాత్రం యథాశక్తి హిరణ్య సహితం యమదైవతం బ్రహ్మలోకావాప్తి కామస్తుభ్య మహం సంప్రదదే" యని యుచ్చరింపుచు దానము జేయునది. ఇక హిరణ్యముతో గూడిన తులసీపత్ర దానమునకు మంత్రము.

## సాలగ్రామ హిరణ్య దానములు

"సువర్ణతులసీదానాద్బ్రహ్మణః కాయసంభవాత్, పాపం ప్రశమమాయాతు సర్వే సంతు మనోరథాః" అనఁగా బ్రహ్మశరీరమునుండి పుట్టిన తులసిని హిరణ్యదానము జేసెదను. నా పాపము నశించుగాక. కోరికలన్నియు సిద్ధించుగాక యని యర్థము. ఇక సాలగ్రామ దానమంత్రము, "సాలగ్రామశిలా పుణ్యభుక్తిముక్తిప్రదాయినీ సాలగ్రామప్రదానేన మమసంతు మనోరథాః చక్రాంకితసమాయుక్తా సాలగ్రామశిలా శుభా, దానేనైవ భవేత్తస్యా ఉభయోర్వాంఛితం ఫలం" అనఁగా చక్రములతో గూడిన సాలగ్రామశిల శుభమైనది. దీని దానముచే దాతృప్రతిగ్రహీత లిద్దరి వాంఛితము సిద్ధించుననుట.

## ప్రయాగమందు వేణీదానము

అందు సర్వజనులకు వపనము విధింపఁబడినది. "ఊర్ధ్వ మబ్దాద్ద్విమాసో నాద్యదా తీర్థం వ్రజేన్నరః, తదా తద్వపనం శస్తం ప్రాయశ్చిత్తమృతే ద్విజ." అనఁగా మనుష్యుఁ డెనిమిదిమాసములలోగా తీర్థమును దిరుగనొందినయెడ క్షౌరము ప్రశస్తము. ప్రాయశ్చిత్తమునకైనచో నెప్పుడును గూడును. ప్రయోగమునందు మూడు యోజనముల దూరమునుండి వచ్చినచో పదిమాసములకు లోనుగవచ్చినను క్షౌరము ప్రథమయాత్రయందు మాత్రము గర్భిణీపతియును చూడాకర్మచేసిన బాలుఁడును సభర్తృకలైన స్త్రీలు సహితము క్షౌరము జేసుకొనవలెను. కొందరు సభర్తృక స్త్రీలకు కొప్పుకొన రెండంగులములు మాత్రము కత్తిరించవలెనని యందురు. ఇఁక దాని ప్రయోగము స్త్రీ తన కొప్పు జడవేసుకొని మంగళాలంకారములు ధరించి భర్తకు

నమస్కరించి యాతని యాజ్ఞచే సర్వక్షౌరముగాని ద్వ్యంగుల ఖండనముగాని చేసుకొని స్నానముజేసి త్రివేణిపూజను జేయవలెను. భర్తచే జేయించినను సరియే. పూజాంత మందు పత్ని ఛిన్నమైన వేణితోగూడిన చేట మొదలగునది యంజలియందుంచుకొని దానియందు బంగారు జడరత్నవ0యిలు మొదలగువాని నుంచి "వేణ్యాం వేణీ ప్రదానేన మమ పాపం వ్యపోహతు, జన్మాంతరేష్వపి సదా సౌభాగ్యం మమవర్ధతాం" అనఁ గా త్రివేణియం దీవేణీదానముచే నాపాపము నశించునుగాక. జన్మాంతరములందును నా సౌభాగ్యము వృద్ధినొందుగాకయని తాత్పర్యముగల యీ శ్లోకము పఠించి త్రివేణీలో విడువవలెను. బ్రాహ్మణులు "సుమంగలీరియంవధూ" యను మంత్రము పఠించ వలెను. అటుపైని విప్రులను సువాసినులను వస్త్రాదులచేఁ బూజింపవలెను. ఇఁక త్రివేణి యందు దేహ త్యాగవిధి. "యేవై తన్వం విసృజంతి ధీరాస్తేజనా సో అమృతత్వం భజంతే" యనుశ్రుతి మాఘమాసవిషయకము. "తనుం త్యజతువైమాఘే తస్యముక్తి ర్నసంశయః" అని బ్రహ్మపురాణవచన మున్నందున దేహత్యాగము మాఘమాసమందు జేసిన నమృతత్వము గలుగును. ఇతరమాసమునందు దేహత్యాగము స్వర్గప్రదము. అపుడు యథాశక్తిగ బ్రాయశ్చిత్తము జేసుకొని శ్రాద్ధాధికారులు పుత్రాదులు లేనిచో దనకు జీవచ్ఛ్రాద్ధ మనుపిండదానాంతమునుజేసి గోదానాదులుచేసి యుపోషణము జేసి పారణదినమందు ఫలము నుద్దేశించి సంకల్పించి విష్ణువును ధ్యానించి త్రివేణి యందు బ్రవేశించునది. జీవచ్ఛ్రాద్ధమునకు విధికౌస్తుభమందు దెలియునది. మాఘ మాసము నుద్దేశించి వచనమున్నది. ఎట్లనిన, "తిలస్నాయీ తిలోద్వర్తీ తిలహోమీ తిలోదకీ, తిలభుక్తిలదాతాచ షట్తిలాః పాపనాశనాః" అని యీవాక్యమందు తిల స్నాయీ యనుచో తిలయుక్తజలముచే స్నానము విధింపబడినది. తిల హోమమనగా నయుతముగాని లక్షగాని తిలహోమముతోఁగూడిన గ్రహమఖమునకు సంగ్రహము. తిలోదక యనఁగా తిలయుక్తోదకముచే దేవపూజ తర్పణము సంధ్య మొదలగునవి చేయవలెనని యర్థము. తిలహోమము మూఁడు విధములు మొదటిది పదివేలు హోమము రెండవది లక్షహోమము మూఁడవది కోటిహోమము సర్వకామావాప్తి ఫలము కుండ మంటపాదులనిర్ణయముతో లక్షహోమాదివిధి కౌస్తుభమయూఖాదు లలో దెలియునది. మాఘశుక్ల చతుర్థియందు ఢుండి రాజునుద్దేశించి నక్తవ్రతమును పూజయు తిలలడ్డుకనైవేద్యము తిలభక్షణమును జెప్పఁబడినవి. అందు ప్రదోషవ్యాప్తి గావలెను ఈ చతుర్థియందు కుందపుష్పములచే శివునిబూజించి యుపవాసముగాని నక్తభోజనముగాని చేయునది. సంపత్తి ఫలము అందు వినాయకవ్రతమునకు భాద్ర పదశుక్ల చతుర్థియందువలె నిర్ణయము.

## రతికాముల పూజ

మాఘశుక్లపంచమి వసంతపంచమి. అపుడు వసంతోత్సవమున కారంభము. అందు రతిమన్మథులకు పూజ విధింపఁబడినది. ఇది పరదినమందే పూర్వాహ్ణవ్యాప్తి యున్నచోఁ బరదినమేలేనిచోఁ బూర్వదినమే మాఘశుక్లసప్తమి రథసప్తమి. అది యరుణోదయ వ్యాపినిగావలెను. దినద్వయమందరుణోదయ వ్యాప్తియున్నచోఁ బూర్వ

దినమే. షష్ఠిగడియ మొదలగు స్వల్పకాలమే యుండి క్షయవశమున సప్తమి మరు నాఁడరుణోదయమునకుఁబూర్వమే సమాప్తమైనచో షష్ఠీయుతమే గ్రహించునది. అందు షష్ఠియందు సప్తమీక్షయము యొక్క గడియలు గలపి యరుణోదయమందు స్నానము చేయునది. ఈ వ్రతమందు షష్ఠియందేకభక్తము జేసి సప్తమియందరుణో దయమున స్నానము చేయునది. అపుడు మంత్రము "యదా జన్మకృతం పాపం మయా జన్మసు జన్మసు, తన్మేరోగంచ శోకంచ మాకరీ హంతు సప్తమీ. ఏతజ్జన్మ కృతం పాపం యచ్చ జన్మాంతరార్జితం, మనోవాక్కాయజం యచ్చ జ్ఞాతాజ్ఞాతే చ యే పునః. ఇతి సప్తవిధం పాపం స్నానాన్మే సప్తసప్తికే, సప్తవ్యాధిసమాయుక్తం హర మాకరిసప్తమి."అనఁగా జన్మ మొదలుగజేసినదియు జన్మాంతరముల జేయునదియు శోకరోగరూపమగు నాఆపపమంతయు మకరమందలి సప్తమి హరించుఁగాక యనియు నో సూర్యప్రియమైన మకరసప్తమి యీ జన్మమందు జన్మాంతరమందు మనోవాక్కాయములచే జ్ఞానాజ్ఞానమూలతో జేసిన సప్తవిధ పాపము సప్తవ్యాధిరూపము దాని నీస్నానముచే నశింపఁజేయుమని యుఁదాత్పర్యం. ఇక నర్ఘ్యమంత్రము "సప్త సప్తి వహప్రీత సప్తలోక ప్రదీపన, సప్తమీ సహితో దేవ గృహాణార్ఘ్యం దివాకర" అనఁగా సప్తనామకమైనదని గాని సప్తసంఖ్యాకమైనవియనిగాని యశ్వముల వాహన ముచేఁ బ్రీతుఁడవై సప్తలోకముల ప్రకాశింపఁజేయునో దివాకరుఁడ సప్తమీయుక్తుఁ డవై సప్తలోకముల బ్రకాశింపఁజేయునో దివాకరుఁడ సప్తమీయుక్తుఁడవై సప్తలోక ముల బ్రకాశింపఁజేయునో దివాకరుఁడ సప్తమీయుక్తుఁడవై నాయర్ఘ్యము గైకొను మని యర్థము. ఈ సప్తమియే మన్వాదియునగు. శుక్లపక్షమన్వాది గనుక పూర్వాహ్ణ వ్యాపిని గ్రహింపవలెనని చెప్పఁబడినది.

## మాఘ శుక్లాష్టమి భీష్మాష్టమి

అందు భీష్మోద్దేశమున శ్రాద్ధము జేయువారికి సంతతి గలుగును. అందు శ్రాద్ధము కామ్యము తర్పణము నిత్యము. అది జేసెనేని సంవత్సర దురితము నశిం చును. చేయనిచోఁబుణ్యనాశమగునని చెప్పఁబడినది. అట్టి తర్పణమునకు మంత్రము 'వైయాఘ్ర పద్యగోత్రాయసాం కృత్య ప్రవరాయచ, గంగాపుత్రాయ భీష్మాయ ఆజన్మ బ్రహ్మచారిణే. అపుత్రాయ జలం దద్మి నమో భీష్మాయ వర్మణే, భీష్మశ్శాంత నవో వీర స్సత్యవాదీ జితేంద్రియః అభిరర్భిరవాప్నోతు పుత్రపౌత్రోచితాం క్రియామ్" అనగా వ్యాఘ్రపాద్గోత్రమందు బుట్టి సాంకృత్య ప్రవరుఁడు గంగాపుత్రుఁడు నాజన్మ బ్రహ్మచారి గనుక నపుత్రుఁడగు భీష్మునకు తర్పణజల మిచ్చెదను. దీనిచే శంతను పుత్రుఁడు వీరుఁడు సత్యసంధుఁడు జితేంద్రియుఁడు నగు భీష్ముఁడు పుత్రపౌత్రక్రియల చేతవలెఁ దృప్తినొందుగాక యని యర్థముగల మంత్రముతో నపసవ్యముగ దర్పణ మిచ్చి యాచమనముజేసి సవ్యమున నర్ఘ్యమీయవలెను. శ్లో॥ "వసూనా మవతారాయ శంతనో రాత్మజాయచ అర్ఘ్యం దదామి భీష్మాయ ఆబాల్య బ్రహ్మచారిణే." అనఁగ నెనమండ్రువసువుల కేకావతారమగు శంతను పుత్రుఁడైన భీష్ముని కర్ఘ్య మిచ్చెద నని యర్థము. ఈ తర్పణమందు జీవత్పితృకున కధికారములేదని కౌస్తుభమందున్నది.

తండ్రి జీవించియున్నవానికి నధికారమున్నదని బహుసమ్మతము. అందు మధ్యాహ్న వ్యాప్తి యష్టమికి గావలెను. శ్రాద్ధాదిక మేకోద్దిష్టమే యగుట నట్లు జెప్పఁబడెను.

## మాఘశుక్లద్వాదశియందు తిలోత్పత్తి

కనుక నాదినమందుపవసించి తిలస్నానము, తిలలచే విష్ణుపూజ, తిల నైవేద్యము, తిలతైలముచే దీపదానము, తిలహోమము, తిలదానము, తిలభక్షణమును జేయవలెను. మాఘపూర్ణిమపరమే గ్రహించునది. అందు కృత్యము "ఏవం మాఘావసానేతు దేయం భోజ్య మవారితం, భోజయే ద్విజదాంపత్యం భూషయే ద్వస్త్ర భూషణైః " అనఁగా మాఘమాసాంతమందు విరామము లేకుండగ భోజనదానము చేయవలెను. దంపతులకు భోజనముపెట్టి వస్త్రభూషణాదులచేఁ బూజింపవలెను. కంబలములు, అజినములు రక్తవస్త్రములు, దూది, రొజాయిలు, పాదరక్షలు, దుప్పట్లు, మాధవ ప్రీతికై యీయవలెను.

## మాఘస్నానోద్యాపనము

ఇఁక మాఘస్నానమునకు సంకల్పించి "సవిత్రే ప్రసవిత్రే చ పరంధామ జలే మమ, త్వత్తేజసా పరిభ్రష్టం పాపం యాతు సహస్రధా దివాకర జగన్నాథ ప్రభాకర నమోస్తుతే, పరిపూర్ణం కరిష్యేహం మాఘస్నానం తదాజ్ఞయా."అనుమంత్రములచేగూడ సంకల్పము. ఇట్లు చతుర్దశియందు సంకల్ప ముపవాసము నధివాసనము మాధవపూజనముజేసి పూర్ణిమయందు తిలలు చరువు మొదలగు వానిచే నష్టోత్తరశతహోమముజేసి తిలలు శర్కరయు నుంచిచేసిన మోదకములు ముప్పది వాయనమీయవలెను. అపుడు మంత్రములు "సవితః ప్రసవస్త్వంహి పరంధామ జలం మమ, త్వత్తేజసా పరిభ్రష్టం పాపం యా తు సహస్రధా దివాకర జగన్నాథ ప్రభాకర నమోస్తుతే, పరిపూర్ణం కురుష్వేహ మాఘస్నానం ఝుషఃపతే" అనఁగా మొదటి శ్లోకమునకు మీదవ్రాయఁబడినది జగన్నాథుఁడవు తేజస్సులకు నిధివగు నోదివాకరుఁడ నేజేయు మాఘస్నానము బరిపూర్ణము జేయుమనియర్థము. అటుపైన దంపతులకు సన్నపుబట్టల నిచ్చి సప్తధ్యానముల దానముజేసి దంపతులకు బ్రాహ్మణులకును నారు రసములతోగూడిన భోజనము పెట్టవలెను. అందు మంత్రము "సూర్యో మే ప్రీయతాం దేవో విష్ణుమూర్తి ర్నిరంజనః" విష్ణు స్వరూపుఁడైన సూర్యుఁడు నిరంజనుఁడు నా విషయములో ప్రీతినొందుఁగాక యని."ఏవం మాఘప్లవీయాతి భిత్వా దేవం దివాకరం, పరివ్రాడ్యోగయుక్తశ్చ రణేచాభిముఖో హతః" అనఁగా నిట్లు మాఘ వ్రతము లాచరించినవాఁడును యోగి యగుసన్యాసియు యుద్ధమున పరాఙ్ముఖుఁడుగాక మృతినొందినవీరుఁడును సూర్యమండలము భేదించెదరని యర్థము.

## అష్టకాశ్రాద్ధములు

మాఘకృష్ణాష్టమియందు నాలుగష్టకాశ్రాద్ధములు జేయ నశక్తుఁడు పూర్వేద్యు శ్రాద్ధము నన్వష్టక్యశ్రాద్ధము గూడ నేకాష్టకశ్రాద్ధము జేయునది. దినత్రయమందు జేయలేనిచో నష్టమియందే యేకాష్టక శ్రాద్ధము జేయునది.

## శివరాత్రి నిర్ణయము

అది నిశీథ వ్యాపిని గావలయును. నిశీథ మనఁగా రాత్రి పదునాల్గు గడియల పైని రెండుగడియలని మీఁద జెప్పఁబడినది. అందు పరదినమందే యర్ధరాత్ర వ్యాప్తి యున్నచో పరమే, పూర్వదినమందే యట్లున్నచోఁ బూర్వమే, దినద్వయమందు నర్ధరాత్ర వ్యాప్తిలేనిచోఁ బరదినమే, దినద్వయమందును సంపూర్ణముగగాని యేక దేశమందుగాని యర్ధరాత్ర వ్యాప్తియున్నచోఁ బూర్వమే యని హేమాద్రిమతము ననుసరించి కౌస్తుభము పరదినమే యని మాధవనిర్ణయసింధు పురుషార్థ చింతామణ్యాదులు. పరదినమందు నిశీథైక దేశవ్యాప్తియుఁ బూర్వదినమందు సంపూర్ణ వ్యాప్తియు నున్నచో బూర్వమే, అట్లు పూర్వదినమందు నిశీథైకదేశవ్యాప్తియుఁ బరదినమందు సంపూర్ణ వ్యాప్తియు నున్నచోఁ బరదినమే. ఈ వ్రతము రవివారము మంగళవారము గూడినను శివయోగమున్నను బ్రశస్తము.

## పారణ నిర్ణయము

మూడు జాములకులోగా చతుర్దశి సమాప్తి నొందినచో నా సమాప్తి యందే పారణము. యామత్రయముదాటి వ్యాపించినచోఁ బ్రాతఃకాలమందే చతుర్దశి మధ్యమున పారణమని మాధవాదులు. నిర్ణయసింధువు నందు యామత్రయమునకులోగా సమాప్తియైనను చతుర్దశి మధ్యమందే పారణము. చతుర్దశి యంతమందెపుడును గూడదు. శ్లో॥"ఉపోషణం చతుర్దశ్యాం చతుర్దశ్యాం చ పారణం, కృతై స్సుకృతలక్షైస్తు లభ్యతే యది వానవా సిక్థే సిక్థే ఫలం తస్య శక్తో వక్తుం న పార్వతి."అనఁగాఁ జతుర్దశి యందుపవాసము చతుర్దశియందే పారణమును లక్షపుణ్యములు చేసినను సంభవించునో సంభవింపదో అట్టి పారణమందు ప్రతిబలమునకు గల్గుపుణ్యము జెప్పుటకు నేను సహితము చాలనని పార్వతితో నీశ్వరునివచనమువలన జతుర్దశి మధ్యమందు పారణకు పుణ్యాతిశయము చెప్పుటయే ప్రమాణమని యున్నది. ఇక్కడ నిట్లు వ్యవస్థ దెలియునది. నిత్యకర్మ చేయుటకును పారణకును చాలునంత చతుర్దశి లేకుండినగాని చతుర్దశి శేషదినమందు దర్శాదిశ్రాద్ధము ప్రసక్తించినగాని యపుడు తిథ్యంతమందు పారణము. ద్వాదశివలె దీనియందు నిత్యకర్మకపకర్షము విధింపలేదు. తిథ్యంతరమందు పారణకు విధివాక్యమున్నందున సంకటకాలమందు జలపారణవిధి వాక్యములు ప్రవర్తింపవు. కర్మపర్యాప్తమైన చతుర్దశియుండినను శ్రాద్ధప్రసక్తిలేకున్నను చతుర్దశి మధ్యమందే పారణమని.

## శివరాత్రి వ్రత ప్రయోగము

త్రయోదశియందేక భక్తముజేసి చతుర్దశియందు నిత్యకర్మ నాచరించి ప్రాతః కాలమున మంత్రపూర్వముగ సంకల్పించవలెను. శ్లో॥" శివరాత్రి వ్రతం హ్యేతత్కరిష్యే హం మహాఫలం, నిర్విఘ్నం కురు దేవా త్రత్వ త్ర్పసాదాజ్జగత్పతే. చతుర్దశ్యాం నిరాహారో భూత్వ శంభో పరేహని, భోక్ష్యేహం భుక్తి ముక్త్యర్థం శరణం మే భవేశ్వర." అనఁగా మహాఫలమిచ్చు నీ శివరాత్రి వ్రతము చేసెదను. నీ ప్రసాదము వలన నది

నిర్విఘ్నముగావలె నో జగదీశ్వరుడా! చతుర్దశియందుపవాసముజేసి పరదినమందు పారణ భుక్తిముక్తులు గల్గుటకు జేసెదను. నాకు రక్షకుఁడవు గమ్మని యర్థముగల శ్లోకమున సంకల్పము ద్విజుఁడైనచో "రాత్రిం ప్రపద్యే జననీ"మని మొదలగు ఋక్కులను బఠించి జలము విడువవలెను. అటుపైని సాయాహ్నామందు గృష్ణతిలలచే స్నానముజేసి భస్మముచే త్రిపుండ్రమును రుద్రాక్షమాలను ధరించి ప్రదోష కాలమున శివాలయము బ్రవేశించి పాదములు గడగికొని యాచమనముజేసి యుత్తరాభిముఖుఁడై దేశకాలము లుచ్చరించి శివరాత్రి యందు ప్రథమయామపూజను సంకల్పించి యామచతుష్టయమందు నాల్గుపూజలు చేయుట కశక్తుఁడైనచో "శివప్రీత్యర్థం శివ రాత్రౌ శివ పూజాంకరిష్యే"యని సంకల్పించియుఁ బూజింపవలెను. అందు మొదటి సాధారణ పూజావిధి చెప్పఁబడును. ప్రతియామమునకు పూజావిశేషము పైని చెప్పఁబడును. "అస్య శ్రీ శివపంచాక్షరీ మహామంత్రస్య, వామదేవ ఋషిః అనుష్టుప్ఛందః శ్రీ సదాశివో దేవతా, న్యాసే పూజనే జపే వినియోగః, వామదేవాయ ఋషయేనమః శిరసి అనుష్టుప్ఛందసే నమః ముఖే, శ్రీం సదాశివదేవతాయైనమః, హృది ఓం నం తత్పురుషాయనమః, హృదయే ఓం మం అఘోరాయ, పాదయోః ఓం శివ సద్యోజాతాయనమః గుహ్యే ఓం వాం వామదేవాయనమః, మూర్ధ్ని ఓం యం ఈశానాయనమః ముఖే ఓం హృదయాయనమః, ఓం నం శిరసేస్వాహా, ఓం మం శిఖాయైవషట్, ఓం శిం కవచాయ హుం ఓం వాం నేత్రత్రయాయవౌషట్, ఓం యం అస్త్రాయఫట్" అని ఇట్లు న్యాసముచేసుకొని కలశపూజనుచేసి ధ్యానింపవలెను. శ్లో॥"ధ్యాయేనిత్యం మహేశం రజతగిరినిభం చారుచంద్రావతంసం, రత్నాకల్పోజ్వలాంగం పరశుమృగ హరాభీతిహస్తం ప్రసన్నం, పద్మాసీనం సమంతా త్స్తుతమమరగణ్యైర్వ్యాఘ్రకృత్తిం వసానం, విశ్వాద్యం విశ్వవంద్యం నిఖిలభయహరం పంచవక్త్రం త్రినేత్రం." అని ధ్యానించి ప్రాణప్రతిష్ఠజేసి లింగమును స్థాపించి స్పృశింపుచు, "ఓం భూః పురుషం సాంబ సదాశివ మావాహయామి, ఓం భువః పురుషం సాంబసదాశివ మావాహయామి, ఓం స్వః పురుషం సాంబసదాశివ మావాహయామి, ఓం భూర్భువస్వః పురుషం సాంబసదాశివ మావాహయామి, ఓం భూర్భువస్వః పురుషం సాంబసదాశివ మావాహయామి" యని యావాహనము జేయవలెను. "స్వామిన్ సర్వజగన్నాథ యావత్పూజావసానకం, తావత్వం ప్రీతిభావేన లింగేఽస్మిం త్సన్నిధింకురు"అని పుష్పాంజలి నీవలయును. స్థిరలింగమందును పూర్వమందు నమస్కరింపఁ బడిన చరలింగమందును నావాహన మక్కరలేదు. "ఓం సద్యోజాతం ప్రపద్యామి సద్యోజాతాయవైనమోనమః, ఓం నమఃశివాయ శ్రీ సాంబసదాశివాయనమః ఆసనం సమర్పయామి"యని యుపచారము లీవలయును. స్త్రీశూద్రులైనచో "ఓం నమశ్శివాయ"అను పంచాక్షరికి ప్రతిగా "శ్రీం శివాయనమః"అని నమశ్శబ్దాంతముగ మంత్రముచే బూజింపవలెను. "ఓం భవే భవే నాతి భవే భవస్వమాం, ఓం నమశ్శివాయ శ్రీ సాంబశివాయనమః పాద్యం సమర్పయామి, ఓం భవోద్భవాయ నమః ఓం నమశ్శివాయనమః అర్ఘ్యం సమర్పయామి, ఓం వామదేవాయ నమః ఓం నమశ్శివాయ

నమః ఆచమనీయం సమర్పయామి, ఓం జ్యేష్టాయ నమః ఓం నమఃశ్శివాయ నమః స్నానం”అటుపైని మూల మంత్రముచేతను “ఆప్యాయస్వ” యని మొదలగు మంత్రములచేతను పంచామృతస్నానము చేయించి “ఆపోహిష్ఠా”యను మంత్రములు మూఁడిటిచే శుద్ధోదకముల గడిగి పదునొకండు మారులుగాని యొకమారేగాని రుద్రముచేతను పురుషసూక్తముచేతను చందనకుంకుమకర్పూరాదులచే వాసిత మైన జలముతో నభిషేకముచేసి స్నానాంతరమందు; “ఓం నమశ్శివాయ” యని యాచమ నీయమిచ్చి యక్షతలు జలమునుగలపి తర్పణము జేయునది. అందు మంత్రము. “ఓం భవం దేవం తర్పయామి, ఓం శర్వం దేవం తర్పయామి, ఓం ఈశానం దేవం తర్పయామి, ఓం పశుపతిం దేవం తర్పయామి, ఓం ఉగ్రం దేవం తర్పయామి, ఓం రుద్రం దేవం తర్పయామి, ఓం భీమందేవం తర్పయామి, ఓం మహాంతం దేవం తర్పయామి, ఓం భవస్య దేవస్య పత్నీం తర్పయామి, శర్వస్య దేవస్య పత్నీంత తర్పయామి, ఓం ఈశానస్య దేవస్య పత్నీం తర్పయామి, ఓం పశుపతేర్దేవస్య పత్నీం తర్పయామి, ఉగ్రస్య దేవస్య పత్నీం తర్పయామి, రుద్రస్యదేవస్య పత్నీం తర్పయామి, ఓం భీమస్య దేవస్యపత్నీం తర్పయామి, ఓం మహతోదేవస్య పత్నీం తర్పయామి”అని తర్పణముజేసి “ఓం శ్రేష్ఠాయనమః, ఓం నమశ్శివాయ శ్రీ సాంబసదాశివాయనమః వస్త్రం సమర్పయామి ఓం నమశ్శివాయ ఆచమనం, ఓం రుద్రాయ ఓం నమశ్శివాయ శ్రీ యజ్ఞోపవీతం, ఓం నమశ్శివాయ ఆచమనం, ఓం కాలాయ నమః, ఓం నమశ్శి వాయ శ్రీ చందనం, ఓం బలవికరణాయ నమః, ఓం నమశ్శివాయ శ్రీ సాంబసదా శివాయనమః అక్షతాన్ సమర్పయామి, ఓం బలవికరణాయనమః ఓం నమశ్శివాయ శ్రీ సాంబసదాశివాయనమః పుష్పాణి సమర్పయామి.” అని యుపచారములిచ్చి అటుపైని సహస్రనామములచేగాని యష్టోత్తరశతనామములచేగాని మూలమంత్ర ముచేగాని బిల్వదళములర్పించవలెను. “ఓం బలాయనమః ఓం నమశ్శివాయ శ్రీ సాంబసదాశివాయనమః దీపం దర్పయామి, ఓం సర్వభూతదమనాయనమః ఓం నమశ్శివాయ శ్రీ సాంబసదాశివాయనమః నైవేద్యం, ఓం నమశ్శివాయ, ఓం శ్రీః ఆచమనం ఫలంచ ఓం మనోన్మనాయ నమః ఓం నమశ్శివాయ ఓం శ్రీ సాంబసదా శివాయనమః తాంబూలం సమర్పయామి. ఓం నమశ్శివాయ వేదాహమేతం సామ్రా జ్యం భోజ్యం శ్రీ సాంబసదాశివాయనమః నీరాజనం ఓం ఈశానస్సర్వవిద్యానా మీశ్వర స్సర్వభూతానాం బ్రహ్మాధిపతి ర్బ్రహ్మణోధిపతి ర్బ్రహ్మాశివోమే అస్తు సదాశివోమ్ ఓం నమశ్శివాయ శ్రీ సాంబసదాశివాయనమః మంత్రపుష్పం సమర్పయామి. అని పూజించి “భవాయ దేవాయ నమః” యని మొదలగు మంత్రములచేతను “భవస్య దేవస్య పత్న్యైనమః” అని మొదలగు మంత్రములచేతను నెనిమిదేసిమారులు నమస్కా రములుచేయునది. అటుపైని “శివాయనమః, రుద్రాయనమః, పశుపతయే నమః నీలకంఠాయనమః, మహేశ్వరాయనమః, హరికేశాయనమః, విరూపాక్షాయనమః పినాకినేనమః, త్రిపురాంతకాయనమః, శంభవేనమః, శూలినేనమః, మహాదేవాయ నమః” అని పండ్రెండునామములచే నన్ని పుష్పాంజలు లీవలెను. మూలమంత్ర

ముచేఁ బ్రదక్షిణనమస్కారములుచేసి మూలమంత్రము నూటయెనిమిది మారులు జపించి క్షమాపణమొనర్చి “అనేన పూజనేన శ్రీసాంబసదాశివః ప్రీయతామ్” అని పూజ సమర్పించునది. ఇఁక నాలుగు యామములయందు నాలుగు పూజలుచేయుచో విశేషము. అందు ప్రథమయామమందు మూలమంత్ర ముచ్చరించిన పైని “శ్రీశివాయాసనం సమర్పయామి” అని ప్రతి యుపచారమందును శివనామముచేతనే యర్పణము. మరియు రెండవజామున “ద్వితీయయామపూజాం కరిష్యే” యని సంకల్పించి “శ్రీశంకరాయాసనం సమర్పయామి” యని శంకరనామముల చేతనే సర్వోపచారము నీవలెను. అటుపైని “తృతీయయామపూజాం కరిష్యే” యని సంకల్పించి “శ్రీమహేశ్వరాయాసనం సమర్పయామి” యని మొదలుగ మహేశ్వరనామముచేతనే సమస్తోపచారములీవలెను. ఇట్లు చతుర్థయామమందును “శ్రీరుద్రాయ” యని రుద్రనామము చేతనే యన్ని యుపచారము లిచ్చునది. ప్రతియామమందును తైలాభ్యంగము పంచామృతము నుష్ణోదకము శుద్ధోదకము గంధోదకము వీటితో నభిషేకమును జేయవలెను. యజ్ఞోపవీత మిచ్చినపైని గోరోచన కస్తూరీ కుంకుమ కర్పూరాగురుచందన మిశ్రితాను లేపముచేఁ బూయవలెను. అది యిరువదైదు పలములనియున్నది. యథాశక్తిగనైన జేయవచ్చును. ఉమ్మెత్త, గన్నేరుపువ్వులచేతను, బిల్వపత్రములచేతను పూజ మిగుల ప్రశస్తము. పుష్పములులేనిచో శాలితండులములు గోధూమములు యవలు వీనితో పూజ నైవేద్యోత్తరమందు తాంబూలముఖవాసముల చెప్పఁబడినవే. నాగవల్లీ దళములు పూగఫలములు ముక్తాది చూర్ణము నీ మూఁడిటితోగూడునది తాంబూల మనఁబడును. ఇదియే “నారికేళకర్పూరై” లాకంకోలముతోగూడెనేని ముఖవాసమనఁబడును. వీనిలో నొక్కటి దొరకనిచో దాని స్మరింపవలెను. సర్వ పూజాంతమున ప్రార్థన. శ్లో॥“నిత్యం నైమిత్తికం కామ్యం యత్కృతం తు మయా శివ, తత్సర్వం పరమేశాన మయా తుభ్యం సమర్పితమ్.” అనఁగా నిత్యనైమిత్తిక కామ్యరూపముగ నే జేయుకర్మయావత్తు నీకే యర్పితమనుట. శ్లో॥“శివరాత్రి వ్రతం దేవ పూజా జప పరాయణః, కరోమి విధివద్దత్తం గృహాణార్ఘ్యం నమోస్తుతే.” యని యర్ఘ్యమీయవలెను. ఇట్లు నాల్గుజాముల సర్ఘ్య భేదము కౌస్తుభమందున్నది. అనంతరమున ప్రాతఃకాలమందు స్నానముజేసి తిరుగ శివుని బూజించి మీద జెప్పిన పండ్రెండు నామములచే బండ్రెండుగురు బ్రాహ్మణులను నశక్తియగుచో నొకనినైన బూజించి తిలపక్వాన్నముచేఁ బూర్ణమైన కుంభములు పండ్రెండైన నొకటియైన నిచ్చి వ్రతమర్పించవలెను. శ్లో॥ “యన్మయాద్యకృతం పుణ్యం తద్రుద్రస్య నివేదితం, త్వత్ప్రసాదాన్మహాదేవ వ్రత మద్యసమర్పితం, ప్రసన్నో భవమే శ్రీమన్ సద్గతిః ప్రతిపాద్యతాం, త్వదా లోకనమాత్రేణ పవిత్రోఽస్మి న సంశయః” అనఁగా నేజేసిన సుకృతము నీకు సమర్పించితిని. నీ దర్శనముచేఁ బవిత్రుఁడనైతిని. నాయందు ప్రసన్నుఁడవై నాకు సద్గతి యీవలెనని ప్రార్థించి భోజనము బ్రాహ్మణులకు బెట్టి పూర్వము నిర్ణయించిన ప్రకారమున బారణ జేయవలయును. అందు మంత్రము, “సంసార క్లేశదగ్ధస్య వ్రతేనానేన శంకర, ప్రసీద సుముఖోనాథ జ్ఞానదృష్టిప్రదో భవ” అనఁగా నోశంకరుఁడా! యీ వ్రతముచే

ప్రసన్నుఁడవై సంసారక్లేశములచే దగ్ధుఁడనైన నాకు జ్ఞానదృష్టిని నిమ్మని తాత్పర్యము. ఇది శివరాత్రి వ్రతవిధి. ఇఁక మృన్మయ లింగమందు శివపూజకువిధి, ఓం హరాయ నమః" యని మృత్తికదీసి దాని శోధించి జలముచేదడిపి పిండముచేసి "ఓం మహేశ్వ రాయనమః"యనుచు లింగము జేయునది. అది యెనుబది గురిగింజలయెత్తుగల కర్షమునకంటె నధికమై యంగుష్ఠపరిమాణము గలదిగా నుండవలెను. లేక యంతకు నెక్కుడుగావచ్చునుగాని తక్కువగూడదు. మృణ్మయలింగమందు పంచసూత్రీపరిమితి సంపాదించకున్నను దోషములేదు. కనుకనే శ్లో॥"సప్తకృత్వస్తులా రూఢం వృద్ధిమేతి న హీయతే, బాణలింగమతి ప్రోక్తం శేషం నార్మదముచ్యతే" అనఁగా లింగము నుంచిన బియ్యము సప్తవారములు తూచినయెడ నెక్కుడగునది బాణలింగ మన బడును. తక్కినది నార్మద మనబడునని చెప్పఁబడినలక్షణముగల బాణలింగమున కంటెను దుర్లభమైనపంచ సూత్రీసంపత్తిదాల్చిన సువర్ణలింగమునకంటెను మృణ్మయ లింగము శ్రేష్ఠము.

## పార్థివలింగ పూజావిధి

శ్లో॥"ద్వాపరే పారదం శ్రేష్ఠం పార్థివం తు కలౌ యుగే" యనఁగ ద్వాపర మందు రసలింగము శ్రేష్ఠము, కలియుగమందు మృణ్మయ లింగము శ్రేష్ఠమని చెప్పఁబడినది. అటుపైని "ఓం శూలపాణయే నమః శివేహప్రతిష్ఠితోభవ" యని బిల్వపత్ర సహితమైన పూజాపీఠమందుంచి "ధ్యాయే నిత్యం మహేశ" మని ధ్యానించి ఓం పినాకధృతే నమః "శ్రీసాంబసదాశివేహాగచ్ఛేహ ప్రతిష్ఠేహ సన్నిహితో భవ"యని యావాహనము జేయునది. ఈపూజయందంతటను ద్విజులకు మూలమంత్రముగూడ నుచ్చరించునది. అటుపైని ఓం నమశ్శివాయ" యను మూలమంత్రమున బాద్యమర్ఘ్య మాచమనీయమునిచ్చి "ఓంపశుపతయేనమః" యనియు మూలమంత్రము నుచ్చ రించి స్నానము వస్త్రముపవీతము గంధపుష్ప ధూపదీపనైవేద్యఫలతాంబూల నీరాజన మంత్రపుష్పాంజలులను సమర్పించి "శర్వాయక్షితిమూర్తయేనమః"యని యీశాన దిక్కునను, "రుద్రాయాగ్నిమూర్తయేనమః" యని యుత్తరమందును, "ఉగ్రాయవాయు మూర్తయేనమః" యని వాయవ్యదిక్కునను, "భీమాయాకాశమూర్తయేనమః" యని పశ్చిమమందును, "పశుపతయే యజమానమూర్తయేనమః" యని నైరృతిదిక్కునను, "మహాదేవాయ సోమమూర్తయేనమః"యని దక్షిణమందును, "ఈశానాయ సూర్య మూర్తయేనమః" యని యాగ్నేయీ దిక్కునను బూజించి స్తుతించి నమస్కరించి "మహాదేవాయనమః" యని విసర్జించునది. అని యిట్లు సంక్షేపము విస్తర ప్రకారము కౌస్తుభాదులందు జూడవలెను. శివరాత్రి యైనచో బూర్వోక్తమైన పూజావిధి పార్థివ లింగమందును జేయవలెను. పార్థివలింగోద్యాపనవిధి కౌస్తుభాదులలో దెలియవలెను.

## లింగ విశేషముచే ఫలవిశేషము

వజ్రముచే లింగము నిర్మించిన నాయుష్యము, ముగ్తామయయైనచో రోగ నాశము, వైడూర్యముచేనైనచో శత్రునాశము, పద్మరాగమైనచో లక్ష్మీప్రాప్తి, పుష్యరాగజ

మైనచో సుఖము, ఇంద్రనీలమైన యెడ యశము, మరకమునన్నైనచో పుష్టి, స్ఫటిక మయమైన యెడ సర్వకామావాప్తి, రజతలింగము రాజ్యమును, పితృముక్తినిచ్చును. సువర్ణలింగము సత్యలోకమునిచ్చును. రాగిలింగము పుష్టియు నాయుష్యము నొసఁగును. ఇత్తడిలింగము తుష్టినిచ్చును, కంచులింగమున గీర్తిగల్గును. లోహలింగమున శత్రునాశము, సీసలింగమున నాయుష్యము, సువర్ణలింగము బ్రహ్మస్వపరిహారమును స్థిరలక్ష్మినిచ్చునని మతాంతరము. ఇట్లు గంధలింగమున సౌభాగ్యము, గజదంతలింగమున సేనాధిపత్యము, వ్రీహి మొదలగు ధ్యానపుపిండిచేజేసిన లింగమున పుష్టి సుఖము, రోగనాశము, మినుములపిండితో జేసినను స్త్రీలాభము, వెన్నతోజేసినచో సుఖము, గోమయలింగమున రోగనాశము, గుడలింగము నన్నలింగము వంశాంకుర లింగమును వంశవృద్ధిజేయునని గ్రంథాంతరమున విస్తరము జూడవలెను. ఇట్లు లింగముల బహుత్వమువలన కులవిశేషము కౌస్తుభమందున్నది. శివనిర్మాల్యము గ్రహించుట గ్రహింపకుండుటయొక్క విచారము తృతీయపరిచ్ఛేదమందు జెప్పఁబడును. మాసశివరాత్రి నిర్ణయము ప్రథమపరిచ్ఛేదమందున్నది. శివరాత్రి వ్రతోద్యాపనము కౌస్తుభాదులలో జూడవలెను. మాసశివరాత్రి వ్రతోద్యాపనము నచ్చుటనే స్పష్టము. మాగమావాస్య యపరాహ్ణవ్యాప్తి యగుచో యుగాదిగనుక పిండరహిత శ్రాద్ధము జేయవలెను. అదియు దర్శశ్రాద్ధముతో సమానతంత్రముగ జేయవలెను. ఈయమావాస్యయందు శతభిషఙ్నక్షత్రయోగమైనచో మహాపుణ్యకాలము. అందు శ్రాద్ధముజేయుచో నది పితృతృప్తియగును. ధనిష్ఠాయోగమున్నచో దిలాన్నముచే శ్రాద్ధము జేయునది. పదివేల సంవత్సరములు పితృతృప్తి యగును. ఇది ధర్మసింధు సారమున మాఘమాస కృత్యనిర్ణయోద్దేశము.

## ఫాల్గుణమాసము

మీన సంక్రాంతి యందుత్తరమైన పదియారుగడియలు పుణ్యకాలము రాత్రి ప్రవేశమైనచో మీద జెప్పబడినది, ఫాల్గుణమందు గోవ్రీహివస్త్రదానములు గోవిందునికి ప్రీతికరములు, ఇక ఫాల్గుణశుక్ల ప్రతిపత్తు మొదలుకొని పండ్రెండు దినముల పర్యంతము పయోవ్రతము శ్రీ భాగవతమునందు విధింపబడినది. వాని ప్రయోగము నాగ్రంథముననుసరించి తెలియునది ఫాల్గుణపౌర్ణమాసిమన్వాది, ఆది పూర్వాహ్ణ వ్యాపిని గ్రాహ్యము, ఇదియే హోలికయు, అది ప్రదోషవ్యాపినియై భద్రారహితము కావలెను. దినద్వయమందును ప్రదోషవ్యాప్తియు లేక పరదినమందు ప్రదోషైకదేశ వ్యాప్తియునగునపుడు పరదినమే, ఏమనిన బూర్వదినమందు భద్రాదోషమున్నది.

## హోలికపూజ

ఇక బరదినమందు ప్రదోష స్పర్శలేక పూర్వదినమందు భద్రాయుక్తమైన ప్రదోషమున్నచో బూర్ణిమ పరదినమందు మూడు యామములనరగాని యంతకునధికముగాగాని యుండెనేని దానికి బరదినమందు ప్రతిపత్తు వృద్ధిగలదియేని అపుడు బరదినమందు ప్రదోషవ్యాపినియైన ప్రతిపత్తులో హోళికోత్సవము లేనిచో ననగా

ప్రతిపదకు హ్రాసమైనయడ పూర్వదినమందే భద్రాపుచ్ఛమందు భద్రాముఖము మాత్రము విడచి భద్రయందే హోళికాదీపనముజేయునది. పరదినమందు ప్రదోష స్పర్శకు లేక పూర్వదినమందు నిశీథమునకుమున్ను భద్రాసమాప్తియయ్యేనేని యపుడు భద్రావసాన కుత్తరమందె హోళికాదీపనము నిశీథానంతరమున భద్రకుసమాప్తి గలిగి నచో భద్రాముఖము విడచి భద్రయందే చేయునది ప్రదోషమందు భద్రాముఖవ్యాప్తి యుండెనేని భద్రానంతరమందైననుప్రదోషానంతరమందైనను జేయవచ్చును. రెండు దినములందును పూర్ణిమకు ప్రదోష స్పర్శలేనియెడ బూర్వదినమందే భద్రాపుచ్ఛ మందు జేయునది. అదిదొరకనిచో భద్రయందే ప్రదోషోత్తరమందే హోళికాదీపనము. రాత్రియందు పూర్వార్ధభద్రకు గ్రాహత్వము విధింపబడినది. కనుక పరదినమందే యగునుగాని పూర్వప్రదోషమందు జతుర్దశియందును పరమందు సాయాహ్నాదిక మందుగూడదు. పగలు హోళికాదీపనము సర్వగ్రంథవిరుద్ధము. ఈహోళికాపూజ నము శ్రవణా కర్మాదులవలె భోజనానంతరమందును జేయుదురు. ఇది యుక్తమే కొందరు హోళికాపూజనము జేసి భుజింతురు, వారికి భోజనమునకుగాని పూజనము నకుగాని నియతముగ శాస్త్రవిహిత కాలము సంభవింపదు. ఇది చంద్రగ్రహణము వచ్చునపుడు వేధమధ్యమందును జేయవచ్చును. గ్రస్తోదయమైనచో బరదినమందు బూర్ణిమయుండెనేని గ్రహణమధ్యమందే జేయవచ్చును లేనిచో బూర్వదినమందే చేయవలెను.

## భద్రాముఖ పుచ్ఛ లక్షణము

పూర్ణిమయందు భద్రయొక్క తృతీయ పాదాంతమందు మూడుగడియలు పుచ్ఛము నాల్గవపాదము మొదటియైదుగడియలు ముఖము కాబట్టి మధ్యమ మాన ముచే బూర్ణిమయరువది గడియలుండగా పూర్ణిమ ప్రవర్తించిన పైని పందొమ్మిది గడియల నరకాగా పైని మూడు గడియలు పుచ్ఛము. ఇరువది రెండుగడియలనర పైని గడియలైదును ముఖము. తిథి యరువదినాలుగు గడియలైనచో బూర్ణిమ యిరువది యొక గడియపైని పుచ్ఛము. ఇరువది నాలుగు గడియలపైని ముఖము, ఇట్లు తిథికి న్యూనాధికత్వములలో నూహించునది.

## హోళికాపూజా విధి

దేశకాలములుచ్చరించి "సకుటుంబస్య మమఢుంఢా రాక్షసీ ప్రీత్యర్థంతత్పీ డాపరిహారార్థం హోళికాపూజనమహంకరిష్యే" యని సంకల్పించి యెండిన కర్రలు గోమయపిండములును రాశిపోసి యగ్నినంటించి అపుడు "అస్మాభిర్భయసంత్రస్తైః కృతాత్వంహోళికేయతః, అతస్త్వాం పూజయిష్యామి భూతభూతిప్రదాభవ" అనగా భయగ్రస్తులమై నిను నావాహనముచేసి పూజించెదము. భూతములకైశ్వర్యము నీయ వలయునని అర్థముగల శ్లోకముచే "శ్రీహోళికాయైనమః హోళికామావాహయామి" యని యావాహనముజేసి "హోళికాయైనమః" యను మంత్రముచే నాసనపాద్యాది షోడశోపచారముల సమర్పించి ప్రార్థనచేయునది. శ్లో॥"వందితాసిసురేంద్రేణ

బ్రహ్మణా శంకరేణచ, అతస్త్వంపాహినోదేవి భూతేభూతి ప్రదాభవ. అనగా బ్రహ్మాది దేవతలచే పూజింపబడునిన్ను పూజించితిమి. మమ్ము రక్షించి యైశ్వర్యము నీవలెనని యర్థము. "తమగ్నిం త్రిః పరిక్రమ్యగాయంతు చహసంతుచ, జల్పంతు స్వేచ్ఛయా లోకానిశ్శంకాయస్య యన్మతం" అనగా నట్టి హోళికాగ్నికి మూడు మారులు ప్రదక్షిణముచేసి గానములు చేయవచ్చును. పరిహాసములాడవచ్చును. యథేచ్ఛముగా తోచినట్టుల యుక్తములును, బలుకవచ్చును మరియును జ్యోతిర్నిబంధమునందు, "పంచమీ ప్రముఖాస్తాస్తుతిథయోనంత పుణ్యదాః, దశస్యుశ్శోభనాస్తాసు కాష్ఠస్తేయం విధీయతే. చండాల సూతికాగేహాచ్ఛిశుహారితవహ్నినా, ప్రాప్తాయాంపూర్ణిమా యాంతు కుర్యాత్తత్కాష్ఠదీపనం, గ్రామాద్బహిశ్చ మధ్యేవాతూర్య నాదసమన్వితః, స్నాత్వారాజా శుచిర్భూత్వా స్వస్తివాచనతత్పరః దత్వాదానాని భూరీణి దీపయేద్హోలికాచితం, 'తతోభ్యుక్ష్యచితింసర్వాంసాజ్యేనపయసాసుధీ, నారికేళానిదేయాని బీజపూరఫలానిచ, గీతాద్యైస్త దానృత్తైః, తేన శబ్దేనసాపాపారాక్షసీ తృప్తి మాప్నుయాత్" అనగాపంచమి మొదలుకొని పూర్ణివరకు పదిదినములు పుణ్యములైనవి. ఆ దినములలో కట్టెలు దొంగలించుట శాస్త్రవిహితము. పూర్ణిమరాగానే యట్లుతెచ్చిన కట్టెలన్నియు రాశిజేసి చండాల వాటికలో సూచికాగృహములో నగ్ని శిశువుచే తెప్పించి ఆ రాశిని గ్రామమధ్యమందైనను వెలపలనైన నంటించుటకు రాజుస్నానముచేసి శుచిగాస్వస్తివాచన తూర్య నాదములతో ననేకదానములు చేసి యాహోళికాచితిని యగ్నిచేగాల్చవలెను. అపుడు పాలు నేయి కొబ్బరికాయలు దాడిమపళ్లు వేయవలెను. నృత్యగీతవాద్యములతో నా రాత్రి జనులకందఱకు జాగరణమగును. అటుపైని నానావిధమైన తిట్టుమాటలాడుచు నాయగ్నికి మూఁడు ప్రదక్షిణములుచేయవలెను. అట్టి బూతుమాటలచే నా దేవత తృప్తి నొందునని యున్నది. ఇట్లు రాత్రి హోళికోత్సవమును జేసి ప్రాతఃకాలమందు చండాలుని స్పృశించి స్నానము చేయవలయును. అట్టి నరునికి పాపమేమియు లేదు. వ్యాధులు మనఃపీడలును రావు. "కృత్వాచావశ్య కార్యాణి సంతర్ప్యపిత్రుదేవతాః వందయేద్ధోళికాభూమిం సర్వదుష్టప్రశాంతయే. వందితాసిసురేంద్రేణ బ్రహ్మణా శంకరేణచ, తస్మాత్వం పాహినోదేవి భూతేభూతి ప్రదాభవ" అనగా మరునాడు నిత్యకర్మానుష్ఠానము జేసి హోళికాభూమికి నమస్కరించవలెనని నమస్కారమంత్రార్థము. మీద చెప్పఁబడినది. హోళికాదినము కరిసంజ్ఞగలదానియుత్తరదినము.

## శుభకార్యమునకు వర్జ్యములు, అందు వచనము

"హోళికాగ్రహణభావుకాయనీం ప్రేతదాహ దివసోత్రపంచమః, తత్పరంచకరి సంజ్ఞకందినంవర్జిత. సకలకర్మసూభయం"అని. యనగా హోళికాదినము గ్రహణ దినము భావుకదినము. అయనదినము ప్రేతను దహించిన దినము నీయైదును వాటిపై దినములు కరిసంజ్ఞగలదియును, సర్వశుభకార్యములందు వర్జ్యములని అందు గ్రహణాయనప్రేత దాహముల తిథులకు రాత్రి నిశీథమునకు పూర్వమైనచో పూర్వదినము అటుపైని జరిగినచో బరదినమని నిర్ణయించి దానికి బరదినము కరి దినమని తెలియవలెను. మఱియును "నరాడోలాగతంద్రుష్ట్వా గోవిందం పురుషోత్త

మం, ఫాల్గుణ్యాం త్రయతో భూత్వా గోవిందస్య పురం వ్రజేత్” అనగా నిది డోలా పౌర్ణమాసియగుటచే నుయ్యేలలోనున్న పురుషోత్తముఁడగు గోవిందుని జూచిన నరుఁడు వైకుంఠము నొందునని ఫాల్గుణకృష్ణప్రతిపదయందు వసంతారంభోత్సవము. అందు తిథి కుదయవ్యాప్తిగావలయును. దినద్వయమందు నుదయవ్యాప్తియున్నచో బూర్వదినమే గ్రాహ్యము. అందుతైలాభ్యంగము విహితము, మఱియును చూతకుసుమ భక్షణము విధింపబడినది. ఎట్లనిన, గోమయముచే నలికిన గృహాంగణమందు శుక్ల వస్త్రము నాసనముగా జేసికొని కూర్చుండి ప్రాఙ్ముఖుడై సువాసినిచే వందనము తిలకము నీరాజనమునొంది చందనముతోఁగూడిన మామిడిపువ్వును భక్షించవలెను. శ్లో॥“చూతమగ్ర్యం వసంతస్య మాకందకుసుమంతవ, సచందనంపిబామ్యద్య సర్వ కామార్థసిద్ధయే. నో మామిడి వృక్షమా నీకు సుమము వసంతమునకు బ్రారంభము గనుక సర్వకామములు సిద్ధించుటకు చందనముతో దానిని భక్షించెదనని కృష్ణ ద్వితీయ యందు దేశగ్రామాధిపత విస్తారమైనదియు బొంది నీ మొదలగు వానిచే నలంకరించిన ప్రదేశమందు రమ్యమైన యాసనమునం గూర్చుండి పౌరులను జాన పదులను సింధూర చూర్ణమనగా భర్గుండ జక్కచందనము మొదలగు వానిచే ముంచి వారికి తాంబూలములిచ్చి నృత్యగీతవాద్యములచే మహోత్సవము జేయవలెను. ఇపుడు ప్రాకృతజనులందరు కృష్ణపంచమి పర్యంతము నీయుత్సవము జేయుచున్నారు. ఇది హోళికోత్సవము. ఫాల్గుణామావాస్య మన్వాది అది అపరాహ్ణవ్యాపిని గావలయును.

ఇక నీ రెండు పరిచ్ఛేదములకు శేషములైనకృత్యముల నిర్ణయరూపమైన ప్రకీర్ణ ప్రకరణ మారంభింపబడును. పంద్రెండు మాసములలో శ్రాద్ధమందు వ్యతీపాతాదియోగమునకు భరణ్యాదినక్షత్రముకునుం నపరాహ్ణవ్యాప్తిచే దర్శకువలె నిర్ణయము. ఉపవాసాదికమందు బ్రచురముగ నాచారము లేనందున జెప్పబడలేదు. ఇక చాంద్రమానముచే సంవత్సరభేదము, ప్రభవోవిభవోశ్శుక్లః ప్రమోదూత ప్రజాపతిః అంగిరాశ్రీ ముఖోభావో యువాధాతాతథైవచ. 1. ఈశ్వరో బహుధాన్యశ్చ ప్రమాదీ విక్రమోవృషః చిత్ర భానుస్స్వభానుశ్చ తారణః పార్థివోవ్యయః. 2. సర్వజిత్సర్వధారీ చ విరోధీవికృతిః ఖరః నందనోవిజయశ్చైవ జయోమన్మథ దుర్ముఖౌ. 3. హేవిలంబీ విలంబీ చ వికారీ శార్వరీప్లవః, శుభకృచ్ఛో భకృత్క్రోధీ విశ్వావసుపరాభవౌ॥ 4. ప్లవంగః కీలకస్సౌమ్య స్సాధారణ విరోధికృత్। పరీధావీ ప్రమాదీచాప్యానందో రాక్షసో నలః 5. పింగళః కాలయుక్తిశ్చ సిద్ధార్థీ రౌద్రి దుర్మతీ। దుందుభీ రుధిరోద్గారీ రక్తాక్షీ క్రోధనః క్షయ 6. అని యీయరువది నామములు చాంద్రమాన వత్సరముల కగును. సూర్యుని రాశి సంక్రాంతి యందువలె నక్షత్ర సంక్రాంతి యందును బూర్వ పరము లైన పదియారు గడియలు పుణ్యకాలము.

## చంద్రాదులకు సంక్రమణమైనచో బుణ్య కాలము

చంద్రునికి సంక్రాంతి గల్గుచో బూర్వమందును బరమందును నొకగడియ పదిపలములును బుణ్యకాలము. అంగారకునికి నాల్గుగడియల యొకపలము. బుధునికి మూడుగడియల పదునాల్గు పలములు. బృహస్పతికి నాల్గు గడియల ముప్పది

యేడుపలములు. శుక్రునకు నాల్గుగడియల యొకపలము. శనికి పదియారుగడియల యేడుపలములు. ఇవియన్నియు ముందు వెనుకనుగూడ దెలియునది. ఇట్లు గ్రహాంత రముల సంక్రమణము రాత్రియైనచో నపుడె పుణ్యకాలము సూర్యసంక్రాంతికివలె పగలు పుణ్యకాలము విధించు వచనము లేదు.

## గ్రహస్నానములు

ఈ సంక్రాంతులయందు స్నానము కామ్యము నిత్యముకాదు. ఆదిత్యాది గ్రహములచే సూచింపఁబడు పీడలుపోవుటకు స్నానములు చెప్పఁబడును. మంజిష్ఠ, గజమదము, కుంకుమము, రక్తచందనము, జలపూర్ణమైన రాగిపాత్రలో గలపి స్నానముజేసిన సూర్యపీడ పోవును. వట్టివేళ్లు, సిరిసెపుగంధము, కుంకుమము, రక్తచందనము గలపిన శంఖోదకముచే స్నానము చంద్రదోషహరము, చంద్రకర్ర గంధము దేవదారు గంధము తిలలు ఉసిరికెపప్పు గలపిన రజతపాత్రోదకముచే స్నానము యంగారకదోషహరము. గజమదముగలసిన నదీసంగమజలము మృత్పా త్రలోనుంచి స్నానము బుధప్రీతికరము. బొడ్డ, మారేడు, మర్రి, ఉసిరికె, వీటిఫలముతో గూడిన సువర్ణపాత్రజలముతో స్నానముజేసిన బృహస్పతి ప్రీతికరము. గోరోచనము, గజమదము, శతపుష్ప, శతావరీ, వీనితోగూడిన రజతపాత్ర జలముతో స్నానము శుక్రప్రీతికరము. తిలలు మినుము ప్రియంగుధాన్యము గంధపుష్పములు వీనితో గలసిన లోహపాత్ర జలముతో స్నానము శనిప్రీతికరము. గుగ్గులము, నింగువు, హరిదళము, మనశ్శిల వీనితోగూడిన గేదెకొమ్ము పాత్రలో జలముచే స్నానము రాహు ప్రీతికరము. పందికొమ్ముచే త్రవ్విన పర్వతశృంగమందలి మృత్తికయు మేక పాలుగలపి ఖడ్గపాత్రస్థ జలముతో స్నానము కేతుదోషహరము.

## గ్రహదానములు

మాణిక్యము, గోధూమములు, రక్తవస్త్రము, గుడము, సువర్ణము, రాగిరక్త చందనము, పద్మములు దానముచేసిన రవిప్రీతియగు వంశపాత్రమనగ చేట మొద లగు వానిలోనుంచి తండులములు, కర్పూరము, మౌక్తికములు, శ్వేతవస్త్రము, ఘృత పూర్ణమైన కలశము, వృషభము దానముచేయుట, చంద్రప్రియము, పగడములు, గోధూమములు, మొసరులు, రక్తవృషభము, గుడము, సువర్ణము, రక్తవస్త్రము, రాగియు నంగారకునికి నీలవస్త్రము, సువర్ణము, కాంస్యము, పెసలు, మరకతము, దాసియు, గజదండము, పుష్పములు బుధునికి ప్రియము, పుష్యరాగరత్నమును, పసుపు, శర్కర, యశ్వము, పచ్చనిధాన్యము, పచ్చనివస్త్రము, లవణము, సువర్ణము బృహస్పతికి చిత్రవస్త్రము, శ్వేతాశ్వము, తెల్లధేనువు, వజ్రమణి, సువర్ణము, రజతము, గంధము తండులములు శుక్రునికి బ్రియము. ఇంద్రనీలము, మాషములు, తైలము, తిలలు, కులుత్థములు, గేదె, లోహము, నల్లయావు, శనికి ప్రియము. గోమేధికము, నశ్వము, నీలవస్త్రము, కంబలము, తైలము, తిలలు, లోహమునివి, రాహువునకు ప్రియము.వైడూర్యము, తైలము, తిలలు, కంబలము, కస్తూరి, మేకయు, వస్త్రము

లివి కేతుదానములు. శనిపీడా పరిహారమునకు శనివారమందు తైలాభ్యంగము తైలదానమును విహితములు.

## శని వ్రతము

లోహమయమైన శని ప్రతమను తైలపూర్ణమైన లోహపాత్ర మందుగాని మృన్మయ పాత్రమందుగాని యుంచినల్లవస్త్రములుగాని కంబలముగాని కప్పి నల్లని గంధ పుష్పములతోను పులగము తిలాన్నము మొదలగు వానితోను బూజించి నల్లని బ్రాహ్మణునికి లభింపనిచో నితరునికైనను శనిప్రతిమతోగూడ దానము చేయునది. అపుడు "శంనోదేవీః" అను మంత్రము నుచ్చరింపవలెను. శూద్రాదులకైనచో, శ్లో॥ "యః పునర్భ్రష్టరాజ్యాయ నలాయపరితోషితః, స్వప్నేదదౌ నిజం రాజ్యం సమేసౌరిః ప్రసీదతు, నమోర్క పుత్రాయ శనైశ్చరాయ నీహార వర్ణాంజనవంచకాయ, శ్రుత్వా రహస్యం భవకామదస్త్వం ఫలప్రదోమే భవసూర్యపుత్ర", యని అనగా రాజ్యభ్రష్టుడైన నలునికి తుష్టుడవై స్వప్నములో వరమిచ్చి స్వకీయరాజ్యము దిరుగనిచ్చిన శని నాకు బ్రసన్నుఁడు గావలయుననియు సూర్యపుత్రుఁడును మంచువలె కాటుకవలె నల్లని వాఁడును నగు శనైశ్చరునికి నమస్కారము. నీ రహస్య స్తోత్రము వినువారికి గామ పూర్తి జేయువాఁడవు. నాకు ఫలప్రదుఁడవుగమ్మో? సూర్యపుత్రుఁడ యనియు నర్థము గల శ్లోకమంత్రములు పఠించి దానము చేయునది.

ఇట్లు ప్రతిశనివారమును సంవత్సరపర్యంతముఁ జేయవలెను. "కోణస్థః పింగలోబభ్రుః కృష్ణో రౌద్రోంతకోపమః, శౌరి శ్శనైశ్చరోమందః పిప్పలాదేన సంస్తుతః " అను నీపదినామములను నిత్యము పఠించవలెను.

## శని స్తోత్రము

ఇది పిప్పలాదునిచే జేయఁబడినది. "నమస్తే కోణసంస్థాయ పింగలాయ నమోస్తుతే, నమస్తే బభ్రురూపాయ కృష్ణాయ చ నమోస్తుతే, నమస్తే రౌద్ర దేహాయ నమస్తే చాంతకాయ చ, నమస్తే యమసంజ్ఞాయ నమస్తే సౌరయే విభో, నమస్తే మందసంజ్ఞాయ శనైశ్చర నమోస్తుతే, ప్రసాదం మమదేవేశ దీనస్య ప్రణతస్య చ." అని యీ రహస్య స్తోత్రము ప్రతిదినమందు ప్రాతఃకాలమున బఠించినచో నేడు సంవత్సరముల నరపర్యంతము శనిపీడఁగలుగదు. రవివారమందు సూర్యపూజయు నుపవాసము సూర్య మంత్రజపము జేయుచో సర్వరోగనాశము. "హ్రాం హ్రీం సః సూర్యాయ" యని షడక్షరమంత్రము ఇది ప్రకీర్ణ నిర్ణయము.

ఇట్లు మొదటిపరిచ్ఛేదమందు సాధారణముగ తిథ్యాదినిర్ణయము చేయఁబడి నది. ద్వితీయపరిచేఛదమందు వాటివిశేష నిర్ణయము వ్రాయఁబడినది. బుద్ధిమంతులు మీమాంసయు ధర్మశాస్త్రమును తెలిసినవారు ప్రాచీన గ్రంథములచే గృతార్థులగు దురు. వారికొరకీ ప్రయత్నమకాదు. మరియేమనిన; బుద్ధిమాంద్యముచేగాని యలస టచేగాని శాస్త్రాధ్యయనము చేయలేక ధర్మనిర్ణయమును మాత్రము దెలిసికొనుట కుత్సహించువారి కుపకారముగ నీ గ్రంథము రచియింపఁబడినది. దీనిచే విఠలస్వామి

ప్రీతినొందుగాక. ఇందులో నిర్ణయింపఁబడినవారికి మూలవచనములు కావలసినచో కౌస్తుభము నిర్ణయసింధువు మాధవీయము వీనిలో దెలియునది. సత్పురుషులు వారు మంచిపనియందు ప్రేమగల్గిన స్వభావము జూపుటకై దీనిని సేవింపవలెను. శ్రీహరి కుచేలుఁడిచ్చిన మురికియటుకులు గొనలేదా? అట్లనే యని తాత్పర్యము.

ఇది శ్రీమదానంద గజపతి మాహరాజాప్తుఁడైన కొల్లూరి కామశాస్త్రిచే వ్రాయఁ బడిన యాంధ్రధర్మసింధుసారమున ద్వితీయపరిచ్ఛేదము ముగిసెను.

ఓ దుర్గాంభాయైనమః

# తృతీయపరిచ్ఛేదము

## మంగళాచరణము

ఇపుడు గ్రంథకర్త మంగళముఁ జేయుచున్నాఁడు. ఎట్లనిన కలంకరహితమైన చంద్రబింబమువంటి ముఖము గల్గువాఁడును నమోఘముగ నజ్ఞుల నుతిసహితము గ్రహించువాఁడును కౌస్తుభ శ్రీ మహాలక్ష్ములచే నలంకృతమైన వక్షస్థ్సలము గలవాఁ డును పాదారవిందముల భక్తిచే సత్పురుషుల సంతసింపఁజేయువాఁ డునగు పాండురంగ విఠ్ఠల స్వామిని నమస్కరింతునని తక్కిన శ్లోకములకు ప్రథమ పరిచ్ఛేద మందర్థము వ్రాయఁబడినది. ఇట్లు రెండుపరిచ్ఛేదములందును కాలాది నిర్ణయము చెప్పఁబడినది.

## గర్భాధాన సంస్కారము

ఇపుడు గర్భాధానాది సంస్కారములను గృహ్యాసూత్ర సమ్మతముగా నిందు నిర్ణయింపఁబడును. విద్వాంసులు శోధించి పరిగ్రహింపవలయును. అందు మొదట గర్భాధాన సంస్కారములు నిరూపింపవలెను గనుక నందుల కుపయోగించు ప్రథమ రజోదర్శనమందు దుష్టమాసాది నిర్ణయముఁ జెప్పఁబడును. అందు చైత్ర జ్యేష్ఠాషాఢ భాద్రపదకార్తిక పౌషమాసములు దుష్టములు. ప్రతిపత్తు, అష్టమి, షష్ఠి, ద్వాదశి, పూర్ణిమయు; మరియు రిక్తతిథులనఁగ చవితి, నవమి, చతుర్దశియు నివి యనిష్ట ఫలదములు; మరియు రవి, మంగళ, శనివారములందును, భరణి, కృత్తిక, ఆర్ద్ర, ఆశ్లేష, మఘ, పూర్వాత్రయమనఁగ పుబ్బ, పూర్వాషాఢ, పూర్వాభాద్రయు, విశాఖ, జ్యేష్ఠ, ఈ నక్షత్రములందును విష్కంభము, గండము, యతిగండము, శూలము, వ్యాఘాతము, వజ్రము, పరిఘము, వ్యతీపాత, పూర్వార్థము, నైదృతి యనునీయోగము లందును; విష్టియందు రాత్రి యందు సంధ్యాకాలమందు నపరాహ్ణకాలమందు నిద్రించునపుడును; జీర్ణవస్త్రముగాని రక్తవస్త్రముగాని నీలవస్త్రముగాని చిత్రవస్త్రము గాని కట్టియున్నపుడును; వస్త్రమేమియు లేక నగ్నయై యున్నపుడును పరగృహమందు పరగ్రామమందున్నపుడును, ప్రథమరజోదర్శన మనిష్టఫలము. మఱియును రజస్సు స్వల్పమైనను అధికమైనను నలుపు మొదలగు రంగులు గలిగియున్నను ననిష్టఫలమే.

మఱియు నట్టి రజోదర్శనకాలమందు చీపురు, కఱ్ఱలు, గడ్డి, చేట మొదలగునవి ధరించియున్నచో గులటయగును. వస్త్రమందుపడిన రక్తబిందువులకు విషమసంఖ్య గల్గినచో పుత్రలాభము సమసంఖ్య గల్గినచో కన్యాలాభమగును.

## ప్రథమ ఋతువున పసుపుకుంకుమము ధరించుట

ఇఁక ప్రథమ ఋతువునందు నక్షతలచే నాసనమేర్పఱచి యందట్టి ప్రథమరజస్వలా స్త్రీని గూర్చుండఁబెట్టి పతిపుత్రులుగల పుణ్యస్త్రీలు పసుపు కుంకుమము గంధము పుష్పమాలికలు తాంబూలము మొదలగునవి యిచ్చి దీపములచే నీరాజనమిచ్చి దీపముతో గూడిన గృహమందు నాపై నుంచవలెను. సువాసినులకు గంధపుష్ప తాంబూలాదులిచ్చి లవణము ముద్గము(పెసలు) మొదలగునవి యీయవలెను.

## సర్వరజస్వలకు సాధారణ నిర్ణయము

మూఁడు దినముల పర్యంతము స్పృశింపఁగూడదు. అభ్యంగము కాటుక స్నానము పగలు నిద్రించుట అగ్ని స్పృశించుట దంతధావనము మాంసాశనము సూర్యావలోకనము భూమియందు రేఖలుగీయుటయు వర్జింపవలెను. క్రింద బండు కొనవలెను. దోసిలిచేగాని రాగిపాత్రచేగాని లోహపాత్రచేగాని జలము ద్రావకూడదు. చిన్నగిన్నె మొదలగు పాత్రలతో ద్రావిన యెడ పొట్టి మరుగుజ్జుపుత్రులే పుట్టుదురు. గోళ్లు ఖండించినచో బుప్పిగోళ్లుగల పుత్రులు గల్గుదురు. ఆకులతో ద్రావినచో వెఱ్ఱి సంతతిగల్గును. రెండవమారు రజోదర్శనము మొదలుకొని ప్రయాణము గంధమాల్యములు తాంబూలము గోవుపాలు పెరుగు చల్ల మొదలగునవి భక్షించుట, పీట మొదలగునవి యెక్కి కూర్చుండుట నివి వర్జింపవలెను. మృణ్మయపాత్రయందుగాని యినుపపాత్రయందుగాని భూమియందుగాని భోజనము చేయవలెను. గ్రహణము మొదలగు నిమిత్తములచే స్నానము ప్రాప్తించెనేని జలమందు మునిగి చేయగూడదు. మఱియేమనిన; పాత్రతో జలముపుచ్చుకొని స్నానముచేసి బట్టపిడువగూడదు. వస్త్రాంతరము గట్టనుగూడదు. ఇట్లు మృతాశౌచాది నిమిత్తక స్నానము నూహించునది. ఏకగోత్రమందున్న వారుగాని మేనత్త మేనకోడలు మొదలగు రక్తస్పర్శమాత్రము గలవారుగానియైన రజస్వలా స్త్రీలిద్దరు పరస్పరమును ప్రమాదమున స్పృశించినచో మీఁదఁ జెప్పినరీతిని స్నానముజేసి శుద్ధినొందుదురు. బుద్ధిపూర్వకముగ స్పృశించిరేని యొకరాత్రి యుపవాసము చేయవలెను. మీఁదఁజెప్పిన బంధుత్వమేమియులేని స్త్రీలు రజస్వలలు పరాకున నొకరినొకరు ముట్టిరేని స్నానముజేసి యా దినమున భుజింపఁగూడదు. ఎదిరికావలెనని ముట్టినచో శుద్ధిస్నాన మగువరకును భుజింపఁ గూడదు. భుజించినచో శుద్ధిస్నానాంతరమందు భుజించిన దినముల సంఖ్యచే నన్ని దినములుపవాసము చేయునది. ఉపవాసముఁజేయ నశక్తియగునేని దానికి బ్రతినిధిగ బ్రాహ్మణభోజనాదికము జేయునది. అంతటను శుద్ధిస్నానమైన పైని పంచగవ్యము అనఁగా గోవుపాలు పెరుగు ఘృతము మూత్రము పురీషము నీయైదును సమభాగము

లుగ గలిపి భుజించునది. శూద్ర స్త్రీయు బ్రాహ్మణ స్త్రీయు నిద్దరు రజస్వలలై యొకరి నొకరు ముట్టిరేని శుద్ధిస్నానము పర్యంతము భుజింపఁగూడదు. శుద్ధియైన పైని కృచ్ఛ్రవ్రత ప్రాయశ్చిత్తమును బ్రాహ్మణస్త్రీ జేసుకొనవలెను. శూద్రస్త్రీకి పాద కృచ్ఛ్రము చాలును. రజస్వలకుగాని ప్రసవించిన స్త్రీకిగాని చండాలస్పర్శయైనచో శుద్ధిపర్యంతము భుజింపక శుద్ధిపైని నతికృచ్ఛ్రము గూడ జేయవలెను. అబుద్ధిపూర్వక ముగ నైనచో బ్రాజాపత్యకృచ్ఛ్రము, కఱ్ఱ మొదలగు నితరవస్తుద్వారముగా స్పర్శ మైనచో స్నానమాత్రముచే శుద్ధియగు భోజన కాలమందు స్పృశించినచో ప్రాజాపత్య కృచ్ఛ్రమును శుద్ధ్యనంతరమున ద్వాదశ బ్రాహ్మణ భోజనమును జేయునది. యాజ్ఞ వల్క్యస్మృతి వ్యాఖ్యానమైన మితాక్షరయందు రజస్వలకు పతితులు అంత్యజులు చండాలులు. వీరి స్పర్శ బుద్ధిపూర్వముగనైననచో శుద్ధిపర్యంతము భుజింపక శుద్ధ్య నంతరమందును స్పర్శదినము మొదలు శుద్ధిపర్యంత మెన్ని దినములుండెనో యన్ని దినము లుపవాసములు చేయవలెను. ప్రమాదమున స్పర్శయైనచో శుద్ధిపర్యంత ముపవాసము మాత్రమే. ఇట్లు గ్రామకుక్కటమనఁగ కోడి, పంది,కుక్క,కాకి, నక్షత్ర దర్శనమువఱకునైన భుజింపఁగూడదు. భోజనకాలమందు చండాలాదుల స్పర్శ యగుచో శుద్ధిపర్యంతము భుజింపక యటుపైని నారుదినములు గోమూత్రములత్తుక యాహారము జేయవలెను. అశక్తిలో సువర్ణదానమైనను బ్రాహ్మణ భోజనమైనను జేయవలెను. ఇద్దరు రజస్వల స్త్రీలు నెంగిలిచేతులతో నున్నపుడు స్పర్శయైనచో లేక యెంగిలితోన్ను చండాలుని స్పర్శయైనను కృచ్ఛ్రవ్రతముచే శుద్ధియగును. ఎంగిలి నోటితోనున్న విప్రాదిద్విజవర్ణస్తుని స్పర్శయైనచో రజస్వలకు మూఁడుపవాసములు. అటుగాక మూత్రపురీషోత్సర్గము చేసి శుద్ధుఁడుగాక ముందట్టిద్విజుని స్పృశించిన నొకయుపవాసమని చెప్పఁబడినది. ఇట్లెంగిలితో నున్న శూద్రుని స్పర్శయందధికము గల్పించుకొనవలెను. రజస్వలకు జాతాశౌచాదులతోనున్న మైలవాని స్పర్శయగుచో శుద్ధిపర్యంతమున భోజనము భుజించినచో కృచ్ఛ్రవ్రతము జేయవలెను. అయిదు గోళ్లుగల జంతువులు రెండుడెక్కలుగల జంతువులు నొక్కడెక్క గలజంతువులు వీని స్పృశించినచో లేక యండజములైనపక్షి సర్పాదుల స్పృశించుచో శుద్ధిపర్యంతమున భోజనము. రజస్వల స్త్రీని కుక్క, నక్క, గాడిద వీనిలో నేదైనను గఱచినచో శుద్ధిపర్యం తము భుజింపకుండుటయు శుద్ధ్యనంతరమున నైదురోజులుపవాసము. నాభికంటె నుపరిభాగమందు గరిచెనేని పదిరాత్రులుపవాసము. శిరస్సున గరచినచో నిరువది రాత్రులుపవాసము. భోజనము జేయుచు రజస్వలస్త్రీ మఱియొక రజస్వల స్త్రీని చూచినచో శుద్ధిపర్యంతమభోజనము. చండాలుని జూచినచో నుపవాసత్రయము గూడ జేయునది. బుద్ధిపూర్వముగ చండాలుని జూచినచో ప్రాజాపత్య కృచ్ఛ్రము. రజస్వలకు శవము సూతికాస్త్రీ వీని స్పర్శ గల్గినచో భుజించినయెడ కృచ్ఛ్రము జేయవలెను. ఈ స్థలము లన్నింటియందును బ్రహ్మకూర్చవిధానముచే బంచగవ్య ప్రాశనము మీఁదఁజెప్పఁబడినది. ఆశౌచముగలవారిని స్పృశించి స్నానము చేయక ముందు రజోదర్శనమైన యెడ జతుర్థదినపర్యంతము భుజింపఁగూడదు. అశక్తిలో

నపుడే స్నానముచేసి భుజింపవచ్చును. ఇట్లు బంధుమరణాశౌచము వినినపుడు స్నానమునకు ముందు రజోదర్శన మైనపుడు నూహించునది. అట్లు రజోదర్శన మైన పైని బంధుమరణము విన్నను శక్తిగల్గినచో శుద్ధిపర్యంత మభోజనము లేనిచో నప్పుడే స్నానముజేసి భుజింపవచ్చును. కొందఱు స్పృశింపఁ గూడనివాని స్పర్శ యందంతటను నశక్తిలో స్నానానంతరమున భోజనము శుద్ధ్యంతమందుపవాస ప్రతినిధి జేయవలెనని యందురు. రజస్వలకు ప్రథమదిన నిర్ణయమెట్లనిన; రాత్రి మూఁడు భాగములుజేసి మొదటి రెండుభాగములలో రజోదర్శన మైనచో పూర్వదినమే ప్రథమము, తృతీయభాగమందైనచో బరదినమే ప్రథమదినమని నిర్ణయము. కొంద రర్థరాత్రమునకు బూర్వము రజోదర్శనమైనచో బూర్వదినము ప్రథమమనియు, అర్థరాత్రమున కనంతరమైనచో బరదినమే ప్రథమమని యందురు. దేశాచారమున వ్యవస్థ దెలియునది. ఇట్లు జననమరణాదులకు నాశౌచమునకు నెఱుంగునది. తరు చుగా ముప్పదిరోజులకే రజోదర్శన మగుచుండుట యున్నవారికి పదునేడు దినముల పర్యంతము తిరుగ రజోదర్శనమైనను స్నానముచేతనే శుద్ధి, పదునెనిమిదవ దిన మందైనచో నొకరాత్రి యందుశుతిత్వము, పందొమ్మిదవ దినమందైన యొక రెండు రాత్రులశుచిత్వము. ఇరువది మొదలుకొని మూఁడురాత్రు లశుచిత్వమని యెఱుంగు నది. ఇఁక దరుచుగా పదునైదు దినములకే రజోదర్శన మగుచుండుట మామూలు పడ్డవారికి పదిదినముల పర్యంతము తిరుగ రజోదర్శనమైనను స్నానము చేతనే శుద్ధి. పదునొకండవ దినమందునైనచో నొకరాత్రి యశుచిత్వము. పంద్రెండవదిన ముననేని ద్విరాత్రము. అటుపైని మూఁడు రాత్రులే రోగముచే నిత్యమును రజః ప్రవృత్తియయ్యెనేని యపుడు స్పర్శ కూడని యశుచిత్వములేదు. మరి దానిని వృత్తిగలుగు పర్యంతము పాకమందును దైవ పితృకర్మల యందును నధికారము మాత్రమురాదు. ఇఁక రోగమువలన నటులగు చున్నప్పటికి దిరుగ నెప్పటిసమయ మునకు మాసమందు రజోదర్శనమగును. దాని సావధానముగా గనిపెట్టి మూఁ డురాత్రు లశుచిగ నుండవలెను. గర్భిణికి ప్రసవము గాక ముందురోగముచే రజోదర్శనమైనచో మూఁడు రాత్రులశుచిత్వము. ప్రసవమైన పైని నెలదినముల పర్యంతములోనైనచో స్నానమాత్రముచే శుద్ధిమాస పూర్ణమైనపుడు గనుపించినయెడ మూఁడు రాత్రులశుచిత్వము భోజనముజేసి యెంగిలి ముఖముతో నున్నపుడు రజస్వల యైనచో శుద్ధ్యంతమందు మూఁడుపవాసములు చేయవలెను. ఇఁక మూత్రపురీషోత్సర్గ ముజేసి ప్రక్షాళనము జేసుకొనకముందశుచియై యున్నపుడు రజస్వలయైనచో శుద్ధ్యంతమందొకరాత్రి యుపవాసము. రజోదోషముగలిగిన నెఱుం గక గృహమందు పనిచేయునేని యపుడాబిడె స్పృశించిన గోరసమృద్భాండాదిక మును జలాదికమును విడువ నక్కఱలేదు. ఏమనిన; సూతకమువలె తెలిసిన క్షణము వద్దనుండియె యశుచిత్వము. అట్లు తెలిసిన దినము మొదలుకొని మూఁడుదినము లని నిర్ణయము. కొందఱు రెండవది మొదలగు దినములందు జూచినచో సూతకము నకువలె

శేషించినదినములచే శుద్ధియనియందురు. ఇట్లు మూఁడు రోజులుండి నాల్గవ దిన మందు నరువదిమారులు మృత్తికాశౌచముచే మలినముగడిగికొని దంత ధావనము జేసి యారుగడియల ప్రొద్దయిన పైని స్నానము చేయవలెను. సూర్యోదయ మునకు ముందు స్నానముచేయుట యానాచరము. నాల్గవదినమందు రజోనివృత్తి యయ్యేనేని భర్తృశుశ్రూషాదులయందు శుద్ధురాలగును. పంచమదినమందు దైవ పితృకర్మల యందు సహితము శుద్ధియగును. కొన్నిదినములు రజోనివృత్తికానిచో గర్భాది కారము మాత్రములేదు. రోగముచే నట్లైనచో మీఁదఁ జెప్పఁబడినది. కొందఱు నాల్గవదిన మందు దర్శేష్టి మొదలగు శ్రౌతకర్మలు ఛేయవచ్చు నందురు. మరికొందరు తక్కిన దినముల కంటె జతుర్థదినమే యనుకూలమగుటచే నా దిన మందే గర్భాదానము రజోదర్శనదోషమున్నచో దానికిశాంతికర్మయు చేయవలెను. కాలాంతరము సంభ వింపనిచో శ్రీసూక్తహోమ పూర్వకమైన యభిషేకము నుపనయ నము మొదలగునవి యును జేయవచ్చుననిరి. ఇట్లు చతుర్థదినమందధికార నిర్ణయ మును స్పష్టముగ రజోనివృత్తి గలిగినపుడెయని తెలియవలెను. జ్వరాదులచే బాధగలిగి చతుర్థదినమందు స్నానము చేయలేని యెడల నామెను మఱియొకరు పదిమారులు స్పృశింపుచు స్నానములుచేసి యాచమనము జేయవలెను. ప్రతిస్నానమందును నా బిడ్డకు మఱియొక్కొక్కవస్త్రము గట్టింపు చుండవలెను. అంతమందన్ని వస్త్రములు విడువ వలెను. తుదకు తడిబట్టగట్టించి మరియొక శుద్ధవస్త్రము గట్టించినపైని పుణ్యాహవాచ నము బ్రాహ్మణభోజనముఁ జేసినచో శుద్ధియగును. రోగగ్రస్తులైన యందరకు నిట్లు శుద్ధి విధింపఁబడినది. ఇట్లు శుద్ధ్యనంతరమందు శుభదినమున దుష్టరజోదర్శన నిమిత్తమైన శౌనకప్రోక్తమైన భువనేశ్వరీశాంతినిగాని గ్రంథాంతర మందు జెప్పఁ బడిన శాంతినిగాని చేసి యటుపైని గర్భాదానము చేయవలెను. సూర్యగ్రహణమందు రజోదర్శనమైనచో బంగారు సూర్యబింబమును గ్రహణ నక్షత్ర బింబమును సీసము చేతను రాహురూపము నుంజేసిన పూజించి జిల్లేడు సమిధలచే సూర్యునికి జువ్వి సమిధలచే నక్షత్రేశునికిని రాహునకు దూర్వలచేతను హోమము జేసి యాజ్యము చరువుతిలలు ఈ మూఁడిటిచేతను హోమము చేయవలెను. చంద్ర గ్రహణమందు రజతచంద్ర బింబమును మోదుగు సమిధలచే హోమము నని విశేషము. గ్రహణము వ్యతీపాతము మొదలగు బహుదోషములున్నచో ద్వితీయాది రజోదర్శనమైన పైని శాంతి పూర్వముగ గర్భాధానము చేయవలెను.గర్భాదానమునకు గురుశుక్రాస్తమ యాదలు గాని యధికమాసముగాని బాధకములుగావు. మొదటి రజోదర్శన మందు శాంతిజేయనియెడ ద్వితీయాది రజోదర్శనమందు గురు శుక్రాస్తాది దోషప్రసక్తియగు. నిమిత్తావ్యవహితోత్తరమందే నైమిత్తికానుష్ఠానము జేయుచో గురు శుక్రాస్తాది దోషము లేదు. ముఖ్యకాలము దాఁటినచో నస్తాదిదోష ముండు నను సామాన్య నిర్ణయమును బట్టి ఋతుశాంతి యస్తాదులందు కూడదు. దాని ననుసరిం చిన గర్భాధానమును గూడదని తోఁచుచున్నది.

## భువనేశ్వరీ శాంతి

శాంతియును గ్రహముఖముతో గలిపి చేయవలెను. శాంతియందు భువనేశ్వరి ప్రధానదేవత. ఇంద్రుఁడు శచియు పార్శ్వదేవతలు. ఇట్లు మూఁడు కలశములందును మూఁడు ప్రతిమలు స్థాపించవలెను. గ్రహములకు జిల్లేడు మొదలగు సమిధలును చరువు నాజ్యమును హోమద్రవ్యము. ప్రధానదేవతలకు దూర్వలు తిల సహితమైన గోధూమములు పాయసము నాజ్యమునను నీనాల్గును హోమద్రవ్యములు. ఇట్లు పార్శ్వదేవతలకు నన్నియు, పాయసము ప్రతిష్ఠించిన యగ్నిలో శ్రవణము చేయవలెనుగాని గృహమున సిద్ధము చేసినది పనికిరాదు. గ్రహహోమమునకు మాత్రము గృహమందు వండినయన్నము తీసుకొనవచ్చును. పాత్రాసాధనము చేయునపుడు పాయసమువండుట కొకస్థాలినాసాదించవలెను. గృహసిద్ధాన్నమును సంస్కరించుటకు మరియొక స్థాలియునుంచవలెను. ఆజ్యహోమము ననేకులు జేయవలసిన యెడ ననేక స్రువలాపాదింపవలెను. ఆజ్యముతోగూడ మూఁడు హవిస్సులకును గృహ సిద్ధాన్నమునకును పర్యగ్నికరణముజేసి స్రువాదులను దుడిచినపైని గృహసిద్ధాన్నము నాపాదించిన చుస్థాలియందుంచుకొని, యగ్నియందుంచి తీసి యభిఘరించుట మొదలు బర్హిస్సువేయుట పర్యంతమైన కర్మజేసి పాయసము నభిఘరించి యాసాదించుట సయితము జేయవలెను. అన్వాధానమందును హవిస్త్యామందును ప్రధాన దేవతలను భువనేశ్వరీనామముచేతను సవితృపదముచేతను నుచ్చరింపవలెను. యేమనిన; గాయత్రిచే హోమముఁ జెప్పఁబడినది. ఆజ్యభాగాంతమందు యజమానుదన్వాధానము ననుసరించి "ప్రతిదైవతమష్టావింశత్యాహుతి పర్యాప్తమర్కాది జాతీయ సమిచ్చర్వాజ్యాత్మకమిదంహ విస్త్రయంసుర్యాయ సోమాయ భౌమాయ బుధాయ బృహస్పతయే శుక్రాయ శనయే రాహవే కేతవే నమః అష్టావష్టాహుతి వర్యాప్తంతద్ధ విస్త్రయంతత్తదధిదేవతా ప్రత్యధిదేవతాభ్యో నమః, చతుశ్చతుస్సంఖ్యాపర్యాప్తం తద్ధవిస్త్రయం వినాయకాదిభ్యః క్రతు సంరక్షణ క్రతుసాద్గుణ్య దేవతాభ్యో మమ అష్టోత్తర శతసంఖ్యాకాహుతి పర్యాప్తం దూర్వాతిల గోధూమపాయసాజ్య రూపహవిశ్చతుష్టయం భువనేశ్వర్యై మమ యద్వాసవిత్రేనమమ ఏవమష్టావిశంతిపర్యాప్త తచ్చతుష్టయమింద్రేంద్రాణీభ్యాం నమమ" యని త్యాగముజేయవలెను. బహుదోషములకు శాంతి జేయవలసినచో నష్టోత్తర సహస్రసంఖ్యచే భువనేశ్వరికిని నష్టోత్తరశతసంఖ్యచే నింద్రేంద్రాణులకును హోమము వైకల్పికము. హోమాంతమందు గ్రహాదిబలులును భువనేశ్వర్యాదిబలులును నభిషేకమును జేయవలెనని సంక్షేపము.

## సామాన్యముగ స్మార్తకర్మలకు కావలసిన పూర్వంగపరాంగములు

అందు మంత్రములతోగూడ విస్తారప్రయోగము దమతమ శాఖలననుసరించి తెలియవలెను. అందు తరుచుగ స్మార్తకర్మల కన్నిటికిని పూర్వాంగపరాంగ క్రమము నిట్లు వివరింపఁబడును. శ్లో॥ "సంకల్ప స్స్వస్తి వాగ్విప్రవరణం భూతనిస్సృతిః, పంచ

గవ్యై ర్భూమిశుద్ధిర్ముఖ్యదైవత పూజనం, అగ్నిప్రతిష్ఠా సూర్యాది గ్రహస్థాపనపూజనే, దేవతాన్వాహితిః పాత్రాసాధనం హవిషాంకృతిః యథాక్రమం త్యాగహోమావితి పౌర్వాంగకః క్రమః, పూజాస్విష్టం నవాహుత్యా బలిః పూజాహుతిస్తథా, పూర్ణపాత్ర విమోకాద్యగ్న్యర్చనాంతేభిషేచనం, మానస్తోకేతిభూతిశ్చ దేవపూజావిసర్జనే, శ్రేయో గ్రహోదక్షిణాది దానం కర్మేశ్వరార్పణం, క్రయోయముత్తరాంగానాం ప్రాయస్మార్తేష్వితి స్థితిః" అని యర్థము స్పష్టము. ఇట్లు మదనరత్నమందున్న బౌధాయనశాంతియు గౌస్తుభమం దెఱుంగునది. రజోదర్శనముగాక ముందు పత్నీగమనము బ్రహ్మహత్యాది దోషముఁ జేయునని యున్నందున బ్రాయశ్చిత్తమేదియైనపుడు చేయవలెనని తోఁచు చున్నది. ఋతువునందు గమనము విధింపఁబడినది. అట్లు జేయనిచో భ్రూణ హత్యాదోషము. అది మనస్సునందు గామమున్నప్పటికిని ద్వేషాదులచే స్త్రీని గూడ కున్నవాని కగునని తెలియవలెను. విరక్తునికి దోషమేమియు లేదని శ్రీమద్భాగవత మందు "లోకేవ్యవాయామిషమద్యసేవా"యను శ్లోకమందునుదాని వాఖ్యానమందును స్పష్టము. ఋతుకాలము రజోదశర్శనము మొదలుకొని పదియారు దినముల పర్యంత మునని. తెలియవలెను. అందు మొదటి నాల్గురోజులును పదునొకండవ దినము పదు మూఁడవదినమును వర్జ్యములు మిగిలిన దినములందును పుత్రసంతతి గోరినచో సమసంఖ్యగల దినమందును. కన్యార్థియైనచో విషమసంఖ్య గలదినమం దును స్త్రీసంగముఁ జేయవలెను. అందు నుత్తరోత్తర రాత్రులు ప్రశస్తములు. ఒక రాత్రి యందొక్కమారే స్త్రీసంగముఁ జేయవలెను. అట్టి సంగమము సరితిథులన్నిటి యందు నావశ్యకమని కొందరు, ఇతరదినములందు ప్రతిబంధాదులచే సంగము సంభవింపనియెడ శ్రాద్ధదినమందు నేకాదశియందును ఋతుగమనము చేయవలెనని కొందరు, స్త్రీలకిచ్చినవసరమును స్మరించి, పత్ని గోరినయెడ ఋతుకాలముగాకున్నను గమనము జేసిన దోషములేదుగాని బ్రహ్మచర్య వ్రతమునకు భంగము మాత్రమగును. అట్లు చేయనిచో సదా బ్రహ్మచారియగును. అందు వచనము – "ఋతౌ గచ్ఛతి యో భార్యా మనృతౌనైవ గచ్ఛతి, యావజ్జీవం బ్రహ్మచారీ మునిభిః పరికీర్తితః" అని యర్థము స్పష్టము, అష్టమి, చతుర్దశి, పూర్ణిమ, అమావాస్య సూర్య సంక్రాంతి, వ్యతీపాత, పరిఘపూర్వార్థము, విష్టి, సంధ్యకాలము తల్లితండ్రుల మృతదినము. శ్రాద్ధదినము, దాని పూర్వదినము, జన్మనక్షత్రము, పగలు వీటియందు స్త్రీ గమనము నిషిద్ధము.

## గర్భాధాన కాలము

చతుర్థి, షష్ఠి, చతుర్దశి, అష్టమి, పూర్ణిమ యివిలేని తిథులు ప్రశస్తములు. సోమ బుధ గురు శుక్రవారములు శుభములు. మూల మఘా రేవతీ జ్యేష్ఠా నక్షత్ర ములు వర్జ్యములు. భరణి, కృత్తిక, ఆశ్రేష, ఆర్ద్ర, పుబ్బ, పూర్వషాఢ,పూర్వభాద్ర, విశాఖ ఇవి మధ్యములు. తక్కినవి శుభములు. సర్వకార్యములకును గోచారమందు చంద్రబలమావశ్యకము. అది యెట్లనిన–శ్లో॥"చంద్రోన్న మధనం సౌఖ్యం రోగం కార్యక్షతింశ్రియం, స్త్రియం మృత్యుం నృపభయం సుఖమాయం వ్యయం క్రమాత్,

స్థానేషు ద్వాదశస్వేత జ్జన్మరాశేః ప్రయచ్ఛతి, శుక్లపక్షే శశీశ్రేష్ఠో ద్విపంచ నవమేష్వపి.” అని యనఁగ జన్మరాశి మొదలుగ పంద్రెండు స్థానములందుండు చంద్రునికి గ్రమముగా ఫలములు అన్నములు దారిద్ర్యము సౌఖ్యము రోగము కార్యనాశము సంపత్తి స్త్రీలాభము మరణము రాజభయము సుఖము ధనలాభము ధననాశము నను నీ పంద్రెండును గలుగును. శుక్లపక్షమందైనచో చంద్రుఁడు ద్వితీయ పంచమ నవమమునను నశుభస్థానములందుండినను శుభమునే జేయునని యర్థము. కనుక నట్ల చంద్ర బలముఁ దెలియునది. ఇఁక ననేక భార్యలు గలవానికి  భార్యలందరు నొక్క మారే ఋతుమతులైనచో వివాహక్రమముచేగాని ఋతుక్రమముచేగాని గర్భాధానము.

## ఋతువునందు సంగమము జేయనిదోషమున కపవాదము

శ్లో॥“వ్యాధితో బందనస్థోవా ప్రవానేష్వథపర్వసు, వృద్ధాం వంధ్యామ సద్వృత్తాం మృతాపత్యామ పుష్పిణీం, కన్యాసూంబహుపుత్రాం చాప్యగచ్ఛన్నైవ దోషభాక్” అని అనఁగాదాను రోగియై నపుడును, ఖైతులోనున్నపుడు ప్రయాణము వెళ్ళినపుడు పర్వ పంచకమందును భార్యవృద్ధురాలైనను వంధ్యురాలైననుజారిణియైనను మృతప్రసవమే కలదైనను రజస్వలకాకుండనే యుండినను కన్యలనే గనునదియైనను బహుపుత్రులు గనినదియైనను సంగమము చేయకుండుటవల్ల పురుషుని కేదియు దోషములేదు. అందుఁ బ్రథమ ఋతుగమనము గర్భాధానహోమమును గృహ్యాగ్ని యందు జేసిన పైని జేయవలెను. ద్వితీయాదిఋతువుననైనచో హోమమక్కఱలేదు. తమ సూత్ర మందు హోమము చెప్పియుండని శాఖవారు హోమము దప్ప మంత్ర పాఠాది రూపమైన గర్భాధానసంస్కారము జేయవలెను. ఆహితాగ్ని యర్ధాదానము జేసినవాఁడైనను ననాహితాగ్ని కౌపాసనాగ్నికి సిద్ధించియున్నను నాయగ్ని యందే హోమము. ఔపాసనాగ్నికి విచ్ఛేదము గల్గినచో పంద్రెండు దినములలోగా నైనయెడ, ‘అయాశ్చ యను నాజ్యాహుతితోడను, అటుపై నైనయెడ ప్రాయశ్చిత్త పూర్వముగ బునస్సంధాన విధిచే నగ్ని బుట్టించి యందు హోమము. అందు ప్రతిసంవత్సరమును ప్రాజాపత్య కృచ్ఛ్రము ప్రాయశ్చిత్తము. అపుడిట్లు సంకల్పము. “మమగృహ్యాగ్ని విచ్ఛేద దినాదార భ్యైతావంతంకాలం గృహ్యాగ్ని విచ్ఛేద జనితదోష పరిహారద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం గృహ్యాగ్ని విచ్ఛేద దినాదార భ్యైతా పదబ్ధపర్యంతం ప్రత్యబ్దమేకైక కృఛ్రాన్ యథాశక్తి ప్రత్యామ్నాయ గోనిష్క్రయీభూత రజతనిష్కనిష్కార్ధనిష్కపాద నిష్కపాదార్ధాన్య తమ ద్రవ్యదానేనాహమాచ కరిష్యే”యనియు, నట్లు“ఏతావద్దినేషుగృహ్యాగ్ని విచ్ఛేదేనలుప్త సాయం ప్రాతరౌపాసన హోమద్రవ్యం లుప్తదర్శ పౌర్ణమాసాది స్థాలీపాకాది కర్మపర్యాప్త వ్రీహ్యాజ్య ద్రవ్యంచ తన్నిష్క్రయం వాదాతుమహముత్సృజే” యనియు జేయవలెను. కృచ్ఛ్రములకు మరియొక ప్రతినిధి జేయఁదలఁచినచో నటులూహించునది. ఎన్మిది గురిగింజలయెత్తు విష్కపాదము అతిచతుర్గుణమైనచో నిష్కము. ఇట్లు సంకల్పించి మరియు “విచ్ఛిన్నస్య గృహ్యాగ్నేః పునస్సంధానం కరిష్యే” యను సంకల్పము మొదలుగ దమ తమ సూత్రోక్త విధిచే గృహ్యాగ్ని సాధింపవలెను. సర్వాధానము జేసినవారైనను నిటులనే పునస్సంధాన ముచే గృహ్యాగ్ని సంపాదించి గర్భాధానపుంసవనాది హోమము

చేయవలెను. అందు కృచ్ఛ్రసంకల్పము హోమాది ద్రవ్యదానసంకల్పము నక్కరలేదు. మరేమనిన "గర్భాధాన హోమంకర్తుం గృహ్యాగ్ని పునస్సంధానం కరిష్యే" యని సంకల్పించి గర్భాధానాంత మందాయగ్నిని విడుచునది. అర్ధాధానము వారికిని పక్షద్వయము. గృహ్యాగ్నియందు సాయంప్రాతర్హోమములు స్థాలీపాకమును చేయవలె నని యొకపక్షము. గృహ్యాగ్ని కేవలము సంరక్షింపఁబడవలసినదే కాని దానియందు హోమాదికముఁ జేయఁగూడదని రెండవపక్షము.

## గర్భాధాన హోమవిధి

అందు మొదటిపక్షమందు బూర్వహోమాది ద్రవ్యదానము జేయవలెను. హోమాదులు చేయనిపక్షములో ప్రయాశ్చిత్తము మాత్రము చేయవలెను. ద్రవ్యదాన మక్కరలేదు. ఇద్దరు భార్యలుండువాని కగ్నిద్వయము గలపకముందు రెండగ్నుల యను గతియున్నచో నుభయవిచ్ఛేద దినము మొదలబ్ధ సంఖ్యచే నొక్కదానికి కృచ్ఛ్ర ప్రాయశ్చిత్తమును పృథక్పృథక్కుగా ద్రవ్యదానమును స్థాలీపాకద్రవ్య దానమునుజేసి పునస్సంధానద్వయముచే నగ్నిద్వయమును బుట్టించి రెంటికి సంసర్గము జేసి యందు గర్భాధాన హోమముఁ జేయునది.

## అగ్నిద్వయ సంసర్గము

అగ్ని ద్వయసంసర్గమునకు ముందొక యగ్ని యనువృత్తియే యున్నచో దానికి మాత్రమే ప్రాయశ్చిత్తము. తద్ధోమద్రవ్య మాత్రమునకే దానమునుఁ జేయవలయును గాని స్థాలీపాక ద్రవ్యదాన మక్కరలేదు. రెండవభార్య సన్నిధినిలేనిచో గర్భాధానము చేయవలసిన భార్యయొక్క అగ్నివిచ్ఛేదమునకు బ్రాయశ్చిత్తము మొదలగుదానిచే గృహ్యాగ్ని బుట్టించి యందు హోమము. అన్ని పక్షములందును పునస్సంధాన మందు స్థాలీపాకారంభము లేనిచో స్థాలీపాకాది ద్రవ్యదానము వైకల్పికము.

## గర్భాధాన ప్రయోగము

ఇట్లు తమతమ పక్షములు గృహ్యాగ్ని సిద్ధిజేసికొని "మమాస్యాం భార్యాయాం సంస్కారాతిశయద్వారా అస్యాంజనిష్యమాణసర్వ గర్భాణాం బీజగర్భసముద్భవైనో నిబర్హణద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం గర్భాధానాఖ్యం కర్మకరిష్యే" యనియు–"తదంగ త్వేనస్వస్తి వాచనే" త్యాదియును సంకల్పించి పుణ్యాహవాచన మాతృకాపూజ ననాందీ శ్రాద్ధములుచేసి గృహ్యసూత్రానుసారముగ గర్భాధాన సంస్కారముఁ జేయునది. అందుగర్భాధానము బ్రహ్మాదిదేవతాకము గనుక పుణ్యాహవాచనాంతమందు "కర్మాంగ దేవతా బ్రహ్మాప్రీయతా" మ్మని యుచ్చరింపవలెను. ఔపాసనాంగమైన స్వస్తివాచన మందు–"అగ్నిసూర్య ప్రజాపతయఃప్రీయతా" మ్మనియు స్థాలీపాకారంభ మందు– "అగ్నిఃప్రీయతా" మ్మనియు నుచ్చరింపవలెను. ఇట్లితరస్థలములందు గ్రంథాంతర ముచే నూహించునది.

## నాందీశ్రాద్ధ విచారము

గౌరి మొదలగు మాతృకలఁ బూజించుట నాందీశ్రాద్ధమున కంగము గనుక నాందీశ్రాద్ధముఁ జేయనిచో మాతృకాపూజనమునక్కరలేదు. నాందీశాద్ధమందు మాతృ పార్వణము అనఁగ మాతృపితామహీ ప్రతితామహీగణమును ముందుచ్చరింపవలెను. అటుపైని పితృపార్వణ మనఁగ పితృపితామహ ప్రపితామహుల నుచ్చరింపవల యును. ఆపైని సపత్నీకులైన మాతామహాదిగణము నుచ్చరింపవలయును. ఆపైని సపత్నీకులైన మాతామహాదిగణము నుచ్చరింపవలెనని మూఁడు పార్వణము గలది నాందీశ్రాద్ధము. తల్లి జీవించియున్నయెడ సవితితల్లి మృతినొందినను మాతృపార్వణ మక్కఱలేదు. ఇట్లు మాతామహి జీవించియున్నచో సవతి మాతామహి మృతినొంది యున్నప్పటికి మాతామహాదులకు భార్యతోగలసి యుచ్చరింప నక్కరలేదు. ఇట్లు దర్శాది శ్రాద్ధమందును తల్లి జీవించియున్నచో సవతితల్లి మృతినొందినను పిత్రాదు లకు పత్నితోగూడ నుచ్చరించుట యక్కరలేదు. ఈ నాందీ శ్రాద్ధమున స్వధాశబ్దము నుచ్చరించుచోట స్వాహాశబ్దము బలుకవలెను. సమస్తక్రియలును సవ్యముచేతనే జేయవలెను. ఒకొక్క పార్వణమునకును విశ్వేదేవతలకును నిద్దరిద్దరేసి బ్రాహ్మణులు గావలెను. కుశలుగావలసినచో దూర్వలు వినియోగింపవలెను. వివాహాది మంగళ కర్మాంగమైన నాందీ శ్రాద్ధమందిట్లుచేయునది. యజ్ఞాది కర్మాంగమైన నాందీ శ్రాద్ధ మందు మూలరహితముగ దర్భలే గ్రహించునది. దూర్వలుగాని దర్భలుగాని యుగ్మ ములే గ్రహింపవలెను. యజమాను డుత్తరాభిముఖుఁడును బ్రాహ్మణులు తూర్పున కభిముఖులునై యుండవలెను. లేదా వారేయుత్తరాభిముఖులు, నితఁడే ప్రాఙ్ముఖుఁ డును గావచ్చును. పూర్వాహ్ణ కాలమందే చేయునది. ప్రదక్షిణముగనే కర్మచేయునది. అన్వాధానాంగమైనచో నపరాహ్ణమందు జేయవలెను. పుత్రజననము బట్టిచేయుచో రాత్రియందును జేయవచ్చును. ఇట్లు విశ్వేదేవార్థమైన విప్రులతోగూడ నెనమంద్రును విష్ణుని మిత్తమొకఁడునుగలసి తొమ్మండ్రుగాని యశక్తిలో నలుగురు గాని బ్రాహ్మ ణులు. వృద్ధి శ్రాద్ధమందు సత్యవసుసంజ్ఞికులు విశ్వేదేవులు. సోమ యాగము గర్భా ధానము పుంసవనము సీమంతోన్నయనము ఆ సోమయాగము గర్భా ధానము పుంసవనము సీమంతోన్నయనము ఆధానము మొదలగు కర్మల కంగమైన వృద్ధిశ్రాద్ధ మందు గ్రతుదక్షసంజ్ఞికులు విశ్వేదేవులు. గర్భాధానాది సంస్కార ములందును వాపీదేవ ప్రతిష్ఠాదిపూర్వ కర్మలయందును ప్రాథమికమైన యాధానాదు లందును సన్యాసస్వీకారమందును కామ్యవృషోత్సర్గమందును గృహప్రవేశమందును తీర్థయాత్రయందును శ్రవణాకర్మయు సర్పబలియు నాశ్వయుజకర్మయు నాగ్రయణము మొదలగు పాకసంస్థ లారంభించునపుడును నాందీశ్రాద్ధమావశ్యకము. పునరాధాన మందును సోమయాగాదులు తప్ప బహువారములు చేయు కర్మయందును నష్టకాది శ్రాద్ధకర్మలందును నాందీశ్రాద్ధ మక్కరలేదు. గర్భాధానము పుంసవనము సీమంతోన్న యనము చౌలము నుపనయనము వివాహము వీనిదప్ప తక్కిన సంస్కారములందును శ్రవణాకర్మాదులందును నాందీ శ్రాద్ధము వైకల్పికము. జాతకర్మాంగమైనదియు పుత్ర

జననినిమిత్తమైనదియు నాందీశ్రాద్ధము వేరుగనే యుండును. జన్మకాలమందే జాత కర్మ చేసినయెడ "పుత్రజన్మనిమిత్తకం జాతకర్మాంగంచ వృద్ధిశ్రాద్ధం తంత్రేణ కరిష్యే" యని సంకల్పించి యొకమారే చేయవలెను. నామకర్మతో జాతకర్మ జేయఁదలఁచి నచో పుత్రజన్మ నిమిత్తకమును జననకాలమందే హిరణ్యముచేజేసి కర్మాంగమును నామకర్మ కాలమందు జేయవలెను. అట్లపుడు చేయనియెడ నామకరణ కాలమందే తంత్రముచే నొకమారే చేయవలెను. ఇట్లు చౌలాదికర్మలతో నామకర్మాదులు చేయు నపుడు "పుత్రజన్మ నిమిత్తకంజాతకర్మాది చౌలాంత సంస్కారాంగభూతం చ నాందీ శ్రాద్ధ తంత్రేణ కరిష్యే" యని సంకల్పము. కాఁబట్టి చౌలాదికర్మలును నితర కర్మలును కలిపి యొక్క మారే చేయునపుడు నాందీశ్రాద్ధము నొకమారే చేయుటగాని ప్రతి కర్మకు వేరుగ చేయనక్కరలేదు. ఇట్లు కవలకు నొకమారే సంస్కారముజేయుచో నూహించవలెను. ఋగ్వేదులు కాత్యాయనులును నీ శ్రాద్ధమందు "పితృపితామహ ప్రపితామహాః" అని తండ్రిని మొదలుకొని యుచ్చరింపవలెను. ఇతరశాఖీయులు "ప్రపితామహపితా మహపితరోనాందీముఖా" అని. తాతతండ్రిని మొదలుకొని యుచ్చారణముఁజేయవలెను. మాతృపార్వణమందు నాందీముఖశబ్దమందు వికల్ప ముగ జీవునుచ్చరించి "నాందీముఖ్యః" అనుటయు "నాందీముఖాః"అనుటయు బక్ష ద్వయ మున్నది. అనాది సంజ్ఞయగుటచే "నఖముఖాత్సంజ్ఞాయా"మ్మను నిషేధము రాదని పురుషార్థ చింతామణియం దున్నది.

## జీవత్పితృకుఁడు వృద్ధిశ్రాద్ధము జేయుట

ఇఁక వృద్ధిశ్రాద్ధము జేయువానికి దండ్రిజీవించియున్నచో నిర్ణయము. "జీవేత్తు యది వర్గాద్యస్తంవర్గంతు పరిత్యజేత్" అను న్యాయముచే జీవపితృకుఁడు తన సంతాన మునకు సంస్కారము జేయుచో మాతృపార్వణము మాతామహపార్వణము నీరెంటి తోడనే నాందీశ్రాద్ధము జేయవలెను. తల్లిగూడ జీవించియున్నచో మాతామహ పార్వణ మొక్కటియే యుచ్చరించునది. మాతామహుఁడు జీవించియున్నచో నొక్క మాతృ పార్వణమే. అట్టిచో విశ్వేదేవులక్కరలేదు. వర్గత్రయ మందును మొదటివారు జీవించి యున్నచో నట్టినాందీ శ్రాద్ధమునకు లోపమే యగును. ద్వితీయ వివాహము నా ధానము సోమయాగము పుత్రుష్టి మొదలగు స్వసంస్కారకర్మలు తానే చేయవలసి వచ్చినపుడు "యేభ్య ఏవపితాదద్యాత్తేభ్యోదద్యా" త్తను వచనమున తాత మొదలగువారి నుచ్చరింపవలెను. అనఁగా, మాతామహుఁడు మృతినొందినను తన తండ్రి జీవించి యున్నవాఁడు స్వసంస్కార కర్మను మీఁదఁజెప్పిన వానిలో నొకదాని జేసుకొనునపుడు నాందీ శ్రాద్ధమందు "పితుర్మాతృపితామహీ ప్రపితామహ్యః, పితుః పితృపితామహ ప్రపితామహా, పితుర్మాతృహః మాతుః పితామహమాతుః ప్రపితామహాః" అనియే పార్వణత్రయము నుచ్చరించి నాందీశ్రాద్ధము జేయవలెనుగాని తనతల్లిని తనమాతా మహుని మొదలుకొని యుచ్చరింపఁగూడదు. తండ్రియు తాతయు నిద్దరు జీవించి యున్నచో "పితామహస్య మాతృపితామహీ ప్రపితా మహ్యః" అని మొదలగు నుచ్చా రణ మూహించునది. ఇట్లు ప్రపితామహునికి స్వసంస్కారమం దూహించునది.

తండ్రికి దల్లి మొదలగువారు జీవించియున్నచో నాపార్వణమునకు లోపమే. కాఁబట్టి "యేభ్య ఏవ పితాదద్యా తేభ్యోదద్యా" త్తను పక్షమునకును వర్గములలో మొదటివారు జీవించినచో నాపార్వణమునకు లోపమే యను ద్వారలోప పక్షమునకును స్వసంస్కారకర్మలలో లోపము లేదనియు స్వాపత్యసంస్కార కర్మలలో లోపము కావచ్చుననియు వ్యవస్థ సిద్ధాంతితమైనదని తెలియవలెను. కొందఱీ పక్షద్వయమునకు నిచ్ఛానుసారముగ వికల్పమనిరి. ఇట్లు తల్లియు మాతామహుఁడును జీవించి, తండ్రి లేనిచో బితృపార్వణము మాత్రముననే నాందీశ్రాద్ధ సిద్ధియని తెలియునది. సమావర్తనమునకు బ్రహ్మచారి యధికారియైనను దానికంగమైన నాందీశ్రాద్ధమందు మాత్రము తండ్రికేయధికారము. అతఁడు లేనిచో జ్యేష్ఠ భ్రాత్రాదుల కధికారమని కొందరు. అందు తండ్రి పుత్రునిసమావర్తనములో తన పిత్రాదులకు నాందీశ్రాద్ధము చేయవలెను. తండ్రి జీవత్పితృకుఁడైనచో సుతసంస్కారమందు ద్వారలోపమే యుక్తమని తోఁచుచున్నది. మాణవకుని తండ్రి ప్రవాసములో నున్నందున సన్నిధిలేనిచో భ్రాత్రాదులు "మాణవకస్యపితుః మాతృపితామహీ ప్రపితామహ్యాః" అని మొదలగు నుచ్చారణముతో శ్రాద్ధము జేయవలెను. తలిదండ్రులులేని మాణవకుని సమార్తనమందు పినతండ్రియు సోదరుఁడును మొదలగు వారు "అస్యమాణవకస్య మాతృపితామహీ ప్రపితామహ్యాః" అని మొదలగు నుచ్చరింపవలెను. భ్రాత్రాదులు లేనిచో దానే తన పితృ దేవతల నుద్దేశించి యీయవలెను. ఇట్లు జీవత్పితృకుఁడైనను తండ్రి సన్నిధి లేనిచో భ్రాత్రాదులును లేనియెడల తానే తండ్రి పితృదేవతలనుద్దేశించి నాందీముఖము చేయునది. ఉపనయనముచేతనే కర్మాధికారము సిద్ధించియున్నది. ఇట్లు వివాహమందు నూహించునది. మృతపితృకునికి చౌలోపనయనాదలు పినతండ్రి మేనమామ మొదలగువారు చేయుచో "అస్యసంస్కార్యస్య పితృపితామహ ప్రపితామహాః" అనియుచ్చరించి యేశ్రాద్ధము జేయునది. జీవించియు దండ్రి ప్రవాసములోనున్నచో పినతండ్రి మొదలగువారు చేయవలసివచ్చినపుడు "అస్య సంస్కార్యస్య పితుః మాతృపితామహీ ప్రపితామహ్యాః" యని యుద్దేశించవలెను గాని "సంస్కార్యస్య మాతృపితామహీ ప్రపితామహ్యాః"అని యుచ్చరింపఁగూడదని సంక్షేపము. నాందీశ్రాద్ధమందు పిండదానము కులాచారముఁబట్టి వైకల్పికము. ఇట్లు పిండములయందు దధి మధు ద్రాక్షామల కాదిమిశ్రణము దక్షిణనిచ్చుచో ద్రాక్షపండ్లు నుసిరికెపండ్లు నిచ్చుట, ప్రథమాంతముచే సంకల్పము. అంతట నుచ్చరించునపుడు సంబంధమును నామమును గోత్రమును వర్జింపవలెను. మాలతీ మల్లికా కేతకీక మలముల మాలికలీవలయునుగాని రక్తపుష్పముల మాలికలు కూడదు. అందరు కుంకుమచందనాదులచే నలంకరించుకొని చేయవలెను. నాందీ శ్రాద్ధారంభ మగునపుడు సాగ్నికుల నగ్నికులును సర్వశాఖీయులును వైశ్వదేవము పాకాంతరముచే జేయవలెను. ఇద్దరిద్దరికి యొక్కమారే నిమంత్రణము. అనఁగా "భవద్భ్యాంక్షణః క్రియతాం ఓం తథా, ప్రాప్నుతాం భవంతౌ, ప్రాప్నవావ" అని ప్రార్థనా ప్రతివచనములుచ్చరించునది. మరియు "శంనోదేవీః" అని మంత్రించి యవలనేయుంచునది. "యవోసి సోమదేవత్యో

గోసవే దేవనిర్మితః, ప్రత్నవద్భిః ప్రత్తః పుష్ట్యానాందీముఖానిమాన్ లోకాన్ ప్రీణయా హినః స్వాహానమః" అని పిత్ర్యకర్మయందు మంత్రము. రెండేసి మారులు గంధాదుల నీవలెను. "అగ్నయేక వ్యవాహనాయస్వాహా, సోమాయ పితృ మతే స్వాహా"యని పాణిహోమము. ఈనాందీ శ్రాద్ధమందు నపసవ్యములేదు. తిలలు లేవు. తర్జన్యంగుష్ఠ మధ్యమునుండి యుదకదానమునులేదు. పావమానీ ఋక్కులు శంవతీఋక్కులు శకునిసూక్తము స్వస్తిసూక్తమును పఠించవలెను. "మధువాతా" యనుతృ్ృ చస్థావ మందు "ఉపాస్మైగాయత" యను నైదు ఋక్కులు పఠించవలెను. "అక్షన్నమీమదంత" యను తృప్తిప్రశ్నస్థానమందు "సంపన్నం"అని పలుకవలెను. దేవస్థానమందు "రుచితం"అనవలెను. కుశలుగాని దూర్వలుగాని పూర్వాగ్రములుగానే వేసి యొక్కొక్కరికి రెండేసి పిండములీవలెను. "అక్షయ్యా" స్థానమందు "నాందీముఖా" పితరః ప్రీయతా" మ్మనియు, "స్వధావాచన" స్థానమందు "నాందీ ముఖాన్ పితౄన్ వాచయిష్యే" యనియు నుచ్చరింపవలెను. స్వధాశబ్దము నుచ్చరింపఁ గూడదు. త్యమూషు వాజినమను ఋక్కుచే విప్రవిసర్జనము. కొందరు ఋగ్వేదులకు నాందీశ్రాద్ధాంతమందు వైశ్వదేవమని చెప్పుదురు. ఇక్కడ శ్రాద్ధాంగతర్పణము లేదు. ఈ శ్రాద్ధమం దాహితాగ్ని పిండదానము చేయఁగూడదు. తండ్రియొక్క పిత్రాది వర్గముల నుద్దేశించి శ్రాద్ధము జేయునపుడు "పితుర్మాతామహీ చైవతథైవచ పితా మహీ" త్యాది. శ్లోకము పఠించవలెను. ద్వారలోప పక్షమందు లోపించిన పార్వణ వర్గమును జెప్పెడు శ్లోకైక దేశమునకును లోపము చేయునది. ఒక్క మాతృ పార్వణ మేయైనచో విశ్వేదేవులక్కరలేదు. "ఏతాభవంతు సుప్రీతాః" అని యూహ చేయవలెను. సాంకల్పికవిధిచే సంక్షిప్తమైన నాందీశ్రాద్ధప్రయోగము ప్రయోగ రత్నాదులలో దెలియ వలెను. ఇది నాందీ శ్రాద్ధవిచారము.

## గర్భాదాన సంస్కారము

ఇట్లు స్వస్తివాచనమును క్రతుదక్షసంజ్ఞికులైన విశ్వేదేవులతో గూడిననాందీ శ్రాద్ధమునుజేసి శాఖానుగుణముగ గర్భాధాన సంస్కారము జేయవలెను. ఋగ్వేదులు గృహ్యాగ్ని యందు ప్రాజాపత్య చరువును వేల్చి విష్ణువున కారుమారులును ప్రజాపతి కొకమారు నాజ్యాహుతులు వేల్చి జపోపస్థానము లక్కరలేదుగాని కరణాదికము చేయవలెను. "శ్లో॥విష్ణుర్యోనిం జపేత్సూక్తం యోనిం స్పృష్ట్వా త్రిభిర్వ్రతీ, గర్భాదానం తతః కుర్యా త్సుపుత్రో జాయతేధ్రువం" అని వచనమున్నందున యజమానుఁడు స్త్రీ జఘనమును స్పృశింపుచు "విష్ణుర్యోనిం కల్పయతు" అను మంత్రము ముమ్మారు పఠించి గర్భాధానము జేసెనేని సుపుత్రుఁడు గల్గును. ఇట్లు "నేజమేషేత్యాది" మంత్ర జపముఁగూడ విధింపఁ బడినది. సర్వ ప్రకారములచేతను హోమము సంభవింపని యెడ పిల్లివేంఁడ్ర పురసమును స్త్రీయొక్క దక్షిణానాసా పుటమందు బిడిచి సంగమము చేయవలెను. ఇట్లు గర్భాధాన సంస్కారము చేయక స్త్రీని బొందినచో గర్భోత్పత్తి యందు దానికి ప్రాయశ్చిత్తము గోదానము చేసి పుంసవనము చేయవలెను. ఇంక స్త్రీ సంగమమైనపైని "శ్లో॥ ఋతౌతు గర్భ శంకిత్వాత్స్నానం మైథునినస్మృతం,

అనృతౌతు యదాగచ్ఛే చ్ఛౌచం మూత్ర పురీషవత్” అను వచనమున ననఁగా ఋతుకాలమందు స్త్రీసంగము జేసినచో గర్భమగునని యూహగల్గును గనుక నపుడు స్నానము విధింపఁబడినది. ఋతుకాలము గానియెడనైనచో మూత్రపురీషోత్సర్గ మందువలె శుద్ధి మాత్రము జేసుకొనవలెనని యున్నందున నట్లు శుద్ధిజేసుకొని యాచమనము జేయవలెను. ఆచమనము జేయక మూత్రపురీషోత్సర్గమైనచో ప్రాయ శ్చిత్తము. శ్లో॥“తైలాభ్యక్త స్త్వనాచాంతశ్మ శ్రు కర్మణిమైథునే, మూత్రోచ్చారం యదాకుర్యా దహోరాత్రేణ శుద్ధ్యతి”అని. అనఁగా తైలాభ్యంగము జేసుకొనునపుడు క్షౌరమందును మైథునమందును మూత్రోత్సర్గము జేయునపుడు నాచమనమును జేయనిచో నొకయుపవాసము జేయవలెనని “శయనాదుత్థితానారీ శుచి స్స్యాద శుచిః పుమాన్” అని యున్నందున స్త్రీకి స్నానమక్కరలేదు. ఇట్లు గర్భాధానాద్యుపయోగి నిర్ణయము.

## నారాయణబలి

ఇట్లు గర్భాధానము జేసినను గర్భోత్పత్తి కాకున్నను మృతాపత్యత గల్గినను నట్లు ప్రతిబంధకమైన ప్రేతోపద్రవము నివర్తించుటకై నారాయణబలియు నాగ బలియుఁ జేయునది. అందు నారాయణబలి శుక్లైకాదశి యందుగాని పౌర్ణమాసి యందుగాని చేయవలెను. దాని ప్రయోగము పరిశిష్టస్మృత్యధిసారము ననుసరించి కౌస్తుభమందుఁ జెప్పఁబడినది. శుక్లైకాదశియందు నదీతీరముగాని దేవాలయమున గాని దేశకాలముల నుచ్చరించి “మదీయ కులాభివృద్ధి పతిబంధక ప్రేతస్య ప్రేతత్వ నివృత్త్యర్థం నారాయణబలిం కరిష్యే” యని సంకల్పించి విధిగా స్థాపించిన కలశ ద్వయమందు స్వర్ణాదులచే నిర్మింపఁబడిన ప్రతిమలుంచి విష్ణునివైవస్వతయముని నావాహనముజేసి పురుషసూక్తము చేతను ‘యమాయసోమ’ మను మను మంత్రము చేతను గ్రమముగ షోడశోపచారములచే బూజింపవలెను. గొందరు కలశములై దుంచి వానియందు బ్రహ్మ విష్ణు శివయమ ప్రేతలను పూజింతురు. వారికిఁ దూర్పుగా రేఖయందు దక్షిణాగ్రములుగా దర్భలువేసి “శుంధంతాం విష్ణురూపీప్రేతః” అని పది స్థానములందు దక్షిణసమాప్తిగ నుదకము విడిచి మధు ఘృత తిలయుక్తములైన పది పిండములను “కాశ్యపగోత్ర దేవదత్త ప్రేత విష్ణుదైవత, అయంతే పిండః” అని దక్షిణాభిముఖుఁడై యపసవ్యముతో నెడమకాలు ముణుకువంచి తర్జన్యంగుష్ఠ మధ్యమునుండి పిండము విడువవలెను. గంధాదులచేఁ బూజించి ప్రవాహణాంతము జేసి విసర్జింపవలెను. ఆ రాత్రి యందే ‘శ్వఃకరిష్యమాణ శ్రాద్ధేక్షణః క్రియతాం’ అని యొకరినిగాని ముగ్గురినిగాని యైదుగురినిగాని విప్రులను నిమంత్రించి యుపవాస ముతో జాగరము చేయవలెను. మరునాఁడు మధ్యాహ్నమందు విష్ణుని పూజించి విష్ణురూపుఁడైన ప్రేతనుగాని బ్రహ్మ విష్ణు శివ యమ ప్రేతలనుగాని యుద్దేశించి యేకోదిష్టవిధిచే పాదప్రక్షాళనము మొదలు తృప్తి ప్రశ్న పర్యంతము జేసి రేఖాకరణము మొదలుకొని యవనేజనము పర్యంతము మంత్ర మక్కరలేకుండఁగజేసి “విష్ణవే బ్రహ్మణే శివాయ యమాయస పరివారాయచ” అని నామమంత్రములచే నాల్గు

పిండములిచ్చి విష్ణురూపమందు ప్రేతను ధ్యానింపుచు "కాశ్యప గోత్ర దేవదత్త విష్ణు రూపప్రేత అయంతేపిండః" అని యైదవ పిండము నిచ్చి అర్చనాది ప్రవాహణాం తముఁ జేసి ఆచమనము జేసిన బ్రాహ్మణులకు దక్షిణలిచ్చి అందు గుణవంతుఁడు శ్రేష్ఠుఁడనితోఁచిన యొక బ్రాహ్మణునికి ప్రేతబుద్ధిచే నాభరణ వస్త్రాదులనిచ్చి యంద రకు నమస్కారము చేయునది. 'భవం తః ప్రేతాయతిలాంజలి దానంకుర్వంతు' అని ప్రార్థించినపైని వారు పవిత్రములు ధరించి కుశతిలతులసీయుక్తమైన జలాంజ లులను "ప్రేతాయ కాశ్యప గోత్రాయ విష్ణురూపిణేయం జలాంజలిః" అని యీవలెను. "అనేన నారాయణ బలినాభగవాన్ విష్ణురిమం దేవదత్తం ప్రేతం శుద్ధమ పాపమర్హం కరోతు" అని బ్రాహ్మణులు దానునుపలికి విసర్జింపవలెను. అటుపైని స్నానముజేసి భుజింపవలెనని నిర్ణయసింధువునందు విశేషము. ఎట్లనిన! అయిదు కలశములందు బ్రహ్మ విష్ణు శివయమ ప్రేతలను స్వర్ణరౌప్య తామ్రలోహమయములగు ప్రతిమలం దును దర్భ ప్రతిమ యందును గ్రమముగ బూజించి అగ్నిని ప్రతిష్ఠించి శ్రపితమైన చరువును పురుషసూక్తముచే నారాయణునికి బదియారాహుతులవేల్చి దశపిండాంత మందు పురుషసూక్తముచే నభిమంత్రించిన శంఖోదకముచే ప్రేతను ప్రతి బుక్కునకు నభిషేకము చేయునది. విష్ణ్వాదులు నలుగురికిఁ బలిదానము జేయునది. మరునాఁ డు "ఏకోద్దిష్టవిధినా శ్రాద్ధ పంచకం కరిష్యే" యని సంకల్పించి విప్ర పంచకమునకు బాద్యాది పిండదానాంతము జేసి తర్పణాదికము చేయవలెను. తక్కినది మీఁదఁ జెప్పినటులనే తెలియవలెను.

## నాగబలి

అదిదర్శయందుగాని పూర్ణిమయందుగాని పంచమియందుగాని యాశ్రేషతో గూడిన నవమియందుగాని చేయవలెను. అందు ముందు సభకు ప్రదక్షిణముజేసి నమస్కరించి గోవృషభ నిష్క్రయ ద్రవ్యమునుంచి "సభార్యస్యమమేహజన్మని జన్మాంతరే వాజాత సర్వవధదోష పరిహారార్థం ప్రాయశ్చిత్తముపవిశంతు భవంతః. సర్వేధర్మ వివక్తారః" అని ప్రార్థింపఁగా సభ్యులు "చతుర్దశకృచ్ఛ్ర ప్రాయశ్చిత్తే నాముక ప్రత్యా మ్నాయ ద్వారా పూర్వోత్తరాంగ సహితే నాచరితేనత, వశుద్ధిర్భవిష్యతి" యిన యుప దేశించిన పైని దేశకాలము లుచ్చరించి "పరిషదుపదిష్టం చతుర్దశకృచ్ఛ్ర ప్రాయశ్చిత్త మముక ప్రత్యామ్నాయే నాహమాచరిష్యే". యని సంకల్పించి క్షౌరము మొదలగు విధిచే నది యాచరింపవలెను. వపనము సంభవింపనిచో ద్విగుణముగ కృచ్ఛ్ర ప్రత్యామ్నాయము "సర్వవధదోష పరిహారార్థ మిమం లోహదండం సదక్షిణం తుభ్య మహం సంప్రదదే" యని లోహదండమిచ్చి గుర్వనుజ్ఞనొంది గోధూమము వ్రీహి ధాన్యము తిలలువీనిలో నొకదానిపిండిచే సర్పప్రతిమఁజేసి చేటలోనుంచి సర్పమును ప్రార్థింపవలెను. "శ్లో॥ ఏహి పూర్వమృతస్సర్ప అస్మిన్ పిష్టేసమావిశ, సంస్కారార్థ మహంభక్త్యా ప్రార్థయామి సమాహితాః."అనఁగా పూర్వము నాచే జంపఁబడిన యో సర్పమా! దీనియందు ప్రవేశింపుము. నిన్ను సంస్కరించెదనని యావాహనాది షోడశోపచారములచే బూజించి 'భోసర్ప అముంబలిం గృహాణమమాభ్యుదయంకురు'

అని బలినిచ్చి పాదములు గడిగికొని యాచమనము జేయవలెను. దేశకాలము లుచ్చరించి "సభార్య స్యమమేహజన్మని జన్మాంతరేవా జ్ఞానాదజ్ఞానా ద్వాజాతసర్ప వధోత్థదోష పరిహారార్థాం సర్ప సంస్కార కర్మకరిష్యే" యని సంకల్పించి "చక్షుషీ ఆజ్యనేతి" మంత్రాంతమందు అగ్ని యందగ్ని వాయు సూర్యులను ఆజ్యము చేతను సర్పముఖమం దాజ్యముచే ప్రజాపతిని వేల్చి "ఆజ్యశేషణ సర్పం సద్యో యక్ష్యే" యని సమిదాధానము చేసి యగ్ని కాగ్నేయదిక్కున ప్రోక్షించిన ప్రదేశమందు చితిపేర్చి యగ్నిని చితినిపరిసమూహనముజేసి యాగ్నేయాగ్రములుగ దర్భలచే పరిస్తరణముజేసి పరిషేచనముజేసి షట్పాత్రాసాదనము మొదలగుగ జేసి "చక్షుషీహత్వా"సర్పమును చితియందెక్కించి జలమును శ్రోత్రమును స్పృశించి యగ్నియందు "భూస్వాహా అగ్నయ ఇదం." అని మొదలుగ వ్యాహృతిత్రయముచే నాజ్యాహుతులనిచ్చి సమస్త వ్యాహృతులతో నాల్గవ యాజ్యాహుతిని సర్పముఖమునందు వేల్చవలెను. ఆజ్య శేషమును స్రువముచేతనే సర్పము దేహమందు జల్లవలెను. ఇక్కడ స్విష్టకృత్తు మొద లగు శేషములేదు. చమసజలములచే సమస్త వ్యాహృతుల నుచ్చరింపుచు హస్తముచే సర్పమును ప్రోక్షించి "ఆగ్నేరక్షాణోవసిష్ఠోగ్నిర్గాయత్రీ సర్పాయాగ్నిదానే వినియోగః" అగ్నే రక్షాణోబుక్ అని యాబుక్కును బంధించి మరి యుపస్థానమంత్రమును "నమోఽస్తు సర్వేభ్యోయేకీచ పృథివీమను, యే అంతరిక్షేయేదివితేభ్య స్సర్వేభ్యోనమః యెందోరోచనేదివోయేవా సూర్యస్యరశ్మిషు, యేషామప్సుసదఃకృతంతేభ్య స్సర్వేభ్యో నమః యా ఇషవోయాతుధానానాం యేవావనస్పతీగ్ంరను, యేవావటేషు శేరతే తేభ్యస్సర్వేభ్యో నమః త్రాహి త్రాహి మహాభోగిన్ సర్పోపద్రవదుఃఖత, సంతతిం దేహి యే పుణ్యాం నిర్దుష్టాం దీర్ఘదేహినీం, ప్రపన్నం పాహిమాం భక్త్యా కృపాళో దీనవత్సల, జ్ఞానతో జ్ఞానతోవాఽపి కృతస్సర్పవధోమయా, జన్మాంతరే తథైతస్మిన్ మత్పూర్వై రథవావిభో, తత్పాపం నాశయక్షిప్ర మపరాధం క్షమస్వమే, ఇతి సంప్రార్థ్య నాగేంద్రం స్నాత్వా గత్యతతః పునః" అని. అనఁగా సర్వలోకములందు సర్వస్థానము లందుండు సర్పములకునమస్కారము. ఓ మహాసర్పమా! నన్ను సర్పోపద్రవ దుః ఖము నుండి తొలగించుము. దీర్ఘాయుష్యముగల పవిత్రమైన సంతతి నాకిమ్ము. జన్మాంతరమందుగాని యీ జన్మమందుగాని జ్ఞానాజ్ఞానములతో నాచేగాని నా పూర్వు లచేగాని సర్పవధ చేయఁబడినది దానిని క్షమింపుమని ప్రార్థించి స్నానము చేయ వలెను. అటుపైని వ్యాహృతులచే క్షీరము నేయి అగ్నిపై ప్రార్థించి సర్పము హుతము కాగానే జలముచే జల్లార్పవలెను. సవ్యముచేతనే సర్ప సంస్కార కర్మయు జేయవలెను. అస్థిసంచయన మక్కరలేదు. స్నానముచేసి యాచమనముపైని గృహమునకురావలెను. భార్యతోగూడ దనకు త్రిరాత్రమాశౌచము బ్రహ్మచర్యమునుగావలెను. నాల్గవదిన మందు సచేలస్నానముజేసి ఘృతపాయసభక్ష్యములతో బ్రాహ్మణ భోజనము చేయ వలెను. అది యెట్లనిన–"సర్పస్వరూపిణే...బ్రాహ్మణాయ ఇదం పాద్యం, అనంత స్వరూపిణే య ఇదం పాద్యం, శేషస్వరూపిణఇదం పాద్యం, కపిల స్వరూపిణ ఇదం పాద్యం, నాగస్వరూపిణే ఇదం పాద్యం, కాలికస్వరూపిణే ఇదం పాద్యం, శంఖపాల

స్వరూపిణే ఇదం పాద్యం, భూధరస్వరూపిణే బ్రాహ్మణ ఇదం పాద్యం" అని యెన మంత్రము బ్రాహ్మణులకు బాద్యమిచ్చి తవ పాదములఁ గడిగికొని యాచమనముజేసి "సర్పస్వరూపిణే బ్రాహ్మణాయ ఇదమాసనం" అని యాసన మీయవలెను. ఇట్లనంతా దులైన విప్రులకు నెఱుంగునది. అటుపైని "సర్పస్థానేక్షణః క్రియతా"మ్మని మొదలగు నర్చనము "ఓం తథా, ప్రాప్నోతుభవాన్, ప్రాప్నవాని, భోసర్ప ఇదంతే అర్ఘ్యం"అని ఇట్లు సర్పాదులెనమంత్రకు నూహించునవి. ఇట్లు పుష్పధూపదీప వస్త్రాదిక మిచ్చి అన్నము వడ్డించి ప్రోక్షించి "సర్పాయ ఇదమన్నం పరవిష్టం పరివేష్యమాణంచ దత్తం దాస్యమానంచ ఆతృప్తే రమృతస్వరూపేణ స్వాహా సంపద్యతాం న మమ" యని సర్పాదులెనమంత్రకునిచ్చి వారు భుజించి యాచమనముజేసిన పైని 'భోసర్ప అయంతే బలి' అని మొదలుగు నామమంత్రముచే బలిదానము ఆ పిండముల యందు వస్త్రాది పూజయుఁ జేయునది. ఈ సర్వము సవ్యముచేతనే కావలెను. విప్రులకు తాంబూలదక్షిణలిచ్చి యాచార్యుని బూజించి కలశమందు సువర్ణనాగమును నావాహనాది షోడశోపచారములచే బూజించి ప్రార్థించవలెను. శ్లో॥ బ్రహ్మలోకేచ యే సర్పా శ్శేషనాగపురోగమాః, నమోస్తుతేభ్య స్సుప్రీతాః ప్రసన్నాస్సంతుతే సదా. విష్ణులోకేచ యే సర్పా వాసుకి ప్రముఖాశ్చయే, నమోస్తుతేభ్య స్సుప్రీతాః ప్రసన్నాస్సం తుతే సదా. రుద్రలోకేచయే సర్పాస్తక్షక ప్రముఖాశ్చయే నమోస్తుతేభ్య స్సుప్రీతాః ప్రసన్నాస్సంతుతే సదా. ఖాండవస్యతథా దాహే సర్గంయేచ సమాశ్రితాః నమోస్తుతేభ్య స్సుప్రీతాః ప్రసన్నాస్సంతుతే సదా. సర్పసత్రేచయే సర్పా ఆస్తికే న చ రక్షితాః, నమోస్తు తేభ్య స్సుప్రీతాః ప్రసన్నాస్సంతుతే సదా. మలయేచైవయే సర్పాః కర్కోటక ముఖాశ్చయే నమోస్తుతేభ్య స్సుప్రీతాః ప్రసన్నాస్సంతుతే సదా. ధర్మలోకేచయే సర్పావైతరణ్యాం సమాశ్రితాః నమోస్తుతేభ్య స్సుప్రీతాః ప్రసన్నాస్సంతుతే సదా. యేసర్పా పర్వతీయేషు దదీ సంధిషు సంస్థితా, నమోస్తుతేభ్య స్సుప్రీతాః ప్రసన్నాస్సంతుతే సదా. గ్రామేవాయది వారణ్యే యేసర్పాః, ప్రచరంతిహి, నమోస్తుతేభ్య స్సుప్రీతాః ప్రసన్నాస్సంతుతే సదా. పృథివ్యాం చైవయే సర్పాయేసర్పా బలిసంస్థితాః, నమోస్తుతేభ్య స్సుప్రీతాః ప్రసన్నాస్సంతుతే సదా. రసాతలేచ యేసర్పా అనంత్యామహాబలా నమోస్తు తేభ్య స్సుప్రీతాః ప్రసన్నాస్సంతు తే సదా" అని అనఁగా బ్రహ్మ విష్ణు రుద్రలోకము లందుండు ననియు, ఖాండవ వనదాహమందు స్వర్గము నొందుననియు, సర్పయాగమందాస్తికు నిచే రక్షింపఁబడినవియు, మలయమందును ధర్మలోకములో వైతరణియందును గ్రామములలో నరణ్యములలో భూలోకమునను పాతాళలోకమునను పర్వతగుహలను సంచరించుననియు నైన సర్పముల కన్నిటికి నమస్కారము. నాయందు ప్రసన్నములు కావలెనని ప్రార్థించి దేశకాలము లుచ్చరించి "కృతస్యసంస్కార కర్మణస్సాంగతా సిద్ధ్యర్థ మిమం నాగం సౌవర్ణం సకలశం స వస్త్రం సక్షిణం తుభ్యమహం సంప్రద దేనమమ. అనేన స్వర్ణనాగదానేన అనంతాదయో నాగదేవతాః ప్రీయతా"మ్మని నాగదాన మిచ్చి యాచార్యునికి గోదాన మీయవలెను. "యస్యస్మృత్యాచ నామోక్త్యా తపోహోమ క్రియాదిషు, న్యూనం సంపూర్ణతాం యాతి సద్యోవందే తమచ్యుతం.

మయాకృతం సర్ప సంస్కారాఖ్యం కర్మతద్భవతాం విప్రాణాం వచనాత్పరమేశ్వర ప్రసాదత్సర్వం పరిపూర్ణమస్తు" అని యుచ్చరించి ప్రార్థింపఁగా "తథాస్తు" అని బ్రాహ్మణులనవలెను. సాంగతా సిద్ధికై బ్రాహ్మణులకు భోజనము దక్షిణయు నీవలెను. "కృత్వాసర్పస్య సంస్కార మనేన విధినా నరః, విరోగోజాయతే క్షిప్రం సంతతిం లభతే శుభాం." అనఁగ నీ పూర్వోక్త ప్రకారముగ సర్ప సంస్కారముఁజేయువానికి మహారోగమైనను శీఘ్రముగ నివర్తించును. శుభమైన సంతతియు గలుగును.

## హరివంశ శ్రవణాది విధానము

ఇట్లు చేసినప్పటికిని పుత్రోత్పత్తిలేనిచో గర్మవిపాకోక్తమైన హరివంశ శ్రవణాది కము విధిచొప్పున జేయవలెను. అదియు నారుసంవత్సరములుగాని నాల్గుగాని మూఁడుగాని యొకటిన్నరగాని సంవత్సరముగాని ప్రాయశ్చిత్తము జేసికొని చేయ వలెను. అందు ముప్పది కృచ్ఛ్రములు సంవత్సర మనఁబడును. కృచ్ఛ్రమనఁగ పండ్రెండు దినములు చేయవలసిన దీక్ష. అదియెట్లనిన; ప్రథమదినమందు మధ్యాహ్న మందు మాత్రమే భోజనము ఏక భక్త మనఁబడును. అదియును నిరువదియారు కబళమునే భుజింపవలెను. రెండవదినమందు రాత్రియందే యిరువది రెండే కబళ ములు భుజించునది. మూఁడవదినమందయాచితము యొక్క యిరువది నాల్గు కబళములే భుజింపవలెను. నాల్గవదినమునం దుపవాసమే. ఇట్లు చేసినచో పాద కృచ్ఛ్రము. ఇది యెట్లైనను మూఁడురెట్లు అయినచో బ్రాజాపత్య కృచ్ఛ్రము. రెండేసి ఏకభక్తములు నక్తములు అయాచితములును రెండుపవాసములునైనచో నర్ధకృచ్ఛ్రము. లేదా మూఁడు రోజుల యాచితము మూఁడుపవాసములైనచో నర్ధకృచ్ఛ్రము. ఏకభక్త నక్తాయాచితోపవాసము లెటులైన ముమ్మారైనచో పాదోనకృచ్ఛ్రము వీటిలో తొమ్మిది దినముల భోజనము ప్రాప్తించు నాదినముల గ్రాసనియమ మానిచే రెండన్నము మాత్రము భక్షించినచో నతికృచ్ఛ్రము. ఒక గ్రుక్కెడైనను ప్రాణధారణము మాత్రమున కైనను దుగ్ధముద్రావుచు నిరువదియొక దివసమున్నచోఁ గృచ్ఛ్రతికృచ్ఛ్రము. ఒకదిన మందు కుశోదకముతో పంచగవ్యము భక్షించుట. ఒక యుపవాసము జేసినచో రెండు దినములు చేయవలసిన సాంతవన కృచ్ఛ్రము. ఆవుయొక్క పాలు, పెరుగు, నేయి, మూత్రము, పేడ, కుశోదము నొక్కొక్కటి యొక్కొక్క రోజున భుజించి తుది నొకయుపవాసముఁ జేయుచో సప్తాహసాధ్యమైన మహాసాంతపనకృచ్ఛ్రము మూఁ డు రోజులు మీఁదఁజెప్పిన గోవుసంబంధమైన యైదువస్తువులు సమభాగములుగ గలిసి భుజించినచో అతి సాంతపనకృచ్ఛ్రము, వేడిగల్గిన ఘృతము క్షీరము జలము నొక్కొక్కటి యొక్కక్కరోజున క్రమముగ భుజించి పైని మూఁడుపవాసములు చేసినచో దప్తకృచ్ఛ్రమనఁబడును. అవియె చల్లారినపైని ద్రావినచో శీతకృచ్ఛ్రము. పండ్రెండు రోజులు వరుసగ నుపవాసములు చేయుచో పరాక కృచ్ఛ్రము. పక్షాంతరమున దప్తములైన ఘృతక్షీరజలముల మూఁడుదినములు భుజించి యొకయుపవాసము జేయ నాల్గుదినములచే దప్త కృచ్ఛ్రము. శుక్లపక్షమందు ప్రతిపత్తు మొదలగు తిథు లందు నెమలిగ్రుడ్డు పరమితిగల యొక్కొక్కబలము రెంట్టింపుచు భుజించినచో పూర్ణిమ

యందు పదునైదు గ్రాసములగును. దినక్షయమందు బదునాలుగే యగును. దినవృద్ధి యందు బదియారగును. అటుపైని కృష్ణపక్షమందొక్కొక్క గ్రాసమును తగ్గించినచో ప్రతిపద యందుఁ బదునాల్గు గ్రాసములును దర్శయం దుపవాసమును సిద్ధించును. ఇట్లు మాససాధ్యమై యవమధ్య చాంద్రాయణ మనఁబడును. ఇఁక కృష్ణపక్ష ప్రతిపద యందు పదునాల్గు గ్రాసములు భుజించి ప్రారంభించి యొక్కొక్క గ్రాసము నిత్యము తగ్గించుచు దర్శయం దుపవాసముచేసి శుక్లపక్షమందొక్కొక్క గ్రాసమును వృద్ధిఁ జేసినచో గృష్ణాదిశుక్లాంతమగు నిది పిపీలికామధ్య చాంద్రాయణము. ఈ కృచ్ఛ్ర చాంద్రాయణాది వ్రతములందు గాలత్రయమందును స్నానము గ్రాసము నభి మంత్రించుట మొదలగు విధితోగూడిన ప్రయోగము ప్రాయశ్చిత్త ప్రకరణములో జెప్పఁబడును. అతి కృచ్ఛ్రాదిలక్షణము బ్రసంగముఁబట్టి చెప్పఁబడినది. సంవత్సర సంఖ్యకు ప్రాజాపత్య కృచ్ఛ్రములే కావలెను. ఇఁక వీనికి ప్రతినిధులు చెప్పఁబడును.

## ప్రాజాపత్య ప్రత్యామ్నాయములు

1. పదివేలు గాయత్రీజపము 2. గాయత్రిచే వేయుమారులు తిలఘోమము 3. కొన్ని గ్రంథములలో వ్యాహృతులచే నట్టి తిలలే హోమము. 4. రెండువందలు ప్రాణాయామములు. 5. పంద్రెండుగురు బ్రాహ్మణులకు భోజనము పెట్టుట. 6. కొప్పు తడియారుపర్యంత ముండుచు దిరుగదిరుగ పంద్రెండుమారులు తీర్థమందు స్నానములు చేయుట. 7. వేదసంహితాపారాయణము 8. ఒకయామడ వెల్లుట. 9. పంద్రెండువేల నమస్కారములు 10. నూట ముప్పది రెండుమారులు ప్రాణాయా మములు చేసి యొకదిన ముపవలసించి ప్రాఙ్ముఖుఁడై నిలువఁబడుట. 11. గోమూత్ర ముతో లత్తుక భక్షించినచో నేకాహిక కృచ్ఛ్రము. 12. రుద్రము పదునొకండుమారులు జపించిన కృచ్ఛ్రమగునని కొందరు. 13. పావకేష్టి 14. పావమానేష్టి 15. ఆ రుపవాసములు. ఇవి ప్రాజాపత్య ప్రత్యామ్నాయములు. ఉపవాసమున కేక విప్ర భోజనము. అత్యశక్తిలో సహస్ర గాయత్రీ జపము గాని పంద్రెండు ప్రాణాయామములు గాని చేయవలెనని స్మృత్యర్థసారము.

## ప్రాజాపత్యము

శ్లో॥॥ప్రాజాపత్యేష్వశక్తస్తు ధేనుం దత్యాత్పయస్వినీం, ధేనోరభావే నిష్కంస్యాత్త దర్ధం పాదమేవవా." అనగా నశక్తుఁడు ప్రజాపత్యమునకు ప్రతినిధిగ మంచి పాలావును దానము చేయునది. లేదా దానిమూల్యము నిష్కముగాని యందులో సగముగాని నాల్గవభాగముగాని సువర్ణమైనను రజతమైనను నీవచ్చును. ఎనుబది గురిగింజల యెత్తు కర్షము నాల్గుకర్షములు నిష్కము. అత్యశక్తుఁడు నిష్కపాదమునకుఁ దగిన ఖరీదైనను అందులకుఁ దగిన ధాన్యాదికమైన నీవచ్చును. అతికృచ్ఛ్రమునకుఁ బ్రతినిధి గోద్వయము. సాంతపనకృచ్ఛ్రమునకును గోద్వయమే. పరాకకృచ్ఛ్రమునకును దప్తకృచ్ఛ్రమునకును మూఁడేసి గోవులు. కృచ్ఛ్రాతికృచ్ఛ్రములకు గోచతుష్టయముగా వచ్చును. చాంద్రాయణమున కెన్మిదిగాని యైదుగాని నాల్గుగాని మూఁడుగాని గోవులు

ప్రతినిధి. మాసముపయోవ్రతమందును యావకవ్రతమందును మాసోపవాసమం దును నైదేసి గోవులు. మాసము గోమూత్ర యావకవ్రతమందారుగోవులు.

## ప్రాయశ్చిత్త ప్రయోగము

సచేలస్నానముజేసి సమర్థుండైనచో తడిబట్టలతోడనే సభ్యుల యెదుట గో నిష్క్రయ ప్రత్యామ్నాయమైన నిష్కాది పరిమిత ద్రవ్యమును బ్రహ్మదండమునుగా నుంచి, సాష్టాంగప్రణామముజేసి సభకు ప్రదక్షిణము జేయవలెను. శ్లో॥"సర్వే ధర్మ వివేక్తారో గోప్తార స్సకలాద్విజాః, మమ దేహస్య సంశుద్ధిం కుర్వంతు ద్విజసత్తమాః మయాకృతం మహాఘోరం జ్ఞాతమజ్ఞాతకిల్బిషం,ప్రసాదఃక్రియతాం మహ్యాం శుభానుజ్ఞాం ప్రయచ్ఛథ, పూజ్యైః కృతపవిత్రోహం భవేయం ద్విజసత్తమాః, మామను గృహ్ణంతు భవంతః" అని ప్రార్థించవలెను. అనఁగా ధర్మమును విమర్శించి రక్షించు బ్రాహ్మణోత్తములు నాచే జ్ఞానాజ్ఞానములచే ఘోరమైన పాపము చేయఁబడినది గనుక నాయందనుగ్రహించి నేను పవిత్రుఁడనగు నట్లనుజ్ఞను మీరు దయసేయుఁ డని యనుట. అనంతరమందు నీకార్యమేమని సభ్యులు సత్యముగఁ జెప్పుమనఁగ దనపా మును వారితో జెప్పవలెను. అటుపైని నాచేతగాని నాభార్యచేతగాని యీ జన్మమందో, లేక జన్మాంతరమందో సంతానము కలుగకుండుటకును కలిగియు మృతినొందుట కును హేతువైన బాలఘాతము విప్రధనాపహారము మొదలగు దుష్కృ తము చేయఁ బడియున్నది. దాని నశింపఁజేయుటకు నేజేయు హరివంశ శ్రవణాదిక మందు కర్మవిపాకోక్తవిధిచే నా కధికారము సిద్ధించుటకును దీర్ఘాయుష్మత్పుత్రాది సంతతి కలుగుటకును ప్రాయశ్చిత్త ముపదేశింపుఁడని ప్రార్థించునది. ఆపైని సభ్యులును పాపిచే బూజితుఁడైన యనువాదకునితో నారు సంవత్సరములుగాని మూఁడుగాని సంవత్సరమున్నరగాని యొకసంవత్సరముగాని ప్రాయశ్చిత్తము పూర్వ మందు జేసుకొని పూర్వోత్తరాంగములతో నట్లుజేసిన కృతార్థుఁడవగుదువని చెప్పుమని పలుకగా నాయనువాదకుఁ డతనితో జెప్పునది. అటుపైని కర్తయగు నాతఁడు "ఓం" అని యంగీకరించి సభ్యుల వీడ్కొని దేశకాలము లుచ్చరించి, "మమ సభార్య స్యైతజ్జన్మజన్మాంతరార్జితాన పత్యత్వ మృతాపత్యత్వాది నివాసభూత బాలఘాత విప్ర రత్నాపహారాది జన్యదురితసమూల నాశక కర్మవిపాకోక్త విధినాధి కారసిద్ధిద్వారా దీర్ఘాయుష్మద్బహుపుత్రాది సంతతి ప్రాప్తయేషడ్ద్ర్యబ్దం సార్ధాబ్దమబ్దం వా ప్రాయశ్చిత్తం పూర్వోత్తరాంగ సహితమముక ప్రత్యామ్నాయే నాహమాచరిష్యే" యని సంకల్పించి సాయంకాలమున కేశనఖలోమాదుల క్షౌరముజేసుకొని స్నానముజేసి శ్లో॥ "ఆయుర్బ లం యశోవర్చః ప్రజాపశు వసూనిచ, బ్రహ్మప్రజ్ఞాం చ మేధాంచ త్వం నోదేహి వనస్పతే." అను మంత్రము నుచ్చరింపుచు విధించినపుల్లచే దంతధావనము చేయు నది. అటుపైని పదివిధములైన స్నానములు. అందు-

## భస్మస్నానము

"ఈశానాయనమ యని శిరమునందును, తత్పురుషాయ నమః యని ముఖమునను, అఘోరాయ నమః యని హృదయమునను, వామదేవాయ నమః

యని గుహ్యమునను, సద్యోజాతాయ నమః యని పాదములందును, ప్రణవముచే సర్వాంగములందును భస్మముఁ బూసుకొనునది. ఈశానాదిపదములతోగూడిన మంత్రములతోనైనను భస్మలేపము కావచ్చును.

## గోమయస్నానము

గోమయము దీసుకొని ప్రణవముచే దిక్కుల దక్షిణభాగమునను తీర్థమున కుత్తరభాగమునను గొంతజిమ్మి శేషమును, మానస్తోకయను మంత్రముచే నభి మంత్రించి, గంధద్వారా మనుమంత్రమున సర్వాంగమును బూసి హిరణ్యశృంగ మను రెండు ఋక్కులచే ప్రార్థించి యఃపోత యను ఋక్కుచే దీర్థము స్పృశించి స్నానముజేసి రెండుమారులాచమనము జేయునది.

## మృత్తికా స్నానము

శ్లో॥"అశ్వక్రాంతే రథక్రాంతే విష్ణుక్రాంతే వసుంధరే, శిరసాధారయిష్యామి రక్షస్వమాం పదేపదే." అని మృత్తిక నభిమంత్రించి, "ఉద్ధృతాసివరాహేణ కృష్ణేన శతబాహునా, మృత్తికే హరమే పాపం యన్మయాదుష్కృతం కృతం." అను మంత్ర ముతో మృత్తికఁదీసుకొని నమోమిత్రస్య యనుమంత్రముతో సూర్యునికిఁ జూపి, గంధద్వార మనుమంత్రముచేగాని స్యోనాపృథివీ యను మంత్రముచే గాని, ఇదం విష్ణుః అను మంత్రముచేగాని శిరసు మొదలు సర్వాంగముల బూసుకొనవలెను. రెండుమారు లాచమనము జేయునది.

## జలస్నానము

శ్లో॥"ఆపో అస్మాన్మేత్యుక్త్వా భాస్కరాభి ముఖస్థితః ఇదం విష్ణు ర్జపిత్వా చ ప్రతి స్రోతోని మజ్జతి"అనఁగా ఆపో అస్మాన్ అని యుచ్చరించి సూర్యాభిముఖుఁడై ఇదం విష్ణుః అను మంత్రము జపించి ప్రవాహమున కెదురుగ మునుగవలెను. అనంతరమున పంచగవ్యములచే బ్రత్యేక మొక్కక్కదానితో నొక్కొక్క మారును గుశోదక ముచే నొకమారును సమంత్రకముగ స్నానముజేసి స్నానాంగతర్పణాదికముఁ జేయ వలెను. విష్ణుశ్రాద్ధమును బూర్వాంగ గోప్రదానమునుజేసి యగ్నిని ప్రతిష్ఠాపించి పంచగవ్యములచే హోమము వ్యాహృతులచే నూటయెనిమిది మారులును నాజ్యముచే నిరువదెనిమిదిమారులును హోమముజేసి వ్రతంగ్రహీష్యే యని విప్రులఁబ్రార్థించి హోమముచేయగా మిగిలిన పంచగవ్యమునుఁ ద్రావవలెను. అపుఁడు ప్రణవ ముచ్చ రించవలెను. ముఖ్యప్రాయశ్చిత్త కృచ్ఛ్రములను సంకల్పించిన రీతిచే జేసి వ్యాహృతు లచే నాజ్యహోమము విష్ణుశ్రాద్ధము గోదానము దిరుగఁజేయవలెను. ఈ యాజ్య హోమమందును పంచగవ్యహోమమందును నిధ్మాధానది స్థాలీపాకాంతమైన యితి కర్తవ్యతను కొందరు లేదనిరి. వ్యాహృత్యాజ్య హోమమందు పాపపహుఁడైన మహా విష్ణువు దేవతయని కొందరు. పంచగవ్యవిధియెట్లనిన; రాగిపాత్ర యందుగాని మోదు గాకు దొప్పలోగాని యెట్టిటి గోవు యొక్క మూత్ర మెనిమిది మిరుపగింజలయెత్తుగల దానిని గాయత్రీ నుచ్చరింపుచు దీసుకొని గంధద్వారా మనుమంత్రమున శ్వేతగోవు

పేడను పదియారు మాషములయెత్తు దీసుకొని, ఆప్యాయస్వయనుమంత్రముచే పచ్చని గోవుయొక్క పాలు పంౘెండు మాషములయెత్తును దధిక్రావ్ణః అను మంత్రముతో నీలపురంగు గోవుపెరుగు పదిమాషముల యెత్తును తేజోసి శుక్రమసి యను మంత్ర ములచే నల్లనియావునేయి యారుమాషములయెత్తును దీసుకొని యందు దేవస్యత్వా యను మంత్రముచే గుశోదకము నాల్గుమాషముల యెత్తుగలిపి ప్రణవము నుచ్చ రింపుచు మర్దించవలెను. ఇక్కడ మాషమనఁగ నైదు గురిగింజలయెత్తు. అట్టిపంచ గవ్యమును సాౖశ్రములైన యేడుదర్భలచే హోమము చేయవలెను. ఇరావతి యను మంత్రమున పృథివికిని, ఇదం విష్ణుః అనుమంత్రమున విష్ణువునకును, మానస్తోక యను మంత్రమున రుద్రునిని, శంనోదేవీః అని యుదకదేవతను, బ్రహ్మజ్ఞానం అను మంత్రమున రుద్రునిని, శంనోదేవీః అని యుదకదేవతను, బ్రహ్మజ్ఞానం అను మంత్రమున బ్రాహ్మణుని, అగ్నిని సోముని నామమంత్రముచేతనే సూర్యుని గాయత్రి చేతను ప్రజాపతే నత్వదిత్యాది మంత్రముచేనైనను సమస్త వ్యాహృతులచేనైనను ప్రజా పతిని, లేదా ప్రణవముచేనైన ప్రజాపతిని అగ్నిని స్విష్టకృత్తును నామముచేతనే యని యీ దేవతలను పంచగవ్యముచేతను నగ్ని వాయు సూర్య ప్రజాపతులనుగాని మహా విష్ణువునుగాని యాజ్యముచే నిరువదెనిమిది యాహుతులను వేల్చవలెనని యన్వా ధానము. స్త్రీ శూద్రులకు హోమమక్కరలేదు. బ్రాహ్మణునిచే హోమము జేయింప వలెనని కొందరు, స్త్రీ శూద్రులకు పంచగవ్యము ద్రావుట వికల్పమని మహార్ణము. విప్రునిచే జేయించి పంచగవ్యమును స్త్రీ శూద్రులు మంత్రవిధిలేకుండఁగ భక్షింప వచ్చునని స్మృత్యర్థసారము. ఈ ప్రాయశ్చిత్తవిధి కృచ్ఛ్రమునకు దక్కువయైన ప్రాయశ్చి త్తములలో నక్కరలేదు.కృచ్ఛ్రము మొదలు సర్వప్రాయశ్చిత్తములయందును జేయ వలయును. ఇట్లు కృచ్ఛ్రాదికముజేసి సూర్యారుణసంవాద మహార్ణవాది కర్మవిపాకోక్త మయిన హరివంశ శ్రవణము మొదలగు కర్మజేయవలెను.

## సంతతివృద్ధికై ప్రకారాంతరము

అందు శుభదినమందు దేశకాలముల నుచ్చరించి అనేక జన్మార్జితానపత్యత్వ మృతాపత్యత్వ నిదానభూత బాలఘాతనిక్షేపహరణ బ్రహ్మస్వాపహరణజన్య సమూల నాశ ద్వారాదీర్ఘాయుష్మ త్పుత్రాది సంతతి ప్రాప్తికామో హరివంశంశ్రోష్యామి యనియు దంపతు లిద్దరు చేయునెడ 'శ్రోష్యావః' అనియు సంకల్పించి గణేశపూజయు, స్వస్తి వాచనము నాందీశ్రాద్ధమును వినాయక శాంతియునుఁజేసి హరివంశ శ్రవణము నకుఁ జదివి వినుపించువాని నొకవిప్రున్ని వరించి వస్త్రాలంకారములచే బూజింప వలెను. అట్లు చదివెడు బ్రాహ్మణునకుఁ బ్రతిదినమందు నుపాయస్వాదుతో భోజన మిడవలెను. దంపతులు ప్రతిదినమందును "త్రాయంతాం"అని మొదలగు వైదిక మంత్రములచేతను సురాస్త్వా మిత్యాది పౌరాణమంత్రములచేతను సుస్నాతులై యలం కరించుకొని యేకాగ్రచిత్తులై వినుచు, తైలము తాంబూలము క్షౌరము మైధునము మంచముపై బండుకొనుటయు సమాప్తి పర్యంతము విడిచిపెట్టి హవిష్యము భుజింపు

చుండవలయును. అంతమందు వాచకునికి గోవును సువర్ణత్రయమునుగాని యొక సువర్ణమునుగాని దక్షిణనిచ్చి ప్రత్యవరోహమంత్రముచే వేయు తిలాజ్యాహుతులిచ్చి నూరుగురు బ్రాహ్మణులకుగాని యిరువదినాల్గు దంపతులకుగాని పాయసములో భోజన మిడవలెనని హరివంశ శ్రవణ ప్రయోగము.

## సంతతి వృద్ధికై విధానాంతరములు

"శ్లో. సౌవర్ణం బాలకం కృత్వా దద్యాడ్డోలా సమన్వితం, అథవా వృషభందద్యా ద్విప్రో ద్వాహన మేవవా, మహారుద్ర జపోవాஉపి లక్షపద్మైశ్శివార్చనం, స్వర్ణధేనుః ప్రదాతవ్యా సవత్సావా యథావిధి, ఘృతకుంభ ప్రదానం వా సంక్షేపాదిద మీరితం." అనఁగా సువర్ణమయమైన శిశుప్రతిమ నుయ్యలలోనుంచి దానముచేయుట, లేక వృషభదానము, లేదా బ్రాహ్మణునకు వివాహము చేయుట, మహారుద్రము జపించుట లక్షపద్మములచే శివునిఁబూజించుట, వత్సతోగూడ సువర్ణమయమగు గోవునిచ్చుట, ఘృతపూర్ణకుంభదానము ననునివి సంక్షేపముగ బ్రత్యామ్నాయములు. లేదా ప్రత్య హము పార్థివలింగపూజను జేయుచు నఖిలాషాష్టక స్తోత్రము కౌస్తుభమందుఁ దెలియు నది. ఇట్లు చేసినను ఫలము లభింపనిచో దత్త పుత్రుని గ్రహించునది.

## దత్తకునియందు (గ్రాహ్యాగ్రాహ్య విచారము)

బ్రాహ్మణులకు సోదర భ్రాతృపుత్రుఁడు ముఖ్యుఁడు గనుక ప్రథమమందు గ్రహింపఁదగును. అతఁడు లభింపనిచో సగోత్రసపిండుఁ డెవ్వఁడైనను సవతి సోద రుని పుత్రుఁడైనను గ్రహింపఁదగును. అతఁడును సంభవించినచో నసగోత్ర సపిం డుఁడు సమానగోత్రమునఁబుట్టినవాఁడు. తదభావమందసపిండుఁడై భిన్నగోత్ర మందు బుట్టినవాఁడును గ్రాహ్యుఁడు. అందు మేనల్లుఁడును, దౌహిత్రుఁడును వర్జింపఁదగినవారు. ఇట్లు విరుద్ధ సంబంధము భావింపవలసి వచ్చును. గనుక పుత్ర బుద్ధిజేయు కనర్హుఁడగు మేనమామయు నగ్రాహ్యుఁడు. కనుకనే సగోత్ర సపిండు లలో సోదరుఁడుగాని పినతండ్రిగాని గ్రాహ్యులు గారు. బ్రాహ్మణాది వర్ణము లకు సమానవర్ణుఁడే దత్తకుఁడు గావలెను అందునను దేశభేదముఁబట్టి ఘూర్జరత్వ మాంధ్రత్వము మొదలగు ధర్మములచే సమాన జాతీయుఁడే కావలెను. అట్లు గ్రహించు దత్తకునికి సోదరు లుండవలెను. అందు జ్యేష్ఠుని గ్రహింపను గూడదు. ఇవ్వను గూడదు. శూద్రునికి దౌహిత్రుఁడు మేనల్లుగూడ గ్రహింపఁదగుదురు. ప్రమాణ వచనములు. "శ్లో. భ్రాతౄణామేక జాతానా మేకశ్చేత్పుత్రవాన్ భవేత్ సర్వే తేతేన పుత్రేణ పుత్రిణో మనుర బ్రవీత్." అనఁగా నేకగర్భజనితులైన సోదరులలో నొకనికి బుద్రుఁడు గల్గినచో నా పుత్రనిచే "నాపుత్రస్య లోకోస్తి, త్రిభిర్బుణ వాజాయతే" యను శాస్త్రముచే బోధింపఁబడిన యపుత్రత్వ ప్రయుక్తదోషము తనకు రాదని తెలియ వచ్చుచున్నది. కాఁబట్టి పుత్ర సదృశుఁడగుటచే ముఖ్యుఁడని చెప్పఁబడినది. 'ముఖ్యా భావేతత్సదృశః ప్రతినిధిః' అను న్యాయము గూడ నిందులకు సహాయము. ఇఁక నట్లైనచో నావచనముచేతనే విధిగా పరిగ్రహింపకున్నప్పటికిని పుత్రత్వ మాతనికి

సిద్ధించునని శంకింపఁగూడదు అట్లైనయెడ నౌరసదత్తకాది పుత్రులకువలె నీతనికి నసఁగా పరిగ్రహింపని సోదరపుత్రకునికిని పత్నికంటె ముందే ధనహారిత్వము పిండ స్వత్వముగలుగుట యుచితము గనుక, విభక్తసోదరునికి “పత్నీ దుహితరశ్చైవ పితరౌ భ్రాతరస్తథా, తత్సుతో గోత్రజోబంధుః” అని వారసుదారులను జెప్పు క్రమవచనములో భ్రాత యనంతరము తత్పుత్రునియుంచుట కనుపపత్తి వచ్చును. కాఁబట్టి పత్నికంటె ముందుదనకు పిండదానమందును ధనగ్రహణమందు నధికారియొకఁడు కావలయు నని కోరికయున్నచో విధిగా స్వీకరించినవాఁడే యట్టి యధికారియగును. లేనిచో గాడనియు నట్టి కోరికలేనిచో పితృఋణాపాకరణము మొదలగు పరలోక కృత్యము నకు మాత్రమే దత్తపుత్రుఁ డక్కరలేదు. భ్రాతృపుత్రునిచేతనే యది సిద్ధించుననియు వచనతాత్పర్యము. కొన్ని దేశములలో వైదికవిధి యక్కరలేకుండనే దాతృప్రతిగ్రహీతల సమ్మతియు రాజపురుషాద్యనుమతి మొదలగు లౌకిక వ్యాపార మాత్రముచేతను నుపనయనాది సంస్కారములు చేయుట మాత్రముచేతను సగోత్రసపిండులయందు బుత్రత్వము వ్యవహరింపుచున్నారు. అట్లు ప్రమాణము గానరాదు. ఇట్లు “సర్వాసామేక పత్నీనా మేకాచేత్పుత్రిణీభవేత్, సర్వాస్తాన్తేనపుత్రేణ పుత్రిణ్యో మనురబ్రవీత్” అనఁ గా సవతులందఱిలో నొకతే పుత్రునిగన్నచో నా పుత్రునిచేతనే యందరుసవతులును పుత్రువతు లగుదురని చెప్పు మనువచనమునకును సవతి కొడుకు దత్తుఁడుగా స్వీకరింపకపోయినను దనకు పిండదానాద్యదికారి యైన పుత్రుఁడు కావచ్చును. గనుక సవతిపుత్రుఁ డున్నయెడ దాను దత్తునిచేసుకొన నక్కరలేదని తాత్పర్యము. “దౌహిత్రో భాగినే యశ్చ శూద్రాణాం విహితస్సుతః, బ్రాహ్మణాదిత్రయేనాస్తి భాగినేయ సుతః, క్వచిత్, నత్వేవైకంపుత్రం దద్యా త్ప్రతిగృహ్ణీయాద్వా, న జ్యేష్ఠం పుత్రం దద్యా దితి చ.” అనఁగా దౌహిత్రుని మేనల్లుని శూద్రులలో దత్తునిగ గ్రహించుట నగును గాని బ్రాహ్మణాదివర్ణత్రయమందును గూడదనియు ఒకఁడే పుత్రుఁడైనచో వాని నివ్వ గూడదు. స్వీకరింపను గూడదని జ్యేష్ఠపుత్రునివ్వగూడదనియు నర్థము. కాఁ బట్టి యౌరసులైన యనేక పుత్రులున్నచో బుత్రదానము చేయవలెనని విధింపఁబడి నది. కనుకనే దత్తకుని గ్రహించినపైని యౌరసుఁడు పుట్టినందున ననేక పుత్రుఁ డైనను నందు దత్తకునిగాని యౌరసునిగాని యొకరిక్విఁగూడగు. పతితో గూడియున్న స్త్రీ పత్యనుజ్ఞచే పుత్రుని గ్రహింపవచ్చును. తనకున్నయెడ నొకరికివ్వను వచ్చునుగాని భర్తనుమతిలేనిచో నట్లు చేయగూడదు. ఇట్లు పతివియోగము నొందిన స్త్రీయును భర్త జీవించియున్నపుడు నీవు దత్తుని గ్రహింపుమని యాజ్ఞ యిచ్చినచో గ్రహింప వచ్చును. స్పష్టముగ నట్టి యనుజ్ఞ లేకున్నను నట్టియభిప్రాయము భర్తకుఁగలదని యాతని జీవితకాలమందుగాని యనంతరమున నాప్తులవలనగాని తెలిసినయెడ స్త్రీ దత్తుని గ్రహింపవచ్చునని సర్వసమ్మతము. అట్టి రెండు విధముల భర్తనుజ్ఞయు లేకున్నప్పటికిని, నాయాశాస్త్రములచే నిత్యకామ్య వ్రతాదిధర్మాచరణమందువలె పుత్ర స్వీకారమందును, “నా పుత్రస్య లోకోస్తి” యని మొదలగు సామాన్య శాస్త్రముచేతనే విధవ కధికారముసిద్ధించును. “ఇక నస్త్రీపుత్రం దద్యాత్ప్రతి గృహ్ణీయాద్వాన్యత్రభర్తృ

సుజ్ఞానా"త్తనిభర్త్రనుజ్ఞలేక స్త్రీ పుత్రునివ్వగూడదు, స్వీకరింపగూడదను నిషేధవచనము నకుఁదాత్పర్యము. భర్త్రనుజ్ఞలేని స్త్రీపుత్రుని పరిగ్రహింపక పోవచ్చునని యభ్యనుజ్ఞ నిచ్చుటయందేకాని శాస్త్రసిద్ధాధికారముచే పుత్రుని గ్రహించుచో నిషేధించుటయందు తాత్పర్యముగాదని తెలియునది. కనుక నట్టి స్త్రీయొక్క పుత్ర స్వీకారమును ప్రతి బంధించి వృత్తిలోపము పిండవిచ్ఛేదాదికముఁ జేయువాఁడు నరకపాతము నొందును. "శ్లో. యో బ్రాహ్మణస్య వృత్త్యైతు ప్రతికూలం సమాచరేత్, విడ్భుజాంతు కృమిణాం స్యాత్" అని యందు ప్రమాణవచన మున్నదని కౌస్తుభమందుఁ జెప్పిన విస్తరముఁ జూడవలెను. స్త్రీలు పుత్రుని స్వీకరించునపుడు హోమాదికము బ్రాహ్మణునిచే జేయింప వలయును. ఇట్లు శూద్రులందు నూహించునది. విప్రుఁడు శూద్ర దక్షిణను తీసుకొని వైదికమంత్రములచే హోమాదికము చేయుచున్నాఁడు. అపుడు శూద్రుఁడు పుణ్య ఫలమును పొందును. విప్రునికి మాత్రము ప్రత్యవాయము తప్పదు. పుత్రస్వీకారము జేసి యతనికి జాతకర్మ మొదలుగగాని చూడాకర్మ మొదలుగగాని సంస్కారములు చేయునది యని ముఖ్యపక్షము. అసంభవమగుచో సగోత్ర సపిండులందు ఉపనయ నముజేసిన పైనిగాని వివాహముగూడ జేసినప్పటికిని దత్తునిగా స్వీకరింపవచ్చును. గాని పుత్రవంతుఁడు గాకముందే వివాహితుని సహితము గ్రహించుట యని తోఁ చుచున్నది. ఆసపిండసగోత్రులం దుపనీతుఁడు మాత్రమే యనియు తోఁచుచున్నది. భిన్న గోత్రుఁడైనచో నుపనయనముగాక ముందే గ్రహింపవలెను. కొందఱు ఉప నయనమైన పైని గూడ వానిం గ్రహింపవచ్చునందురు. ఇది దత్తకగ్రాహ్యా గ్రాహ్యా వివేకము.

## ఋగ్వేదులకు ఋత్ర ప్రతిగ్రహము

ఋగ్వేదులకు పుత్రస్వీకార ప్రయోగము తొలిరోజున యుపవాసముజేసి పవిత్రము ధరించి ప్రాణాయామముజేసి దేశకాలములుచ్చరించి "మమాప్రజత్వ ప్రయుక్త పితృఋణాపాకరణపున్నామ నరకత్రాణ ద్వారా పరమేశ్వర ప్రీత్యర్థం శౌనకోక్త విధినాపుత్ర ప్రతిగ్రహం కరిష్యే, తదంగత్వేన స్వస్తివాచనం ఆచార్యవరణం విష్ణు పూజన మన్నదానంచ కరిష్యే" యని సంకల్పించి యాచార్యునికి మధుపర్కమిచ్చిన పైని విష్ణునిఁ బూజించి బ్రాహ్మణ భోజనము సంకల్పించవలెను. ఆచార్యుఁడు "యజమానానుజ్ఞ యాపుత్రప్రతి గ్రహాంగహోమం కరిష్యే" యని సంకల్పించి అగ్నిని ప్రతిష్ఠించి చక్షుషీ ఆజ్యేనేత్యంతముగ నుచ్చరించి, "సకృదగ్ని సూర్యా సావిత్రీషడ్వారం చరుణా అగ్నిం వాయుం సూర్యం ప్రజాపతించాజ్యేన శేషేణస్విష్టకృతం" అని యన్వా దానముజేసి యిరువదెనిమిది పిడికిళ్ల నూరకే నిరూపించి యట్లనే ప్రోక్షించి యాజ్యోత్ప తనముపర్యంతముఁజేసి యటుపైని దాతవద్దకువెళ్లి "ఏతస్మైపుత్రందేహి"యని యాచింపవలెను. అటుపైని దాతయును దేశకాలములుచ్చరించి, "శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం పుత్రదానం కరిష్యే" యని సంకల్పించి గణపతిపూజజేసి ప్రతిగ్రహీతను యథాశక్తిగఁ బూజించియే "యజ్ఞేనేతిపంచానాం నాభానేదిష్టోమానవో విశ్వేదేవాస్త్రి ష్టుప్, పంచమ్యనుష్టుప్, పుత్రదానే వినియోగః" అని యజ్ఞేనేత్యాది యైదు ఋక్కులను

బఠించినపైని “ఇమం పుత్రం తవ పైతృకృణాపాకరణ పున్నామ నరకత్రాణ సిద్ధ్యర్థం ఆత్మనః శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం తుభ్యమహం సంప్రదదేనమమ. ప్రతిగృహ్ణాతు పుత్రం భవాన్.” అని యుచ్చరింపుచు ప్రతి గ్రహీతయొక్క హస్తమందు జలము విడువవలెను. ప్రతిగ్రహీతయు, ‘దేవస్యత్వా’యను మంత్రముతో రెండుచేతులను దీసుకొని తొడపై గూర్చుండc బెట్టుకొని “అంగాదంగాత్సంభవసి” యను మంత్రముచే శిరసు నా ఘ్రూణింపవలెను. వస్త్రకుండలాదులచే నలంకరించి గీతవాద్యములతోను స్వస్తి మంత్రములతోను నింటికిc గొనితెచ్చి పాదములc గడగికొని యాచమనముcజేసి యాచార్యునికి దక్షిణముగ దాసును దనకుc దక్షిణముగ గూర్చున్న భార్యయొక్క తొడపైని పుత్రుcడునగు నట్లు గూర్చుండవలెను. ఆచార్యుడు బర్హిరాసాదనము మొద లుగ నాజ్యభాగాంతముcజేసి చరువు నవదానముcజేసి “యస్త్వాహృదేతి ద్వయో రాత్రే యో వసుశ్రుతోగ్ని స్త్రీష్టుప్. పుత్ర ప్రతి గ్రహాంగహోమే వినియోగః” అని యస్త్వాహృదాయను రెండు ఋక్కుల బఠించి యొక్క యవదానమునే వేల్చునది. యజమానుcడు “అగ్నయ ఇదం నమమ” యని త్యాగముc బలుకవలెను. “తుభ్య మగ్రైపర్యవహం త్స్వర్యాసావిత్రీ, సూర్యాసావిత్ర్యనుష్టుప్, ఓం తుభ్యమగ్రే” యను మంత్రముతో మఱియు వేల్చవలెను. యజమానుcడు “సూర్యా సావిత్ర్యా ఇదం సమయనవలెను.” సోమోదదదితిపంచానాం సూర్యా సావిత్రీ అనుష్టుభౌజగతీ త్రిష్టు బనుష్టుప్, ఓం సోమోదదత్,” అను ఋక్పంచకముc బఠించునపుడును సూర్యా సావిత్రికే త్యాగము ఇట్లు సప్తచర్వాహుతులవేల్చి వ్యాహృతులచే ప్రత్యేకముగాను సమస్తముగాను నాజ్యహోమముc జేసి స్విష్టకృదాది సమాప్తిపైని యాచార్యునికిc గోదానముcజేసి బ్రాహ్మణ భోజనము చేయించవలెను.

## యజుర్వేదములకు భేదాయనోక్తరీతిని ప్రయోగము

మొదట రాజు శిష్టులు బంధువులు మొదలగువారి యనుజ్ఞనొంది సంకల్పము మొదలాచార్య పూజవరకు పూర్వమువలెజేసి బ్రాహ్మణభోజన సంకల్పముc జేసిన పైని యాచార్యుcడు దేవ యజనస్థలముగీయుట మొదలుగ ప్రణీతలపర్యంతము చేయవలెను. పుత్రస్వీకారముచేయు యజమానుడు దాతవద్దకు వెళ్లి “పుత్రం మే దేహి” యని స్వయముగా యాచింపవలెను. అటుపైని దాత సంకల్పము మొదలుగ పుత్రదానంతముc బూర్వమువలెc జేయవలెను. అపుడు ప్రతిగ్రహీత “ధర్మాయత్వాత గృహ్ణామి సంతత్యైత్వాగృహ్ణామి” యని పరిగ్రహించి యాపుత్రుని వస్త్రకుండ లాంగులీయ కాదులచే నలంకరింపవలెను. ఆచార్యుcడు కుశమయమైన బర్హిస్సును మోదుగు సమిధలును సిద్ధముచేసి పరిధానము మొదలుగ నగ్నిముఖముజేసి చరుశ్రవణము నాసాదనమునైన పైని పూర్వాంగహోమముcజేసి “యస్త్వా హృదాకీరిణా” యను పురోనువాక్యము బఠించి “యస్మైత్వం సుకృతే” యనుయాజ్యచే హోమముcజేసి వ్యస్తసమస్త వ్యాహృతులచే హోమముcజేసి స్విష్టకృదాది కర్మను జేయవలెను. ఆచార్యు నికి దక్షిణయు వస్త్రకుండలాంగులీయకాదులు నీయవలెను. భిన్నగోత్రుcడైన దత్తుకుని కుపనయనము మాత్రము పాలకగోత్రముచే జేయcబడినయెడ, లేక యుపనయనము

మాత్రము పాలకగోత్రముచే జేయఁబడినయెడ, లేక యుపనయనాంతరమున స్వీక రింపఁబడినయెడ నట్టి దత్తకుఁడభివాదనమును శ్రాద్ధమును జేయునపుడు రెండు గోత్రముల నుచ్చరింపవలెను.

ఇఁక చాడాకర్మ మొదలగు సంస్కారములునుగూడ పాలక గోత్రముచేఁ జేయఁ బడినచో వానికి పాలకగోత్రము మాత్రమే యుచ్చరింపఁదగును.

## దత్తోపయోగి నిర్ణయము

దత్తకుని వివాహముకెట్టి దత్తుఁడైనను జనకపాలక గోత్రముల సంబంధము గాని ప్రవరసంబంధముగాని కల్గిన కన్యకల వర్జింపవలయును. అచట సాపింద్యము సాప్త పౌరుషమని గాని పాంచపౌరుషమనిగాని నియమముఁ గానరాదు. ఇఁక జనక గోత్రముచే నుపనయనము జరిగినచో జనకపితృ మాతృకులమందు సాపిం ద్యము సాప్తపౌరుషము పాంచ పరుషమును గ్రమముగ నగును. గ్రహీతృమాతృ పితృకుల మందు త్రిపురుషమే గ్రహించునది. గ్రహీతృగోత్రముచే నుపనయనము మాత్రము జరిగినచో రెండు గోత్రములందు పితృకులమందు పాంచ పౌరుషమును మాతృకులమందు త్రిపురుషమని తెలియునది. జాతకర్మాద్యుపనయనాంత సంస్కార ములు గ్రహీతచే జేయఁబడిన యెడ గ్రహీతృకులమందు సాప్తపౌరుషము మాతృకుల మందు పాంచపౌరుషమునగు. అంతకు దక్కువగా జనకకులమందు కల్పించుకొన వలెను. కొందఱు దత్తకుఁడు ప్రవేశించినచో నన్నివిధములచే దక్కువయే సాపింద్యమం దురు. ఇట్లు దత్తక సంతతికిని సాపింద్యము తెలియునది. దత్తకుఁడు మృతినొందినచో జనకపాలకులగు తల్లిదండ్రులకు ద్రిరాత్రమాశౌచము. సపిండుల కొకదినము. దత్తకుఁ డుపనీతుఁడై మృతినొందినచో బాలకసపిండులకు దశాహాద్యా శౌచమ యని నీలకంఠీయ దత్తకనిర్ణయమందున్నది. ఇట్లు దత్తకునికిని పూర్వాపర పితృమరణ మందు త్రిరాత్రమాశౌచము పూర్వాపరసపిండుల మృతియం దొకదినము. తలిదం డ్రుల యుత్తర క్రియలు చేయునపుడు పదిదినములు కర్మాంగాశౌచము. దత్తకుని పుత్రపౌత్రాదుల జననమరణములందు సపిండుల కొకదినము. సగోత్ర సపిండుఁ డు దత్తుఁడైనచో నందఱకు దశరాత్రమే యాశౌచము. భార్యయు దుహితలు నున్నప్పటి కిని దత్తుఁడే పితృధనమున కధికారియగు. దత్తుని స్వీకరించినపైని యౌర సుఁడు గల్గినచో దత్తునికి పితృధనమందు జతుర్థాంశమీవలెను సమభాగమున కధికారి గాఁడు కొందఱు దత్తునికి జాతకర్మాద్యుపనయనాంత సంస్కారములును విధిగా పరిగ్రహించుటయు గ్రహీతచే జరిగినచో సమాంశకే యధికారి యగును. సంస్కారమాత్రముజేసి విధానముఁ జేయనిచో వివాహమాత్రలాభమేగాని యితర ధనలాభములేదు కొన్ని సంస్కారములుచేసినచో నాలుగవభాగము పితృధనములో నీయవలెనని యందురు. దత్తుఁడున్నప్పటికిని నౌరసునికే తలిదండ్రుల పిండ దానమందధికారము. జనకపితకు పిండదానాధికారి మఱియొకఁడు లేనిచో దత్తుఁ డే యుభయులకు నుత్తర క్రియలు చేయవచ్చును. ఉభయుల ధనమును గ్రహింప వలెనని నీలకంఠీయమందున్నది. ఇట్లు దత్తకన్యను స్వీకరించుటయు మీఁదఁ జెప్పిన

విధముచే జేయవలెను. అందు భిన్నగోత్ర కన్యను గ్రహించునెడ వివాహమున నుభయ గోత్రముల విడుచుట మీఁదఁ జెప్పినటులఁ దెలియునది పుత్రులు పతియును లేనిచో దత్తకన్యకే పితృధనము లభించును. ఇది దత్తోపయోగి యగు నిర్ణయము.

## పుత్రకామేష్టి

ఇఁక కన్యలేపుట్టినచో పుత్రోత్పత్తికై పుత్రకామేష్టిఁ జేయునది. ఋతుకాలమున కారవదినమందు భార్యతో నభ్యంగముఁజేసి ప్రాణాయమముజేసి దేశకాలముల నుచ్చరించి "పుత్రకామః పుత్రకామేష్ఠిం కరిష్యే" యని సంకల్పించి స్వస్తివాచనము నాందీ శ్రాద్ధమునైన పైని యగ్నిఁ బ్రతిష్ఠించి "చక్షుషీ ఆజ్యేనాత్ర ప్రధానం, అగ్నిం పంచవారం వరుణం పంచవారం విష్ణుం పృథివీం విష్ణుం సోమం సూర్యాసావిత్రీం పాయసేన శేషేణ స్విష్టకృత" మ్మని మొదలుకొని, నిర్వాపకాలమందేమియు నుచ్చ రింపకనే యరువది ముష్టులనిరూపించి యట్లే ప్రోక్షించి తెల్లని వత్సగల్గిన తెల్లని యావు పాలచే చరవునుండి యాజ్యభాగాంతమందు "ఆతేగర్భ ఇతి అగ్నిరైతు ఇతి సూక్తద్వయస్య హిరణ్యగర్భఋషిః క్రమేణాగ్ని వరుణౌ దేవతే. అనుష్టుప్ జగత్యౌ ఛందసి, పాయసచరుహోమేవినియోగః" "ఓం ఆతేగర్భోయోని మేతుపుమాన్ బాణ ఇవేషుధిం, ఆవీరోజాయతాం పుత్రస్తే దశమాస్యః స్వాహా, అగ్నయ ఇదం నమమ, కరోమితే ప్రాజాఃత్యమాగర్భోయో నిమైతుతే, అసూనః పుత్రో జాయతామశ్లోణోఽ పి శాచధీతాస్స్వహా, అగ్నయ ఇదం, పుమాంస్తేపుత్రో నారితంపుమాననుజాయతాం, తాని భద్రాణి బీజాస్యృషభా జనయంతునౌ స్వాహా, అగ్నయ ఇదం, యానిభద్రాణి బీజాన్యృషభాజనయంతినః, తైస్త్వంపుత్రాన్విందస్వ సాప్రసూర్ధేనుకాభవస్వాహా, అగ్న య ఇదం, కామస్సముద్ధృహ్యతాం మహ్యామపరాజితమేవమే, యం కామం కామయే దేవతన్మేవాయో సమర్ధయ స్వాహా, అగ్నయ ఇదం, అగ్నిరైతు ప్ర...న్నదోదాత్స్వాహా, వరుణాయేదం, ఇమామగ్నిస్త్రాయతాంగర్హపత్యః ప్రజామస్యైనయతు దీర్ఘమాయుః అశూన్యోపస్థాజీవతామస్తుమాతా పౌత్రమానంద మభి ప్రబుధ్యతామియం స్వాహా, వరుణాయేదం, మాతేగృహే నిశిఘోషుత్థాదన్యత్రత్వద్రు దంత్యస్సంవిశంతు, మాత్వంబి కేశ్యుర అవధిష్మాజీవ పత్నీ పతిలోకేవిరాజ, పశ్యంతీ ప్రజాం సు మనస్య మానాం స్వాహా, వరుణాయేదం, అప్రజస్తాం పౌత్రమృత్యుం పాప్మానముతబాధం, శీర్ష్ణస్స్ర జమివోన్ముహ్యద్విషద్భ్యః ప్రతిముం చామిపాశంస్వాహా, వరుణాయేదం, దేవకృతం బ్రాహ్మణకల్పమానం తే నహన్మేయోనిషదః పిశాచాన్, క్రవ్యాదో మృత్యూవధ రాన్పాత యామిదీర్ఘమాయుస్తవ జీవంతు పుత్రాస్స్వాహా, వరుణాయేదం, నేజమేషేతి తిసృణాం విష్ణుస్త్వష్టా గర్భ కర్తావిష్ణుపృథ్వీ విష్ణవోనుష్టుప్, నైజమేష విష్ణవ ఇదం, యధేయం పృథ్వీ, వృష్ట్యాఇదం, విష్ణో శ్రేష్ఠేన, విష్ణవ ఇదం, సోమోధేనుం రాహుగణే గౌతమః సోమ స్త్రిష్టుప్, పాయసహోమే వినియోగః తాంపూషన్ సూర్యాసావిత్ర్యా ఇదం" అని ఇట్లు పదునైదాహుతులు వేల్చి, స్విష్టకృద్ధోమముజేసి దంపతులిద్దరు "అపశ్యం త్వేతిద్వయోః ప్రజావాన్ ప్రజాపత్యః ప్రజాపతి స్త్రిష్టుప్, హుత శేషచరుప్రాశనే విని యోగః" అని అపశ్యంత్వాయని మొదలగు రెండు ఋక్కులచే చరుశేషము భక్షించి

'పిశంగభృష్టిమిత్యృదైవోదాసిః పరుచ్ఛేపః ఇంద్రోగాయత్రీ, నాభ్యాలభనే వినియోగః ఓం పిశంగభృష్టిమమ్భృణంపిచాచ" అను మంత్రముచే దంపతులిద్దరు నాభిని స్పృశించవలెను. యజమానుఁడు ప్రాయశ్చిత్తాది హోమశేషమును సమాప్తి నొందించి విప్రులకు గోవును సువర్ణాది దక్షిణనిచ్చి రాత్రి యందు దంపతులు దర్భా స్తరణము నందు బండుకొనవలెను. ఇది పుత్రకామేష్ఠి ప్రయోగము.

## పుంసవనము

అది గర్భము స్పష్టమైన పైని రెండవదిగాని మూఁడవదిగాని నాల్గవదిగాని యారవదిగాని మాసము ప్రవేశింపఁగానే, లేదా యష్టమ మాసమందు సీమంతముతో గూడ నైనను జేయునది. శుక్లపంచమి మొదలుకొని కృష్ణపంచమిలోగా చవితి, నవమి, చతుర్దశి, పున్నమయు వీనిదప్ప దక్కిన తిథియందు రవిమంగళ గురువార ముల నొకదానియందు జేయుట ప్రశస్తము. కొన్నిటిలో సోమ బుధ, శుక్రవారములు చెప్పఁబడినవి. నక్షత్రములు పురుషనామకమైనవి ప్రశస్తములు. అవి యేవనిన; పుష్యశ్రవణపునర్వసు హస్తమృగాభి జిన్మూలానురాధాశ్వినులు. అందు పుష్యము ముఖ్యము. అదిలేనిచో శ్రవణము నదియు సంభవింపనిచో హస్తాదులు. ఇదియే యనవలోభనమునకును గాలము. అనవలోభనము పుంసవనముతోఁజేయ విధింపఁ బడినది. పుంసవనమున నవలోభనమును ప్రతిగర్భమందును జేయవలెను. ఏమనిన; నవి గర్భసంస్కారములు. గర్భాధానసీమంతోన్నయనములు స్త్రీ సంస్కారములగుటచే ప్రతిగర్భమందక్కఱలేదు. ప్రథమగర్భమందే చేయవలెను. అట్లు చేయనిచో ప్రతిగర్భ మందును తల్లోపప్రాయశ్చిత్తముచే బ్రత్యవాయపరిహారము కావచ్చునుగాని యపూర్వ మను నతిశయ మెట్లుపుట్టును. అది సంస్కారవిధిచేతనే గల్గునని యుక్తము. ప్రతిగర్భ మందును ప్రాయశ్చిత్తము. పుంసవనానవలోభనములు ప్రథమ గర్భమందుఁ జేసినను ప్రతిగర్భమందునుఁ జేయనియెడఁ బ్రాయశ్చిత్తము. అది పాదకృచ్ఛ్రము చొప్పున ప్రతి సంస్కారమునకునుఁ జేయవలెను. బుద్ధి పూర్వముగ మానినచో ద్విగుణము చేయవలెను. పుంసవనమందు పతియే కర్తయగును. పతిలేనిచో మరది మొదలగు వారు చేయవచ్చును.

## సీమంత కాలము

సీమంతము నాల్గవ మాసమందుగాని యెనిమిదవ మాసమందుగాని యారవ మాసమందుగాని యైదవమాసమందుగాని చేయవచ్చును. మఱియును "నవమే మాసివాకుర్యాద్యావద్గర్భ విమోచనం, స్త్రీయ ద్యకృత సీమంతా ప్రసూయేతకదాచన, గృహీత పుత్రవిధివత్సాతం సంస్కారమర్హతి," అనియున్నది. అనఁగా దొమ్మిదవ మాసమందె ననుబుంసవనమ చేయవచ్చును. ఒకవేళ సీమంతముఁ జేయకమున్ను ప్రసవించినయెడఁ బుత్రునితో గూడ నాసంస్కారము జేయఁదగునని పక్షతిథి వార నక్షత్రములు పుంసవనమందు జెప్పినవియే సీమంతమునకునుఁ బ్రశస్తములు. కొన్ని గ్రంథములలో కృష్ణపక్షము దశమిపర్యంతము గూడుననియు; షష్ఠి, అష్టమి, ద్వాదశి,

రిక్తతిథులు, పున్నమయు వర్జ్యములు. ఇబ్బందిగల్గినచో చతుర్థీ చతుర్దశీపూర్ణిమలు గ్రహింపవచ్చుననియు; షష్టి, అష్టమి, ద్వాదశియైననుఁ గ్రమముగా నెనిమిది, నాల్గు, పదిగడియలు మొదటివి విడిచి గ్రహింపఁదగినవనియు; పున్న క్షత్రములు దొరకనిచో రేవతి, రోహిణి, ఉత్తర, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర వీని గ్రహింపవచ్చుననియు; అపుడు చెప్పిన నక్షత్రములకు ప్రథమ పాదము నంత్యపాదమును విడిచి మధ్యమందలి రెండుపాదములు గ్రహింపవచ్చుననియుఁ జెప్పఁబడినవి.

## సీమంతోన్నయనము

ఈసీమంత మొకమారే చేయవలెనని యున్నది. కాత్యాయనులకు గర్భ సంస్కార మగుటచే ప్రతిగర్భమందు నావృత్తి చేయవలెను. సీమంతోన్నయనమందు పతియేకర్తగావలెను. గర్భాధానలోపమందు ప్రాయశ్చిత్తార్థమై బ్రాహ్మణునికి గోవునిచ్చి చేయవలెను. అందాశ్వలాయనులకు దేశకాలము లుచ్చరించినపైని "మమాస్యాం భార్యాయాముత్పత్స్యమాన గర్భస్యగార్భికబైజిక దోషపరిహారపుంరూపతా సిద్ధి జ్ఞానో దయ ప్రతిరోధ పరిహారద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం పుంసవనమనవలోభనం మమాస్యాం భార్యాయాం గర్భాభివృద్ధి ప్రతిబంధి పిశితరుధిర ప్రియాలక్ష్మీ భూత రాక్షసీ గణదూరనిరసన క్షేమసకల సౌభాగ్యదానమహలక్ష్మి సమావేశనద్వారా ప్రతి గర్భం బీజగర్భ సముద్భవైనో నిబర్హణద్వారాచ శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం స్త్రీ సంస్కార రూపం సీమంతోన్నయనాఖ్యం కర్మచ తంత్రేణ కరిష్యే" యని సంకల్పము సీమంత ముతో మూఁడు నొకమారు చేయఁదలచినచో నిట్లని తెలియునది. నాందీ శ్రాద్ధ మందు క్రతుదక్షసంజ్ఞికులు విశ్వేదేవులు. పుంసవనము వేరుగఁ జేయఁదలచినచో పవమానసంజ్ఞికమైన యౌపాసనాగ్నిని ప్రతిష్ఠాపించవలెను. మూఁడింటి నొకమారే చేయునపుడు మంగళనామకమైన యగ్నిని ప్రతిష్ఠించవలెను. గృహ్యాగ్నికి విచ్ఛేదమైనచో సర్వాధానికి నగ్న్యుత్పత్తి పూర్వమువలె నెఱుంగునది. పుంసవనమందు ప్రజాపతికి చరువుచేతను సీమంతమందు ధాతకు రెండుమారులు రాకాదేవతకు రెండుమారులు విష్ణునకు మూఁడు మారులు ప్రజాపతి కొకమారు నేతిచే హోమముఁ జేయునది. తక్కిన ప్రయోగమన్యస్థలమందుఁ దెలియునది. శాఖాంతరమునందు వారి గ్రంథ ములఁ దెలియవలెను.

## సీమంతాన్నభోజన ప్రాయశ్చిత్తము

అపుడు ప్రతిసంస్కారమునకు పదుగురేసిగాని ముగ్గురేసిగాని బ్రాహ్మణులను భుజింపఁజేయవలెను. సమర్థుఁడైనచో నూర్గురేసి విప్రులకుఁ బెట్టవలెను. సీమంతాన్న భోజనముఁ జేసినచో బాయశ్చిత్తము పారిజాతమందు–"బ్రహ్మౌదనే చ సోమే చ సీమంతోన్నయనేతథా, జాతశ్రాద్ధే తథా భుక్త్వా భోక్తా చాంద్రాయణం చరేత్" అనఁ గా బ్రహ్మౌదనమందును సోమయాగమందును సీమంతమందును జాతకర్మ యందును నిమంత్రితులై భుజించువారు చాంద్రాయణముఁ జేయవలెనని అశక్తుఁ డైనచో "అరాఇవ"యను మంత్రమును నూరుమారులు జపించవలెను. ఇది యాధా

నాంగ బ్రహ్మోదనాంగ భోజనమందువలె సీమంతాంగ భోజనమందలి తెలియ వలెను. అంతియేకాని యాదినమందును నా గృహమందును భోజనము చేయువారి కందఱకు ప్రాయశ్చిత్తమని కాదు.

## గర్భిణీ ధర్మములు

శ్లో॥ గర్భిణీ కుంజరాశ్వాజ శైలహర్మ్యాధిరోహణం, వ్యాయామం శీఘ్రగమనం శకటారోహణం త్యజేత్, నభస్మాదావున విశేన్ముసలో లూఖలాదిషు, త్యజేజ్జలావగాహం చ శూన్యం సద్మతరోస్తలం, కలహంగాత్ర భగ్నంచ తీక్ష్ణాత్యుష్ణాది భక్షణం, సంధ్యాయామతి శీతామ్లంగుర్వాహారం పరిత్యజేత్, వ్యవాయశోకా సృజ్మోక్షం దివాస్వాపం నిశిస్థితం, భస్మాంగారనఖైర్భూమి లేఖనం శయనంసదా, త్యజేదమంగలం వాక్యం నచహా స్యాధికాభవేత్, నముక్తకేశానో ద్విగ్నాకుక్కుటాసనగానచ, గర్భరక్షాసదా కార్యా నిత్యం శౌచనిషేవణాత్, ప్రశస్త మంత్రలిఖనాచ్ఛస్త మాల్యానులేపనాత్, విశుద్ధ గేహ వనినాద్ధానైశ్చ్వశ్ర్వాదిపూజనైః, హరిద్రాం కుంకుమంచైవ సిందూరం కజ్జలంతథా, కేశసంస్కార తాంబూలం మాంగల్యాభరణం శుభం, చతుర్థేమాసి షష్ఠేవా ప్యష్టమే గర్భిణీవధూః యాత్రాం వివర్జయేన్నిత్య మాషష్ఠాత్తు విశేషతః" అని అనఁగాగర్భిణియైన స్త్రీ యేనుగు, గుఱ్ఱము, బండి మొదలగునవియెక్కి వెళ్ళఁగూడదు. పర్వతము, మేడ మొదలగు నున్నతప్రదేశము నెక్కఁగూడదు. పని విస్తారము చేయుట, పరుగెత్తుటయుఁ గూడదు. భస్మము మొదలగు మలినవస్తువులందును రోకలి రోలు మొదలగు పనిముట్లయందునుఁ గూరుచుండఁగూడదు. జలములో మునుఁగుట శూన్యగృహ మందుగాని చెట్లక్రిందగాని నిలుచుటయు గలహించుట యొడలు విరుచుకొనుట వట్టివస్తువులు వేడివస్తువులుదినుట సంధ్యలయందు భుజించుట అతిశీతమైన మంచు మొదలగునవియు కారుపులుసు గల వస్తువులును భుజించుట యజీర్ణమగు వస్తువులు దినుట మైధునము శోకము రక్తము తగ్గించుట పగలు నిద్రించుట రాత్రి యొంటి మేల్కొనుట భస్మము బొగ్గు గోళ్లు మొదలగువాటిచే గీతలు గీయుట ఎల్లప్పుడు శయనించుట యమంగళవాక్కులాడుట అధికముగ నవ్వు టయు నివి వర్జింపవలెను. కొప్పువిప్పుకొని యుండఁగూడదు. గపక్కుమని జడియుట గొంతుగ గూర్చుండు టయుఁ గూడదు. గర్భరక్షణమునకై శుచిత్వముఁ గలిగి మంచి మంత్రముల రక్షరేకులను మంచి పుష్పమాలికలు చందనము ధరించి పవిత్రమైన గృహమందుం డుచు దానముల నత్తమామల పూజయును జేయుచు పసుపు, కుంకుమ, సింధూరము, కాటుక మొదలగువానిచే నలకంరించుకొని దువ్వినకొప్పుతో తాంబూలము మంగళాభరణములు ధరించియుండవలెను. నాల్గు నారు నెనిమిది మాసము లందుఁ ప్రయాణ మెప్పుడునుగూడదు అందులో నారవమాసము బొత్తిగఁగూడదు.

## గర్భిణీ పతి ధర్మములు

"శ్లో॥ గర్భిణీ వాంఛితం ధర్మం తస్త్యైదద్యాద్యథోచితం, సూతేచిరాయుషం పుత్రమన్యథా దోషమర్హతి, సింధుస్నానం ద్రుమచ్ఛేదం వపనం ప్రేతవాహనం, విదేశ

గమనం చైవ నకుర్యాద్గర్భిణీ పతిః వపనం మైధునం తీర్థం శ్రాద్ధభోజనమేవచ, వర్జయే త్సప్తమాన్మాసా న్నావా ఆరోహణం తథా, యుద్ధాదివాస్తుకరణం నఖకేశ విరక్తనం, చౌలంశవానుగమనం వివాహంచ వివర్జయేత్, ముండనం పిండదానం చ ప్రేతకర్మ చ సర్వశః న జీవత్పితృకః కుర్యాద్గర్భిణీ పతిరేవచ.” అని యనఁగా గర్భిణి యగు స్త్రీ గోరిన వస్తువు నుంచి తమగుదాని దెచ్చియిచ్చుట ముఖ్యము. చిరాయుష్యము గలపుత్రుఁడు గల్గును. లేనిచో దోషము గల్గును. మఱియు సముద్ర స్నానము చెట్టునరుకుట క్షౌరము శవము మోయుట విదేశ ప్రయాణమునుఁజేయఁ గూడదు. మఱియు సప్తమమాసము మొదలుగు క్షౌరము మైధునము తీర్థయాత్రయు శ్రాద్ధభోజనమును నావనెక్కుటయు విడువవలెను. యుద్ధాదికము గృహాది నిర్మాణము నఖకేశములు కత్తిరించుట చౌలకర్మశవము ననుసరించి వెళ్లుట వివాహము నుప నయనము పిండదానము నన్నివిధముల ప్రేతకర్మయుఁ జేయఁ గూడదు. ఇట్లు క్షౌరమువలె కత్తిరించుటయు నిషేధింపఁబడినదే. “మఱియు వపనస్య నిషేధేపి కర్తనం తు విధీయతే” యని యొక వచన మున్నది. అయినను దానికిఁ దాత్పర్యము. జీవత్పితృకాదులకు వసననిషేధమున వసనము ప్రాప్తించునపుడు కర్తనముఁ జేసు కొనవలెనని విధించుటయందని యూహించునది.

## గర్భిణీపతికి నిషేధించిన వానిలో నపవాదము

“క్షౌరం నైమిత్తికం కుర్యాన్నిషేధే సత్యపి ధ్రువం, పిత్రోః ప్రేత విధానం చ గర్భిణీపతి రాట్చరేత్” అని. అనఁగా గర్భిణీపతికి క్షౌరనిషేధమున్నప్పటికిని నిమిత్త మున్నచో జేసుకొనతప్పదు. మఱియు ప్రేతకర్మఁజేయుటకు నిషేధమున్నప్పటికిని పితృప్రేతకర్మ చేయకతప్పదని యర్థము. ఇట్లన్వష్టక్యాష్ట శ్రాద్ధములందు గర్భిణీ పతియును బిండదానము చేయవలెను. కొందఱు తల్లితండ్రులయొక్క ప్రత్యాబ్దిక మందు బిండదానముఁ జేయుచున్నారు. దర్శమహాలయాదులయందు జేయనక్కర లేదు.

## గర్భస్రావహరమైన కాంచన యజ్ఞోపవీతధారణ విధి

ఇది స్త్రీ జేయవలసినది. శుభదినమందు స్త్రీయాచమనముజేసి దేశకాలముల నుచ్చరించి “మమగర్భస్రావనిదానసకల దోషపరిహారద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం, వాయుపురాణోక్తం సువర్ణయజ్ఞోపవీతదాన విధిం కరిష్యే” యని సంకల్పించి పలము గాని యరపలముగాని యథాశక్తిగగాని సువర్ణముతో యజ్ఞోపవీతమును గ్రంథిస్థాన మందు ముత్తెదునుంచి చేసి యిట్లనే వజ్రముతోగూడిన వెండియుత్తరీయమునుజేసి రెండును బంచగవ్యముచే గాయత్రితోగడిగి రాగిపాత్రయందు ద్రోణకును పరిమితిగ పెరుగుఁబోసి దానిమధ్యమందంతియె నేయివేసి దానిపై నా రెండునుంచి భర్తగాని, బ్రాహ్మణుఁడుగాని, గాయత్రితోగంధాదులచేఁ బూపింపవలెను. యెనిమిది గురుగింజల యెత్తు మాషము పదిమాషములు సువర్ణము పలము కుడవము ప్రస్థము ఆఢకము ద్రోణమునివి క్రమముగఁ బూర్వపూర్వమునకంటె చతుర్గుణములు అశక్తిలో

యథాశక్తిగ దధ్న్యాము లుంచవచ్చును. నేతితోను తేనెతోనుగల పినతిలలనే గాయత్రితో నూటయెనిమిదిమారులు హోమము బ్రాహ్మణునిచేఁ జేయింపవలెను. త్యాగము భర్తయైనను స్త్రీయెననుఁ జేయవచ్చును. హోమముఁ జేసినవిప్రుని వస్త్రాదు లచే బూజించి తూరుపుమొగమైయున్న విప్రునికి స్త్రీయుత్తరాభిముఖియై దాన మీయ వలెను. అది యెట్లనిన–"ఉపవీతం పరిమితం బ్రహ్మణా విధృతంపురా, భవనౌ కామ్యదానేన గర్భంసంధారయేహం." అను మంత్రముతో విప్రుని నామగోత్రము లుచ్చరించి "తామ్రపాత్రస్థ దధ్యాజ్య సంస్థం సుపూజితం సోత్తరీయమిదం యజ్ఞోప వీతం గర్భస్రావ నిదానదోష పరిహారద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం తుభ్యమహం సంప్రదదే నమమ ప్రతిగృహ్యతాం" అనిపలికి విప్రునికివ్వఁగ నతఁడు "ప్రతిగృహ్ణామి" యనవలెను. అటుపైని యథాశక్తి దక్షిణనిచ్చి యన్యబ్రాహ్మణులకును యథాశక్తిగ దక్షిణనిచ్చి ప్రతి గ్రహీతను గౌంతమేర నంపకముపెట్టి నమస్కరించి క్షమాపణము జేసి విప్రభోజనము సంకల్పించి కర్మనీశ్వరార్పితముఁ జేయవలెను. ఇట్టిదానమును "ప్రవద్గర్భాభవేత్స్రాతు బాలకం హంతి యావిషైః" అనువచన మున్నందున బాలహత్యా ప్రాయశ్చితముఁ జేసినపైని జేయవలెను. కొన్ని గ్రంథములలో స్వర్ణ ధేనుదానము హరివంశ శ్రవణము మొదలుగఁ జెప్పి ఘృతపూర్ణమైన రాగికలశమును దానము చేయుట మొదలైన విధానములుఁ జెప్పఁబడినది. ఇఁక సూతికా గృహప్రవేశము విచారింపఁబడును.

## సూతికాగృహ ప్రవేశము

గృహమందు నైరఋతి దిక్కున సూతికాగృహము సిద్ధముచేసి యందు అశ్విని, రోహిణి, మృగశీర్ష, పునర్వసు, పుష్యము, ఉత్తర, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర, హస్త, చిత్త, స్వాతి, అనూరాధ, ధనిష్ఠ, శతభిషక్ ఈ నక్షత్రములందు రిక్తాది భిన్నములైన తిథులందు చంద్ర బలముగల శుభలగ్నమందు విప్రదేవపూజను జేసి పుత్రవతులైన పుణ్యస్త్రీలు మంత్రవాద్యఘోషములతో గర్భిణిని సూతికాగృహప్రవేశముఁ జేయించ వలెను. అసంభవమైనచో దత్షణమే ప్రవేశించునది.

## సుఖప్రసవమునకుపాయము

ప్రసవమునకు ప్రతిబంధమైనచో ఋగ్విధానమందుఁ జెప్పఁబడినది. "ప్రమందినే" యను ఋక్కును "విజిహీష్వే" యను సూక్తమునైనఁ జపింపవలెను. ఈ మంత్రములచే నభిమంత్రితమైన జలమును ద్రావింపవలెను. దానిచే సుఖ ప్రసవ మగును. శీఘ్రప్రసవమునకు మంత్రము–"హిమవత్యుత్తరేపార్శ్వే సురధానా మయ్షిణీ, తస్యాస్మరణమాత్రేణ విశల్యాగర్భిణీ భవేత్. ఓం క్షీం ఓం స్వాహా" యను నది దానిచే దూర్వాంకురముచే నూరుమారులైనను వేయుమారులైనను దిలతైలము నభిమంత్రించి యించుక ద్రావించవలెను. కొంచెము గర్భమందుఁ బూయవలెను. బాగుగా లేపముఁ జేసినచో శీఘ్రప్రసవ మగును. ఆవుశిరసు పుణికెను సూతికా గృహముపై నుంచినచో సుఖప్రసవమగును. వెదురు వేపచెట్టును వీనిత్వక్కును తులసి

చెట్టు వేరును వెలగాకును గన్నేరు బీజమును నివి సమభాగములుగా గేదెపాలచే మర్దించి నూనెతోగలిపి జఘనమునకుఁ బూసినచో దక్షణమే ప్రసవమగును.

## జాతకర్మ

మూల, జ్యేష్ఠ, వ్యతీపాత మొదలగునవి లేకుండఁ బుట్టినపుత్రుని ముఖమును తక్షణమే తండ్రి తన కులదేవతకు పెద్దలకును నమస్కరించి చూచి, నది మొదలగు వానిలో నుత్తరాభిముఖుఁడై స్నానము చేయునది. అది సంభవింపనిచో గృహము నకుఁ దెచ్చిన శీతోదకములో సువర్ణముంచి స్నానముఁ జేయవలెను. ఈ స్నానము రాత్రియందును నద్యాదులందు చేయవలెను. అశక్తిలో రాత్రి నగ్ని సన్నిధి యందు స్వర్ణయుక్తమైన శీతోదకములచే స్నానము. మూలాది దుష్టనక్షత్రముల జననమైనచో ముఖము చూడకనే స్నానము. ఇట్లు తండ్రి దేశాంతరమందున్ననుఁ బుత్రోత్పత్తి వినఁ గానే స్నానముచేయవలెను. స్నానము చేయక ముందంతటను నస్పృశ్యత్వమే. ఇట్లు కన్యకపుట్టినను స్నానము. నంతకుమున్ను స్పృశింపఁగూడదనియుఁ దెలియు నది.

మరియొక సపిండుని యాశౌచమధ్యమందుఁ బుత్ర జననమైనను దండ్రికిఁ దత్కాలమందు స్నానదానాదులకును జాతకర్మకును శుద్ధియగును. కొందఱు మృతా శౌచము వచ్చునపుడు మాత్రము జాతకర్మను శుద్ధియైన పైనిఁ జేయవలయు నందురు. బొడ్డు గోయకముందు సంపూర్ణ సంధ్యావందనము మొదలగు కృత్యములం దాశౌచము లేదు. ప్రథమ దినమందును నట్లైదవ యాఱవ పదియవదినములందును దాన ప్రతిగ్రహములకు దోషములేదు. పక్వాన్నము మాత్రము గ్రాహ్యము గాదు. జ్యోతిష్టోమాది దీక్షలోనున్నయెడ స్వయముగగాని అన్యులచేగాని జాతకర్మ జరుగఁ గూడదు. మఱియు అవభృథస్నానమైన పైని దీక్షను విసర్జించి తానే జేయవలెను. జ్యేష్ఠుఁడు కనిష్ఠునిచే పుంసవానాదికముఁ జేయింపఁ గూడదు. జాతకర్మ మాత్రముఁ జేయింపవచ్చును. కాలాది క్రమణమైనచో దానే చేయవలెను. మహారోగముచే బీడితుఁ డయ్యెనేని జాతకర్మ దాను చేయఁగూడదు. శ్లో॥ అచ్ఛిన్న నాభికర్తవ్యం శ్రాద్ధం వై పుత్రజన్మని” యని వచనము నందు పుత్రశబ్దముచే గన్యయుఁగ్రహింపఁబడును. కాఁబట్టి జాతకర్మకు నంగమైనదే కాక పుత్రజన్మము నిమిత్తముగా నాందీశ్రాద్ధము వేరుగ విధింపఁబడినది. ఇది రాత్రి యందును జేయవచ్చును. అది హిరణ్యముచే జేయవలెనుగాని యన్నముచే గూడదు. కనుక స్నానముఁజేసి యలంకరించుకొని తండ్రి బొడ్డు గోయకమున్ను స్తన్యము బెట్టకముందే యితరులు ముట్టకుండఁగ శిశువునుగడిగి తల్లి తొడనుం పించి యాచమనముఁజేసి దేశకాలము లుచ్చరించి “అస్యకుమారస్య గర్భాంబు పానజనితదోష నిబర్హణాయుర్మేధావృద్ధి బీజగర్భ సముద్భవైనో నిబర్హణద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం జాతకర్మ కరిష్యే తదాదౌచ స్వస్తి పుణ్యాహవాచనం మాతృకాపూజనం చ కరిష్యే” యని సంకల్పించి మరియు “హిరణ్యేన పుత్ర జన్మనిమిత్తకం జాతకర్మాం గంచ నాందీశ్రాద్ధం తంత్రేణ కరిష్యే” యని సంకల్పించి తమతమ గృహ్యసూత్రాను సారముగఁ జేయవలెను. “తతో దద్యాత్సువర్ణం చ భూమిం గాం తురగం రథం, ఛత్రం ఛాగం చ మాల్యం చ

శయనం చాసనం గృహం, తిలపూర్ణాని పాత్రాణి స హిరణ్యాని చైవ హీ, భక్షయిత్వాతు పక్వాన్నం ద్విజశ్చాంద్రాయణం చరేత్, సూతకేతు స కుల్యానాం న దోషోమునిర బ్రవీత్." అని యనఁగా శ్రాద్ధము జేసినపైని సువర్ణము, భూమి, గోవు, గుఱ్ఱము, రథము, గొడుగు, మేక, పుష్పమాలిక, మంచము, పీట, యిల్లు, తిలలతోనిండిన పాత్రలలో హిరణ్యముంచి, యీ మొదలగుదాని దానములు చేయవలెను. అపుడు వారుబెట్టిన యన్నముపై వారు భుజించినచో చాంద్రాయణముఁ జేయవలెను. కులస్థుల కక్కరలేదు యని యర్థము. అటుపైని హస్తములో ఫలాదు లుంచుకొని జ్యౌతిషికునిఁ బూజించి యతనివలన జన్మలగ్నమునొందిన శుభాశుభ గ్రహనిర్ణ యముఁ దెలిసికొని దుష్టగ్రహములకు శాంతియు ప్రీతియుగా దానము లీయవలెను. గ్రహమంత్ర జపాదులకును శాంతి సూక్తజపాదులకును విప్రులవరించి చేయింప వలెను. అటుపైని బొడ్డుగోసి సువర్ణముంచిన యుదకముచే తల్లి దక్షిణ స్తనముగడిగి స్తన్యము శిశువున కీయవలెను. "తం న ఇమాం కుమారః" అని మొదలగు మంత్రము విప్రులు పఠించవలెను. జాతకర్మ మొదలన్న ప్రాశనమువరకు గర్మలలో హోమ మాశ్వలాయనులకు వైకల్పికము. అది చేయు పక్షమున నాందీ శ్రాద్ధాంత మందు "జాతకర్మాంగ హోమం కరిష్యే" యని సంకల్పించి లౌకికాగ్నిని ప్రతిష్ఠించి యన్వాధాన మాజ్యభాగముఁ జేసిన పైని అగ్నికి నింద్రునికి ప్రజాపతికి విశ్వేదేవతలకు బ్రహ్మకు నాజ్యముచే నాహుతులీయవలెను. మధువనఁగ తేనెయు ఘృతము దినిపించి శిరస్సు నాఘ్రాణించినపైని స్విష్టకృత్తు మొదలగునవి చేయవలెనని క్రమము. ఇతరు లకు వారివారి గృహసూత్రము ననుసరించి హోమము తెలియునది కన్యకును జాతకర్మ మొదలు చౌలపర్యంతము సంస్కారములన్నియు మంత్ర రహితముగఁ జేయ వలెను. వివాహము మాత్రము మంత్రసహితమే యగును. కనుక కన్యకు జాతకర్మాదులు లోపించినను నాయాకాలములందుగాని వివాహకాలమందుగాని తల్లోప ప్రాయశ్చిత్త ముఁజేసి వివాహముఁ జేయునది. ఇక్కడనంతటను జాతకర్మ నామకర్మాదికమునకు ముఖ్యకాలమతిక్రమించినచో గుర్వస్తమయము మొదలగునవి లేని శుభనక్షత్రాదు లాలోచించి చేయవలెను.

## జాతకర్మకు నక్షత్రములు

రోహిణి, ఉత్తర, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర, అశ్విని, హస్త, పుష్యము, అనూ రాధ, రేవతి, మృగశిర, చిత్త, శ్రవణము, ధనిష్ఠ, శతభిషక్, స్వాతి, పునర్వసు, యీ నక్షత్రములు రిక్తతిథులు. పర్వతిథులుఁ దప్ప తక్కిన తిథులు. మంగళ శనివారములు తప్ప తక్కుఁగల వారములు భద్రావైధృత్యాదులు లేని సుకేంద్రలగ్నము నివి శుభములు.

## జన్మదేవతల పూజ

ఇఁకనైదవ యాఱవదినములయందఢ జన్మదేవతలకు పూజనము రాత్రి ప్రథమ యామమందు దండ్రి మొదలగువారు స్నానము నాచమనముఁజేసి, దేశ కాలము లుచ్చరించి "అస్య శిశోస్సమాతృకస్యాయురారోగ్య ప్రాప్తి సకలానిష్టశాంతి

ద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం విఘ్నేశస్య జన్మదానాం జీవంత్యపరనామ్న్యాః షష్ఠీ దేవాశ్శస్త్ర గర్భా భగవత్యాశ్చ పూజనం కరిష్యే" యని సంకల్పించి బియ్యములో విఘ్నేశ్వరుని జన్మదలను నామమంత్రములచే నావాహనముఁజేసి "ఆయాహీ వరదే దేవి మహాషష్ఠీతి విశ్రుతే, శక్తిభి స్సహబాలం మే రక్షజాగర వాసరే." అని. అనఁగా వరములిచ్చు నోమహాషష్ఠీ దేవతా రమ్ము నీ శక్తులతోగూడి యీ జాగరదినమందు నా పుత్రుని సంరక్షింపుమని షష్ఠీదేవత నావాహనముఁజేసి శస్త్రగర్భాభగవతిని నామ ముచే నావాహనముఁజేసి "శక్తిస్త్వం సర్వదేవానాం లోకానాం హితకారిణీ, మాతర్బాల మిమం రక్షమహాషష్ఠి నమోస్తుతే" యను మంత్రముచే షోడశోపచారములిచ్చి పూజించి ప్రార్థించవలెను. "లంబోదరమహాభాగ సర్వోపద్రవనాశన, త్వత్ప్రసాదాద విఘ్నేన చిరంజీవతు బాలకః జననీ సర్వభూతానాం బాలానాం చ విశేషతః నారాయణీ స్వరూపేణ బాలం మే రక్ష సర్వదా, ప్రేత భూత పిశాచేభ్యో డాకినీ యోగినీషు చ, మాతేవ రక్షబాలం మే శ్వాపదే పన్నగేషు చ, గౌరీపుత్రో యథా స్కందః శిశుత్వేర క్షితః పురా, తథామమాప్యయం బాలష్షష్ఠికే రక్ష్య తాం నమః" అని. అనఁగా నో విఘ్నేశుఁడా! మహాపూజ్యుఁడవు. సమస్తాపత్తు నశింపఁజేయువాఁడు. నీయనుగ్రహ మున శిశువు చిరకాలము జీవింపవలెను. ఓ షష్ఠీ దేవీ ! నీవు సర్వజంతువులకుఁ దల్లివి. విశేషించి బాలురకు రక్షకురాలవు. కనుక నా పుత్రుని భూత ప్రేతపిశాచాదుల వలనను వ్యాఘ్రసర్పాది జంతువుల వలనను రక్షింపుము. నీవే భగవచ్ఛక్తి స్వరూపు రాలవు. కనుక పూర్వమందుఁ గుమారస్వామిని రక్షించిన ట్లితని రక్షింపుమని యర్థము. అటుపైని విప్రులకు దక్షిణాతాంబూలము లీవలెను. రాత్రి జాగరముఁ జేయవలెను. పంచమ షష్ఠదినములందు దాన ప్రతిగ్రహములకు దోషము లేదు. పదియవదినమందుఁ బలిదానమును స్వకీయుల కన్నదానముఁ జేయవలెను.

## ఆశౌచమందు కర్తవ్య నిర్ణయము

శ్లో. సూతకే మృతకేకుర్యాత్ప్రాణాయామమ మంత్రకం, తథా మార్జన మంత్రాంశ్చ మనసోచ్చార్య మార్జయేత్, గాయత్రీం సమ్య గుచ్చార్య సూర్యాయార్ఘ్యం నివేదయేత్, ఉపస్థానం నైవ కార్యం మార్జనం తు కృతాకృతం, సూర్యం ధ్యాయన్న మస్కుర్యాత్" అనఁగా జాతాశౌచమందును మృతాశౌచమందును మంత్రము నుచ్చరింపక ప్రాణా యామము చేయవలయును. అట్ల మార్జన మంత్రముల సహితము మనస్సులో దలంచుకొని మార్జనముఁ జేసుకొనవలెను. సూర్యుని కర్ఘ్యమిచ్చునపుడు మాత్రము గాయత్రీ నుచ్చరించునది. ఉపస్థానమంత్రముచ్చరింపఁ గూడదు. సూర్యుని ధ్యానించి నమస్కరించునది. గాయత్రీ జపముఁ గూడదు. ఏమనిన–"అర్ఘ్యాంతా మానసీ సంధ్యా" యని యున్నది. కొందఱు గాయత్రీ జపము మానసీకముగాఁ జేయవచ్చు నందురు. వైశ్వదేవము బ్రహ్మయజ్ఞము మొదలగు పంచ మహాయజ్ఞములనుఁ జేయఁగూడదు. వేదాధ్యయనముఁ గూడదు. ఔపాసన హోమము పిండపితృయజ్ఞము సగోత్రుఁడుగాని విప్రునిచేఁ జేయించవలెను. కొందఱు శ్రౌతకర్మయందు సద్యశ్శుద్ధి విధింపఁబడ్డందున నగ్నిహోత్ర హోమము దానే

యాచమనముఁజేసి చేయవచ్చు నందురు. మఱికొందరు సర్వమైన యాశౌచాపవాద మును గతిలేనిచో విధింపఁ బడినది గనుక బ్రాహ్మణుఁడు సంభవించినచో వానిచేఁ జేయించునది. లేనిచో దానే జేయునది యనిరి. స్థాలీపాక మాశౌచశుద్ధియైన పైనిఁ జేయవలెను. సర్వప్రకారములచే లోపమువచ్చునెడ నదియును బ్రాహ్మణునిచేఁ జేయించునది. అన్వాధానముఁ జేసినపైని సూతకమువచ్చెనేని, బ్రాహ్మణునిచే నిష్టియు స్థాలీపాకమునుఁ జేయించుచు స్నానముచేసి తాను హోమాదులందు త్యాగమును నుచ్చరించునది. దర్శాదిశ్రాద్ధమునకు లోపమే యగును. ప్రత్యాబ్దిక శ్రాద్ధమును శుద్ధియైనదినమం దనఁగా పదునొకండవ దినమందుఁ జేయునది. అపుడు సంభవింపనిచో దర్శయందు గాని వ్యతీపాతాది పర్వమందుగాని చేయవచ్చును. ఇట్లు భార్య రజస్వలయైననుఁ బిండపితృయజ్ఞము దర్శశ్రాద్ధమునుఁ జేయునది.

## అన్వాధాన సూతక నిర్ణయము

అన్వాధానమైన పైని రజోదోషముఁ గానుపించినచో నిష్టి స్థాలీపాకములు జేయవచ్చును. లేనిచో గాలాంతరమందే చేయవలెను. దానము ప్రతిగ్రహము నధ్యయనమును వర్జింపవలెను. ఆశౌచమందు మఱియొకరియన్నము భుజింపఁ గూడదు. పిండపితృయజ్ఞము స్థాలీపాకము శ్రవణాకర్మ మొదలగు సంస్థలు ప్రథమ మందారంభించుట జాతాశౌచమృతాశౌచములలో బ్రాహ్మణునిచేఁ జేయింపగూడదు. ఆరంభించిన పైని శ్రవణాకర్మాదు లాశౌచమందును భార్య రజస్వల యగు నపుడును బ్రాహ్మణునిచేఁ జేయింపవచ్చును. ఆ గ్రయణము మాత్రము చేయఁగూడదు. అగ్న్యా రోపణము ప్రత్యవరోపణమును నాశౌచములలోఁ జేయఁగూడదు. కనుక నాత్మా రోపజేసిన పైని యాశౌచము వచ్చినచో దర్శాదిపర్వము వచ్చునపుడు తైత్తిరీయులకు మూఁడు రోజులు హోమము లోపమగునేని నాశ్వలాయనులకు పంద్రెండు దినములు హోమము లోపమగునేని యగ్ని నశించును గనుక నా శౌచశుద్ధియైన పైని శ్రౌత స్మార్తాగ్నులకుఁ దిరుగ నాధానమే చేయునది. అగ్ని సమారోపణముఁ జేయువారే తిరుగ ప్రత్యవరోపణము చేయవలెను గనుక బ్రాహ్మణునిద్వారా చేయింపఁగూడదు. అగ్ని యనువర్తించినయున్నచో ప్రాయశ్చిత్తపూర్వకముగ బునరుత్పత్తి యన్యునిచేఁ జేయింపవచ్చును. భోజనము సేయుచుండగఁ నాశౌచము ప్రాప్తించినచో ముఖమం దున్న కబళమువిడిచి స్నానము చేయవలయును. అట్లుచేయక నాకబళము భక్షించి నచో మూఁడుపవాసములు చేయవలెను. "సూతకే మృతకే చైవన దోషో రాహుదర్శనే" యని యున్నందున ననఁగా నాశౌచదోషము గ్రహణకాలమందులేదని యున్నందు నపుడు స్నానముఁజేసి శ్రాద్ధము దానము జపము మొదలగునవి యాశౌచమందునుఁ జేయవచ్చును. ఇట్లు సంక్రాంతి, స్నానదానాదులుఁ జేయవచ్చును. కాలాంతరమం దవకాశము లేనియెడ నాందీశ్రాద్ధమైన పైని యాశౌచము సంభవించినను వివాహోప నయనములు చేయవచ్చును. అట్లు నిర్బంధము గలుగుచో మధుపర్కమిచ్చిన పైని ఋత్విక్కులకు నాశౌచములేదు. యజమానునికి దీక్షణీయమైన పైని యవభృథమునకు ముందు నాశౌచమంటదు. ఆశౌచ శుద్ధియైన పైనే యవభృథముఁ జేయవలెను.

'ప్రతేషునాశౌచ'మని యున్నందున ననంతవ్రతాదికము బ్రాహ్మణునిచేఁ జేయింప వచ్చును. అన్న సత్రము ప్రారంభించిన పైని దాతకన్న దానాదిరిమం దాశౌచము లేదు. "పూర్వసంకల్పితాన్నేషు న దోషః పరికీర్తితః" అను వచనమున నాశౌచ శూన్యకాలమందే యట్టి యన్నసత్రము సంకల్పించుటచే దోషములేదు. మఱియు జలము, పెరుగు, పాలు, లవణము, ఫలము, మూలము, వేచిన వస్తువులు ఇవి సూతకము గలవాని గృహమందున్నప్పటికిని తాను స్వయముగా దీసుకొనినచో దోషములేదు. సూతకియొక్క హస్తము నుండి పుచ్చుకొనఁగూడదు. కొందఱు బియ్యము మొదలగు నపక్వాన్నము గ్రహింపవచ్చునని చెప్పుదురు. ఇట్లు సంక్షేపముగ నిర్ణయము విశేషము ముందుఁ జెప్పఁబడును.

## సూతికకు శుద్ధి

పదిదినములైన పైని సూతికయగు స్త్రీకి పురిటి శుద్ధిగలిగి స్పృశింపఁ దగుటయు జాతకర్మ నామకరణాది సమయప్రాప్తకర్మలయందధికారమును గలుగును. జాతేష్టి, వివాహము, ఉపనయనము మొదలగు కర్మలయందు పుత్రునిగన్న స్త్రీకిరువది దినముపైని కన్యను గన్న స్త్రీకి ముప్పది రోజులపైని నధికారము సిద్ధించును.

## గోప్రసవశాంతి

ఇఁక జన్మయందు దుష్టకాలము దానికి శాంతులును నిర్ణయింపఁబడును. అందు మొదట గోప్రసవశాంతిఁ జెప్పఁబడును. ఎపుడు పుత్రజననమందుఁ దల్లి దండ్రులకును శిశువునకును ననిష్టము చెప్పఁబడునో యపుడు గోప్రసవశాంతియు తత్తన్న క్షత్రాదిశాంతియుఁ జేయవలెను. ధనాదుల కరిష్టముఁ జెప్పునపుడు చేయ నక్కఱలేదు. మూల, ఆశ్రేష, జ్యేష్ఠ, మఘ యీ నక్షత్రములందుఁ జననమైనచో జతుర్థపాదాదులయందుఁ దండ్రి మొదలగువారి కనిష్టము లేకపోయినప్పటికిని గోప్ర నవశాంతిఁ జేయవలెను. అశ్విని, రేవతి, పుష్యము, చిత్త వీనియందు నక్షత్ర శాంతి లేకున్నను గోప్రసవశాంతి మాత్రము చేయవలయును. అందు–"అస్యశిరోర ముక దుష్టకాలోత్పత్తి సూచితారిష్టనివృత్త్యర్థం గోముఖ ప్రసవశాంతిం కరిష్యే" యని సంకల్పించి గణేశపూజను మాత్రముఁ జేసి "అంగాదంగా"త్తను మంత్రముచే శిశువు శిరస్సు నాఘ్రాణించిన పైని ప్రయోగమధ్యమందే పుణ్యాహవాచన మని కౌస్తుభ మయూఖములు పుణ్యాహవాచనము శాఖోక్త ప్రకారముఁజేసి శిశువు శిరసును మూర్కొనిన పైని "అస్య గోముఖ ప్రసవస్య పుణ్యాహం భవంతో బ్రువంతు"అని ముమ్మారు పలుకవలెను. ఋత్విక్కులు ప్రతిగాఁబలుకవలెను గాని శాకోక్తముగాదని కమలాకరుఁడు. నాందీశ్రాద్ధ మక్కఱలేదు. అగ్నిని ప్రతిష్ఠించి యొక పీట యందు నవగ్రహములను నధిదేవతాదులను విడిచి యావాహనముఁజేసి యన్వాధానముఁ జేయవలయును.ఆజ్యభాగాంతమందు, అబ్దేవతలకు–"ఆపోహిష్ఠా" యను మూఁ డు ఋక్కులచేతను "అప్పు మే సోమః" అను గాయత్రీ ఋక్కుచేతను మిళితమైన పెరుగు, తేనె, నేయి ఈ మూఁడుగలపి ప్రతిఋక్కునకు నెనిమిదేసి యాహుతుల

చొప్పునను, విష్ణునకు "తద్విష్ణోః" అను ఋక్కుచే వాటిచే నెనిమిది యాహుతులను యక్ష్మహదేవతకు "అక్షీభ్యా" మనుసూక్తముచే ప్రతిఋక్కునకు నెనిమిదేసి యాహుతుల చొప్పున మిళిత దధిమధ్వాజ్యాహుతులను, నవగ్రహములకు నొక్కొక్కగ్రహమున కెనిమిదేసి యాహుతుల చొప్పున దధిమధ్వాజ్యాహుతులను వేల్చి శేషముతో స్విష్టకృతా దులని మయూఖాదులు కమలాకరుఁడు మాత్రము దధిమధ్వాజ్యాహుతులు నాలుగ ద్దేవతలకును విష్ణునకొక యాహుతియును యక్ష్మహదేవతకు అక్షీభ్యామనుసూక్తములో ప్రతిఋక్కుచే నెనిమిదేసి యాహుతులు నవగ్రహములకు నొక్కొక్కయాహుతియును వేల్చి శేషముచే స్విష్టకృత్తని చెప్పెను. ఆజ్యభాగాంతమందొక కలశమందు విష్ణువరుణ ప్రతిమలను పూజింపవలెను. ప్రతిమలుంచి విష్ణువరుణ యక్ష్మహులను ముగ్గురను బూజింపవలెనని మయూఖమం దున్నది ఆపైని నన్వాధానము ననుసరించి హోమ ముం జేయవలెనని సంక్షేపము. తక్కిన ప్రయోగము శాంతి గ్రంథమందుఁ జూడ వలెను. ఇట్లు ముందును దేవతయు ద్రవ్యము నాహుతి సంఖ్యయు ఫలము నిమిత్త మును వ్రాయఁబడును. తక్కిన ప్రయోగ విస్తరము నితర గ్రంథమునఁదెలియునది.

## కృష్ణచతుర్దశీ జననశాంతి

కృష్ణచతుర్దశియందుఁ బుత్రజననమైనచో నారువిధముల ఫలములు: ఎట్లనిన; చతుర్దశి నారుభాగములుచేసి యందు ప్రథమభాగమునకు శుభము. ద్వితీయభాగ మందుఁ దండ్రికనిష్టము. మూఁడవభాగమందుఁ దల్లికనిష్టము. నాల్గవభాగమందు మేనమామకు, నైదవభాగమందు వంశమున కనిష్టము. ఆఱవభాగమందు ధన నాశము, వంశనాశమునగును. అందు చతుర్దశి యారంభములలో ద్వితీయ తృతీయ షష్ఠాంశములయందు జననమగునపుడు గోముఖ ప్రసవశాంతి పూర్వకముగ జతుర్దశీ శాంతిఁ జేయవలెను. ఇతరభాగమందైనచో గేవల చతుర్దశీశాంతియే చేయవలెను. అపుడు "అస్య శిశోశ్చతుర్దశ్యా అముకాంశజననసూచిత సర్వారిష్ట నిరసనద్వారా శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం" అని మొదలగుసంకల్పము ఆగ్నేయదిక్కు మొదలుగ నాల్గు దిక్కులను నాల్గుకలశములు మధ్యమందు నూరుఛిద్రముల కలశమును నుంచి యందు ప్రతిమపై రుద్రావాహనముఁ జేయునది. మయూఖమందు మాత్రము పీఠమందు రుద్ర ప్రతిమనుఁ బూజించి దానికిఁ దూర్పునగాని యుత్తరమునగాని శతఛిద్రకలశము మొదలగు నైదునుంచిఁ బూజించుటయు నన్వాధానమందు గ్రహ ములకు సమిధలు, ఆజ్యము, నేయి వీనిచే నెనిమిదేసి యాహుతులును నధిదేవతాదు లకు వాటిచేతనే నొక్కొక్క యాహుతియును రుద్రునకు రావి, జువ్వి, మోదుగు, చండ్ర వీని సమిధలచేతను చరువుచేత నాహుతులు నాజ్యాహుతులును మినుములు తిలలు నావాలు వీనిచే నాహుతులును నొక్కొక్క వస్తువుచే నూటయెనిమిదిగాని యిరువదెనిమిదిగాని త్ర్యంబకమంత్రముతో నీయవలెను. అగ్నికి వాయువునకు సూర్యునికిఁ బ్రజాపతికిని తిలలచే నిన్ని యేసంఖ్యగల యాహుతులను నొక్కొక్క మారయినను వ్యస్తముగాను సమస్తముగాను వ్యాహృతుల నుచ్చరింపుచు నీయవలెను.

లేదా ప్రజాపతికే సమస్త వ్యాహృతులచే తిలలచే తను వేల్చునది. తక్కినదానిచే స్విష్ట కృత్తు మొదలగునది యని.

## సినీవాలీ, కుహూ, దర్శ అను నమావాస్యలో భేదములకు శాంతులు

అమావాస్యకు ప్రథమయామము సినీవాలీ, అంత్యోపాంత్యయామములు కుహూ సంజ్ఞికములు. మధ్యమందలి యైదుయామములు దర్శయనఁబడునని కొందఱు ఇతరులు చతుర్దశి మాత్రముతోగూడిన యహోరాత్రమునందుండు నమావాస్య సినీవాలీ. ప్రతిపత్తు మాత్రము గలసిన యహోరాత్రమునందుండు నమావాస్య కుహూసంజ్ఞికము. అందుచేత నమావాస్యకు దినత్రయము స్పృశించు రూపమగు వృద్ధిలేనిచో సూర్యోదయస్పర్శ లేకపోవుట యనుక్షయము లేకున్నపుడును దర్శలేదు. ఉదయమునకంటె పూర్వమహోరాత్రులందున్నది సినీవాలియే. ఉదయోత్తరమందున్నది కుహూవే. దినక్షయమందు నమావాస్యయంతయు దర్శసంజ్ఞికమే కానియపుడు సినీవాలీ కుహూభాగములులేవు. ఏమనిన; కేవలచతుర్దశీ కేవల ప్రతిపదలతో గూడుట యపుడు సంభవింపదు. ఇట్లు దినవృద్ధియందు మూఁడు దినములు స్పృశించినచో మధ్యమమందరువది గడియలుండు నమావాస్య దర్శసంజ్ఞికము. దానికి చతుర్దశ్యాది యోగము లేదు. పూర్వోత్తర దినములందుండు భాగములు సినీవాలీయు కుహూవు కావచ్చుననిరి. ఇది మయూఖమందు స్పష్టముగనున్నది. "సినీవాల్యాం ప్రసూతాస్యాద్యస్య భార్యాపశుస్తథా, గజాశ్వమహిషి చైవ శక్రస్యాపిశ్రియం హరేత్, గోపక్షి మృగదాసీనాం ప్రసూతి రపి విత్తహృత్, కుహూప్రసూతి రత్యర్థం సర్వదోషకరీస్మృతా, యస్య ప్రసూతి రేతేషాం తస్యాయుర్ధననాశనం, శాంత్యభావే ర్త్వతిత్యాగ మప్రజాతో న సంశయః, అత్యాగే నాశయేత్కించి త్స్వయం వానాశమాప్నుయాత్." అనఁగ సినీవాల్య మావాస్యయందు భార్యగాని ఆవుగాని గజముగాని గుఱ్ఱముగాని గేదెగాని ప్రసవమైనచో సంపత్తి నశించును. గోవు పక్షి మృగము దాసియు ప్రసవించిన నట్లనేయగును. కుహ్వమావాస్యయందైనచో సర్వదోషములు గలుగును. శాంతి చేయనిచో వాని విడిచి పెట్టవలయును. అట్లుచేయనిచో నేమైనహాని గల్గును. జనన మైనదియు నశించును. కనుక నట్టిశాంతియందు "సినీవాలీ జననసూచి తారిష్ట నిరసనద్వారా" యనియు, "కుహూజనన సూచితారిష్ట నిరసనద్వారా" యనియు సంకల్పము. కుహూజననమందు గోప్రసవశాంతియుఁ జేయవలెనని కొందఱు. ఈ రెంటియందును జతుర్దశీ శాంతియందువలె శతఛిద్రకలశముతో గూడిన యైదు కలశములుంచి మధ్యమందు రుద్రుఁడు ప్రధానదేవత. ఇంద్రుఁడు పితృదేవతలు పార్శ్వదేవతలు. ఇట్లు మూఁడు ప్రతిమలు. ఇంద్రునికి పితృదేవతలకును ప్రధాన రుద్రునికంటె న్యూనసంఖ్యచే ప్రధానమునకు చెప్పిన ద్రవ్యములన్నిఁటితో హోమము మిగిలిన యన్వాధానదేవతల నూహించుట చతుర్దశీ శాంతికివలె నూహించునది. ప్రధాన దేవతా పూజఁజేసినపైని గోవస్త్రస్వర్ణదానముచేసి "గోభూతిల హిరణ్యాజ్య

వాసోధాన్యగుడాని చ, రౌప్యం లవణమిత్యేత ద్దశదానానిదాపయేత్."అనఁగా నీదశ దానములు చేయునది. "క్షీరాజ్యగుడ దానం చ కృత్వా హోమం సమారభేత్."ఈ దానములు ఋత్విక్కుల కీవలయును. గనుక నంతమందుఁ దిరుగ దక్షిణలనివ్వ నక్కఱలేదు. కనుకనే యిక్కడ గోవు మొదలగునవి దక్షిణారూపములుగను దానము సదక్షిణమగును. మఱియొకచో నీదానములు చేయునపుడు దక్షిణతో నీయవలెను.

## దశదానముల పరిమాణము

భూమి గోచర్మమాత్ర మీవలెను. అనఁగా సప్తహస్తము లననేడు మూరలు దండ మనఁబడును. ముప్పదిదండములు వర్తనమనఁబడును. పదివర్తనములు గోచర్మ మనఁబడును. తిలలు మీఁద జెప్పిన ద్రోణపరిమితములు గావలెను. సువర్ణము రజతమును మీఁదఁ జెప్పిన మాషములు పదిగాని యందు సగముగాని సగములో సగముగాని యీవలెను. ఆజ్యము నలువది పలములు వస్త్రము మూడు హస్తముల పరిమితిగలి. ధాన్య మైదుద్రోణములు. ఇట్లు గుడలవణములును, అంతమట్టివ్వలేనిచో నిత్యనైమిత్తికములందు యథాశక్తిగ నీయవలెను. యథాశక్తి హిరణ్యమైనను దత్తత్ప్రతినిధిగ నీయవచ్చును. అపుడు "హిరణ్యగర్భ" యను మంత్రము పఠించునది. నైమిత్తికాదులు చేయనిచో బ్రత్యవాయము విధింపఁబడినది. అభ్యుదయార్థము దశదానములు శక్తిలేనిచో చేయనక్కఱలేదు. హోమాంతమందు బలిదానము నభిషేకము మొదలగునవి చేయవలెను.

## దర్శశాంతి

"అథాతో దర్శజాతానాం మాతాపిత్రోర్ధరిద్రతా, తద్దోషపరిహారార్థం శాంతిం వక్ష్యామి తే సదా" యనఁగ దర్శయందు జననమైనచో తలిదండ్రులకు దారిద్ర్యము వచ్చును. కనుక నాదోషము శాంతించుటకు కర్మవిశేషముఁ జెప్పెదనని యర్థము. "అస్యదర్శజనన సూచితారిష్ట నిరాసార్థం శాంతిం కరిష్యే" యని సంకల్పించి స్థండిలమునకుఁ దూర్పున కలశముంచి కలశమునకు నగ్నికిని మధ్యమందు సర్వతో భద్ర పీఠమున బ్రహ్మాది మండలదేవతల నావాహనముచేసి వారి మధ్యమందు స్వర్ణప్రతిమపై పితృదేవతల నావాహనము చేయవలయును. వారికి దక్షిణముగ రజతప్రతిమ యందు నాప్యాయస్వయను మంత్రముచే సోముని నుత్తరమున రాగి ప్రతిమయందు "సవితాపశ్చా"త్తను మంత్రముచే సూర్యుని నావాహనముచేసి పూజించి యగ్నినిఁ బ్రతిష్ఠించి సర్వతోభద్రమున కీశానదిక్కున గ్రహస్థాపనము మొదలుగ చేయునవి. అన్వాధానమం దాదిత్యాది గ్రహములకు వారిసంఖ్యచే సమిచ్చర్వాజ్యాహుతులును పితృదేవతల కిరువదెనిమిది సంఖ్యచే సమిచ్చ ర్వాహుతులను సోమునికి వేల్చి మిగిలిన దానిచే స్విష్టకృత్తు మొదలగునది యని ఇక్కడ స్విష్టకృత్తుచేయక ముందుఁ దలిదండ్రులకును శిశువునకును గలశోదకముచే నభిషేకము నటపైని స్విష్టకృద్విధానాదికము నని విశేషము.

# నక్షత్రశాంతి

అందు మూల నక్షత్రమునకు ఫలము. "పితా౹మ్రియేత మూలాద్యే పాదే పుత్ర జనిర్యది, ద్వితీయ జననీ నాశో ధననాశ స్తృతీయకే, చతుర్థే కులనాశోత శ్శాంతిఃకార్యా ప్రయత్నతః, క్వచిచ్చతుర్థ చరణశ్శుభ ఉక్తో మనీషిభిః, ఏవం చ దుహి తుర్జ్ఞేయం మూలజాత ఫలంబుధైః". అనఁగా మూలానక్షత్రముయొక్క ప్రథమపాదమందుఁ బుత్రజననమగునేని దండ్రి కనిష్టమగును రెండవ పాదమైనచో దల్లి కనిష్టము. మూఁడవపాదమందగునేని ధననాశము. నాల్గవపాదమం దగునెడ గులనాశము గనుక ప్రయత్నముతో శాంతిచేయవలెను. కొందఱు మూల నాల్గవ పాదము శుభమే యంద్రు. ఇట్లు కన్యఁబుట్టినను మూలా నక్షత్రఫలము దెలియ వలయును ననుట. కేచిత్తు 'న కన్యాహంతి మూలర్షే పితరం మాతరం తథా, మూలజాశ్వశురం హంతి శ్వశ్రూమాశ్రేషజాసుతా, జ్యేష్ఠాయాంతు పతిజ్యేష్ఠం విశాఖోత్థాతు దేవరం, శాంతిర్వా పుష్కలాస్యాచ్చే త్తర్హిదోషో నవిద్యతే. ఇత్యాహుః" అనఁగా కొందఱు మూలనక్షత్రమందు కన్యకపుట్టినచో తల్లిదండ్రి మొదలగువారికి కనిష్ట మేమియులేదుగాని మామ కనిష్ట మగును. ఆశ్రేషయందుఁ బుట్టినచో నత్తకు హానిగలుగును. జ్యేష్ఠయందైనచో బావకు హానియగు. విశాఖయందైనచో మరిది కనిష్ట మగును. పుష్కళమైన శాంతి జరిగినచో నట్టిదోష ముండదని చెప్పుదురనుట.

"శ్లో. అభుక్తమూల సంభవం పరిత్యజేత్తుబాలకం సమాష్టకం పితాథవానతన్ముఖం విలోకయేత్, జ్యేష్ఠాంతే ఘటికాచైకా మూలాదౌ ఘటికాద్వయం, అభుక్తమూల మథవాసంధినాడీ చతుష్టయం, వృషాళిసింహేషు ఘటే చ మూలం దివిస్థితం యుగ్మతులాంగనాంత్యే, పాతాళగం మేషధనుః కుళీరన క్రేషు మర్త్యేష్వితిసంస్మరంతి. ఏతల్లగ్నఫలం:- స్వర్గే మూలే భవేద్రాజ్యం పాతాళే చ ధనాగమః, మర్త్యలోకే యదా మూలం తదాశూన్యం సమాదిశేత్, నవమాసం సార్ప దోషో మూలదోషోష్టవర్షకం, జ్యేష్ఠా మాసాన్పంచదశతావద్దర్శన వర్జనం,వ్యతీ పాతేంగహానిస్స్యాత్పరిఘే మృత్యు మాదిశేత్, వైధృతౌ పితృహానిస్స్యాన్నష్టేందావంధతాం వ్రజేత్, మూలే సమూలనాశస్స్యా త్కులనాశో ధృతౌ భవేత్, వికృతాంగశ్చ హీనశ్చ సంధ్యయో రుభయోరపి, తద్వత్స దండజాతస్తు పాదజాత స్తథైవచ, తస్మాచ్ఛాంతిం ప్రకుర్వీత గ్రహాణాం క్రూరచేతసాం." అనఁగా జ్యేష్ఠానక్షత్రాంతమం దొకగడియయు మూలానక్షత్రమందు మొదటి రెండు గడియలు నభుక్తమూల మనఁబడును. లేదా జ్యేష్ఠకు మూలకును రెంటికి మధ్యస్థమైన నాల్గు గడియల భుక్తమూలము దానియందుఁ బుట్టినపుత్రుని విడిచిపెట్టి వేయవలెను. లేదా యెనిమిది సంవత్సరముల పర్యంతము తండ్రి యాతని ముఖము చూడఁ గూడదు. మఱియును వృషభము, కర్కటకము,సింహము, కుంభము, నీలగ్నములందు మూలము దివియందు దుండును. మిధునము, తుల, మీనము, కన్య వీనియందు పాతాళమందుండును. మేషము, ధనుస్సు,వృశ్చికము, మకరము వీనియందు మర్త్యలోకమందుండును. ఈ లగ్నములకు ఫలము : స్వర్గమందు మూలమున్నచో రాజ్యము పాతాళమందున్నచో ధనాగమము. మర్త్యలోకమందున్నచో శూన్యము

నగును. మఱియు నాశ్రేష దోషము తొమ్మిది మాసములు. ఎనిమిదిసంవత్సరముల పర్యంతము మూలదోషము. జ్యేష్ఠాదోషము పదునైదు మాసములవఱకు నుండును. కనుక నంతంత కాలము చూడఁగూడదు. వ్యతీపాతయం దంగవికలిత యగున. పరిఘయందు మృత్యువులై ధృతియందు తండ్రి గండము కుహూసంజ్ఞమందు నంధత్వము నొందును. మూలయందు సమూలము నశించును. ధృతియందు గులనాశ మగును. సంధ్యాకాలములు రెంటియందు వికలాంగుఁడు హీనుఁడు నగును. అట్లు దంతములతో బుట్టును. శీర్షోదయము మాని పాదములద్వారముగఁ బుట్టును. కనుక క్రూరగ్రహములకు శాంతి చేయవలయును.

## సర్వశాంతులకు నుపయోగించు నిర్ణయము

వ్యతీపాతాదాలందు గ్రహముఖముతోఁగూడ నాయాశాంతి జేయునది. ఇతర శాంతులందు గ్రహమఖ మావశ్యకముగాదని తెలియునది. "ముఖ్యకాలం ప్రవక్ష్యామి శాంతిహోమస్య యత్నతః జాతస్య ద్వాదశాహేతుజన్మర్శేవాశుభేదినే" అఁనగా జనన మైన పండ్రెండవ దినమందును జన్మనక్షత్రమందును లేక శుభమైన దినమందైనను శాంతిఁజేయవలెను. పండ్రెండవ దినమందు శాంతిఁ జేయునెడ, శాంత్యుక్తన క్షత్ర మాహుతియు వహ్ని చక్రము వీని విమర్శమక్కఱలేదు. కాలాంతరమందుఁ జేయునేని యావశ్యకము. ఇట్లితర శాంతులందు నూహించునది. అదియెట్లనిన–"శుక్లాదితస్తిథి స్సైకావార యుక్తాబ్ధిశేషితా స్వేగుణేభువివాసోగ్నే ర్ద్వ్యేకయోస్స్యాదధోదివి."అనఁ గా శుక్లపక్ష ప్రతిపద మొదలు తిథిసంఖ్యలో నొకటి కలిపియు వారసంఖ్యయు గలిపి నాలుగింటి హరించినచో నాలుగు మూఁడు మిగిలిన యెడ భూమియందగ్ని యుండును. రెండు మిగిలిన యెడ నధోలోకమందుండును. నొకటి మిగిలినచో దివియందుండునని తెలియునది. అందు భూమియం దగ్ని శుభము. "హోమాహుతి స్సూర్యతస్త్రి భంత్రిభంగణ్యం ముహుస్త్రచచంద్రభావధి, సూర్యజ్ఞశుక్రార్కజ చంద్ర భూమిజాజీవస్తమః కేతుర సత్య సమ్ముఖే." అనఁగా సూర్యుఁడున్న నక్షత్రము మొదలు కొని చంద్రుఁడున్న నిత్యనక్షత్రము పర్యంతము మూఁడేసి నక్షత్రములకు క్రమముగ రవి, బుధ, శుక్ర, శని, చంద్రాంగారక, గురు, రాహు, కేతువు లధిపతులని తెలియు నది. అందు రవి, రాహు, కేతు, శన్యంగారకులు దుష్టగ్రహములు. వీనిలోనైనను అసద్గ్రహము సమ్ముఖమందనఁగా హోమముఁ జేయు నక్షత్రమందులేనిచో పూర్ణా హుతి చేయవచ్చుననియర్థము. సంస్కార నిత్యకర్మలయందును నిమిత్తావ్యవధానముగ చేయు నైమిత్తికములందును రోగాతురుఁడై నపుడును వహ్నిచాక్రాదిశో ధనమక్కర లేదు. "అగ్నిస్థాపన వేళాయాం పూర్ణాహుత్యా మథాఽపివా, ఆహుతిర్వహ్నివాసశ్చ విలోక్యాశాంతి కర్మణి." అనఁగా శాంతికర్మయందగ్ని చక్రాదిశోధనము. నగ్ని ప్రతిష్ఠఁ జేయునపుడును బూర్ణాహుతి సమయమందును గావలెననుట. ఉత్తర, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర, రోహిణి, శ్రవణము, ధనిష్ట, శతభిషక్కు, పునర్వసు, స్వాతి, మఘ, అశ్విని, హస్త, పుష్యము, అనూరాధ, రేవతి, ఈ నక్షత్రములందును గురుశుక్రాస్తమయ ముల మాసాదిదోషములులేని శుభమైనవారము తిథి మొదలగువానియందును

శాంతిఁ జేయవలెను. నిమిత్తము రాగానే నైమిత్తికముఁ జేయునపుడును రోగాదిక మందును శాంతిఁజేయునపుడు గురు శుక్రాస్తాది దోషము లేదు. ఇట్లు ప్రసక్తాను ప్రసక్తిచే సర్వశాంతుల కుపయోగించు నిర్ణయము.

## అభుక్తమూల జననశాంతి ప్రయోగము

ఆ భుక్తమూలమం దుత్పత్తియైనచో నెనిమిది సంవత్సరములు చూడక యటు పైని శాంతిజేయునది. మూలయందు నన్యభాగమునబుట్టినచో బండ్రెండవదిన మందైనను దిరుగవచ్చు మూలయందైన శుభదినమందైనను మఱియొక శుభదిన మందైనను గోప్రసవశాంతిఁ జేసి "అస్యశిశోః మూలప్రథమ చరణోత్పత్తి సూచితదోష నిరాసార్థం సగ్రహమఖశాంతిం కరిష్యే." యని సంకల్పించవలెను. ద్వితీయాదిపాద ములందుత్పత్తి యైనపుడు నట్లు సంకల్ప మూహించునది. బ్రహ్మసదస్యములు వైకల్పిక ములు. ఋత్విజు లెనమండ్రుగాని నలుగురుగాని యుండవలెను. మధ్యకలశమందు స్వర్ణప్రతిమపై రుద్రుని కావాహనాదులు చేయునది. అతకి నాల్గుదిక్కులనున్న కలశము లందును నక్షతలపై వరుణపూజఁ జేయవలెను. లేదా మధ్యకుంభమందు ప్రతిమ యందు రుద్రుని వాని కుత్తరమగు కుంభమున వరుణుని పూజంపవలెనని కుంభ ద్వయము. రుద్రకుంభోత్తర కుంభమందు ప్రతిమలయందు నిరృతి నింద్రుని నద్దేవతల నావాహనముఁజేసి పద్మముయొక్క యిరువదినాల్గు దళములందు నుత్తరాషాఢ మొదలుకొని యనూరాధ యంతముగ నిరువదినాలుగు నక్షత్రముల విశ్వేదేవాది చతుర్వింశతి దేవతలకును బియ్యము మొదలగువానిలో నావాహనము దిక్కులయందు లోకపాలురను నావాహనముఁజేసి పూజింపవలెను. అగ్నికి గ్రహములకు స్థాపనమైన పైని యన్వాధానమందలి సూర్యాది గ్రహములకు సమిచ్చర్వాజ్యాహుతులును నిరృతికి ప్రతిద్రవ్యముచేతను నూటయెనిమిది చొప్పున ఘృతమిశ్రపాయసము సమిధలు ఆజ్యము చరువు వీటిచే నాహుతులును వేల్చవలెను. లేదా పాయసముచే నూటయెని మిది దాహుతులును సమిదాజ్యచరువులచే నిరువదెనిమిది చొప్పున నింద్రునికి నద్దేవతలకు ప్రతి ద్రవ్యము నిరువదెనిమిది చొప్పున పాయస సమిదాజ్యచరువులచే నాహుతులును, విశ్వేదేవులు మొదలగు నిరువదినలుగురు దేవత లకు నెనిమిదేసి పాయసాహుతులును, రక్షోదేవత కగ్నికి కృణుష్వపాజ యనుపదునైదు ఋక్కులచేఁ బ్రతిఋక్కునకు నెనిమిదేసి చొప్పున కృసరాహుతులును, సవితకు దుర్గకు త్ర్యంబకునికి కవులకు దుర్గకు వాస్తోష్పతికి నగ్నికి క్షేత్రపాలునికి మిత్రావరుణు లకు నగ్నికి నెనిమిదేసి కృసరాహుతులును, శ్రీదేవతకు హిరణ్యవర్ణామని మొదలుగ పదునైదు ఋక్కులచే ప్రతిఋక్కునకు నెనిమిదేసి చొప్పున సమిదాజ్యచరువులచే నాహుతులును, సోమునికి పదుమూఁడు పాయసాహుతులును, రుద్రునకు స్వరాట్టు నకు నాల్గు మారులుఁ గ్రహించిన యాజ్యముచే నాహుతియును, అగ్నికి వాయువు నకు సూర్యు నికిఁ బ్రజాపతికిని యాజ్యాహుతులును వేల్చి మిగిలినదానిచే స్విష్టకృత్తుఁ జేయునది. ఇందు కవులకునునపుడు ఋత్విక్ స్తుతికని యుద్దేశము. మయూఖాదు లలో నున్నది. మూఁడుచేటలలో నిర్వాపము చేయునది. అందు మొదటిచేటలలో పాయసము కొఱకు

నూరకే పం[డెండు పిడికిళ్లును నిర్ఋతి నిం[ద్రుని నద్దేవతలను ద్దేశించి నిర్వాపముఁ జేసి రెండవచేటలో చరువుకొరకు నాముగ్గుర నుద్దేశించి నిర్వాపముఁజేసి రెండవ చేటలో చరువు కొరకు నాముగ్గుర నుద్దేశించియే పం[డెండు పిడికిళ్లును, దిరుగ మొదటిచేటలో తొంబది యారుపిడికిళ్ళు పాయసము కొరకును, మూఁడవచేటలో కృసరమనఁగ పులగమునిమిత్తము నలుబది నాలుగు పిడికిళ్లును, దిరుగ రెండవ చేటలో నాలుగుపిడికిళ్లును దిరుగ మొదటిచేటలో సోమునికొరకు నాలుగు పిడికిళ్లును నిర్వాపముచేసి అటుపైని మూఁడుచేటలలో నాహుతులకు చాలినతండులములనుఁ దీసుకొని నిర్వాపనము సంఖ్యచే ప్రోక్షించి మూఁడుపాత్ర లలో మూఁడు హవిస్సుల నుడికింపవలెను. తిలలు బియ్యముఁగలిపి వండినచో గృసర మనఁబడును. గ్రహ ములనిమిత్తము గృహమందు వండినయన్నముఁ గ్రహింప వచ్చును. సర్వగ్రంథము లందును నిర్ఋత్యాదుల కొఱకు నిర్వాపక్రమముచేః బ్రతిష్ఠిం చిన యగ్ని యందుడి కించుటయే విధింపఁబడినది గనుక గృహసిద్ధాన్నమందు పాలు తిలలును గలిపి పాయసము కృసరము సంపాదించుట ప్రమాదాలస్యములచే నగు కర్మ భ్రంశమే యని యెఱుంగునది. అటుపైని హోమకాలమందు యజమానుఁడు త్యాగముఁ జెప్పవలెను. అపుడు "ఏతావత్సంఖ్యాహుతి పర్యాప్తం సమిదాజ్య చరు ద్రవ్యమాదిత్యాది గ్రహేభ్యో నమమ" యని యుచ్చరించునది. ఇట్లధిదేవతాదు లకు నూహించునది. అటుపైన అష్టోత్తర శతసంఖ్యా పర్యాప్తం ఘృతమిశ్రపాయసం అష్టోత్తర శతాహుతీనాం అష్టావింశత్యాహుతీనాం వాపర్యాక్తం సమిదాజ్య చర్వాత్మకం ద్రవ్యత్రయ మిదం నిర్ఋతయే నమమ" యని త్యాగము. ఇట్లు "అష్టావింశత్యాహుతి పర్యాప్తం పాయసస మిచ్చ ర్వాజ్యం ద్రవ్య చతుష్టయ మింద్రాయ నమమ"యని త్యాగము. ఇట్లద్దేవతలకు "నద్భ్యో నమమ" యని యూహించునది. ఇట్లు"అష్టాహుతి పర్యాప్తపాయసం విశ్వేభ్యో దేవేభ్యో నమమ 1.విష్ణవే...2. వసుభ్యో 3. వరుణాయ... 4. అజైకపదే..5. అహయే బుధ్న్యాయ...6.పూషే...7. అశ్విభ్యాం...8. యమాయ...9. అగ్నయే ..10. ప్రజా పతయే 11. సోమాయ 12. రుద్రాయ 13. అదిత్యై 14. బృహస్పతయే 15. సర్వేభ్యః 16. పితృభ్యో 17. భగాయ 18. అర్యమ్ణే 19. సవిత్రే 20. త్వష్ట్రే 21. వాయవే 22. ఇంద్రాగ్నిభ్యాం 23. మిత్రాయ 24. నమమ" అని యిరువదినాలుగు త్యాగములు. మఱియు "వింశత్యధిక శతాహుతి పర్యాప్తం కృసరం, రక్షోఘ్నేగ్నయే నమమ. అష్టాహుతి పర్యాప్తం కృసరం, సవిత్రే, దుర్గాయై, త్ర్యంబకాయ, కవిభ్యో, దుర్గాయై, వాస్తోష్పతయే, అగ్నయే, క్షేత్రపాలాయ, మిత్రా వరుణాభ్యాం, అగ్నయే నమమ. ప్రతిద్రవ్యం వింశత్యధిక శతాహుతి పర్యాప్తాం సమిచ్చ ర్వాజ్యానిశ్రియై నమమ. త్రయోదశాహుతి పర్యాప్తం పాయసం సోమాయ నమమ. చతుర్గృహీతాజ్యం రుద్రాయ స్వరాజేనమమ, ఏకైకాహుతి పర్యాప్త మాజ్య మగ్నయే, వాయవే, సూర్యాయ ప్రజాపతయే నమమ" యని క్రమముగ త్యాగముల నాయాసంఖ్యగల యాహుతి ద్రవ్యముల యొక్కయు దేవతలయొక్కయు నుచ్చారణముతోఁ జేయునది. కొందఱు "ఇదముపకల్పిత మన్వాధానోక్త ద్రవ్యజాతమన్వాధా నోక్తాహుతి సంఖ్యాపర్యాప్త

మన్వాథానోక్తాభ్యో యక్ష్యమాణాభ్యో దేవతాభ్యో నమమ" యని సంక్షేపముగా త్యాగముఁ జేయుచున్నారు. అనంతరమందు గ్రహమంత్రముల చేతను, నిర్ఋతి మొదలగు దేవతలమంత్రములచేతను యథార్థ్వముగ హోమముఁ జరిగిన పైన గృహపూజయు స్విష్టకృత్తు నవాహుతియు బలిదానము పూర్ణాహుతియు పూర్ణపాత్ర విమోకము మొదలుగ వహ్నిపూజఁ జేసిన పైని యజమానాదుల కభిషేకముఁ జేయఁ గా యజమానుఁడు శుద్ధవస్త్రములను చందనమును ధరించి "మానస్తోకే" యను మంతమున విభూతిధరించి ముఖ్యదేవతాపూజయు విసర్జనము శ్రేయోగ్రహణము. అనఁగ నాశీర్వాదము గ్రహించుట దక్షిణాదానమును జేయవలెను. నూర్గురికిగాని ఏఁబది విప్రులకుగాని పదుగురికిగాని బ్రాహ్మణభోజనముఁ జేయించు నది యని సంక్షేపము.

## ఆశ్రేషాజననశాంతి

ఆశ్రేషానక్షత్రమునకు ఫలము :- ఆ నక్షత్రముయొక్క గడియలు క్రమముగ నైదు, ఆరునొకటి, రెండు, మూఁడు నాల్గు, ఎనిమిది, పదునొకండు, ఆరు, తొమ్మిది, అయిదునని పదివిధములుగ విభాగించి వాటికి ఫలములు క్రమముగ రాజ్యము, పితృనాశము, మాతృనాశము, కామభోగము, పితృభక్తి, బలము, హింసకత్వము, త్యాగము, భోగము, ధనము నని పదివిధములుగ నున్నవి. మరియు పాదవిభాగముచే ఫలములు గలవు. అందు మొదటిపాదము శుభము. రెండవపాదమందు ధనాశము. మూఁడవపాదమందు దల్లికనిష్టము. నాల్గవపాదమందుఁ దండ్రికనిష్టము. ఆశ్రేష మొదటిపాదము తప్ప తక్కిన పాదములలో జన్మించిన కన్యకయత్తకనిష్టముజేయును. ఇట్లు పెండ్లికొడుకు నాశ్రేషా ద్వితీయాది పాదములఁ బుట్టినవాఁడైనచో నత్తకు హానియగును. "ఆశ్రేషా సర్వపాదేషు శాంతిః కార్యా ప్రయత్నతః, జాతస్య ద్వాదశా హేతు శాంతికర్మసమారరేత్, అసంభవేతు జన్మర్షే అన్యస్మిన్ వా శుభేదినే" అనఁ గా, ఆశ్రేష నాల్గుపాదములకు ప్రయత్నముతో శాంతిఁజేయవలెను. పుట్టిన పండ్రెండవ దినమందే చేయవలెను. అపుడు సంభవింపనిచో జన్మనక్షత్రమందైనను మఱియొక శుభదినమందైననుఁ జేయవచ్చును. అట్లుక్త కాలమందు గోముఖ ప్రసవశాంతినిజేసి "అస్య శిశోరాశ్రేషా జనన సూచిత సర్వారిష్టపరిహారద్వారా"యని మొదలుగ సంకల్పము జేసి మూలశాంతియందువలె కలశద్వయమందు రుద్రుని వరుణుని బూజించి యిరువదినాల్గుదళములుగల పద్మమందున్న కుంభమందు ప్రతిమయం దా శ్రేషాధిపతులగు సర్పముల నావాహనముజేసి దానికిఁ దక్షిణముగ పుష్యదేవతను బృహస్పతిని నుత్తరమున మఘాదేవతలగు పితృదేవతల నావాహనముజేసి దళములందు దూర్పు దళము మొదలుకొని ప్రదక్షిణముగ పుబ్బ కధిపతి భగదేవతమొదలుకొని పునర్వసు దేవతయగు నదితిపర్యంతము నిరువదినాలుగురు దేవతల కావాహనాదికముఁ జేయవలెను. కౌస్తుభగ్రంథమునందు తైత్తిరీయమంత్రములచే పుష్యము మఘ పుబ్బ మొదలగు నక్షత్రములకే యావాహనము చెప్పఁబడినదిగాని దేవతలకుఁ జెప్పలేదు. అటు పైని లోకపాలుర నావాహనముజేసి యట్టి సర్వదేవతలను బూజించి యగ్నిని గ్రహ

ములను నిలిపి యన్వాధానముఁ జేయునది. ఆదిత్యాదిగ్రహముల నుద్దేశించిన పైని ప్రధానదేవతలగు సర్పములకు నొక్కొక్కవస్తువుచే నూటయెనిమిదేసియైనను నిరువ దెనిమిదేసియైనను నాహుతులు ఘృతమిశ్రమైన పాయసము సమిధలు నాజ్యము చరువు నీహోమవస్తువులచేనిచ్చి బృహస్పతికిని పితృదేవతలకును నిరువదెనిమిది చొప్పునగాని యెనిమిది చొప్పునగాని యాహోమద్రవ్యములచేతనే యాహుతులను వేల్చి రక్షోహదేవత మొదలగువాని యుద్దేశము మూలశాంతికివలె నూహించునది. అట్లనే పాయసకృసరచరువుల శ్రవణమును హవిస్త్యాగము నూహించునది. కౌస్తుభోక్త ప్రధానదేవతామంత్రములచేతనే ఆయాహోమము చేయునది. మిగిలినది మూల శాంతికివలె జేయవలెను.

## జ్యేష్ఠా నక్షత్ర ఫలము

"శ్లో. జ్యేష్ఠాయా దశాభాగేషు ఆద్యేమాతా మహీమృతిః, మాతామహం ద్వితీయే చ తృతీయే హంతిమాతులం, తుర్యేజాతో మాతరం చ హంత్యాత్మానం తు పంచమే, గోత్రజాన్ షష్ఠభాగే చ సప్తమేతూ భయంకులం, అష్టమే స్వాగ్రజం హంతి నవమేశ్వ శురం తథా, దశమాంశక జాతస్తు సర్వం హంతి శిశుర్ధ్రువం, జ్యేష్ఠర్షేతుపుమాన్ జాతో జ్యేష్ఠభ్రాతుర్వినాశకః, జ్యేష్ఠర్షే కన్యకాజాతా హంతి శీఘ్రంధవాగ్రజం, పాదత్రయే జాత నరో జ్యేష్ఠోప్యత్ర ప్రజాయతే, జ్యేష్ఠాంత్యపాద జాతస్తు పితు స్స్వస్య చనాశకః " అనఁగా మూలకువలె జ్యేష్ఠకును గడియలు పదివంతులువేసి యందు మొదటి యంశమున జననమైనచో దల్లితల్లి కనిష్ఠము. రెండవదానియందైనచో దల్లి తండ్రికిని, మూఁడవభాగమందు మేనమామకును, నాల్గవభాగమందు తల్లికిని, నైదవభాగమందు శిశువునకును, నాఱవభాగమందు వంశస్థులకును, నేఁడవ భాగమందు మాతృపితృ వంశములవారి కుభయులకును, యెనిమిదిదవభాగమున జ్యేష్ఠభ్రాతకును, దొమ్మిదవ భాగమున మామకును, పదియవభాగము సర్వమునకును హాని యగునని తెలియు నది. మఱియు భాగవివక్షలేకనే జ్యేష్ఠానక్షత్రమునందు శిశువు పుట్టినమాత్రమునఁ జ్యేష్ఠునికి హానియగు కన్యకఁబుట్టినయెడ తనబావకు హానిచేయును. పాదత్రయ మందుఁ బుట్టినచో దిరుగఁబుట్టును. అంత్యపాదమందుఁ బుట్టినచో తండ్రికిఁ దనకును హాని చేయునుట. పండ్రెండవ రోజునగాని శాంతికిఁజెప్పిన శుభదినమందు గాని గోప్రసవశాంతిచేసి "అస్య శిశోర్జ్యేష్ఠర్ష జననసూచిత సర్వారిష్ఠ పరిహారద్వారా" యని మొదలుగ సంకల్పించి మధ్యకలశమందు సువర్ణ ప్రతిమపై శచీదేవితో నైరావ తము నెక్కిన యింద్రుని లోకపాలుర నావాహనముచేసి యెఱ్ఱనిబట్టలు రెండును నివేదనకు చక్కిలములుఁ గలిగిన షోడశోపచారములచేఁ బూజించి యతనికి నాలుగు దిక్కులను నాలుగు కలశములుంచి యతనికే తూర్పున మధ్యభాగమందు నూరు చిద్రములుగల కలశముంచి పూర్ణపాత్రముతోగూడిన నాలుగు కలశములందును ఫలాదులపై వరుణున కావాహన పూజనాదికము చేయునది. అన్వాధానమందుఁ గ్రహముల కన్వాధానమైన పైని నింద్రునికి మోదుగుసమిధలు ఘృతము చరువును వీనిచే నొక్కొక్క వస్తువుచే నూటయెనిమిది చొప్పున "ఇంద్రాయేంద్రో మరుత్వత"

యను మంత్రముచే నాహుతులును, ప్రజాపతికి నూటయెనిమిది తిలాహుతులు సమస్త వ్యాహృతి మంత్రముచేతను వేల్చి మిగిలినదానిచే స్విష్టకృత్తునని మొదలుగఁ జేయునది. నూటయెనమండ్రు బ్రాహ్మణుల భుజింపఁజేయునది.

## చిత్రాది నక్షత్ర జననశాంతి

"శ్లో. చిత్రాద్యేర్థే పుష్యమధ్య ద్విపాదే పూర్వాషాఢాదిష్ణ్య పాదేతృతీయే, జాతః పుత్రశ్చోత్తరాద్యే విధత్తే పిత్రో ర్భ్రాతు స్స్వస్యచాపి ప్రణాశం." అనఁగా చిత్రానక్షత్రము మొదటి సగమందుఁ బుట్టినను పుష్యనక్షత్రము రెండు మూఁడు పాదములలోఁ బుట్టినను పూర్వాషాఢ మూఁడవపాదమందుఁ బుట్టినను నుత్తరఫల్గుణి మొదటి పాద మందుఁ బుట్టినను శిశువునకుఁ దలిదండ్రులకును సోదరునికి హానియగునని యర్థము. ఇక్కడ నిట్లు తోఁచుచున్నది. చిత్రా నక్షత్రమందు మొదటి సగములో జననమైనచో గోప్రసవశాంతి చేసి నక్షత్రాధిపతి ప్రతిమనుపూజించి మేకదానము చేయవలెను. ఇట్లు పుష్యనక్షత్రమునకుఁ దెలియునదిగాని ఛాగమునకు ప్రతి గోదా నము. ఉత్తరా ప్రథమ పాదమందు జననమైనచో నక్షత్రాధిప పూజయు తిలపాత్ర దానముఁ జేయునది. పూర్వాషాఢా తృతీయ పాదమందు నక్షత్రాధిప పూజయు సువర్ణదానమునుఁ జేయునది. మఘా ప్రథమచరణమందు మూలకువలె ఫలము. అందు గోప్రసవము నక్షత్రేశపూజయు గ్రహముఖమునఁ జేయునది. మఘకు మొదటి రెండుగడియలలో జననమైనచో నక్షత్రగండాంత శాంతియుగూడఁ జేయవలెను. రేవతి తుద రెండుగడియలలోగాని యశ్విని మొదటి రెండు గడియలలోగాని జనన మైనచో నక్షత్ర గండాంతశాంతియు గోప్రసవము గ్రహమఖమునఁ జేయునది. రేవత్యశ్వినుల యితరభాగములందును మఘ రెండవపాదము మొదలగు వాని యందును దోష విశేషము చెప్పనందున శాంతిఁజేయ నక్కరలేదు. ఇట్లు విశాఖ నాల్గవ పాదమందు జననమైనచో స్యాలకునికి మఱదికి హాని మొదలగు దుష్ట ఫలము చెప్పినందున గ్రహముఖము చేయునది. దుష్టఫలము మాత్రము చెప్పి శాంతి విధింపనిచో గ్రహమఖముఁ జేయవలెనని నిర్ణయసింధువు. ఇట్లితర నక్షత్రము లకు నూహించునది.

## వ్యతీపాత వైధృతి సంక్రాంతి శాంతులు

"శ్లో. కుమార జన్మకాలేతు వ్యతీపాతస్య వైధృతిః" సంక్రమశ్చ రవే స్తత్ర జాతో దారిద్ర్యకారకః, అశ్రియం మృత్యుమాప్నోతి నాత్రకార్యావిచారణా, స్త్రీణాం చ శోకదుఃఖం చ సర్వనాశ కరోభవేత్, గోముఖ ప్రసవంకుర్యా చ్ఛాంతించ స నవ గ్రహం." అనఁగా వ్యతీపాతమందు వైధృతియందు సంక్రాంతి యందునుఁ బుత్ర జననమైనచో దారిద్ర్యమున లక్ష్మియు శిశుహానియు స్త్రీలకు శోకదుఃఖమును సర్వ నాశము గలుగును. కనుక గోముఖ ప్రసవమును గ్రహమఖముతో శాంతియుఁ జేయవలెననుట. కాఁబట్టి విధించిన కాలమందు సంకల్పాదులుచేసి యైదు ద్రోణ ముల ధాన్యరాశిపై ద్రోణము నరబియ్యముపోసి దానిపై ద్రోణము పావు నువ్వులు

రాశిగఁబోసి యందు విధిగా స్థాపించిన కలశమందు సువర్ణ ప్రతిమపై సూర్యు నావాహనముచేసి యాతని కుడియెడమల నగ్నిరుద్రుల నావాహనముజేసి యీ ముగ్గురు దేవతలను వ్యతీపాత సంక్రాంతిశాంతులఁ బూజింపవలెను. రెంటియందును జననమైనచో రెండుశాంతులు తంత్రముచే నొకమారే చేయవచ్చును. పూజా హోమాదికము ప్రసంగముచే సిద్ధించును. లేదా ప్రధానహోమము మాత్రము ద్విగుణముగఁ జేయవలెను. గ్రహపీఠ దేవతల కన్వాధానమైనపైని సూర్యునికి "ఉత్సూర్యో బృహస్పతిః" అను మంత్రముచే సమిదాజ్య చ రుద్రవ్యములచే నాహుతులు నొక్కొక్క ద్రవ్యమునకు నూటయెనిమిది చొప్పునను, అగ్నికి రుద్రునకును మీఁదఁజెప్పిన ద్రవ్యములచే ప్రత్యేకముగ నిరువదెనిమిది చొప్పున "నగ్నిందూతం త్ర్యంబక" మను మంత్రములచే నాహుతులను మృత్యుంజయునకు నూటయెనిమిది తిలాహుతులును వేల్చి మిగిలినదానిచే స్విష్టకృత్తుఁజేయుట మొదలుగ నభిషేకాంతమందు గోవస్త్ర స్వర్ణాది దానములు జేసి నూర్గురు బ్రాహ్మణుల భుజింపఁజేయవలెను.

## వైధృతి శాంతిలో విశేషము

పూర్వమందువలె ధాన్యరాశిపైఁ బోసిన బియ్యపురాశిలోనున్న నువ్వులరాశిలో స్థాపించిన కలశమందు "త్ర్యంబక" మను మంత్రముచే రుద్రుని నతనికిఁ దక్షిణమున 'నుత్సూర్య' యనుమంత్రమున సూర్యుని నుత్తరమున 'నాప్యాయస్వ' యని సోముని నావాహనముచేసి పూజింపవలెను. అన్వాధానమందు రుద్రునికి సమిచ్చం ర్వాజ్యములలో నొక్కొక్క ద్రవ్యముచే నూటయెనిమిది చొప్పున నాహుతులను సూర్యసోములకు ప్రత్యేకముగ నిరువదెనిమిదేసి యాహుతుల నాద్రవ్యములచేతను మృత్యుంజయునకు వేయు నెనిమిదిగాని నూటయెనిమిదిగాని తిలలచే నాహుతులనువేల్చి మిగిలినదానిచే స్విష్టకృత్తు మొదలగునది చేయవలెను. తక్కినది పూర్వమువలెఁ జేయునది. సంక్రాంతి దినమున వైధృతియున్నచో దేవతా భేదమున్నందున రెండు శాంతులును వేరుగఁ జేయవలెను.

## ఏకనక్షత్ర జననశాంతి

"శ్లో. ఏకస్మిన్నేవనక్షత్రే భ్రాత్రోర్వా పితృపుత్రయోః, ప్రసూతి శ్చేత్తయోర్మృత్యుర్భవేదేకస్యనిశ్చితః". అనఁగా పితృనక్షత్రమందుగాని మాతృనక్షత్రమందుగాని కన్యకగాని పుత్రుఁడుగాని పుట్టినచో గోముఖప్రసవముజేసి శాంతిజేయవలెను. సోదర భ్రాతయొక్క గాని యట్టి భగినియొక్కగాని నక్షత్రమందు భ్రాతగాని భగినిగాని పుట్టినచో గోముఖప్రసవ మక్కఱలేకనే శాంతిమాత్రము చేయవలెను. సంకల్పమందు "పిత్రేక నక్షత్రోత్పత్తిసూచిత సర్వారిష్ట పరిహారద్వారా"యని మొదలుగ నూహించవలెను. కలశమందు రక్తవస్త్రముంచి యందు జన్మనక్షత్ర ప్రతిమనైనను తన్నక్షత్రదేవతా ప్రతిమనైనను "అగ్నిర్నః పాతు కృత్తికా" యని మొదలగు తైత్తిరీయ మంత్రములచేఁ బూజింపవలెను. అన్వాధానమందు ఈ నక్షత్రమునుగాని ఈ నక్షత్రదేవతనుగాని, సమిధలు, చరువు, ఆజ్యము వీనిలో నొక్కొక్కదానిచే నూటయెనిమిది చొప్పున నాహు

తులు వేల్చి శేషించినవానిచే స్విష్టకృత్తిని మొదలుగఁ జేయవలెను. అంతమందు నక్షత్రైక్యము గల వారి కభిషేకము అపుడు గ్రహమఖ మావశ్యకముగాదు. కొన్ని గ్రంథములలో హరిహర ప్రతిమలు పూజించి దానము చేయవలె నని యున్నది.

## గ్రహణశాంతి

"గ్రహణే చంద్రసూర్యస్య ప్రసూతి ర్యదిజాయతే, ఇత్థం సంజాయతే యస్తు తస్యమృత్యు ర్నసంశయః వ్యాధిపీడా చ దారిద్ర్యం శోకఛ్చ కలహోభవేత్." అనఁగా చంద్రసూర్య గ్రహణములందు బ్రసవమైనచో నపుడు పుట్టిన శిశువునకు మరణమే గలుగును. లేదా రోగము దారిద్ర్యము కలహము వచ్చుననియు, అందు గోముఖ ప్రసవశాంతి చేయవలె ననియు తోఁచుచున్నది. గ్రహముఖము వైకల్పికము. సంకల్ప మందు "సూర్యగ్రహణ కాలిక ప్రసూతి సూచిన సర్వారిష్టపరిహారద్వారా"యని మొద లుగ నూహించునది. గ్రహణముపట్టిన నక్షత్రముయొక్క గాని యానక్షత్రదేవతయొక్క గాని సువర్ణప్రతిమను సూర్యగ్రహణమందు సువర్ణసూర్యప్రతిమను చంద్రగ్రహణమున వెండిచే జంద్రబింబమును రెండుగ్రహణములలో సీసముచే రాహు ప్రతిమ సర్పాకార ముగఁజేసి గోమయముచే నలికిన శుద్ధప్రదేశమందు శుద్ధవస్త్రముపై నీ ముగ్గురు దేవతలనుఁ బూజించునది. అపుడుకలశస్థాపనాదికమక్కరలేదు. అందు మధ్యమం "దాకృష్ణేన" యను మంత్రముచే సూర్యుని నతనికిఁ దక్షిణమున "స్వర్భా నోరథః" అను మంత్రముచే రాహువును నుత్తరమందు నక్షత్రదేవతనుఁ బూజించు నది. చంద్రగ్రహనమందు "నాప్యాయస్వ" యను మంత్రముచే జంద్రుని మధ్య మందుఁ బూజింపవలెను. పార్శ్వములందు రాహువు నక్షత్రదేవతయు పూర్వము వలెఁ బూజింపఁదగును. అన్వాధానమందు సూర్యగ్రహణములో సూర్యునికిఁ జిల్లుఁడు సమిధలు ఘృతము చరువు తిలలు వీనిలో నొక్కొక్కటిచే నూటయెనిమిది చొప్పున నాహుతులును రాహువునకుఁ దూర్వలు ఆజ్యము చరువు తిలలు వీనిలో నొక్కొక్కటి నూటయెనిమిది చొప్పున నాహుతులను, నక్షత్రదేవతకు నాచు, సమిధలు, ఆజ్యము, చరువు, తిలలు వీనిలో నొక్కొక్కటిచే నూటయెనిమిదేసి యాహుతులను వేల్చి శేష ముచే స్విష్టి కృత్తని మొదలుగ నూహించునది. చంద్రగ్రహణమందు చంద్రునికి మోదుగుసమిధలు ఆజ్యము చరువు తిలలు వీనిచే నాహుతులు మిగిలినది. పూర్వము వలెనే యూహించునది. అంతమందు గ్రహకలశోదకముచే పంచగవ్యము పంచత్వ క్కులు పంచపల్లవములతో గూడిన లౌకికోదకముచేతను నభిషేకము గ్రహణవేధ తగిలిన కాలమందు జననమైనచో శాంతిఁ యక్కఱలేదు కాని దుష్టకాలము గనుక రుద్రాభిషేకము చేయవలెనని తోఁచుచున్నది.

## నక్షత్ర గండాంత జననశాంతి

రేవతి, ఆశ్రేష, జ్యేష్ఠ ఈ నక్షత్రముల తుది రెండుగడియలును అశ్విని, మఘ, మూల, ఈ నక్షత్రము మొదటి గడియలు రెండును నని క్రమముగ రెండేసి నక్షత్రముల మధ్యమందైన నాల్గుగడియలు గండాంత మనఁబడును. కనుక మూఁ

డు విధములై యున్నది. "అశ్వినీ మఘ మూలానాం పూర్వార్ధే బాధ్యతేఽ పితా, పూషాహి శక్రపశ్చార్ధే జననీ బాధ్యతే శిశోః, సర్వేషాం గండజాతానాం పరిత్యాగో విధీయతే, వర్జయే ద్దర్శనం యావత్తస్యషాణ్మాసికో భవేత్, శాంతింవాపుష్కలాంకుర్యా త్సోమమంత్రేణ భక్తిమాన్." అనఁగా మీఁదఁజెప్పిన యశ్విన్యాదుల పూర్వభాగమందు జననమైనచో దండ్రిగండము రేవత్యాదుల యంతభాగమునఁ జనించినచో దల్లి గండము కాఁబట్టి గండమందు జనించిన శిశువు నారుమాసముల పర్యంతము చూడక విడిచిపెట్టవలెను. లేదా భక్తిగలవాఁడై సోమమంత్రముచే సంపూర్ణ శాంతినిఁ జేయవలెనని యర్థము. "అస్య శిశోః రేవత్యశ్వినీ సంధ్యాత్మక గండాంత జననసూచిత సర్వారిష్ట నిరసనార్థం నక్షత్ర గండాంతశాంతిం కరిష్యే" యని సంకల్పము. గోముఖ ప్రసవశాంతిఁజేసి పదియారు పలములుగాని యెనిమిది పలములుగాని నాల్గుపల ములుగాని కంచు పాత్రముఁజేసి యందు బాయసముగాని పాలుగాని యుంచి యందు నవనీతపూర్ణమైన శంఖముంచి యందు వెండి చంద్రబింబము నుంచి 'సోమోహ'మని ధ్యానముఁజేసి చంద్రుని, 'ఆప్యాయస్వ'యను మంత్రముచేఁ బూజించ వలెను. పూజాంతమం 'దాప్యాయస్వ' యను మంత్రమును వేయుమారులుఁ జపించ వలెను. గ్రహమఖహోమము చేయవలెను. అందు ప్రధానదేవతాహోమ మక్కఱలేదు.

## వాగీశ్వరీ దానము

గ్రంథాంతరమందు రాగికలశమందు వెండిప్రతిమయందుఁ బృహస్పతి మంత్రముచే వాగీశునిఁ బూజించి యతని కుత్తరముగ కుంభ చతుష్టయమందు పంచ పల్లవాదికమును కుంకుమము చందనము చెంగల్వకోష్ఠ గోరోచనము గలిపి వరుణుని పూజింపవలెనని యున్నది. ఆచార్యుని కాశంఖము ముత్తెములతో దానము చేయవలెను. గ్రంథాంతర పక్షమున తామ్రపాత్రతో వాగీశునిదానము. ఆయుర్వృద్ధికై సహస్రాక్షేణ యని మంత్రముఁ జపించవలెను. పదుగురు విప్రులకుఁ దక్కువగాకుండ భోజనము పెట్టవలెను.

## తిథిగండాంత లగ్నగండాంతములకు శాంతి

పంచమీషష్ఠులకు దశమ్యేకాదశులకు పూర్ణిమా ప్రతిపత్తులకు మధ్యమందు సంధిగనుండు గడియలు రెండును తిథిగండాంతము. కర్కటక సింహములకు వృశ్చిక ధనుస్సులకు మీన మేషములకును సంధియగు నొకగడియ లగ్నగండాంతము. అందు తిథిగండాంతమందు పూర్వార్థమందు జననమైనచో నపుడే స్నానముఁజేసి వృషభదానమైనను తన్మూల్యద్రవ్యమైనను నిచ్చి సూతకాంతమందు శాంతిఁజేయ వలెను. ఉత్తరార్థమందు జననమైనచో శాంతిమాత్రము జేయవలెను. లగ్నగండాంత మందు పూర్వార్థమైనచో సువర్ణదానము నుత్తరార్థ మైనచో శాంతిమాత్రముఁ జేయ వలెను. కలశమందు సువర్ణ ప్రతిమపై వరుణునిఁ బూజించి యతని నుద్దేశించి సమిచ్చర్వాజ్యతిలలలో నొక్కొక్క ద్రవ్యముచే నూటయెనిమిది చొప్పున నాహుతులు వేల్చునది. యవలు, ధాన్యము, మినుముల, తిలలు, పెసలునివి దక్షిణగా నీయవలెను.

## దినక్షయాది శాంతి

"దినక్షయే చ భద్రాయాం ప్రసూతిర్యది జాయతే, యమఘంటే దగ్ధయోగే మృత్యుయోగే చ దారుణే, దుష్టయోగత ధీనాం చ నిషిద్ధాం శేషుచేత్తదా, అతిదోష కరీ ప్రోక్తా తస్మిన్ పాపయుతే సతి." అనఁగా దినక్షయము, భద్ర, యమఘంట, దగ్ధయోగము, మృత్యుయోగము, దుష్టమైన యోగములయొక్క తిథులయొక్క నిషిద్ధాంశ ములయందును జననమైనచో నతిదోషము గలుగును. యమ ఘంటాదులు జ్యోతి శ్శాస్త్రమందుఁ దెలియునది. దుర్యోగతిథుల నిషిద్ధాంశము లేవనిన–"శ్లో. విష్కంభ వజ్ర యోస్తిస్రః షట్చగండాది గండయోః, పరిఘార్థం పంచశూలే వ్యాఘాతేంకఘటీ స్త్యజేత్, చతుష్షడష్టనిధ్యర్క భూతతిధ్యాద్య నాడికాః, అష్టాంగమను తత్వాశా బాణ సంఘ్యా వివర్జయేత్". అనఁగా విష్కంభవజ్రములకు మూఁడేసి గడియలును గండాతి గండముల కారేసి గడియలును పరిఘకు సగముభాగమును శూలకు నైదుగడి యలును వ్యాఘాతమునకు తొమ్మిదిగడియలు నిషిద్ధములు. చవితి,షష్ఠి,అష్టమి,నవమి, ద్వాదశి, ఈ తిథుల మొదటిగడియలు క్రమముగ నెనిమిది, తొమ్మిది, పదునాల్గు, ఇరువదేను, పదియైదు గడియలు విడువవలెను. ఈ దినక్షయాది దోషములలో నొక్కొక్కటియున్నచో పదునొకండుమారులు రుద్రాభిషేకము చేయవలెను. రెండు మూఁడు గలిసినచో గ్రహయజ్ఞము నశ్వత్థ ప్రదక్షిణము మొదలగునవియును గలుప వలెను."శ్లో.దీపంశివాలయే భక్త్యా ఘృతేన పరిదాపయేత్, గాణపత్యం పురుష సూక్తం సౌరం మృత్యుం జయం శుభం, శాంతిజాప్యం రుద్రజాప్యం కృత్వా మృత్యుం జయీ భవేత్."అని చెప్పినందున దోష బాహుల్య పురుషసూక్తము సౌరము మృత్యుం జయము శాంతిపారాయణము రుద్రపారాయణము మొదలగునవి పఠించవలెను.

## వర్జ్య ఘటికలకు శాంతి

అందు కౌస్తుభమందు తిథివార నక్షత్రములకు విషఘటికలు చెప్పఁబడినవి. అయినను జ్యోతిశ్శాస్త్రమందు నక్షత్ర వర్జ్యపుగడియలచే మహాదోషత్వము చెప్పబడి నందున నట్టిగడియలందు జననమునకే శాంతిఁ జేయవలెను. తిథ్యాదివిషఘటికలు సదోషమగుటచే రుద్రాభిషేకాదికముఁ జేయునది. వర్జ్యఘటికల లక్షణము కౌస్తుభాదు లందుఁ దెలియునది. వానిఫలము. "విషనాడీషుసంజాతః పితృమాతృ ధనాత్మనాం, నాశకృద్విషశస్త్రాస్త్రైః క్రూరేలగ్నాంశకేపి చ." అనఁగా వర్జ్యపు గడియలలో జనన మైనచో తలిదండ్రులకుఁ దనకును విషశస్త్రాదులచే నాశమగును. లగ్నాంశము క్రూరమైననిట్లు దెలియవలెను. "ఏత ద్విషనాడీషు శిశుజనన సూచితారిష్ట పరిహార ద్వారా"యని మొదలగు సంకల్పము. ఒకకలశమందునాలుగుప్రతిమలుంచి రుద్రయ మాగ్ని మృత్యుదేవతలను, "కద్రుద్రాయ,యమాయసోమం,అగ్నిర్మూర్ధా, పరంమృత్యో" అను మంత్రములచేఁ బూజింపవలెను.గ్రహముల కన్వాధానమైన పైని రుద్రయ మాగ్ని మృత్యువులకు నొక్కొక్కరికి సమిధలు చరువు ఘృతము తిలలు వీనిలో నొక్కొక్క దానిచే నూటయెనిమిదాహుతుల చొప్పునను వేల్చి శేషించిన దానిచే స్విష్టకృత్తునని గృహసిద్ధాన్నమునకే హోమము.

# యమళజనన శాంతి

అందు శ్రౌతాగ్ని గలవారికి 'సోగ్నయే మరుత్వతే త్రయోదశ కపాలం పురో డాశం నిర్వపేత్' అని ఋగ్వేదబ్రాహ్మణమందుఁ జెప్పిన యిష్టి విధింపఁబడినది. లేదా యాశ్వలాయనసూత్రమందుఁ జెప్పఁబడిన కేవల మారుతయాగము. గృహ్యాగ్ని గల్గినచో నాశ్వలాయనునికి గృహ్యాగ్నియందే మారుతచరువు. ఏమనిన; 'అథయస్యవ ధూర్గౌర్వా జనయేచ్ఛేద్యమౌ తతః, సమరుద్భిశ్చరుం కుర్యా త్పూర్ణాహుతి మథాపి వా.' యని కవలు జననమైనపుఁడది విధింపఁబడినది. గృహ్యాగ్ని లేని ఋగ్వేది కాత్యానోక్తశాంతిని లౌకికాగ్నియందుఁ జేయవలెను. 'మమ భార్యాయాం యమల జననసూచిత సర్వారిష్ట పరిహారద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం మారుతేష్ట్యాయక్ష్యే' యని సంకల్పము. శ్రౌతాగ్నియున్నను స్మార్తాగ్నియున్నను 'మారుతస్థాలీపాకేనయక్ష్యే' యని సంకల్పము అగ్నిలేనిచో 'గ్రహమఖయుక్తాం కాత్యాయనోక్తాం శాంతిం కరిష్యే' యని సంకల్పించి స్వస్తివాచనము మొదలుగ నాచార్య వరణము వఱకుఁ జేయవలెను. ఎనిమిది దిక్కుల నెనిమిది కలశములుంచి యుదకపూరణము మొదలు సర్వౌషధుల నుంచిన పైని వరుణునిఁ బూజింపవలెను. ఆ యెనిమిది కలశములలో నుదకముచే దంపతుల కభిషేకము. ఎట్లనిన; 'ఆపోహిష్ఠా' యను మూఁడు ఋక్కులును 'కయాన' యను రెండును 'ఆనస్తుత' యను నైదును, నీయైంద్ర ఋక్కు లేడిటిచేతను 'మోషు వరుణ' యనునైదు ఋక్కులును 'ఇదమాప' యను నొకటియును 'అపన' యిన మొదలగు నెనిమిదియును నగు నీయాగ్నేయ ఋక్కులచేతనుఁ జేయవలెను. ఇట్లభి షేకము నొంది దంపతులు శుక్లవస్త్రముల ధరించి యుత్తరాభిముఖులై యుండవలెను. తూర్పున కభిముఖుఁడై యాచార్యుఁడగ్నిని గ్రహములను స్థాపించి యద్దేవతలకు మూడాజ్యాహుతులును ఇంద్రుని కారు నొకటియు వరుణుని కైదునుఁ దిరుగ నభిషేకమునకై చెప్పిన యిరువదినాలుగు మంత్రములచే నగ్నికి సోమునకు పవమాను నకు మారుతునకు మరుత్తులకు యమునికి నంతకునకు మృత్యువునకును నామ మంత్రములచే నొక్కొక్క చర్వాహుతియు వేల్చవలెను. శేషముచే స్విష్టకృత్తిని మొదలుగ నన్వాధానముఁ జేయవలెను. ముప్పది యాఱుమారులు మంత్రమేమియు నుచ్చరింప కయే నిర్వాపమును ప్రోక్షణమునుఁ జేయవలెను. అంతమందు గ్రహకలశోదకము మొదలగువానిచే నభిషేకము. దాసిగాని గేదెగాని యాడుగుఱ్ఱముగాని యావుగాని యాడేనుఁగుగాని కవలుఁగన్నచో నిట్లు శాంతిఁజేయునది. మఱియు గ్రహోత్పాతము లందును గూబ, కపోతములు, గెద్ద, డేగయు నివి గృహమందు ప్రవేశించునపుడు, స్తంభముపై శాఖలు మొలుచునపుడును, పుట్టలు బెట్టునపుడు తేనెపుట్టలు పుట్టు నపుడును పీఠము మంచము సవారి మొదలగునవి యవశముగ భగ్నమగునపుడును బిల్లిపడునపుడును తొండదనై నెక్కునపుడును ఛత్రము ధ్వజము మొదలగునవి విరుగు నపుడును, ఇట్టి యుత్పాతములందు నీశాంతియే చేయవలెనని కాత్యాయనుని మతము. అదియు నగ్నిగల కాత్యాయనులు స్వగృహ్యాగ్ని యందే చేయవలెను. అగ్ని లేనిచో లౌకికాగ్నియందే చేయవలెను. ఇది యమళ జననశాంతి.

## ప్రసవ శాంతి

"శ్లో. సుతత్రయే సుతాచేత్స్యాత్త త్త్రయే వాసుతో యది, మాతాపిత్రోః కులస్యాపి తదానిష్టం మహద్భవేత్, జ్యేష్ఠనాశో విత్తహాని ర్దుఃఖంవాసు మహద్భవేత్." అనఁగా ముగ్గురు పుత్రులపై కన్యక పుట్టినను ముగ్గురు కన్యకలపై పుత్రుఁడు పుట్టిననుఁ దల్లి తండ్రులకును కులమునకును గొప్ప యనిష్టము. జ్యేష్ఠునికి నాశము ధనహానియు బహుదుఃఖమును సంభవించునని గోప్రసవశాంతిఁజేసి "మమ సుత్రతయ జన్మా నంతర కన్యాజననసూచితసర్వారిష్ట పరిహారద్వారా" యని గాని "కన్యాత్రయ జననాం తర పుత్రజననసూచిత సర్వారిష్ట పరిహారద్వారా" యనిగాని సంకల్పము స్థండిల పూర్వభాగమందాగ్రహముల స్థాపించిన పైని వానికుత్తరముగ నైదుకలశములందు స్వర్ణ ప్రతిమలపైఁ బ్రహ్మను విష్ణువును మహేశుని ఇంద్రుని రుద్రుని నావాణముఁ జేసి పూజింపవలెను. అపుడు మంత్రములు "బ్రహ్మ జజ్ఞానం, ఇదం విష్ణుః త్ర్యంబకం, యత యింద్ర, కద్రుద్రాయ" యని గ్రహపీఠదేవతల కన్వాధానముఁ జేసినపైని బ్రహ్మకు విష్ణునకు మహేశునికి నింద్రునకు రుద్రునికి నొక్కొక్కరికి సమిదాజ్యచరు తిలలలో నొక్కొక్క ద్రవ్యముచే వేయు నెనిమిదేసిగాని మున్నూటయెనిమిదిదేసిగాని నూట యెనిమిదేసిగాని యాహుతులనిచ్చి శేషముచే స్విష్టకృత్తుని మొదలుగఁ దెలియ వలెను.

## దంతజనన శాంతి

"ఉపరి ప్రథమం యస్స జాయంతేథశిశోర్ద్విజాః దంతైర్వాసహయస్యస్యా జ్జన్మ భార్గవ సప్తమ, ద్వితీయే చ తృతీయే చ చతుర్థే పంచమే తథా, యదా దంతాః ప్రజాయంతే మాసేచైవ మహద్భయం, మాతరం పితరం వాథ ఖాదేదాత్మాన మేవ వా, బాలానా మష్టమే మాసి షష్టేవాపి తతః పునః దంతాయస్య తు జాయంతే మాతా వా మ్రియతే పితా, బాలకః పీడ్యతేవాత్ర స్వయమేవ న సంశయః" అనఁగా బుట్టిన శిశువునకు మీఁదిపళ్లు మొదటఁ బుట్టినను లేక దంతములతోడనే శిశుజన్మ మైనను లేక రెండు, మూఁడు, నాల్గు, నైదు, నారు, నెనిమిది యను నీ మాసములలో దంతజననమైననుఁ దల్లిదండ్రులకుగాని శిశువునకుగాని హానికలుగుననుట, కొంద రందులో నెనిమిదివ మాసమందు శుభమనిరి. అట్లు శాంతిఁ జేయునపుడు "అస్య శిశోః ప్రథమమూర్ధ దంతజననసూచిత సర్వారిష్ట పరిహారద్వారా" యని మొదలుగ సంకల్పము నిమిత్తము నుచ్చరించి చేయవలెను. స్థండిలమున కుత్తరభాగమందు నౌక యెందుగాని స్వస్తికమండలముతో గూడిన సువర్ణపీఠమందుగాని శిశువునుంచి సర్వౌషధులతో గూడిన జలములచే స్నానముఁ జేయించి స్థండిల పూర్వభాగమున గలశమందు ప్రతిమలపై ధాతను వహ్నిని సోముని వాయువును పర్వతములను కేశవుని నీ యార్గురు దేవతలఁ బూజించి గ్రహముల కన్వాధానముఁ జేసినపైని ధాతకు చరువుచే నొకయాహుతియు వహ్ని మొదలగు పంచదేవతలకు నొక్కొక్క యాజ్యాహుతియు వేల్చి శేషముచే స్విష్టకృత్తు మొదలగునది యని యన్వాధానముఁ

జేయవలెను. "ధాత్రేత్వాజుష్టం నిర్వపామి" యని మొదలుగ నిర్వాపప్రోక్షణములు నామముచే చరుహోమమునుఁ జేయునది. స్రువముచే వహ్న్యాదులకిచ్చు నాహుతులను నామముచేతనే. హోమాంతమందుఁ దక్షిణలిచ్చి యేడుదినముల పర్యంతము యథాశక్తి బ్రాహ్మణభోజనముఁ జేయవలెను. అష్టమదినమందు కాంచనాది దానములిచ్చి కర్మ నీశ్వరార్పితము చేయవలెను. షష్ఠాష్టమమాసములందుఁ దంతజననమైనచో నొక్క బృహస్పతి దేవతకే పూజయును పెరుగు తేనె నేతులతోఁ దడిపిన సమిధలచే నూట యెనిమిదాహుతులు బృహస్పతి మంత్రముతో వేల్చుటయును ఆజ్యముచే స్విష్ట కృదాదికమును విధింపఁబడినవి. ఇది దంతజననశాంతి.

## ప్రశవ వైకృత శాంతి

"యత్రగర్భే విపర్యాసో మానుషాణాంగవా మపి, అద్భుతాని ప్రసూయంతే తత్ర దేవస్య విద్రవః మానుషా మానుషాణంచ గజాశ్వ మృగపక్షిణాం, జాయంతే జాతిభేదాశ్చ సదంతా వికృతాస్తథా, బహుశీర్షా ఆశీర్షావా బహుకర్ణా అకర్ణకాః ఏకశృంగాత్రి శృంగావాతథైవ త్రిచతుర్భుజాః, దీర్ఘకర్ణా మహాకర్ణా గజకర్ణాశ్చ మానవాః రాజశ్రేష్ఠ కులేనాశో ధనస్య చ కులస్య చ, అష్టోత్తర సహస్రాణి చరుంవై జుహుయాత్తదా, సమిధాంతు పలాశానాం తర్పయేత్పూర్వ వద్ద్విజాన్, అశిరాజాయతే జంతుస్తథా ద్విత్రిశిరా అపి, అత్ర సూర్యాద్భుతే సూర్యం పూజయే జ్జుహుయాదపి, దధ్యాజ్య మధుసంయుక్తా స్సమిధస్త్వర్క సంభవాః, మృగీజనయతే సర్వాన్ మండూకాశ్చైవ మానుషాన్, అత్రాద్భుతే గీష్పతయే పూజా హోమం చ కారయేత్, ఔదుంబరస్య సమిధో దధిసర్పి స్సమన్వితాః స్త్రీగర్భపాతో యమలం ప్రసూయంతేధవాస్త్రియః సదంతాశ్చైవ జాయంతే జాతమాత్రా హసంతి చ, బుధాద్భుతే బుధాయాత్ర పూజా హోమౌ సమాచరేత్" అనఁగా మనుష్య గర్భములుగాని తిర్యగ్గర్భములుగాని వ్యత్యాస మనఁగ వికృతమై యద్భుతముగఁ బుట్టినచో రాజోపద్రవముఁ గలుగును. ఎట్లనిన; మనుష్య స్త్రీలకును గోగజాశ్వమృగపక్షులకు నొకజాతికి మఱియొకజాతి జంతువు పుట్టుట. పుట్టిన శిశువునకుఁ దంతములు మీసము గడ్డము మొదలగు వికారము లుండుట. శిరస్సులు పెక్కుఁగలుగుట. యొకశిరసును లేకుండుట, యిట్లు చౌలు కొమ్ములుగలుగుట. మూఁడు నాల్గు భుజములుండుట పొడవైనవిగా గజములకువలె వెడలుపుగలవిగాని కర్ణములుండుటయు నట్టి యద్భుత ప్రసవములైనయెడ రాజ శ్రేష్ఠులగృహమందు ధనమునకు గులమునకును హానియగును. గనుక శాంతికై మోదుగు సమిధలచేతను హవిస్సుచేతను వేయు నెనిమిదిమారు లాహుతులు వేల్చి మీఁదఁజెప్పినట్లు బ్రాహ్మన తృప్తిఁ జేయవలెను. రెండు మూఁడు శిరస్సులు గలిగిన గాని శిరసులేకనే గాని పుట్టినచో నది సూర్యాద్భుతముఁ గనుక సూర్యునికి బూజించి పెరుగు, తేనె, నేతులతో దడపిన జిల్లుఁడు సమిధలచే సూర్యునికి హోహము చేయవలెను. మఱియు లేళ్లు సర్పములను కప్పలు మనుష్యాకార శిశువులనుఁ గన్నచో బృహస్పతినిఁ బూజించి పెరుగు, నేతులతో దడపిన బొడ్డచెట్టు సమిధలచే హోమము

చేయవలెను. ఇcక స్త్రీలకుc దరుచుగ గర్భపాతమైనను కవలే పుట్టుచున్నను పుట్టిన శిశువులకుc దంతములుండి పుట్టగానే నవ్వినను నిట్టివి బుధాద్భుతములు గనుకc బుధునిపూజించి హోమముc జేయవలె ననుట. సంక్షేపేణ యథా ప్రజ్ఞమిద్ధం జనన శాంతయః, ఉక్తాజపాభిషేకార్థ సూక్తాది బహువిస్తృతాః, ప్రయోగాః కౌస్తుభాదౌ చ ప్రసిద్ధా బహుశః పరాః, అనేన ప్రీయతాం దేవో భగవాన్ విఠ్ఠల ప్రభుః" అనcగా నిట్లు జననశాంతులు సంక్షేపముగా నిర్ణయింపcబడినవి. విస్తార ప్రయోగములు కావలసినయెడc గౌస్తుభాది గ్రంథములc దెలియుcడనియు నిది భగవదర్పితమగు గాక యనియుc దాత్పర్యము.

## నామకరణము

అందు జన్మదినమందు జాతకర్మcజేసిన పైని నపుడేయైనను క్వచిత్తుగా నేకా దశదినమందైనను ద్వాదశిదినమందైనను నామకర్మc జేయవలెను. కొందఱు దశమ దినమందాశౌచ మున్నప్పటికిని వచనమున్నందునc బదియవరోజుననుc జేయవచ్చు ననిరి. క్షత్రియులకు బదుమూcడవ దినమందుగాని పదియాఱవ దినమందుగాని చేయవలెను. వైశ్యులకుc బదారవదినమందుగాని యిరువదిదినమందుగాని చేయు నది. శూద్రుల కిరువది రెండవదినమందు మాసాంతమందుగాని చేయవలెను. బ్రహ్మ క్షత్రవైశ్యులకుc గ్రమముగ మాసాంతము నూరవదినము. వత్సరాంతము నని గౌణకాలము. ముఖ్యకాలమందుc జేయునపుడు పుణ్యతిథి నక్షత్రములు చంద్రానుకూల్యము మొదలగునవి వెదక నక్కరలేదు. గౌణకాలమందది కావలెను. వైధృతివ్యతీపాతము సంక్రాంతి గ్రహణదినము నమావాస్య, భద్ర వీనియందు ప్రాప్తించి నను నామకర్మ మొదలగు శుభకర్మనుc జేయగూడదుగాని మలమాసము శుక్రాస్త మయము మొదలగు నిషేధము లేదని మీcదc జెప్పcబడినది. అపరాహ్ణమందును రాత్రియందును నామకర్మగూడదు. ఇcక ముఖ్యకాల మతి క్రమించినచో నపేక్షిత మగు శుభతిథ్యాదికరము చెప్పcబడును. చవితి, షష్ఠి, అష్టమి, నవమి, ద్వాదశి, చతుర్దశి, పూర్ణిమ యివితప్ప తక్కిన తిథులు ప్రశస్తములు. సోమ, బుధ, గురు, శుక్రవారములు ప్రశస్తములు. అశ్విని, ఉత్తర, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర, రోహిణి, మృగశీర్ష, పునర్వసు, పుష్యము, హస్త, స్వాతి, అనూరాధ, శ్రవణము, ధనిష్ఠ, శతభి షక్కు, రేవతి, యీ నక్షత్రములును, వృషభము, సింహము, వృశ్చికము యీ లగ్నము లును శుభములు. అపుడు నామములు నాలుగు విధములు. దేవతానామము మాస నామము నక్షత్రనామము వ్యావహారిక నామమునని, అందు నీదేవతకు భక్తుc డని యొక యిష్టదేవత నుద్దేశించి పెట్టునది దేవతానామము. మొదటిది– "చైత్రాది మాసనామాని వైకుంఠోథ జనార్దనః ఉపేంద్రో యజ్ఞపురుషో వాసుదేవ స్తథాహరిః యోగీశః పుండరీకాక్షః కృష్ణోనంతోచ్యుత స్తథా, చక్రీతి ద్వాదశైతాని క్రమదాహుర్మ నీషిణః" యను వచనానుసారముగ మాసనామము రెండవది. ఇక్కడ మాసము చాంద్రమే గ్రహించునది. అదియును శుక్లాది కృష్ణాంతమే ఇcక నేనక్షత్రమునc జననమగునో యా నక్షత్రవాచకశబ్దము పైని 'తత్రజాతః' అను నధికారమందలి

తద్ధిత ప్రత్యయముంజేసి యుచ్చరించుచో నది నాక్షత్రనామము మూఁడవది, అది యెట్లనిన; "ఆశ్వయుక్, ఆపభరణః, కార్తికః, రౌహిణః, మార్గశీర్ష, ఆర్ద్రకః, పునర్వసుః తిష్యః, ఆశ్లేషః, మఘః, పూర్వాఫాల్గుణః, ఉత్తరాఫాల్గుణః, హస్తః, చైత్రః, స్వాతిః, వైశాఖః, అనూరాధః, జ్యైష్ఠః, మూలకః, పూర్వాషాఢః, ఉత్తరాషాఢః, అభిజితః, శ్రావణః శ్రవిష్ఠః, శతభిషక్, పూర్వాప్రోష్ఠపాదః, ఉత్తరాప్రోష్ఠపాదః, రైవతః"అని కొందరు 'చూచేచోలా అశ్వినీ ప్రోక్తా'యని జ్యోతిర్గ్రంథోక్తమైన యవకహడాచక్రానుసారముగ నశ్విన్యాదుల నాల్గు పాదములను చూడామణి చేలేశుఁడు చోలేశుఁడు లక్ష్మణుఁడు నని మొదలుగ నాక్షత్రనామముఁ జెప్పుచున్నారు. అది శ్రౌత గ్రంధాదులందు బహు సమ్మతముగాదు. శాంఖాయనశాఖీయులు కృత్తిక యందుఁ బుట్టినఁదాని కగ్ని శర్మ యని నక్షత్రదేవతా సంబంధము గలుగ నాక్షత్రనామ మిడుచున్నారు. ఇట్లు కాకతీ యులునుఁ జేయుచున్నారు. నమస్కారముఁ జేయునపుడునాక్షత్ర నామమునే యుచ్చ రింపవలెను. ఉపనయనము వరకు నది తలిదండ్రులు తప్ప నితరు లెఱుగకుండ గుప్తమై యుండునది. వ్యావహారికనామము నాల్గవది. అది కవర్ణము మొదలగు వర్ణములలో మూఁడు నాల్గు నైదు ననువర్ణములును హకారము. వీనిలో నొకవర్ణము మొదటఁ గలదియును, యరలవలలో నొకవర్ణము మధ్యమందు గలదియును, ఋషి వర్ణములు లేనిదియు, విసర్గమంతమునఁ గలదియును, తండ్రి మొదలగు ముగ్గురు కూటస్థులలో నొకరినిఁ జెప్పునదియు, శత్రువాచకము గానిదియు, తద్ధితప్రత్యయము లేనిదియు, కృత్ప్రత్యయ మంతమందుఁగలదియునై సరియక్షరములు గలనామము పురుషుల కుంచునది. బేసి యక్షరము లుండునామము స్త్రీలకుంచునది. పురుషులకు ఎట్లనిన; పురుషులకు 'దేవదత్తః, హరిః' అని మఱియుఁ జెప్పిన లక్షణములన్నియు లేకున్నను సమాక్షరము పురుషులకు నయుగ్మాక్షరము స్త్రీలకు నని యొక లక్షణమే చాలును. ఎట్లనిన; 'రుద్రః రాజా' అని. ఇచట స్వరము మాత్రమే యక్షర మనఁ బడును. హల్లులకు సంఖ్యానియమము లేదు. ఇచట విశేషము. "ద్వ్యక్షరం ప్రతిష్ఠా కామశ్చతురక్షరం బ్రహ్మవర్చస కామః అంత్యలకారరేఫం వర్జయేత్." అని అనఁగా కీర్తినిఁగోరువాఁడు రెండక్షరముల నామమును బ్రహ్మవర్చస మనఁగ సదాచారము చేతను నధ్యయనముచేతఁ గలుగు తేజస్సమృద్ధి యదిగోరువాఁడు నాల్గక్షరముల నామము నుంచునది. తుదిని లకారమును రేఫను వర్జించునది యనుట. ఆపస్తంబ హిరణ్య కేశిసూత్రములందు ప్రాతిపదిక మొదటను ధాతువంతమునను గల్గునన ఎట్లనిన; హిరణ్యాదా యనియును విసర్గతోఁగూడునది. ఎట్లనిన; 'శ్రీః'అనియు నుంచ వలెనని విశేషము చెప్పఁబడినది. అట్టి వ్యావహారిక నామము శర్మపదముగాని దేవ పదముగాని యంతమందుంచి బ్రాహ్మణునకును వర్మపదమైనను రాజపదమైన నుంచి క్షత్రియునకును, గుప్త, దాస యను పదములలో నొకటియుంచి వైశ్యునకును దాసాంతముగ శూద్రునకునుఁ జేయవలెను. అట్టి వ్యావహారికనామము మేడలు మొదలగు వాటికిని విధింపఁబడినది. ఎట్లనిన; "శ్లో॥ దేవాలయ గజాశ్వానాం వృక్షాణాం వాపి కూపయోః సర్వాపణానాం పణ్యానాం చిహ్నానాం యోషితాం నృణాం,

కావ్యాదీనాం కవీనాం చ పశ్వాదీనాం విశేషతః” రాజప్రాసాద యజ్ఞానాం నామకర్మ యథోదితం” అనఁగా దేవాలయ గజాశ్వవృక్షవాపీకూపములకును బాజారులు పణ్య వస్తువులు ధ్వజాది చిహ్నములు పురుషులు స్త్రీలు కావ్యములు కవులు పశ్వాదులు మేడలు యజ్ఞములు మొదలగువానికిని విధి ప్రకారముగ నామకర్మఁ జేయునది. ఇఁక ప్రయోగమందు విశేషము :– గర్భాధానాది సంస్కారములు లోపించినచో ప్రత్యేకముగ పాదకృచ్ఛ్రము బుద్ధిపూర్వకముగ లోపించినచో నర్ధకృచ్ఛ్రము చొప్పునఁ జాతకర్మకు కాలాతిక్రమణమునకై యాజ్యాహుతి ముందువేల్చి ప్రాయశ్చిత్తముఁ జేయ వలెను. అది యెట్లనిన; “జాతకర్మ నిమిత్తకాలాతిపత్తి జనితదోష పరిహార ద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం ప్రాయశ్చిత్తహోమం కరిస్యే” యని సంకల్పించి యగ్ని స్థాపనము నిధ్మాధానము మొదలగు పాకయజ్ఞ తంత్రముతోనైనను వహ్నిస్థాపనము నాజ్య సంస్కారము పాత్ర సంస్కారము మాత్రముతో నైనను ‘భూర్భువస్స్వః స్వాహా’ యని సమస్త వ్యాహృతులచే తను నాజ్యాహుతి వేల్చవలెను. హోమాంతమందు “గర్భాధాన పుంసవనావలోభన సీమంతోన్న యన లోప జనితదోషపరిహార ద్వారా శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం ఏతావతః పాదకృచ్ఛ్రా నర్ధకృచ్ఛ్రాన్వాత త్ప్రత్యామ్నాయగో నిష్ర్కయీ భూతయథాశక్తి ద్రవ్యదానే నాహమాచరిష్యే” యని సంకల్పించి ద్రవ్యము నీయవలెను. జాతకర్మయు నామకర్మయు నొకమారే చేయదలఁచినచో మీఁదఁ జెప్పిన జాతకర్మ సంకల్పము నుచ్చరించి, “అస్యకుమారస్యాయురభివృద్ధిద్వారా వ్యవహారసిద్ధి బీజగర్భ సముద్భవైనో నిబర్హణ ద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం నామకర్మ చ తంత్రేణ కరిష్యే” యని సంకల్పించి స్వస్తివాచనాదికముఁ జేయవలెను. అందు “జాతకర్మనామకర్మణోః పుణ్యాహం భవంతో బ్రువంతు” అని యుచ్చరించి ‘అస్య కుమారస్య జాతకర్మణే తేన్నామ్నే చ స్వస్తిభవంతో బ్రువంతు’ అని స్వస్తిపర్యాయ మందుఁ జెప్పవలెను. దాని ననుసరించే ప్రతివచనము నుచ్చరింపవలెను. కేవల నామకర్మ యందు ‘నామకర్మణః పుణ్యాహంభవంతో బ్రువంతు’ అనియు ‘నేతన్నామ్నే స్వస్తిభవంతో బ్రువంతు’ అనియుఁ బలుకవలెను. బ్రాహ్మణుల ప్రతివచనము నట్లనే యగును. వ్రాయునపుడు నామత్రయమును శర్మాదిపదములు లేకుండగఁ వ్రాసి వ్యావహారిక నామము మాత్రము శర్మాదిపదములతో వ్రాయవలెను. నమస్కరించు నపుడు నాక్షత్ర నామ సహితము శర్మాదిపదము లంతముగ నుచ్చరింపవలెన. తక్కినది ప్రయోగ గ్రంథములందెలియునది.

## స్త్రీలకు నామకర్మ

సంకల్పమందు ‘అస్యాః కుమార్యా’ యను విశేషము స్వస్తి వాచనమందే తన్నామ్న్యైయనియు దేవతానామమందు భక్తాయని యాబంతము మాసనామములు చక్రిణీనైమంథీ వాసుదేవీ యని మూఁడు జీబంతములు హరిః అనునది యట్లనే వికారము లేకయుండును. తక్కినవి యెనిమిదియు నాబంతములనఁగ దీర్ఘాకారాంత ములు. రౌహిణీకృత్తికా యని మొదలగు నాక్షత్రనామములు యథార్థ్వముగ స్త్రీలింగము లుచ్చరించునది. మాతృదత్తమతమం దాశ్వలాయనులచే నాక్షత్రనామము స్త్రీలకుఁ

జేయcబడనక్కరలేదు. వ్యావహారికనామము యజ్ఞదాశర్మయని పురుషునికివలెc జేయు నది. పూజాదికము వైదికమంత్రములు మాని పురుషులకువలెc జేయవలెను. తండ్రి సన్నిధియందు లేనియెడ స్త్రీపురుషులకు నామకర్మ తాత మొదలగువారు చేయ వచ్చును.

## డోలారోహణము

శ్లో. "ఆందోలా రోహనే పుంసో ద్వాదశో దివసశ్శుభః, త్రయోదశస్తు కన్యాయా నక్షత్ర విచారణా, అన్యస్మిన్ దివసే చేత్స్యాచ్ఛుభకాలం విచారయేత్" అనcగా పుత్రు నికిc బండ్రెండవ దినమందును కన్యకు పదమూcడవదినమందు నుయ్యల నుంచి నచో శుభతిథ్యాదులు విచారింప నక్కరలేదు. మఱియొక కాలమందైనచో నది కావలెను. ఎట్లనిన; ఉత్తర, ఉత్తరాషాడ, ఉత్తరాభాద్ర, రోహిణి, హస్త, అశ్విని, పుష్యము, రేవతి, అనూరాధ, మృగశీర్ష, చిత్ర, పునర్వసు, శ్రవణము, స్వాతి అను నీ నక్షత్రములందు శుభవారమున రిక్తగాకుండ తిథియందు చంద్రతారాబల ముండు నపుడు పుణ్య స్త్రీలు శిశువు నుయ్యలనుంచునది.

## దుగ్ధ పానము

ముప్పదియొకటవ రోజున నైనను జన్మనక్షత్రము రెండవపర్యాయము దిన మందైనను డోలారోహణమునకుc జెప్పిన నక్షత్రమందైనను పూర్వాహ్ణ మధ్యాహ్ణ ములయందుc గులదేవతకుc బ్రాహ్మణునికినిc బూజజేసి శంఖముచే నావుపాలు పోయవలెను.

## జలపూజనము

ప్రసవించిన స్త్రీ మాసమైన పైని బుధ, సోమ, గురువారములందు రిక్తగాని తిథియందు శ్రవణము, పుష్యము, పునర్వసు, మృగశీర్ష, హస్త, మూల, అనూరాధలలో నొకనక్షత్రమందు జలసమీపమునకువెళ్లి జలపూజc జేయవలెను. ఇక్కడ గురు శుక్రాస్తములు చైత్రపౌషమాసములు నధికమాసమును వర్జ్యములు.

## సూర్యావలోకన నిష్క్రమణములు

మూcడవమాసమందు సూర్యావలోకనము నాల్గవ మాసమందైనను నన్న ప్రాశన కాలమందైనను శిశువు నిల్లుc బయలుదేరించుట అందుకాలము. "శుక్లపక్ష శ్శుభః ప్రోక్తః కృష్ణశ్చాంతి త్రికంవినా, రిక్తషష్ఠ్యష్టమీదర్శ ద్వాదశీ చ వివర్జితా" అనcగా శుక్లపక్షమును త్రయోదశి మొదలు మూcడుదినములు తప్ప తక్కిన కృష్ణ పక్షమును రిక్తదినము. షష్ఠి, అష్టమి, దర్శ, ద్వాదశి యివివిడిచి శుభములు. గురు బుధ, శుక్రవారములు నశ్వినీ రోహిణీ మృగపుష్యోత్తరోత్తరాషాఢోత్తరాభాద్రా హస్తా ధనిష్ఠా శ్రవణరేవతీ పునర్వస్వనూరాధా నక్షత్రములు శస్తములు. ఈ నిష్క్రమణము నిత్యకామ్యము సూర్యావలోకన నిష్క్రమణములందు నాందీశ్రాద్ధము వైకల్పికము. ఇcక భూమియందుc గూర్చుండcబెట్టుటకు కాలము అయిదవ మాసమందు నిష్క్ర మణమునకుc జెప్పిన శుభతిథ్యాదులందు నవి చేయవలెను.

## అన్నప్రాశనము

ఆఱవదిగాని యెనిమిదవదిగాని పదియవదిగాని పండ్రెండవదిగాని యగు మాసమందు పురుషుని కన్నప్రాశనము చేయవలెను. అయిదవదిగాని యేఁడవదిగాని తొమ్మిదవదిగాని మాసము స్త్రీలకు శుభము. విదియ, తదియ, పంచమి, సప్తమి, త్రయోదశి, దశమియు నీతిథులు ప్రశస్తములు. రవి సోమవారములు క్వచిత్తుగా విధింపఁబడినవి. అశ్విని, రోహిణి, మృగశీర్ష, పునర్వసు, పుష్యము, ఉత్తర, ఉత్తరాషాడ, ఉత్తరాభాద్ర, హస్త, చిత్ర, స్వాతి, అనూరాధ, శ్రవణము, ధనిష్ఠ, శతభిషక్, రేవతియు శుభములు. జన్మనక్షత్రము శుభమని కొందరు. భద్రావైధృతి వ్యతీపాత గండాతిగండ వజ్రశూలపరిఘులు యోగములో వర్జ్యములు. విష్ణుశివచంద్రార్క దిక్పాల భూమి దిగ్బ్రాహ్మణులను పూజించి తల్లి తొడపైఁ గూర్చున్న శిశువునకు కాంచనపాత్ర యందుగాని కంచుపాత్రయందుగాని యుంచి, పెరుగు తేనె నేయి గలిపిన కొంచెము పాలతో జేసిన పాయసము (బెల్లము వేయనిది) సువర్ణముతోగూడిన హస్తముచే మంత్ర ముచ్చరింపుచుఁ బెట్టవలెనని స్మృతిమతము. ఆశ్వలాయన సూత్రమందు మాత్రముఁ జలమాత్రముచే వండినయన్నముఁ జెప్పఁబడినది. సూర్యావలోకనము మొదలుకొని యన్నప్రాశనమువఱకును శిష్టు లన్నప్రాశనముతోడనే చేయుదురు. అట్టి సహస్ర యోగమందు సంకల్పాదికము గౌస్తుభాదులందుఁ దెలియవలెను. ఇఁక నన్నప్రాశనరాంతమందుఁ జేయవలసిన కృత్యము "అగ్రతోధ పరిన్యస్య శిల్ప వస్తూని సర్వశః శస్త్రాణి చైవ వస్త్రాణి తతః పశ్యేత్తు లక్షణం, ప్రథమం యత్స్పృశే ద్బాలః పుస్తకాదిస్వయం తదా, జీవికాతస్య బాలస్యతే నైవతు భవిష్యతి" అనఁగా నపుడు చిత్రమైన నగలు బట్టలు కత్తులు పుస్తకములు మొదలైనవి శిశువునెదుట యుంచి లక్షణముచూచునది. ఎట్లనిన; బాలుఁడు మొదట నేవస్తువును ముట్టునో యావస్తువుచే జీవికయగునని యూహించునది. అన్నప్రాశనాంత సంస్కారములు చేయునపుడు మలమాసశుక్రాస్తాది దోషములేదని మీఁదఁ జెప్పఁబడినది. అదియు; శుద్ధకాలమున సంభవించినపుడని తెలియునది. కనుక నారవమాసమందట్టి దోష మున్నచో నష్టమ మాసమందుఁ జేయవలెను.

## కర్ణవేధ

"దశమేద్వాదశే వాహ్ని షోడశే కర్ణవేధనం, మాసే షష్ఠే సప్తమే వా అష్టమే దశమే తథా, ద్వాదశే వాతతో బ్దేచ ప్రథమే వా తృతీయకే, న కర్తవ్యం స మేవర్షే స్త్రీ పుంసోః కర్ణవేధనం." అనఁగా చెవులుకుట్టుట పది పండ్రెండు పదియాఱుదినము లందును ఆరు నేఁడు నెనిమిది పది పండ్రెండు మాసములందును ప్రథమ తృతీయ వత్సరములందునుఁ జేయవచ్చును. స్త్రీకిగాని పురుషునికిగాని సరివత్సరమునఁ గూడదు. మూఁడు మొదలగు వత్సరములందును "కార్తికే మాఘమాసే వా చైత్రే వా ఫాల్గుణే తథా, శుక్లపక్ష శ్శుభః ప్రోక్తో జన్మమాసో నిషేధితః" అనఁగా జన్మమాసము తప్ప తక్కిన మాసములలో గార్తికమాఘ చైత్ర ఫాల్గుణ మాసములును నందు శుక్లపక్ష

మును శుభములు. "భద్రాయాం విష్ణుశయనే కర్ణవేధం వివర్జయేత్" భద్ర యందును జాతుర్మాస్యమగు నేకాదశు లతిక్రమించక మున్నునుఁ గూడదు. అనియున్నందున గార్తికమందును శుక్లైకాదశికి పైనిఁ జేయవలయును. కొందఱు మీనస్థుఁడై సూర్యుఁ డున్నచో చైత్రమును ధనుస్సు నందుండఁగ బౌషమును విడుచుచున్నారు. విదియ, దశమి, షష్ఠి, సప్తమి, త్రయోదశి, ద్వాదశి, పంచమి, తదియయు కర్ణవేధకు మంచివి. సోమ, బుధ, గురు, శుక్రవార ములు శుభములు. పుష్యము, పునర్వసు, మృగశీర్ష, ఉత్తర, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర, హస్త, చిత్ర, అశ్విని, శ్రవణము, రేవతి, ధనిష్ఠ యీ నక్షత్రములు శుభములు. విష్ణు రుద్ర బ్రహ్మ సూర్య చంద్ర దికాల్పులురకును నశ్వినీదేవతలకు సరస్వతికిఁ గోవునకు బ్రాహ్మణునికి గురువునకునుఁ బూజఁజేసి మొగశిశువు కుడిచెవి లత్తుకఁబూసి మొదట కుట్టవలెను. అటుపైని నెడమ చెవియు నట్లనే కుట్టవలెను. అపుడు కుట్టు తీగెకు లక్షణము. "సౌవర్ణీ రాజపుత్రస్య రాజతీ విప్రవైశ్యయోః, శూద్రస్య వాయసీ సూచీ బాలకాష్టాంగులామతా, కర్ణరంధ్రే రవేచ్ఛాయా ప్రవిశే ద్వర్ధయేత్తథా, అన్యదా దర్శనే తస్య పూర్వపుణ్య వినాశనం." అనఁగా రాజపుత్రునకును రాజాశ్రితునకునుఁ గొప్ప వైశ్యునకును సువర్ణమయమై సూదివలె సన్నమైనతీఁగె బాలునియంగుళితో నెనిమిదివేళ్ళు పొడవుగలది కావలెను. శూద్రునకు నినుపతీగె యట్టిది కావలెను. కర్ణ రంధ్రములో సూర్యకాంతి ప్రవేశించినట్లు దాని పెంచవలెను. లేనిచో వానిఁ జూచినవానికిఁ బూర్వపుణ్యము నశించుననుట.

## దృష్టిదోషక నివారక రక్షావిధి

శ్లో॥ "వాసుదేవో జగన్నాథః పూతనాతర్జనో హరిః, రక్ష తు త్వరితో బాలం ముంచ ముంచ కుమారకం, కృష్ణరక్ష శిశుం శంఖమధుకైటభ మర్దన, ప్రాతస్సంగవ మధ్యాహ్న సాయాహ్నేషు చ సంధ్యయోః, మహానిశి సదారక్ష కంసారిష్ట నిషూదన, యద్గోరజః పిశాచాంశ్చ గ్రహాన్ మాతృగ్రహానపి, బాలగ్రహా న్విశేషేణ ఛింధి ఛింధి మహాభయాన్, త్రాహి త్రాహి హరే నిత్యం త్వద్రక్షాభూషితం శుభం, ఇతి భస్మాభి మంత్రైవ భూషయే త్తేన భస్మనా, శిరోలలాటాద్యంగేషు రక్షాంకుర్యా ద్యథావిధి." అనఁగ "త్వద్రక్షో భూషితం శుభం" అను పర్యంతము మంత్రము దానిచే భస్మము నభిమంత్రించి బాలకుని శిరోలలాటాదులందుఁ బూయవలెననుట. మఱియును "రక్ష రక్ష మహాదేవ నీలగ్రీవ జటాధర, గ్రహైస్తు సహితోరక్ష ముంచ ముంచ కుమారకం." అను మంత్రమును భూర్జపత్రమందు లిఖించి బాలకుని భుజమందుఁ గట్టవలెను. బాలకుని రోదనము మాన్పుటకు యంత్రము మయూఖమందుఁ జెప్పఁ బడినది. ఎట్లనిన; ఆరంచులుగల చక్రమందు మధ్యభాగమున "హ్రీం" అను నక్షర మును దానిమధ్యమున బాలకుని నామమును వ్రాసి యారుకోణములందును "ఓం లులు పతుస్వాహా" యను మంత్రము నారక్షరములు వ్రాసి యా చక్రముపైని కమ్మి వలె రెండువర్తులాకార రేఖలను వ్రాసి యాపైని యర్ధచంద్ర రేఖల నధోముఖములుగఁ జుట్టును వ్రాసి యా యంత్రమునుఁ బంచోపచారములచేఁ బూజించి బాలుని

హస్తమందుఁ గట్టవలెనని, బాలగ్రహ శాంతి మొదలగునదియు బాలగ్రహస్తవమును శాంతి కమలాకరశాంతి మయూఖములోఁ దెలియునది.

## వర్ధాపన విధి

అనఁగాఁ బుట్టినదినమందుఁ జేయు నుత్సవము. అది సంవత్సరము పర్యంతము ప్రతిమాసమందును జన్మతిథియందుఁ జేయవలెను. అనంతరమందు ప్రతి సంవత్సరమందును నపుడుఁ జేయవలెను. ఖండతిథియైనచో జన్మనక్షత్ర యోగమున్న తిథి గ్రహించునది. దినద్వయమందును జన్మనక్షత్రయోగముండినను లేకున్నను నుదయకాలమందు రెండుముహూర్తములకు నధికముగ వ్యాపించునది. గ్రహింపవలెను. అంతకుఁ దక్కువయైయున్నచోఁ బూర్వదినమే గ్రాహ్యము. జన్మమాస మధిక మాసమైనప్పటికిని ప్రతిసంవత్సరమునఁ జేయు జన్మదినోత్సవము శుద్ధమాసమందే చేయవలెనుగాని యధికమందుఁ గూడదు. ఇఁక సంక్షేపముగ ప్రయోగము చెప్పఁబడును. "ఆయురభివృద్ధ్యర్థం వర్షవృద్ధి కర్మ కరిష్యే" యని సంకల్పించి తిలలచే నలుగుబెట్టుకొని తిలలు గలిపిన జలముచే స్నానముఁజేసి తిలకాదులు ధరించి గురువునుఁ బూజించి యక్షతపుంజములపై దేవతలఁ బూజించునది. అందు మొదట "కులదేవతాయై నమః" అని కులదేవతావాహనముఁజేసి జన్మనక్షత్రమును తల్లిదండ్రులను ప్రజాపతిని భానుని విఘ్నేశుని మార్కండేయుని వ్యాసుని పరశురాముని అశ్వత్థామను కృపాచార్యుని బలిచక్రవర్తిని ప్రహ్లాదుని హనుమంతుని విభీషణుని షష్ఠీదేవిని నామములచేతనే యావాణముఁజేసి పూజింపవలెను. షష్ఠీదేవికి దధ్యన్న నిదేనములు. ఆపైని ప్రార్థన చేయునది. "శ్లో. చింరజీవీ యథా త్వంభో భవిష్యామి మహామునే, రూపవాన్ విత్తవాం శ్చైవ శ్రియాయుక్తశ్చ సర్వదా, మార్కండేయ నమస్తేస్తు సప్త కల్పాంత జీవన, ఆయురారోగ్య సిద్ధ్యర్థం ప్రసీద భగవన్మునే, చిరంజీవీ యథాత్వం తు మునీనాం ప్రవరో ద్విజ, కురుష్వమునిశార్దూల తథామాం చిరంజీవితనం, మార్కండేయ మహాభాగ సప్తకల్పాంత జీవన, ఆయురారోగ్య సిద్ధ్యర్థ మస్మాకం వరదోభవ." అనఁగా నేడు కల్పాంతములవరకు జీవించి మునులలో శ్రేష్ఠుఁడ వైన యో మార్కండేయుఁడా! నాకు వరముగ నాయురారోగ్యైశ్వర్యములఁ జిరకాలమిమ్మని యర్థముగల యీ శ్లోకములచే మార్కండేయుని ప్రార్థించునది.

## షష్ఠీ దేవీ ప్రార్థన

"జయదేవీ జగన్మాత ర్జగదా నందకారిణి, ప్రసీద మమ కల్యాణి నమస్తేషష్ఠ దేవతే, త్రైలోక్యే యాని భూతాని స్థావరాణి చ రాణి చ, బ్రహ్మా విష్ణు శివైస్సార్థం రక్షాం కుర్వంతు తానిమే." అనఁగా జగజ్జనని వైనయోషష్ఠీదేవీ! జగత్తున కానందము చేయుదానవు. నీ ప్రసాదముచే మూఁడు లోకములందున్న స్థావరజంగమములు బ్రహ్మ విష్ణు రుద్రులు సహితము నాకు రక్షనుఁ జేయవలెనని యర్థముగల యీ శ్లోకములచే షష్ఠీప్రార్థనఁ జేయునది. ఇట్లుచేసి తిలగుడములుఁ గలిపినపాలుఁ త్రాగవలెను. అందు మంత్రము–"స తిలం గుడసంమిశ్ర మంజల్యర్థమితం పయః

మార్కండేయా ద్వరంలబ్ధ్వా పిబామ్యాయుర్వివృద్ధయే" అని అనఁగా మార్కండేయునిచే వరమునొందిన పైని తిలగుడమిశ్రమైన చేరెడుపాలుఁ ద్రాగవలెను. నా కాయుర్వృద్ధి కావలెనని యర్థము. కొన్నిటిలో పూజించిన పదారుదేవతలకు నామములచే ప్రత్యేకము నిరువదెనిమిదేసి యాహుతులు హోమము చెప్పఁబడినది. ఆ పైని బ్రాహ్మణభోజనము. ఆదినమందుఁ జేయు నియమములు–"ఖండనం నఖ కేశానాం మైథునాధ్వగమౌ తథా, ఆమిషం కలహం హింసాం వర్షవృద్ధౌ వివర్జయేత్, మృతీ జన్మని సంక్రాంతౌ శ్రాద్ధే జన్మదినే తథా, అస్పృశ్య స్పర్శనే చైవ న స్నా యాదుష్ణ వారిణా." అనఁగా క్షౌరము మైథునము ప్రయాణము మాంసము కలహము హింసయు ఉష్ణోదకస్నానము వర్జింపవలెను.

## చౌలము - చూడాకర్మము

"జన్మతో గర్భతోవాబ్దే పథమే తద్వితీయకే, తృతీయే పంచమే వాపి చౌలకర్మ ప్రశస్యతే, యద్వాసహోపనీత్యా చ కులాచారాద్వ్యవస్థితిః, మాఘ ఫాల్గుణవైశాఖ జ్యేష్ఠే మాసి శుభం స్మృతం, జన్మమాసేధి మాసే చ జ్యేష్ఠే జ్యేష్ఠస్యనో భవేత్, శుక్ల పక్ష శ్శుభః ప్రోక్తః కృష్ణ స్యాంత్యత్రికం వినా, ద్వితీయా చ తృతీయా చ పంచమీ సప్తమీశుభా, దశమ్యేకాదశీ వాపి త్రయోదశ్యపి శస్యతే, రవి భౌమార్కశనయో వారావిప్రాది వర్ణతః, గురు శుక్ర బుధాశ్శుక్లే సోమస్సర్వ శుభావహః" అనఁగా పుట్టజుట్టు తీసివేయుట గర్భము మొదలుకొనిగాని, జన్మము మొదదలుకొనిగాని, యొకటి రెండు మూఁడు నైదుసంవత్సరములలో ప్రశస్తము. లేక యుపనయనము తోనైననుఁ జేయవచ్చును. అందు గులాచారముచే వ్యవస్థయగును. మఱియు మాఘ ఫాల్గుణ వైశాఖ జ్యేష్ఠమాసములు శుభములు. అందు జన్మమాసమునఁ జ్యేష్ఠుఁ డైనచో జ్యేష్ఠమాసమును వర్జ్యములు. శుక్లపక్షమును త్రయోదశి మొదలు మూఁడు దినములు తప్ప కృష్ణపక్షమును మంచివి. విదియ, తదియ, పంచమి, సప్తమి, దశమి, ఏకాదశి, త్రయోదశి ఈ తిథులు ప్రశస్తములు. గురు శుక్ర బుధవారములు శుక్లపక్షమందును, సోమవారము రెండుపక్షములందును శుభములు, అశ్విని, మృగ శీర్ష, పునర్వసు, పుష్యము, హస్త, చిత్ర, స్వాతి, జ్యేష్ఠ, శ్రవణము, ధనిష్ఠ, శతభిషక్, రేవతియు శుభములు. "క్షౌర ప్రయాణభైషజ్యే జన్మర్షం వర్జయేత్సదా, ఆయుఃక్షయోను రాధాగ్ని త్ర్యుత్తరా రోహిణీమఘే." అనఁగా క్షురకర్మయందును, ప్రయాణమందు, నౌషధపానమందును జన్మనక్షత్రముఁగూడదనియు, అనూరాధ, కృత్తిక, ఉత్తర, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర, రోహిణి, మఘ వీనియందు క్షురకర్మ ఆయుర్నాశకరమనియు, బృహస్పతి సింహస్థుఁడైనచో చూడాకర్మ చేయఁగూడదు. అయిదు సంవత్సరములలో పునఁ జేయుచో దల్లి గర్భిణియైయుండఁగఁజేయఁగూడదు. అటుపైనిఁ జేయవచ్చును. ఉపనయనముతో గలిపి చేయునపుడు తల్లి గర్భిణియైనను దోషములేదు. వేఱుగ చేయునపుడే నిషేధము. అదియును "పంచమాసాదధః కుర్యా దత ఊర్ధ్వం న కార యేత్" అని యున్నందున నయిదుమాసములపైనిఁ జేయఁగూడదని తెలియునది. రజముతో గూడియున్న యెడ చౌలాది మంగళముఁ జేయఁగూడదు. "వివాహవ్రత

చూడాసు మాతా యది రజస్వలా, తస్యాశుద్ధేః పరంకార్యం మంగళం మనురబ్రవీత్” అనఁగా వివాహము నుపనయనము చౌలము తల్లి రజస్వలయై యుండఁగ జేయఁ గూడదని మనువచనము కాని, నాందీశ్రాద్ధానంతరము రజస్వల యైనచో శాంతినిఁ జేసి చేయవచ్చును. కొందఱు మఱియొక ముహూర్తము సంభవింపనిచో ప్రారంభము నకు ముందు రజోదర్శనమైనను శ్రీపూజనము మొదలగు విధిచే శాంతినిజేసి చేయ వచ్చుననిరి. మేనమామ పినతండ్రి మొదలగువారు చేయునపుడు వారిభార్యలు రజస్వలలైననుఁ జేయగూడదని నిర్ణయసింధువు. ముగ్గురు పురుషుల పర్యంతమైన యేకకులమందు ఉపనయన వివాహరూపమంగళమైన పైని యాఱుమాసములలోగా ముండనమను పేరుగల చూడాకర్మ మొదలగునవి చేయఁగూడదు. నిర్బంధమున్నచో సంవత్సరము భిన్నముచేసి చేయవచ్చును. నలుగురు పురుషుల పర్యంతమైన యేక కులమందెచ్చట నైనఁ బ్రేతకర్మ ప్రాప్తించిననది సపిండీకరణమైన పైని మాసిక శ్రాద్ధము సమాప్తియగు పర్యంతము చూడాకర్మ మొదలగు శుభముఁ జేయఁ గూడదు.

## కూశ్మాండ హోమము

“ఏకమాతృక యోరేక వత్సరే పత్యయోర్ద్వయోః, వ సంస్కార స్సమానస్స్యా న్మాతృభేదే విధీయతే.” అనఁగా నొకతల్లిగర్భమునఁ బుట్టిన పుత్రుల కిద్దరకు నొక వత్సరమందు సమానసంస్కారమనఁగ చౌలముగాని యుపనయనముగాని యొక్క సంస్కారము చేయఁగూడదు. మాత వేరైనచోఁ జేయవచ్చునని, ప్రారంభమైన పైని సూతకము వచ్చినయెడ కూశ్మాండీఋక్కులచే నాజ్యహోమముఁ గోదానముఁజేసి చౌలము నుపనయనము వివాహముఁ జేయవచ్చును. శిరస్సు మధ్యమందు ముఖ్య మైనది యొక శిఖయును, ఇతర శిఖలు పార్శ్వములు మొదలగు భాగమలందును గులాచారము చొప్పున నుంచవలయును. అపుడు ప్రవరసంఖ్య శిఖల కుండవల యును. ఉపనయనకాలమందు మధ్యశిఖ తప్ప తక్కిన శిఖలన్నిటికి వపనముఁజేసి యుపనయనమైన పైని మధ్యశిఖనుమాత్రమే ధరించునది. ఈ చౌలకర్మయందును జాతకర్మయందును భుజించిన విప్రులకు సాంతపనకృచ్ఛ్రము ప్రాయశ్చిత్తము ఇతర సంస్కారములందు భుజించినచో నుపవాసముచే శుద్ధియగు చూడాకర్మ పర్యంతమైన సర్వసంస్కారములును స్త్రీలకు మంత్రరహితముగఁ జేయునది. హోమము మాత్రము మంత్రముతోఁ జేయవలయును. వృత్తికారుఁడు మొదలగువారు మాత్రము హోమము గూడ నమంత్రముగఁ జేయవలయును. లేదా హోమము మానవలయుననిరి. ఇట్లు శూద్రునకును మంత్రహీనముగనే చౌలము. ఇపుడు శిష్టుల గృహములందు స్త్రీలకుఁ జూడాకర్మఁజేయు నాచారము లేదు. వివాహకాలమందు చూడాకర్మ లోపప్రయాశ్చిత్త మును మాత్రముఁ జేయుచున్నారు. చౌలముఁ జరిగినపైని మూఁడు మాసముల పర్యంతము సపిండులు పిండదానమును తిలతర్పణమునుఁ జేయఁగూడదుగాని మహాలయమందును గయయందును ప్రత్యాబ్దికమందును పిండదానాదులు చేయ వచ్చును.

## విద్యారంభము

అయిదవ సంవత్సరమున నక్షరాభ్యాసముత్తరాయణమునఁజేయవలయును. అపుడు సూర్యుఁడు కుంభమందున్నచో గూడదు. శుక్లపక్షము శుభము. కృష్ణపక్షమైనను తుది మూఁడుదినములు తప్ప తక్కిన తిథులందు మంచిదే. విదియ, తదియ, పంచమి, దశమి, ఏకాదశి, త్రయోదశియు శుభములు. అశ్విని, మృగశీర్ష, ఆర్ద్ర, పునర్వసు, పుష్యము, హస్త, చిత్త, స్వాతి, అనూరాధ, శ్రవణము, ధనిష్ఠ, శతభిషక్, రేవతి యీ నక్షత్రములును, మంగళవారము శనివారము తప్ప తక్కిన వారములును శుభములు. విఘ్నేశుని లక్ష్మీనారాయణులను సరస్వతినిఁ దనవేదశాఖను సూత్ర కారుని గురువును బ్రాహ్మణులను ధాత్రినిఁ బూజించి నమస్కరించి యందఱకు మూఁడుమారులు ప్రదక్షిణముఁజేసి యోంకారపూర్వకముగ నక్షరము నారంభించు నది. అనంతరమున గురువునకు నమస్కరించి దేవతల విసర్జింపవలెను. అటుపైని "అత్ర భువన మాతస్సర్వవాఙ్మయ స్వరూపేణాగచ్ఛ అగచ్ఛ" యని యావాహనము సరస్వతికిఁజేసి ప్రణవముచే షోడశోపచారము లర్పించవలెను.

## అనుపనీత ధర్మములు

"ప్రాగుపనయనాత్కామచార కామవాద కామభక్షాః" అని యున్నందున ననఁగా నుపనయనము గాకమున్ను యథేష్టముగ నాచరించుటయు, మాటలాడుటయు, భక్షించుటయు, విధింపఁబడినందున మూత్రపురీషోత్సర్గము మొదలగువాని శుద్ధిలో నాచమనముఁ జేయు నాచార మపుడులేదు. స్వల్పపాపములగు నుల్లిచలిలదియెంగిలి భక్షించుట మొదలగు కార్యములచే దోషములేదు. ఇట్లు త్రాఁగకూడనివి త్రాఁగినను నసత్యముల వాక్యములు పలికినను దోషములేదు. మహాదోషములగు మాంసము చండాల రజస్వలాదులు స్పృశించినయన్నము భక్షించినను వధ్యాదులు త్రాగిననుఁ దోషము తప్పదు. "రజస్వలాది సంస్పర్శే స్నానమేవ కుమారకే, శిశోరభ్యుక్షణం ప్రోక్తం బాలస్యా చ మనం స్మృతం." అని యనఁగా నన్నప్రాశనమునకు ముందు శిశువనఁ బడును. అపుడు రజస్వల ముట్టినచో ప్రోక్షణమాత్రముచే శుద్ధి. అది మొదలుకొని మూఁడువత్సరముల వఱకును బాలుఁడనఁబడును. అపుడు రజస్వలాసంపర్కమైనచో నాచమనముచే శుద్ధి. అనఁగా మూఁడు మారులు జలముఁద్రాగుటమాత్రమే యాచ మనము. ఓష్ఠాదిమార్జన మక్కరలేదు. అదిమొదలుకొని యుపనయనము వఱకును గుమారసంజ్ఞ యగునపుడు ముట్టిన స్నానముచే శుద్ధియనుట. ఉపనయనముగాక మున్ను వేద ముచ్చరింపఁ గూడదు. తలిదండ్రుల యంత్యక్రియ ప్రాప్తించినచో మంత్ర ముచ్చరింపవచ్చును. అదియును రెండు మూఁడు వత్సరములలోనైనచో చౌలముఁ జేసినవానికే కూడును. ఆ పైని చూడాకర్మ ప్రమాణము. "పిత్రో రనుపనీఉ తోపి విదధ్యాదౌరస స్సుతః, ఔర్ధ్వదైహికమన్యే తు సంస్కృతా శ్రాద్ధకారకాః" అను స్కాందవచనము. బాలురకు హితముగాని చర్యను దల్లిదండ్రులు వారింపవలెను. "తస్మాత్సర్వ ప్రయత్నేన బాలానగ్రేతు భోజయేత్" అనఁగా ప్రయత్నముచే బాలురకు

ముందు భోజన మీయవలెను. బాలురకు నాటవస్తువుల నిచ్చువారికి స్వర్గసుఖము భోజనము పెట్టువారికిఁ గోదానఫలము.

## ఉపనయనము

ఉపనయనమనఁగ నాచార్యుని సమీపమునకుఁ గుమారునిఁ బొందించుట యంగముగను గాయత్ర్యుపదేశము ప్రధానముగను నడుచు కర్మవిశేషము. కనుకనే యువనయనపదము యోగరూఢము. ఇఁక నుపనయనము చేయునది కారులు– "పితైవోపనయే త్పుత్రం తదభావేపితుః పితా, తదభావే పితుర్భ్రాతా తదభావే తు సోదరః, తదభావే సగోత్ర సపిండాః తదవావేꠌ సగోత్ర సపిండాః తదభావే ꠌ సపిండ సగోత్రజాః" అనఁగా నుపనయనముఁజేయుటకుఁ దండ్రి ముఖ్యాదికారి. అతఁడు లేనిచో తాత అతఁడును లేనియెడఁ బినతండ్రి అతఁడునులేనిచో సోదరుడు నతఁడునులేనిచో ముగ్గురు పురుషులలోగానున్న జ్ఞాతులు. వారులేనిచో మేనమామ మొదలగు సపిండులు. వారులేనిచో దూరపు జ్ఞాతులగు సగోత్రులు ననుట. అట్టి యధికార మొందువారును గుమారునికంటె నధికమైన వయస్సుగలవారు కావలెను. ఏమనిన; కనిష్ఠునిచే నుపనయనము నిషిద్ధము ఎవ్వరును లేనిచో శ్రోత్రియుఁడు బురోహిఁతుడే చేయవలెను. "జన్మనా బ్రాహ్మణో జ్ఞేయ స్సంస్కారై ద్విజ ఉచ్యతే, విద్వత్వాచ్చాపి విప్రత్వం త్రిభిశ్శ్రోత్రియ ఉచ్యతే." అనఁగా బ్రహ్మబీజోత్పన్నుఁడగుట మాత్రముచే బ్రాహ్మణుఁ డగును. సంస్కారములు క్రమముగఁ జరిగినచో ద్విజుఁ డగును. విద్వాంసుఁడు గూడ నైనచో విప్రుఁడగును. మూఁడు లక్షణములు పూర్ణము గనున్నచో శ్రోత్రియుఁ డనఁబడును. ఉపనయనము చేయువాఁడు మూఁడు కృచ్ఛ్ర వ్రతములను వటుఁడు మూఁడు కృచ్ఛ్రములను నధికారసిద్ధికిఁ జేయవలెను. మఱియు నుపనయనము చేయునతఁడు వేయు పండ్రెండు మారులు గాయత్రీ జపము చేయవలెను. కొందఱు పండ్రెండు వేల జపముఁ జేయుచున్నారు.

## ఉపనయన కాలములు

గర్భస్థుఁడైనది మొదలుగాని జన్మమొదలుగాని కొని పంచమవర్షమందైనను నష్టమవర్షమందైనను బ్రాహ్మణున కుపనయనము. పదునొకండవ సంవత్సరమున నైనను పండ్రెండవ వత్సరమందైనను క్షత్రియునకును ద్వాదశమందైనను పదారవ వర్షమందైనను వైశ్యునకు నుపనయనము. శ్లో. "షష్ఠేతు ధనకామస్య విద్యాకామస్య సప్తమే, అష్టమే సర్వకామస్య నవమే కాంతి మిచ్ఛతః" అనఁగా ధనము గోరినయెడ నాఱవ సంవత్సరమున విద్యను గోరినచో సప్తమమందును సర్వముఁ గోరినచో నష్టమమందును శాంతిగోరునేని నవమమందు నుపనయనముఁజేయునది. కొందఱు విప్రుని కాఱవమాసము నంగీకరింపరు. పదారుసంవత్సరముల పర్యంతము బ్రాహ్మణునకును, నిఱువది రెండువఱకును క్షత్రియునికిని, నిరువదినాలుగగునంతకు వైశ్యునికిని గౌణకాలము. ఇక్కడ గర్భము మొదలుకొనియే యని తెలియవలెను. కనుక పదునైదువఱకును బ్రాహ్మణునకు విశేషప్రాయశ్చిత్త మక్కరలేదు. పదహారవ

సంవత్సర మున శిఖతోగూడ క్షౌరము నిరువదొకరోజు లత్తుకఁదిని యుపవసించుటయు తుది నేఁడుగురు బ్రాహ్మణులకు భోజనమునుఁ బెట్టుటయు ననిప్రాయశ్చిత్తము పదునేఁడవ సంవత్సరము మొదలగువాటిలో నెప్పటివలె కృచ్ఛ్రత్రయముఁజేసి యుపనయనము కావచ్చును. విప్రునకు క్షత్రియునకు నుత్తరాయణమందే, మౌంజీబంధమనఁగా నుపనయనము. వైశ్యునికిఁ దక్షిణాయనమందునుఁ జేయవచ్చును. "వసంతే బ్రాహ్మణము పనయీత గ్రీష్మే రాజన్యం శరదివైశ్యం మాఘాది శుక్రాంతపంచమాసావాసాధారణా స్సకలద్విజానాం." అని గర్గవచన మున్నందున వసంతముఁ దొరకనిచో శిశిరఋతువు గ్రీష్మమునుఁ గ్రహింపవచ్చును. వసంతమందని విధించుటచే నుత్తరాయణ మందను విధికి సంకోచముఁ గూడదు. ఇట్లు మాఘాదిమాసపంచకము నియమించుటచే పౌషమునకు నాషాఢమునకు నుత్తరాయణ యోగమున్నను చేయఁగూడదు. అందును మీనమందు సూర్యుఁడు ప్రవేశించుట మొదలుకొని మిధున ప్రవేశము వఱకును, బ్రశస్తకాలము మీనమేషము లయినచో బ్రశస్తతరము. ఏమనిన; "మకరకుంభస్తేర్కే మధ్యమం మీనమేషస్థే ఉత్తమం వృషభ మిధునస్థేஉ ధమముపనయన"మని వచనమున్నది. మీనార్కునితోఁగూడిన చైత్ర మనిస్ట బృహస్పతి మొదలగు దోషముల కపవాదము గనుక ప్రశస్తతమము. అందువచనము. "జీవభార్గవయోరస్తే సింహస్థే దేవతాగురౌ, చంద్ర సూర్యేదుర్బలేతి గోచరేనిష్ట దేగురౌ, మేఖలా బంధనం కార్యంచైత్రే మీనగతేరవౌ" అనఁగా గురుశుక్రాస్తములందును గురువు సింహలగ్నమందున్నను చంద్రసూర్యులు బలహీనులైయున్నను గోచారమందు బృహస్పతి యనిష్టమైయున్నను చైత్రము మీనసంక్రాంతితో గూడెనేని యుపనయనము చేయవచ్చునని యర్థముగల స్మృతియున్నదిగాని యది గురు శుక్రాస్తాది మహాదోషాపవాదమైయున్నందున నతిసంకట విషయము గనుక నిచ్చటఁ జెప్పవలసినదికాదు. మఱి యేమనిన; మీనార్క చైత్ర మందు జన్మమాసదోషము జన్మనక్షత్రదోషములేదని తెలియవలెను. జన్మమాసము జన్మనక్షత్రము జన్మలగ్నము జన్మరాశి వీనియందు విప్రులకు దోషములేదు. క్షత్రియ వైశ్యులకైననుఁ జ్యేష్ఠునకుఁ జేయునపుడే దోషము. రెండవగర్భమైనచో దోషములేదు. మరియు జ్యేష్ఠునికిఁ జ్యేష్ఠమాసము నిషిద్ధము. "శుక్లపక్ష శ్శుభః ప్రోక్తః కృష్ణ స్యాంత్యత్రికం వినా" యని యున్నందున నిబ్బందియగుచో గృష్ణ పక్షము దశమీపర్యంతమే గూడును. శిష్టులు మాత్రము పంచమిలోగానే చేయుచున్నారు.

## తిథి విచారము

విదియ, తదియ, పంచమి, షష్ఠి, దశమి, ఏకాదశి, ద్వాదశి యివి ప్రశస్తములు. కొన్నిటిలో సప్తమి, త్రయోదశి, కృష్ణప్రతి పదయుఁగూడ విధింపఁబడినది. గాని, యది పునరుపనయనమున కైనను మూగివాఁడు మొదలగువాని యుపనయనమునకైన నని తెలియవలెను. "తిథౌసోప పదాఖ్యాయా మనధ్యాయే గలగ్రహే, అపరాహ్ణే చోపనీతః పున స్సంస్కార మర్హతి, సితాజ్యేష్ఠే ద్వితీయా చ అశ్వినే దశమీ సితా, చతుర్థీ ద్వాదశీ మాఘే ఏతాస్సోప పదాస్మృతాః" అనఁగా జ్యేష్ట శుక్ల ద్వితీ

యయు, నాశ్వినశుక్ల దశమియు, మాఘశుక్ల చవితియు, ద్వాదశియు నివి సోప పదములు. వీని యందును ననధ్యాయమందును గలగ్రహమందు ననఁగా క్రింద వ్రాయఁబడుదినములను, అపరాహ్ణకాలమందును, నుపనయనముచేసినచో సిద్ధిం పదు గనుక దిరుగఁజేయవలయును.

## నిత్యానధ్యాయములు

“అనధ్యాయాః పౌర్ణమాసీ చతుర్దశ్యష్టమీతథా, ప్రతిపత్సూర్య సంక్రాంతి మన్వాధ్యాశ్చ యుగాదయః, కృష్ణపక్ష ద్వితీయాశ్చ కార్తికాషాఢ ఫాల్గుణే.” అనఁగా, పూర్ణిమ చతుర్దశి, అష్టమి అమావాస్య, ప్రతిపద సంక్రమణదినము, మన్వాది, యుగాది, కార్తికాషాఢ ఫాల్గుణముల కృష్ణద్వితీయలు ననధ్యాయములు. తులామకర కర్కటముల ప్రవేశమందు బక్షిణీ యనఁగ రెండురోజు లనధ్యాయమని మీఁది పరిచ్ఛేదమందు చెప్పఁబడినది. సోపపదతిథులుగాని, యనధ్యాయములుగాని, రెండు దినములందును, సూర్యోదయోత్తరమందును, సప్తమయమునకు బూర్వమును నారు గడియలున్నచో దినద్వయము ననధ్యాయము. శిష్టులు ప్రతిపత్తుగడియ శేషించి యున్నప్పటికి మఱునాఁడనధ్యాయమునుగా నుపనయనమున కంగీకరింతురు. ఇఁక సంక్రాంతి యుగాదిమన్వాదులకు ద్వితీయపరిచ్ఛేదమందుఁ జెప్పినటుల సంక్రాంతి పుణ్యకాలము యుగాదిమన్వాది శ్రాద్ధమున కర్హతయుఁగలిగిన దిన మనధ్యాయమని తెలియునదిగాని వాటి కస్తమయాదులందు ముహూర్త త్రయ ముండుట యనధ్యాయ హేతువుగాదు. “త్రయోదశ్యాది చత్వారి సప్తమ్యాది దినత్రయం, చతుర్థీ చైకతః ప్రోక్తా అష్టావేతే గళగ్రహాః” అనఁగా త్రయోదశి మొదలు నాల్గురోజులును సప్తమి మొదలు మూఁడు రోజులును చవితియును నీయెనిమిదిగళ గ్రహములు. అందు చవితియు నవమియు నుపనయనకాలమందు వర్జ్యము లని తోఁచుచున్నది. కొందఱు చతుర్థీ శేషముతోగూడిన పంచమియందుపనయనముఁ జేయరు. అందు ప్రమాణము గానరాదు. నవమి శేషముతో గూడిన దశమియందు నుపనయనముఁగూడదని మయూఖమం దున్నది. అపరాహ్ణమనఁగ దినము మూఁడు భాగములలో మూఁ డవ భాగమందుపనయనముఁ గూడదు. దిన మధ్యభాగమునం దైనచో మధ్యమము. దిన ప్రథమభాగము ముఖ్యకాలము. మన్వాదియుగాదులు మీఁదిపరిచ్ఛేదమందుఁ జూపఁబడినవి. అందుపనయనమునకు చైత్రశుక్ల తృతీయ మన్వాదియును వైశాఖ శుక్ల తృతీయ యుగాదియునుఁ బ్రసక్తించును. తక్కిన యుగాది మన్వాది తిథులకు ప్రసక్తియే లేదు. ఆ రెండింటి కపవాదము సింధుకౌస్తుభాదులం దున్నది. “యాచైత్ర వైశాఖ సితాతృతీయా మాఘస్యసప్త మ్యథ ఫాల్గుణస్య, కృష్ణ ద్వితీయోపనయే ప్రశస్తా ప్రోక్తా భరద్వాజ మునీంద్ర ముఖ్యైః” అనఁగా చైత్ర వైశాఖశుక్ల తృతీయలు, మాఘశుక్ల సప్తమియు, ఫాల్గుణకృష్ణద్వితీయయు ప్రశస్తములనుట. అందు మాఘ సప్తమి మన్వాది దానికపవాదముఁ జెప్పుట పునరుపనయన విషయము. ఫాల్గుణకృష్ణద్వితీయ చాతుర్మాస్యద్వితీయ గనుక ననధ్యాయ మగునని దాని కపవాదము నగును. మఱియు “అనధ్యాయస్య పూర్వేద్యు రనధ్యాయాత్పరేహని, వ్రతారంభ విసర్గం చ విద్యారంభం

చ వర్జయేత్” అను నిషేధవచనమనఁగా ననధ్యాయదినమునకుఁ బూర్వదినమును బరనము నుపనయనమందును, విసర్జనమందును, విద్యారంభమందును వర్జింపవలె నని యున్నదిగాని, యది ద్వితీయయందు విధించు వచనమునకు విరోధించును గనుక గళగ్రహమగుటచే సప్తమీ నవమీ త్రయోదశులకుఁ బ్రాప్తించిన నిషేధము ననువదించినదని యూహించునది. అప్రాప్తమును నిషేధించుననినచో మన్వాది యుగాది సంక్రాంతి ప్రయుక్తమగు ననధ్యాయమునకుఁ బూర్వపరదినములు గూడ నిషిద్ధములు గావలసివచ్చును గనుక చైత్రశుక్ల ద్వితీయకుఁగూడ నిషేధము వచ్చును. శిష్టాచారమందును ప్రాచీన గ్రంథమందు నది గానరాదు. ముహూర్తమార్తాండ మందు మాత్రము మాఘశుక్ల ద్వితీయ కృష్ణద్వితీయ వైశాఖ కృష్ణద్వితీయయు నను ననధ్యాయత్రయ మధికము వచ్చుచున్నది గాని దాని నితరులాదరించరు. ముహూర్త చింతామణి మొదలగు బహుగ్రంథములందట్లు గానరాదు. కనుక మార్తండోక్తమైన ననధ్యాయము లుపనిషత్పారము మొదలగువానికిగాని యుపనయనమునకుఁగాదని దోఁచుచున్నది. అందు తృతీయ, షష్ఠి, ద్వాదశి వీనియందు ప్రదోషమున్నచో నుపనయ నముఁజేయఁగూడదు. ఎట్లనిన; రాత్రి ప్రథమయామమందు చవితియున్నచో తృతీయ కును జామున్నరకు సప్తమియగుచో షష్ఠికిని రెండుజాములకు త్రయోదశియగుచో బూర్వదినమందు ప్రదోషము లేదు. పరదినమందే యని కౌస్తుభమున నున్నది. ప్రదోష దినమందును శనివారమందును కృష్ణపక్షము తుది మూఁడుదినములందును నుపనయనముః జేయునెడ దిరుగనవి చేయవలయునని మయూఖమందున్నది.

## నైమిత్తికానధ్యాయములు

“వివాహ ప్రతిష్ఠోద్యాపనాదిష్వాసమాప్తే స్వగోత్రాణా మనధ్యాయః” అని స్మృత్యర్థసారమందుః జెప్పినందున ముగ్గురు పురుషులలోగా సపిండులకు బ్రహ్మ యజ్ఞాదులు వర్జించుటచే నుపనయన వివాహాదులకై వేసిన మండప ప్రతిష్ఠ మొద లగు నుత్సవము సంపూర్తి యగు వఱకు నుపనయనము చేయఁగూడదని తోఁచు చున్నది. వివాహాది మంగళ కార్యమందు దోషములేదు. “శోభనదినేచా నధ్యాయః” అని చెప్పినందున గర్భాధానము మొదలగు శుభకార్యదినమందు నొక్కగృహమందు నొక్కకులమందు నుపనయనము చేయఁగూడదని తోఁచుచున్నది. భూమి కంపించి నను, భూమి బ్రద్దలైనను, పిడుగువడినను, నాకాశమునుండి జ్వాలపడినను, ధూమ కేతువు పుట్టినను, గ్రహణము వచ్చినను, పదిదినములపర్యంతముగాని, యేఁడు దినములమట్టుకుగాని, యుపనయనము మొదలగు శుభకార్యము చేయఁగూడదు. కొందఱు నిర్బంధముగలుగుచో మూఁడుదినము లనధ్యాయమంద్రు. అకాలవర్ష మైనచో మూఁడు రాత్రులుగాని రెండురాత్రులనఁగ పక్షిణియైన ననధ్యాయము. పౌషము మొదలుగ చైత్రమువఱకు నకాలవృష్టి. కొందఱు ఆర్ద్రమొదలుకొని జ్యేష్ఠ యంతముగ సూర్యుఁడు దాఁటినపై నకాలవృష్టి యందురు. ఏదేశమున వర్షాకాల మెద్దియో యాదేశమందు దానికి వ్యతిరిక్త కాలమందు వృష్టి యకాలవృష్టి. యని

సిద్ధాంతము. అతివృష్టియు వడగళ్లు వర్షింపచినను రక్తము వర్షించినను మూఁడు రోజు లనధ్యయనము. ఉదయసంధ్యాకాలమున నురుములుఁ గల్గినచో నహోరాత్ర మనధ్యాయము. గురవుగాని శిష్యుఁడుగాని ఋత్విక్కుగాని మృతినొందినచో మూఁడు దినము లనధ్యాయము. పశువులు కప్పలు ముంగి కుక్క సర్పము పిల్లి యెలుకయు గురుశిష్యుల మధ్యమున వెళ్లినచో నొకరోజు చౌలపిల్లి మొదలగునవి వెళ్ళినచో మూఁడు రాత్రులు. నక్కయు వానరము వెళ్ళినచో బంఁడ్రెండు దినములు. శ్రవణ ద్వాదశి, యమద్వితీయ, మహాభరణి మొదలగు నిత్యానధ్యాయములును, మఱియును నైమిత్తికానధ్యాయములును, గ్రంథాంతరములందుఁ జెప్పఁబడినవి గాని యవి యుపనయనమందుఁ బ్రసక్తింపవు గనుక వ్రాయలేదు. వ్రతబంధమనఁగ నుపనయనమందు నాందీ శ్రాద్ధము పైని మీఁదఁజెప్పిన ప్రాతర్గర్జనాదులు నైమిత్తికానధ్యాయములు ప్రాప్తించినచో జ్యోతిర్నిబంధమందు "నాందీశ్రాద్ధం కృతం చేత్స్యా దనధ్యాయస్త్వకాలికః, తదోపనయనం కార్యం వేదారంభం న కార యేత్" అని విధించినందున నుపనయనముఁ జేయవచ్చును. వేదారంభము మాత్రము కూడదు. ఇట్లు నిషేధించుట యజుర్వేదవిషయము. ఋగ్వేదుల కుపాకర్మతోఁగాని వేదప్రారంభ ముపనయనముతో లేదు. ఉపనయనవిధి మాత్రము ఋగ్వేదులకు నితర శాఖీయులకును సమమే. ఉపనయనాంతరమైనచో యజుర్వేదులకును ననధ్యాయము వచ్చుచో వేదారంభముఁ గూడదు. నాందీశ్రాద్ధము కాకముందు నైమిత్తికానధ్యాయము వచ్చుచో ముహూర్తాంతరమందుఁ జేయవలెను. మౌంజి యనఁగ నుపనయనము పైని యను ప్రవచనీయమునకు మున్ను గర్జనమైనచో ముందుఁ జెప్పఁబడును.

## వారములు

గురు శుక్ర బుధవారములు శ్రేష్ఠములు. ఆదిత్యవారము మధ్యమము. సోమవార మధమము. మంగళ శనివారములు నిషిద్ధములు. సామవేదులకును క్షత్రియులకును మంగళవారము ప్రశస్తము. "శాఖాధిపతివారశ్చ శాఖాధిప బలం తథా, శాఖాధిపతి లగ్నం చ దుర్లభం త్రితయంవ్రతే" అనఃగా వారము బలము లగ్నము నీమూఁడు నుపనయనమందు స్వశాఖాధిపతి సంబంధములైనవై సంభవించుట దుర్లభము "గురుశుక్రౌ భౌమబుధా వృగ్వేదాద్యధిపామతాః" గురు శుక్రాంగారకబుధులు క్రమముగ ఋగ్యజుస్సామాధర్వణముల కధిపతులు "పతీ సితే జ్యౌ విప్రాణాం నృపాణాం కుజభాస్కరౌ వైశ్యానాం శశభృత్సౌమ్యౌ ఇతి వర్ణాధిపా స్మృతాః" అనఁగా బ్రాహ్మణులకు శుక్రబృహస్పతులును క్షత్రియులకు సూర్యాంగారకులును వైశ్యులకు చంద్రబుధులును నని వర్ణాదిపతులు. "పితుస్సూర్యబలం శ్రేష్ఠం శాఖావర్ణేశ యోర్వటోః, పితుర్వటోశ్చ సర్వేషాం బలం వాక్పతి చంద్రయోః"వటునితండ్రికి సూర్యబలము కావలెను. వటునికి స్వశాఖాధిపతియొక్కయు, స్వవర్ణాధిపతియొక్కయు బలము కావలెను. వటునికి తండ్రికి నందఱకును గురుచంద్రుల బలము కావలెను. గురుచంద్రబలము వటునకును, దండ్రికి నిద్ధఱకును సంభవింపనిచో వటునకైనను కావలెను. అందు చంద్ర

బలము గర్భాదాన ప్రసంగమందుఁ జెప్పఁబడినది రెండునైదు నేఁడు తొమ్మిది పదు నొకండు నీస్థానములందుండెనేని గురుఁడు శుభఫల మిచ్చును. జన్మ తృతీయ షష్ఠదశమస్థానములందుండేనేని పూజాహోమము మొదలగుశాంతిచే శుభమిచ్చును. చతుర్థాష్టమద్వాదశములందుండెనేని దుష్టఫలము నిచ్చును. కర్కటధనుర్మీనములలో చతుర్థాధిస్థానములైనను దోషములేదు. మిక్కిలి నిర్బంధమున్నచో చతుర్థాధిస్థాన ములందున్నను ద్విగుణపూజాహోమాదులచే శుభుఁడగును. అష్టమస్థానమందు గురుఁడుండెనేని త్రిగుణముగఁ బూజాహోమాదులఁజేసిన శుభుఁడగును. కొంద రనిష్టస్థానమందుండినను వామవేధగలిగిన ననఁగా వెనుక వేధయున్నచో శుభుఁ డని యందురు అది యుక్తముగా దని రాజమార్మతండుఁడు. అష్టమవర్షము మొదలగు ముఖ్యకాలమునఁ గురుబలము లేకున్నను మీనస్థరవితోగూడిన చైత్రమం దైనను శాంతిజేసియైన నుపనయనముఁ జేయవలెనుగాని ముఖ్యకాలము దాఁటగూడదు. నిత్యకాలవిధి ప్రబలము.

## నక్షత్రములు

పుబ్బ, పూర్వాషాఢ, పూర్వాభాద్ర, హస్త, చిత్ర, స్వాతి, మూల, ఆశ్లేష, ఆర్ద్ర, శ్రవణము నీ నక్షత్రములు ఋగ్వేదులకు మౌంజబంధనమందు ప్రశస్తములు. రోహిణి, మృగశీర్ష, పుష్యము, పునర్వసు, ఉత్తర, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర, హస్త, అనూరాధ, చిత్ర, రేవతి యీ నక్షత్రములు యజుర్వేదులకు శుభములు. అశ్విని, పుష్యము, ఉత్తర, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర, ఆర్ద్ర, హస్త, ధనిష్ఠ, శ్రవణము నీ నక్షత్రములు సామవేదులకు శ్రేష్ఠములు. అశ్విని, మృగశీర్ష, అనూరాధ, హస్త, ధనిష్ఠ, పునర్వసు, రేవతి యీ నక్షత్రము లధర్వవేదులకుఁ బ్రశస్తములు. ఈ నక్షత్రములు సంభవింపనిచో భరణి, కృత్తిక, మఖ, విశాఖ, జ్యేష్ఠ, శతభిషక్కు యివితప్ప తక్కినవి యందఱకు గ్రాహ్యములే. రాజమార్తాండమందుఁ బునర్వసునిషేధముఁ జెప్పఁబడినది. గాని ప్రమాణము గానరాదని బహుసమ్మతము. కొందఱు ఋగ్వేదులకు సామవేదులకును బునర్వసు నిషేధమనిరి. వ్యతీపాత, వైధృతి, పరిఘ వీని పూర్వార్ధములందును విష్కంభాదుల నిషిద్ధములగు గడియలందు నుపనయనము వర్జింపవలెను. ఇట్లు భద్ర యందును గ్రహణమందును గూడదు.

## లగ్న గ్రహములకు ఫలములు

"వ్రతే గ్రాహ్యోద్వాదశాష్ట షడ్వర్జ్యా శ్శుభఖేచరాః, ఖలాస్త్ర్యా యారిగాశ్చంద్ర శ్శుక్లగో కర్కగస్తనౌ, క్వచి త్సూర్య స్తనౌ శ్రేష్ఠో ష్టమేవర్జ్యోఖిలగ్రహాః లగ్నేశ శ్శుక్ల చంద్రౌ చ షష్ఠేవర్జ్యా స్సితోంత్యగః, లగ్నే చంద్రఖలాశ్చైవేం దుర్వర్జ్యో ద్వాదశాష్టమే, పంచేష్ట గ్రహహీనం తు లగ్నం సర్వత్ర వర్జయేత్, తులా మిధునకన్యాఖ్యా ధనుర్వృష ఝషాహ్వయాః, నవమాం శాశ్శుభాఃప్రోకాః కర్కాంశం వర్జయే ద్వ్రతే" ఉపనయన లగ్నమునకుఁ బంద్రెండింటను నెనిమిదింటను నారింటను దప్ప తక్కినస్థానములందే శుభగ్రహము లుండవలెను. మూఁడింటను పదునొకొండింటను నారింటను దుష్ట

శుభగ్రహము లుండవలెను. చంద్రుఁడు శుక్లపక్షమందుండి వృషభకర్కటములలో నొకటి లగ్నమైనచో దానియం దుండవచ్చును. కొన్ని గ్రంథములలో సూర్యుఁడు లగ్నమందున్నను శ్రేష్ఠుఁడని యున్నది. అష్టమస్థానమందు గ్రహమేదియు నుండఁ గూడదు. లగ్నాధిపతియు శుక్రుఁడు చంద్రుఁడు నారింట నుండఁగూడదు. ద్వాదశ మందు శుక్రుఁడు గూడదు. చంద్రుఁడును దుష్టగ్రహములును లగ్నమందుండ గూడదు. చంద్రుఁడు ద్వాదశమందును నష్టమందును గూడదు. ఇష్టగ్రహము లైదు లేనిచో నాలగ్నము విడువవలెను. తుల, మిథునము, కన్య, ధనుస్సు, వృషభము, మీనము నీనవమాంశము శుభములు. కర్కటక నవమాంశ ముపనయనమందు నిషిద్ధము. షడ్వర్గశుద్ధి మొదలగునదియు నిష్టకాలసాధన విచారమును జ్యోతిర్గ్రంథ మువలన దెలియునది. తల్లి రజస్వలయైనను దండ్రి దూరదేశమందుండుటచే మేన మామ జ్యేష్ఠభ్రాత మొదలగు వారుపనయనముఁ జేయునపుడు వారిభార్యలు రజస్వల లైనను నుపనయనము వివాహముఁ జేయఁగూడదు. నాందీశ్రాద్ధమైన పైని దల్లి రజస్వలయైనచో జ్యేష్ఠభ్రాత్రాది కర్తలున్నప్పటికిని జేయఁగూడదు. సన్నిహిత ముహూ ర్తము వేఱొకటి దొఱకనిచో శాంతిఁజేసి చేయవచ్చును దొరికినచో నపుడే చేయవలెను. మాతులాదిగౌణకర్తలు జేయునపుడు వారిభార్యలు నాందీశ్రాద్ధమైన పైని రజస్వల లైనచో నారంభింపఁబడినది. కనుక శాంతిలేకుండఁగనే జేయవచ్చును. ఉపనయ నమునకుగాని వివాహమునకుగాని స్థాపించిన మండప ముద్వాసనజేయకమున్ను దల్లి రజస్వలయైనను శాంతిఁజేయక తప్పదు. ఏమనిన; మంగళము సమాప్తము కాలేదని ముహూర్తచింతామణి టీకలో నున్నది.

## లగ్నగ్రహఫలశాంతి

నాందీశ్రాద్ధమునకు ముందే తల్లి రజస్వలయైనను అవకాశము లేనియెడ శాంతిఁజేసి చేయవచ్చునని కౌస్తుభమందున్నది. ఎట్లనిన; "మమూముక మంగళే సంస్కార్యజననీ రజోదోషజనితా శుభఫల నిరాసార్థం శుభఫలావాప్త్యర్థం శ్రీపూజనాది శాంతిం కరిష్యే." యని సంకల్పించి మాషపరిమితమైన సువర్ణముచే ప్రతిమయందు లక్ష్మిని శ్రీసూక్తముచే షోడశోపచారములిచ్చి పూజించి తమగృహ్యా సూత్రవిధిచొప్పున శ్రీసూక్తముచే బాయపహోమము ప్రతిఋక్కునకొక యాహుతి చొప్పునఁజేసి కలశోదక ముచే నభిషేకముఁజేసి విష్ణుని స్మరించి కర్మ నీశ్వరారిత్పముఁ జేయవలయునని ప్రారంభించిన పైని సూతకమువచ్చినచో నేకోదరులకు సమాన సంస్కారమందును ప్రేతకర్మ సమాప్తిఁ బొందకున్నపుడును చౌలప్రకరణమందుఁ జెప్పఁబడినది. విశేషము ముందుఁ జెప్పఁబడును.

## పదార్థసంపాదనము

గోఁచియు పై వస్త్రము నహతమైనది సంపాదించునది. బద్దెతో గూడిన క్రొత్త వస్త్రము గొంచెముతికి యెండించినచో నహతమనఁబడును. కప్పుకొనుటకు గృష్ణాజినమైనను జేయవచ్చును. అట్టి లేడిచర్మము నాలుగంగుళములు వెడలుపును

నలుబదెనిమిదియంగుళములు పొడవును గల్గినది ఖండములు గాకుండ వలయాకార ముగ గత్తిరించియైనను, లేదా మూఁడు ఖండములు గలపియైనను, దానిరోమములు పైకి గనుపించునట్లుపవీతముగ ధరింపవలెను. మూఁడు ఖండములు చేయుచో గ్రమముగనిఱువదినాలుగంగుళములు నెనిమిదంగుళములుఁ బదారంగుళములు నుండవలెను. ప్రత్తిచే నిర్మించిన యజ్ఞోపవీతము గావలయును అది ఎట్లనిన, బ్రాహ్మ ణుఁడైనను విధవమొదలగు బ్రాహ్మణ స్త్రీలైనను వడకిన నూలు కావలెను. అది తొంబదియారు బెత్తెళ్లు ముప్పోగుతోడి మీఁదికి పురియెక్కించి తిరుగ మూఁడు పేటలుగఁజేసి దిగువకు బురి యెక్కించినచో దొమ్మిదిపోగులు గల్గినదగును. అది మూఁడుపేటలు గుజ్జు రెండుకొసలును పోగులును గలిపి గట్టిగ ముడివేయవలెను. "స్తనాదూర్ధ్వ మధోనాభే ర్నధార్యం త త్కథంచన, విచ్ఛిన్నం వా వ్యధోయాతం భుక్త్వా నిర్మిత ముత్సృజేత్." అనఁగా ధరించి యజ్ఞోపవీతము స్తనములకూర్ధ్వ భాగమందును నాభికిఁ దిగువను నెపుడు చేర్పఁగూడదు. పోగు తెగినను నాభికిఁ దిగువఁబడినను విడువవలెను. భుజించిన పైనిఁజేసిన యజ్ఞోపవీతము ధరింపనేకూడదు. "సిద్ధేమంత్రాః ప్రయోక్తవ్యా" యనున్యాయముచే యజ్ఞోపవీతము సిద్ధమైన పైని త్రిగుణీకరణము మొదలగు వానిమంత్రములచే నభిమంత్రించవలెను. ధరించునపుడు–"యజ్ఞోపవీతం పరమం పవిత్రం ప్రజాపతేర్య త్సహజం పురస్తాత్, ఆయుష్యమగ్ర్యం ప్రతిముంచ శుభ్రం యజ్ఞోపవీతం బలమస్తుతేజః" అను మంత్ర ముచ్చరించి ధరింపవలెను. అదియెట్లనిన; గాయత్రి నుచ్చరింపుచు మూఁడు మారు లభిమంత్రించి 'అపోహిష్ఠా' యను మూఁడు ఋక్కులచే గడిగి తిరుగ గాయత్రిచే ముమ్మారభిమంత్రించి బ్రహ్మ ముడియందు బ్రహ్మవిష్ణురుద్రులను ధ్యానించి నమస్కరించవలెను. కొందఱు తొమ్మిది పోగులందును దొమ్మండ్రుదేవత లన్యసింపవలె నందురు. ఆపైని గాయత్రిచే బది మారు లభిమంత్రించిన యుదకముచే గడగి 'ఉదుత్య'మను మూఁడు ఋక్కునెక్కించి యాపైని గంఠమున ధరించునది. 'ఉపవీతంయజ్ఞ సూత్రం ప్రోద్ధృతం దక్షిణేకరే, ప్రాచీనావీతమన్యస్మిన్ని వీతంకంఠలంబితం' అనఁగా నట్లు దక్షిణకరమునకు లోపుగా ధరింపఁబడిన యజ్ఞోపవీత ముపవీతమనఁబడును. ఎడమచేతికి లోపుగా ధరించు నపుడు ప్రాచీనావీత మనఁబడును. కంఠమందు వ్రేలాడునపుడు నివీత మనఁ బడును. అవి దేవపితృమనుష్య కర్మలయందు గ్రమముగ వినియోగింపఁబడును. శ్మశానమందలి కట్టెగాని, ధూమముగాని, తగులునపుడును చండాల, రజస్వలా, శవ సూతికాదుల స్పర్శ గలుగునపుడును స్నానముజేసి యజ్ఞోపవీతము విడువవలెను. మూత్రపురీషవిసర్జము మొదలగు మనుష్య కృత్యములందు కంఠలంబిత్వము మొదలగునవి చేయనిచో యజ్ఞోపవీతము విడువవలెను. ధరించినపైని నాల్గు మాసములైనయెడ త్యజించవలెను. కొందఱు పురుఁడు మైలయునంత మగునపుడు యజ్ఞోపవీతత్యాగముఁ జెప్పిరి. "సముద్రం గచ్ఛస్వాహా" యనిగాని 'ఓం భూర్భువ స్సువః' అని ప్రణవపూర్వక వ్యాహృతులగాని యుచ్చరించి జీర్ణోపవీతము విడువవ లెను. ధరించినపైని నాల్గుమాసములైనయెడ త్యజించవలెను. కొందఱు పురుఁడు

మైలయునంతమగునపుడు యజ్ఞోపవీతత్యాగముఁ జెప్పిరి. "సముద్రం గచ్ఛస్వాహా" యనిగాని 'ఓంభూర్భువస్సువః' అని ప్రణవపూర్వక వ్యాహృతులగాని యుచ్చరించి జీర్ణోపవీతము విడువవలెను. యజ్ఞోపవీతము ప్రమాదమున జారిపోయినచో మంత్ర హీనముగ నొకటిధరించి "మనోజ్యోతిః" అనియు "అగ్నే వ్రత పతేవ్రతం చరిష్యామి తచ్ఛకేయం తన్మేరాధ్యతాం, వాయోవ్రతపతే ఆదిత్యవ్రతపతే" యని మొదలగు మంత్ర ములు నాలుగింటిచేత నాజ్యాహుతులువేల్చి యథావిధిగా నూతన యజ్ఞోప వీతము ధరించునది.లేదా "యజ్ఞోపవీతనాశజన్యదోష నిరాసార్థం ప్రాయశ్చిత్తం కరిష్యే" యని సంకల్పించి యాచార్యవరణము మొదలాజ్యభాగాంతమైన పైని సవితృ దేవతకు గాయత్రీ మంత్రముచే తిలలనాజ్యము నూటయెనిమిదిగాని వేయునెనిమిది గాని వారములు వేల్చవలెను. నూతనమైన దాని ధరించి యతిక్రమించిన సంధ్యా వంత నాదికముఁ జేయునది.యజ్ఞోపవీతము లేకుండఁగ క్షణమైన నున్నచో నూరు మారులు గాయత్రీ జపముచేయవలెను. యజ్ఞోపవీతము, లేక భోజనము చేసినను మూత్రపురీష విసర్జనముఁ జేసినను నెనిమిదివేలు గాయత్రీ జపము యెడమ మూఁపు నుంచి మోచేయిపైనిగాని ముంజేయిపైనిగాని పడినచో యథాక్రమముగ మూఁడుగాని యాఱుగాని ప్రాణాయామములుచేసి క్రొత్తయజ్ఞోపవీతము ధరించునది. కోపాదులచే స్వయముగ యజ్ఞోపవీతము విడిచినచో మీఁదఁజెప్పినటుల లౌకిక యజ్ఞోపవీతము ధరించి ప్రాయశ్చిత్తముఁజేసి క్రొత్తదిధరింపవలెను. బ్రహ్మచారి కొక్కటిచే యజ్ఞోప వీతము. స్నాతకవ్రతస్థునికి రెండు ఉత్తరీయములేనిచో మూఁడు ధరింపవలెను. జీవత్పితృకుఁడును జీవించియున్న జ్యేష్ఠభ్రాతగలవాఁడుగాని యైనచో నుత్తరీయ మైనను దత్ప్రత్యామ్నాయమైన మూఁడవయజ్ఞోపవీతమైనను ధరింపఁగూడదు. ఆయుష్యము గోరువాఁడు బహుయజ్ఞోపవీతములను ధరింపఁగూడదు ఆయుష్యము గోరువాఁడు బహుయజ్ఞోపవీతములను ధరింపవచ్చును. "అభ్యంగేచో దధిస్నానే మాతాపిత్రోర్మృతే హని, తైత్తిరీయాః కఠాఃకాణ్వాశ్చరకా వాజసనేయినః కంఠా దుత్తార్య సూత్రంతు కుర్యుర్వైక్షాళనంద్విజాః" అనఁగానభ్యంగస్నానమందును సముద్రస్నాన మందును తల్లిదండ్రుల మృతతిథి యందును తైత్తిరీయులు కఠులు కాణ్వులు చరకులు మాధ్యందినులును యజ్ఞోపవీతమును కంఠమునుండి పైఁకి దీసి కడుగుదురు. ఇతర యజుర్వేదులు బహ్వృచులు సామవేదులు గంఠమునుండి తీసినచో దానిని త్యజించి క్రొత్తది ధరింపవలెను. ఇఁక వటునికి మొలత్రాఁడు మేఖల యనఁబడును. "మౌంజీ త్రివృత్సమాశ్లక్ష్ణాకార్యా విప్రస్యమేఖలా, త్రివృతా గ్రంథినైకేన త్రిభిః పంచభిరేవ చ, ముంజా భావేతు కర్తవ్యా కుశాశ్మంతకబల్బజైః" బ్రాహ్మణవటునకు ముంజతృణముచే ముప్పిరివేసిన త్రాఁడు సమమైనదియు ననుపైనదియుగ జేసి మేఖలనిర్మించునది. అది మూఁడు పేటలు గలిగి యొకచుట్టు గ్రంథిగాని మూడుచుట్ల గ్రంథిగాని యైదుచుట్లగ్రంథిగాని గలిగియుండవలెను. అనఁగా సరిచుట్లు కూడదు. ముంజగడ్డిదొరకనిచో దర్భగాని, యశ్మంతక వృక్షము త్వక్కుగాని, బల్బజతృణముగాని కూడును. "బ్రాహ్మణస్య భవేద్దండః పాలాశః కేశ సమ్మితః సర్వేషాం యజ్ఞియోవాస్యా

దూర్ధ్వంనానాగ్ర సమ్మితః” బ్రాహ్మణవటునకు దండము మోదుగు కఱ్ఱపాదము మొగలుగ కేశములపర్యంతము పొడవైనది యుండవలెను. లేక సర్వవర్ణముల వారికిని యజ్ఞార్హమైన పలాశదండము పాదము మొదలు నాసాగ్రమువఱకుఁ బొడవైనది యుండవచ్చునని వటుని మూరతో నాలుగు మూర లెత్తుగలిగి సమానమైన నాలుగు పార్శ్వములుఁ గలుగుటచేత చతురశ్రమై నాల్గు వైపుల సోపానము లనఁగ మెట్లు గలిగి యరటిస్తంభములు పల్లవతోరణములు మొదలగు వానిచే నలంకరించి వేదిక సిద్ధము చేయవలెను.

## ఉపనయన విశేషములు

వస్త్రముఁ గట్టుకొన్న పైని లౌకికాచమనమేగాని విధిగాజేయనక్కరలేదు. అనఁగా మూఁడు మారులు జలము శంఖముద్రగలహస్తమందు మినుపగింజ మునుగు నంతయుంచుకొని త్రాఁగుటమాత్రమే యజ్ఞోపవీతము ధరించిన పైని యథావిధిగ నాచమనముఁ జేయవలెను. దానివిధి ముందుఁ జెప్పఁబడును. ఇట్లు ఆజ్యపాత్ర కుత్తరభాగమున వటువుచేత నాచమనము చేయించి ప్రణీత యనుపాత్రకు పశ్చిమ భాగమను తీర్థముచేఁబ్రవేశించి యాచార్యునికి నగ్నికి మధ్యభాగము నుండి వటువును దీసుకొని వెళ్లి యాచార్యుని కుడిభాగమందుఁ గూర్చుండఁ బెట్టవలెను. బర్హిస్సును చుట్టుపఱచుట మొదలుగ స్రుతపాత్రను దుడుచువరకునుజేసి యజ్ఞోపవీత దానము మొదలాచమనము వఱకును గావలెను. అటుపైని శిష్యునిఁ దోసిలిలో జలము స్రవించుట మొదలు సమిదాధానము పర్యంతముఁజేసి యగ్ని కుత్తరభాగ మున గాయత్రీ నుపదేశింపవలెను. మీఁదఁజెప్పిన జలము స్రవింపఁ జేయుటయుఁ గూడ నుత్తరదేశమందే చెప్పఁబడినది. తూరుపుమొగమై యాచార్యుఁడు గూర్చుండి పశ్చిమాభిముఖముగఁ గూర్చున్న వటువునకు గాయత్రి నుపదేశింపవలెను.

## పాదోపసంగ్రహణ ప్రకారము

ఉపసంగ్రహణమనఁగా “అముక ప్రవరాన్వితోఽ ముకగోత్రోఽ ముకశర్మా హంభో అభివాదయే” అని తనగోత్ర ప్రవరనామము లుచ్చరించి కుడి యెడమ చెవులను ఎడమ కుడిచేతులచే స్పృశించి గురుపాదములను కుడిచేత కుడిపాదము నెడమ చేత నెడమపాదమును స్పృశించి శిరస్సువంచి నమస్కరించుట యని తెలియ వలెను. ఇట్లు తలిదండ్రులు మొదలగువారికి నభివాదన పూర్వముగ పాదస్పర్శ స్వరూపమైన యుపసంగ్రహణము కావలెను. మిక్కిలి వృద్ధుల కభివాదనము మాత్రమే. వృద్ధులు మాత్రమేయైనచో నమస్కారము చేయునది. ఆశౌచముగల వానికిని వమ నముఁ జేయువానికిని నలుఁగు బెట్టుకున్నవానికిని స్నానముఁ జేయుచున్నవానికిని జపపూజాదులుఁ జేయుచున్న వానికిని పుష్పములు జలము భిక్షాన్నము మొదలగు భారము మోయువానికిని నమస్కరింపఁగూడదు. అట్లునమ స్కరించినచో నుపవాసము చేయవలెను. శూద్రునికినమస్కరించినచో మూఁడు రాత్రులుపవాసము. చండాలుని కైనచో గృచ్ఛ్రప్రాయశ్చిత్తము. దేవతలకుఁ గురువులకు యతులకును నమస్కరింపనిచో నుపవాసము.

## ప్రత్యభివాదనము

అనఁగా నమస్కరించినవటుని గౌరవించుట. అందు దుదియచ్చు ప్లుతము చేయునది. ఎట్లనిన; "ఆయుష్మాన్ భవసౌమ్య దేవదత్తా" యని. అనఁగా ప్రత్యభివాద వాక్యము తుది దేవదత్తయను సంబోధనపదము హ్రస్వాంతమైనను ప్లుతమనఁగ మూఁడు మాత్రాకాలములు గల్గునటుల నుచ్చరింపవలెను. మఱియును, ఏకారాంతమును ఓకారాంతమును సంభవించునపుడు తుది ఏకారమునోకారమును సంధ్యక్షరములు గనలుక సంధివిప్పి పూర్వభాగము ప్లుతముఁ బలుకవలెను. ఎట్లనిన; "ఆయుష్మాన్భవసౌమ్యహరా ఇ, ఆ, యు...శంభా. " ఉ, అని అనఁగా నేకారము అకార ఇకార సంధిరూపము. ఓకారము అకార ఉకార సంధిరూపము గనుక విప్పి రెండింటి యందును అకార రూపమగు పూర్వభాగమునకే ప్లుత ముచ్చరింపవలె ననుట. అను ప్రవచనీయ మనఁగ గురువు తనకుపదేశించుట నిమిత్తమైనది హోమము దానికొఱకైన తండులభిక్ష యందు "భిక్షాంభవాన్ దదాతు, భిక్షాంభవతీ దదాతు" అని భవచ్ఛబ్దమును వాక్యమధ్యమందే పఠింపవలెను. ఇతరమైన భిక్షయందు మొదటను మధ్యమందును. యథేష్టముగఁ బ్రయోగింపవచ్చును. "భవాన్ భిక్షాం దేహి" అని.

## వినాయక శాంతి

ఇఁక నుపనయనవివాహాదులందు నిర్విఘ్నముగ ఫలము దొఱకుటకై కాని యుపద్రవములు పోవుటకైకాని సపిండమరణాదినిమిత్త ప్రతికూలనివృత్తికైకాని వినాయకశాంతిఁ జేయవలెను. అందు కాలము శుక్లపక్ష చతుర్థి గురువారము. పుష్యము, శ్రవణము, ఉత్తర, రోహిణి, హస్త, అశ్విని, మృగశీర్ష ఈ నక్షత్రములు ప్రశస్తములు. ఉపనయనాదులందు వాటికాలము ననుసరించి సంభవించినకాలము "ఉపసర్గనివృత్త్యర్థ" మ్మనియైనను "అముకసపిండమరణనిమిత్తకాశుచిత్వ ప్రాతికూల్య నిరాసార్థ" మ్మనియైనను సంకల్పము. తక్కిన ప్రయోగము గ్రంథాంతరమందుఁ దెలియునది. వివాహోపనయనాది శుభకర్మలయందు మొదట గ్రహయజ్ఞముఁ జేయ వలెను. శ్రాద్ధముఁదప్ప నితరములైన యభ్యుదయార్థకములు గాకపోయినను శాంత్యాది కర్మలయందు సహితము గ్రహానుకూల్యము గావలసినచో గ్రహయజ్ఞముఁ జేయవలెను. అరిష్టముపోవుటకు నుత్పాతాదులందుఁ జేయు శాంతులలో ప్రధానము గాకున్నను గ్రహమఖము చెప్పఁబడినది. అట్టి గ్రహయజ్ఞము ప్రధానకర్మకు పూర్వ మందు దూరముగనైనను దగ్గరనైనను జేయవచ్చును. దూరముగ జేయునపుడు నేఁడు రోజులలోగానే కావలయును. అధికవ్యవధానముః గూడదు. అందు ప్రతి గృహమునకును పదింటికి తక్కువ సంఖ్య చొప్పున ప్రధానాహుతులు వేల్వఁదలఁ చినచో నొక్కఁడే ఋత్విక్కుచాలును. పదింటిపైని యేబది పర్యంతమునకు లోపు సంఖ్య చొప్పున ప్రధానాహుతులు వేల్వఁదలఁచినచో నొక్కఁడే ఋత్విక్కుచాలును. పదింటిపైని యేబదిపర్యంతమునకు లోపు సంఖ్య చొప్పున నొక్కొక్క గ్రహమున

కాహుతు లీదలంచినచో నలుగురు ఋత్విజులు కావలెను. ఆచార్యుండొకండు ఏబది పయి నరువదిలోపు సంఖ్య చొప్పున ప్రధానాహుతులు వేల్వందలంచినచో నెనమండ్రు ఋత్విజులు నాచార్యుండొకండును గలసి తొమ్మండ్రు కావలెను. అందాచార్యుండా చార్యకర్మంజేసి యాదిత్యునికి హోమము చేయవలయును. తక్కిన యెనమండ్రు నెనిమిది గ్రహములకు జేయునది. నలుగురు ఋత్విజులైనచో నొక్కొక్క ఋత్విక్కు రెండేసి గ్రహములకు హోమముం జేయవలెను. ఆచార్యుండాదిత్యునికిం జేయునది. తామ్రమనంగ రాగి మొదలగు లోహములచేగాని, లేక నగ్నియు సువర్ణముచేగాని నిర్మించిన ప్రతిమలందైనను ఫలములందైనను నక్షరపుంజములందైనను నాదిత్యాది నవగ్రహముల నావాహనముంజేసి పూజింపవలెను. హోమసంఖ్య ననుసరించి హోమ కుండమునకును స్థండిలమనంగ నగ్ని ప్రతిష్ఠించు స్థలమునకును వేదికయనంగ నఱుగునకును మానము తెలియునది. అందు ప్రధానాహుతులం గాహుతులు నేబదికిం దక్కువయైనచో పిడి వెలితి మూరెడు పరిమణాము గలకుండము. నూటికిం దక్కువయైనచో నరత్నియనంగ చిటికెన వ్రేలుమాత్రము చాపిన మూరెడుపరి మాణము. అటుపైని వేయుసంఖ్య పర్యంతము గజము పరిమాణము. పదివేలు మొదలగుహోమమందు రెండుగజాలు. లక్షహోమమందు నాల్గుహస్తాలు. ఇక్కడ గజమనంగా నిరువది నాలుగంగుళములు గలది. రెండుగజము లనంగా యవగింజ పరిమాణము తక్కువ ముప్పదినాలు గంగుళములు. నాల్గుహస్తములనంగ నలుబదెని మిదంగుళములు. కుండముచుట్టి మేఖలకును లోపునకు మధ్యమందు లోతునకుం బరిమాణము గ్రంథాంతరమునం దెలియునది. ఈ కుండాదిపరిమాణమంతటను దెలియునది. సమిధలు చరువనంగా బ్రతిష్ఠంజేసిన యగ్నియందపు డుడికించు నన్నము ఆజ్యమును హోమద్రవ్యము. "అర్కః పలాశః ఖదిరశ్చాపామార్గోథపిప్పలః ,ఔదుంబరశ్శమీదూర్వాకుశోర్కాదేః క్రమాత్సమిత్." అనంగా జిల్లుండు, మోదుగు, చంద్రకట్ట, దుచ్చెన,రావి, బొడ్డ, జమ్మి, దూర్వలు, దర్భ యివి క్రమముగ సూర్యాది నవగ్రహములకు సమిధలు. కొందఱు తిలలుగూడం జెప్పిరి. సూర్యాదుల ప్రధానా హులసంఖ్యలో పదియవవంతున వారి యధిదేవతా ప్రత్యధిదేవతలకు హోమము. అధిదేవతాదుల యాహుతిసంఖ్యలో సగము చొప్పునం గ్రతుసంరక్షకులైన క్రతు సాద్గుణ్య దేవతలకు హోమము. శాంతికి నంగముగజేయు గ్రహమఖమందు మాత్రమే బలిదానముం జేయుచున్నారు. తక్కినచోట్ల చేయరు. ప్రధానాహుతులసంఖ్యచే బ్రాహ్మణులకు భోజనము పెట్టుట శ్రేష్ఠము. నూరాహుతులకొక బ్రాహ్మణ భోజనము మధ్యమము. వేయాహుతుల కేక బ్రాహ్మణభోజన మధమము సువిస్తరమైన తక్కిన ప్రయోగము గ్రంథాంతరమునం దెలియునది.

## బృహస్పతిశాంతి

కుమారుని కుపనయన కాలమందును, కన్యకు వివాహమందును, బృహస్పతి గ్రహ మనకూలముం గాకున్నచో శౌనకోక్తమైన శాంతిం జేయవలెను. "అస్య కుమార

స్యోపనయనే” యనిగాని ‘అస్యాః కన్యాయా వివాహే’ యనిగాని యుచ్చరించి ‘బృహస్పత్యానుకూల్య సిద్ధిద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం బృహస్పతి శాంతిం కరిష్యే’ యని సంకల్పించి యాచార్యుని వరించవలెను. స్థండిలమున కీశానదిక్కు యందు స్థాపించిన తెల్లనికలశమందు పంచగవ్యము కుశోదకము విష్ణుక్రాంతయు శతావరియు మొదలగు నోషధులువేసి పూర్ణపాత్ర ముంచినపైని, హరిద్రాక్షతలచే దీర్ఘము చతురశ్రము నైనవేదిక నిర్మించి సువర్ణమయమైన బృహస్పతి ప్రతిమను స్థాపించి స్థండిలమందగ్ని ప్రతిష్ఠించుట మొదలగునవి. అన్వాధానమందు బృహస్పతికి రావి సమిధలు నాజ్యమును నేతితో మిశ్రమైన పాయసమును యవలు ధాన్యము తిలలు గలిపి నేతితో మిశ్రముఁజేసి యదియు నను నీ ద్రవ్యములలో నొక్కొక్కదానిచే నూట యెనిమిదేసి యాహుతిచొప్పునను శేషముచే స్విష్టకృత్తునని మొదలుగ నుద్దేశించి యాజ్యభాగాంతమందు ప్రతిమపై షోడశోపచారములచే బృహస్పతిని బూజించునపుడు పచ్చునివస్త్రద్వయమును, పచ్చుని యజ్ఞోపవీతము, పచ్చునిచందనము, పచ్చుని యక్షతలు, పచ్చునిపువ్వులు, నేతిదీపము, పెరుగన్నము, నైవేద్యము నిచ్చిన పైని మాణిక్యముగాని సువర్ణముగాని దక్షిణనిచ్చి గ్రహమఖమందుఁ జెప్పినరీతిని కుంభమునను మంత్రించిన పైని బృహస్పతిమంత్రముచే పెరుగు తేనెల చేదడిపిన సమిధలాజ్యము గృహమందువండిన పాయసము మిశ్రితమైనయవాదులు వీనిచే నన్వాధానమునసరించి హోమము హోమశేషముఁ బూర్తిఁ జేసి గంధాదిపంచోపచారములచే బృహస్పతిఁ బూజించి పచ్చుని గంధాక్షత పుష్పములతో రాగిపాత్రయందున్న జలముచే నర్ఘ్యమీయవలెను. అపుడు మంత్రము. ‘గంభీరదృఢరూపాం గదేవేజ్యసుమతే ప్రభో, నమస్తేవాక్పతేశాంత గృహాణార్ఘ్యం నమోస్తుతే’ యని. ఆపైని ప్రార్థింపవలెను. “భక్త్యాయత్తే సు రాచార్య హోమపూజాది సత్కృతం, తత్త్వం గృహాన శాంత్యర్థం బృహస్పతే నమోనమః జీవో బృహస్పతి స్సూరి రాచార్యో గురురంగిరాః, వాచస్పతి ర్దేవమంత్రీ శుభం కుర్యాత్సదా మమ.” యని. అనఁగా సురల కాచార్యుఁడవైన యో బృహస్పతీ! యని యతని నామములచ్చరించి భక్తిచే నీశాంతికొఱకు నేజేసిన హోమపూజాదికము గ్రహించి నాకు శుభమీయవలెనని ప్రార్థించి విసర్జనము ప్రతిమా దానముఁజేసిన పైని పుత్రాదులతోగూడ యజమానుని కభిషేకము. అపుడు మంత్రములు. ‘అపోహిష్ఠ’ యను మూఁడు ఋక్కులు–‘తత్త్వాయామి బ్రహ్మణా’ యను మూఁడును–‘స్వాదిష్ఠయా మదిష్ఠయా’ యను నాల్గును ‘సముద్రజ్యేష్ఠాస్సలిలస్య’ యను నాల్గును, ‘ఇదమాపః ప్రవహత’ యను నొకటియు ‘తామగ్నివర్ణా’ యను నొకటియు ‘యాఓషధీః’ అను నొకటియు ‘అశ్వావతీర్గోమతిర్న’ యను నొకటియు ‘యద్దేవాదేవ హేలన’ మను మొదలుగ కూశ్మాండమంత్రములు ‘పునర్మనః పునరాయుః’ అను వరకును తైత్తిరీయశాఖయందు ప్రసిద్ధములు కౌస్తుభాదులయందు వ్రాయఁబడి యున్నవి. యీ మంత్రములచే నభిషేకముఁజేసి బ్రాహ్మణ భోజనము చేయవలెను.

# ఉపనయనాదులందు సంకల్పములు

అం దుపనయనదినమునకుఁ బూర్వమైన దినమందు నాచార్యుఁడు “మమో పనేతృత్వయోగ్యతా సిద్ధ్యర్థం కృచ్ఛ్రత్రయం తత్ప్రత్యామ్నాయ గోనిష్క్రయభూత యథా శక్తి రజతద్రవ్యదానే నాహమాచరిష్యే. తథా ద్వాదశాధిక సహస్రగాయత్రీ జపముప నేతృత్వయోగ్యతాసిద్ధ్యర్థం కరిష్యే” యని సంకల్పించవలెను. అట్లుచేసి మరునాఁ డు వటునికి పూర్వసంస్కారములు కాకున్నచో “అస్య కుమారస్య పుంసవనాదీనా మధవాజాతకర్మాదీనాం చౌలాంతానాం సంస్కారాణాం కాలాతిపత్తిజనితప్రత్యవాయ పరిహారద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం ప్రతిసంస్కార మేకైకం భూర్భువః స్వస్స్వాహేతి సమస్తవ్యాహృత్యాఽఽజ్యాహుతిం హోష్యామి” యని సంకల్పించి యగ్నిస్థాపనము నిధ్మాధానము మొదలుగ పాకయజ్ఞతంత్రముతో గూడినవైనను వహ్నిస్థాపనము నాజ్యసంస్కారము పాత్రములు విధిగ దుడుచుటయు నింతమాత్రముతో గూడినవైనను అతీత సంస్కారములతో సమమైన సంఖ్యగల సమస్త వ్యాహృతులచే నాజ్యాహుతుల వేల్చవలెను అటుపైని “అస్యకుమారస్య పుంసవనానవలోభన సీమంతోన్నయన జాతకర్మ నామకర్మ సూర్యావలోకన నిష్క్రమణోపవేశనాన్న ప్రాశనచౌల సంస్కారాణాం లోపనిమిత్త ప్రత్యవాయ పరిహారార్థం ప్రతిసంస్కారం పాదకృచ్ఛ్రం ప్రాయశ్చిత్తం చౌలస్యార్థకృచ్ఛ్రం బుద్ధిపూర్వకలోపే ప్రతిసంస్కార మర్ధకృచ్ఛ్రం చూడాకర్మణః కృచ్ఛ్రం తత్ప్రత్యామ్నాయ గోనిష్క్రయీభూత యథాశక్తి రజత ద్రవ్యదానే నాహ మాచరిష్యే” యని సంకల్పించవలెను. చౌలము నుపనయనముతో జేయుటచే కులాచారమైనచో దానికి గాలాతి క్రమప్రాయశ్చిత్త హోమమును లోపప్రాయశ్చితము వటునిచేఁ జేయుంచు చున్నారు. అపుడు మీఁదఁజెప్పిన వటుఁడే చేయవలెను. అటుపైని వటుఁడు “మమ కామచార కామవాద కామభక్షాదిదోషపరిహార ద్వారా ఉపనేయత్వ యోగ్యతా సిద్ధ్యర్థం కృచ్ఛ్రత్రయ ప్రాయశ్చిత్తం తత్ప్రత్యామ్నాయ గోనిష్క్రయీభూత యథాశక్తి రజతదానద్వారాహ మాచరిష్యే” యని సంకల్పించవలెను. నిష్కముగాని యందులో సగముగాని, లేక నాలుగవ యంశముగాని సగముగాని రజతము గోమూల్యము గావచ్చును. నిష్కమనఁగా నెనిమిది గురిగంజలయెత్తుగల మాషములు నలుబదియైనచో నగును. అనఁగా రెండుతులములపై నిరువది చిన్నములయెత్తు రజతనిష్కము ముఖ్యపక్షము. అట్లు ప్రాయశ్చిత్తముఁ జేసినపైని “ప్రాయశ్చిత్తే కృతేపశ్చా దతీత మపికర్మవై, కార్యమిత్యేవ ఆచార్యా నేత్యన్యేపి విపశ్చితః” అను వచనముచే జాతకర్మాది సంస్కారములు తిరుగఁజేయవలెనని యొకపక్షము. అక్కఱలేదని మఱి యొకపక్షమునని రెండుపక్షములు. అందు ప్రాయశ్చిత్తముచే బ్రత్యవాయము పోవుట మాత్రమేకాని సంస్కారముచే గలుగు నపూర్వ మనఁగఁ బుణ్యమురాలేదని యా సంస్కారములు చేయుపక్షమున సంకల్పము. భార్యతోను గుమారునితోడను గూర్చొని యజమానుఁడు దేశకాలముల నుచ్చరించి “అస్య కుమారస్య గర్భాంబు పానజనిత దోషనిబర్హణాయుర్మేధాభివృద్ధి బీజగర్భసముద్భవైనో నిబర్హణద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం అతిక్రాంతం జాతకర్మ, తథా బీజగర్భ సముద్భవైనో నిబర్హణాయురభివృద్ధి

వ్యవహార సిద్ధిద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం నామకర్మ, ఆయురభివృద్ధి ద్వారా శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం, సూర్యావలోకనం ఆయుశ్శ్రీవృద్ధి బీజగర్భ సముద్భవైనో నిబర్హణ ద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం నిష్క్రమణం, ఆయురభివృద్ధి ద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థముపవేశనం మాతృగర్భమలప్రాశనశుద్ధ్యన్నాద్య బ్రహ్మవర్చస తేజ ఇంద్రియా యురభివృద్ధి బీజగర్భసముద్భవైనో నిబర్హణ ద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థ మన్న ప్రాశనంచాద్య కరిష్యే బీజగర్భ సముద్భవైనో నిబర్హణేన బలాయుర్వర్చోభివృద్ధిద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం చూడాకర్మ, ద్విజత్వసిద్ధ్యా వేదాధ్యయనాధికారార్థం ఉపనయ నం చశ్వః కరిష్యే, జాతకర్మాది సర్వసంస్కారాంగత్వేన పుణ్యాహవాచనం మాతృకాస్థా పనం నాందీశ్రాద్ధం కరిష్యే, ఉపనయనాంగత్వేన మండపదేవతాస్థాపనం కులదేవతా స్థాపనం చ కరిష్యే." యని తమ తమ గృహ్య సూత్రము ననుసరించి సంకల్పించి నాందీశాద్ధము పర్యంతము తంత్రముచే జేయవలెను. అనేక సంస్కారముల నుద్దేశించి యొకమారే యంగము లాచరించుట తంత్రము. అట్లుచేసి వటుతండ్రియు వఱకుఁ జేసి గృహ్యసూత్రానుసారముగ నన్నప్రాశనాంతసంస్కారములు పూర్వదినముననే చేయవలెను. చౌలము నుపనయనమును బరదినమందుఁ జేయవలెను. అన్ని సంస్కా రములు నపుడే చేయఁదలచయిఁనచో మీఁదఁజెప్పిన సంకల్పముతుదిని"చౌల ముప నయనం చాద్యకరిష్యే" యని యుచ్చరింపవలెను. అతీత సంస్కారములు తిరుగఁ జేయఁదలచిన పక్షమందు చూడాకర్మను నుపనయనమును సంకల్పించి రెండింటి కంగముగ పుణ్యాహవాచనము నాందీశ్రాద్ధమును ఉపనయనమున కంగముగ మండపదేవతాస్థాపనమును కులదేవతాస్థాపనమును సంకల్పింపవలెను. నాందీ శ్రాద్ధమైన పైని పూర్వమందుఁ బూజించిన మాతృకలతో గూడిన మండపదేవతలకు స్థాపనము చేయవలయును. అటుపైని మీఁదఁజెప్పినట్లు వేదిక నిర్మించుట. ఇట్లు పూర్వదినమందుఁ జేయవలసిన కృత్యము. మఱునాఁడు అతిక్రమించిన చూడా కర్మనుఁజేసి, లేక యథాకాలముగ చూడాకర్మఁ జరిగినవాఁడేయైనచో నభ్యంగ స్నానము మాత్రమే చేయించి తల్లితో భోజనము చేయించునది. అపుడు బ్రహ్మచా రులకు భోజనము పెట్టవలెనని యాచారము. అటుపైని దేశకాలము లుచ్చరించి "అస్యకుమారస్య ద్విజత్వసిద్ధి ద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం గాయత్ర్యుపదేశం కర్తుం తత్ప్రాచ్యాంగభూతం వపనాదికరిష్యే యని సంకల్పించి వపనాదికము చేయవలెను. ముఖ్యమైన జుట్టునకు రుగబార్శ్వములందున చూడాకర్మలోనుంచిన శిఖలకిపుడు వపనము. అటుపైని స్నానముచేయించి క్రొత్త వస్త్రముఁ గట్టించి శిఖ ముడివేయించి మంగళతిలకముంచి వటువును సిద్ధము చేయవలెను. జ్యోతిర్విదునిఁ బూజించి యాతఁడు చెప్పిన సుముహూర్తమం దాచార్యుఁడు వేదికయందుఁ దూర్పు మొగమై గూర్చుండి మధ్యమందు పట్టిన తెఱను పైకెత్తి వటుని ముఖముఁ జూడవలెను. వటువు నమస్కరించిన పైని నాతనిఁ దనతొడపై నుంచుకొనవలెను. ఆపైని బ్రాహ్మ ణులు యథాచారముగ మంత్రాక్షత లిద్దరిపై వేయవలెను. ఇట్లు తమ గృహ్య సూత్రాను సారముగ నుపనయనప్రయోగముఁ దెలిసి చేయవలెను. వటునిచే గాయత్ర్యాది

మంత్రము లుచ్చరింపఁజేయవలసి వచ్చినపుడంతటను సంధికృతమైన వర్ణవికార మును విప్పి చెప్పఁగూడదు. ప్రయోగ శేషమంతయుఁ బూర్ణముఁజేసి రెండువందలు గాని వందగాని బ్రాహ్మణులకు భోజనము సంకల్పించి 'భూయసి' యనఁగ సర్వ సాధారణముగ నందఱకిచ్చు దక్షిణ లీయవలెను. అనంతరమందు బ్రహ్మచారి క్రొత్త భిక్షాపాత్రముఁబూని తల్లినిగాని మేనత్త మొదలగువారినిగాని యను ప్రవచనీయ హోమమునకు బియ్యమును, "భిక్షాం భవతీ దదాతు" అని యాచింపవలెను. తండ్రిని "భిక్షాం భవాన్ దదాతు" అని యాచింపవలెను. ఆపై నాభైక్షద్రవ్యము నాచార్యునికి సమర్పించి మధ్యాహ్న సంధ్యావందనముఁజేసి గురుసన్నిధియందే యా పగలు నడప వలెను. ఆ దినమందు మధ్యాహ్న సంధ్య వైకల్పికమని కొందఱు బ్రహ్మయజ్ఞము మఱునాడారంభించి గాయత్రిచే జేయవలెను. అను ప్రవచనీయహోమారంభము గాకమున్ను గర్జించుట వర్షించుట గల్గునని తోఁచినచో బగటియందే చరు శ్రవణ పర్యంతముఁజేసి యస్తమయానంతరమున హోమముఁ జేయవలెను. పాకముగాక ముందే గర్జితాదులు సంభవించుచో శాంతిఁజేసి పాకముఁ జేయవలెను.

## శాంతి ప్రయోగము

"బ్రహ్మౌదనపాకాత్పూర్వం గర్జితేన సూచితస్య బ్రహ్మచారికర్తృకాధ్యయన విఘ్నస్య నిరసనద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం శాంతింకరిష్యే" యని సంకల్పించి స్వస్తివాచనము నాచార్యవరణముఁ జేసిన పైని యాచార్యుఁడగ్ని నిఁబ్రతిష్ఠించి 'చక్షుషీ ఆజ్యేన' యనుదాని యంతమందు సూర్యునికి గాయత్రీమంత్రముచే నూటయెనిమిది ఘృతమిశ్రపాయసాహుతులును శేషముచే స్విష్టకృత్తని మొదలగునవి ప్రాయశ్చిత్త హోమమైన పైని గాయత్రిచే సూర్యుని కాజ్యముచే హోమమని యన్వాధానముఁ జేసి గృహసిద్ధమైన పాయసముచే హోమముఁజేసి బృహస్పతి సూక్తముఁ జపించ వలెను. తుదినాచార్యునకు గోవునిచ్చి నూర్గురికిగాని యథాశక్తిగగాని బ్రాహ్మణులకు భోజనము పెట్టెదనని సంకల్పించవలెను. మేధాజననమునకుఁ బూర్వముఁజేయు నగ్నికార్యము సమాప్తి యగుపర్యంతము నుపనయనాగ్ని స్థిరముగ నుండవలెను. అట్లుండక నశించినచో దిరుగ నుపనయనాహుతులచే నగ్నిఁ బుట్టించునపుడు కటిసూత్రధారణము మొదలగు మాణవకు సంస్కారమున వక్షారణము నగ్నికార్యము గాయత్ర్యుపదేశమునుఁ దిరుగఁజేయ నక్కఱలేదుగాని తక్కిన పూర్వోత్తర తంత్రము లతో నుపనయనాహుతులచే నగ్ని నుత్పాదించి యందను ప్రవచనీయ హోమము నకు ముందుఁజేయవలసిన యగ్నికార్యముఁజేసి యటుపైని యను ప్రవచనీయ హోమముఁ దిరుగఁజేసి మేధాజననము జేయవలెనని కౌస్తుభమందుపాదింపఁబడి నది. నష్టమైన యుపనయనాగ్నికిఁ బునరుత్పత్తియు హోమమందు వినియోగమని విశేషమనికూడఁ జెప్పఃబడినది. గాని నాకుఁ దోఁచిన దేమనిన; నగ్ని నష్టమగునో నుపనయనాహుతులచే నగ్నిఁబుట్టించి మేధాజనన పూర్వముఁ జేయవలసిన యగ్ని కార్యము మాత్రమే చేసి మేధాజననము చేయవచ్చును అను ప్రవచనీయ హోమమును

దానికిఁ బూర్వముఁ జేయవలసిన యగ్నికార్యమును దిరుగఁజేయ నక్కఱలేదని, ఏమనిన; నుపనయనమందు గాయత్ర్యుపదేశము నను ప్రవచనీయ హోమమును మేధాజననము నీమూఁడును సమప్రధానములగు నధ్యయనాంగములు. ఈ మూఁ డింటికి నగ్ని యంగము. అట్టి యగ్ని నష్టమగుచోఁ బ్రధానకర్మ కావృత్తిఁ గలుగదు. ఒకవేళ సంగమైన యగ్ని కార్యముఁ జరిగినపైని యగ్ని నష్టమగుచోఁ దిరుగబుట్టించిఁ బ్రధానముఁ జేయునపుడు పూర్వభావ్యగ్ని కార్యమున కావృత్తి యగును. అట్లు ప్రధానముఁ జరిగిన పైని యగ్నినష్టమైయుద్ధారము నొందినను దాని కావృత్తిలేదు. కనుకనే కౌస్తుభమందు సహితము గాయత్ర్యుపదేశమునకు తత్పూర్వభావియైన యగ్ని కార్యమునకును నావృత్తి చెప్పలేదు. అట్లనే యను ప్రవచనీయహోమమునకును గావచ్చును. అట్లుగానిచో నర్ధజరతీయమన్యాయ్యము గనుక వాటికిఁగూడ నావృత్తిఁ జెప్పవలసివచ్చును. కాఁబట్టి గాయత్ర్యుపదేశమునకును తత్పూర్వాగ్ని కార్యమునకును నావృత్తి లేనట్లును ప్రవచనీయ హోమమునకును దత్పూర్వాగ్ని కార్యమునకు నావృత్తి కూడదు. అగ్నిష్టోమమున కంగమైన పశుక్రయమున కంగమైన యూపము పశు ద్వయానుష్ఠానముఁ జరిగిన పైని నష్టమై తృతీయ పశువునకైఁ దిరుగ నుద్ధరింపఁ బడినను ద్వితీయ పశ్వనుష్ఠానముఁగూడ దిరుగఁ జేయఁబడునా? లేదు. తృతీయ పశువునకు మాత్రమే జేయఁబడును. కనుక నిందుమంచి చెడ్డలు సత్పురుషులు విమర్శించి చేయవలెను. సాయం సంధ్యాకార్యముఁ జేసినపైని నను ప్రవచనీయ హోమమును బ్రహ్మచారియే చేయవలెను. అశక్తియైనచో చరుశపణము పర్యంతము నితరులు చేయవచ్చును. హోమము మాత్రము వటుఁడు చేయకతప్పదు. హోమము చేయఁగా మిగిలినచరువుచే ముగ్గురు బ్రాహ్మణులు భుజింపవలెను.

## వటు వ్రతము

"క్షారాది వర్జమశ్నీయా ద్బ్రహ్మచారీ దినత్రయం, శయీతాథ శ్చతుర్థేహ్ని మేధా జననమాచరేత్, యద్వా ద్వాదశ రాత్రంస్యాదబ్దవ్రత మథాపి వా." అనఁగా వటుఁడు మూఁడు రోజుల పర్యంతము కారము ఉప్పు మొదలగునవి విడిచి హవిష్యము మాత్రమే భక్షింపవలెను. మంచముపైఁ బండుకొనఁగూడదు. భూమి యందే శయనించవలెను. ఇట్లుచేసి నాల్గవరోజున మేధాజననముఁ జేయవచ్చును. లేదా పండ్రెండురాత్రులట్లు వ్రతము చేయవలెను. సంవత్సర పర్యంతముఁ జేయుట ముఖ్య పక్షము. మేధాజననవిధి గ్రంథాంతరమందుఁ దెలియునది. ఇఁక మంటప దేవతోత్థాపనము. అది స్థాపనదినమునకు సరిదినమందును బేసి దినములలో నైదు నేడు దినములందును శుభము నెఱుంగునది.

## మండపదేవతో ద్వాపనము

"నాందీశ్రాద్ధే కృతేపశ్చా ద్యావన్మాతృ విసర్జనం, దర్శశ్రాద్ధం క్షయ శ్రాద్ధం స్నానం శీతోదకేన చ, అపసవ్యం స్వధాకారం నిత్యశ్రాద్ధం తథైవచ, బ్రహ్మయజ్ఞం చాధ్యయనం నదీసీమాది లంఘనం, ఉపవాస వ్రతం చైవ శ్రాద్ధభోజన మేవ చ,

నైవ కుర్యుస్సపిండాశ్చ మండపో ద్వాసనావధి.” అనఁగా నాందీశ్రాద్ధమైన పైని మండపదేవతలమైన మాతృకల యుద్వాసనము పర్యంతము మూఁడు పురుషాంత రములలోగా నున్న సపిండులు దర్శశ్రాద్ధమును క్షయాహశ్రాద్ధమనఁగ మృతదిన శ్రాద్ధమును శీతోదకముచే స్నానమును అపసవ్యమనఁగఁ బ్రాచీనావీతముఁ గల్గియుం డుట, స్వధాయని యుచ్చరించుట, నిత్యశ్రాద్ధమును బ్రహ్మయజ్ఞము నధ్యయనమును నదిదాటుటయు పొలిమేరఁదాటుటయు ఉపవాసవ్రతము శ్రాద్ధమందు నిమంత్రితుఁ డై భుజించుటయు ననుఁ జేయఁగూడదు.

## ఆయుద్వాసనము పర్యంతము నిషేధములు

అందు స్వధాకారనిషేధము స్వధాశబ్దముతోఁగూడిన వైశ్వదేవము నిషేధించు కొఱకని తెలియవలెను. ముగ్గురుపురుషులు దాటియున్న సపిండులకైన నీ నిషేధము లేదని పురుషార్థ చింతామణిలో నున్నది. “అభ్యంగే సూతకే చైవవివాహే పుత్రజన్మని, మాంగల్యేష్ఠు చ సర్వేషు న ధార్యం గోపిచందనం” అభ్యంగస్నానము సూతకము. వివాహము, పుత్రోత్పత్తి, సమస్త శుభకార్యములు వీనియందు గోపీచందనము ధరింపఁ గూడదు. భస్మముగూడ ధరింపరు. జననా శౌచమందు భస్మము గోపీచంనముఁ గూడ నిషిద్ధములు. మృతకాశౌచమందు భస్మము ధరింపవచ్చును.

## మూఁగవానికి బధిరునికి గాయత్రిఁ జెప్పుట

నపుంసకుఁడును గుడ్డివాఁడును చెముఁడుగలవాఁడును మూగివాఁడును పొట్టివాఁడును మరుగుజ్జువాఁడును సొట్టవాఁడును మొదలగువారు సహితము నుప నయనము జేయుటకు పాత్రులే. మదించినవాఁడును వెఱ్ఱిగలవాఁడును సంస్కరింపఁ దగరని కొందఱందరు. అట్లు చేయకుండినను వారికిఁ గర్మాధికారమే లేనందున జాతిభ్రంశము లేదు. వారి సంతతికి సంస్కారము చేయవచ్చును. బ్రాహ్మణజాతిస్త్రీ యందుఁ బ్రాహ్మణజాతీయుఁ డైనవానిచే బుట్టినవాడు బ్రాహ్మణుఁడే యగునని శ్రుతియున్నది. మఱికొన్ని గ్రంథములలో మత్తోన్మత్తులుగూడ సంస్కారార్హులే యని యున్నది. అందు హోమము నాచార్యుఁడే చేయును. ఉపనయన మనఁగ నాచార్యుని సమీపము నొందించుట మాత్రమైనను నగ్ని సమీపముఁ జేర్చుటమాత్రమైనను గాయత్రీ నుచ్చరింపఁ జేయుటయైనను వికలాంగులవిషయమై ప్రధానము. కనుక నీ మూఁడింటిలో నొకటియే వికలాంగునికిఁ జేయునది. ఇతరాంగములు సంభవించి నంతమట్టుకు చేయునది. మూకబధిరాదులకు గాయత్రీ నుచ్చరింపఁ జేయుట సంభ వింపనిచో స్మరించియే జపము. సంస్కారమంత్రములును వాసఃపరిధానమందు మంత్రములును నాచార్యుఁడే యుచ్చరింపవలెను. కొందఱు మంత్రోచ్చారణము లేక యూరకనే వాసఃపరిధానాదులని చెప్పిరి. ఇట్లు వివాహమందును గన్యా ప్రతి గ్రహము మాత్రము వారిచే జేయించి యితరాంగములు బ్రాహ్మణునిచే జేయించునది. అట్లు వచనమున్నది. ఇది వికలాంగోపనయన విచారము. “అమృతేజా రజః కుండో మృతే భర్తరిగోళకః” అనఁగా భర్త జీవించియున్నపుడే జారునివలన గల్గినవాఁడు

కుండుఁడు. భర్త మృతుఁడైన పైని జారునివలనఁ బుట్టినవాఁడు గోళకుఁడు. వీరలిద్దఱకును సంస్కారము చేయవలసినదని విధియున్నది గాని వారిద్దఱు క్షేత్రజులు గనుక నది యుగాంతరవిషయము. కలియుగమందుఁ దత్తుఁడు నౌరసుఁడును దప్ప తక్కినపుత్రులు నిషేధింపఁబడిరి. "జ్యేష్ఠేత్వ కృతసంస్కారే గర్భాదానాది కర్మభిః కనిష్ఠోనైవ సంస్కార్య ఇతి శాతా తపో బ్రవీత్" అనఁగా జ్యేష్ఠునికి గర్భాధానాది సంస్కారములు జరుగనియెడఁ గనిష్ఠునికి సంస్కారములు చేయఁగూడదని శాతాతప ఋషివచనము. జ్యేష్ఠునికిఁ జేసిన కనిష్ఠునికిఁ జేయవచ్చు ననుట. ఈ నిషేధము నుపనయనపర్యంతమైన సంస్కారములకే? వివాహ విషయమైనచో జ్యేష్ఠుఁడు వికలాంగుఁడేని నియమమక్కఱలేదు. కన్యలయందును జ్యేష్ఠకన్యకు వివాహముఁ జేసినపైనే కనిష్ఠకన్యకు వివాహము. జ్యేష్ఠపుత్రునికి వివాహము లేకున్నను కనిష్ఠ కన్యకు వివాహము చేయవచ్చును. అయినను జ్యేష్ఠుని కుపనయనమే లేనిచో గనిష్ఠకు వివాహము చేయరాదు.

## ఋగ్వేదీయ పునరుపనయన త్రివిధప్రాయశ్చిత్త ముపనయన విశేషములు

బునరుపనయనము అది మూఁడు విధములు. ప్రత్యవాయము పరిహరించు కొనుటకుఁ బ్రాయశ్చిత్తరూపమైన పునరుపనయనము మొదటిది. అదియును జాత కర్మాదులతోఁ గూడినదియునవిలేనిదియు మఱియొక ప్రాయశ్చిత్తముతో గూడినదియు నట్లు లేక కేవలముగ నున్నదియు నని యిట్లనేక విధములుగ నున్నది. మఱియు మునుఁ జేసిన యుపనయనమునకు విహితమైనకాలము మొదలగు నంగములు వికలమైనచో వ్యర్థమని తోఁచెనేని దిరుగఁజేయుట రెండవది. మఱియొక వేదముఁ జదువుటకుఁ జేయునది మూఁడవది. అందు మొదటిదెట్లనిన, బుద్ధిపూర్వకముగా కుండ నౌషధాంతరముచే సాధ్యముగాని రోగనివారణము కొఱకు పైష్టనిర్మితమైన సురనుద్రాఁగినచో మూఁడుమాసములు కృచ్ఛ్రముఁజేసి పునరుపనయనముఁ జేయ వలెను. బుద్ధిపూర్వముగ నౌషధనిమిత్తము పైష్టిగాక తక్కిన సురనుద్రాఁగినచోమూఁ డు మాసములు కృచ్ఛ్రముఁజేసి పునరుపనయనముఁ జేయవలెను. బుద్ధిపూర్వముగ నౌషధనిమిత్తము పైష్టిగాక తక్కిన సురనుద్రావినచో కృచ్ఛ్రము నతికృచ్ఛ్రముఁజేసి పునరుపనయనముఁజేయవలెను. పిష్టనిర్మితసురయనఁగ సారాయినేద్రావినచో బంద్రెండు సంవత్సరములు కృచ్ఛ్రవ్రతము. అజ్ఞానముచే వారుణియు గౌడి యనఁ గా బెల్లపుసారాయను మాధ్వియనఁగ నిప్పపువ్వుల సారాయనుఁ ద్రాగెనేని పునరుప నయనమును దప్తకృచ్ఛ్రమునుఁ జేయునది. తెలియక రేతోవిణ్మూత్రములు భక్షించినను సురతోగలిసినయన్నముఁ జలము భక్షించినను ద్విజాతులకు ప్రాయశ్చి త్తముఁ జేసినపైని పునరుపనయనముఁ దప్తకృచ్ఛ్రమునుఁ జేయునది. తెలిసి విణ్మూ త్రాదులు భక్షించినచో చాంద్రాయణమును, పునరుపనయనమును, ఉల్లి, నీరుల్లి, గంజాయి, ఊరుబంది, ఊరుకోడి, మనుష్యమాంసము, గోమాంసము వీని భక్షించి

నచో వాని ప్రాయశ్చిత్తముఁ జేసినపైని పునరుపనయనము. గొఱ్ఱె, గాడిద, లొట్టియ, మనుష్య స్త్రీ వీని క్షీరముఁ ద్రాగినచో మఱియు నేనుఁగుపాలునుగుఱ్ఱము పాలును ద్రాగెనేని తప్తకృచ్ఛ్రమును పునరుపనయనమును, గాడిదనుగాని లొట్టియనుగాని యెక్కినచో కృచ్ఛ్రమును పునరుపనయనముననని హేమాద్రిమతము. మితాక్షరాస్మృ త్యర్థసారాదిమతమందు రాసభయు నుష్ట్రము నెక్కినయెడ నుపవాసత్రయము మాత్రము విధింపఁబడినది. పునస్సంస్కారము విధింపలేదు. కౌస్తుభతాత్పర్యము నిట్లనే యున్నది. అబుద్ధిపూర్వముగ వృషభము నెక్కినచో గృచ్ఛ్రముఁ బుద్ధిపూర్వ మైనచో గృచ్ఛ్రత్రయము మొదలగునది. కొందఱు వృషభారోహమందు బునస్సంస్కా రముఁ జేయుచున్నారు. అందుఁ బ్రమాణము గానరాదు. ఇట్లు మేక గొఱ్ఱె నెనుబోతు నెక్కినను గ్రహించునది మాంసమును భక్షించు పశువు పురీషమును భక్షించినచో బునరుపనయనము మాత్రము. కొందరు మనుష్యమలము భక్షించినను బునరుప నయనము మాత్రమే యనిరి. ప్రేతనిమిత్తమిచ్చిన ప్రచ్ఛాదనమును బ్రతిగ్రహించినచో బునస్సంస్కారము గావలెను. దేశాంతరమందు జీవించియున్నప్పటికిని మృతుఁడై నట్టు వార్తవినుటచే నతని కంత్యకర్మచేసినచో దిరుగవచ్చిన నాతని ఘృతకుంభమందు ముంచి తీసి స్నానముఁజేయించి జాతకర్మ మొదలుగ నుపనయనపర్యంతము సంస్కా రములుచేసి త్రిరాత్ర వ్రతమాచరించిన పైని పూర్వభార్యతోగాని యాబిడలేనిచో మఱియొక స్త్రీతోగాని వివాహముఁ జేయునది. ఆ హితాగ్నియైన యెడ బునరాధానము నాయుష్మదిష్టి మొదలగు నదియుఁ జేయవలెను. తీర్థయాత్రయందు దప్ప నితర కార్యమున కంగవంగ కళింగాంధ్ర సింధు సౌవీర మ్లేచ్ఛదేశ ప్రత్యంత వాసి దేశములకు వెళ్ళినచో బునస్సంస్కారము. చండాలాన్నము భక్షించినచో చాంద్రా యణము బుద్ధిపూర్వకముగ భక్షించిన నొకయేఁడు కృచ్ఛ్రవ్రతమును రెండింటి యందుఁ బునరుపనయనమునుఁ జేయవలయును. “అజినం మేఖలాదండో భైక్షచర్యా వ్రతాని చ, నివర్తంతే ద్విజాతీనాం పునస్సంస్కార కర్మణి, వపనం మేఖలేతి స్మృత్యంత రేపాఠః” అనఁగా కృష్ణాజినము మౌంజియు దండము భిక్షయు వేదవ్రతములును బునరుపనయనమం దక్కఱలేదు. వపనం మేఖలాయను పాఠమందు క్షౌరమని యర్థము. బ్రహ్మచారి మధుమాంసముల భక్షించినచో బునరుపనయనము ప్రాజాపత్య కృచ్ఛ్రము మూఁడురాత్రు లుపవాసమైనను జేయవలెను. బుద్ధిపూర్వముగ భక్షించి నచో పరాక కృచ్ఛ్రము. అభ్యాసమనఁగ రెండవమాఱుజేయుట, అపుడు రెండు కృచ్ఛ్రములును బునస్సంస్కారమును జేయునది. సన్యసించి తిరుగ గార్హస్థ్యము నపేక్షించినచో నాఱుమాసముల పర్యంతము గృచ్ఛ్రములుచేసి జాతకర్మాది స్సంస్కార ములు చేసినచో శుద్ధుఁడై గార్హస్థ్యముఁ జేయవచ్చును. ఇట్లు ప్రాయోపవేశమనఁగ మృతి నొందుట కుపవాసము సంకల్పించి మానివేసినవాఁడును జేయవలెను. “కర్మ నాశా జలస్పర్శా త్కరతో యాదిలంఘనాత్, గండకీ బాహుతరణా త్పునస్సంస్కార మర్హతి.” అనఁగా కర్మనాశ యనునది జలమును ముట్టినను కఱ్ఱతో యానదినిఁ దాటినను గండకీనదిలో నీదినను పునరుపనయనముఁ జేయవలయును.

ఇంక రెండవ పునరుపనయనము :- "ప్రదోషే నిశ్యనధ్యాయే మందే కృష్ణే గల గ్రహే, అపరాహ్ణే చోపనీతః పునస్సంస్కారమర్హతి." అనఁగా మీఁదవ్రాసినట్లు ప్రదోషదినమందును రాత్రియందు ననధ్యాయ దినమందు ననఁగా పూర్ణిమ మొదలగు నిత్యానధ్యాయమందును నైమిత్తికానధ్యాయములలో ప్రాతర్గర్జనము మాత్రమే పునస్సం స్కారహేతువని కౌస్తుభము. అట్లు శనివారమందును కృష్ణపక్షమనఁగ తుది మూఁడు దినములు నిషిద్ధములని మీఁదఁజెప్పినందున నపుడును పూర్వమందుఁ జూపించినగల గ్రహదినమందును పగటిలో మూఁడవ భాగమని మీఁదఁ జెప్పిన యపరాహ్ణమందును నుపనయనముఁ జేసినయెడఁ దిరుగఁ జేయవలెను. మఱియు వటుని మూఁపుపై చేయుంచి యాచార్యుని సమీపము నొందించుట ప్రధానకర్మము. అది మఱచి పోయినను ఇట్లు గాయత్ర్యుపదేశము మఱచిపోయినను పునస్సంస్కారము చేయవలెను.

ఇంక మూఁడవ పునస్సంస్కారమునకు నిమిత్తవిచారము :- ఒకవేదముఁ జదివి మఱియొక వేదముఁ జదువుటకుఁ గోరినచో ప్రతివేదమునకు పునరుపనయనమని కొందరు. ఇతర వేదశాఖీయులు ఋగ్వేదముఁ జదువ దలఁచునపుడు మాత్రమే పునరుపనయనమని కొందరు. ఒక్క యుపనయనముచేతనే వేదములు మూఁడును జదువుట, కధికారము సిద్ధించును. మఱి యథర్వవేదముఁ జదువునపుడు మాత్రమే పునరుపనయన మని మఱికొందరు. వారి మంతమందు వేదత్రయముఁ జదివిన వారికిని నాథర్వణశిఖ మొదలగు నుపనిషత్తులు పఠించుట కధికారము లేదని సిద్ధించును. ఒక్కమారే యనేకవేదములు ప్రారంభించినచో నుపనయనముఁ దిరుగఁ జేయనక్కఱలేదని యున్నందున నట్టొక యుపనయనముననే సకల వేదాధ్యయనాధికారము సిద్ధించునని యితరులు. కనుకనే పునరుపనయనము లేకయే శిష్టులు బ్రహ్మ యజ్ఞమంత్రముల నుచ్చరింపుచున్నారు. అందు ప్రతివేద ముపనయనమును పక్షమందు నేశాఖను జదువఁదలఁచెనో యాశాఖోక్తవిధిచే నుపనయనము. అపుడు వపనము బ్రహ్మోదనము మేధాజననము దీక్షయు వైకల్పికములు. పరిదానము పర్యంతమే క్రియఁ జరుపనది. అనధ్యాయము మొదలగు రెండవనిమిత్తముచే బునరుపనయనముఁజేయునపుడు సర్వాంగములు పూర్ణముగ జేయవలెను. విధ్యుక్తకాలమందుఁ జేయవలెను.

## ఋగ్వేదీయ పునరుపనయన ప్రయోగము

అందునిమిత్తముఁ జరుగఁగానే యవ్యవధానముగఁ జేయుచో నుత్తరాయణము నక్షత్రము మొదలగునవి శోధింప నక్కఱలేదు. లేనిచో యథోక్తకాలము గావలెను. అందు గర్తతండ్రియే ముఖ్యుఁడు. అతఁడు లేనిచో పినతండ్రి మొదలగు సపిండులు. వారును లేనిచో నన్యుఁడు చేయవచ్చును. పెద్దలు ప్రత్యవాయము ననుసరించి ప్రాయశ్చిత్తము బునరుపనయనముగూడ విధించిరేని సంస్కార్యునిచే మొదట ప్రాయశ్చిత్తముఁ జేయించి యాచార్యుఁడటుపైని నుపనయనము జేయవలెను. మఱియు జాతకర్మాదులు గూడ విధించిరేని యపుడు జాతకర్మాది చౌలాంత

కర్మలుఁజేసి పునరుపనయనముఁ జేయునది. అందాచార్యుఁడు గాయత్రికిఁ బ్రతి నిధిగా 'తత్సవితుర్వృణీ మహే' యను ఋక్కునుపదేశింపవలసియున్నది. గనుక నా ఋక్కునే వేయును బంఁడ్రెండు మారులు జపింపవలెను. అట్లు కృచ్ఛ్రత్రయముఁ గూడ నధికారసిద్ధికై చేయవలెను. అందు "అస్య కృతోద్వైహికస్య పున స్సంస్కార ద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం జాతకర్మా ద్యుపనయనాంతసంస్కారాణి కరిష్యే" యని సంకల్పించవలెను. ఇట్లు నిమిత్తాంతరమందును సంకల్ప మూహింపవలెను. సకల సంస్కారముల నుద్దేశించి తంత్రముచే నాందీ శ్రాద్ధాదికము. మీసము గడ్డము క్షౌరమైనపైని చైలమునకు గేశవపనము మనుష్యాది క్షీరపాననిమిత్తమందు సంస్కా ర్యుఁడే– "అముక దోషపరిహారార్థం పదిషదుపదిష్టా ముకప్రాయశ్చిత్తం కరిష్యే" యని సంకల్పించి యది చేయవలెను. అటుపై నాచార్యుఁడు 'అస్యాముక దోష నిరాసార్థం పునస్సంస్కార సిద్ధిద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం పునరుపనయనం కరిష్యే' యని సంకల్పించి యుపనయనము మాత్రమే చేయవలెను. ఉపనయనము మాత్రము విధించునపుడు సంస్కార్యునికి సంకల్ప మక్కఱలేదు. ఆచార్యుఁడు మాత్రమే చేయునది. అట్లు పునరుపనయనమును గ్రామమునకు వెలుపలనే చేయవలెను. అదియును దూరుపునగాని యుత్తరమునగాని కావలెను. నాందీశ్రాద్ధాంతమందు మండపదేవతాస్థాపనము మంగళస్నానముఁజేసిన సంస్కార్యునికి భోజనము పెట్టించి క్షౌరమున్నపక్షమం దదిచేయించి 'అస్యప్రాయశ్చిత్తార్థం పునరుపనయనహోమదేవతా పరిగ్రహార్థ మన్వాధానం కరిష్యే' యని సంకల్పించి 'అస్మిన్నన్వాహితేగ్నౌ' అని మొద లగునది నిత్యోపనయన మందువలెఁ జేయవలెను. బ్రహ్మచారికిఁ బునరుపనయన మందు మంత్రసహితముగ వాసోధారణము నిత్యము బ్రహ్మచారిగానిచో వైకల్పికము బ్రహ్మసూత్రాధికారణము మొదలుగ సూర్యునిఁ జూచుట పర్యంతము నిత్యముతో తుల్యము. అటుపైని 'యువాసు వాసా' యను మంత్ర ప్రదక్షిణ మావర్తనాది వాసో బద్ధాంజలి గ్రహనమైనపైని ప్రణవమునకును వ్యాహృతులకును ఋషి ఛందస్సులు స్మరించి "తత్సవితుర్వృణీమహ ఇత్యస్యశ్యావాశ్వస్సవితానుష్టుప్ పునరుపనయనే ఉపదేశే వినియోగః" అని యుచ్చరించి యా ఋక్కును పాదము పాదమొక పర్యాయ మును సగము సగమొకమాఱును నంతయు నొకవామును నిట్లు ముమ్మారుపదేశింప వలెను. బ్రహ్మచారి 'మేఖల' యనఁగ మొలత్రాఁడునిచ్చుట మొదలగునది నిత్యము నకువలెఁ జేయునది. బ్రహ్మచర్యోపదేశాంతము బ్రహ్మచారిగాకున్నచో మేఖలాజిన దండధారణ ముపాక్షికము బ్రహ్మచర్యోపదేశము. 'దివామాస్వాప్సీః' అనువరకునుగాని 'వేదమధీష్వ'యని మొదలుగ నక్కఱలేదు. అటుపైని స్విష్టకృత్తని మొదలగునవి మేధా జననము చేయుపక్షమునఁ దాని పర్యంతమగ్ని నిలుపుట భిక్షాపూర్వముగ ననుప్రవచ నీయ గాయత్రీస్నానమందు "తత్సవితుర్వృణీమహ" యని హోమము త్రిరాత్ర వ్రత మైన పైని నేయాశ్రమమందుండఁగ బునరుపనయనము వచ్చెనో యాయాశ్రమ ధర్మము లాచరింపవలెను. అత్యంతకర్మచేసిన పైని వచ్చినవానికిఁ బునరుపనయ నాంతమందుఁ బునర్వివాహము విధింపఁబడినందున నది జేయునపుడు మేఖలాది

ధారణముతో గొన్నిరోజులు బ్రహ్మచర్యముఁ జేసి తగినకాలములో సమాప్తిఁ జేసి పూర్వభార్యతోగాని వేఱొకస్త్రీతోగాని వివాహముఁ జేయునది.

## యజుర్వేదులకు పునస్సంస్కారము

ఇక్కడ బోధాయనఋషి: – "బ్రహ్మచారిణః పితృజ్యేష్ఠాభ్యామన్యోచ్ఛిష్టభోనేస్త్రియా సహభోజనేమధ్యమాంస శ్రాద్ధసూతకాన్నగణాన్న గణికాన్నాశనే పునరుపనయన"మ్మని చెప్పి, అనఁగా బ్రహ్మచారికి పితృజ్యేష్ఠభ్రాతలు తప్పఁ దక్కినవారి యుచ్ఛిష్టము భుజించినను స్త్రీలపఙ్త్తిని భుజించినను కల్లు మాంసము శ్రాద్ధాన్నము సూతకాన్నము గణాన్నము వేశ్యాన్నము వీని భక్షించినను పునరుపనయనము చేయవలెనని చెప్పి, అగ్నిముఖముఁజేసి నేతితో దడిపిన మోదుకసమిధగ్రహించి పఠించునది. "పునస్త్వా దిత్యా కామాయస్వాహా" యనియు. "యన్మ ఆత్మనోమిందా భూదగ్నిః పునరగ్నిశ్చక్షు రదాత్" అనియు నీరెంటిచే హోమముఁజేసి చరువునుడికించి హోమము చేయునది. "సప్తతే అగ్నే, ఘృతేన స్వాహా" అని మంత్రములు అటుపైని "ఏన దేవాః పవిత్రేణ" యను మూఁడు ఋక్కులచే నుపహోమములు. అనంతరమందు స్విష్టకృత్తు మొదలుగ సిద్ధిని ధేనువరప్రదానము పర్యంతముఁ జేయునది. లేదా రెండవది పరిధానపర్యం తముఁజేసి మోదుగు సమిధఁబట్టుకొని ప్రాత్యప్రాయశ్చిత్తహోమముఁ జేయునది. వ్యాహృతులచే వేల్చునది. మఱియు మూఁడవది బ్రాహ్మణవచనమునుంచి నూరు మారులు సావిత్రచే నభిమంత్రించిన ఘృతమును భక్షించినచో ప్రాయశ్చిత్తము పూర్ణ మగునని మొదలుగ సూత్రమందుఁ జెప్పెను. అట్లు జెప్పిన పక్షములకు శక్తి చాలా గల్గినచో ప్రథమపక్షము తక్కువయైనచో రెండవ పక్షమునంతకు నశక్తుఁడైనచో మూఁడవపక్షము నని వ్యవస్థఁదెలియునది. ఇట్లు కౌస్తుభమందున్నది. ఇట్లు శాఖాంతరమందును వపనము మేఖన అజినము దండము భైక్షచర్యయు వ్రతము మొదలగునవి వైకల్పికములు. వ్యవస్థచే నాచరించి తమతమ శాఖలోఁ జెప్పఁబడిన విధిచొప్పున బునరుపనయనముఁ జేయునది.

## బ్రహ్మచారి ధర్మములు

అందు మూఁడువేళల సంధ్యావందనములు నగ్నిపరిచర్యయు భైక్షమును నిత్యమును అందగ్ని కార్యము ప్రాతఃకాలమందు సాయంకాలమందు నీరెంటియందు గాని కేవలముగ సాయంకాలమందు సకృత్తుగగాని చేయవచ్చును. అపుడు మోదుగు, చంద్ర, రావి, జమ్మిని వీసమిధలు శ్రేష్ఠములు. అవి దొరుకనిచో జిల్లుఁడు, ప్రబ్బ వీటిసమిధలు, భవచ్ఛబ్దము మొదలనుంచి భిక్షచేయవలెను. అనఁగా "భవతీ భిక్షాం దదాతు" అని యుచ్చరింపవలెననుట. ఆ భిక్షయును బ్రాహ్మన గృహములందే. అట్లు జరుగుట దుర్లభమైనచో శూద్రగృహమందు సహితము బియ్యము భక్షింప వచ్చును. దేవకర్మ యందును శ్రాద్ధముగాక యన్యమైన పితృనిమిత్తములందును ప్రార్థింపఁబడినచో భుజింపవచ్చును. ఇతనికి బ్రహ్మయజ్ఞము నిత్యము. అదియు నుపాకర్మకు ముందు గాయత్రిచే చేయవలెను. గురువు భక్షింపఁగ మిగిలినది

మధ్యాదికమైనను దానివలనఁగాని నివారిపంని రోగమున్నపు డౌషధముగ భక్షింప వచ్చును. నిషిద్ధముగాని ద్రవ్యము గూరూచ్ఛిష్టమును ఔషధముగాకున్నను భుజింప వచ్చును. ఇట్లు జ్యేష్ఠభ్రాతయొక్కయు, దండ్రి యొక్కయు, నుచ్ఛిష్టమందుఁ దెలియు నది. పగలునిద్రయు, నేత్రములందు కాటుకయు, పాదరక్షలు, గొడుగు, మంచముపైఁ బడుకొనుటయుఁ గూడదు. "తాంబూలా భ్యంజనం చైవ కాంస్య పాత్రే చ భోజనం, యతిశ్చ బ్రహ్మచారీ చ విధవా చ వివర్జయేత్" అనఁగా తాంబూలభక్షణము నభ్యంజన స్నానమును కంచుపాత్రలో భోజనమును యతియు బ్రహ్మచారియు విధవయును వర్జింపవలయును. మధుసూతకాన్నశ్రాద్ధాన్నాది నిషేధములు పునస్సంస్కార ప్రకరణ మందుఁ జెప్పఁబడినవి యూహించునది. మేఖలయు నజినము దండము యజ్ఞోప వీతము కౌపీనమును అది ధరించుటకు మొలత్రాఁడును నిత్యముగ ధరించునది. మేఖల యుపవీతము మొదలగునది జీర్ణమైనచో నది జలమందు విడచి క్రొత్తవి ధరింపవలెను. యజ్ఞోపవీతము ప్రమాదమున జారిపోయినచో "మనోజ్యోతి" యను దానిచేతను "వ్రాతపతిభిశ్చ" యను దానిచేతను నాలుగుగాజ్యాహుతులు వేల్చవలెనని మీఁదఁజెప్పఃబడినది. ఇతనికి గురుశుశ్రూషా ప్రకారము గ్రంథాంతరమున దెలియు నది. మఱియు బ్రహ్మచారి వ్రతములోపించినను సంధ్యాగ్ని కార్యము లోపించినను నెనిమిదివేల గాయత్రీ జపము కొన్ని గ్రంథములలో నొకమాఱు లోపించినచో 'మాన స్తోకే' యను మంత్రము నూరుమాఱులుఁ జపించునది యనియున్నది. భిక్షాలోప మైనచో నెనిమిదివందలు జపము రెండుమారులుఁ జఱిగినచో ద్విగుణముగఁ జేసి పునరుపనయనముఁ జేయవలెను. మధుమాంసభక్షణమందు మీఁదఁజెప్పఁబడినది. స్త్రీసంగమముఁజేసినచో గర్దభపశువునువేసి యాగముఁజేయునది. ఒకటి వ్యాపించి నను ననేకము లోపించినను సాధారణముగ ప్రాయశ్చిత్తము ఋగ్విధానమందున్నది. "తం వోధియా జపేన్మంత్రం లక్షం చైవ శివాలయే, బ్రహ్మచారీ స్వధర్మేషు న్యూనంచే త్పూర్ణమేతితత్" అనఁగా బ్రహ్మచారి వ్రతలోపము సంభవించినపుడు "తం వోధియా" యను మంత్రమును శివాలయమందు లక్షావృత్తులుగఁ జపింపవలయుననుట. ఉపాకర్మచేసిన పైని మీఁదఁజెప్పిన విద్యారంభకాలమందు నక్షరారంభ మందుఁ జెప్పిన విష్ణ్వాదిదేవతలఁ బూజించి వేదారంభముఁ జేయునది. ద్విజస్త్రీలకు యుగాం తరమందు మౌంజీబంధమనఁగ నుపనయనమును వేదాధ్యయనమును జరిగి యున్నది. కలియుగమందు రెండును లేవు గనుక ద్విజస్త్రీలు వేదము నుచ్చరించినచో దోషము.

## అనధ్యాయములు

ఇవి నిత్యములు నైమిత్తికములును చాలామట్టునకు మౌంజీప్రకరణమునందుఁ జెప్పఁబడినవి. మఱియు ననేక విధములు నిబంధనములలో గనఁబడుచున్నవి. అయినను వాటిపరిపాలనము కలికాలముచే దుర్మేధస్కులయిన ద్విజులకు దుష్కరము గనుక నిక్కడ విస్తరింపఁబడవు. అట్లు హేమాద్రియందు వచనము :– "చతుర్ద శ్యష్టమీపర్వ ప్రతిపత్స్వేవసర్వదా, దుర్మేధసా మనధ్యాయా స్త్వంతరా గమనేషుచ"

అని. కనుక కలియుగమందు ప్రతిపదలు రెండును నష్టమీతిథులు రెండును చతుర్ద శులు రెండును పౌర్ణమాసియు దర్శయు నయనము సంక్రాంతియు నని యింతమట్టు నకే యనధ్యాయములు. వానివిడిచి వేదశాస్త్రాదికముఁ జదువవలెను. శిష్టాచారము నిట్లనేయున్నది. పూర్వదినమందు సాయంకాలమునను బరదినమున నుదయమం దును మూఁడు ముహూర్తముల వనధ్యాయతిథియున్నచో "ఉదయేస్తమయేవాపి" యను వచనముచే దినద్వయమందు ననధ్యాయము ప్రాప్తించినచో వచనాంతరము. "కేచిదాహుః క్వచిద్దేశే యావత్తద్దిననాడికాః, తావదేవ త్వనధ్యాయో నతన్మిశ్రే దినాం తరే" యని యిదియు నల్పప్రజ్ఞుల విషయమే యని తెలియునది. చవితి సప్తమి మొదలగువానియందుఁ బ్రదోషము నియమింపఁబడియున్నది. ప్రదోషమందు "నస్మరే న్నచ కీర్తయేత్" అని స్మరించుటకూడ నిషేధించుటచే నితరానధ్యాయములకంటె దోషాధిక్యము. "అనధ్యాయ స్తునాంగేషు నేతిహాసపురాణయోః, నధర్మశాస్త్రే ష్వన్యేషు వర్జ్యతేతో నవర్జయేత్" అంగములు నిరుక్తాదులు ఇతిహాసములు భారతాదులు పురాణ ములు ప్రసిద్ధములు. ధర్మాశాస్త్రములు మన్వాదిస్మృతులు వీనిజదువుట కనధ్యాయము విధింపలేదు గనుక వర్జింపనక్కఱలేదు. మఱియు "నిత్యే జపే చ కామ్యే చ క్రతౌ పారాయణేపి చ, నానధ్యాయో స్తివేదానాం గ్రహనే గ్రాహణేస్మృతః" అనఁగా నిత్య కర్మయందు జపమందును కామ్యకర్మయందును యజ్ఞమందును వేదపారాయణ మందును వేదము నుపదేశించుటకును దా నుచ్చరించుటకు ననధ్యాయములేదు.

## అధ్యయన ధర్మములు

వేదముఁ జదువ నారంభించునపుడును సమాప్తియందును గురువునకు పాదోప సంగ్రహణముఁ జేయవలెను. మొదట ప్రణవము నుచ్చరించి ప్రారంభించి తుదినిగూడఁ బ్రణవము నుచ్చరించి భూమిని స్పృశించి చాలింపవలెను. రాత్రి ప్రథమ యామమందును, నాల్గవయామమందును వేదాధ్యయనముఁ జేయవచ్చును. మధ్యమున రెండుయామములును శయనించినచో బ్రహ్మత్వము నొందును. గురు వును తల్లిదండ్రులుగా దలఁచునది యెపుడును ద్రోహబుద్ధి చేయఁగూడదు. "అధ్యా పితాయే గురుం నాద్రియంతే శిష్యా వాచా మనసా కర్మణావా, యథైవతే నగురోర్భోజనీ యాస్తథైవతాన్న భునక్తిశ్రుతం తత్." అనఁగా నధ్యయనము చేయింపఁబడ్డ శిష్యులు గురువునందు మనసుచేతను వాక్కుచేతను క్రియచేతను నాదరణముఁ జూపని యెడల వారు గురువున కుపయోగపడనట్టు లేశ్రుతముగా చదివిన విద్య వారి కుపయోగింప దని యర్థము.

## వ్రతములు

ఇవి మహానామ్నివ్రతము, మహావ్రతము, ఉపనిషద్వ్రతము, గోదానవ్రతము నని నాలుగు. ఇవి క్రమముగ జన్మమొదలుగ పదుమూఁడవ సంవత్సరము మొదలు కొని నాలుగు సంవత్సరములందుత్తరాయణ ప్రవేశమైన పైని చూడాకర్మకుఁ జెప్పిన తిథినక్షత్రవారాదులందు చేయవలయును. వాటివిస్తారము కౌస్తుభాదులందును దమ

తమ గృహ్యసూత్రములందును దెలియునది. వీటికి లోపముగల్గినచో నొక్కొక్కవ్రత మున కొక్కొక కృచ్ఛ్రముం జేయునది. మఱియును గాయత్రిచే నూరాజ్యాహుతులు వేల్చవలెను. మూఁడుగాని యాఱుగాని పండ్రెండుగాని కృచ్ఛ్రములఁ జేయవలెనని గ్రంథాంతరమందున్నది.

## సమావర్తనము

గురునకు భూమి మొదలగువానిలో నొకటిచ్చి యాతనియనుజ్ఞచే స్నానము చేయవలెను. స్నానమనఁగ సమావర్తనము. భూమి మొదలగునవి యేవనిన–"క్షేత్రం హేమగౌరశ్వశ్ఛత్రోపానహౌధాన్యం వస్త్రత్రయం శాకం" అని సూత్రోక్తములు. అనఁగా భూమియు, బంగారు, గోవు, గుఱ్ఱము, గొడుగు, పాదరక్షలు, ధాన్యము, మూఁడు వస్త్రములు, శాకమునను వీనిలో గురునకుఁ బ్రియమైనది యీయవలెను. గురుదక్షిణ యివ్వనక్కఱలేకుండఁగ గురునకుఁ బ్రీతియైన యెడ నను మతిమాత్రముననే సమావర్తన రూపస్నానముఁ జేయవచ్చును. క్షేత్రాదిదానముచేనైనను విద్యానిష్క్రయము గానేరదు. "ఏకైక మక్షరం యస్తు గురుశ్శిష్యే నివేదయేత్, పృథివ్యాం నాస్తి తద్ద్రవ్యం యద్దత్వాత్వనృణీభవేత్." అని యున్నది. అనఁగా గురువుపదేశించిన యొక్కొక్క యక్షరమునకు శిష్యుఁడు ఋణముఁదీర్చుకొనదలఁచినను దానికి సరియైన ద్రవ్యము భూలోకమందే సంభవింపఁదని యున్నందున దక్షిణచే విద్యానిష్క్రయము సిద్ధింపదనుట అట్లు స్నాతకవ్రతస్తులు మూఁడువిధములుగా నున్నారు. విద్యాస్నాతకుఁడు వ్రతస్నాతకుఁడు నుభయస్నాతకుఁడు నని. అందొకటిగాని రెండుగాని మూఁడుగాని వేదములైనను వేదైకదేశమైనను జదివి తదర్థమునుఁదెలసి పండ్రెండు వత్సరములు మొదలగు బ్రహ్మచర్యావధికాలమునకు లోగానే స్నానము చేయువాఁడు విద్యాస్నాతకుఁడు. ఉపనయనదీక్షయు సావిత్రీ వ్రతములునుజేసి వేదసమాప్తికిముందే స్నానము జేసినవాఁడు వ్రతస్నాకుఁడు. ద్వాదశవర్షములు మొదలగు బ్రహ్మచర్య సమాప్తితో వేదము సమాప్తినొందించి స్నానముజేసినవాఁడు విద్యావ్రతోభయ స్నాతకుఁడు. అందుపనయనమైనపైని మేథాజననపర్యంతము త్రిరాత్రము ద్వాదశరాత్రము మొదలగు వ్రతముపనయనవ్రతము మేధాజననమైన పైని నుపాకర్మపర్యంతము బ్రహ్మచారి ధర్మానుష్ఠానము సావిత్రీవ్రతము అటుపైని బండ్రెండువత్సరములు మొదలగుకాలము పర్యంతము బ్రహ్మచర్యముఁజేయుట వేదవ్రతము. 'స్వాధ్యాయోధ్యేతవ్యః' అనువిధి యర్థజ్ఞానము పర్యంతము నధ్యయనమును విధింపుచున్నవి. కనుక వేదార్థజ్ఞానము గల్గినపైని గాని సమావర్తనమున కధికారములేదని పూర్వమీమాంసకులు చెప్పిరి. వేదమును గ్రహించుటయే విధికిఫలము పూర్వకాండముయొక్క యర్థజ్ఞానము కర్మానుష్ఠానముబట్టి గమనింపఁబడినది. ఉత్తరకాండముయొక్క యర్థము దెలియుట కామ్యము 'శ్రోతవ్యోమంతవ్యః' అను శ్రవణాదివిధిచే ప్రాప్తమైనదని యుత్తరమీమాంసకులనిరి. అందు సంహితయు బ్రాహ్మణము రెండునుగలసి యొకవేదము అరణ్యకాండమును బ్రాహ్మణాంతర్గతమే సంపూర్ణవేదాధ్యయనమం దశక్తుఁడైనచో వేదములో నొకభాగమైనను జదువవలెను. అంతకు నశక్తుఁడైనచో సంహితకు మొదటి యను

వాకము తుదియనువాకమునైనను కొన్ని యనువాకముల మొదటి ఋక్కులనైనను నన్నియనువాకముల మొదటి ఋక్కులనైనను బఠించవలెను. ఇట్లు వేదైకదేశము జదివి సమావర్తనముజేసి వివాహితుఁడై బ్రహ్మచర్యమందు జెప్పిన నియమముతో వేదాధ్యయనము జేయవలెను. అపుడు ఋతుకాలమందు భార్యాగనము జేయవలెను. బ్రహ్మచారివ్రతలోపమునకు బ్రాయశ్చిత్తముగ మూఁడు కృచ్ఛ్రములు జేసి మహా వ్యాహృతులచే హోమముజేసి సమావర్తనము జేయవలెను. ఇదియు సంధ్యాగ్ని కార్య ములకు లోపము భిక్షకులోపము శూద్రాది స్పర్శము మొలత్రాఁడు మౌంజి యజినము వీని విడుచుట దివాస్వాపము నంజనము చలిదిదినుట మొదలగు వ్రతభంగములందు స్వల్పకాలము నల్పవ్రతభంగమునైనచో నని తెలియవలెను. అట్లుగాక యధికకాలము ననేక వ్రతభంగములు నైనయెడ 'తం వోధియానవ్యస్యాశవిష్టం' అను ఋక్కుచే శివాలయమందు లక్షజపముజేయవలెనని మీఁదఁ జెప్పఁబడినది. కాఁబట్టి మహా నామ్న్యాది వ్రతలోపమునకును బ్రహ్మచర్య వ్రతలోపమునకును బ్రాయశ్చిత్తమైన పైని సమావర్తనమందధికారము.

## సమావర్తనమునకు కాలము

అందుపనయనోత్తరకాలమందే సమావర్తన మని బహుజ్యోతిర్గ్రంథసమ్మతము. కనుక ననధ్యాయమందును బ్రదోషదినమందును మంగళశనివారములందును పౌషా షాఢములందును దక్షిణాయనమందును గూడదు. మార్గశీర్షమందు వివాహము బ్రాప్తించినచో దక్షిణాయనమందును గూడును. కానియెడ 'అనాశ్రమీ నతిష్ఠేత దినమేక మపిద్విజః' అనునిషేధవచనము నతిక్రమింపవలసివచ్చును. మఱికొంద రుపనయనమునకు జెప్పినకాలము స్వీకరించుటకు ప్రమాణములేదు. కావున రిక్తా త్రయము పూర్ణిమయు నమావాస్య ప్రతిపద వీటికి భిన్నమైనతిథియందు శుక్లపక్ష మందును తుదిమూఁడు రోజులు వదిలిన కృష్ణపక్షమందును గురుశుక్రాస్తమయాదు లును దినక్షయము భద్రవ్యతీపాత మొదలగు దోషములు లేని శుభవారమందు సమావర్తనముఁ జేయునది.

## సమావర్తనాధికార ప్రధాన హోమము

అపుడు సోపపదాదులగు మీఁదఁజెప్పిన తిథుల వర్జింప నక్కరలేదనిరి. పుష్యము, పునర్వసు, మృగశీర్ష, రేవతి, హస్త, అనురాధ, ఉత్తర, ఉత్తరాషాఢ, ఉత్తరా భాద్ర, రోహిణి, శ్రవణము, విశాఖ, చిత్ర, జ్యేష్ఠ, యివి శుభములు. అవి లభింపనిచో మౌంజికిఁ జెప్పిన నక్షత్రములు నొకానొకచో భౌమశనివారములును సింధూక్తములు. అపుడు మణికుండలములు వస్త్రయుగము గొడుగు పాదుకలు దండము పుష్పమాల యభ్యంజనము నంగరాగము కాటుక పాగా ఇవి తనకు నాచార్యునికి సంపాదించ వలెను. దొరకనిచో నాచార్యునికి మాత్రమే సంపాదించి దేశకాలము లుచ్చరించి "మమ బ్రహ్మచర్యలోప జనిత సంభావిత సకలదోష పరిహారద్వారా సమావర్తనాధికార ప్రాప్త్యా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం ఆజ్య హోమపూర్వకం కృచ్ఛ్రత్రయమాచరిష్యే" యని

సంకల్పించి యగ్ని ప్రతిష్ఠాపనము మొదలగు "చక్షుషీ ఆజ్యేన" యనునంతమందు ప్రధానముగ నగ్నికి వాయువునకు సూర్యునకు ప్రజాపతికి నాలుగాజ్యాహుతులును, నగ్నికి పృధివికి మహాదేవతకు నొక్క యాజ్యాహుతియును, వాయువునకు నంతరిక్షము నకు మహాదేవతలకు నొక యాజ్యాహుతియును, ఆదిత్యునకు ద్యుదేవతకు మహాదేవతకు నొక యాజ్యాహుతియు, చంద్రునికి నక్షత్రములకు దిక్కులకు మహానను దేవతలకు నొక యాజ్యాహుతియు, మఱియును "అగ్నిం ద్విర్విభావసుం శతక్రతుం వసుం అగ్నిం అగ్నిం అగ్నిం వాయుం సూర్యం ప్రజాపతించ" యని యెనమంద్రకు నొక్కొక్క యాజ్యాహుతియు, శేషేణ స్విష్టకృతమని మొదలగు నన్వాధానముఁజేసి యాజ్యభాగాంతమున వ్యస్త సమస్త వ్యాహృతులచే నగ్న్యాదులు నలుగురికి నాలు గాహుతులిచ్చి "భూరగ్నయే చ పృధివ్యై చ మహతే చ స్వాహా, అగ్నయే పృధివ్యై మహతే చేదం నమమ", యని యన్వాధానక్రమమున త్యాగము. "భువో వాయవే చాంతరిక్షాయ చ మహతే చ స్వాహా, వాయవేంతరిక్షాయ మహతే చేదం. సువరా దిత్యాయ చ దివే చ మహతే చ స్వాహా, ఆదిత్యా ఇదం. భూర్భు వస్సువశ్చంద్రమసే నక్షత్రేభ్యశ్చ దిగ్భ్యశ్చమహతే చ స్వాహా, చంద్రమసే నక్షత్రేభ్యశ్చ దిగ్భ్యశ్చమహతే చేదం, పాహినో అగ్నఏనసే స్వాహా, పాహినో విశ్వవేదసే స్వాహా, యజ్ఞంపాహి విభావసో స్వాహా, సర్వం పాహిశతక్రతో స్వాహా, పాహినో అగ్న ఏకయా, పాహ్యుత ద్వితీయాయ, పాహ్యూర్జం తృతీయయా, పాహిగీర్భిశ్చతసృభిర్వసో స్వాహా, వసవ ఇదం నమమ, పురరూర్జా నివర్తస్వ పునరగ్న ఇహాయుషా, పునర్నః పాహ్యం హస స్వాహా, సహరయ్యా నివర్తస్వాగ్నే పిన్వస్వధారయా, విశ్వప్స్న్యయా విశ్వతస్పరిస్వాహా" ఇట్లు హోమముఁజేసి తిరుగ వ్యస్త సమస్తవ్యాహృతులచే నగ్న్యాదులకు నాహుతులు నాల్గునిచ్చి, వ్రతచతుష్టయము నిమిత్తము గాయత్రిచే నాజ్యహోమము, కృచ్ఛ్రత్రయము నకు గోనిష్క్రయ ద్రవ్యమునిచ్చి హోమశేషమునకుఁ బూర్తిచేయవలెను. మహానా మ్న్యాది వ్రతములు లోపించినచో ప్రత్యేకముగ నూటయెనిమిదిగాని, యిరువ దెనిమిది గాని యెన్మిదిగాని, యాజ్యాహుతులవేల్చి యొక్కొక్క కృచ్ఛ్రమును జేయవలెను. ఇట్లు ప్రాయశ్చిత్తమునకు ప్రయోగము.

## సమావర్తనసంకల్పములు

"మమగృహస్థాశ్రమార్హతా సిద్ధిద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం సమావర్తనం కరిష్యే" యని సంకల్పించి నాందీశ్రాద్ధాంతము వటుఁడే చేయవలెను. బ్రహ్మచారి జీవత్పితృకుఁడైనచో దండ్రిమాత్రాదులనుద్దేశింపవలెను. బ్రహ్మచారి యశక్తుఁడైనచో దండ్రి మాత్రాదులనుద్దేశింపవలెను. బ్రహ్మచారి యశక్తుఁడైనచో పిత్రాదులు ప్రతి నిధిగా నాందీశ్రాద్ధముఁ జేయవచ్చును. ఉపనయనాదులందువలె సమావర్తనమం దును పిత్రాదులే యధికారులని మతాంతరము పూర్వమందుఁ జెప్పఁబడినది. మిగి లిన ప్రయోగము దమతమ గృహ్యసూత్రము ననుసరించి తెలియవలెను. ముగ్గురికి గాని పదుగురికిగాని విప్రులకు భోజనము పెట్టవలెను. "దాస్యంతి మధుపర్కం

యేత్రైతాం రజనీంసేత్" అనఁగా దనకు మధుపర్కమిచ్చినవారి గృహమందారాత్రి నివసింపవలెననుట. అటుపైని వ్రతముల సంకల్పించవలెను. అది సూత్రోక్తములు స్మృత్యుక్తములు నని రెండువిధములు. అన్నియు పురుషుని సంస్కారములేకాని సమావర్తనమున కంగములు కావు.

## స్నాతక వ్రతములు

అందశక్తుఁడు సూత్రోక్త వ్రతములే చేయవలెను. అవి యేవనిని నిమిత్తము లేకుండగ రాత్రి స్నానము చేయఁగూడదు. నగ్నుఁడై స్నానముఁజేయఁగూడదు. నగ్నుఁడై శయనింపఁగూడదు. నగ్నయనఁగ వస్త్రహీనయైయున్నపుడు స్త్రీని సంగమ కాలముఁదప్ప నితరకాలములందుఁ జూడఁగూడదు. వర్షించునపుడు పరుగెత్తఁ గూడదు. వృక్షమునెక్కగూడదు. నూతిలో దిగఁగూడదు. చేతులతో నీది నదిఁదాట గూడదు. ప్రాణసంశయ కార్యమేమియు చేయఁగూడదు. అనునవి సూత్రోక్తములు. ఇఁక స్మృత్యుక్తము లేవనిన, యజ్ఞోపవీతద్వయమును నిత్యముగ ధరించుట, జల ముతో గూడిన కమండలువును గొడుగు పాగాపాదరక్షలు సువర్ణకుండలములు దర్భముష్టియును ధరించవలెను. కేశములు మీసము గడ్డము గోళ్లను కత్తిరించుటయే గాని నిమిత్తము లేక క్షౌరముఁ జేసుకొనగూడదు. ఏమనిన "వచ సమావృత్తా ముండే రన్" అని నిషేధమున్నది. నిత్యము నధ్యనపరుఁడు గావలెను. తానుధరించి తీసి వేసిన పుష్పమాల్యగంధాదుల తిరుగ ధరింపఁగూడదు. శుభ్రవస్త్రముల ధరించి శుభ గంధాలంకారములచే రమ్యముగ నుండవలెను. విభవమున్నచో జీర్ణవస్త్రము మలిన వస్త్రముఁ గట్టగూడఁదు. రంగుబట్టయు శరీరపీడజేయు వస్త్రము ధరింపఁగూడదు. గురువుదప్ప నితరులు ధరించినవస్త్ర మలంకారము మాల్యము ధరింపఁగూడదు. అశక్తుఁడైనచో నితరులు ధరించినవస్త్రమును దడపి ధరింపవచ్చును. అన్యులు ధరిం చిన యుపవీతము పాదుకలను ధరింపఁగూడదు. కంధయనఁగా బొంత దులాయి మొదలగునవి ధరింపఁగూడదు. జలమందు దన ప్రతిబింబముఁ జూడగూడదు. భార్యతో గూడ నేకపాత్రమందుగాని యేకకాలమందుగాని భుజింపఁగూడదు. ఇది వివాహకాలము తప్ప నితర కాలమందని తెలియునది. శూద్రునికి ధర్మజ్ఞానము నీతి జ్ఞానము వ్రతసంకల్పము నుపదేశింపఁగూడదు. ఇదియు సాక్షాదుపదేశ మందలి యెరుంగునది ఏమనిన. "శ్రావయేచ్చతురో వర్ణాన్ కృత్వా బ్రాహ్మణమగ్రతః" అని బ్రాహ్మణుని ముందుంచుకొని యందఱకు నుపదేశింపవచ్చునని విధి యున్నది. స్వయముగాఁ గుటుంబియై బ్రతుకుచున్న శూద్రునకు తన యుచ్ఛిష్ట మీగూడదు. తనకుఁదాసుడై తాను బెట్టినయన్నముచే జీవించుచున్న శూద్రున కీవచ్చుననుట. శూద్ర మాత్రునకు హోమశేషమీగూడదు. ఉద్ధరణితో బైకిదీసినయుదకముచే నిలువఁ బడునపుడాచమనముఁ జేయఁగూడదు. జానుమాత్రమనఁగ మునులకుల బంటుగాని యంతకు నెక్కుడుగాని లోతులో నదియందు నిలువఁబడియును నాచమనముఁ జేయుచో దోషములేదు. అపవిత్రుఁడుగాని పవిత్రుఁడైనను నేకహస్తముచేగాని తెచ్చిన

జలముచే నాచమనముఁ జేయగూడదు. ఒకపాదముచే రెండవపాదమును దోముటఁ గూడదు. శాస్త్రము విధింపని స్త్రీసంగమము చేయఁగూడదు. పగలు పాగాను ధరించి తిరుగఁగూడదు. రాత్రియందును మూత్రపురీషములు విడుచునపుడును శిరసున కావరణము లేక యుండఁగూడదు. పాదరక్షలు ధరించియుండి భోజనము నభివాద నము నమస్కారమును జేయఁగూడదు. తాను కూర్చుని కర్మజేసినదిగాని యన్యులది గాని యాసనము కాలుచే దొలగద్రోయఁగూడదు. లాగనుగూడదు. ఇట్లితరములైన వియు స్మృత్యుక్తమును గ్రహించునది. ఇట్టి వ్రతములలో నెవ్వియాచరించుటకు సమర్థుఁడగునో వానినే సంకల్పించవలెను. అట్లు సంకల్పించిన వ్రతమును బుద్ధి పూర్వముగ దాఁటినచో మూఁడు దినములుపవాసముఁ జేయవలెను.

## సమావర్తనమున కనుకల్పము

ప్రమాదమున దాఁటినచో నొకరాత్రి యభోజనము. అశక్తుఁడైనచో ముగ్గురు గాని యొకఁడుగాని బ్రాహ్మణులకు భోజనమిడునది. ఇవి స్నాతక వ్రతములు. ఇబ్బంది సమయమందు యథోక్తవిధిగా సమావర్తనము సంభవించినచో సంక్షేపముగ నది జేయవచ్చును . అపుడు ప్రయోగ మెట్లనిన–సంకల్పముఁజేసి బ్రహ్మచారికి లింగములగు మేఖల మొదలగునవి విడచి క్షౌరము జేసుకొని తీర్థమందు స్నానముఁ జేసి వస్త్రముఁగట్టుకొని తిలకధారణము మొదలైనవి చేసి యగ్నిని ప్రతిష్ఠించి యందు ప్రజాపతిని మనసునందు ధ్యానింపుచు నూరకే సమిదాధానము చేయునది. ఇతరమైన విరోధములేని కర్మయంతయు నూరకే జేయునది.

## సమావర్తనమైన పైని యాశౌచనిషేధము

బ్రహ్మచర్యముఁ జేయుచున్నపుడు పదిరోజులు మైలబట్టవలసిన సపిండులు మృతినొందినను నపుడా శౌచము లేదు. మఱిసమావర్తనముఁ జేసుకొన్నపైని యుద కమునిచ్చును. మూఁడురోజు లాశౌచముఁ బట్టవలయును ఇది యతిక్రాంతా శౌచము. ఉపనయనములేని సపిండులును మేనమామ మొదలగువారును మృతి నొందునపు డతిక్రాంతా శౌచము లేదు. ఇట్లు జననాశౌచమందును నతిక్రాంతా శౌచము లేదు. కాఁబట్టి సమావర్తనమునకుఁ బూర్వము పదిరోజు లా శౌచముఁ బట్టదగిన సపిండమృతి సంభవింపనిచో సమావర్తనమైన పైని మూఁడు దినముల పర్యంతము వివాహము చేయఁగూడదు. అట్లు మరణములేనిచో వివాహమందు దోషము లేదు.

ఇట్లనంతోపాధ్యాయపుత్రుఁడు కాశీనాథోపాధ్యాయ విరచితమగు ధర్మ సింధుసారమున తృతీయ పరిచ్ఛేదమునందు పూర్వార్థము ముగిసెను.

శ్రీ దుర్గాంబాయై నమః

# తృతీయ పరిచ్ఛేదము

ఉత్తరార్ధము

## వివాహ ప్రకరణము

అవ. ఇఁక పుండరీకుఁడను భక్తునికి వరమిచ్చిన విఠ్ఠలస్వామిపాదాంబుజ ముల ధ్యానించి గురువులకుఁ దల్లిదండ్రులకును నమస్కరించి వివాహనిర్ణయమును జెప్పుచున్నాఁడు.

## వివాహమందు గ్రహమైత్రి

"ఉద్వహేతు ద్విజో భార్యాం సవర్ణాం లక్షణైర్యుతాం అవ్యంగాంగీం సౌమ్య నామ్నీం మృద్వంగీం చ మనోరమాం" అనగా ద్విజుఁడు మంగళమైన నామధేయము మృదువైన శరీరము అవయవలోపము లేక మనసు కింపైన రూపము శుభలక్షణము లును గలిగిన సమానజాతి స్త్రీని వివాహముఁ జేసుకొనవలెను. ముందు కాబోవు శుభాశుభములఁ దెలియుటకు శకునముగ "అష్టౌ మృత్పిండాన్ కృత్వా" యని మొదలుగ నాశ్వలాయన సూత్రమందుఁ జెప్పఁబడినది. జ్యోతిశాస్త్రమందుఁ జెప్పఁ బడినరాశి నక్షత్ర గ్రహవిచారముగూడ శుభాశుభజ్ఞాన హేతువగును. అది సంక్షేప ముగ నిరూపింపఁబడును. అందు మేషాది రాసుల కధిపతులు "భౌమశ్శుక్రో బుధ శ్చంద్ర స్సూర్య స్సౌమ్యో భృగుః కుజః గురు శ్శనైశ్చరో మందః సురేజ్యో రాశి పాస్మృృతాః" కుజశుక్ర బుధచంద్రులు, సూర్యబుధ శుక్ర కుజులు, గురు శని శని గురులును క్రమముగ మేషాది రాసుల కధిపతులు. అందు గ్రహములకు మిత్రశత్రు విచారము, సూర్యునికి గురు భౌమచంద్రులు, మిత్రులు శని శుక్రులు శత్రువులు, బుధుఁడు సముఁడు, చంద్రునికి సూర్య బుధులు మిత్రులు, భౌమ గురు శుక్రశనులు సములు, ఇతనికి శత్రుఁడులేడు. అంగారకునికి బుధుఁడు శత్రుఁడు. సూర్య గురు చంద్రులు మిత్రులు, శని శుక్రులు సములు, బుధునకు సూర్య శుక్రులు మిత్రులు, చంద్రుడు శత్రువు, శనిభౌమగురులు సములు, గురునకు సూర్యభౌమ చంద్రులు మిత్రులు, శుక్ర బుధులు శత్రులు, శని సముఁడు, శుక్రునకు శనిబుధులు మిత్రులు, సూర్యచంద్రులు శత్రులు, భౌమగురులు సములు. శనికి శుక్ర బుధులు మిత్రులు, కుజ సూర్య చంద్రులు శత్రులు. గురుఁడు సముఁడు.

## గుణవిచారము

అందు గుణవిచారము దంపతుల రాశిద్వయమున కొకఁడే యధిపతియైనను నొకరాశి కధిపతులిద్దరును మిత్రులైనను నైదుగుణములు, రాశిపతులకు సమత్వము గాని శత్రుత్వముగాని యున్నచో సగము గుణము సమత్వము మిత్రత్వము నున్న యెడ నాల్గు గుణములు. శత్రుత్వ మిత్రత్వమున్నచో నొకగుణము ఇద్దరికి సమత్వ మున్నచో మూఁడు గుణములు. ఇద్దరికి శత్రుత్వమున్నచో గుణమేలేదు.

## గణములు

పుబ్బ, పూర్వాషాఢ, పూర్వాభాద్ర, ఉత్తర, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర, భరణి, రోహిని, ఆర్ద్రయు నివి మనుష్యగణము. హస్త, రేవతి, పునర్వసు, పుష్యము, స్వాతి, మృగశీర్ష, శ్రవణము, అశ్విని, అనురాధయు దేవగణము, కృత్తిక, ఆశ్రేష, మఘ, చిత్ర, విశాఖ, జ్యేష్ఠ, మూల, ధనిష్ఠ, శతభిషక్కు, నివి రాక్షసగణము. దంపతుల నక్షత్రములకు గణమొక్కటియైనచో శుభము. దేవమనుష్యగణము లైనచో మధ్యమము, దేవరాక్షసగణములైనచో వైరము, రాక్షస మనుష్యగణములైనచో మరణము, కనుక మనుష్య రాక్షసులకు వివాహముఁగూడదు, అందు గుణములు గణమేకమైనచో నారుగుణములు. వరుఁడు దేవగణము, కన్య మనుష్యగణమైనచో నారుగుణములు. వరుఁడు దేవగణము, కన్య మనుష్యగణమైనచో నారుగుణములే, వరుఁడు రాక్షసుఁడు కన్య దేవగణమైన యెడ నొక గుణము, వరుఁడు దేవగణము, కన్య రాక్షసగణము నైన యెడ గుణమొకటియు లేదు. మనుష్య రాక్షసగణములైనను గుణములేదు.

## గుణములు రాశికూటము

రెండు పండ్రెండు కూటమైనచో నిర్ధవత్వము తొమ్మిదవదియు నైదవదియు నగుచో పుత్రులు గలుగరు, ఆరవదియు నెనిమిదవదియు నగుచో మరణమైనను విపత్తియైనను గలుగును, రెండును సప్తమములైనను తృతీయము నేకాదశమునైనను, నాల్గవది పదియవదియునైనను శుభము, నక్షత్ర మొకటియైనపుడు పాదభేదమున్నచో శుభము, అపుడు రాశియేకమైనచో నధికశుభము, రాశిభేదమున్నను కూటదోషము లేదు. నక్షత్రము వేరుగను రాశి యేకముగనైనచో శుభము. అపుడు నాడీగణాది దోషము లేదు. పాదైక్యమందు షట్కాష్టకము వర్జింపవలెను. ద్విద్వాశము నవపంచ మమునైనచో మధ్యమము, తక్కినదానియందు శుభమే, అందు గుణములు మంచి కూటమైనయెడ నేఁడు గుణములు, దుష్టకూటమందు గ్రహమైత్రియున్నచో నాల్గు గుణములు, లేనిచో నొకగుణము, పాదైక్యమున్నచో గుణమే లేదు.

## నాడీవిచారము

అశ్విని, ఆర్ద్ర, పునర్వసు, ఉత్తర, హస్త, జ్యేష్ఠ, మూల, శతభిషక్కు, పూర్వాభాద్ర, యనునివి ప్రథమనాడి. భరణి, మృగశీర్ష, పుష్యము, పుబ్బ, చిత్ర, అనురాధ, పూర్వాషాఢ, ధనిష్ఠ, ఉత్తరాభాద్రయు,నివి మధ్యమనాడి. కృత్తిక, రోహిణి, ఆశ్రేష, మఘ, స్వాతి, విశాఖ, ఉత్తరాషాఢ, శ్రవణము, రేవతి, యనునివి చరమనాడి, అందునాడి యేకమైనచో మృత్యువు. నాడిభేదమున్నచో నెనిమిదిగుణములు. నాడ్యైక్యము నన్ని విధములను వర్జింపవలెను. శూద్రాదులకు పార్శ్వైకనాదులు రెండైనచో నిర్బంధమందు శుభము. ఇక్కడ వర్ణవశ్యభకూట యోనికూటములు స్వల్పగుణములగుటచే వివాహ ప్రతిబంధకములు గావు గనుక నిరూపింపఁబవు. అపుడు గుణములన్నియుఁ గలిపి నచో నిరువది యైనయెడ మధ్యమము. అంతకు నెక్కుడైనచో నధికశుభము. ఇరువదికి దక్కువయైనచో నశుభము.

## వధూలక్షణము

"అనన్యపూర్వికాం కాంతా మపసిండాం యవీయసీం, అరోగిణీం భ్రాతృమతీ మసమానార్ష గోత్రజాం" అనుయాజ్ఞ వల్క్యాది వచనమందు కన్యావిశేషణములలో కాంతత్వము రోగరాహిత్యత్వము భ్రాతృమత్వముఁగాక తక్కినవిశేషణములు లేనిచో నిహపరలోకములందు పతితత్వము గల్గును. గనుక వానివిచారము విస్తరింపఁ బడును. అందనన్యపూర్విక యనఁగా బురుషాంతరసంబంధము లేనిదని యర్థము. అట్టిసంబంధ మేడువిధములు. ఎట్లనిన, మనోదత్త, వాచాదత్త, అగ్నిప్రదక్షిణముఁ జేసినది. సప్తపదములుఁ ద్రొక్కింపఁ బడినది. భోగింపఁబడినది. గర్భిణియైనది. ప్రసవించినదియు నని. యట్టి సప్తవిధసంబంధములులేనిది యనన్యపూర్విక యనఁ బడును. అయినను అందు సప్తపద విధికిమున్ను మూఁడు విధముల సంబంధము వారికిని నిర్బంధమందు తిరుగ వివాహము కావచ్చును. కాని సప్తపదీవిధి అయిన పైని బలాత్కారముచే నైన వివాహమైనప్పటికిని మరియొకనికి వలనుగాదు.

## అసపిండనిర్ణయము

అసపిండాం అనఁగా సమానమైన ఏకమయిన పిండదానక్రియగాని కూటస్థుని శరీరముగాని కలది సపిండ యనఁబడును. అట్లుగానిది యసపిండ. ఇక్కడ "లేపభాజ శ్చతుర్థాద్యా స్త్రాద్యాః పిండభాగినః, పిండదస్సప్తమస్తేషాం సాపిండ్యం సాప్తపౌరుషం" అని మాత్స్య వచనము వలన ననఁగా ముత్తాతకు పైవారలు ముగ్గురు లేపమనఁ గా పిండశేషకణములు వాని బొందువారు తండ్రి మొదలుకొని ముత్తాతవఱకు ముగ్గురుపిండముల బొందేవారు. అట్టి పిండలేపముల నిచ్చువాఁడు సప్తమ పురుషుఁ డు కనుక నొక్కపిండదానక్రియలో దాతృత్వము పిండభాక్త్వము లేపభాక్త్వమునని యొక సంబంధముచే బ్రవేశించుట నిర్వాప్య సాంపిండ్యమని కొందఱిమతము. కనుక స్త్రీలకును సమానాధికార మున్నందున సాపిండ్యము సిద్ధించును. మూలపురు షుని శరీరావయవములు సంతతికిఁ గలియును గనుక నవయవసాపిండ్యమని రెండవ మతము. విచారింపఁగా నీమతమందు భ్రాతృభార్యలకు పరస్పరము నిట్టి సాపిండ్యము సంభవించదు. అయినను భ్రాతృద్వారాగా నేక శరీరావయవముల కాధారమగుటచే సాపిండ్యవ్యవహారాముఁ గలుగవచ్చునని తెలియునది. అయిన నీ రెండుమతములందును గయాక్షేత్రాదులందు మిత్రాదులకు సహితము పిండభాక్త్వ మున్నది. ఏకశరీరాంశలుఁ గలిగియుట సప్తమపురుషునిఁదాటి నూటికిపైనిగూడ యుండవచ్చును. గనుక నతిప్రసంగము సంభవించునుగాని దాని నీవచనముచే నివారించుకొనవలెను. ఎట్లనిన "వధ్వారస్య వాయతః కూటస్థాద్యదిసప్తమః పంచమీ చేత్తయోర్మాతా తత్సాపిండ్యం నివర్తతే" యని అనఁగ వధువుయొక్క గాని వరుని యొక్కగాని తండ్రి కూటస్థునికి సప్తముఁడైనను లేదా వారితల్లి కూటస్థుని కైదవ దైనను సాపిండ్యము నివర్తించునని యర్థము. కాఁబట్టి మాతృత్వపితృత్వాది సంబంధ ముండెనేని సాపిండ్యము అదియును పంచమ సప్తమ పురుషపర్యంతమే యని

రెండింటియందు నియమింపఁబడినందున నతిప్రసంగమురాదని తాత్పర్యము. కాఁబట్టి పితృద్వారకమైన సాపింద్యము విచారింపుచో సప్తమపురుషునివద్దనుండి నివర్తించును. మాతృద్వారకముగ సాపింద్యము జూచిన బంచమపురుషుని నుండి నివర్తించును. అందులకు నుదాహరణములు. "విష్ణోర్మాలా త్కాంతి గౌర్యౌ జాతౌతాభ్యాం సుధీకరౌ, బుధమైత్రౌ చైత్రశివౌ గణభూపౌ మృడాచ్యుతౌ. 1. తజ్జాతయో సోమ మైత్రౌ సుధీబుధౌ. 2. తాభ్యాంశ్యామారతీతజ్జశివగౌర్యోః కరగ్రహః, విష్ణోర్మాలాద్దత్త చైత్రౌ సోమమైత్రౌ సుధీ బుధౌ 3. తాభ్యాం శ్యామా నర్దఆచ శివకామౌ రమాకవీ, మండూకప్లుతి సాపింద్యం రమా కవ్యోర్వివాహహృత్. 4. విష్ణోర్మాలాద్దత్త చైత్రౌ సోమమైత్రౌ సుధీబుధౌ. శ్యామశివౌ కాంతిహరౌ హరకాంతీ న దంపతీ. 5. నివృత్తుమప్యేకతస్త దన్యతస్త్వనువర్తతే, దీజ్మాత్రేణో దాహృతాత్రసేయం సాపింద్యపద్ధతిః 6. కూటస్థు డనఁగ మూలపురుషునికై దవవారైనకన్యకల సంతతికి మాతృద్వారకమగుటచే సాపింద్యము నివర్తించును. అట్టి కన్యల పుత్రులగు వారి సంతతికి బితృద్వారక మైనందున సాపింద్యము నివర్తింపదు. కనుక నిది మండూకప్లుతిసాంపింద్య మనఁబడును. ఏమనిన-కప్పదాటువలె మధ్యమందు కన్యలకు సంతతియందు నివర్తించి వారి సంతతికిఁ దిరుగవచ్చినందున నట్లు వ్యవహరింపఁబడినది. మూలపురుషుని కైదవదియైకన్యకు బుత్రుఁడగు నారవవానికిఁ బంచమాదులు సపిండులు కారు. ఏమనిన మాతృద్వారకమగుటచే నది పంచమపురుషునితో నివర్తించును. గాని, రెండవ సంతతి. జ్తీలో పంచమషష్ఠాదులకు పితృద్వారకమగుటచే వారి కిఁతడు సపిండుడు గాకతప్పదు. మీద వ్రాసిన శ్లోకములలో జూపినయుదాహరణము లీదిగువ వ్రాయఁబడును.

## గోత్రప్రవర నిర్ణయము

విష్ణువు మూలపురుషుఁడు

| | |
|---|---|
| కాంతి - 2 | గౌరి - 2 |
| సుధి - 3 | హరుడు - 3 |
| బుధుడు - 4 | మైత్రుడు 4 |
| చైత్రుడు - 5 | శివుడు - 5 |
| గణుడు - 7 | భూపుడు - 6 |
| మృడుడు - 7 | అచ్యుతుడు - 7 |
| రతి - 8 | కాముడు - 8 |

ఇక్కడ నెన్మిదవవారగు రతి కాములకు వివాహము జేయ వచ్చును.
పితృద్వారక సాపింద్యముతిరుగవచ్చినది.

మూలపురుషుఁడు విష్ణువు

| | |
|---|---|
| దత్తుడు - 2 | చైత్రుడు - 2 |
| సోముడు - 3 | మైత్రుడు - 3 |
| సుధి - 4 | బుధుడు - 4 |
| శ్యామస్త్రీ - 5 | రతి-స్త్రీ - 5 |
| శివుడు - 6 | గౌరి స్త్రీ - 6 |

ఇక్కడ నారవవారైన గౌరీశివులకు వివాహము మాతృద్వారక మగుటచే సాపింద్యము నివర్తింనది.

మూలపురుషుఁడు విష్ణువు

| | |
|---|---|
| దత్తుడు - 2 | చైత్రుడు - 2 |

మూలపురుషుఁడు విష్ణువు

| | |
|---|---|
| దత్తుడు - 2 | చైత్రుడు - 2 |

| | |
|---|---|
| సోముడు - 3 | మైత్రుడు - 3 |
| సుధి - 4 | బుధుడు - 4 |
| శ్యామ - 5 | నర్మద - 5 |
| శివుడు - 6 | కాముడు - 6 |
| రమ - 7 | కవి - 7 |

ఇక్కడ రమకు కవికి వివాహము లేదు. మందూకప్లుతిచే సాపిండ్యము తిరుగ వచ్చినది.

| | |
|---|---|
| సోముడు - 3 | మైత్రుడు - 3 |
| సుధి - 4 | బుధుడు - 4 |
| శ్యామ - 5 | శివుడు - 5 |
| కాంతి - 6 | హరుడు - 6 |

ఇక్కడ కాంతి హరులకు వివాహము గూడదు. సాపిండ్య మొకవైపు నివర్తించి నను మరియొక వైపున ననువర్తించినది.

ఇట్లు కూడటస్థుఁడు మొదలుకొని యష్ట మాదులకును కూటస్థుని మొదలుకొని ద్వితీయ తృతీయాదులకును నొకవైపున నివృత్తియు రెండవవైపున ననువృత్తియు నూహించునది. ఇట్లు లాశౌచమందును నొకవైపున నివృత్తి మొదలగునవియన్నియు యథా సంభవముగ నూహింపవలెను. ఇట్లు పితృద్వారక సంబంధముచే సాపిండ్యము సప్తమ పురుషునిపై నివర్తించును. మాతృద్వారక సంబంధమున సాపిండ్యము పంచమ పురుషునితో నివర్తించునను ముఖ్యపక్షముచే వర్జింపవలసిన కన్యకల సంఖ్యయింతని జెప్పవచ్చును. ఎట్లనిన. పితృకులమందు రెండువేల పదార్గురు 2016, మాతృకుల మందు నూటైదుగురు 105-రెండు సంఖ్యలు గలపిన మొత్తము రెండువేలనూట యిరువదొకటి యగును. ఇట్లు లెక్కించుటకు మూలశ్లోకములు వాటి వ్యాఖ్యానమును కౌస్తుభమందుఁ దెలియునది, బాలురకు బోధింప శక్యముగాదని యిచట వ్రాయలేదు, కనుక ముఖ్య కల్పము ననుసరించి యిందరకన్యకలను విడువనేవలెను గాని యను కల్పముఁబట్టి సప్తమమునకు బంచమమునకును లోపున వివాహముఁ జేయఁ గూడదు. ఇట్లు నిషేధవచనములు "పంచమే సప్తమే చైవ యేషాం వైవాహికీ క్రియా, క్రియాపరా అపిహితే పతితా శ్శూద్రతాం గతాః, సప్తమా త్పంచమాద్ధీమాన్ యః కన్యా ముద్వహేద్ద్విజః, గురుతల్పీనవిజ్ఞేయ స్స గోత్రాం చైవ ముద్వహన్" అని మొదలగు స్మృతివచనములు అనఁగా పంచమ సప్తమములలో వివాహము చేయువారు మిగుల కర్మఠులైనప్పటికిని బతితులై శూద్రత్వము నొందినవారే యనియు పితృతస్సప్తమములోగాను మాతృతః పంచమములోగా నున్న కన్యను వివాహమైనవాఁడు గురు తల్పపాపముఁజేసిన మహాపాతకునితో సముఁడు సగోత్రకన్యను బెండ్లి యాడిన నట్లనే యగుననియు నర్థము. ఇఁక "చతుర్థీ ముద్వహేత్కన్యాం చతుర్థః పంచమోపరః, తృతీయాంవా చతుర్థీంవా పక్షయో రుభయోరపి." అను మొదలగు వచనములున్నవిగాని వాటిలో గొన్ని నిర్మూలములు, కొన్ని దత్తకుఁడు సవతికొడుకు మొదలగువారి విషయమని విప్రులకును లేదా క్షత్రియాదుల సాపిండ్య విషయముగ నూహించునది యని నిర్ణయసింధు మతము, కౌస్తుభమందు మాత్రము, "ఉద్వహే త్సప్తమాదూర్ధ్వం తదభా వేతు సప్తమీం, పంచమీం తదభావేతు పితృపక్షేష్వయం విధిః. సప్తమీం చ తథాషష్ఠీం పంచమీం చ తథైవచ, ఏవ ముద్వాహయేత్కన్యాం

నదోష శ్శాకటాయనః తృతీయాం వా చతుర్థీం వా పక్షయోరుభయోరుభయోరపి, వివాహయేన్మనుః ప్రాహ పారాశర్యోయ మోంగిరాః, యస్తుతేశాను రూపేణకులమార్గేణ చోద్వహేత్, నిత్యం సవ్యవహారస్స్యా ద్వేదాచ్చై తత్రప్రతీయతే” యని మొదలగు వచనములు చతుర్వింశతి మతమందును షట్త్రింశన్మతమందును గనంబడుచున్నందున, సాపిండ్యము సంకోచపరచి వివాహముం జేయుట బహుదేశములందు నడచుచున్నందునను దనకులమందుగాని దేశమందుగాని యనుకల్పముగ సాపిండ్య సంకోచమాచారమైయున్నచో నట్లు వివాహము దోషముకొరకు గాదు. అట్లుగాక స్వకులదేశ విరుద్ధమైనడచునపుడట్టి వివాహము నిషిద్ధమే యగును. కనుకనే “జనపదధర్మాగ్రామ ధర్మాశ్చతాన్ వివాహే ప్రతీయాత్, యేనాస్యపితదో యాతాయేనయా తాఃపితామహాః తేన యాయాత్సతాంమార్గం తేన గచ్ఛన్నదుష్యతి” యని మొదలగు వచనములు వివాహమందు స్వకులదేశాచారమునకు విరోధము లేకుండగ శాస్త్రము ననుసరింపవలెనని విధింపుచున్నది. ఇట్లు మేనమామకూతురి వివాహమందు నూహించునది. ‘తృప్తాం జుహు రాతులస్యేవ యోషాభాగస్తే పైతృష్వసేయీ వపామివ’ యను మంత్రలింగములచేతను “మాతులస్య సుతామూఢ్వా మాతృగోత్రాం తథైవచ, సమానప్రవరాం చైవ త్యక్త్వా చాంద్రాయణం చరేత్” అను నిషేధవచనములకు బాధతమగుటచేత మాతలకన్యా పరిణయము తనకులమందు బరంపరాప్రాప్తమైనచో జేయవలెను. “గోత్రాన్మాతు స్సపిండాచ్చ వివాహో గోవధస్తథా” యని కలివర్జములలో మాతులకన్యాపరిణయమును బఠించుటయు నది కులాచారమై ప్రాప్తించనివారికని యూహించవలెను. మాతులకన్యా వివాహమనేక శ్రుతిస్మృతి విహితము. కనుకనే యట్టి వివాహమాడినవానిని శ్రాద్ధమందు నిమంత్రణముం జేయఁగూడదను నిషేధము గూడ గులాచార ప్రాప్తముగాని వివాహము పరమనియే యూహించునది. కనుక సిద్ధాంతపక్షమైన పంచమసప్తమ పర్యంతమైన సాపిండ్యమును తగ్గించి యాలోపున వివాహములు చేసుకొనివారిని బాహాటముగ శ్రాద్ధమందు నిమంత్రణముం జేయుట సర్వదేశములందాచారమై యున్నది. అని యిట్లు విశేషముగ నుపపాదనము చేయఁబడినది గాని సాపిండ్య సంకోచముం జేసినప్పటికిని యెన్నోవాఁడు యెన్నో కన్యను వివాహమాడవచ్చునో యెన్నోవాఁడు పెండ్లియాడ గూడదో అది నిర్ణయించి కౌస్తుభమందుఁ జెప్పలేదు. ఇక సాపిండ్యదీపికా కారుడు మొదలగు నవీనులు. “చతుర్థీము ద్వహేత్కన్యాం చతుర్థః పంచమోవరః, “పారాశర్యమతేషష్ఠిం పంచమోనతు పంచమీం” అని మొదలగువచనములకు సప్రమాణత్వము నంగీకరించి యశక్తులిబ్బందిలో నంగీకరింపఁదగిన సాపిండ్య సంకోచమునకు వ్యవస్థను జెప్పిరి. అది యెట్లనిన–నాలుగువకన్యకను మాతృపక్షమందు బితృపక్షమందును నాల్గవవాఁడు గాని యైదవవాఁడు గాని వివాహ మాడవచ్చును. రెండవవాఁడు మూఁడవవాఁడు నారవవాఁడు మొదలగువారు నాల్గవకన్యను బెండ్లాడఁగూడదు. పరాశరమతమందుఁ బంచమపురుషుఁ డారవకన్యను వివాహమాడవచ్చును. రెండవవాఁడు మూడవవాఁడు నాల్గవవాఁడు మొదలగువారు షష్ఠకన్యను బెండ్లాడఁగూడదు. మఱియు నైదవ

వాఁడు నైదవకన్యను గూడదు. "మాతృతః పితృతశ్చాపి షష్ఠషష్ఠీం సముద్వహేత్" అను మఱియొక వచనమువలన నారవవాఁడు నారవకన్యను వివాహమాడవచ్చును. అనఁగా నైదవవాఁడు నారవవాఁడు దప్ప నితరులారవ కన్యను వివాహమాడగూడ దని తాత్పర్యము. ఇట్లు పితృపక్షమందు సప్తమ కన్యయు మాతృపక్షమందు నైదవ కన్యయు మూఁడవవాఁడు మొదలుగ నందఱచే వివాహ మాడబడవచ్చును. అట్లు వ్యాసవచనము "పితృపక్షాచ్చ సప్తమీం మాతృపక్షాచ్చ పంచమీం" అని మఱియు "ఉత్వహేత్సప్తమాదూర్ధ్వం తదభావేతు సప్తమీం" పంచమీం తదభావేతు పితృపక్షే ప్యయం విధిః" అని చతుర్వింశతి మతవచనము నున్నది. తండ్రివంక నైదవకన్యక మూఁడవవాఁడు మొదలగువారిచే బెల్లాడవచ్చును. అయినను దండ్రివంకనుగాని తల్లివంకనుగాని యైదవకన్య నైదవవాఁడు పెల్లాడఁగూడదు. ఏమనిన–"పంచమో నతు పంచమీం" అని పక్షద్వయమందు నిషేధమున్నది. ఇఁక "తృతీయాంవా చతుర్థీంవా పక్షయోరుభయోరపి" యను వచనమున్నందున మూఁడవకన్య గూడ వివాహమాడవచ్చునని ప్రాప్తించుచున్నది. అందు వ్యవస్థఁ జేయఁబడును. తల్లివంకను మూఁడవకన్య యనఁగ మేనమామకూతురుగాని పినతల్లికూతురుగాని యర్థమగు చున్నది. ఇట్లు తండ్రివంకను మూఁడవకన్య యనఁగ పినతండ్రి కూతురుగాని మేనత్త కూతురుగాని యర్థమగుచున్నది. అందు పినతండ్రి కూతులు సగోత్రురాలు గనుక వర్జింపవలెను. "పైతృష్వసేయీం భగినీం స్వస్త్రీయాం మాతురేవచ, ఏతాస్తి ప్రస్తుభార్యార్థే నోపయచ్ఛేత బుద్ధిమాన్" అని మనువచనమున్నందున అనఁగా మేనత్త కూతురిని తల్లి చెలియలిని నాబిడెకూతురిని ననఁగా పినతల్లికూతురిని నీముగ్గురను వివాహమాడగూడదని యర్థముగల మనువచనమువలన మేనత్తకూతురి వివాహము నిషిద్ధమైనది. ఇఁక మేనమామ కూతురొక్కతె మిగిలినది. అది మీఁద జెప్పినటుల కులపరంపరాచారమున్నయెడ వివాహమాడవచ్చును. కనుక మూఁడవ కన్య మేన మామకూతురే దానిని మూఁడవవాఁడే వివాహమాడవలెనని తాత్పర్యము. గనుక నాల్గవవాఁడు మొదలగువారు గూడదు కొందరు మేనత్తకూతురినిగూడ నిబ్బంది యగునపుడు వివాహమాడవచ్చునందురు. అది దేశకులాచారాదివ్యవస్థలో గ్రహింప వలెను. ఇట్లు సాపిండ్య దీపికాదులచే నిర్ణయింపఁబడినయర్థము సంక్షేపముగఁ జూపఁబడును. ఎట్లనిన–మూఁడవకన్య యనఁగ మేనమామకూఁతురే వివాహము చేసుకొనఁదగినది. నాల్గవకన్యను నాల్గవవాఁడు నైదవవాఁడు నీయిద్దరే వివాహమాడ వచ్చును. ఐదవకన్య నైదవవాఁడు తప్పఁ దక్కిన మూఁడవవాఁడు మొదలుకొని యేఁడవ వానిపర్యంతమందురును వివాహమాడవచ్చును. ఆఱవకన్య నైదవవాఁ డు నాఱవ వాఁడు నీయిద్దరే పెల్లాడవలెను. ఏడవకన్యను మూఁడవవాఁడు మొదలుగ నేఁడవవానిపర్యంత మందు వివాహ మాడవచ్చును అని యిట్టి సాపిండ్య సంకోచము నిబ్బందిలో నశక్తుఁ డంగీకరింపవచ్చును. మఱియొక కన్య లభించనపుడు సమర్థుఁ డంగీకరింపఁగూడదు. ఏమనిన–గురుతల్పాది దోషము వచ్చునని స్మృతి వచనము లున్నవనికూడ వ్రాయఁబడినది. గనుక సాపిండ్యసంకోచ మశక్తపక్షమని తెలియఁ

బడును. మఱియును "ప్రభుః ప్రథమకల్పస్య యోనుకల్పేన వర్తతే, సమాప్నోతి ఫలం చేహ" యని సమర్థుఁడనుకల్పముచే నడచినచో దోషము గూడఁ జెపఁబడినది. దత్తకునిసాపిండ్యము దత్తకవిధిలో మున్నే చెప్పఁబడినది. ఇఁక సవతి తల్లికులమందు సాపిండ్యప్రకారమును సుమంతుఁడు చెప్పెను. ఎట్లనిన–"పితృపత్న్య స్సర్వా మాతరః తద్భ్రాతరో మాతులాః తద్భగిన్యో మాతృష్వసారః తద్దుహితరశ్చ భగిన్యః తదపత్యాని బాగినేయాని. అన్యథాసంకర కారిణస్యుః" అని. ఇక్కడ గొందరు లక్షణచే సవతితల్లి కులమందు నాల్గుపురుషుల పర్యంతము సాపిండ్యము వివాహనిషేధమునకు మాత్రము విధింపఁబడినదండ్రు. ఇతరులు వివాహమాత్రమునకే యనుటకు ప్రమాణములేదు. ఆశౌచము మొదలగువాటి విషయముగూడ సంభవింపవచ్చును. "యావద్వాచనికం ప్రమాణ" మను న్యాయముచే సూత్రమందు లెక్కఁబెట్టినవారి విషయమే సాపిండ్యమని చెప్పిరి. కనుక సుమంతువాక్యములందు తాత్పర్యముఁబట్టి యనేక వాక్యార్థములు సిద్ధించును. ఎట్లనిన; పితృపత్న్య స్సర్వామాతరః' అను ప్రథమ వాక్యమున సవతితల్లిని తనతల్లివలె గౌరవించుటయు సవతితల్లి జపించచో మాతృవధ ప్రాయశ్చిత్తము జేసుకొనవలెననియు సవతితల్లితో సంగమము జేసినచో మాతృగమన ప్రాయశ్చిత్తము గావలెననియు మొదలగునవి యతిదేశింపఁబడినది. కాని యతిక్రాంతాశౌచమున దశాహాశౌచ మతిదేశింపఁబడదు. ఏమనిన; త్రిరాత్రమే యాశౌచమని విధియున్నది. 'తద్భ్రాతరోమాతులాః' అను ద్వితీయవాక్యమున సవతి తల్లి సోదరులు మేనమామలే యగుటయు నందువలన వచ్చు నాశౌచము మేనమామకు దనచెలియలి సవతికూతుని వివాహనిషేధము నతిదేశింపఁబడినది. ఇక్కడ సవతితల్లి సోదరునికి మాతులత్వము నతిదేశించినను నతనిపుత్రులు మొదలగువారికి మాతులపుత్రత్వాదుల నతిదేశింపలేదు. కనుక బంధుత్రయములో వారివలన సంభవించు నాశౌచము వీరివిషయమై యక్కఱలేదు. మాతులకన్యా వివాహమందలి విధియు నిషేధమును సవతితల్లి సోదరునికూతులకు లేదు. ఇట్లు మాతలకన్యాదులందుఁ దండ్రికి భగినియౌట నతిదేశింపలేదు. గనుక నతినపుత్రునికి మేనత్తయగుటయు నతిదేశింపఁబడదు. 'తద్భగిన్యో మాతృష్వసారః' అనువాక్యమందును సవతి తల్లి చెలియండ్రయందు పినతల్లు లగుటయు నందులకు సంభవించు నాశౌచార్హతయు వివాహనిషేధము గూడ నతిదేశింపఁబడినది. వారి పుత్రులందు పినతల్లి పుత్రులగుట నతిదేశింప కుండుటచే నాపుత్రులకు బంధుత్రయాంతర్గతత్వము లేదు. మఱి సవతి తల్లి చెలియలికూతుని వివాహమాడవచ్చునా? యనిన; నందు వావిరుద్ధమైనందున గూడదని ముందుఁ జెప్పఁబడును. 'తద్దోహితరోభగిన్యః' అనువాక్యమందును సవతితల్లి కూతులను తన సాక్షాత్సోదరినివలె మన్నింపవలెననియు నందులకుఁ దగిన యాశౌచార్హతయు నతిదేశింపఁబడినది. ఇక్కడ వివాహ ప్రసంగమునకు సంభవమే లేదు. సగోత్రకన్యకలని తెలిసియున్నది. మఱియు నిట్టి సవతి మేనమాకు సవతి సోదరునికి సవతి పినతల్లికి సవతి చెలియలకును సాక్షాన్మాతులసోదర భ్రాత్రాదులదర్పణముచేసిన పైని దర్పణమును మహాలయాది శ్రాద్ధములం దుద్దేశమును

నీవచనములచేతనే యతి దేశింపఁబడుచున్నదని తోఁచుచున్నది. 'తదపత్యాని భాగినే యాని' యనువాక్యమునను సవతిచెలియలి సంతతియందు మేనల్లుఁడగుటయు మేన గోడంౘ్రగుటయు నందు సంభవించు నాచౌచార్త్వతయు వివాహనిషేధము నతి దేశింపఁబడినది. ఇట్లు సవతి చెలియలి కూతులందు భాగినేయీత్వ మతిదేశించి నను వారికూతులందు భాగినే యీ కన్యాత్వము నతిదేశింపలేదు. 'యావదుక్తప్రమా ణం' అని న్యాయమనఁగా, సూత్రవాక్యమువలన స్వరసముగఁజెప్పఁబడినదే ప్రమాణ ముగాని యూమించునది గాదనుట. ఒకానొకచో సాపిండ్యము లేకున్నను విషేధ వచనమువలన వివాహములేదు. ఎట్లనిన; "అవిరుద్ధ సంబంధా ముపయచ్ఛేత" అని. అనఁగా వావి విరుద్ధమైనచో వివాహము గూడదనుట దంపతులకు పరస్పరము తలిదండ్రుల వావిరుద్ధ సంబంధము. ఎట్లనిన; భార్య చెలియలికూఁతురు దనకు గూతురగును. పినతండ్రి భార్యచెలియలు దనకుఁ దల్లియగును. ఇట్లు పరశిష్టమందుఁ జెప్పఁబడినది. బౌధాయనుఁడు చెప్పుచున్నాఁడు–"మాతుస్సపత్న్యా భగినీం తత్సుతాం పరివర్జయేత్, పితృవ్యపత్నీ భగినీం తత్సుతాంచ వివర్జయేత్" అనఁగా సవతితల్లి చెలియలిని యామెకూఁతును పినతండ్రి భార్య చెలియలిని యామె కూతును బెండ్లాడఁ గూడఁదని యర్థము. కొందఱు జ్యేష్ఠ భ్రాతపితృసముఁడు గావున నతని భార్య చెలియలిని పినతల్లి వావియగుటచే వివాహ మాడగూడ దనిరి. 'ఇట్లసపిండాం' అను విశేషణమున కర్థము. ఇఁక 'యవీయసీం' అనఁగా దనకంటె వయసుచేతను శరీరముచేతను దక్కువయుండవలెను. 'అసమానార్షగోత్రజాం' అనఁగా దనకుసమాన మైన యార్షమనఁగా ప్రవరము గోత్రము గలవానికిఁ బుట్టినది కాకుండ వలెననుట. అనఃగా తనకు భిన్న గోత్రమందును భిన్న ప్రవరమందును బుట్టినదాని వివాహ మాడవలెనని యర్థము. ఇఁక సంక్షేపముగ గోత్రప్రవరనిర్ణయముఁ జెప్పఁబడును.

గోత్రలక్షణము :– "విశ్వామిత్రో జమదగ్ని ర్భరద్వాజోథ గౌతమః, అత్రిర్వసిష్ఠః కశ్యప ఇత్యేతే సప్తఋషయః" అనఁగా నీ యేడుగురును నగస్త్యునితో నెనమండ్రు. వీరి సంతతి గోత్రమనఁబడును. అయినను వీరిలో భృగువు అంగిరసుఁడును లెక్కింపఁబడనందున కేవలభార్గవులైన యార్ష్టి షేణుఁడు మొదలగువారియందును కేవలాంగిరసులైన హరితాదులందును నీగోత్ర లక్షణము పట్టదుగాని ప్రవరైక్యమగుట చేతనే వివాహము గూడదని చెప్పవచ్చును. విచారింపఁగా "గోత్రాణాం తు సహస్రాణీ ప్రయుతాన్యర్బుదాని చ" యనినట్లు గోత్రము నంతములుగ నున్నవి. అయినను వాని తరగతులు నలుబదితొమ్మిదే గానఁబడుచున్నవి. ఎట్లనిన; అట్టి భేదములకు జ్ఞాపకమైన ప్రవరభేదములన్నియే గనఁబడుచున్నది. ప్రవరలక్షణమేమనిన గోత్రవంశ ప్రవర్తకులైన ఋషులకు భేదముఁజూపెడు ఋషి విశేషులు ప్రవరులని సంక్షేపముగ దెలియునది. కనుక సమానగోత్రత్వము సమాన ప్రవరత్వమును వేరువేరుగ వివాహ ప్రతిబంధములని తెలియునది. అందు ప్రవరసామ్యము రెండువిధములు. ఏకప్రవర సామ్యము ద్విప్రవరసామ్యమునని, అందు భృగ్వంగిరోగణములుతప్ప నితరగణము లందునేక ప్రవసామ్యముగూడ వివాహ ప్రతిబంధకము. కేవలభృగుగణమందును

గేవ లాంగి రోగణమందు నేకప్రవరసామ్యము వివాహమునకు బ్రతిబంధకముగాదు. మఱియేమనిన; త్రిప్రవరములందు ద్విప్రవరసామ్యమును బంచప్రవరములందు ద్విప్రవరసామ్యమును వివాహబాధకము. ఇట్లు వచనము– "పంచానాం త్రిషు సామాన్యా దవివాహ స్త్రిషు ద్వయోః, భృగ్వంగిరోగణేష్వేవం శేషేష్వే కోపివారయేత్" అని. అనఁగ గేవలభృగ్వంగిరోగణములు దప్ప దక్కిన గణములందొక ప్రవరసామ్య మున్నను వివాహముఁగూడదని జామదగ్న్య భృగుగణములందును గౌతమాంగిరోగణ ములందును భరద్వాజాంగిరసులందును నేకప్రవరస్యామున్నను ప్రవరసామ్య మేమియు లేకున్నను సగోత్రత్వమునుబట్టియే వివాహనిషేధము.

## గోత్రప్రవరణ గణము

భృగుగణములు ఏడు. అంగిరోగణములు పదునేడు. అత్రిగణములు నాలుగు. విశ్వామిత్రగణములు పది. కశ్యపగణములు మూఁడు. వసిష్ఠగణములు నాలుగు. అగస్త్యగణములు నాలుగు. ఇట్లన్నియు గలసి నలుబదితొమ్మిది. అయినను సకల గ్రంథసమ్మతి సంగ్రహముచేత నధికులవారక్కడక్కడ నిరూపింపఁబడియెదరు. భృగు ణములేడు. యేవనిన; వత్సులు బిదులు ననునీ రెండుగణములు జామదగ్న్యగణములో గూడ జేరును. ఆర్ష్టిషేణులు, యస్కులు, మిత్రయువులు, వైశ్యులు, శునకులు నీయైదును గేవల భృగుగణములు. వెరసి యేడుగణములు. అందు వత్సగణములో మార్కండేయులు, మాండూకేయులు మొదలుగ నూటరెంటికిపైఁగా వత్సగోత్రభేదము లున్నవి. వీని కయిదుగురు ప్రవర ఋషులు. భార్గవ, చ్యావన, ఆప్నవాన, ఔర్వ, జామదగ్న్య అని. భార్గవ, ఔర్వ, జామదగ్న్య అని ముగ్గురైన నుండవచ్చును. భార్గవ, చ్యావన, ప్నవానయని ముగ్గురైన నుండవచ్చును. ఇఁక బిదులలోశైలులు అవటులు నని మొదలుగ నిరువదికిపైఁగా బిదగోత్రభేదములు. వీటికి నైదుగురు ప్రవరులు. భార్గవ, చ్యావన, ఆప్నవాస, ఔర్వ, బైదయని, భార్గవ, ఔర్వ, జామదగ్న్యయని ముగ్గురైన నుండవచ్చును. ఇఁక నార్ష్టిషేణులు నైర్ఋతులు గ్రామాయణులు మొదలుగ నిరువదికిపైఁగా నార్ష్టిషేణగోత్రభేదములున్నవి. వీటికిభార్గవ, చ్యావన, ఆప్నవాన, ఆర్ష్టిషేణ, అనురూపయని యైదుగురు ప్రవర ఋషులు, భార్గవ, ఆర్ష్టిషేణ, అనురూప యని ముగ్గురైన నుండవచ్చును. ఈ మూఁడు గోత్రములవారనఁగ వత్స, బిద, ఆర్ష్టిషేణులకు పరస్పరము వివాహముఁగూడదు. ఇద్దరు ముగ్గురు ప్రవర ఋషులు గలసి యున్నారు. మొదటి రెండు గణములవారును జామదగ్న్యు లగుటచే సగోత్రత్వముగూడ నగును. విచారించినయెడ ద్రిప్రహార్ష్టిషేణులకు వత్సబిదులతో ద్విప్రవర సామ్యములేదు. జామదగ్న్యత్వములేదు. గనుక సగోత్రత్వ మును లేదు. అయినను పంచప్రవరగతమైన ద్రిప్రవరసామ్యమే వీరికి వివాహ ప్రతిబంధకము గావచ్చును. ఇట్లు ముందునుగ్రహించునది. వాత్స్యులకు, భార్గవ, చ్యావన, అప్నవాన యని ముగ్గురు. వత్సపురోధరసునకు భార్గవ, చ్యావన, ఆప్నవాన, వత్స, పౌరోధస యిన యైదుగురు. వైజమధితులకు భార్గవ, చ్యావన, ఆప్నవాన, వైజ మధిత యని యైదుగురు. ఈ మూఁడు గోత్రములు క్వచిత్తుగా నున్నవి.

వీటిలో పరస్పరమును మీఁదఁజెప్పిన వత్సబిదార్ష్టి షేణులు ముగ్గురితోను వివాహముఁ గూడదు. ఏమనిన; త్రిప్రవర సామ్యమున్నది. ఇఁక యస్కులు మౌనులు మూకులు మొదలుగ నేబదిమూఁడిటికంటె నధికముగ యస్కగోత్రభేదములు వీటికి భార్గవవైతహవ్య, సావేతస యని మువ్వురు ప్రవరులు. ఇఁక మిత్రయువులు వైష్ట్యాయనులు సాపిండినులు మొదలుగ ముప్పది కుక్కువ మిత్రయువులు. వారికి భార్గవ వార్ధ్ర్యశ్వదివోక్షస యని మువ్వురు ప్రవరులు. భార్గవ, చ్యావన, దైవోదాస యనియైన నుండవచ్చును. వార్ధ్ర్యశ్వయని యొక ఋషియైన నుండును. ఇఁక వైన్యులు పార్థులు బాష్కలులు శ్యేనులు నని మూఁడుగణములే వీరికి భార్గవ వైన్యపార్థ యని మువ్వురు ప్రవరులు. ఇఁక శునకులు. గార్త్సమదులు యజ్ఞపతులు నని మొదలుగ బదునేడిటి కంటె నధికముగ శునకగోత్రభేదములు. వీటికి శౌనకయని యయినను గార్త్సమద యనియైన నొకడే ప్రవర ఋషి. కొన్నింటికి భార్గవ గార్త్సమద యని మువ్వురైన నుండవచ్చును. ఈ యస్కమిత్రయు దైన్య వునకులను తమతమ గణములనువిడిచి పరస్పరమును మీఁదఁజెప్పిన జామదగ్న్య వత్సాదులతోడను వివాహము గావచ్చును. ఏకప్రవరసామ్య మున్నను ద్విత్రిప్రవరసామ్యము లేకుండుటచే నిషేధము లేదు. భృగుగణములందేక ప్రవరసామ్యము బాధకము గాదని మీఁదఁజెప్పఁబడినది జామదగ్న్యులగుటచే సగోత్రత్వముగూడ లేదు. మిత్రయువులకుఁ మాత్రమొకపక్షమందు ద్విప్రవరసామ్య మున్నందున త్రిప్రవరులైన వత్సాదులతో వివాహము గూడదని కొందరు, ఆ ప్రవర పక్షము గ్రహించువారికి వివాహము లేదు. పక్షాంతరము గ్రహించు మిత్రయువులకు వివాహముఁ గూడునని యితరులచే కొన్నిటిలో రెండు గణములధికముగా జెప్పఁబడినవి. అందువేదవిశ్వజ్యోతిషులకు భార్గవ వేదవైశ్య జ్యోతిష యని ముగ్గురు ప్రవరులు. శాఠరమాఠరులకు భార్గవ శాఠర మాఠర యని ముగ్గురు. ఈ రెండుగణములకు బరస్పరమును మీఁదఁజెప్పిన యందరితోను వివాహము గూడును. ఇట్లేడుభృగుగణములు నిరూపింపఁబడెను. ఇఁక నాంగిరసులు వారు మూఁడు విధములు. గౌతములు, భారద్వాజులు, కేవలులు నని, అందు గౌతమాంగిరసులు పదిగణములు. అయాస్యులు శారద్వతులు కౌమండులు దీర్ఘతమసులు కరేణుపాలులు వామదేవులు ఔశనసులు రాహుగణులు సోమరాజకులు బృహదుక్షులు నని. అందు యాస్యులు శ్రౌణివేధులు మూఢరథులు మొదలుగ బదునెనిమిది కంటె నధికముగను యాస్యగోత్ర భేదములు. వాటికి ఆంగీరస, ఆయాస్య, గౌతమ యని ముగ్గురు ప్రవర ఋషులు. ఇఁక శారద్వతులు అభిజిఉతులు రౌహిణ్యులు మొదలుగ డెబ్బది కంటె నధికముగ శారత్వతగోత్ర భేదములున్నవి. వాటికి ఆంగీరస, గౌతమ, శారద్వత యని ముగ్గురు ప్రవరులు. ఇఁక కౌమండులు మామంథరేషణులు మాసురాక్షులు నని మొదలుగ పదింటి కధికముగ కౌమండగోత్రభేదములు. వాటికి ఆంగీరస, ఔతథ్య, కాక్షీవత, గౌతమ, కౌమండ యని యయిదుగురు ప్రవరులు ఆంగీరస, ఆయాస్య, ఔశిజ, గౌతమ, కాక్షీవత యనియైన నుండును. ఆంగీరస, ఔశిజ, కాక్షీపత యని ముగ్గురైన నుండుదురు. ఆంగీరస, ఔతథ్య, కాక్షీవత యని

యైనను, ఔతథ్య, గౌతమ, కౌమండ యనియైనను, ఇంక దీర్ఘతమసులు గౌతములు వారికి ఆంగీరస, ఔతథ్య, కాక్షీవత, గౌతమ, దైర్ఘతమసయని యైదుగురు ప్రవరులు నుండుదురు. కరేణుపాలులు వాస్తవ్యులు, శ్వేతీయులు మొదలుగ నేడిటికంటె నధిక ముగ గరేణుపాల గోత్రభేదములు. వాటికి ఆంగీరస, గౌతమ, కరేణుపాల యని ముగ్గురు ప్రవరులు. ఇంక వామదేవులకు ఆంగీరస, వామదేవ్య, గౌతమ యని ముగ్గురు ప్రవరులు. ఆంగీరస, వామదేవ్య, బార్హదుక్థ యనియయిన నుండవచ్చును. ఇంక నౌశనసులు దిశ్యులు గోత్రభేదములు వాటికి ఆంగీరస, గౌతమ, ఔశనస యని ముగ్గురు ప్రవరులు. రాహూగణుల కాంగీరస, రాహూగణ, గౌతమ యని ముగ్గురు ప్రవరులు. సోమరాజకులకు నాంగీరస, సోమరాజ్య, గౌతమయని ముగ్గురు ప్రవరులు. బృహదుక్షులకు నాంగీరస, బార్హదుక్థ్య, గౌతమ యని ముగ్గురు ప్రవరులు. ఇట్లు బదిగణముల గౌతములు నొకానొకచో మరి రెండుగణము లధికముగ నున్నవి. ఎట్లనిన; ఉతథ్యుల కాంగీరస ఔతథ్య గౌతమ యనియు, రాఘవుల కాంగీరస, రాఘవ, గౌతమ యనియు ముగ్గరేసి ప్రవరులు. ఇట్ల గౌతమగణముల కన్నిటికిఁ బరస్పరము వివాహముఁ గూడదు. ఏమనిన; సగోత్రత్వ మును దరుచుగ ద్విత్రిప్రవర సామ్యము నున్నది. నంగిరోగణమందు రెండవగణమైన భరద్వాజులు భారద్వాజులు గర్గులు ఋషులు కపులు నని వారు నాలుగువిధములవారు అందు భారద్వాజులు క్షామ్యాయణులు దేవాశ్వులు నని మొదలుగ నూటయరువదికంటె నెక్కుడుగ భారద్వాజ గోత్రభేదములు. వాటికి ఆంగీరస బార్హస్పత్యనులు మొదలుగ నేబదికంటె నెక్కుడుగ గర్గగోత్రభేదము లున్నవి. వాటి కాంగీరస, బార్హస్పత్య భారద్వాజ, శైన్య, గార్గ్య యని యయిదుగురు ప్రవరులు. ఆంగీరస, శైన్య, గార్గ్య యని ముగ్గురైనను ఆంగీరస, గార్గ్య, శైన్య యనియయిన నుండవచ్చును. భరద్వాజ, గార్గ్య, శైన్యయని ముగ్గురైనను గావచ్చును. గర్గభేదులకు ఆంగీరస, తైత్తిర కవిభువ యని ముగ్గురు ఋషులు రౌక్షాయణులు కపిలులు నని మొదలుగ తొమ్మిదికంటె నధికముగ ఋక్ష గోత్ర భేదములు. వాటి కాంగీరస, బార్హసత్య భరద్వాజ, వాందన, మాదవచ స యని యయిదుగురు. ఆంగీరస, నాందన, మాదవచస యని ముగ్గురైనను ప్రవరులు. ఇంక కపులు. స్వస్తితరులు, దండులు నని మొదలుగ నిరవదేనిటి కంటె నధికముగ కపిగోత్రభేదము లున్నవి. వాటి కాంగీరస, అమహయ్య ఔరుక్షయ్య యని ముగ్గురు. ఆంగీరస ఆమహీయవ ఔరుక్షవస యని యాశ్వలాయనపాఠము. మరియు నాత్మభువు లకు ఆంగీరస భారద్వాజ బార్హస్పత్యవర ఆత్మభువ యని యయిదుగురు ప్రవరులు. ఈ గణము క్వాచిత్కము ఇట్టి భరద్వాజ గణముల వారికందరకు బరస్పరము వివా హము గూడదు. సగోత్ర మును దరుచుగ ద్విత్రిప్రవర సామ్యము నున్నది. ఋక్షగణ మందలి కపిలులకు విశ్వామిత్రులతోగూడ వివాహము ఁగూడదు. ఇట్లు భరద్వాజాంగీ రసులు. ఇంక గేవలాంగీరసులు వారారువిధములు. ఎట్లనిన; హారీతులు, కుత్సులు, కణ్వులు, రథీతరులు, విష్ణువృద్ధులు, ముద్గలులు నని. అందు హారీతులు సౌభగులు నయ్యగవులు నని మొదలుగ నిరువదిరెంటికంటె కధికముగ హారీతగోత్రభేదము

లున్నవి. వాటి కాంగీరస అంబరీష యౌవనాశ్వయని ముగ్గురు ప్రవరులు. మొదట మాంధాతను పఠిచుటయు గలదు. కుత్సులకు నాంగీరస మాంధాత కౌత్సయని ముగ్గురు ప్రవరులు. ఇఁక కణ్వులు ఔషమర్కటులు భాస్కలాయనులు నని మొదలుగ నిరువదియొకటి కంటె ఔషమర్కటులు భాస్కలయనులు నని మొదలుగ నిరువది యొకటికంటె నధికముగ కణ్వగోత్రభేదము లున్నవి. వాటికాంగీరస ఆజమీఢకాణ్వ యని ముగ్గురు ప్రవరులు. ఆంగీరస ఘౌర కాణ్వయని యుం గలదు. ఇఁక రథీతరులు హస్తిదులు నైతిరక్షులు నని మొదలుగ పదునాల్గుకంటె నధికము రథీతరగోత్ర భేద ములు వాటికాంగీరస వైరూప రథీతరయని ముగ్గురు ప్రవరులు. ఆంగీరస వైరూప పార్షదశ్వయనియు గలరు. ఆంగీరస పార్ణదశ్వ వైరూపయనియు పఠింతురు. ఇఁ క విష్ణువృద్ధులు శరులు మర్షణులు నని మొదలుగ నిరువదేనిటికంటె నధికములు విష్ణువృద్ధగోత్ర భేదములు వాటికాంగీరస పౌరుకుత్స త్రాసదస్యవ యని ముగ్గురు ప్రవరులు. ఇఁక ముద్గలులు సాత్యముగ్రియులు హిరణ్యస్తంబులు నని మొదలగు పదునెనిమిదికంటె నధికమై ముద్గల గోత్ర భేదము లున్నవి. వాటి కాంగీరస భార్మ్యశ్వ మౌద్గల్య యని ముగ్గురు ప్రవరులు. మొదట తార్క్ష్యయనియు బఠింతురు. ఆంగీరస తావిమౌద్గల్యయనియుఁ గలదు. ఈ యారు కేవాంగిరోగణములకును దమతమ గణమును మాత్రము విడచి పరస్పరమును మీఁదఁజెప్పిన గణములన్నిటితోగూడ వివాహము గావచ్చును. అంగిరోముని మొదట మూలపురుషులగు నెనమండ్రు ఋషుల గలియనందున తత్సంతతులకు సగోత్రము లేదు. ద్విత్రి ప్రవరసామ్యము లేదు. హరితకుత్సగోత్రములకు మాత్రము వివాహము గూడదు. ఏమనిన; నొక పోమందు ద్విప్రవరసామ్య మున్నది. ఇఁక నత్రులు నాల్గువిధములవారు. ఎట్లనిన; ఆత్రులు ఛాందిసంజ్ఞికులు నని మొదలుగ దొంబదినాలుగుకంటె నధికము లత్రిగోత్ర భేదములు. వాటికి ఆత్రేయ ఆర్చనానస శావాశ్వయని ముగ్గురు ప్రవర్తులు. ఇఁక గవిష్ఠిరులు దక్షిసంజ్ఞికులు భలందనులుగ మొదలుగ నిరువదినాలుగు. గవిష్ఠిరగోత్ర భేదములు వాటికి ఆత్రేయ అర్చనాసన గావిష్టిరయని ముగ్గురు ప్రవరులు. ఆత్రేయ గావిష్ఠిర పౌర్వాతిథ యనియైన నుండవచ్చును. ఇఁక వాద్భుతకుల త్రేయ అర్చనానస వాద్భుతక యని ముగ్గురు. ఇఁక ముద్గలులుగాని సంధినామకులు అర్ణవులు నని మొదలుగ బదింటిలోగా ముద్గలగోత్ర భేదములు. వాటికాత్రేయ అర్చనానస పౌర్వా తిథయని ముగ్గురు. క్వచిత్తుగా నతిథులు వామరథ్యులు నినయు సుమంగలులు నీజివాపులు ధనంజయులు నని యైదుగణములు వాడఁబడి యధికముగ నున్నవి. అందు మొదటినాలుగింటికి నాత్రేయ అర్చనానస అతిథయని ముగ్గురు ఆత్రేయ అర్చనానస గనిష్ఠరయనియయిన నుండవచ్చును. సుమంగలులకు అత్రి సుమంగల శ్యావాశ్వయనియు ముప్వురు ప్రవరులు. ధనంజయులకు అత్రేయ అర్చనానస ధనంజయ యనియు ముగ్గురు, ఇఁక బాలేయులు కౌద్రేయులు శౌద్రే యులు వామరథ్యులు మొదలగువారు అత్రికి దౌహిత్రులు వారి కాత్రేయ వామరధ్య పౌత్రీక యని ముప్వురు. ఇట్లత్రిగణము వారికందరకు బరస్పరము వివాహముఁ గూడదు.

ఏమనిన; గోత్రములకు ప్రవరులకు నైక్యమున్నది. అత్రిదౌహిత్రులకు నామరథ్య గణము మొదలగువారికిని వాని నిష్ఠులతోగాని విశ్వామిత్రులతో గాని వివాహముం గూడదు. ఇట్లత్రిగణము ముగిసెను. ఇంక విశ్వామిత్రులు; వారు పది గణములు:– కుశికులు, లోహితులు, రౌక్షకులు, కామకాయనులు, అజులు, కతులు, ధనంజయులు, అఘమర్షణులు, పూరణులు, ఇంద్రకౌశికులు నని, అందు గుశికులు, పర్ణజంఘులు, వారక్యులునని మొదలుగ డెబ్బదికంటె నెక్కుడుగ గుశికగోత్ర భేదము లున్నవి. వాటికి విశ్వామిత్ర, దేవరాత, ఔదల యని ముగ్గురు, ఇంక లోహితులు కుడవక్యులు చక్రవర్ణాయనులు మొదలుగ నైదింటికంటె నధికములు లోహిత గోత్ర భేదములు, రోహితులని కొందరు పఠింతురు. వానికి వైశ్వామిత్రక అష్టక లోహిత యని మువ్వురు, తుదినున్న యిద్దరను వ్యత్యయముగ పఠించియయిన నుండుదురు. వైశ్వామిత్ర మాధుచ్ఛందరాష్ట్రక యనియయినను ముగ్గరే. విశ్వామిత్ర అష్టకయని యిద్దరైన నుండవచ్చును. ఇంక రాక్షసులకు విశ్వామిత్రగార్ధినరైవణ యవి ముగ్గరు. విశ్వామిత్రకాక్షక రైవణయని మువ్వరైన నుండవచ్చును. వీరేరైవణులని మూండవగణ మని యయినను ఇంక కామకాయణులు దేవశ్రసులు దేవతరసులునని మొదలుగ నైదిటిలోగా కామకాయనగోత్ర భేదములున్నవి. కామకాయనులే శ్రౌమతులనియు బఠింపంబడుదురు. వారికివైశ్వామిత్ర దేవశ్రవస దైవతరసయని మువ్వరు. ఇంక నజులకు వైశ్వామిత్రమాధుచ్ఛందస్యా యని మువ్వరు. ఇంక కతులు ఔదుంబరి నామకులు శైశిరినామకులు మొదలుగ నిరువదికెక్కుడు కతగోత్రభేదములు. వాటికి వైశ్వామిత్ర కాత్య అక్షలయని మువ్వరు, ఇంక ధనంజయులు పార్థివులు బంధులులు నని మొదలుగ నేడింటికిలోగా ధనంజయ గోత్రభేదములు వాటికి వైశ్వామిత్ర మాధు చ్ఛందస ధానంజయయని మువ్వరు, వైశ్వామిత్ర మాధుచ్ఛందస అఘమర్షణ యని యయినను ముగ్గరు. ఇంక నెన్మిదవగణమైన యఘమర్షణులకు వైశ్వామిత్ర, అఘ మర్షణకౌశిక యని మువ్వరు. ఇంక దొమ్మిదవగణమగు పూరణులకు వైశ్వామిత్ర పూరణ యని యిద్దరు. విశ్వామిత్రదేవరాత పౌరాణయనియైన నుండవచ్చును. ఇంక బదియవగణ మింద్రకౌశికులు వారికి వైశ్వామిత్ర ఐంద్రకౌశిక యని యిద్దరు. గొన్నింటిలోనింక నన్యమైనపదునొకందుగణము లధికముగ జెప్పంబడినవి. ఎట్లనిన; ఆశ్మరథ్యులు సాహులులు. గాధినులు వైణవులు హిరణ్యరేతసులు సువర్ణరేతసులు కపోతరేతసులు శాలంకాయనులు ఘృతకౌశికులు కథకులు రౌహిణులు నని, అందాశ్మ రథ్యులకు వైశ్వమిత్ర అశ్మరథ్యవాధుల యని మువ్వరు. రెండవగణము సాహులులకు వైశ్వామిత్ర సాహుల మాహుల యని మువ్వరు. ఇంక మూండవగణము గాధినులకు వైశ్వామిత్ర గాధిన రైవణ యని మువ్వరు. వీరే రేణువలనికూడ వాంబడుదురు. ఉపవేణులనియు నందురు. ఇంక వైణవులకు వైశ్వామిత్ర, గాధిన, వైణవ యని ప్రవరలు. ఇంక హిరణ్యరేతసులకు వైశ్వామిత్ర హైరణ్యరేతస యని యిద్దరు ప్రవరులు. ఇంక సువర్ణరేతసులకు వైశ్వామిత్ర కపోతరేతసయని యిద్దరు. ఇంక శాలంకాయను లకు వైశ్వామిత్ర శాలంకాయన కౌశికయని ముగ్గురు. ఈశాలంకాయనులే కౌశికుల

నియుజహ్నువులనియుఁ జెప్పఁబడుదురు. ఘృతకౌశికులకు వైశ్వామిత్ర ఘృతకౌశిక యని యిద్దరు ప్రవరులు. ఇఁక కథకులకు వైశ్వామిత్ర కాథకయని ప్రవరులు. ఇఁక రౌహిణులకు వైశ్వామిత్ర మాధుచ్ఛందస రౌహిణయని మువ్వురు. ఈ వైశ్వామిత్ర గణములకన్నిఁటికి పరస్పరము వివాహము గూడదు. ఏమనిన; గోత్రైక్యము ప్రవరైక్యముఁగూడనున్నది. కుశికులకు దేవరాతుఁడను ప్రవరఋషి సమానుఁడు గనుక ప్రసిద్ధ. దేవరాతునికంటె భిన్నుఁడు గాకుండుటచే ముందుఁ జెప్పెడి దేవరాతునికివలె జామదగ్న్యులతో వివాహములేదని తోఁచుచున్నది. మరియు ధనంజయులకు వైశ్వామిత్రులతోను నత్రిగణము వారితోను వివాహములేదు. కతులకు భారద్వాజులతోడను విశ్వామిత్ర గణముల వారితోడను వివాహముఁ గూడదు. ఏమనిన; వీరు రెండుగోత్రములలో నున్నవారు. ఇట్లు విశ్వామిత్రగణము ముగిసెను. ఇఁక కశ్యపులు మూఁడు విధములు. నిధ్రువులు, రేభులు, శాండిలులు నని. అందు నిధ్రువులు కశ్యపులు అష్టాంగిరసులు నని మొదలుగ నూటనలుబదింటికి లోపుగాని ధ్రువగోత్ర భేదములు వాటికి కాశ్యప, వత్సార, నైధ్రువ యని మువ్వురు. నిర్ణయసింధువు నందు నిధ్రువగణముపైని కశ్యప గణము జెప్పి కశ్యపులకు కాశ్యప, వత్సార, అసిత యని ముగ్గురు ప్రవరులని జెప్పఁబడినది. అందు శిష్టాచారమును గనఁబడుచున్నది. ఇఁక రేభులకు కాశ్యప, వత్సార,రైభ్య యని మువ్వురు. ఇఁక శాండిలులు కోపాలులు ఉదమేధులు మొదలుగ నరువదికిలోగా శాండిలగోత్ర భేదములు. వాటికి కాశ్యప, వత్సార, శాండిల్య యని మువ్వురు ప్రవరులు. శాండిల్యునిచోట, దేవలుఁడైన నుండును. అసితుఁడైన నుం డును. కాశ్యపాసిత దేవలయని యుంగలదు. కాశ్యప, దేవల, అసిత యనియును గలదు. దేవల, అసిత యని యిద్దరేయనియుఁ గలదు. ఈకాశ్యపగణమువారికిఁ బరస్పరమును వివాహముఁ గూడదు. ఏమనిన; గోత్రైక్యము ప్రవరైక్యముఁ గూడ నున్నది. ఇఁక వసిష్ఠులు, వారు నాల్గువిధములు. వసిష్ఠులు, కుండినులు, ఉపమన్యు వులు, పరాశరులు నని, అందు వసిష్ఠులు వైతాల కవినామకులు. రకి యనఁబడు వారు నని మొదలుగ నరువదికంటె నధికములు వసిష్ఠగోత్ర భేదములు. వారికి వాసిష్ఠ, ఇంద్రమద, ఆభరద్వసుయని మువ్వురు. వాసిష్ఠ యని యొకఁడే యైనను నగును. ఇఁక కుండినులు, లోహితాయనులు, గుగ్గులులు మొదలుగ నిరవదేనింటి కంటెలోగా కుండినగోత్ర భేదములు. వాటికి వాసిష్ఠ, మైత్రావరుణ, కౌండిన్య యని మువ్వురు ప్రవరులు ఇఁక నుపమన్యువులు, ఔదలిసంజ్ఞికులు, మాండలేఖ సంజ్ఞ గలవారునని డెబ్బదికి తక్కువగ నుపమన్యు గోత్రభేదములు. వాటికి వాసిష్ఠ, ఇంద్ర ప్రదమద, ఆభరద్వసు యని మువ్వురు వాసిష్ఠ, ఆభరద్వసు, ఇంద్రప్రమద యని ముగ్గురైనను, ఆ భరద్వసు, వాసిష్ఠ, ఇంద్రప్రమద యనియైనను గలవు. ఇఁక పరాశరులు, వాజిసంజ్ఞికులు మొదలుగ నలుబదేడింటికి లోగా పరాశర గోత్రభేద ములు. వాటికి వాసిష్ఠ, శాక్త్య పారాశర్య యని మువ్వురు. ఈ వసిష్ఠగణము ముగి సెను ఇఁక నగస్త్యగణము. వారు పదివిధములు. ఇధ్మవాహులు సాంభవాహులు సోమవాహులు

యజ్ఞవాహులు దర్భవాహులు సారవాహులు అగస్తిసంజ్ఞికులు పూర్ణమాసులు వామోదకులు పాణికులు నని అందు ఇధ్మవాహులు విశాలాద్యులు స్వాలనాయనులు అని మొదలు నేబదికుక్కువగా నిధ్మవాహ గోత్రభేదములు. వాటి కాగస్త్య, దార్ఢ్యచ్యుత, ఇధ్మవాహ యని ముప్వరు అగస్త్యయని యొకఁడేయైనను గావచ్చును. ఇఁక సాంభవాహుల కాగస్త్య దార్ఢ్యచ్యుత సాంభవాహ యని ముప్వరు. సోమవాహులకు నాగస్త్య, దార్ఢ్యచ్యుత, సోమవాహయని ముప్వరు. ఇట్లు యజ్ఞ వాహులకు నాగస్త్య దార్ఢ్యచ్యుత, యజ్ఞవాహ యని ముప్వరు ఇట్లు దర్భవాహులకు నాగస్త్య దార్ఢ్యచ్యుత సారవాహ యనియు నూహించునది. అగస్తి యనువారికి నాగస్త్య మాహేంద్ర మాయోభువ యని ముప్వరు. ఇఁక పౌర్ణమాసుల కాగస్త్య, పౌర్ణమాస, పారణయని ముప్వరు. వారోదకుల కాగస్త్య, హైమవర్చి, హైమోదక యని ముప్వరు. పాణికుల కాగస్త్య, పైనాయక, పాణికయని ముప్వరు. ఈ యగస్తిగణము వారి కందరకు వివాహముఁగూడదు. ఏమనిన; సగోత్రత్వము సప్రవరత్వముఁగూడ నున్నది. ఇట్లగస్తిగణము ముగిసెను. ఇఁక ద్విగోత్రులు. అందు భరద్వాజగోత్రుఁడైన శుంగునికి విశ్వామిత్ర గోత్రుఁడైన శైశిరియొక్క క్షేత్రమందుఁ బుట్టినవాఁడు శౌంగశైశిరి యను ఋషి గోత్రలక్షణాకాంతుఁ డగుటచే గోత్రఋషి యయ్యెను అట్టి శౌంగ శైశిరిగోత్రమునకు, అంగీరస, బార్హస్పత్య, భారద్వాజ, శౌంగ, శైశిర యని యయిదుగురు ప్రవరులు. ఆంగీరస, బార్హస్పత్య, భరద్వాజ, కాత్య, అక్షీల యనియైనను అంగీరస, కాత్య, అక్షీలయని ముప్వరైనను, భరద్వాజ, కాత్య, అక్షీల యనియైనను నుండవచ్చును. వీరికి సర్వభరద్వాజులతో సర్వవిశ్వామిత్రులతోడను వివాహముఁ గూడదు. ఇఁక సంకృతులు. పూతిమాషులు, తండ్రిసంజ్ఞకులు నని మొదలుగ నిరువదెన్మిదింటికిఁ దక్కువగా సంకృతిగోత్ర భేదము లున్నవి. వాటి కాంగీరస, గౌరివీతి, సాంకృత్య యని ముప్వరు. శాక్త్య, గౌరి వీతి, సాంకృత్య యని యైను, శాక్త్య, సాంకృత్య, గౌరివీతి యని యయినను వీరికి స్వగణమువారగు పూతి మాషాదులతోడను సర్వయయినను వీరికి స్వగణమువారగు పూతిమాషాదుల తోడను సర్వవాసిష్ఠగణములతోడను నహర్వసిష్ఠ సంజ్ఞగల ముందుఁజెప్పెడిలౌగా క్షిసంజ్ఞికులతోడను వివాహముఁ గూడదు. కేవ లాంగిరోగణములతో మాత్రము వివాహము గావచ్చును. ఆంగీరసులైనప్పటికి సగోత్రత్వములేదు. ద్విప్రవరసామ్య మును లేదు. కొందరు భారద్వాజాంగిరసులని యొప్పుకొని భారద్వాజ, శౌంగ, శైశిరగణములతోడ వివాహము లేదనిరి గాని యది భారద్వాజులనుటకు దృఢ ప్రమాణము లేనందున యసంగతము. ప్రయోగపారిజాత మనుగ్రంథము కాశ్యపు లతో గూడ వీరికి వివాహముఁగూడదని చెప్పినది గాని యచట హేతువు విచారింప వలెనని కౌస్తుభమున నున్నది. ఇఁక లౌగాక్షులు దర్భాయణులు నని మొదలుగ ముప్ప దెనిమిదింటికి నెక్కుఁడుగా లౌగాక్షి గోత్రభేదములు. వాటికి కాశ్యప, వత్సార, వాసిష్ఠయని ముప్వరు. కాశ్యప వత్సార అసిత యనియయినను వీరే. యహర్వసిష్ఠులు నక్తం కాశ్యపులు. అనఁగా పగలు వసిష్ఠగణములోను రాత్రి కశ్యపగణములోను

నుండుదురని తాత్పర్యము. కనుకనే పగటికర్మయందు వాసిష్ఠత్వమును బట్టి క్రియను జేతురు. రాత్రికర్మయందు కాశ్యపత్వమునకుఁ దగినకార్యము నొందుదురు. వీరికి సర్వకాశ్యపులతోడను సర్వవసిష్ఠులతోడను సంకృతిసంజ్ఞికులతోడను వివాహముఁ గూడదు. ఇఁక స్మృత్యర్థసారాదులలో జెప్పిన ద్విగోత్రులు దేవరాతులకు వైమిత్ర, దేవరాత, ఔదల యని ముప్వురు. వీరికి సర్వజామదగ్న్యులతోడను విశ్వామిత్రుల తోడను వివాహముఁ గూడదు. ధనంజయులకు విశ్వామిత్ర మాధుచ్ఛందస ధనం జయ యని ముగ్గురు ప్రవరులు. వీరికి సర్వ విశ్వామిత్రులతోడను నత్రిగణము వారితోడను వివాహముఁ గూడదు. ఈగణము విశ్వామిత్ర గణమందు మున్ను జెప్పఁబడినది. జాతూకర్ణ్యులకు వాసిష్ఠ ఆత్రేయ జాతూకర్ణ్య యనిముప్వురు. వీరికి వాసిష్ఠులతోడను నత్రిగణముతోడను వివాహముఁ గూడదు. ఈగణము వసిష్ఠగణ ములో సింధువు జెప్పినది. మీఁద నత్రిగనములో జెప్పిన వారమథ్యాదులకును అత్రి దౌహిత్రులకును వాసిష్ఠులతోడను వత్రులతోడను వివాహములేదు. అత్రి విశ్వా మిత్ర గణములతో గూడదని కొందరు మీఁద భరద్వాజగణములో ఋక్షగణమున కంతర్గణముగఁ జెప్పఁబడిన కపిలులకు ఆంగీరస బార్హస్పత్య భారద్వాజ వాందన మాతవచస యని పంచ ప్రవర ఋషులు గలవారికి విశ్వామిత్ర భరద్వాజ గణములతో వివాహములేదు. మీఁద విశ్వామిత్ర గణములో జెప్పిన కతులకు వైశ్వామిత్ర కాతి అక్షీలయని. త్రిప్రవరులకు విశ్వామిత్ర భరద్వాజగణములతో వివాహములేదు. ఈన్యా యము చేతనే భిన్నగోత్రజుఁడైన దత్తకుఁడు మొదలగువారి కిప్పటివారికిని రెండు గోత్రములగుటచే జనకపాలకులగు తండ్రులిద్దరి సగోత్రులతోడను వివాహముఁ గూడదు. ఇక్కడ పురుషాంతరములలెక్కచే నూర్గురు పురుషులు దాటినను ద్విగోత్ర త్వము పోనేరదు. క్షత్రియవైశ్యులకుః బురోహితులగు గోత్రప్రవరులే గోత్రప్రవరు లయ్యెదరని సిద్ధాంతము. ఇఁక దనగోత్ర మెఱుంగనిచో నునపనయనమందాచార్యుఁ డగు. పురుషుని గోత్రప్రవరముల చేతనే కర్మలును వివాహ తన్నిషేధములు నని యెఱుంగునది. ఆచార్యుని గోత్రముగూడ దెలియనిచో కెవ్వరికైన దననిచ్చి వారి గోత్రము ప్రవరులను గ్రహించునది.

## మాతృగోత్రము వర్జించుటకు నిర్ణయము

అపుడు మాతృగోత్రమనఁగ మాతామహునిగోత్రమే వర్జింపవలెను. అదియును గాంధర్వ వివాహమాడిన స్త్రీకిఁ బుట్టిన పుత్రులకే యందరకు వర్జ్యము. బ్రాహ్మవివా మాడిన స్త్రీకిఁబుట్టినచో నందరకు వర్జింపనక్కఱలేదు. మరి యేమనిన; మాధ్యందిన శాఖీయులకు మాత్రమే మాతామహగోత్రము వర్జ్యము. "మాతృగోత్రం మాధ్యందినీ యానా" మని సత్యాషాఢ వచనమున్నది. అట్లనే యంతట శిష్టాచారముఁగూడ గనఁబడుచున్నది.

## సగోత్రకన్యా వివాహ ప్రాయశ్చిత్తము

అజ్ఞానముచే సగోత్రకన్యనుగాని సప్రవర కన్యనుగాని వివాహమాడినచో

నట్టి స్త్రీని విడచి చాంద్రాయణప్రాయశ్చిత్తము జేయవలెను. బుద్ధిపూర్వకముగ జరిగినచో ద్విగుణ ప్రాయశ్చిత్తముఁ జేయవలెను. ఇట్లు కన్యకు సగము ప్రాయశ్చిత్తము జేయునది అట్లు సపిండ స్త్రీవివాహమందును దెలియునది. ఇఁక కన్యను విడుచుట యనఁగ బ్రాహ్మణకన్యకే యనియు సంభోగమందును ధర్మకార్యమందు నీ రెండిటిన యందే యనియు తెలియవలెను. “మాతృవత్పరిపాలయేత్” అని యన్నాదులిచ్చి సంరక్షించుట విధింపఁబడియే యున్నది. కొందరు సగోత్రకన్యా వివాహమై సంభోగించినచో నట్టి వివాహమును బ్రాయశ్చిత్తము చాంద్రాయణ ద్వయాదికమును జ్ఞాన పూర్వకమైనచో, మరియు నధికము గల్పింపవలె నంద్రు. మరికొందరు–“గురుతల్ప వ్రతాచ్ఛుద్ధ్యేత్” అని వచనమున్నందున గురుభార్యాగమనసామ్యముచే నారు సంవత్సరములు ప్రాయశ్చిత్తము ప్రమాదమున నయినచో మూఁడు సంవత్సరములు గాని, రెండు చాంద్రాయణములుగాని జేయునది యనిరి. అజ్ఞానముచే సగోతా వివాహమైనచో దాని సంతానము జనకుని బ్రాయశ్చిత్తమైన పైని కాశ్యపగోత్రముచే వ్యవహరింపఁబడునుగాని, త్యజింప వలనుగాదు. జ్ఞానపూర్వము సగోత్రస్త్రీయందు బుట్టించిన సంతతికి చండాలత్వమే. ఎట్లనిన; ‘ఆరూడపతితాపత్యం బ్రాహ్మణ్యాం యశ్చశూద్రజః, సగోత్ర జా సుతశ్చైవ చండాలాస్త్రయ ఈరితాః” అని. అనఁగా జాతిభ్రష్టులుని సంతతియు బ్రాహ్మణ స్త్రీయందు శూద్రునికిఁ బుట్టినవాఁడును సగోత్రకన్యను వివాహమై దానియందు గన్న సంతతియు నని మూఁడు విధములు చండాలులు అని యమస్మృతి యున్నది.

## వివాహమం దితరములైన నిషేధములు

మఱియు; “ప్రత్యుద్వాహో నైవకార్యోనైకస్య దుహితృద్వయం, నచైక జన్యయోః పుంసో రేకజన్యేతు కన్యకే” అనఁగా వావిమాత్రము కుదుర్చుకొని యొకని కన్యను తనకుమారునికి దనకన్యను తిరుగనతని కుమారునికినిచ్చి వివాహములుచేయుట యిదియే కుండమార్పులుగానని వ్యవహరింపుచున్నారు. అదియును నొకవరునికి దనకన్యల నిద్దరినిచ్చి వివాహము చేయుటయు నేకగర్భజనితులైన పురుషులకు నేకగర్భజనితలయిన కన్యల నిచ్చుటయును నిషిద్ధములని యర్థము. దీని కపవాదము సోదరులైనవరులకు నేకగర్భజాతలగు కన్యలనిచ్చుటకు సంవత్సరము మొదలగు కాలము వ్యవధానమై యున్నను మహగిరి నద్యాదులు వ్యవధానముగనున్నచో నేక కాలమందైనను వివాహము జేయవచ్చును. ఒకనికిద్దర సోదరకన్యలనిచ్చుటయు క్రమముగా మొదటనిచ్చిన కన్యక మృతినొందినచో జరుగవచ్చును. మహాదారిద్రాది నిర్బంధములు గల్గినచో బ్రత్యుద్వాహ మనఁగకుండమార్పులుగ జేయవచ్చును. సోదరులకు సమానసంస్కారము సంవత్సరములోగా చేయఁగూడదు. ఇట్లు గృహ నిర్మాణము వివాహము నొకసంవత్సరములో జేయఁగూడదు. గృహప్రవేశమునకు నిషేధము లేనందున గృహప్రవేవానంతరము వివాహము జేయవచ్చును. సోదరుల యిన పుత్రులకుగాని కన్యాపుత్రులకుగాని కేవల కన్యలకేగాని వివాహము లారు మాసములలో మిగుల నిషిద్ధములు. పురుషత్రయ స్వరూపమైనకులమందు వివా

హముఁ జరిగినపైని యుపనయనముఁ గూడదు. అనఁగ నారుమాసములలోగా గూడదనుట. ఆరుమాసములలో శుభకార్యములు మూఁడు చేయఁగూడదు. ఇక్కడ శుభకార్యమనఁగ వివాహోపనయనములలో నొకటియే. కనుక గర్భాధాన నామ కర్మాది సంస్కారములు మూఁడైనను నిషేధము లేదు మరియు; గర్భాధానాదులలో నొకటి గలపి నాలుగైనవని యూహచేయుటకు నవకాశమునులేదు. "నాగ్ని కార్య త్రయం భవేత్" అను వచనముతో నేకవాక్య తగలుగుట నని తోఁచుచున్నది. భిన్నో దరుల కన్నికార్యములు మూఁడు జరిగినను దోషములేదని కొందరు. మరికొందరు "నకు ర్యాన్మంగలత్రయం" అను వచనమునకు భినప్నవాక్యార్థమని యంగీకరించి యేశుభకార్యములైనను మూఁడు గూడదనిరి. పురుషుని వివాహముజేసి యారు మాసములో స్త్రీవివాహముఁ జేయఁగూడదు. పెద్దమంగళ కార్యము జేసినపైని స్వల్ప మంగళము జేయఁగూడదు. బాహ్యామంటపమందు జేసినది పెద్దమంగళము. ఇతరము లఘుమంగళము. ప్రాప్తకాలములైన గర్భాధానాదుల కీ నిషేధము లేదు. ఇట్లు ప్రాప్తకాలములైన నైమిత్తికశాంతి మొదలగువాటికిని నిషేధము లేదుగాని వాటి సమయముఁ దాటినచో జేయఁగూడదు. ఇట్లు వ్రతోద్యాపనాదులును గృహప్రవేశాదు లును లఘుమంగలము లగుటచే వివాహానంతరము నిషిద్ధములు. ఇట్లు నిషేధములు నాల్గును ముగ్గురు పురుషులలోనగు కులమందారు మాసములకులోగా నని తెలియ వలెను. మరియు కొందరు ముండద్వయమునకు నుపనయనముపైని చౌలమునకును నిషేధమనిరి.

## నిషేధమున కపవాదము

ఇఁక వీటి కపవాదము సోదరులకును సమానసంస్కారములును వివాహము లును నిబ్బందిలో సంవత్సరభేదము గల్గినచో జేయవచ్చును. అట్లు నాల్గుదినములు గాని యొకదినముగాని వ్యవధానముచే జేయవచ్చును. అతి నిర్బంధనమైనచో నేక దినమందైనను కర్తృభేదముచే గాని మండపభేదముచేగాని చేయవచ్చును. ఇద్దరు చేయువారైనచో నొకలగ్నమందైనను నొక గృహమందే భిన్నోదరులకు వివాహము జేయవచ్చును. ఇట్లు మీఁదఁజెప్పిన నాల్గునిషేధములందును వత్సరభేదమున్నచో దోషములేదు. కవగా బుట్టినవారికి యొక్క కాలమందొక్కమండపముపై జేసిన సమాన సంస్కారములకు దోషము లేదు. ఇట్లు సవతిబిడ్డలకు సమానసంస్కారము లారుమాస ములలోగా జేసినను దోషములేదు.

## మండన ముండన విచారము

మఱియు సవతియొక్క చెలియండ్రకు నొక్కదినమందే యొక్క మండపమున వేదికలు వేరుగ వివాహముచే దోషములేదని కొందరు. ముగ్గురు పురుషులకు లోగా నేకకులమందు మంగళకార్యము జరిగినపైని మండనముతో గూడిన యుపనయన చౌలాదులు చేయఁగూడదు. మీఁదఁజెప్పినచోట్ల నంతటను పురుషత్రయగణన

మెట్లులనిన; వివాహ ప్రతికూలవిచారమైన పైని నిరూపింపఁబడును. ముండన కర్మ యనఁగ చౌలము నాగసంస్కారాదికము ఆధానము మొదలగునదియు నభ్యు దయమున కిచ్చుచే సర్వప్రాయశ్చిత్తాదికము క్షౌరవిధితోగూడిన తీర్థయాత్రాదికము నూహించునది. ఉపనయనము మాత్రము కాత్యాన మతమందు మంగళరూపము గాని మండనరూపముగాదు గనుక వివాహానంతరమందు జేయవచ్చును. ఇతరుల మతమందు ముండన రూపము గనుక చేయఁగూడదు. తల్లిదండ్రుల కంత్యక్రియఁ జేయుటకు బ్రాప్తమైన ముండనము నాకస్మికప్రాప్త ప్రాయశ్చిత్త ముండనము మరణము సమిపించినపుడు సర్వప్రాయశ్చిత్తము కొరకైన ముండనమును చేయవలసి నదేగాని నిషేధము లేదు. ఏమనిన; నవి నిత్యములు. ఇట్లు దర్శపూర్ణమాసములు చేయునపుడును చాతుర్మాస్యము జేయునపుడు ముండనమునకు దోషములేదు. సరియే కాని "ముండన చౌలమిత్యుక్తం వ్రతోద్వాహౌతు మంగళం" అని వచన మున్నది. అనఁగా ముండనమనఁగా చౌలమని ఉపనయన వివాహములు మంగళ మనఁబడునని మండనముండనములు స్పష్టముగా జూపఁబడుచున్నవి. కాఁబట్టి యట్టి పరిగణనములో నాధానాదులు పడనందున వాటికీ నిషేధము రానేరాదు. ముండన శబ్దార్థము గాకున్న యాధానాదులకు నీవెట్లుమీఁద నిషేధము వ్రాసితివని శంకింపఁగూడదు. ఏమనిన; నట్లు వాక్యముచే ముండనము చౌలమని చూపించుట యుదాహరణము కొరకు గాని యిదేయని నిర్ణయించుట కొరకుగాదు. అట్లుగానిచో "వ్రతోద్వాహాన్న చౌలకం" అని అనఁగా నుపనయనవివాహములపైని చౌలము జేయఁగూడదని స్పష్టముగనే నిషేధింపవచ్చును. "మండనాన్నతు ముండనం" అని. అనగ మండనముపైని ముండనము చేయఁగూడదని ముండన మనుసామాన్య శబ్దముచే నిషేధింప బ్రయత్నమెందులకు జేయవలెను. కాఁబట్టి గర్భాదానాది లఘు మంగళములకంటెను వివాహాది గురుమంగళముకంటెను పైని యాధానాదిముండ నము. సహితము జేయఁగూడదనియే నిషేధవచనమునకు దాత్పర్యము. మరియేమ నిన; నట్టి సామాన్య నిషేధమున కొక యుదాహరణము చూపింపవలెనని, ముండన మనఁగ చౌలమనియు మండనమనఁగ వివాహాదులు నని వచనము చూపించు చున్నది. కనుక నాధానాదులకును నిషేధము సిద్ధమే. అట్లైనచో పుతరుషత్రయాత్మకమైన కులమందందరి గృహములను బహుకర్మలు నిల్చిపోవును. మరియేమిగతియనిన; వివాహోపనయన చౌలములయినపైని మంగళములందును పిండాదానాదికమందు మాసము మొదలగు నల్పకాలమువరకే ప్రతిబంధము నంగీకరించినట్లును పిత్రాదు లలో నెవ్వరైన మృతినొందినచో నల్పకాలమే ప్రతికూలించుట నిర్ణయించినట్లును లఘుమంగళము జరిగినపైని మాసము మొదలైన యల్పకాలము వరకే ముండన కర్మకు నిషేధము యుక్తిచే గల్పింపవలెను అని తోఁచుచున్నది. ప్రాచీన నిబంధన గ్రంథములందీ విషయమై విశేషము గనఁబడదు. అయినను దార్ఢ్యముచే నిట్లు వ్రాసితి. యుక్తమైనచో గ్రహింపవలెను. ఇట్లు మండనముండన నిర్ణయము.

## ప్రతికూల విచారము

వివాహనిశ్చయమైన పైని వరునికిగాని కన్యకకుగాని సగోత్రులలో ముగ్గురు పురుషులు స్వరూపముగ గల కులమందొకానొకఁడు మృతినొందినచో బ్రతికూల దోషము. యిచట వివాహ నిశ్చయమనఁగ వైదికమైనను లౌకికమైనను గ్రహింప వచ్చును. అందు వైదికము. వాగ్దానరూపవిధిచే జేయఁబడినది ముఖ్యము. ఇఁక లౌకికమనఁగ లగ్న తిథి నిశ్చయాదికము వరవధువులకు శుల్క నిశ్చయపూర్వకముగ తాంబూలదానాదికమును సగోత్రులైన త్రిపురుషులని చెప్పినందున మాతామహకుల మందు గ్రహింప వలనుగాదు. కనుక వరుఁడును నతని పూర్వభార్యయు నతనితల్లి దండ్రులు నతనిపితామహుఁడు పితామహియు పెళ్లిగాని మేనత్తయు వీరు వధుని వంకను పూర్వత్రిపురుషి యనఁబడుదురు. ఇఁక వరుఁడు నతనిభ్రాతయు పత్నియు పుత్రుఁడు పెళ్ళిగాని కూతురు వీరును వరుని యనూఢభగినియు వరునికోడలు కొడుకును బెళ్లిగాని కూఁతురు పౌత్రుఁడు నతని భార్యయు ననూఢయగు పౌత్రియు నను వీరును వరత్రిపురుషి యనఁబడుదురు. మరియు పినతండ్రియు నతని భార్యయు పుత్రుఁడు కోడలు ననూఢయగు కన్యయునని వీరుసంతతి భేదమందు త్రిపురుషి. ఇట్లు సగోత్ర త్రిపురుషికి పరిగణనముఁ దెలియునది. వీరిలో నొకరు మృతినొందిన యెడ ప్రతికూలమని తాత్పర్యము. అందుభ్రాతయు పుత్ర పౌత్రాదికమున నుపనీతు లైనను మూఁడువత్సరముల కెక్కుడు వయస్సుగల్గినచో గ్రహింపవలెను. ఇట్లనూఢ భగిని మొదలగువారును త్రివర్షముల కధిక వయసుగలవారే యని తెలియవలెను. అట్లు వధూకులమందు నూహించునది. మండన ముండనాదికమందు నిట్లనే త్రిపురుషి యూహింపవలెను. ఇక్కడ విశేషము. తలిదండ్రులు తాతయు నతని భార్యయు పినతండ్రియు వరుని పూర్వపత్నియు నామె పుత్రుఁడు వరునిభ్రాతయు బెళ్లిగాని చెలియలు వీరిలో నొకరికి మరణము సంభవించినచో నావివాహము చేయఁగూడదు. తక్కిన త్రిపురుషసపిండుని మరణమందు శాంత్యాదికముచే దోషము పరిహారముచేసి వివాహము చేయవచ్చును. అతి నిర్బంధమైనచో పిత్రాది మరణ మైనను కొంతకాలము ప్రతీక్షించి శాంత్యాదులుచేసి చేయవచ్చును. అందు వ్యవస్థ యెట్లనిన; వివాహనిశ్చయ మైనపైని తలిదండ్రులిద్దరు మృతినొందినచో గాలప్రతీక్ష జేసినను శాంతిజేసినను దోషపరిహారముగాదు. కనుక నట్టి వివాహము వర్జింప వలెను.

## వివాహము

ఒకానొకరికి మరణమైనపుడు శాంతిజేసి వివాహము జేయవచ్చును. అక్కడ కాలప్రతీక్షకు నిర్ణయము. "పితురబ్దమిహాశౌచం తదర్థం మాతురేవ చ, మాసత్రయం తు భార్యాయా స్తదర్థం భ్రాతృపుత్రయోః, అన్యేషాంతు స పిండానా మాశౌచం మాససమ్మితం."అనఁగా దండ్రి వియమాశౌచము సంవత్సరము తల్లి కారుమాస ములు భార్యకు మూఁడు మాసములు భ్రాతకు పుత్రునకు మాసమున్నర తక్కిన

సపిండుల కొకమాసము. నిట్లువిడిచి యనంతరమున శాంతిఁజేసి యటుపైని లగ్న నిశ్చయముఁ జేయునది. ఇచ్చట నాశౌచమనఁగ ప్రతికూలముచే జేయఁబడిన వివాహమునకు నధికారము మాత్రమే కాలప్రతీక్ష కొరకుఁ జెప్పఁబడినది. కనుక దండ్రి మృతినొందినచో సంవత్సరము పైని వినాయక శాంతిజేసి యిబ్బంది గలుగు నపుడు వివాహము జేయునది. అది నిర్బంధమైనచో నారుమాసముల పైని వినాయక శాంతిని నిర్బంధమైనచో మాసానంతరమందు మీఁదఁజెప్పిన శాంతులుచేసి వివాహముజేయునది అని పక్షత్రయమున్నది. మాతృమరణమందారుమాసములపైని శాంతిజేసి వివాహము జేయునది. లేక యిబ్బంది గలుగునపుడు మాసాంతమందు మీఁదఁజెప్పిన శాంతి ద్వయముజేసి వివాహము జేయునది.

## వివాహాది ప్రతిబంధము - దాని కపవాదము

"ప్రమితౌపితకాయస్య దేహస్త స్యా శుచిర్భవేత్, నదైవం నాపివాపిత్ర్యం యావత్పూర్ణోన వత్సరః" అని యొకసంవత్సరము పర్యంతము తలిదండ్రుల మృతి యందు శుభకర్మ నిషేధవచన మున్నది. అయిన నది వాఙ్నిశ్చయముగాక మున్ను పితృమరణమందుగాని యవి సంతకము లేనపుడుగాని యట్లు నిషేధము జెప్పునని తెలియవలెను. భార్యామరణమందు త్రిమాసాంతమునగాని మాసాంతమందుగాని శ్రీపూజనాదిశాంతి జేయవలెను. భ్రాతృమరణమందు మాసమున్నరపైని వినాయక శాంతి పుత్రమరణమందు మాసమున్నరగాని మాసముగాని ప్రతీక్షించి యాపైని శ్రీ పూజనాది శాంతి పినతండ్రి మృతినొందినచో మాసాంతరమందు వినాయకశాంతి పితామహికిగాని పెళ్లిగాని భగినికి గాని మృతిగల్గినచో మాసాంతరము శ్రీపూజనాది శాంతి జేయవలెను. తక్కిన త్రిపురషసపిండ మరణమున మాసాంతమందు శ్రీపూజ నాది శాంతిఁజేసి అటుపైని వివాహముజేయవలెను. గుణవత్తరురాలైన తల్లి మృతి నొందినచో నారుమాసములకు దుఃఖశాంతి గాదు గనుక సంవత్సరము పర్యంతము ప్రతీక్షించునది అట్లా గుణవత్తరభార్య మృతినొందినచో నారుమాసములు జ్యోతిః ప్రకాశమను గ్రంథమందు మాత్రము జెప్పినది. మాతృమరణమందు నతిసంకట మైనచో మాసములోగానే, దశాహానంతరమందు గొన్ని దినములు మాత్రము ప్రతీక్షించి వినాయక శాంత్యాదులఁజేసి గోవునిచ్చి తిరుగ వివాహనిశ్చ యాదులు చేయవచ్చునని యున్నది. ఈ యిన్ని విధముల యపవాదమును యిబ్బందుల తారతమ్యమునుబట్టి వినియోగింపవలెను. అల్పసంకటము విషయమై మహాసంకట మందు జెప్పిన విధిని జెప్పుచో వక్తకు గర్తకును దోషమే. మరియు దుర్భిక్షము రాజ్యభంగము మొదలగు భయములందు తలిదండ్రులకు మరణము వచ్చునను శంకయందును ప్రతికూలము లేదు. దీర్ఘరోగికిని దూరదేశస్థునికిని విరక్తునికిని కన్యకు ప్రౌఢత్వము గలుగునపుడును బ్రతిశూల దోషములేదని యపవాదము.

## శ్రీపూజనాది శాంతి

'శ్రియేజాత' యను మంత్రముచే శ్రీదేవిని 'ఇదం విష్ణు' అను మంత్రముచే విష్ణుని 'గౌరీమి మాయ' యను మంత్రముచే గౌరిని 'త్ర్యంబకం' అనుమంత్రముచే 'రుద్రుని పరంమృత్యో' యను మంత్రముచే యముని పూజించి తిలాజ్యములచే

నూట యెనిమిది మారులు హోమములు జేయవలెను. "ఓం భూస్స్వాహామృత్యుర్నశ్య తాంస్సుషాయై సుఖం వర్ధతాం స్వాహా" యని హోమమున మాప్తినొందించి రెండు గోవులు దక్షిణగా నీయవలెననియుఁ గౌస్తుభమందుఁ దెలియునది. 'ప్రేతకర్మాణ్య నిర్వర్త్యచరేన్నా భ్యుదయక్రియాం, ఆచతుర్థం తతః పుంసిం పంచమే శుభదంభవేత్" అనఁగా మీఁదః జెప్పిన సగోత్ర చతుఃపురుషిలో పునప్రేత కర్మలు సంభవించినచో వానిపూర్తిజేయక ముస్సు వేరయిన యాభ్యుదయిక కర్మ జరుగఁగూడదు. చతుః పురుషిని దాఁటినచో దోషములేదు. శుభమే. ఇచట ప్రేతకర్మ యనఁగ సపిండీకరణ మునకుఁ బూర్వము జరిగెడు కర్మలును సపిండీకరణమును సపిండీకరణాంతరమున బార్వణవిధిచేఁ జెప్పఁబడిన మాసికములును గ్రహింపఁబడును. 'సపిండీకరణాదర్వాగ పకృష్య కృతాన్యపి, పునరప్యపకృష్యంతే వృద్ధ్యుత్తర నిషేధనాత్." అని సపిండీకరణమున కంటె బూర్వమే మాసికములన్నియు నవకర్షించి చేసినప్పటికిని తిరుగ సంవత్సర పర్యంతము యథావిధిగ జేయవలెను. ఏమనిన; నుత్తరమందు వృద్ధికర్మలు నిషేధిం చుట వలన నని యర్థము. ఇట్లు అను మాసికములకు సహిత మపకర్షము విధింపఁ బడుచున్నది. 'అభ్యుదయప్రియ' యనఁగ నాందీశ్రాద్ధముతో గూడిన కర్మమాత్రము గ్రహింపఁబడును. కొందరు వివాహాదులే గ్రహింపఁబడునంద్రు. 'ఆచతుర్థం' అనునపుడు నాందీశ్రాద్ధకర్త యగుపురుషుఁడు మొదలుగ జనక వర్ణము నలుగురు పురుషుల పర్యంతమును, జన్యవర్ణము నలుగురు పురుషుల పర్యంతమును, సంతానభేదమందు నలుగురు పురుషుల పర్యంతమును సగోత్రుల గ్రహింపఁబడు దురు. కనుక నాందీశ్రాద్ధ కర్తయొక్క పితృపితామహ ప్రపితామహులు వారి భార్యలు కర్తభార్యయు పుత్రపౌత్రాదులు వారి భార్యలు భ్రాతయు వానిపుత్ర పౌత్రులు వారే యందరిభార్యలు పినతండ్రియు నతని పుత్రపౌత్రులు వారి యందరిభారయలు ప్రపితామహుని పుత్రపౌత్రులు వారిభార్యలు వీరిలో నెవ్వరు మృతినొందినను వారికి అనుమాసి కాంతప్రేతకర్మ సమాప్తిగాకముస్సు మంగలము చేయఁగూడదు. నాందీ శ్రాద్ధకర్త యనఁగ ముఖ్యుఁడే గ్రహింపఁ బడవలెను. గాని గౌణకర్తలైన మాతులుఁ డు మొదలగువారు గారు. తండ్రి మృతుఁడైన పైని యుపనయనముజేయుచో సంస్కా ర్యుఁడు మొదలుగ చతుఃపురుషి గణనయగును. ఇఁక మాతామహుఁడు మొదలగు వారు భిన్నగోత్రులగుటచే చతుఃపురుషిలో జేరకున్నను వారు నాందీశ్రాద్ధమునకు దేవతలే యగుటవలన వారి ప్రేతకర్మ పూర్తిగానిచో మంగళము నిషిద్ధము. మాతా మహి మొదలగువారికి స్వయముగ దేవతాత్వము లేనందున వారి దశాహాంతకర్మగాక ముస్సు గూడ మంగళముఁ జేయవచ్చును. ఇట్లంత్యకర్మ జరగకున్నందున వచ్చు మంగళ ప్రతిబంధ నిర్ణయము. ఉపనయనమందును వివాహమందును నాందీ శ్రాద్ధము మొదలుకొని మండపోద్వాసన మగువరకును మధ్యమందు దర్శదినము రాకుండునట్లు ప్రారంభించవలెను. దర్శగాక వేరైన తలిదండ్రుల మృతాహస్సు మొద లగు శ్రాద్ధదినము ప్రమాదము గాని బుద్ధిపూర్వకముగాని మధ్యమందు ప్రాప్తించినచో త్రిపురషసపిండులు వివాహాదిమంగళమైన పైని శ్రాద్ధముఁజేయవలెను. కనుక

దర్శకంటె వేరగుశ్రాద్ధమునకే స్వరూపముచే వివాహమధ్యమందు నిషేధముగాని దర్శకువలె శ్రాద్ధరహితమైన శ్రాద్ధార్వాదినమాత్రమునకు నిషేధము లేదు. ఏమనిన; 'వృత్తే వివాహేతరస్తు కుర్యాచ్ఛ్రాద్ధం' అని వివాహానంతరమందు శ్రాద్ధము విధించు చున్నది. కాఁబట్టి సంక్రాంతిమన్వాద్యష్టకాది దినములు శ్రాద్ధదినములగుటచే వివాహ మధ్యమందు నిషేధమగు ననుశంక పోయినది. ఇఁక సపిండులలో షణ్ణవతిశ్రాద్ధ ములు చేయువారు వివాహమధ్యమందు వచ్చిన మన్వాదులకు ప్రాయశ్చిత్తము మొదలగు వానిచే పూర్తిజేసుకొనవలెనని తెలియవలెను. ఇట్లు కర్మమధ్యమందు ధర్మాది నిర్ణయము.

ప్రారంభము చేయకమున్ను గాని ప్రారంభించిన పైనిగాని తల్లియైనను పిన తండ్రి మొదలగువారు కర్తలైనపుడు వారి భార్యలైనను రజోదోషము నొందినపుడు చెప్పవలసినది. యుపనయనమందు విస్తరించి నిరూపింపఁబడినది. రజో దోషము జననాశౌచము మొదలగునవి సంభవించినను శంకగల్గినచో నపకర్షముజేసి నాందీ శ్రాద్ధము జేయుటకు దిననియమము. "ఏకవింశత్యహర్యజ్ఞే వివాహే దశవాసరాః, త్రిషట్చౌలోపనయనే నాందీశ్రాద్ధం విధీయతే" అనఁగా యజ్ఞమందు నాందీశ్రాద్ధము నిరువదియొకరోజులు వ్యవధానముండగ జేయవచ్చును. వివాహమందు పదిరోజులు చౌలమందు మూఁడురోజులు ఉపనయనమందారు రోజులును వ్యవధానము గావచ్చును. అనఁగా నంతకెక్కుఁడైనచో దిరుగ నాందీశ్రాద్ధము జేయవలెనని తాత్ప ర్యము. నాందీశ్రాద్ధమైనపైని జాతాశౌచ మృతాశౌచములు ప్రాప్తించినయెడ వివాహాదు లకు ప్రతిబంధములేదు. ఏమనిన; "వివాహవ్రతయజ్ఞేషు శ్రాద్ధే హోమేర్చనే జపే, ఆరబ్ధే సూతకం నస్యా దనారబ్ధేతు సూతకం, ప్రారంభో వరణంయజ్ఞే సంకల్పో వ్రత సత్రయోః, నాందీముఖం వివాహాదౌ శ్రాద్ధేపాక పరిక్రియా." అని వచనమున్నది. అనఁగా వివాహాదులకు నాందీశ్రాద్ధమైనపైని వ్రతాదులకు యజ్ఞములకు సంకల్పమైన పైని శ్రాద్ధమందు 'పాకపరిక్రియా' అనఁగా ప్రోక్షణము జరిగినపైని నాశౌచమంట దనియు నట్లు ప్రారంభించకము న్నాశౌచమంటుననియు వచనమున్నది. ఇదియును సమీపమందు ముహూర్తాంతరము సంభవింపనిచో నిర్బంధమందే యని తెలియ వలెను. లేనిచో నాందీశ్రాద్ధమైనప్పటికి నాశౌచాంతమందు ముహూర్తాంతముననే చేయవలెను. సమస్తమైన యాశౌచాపవాదమును నన్యగతికమై యార్తిగలుగునపుడే యని తెలియవలెనని నిర్ణయసింధువు. కాబట్టి వ్రతమందు సంకల్పమైన పైని యాశౌచ ప్రాప్తించినప్పటికిని బ్రాహ్మణుని చేతనే పూజాదికము జేయింపవలెను. యజ్ఞమందు మధుపర్కాదివిధిచే ఋత్విగ్వరణమైన పైని యాశౌచము వచ్చినప్పటికిని మరియొక ఋత్విక్కు దొరకనిచో ననన్యగతికము గనుక మధుపర్కాదికముచే వరించినవాని కాశౌచమంటదని యొప్పుకొనుట. ఇట్లు జపహోమాదులందు నూహించునది. శ్రాద్ధ మందు పాకప్రోక్షణమైన పైని యాశౌచ మంటకుండుటయునిర్బంధమందే యని తెలియునది. మహోపద్రవము సంభవించినచో ప్రారంభించకము న్నాశౌచము గల్గినను కూశ్మాండమంత్రములచే ఘృతహోమముఁ జేసి మంచిపాలావును దానము

జేసి పంచగవ్యము భక్షించి శుద్ధుఁడై చౌలముపనయనము వివాహము దేవప్రతిష్ఠ మొదలగునవి చేయవచ్చును. సంపాదించిన సంభారములకు సమీపమందు ముహూ ర్తాంతరములేనందు నాశము గల్గునని శంకగల్గినపుడును నిట్లు శుద్ధి దెలియునది. ఇదియు జననాశౌచమాత్రమునకే యని కూశ్మాండాది గ్రంథములందున్నది. ఇట్లు కూశ్మాండల హోమాదులచే శుద్ధియై యారంభించిన వివాహాదులలో పూర్వసంకల్పి తాన్నమును భక్షించిన బ్రాహ్మణులకు దోషములేదు. అట్లు శుద్ధిగల్గినందున వండిన పదార్థములు సహితము సూతకులు వడ్డించ వచ్చునని కౌస్తుభమందున్నది. గాని యది లోకవిద్విష్టము గావున యుక్తముగాదు. కనుక భిన్నగోత్రులచేతనే యన్నదానము యుక్తమని తోఁచుచున్నది. నాందీశ్రాద్ధమైన పైని జాతాశౌచ మృతాశౌచములు ప్రాప్తమైనచో పూర్వమందన్న సంకల్పము లేకున్నప్పటికిని వివాహోత్తరమందు సంకల్పించిన యన్నాదుల భుజింపవచ్చును. అపుడును "పరైరన్నం ప్రదాతవ్యంభోక్త వ్యంచద్విజోత్తమైః" అని అనఁగా భిన్న గోత్రులువండి వడ్డించవలెనని సర్వసమ్మత మని సింధుమయూఖాదులు. పూర్వమందు సంకల్పించినప్పటికి యన్నము భుజించు నపుడు సూతకాదులు వచ్చినచో భుక్తశేషము విడి భోక్తలు పరగృహమందు జలముచే నాచమనము జేయవలెను. మిగిలినపాకము సూతకులు భుజింపవలెను. ఇట్లు వచనము. "భుంజానేషు చ విప్రేషు త్వం తరామృతసూతకే, అన్యగేహోదకాచాంతా" యనియర్థము స్పష్టము. నాందీశ్రాద్ధమైనపైని భోజనకాలముగాక తక్కినకాలమందు సూతకమువచ్చినను సూతక గృహమందు భుజింపవచ్చును. భోజనకాలమందే వచ్చిన యెడ సూతకులు పాత్రస్థమైనయన్నము విడువవవలెనని వచనమువల్ల విశేషమయు తెలియునది. వచనమున కతిభారములేదని న్యాయమున్నది. మరియేమనిన; 'భుంజా నేషు చ విప్రేషు' అనువచనము ఆరబ్ధానారబ్ధ సర్వకర్మల యందును పూర్వము సంకల్పింపఁబడనియన్నము విషయమని నాకు దోచుచున్నది.

## వివాహాదులందు రజోదోషసూతకాదుల నిర్ణయము

వివాహముగాక మున్ను కన్యకు రజోదోషము గనుపించినచో దలిదండ్రుల కును సోదరులకును నరకపాతమగును. కన్యకు వృషలీత్వము పతికి వృషలీపతిత్వ మును వచ్చును. అపుడు శుద్ధిప్రకారము. కన్యాదాత ఋతుసంఖ్య చేననఁగ నెన్ని మారులు రజస్వలయగునో యన్ని గోదానములు లేదా యొకగోదానమైననుజేసి యథాశక్తిగ బ్రాహ్మణ భోజనముజేసినచో గన్యాదానమందు యోగ్యుఁడును. ఇఁక కన్య యొకయుపవాసము జేసియావుపాలు ద్రావి బ్రాహ్మణకన్యకు రత్నభూషణ మిచ్చినచో వివాహయోగ్యురాలగును. వరుఁడు కూశ్మాండ మంత్రములతో హోమము జేసి వివాహమాడినచో దోషములేదు. వివాహ హోమకాలమంద రజోదోషము గనుపించినచో స్నానముజేయించి యుంజనాయను తైత్తిరీయ మంత్రముచే బ్రాయ శ్చిత్తహోమముచేసి హోమమంత్రము సమాప్తి జేయవలెను. ఒకవేళ కన్యకు దానము చేయువారు లేక రజో దర్శన పర్యంత మట్లనేయున్నచో కన్య మూఁడువత్సరముల

పర్యంతము ప్రతీక్షించి తానే వరుని వరించుకొనవలెను. అపుడు వరునికి సహితము దోషములేదు.

## వివాహమునకున్ను, కన్య రజస్వలయైనచో క్షయపక్షనిర్ణయము

పక్షమధ్యమందు రెండు తిథులకు క్షయమువచ్చుటచే పదుమూఁడు దినములే అయినపక్షము క్షయపక్షము. అపుడు ప్రజాక్షయము రాజోపద్రవమును గల్గును. అట్టి క్షయపక్షమున చౌలము ఉపనయనము వివాహము మొదలగునవియు వాస్తు కర్మ మొదలగు శుభకార్యముఁ జేయఁగూడదు. క్షయమాసాధికమాస గురుశుక్రాస్తాదు లందు వివాహమునకు నిషేధము ప్రథమ పరిచ్ఛేదమం దున్నది. ఇట్లు సింహమందు గురుఁడున్నపుడును నిషేధ మచ్చుటనే జూడవలెను. క్షయవత్సరముగూడ నిషిద్ధమే. ఎట్లనిన; శీఘ్రగతిచే బూర్వరాశి నతిక్రమించి మరియొక రాశికి వెళ్లుట యతిచారము. దానినొంది గురుఁడు వక్రగతిచే దిరుగ బూర్వరాశికి రానిచో క్షయవత్సర మగును. సర్వకర్మలకు వర్జింపవలెను. అందు మేష, వృషభ, వృశ్చిక, కుంభ, మీనరాసులందు దోషము లేదు. కొందరు గోదావరికి దక్షిణదేశమందు గురునియతిచారాదుల దోష మేమియు లేదనిరి. ఇట్లు క్షయపక్షాది విచారము ముగిసెను.

## వధూవరులకు గ్రహబలవిచారము

"ముఖ్యం గురుబలం వధ్వా వరస్యేష్టం రవేర్బలం" అనఁగ కన్యకు గురు బలము వరునికి సూర్యబలము ముఖ్యము. అందులగ్నమునకు రెండు నైదు నేడు పదునొకండు ఈ స్థానములందు గురుఁడు కన్యకుశుభుడు. జన్మము తృతీయము షష్టము దశమమునను నీస్థానములందు గురుఁడు శాంతిమొదలగువాని జేసినచో శుభుఁడగును. చతుర్థాష్టమ ద్వాదశస్థానములందు దుష్టఫలదుఁడు. కర్క ధనుర్మీనము లలోనొకటియైనచో చతుర్థాది స్థానమందున్నప్పటికిని దోషములేదు. ఇబ్బందిలో చతుర్థమందు ద్వాదశమందున్నను ద్విగుణముగ బూజాపహోమాదికమును నెన్మిదవ స్థానమందున్నచో ద్రిగుణముగను జేసినచో శుభుఁడగు.

## ఆరు సంవత్సరములకు వివాహము చేయకూడదనుట

వరుని జన్మరాశికి మూఁడు నారు పదిపదునొకండు స్థానములందు రవి శుభుఁడు. అన్యస్థానములందు గ్రహమఖ ప్రకారమున బూజజేసినచో శుభుఁడగు. గురుపూజా ప్రకారముపనయనప్రకరణములో జెప్పఁబడినది. జన్మమొదలుగగాని గర్భము నుండిగాని యైదవవత్సరము మొదలుకొని యెన్మిదివత్సరముల పర్యంతము కన్యా వివాహమందుచిత కాలము. ఆరుసంవత్సరములపైని రెండు సంవత్సరములు ప్రశస్తతరమైన కాలము. ఇట్లు వచనము, "షడ్వర్షమధ్యేనోద్వాహ్యా కన్యావర్ష ద్వయం యతః, సోమోభుక్తే తతస్తద్వద్గంధర్వశ్చ తతోనల" యని. యనఁగా నారువత్సరముల పర్యంతము కన్యకు వివాహముఁ గూడదు. ఏమనిన; రెండేసివత్సరములు క్రమముగఁ సోముఁడు గంధర్వుఁడు ననలుఁడు ననుభవింతురని యర్థము. తొమ్మిది పదిసంవత్స

రములు మధ్యమకాలము. పదునొకండవవత్సర మదమకాలము. పండ్రెండవ వత్స రము మొదలుకొని ప్రాయశ్చిత్తకాలము.

## ఎనిమిది వివాహ భేదములు

బ్రాహ్మము దైవము నార్షము ప్రాజాపత్యము నాసురము గాంధర్వము రాక్షసము పైశాచము నని యెనిమిదివిధములు వివాహము. అందు యోగ్యమైన వరునిబిలచి యలంకరించి కన్యాదానమునకుఁ జెప్పినవిధిచే నతనికి దానము జేయుట బ్రాహ్మ వివాహము. యజ్ఞమందు ఋత్విజుఁడై కర్మచేయుచున్న వానికి దన కన్యనిచ్చుట దైవ వివాహము. వరునివలన నొక గోమిధునమునైన గ్రహించి కన్యాదనాముజేయుట యార్ష వివాహము. ఇట్లు గోమిధునము గ్రహించుట నింద్యము గాదు. ఏమనిన నది కుమారీ పూజనము కొరకు గావున గన్యా విక్రయ మనఁ బడదు. నీవీ స్త్రీతోడనే గృహస్థధర్మ మాచరింపవలెను. ఈబిడ జీవించిన వరకును వివాహాంతరముగాని చతుర్థాశ్రమమనఁగ సన్న్యాసముగాని చేయఁగూడదని యొప్పించి కన్యనిచ్చుట ప్రాజాపత్య వివాహము. బంధువులకు యథేష్టముగ ధనము పుచ్చుకొని కన్యనిచ్చుట యాసురము. వరవధులిద్దరు నిచ్చచే నన్యోన్యము స్వయముగ గలియుట గాంధర్వవివాహము. యుద్ధాదులచే గన్యను బలాత్కారముగ గ్రహించుట రాక్షసవివాహము. దొంగతనమున కన్యను హరించుట పైశాచవివాహము. మొదటి నాల్గింటిలో పూర్వపూర్వము శ్రేష్ఠము. తుదినాల్గింటిలో నుత్తరోత్తరము నింద్యము. అందు విప్రునికి బ్రాహ్మాదైవవివాహములు ప్రశస్తములు. క్షత్రియునికి గాంధర్వరాక్షస ములు ప్రశస్తములు. వైశ్యుని కాసురవివాహము ప్రశస్తము. ఆర్ష ప్రాజాపత్య పైశా చము లందరకు సంకటమందు గ్రహింపవచ్చును అందు రాక్షసముతప్ప దక్కిన యేడును విప్రునికి, బ్రాహ్మాదైవములు తప్ప దక్కినయారును క్షత్రియునికి, వైశ్యశూద్రు లకు బ్రాహ్మాదైవములు తప్ప దక్కినయారును క్షత్రియునికి, వైశ్యశూద్రులకు బ్రాహ్మాదైవ రాక్షసములు తప్ప దక్కినయైదును గ్రహింపఁదగినది. ఆ యీ వివాహములందొక రీతిచే గన్యను గ్రహించి తిరుగ దన గృహ్యసూత్రప్రకారమున వివాహహోమాదులు జేసుకొనవలెను. దానవిధిచే దాన మన్నివివాహములందు జరుగదు. పైశాచాది వివాహములందు సప్తపదములుఁ ద్రొక్కుటకు ముందు దొరికినచో నన్యుని కివ్వ వచ్చును. బ్రాహ్మాది వివాహములందును కన్యాదానమైనప్పటికిని సప్తపదీవిధికంటె బూర్వము వరునికి షండత్వాదిమహాదోషము గనుపించినను వరుఁడు మృతినొంది నను మరియొకని కివ్వవచ్చును. బ్రాహ్మవివాహముచే బెండ్లాడిన స్త్రీయందు బుట్టిన పుత్రుఁడు పదిమంది పూర్వులను పదిమంది యపరులగు వంశస్థులను దరింప జేయును. దైవవివాహముచే బెండ్లాడిన స్త్రీ పుత్రుఁడు, ఏడుగు రేడుగురు వంశస్థులఁ దరింపజేయును. ప్రాజాపత్య వివాహితురాలి పుత్రుఁడార్గురార్గురను దరింపజేయును. ఆర్ష వివాహిత పుత్రుఁడు ముగ్గురు ముగ్గురను దరింపజేయును. ఆశ్వలాయన సూత్రమందు బ్రాహ్మము మొదలు నాల్గువివాహములందు బుట్టిన పుత్రులు క్రమముగ పండ్రెండుగు రేసియు పదుగురేసియు నెనమండ్రేసియు నేడ్గు రేసియు బురుషులను

పూర్వులను పరులనుగూడ దరింపజేయుదురని యున్నది. తక్కిన దుర్వివాహము లందు బ్రహ్మధర్మద్వేషులైన పుత్రులు గలుగుదురు.

## వాగ్దానమైనపైని వరుఁడు దేశాంతరగతుఁడైనచో పరివేదన నిర్ణయము

వాగ్దానమైనపైని వరుఁడు దేశాంతరమునకు వెళ్లినయెడనారు మాసముల పర్యంతరము ప్రతీక్షించి మరియొకని కీవలెను. కన్యకుశుల్కమనఁగ నలంకారమిచ్చి దూరదేశము పోయినచో సంవత్సరము ప్రతీక్షించునది. ఇఁక బలాత్కారముగ వివాహ మాడినను సగోత్రత్వము నపుంసకత్వము మొదలగు మహాదోషములున్నను సప్తపదీ విధికి పైని గూడ మరియొకవరునికివ్వవచ్చునని చెప్పుదురది కలియుగమందు నిషిద్ధము. వాగ్దానమైనపైని పాడిత్యాది దోషములు లేకున్నను కన్యనివ్వనియెడ దాతకు శిక్ష విధింపఁబడినది. ఇట్లు కన్యకు గల్గిన యపస్మారాది దోషములు దాచి వివాహము చేసినను దాత శిక్షార్హుడు. అధర్మ వివాహములలో భుజించిన బ్రాహ్మణులకు సహితము ప్రాయశ్చిత్తము. ఎట్లనిన; అసురవివాహమం దొకదిన ముపవాసము. గాంధర్వమందు మూఁడుదినములు. రాక్షసపైశాచములందు చాంద్రాయణము ప్రాయశ్చిత్తము. ఇట్లు వివాహభేదములు. "దారాగ్ని హోత్రసంయోగం కురుతే యోఽ గ్రజేస్థితే, సకనిష్ఠః పరీవేత్తా జ్యేష్ఠస్తు పరివిత్తికః"అనఁగా జ్యేష్ఠునికంటె ముందు వివాహముగాని యాధానముగాని జేసుకొనిన కనిష్ఠుఁడు పరివేత్తి యనఁబడును. జ్యేష్ఠుఁడు పరివిత్తియనఁబడును. ఇట్లు జ్యేష్ఠకన్యకంటెమున్ను వివాహమైన కనిష్ఠకన్య యగ్రేదిధిషు వనఁబడును. జ్యేష్ఠకన్య దిధిషు వనఁబడును.

## పరివేత్తకు ప్రాయశ్చిత్తము

ప్రమాదమున దంఢ్రి మొదలగువారట్టి వివాహము జేయుచో పరివిత్తి పరి వేత్తయునగు సోదరులిద్దరు రెండేసి కృచ్ఛ్రములు జేయవలెను. కన్యయొక కృచ్ఛ్రము దాతయతికృచ్ఛ్రము పురోహితుఁడు చాంద్రాయణమును జేయవలెను. జ్ఞానముచే పిత్రాదులకు సమాధానము లేకున్నను వివాహమైనచో నందరు సంవత్సరము కృచ్ఛ్ర వ్రత మాచరింపవలెను. కోరికతో పిత్రాదులిచ్చి వివాహము జేసినచో మూఁడు మాసములు కృచ్ఛ్రము. అజ్ఞానముచే నెవ్వరివ్వకుండఁగ వివాహమైనచో చాంద్రాయణా దికము. ఇట్లు దిధిష్వగ్రేదిధిషువులకు నతికృచ్ఛ్రము కృచ్ఛ్రము నూహించునది.

## పరివేత్త కపవాద నిర్ణయము

జ్యేష్ఠుఁడు సవతి తల్లికొడుకై నసుదత్తుఁడైనను గనిష్ఠుఁడు వివాహమాధానము జేసుకొన్నను దోషములేదు. మరియు నపుంసకుఁడైనను మూగయు చెమిటివాఁ డును సొట్టవాఁడును మరుగుజ్జువాఁడును దేశాంతరసంచారియు వేశ్యాసక్తుఁడు జాతి భ్రష్టుఁడు దీర్ఘరోగియు నతివృద్ధుఁడు వ్యవసాయమనఁగ భూమిదున్నుటయే పనిగ జీవించువాఁడును, ధనవృద్ధికొరకు వ్యవహారపరుఁడును రాజసేవాపరాయణుఁ డు చౌర్యపరుఁడు వెఱ్ఱివాఁడు వివాహమందుగాని యగ్ని హోత్రమందు గాని కోరికలేని

వాఁడునై జ్యేష్ఠుఁడున్నచో గనిష్ఠుఁడు వివాహాదులు చేసుకొనినను దోషములేదు. అందు దేశాంతరగతుఁడైన జ్యేష్ఠుని గనిష్ఠుఁ డెన్మిదిగాని పండ్రెండుగాని సంవత్సరములు ప్రతీక్షించవలెను. ఇట్లు జ్యేష్ఠకన్య భిన్నోదరురాలయినను గనిష్ఠకు వివాహము గావచ్చును. మూకత్వాదిదోషములున్నచో నిట్లూహించవలెను.

## కన్యాదాతృ నిర్ణయము

కన్యాదానముచేయు నధికారుల క్రమము; తండ్రియు తాతయు సోదరుఁడు పినతండ్రి మొదలగు పితృవంశస్థులు మాతృవంశస్థులగు మాతామహుఁడు మేనమామ మొదలగువారును నెవ్వరును లేనిచోనని, పూర్వపూర్వులులేనిచో పైపైవారిని గ్రహించునది. అందుసోదరులుపనయనమైనవారే యధికారులు. అనుపనీతుఁడైన సోదరుఁడును దల్లి దల్లియునున్నచో దల్లికేయధికారము. ఇట్లధికారులెవ్వరును లేనిచో గన్యస్వయముగానే వరునివలరింపవలెను. అట్టి స్వయంవరమందును దల్లి దానము చేయునపుడును నాందీశ్రాద్ధము వారే చేయవలెను. అపుడు తల్లిగాని కన్యయేగాని తాను ప్రధానసంకల్పమును మాత్రముచేసి తక్కినది బ్రాహ్మణునిచే జేయింపవలెను. వరునికి నుపనీతుఁడైన భ్రాతమొదలగువారు లేనిచో తానే నాందీశ్రాద్ధము జేయవలెనుగాని తల్లి చేయఁగూడదు. ఏమనిన; నుపనయనముచేదన కధికారము సిద్ధించినది. రెండవవివాహము మొదలగు వాటియందు వరుఁడే నాందీముఖము చేయవలెను. పరకీయకన్యను విధిగ దానము చేయుటకు విశేషవచనము. “ఆత్మీకృత్యసువర్ణేన పరకీయాంతు కన్యకాం, ధర్మేణవిధినాదాన మసగోత్రేపి యుజ్యతే” యని. అనఁగా సువర్ణముచే కన్యనుకొని దానముచేసినను విశేష ఫలమనుట. ఇట్లు దాతృనిర్ణయమందు వరవధువులకు గూడ నాందీశ్రాద్ధ కర్తృత్వ నిర్ణయము.

## మూలాది నక్షత్రములయందుఁబుట్టిన వధూవరుల వివాహము

మూలనక్షత్రము మొదటి మూఁడు పాదములందుఁ బుట్టినవధూవరులు మామగారికి హానికరులు. ఆశ్రేష ద్వితీయపాదము మొదలు మూఁడు పాదములందుఁ బుట్టినచో నత్తగారికి గండము. జ్యేష్ఠాంత్యపాదమందుఁ బుట్టినచో నన్యోన్య జ్యేష్ఠ భ్రాతలనఁగ స్యాలకునికి భావుకునకును గండము. మఘా ప్రథమపాదమైనచో మూల నక్షత్రమునకువలె ఫలమనికొందరు. మరికొందరు పనయనము ద్వితీయ జన్మముగనుక పూర్వజన్మ కాలమందైన మూలాదిదోషము ద్వితీయ జన్మముతో పోయినది. వరునకు శ్వశురహానికరత్వాది దోషములేదని యపవాదమును సంకటమందు జెప్పుదురు. శ్వశురాదులు లేనిచో వధూప్రయుక్తమైన దోషమును లేదు. మరియును నక్షత్రము వృక్షము నదియు నీచజాతియు పర్వతము పక్షి పాము దాసియు వీటి పేర్లలో నొకనామముగాని భయంకర నామముగాని గలిగిన కన్యను వివాహ మాడగూడదు. కన్యక నిచ్చునపుడు వరుని పుంస్త్వము పరీక్షించి యీవలెను. “యస్యాప్సుప్లవ తేబీజం హ్రాది మూత్రం చ ఫేనిలం” అని మొదలుగ పుంస్త్వపరీక్ష.

అనఁగా వీర్యము నీటిలో దేలుటయు మూత్ర విసర్జనకాలమందు ధ్వనియు నురుగయు గలుగుట పుంస్త్వసూచకమని యర్థము. మరియు; "కులంచ శీలంచ వపుర్వయశ్చ విద్యాంచ విత్తంచ సనాథతాం చ, ఏతాన్గుణాన్ సప్తపరీక్ష్యదేయా కన్యాబుధైశ్శేష మచింతనీయం" అనఁగా; కులము, స్వభావము, శరీరము, వయస్సు, విద్యయు, ధనము, సంరక్షకులుండుటయు నీ యేడుగుణములను బరీక్షించి కన్యనీవలెను. తక్కినది విచారింపఁబని లేదు. ఇట్లు వధూవరులకు మూలజననము మొదలగు గుణదోషవిచారము.

## అవివాహ (అవివాహ) యోగ్య మాసనిర్ణయము

మాఘ, ఫాల్గుణ, వైశాఖ, జ్యేష్ఠ, మాసములు శుభములు. మార్గశీర్షము మధ్యమము. క్వచిత్తుగా నాషాఢ కార్తికములు గ్రహింపవచ్చును. అందు మిథున మందు సూర్యుఁడుండగ నాషాఢమును వృశ్చికమందు సూర్యుఁడుండగ గార్తికమును దేశాచారము ననుసరించి గ్రహించునది గాని సర్వదేశములందట్లుగాదు. ఇట్లు మకరస్థుఁడై సూర్యుడుండఁగ పౌషమాసము మేషమందు రవియుండగ చైత్రమును గ్రహించునది. జ్యేష్ఠులైన వధూవరులకు జ్యేష్ఠమాసము గూడదు. మరియొక మాస మందు మధ్యమము. అట్లు వచనము–"నజ్యేష్ఠయో ర్వివాహస్స్యా జ్జ్యేష్ఠేమాసి విశేషతః ద్వ్యైజ్యేష్ఠౌ మధ్య మౌప్రోక్తా వేకజ్యైష్ఠ్యం సుఖావహం, జ్యేష్ఠత్రయం న కుర్వీత వివాహే సర్వసంమతం" అని. అనఁగా వధూవరులు జ్యేష్ఠులై జ్యేష్ఠ మాసముగూడ గలసినచో త్రిజ్యేష్ఠత్వము గనుక నది యెపుడును గూడదు. మాసాంతరమందైనచో ద్విజ్యేష్ఠత్వము మధ్యమము. ఇద్దరిలో నొకరే జ్యేష్ఠులైనచో నేకజైష్ఠము శుభము. ఇట్లు జ్యేష్ఠమాస మందు జ్యేష్ఠుని కితరశుభకార్యము మధ్యమము. మరియు జ్యేష్ఠసంతతికి జన్మ మాసము జన్మనక్షత్రము శుభకార్యమందు నిషిద్ధము.

## లగ్నమందు గ్రహబలము

"సార్వకాలమేకే వివాహం" అనునది యాసుర వివాహము మొదలగు నధర్మ వివాహముల విషయమై సర్వకాలము గ్రహింపవచ్చునని చెప్పును. మయూఖమందు మాత్రము ఆర్ద్రమొదలు పదినక్షత్రములందు సూర్యుఁడుండగ వివాహోపనయనాదులు వశిష్ఠాదులచే నిషేధింపఁబడినవని యున్నది. అది కౌస్తుభము నిర్ణయసింధువు మొదలగు గ్రంథములందును మార్తండము మొదలగు జ్యోతిర్గ్రంథములందును గానరాదనఁగ బహుశిష్టసమ్మతము గాదు. అమావాస్య వివాహమునకు నిషిద్ధము. రిక్తయు నష్టమియు షష్టియు నల్పఫలములు. ఇతరతిథులు బహుఫలములు. శుక్ల పక్షము శ్రేష్ఠము. కృష్ణపక్షము. త్రయోదశివరకు మధ్యమము. సోమ బుధ, గురు, శుక్రవారములు శుభములు. ఇతరములు మధ్యమములు. రోహిణి, మృగశీర్ష, మఘ ఈ మూఁడును ఉత్తర, హస్త, స్వాతి, మూల, అనూరాధ, రేవతి ఈ నక్షత్రములు సర్వసమ్మతములు. ఇఁక హరదత్తమతమందు చిత్ర, శ్రవణము, ధనిష్ఠ, అశ్విని యను నీనాల్గు నధికములు. అందులో దుష్టగ్రహముతో గూడిన నక్షత్రము వర్జ్యము.

చంద్రబలము తారాబలమును వధూవరుల కిద్దరకును గావలెను. ఒకరికి చంద్ర బలములేనియెడ రజతాదిదానము చేయవలెను. "మేషః కన్యా ఘటస్సింహో నక్రం యుగ్మం ధనుర్వృషః," మీనస్సింహో ధనుః కుంభో జాదీనాంఘాత చంద్రమాః" అనఁగా మేషము లగ్నమగుచో కన్యయందు చంద్రుఁడు కుంభము. లగ్నమైనచో సింహమందును మకరములగ్నమైనచో మిథునమందును ధనుస్సులగ్నమగుచో వృషభ మందును మీనములగ్నమగుచో సింహమందును ధనుస్సులగ్నమగుచో కుంభమం దును చంద్రుఁడున్న యెడ ఘాతచంద్రుఁడనఁబడును. "యాత్రాయాం యుద్ధకార్యేషు ఘాతచంద్రం వివర్జయేత్." "వివాహ సర్వమాంగల్యే చౌలాదౌ వ్రతబంధనే" "ఘాత చంద్రో నైవచింత్యో యజ్ఞే సీమంత జాతయోః" అనఁగా యాత్రయందును యుద్ధ కార్యములందును ఘాతచంద్రుని వర్జింపవలెను. వివాహాది సర్వశుభకార్యములం దును చౌలము మొదలగు వానియందును ఉపనయనమందును యజ్ఞమందును సీమంతోన్నయనమందును జాతకర్మయందును ఘాతచంద్రుని విచారింప నక్కరలేద నుట. "మృత్యుయోగే పారిఘార్ధే భద్రాయాం పాతవైధృతౌ, విష్కంభాదేర్దుష్టభాగే తిథివృద్ధిక్షయేపి చ, యామార్ధకుళికాదౌ చ గండాంతేరవి సంక్రమే, కేతూద్గమేభూమి కంపే వివాహాద్యం వివర్జయేత్." అనఁగా మృత్యువను యోగమందును, పరిఘయొక్క పూర్వార్ధభాగమందును, భద్రయందును, వ్యతీపాతయందును, వైధృతి యందును, విష్కంభాదులయొక్క దుష్టభాగమందును, తిథియొక్క వృద్ధిక్షయములందును, యామార్ధకులిక మొదలగువానియందును, గండాంతమందును, సూర్యక్రాంతియం దును, ధూమకేతువు పొడమినను, భూకంపము బుట్టినను, వివాహాదులు చేయఁ గూడదు. గ్రహణమం దొకపాదము గ్రాసమైనచో మూఁడురోజులును రెండుపాద ములు గ్రాసమైనచో నాల్గురోజులు మూఁడుపాదములు గ్రాసమైనచో నారురోజులు పూర్ణగ్రాసమైనచో నెనిమిదిరోజులును గ్రహణమునకు ముందు సగముగా వర్జింప వలయును. భూకంపమందును నుల్కాపాతమందును మూఁడు దినములు నిషిద్ధ ములు. ధూమకేతువు గనుపించు నన్నిరోజులు గూడదు. ఇందు కపవాదము. "భూకంపాదేర్నదోషోస్తి వృద్ధిశ్రాద్ధే కృతేసతి" అనఁగా భూకంపాదులు నాందీ శ్రాద్ధమైన పైని జరిగినప్పటికిని దోషములేదు. పగటియందు వివాహము ప్రశస్తము. రాత్రి యందును గన్యాదానము ప్రశస్తమనియే హేమాద్రియందున్నది. ఇఁక లగ్నమందు గ్రహబలము. "త్రిషష్ఠాష్టస్వర్క స్త్రిజలధనగోబ్జః క్షితిసుతస్త్రి షష్ఠస్థోజ్ఞేజ్యావ్యయనిధనవర్జ్యో భృగుసుతః, ద్వితీయాబ్ధీష్వంకాభ్రతనుఘరిపుత్ర్యష్టసుశనిస్తమః కేతుశ్ఛాయే భవతిసుఖ హేతుశ్చ సకలః" అనఁగా లగ్నమునకు మూడింటనారింట నెనిమిదింటను సూర్యుఁ డు శుభుఁడు. చంద్రుఁడు మూడింటను నాలుగింటను రెండింటను శుభుఁడు. అంగారకుఁడు మూడింటను నారింటను శుభమునిచ్చును. బుధ బృహస్పతులు పంద్రెండింటను నెనిమిదింటను నుండగూడదు. తక్కినచోట శుభులు. ఇఁక శుక్రుఁ డు రెండునాలుగు నైదు తొమ్మిది పదియొకటి యాస్థానములందున్న శుభుఁడు. శని యారింటను మూడింటను నెనిమిదింటను నున్నచో శుభుఁడు. రాహుకేతువులు

పదునొకండవస్థానముననున్న శుభులు. ఇట్లు స్థానములందు శుభులు ఇcక లగ్న మందు వర్జింపవలసిన గ్రహములు. "రవిర్లగ్నే చంద్రస్తను రిపుమృతిస్థః క్షితిసుతోష్ట లగ్నాభ్రేజ్ఞే జ్యౌనిధన ఉశనాస్త్ర్యష్టరిపుషు, శనిశ్చేషౌలగ్నే తనుపతిరధార్యష్టమగృహే వివాహేస్యుస్సర్వే మదనసదనే నైవశుభదాః" అనcగా లగ్నమందు సూర్యుcడు లగ్న షష్ఠాష్టమములందు చంద్రుడును నెనిమిదింటను లగ్నమందును పదింటను నంగారకుcడును. ఎనిమిదింట బుధరవులును, మూడు, నెనిమిది, యారు, నీస్థాన ములందు శుక్రుడును, లగ్నమందు శనియును, రాహు కేతువులును లగ్నాధిపతి యారు నెనిమిదిస్థానములందును సప్తమమం దన్నిగ్రహములు నుండగూడదు. "అన్యే ద్వాదశగం చంద్రం దృక్కేశ నవమాంశపౌ, షష్ఠాష్టగౌబుధంచాభ్రే వర్జ్యానాహుర్మ నీషిణః" కొందరు ద్వాదశమందు చంద్రుని ద్రేక్కాణాధిపతియు నవాంశాధిపతియు షష్ఠాష్టగులైనచో వారిని పదింట బుధుని వర్జింపవలెనంద్రు. "మేషాన్నక్రాత్తులాత్కర్కా త్త్రిర్గణ్యా నవమాంశకాః, శస్తావృషనృయుక్కర్క కన్యాతుల ధనుర్ఝషాః" మేష సింహ ధనుస్సులకు మేషము మొదలుకొనియు, కన్యా మకర వృషభములకు మకరము మొదలుకొనియు, తులా కుంభ మిధునములకు తుల మొదలుకొనియు, మీన కర్కట వృశ్చికములకు కర్కటము మొదలుకొనియు, రాశిని ముప్పదిభాగములుచేసి యందు తొమ్మిదవ భాగము నవమాంశమని తెలియవలెను. అందు వృషభ మిధున కర్కట కన్యా తులా ధనుర్మీన నవాంశములు శుభాధిపత్యముగలవి. గనుక అట్టి నవాంశలు వచ్చునటుల లగ్నము గ్రహించునది యని తాత్పర్యము.

## ఏకవింశతి మహాదోషములు

"దుష్టంచాంగ్యష్టమోస్సృక్స విధుకలతను ష్షణ్మృతీం దుస్సితో రౌ సంక్రాంతి ర్గండదోష స్సఖలభదినజౌ చక్ర చక్రార్ధపాతౌ, రంధ్రం లగ్నంకువర్గోస్తగఖల ఉదయాస్తా శుచిః క్రూరవేధః కర్తర్యే కార్గలాంఘ్రిర్గ్రహణభకలవౌదుః క్షణోత్పాతఖేచ" అనcగా తిథివారనక్షత్రయోగ కరణములయిదును దుష్టములగుట, యంగారకుడెనిమిదింట నుండుట, చంద్రునితోగాని పాపగ్రహముతోగాని లగ్నముగూడుట యారింట నెనిమి దింటను చంద్రుcడుంటయారింట శుక్రుడు సంక్రాంతిగండదోషము దుష్టగ్రహముతో గూడిన నక్షత్ర దినములు చక్రచక్రార్ధ పాతములు జన్మలగ్నమునకు నెనిమిదవరాశి లగ్నమగుట దుష్టవర్ణము, అస్తంగతుcడైన ఖలగ్రహము ఉదయము చేతను నస్తమయము చేతను నశుద్ధిక్రూరగ్రహముచే వేధకర్తరియు ఏకాలమైన పాదము గ్రహణముcబట్టిన నక్షత్రము కలవమను దోషము దుర్ముహూర్తము ఉత్పాత నక్షత్రము నీ మహాదోషములు వివాహమందు వర్జింపవలెనని యర్థము.

## చంద్రతారాది బలములేనిచో దోషము

"గోధూలంపదజాదికేశుభకరం పంచాంగశుద్ధౌరవే రర్ధాస్తాత్పర పూర్వతోర్ధ ఘటికం తత్రేందుమష్టారిగం సోగ్రాంగంకుజ మష్టమంగురుయ మాహః పాతమర్క క్రమం జహ్యాద్విప్రముఖేతిసంకట ఇదం సద్యోవనాధ్యేక్వచిత్." అనcగా గోధూల

ముహూర్తము సూర్యుని యర్ధాస్తమయమునకుఁ బూర్వమందును బరమందున్న రగడియస్వరూపమైనది. అది శూద్రాదులకు వివాహమందు శుభము. అపుడును పంచాంగ శుద్ధియనఁగఁ తిథివార నక్షత్ర యోగకరణములు మంచివై యుండవలెను. ఎనిమిదింటను నారింటను చంద్రుఁడుండఁగూడదు. అంగారకునితో గూడియుండ గూడదు. అంగారకుడష్టమమం దుండగూడదు. గురుశనులకు నహఃపాతముగూడదు. సంక్రాంతి గూడదు. ఇట్టి గోధూలము బ్రాహ్మణాదులకు కన్యక రజస్వలయగు నను మొదలయిన యుపద్రవములందు గ్రహింపఁదగినది. మీఁదఁజెప్పినటుల చంద్రతారాదిబలములేనిచో దానములు."చంద్రేచ శంఖం లవణం చతా రేతిథౌ విరుద్ధేత్వథ తండులాంశ్చ, ధాన్యంచ దద్యాత్కరణేచవారే యోగేవిరుద్ధేకన కంచదేయం" అనఁగా చంద్రుఁడు విరుద్ధమైనచో శంఖదానము తారకు లవణదానము, తిథికి తండులదానము, కరణమునకు వారమునకును ధాన్యదానము, యోగమునకు సువర్ణదానము చేయవలెను. ఇఁక షడ్వర్గశుద్ధి మొదలగు విచారము. కాలము సాధించుట మొదలగువాని ప్రకారము కుళికాదుల స్వరూపములును జ్యోతిర్గ్రంథముల నుండి తెలియవలెను.

## మండప నిర్మాణ విచారము

మండప నిర్మాణము మొదలగు వివాహాంగములు వివాహమునకు జెప్పిన తిథివార నక్షత్రాదులం దారంభించవలెను. ఇట్లు వచనము. "కండవదలనయవారక మండప మృద్వేదివర్ణకాద్యఖిలం, తత్సంబంధిగతాగతమృక్షే వైవాహికేకుర్యాత్" అని యనఁగా వివాహము నిమిత్తము పప్పులు పండ్లు బియ్యము, మొదలగు సంభారములు సిద్ధము జేయుటకు నారంభించుటయు మండపము నగ్నివేదిక మొదలైనవి వేయు టయు నలుకుట ముగ్గులిడుట మొదలగునవియు ఆకార్యము నుద్దేశించి మరియొక స్థలమునకు వెళ్లుటయు వచ్చుటయు వివాహమునకు జెప్పిన నక్షత్రమందు జేయునది. యనుట ఇందు యవారకమనఁగ చిక్కసము పంచుట యని తెలియునది. అపుడు చంద్రబలము విచారింపనక్కరలేదు. అట్టి వివాహాంగములు వివాహదినమునకు బూర్వము తృతీయ దినమందును నారవదినమందును తొమ్మిదవ దినమందును నారంభించగూడదు. అందు మండపము పంద్రెండుగాని పదిగాని యెనిమిదిగాని మూరలు చౌకముగలిగి నాలుగుద్వారము లుండవలెను. ఆ మండపమందు వరుని హస్తముతో నాల్గుమూరలును వధూహస్తముతో నైదుమూరలుగల చతురశ్రమైనవేదిక తూర్పునకు పల్లముగా నాల్గువైపుల సోపానముగలిగి యరటిచెట్లతో నలంకరింపఁ బడి గృహమునుండి వెడలునపు డెడమదిక్కుగ నుండవలెను.

## కన్యా జన్మలో గ్రహాదులచే సూచింపఁబడిన వైధవ్యపరిహారము

కన్యకు జన్మకాలమందలి గ్రహాదియోగముచే సూచింపఁబడన వైధవ్యమును దప్పించుట కుపాయము చెప్పఁబడును. అందుమూర్తిదానము. కన్యక దేశకాలముల నుచ్చరించి వైధవ్యహరం శ్రీవిష్ణుప్రతిమాదానం కరిష్యే యని సంకల్పించి పలముగాని

యందు సగముగాని దానిలోసగముగాని సువర్ణముచే విష్ణు ప్రతిమను పంచాయుధ ములు నాల్గుభుజములు గలుగునట్లు నిర్మించి ఆచార్యుని వరించి యగ్న్యుత్తారణము మొదలగు విధిపూర్వకముగ బ్రతిమను షోడశోపచారములచే బూజింపవలెను. అందు వస్త్రోపచారమందు పచ్చనివస్త్రములును పుష్పార్పణకాలమందు కలువలమాలికయు నర్పించవలెను. పూజాంతమందు నమస్కరించి మంత్రపూర్వముగ ప్రతిమాదానము జేయవలెను. అపుడు మంత్రము. "యన్మయాప్రాంచి జనుషిఘ్నంత్యాపతి సమాగమం, విషోపవిషశస్త్రాద్యైర్హతోవాపి విరక్తయా, ప్రాప్యమాణం మహాఘోరం యశస్సౌఖ్య ధనాపహం, వైధవ్యాద్య తిదుఃఖౌఘం తన్నాశయ సుఖాప్తయే, బహుసౌభాగ్యవృద్ధ్యైచ మహావిష్ణోరిమాంతనుం, సౌవర్ణీం నిర్మితాంశక్త్యా తుభ్యం సంప్రదదే ద్విజ." యని యనఁగా పూర్వజన్మమందు పతిసమాగమము ద్వేషించి విముఖురాలనై విషము మందులు శస్త్రములు మొదలగువానిచే పతిని జంపిన పాపమున నీజన్మమందు సంభవించెడి కీర్తిసుఖధనముల నశింపఁజేయు వైధవ్యాదిదుఃఖములు రాకుండుటకును మిక్కిలి సౌభాగ్య వృద్ధికొరకు నీ మహావిష్ణుప్రతిమాదానము జేసితినని యర్థము.

## వైధవ్యహరమైన కుంభవివాహము

అటుపైని యథాశక్తిగ సువర్ణదక్షిణ నిచ్చియిపుడు పాపరహితురాలనైతినని ముమ్మారు పలుకవలెను. అటుపైనిబ్రాహ్మణుఁడు 'ఏవమస్తు' అనిముమ్మారు పలుక వలెను. అనంతరమందు బ్రాహ్మణభోజనము. మరియు వైధవ్యము హరించు కుంభ వివాహము జెప్పఁబడును. వివాహముజేయు తండ్రి మొదలగువారు కన్యా వైధవ్య హరం కుంభ వివాహంకరిష్యే యని సంకల్పించి నాందీ శ్రాద్ధాంతముఁ జేసి 'మహీద్యై'అని మొదలగు మంత్రములచే గుంభస్థాపనము జేసిన పైని దానిమీఁద వరుణ ప్రతిమయుంచి పూజించి విష్ణుప్రతిమయందు విష్ణుని షోడశోపచారములచే బూజించి ప్రార్థించవలెను. ఎట్లనిన; "వరుణాంగ స్వరూపాయ జీవనానాంసమా శ్రయ, పతింజీవయ కన్యాయా శ్చిరంపుత్రసుఖం కురు, దేహి విష్ణోవరందేవ కన్యాం పాలయదుఃఖతః" అని యనఁగా జీవులశరీరమునిల్చుటకు జీవనమైనయుదకముల కధిష్ఠానదేవతవైన యోవరుణుఁడా! యీకన్యయొక్కపతిని జీవింపఁజేసి చిరకాలము పుత్రసౌఖ్యము నిమ్ము. ఓ విష్ణూ! దుఃఖమునుండి కన్యను తప్పించువరము దయసేయు మని యర్థము. అటుపైని; "విష్ణురూపిణే కుంభాయఇమాం కన్యాం శ్రీరూపిణే సమర్ప యామి." అని సమర్పించి పరిత్వాయని మొదలగు మంత్రములచే గ్రిందను మీఁ దను గుంభమును గన్యను మంత్రావృత్తిజేయుచు గట్టి, యటుపైని గుంభము దీసివేసి సరస్సులో పారవైచి, శుద్ధమైనజలముచే బంచపల్లవములచే సముద్రజ్యేష్ఠ యని మొదలగు మంత్రములతో నభిషేకము కన్యకుజేసి బ్రాహ్మణ భోజనముజేయ వలెను.

## వరునికి మృతభార్యత్వముపోవుట కుపాయములు

అందు పరివేత్తృత్వపాపమునుండి మృతభార్యాకత్వము వచ్చును. అట్టి పాపమునశించుటకు ప్రాజాపత్య కృచ్ఛ్రములు మూఁడును చాంద్రాయణములు

మూఁడునుజేసి పలుమారు భార్య మృతినొందినచో నవి ద్విరుక్తములుగజేసి, మృత భార్యాకత్వ నిరసనద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం. "అయుతసంఖ్య చ ర్వాజ్య హోమం కరిష్యే" యని సంకల్పించి యగ్ని ప్రతిష్ఠజేసి యన్వాధానము ఎట్లనిన; దుర్గాగ్నివిష్ణూన్ అష్టాధికాయుత సంఖ్యాభిశ్చర్వాజ్యాహుతిభి శ్శేషేణ స్విష్టకృతేయని. మొదలుగ ప్రతి దేవతకు నూరకేనిరూపించి ప్రోక్షించి త్యాగము చెప్పునపు దష్టోత్తరాయుతాహుతి పర్యాప్తం "చర్వాజ్య ద్రవ్యం యథామంత్రలింగం దుర్గాయై అగ్నయే విష్ణవేచనమమ" యని పలుకవలెను. "జాతవేదసేత్యను వాకస్య ఉపనిషదఋషయః దుర్గాగ్ని విష్ణవో దేవతాః త్రిష్టుప్ఛందః చ ర్వాజ్యహోమే వినియోగః" యని పలికి జాతవేదసే యను ననువాకము నావృత్తిజేయుచు ప్రతిఋక్కునకు హోమము. అందు మొదట నైదువేల నాల్గు చర్వాహుతులు. అటుపైని యైదువేలనాల్గా జ్యాహుతులు. ఇట్లు పదివేలాహుతు లచే హోమము. హోమశేషము సమాప్తినొందించి పదుగురు బ్రాహ్మణులకు భోజనము పెట్టవలెను. ఇట్లయుతహోమము చేయవలెను. లేదా యొకబ్రాహ్మణునకు వివాహము జేయవలెను.

## మృతపుత్రత్వదోషమందు బ్రాహ్మణ వివాహము

మృతపుత్రత్వ దోషమున్నచో బ్రాహ్మణునికి వివాహముచేయుట, హరివంశ శ్రవణము, మహారుద్రజపము వీటిలో యథాశక్తిగ నొకటి రెండు మూఁడునైన జేయవలెను. అందు రుద్ర జపమునకు దశాంశముచే నాజ్యమున దడపినదూర్వల హోమము. హరివంశశ్రవణవిధి మొదలగునవి మీఁద సవిస్తరముగ జెప్పఁబడినవి. యథాశక్తిగ నలంకరించి కన్యనిచ్చువాఁడును నశ్వమేధయాగము జేసినవాఁడును ప్రాణభయము గల్గునపుడు భయము పోగొట్టి రక్షించినవాఁడును సమాన పుణ్యము గలవారు. "శ్లో. శ్రుత్వాకన్యా ప్రదాతారం పితరస్సపితా మహాః, విముక్తా స్సర్వపాపేభ్యో బ్రహ్మలోకం వ్రజంతితే." అనఁగా తమవంశస్థుఁడు సాలంకృత కన్యాదానముచేయుట వినఁగానే పితృదేవతలందరు శుద్ధులై బ్రహ్మలోకము నొందుదురని భావము.

## కన్యాగృహమందు తలిదండ్రులకు భోజననిషేధము

శ్లో॥ "విష్ణుంజామాతరంమత్వాతస్యకోపం న కారయేత్. అప్రజాయాంతు కన్యాయాం నాశ్నీయాత్తస్య వైగృహే." అనఁగా కన్యాప్రతి గ్రహీతను విష్ణువుగా భావింపవలెను. గనుక నాతనికి ప్రతికూలముఁ జేయగూడదు. సంతానము గలుగు నంతవరకు నాతని గృహమందు కన్యాదాతలు భుజింపఁగూడదు. వివాహమధ్య మందు కన్యకతో వరుఁడు భుజించినప్పటికి దోషములేదు. అటుపైని స్త్రీతో భుజించి నచో, చాంద్రాయణము జేయవలెను.

## వాగ్దానాదివిచారము

వివాహనక్షత్రాదులతో గూడిన శుభదినమందు వరునితండ్రి మొదలగువారు కన్యాగృహమునకు వెళ్లి, కన్యాపూజనం కరిష్యే, తదంగత్వేన గణపతిపూజనం వరుణ పూజనం చ కరిష్యే యని సంకల్పించవలెను. కన్య తండ్రియును కరిష్యమాణ

కన్యాదానాంగభూతం వాగ్దానం కరిష్యే, తదంగత్వేన గణపతిపూజనం వరుణపూజనం చ కరిష్యే యని సంకల్పించవలెను. తక్కిన ప్రయోగము గ్రంథాంతర మందు దెలియవలెను.

## వివాహ సంకల్పము

వివాహదినమందైనను పూర్వదినమందైనను పసుపు నూనెమొదలగువానితో గన్యకు మంగళస్నానము జేయించి యందు మిగిలినపసుపు మొదలగువానిచే వరునికి మంగళస్నానము జేయవలెనని యాచారము. ఇట్లు వరునితండ్రి మొదలగువారును పత్నితోడను సంస్కార్యుఁడైన పుత్రునితోడనుగూడ నభ్యంగస్నానముజేసి యుతకని క్రొత్తబట్టలుధరించి తూర్పుమొగమై కూరుచుండి తనకు గుడివైపుపత్నియునా మొగుడివైపు సంస్కార్యుండు గూర్చుండగ దేశకాలము లుచ్చరించి "మమాస్య పుత్రస్య దైవపిత్రృణాపాకరణహేతు ధర్మప్రజోత్పాదన సిద్ధిద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం వివాహాఖ్యం సంస్కారకర్మ కరిష్యే, తదంగత్వేన స్వస్తివాచనం మాతృకాపూజనం నాందీశ్రాద్ధం నందిన్యాది మండపదేవతాస్థాపనంచ కరిష్యే తత్రాదౌ నిర్విఘ్నతా సిద్ధ్యర్థం గణపతిపూజనంకరిష్యే" యని సంకల్పించవలెను. కన్యావివాహము జేయునపుడు కన్యకు జాతకర్మాదులు జరుగనిచో, "మమ అస్యాః కన్యాయాజాతకర్మ నామకర్మ సూర్యావలోకన నిష్క్రమణోపవేశనాన్నప్రాశన చౌలసంస్కారాణాంబుద్ధి పూర్వకలోపజన్య ప్రత్యవాయ పరిహారార్థం ప్రతిసంస్కారమర్థం కృచ్ఛ్రం తత్ప్రత్యామ్నాయగో నిష్క్రయీభూత యథాశక్తి రజతదానేనాహ మాచరిష్యే" యని సంకల్పము. గర్భాధాన సీమంతములకును లోపమైనచో నవియు నూహించునది. అటుపైని, మమాస్యాః కన్యాయా భర్త్రాసహ ధర్మప్రజోత్పాదన గృహ్యపరిగ్రహ ధర్మాచరణే ష్వధికారసిద్ధిద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం వివాహాఖ్యం సంస్కారం కరిష్యే యని సంకల్పమందు విశేషము. తక్కినది మీఁద జెప్పినటుల గ్రహించునది భ్రాత వివాహకర్తయైనచో మమభ్రాతుః అనియును మమభగిన్యాః అనియును పినతండ్రి కర్తయగుచో మమభ్రాతుస్సుతస్య అనియును మమభ్రాతృ కన్యాయాః అనియును సంకల్పమునందూహించునది. వరవధువులు స్వయముగానే కర్తృత్వము నొందినచో మమదైవపిత్ర్యఋణేత్యాదికమును మమభర్త్రాసహోత్యాదికము నూహించునది. కొందరు స్వస్తివాచన కాలమందును కన్యాదానాది కాలమందును ప్రధాన వివాహ సంస్కార సంకల్పమును జేయరు. అది ప్రమాదమే యని బహుసమ్మతము. మరికొందరు కన్యాదానవివాహహోమాది సంకల్పమే ప్రధాన సంకల్పము. వివాహమనఁగ నంతకంటె వేరుగాదని యంద్రు. మాతృకాపూజనమైన పైని వరునితండ్రిగాని కన్యకతండ్రిగాని మృతులైన పితృమాతృ మాతామహులు గలుగుఁవాడైనచో పిత్రాదులనుద్దేశించి పార్వణత్రయముతోఁగూడిన నాందీశ్రాద్ధము జేయవలెననుట నిస్సందేహము. అందు తల్లి మాత్రము జీవించియున్నచోఁదత్పార్వణ మునకు మాత్రము లోపము. ఇట్లు మాతామహుఁడు మాత్రము జీవించియున్నచోఁ దత్పార్వణమాత్రలోపము. అపుడు రెండు పార్వణములచేతనే నాందీశ్రాద్ధము సిద్ధించును. తల్లియు మాతామహుఁడు నిద్దరును

జీవించియున్నచోఁ బితృపార్వణముచేతనే నాందీ శ్రాద్ధము. అందుఁబితామహుఁడు మాత్రము జీవించియున్నయెడ పితృప్రపితామహ తత్పితరల నుద్దేశించి పార్వణ పూర్తిజేయవలెను. అపుడు 'పితృప్రపితామహ తత్పితరో నాందీముఖా ఇదం వః పాద్యం' అని మొదలగు నుచ్చరించి ప్రయోగము. ఇట్లు ప్రపితామహుఁడు మాత్రము జీవించునపుడును 'పితామహతత్పితామహానాందీముఖా' యని యుద్దేశము ఇఁక దంఁడ్రిమృతుఁడై పితామహప్రపితామహులు జీవించియున్నచో 'పితఃపితామహస్య పితామహ ప్రపితామహౌచ నాందీముఖా'యని యుద్దేశము. ఇట్లు తల్లిలేక పితామహిమాత్రము జీవించియున్నచో 'మాతఃపితుః పితామహీ ప్రపితామహ్యౌ నాందీముఖా'యని యుచ్చారము. ప్రపితామహీమాత్రమే జీవించి యున్నచో 'మాతృపితామహ్యాపితుఃప్రపితామహ్యాచ' యనియుచ్చారము. పితామహీయు ప్రపితామహియు నిద్దరు జీవించియున్నచో 'మాతః పితామహస్య పితామహి ప్రపితామహ్యాచ' యని యుచ్చరించునది. తనతల్లి జీవించి యుండఁగ సవతితల్లి మృతినొందినప్పటికిని మాతృపార్వణ మకర్లేదు. ఇట్లు ముఖ్య పితామహి జీవించియుండఁగ దత్సపత్ని మృతినొందినను నామెతో మాతృపారణ్వము గూడదు. మరియేమనిన; మీఁదఁజెప్పినటులనే యుచ్చారము. ఇట్లు ప్రపితామహి సవతిమృతి నొందిన నూహించునది. మరియు ముఖ్యమాతామహి జీవించియుండగ నామె సవతి మృతిబొందినను మాతామహునికి పార్వణమందు సపత్నీకత్వ విశేషణ మక్కర లేదు. మరియేమనిన; కేవలము మాతాహాదులకే యుచ్చారము. దర్శాదికమందు దల్లి జీవించియుండఁగ సవతితల్లి మృతినొందినను కేవలము పిత్రాదులకే యుద్దేశ మని సిద్ధాంతము. ఇఁక మాతామహుఁడు లేకమాతుః పితామహుఁడు జీవించినచో మాతామహతత్పితామహప్రపితామహ యని యుచ్చారము. మాతృ ప్రపితా మహుఁడు మాత్రము జీవించినచో మాతామహ మాతృపితామహౌ మాతా మహస్యప్రపితా మహశ్చ నాందీముఖాయని యుచ్చారము. పితామహప్రపితామహులిద్దరు జీవించి నచో మాతామహమాతుః పితామహస్య ప్రపితామహౌచ యని యుచ్చారము.

## జీవత్పితృకుఁడు జేయు నాందీశ్రాద్ధము

ఇఁక జీవత్పితృకుఁడు మృతమాతామహుఁడు నగువాఁడు వివాహోపనయన జాతకర్మాదులయిన పుత్ర సంస్కారములందు మాతృమాతామహ పార్వణములు రెండే చేయవలెను. తల్లిగూడ జీవించినచో మాతామహ పార్వణమొక్కటియే జేయ వలెను. మాతా మహుఁడు జీవించియుండఁగ మాతలేకున్నచో జీవత్పితృకుఁడు పుత్ర సంస్కారములో మాతృపార్వణమే దేవరహితముగ జేయవలెను. ముగ్గురును జీవించియున్నచో పుత్రసంస్కారము జేయునపుడు తండ్రియొక్క పిత్రాదులనుద్దేశించి పార్వణ త్రయమును జేయవలెను. పితృమాతృమాతామహులు ముగ్గురును జీవించి యున్నచో నాందీశ్రాద్ధమునకు లోపమే యని పక్షాంతము గ్రంథారంభమున వ్రాయఁ బడినది.

## తండ్రి కంటె నితరుఁడు కర్తయైనచో నాందీశ్రాద్ధము

ద్వితీయవివాహము సమావర్తనము నాధానము మొదలగు వానియందు స్వసంస్కారములగుట నాందీశ్రాద్ధముజేయుచో జీవత్పితృకుఁడు తండ్రియొక్క పిత్రాదుల నుద్దేశించియే చేయవలెను. అపుడు పితుర్మాతృ పితామహీ ప్రపితామహ్యాః "పితుః పితామహ ప్రతితామహాః పితుర్మాతామహ మాతృపితామహ మాతృప్రపితామహా నాందీముఖా" యని యుచ్చారము అక్కడ తండ్రి తల్లి మొదలగువారు జీవించినచోఁదత్పార్వణమునకు లోపమే. మృతపితృకుఁడైనచో స్వపిత్రాదుల నుద్దేశించి చేయుట యందు సందేహమే లేదు. పితృపితామహులిద్దరు జీవించినచో పితామహుని యొక్క మాత్రాదులనుద్దేశించి పార్వణత్రయమును జేయునది. పితృపితామహ ప్రపితామహులు ముగ్గురును జీవించినచోఁ బితృపార్వణమునకు లోపమే యగును. అపుడు సుతసంస్కారమందువలె స్వసంస్కారమైనపుడును మాతృమాతామహుల యొక్క పార్వణములచేతనే నాందీశ్రాద్ధసిద్ధి యగును. పిత్రాదులు ముగ్గురు జీవించియున్న యెడ మాతృమాతామహులు గూడ జీవించిరేని ప్రపితామహునియొక్క పిత్రాది పార్వణ త్రయము నుద్దేశించి నాందీశ్రాద్ధము. ఇట్లు ప్రథమ వివాహమందైనను పిత్రాదికర్తలు లేనిచో వరుఁడే నాందీశ్రాద్ధము జేయవలసివచ్చినపుడు మృతులైన దనపిత్రాదుల నుద్దేశించి నాందీశ్రాద్ధము జేయవలయును. పిత్రాదికర్తలు దూరదేశస్థులై జీవించి యున్నచోఁ దండ్రియొక్క పిత్రాదుల నుద్దేశించి చేయవలెను. పితృపితామహులిద్దరును జీవించియున్నచో పితామహుని పిత్రాదిపార్వణత్రయమును ప్రపితామహుఁడుగూడ జీవించినయెడ నతని పిత్రాది త్రయము నుద్దేశించి పార్వణత్రయముచే నాందీ శ్రాద్ధము జేయునది. లేదా పితృపార్వణమునకు మాత్రము లోపమైనను జేయవచ్చు నని పక్షాంతరము. మీఁదఁజెప్పిన నాందీ శ్రాద్ధభేదములం దనఁగా తండ్రియొక్క పిత్రాదులనుగాని తాతలయొక్క పిత్రాదులనుగాని యుద్దేశించునపుడు తనమాతృ మాతామహులు మృతులై యున్నప్పటికిని తండ్రియొక్క మాతృమాతామహులు మృతులై యున్నప్పటికిని తండ్రియొక్క మాతృమాతామహుల పార్వణద్వయమునే చేయవలయునుగాని తనమాతృమాతామహులకుగూడదు. పుత్రుని కుపనయనము గాని పినతండ్రి మొదలగువారు చేయవలసినవచ్చినపుడు సంస్కార్యుని తండ్రి మృతుఁడైనయెడ, "అస్యసంస్కార్యస్య పితృపితామహప్రపితామహా నాందీముఖా" యని యుద్దేశము. సోదరభ్రాతజేయునపుడుచ్చారణములో విశేషము లేదు. తనపిత్రాదులు సంస్కార్యుని తండ్రి మృతుఁడైన యెడ, "అస్య సంస్కార్యస్య పితృపితామహ ప్రపితామహ్యానా' మని యుచ్చరింపవలెను. సంస్కార్యుని తల్లి జీవించినచో తత్పార్వణము నకు లోపమే యగును. తండ్రి దూరదేశమందున్నపుడు మేనమామ మొదలగువారు జేయుచో 'సంస్కారస్య పితుర్మాతృపితామహీ ప్రపితామహ్యాః' అనియు 'సంస్కార్యస్య పితుః పితృపితామహ ప్రితామహా' యని యుచ్చరించి వానితండ్రియొక్క పిత్రాదిపార్వణత్రయమును జేయవలెను. సంస్కార్యునికిఁ దండ్రియు తాతయు జీవించియున్నచో మేనమామ మొదలగువారు సంస్కార్యుని తండ్రియొక్క మాత్రాదులను మాతామహాదు

లనుద్దేశించి పార్వణద్వయమే చేయవలెను. ఇట్లు సంస్కార్యునితండ్రికి రెండువర్గము లలో మొదటివారు జీవించియున్నచో నొకవర్గము నుద్దేశించి యొకపార్వణమే చేయ వలెను. తండ్రికి మూఁడువర్గములలో మొదటివారు జీవించినచో మేనమామ మొద లగువారు సంస్కార్యుని తాతయొక్క మాత్రాదివర్గత్రయము నుద్దేశించి పార్వణ త్రయము చేయునది. అట్టి పితామహునికిని మాత్రాదులు జీవించినచోఁదత్పార్వణము నకు లోపమేయగును. పినతండ్రి జీవత్పితృకుఁడైన సంస్కార్యునికిఁ జేయవలసివచ్చి నపుడచ్చారణములో విశేష మకర్లేదు. ఏమనిన; సంస్కార్యుని తండ్రికిని దనకును పిత్రాదివర్గత్రయ మొక్కటియే గదా. పితామహుఁడు చేయునపుడు తండ్రి మృతుఁ డైనచో 'సంస్కార్యస్య పితః మమ పితృపితామహౌ చ నాందీముఖా' యని యుచ్చార ణము. 'సంస్కారస్య మాతృపితామహ్యాదయో మాతామహాదయశ్చ సపత్నీకా' యనియు నూహించునది. సంస్కార్యుని తండ్రి జీవించినచోఁ బితామహుఁడు స్వమాతృపితృ మాతామహ పార్వణములను మమయను పదముతోనైనను లేకుండనైన నుచ్చరింప వచ్చును. ఇట్లు ప్రపితామహుఁడు కర్తయగునపుడు నూహింపవలెను. మరియు కన్యా దానముచేయుట కశక్తుఁడై మరియొకనికి ప్రార్థించినచో నపుడు పరకీయ కన్య నిచ్చువాఁడును ద్రవ్యమిచ్చి కొని కన్యను గ్రహించి దానము చేయువాఁడును కన్యకు దాత లెవ్వరులేనిచో ధర్మార్థము కన్యాదానము చేయువాఁడును, సంస్కార్య రాలగు కన్యయొక్క పిత్రాదుల నుచ్చరించియే నాదీశ్రాద్ధము జేయునది. కన్యకు తండ్రి జీవించియున్నచో మాత్రాదులను మాత్రమే యుద్దేశించి పార్వణద్వయమును వర్గత్రయమునకు మొదటివారు జీవించినచోఁ తండ్రియొక్క పిత్రాదులనుద్ధేశించియు నని మొదలుగ నూహించునది. ఇట్లు పిత్రన్యకర్తృక నాందీశ్రాద్ధమునకు ప్రయోగము. దత్తకన్యకు వివాహము జేయువాఁడు తాను కన్యను ప్రతిగ్రహించి పెంచినతండ్రియే కనుక తన పిత్రాదుల నుద్దేశించియే చేయవలెను. దత్తపుత్రుఁడు జనకుఁడైన తండ్రికి మరివేరైన యధికారిలేనిచో జనకుని పిత్రాదులను పాలకుని పిత్రాదులనుగూడ నుద్దేశించి 'పితరౌపితామహౌ ప్రపితామహౌ నాందీముఖ' యని యుచ్చరింపవలెను. ఇట్లు మాతృపార్వణమందును ద్వివచనమునే ప్రయోగింపవలెను. ఒకవేళ దండ్రికి వేరువారసుదారు లుండుటఁచేఁదండ్రి ధనము తనకురానియెడ నట్లుచ్చరింప నక్కర లేదు. పోషకపితయొక్క పిత్రాదుల నుద్దేశించియే చేయవలెను. నాందీశ్రాద్ధములో సంతతను మాతృపార్వణము మొదటను పైని పితృపార్వణమున నంతరమున మాతామహపార్వణము నని క్రమము సిద్ధాంతితమై యున్నది. గనుక మీఁదవ్రాసి నపుడు క్రమవివక్ష లేక వ్యత్యాసముగ వ్రాసినను యథాక్రమముగనే గ్రహింపవలెను. అందు ఋగ్వేదులకు కాత్యాయనులకు 'మాతృపితామహీ ప్రపితామహ్యో నాందీ ముఖా' యని యుచ్చారము. క్రమముగానే యుండును. యజుర్వేదులకును మరికొందరికిని 'ప్రపితామహ పితామహ పితరః' అని వ్యుత్క్రమముగా నుచ్చారమని తెలియవలెను. ఒకసంస్కార్యుని కనుక సంస్కారములు యౌగపద్యముచేఁ జేయునపు డొక్క నాందీశ్రాద్ధమే చేయవలెను. ఇట్లు కవలలైన యిద్దరికిని కన్యలకుగాని పుత్రులకు

గాని వివాహోపనయనాది సంస్కారము లొకమారే చేయఁదలఁచినపుడును నాందీ శ్రాద్ధ మొక్కటియే చేయవచ్చును. కవలకు సంస్కారములు చేయునపు డొక్కమండప మందొక్క ముహూర్తమందొకకర్తయే చేయవచ్చునని మీఁదఁ జెప్పఁబడినది. నాందీశ్రాద్ధమందన్నముచే సంబవించనియెడ నామముచేతను అదియు సంభవింప నిచో హిరణ్యముచేతను జేయవచ్చును. హిరణ్యము సందర్భించనిచో నిద్దరు విప్రు లకు భోజనపర్యాప్తమైన యన్నమునకు నిష్క్రయమైన ద్రవ్యమును 'స్వాహానమమ' యని త్యజింపవలెను. తక్కిన విశేషమంతయు గర్భాధానప్రకరణమందు సవిస్తరముగఁ జెప్పఁబడినది.

## గర్భాధాన ప్రకరణము

మండపదేవతాస్థాపనమును గ్రహయజ్ఞమును స్వస్తివాచనమునకుఁ బూర్వ మందైనను నాందీశ్రాద్ధమునకుఁ బరమందైనను జేయవచ్చును. అటుపైని గన్యాదాత వరునిగృహమునకు వెళ్ళి "కరిష్యమాణ వివాహాం గత్వేన వరస్య సీమాంతపూజాం కరిష్యే" యని సంకల్పించి గణేశుని వరుని బూజించి వరుని పాదప్రక్షాళన వస్త్రపుష్ప గంధ ధూప నీరాజనములచే బూజించి యాచారానుసారముగ దుగ్ధాదిప్రాశనము జేయించవలెను. అటుపైని వరుఁడు మంగళవాద్యఘోషములతోవాహనారూఢుఁడై వధూగృహమునకు వెళ్ళవలెను. అపుడు యథాచారముగ వరునితండ్రి కన్యను వస్త్రాలంకారాదులచే గౌరవించవలెను. లగ్నదినమందు గన్యాదాతయైనను గన్య యైనను సువర్ణముచేతగాని వెండిచేతగాని నిర్మించిన యర్ధనారీశ్వర ప్రతిమను కాత్యాయని మహాలక్ష్మి శచియు వీరితోఁ గూడఁ బూజింపవలెను. అందు నాల్గు మూలలు గానుంచిన కలశపఙ్క్తుల మధ్యమందు సన్నెకల్లు పొత్తరముపై నైనను వస్త్రమందైనను బియ్యమునింపి యందుఁ బార్వతీపరమేశ్వరులఁ బూజింపవలెను. అపుడు మంత్రము. శ్లో. "సింహాసనస్థాం దేవేశీం సర్వాలంకారసంయుతాం, పీతాం బరధరం దేవం చంద్రార్ధకృత శేఖరం, కరేణాదస్సుధాపూర్ణం కలశం దక్షిణేవతు, వరదం చాభయం వామేనాశ్లిష్య చ తనుప్రియాం." అని యనఁగా సమస్తాభరణ భూషితురాలైన దేవిని సింహాసనమందున్నట్లును వరదాభయహస్తములును నమృత కలశమును ధరించి చంద్రకలాధరుఁడైన పరమేశ్వరుఁడు పీతాంబరధరుఁడై యెడమ హస్తముచే దేవి నాలింగముజేసినట్లును ధ్యానించవలెను.

## లగ్నమందు గౌరీహరుల పూజ

శ్లో॥ "గౌరీహరమహేశాన సర్వమంగళ దాయక, పూజాం గృహాణ దేవేశ సర్వదా మంగళంకురు."అని యనఁగా సమస్తమంగళములిచ్చునోయర్ధనారీశ్వరుడా! యీపూజను గ్రహించి మాకెప్పుడును శుభముదయసేయుమనియర్థముగల మంత్ర ముచే సర్వోపచారములిచ్చి పూజించునది కన్య పొడవుతో సమమైన పొడవుగల పదునేడు నూలుదారములుగలపివర్తిజేసి దీపము వెలిగించి సువాసినుల కును బ్రాహ్మణులకును భోజనము పెట్టవలెను. ఇట్లు గౌరీపూజ ఇరువదేనుదర్భలచే వైనల్లి నొసలుపై వ్రేలునట్లు ముడివేసిన యాస్తరణము సిద్ధము చేయవలెను.

## మధుపర్కము

శ్లో.“వరస్యయా భవేచ్ఛాఖాతచ్ఛాఖా గృహ్యాచోదితః, మధుపర్కః ప్రదాతవ్యో హ్యన్యశాఖేపి దాతరి” అనఁగా వరునిశాఖలో గృహ్యాసూత్రముచే విధించఁబడిన ప్రకారమే తా నన్యశాఖీయుఁడైనను మధుపర్కమీవలెనుగాని తనశాఖ చొప్పున నివ్వఁగూడదు. పెరుగు తేనెయు గలసినది మధుపర్క మనఁబడును. పెరుగు దొరకనిచోపాలైన నుదకమైన గలవచ్చును. తేనెదొరకనిచో గుడోదకము ప్రతినిధి యగు. ‘గృహాగతం స్నాతకం వరం మధుపర్కేతార్హయిష్యే’ యని సంకల్పము. ద్వితీయ వివాహమైనచో స్మాతకమ్మనుపద మక్కరలేదు. అటుపైని గృహ్య సూత్రానుసారముగ మధుపర్క ప్రయోగము దెలియునది. ఇట్లు గురువులు పెద్దలు రాజు మొదలగువారు గృహమునకు వచ్చునపుడు మధుపర్కముచేఁ బూజింపవలెను. ఇట్లు యజ్ఞమందు వరించఁబడిన ఋత్విజులను బూజించునది. ఋత్విజులు మొదలగువారికిని వారి శాఖచేతనే మధుపర్కము. జయంతుఁడను గ్రంతకర్త మాత్రము యజమానుని శాఖ చేతనే యంతటను మధుపర్కమని చెప్పెను. అపుడు గంధపుష్పధూప దీపాదులిచ్చి పూజాంతమందు గారెలతో భక్ష్యములు భోజనార్థ మీవలెను. ఇట్లు మధుపర్కమందు గాని యంతకుఁ బూర్వమందుగాని భుజించినవరునికే దాత యుపవాసముతో నుండి కన్య నీయవలెను.

## లగ్నఘటీస్థాపనము

పదిపలములయెత్తు రాగిచే నారంగులముల పొడవును బండ్రెండంగుళముల విస్తారముగల గిన్నెచేయించి ఘటీయంత్రము చేయవలెనని సింధువు. “ద్వాదశార్ధపలో మానం చతుర్భిశ్చతురంగులైః, స్వర్ణమాషైః కృచ్ఛిద్రం యావత్ప్రస్థజలప్లుతం” అని శ్రీభాగవత తృతీయస్కంధమునందున్నది. అనఁగా నేను బదిగుంజలయెత్తు కర్షము దీనికే సువర్ణ సంజ్ఞయు గలదు. అట్టి కర్షములు నాలుగుఫలమనఁబడును. అట్టి యారుపలాలరాగిచే నిర్మించిన ప్రస్థజలము పట్టెడిగిన్నెకు నిరువది గుంజలయెత్తు సువర్ణము నాలుగంగుళముల పొడవుగ తీగెదీసి దానిచే గ్రింద రంధ్రమువొడిచి జలములో వైచినది మొదలు ప్రస్థజలము నిండువరకు నగు కాలము గడియ యనఁ బడును. అందు ప్రస్థమనఁగ బదారుపలములు. “పలం సువర్ణాశ్చత్వారః కుడవః ప్రస్థమాఢకం, ద్రోణంచ ఖారికాచేతి పూర్వపూర్వ చతుర్గుణం.” అని అనఁగా నాల్గు సువర్ణములు పలము నాల్గు పలములు కుడవము, నాల్గు కుడవములు ప్రస్థము, నాల్గు ప్రస్థములాఢకము, నాలుగాఢకములు ద్రోణము, నాల్గు ద్రోణములు ఖారి యనుట గ్రంథాంతరమందు నాలుగు పిడికిళ్లు కుడవము, నాల్గు కుడవములు ప్రస్థమని యున్నది. కొందరు పలమనఁగ నరువదియగుర్వక్షరము లుచ్చరించు కాలము. అట్టిపలము లరువదియైనచో గడియ యగుననిరి. ఇట్లు ప్రమాణీకృతమైన ఘటీయంత్రమును సూర్యుని యర్ధోదయమందుగాని యర్ధాస్తమయమందుగాని జల పూర్ణమైన తామ్రపాత్ర మందైనను విడువవలెను. అపుడు మంత్రము “ముఖం

త్వమసి యంత్రణాం బ్రహ్మణానిర్మితం పురా, భవభావాయదంపత్యోః కాలసాధన కారణం" అని యీ మంత్రముచే గణేశవరుణులపూజ ముందుజేసి ఘటీయంత్రము స్థాపించవలెను. ఈలాగుస్థాపించిన ఘటీయంత్ర మాగ్నేయ నైఋతి యామ్యవాయవ్య దిక్కుల నడచినచో శుభముగాదు. మధ్యమందు నిల్చినను నితరదిక్కున నడచినను శుభము. ఇట్లాగ్నేయాదిపంచ దిక్కులలో నిండినచో నశుభము.

## ఇది ఘటికావిచారము

అనంతరమందు జ్యోతిర్వేత్త లుపదేశించిన శుభకాలమందు మధ్యమందు మూరె డెడముండునట్లు తూరుపుపడమరలను రెండు బియ్యపుప్రోగులుపోసి తూర్పు ప్రోవువద్ద మాభిముఖునిగా వరుని గూర్చుండపెట్టి రెండవ రాసివద్ద కన్యను దూర్పు మొగముగ గూర్చుండబెట్టిన వారిమధ్యమందు గుంకుమతో రచియించిన స్వస్తికాది చిహ్నములతోఁగూడిన మంచిబట్టనుత్తరమునకు వస్త్రాంతముజేరునటుల తెరగాఁ బట్టవలెను. కన్యావరులయొక్క తండ్రిమొదలగువారు జ్యోతిర్వేత్తను బూజించి యాతఁ డిచ్చిన యక్షతలను ఫలములతో కన్యావరుల యొక్క దోసిళ్లయం దుంచవలెను. అట్టిచ్చిన యక్షతలు ధరించి కన్యావరు లంతఃపటమందలి స్వస్తికాది చిహ్నములు చూచుచు 'అముకదేవతాయైనవమ' యని తమతమ కులదేవతలను ధ్యానింపుచు నుండవలెను. జ్యోతిర్వేత్త మంగలాష్టక శ్లోకములు పఠించినపైని తాను నిర్ణయించిన కాలమందు 'సుముహూర్తమస్తు. ఓం ప్రతిష్ఠా' యనిన పైని నాతెర నుత్తరము వైపున దీసివేయవలెను. అటుపైని గన్యావరులు పరస్పరము సిరస్సులపై నక్షతారోపణ మును నొకరినొకరు చూచుటయు జరుగవలెను. వరుఁడు వధువుయొక్క బొమల నడుమను దర్భాగ్రములచే, ఓం భూర్భువస్వః అని తుడిచి దర్భను విడిచి యుదకము స్పృశించునది. వేదవేత్తలు పఠించుచున్న బ్రాహ్మణ ఖండముయొక్క ప్రతివాక్యము తుదిని కన్య మొదలగునట్లు వరవధువు లక్షతలు చల్లవలెను. అటుపైని వరుని తూర్పున కభిముఖునిగాను కన్యను పశ్చిమమున కభిముఖముగాను గూర్చుండబెట్టి దాత తాను దనపత్నియు దక్షిణమువైపున గూర్చుండి వరుడిచ్చిన యలంకారాదులు లేకుండఁగ గ్రొత్తచీరయు దానిచ్చిన యలంకారములు ధరించిన కన్యను వరపూజఁ జేయగ మిగిలిన చందనాదులచే హస్తపాదముల నలంకరించి తన హస్తమందు హిరణ్యముంచునొని యీవిధిగా దానముచేయవలెను. ఎట్లనిన; దర్భలు ధరించి దేశకాలముల నుచ్చరించి, "అముక ప్రవరాముక గోత్రోముక శర్మాహం మమ సమస్త పితౄణాం నిరతిశయానంద బ్రహ్మలోకావాప్త్యాది కన్యాదాన కల్పోక్త ఫలా వాప్తయే అనేన వరేణాస్యాం కన్యాయాముత్పాద యిష్యమాణసంతత్యా ద్వాదశావరాన్ ద్వాదశ పరాంశ్చ పురుషాన్ పవిత్రీకర్తుం ఆత్మనశ్చ లక్ష్మీనారాయణ ప్రీతయే బ్రాహ్మ వివాహ విధినా కన్యాదానం కరిష్యే" యని కుశాక్షత జలములతో సంకల్పించి లేచి కన్యను గ్రహించి, "కన్యాం కనక సంపన్నాం కనకాభరణైర్యుతాం, దాస్యామి విష్ణవే తుభ్యం బ్రహ్మలోకజిగీషయా. విశ్వంభర స్సర్వభూతా స్సాక్షిణ్య స్సర్వదేవతాః, ఇమాం కన్యాం ప్రదాస్యామి పితౄణాం తారణయా చ." అని యుచ్చరింపుచు గంచుపళ్లె

మందుంచిన కన్యకదోసిలిపై వరునిదోసలియుంచి కుడివైపున నున్న తనభార్యచే వంచఁబడిన యవిచ్ఛిన్నమైన శుద్ధజలధారను హిరణ్యముతోఁగూడిన వరహస్తమం దుంచవలెను. "కన్యాతారయతు పుణ్యం వర్ధయతు శాంతిః పుష్టిశ్చాస్తు. పుణ్యాహం భవంతో బ్రువంతు"అని మొదలగు వాక్యచతుష్టయము నుచ్చరించినపైని, "అముక ప్రవరాముకగోత్రోఽ ముక శర్మాహం మమ సమస్త" యని మొదలగు ప్రీతయే యను పర్యంతము నుచ్చరించి, "అముకప్రవరోపేతాముక గోత్రాయ అముక శర్మణః ప్రపౌత్రాయాముకశర్మణ, పౌత్రాయాముకశర్మణః పుత్రాయాముకశర్మణే శ్రీధరరూపిణే వరాయ, అముకప్రవరాముక గోత్రస్యాముకశర్మణః ప్రపౌత్రీం అముకశర్మణః పౌత్రీం అముకశర్మణో మమ పుత్రీం అముకనామ్నీం కన్యాం శ్రీరూపిణీం ప్రజాపతి దేవత్యాం ప్రజోత్పాదనార్థం తుభ్యమహం సంప్రదదే" యని హిరణ్యముతోఁ గూడిన వరహస్త మందు నక్షతలు జలము నుంచవలెను. "ప్రజాపతిః ప్రీయతాం, కన్యాం ప్రతిగృహ్ణాతు భవాన్." అని ముమ్మారు పలుకవలెను వరుఁడు. 'ఓం స్వస్తి' యని పలికి కన్యా దక్షిణను స్పృశించి "క ఇదంకస్మా అదాత్ – పృథివీ ప్రతిగృహ్ణాతు" అని ముమ్మారు పలికి "ధర్మప్రజాసిద్ధ్యర్థం ప్రతిగృహ్ణామి" యని పలుకవలెను. ఇఁక దాతయు "గౌరీం కన్యామిమాం విప్ర యథాశక్తి విభూషితాం, గోత్రాయ శర్మణే తుభ్యం దత్తాం విప్ర సమాశ్రయ కన్యే మమాగ్రతో భూయాః కన్యేమే దేహి పార్శ్వయోః, కన్యేమే పృష్ఠతో భూయా స్త్వద్దానాన్మోక్షమాప్నుయాం. మమవంశకులే జాతా పాలితా వత్సరాష్టకం, తుభ్యం విప్రమయాదత్తా పుత్రపౌత్ర ప్రవర్ధినీ" అనఁగా మావంశమందు బుట్టి యెనిమిదివత్సరములు పెంచఁబడినది. యథాశక్త్యలంకారముతో నీకు దానము చేయఁబడినది. పుత్రపౌత్రాదులచే వంశాభివృద్ధిజేయు దీని నవలంబింపుము. ఓ కన్యక! నీవు నాముందును వెనుకను పార్శ్వములందును గాపాడుము. నీదానముచే మోక్షమందెదనని యర్థము. ఇట్లు పలికి "ధర్మే చార్థే చ కామే చ నాతి చరితవ్యేయం" అనఁగా ధర్మార్థకామములందు దీని నతిక్రమింపఁగూడదని పలికినపై వరుఁడు "నాతిచరామి" అనఁగా నతిక్రమించనని పలుకవలెను. దాత గూర్చుండి "కన్యాదాన ప్రతిష్ఠాసిద్ధ్యర్థం ఇదం సువర్ణం సంప్రదదే"యని సువర్ణదక్షిణ నీవలెను. వరుఁడు 'ఓం స్వస్తి' యని ప్రతిగ్రహించవలెను. అటుపైని భోజనపాత్రదానము మొదలగునవి చేయునది. పితామహుఁడు కన్యాదాతయైనచో పౌత్రీం అనునపుడు మమయని యుచ్చరింపవలెను. గాని మమ యని యెక్కడను నన వలనుగాదు. ప్రపితామహుఁ డే కర్తయైనచో ప్రపౌత్రీమనునపుడు మమయని యుచ్చరించునది. మేనమామ మొదలగు వారుగాని కేవలమన్యుఁడే గాని దాతయైనచో తన గోత్రమును దనకు విశేషణముగ నుచ్చరించి "యముకశర్మణ స్సమస్తపితౄణా" మనునపుడు కన్యా పితృనామము షష్ఠ్యంతముగ నుచ్చరించునది. కన్యకు విశేషణము నాతని గోత్రాది కము నుచ్చరించవలెను. మమ వంశకులేజాతా యనునపుడు మమ యనుదానికి బదులుగా గన్యాపితృనామమునే యుచ్చరించునది. దత్తకన్య నిచ్చుచో మమవంశకు లేదత్తా యని పాఠము.

# కన్యాదానమున కంగముగఁజేయు గోదానము మొదలగువాని మంత్రములు

శ్లో. "యజ్ఞసాధనభూతాయా విశ్వస్యా ఘౌఘనాశినీ, విశ్వరూపధరో దేవః ప్రీయతామనయా గవా" అని గోదానమంత్రము. అనఁగా యజ్ఞమునకు సాధనమైన పయస్సునిచ్చుచు మూత్రపురీషములచేఁ సహితము జగత్తును పవిత్రము జేయు గోవును దానముచేయుటచేఁ బ్రపంచ స్వరూపుఁడైన దేవుఁడు ప్రీతినొందుఁగాక యని యర్థము. "శ్లో. హిరణ్యగర్భ సంభూతం సౌవర్ణం చాంగులీయకం, సర్వప్రదం ప్రయచ్ఛామి ప్రీణాతు కమలాపతిః" అని యుంగర మీయవలెను. అనఁగా సువర్ణము బ్రహ్మవలన బుట్టినది. సమస్తమంగళముల నిచ్చునది. అట్టి సువర్ణమయమైన యుంగరము నిచ్చుటచే లక్ష్మీపతి ప్రీతినొందుగాక యని యర్థము. "శ్లో. క్షీరోదమథనే పూర్వముద్ధృతం కుండలద్వయం, శ్రియాసహసముద్భూతం దదే శ్రీః ప్రీయతాం మితి" అని కుండలము లీవలెను. అనఁగా పాలసముద్రమును మథించునపుడు భగవంతుని కలంకారముగ లక్ష్మీదేవితోఁ గుండలద్వయము పుట్టినది. అట్టి కుండల ములనే నిచ్చితిని. లక్ష్మీప్రీతినొందుగాక యని యర్థము. శ్లో. "కాంచనం హస్తవలయం రూపకాంతి సుఖప్రదం, విభూషణం ప్రదాస్యామి విభూషయతు మే సదా" యని వలయము లీవలెను. అనఁగా బంగారు కడియములు రూపమును గాంతిని సుఖము నిచ్చును. వీనినిచ్చుటయే నాకెపుడు నలంకారమగుగాక యని యర్థము. "శ్లో. పరాపరవాదపై శున్యాదభక్ష్యస్య చ భక్షణాత్, ఉత్పన్నదోషో దానేన తామ్రపాత్రస్య నశ్యతు" అని రాగిజలపాత్ర మీవలెను. అనఁగా పరుల కపవాదము దెచ్చుట కొండెతనము నభక్ష్యభక్షణము వలన గలిగిన నాపాప మీతామ్రపాత్రదాన ముచే నశించుగాక యనుట. శ్లో."యాని పాపాని కామ్యాని కామోత్థాని కృతాని చ, కాంస్య పాత్ర ప్రదానేన తాని నశ్యంతు మే సదా" యని భోజనార్థము కంచెపళ్లె మీవలెను అనఁగా నితరమైన కామముచేఁ జేయఁబడిన పాపములన్నియు నీ కాంస్య పాత్రదానముచే నశింపవలయుననుట. "శ్లో. అగమ్యాగమనం చైవ పరదారా భిమర్శనం, రౌప్యపాత్ర ప్రదానేన తాని నశ్యంతు మే సదా" యని జలార్థమును భోజనార్థము నుపయోగించు వెండిచెంబు వెండిపళ్లెము నీవలెను. అనఁగ పరస్త్రీ సంగము వలనను నందులో వావిగూడని స్త్రీలను చండాలాది స్త్రీలను గూడినందున సహితము వచ్చిన పాపము నశించుగాక యనుట, "శ్లో. పూరితం పూగపూగేన నాగవల్లీ దళాన్వితం, పూర్ణేనచూర్ణపాత్రేణ కర్పూరపిష్టకేన చ, సపూగఖండనం దివ్యం గంధర్వాప్సరసాం ప్రియం, దదే దేవ నిరాతంకం త్వత్ప్రసదా త్కురుష్వమాం" అని తాంబూలపేటిక యనఁగ పాన్‌దానునీవలెను. అనఁగా పోకచెక్కలు, తమ్మలపాకులు సున్నపుగాయము నడకత్తెల కర్పూర చూర్ణముతోఁ గూడిన యీపాన్‌దాను గంధర్వాప్స రసలకు ప్రియమైనది. దీని నిచ్చుటచే దేవదేవుఁడు నన్ను నిర్బాధుని జేయుగాక యనుట. ఇట్లు దాసియు మహిషి యనఁగ గేదెయు గజము నశ్వము భూమియు

స్వర్ణ పాత్రయు పుస్తకము శయ్యయయు గృహము రజతము వృషభము మొదలుగ నిచ్చునపుడ మంత్రములు కౌస్తుభమందు దెలియవలెను. అంతఃపటము ధరించుట మొదలుగ గన్యాదానము వరకును గొంద రగ్ని, ప్రతిష్ఠాపనమైన పైని జేయుదురు. కొందరు పూర్వాంగహోమ మయినపయిని జేతురు. కొందరాజ్య సంస్కారమైన పైని జేతు. రిట్లనేక పక్షములు గలవు. అందు దమతమ గృహ్య సూత్రానుసారముగ నాచారముబట్టి వ్యవస్థ జేసుకొనవలెను.

## అక్షతారోపణము

అనంతరమందు వధూవరులకు స్నానము నాపైని గంకణబంధము ననంతర మందక్షతారోపణము. వధూవరులిద్దరు పరస్పరమునకు దిలకముంచుట పూలమాలిక గట్టుటయుఁజేసి యష్టపుత్రి, కంచుకి మంగళసూత్రము మొదలగునవి యిచ్చుట. గణేశపూజ, లడ్డుకము నుంచి ముడివేయుట వధూవరులపై చెంగులు కలిపి ముడి వేయుట, లక్ష్మ్యాదిపూజ, అని యిట్లు కన్యాదానమందుఁ జేయు క్రియలకుఁ గ్రమము తరుచుగ ఋగ్వేదుల కగును. ఇతరశాఖలీయులకు వారి గృహ్యసూత్రము బట్టి తెలియవలెను.

## వివాహహోమము

వధూవరులిద్దరు మీఁదఁజెప్పిన లక్షణములు గలవేదికను మంత్రఘోషముతో నెక్కినపైని వరుఁడు పెళ్లిపీటయందుఁ గూర్చుండి కుడివైపు వధువును, గూర్చుండఁ బెట్టి దేశకాలముల నుచ్చరించి "ప్రతిగృహీతాయామస్యాం వధ్వాం భార్యాత్వసిద్ధయే వివాహ హోమం కరిష్యే" యని సంకల్పించి గృహ్యసూత్రానుసారముగ వివాహ హోమము జేయవలెను. అదిమొదలుకొని వివాహాగ్నిని సంరక్షించవలెను. అట్లు చతుర్థీహోమపర్యంతము రక్షింపఁబడు నగ్నిగృహ ప్రవేశనీయహోమమునకు మున్ను నశించినచోఁదిరుగ వివాహ హోమము జేయునది. గృహప్రవేశనీయ హోమానంతర మందు నష్టమైనచో రెండుహోమములను దిరుగ జేయవలెను. కొందరు ద్వాదశ రాత్ర పర్యంతము వ్యత్యుక్తమగు నయాచ్చయనునాజ్యాహుతి సార్వత్రికమని యిచ్చుట గూడ నయాశ్చయను నాజ్యాహుతినే చేయుదురు.

## గృహప్రవేశనీయ హోమము

అది వధువుతోఁగూడ స్వగృహమును ప్రవేశించి యిచ్చట జేయవలెనని విధింపఁ బడినది. అయినను శిష్టులు మామగారింటనే చేయుచున్నారు. అపుడర్ధ రాత్రానంతరము వివాహహోమమైనచోఁబరదినమందయ కాలమున దేశకాలము లుచ్చరించి, "మమాగ్నేర్గృహ్యాగ్నిత్వసిద్ధి ద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం గృహప్రవేశనీయా ఖ్యం హోమం కరిష్యే" యని సంకల్పము. అర్థరాత్రమునకంటెఁ బూర్వమే వివాహ హోమమైనచో నపుడే తిరుగ సంకల్పించి గృహప్రవేశనీయహోమము రాత్రిజేసినను దోషములేదు. ఇఁక వివాహహోమము గృహప్రవేశనీయ హోమము రెండును దంత్ర ముచే నొక్కమారే చేతు రదియుక్తముగాదు. ఏమనిన; వివాహాగ్నికే గ్రహప్రవేశనీయ

హోమ మైనపైని గృహ్యాగ్ని త్వసిద్ధియాశ్వలాయన తైత్తిరీయాదుల కగును. తైత్తిరీయ కాత్యాయనులకైనచో నాధానమందు మరియొక ప్రకారమున్నది. ఎట్లనిన; రాత్రియం దారు గడియల లోపున నగ్నిపుట్టినచో నపుడు గ్రహప్రవేశనీయ హోమములేకున్నను వ్యతీపాతాదు లున్నప్పటికి నపుడే యౌపాసనహోమ మారంభింపవచ్చును. ఆరుగడి యలు దాఁటినచో ఁబరదినమందు సాయంకాలము, దౌపాసన మారంభించునది. అతి యెట్లనిన; సాయంసంధ్యావందనముజేసి వివాహాగ్నిని జ్వలింపఁజేసి ప్రాణా యామ మొనర్చి దేశకాలముల నుచ్చరించి, "అస్మిన్ వివాహాగ్నౌ యథోక్తకాలే శ్రీపర మేశ్వర ప్రీత్యర్థం యావజ్జీవ మౌపాసనం కరిష్యే" యని సంకల్పించి తిరుగ దేశ కాలము గీర్తించి "శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం సాయంప్రాతరౌపాసన హోమౌకరిష్యే, తత్రేదానీం సాయమౌపాసనంకరిష్యే"యనియు నుదయకాలమందుఁ "బూర్వ సంక ల్పిత ప్రాతరౌపాసనంకరిష్యే" యనియు సంకల్పము. ఆ పైని హోమము జేయునది అట్లు మూఁడు రాత్రుల పర్యంతము వధూవరులు బ్రహ్మచారులై యలంకరించుకొని క్షారలవణములు లేకుండఁగ భుజింపుచు నధశ్శయనము జేయుచు నుండవలెను.

## నాల్గవదినమం దైరిణీదానము

అదియు వధువుయొక్క తలిదండ్రు లుపవాసముజేసి యుపోషితురాలయిన వరుని తల్లికిఁ జేయవలెను. అపుఁడామె రజస్వలయైనచో శుద్ధిపర్యంతము ప్రతీక్షిం చుట కసందర్భమైనయెడ "మనసా పాత్రముద్దిశ్య జలమధ్యే జలం క్షిపేత్" అను న్యాయము మనస్సులోనుద్దేశించి యైరిణీదానము జేయునది.

## వధూవరుల తల్లులు రజస్వలలైనచో నిర్ణయము

వధూవరులయొక్క తల్లులు వివాహమైనపైని దేవతోత్థాపనమునకు మున్ను రజోదోషము నొందినచోఁ బూర్వోక్తమైన శాంతిజేసి కుద్ధియైన పైనిగాని నిర్బంధ మైనచో నపుడేకాని దేవతోత్థాపనము జేయవచ్చును. మేనమామ మొదలగువారు కర్తలైనపుడు వారి భార్యలు రజస్వలలైనచోఁ జేయునది యుపనయన ప్రకరణమందుఁ జెప్పఁబడినది.

## వివాహమైన పైగా నాశౌచము వచ్చుచో నిర్ణయము

ఇట్లు వివాహమైనపైని యాశౌచము వచ్చినచో నాల్గవదినము కృత్యము పర్యంతము ప్రాప్తించిన కర్మజేయుటకు దాతకు వరునికి గన్యకుసు నాశౌచమంటదు. ఆశౌచశుద్ధిపైని దేవతోత్థాపనము జేయునది. అట్లు సంభవించనియెడ నాశౌచ్యమధ్య మందే దేవతోత్థాపనముజేసి యాశౌచము జేయవచ్చును. వివాహమునకంటెఁ బూర్వమే యాశౌచరజోదోషములైనచో మీఁదఁజెప్పఁబడినది. చతుర్థీకర్మహోమము కౌస్తుభమందున్నది. ఇది కొందరు ఋగ్వేదులు చేయరు.

## మండపోద్వాపనమైన పైఁ గార్యాకార్య నిర్ణయము

మండపోద్వాపనమునకు దిననిర్ణయమును మండపోద్వాపన పర్యంతము కర్తవ్యాకర్తవ్య నిర్ణయము నుపనయన ప్రకరణోక్త ప్రకారమున దెలియవలెను. "శ్లో.

నస్నాయాదుత్సవేఽ తీతే మంగళం వినివర్త్య చ, అనువ్రజ్య సుహృద్బృందూ నచ్చ యిత్వేష్ట దేవతాం.”అనఁగా నుత్తసవానంతరమందును మంగళకర్మజేసిన పైని బంధువుల సుహృత్తుల బ్రయాణమునంపియు నిష్టదేవతాపూజాంతమునను స్నానము జేయఁగూడదని; “శ్లో. స్నానంసచేలం తిలమిశ్రకర్మ ప్రేతానుయానం కలశప్రదానం, అపూర్వ తీర్థామరదర్శనం చ వివర్జయే న్మంగలతోఽ బ్దమేకం.”అనఁగా కట్టుబట్టలతో స్నానము తిలలతోఁ జేయుకర్మయుశవముతోఁ గూడనడుచుట కలశదానము క్రొత్త తీర్థక్షేత్రములఁ జూచుటయు మంగళకార్యము జేసినపైని సంవత్సర పర్యంతము గూడదు. “శ్లో. మాసషట్కం వివాహాదౌ వ్రతప్రారంభణేఽ పిచ, జీర్ణభాండాది నత్యా జ్యం గృహసంమార్జనం తథా.” అనఁగా వివామాదికమందును వ్రతప్రారంభమం దును నారుమాసముల పర్యంతము జీర్ణభాండాదికము పారవేయఁగూడదు. గృహము దుడువగూడదని. “శ్లో. ఊర్ధ్వం వివాహాత్పుత్రస్య తథాచ వ్రతబంధనాత్, ఆత్మనో ముండనం చైవవర్షం వర్షార్ధమేవ చ, మాసమన్యత్ర సంస్కారే త్రిమాసం చౌలకర్మణి, పిండదానం మృదాస్నానం కుర్యాత్తిలతర్పణం” అనఁగా పుత్రునికి వివాహము జేసిన పైని సంవత్సర పర్యంతమును నుపనయనమైనచో నారుమాసములును చూడా కర్మయైనచో మూఁడు మాసములును వృద్ధిశ్రాద్ధముతోఁగూడిన యితర మంగళకార్యమునందొకమాసమును దాను క్షౌరము జేసుకొనగూడదు. మరియు దానును దన బంధుత్రయములో సపిండులగు వారును నట్లు పిండదానమును మృత్తికాస్నానమును దిలతర్పణమును జేయఁగూడదు. “వ్రతో ద్వాహౌతు మంగళ”మను పక్షములోనే యుపనయముపైని యీముండననిషేధము. ఉపనయనము ముండనరూపమే యనినచో నిషేధములేదు. ఇక్కడ ముండనమనఁగఁ గర్మాంగమై ప్రాప్తించినదియు నిచ్ఛవేఁ జేయునదియు రెండును గూడదని నిషేధము. ఇందు నపవాదము; అనఁగా కొన్ని కర్మలలో క్షౌరము జేసుకొనక తప్పదు. ఎట్లనిన; “గంగాయాం భాస్కరక్షేత్రే మాతాపిత్రోర్మృతే హని, ఆధానే సోమయాగే చ దర్శాదౌ క్షౌరమిష్యతే, మహాలయే గయాశ్రాద్ధే పిత్రోః ప్రత్యాబ్దికేతథా, సాపింద్యాంతే ప్రేతకర్మ శ్రాద్ధషోడశ కేష్వపి, కృతో ద్వాహాదికః కుర్యాత్పిండదానం చ తర్పణం, కేచిద్భ్రాతృపితృవ్యాదే రాబ్దికేప్యేవ మూచిరే.” యని యనఁగా గంగాతీర్థమందును భాస్కర క్షేత్రమందును తలిదండ్రులు మృతినొందినపుడును నాధానము జేయునపుడును యజ్ఞము జేయునపుడును యజ్ఞము జేయునపుడును నమావాస్యయందును క్షౌరము గావచ్చును. ఇట్లు పిండదానమునకును మహాలయశ్రాద్ధమందును గయాశ్రాద్ధమందును తల్లిదండ్రుల ప్రత్యాబ్దిక మందును సాపింద్యాంతమైన ప్రేతకర్మయందును షోడశశ్రాద్ధమందును పిండనిషేధములేదు. ఇట్లు తర్పణము జేయవచ్చును. కొందరు సోదరుఁడు పినతండ్రి మొదలగువారి ప్రత్యాబ్దికమందు నిట్లు నిషేధము లేదనిరి. అట్లనే పిండపితృయజ్ఞమందును అష్టకాన్వష్టకా పూర్వేద్యుశ్శ్రాద్ధములందును పిండదాన నిషేధము లేదు. దర్శశ్రాద్ధము పిండరహితముగనే చేయవలెను. కాఁబట్టి ఋగ్వేదులకు శ్రాద్ధములలో వ్యతిషంగమనఁగ నొకదానిలో మరియొకటి కలుపుట లేదు. ఇట్లు మండపోద్వాసనముపై గార్యాకార్య నిర్ణయము.

# వధూప్రవేశము

వివాహమైనపైని పదియారు దినములలోగా సరిదినములందును నైదు నేఁడు దొమ్మిదియాదినములందును రాత్రియందు స్థిరలగ్నమందుఁ గ్రొత్తగా నిర్మించిన గృహముదప్ప దక్కిన గృహమందు వధూప్రవేశము శుభము. ప్రథమదినమందును జేయుటఁగలదు. షష్ఠదినమందుఁ గూడదని ప్రయోగరత్నమందున్నది. యది నిర్మూలము కాఁబట్టి పదారురోజులలో మీఁదఁజెప్పిన దినమందుఁ జేసినచోఁ బ్రవేశమునకుఁ జెప్పిన నక్షత్ర తిథివారములను గోచారముచే చంద్రబలాదులను విచారింపనక్కరలేదు. మరియు గురుశుక్రాస్తాది దోషమును లేదు. “శ్లో. వ్యతీపాతే క్షయతిథౌ గ్రహణే వైధృతౌ తథా, అమాసంక్రాంతి విష్ట్యాదౌ ప్రాప్తకాలేపి నాచరేత్.” అనఁగా వ్యతీపాతమందును క్షయతిథియందును గ్రహణమందును వైధృతియందును నమావాస్యయు సంక్రాంతియు విష్టియు మొదలగు వానియందును బదారురోజుల లోపుననైనను గూడదు. ప్రథమ వధూప్రవేశమందును వివాహమునకు వెళ్లునపుడును నెదురు చుక్క దోషములేదు. రెండవమారు శుక్రుని కెదురుగ రాగూడదు. పదారురోజులు దాటినచో నొకమాసము పర్యంతము బేసిదినములందును మాసము దాటినచో బేసి మాసమందును సంవత్సరము దాటినయెడ బేసి సంవత్సరమందును వధూ ప్రవేశము శుభము. సమసంఖ్యగల దినమాసవత్సరములందు వైధవ్యాది దోషము. ఐదవసంవత్సరము దాటినచో సమవిషమ విచార మక్కరలేదు. పదారుదినములు దాటిన పైని నక్షత్రములు అశ్విని, రోహిణి, మృగశీర్ష, పుష్యమి, మఖ, ఉత్తర, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర, హస్త, చిత్ర, స్వాతి, అనూరాధ, మూల, శ్రవణము, ధనిష్ఠ, రేవతియు నివి శుభములు. మాసము దాటినచో మార్గశీర్ష, మాఘ, ఫాల్గుణ, వైశాఖ, జ్యేష్ఠమాసములు శుభములు. చతుర్థి, నవమి, చతుర్దశి, పూర్ణిమయు నివి తప్ప దక్కినతిథులును, రవివారము మంగళవారము దప్ప దక్కినవారములును శుభములు. ఇట్లు నవవధూప్రవేశము.

# రెండవమారు వధూ ప్రవేశము

అపుడు మాఘ, ఫాల్గుణ, వైశాఖములు శుక్లపక్షమును, శుభములు. అశ్విని, రోహిణి, పునర్వసు, పుష్యమి, ఉత్తర, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర, అనూరాధ, జ్యేష్ఠ, హస్త, స్వాతి, చిత్ర, శ్రవణము, శతభిషక్కు ఈ నక్షత్రములందును, చంద్ర గురు బుధ శుక్రవారములందును గురు శుక్రాస్తాదులు వర్జించి స్థిరలగ్నము మొదలగు శుభకాలమందు ద్వితీయమగు వధూప్రవేశము శుభము. అపుడు విష్ణుశయన మాసములు నధికమాసము సమసంవత్సరము గురుశుక్రాస్తమయాదులును వర్జింపవలెను. ద్వితీయ ప్రవేశము వివాహమైన పదారు రోజులలో నైన యెడ గురుశుక్రాది దోషము నెదురుచుక్క దోషమును లేదు. “శ్లో ద్విరాగమే షోడశవాసరాంత రేకాదశాహే సమవాసరేషు, నచాత్రబుక్షం నతిథిర్నయోగో నవారశుద్ధ్యాది విచారణీయం,”అనఁగా పదారు రోజులలోగా నేకాదశ దినమందుగాని సమదినమందుగాని ద్వితీయ,

ప్రవేశము జేయుచో నక్షత్రతిథి యోగవారశుద్ధ్యాది విచారమక్కరలేదనుట. కేవలాంగిరసులకు గేవల భృగుగణమువారికి భరద్వాజ గణమువారికి వసిష్ఠ గణము వారికి కశ్యపగణము వారికినత్రిగణము వారికి వత్సగణ వారికి నీ గోత్రములవారికి బ్రతి శుక్ర దోషములేదు. దుర్భిక్షమందు దేశోపద్రవమందు వివాహమందు తీర్థయాత్రయందు నొకగ్రామములో నొక నగరములోనైనను ప్రతి శుక్రదోషము లేదు. ఇట్లు వధూ ద్వితీయ ప్రవేశము.

## వధూప్రథమాబ్ద నివాస నిర్ణయము

"ఉద్వాహాత్ప్రథమేశుచౌ యదివసే ద్భర్తుర్గృహే కన్యకా, హన్యాత్తజ్జననీం క్షయే నిజతనుం జేష్ఠే పతిజ్యేష్ఠకం, పౌషేచ శ్వశురంపతిం చ మలినే చైత్రేస్వ పిత్రాలయే, తిష్ఠంతీ పితరం నిహంతి నభయం తేషామభావేక్వచిత్." అనఁగా వివాహమైన పై మొదటి సంవత్సరములో గ్రీష్మఋతువునందాషాఢమందు నత్తింటనున్నచో నత్తకు గండము. జ్యేష్ఠమాసమందున్నచో బావకు గండము. క్షయమాసమందున్నచో దనకే గండము. పుష్యమాసమునందున్నయెడ మామకు గండము. మలమాసమందుండెనేని పతికి గండము. చైత్రమాసమందు పుట్టింటనున్నచో దండ్రికి గండము. వారు లేనిచో దోషమే లేదు. ఇట్లు ప్రథమాబ్దనివాస విచారము.

## పునర్వివాహము

దుష్టలగ్నమందును శాస్త్రోక్తగ్రహతారాదులు లేనపుడును మఱియు దుష్టయోగము మొదలగు నశుభకాలమందును గూశ్మాండ మంత్రములచే ఘృతహోమాదులు చేయక వివాహము జరిగినను మఱియు సూతకా ద్యాశౌచమునందు జరిగినను దిరుగ నా దంపతులకు సుమూహూర్తమందు వివాహము జేయునది. మరియును "శ్లో. సురాపీవ్యాధితాధూర్తా వంధ్యార్థఘ్న్యు ప్రియం వదా. స్త్రీ ప్రసూశ్చాధివేత్తవ్యా పురుషద్వేషిణీ తథా." అనఁగా మొదట వివాహమైన స్త్రీ సురాపానము జేయునదియైనను దీర్ఘరోగము గలదైనను వంచన జేయునదియైనను గొడ్డురాలైనను నర్థము నశింపజేయునదియైనను నప్రియవాక్కులే పలుకునదియైనను స్త్రీ సంతతి మాత్రమే కనునదియైనను సంగమము ద్వేషించునదియైనను మరియొక స్త్రీని వివాహ మాడవలెను. మరియును; "అప్రజాం దశమేవర్షే స్త్రీ ప్రజాం ద్వాదశేతతా మృత ప్రజాం పంచదశే సద్యస్త్వ ప్రియవాదినీం." అనఁగా గర్భాదానమైన పదిసంవత్సరముల వరకు సంతతి పుట్టకున్నను స్త్రీసంతతి మాత్రమే కల్గినచో పండ్రెండు వత్సరములకును మృతినొందు సంతతియే కల్గినచో బదునైదు సంవత్సరముల వరకును జూచి పునర్వివాహమును జేసుకొనవలెను. అప్రియవాదినియైనచో నపుడేవిడిచి మరియొక వివాహము గావలెను. ఇక్కడ అప్రియవాదమనఁగ జారత్వమే యూహించవలెను. ప్రియముగాని వాక్కులు పలుకుట కలియుగమందు దరుచుగ సంభవించును. గనుక నది నిషిద్ధముగాదు. ఆజ్ఞ చొప్పున నడచుచు గార్యదక్షురాలై వీరులైన పుత్రులగని వ్యభిచారిణిగాకున్న భార్యను విడిచి భోగార్థమన్యస్త్రీని వివాహమాడెనేని నతని యావత్తు

సొత్తులో మూడవభాగ మామెకిచ్చి వేయవలెను. నిర్ధనుఁడైనచో నామెను బోషించక తప్పదు. ఇక్కడ మనువు "అధివిన్నాతు యానారీ నిర్గచ్ఛే ద్రోషి తాగృహాత్, సాసద్య స్సన్నిరోద్ధవ్యా త్యాజ్యావాకులసన్నిధౌ." అనఁగా నట్లు తిరుగ వివాహమైనపైని పూర్వ భార్యకోపించి యిలువెడలబోవుచో నివారింపవలెను. అట్లును నిలువనిచో బంధువు లకు దెలియజేసి విడువవలెను. ఇట్లు తిరుగ వివాహమాడవచ్చునుగాని యగ్ని శుశ్రూష మొదలగు ధర్మకార్యము జ్యేష్ఠభార్యతోడనే యాచరించునది. యదియు నామో యాజ్ఞకు లోబడినచో నగును. లేక దుష్టురాలైనను గృహాంతరమందు నిరో ధింపఁదగినదైనను గులసన్నిధియందు విడువ నర్హురాలైనను గనిష్ఠభార్యతోడనే జేయ వచ్చును. లేనిచో ధర్మభ్రంశమే యగునుగదా, జ్యేష్ఠభార్యతో నాచరించుటకు వచనము; "తథా వీరసుతాయాస్యాదాజ్ఞా సంపాదినీచయా, దక్షా ప్రియంవదా శుద్ధా తామత్ర వినియోజయేత్." అని మాధవీయమందు స్మృతివచనము. ద్వితీయ వివాహ హోమము పూర్వవివాహమందైన గృహ్యాగ్ని యందే జేయవలెను. అదిలేనిచో లౌకి కాగ్నియందును జేయవచ్చును. అట్లు లౌకికాగ్నియందు యుపక్షమున ద్వితీయ వివాహ హోమముచే నుత్పన్నమైన యగ్నియు గృహ్యాగ్నియే గనుక పూర్వాగ్నితో గలపి సంసర్గము చేయవలెను.

## అగ్నిద్వయ సంసర్గ ప్రయోగము

దేశకాలముల గీర్తించి, "మమద్వాభ్యాం భార్యాభ్యాంసహోనిష్పన్న గృహ్యాగ్న్యోస్తా భ్యాం సహాధికారసిద్ధిద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం సంసర్గం కరిష్యే." యని సంక ల్పించి స్వస్తివాచనముజేసి యుత్తర సమాప్తిగ రెండు స్థండిలముల జేసి యందు దక్షిణ స్థండిలమున జ్యేష్ఠభార్యాగ్ని నుత్తర స్థండిలమున గనిష్ఠభార్యాగ్నిని బ్రతిష్ఠించి ప్రథమాగ్ని యందు జ్యేష్ఠభార్యతోగూడి యన్వాధానము చేయవలెను. అగ్నిద్వయ సంసర్గ విషయమైన ప్రథమాగ్ని హోమకర్మ యందు దేవతాపరిగ్రహమునకై యన్వా ధానము జేసెదనని సంకల్పముజేసి, చక్షుషీ ఆజ్యేనయనునంతమందు, "అగ్నింనవభి రాజ్యాహుతిభిశ్శేషేణ స్విష్టకృత" మని మొదలుగ జేయునది. అగ్నిమీళే ఇతి నవనాం మధుచ్ఛందా అగ్నిర్గాయత్రీ అగ్నిద్వయసంసర్గార్థం ప్రథమాగ్నౌ ప్రధానాజ్యహోమే వినియోగః అని యుచ్చరించి అగ్నిమీళేయని మొదలుగ దొమ్మిది ఋక్కులచే బ్రతి ఋక్కున కొక్కొక యాజ్యాహుతిచొప్పున స్రువముచే దొమ్మిదాహుతులు వేల్చవలెను. "అగ్నయ ఇదం" అని యంతట నుచ్చరింపవలెను. హోమశేషము సమాప్తినొందించి "అయంతే యోనిః" అను మంత్రముచే జ్యేష్ఠాగ్నిని సమిదయందారోపించి ప్రత్యవరోహ యనుమంత్రముచే ద్వితీయాగ్నిలో దింపి ధ్యానముజేసి యిద్దరు భార్యలతోగూడి యన్వాధానము జేయవలెను. ఎట్లనిన; "అగ్నిద్వయసంసర్గార్థే ప్రథమసంసృష్ట ద్వితీయాగ్నౌ వివాహిత హోమేదేవతా పరిగ్రహార్థ మన్వాధానం కరిష్యే" యని సంక ల్పించి యాజ్యభాగాంతమందు "అగ్నిం ప్రధానం షడ్వార మాజ్యేన శేషేణ స్విష్టకృత" మని మొదలుగనుచ్చరించి "ప్రోక్షణీంకుశాన్‌దర్వీ స్రువౌ ప్రణీతా ఆజ్యపాత్రే ఇద్మా

బర్హిషీ" యని యెనిమిదిపాత్రల నాసాదించి స్రుక్కునందు నాల్గుమారు లాజ్యము గ్రహించి భార్యలిద్దరుదనను స్పృశించియుండఁగ హోమము జేయవలెను. "అగ్నా వగ్నిరిత్యస్య హిరణ్యగర్భోగ్నిరష్టి అగ్నిద్వయ సంసర్గార్థే సంసృష్టాగ్నౌ ప్రధానాజ్యహోమే వినియోగః ఓం అగ్నావగ్నిశ్చరతి ప్రవిష్టఋషీణాంపుత్రో అధిరాజ ఏషః తస్మైజుహో మిహవిషా కృతేనమా దేవానాం యోముహద్భాగధేయంస్వాహా యని వేల్చి అగ్నయ ఇదం" అనిత్యాగము జెప్పవలెను. ఇట్లు ముందును గ్రహించునది. ఎట్లనిన; ఆజ్యము స్రుక్కుయందు నాల్గుమారులు గ్రహించుటయు వినియోగము త్యాగము నిట్లనే యనుట. "అగ్నినాగ్నిర్మేధాతిథిః కాణ్వోగ్నిర్గాయత్రీ అగ్నిద్వయసంసర్గే వినియోగః అగ్నినాగ్ని స్సమిధ్యతే కవిర్గ్రృహపతిర్యువా హవ్యవాట్ అస్తీదమితితిసృణాం విశ్వా మిత్రోగ్నిరనుష్టుప్ అంత్యేత్రిష్టుభౌ అస్తీదమధి, అరణ్యో-ఉత్తనాయామ-పాహినో అగ్న ఇత్యస్యగర్భః ప్రగాథోగ్నిర్బృహత్ పాహినో అగ్నఏకయా వసోస్వాహా ఇట్లు వేల్పి హోమ శేషమును సమాప్తినొందించి యాహితాగ్నికి గోమిధునమునిచ్చి బ్రాహ్మణభోజ నము జేయవలెను. ఇట్లుగ్నిద్వయ సంసర్గప్రయోగము. "శ్లో. పత్న్యోరేకాయదిమృతా దగ్ధ్వాతేనైవతాం పునః ఆదధీతాన్యయాసార్థ మాధాన విధినాగృహీ." అనఁగా నట్టి భార్యలలో నొకతె మృతినొందినచో నాయగ్నిచే నామెను దహించి జీవించియున్న భార్యతో దిరుగ నాధానముజేసి విధిచే నగ్ని సంపాదించుకొనవలెను.

## ద్వితీయాది వివాహమునకు గాలము

"శ్లో. ప్రమదామృతివాసరాదితః పునరుద్వాహ విధిర్వరస్యచ విషమేపరివత్సరే శుభోయుగళే చాపిమృతిప్రదోభవేత్" అనఁగా పూర్వభార్య మృతినొందిన దినము మొదలుగజేసి సంవత్సరమందుశుభము. సరి సంవత్సరమందైనచో మరణమగును. నిర్బంధము గలిగినచో మహారుద్రాభిషేకము మృత్యుంజయ జపమునుజేసి వివా హము జేసుకొనవచ్చునని తోఁచుచున్నది. "శ్లో. తృతీయామానుషీ కన్యానోద్వాహ్యా మ్రియతేహిసా, విధవావాభవేత్తస్మా త్తృతీయే ర్కంసముద్వహేత్." అనఁగా మూఁ డవ వివాహము మనుష్య కన్యనుగూడదు అట్లైనచో భార్యకు మృతిగలుగును. విధవ యయిన నగును. కాఁబట్టి తృతీయము నర్కవివాహము జేయునది.

## అర్కవివాహము

రవి శనివారములందు హస్తనక్షత్రమందైనను మరియొక శుభదినమందైనను పుష్పఫలములతో గూడిన జిల్లేడుచెట్టు వద్దకువెళ్లి యర్కకన్యాదాతగా నాచార్యుని వరించి రక్తచందనాదులచే నలంకరించుకొని దేశకాలములు స్మరించి మమతృతీయ మానుషీ వివాహ జన్యదోష పరిహారార్థం తృతీయ మర్కవివాహం కరిష్యే యని సంకల్పించి యాచార్యుని వరించి నాందీశ్రాద్ధాంతము జేయవలెను. దాతమధుపర్క యజ్ఞోపవీత వస్త్రగంధమాల్యాదులచే వరుని బూజింపవలెను. సూర్యునికెదురుగనిల్చి "త్రిలోకవాసినీసప్తాశ్వచ్ఛాయా సహితోరవే, తృతీయో ద్వాహజందోషం నివారయ సుఖం కురు" అనిప్రార్థించి యనఁగా మూఁడులోకముల వసింపుచు సప్తాశ్వయుక్త

రథముపై ఛాయాదేవితో నుండు నోసూర్యుఁడ! నాకు దృతీయ వివాహమువల్ల గల్గెడి దోషము నశింపజేసి సుఖమునిమ్మని ప్రార్థించి ఛాయాదేవితో గూడ సూర్యుని ధ్యానించి యబ్లింగమంత్రముచే నభిషేకముజేసి వస్త్రాదులచే నాకృష్టేన యనుమంత్ర మున బూజించి శ్వేతవస్త్రముచే తను సూత్రముచేతను జుట్టి గుడోదనము నివేదనము జేసి తాంబూల మీవలెను. "శ్లో. మమ ప్రీతికరాయేయం మయాస్పృష్టా పురాతనీ, అర్కజాబ్రహ్మణాసృష్టాఽ ద్యాస్మాన్త్సంప్రతి రక్షతు." అనఁగా పూర్వమందు బ్రహ్మచే సృజింపఁబడి పురాతనియైన యీ యర్కజకన్య నాచే స్పృశింపఁబడి నాకు బ్రీతి నిచ్చుచు, మమ్ము రక్షించుగాక యని యర్కజకన్యకు బ్రదక్షిణముజేసి, "శ్లో. నమస్తే మంగలే దేవి నమస్సవితురాత్మజే, త్రాహిమాం కృపయాదేవి పత్నీంత్వమ ఇహాగతా. అర్కత్వం బ్రహ్మణాసృష్టః స్సర్వప్రాణి హితాయచ, వృషాణామధిభూతస్త్వ దేవానాం ప్రీతివర్ధని, తృతీయోద్వాహజం పాపం మృత్యుం చాశు వినాశయ." అనఁగా మంగళ రాలవైనయో యర్కజకన్యకా ! నీకు నమస్కారము. నీవు నాకు పత్నివగుట కంగీ కరించి నన్ను రక్షింపుము. బ్రహ్మచే సృజింపబిన సమస్త ప్రాణులకు హితమును దేవతలకు సంతోషమునిచ్చుచు వృక్షజాతిలో నధికమైతివి. తృతీయ వివాహదోషము నాకు నంటకుండజేసి మృత్యువు దపింపుమని ప్రార్థించి మధ్యమందు తెరబట్టుట మొదలగు గన్యాదానాంతము విధినిజేసి కన్యాదాత, "ఆదిత్యస్య ప్రపౌత్రీం సవితుః పౌత్రీం మర్కస్యపుత్రీం కాశ్యపగోత్రా మర్కకన్యా మముక గోత్రాయ వరాయ తుభ్యం సంప్రదదే, అర్కకన్యా మిమాంవిప్ర యథాశక్తి విభూషితాం, గోత్రాయ శర్మణేతుభ్యం దత్తాం విప్ర సమాశ్రయ." యని దానముజేసి దక్షిణనిచ్చి గాయత్రిచే బురియెక్కించిన సూత్రముచే బృహత్సామయను మంత్రముతో నర్కవరులకు గంకణము గట్టి యర్కము నకు నాలుగు దిక్కుల కలశములందు విష్ణువును నామంత్రముచే షోడశోపచారము లిచ్చి పూజించి యర్కమున కుత్తరమందర్కపత్నితతో వరుఁడుగూడి "అస్యాస్సమ్యగ్భా ర్యాత్వసిద్ధ్యర్థం పాణిగ్రహహోమం కరిష్యే" యని సంకల్పించి, ఆఘారదేవతే ఆజ్యే నయను పైని "బృహస్పతిం అగ్నిం అగ్నిం వాయుం సూర్యం ప్రజాపతిం చాజ్య ద్రవ్యేణ శేషేణ స్విష్టకృతమని యాఘారాంతముజేసి "సంగోభిరిత్యసాంగిరసో బృహ స్పతిస్త్రిష్టుప్, ఆజ్యహోమే వినియోగః సంగోభి రంగిరసో." బృహస్పతయ ఇదం నమమ, యస్మై త్వేత్యస్య వామదేవోగ్ని స్త్రిష్టుప్ యస్మైత్వాకామకామాయవ యం సమ్రాద్యజామహే, తమస్మభ్యం కామందత్వా స్యధేదం ధృతంపిబస్వాహా, అగ్నయ ఇదం నమమ" అటుపైని వ్యస్తమస్తస వ్యాహృతులచే హోమము జేసి హోమశేషము సమాప్తినొందించి, "శ్లో. మయాకృతమిదం కర్మస్థావరేషు జరాయుణా, అర్కాపత్యాని నోదేహి తత్సర్వం క్షంతుమర్హసి."అనఁగా మావితోబుట్టి జాతిలోనున్న నేనుస్థావర జాతిలో నున్న నీకీ వివాహకర్మను జేసితిని. దీనిక్షమించి నాకు సంతతి యీయవలె నని ప్రార్థించి శాంతిసూక్తము పఠించిన పైని గోమిథున మాచార్యునికిచ్చి తాను ధరించిన వస్త్రములు గురునకిచ్చి యన్య వస్త్రములు ధరించునది. పదుగురుగాని ముగ్గురుగాని విప్రులకు భోజనము పెట్టవలెను. ఇట్లర్కవివాహము ముగిసెను.

## ఆహ్నికవిచారము

ఇట్లుర్కవివాహపర్యంతము కర్మలు నిరూపించి యాహ్నికకర్మల నిర్ణయించుటకు మంగళము జేయుచున్నాఁడు. "శ్లో. శ్రీమన్నాథాంఘ్రి కమలం దీనానాథ దయార్ణవం, స్మారంస్మారం కామపూరమాహ్నికా చరణంబ్రువే." అనఁగా దీనుల బోషింప దయా సముద్రుఁడైన శ్రీవిఠ్ఠలస్వామి పాదపద్మమును గామపూర్తిగ స్మరించి యాహ్నిక మాచ రించుట నిరూపించెదనని యర్థము. "ప్రథమోక్తో బహ్వృచానాం ప్రకారస్సతు యాజుషైః గ్రాహ్యోయత్రస్వసూత్రోక్తో విశేష స్స్యాన్నబాధకః" అనఁగా నీ గ్రంథమందు ఋగ్వేదులకు ముఖ్యమైన ప్రకారమున గర్మలు నిరూపింపఁబడినవి. ఇఁక యజుర్వే దులు సహితము తమ గృహ్యాసూత్రమందు విశేషము జెప్పినచోట దప్ప తక్కినదం తయు నిట్లనే గ్రహింపవచ్చుననుట. ఇఁక నాహ్నికమెట్లు చేయవలెననిన బ్రాహ్మ ముహూర్తమందు మేల్కొంని విష్ణునిస్మరించి గజేంద్రమోక్షము మొదలుగ బఠించి యిష్టదేవతాదుల స్మరింపవలెను. "శ్లో. సమద్రవసనే దేవి పర్వతస్తనమండలే, విష్ణుపత్ని నమస్తుభ్యం పాదస్పర్శం క్షమస్వమే." అనఁగా సముద్రము వస్త్రముగాను బర్వతములు స్తనమండలముగాను ధరించి విష్ణుపత్నివై యొప్పునోభూదేవి నాపాద స్పర్శము క్షమింపుమని ప్రార్థించి గోవులు మొదలగు మంగళవస్తువుల జూడవలెను.

## మూత్రపురీషోత్సర్గము

తృణాదులచే గప్పఁబడినభూమియందు దనశిరస్సునకు బట్టజుట్టియుపవీత మును గంఠమున వ్రేలునటులజేసి వీపుపై నైనను జెవియందైనను ధరించి యూపిరి ముక్కునవిడువక పగటియందును సంధ్యాకాలములందును నుత్తరముఖుఁడై రాత్రి దక్షిణాభిముఖుఁడై మౌనముతో పాదరక్షలు లేకుండగ గూరుచుండి మూత్రపురీష ములు విడువవలెను. యజ్ఞోపవీతము నివీతమును జేయకయే కర్ణమందు ధరించుట యనాచారము. మార్గమందు జలమందు దేవాలయమందు నదీతీరము మొదలగు వానియందును నట్లు మలవిసర్గము నిషిద్ధము.

"శ్లో. హస్తాన్ ద్వాదశసంత్యజ్య మూత్రం కుర్యాజ్జలాశయాత్, అవకాశే షోడ శేవా పురీషేతు చతుర్గుణం." అనఁగా సరస్సు మొదలగు జలాధారమునకు బంఁడ్రెండు మూరలుగాని వలనైనచో బదారుమూరలుగాని దూరమువెళ్లి మూత్రము విడువ వలెను. మలవిసర్జనము దానికి నాల్గురెట్లు దూరమున జేయవలెను. సూర్యుని దిక్కున కెదురుగజేసినగాని పురీషము జూచినగాని సూర్యునైన గోవునైన జూచి శుద్ధుఁడగును అటుపైని మేహనము హస్తముతో ధరించియేలేచి మృత్తికాశౌచము జేయునది. మూత్రము విడుచునపుడు శుద్ధమృత్తికను లింగమున కొకమారును నెడమచేతికి మూఁడుమారులును రెండుచేతులుగలపి రెండుమారులును బూసి జలముతో నన్నిమారులు గడుగవలెను. "శ్లో. మూత్రాత్మద్విగుణం శుక్రే మైథునే త్రిగుణం స్మృతం." అనఁగా వీర్యము స్రవించినపుడు మూత్రశుద్ధికంటె ద్విగుణము జేయవలెను. మైథునము జరిగినచో మూఁడురెట్లు శుద్ధిజేయునది. ఇఁక మలవిసర్జన

మందు శుద్ధి యెట్లనిన; "శ్లో. ఏకాలింగే గుదేతిస్ర స్తథావామకరే దశ, ఉభయోః కర యోస్సప్త సప్తత్రిర్వాపి పాదయోః, ద్విగుణం బ్రహ్మచర్యేస్యా ద్యతీ నాం తు చతుర్గుణం, ఏవం మృద్భిర్జలై శ్శౌచం తదర్ధంనిశికీర్తితం, తదర్ధ మాతురేశూద్ర స్త్రీ బాలానాం తదర్ధతః"అనఁగా లింగమందొకమారును గుదమందు మూఁడు మారులును నెమచేతికి బదిమారులును రెండుహస్తములుగలపి యేడుమారులును పాదములందు నేడు మారులైనను మూఁడుమారులైనను మృత్తికబూయుచు నీళ్లతోగడగుచు దిరుగఁబూయుచు నిట్లు మృజ్జలముచే శుద్ధియగును. ఇట్టి శుద్ధిని బ్రహ్మచారి ద్విగుణముగను సన్యాసి నాల్గురెట్లును జేయునది. ఈశుద్ధి రాత్రియందు సగము జేయవచ్చును. రోగియైనచో నందు సగము శూద్రులు స్త్రీలు బాలురు నందులో సగము జేసిన జాలును. అట్లు మృత్తికాశౌచము జేసినను గంధలేపములు పోలేదని తోఁచిన యెడ నవి పోవు పర్యంతము దిరుగజేయవలెను. ప్రతిపూతకు మన్ను పశ్చియుసిరికె కాయంత దీసుకొనవలెను. జలముదొరకక శౌచమున కాలస్యమైనచో సచేల స్నానము జేయవలెను. విధిచొప్పున శౌచము జరుగనిచో నూట యెన్మిది మారులు గాయత్రి జపించవలెను. మూఁడు ప్రాణాయామములునుజేయవలెను. అట్లు మూత్రవిసర్గమందు నాల్గుమారులు పుక్కిలించి జలము విడుచునది. మలవిసర్గమందు బంద్రెండుమారులైన ఎనిమిది మారులైనను జేయునది. భోజనాంతమందు బదారుమారులు చేయవలెను.

## ఆచమనవిధి

శిరస్సునందు గంధమందును బట్టలేకుండగ గూర్చుని యుపవీతము నెప్పటివలె ధరించి తూర్పునకు గాని యుత్తరమునకుగాని యభిముఖుఁడై, యంగుష్ఠము కనిష్ఠికయును జూపి తక్కునంగులులు వంచిన హస్తముతో నురుగు మొదలగునవి లేని శుద్ధజలము హృదయమున కంటునంతమాత్రము దీసియంగుష్ఠము మొదటి భాగము నుండి మూఁడుమారులు త్రాగవలెను. కేశవనారాయణ మాధవయను మూఁడు నామములుచ్చరింపుచు ముమ్మారుత్రాగి యొకనామముచే గుడి హస్తము ముట్టవలెను. రెంటిచే బెదవులను దుడిచి మరియొకటిచే వాని మార్జనజేసిమరియొక నామముచే జలము నభిమంత్రించి వేరొకనామముచే నెడమహస్తము దుడువవలెను. ఒకనామముచే దక్షిణపాదమును వేకొనామముచే వామపాదమును మరియొక నామముచే శిరస్సును ప్రోక్షించి తక్కిన పంద్రెండు నామములలో నొక్కొక్కటి యుచ్చరింపుచు మీఁదపెదవిని ముక్కు చెవులు రెంటిని నేత్రములు రెంటిని గర్ణములు రెంటిని గుడిది మొదలుగ ముట్టుచు గ్రమముగ నాభిని హృదయమును శిరస్సును గుడి యెడమభుజములను స్పృశించునది. ఇక్కడ కొందరిమతము కేశవాది నామములు మూటిచే ముమ్మారు జలపానమును రెంటిచే జేతులు గడగుటయు గండముల నోష్ఠముల రెండు రెండు నామములచే మార్జనము జేయుటయు పాణిపాదముల కొక్కొక్క నామముచే మార్జనము నని పాఠాంతరము. లేదా పెదవులకే మార్జనము దుడుచుటయును రెండేసి నామములచే జేసి పాణిపాదముల కొక్కొక్కటియనియు

దక్కినవి మీఁదఁజెప్పినటులనే యందురు. అందుమీది పెదవిని స్పృశించుట, వేళ్లతుదలచేతను ముక్కు చెరమలను నంగుష్ఠతర్జనులచేతను నేత్రముల నంగుష్ఠానామి కలచేతను శిరస్సును హస్తమంతిచేతను వ్రేళ్ళకొనలచే భుజములను స్పృశించునది. ఇట్లాచమనవిధి జేయలేనిచో మూఁడుమారులు జలపానముజేసి హస్తము గడగి దక్షిణకర్ణము స్పృశించవలెను. కంచు యినుము సీసము తగరము నిత్తడి యీ పాత్రములచే నాచమనము జేయగూడదు. శ్రౌతాచమనమెట్లనిన; గాయత్రి మూఁడు పాదములును అపోహిష్ఠా యను దొమ్మిదిపాదములును సప్తవ్యాహృతులును గాయత్రి మూఁడు పాదములును రెండుభాగములుగజేసి యవియును గాయత్రీ శిరస్సునని యిరువదినాల్గు స్థానములు.

## ఆచమననిమిత్తములు

కర్మజేయుచున్నప్పు డపానవాయు నిర్గమమైనను గన్నీరు కారినను క్రోధము వచ్చినను పిల్లిముట్టినను తుమ్మినను వస్త్రముగట్టినను రజకుఁడు మొదలగు నీచుల జూచినను నాచమనము జేయవలెను. స్నానము పానము భోజనము నిద్రయుజేసి నచో నాచమనము జేయునది. మలమూత్రములు రేతస్సును విడుచునపుడు శుద్ధ్యంత మందాచమనము జేయునది. అట్లాచమనము సంభవింపనిచో దక్షిణకర్ణము స్పృశింపవలెను. దంతమధ్యమందున్న యున్న కణము మృదూపాయముచే దొలగించ వలెను. అట్లుగానిచో రక్తమువచ్చెనేని దోషము విధింపఁబడినది. దంత లగ్నము దంతముతో దుల్యమే కాలాంతరమందలి వెడలినచో నాచమనము. వామహస్తమందు దర్భలుండగ దక్షిణహస్తముచే నాచమనము గూడదు. "శ్లో. కరద్వయ స్థితేదర్భ ఆచామేతోత్సమపో భవేత్, నచోచ్ఛిష్టం పవిత్రం తద్భుక్తే పిత్ర్యేచ సంత్యజేత్." అనఁగా రెండుజేతుల దర్భలుధరించి యాచమనము జేసినచో సోమపానము జేసిన ఫలము. పవిత్ర ముచ్ఛిష్ఠముగాదుగాని భోజనముపైని పితృకర్మయైన పైని నది విడువవలెను. ఇట్లు మలమూత్ర విసర్గమందును విడువవలెన. ఇఁక దంతధావనము, ముళ్లుగలచెట్టు, పాలుగలచెట్టు, వీటిశాఖతో గాని దుచ్చెనచెట్టు మొదలగువానిచేతను దర్జనితప్ప దక్కిన యంగుళులచేతను జేయవచ్చును. లేదా పంద్రెండు మారులు గండూషమనఁగ బుక్కిలించుట జేయునది.

## సంక్షేపస్నానవిధి

నద్యాదులకు వెళ్లి శిఖముడివిప్పక ముణుకు బంటికిపైగా జలమందుడిగి నిలువఁబడి యంతకు దక్కువయైనచో గూర్చుండి యాచమించి మమకాయిక వాచిక మానసిక దోషనిరసన పూర్వకం సర్వకర్మ సుశుద్ధిసిద్ధ్యర్థం ప్రాతస్స్నానంక కరిష్యే యని సంకల్పించి జలమునకు నమస్కరించి తూర్పుమొగముగగాని ప్రవాహమున కెదురుగగాని మూఁడు మారులు మునిగి యంగముల దోమి స్నానముజేసి రెండు మారులాచనముజేసి, అపోహిష్ఠా యని మార్జనముజేసి ఇమం మేగంగే యను మంత్రముచే ముమ్మారు జలముగదల్చి యఘమర్షణ మంత్రము ముమ్మారును

ఋతంచయను సూక్తమును బఠింపుచు గాత్యాయనులైనచో ద్రుపదాయను ఋక్కును బఠింపుచు జలమందు మునిగి తీరముజేసి జలతర్పణము జేయవలెను. లేకపోయిన పక్షమును గలదు. చేయుపక్షమందిట్లు చేయవలెను. ఉపవీతము యథావిధిగ నుండ గనే, బ్రహ్మాదయోయే దేవాస్తాన్ దేఅం స్తర్పయామి భూర్దేవాం స్తర్పయామిభువర్దేవాం స్తర్పయామి స్వర్దేవాం స్తర్పయామి భూర్భువస్స్వర్దేవాం స్తర్పయామి యనితర్పణము జేసి యుపవీతము కంఠమున వ్రేలునట్లు ధరించి కృష్ణద్వైపాయనాదయో మేఋషయ స్తానృషీం స్తర్పయామి భూః ఋషీం స్తర్పయామి భువఃస్వః భూర్భువస్వః ఋషీం స్తర్పయామి యని తర్పణముజేసి యజ్ఞోపవీతము నెడమవైపు ధరించి, సోమః పితృ మాన్య మోంగిరస్వానగ్నిష్వాత్తాః కవ్యవాహనాదయో యేపితరస్తాన్ పితౄస్తర్పయామి భూః పితౄన్ భువః పితౄన్ స్వఃపితౄన్ భూర్భువస్స్వః పితౄంస్తర్పయామి. యని పితృతర్పణము జేయవలెను. ఒకనదియందు స్నానము జేయుచు మరియొక నదిని స్మరింపఁగూడదు. ఇక్కడ తైత్తిరీయులు మొదలగు వారు ఋషి తర్పణమందు నామాం తరములుచెప్పుదురు వానిజెప్పుటకు దర్పణము వైకల్పికమగుటచే నావశ్యకత లేదు.

## గృహమందుష్ణోదకస్నానవిధి

గృహమందు స్నానముజేసెనేని యుష్ణోదకముచే జేయవలెను. శీతోదక మక్కర లేదు. ఎట్లనిన; పాత్రయందు శీతోదకముపోసి దానిపై నుష్ణోదకమునింపి శంనోదేవీ; ఆపఃపునంతు. ద్రుపదాదివే. ఋతంచసత్యం చ. ఆపోహిష్ట యను నైదుఋక్కులచే నభిమంత్రించి, ఇమం మే గంగేయని తీర్థముల స్మరింపుచు స్నానము జేయవలెను. గృహస్నానమందు సంకల్పము నాచమనము తర్పణము నగమర్షణ మక్కరలేదు. స్నానాంతమందాచమనము మార్జనము జేయునది. ఇట్లు స్నానముజేసి వస్త్రముచేగాని హస్తముచేగాని తుడుచుకొనక శుద్ధమైన పొడిబట్టను కట్టుకొనుచు స్నానార్ద్రవస్త్రమును మీఁదనుండి తీయవలెను. "వికచ్ఛోనుత్తరీయశ్చ నగ్నశ్చావస్త్ర ఏవచ, శ్రౌతస్మార్తే నైవకుర్యాత్." అనఁగా కచ్ఛములేకుండ గుండారుపోసియు పైబట్ట ధరించకయు నగ్నవస్త్ర ఏవచ, శ్రౌతస్మార్తే నైవకుర్యాత్."అనఁగా కచ్ఛములేకుండ గుండారు పోసియు పైబట్టధరించకయు నగ్నతనొందియు ననఁగా బట్టజోడించి రెండుపొరలతో గట్టినను కాలినబట్టగట్టినను కుట్టినిబట్టరంగుబట్ట మొదలగునవి గట్టినను నగ్నుఁ డనబడుదురు దిగంబరుడై యుండియును శ్రౌతస్మార్తకర్మలు చేయగూడదని యర్థము. పిడిచినతడి బట్ట భుజముపై నుంచగూడదు. తడిబట్టను నాల్గు రెట్లు ముడిచి గృహ మందు క్రిందుగాగొసలుంచియు నదియందు మీదుగా గొనలుంచియు స్థలమందే పిడువ వలెను. గాని ముప్పరిగా బిడువగూడదు. ఉత్తరీయమును జీవత్పితృకుఁడు జీవించిన జ్యేష్ఠభ్రాతగలవాఁడును ధరింపఁగూడదు. కప్పుకొనుబట్టనందరు ధరింప వచ్చును.

## ప్రాతఃకాలిక నిత్యస్నానము

చాండాలుని సూతికను సూతకిని రజస్వలను శ్మశానమందలి కాష్ఠమును శవమును చాండాలచ్ఛాయను స్పృశించినచో స్నానము. అట్లు స్పృశించినవాని

ముట్టెనేని మొదటివాఁడు మొదలుగ ముగ్గురి పర్యంతము నట్లనే సచేలస్నానము నాల్గవవాని కాచమనమాత్రమే. ఆపైని ప్రోక్షణముచే శుద్ధియగు. ఇఁక రెండవవాఁడు మొదలగువారు దండముగాని తృణముగాని వ్యవధానముగా ముట్టిరేని వారికి నాచమనమే. వస్త్రమడ్డమైనచో సాక్షాత్తుగా స్పృశించినట్లె గనుక నపుడు నాల్గవవానికె యాచమనము అట్టి నైమిత్తికస్నానము రాత్రి సహితము జేయునది. మరణాశౌచము బట్టునపుడును బుత్రజన్మయందును సంక్రాంతియందును శ్రాద్ధదినమందును చాండాలాదుల ముట్టినపుడును నుష్ణోదకముచే స్నానము నిషిద్ధము. నైమిత్తకస్నానమందు జలతర్పణాది విధిలేదు. నిత్యస్నానము జేయకయే భుజించినచో నుపవాసము జేయునది. గ్రహణము సంక్రాంతి మొదలగు నిమిత్తములచే స్నానము చేయకయే భుజించినను ద్రాగినను నూటయెనిమిదిమారులు గాయత్రీ జపము. శూద్రిదిస్పర్శ నిమిత్తికమైనచో నుపవాసము చేయునది. చండాలాది స్పర్శమందు స్నానములేక భుజించినచో మూఁడుపవాసములు. చాకలి మొదలగువాని ముట్టినచో భుజించెనేని నందులో సగము ప్రాయశ్చిత్తము. దర్శయు వ్యతీప్రాతము కార్తికము రథసప్తమి మొదలగువాని యందు స్నానము కామ్యము. ఇట్లు జలావగాహము మొదలగువారుణస్నానములు.

## గౌణ స్నానములు

ఆపోహిష్ఠాది మంత్రములచే ప్రోక్షించుకొనుట మంత్రస్నానము గాయత్రిచే బదిమారులు జలము నభిమంత్రించి దానిచే సర్వాంగముల బ్రోక్షించుట గాయత్రీ స్నానము. భస్మము బూసికొనుట యాగ్నేయస్నానము. తడిగుడ్డతో దుడుచుకొనుట కాపిలస్నానము, విప్రపాదోదకము విష్ణుపాదోదకము విష్ణుధ్యానము మొదలగువాని స్నానాంతరములు. ఈ గౌణస్నానముచే జపసంధ్యాదులందు మాత్రమే శుద్ధియగు శ్రాద్ధదేవార్చనాదులకు గాదు. బ్రహ్మయజ్ఞమందు శుద్దివైకల్పికము.

## తిలకాదివిధి

ప్రాతఃకాలమందు మృత్తికచే దిలక ముంచుకొనవలెను. హోమానంతరమందు భస్మచే నుంచుకొనవలెను. మృత్తికయనఁగ గోపీచందనము, తులసీమూలమందలిది, సముద్రతీరమందలిది, జాహ్నవీతీరమందైనది, పుట్టయందైనదియు నివి మొదలగునది. లలాటము నుదరము హృదయము కంఠము కుడిపార్శ్వ బాహుకర్ణములందును నెడమబాహుకర్ణ దేశములందును వీపునను మెడపైభాగము నను నీ పంద్రెండు స్థానములందును శుక్ల పక్షమునందు గేశవాది నామములచేతను గృష్ణపక్షమందు సంకర్షణాది నామములచేతను శిరసునందు వాసుదేవనామముచేతను మృత్తికచే దిలకించుకొనవలెను.

## భస్మ త్రిపుండ్రము

“శ్రాద్ధే యజ్ఞే జపే హోమే వైశ్వదేవే సురార్చనే, భస్మత్రిపుండ్రైః పూతాత్మా మృత్యుంజయతి మానవః” అనఁగా శ్రాద్ధమందును యజ్ఞమందును హోమము జేయునపుడును వైశ్వదేవము జేయునపుడును దేవార్చనము జేయునపుడును భస్మ

ముచే మూఁడేసి రేకలు ధరించినచో మృత్యుంజయము గల్గును. కాఁబట్టి భస్మమును గ్రహించి, అగ్నిరితిభస్మ, వాయురితిభస్మ, జలమితిభస్మ, స్థలమితిభస్మ, వ్యోమేతిభస్మ, సర్వ్యగ్ంహవాఇదంభస్మ. మన ఏతాని చక్షూంషిభస్మాని అను మంత్రముచే నభి మంత్రించి జలముతో దడపి దక్షిణహస్తమందలి యంగుష్ఠకనిష్ఠకల మధ్యమందున్న వ్రేళ్ళచే లలాటమందును హృదయమందును నాభియందును కంఠమందును భుజ శిరస్సులందును బాహులందును సంధులందును వీపునను శిరస్సునను శివమంత్రము చేనైనను నారాయణాష్టాక్షరిచేనైనను గాయత్రిచేనైనను ప్రణవముచేనైనను త్రిపుంద్ర ములు చేయవలెను.

## సంధ్యాకాలము

"ఉత్తమాతారకోపేతా మధ్యమా లుప్తతారకా, అధమా సూర్యసహితా ప్రాతస్సంధ్యా త్రిధామతా" నక్షత్రములుండఁగా బ్రాతసంధ్యకు ముఖ్యకాలము. అవి లోపించినపుడు మధ్యకాలము. సూర్యుఁడుదయించినపై నదమకాలము. "ఉత్తమా సూర్యసహితా మధ్యమాలుప్తభాస్కరా, అధమా తారకోపేతా సాయం సంధ్యా త్రిధా మతా" అనఁగా సూర్యుఁడస్తమించకమున్ను సాయంసంధ్యకు ముఖ్యకాలము, అస్త మించినపైని మధ్యమకాలము. నక్షత్రము లుదయించినచో నధమకాలము. "అధ్యర్ధ యామా దాసాయం సంధ్యామాధ్యాహ్ని కీష్యతే" అనఁగా జామునునర మొదలుకొని సాయంకాలమువలరకును మధ్యాహ్న సంధ్యాకర్మకు గాయమేయనుట. అందరును మూఁడు సంధ్యాకర్మలును నదిమొదలగు బాహ్యజలమందే చేయవలెను. అహితాగ్ని యైనచో నగ్నిప్రణయనము మొదలగువానికై సాయంప్రాతస్సంధ్యలు గృహమందే నేయవలెను.

## సంక్షేపముగ సంధ్యాప్రయోగము

రెండుదర్భలచే నిర్మించినపవిత్రములు ముడివ్రేసియున్నను లేకున్నను సరియే హస్తముల ధరించి రెండుమారు లాచమించి ప్రాణాయామము జేయునది. ప్రణవస్య పరబ్రహ్మఋషి, పరమాత్మాదేవతా, దైవీగాయత్రీ యచ్ఛందః, సప్తానాం న్యాహృతీనాం విశ్వామిత్ర జమదగ్ని భరద్వాజ గౌతమాత్రి వసిష్ఠ కశ్యపాఋషయః అగ్ని వాయ్వాదిత్య బృహస్పతి వరుణేంద్రవిశ్వే దేవాదేవతాః, గాయత్ర్యుష్ణిగనుష్టు బ్బృహతీ పఙ్క్తి త్రిష్టుబ్జ గత్యశ్ఛందాంసిగాయత్ర్యా విశ్వామిత్ర ఋషిః సవితాదేవతా గాయత్రీఛంః గాయత్రీ శిరసః ప్రజాపతిఋషిః, బ్రహ్మాగ్ని వాయ్వాదిత్యాదేవతాః యజుశ్ఛందః ప్రాణాయామే వినియోగః, అని యుచ్చరించి యన్నివ్రేళ్లచేనైనను తర్జనిని మధ్యమను విడిచియైనను నాసికబట్టి కుడిచెరమచేతనే వాయువు బీల్చవలెను. అట్లు బీల్చి యూపిరినిలిపి, ఓం భూః, ఓం భువః, ఓం స్వహః, ఓం మహః, ఓం జనః, ఓం తపః, ఓం సత్యం, ఓం తత్సవితు– ఓం ఆపోజ్యోతీ రసోమృతం బ్రహ్మభూర్భువస్స్వరోమ్. అని ఇట్లు ప్రణవము. సప్తవ్యాహృతులు గాయత్రియు గలసిన గాయత్రీ శిరస్సును ముమ్మారు పఠించి ముక్కు నెడమచెరమచే వాయువు విడువవలెను. ఇట్లు ప్రాణాయామము

ఇదే యన్ని శాఖలకు సమానము. అటుపైని మమోపాత్తదురితక్షయ ద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం ప్రాతస్సంధ్యాముపాసిష్యే యని సంకల్పించి “అపోహిష్ఠేతిత్ర్యృ చ స్యాం బరీషస్సింధుద్వీప ఆపోగాయత్రీ, మార్జనేవినియోగః” అని యుచ్చరించి అపోహిష్ఠా యని మొదలుగ దొమ్మిది పాదములచే తను బ్రణవముతో గుశోదకముచే దొమ్మిదిమారులు శిరసునందుమార్జనము జేసుకొనవలెను. అస్యక్షయాయ యను దానిచే గ్రింద మార్జనము చేయునది. నది మొదలగు తీర్థములందున్నదిగాని రాగి చేతగాని మృత్తుచేగాని నిర్మించిన పాత్రను భూమియందుంచి యందున్నదిగాని లేదా యెడమచేతనున్నదిగాని జలము దర్భ మొదలగువానిచే దీసి మార్జనము జేయు టయే యంటను విధింపబడినది గాని ధారాజలముచే నది నిషిద్ధము.

## మంత్రాచనము

“సూర్యశ్చేతిమంత్రస్య యాజ్ఞవల్క్య ఉపనిషదఋషిః, సూర్యమామన్యు మన్యు పతయో రాత్రిశ్చదేవతాః” ప్రకృతిశ్ఛందః, ఆచమనే వినియోగః సూర్యశ్చ మామన్యుశ్చ మన్యుపతయశ్చ మన్యుకృతేభ్యః, పాపేభ్యో రక్షంతాం యద్రాత్ర్యా పాపమకార్షం, మనసా వాచా హస్తాభ్యాం, పద్భ్యాముదరేణశిశ్నా, రాత్రిస్తదవలుంపతు, యత్కించ దురితంమయి, ఇదమహంమామమృతయోనౌ, సూర్యేజ్యోతిషి జుహోమిస్వాహా”అని యుచ్చరించి జలము త్రాగవలెను. ఆచమించి, ఆపోహిష్ఠేదినవచ్చస్యాం బరీషస్సింధు ద్వీప ఆపోగాయత్రీ అంత్యేద్యే అనుష్టుభౌమార్జనే వినియోగః అని ప్రణవేనవ్యాహృతి భిర్గాయత్ర్యా ప్రణవాంతయా, ఆపోష్ఠేతిసూక్తేన మార్జనంచ చతుర్థకం ఋగంతే ర్థముచాంతేవా పాదాంతేవాపి మార్జయేత్, గాయత్రీ శిరసాచాంతే మార్జయిత్వా ఘమర్షణం.” అనఁగా బ్రణవముచేతిను వ్యాహృతులచేతను ప్రణవము నంతమందు నుంచి గాయత్రిచేతను మార్జనము ఆపోహిష్ఠ యను సూక్తముచే నాల్గవమార్జ నము ప్రతిఋక్కునకైనను సగము పఠించియైనను పాదాంతమందైనను మార్జనము జేసి యంతమందు గాయత్రీ శిరస్సుచే మార్జనము. అటుపై నఘమర్షణము ఎట్లనిన; “ఋతంచేతిత్ర్యృచస్య మధుచ్ఛందసో ౭ ఘమర్షణోభావ వృత్తమనుష్టుప్, అఘమర్షణే వినియోగ” అని యుచ్చరించి కుడిచేతిలో జలముంచి ఋతంచయను మూఁడుఁ ఋక్కులనుగాని ద్రుపదాయను ఋక్కుగాని పఠించి ముకర్కుకుడిచెరమయూపిరిచే పాపపురుషుని ద్రోసి యాజలమును జూడకయే యెడమభాగమందు భూమిపై జల్లి వేయవలెను. అటుపై నాచమించి “గాయత్ర్యావిశ్వామిత్ర; సవితా, గాయత్రీ, శ్రీ సూర్యాయార్ఘ్య దానేవినియోగః” యని యుచ్చరించి ప్రణవము వ్యాహృతులును బూర్వముగ గాయత్రి జపింపుచు నిలువఁబడి సూర్యాభిముఖుఁడై జలపూర్ణమైన దోసిలిని ముమ్మారు మీదికిఁజల్లవలెను. ఉక్తకాల మతి క్రమించినచో బ్రాయశ్చిత్తము నకై నాల్గవమారు జల్లవలెను. అసావాదిత్యో బ్రహ్మ యని యుచ్చరింపుచు బ్రదక్షిణ ముగ దిరుగుచు జలధార విడువవలెను. అర్ఘ్యమిచ్చునపుడు దోసిలిలో నంగుష్ఠమునకు దర్జనికి సంయోగము గూడదు. ఇట్లు సూర్యున కర్ఘ్యదానము సంధ్యాకర్మకు ప్రధాన మని కొందరు. అంగమని కొందరు, ఇఁక గాయత్రీ జపము మీఁదజెప్పినట్లు

ప్రాణాయామముజేసి, గాయత్ర్యా విశ్వామిత్ర, సవితా, గాయత్రీ జపేవినియోగః. తత్సవితుః హృదయాయనమః, వరేణ్యం శిరసేస్వాహా భర్గోదేవస్య శిఖాయైవషట్ ధీమహి కవచాయహుం, ధీయోయోనః నేత్రత్రయాయవౌషట్, ప్రచోదయాత్, అస్త్రాయ ఫట్ అని యుచ్చరింపుచు నాయాయంగముల న్యసింపవలెను. న్యాసవిధి వైదికము గాదు గనుక న్యాసము వైకల్పికమని గృహ్యాపరిశిష్టమందున్నది. ఇటు లక్షరన్యాస పదన్యాస పాదన్యాసాదులును ముద్రాప్రదర్శనాదులును శాపవిమోచనాది విధియును తాంత్రికములగుటచే వైదికములుగా నందున ననావశ్యకములని యూహించునది. జపించునపుడు మంత్రదేవతలను ధ్యానించవలెను. కొందరు గాయత్రి మొదలగువాని ధ్యానము జెప్పుదురు. "ఆగచ్ఛవరదే దేవి జపేమే సన్నిధౌభవ, గాయంతంత్రాయసే యస్మాద్గాయత్రీ త్వం తతస్మృతా" యిన యావాణముజేసి, "యోదేవస్స స్సవితాస్మాకం ధియో ధర్మాది గోచరే, ప్రరయే త్తస్య తద్భర్గస్త ద్వరేణ్య ముపాస్మహే" అని మంత్రార్థ మును ధ్యానింపుచు ననఁగా సవితృనామకుఁడైన యే దేవుఁడు మన బుద్ధివృత్తులను ధర్మము మొదలగువానికై ప్రవర్తింపజేయునో యా దేవుని యా తేజము వరింపఁ దగినది. దాని నుపాసింతుమని యర్థమును దలంచుచు మౌనముతో బ్రాతఃకాలమున సూర్యాభిముఖుఁడై నిలువఁబడి యుదయమైన సూర్యమండలము గానుపించు వరకును ప్రణవవ్యాహృతులతో గూడిన గాయత్రిని నూటయెనిమిది మారులుగాని యిరువదెనిమిది మారులుగాని పదిమారులుగాని జపించవలెను. సాయంకాలమం దైనచో వాయవ్యదిక్కున కభిముఖుఁడై జపించవలెనని విశేషము. అదియు నక్షత్ర దర్శన పర్యంతమని తెలియవలెను. అనధ్యాయమం దిరువదెనిమిది మారులును బ్రదోషమందు బదిమారులని కారికయందున్నది. రుద్రాక్షములు పగడములు మొద లగువాని మాలికచేగాని యంగుళులపర్వములచేగాని జపసంఖ్య జేయునది. ఇఁక నక్షమాలికకు నూటయెనిమిదిగాని యేబది నాల్గుగాని యిరువదేడుగాని పూసలుండ వలెను. ఉత్తరన్యాసమును జేసి యుపస్థానము జేయవలెను. "జాతవేదసే తచ్ఛంయో నమో బ్రహ్మణే" అను మంత్రములచే నుపస్థానము జేయవలెనని పరిశిష్ట గ్రంథమం దున్నది. మరియొకస్మృతిలో మిత్రస్యచర్షణీ యని మొదలగు మిత్రదేవతాకమంత్ర ములచే బ్రాతఃకాలముననను ఇమంమే వరుణయని మొదలగు వరుణపరయుక్తమైన మంత్రములచేతను సాయంకాలముననను సూర్యోపస్థానము జేయవలననియున్నది. అటుపైని దిక్కులకు నమస్కారము. "ప్రాచ్యైదిశే ఇంద్రాయనమః ఆగ్నేయ్యైదిశే అగ్నయే నమః" అని మొదలుగ పదిదిక్కులకు వందనము జేసిసనైని సంధ్యాయై నమః గాయత్ర్యై నమః, సావిత్ర్యై నమః, సరస్వత్యై నమః సర్వాభ్యో దేవతాభ్యో నమః అని నమస్కరించి "ఉత్తమేశిఖరేజాతే భూమ్యాం పర్వతమూర్ధని, బ్రాహ్మణేభ్యోభ్యనుజ్ఞాతా గచ్ఛదేవి యథా సుఖం" అనుమంత్రముచే సంధ్యాదేవిని బంపవలెను. భద్రంనో అపి వాతయ యనుమంత్రము ముమ్మారుపఠించి ప్రదక్షిణముగా దిరుగుచు, "అసత్య లోకోత్పాతాలా దాలోకాలోక పర్వతాత్, యేసంతి బ్రాహ్మణాదేవాస్తేభ్యో నిత్యం నమోనమః" యని భూమిపై సాష్టాంగముల నమస్కరించి రెండుమారులాచమనము జేయవలెను.

## తైత్తిరీయులకు సంధ్యా ప్రయోగము

తైత్తిరీయులకు సంకల్ప పర్యంతము పూర్వమువలెను గాయత్రిని ధ్యానించి "ఆయాతువరదా దేవీ అక్షరం బ్రహ్మసమ్మితం, గాయత్రీం ఛందసాం మాతేదం బ్రహ్మ ఋషస్వమే, సర్వవర్ణే మహాదేవి సంధ్యావిద్యే సరస్వతి, అజరే అమరే దేవి సర్వదేవి నమోస్తుతే, ఓజోసి సహోసి బలమసి భ్రాజోసి దేహనాం ధామనామాసి, విశ్వమసివిశ్వాయుః సర్వమసిసర్వాయుః అభిభూరోమ్‌గాయత్రీ మావాహయామి. సావిత్రీ మావాహయామి. సరస్వతీ మావాహయామి. ఛందర్షీ నావాహయామి, శ్రియమావాహయామి. హ్రియమావాహయామి." యని యావాణముజేసి మార్జనము మీఁదఁజెప్పినటుల జేయునది. ఆపైని "ఆపోవా ఇదగ్‌సర్వం విశ్వాభతాన్యాసః ప్రాణవా ఆపః పశవ ఆపోన్నమాపో౽మృతమాపస్స్రమ్రాడాపో విరాడాపస్స్వరాడాప శ్చుందాగ్ స్యాపోజ్యోతీగ్ ష్యాపోయజూగ్ ష్యాపస్సత్య మాపస్సర్వా దేవతా ఆపోభూర్భువ స్సువరాప ఓం" అని జలము నభిమంత్రించి సూర్యశ్చ యనుమంత్రముచే మీఁదఁజెప్పినట్లనే మంత్రాచమనము జేయునది. ఆపైని "దధిక్రావ్‌ణ్ణో అకారిషం" అను ఋక్కునుబఠించి ఆపోహిష్ఠయను మూఁడు ఋక్కులను హిరణ్యవర్ణా యనియు పవమానస్సువర్జన యను ననువాకమును బఠింపుచు ప్రతిఋక్కునంతమున మార్జన ముజేసి యఘమర్షణమనఁగ బాపపురుష నిస్సరణము వైకల్పికమగుటచే జేసియైనను జేయకయయినను నర్ఘ్యదానము మొదలగు గాయత్రీ జపము వరకును నావాహన మంత్రములు లేకుండగ బూర్వమవలె జేయునది. న్యాసవిధికిని వైదికత్వము మీఁదఁ జెప్పఁబడినది. జపాంతమం దుపస్థానము, మిత్రస్యచర్‌షణీ. మిత్రోజనాన్. ప్రసమిత్రమర్తో అస్తు...యచ్చిద్ధితే. యత్కించేదం...కితవాసోయత్. అని యీయా రీటిచేత నుపస్తానము. ఆపైని "నమః ప్రాచ్యైదిశేయాశ్చదేవతా ఏతస్యాం ప్రతివసంత్యే తాభ్యశ్చ నమోనమ" యని యీరీతి నధ రాయైదిశే యను వరకు నారింటికిజేసి అవాంతరాయైదిశేయాశ్చదేవతాః" యని నమస్కరించి నమో గంగాయమున యోర్మునిభ్యశ్చ సమయని మొదలుగ మునులను దేవతలను నమస్కరించి సగ్గ్రవంతుది శోమయి యనుమంత్రము బఠించి గోత్రాదుల నుచ్చరించి మీఁదఁ జెప్పినటుల భూమిపై దండప్రణామముచేసి పూర్వమువలె సంధ్యాదేవి నంపవలెనని.

## కాత్యాయనుల సంధ్యా ప్రయోగము

ఇఁక గాత్యాయనులకు సంధ్యా ప్రయోగము. ఆచమనము జేసి "భూఃపునాతు. భువఃపునాతు. సువఃపునాతు. భూర్భువస్వఃపునాతు" అనిజలము ద్రావి ఆపవిత్రః పవిత్రోవా యని విష్ణునిస్మరించి యాసనాదివిధిజేసి రెండుమారు లాచమించి బ్రాణాయామముజేసి పూర్వమువలె సంకల్పము "గాయత్రీ త్ర్యక్షరాం బాలాం సాక్ష సూత్రకమండలుం, రక్తవస్త్రాం చతుర్వక్త్రాం హంసవాహన సంస్థితాం, బ్రాహ్మణీం బ్రహ్మదైవత్యాం బ్రహ్మలోక నివాసినీం, ఆవాహయామ్యహం దేవీ మాయాంతీం సూర్య మండలాత్. ఆగచ్ఛ వరదేదేవి త్ర్యక్షరే బ్రహ్మవాదిని, గాయత్రీ ఛందసాం

మాతః బ్రహ్మయోనే నమోస్తుతే.” అని యావాణముజేసి పూర్వమువలె నాపోహిష్ఠ యను తొమ్మిదింటిచే మార్గజనమని కొందరు. అనేకశిష్టులు సంకల్పాదులైనపైని సూర్యశ్చయని మంత్రాచమనము జేసి ఆపోహిష్ఠయను మూటింటిచే మార్జనము. అది ప్రతిపాదమునకుజేసి యఘమర్షణముగాని మార్జనద్వయము లేదంద్రు. “సుమిత్రా దుర్మిత్రా. “ఇదిద్వయోః ప్రజాపతిః ఋషిరాపోదేవతా యజుశ్ఛందః, ఆదాన ప్రక్షేపణే వినియోగః సుమిత్రాన ఆప ఓషధయస్సంతు.” అని జలమును గ్రహించి ‘దుర్మిత్రాస్తస్మై సంతు యోస్మాన్ద్వేష్టి యంచవయం ద్విష్మ’ యనియెడమ భూమియందు జల్లవలెను. అటుపైని ఋతంచయను మూడు ఋక్కులచేగాని ద్రుపదా యనునది మూడుమారు లుచ్చరించిగాని యఘమర్షణము పూర్వమువలె జేయునది. సాయంకాలమునను ప్రాతఃకాలమునను ముమ్మారర్ఘ్య మీయవలెను. అదియును బుష్పసహితమైన జలముచేగావలెను. మధ్యాహ్న మందైనచో నొక్కమారే గాయత్రిచే నంతట బ్రోక్షించవలెను. ఇఁక నుపస్థానము. “ఉద్వయముదుత్యమితిద్వయోః ప్రస్కణ్వ ఋషిః సూర్యోదేవతా అనుష్టుప్ గాయత్ర్యౌఛందసీ” చిత్రం దేవానాం ఆంగిరసః కుత్సః సూర్యః త్రిష్టుప్. తచ్చక్షుర్దశ్యజ్వ్యాధర్వణః సూర్యః పుర ఉష్ణిక్ ఉపస్థానే విని యోగః ఉద్వయంతమసస్పరి ....ఉదుత్యంజాతవేదసం....చిత్రం దేవానాం...తచ్ఛక్షు ర్దేవహితం ...అని జపించునపుడు బాహువులెత్తి సూర్యుని జూచుచు శాఖోక్త ప్రకార ముచ్చరింపవలెను. ప్రాణాయామాదులజేసి న్యాసముద్రార్పణాదులు వైకల్పికములు. “తేజోసీతిపరమేష్ఠీతి ప్రజాపతి రాజ్యం యజుః ఆవాహనే వినియోగః తేజోసి శుక్రమ స్యమృతమసి ధామనామాసి ప్రియంతే వానామనాదృష్టం దేవయజనమసి పరోతిరజస ఇటివిమలః పరమాత్మానుష్టుప్ గాయత్ర్యుప గాయత్ర్యస్యేకపదీ ద్విపదీ త్రిపదీ చతుష్పద్య యదనినహిపద్యసే నమస్తేతురీయాయ దర్శనాయప దాయపరో రజసే సావదోమ్” అటుపైని గాయత్రీ జపము పర్యంతము పూర్వమువలెనే ఆపైని సమర్థుడేని విభ్రాట్ అనుననువాకముచే పురుషసూక్తముచేత సంకల్పము. మండల బ్రాహ్మణము వీనిలో నొకదానిచే నుపస్థానము జేయవలెను. ఇక్కడ ఋగ్వేదులు చేయునట్లు దిగ్బంధనము గొందరు చేయుదురు. ఆపైని “ఉత్తమేశిఖరేజాతే దేవాగాతు విదోగాతుం అనుమంత్రములచే విసర్జనము. భూమిపై నమస్కారాదికము పూర్వము వలెనే ఇట్లు కాత్యాయన సంధ్యా “సంధ్యాముసాసతేయేతే నిష్పాపాబ్రహ్మలోకగాః, అన్యకర్మఫలంనాస్తి సంధ్యాహీనేఽశుచిత్వతః జీవమానో భవేచ్ఛూద్రో మృతశ్శ్వా జాయతే ధ్రువం” అనఁగా సంధ్యా వందనముయథోక్తముగ జేయువారు పాపహీనులై బ్రహ్మలోకము నొందుదురు. దీనిని విడచి యేకర్మయు బనికిరాదు. సరియేకదా. జీవించియున్నపుడు శూద్రుఁడే యగును. మృతుడైనచో గుక్క జన్మమెత్తును. సంధ్యా త్రయమందును కాలాతిక్రమణమైనచో నొకయర్ఘ్య మధికముగా నీవలెను. రాత్రి యందు జాముపర్యంతము దినమందు విధించినకర్మలు చేయవచ్చును. బ్రహ్మ యజ్ఞమును సౌరమును గూడదు. సర్వప్రకారములచే సంధ్యకు లోపమైనచో నొక యుపవాసమును పదివేలుగాని వేయు నెనిమిదిమారులుగాని గాయత్రీ జపమును

జేయవలెను. ఆశక్తియందు బ్రతిసంధ్యకు నూరుమారులు గాయత్రీ జపము రెండు రోజులు లోపించినచో బ్రాయశ్చిత్తమున కావృత్తియగు, అటు పైని గృచ్ఛ్రాదులు గల్పించవలెను.

## ఔపాసన హోమము

అశక్తిలో పత్నియు పుత్రుఁడు పుత్రికభ్రాతయు శిష్యుడు మేనల్లుడు నల్లుడు ఋత్విక్కును చేయవచ్చును. అట్లు చేయుటయు దంపతుల సన్నిధియందుగాని యొకరి సన్నిధియందైనను గావచ్చును. త్యాగము వారే చెప్పవలెను. ఒకవేళ నెవ్వరులేనిచో వారి యాజ్ఞచే ఋత్విగాదులు జెప్పవచ్చును. పత్ని ఋతుమతియైగాని ప్రసవించిగాని వెర్రెత్రి గానియున్నచో నాజ్ఞలేకపోయినను జెప్పవచ్చును. 'స్వయం హోమే ఫలం యత్స్యా దన్యైర్హోమే తదర్ధకం' అనఁగా దాను జేసిన యెడ గల్గుఫలమన్యులచే జేయిం చిన సగముగల్గును. పర్వమందు దానే చేయవలెను. అందు బ్రాతఃకాలమందు సూర్యోదయమునను సాయంకాలమున సూర్యాస్తమయమునకు మున్నును జేయునది. అగ్నులకుగాని గృహ్యాగ్నికిగాని ప్రాదుష్కరణముజేసి యనఁగా బ్రణయించిసూర్యో దయాస్తోత్తరమందు హోమముఁ జేయవలెను. అట్లు ప్రణయించుటకే కాలమతిక్ర మించినచో, ఓం భూర్భువస్స్వః, స్వాహాయని స్రువముచే నాజ్యాహుతి యీవలెను. అంతటను ప్రాయశ్చిత్త మాజ్యసంస్కార పూర్వముగజేసి హోమముఁ జేయునది. సూర్యోదయమైనపైని పదిగడియలు హోమమునకు ముఖ్యకాలమే. ఆపైని సాయం కాలము వరకును గౌణకాలము. ఇట్లు సాయంహోమమున కస్తమయముపై దొమ్మిది గడియలవరకును ముఖ్యకాలము. అటుపై బ్రాతఃకాలము వరకును గౌణకాలము. ముఖ్యకాలాతిక్రమమందు దన్నిమిత్తిక ప్రాయశ్చితతపూర్వక మముకహోమం కరిష్యే యని సంకల్పించి యాజ్యమును సంస్కరించి స్రుక్కునందు జతుర్గృహీతముఁజేసి సాయంకాలే దోషావస్తర్నమస్స్వాహా యని వేల్చియుదయమున ప్రాతర్వస్తర్నమస్స్వాహా యని వేల్చియు హోమద్రవ్యము సంస్కరించి నిత్యహోమము చేయునది. శ్రౌతాగ్ని హోమమైన పైని స్మార్తాగ్ని హోమముఁ జేయునది. కొందరు స్మార్తహోమమునే పూర్వముగ జెప్పుదురు. ఆధానమందును పునరాధానమందును, హోమారంభము సాయమందే యగును. సాయంప్రతార్హోమములందు హోమార్థద్రవ్య మొక్కటియే గావలెను. ఇట్లు కర్తయు నొకఁడే కావలెనుగాని ప్రాతర్హోమము యజమానుఁడు చేసినచో కర్తృభేదమనఁగ మరియొకరు సాయం హోమము జేసినను దోషములేదు.

## అశ్వలాయనస్మార్త హోమప్రయోగము

ఆచమించి ప్రాణాయామముజేసి దేశకాలముల స్మరించి, శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం సాయమౌపాసనహోమం ప్రాతరౌపాసనహోమంవా అముకద్రవ్యేణ కరిష్యే యని సంకల్పించి, చత్వారిశృంగా యని ధ్యానించి జలముతోగూడిన హస్తముచే ముమ్మారగ్ని చుట్టును స్పృశించి దర్భలు పరచి ముమ్మారు చుట్టుప్రోక్షించి యుత్తర భాగమందు సమిధలతోగూడిన హోమద్రవ్యమును మండుచున్న దర్భ ప్రతిబింబము

నొందించి ప్రోక్షించి తిరుగ మండుచున్నదర్భచే జుట్టునుద్రిప్పి యగ్నికి బశ్చిమమున దర్భయందుంచి విశ్వానినయనుబుక్కుచే నభ్యర్చనముజేసి ప్రజాపతిదేవత మనస్సుచే ధ్యానముజేయుచు సమిధ నగ్నియందు వ్రేసి విడి యాసమిధ మండినపైని నూరు బియ్యపుగింజలచే అగ్నయేస్వాహా యని సాయంకాలమున బ్రథమాహుతి. సూర్యాయ స్వాహా. యని ప్రాతఃకాలమందు బ్రథమాహుతి. నూటికంటె నెక్కుడైన బియ్యముచే బ్రజాపతయే. అని మనసులో నుచ్చరించి హోమమును ద్యాగమును జేసిన ద్వితీయా హుతి యగును. ఇట్లు కాలద్వయమందును పరిస్తరణముఁదప్ప బరిసమూహనము బర్యుక్షణమునుజేసి యుపస్థానము. "అగ్న ఆయూంషి తిస్సృణాంశతం వైఖానసా అగ్నిః పవమానోగాయత్రీ, అగ్న్యుపస్థానే వినియోగః అగ్నేత్వం న ఇతి తిస్సృణాం గౌపాయనా వౌపాయనావా బంధుస్సు బందు శ్రృతబంధుర్వి ప్రబంధుశ్వాగ్ని ర్ద్వి ప్రదావిరాట్, అగ్న్యుపస్థానే వినియోగః ప్రజాపతే హిరణ్యగర్భః ప్రజాపతి స్త్రిష్టుప్ ప్రజాపత్యుపస్థానే వినియోగః, తంతుంన్వన్ దేవా అగ్నిర్జగతీ ఉపస్థానే వినియోగః హిరణ్యగర్భో హిరణ్యగర్భః ప్రజాపతి స్త్రిష్టుప్, ప్రజాపత్యుపస్థానే వినియోగః" అని యిట్లు వాయవ్యదేశమందుండియు యామంత్రములచే నుపస్థానముజేసి కూర్చుండి మానస్తోక్తే యని మొదలగు మంత్రములచే భస్మధారణము కొన్నిటిలో జెప్పఁబడినది విష్ణునిస్మరించి; "అనేన హోమకర్మణా శ్రీపరమేశ్వరః ప్రీయతాం అని యర్పించవలెను. ప్రాతఃకాలమందు "సూర్యోనోదివస్సూర్యశ్చక్షుః స్సూర్యోగాయత్రీ సూర్యోపస్థానే విని యోగః, ఉదుత్యం కణ్వః ప్రస్కణ్వః సూర్యోగాయత్రీ సూర్యోపస్థానే వినియోగః, చిత్రం దేవానా మాంగిరసః కుత్ససూర్యస్త్రిష్టుప్ సూర్యోపస్థానే వినియోగః" చిత్రం దేవానా మాంగిరసః కుత్ససూర్యస్త్రిష్టుప్ సూర్యోపస్థానే వినియోగః" అని యిట్లు పూర్వోక్తము లైన నాల్గింటిచేతను మూఁడు ప్రాజాపత్యములచేతను నుపస్థానముయునది. కొందరు ప్రాతఃకాలమునందు తంతుంతన్వన్ అని పఠింతురు. పత్నియు గుమారియు హోమము జేయునపుడు ధ్యానోపస్థానములలో మంత్రములు వర్జింపవలెను.

## హిరణ్య కేశీయుల హోమప్రయోగము

హిరణ్యకేశిశాఖీయులకు బూర్వోక్తమైన సంకల్పాదులైన పైని 'యథాహతద్వ సవః' అనుమంత్రముచే బరిసమూహనముజేసి పరిస్తరణమనఁగ దర్భలు చుట్టుబరచి అదితేనుమన్యస్వ యని దక్షిణమున తూర్పు సమాప్తిగ జలమును బ్రోక్షించునది అనుమతేను మన్యస్వ యని పశ్చిమమందు నుత్తర సమాప్తిగ బ్రోక్షించునది. దేవసవితః ప్రసువయని చుట్టును బ్రోక్షించి యూరకే సమిధనువ్రేసి హోమాదులు మీఁదఁ జెప్పినటుల జేయునది. ఆ పైని "అదితేన్వమగ్గ్స్థాః అనుమతే న్వమగ్గ్స్థాః సరస్వతేన్వ మగ్గ్స్థాః దేవసవితః ప్రాసావీః" అని యుచ్చరింపుచు మీఁదఁజెప్పినటుల నాల్గు దిక్కులను చుట్టును బరిషేచనముఁ జేయునది. 'ఉదుత్యం చిత్రందేవానాం' అను మంత్రములచే బ్రాతఃకాలమందుపస్థానము అగ్నిర్మూర్ధాదివఃత్వామగ్నే పుష్కరాదధి' యను రెండిటిచే సాయంకాలమున' నుపస్థానము. ఇఁక నాపస్తంబులకు సాయంకాల

మునందు 'అగ్నయేస్వాహా' యనియు 'అగ్నయే స్విష్టకృతేస్వాహా' యనియు నాహుతులు సిద్ధములు ప్రాతఃకాలమందు 'సూర్యాయస్వాహా' యనియు 'అగ్నయేస్విష్టకృతేస్వాహా' యనియు విశేషము. తక్కినది హిరణ్యకేశీయులకువలె దెలియునది.

## కాత్యాయనుల హోమప్రయోగము

కాత్యాయనులకు సాయంకాలమున నస్తమయమైన పైని హోమము ప్రాతః కాలమున సూర్యుఁడుదయింపక మున్ను హోమము అందు ప్రాతఃకాలమున నుపస్థాన పర్యంతము సంధ్యాకర్మజేసి హోమాంతమందు గాయత్రీ జపము మొదలగు సంధ్యాసమాప్తిఁ జేయునది. అపుడు మీఁదఁ జెప్పినటుల సంకల్పించినపైని కట్టలోనుంచి దర్భలు తీసి యెడమచేతిలోనుంచుకొని కుడిచేతితో మూడుసమిధ లగ్నిలో వేసి కుంభోదకముచే జుట్టుబ్రోక్షించి యగ్ని నక్షతలచే జుట్టునర్చించి అగ్నయే స్వాహా ప్రజాపతయేస్వాహా యని సాయంకాలమున దధచేగాని బియ్యముచేతగాని హోమముజేసి యట్లనే ప్రాతఃకాలమందును 'సూర్యాయస్వాహా ప్రజాపతయే స్వాహా' యని హోమముఁ జేయవలెను. 'సమాస్త్వాయ' ను వాకముచే సాయంకాలమున కుపస్థానము ప్రాతఃకాలమున విభ్రాట్ అను ననువాకముచే నుపస్థానము. ఇక్కడ దధిహోమాదులలో హోమకాలమున స్రవించినదాని ప్రాశనము జెప్పుదురు. హోమము లోపమైనచో నష్టోత్తర సహస్రగాయత్రీ జపము ప్రాయశ్చిత్తము. ముఖ్య కాలాతిక్రమమైనచో ననాదిష్టహోమము జేయవలెను.

## హోమ ద్రవ్యములు

ధాన్యము, చామలు, యవలు వీటిబియ్యము, పాలు, పెరుగు, నేయియు, నివి హోమార్హములు. యవలు, ధాన్యము, గోధూమములు, కొర్రలు నివి దంపకుండ గనే హోమార్హములు గావచ్చును. నువ్వులు స్వరూపముతోనే హోమార్హములు. బియ్యము మొదలగునవి నూరుసంఖ్యగలుగునట్లు హస్తముచే హోమము జేయునది. దధిమొదలగు ద్రవ్యము స్రువముచే యగును అంతట నుత్తరాహుతి పూర్వాహుతి కంటె నధికముగ నుండవలెను. ఇఁక సమిధలు, జిల్లుడు, మోదుగు, చంద్ర, దుచ్చన, రావి, బొడ్డ, జిమ్మి, దూర్వ, దర్భయునని, వీని స్వరూపము త్వక్కుతో గూడినవై పది పండ్రెండంగులముల పొడవుగ నుండవలెను. మఱ్ఱి జువ్వి మారేడు మొదలగు సమిధలు హేమాద్రిలో జెప్పబడివి. ఆహుతులు రెంటిటికి సంయోగమగుచో 'యత్ర వేత్థవనస్పతే' యను మంత్రముచే నగ్నికి సమిధహోమముఁ జేయునది. నిత్య హోమ మతిక్రమించినచో నాజ్యము సంస్కరించి నాల్గుమారులు గ్రహించి 'మనోజ్యోతిర్జుష తాం' అని వేల్చవలెను. పండ్రెండు దినముల వరకును హోమలోపమున కిట్లనే ప్రాయశ్చిత్తము. అటుపై నగ్నియే నశించును.

## హోమాతిక్రమమందు ప్రాయశ్చిత్తము

ఇట్లు హోమలోపమైనచో బ్రాయశ్చిత్తము జేసుకొని యతిక్రమించిన హోమము నకై ద్రవ్యము సంస్కరించి నిత్యము రెండేసి యాహుతుల చొప్పున బూర్తిజేసుకొన

వలెను. అగ్ని సూర్యప్రజాపతుల కుపస్థానము జేయవలెను. హోమము దిరుగజేయ నక్కరలేదు. ప్రాయశ్చిత్తముచే సిద్ధించునని పక్షాంతరము. సూతకాదులచే హోమ లోపము గల్గునపుడు నిటులనే ప్రాయశ్చిత్తము హిరణ్యకేశీయులకు నిటులనే. ఆప స్తంబాదులైనచో మూఁడు దినములు. హోమలోపముచే నగ్ని నశించును గనుక సూతకమందును స్వయముగ హోమము జేయవలెను. అగ్ని నాత్మారోపణము జేయు నపుడు సూతకము వచ్చినచో దిరుగనవరోపణము సంభవింపకుండుటచే మూఁడు రోజులు హోమలోకపము వచ్చేనేని దిరుగ నాధానముచే నగ్ని బుట్టించుకొన వలెను. ఇఁక సాయంప్రాతర్హోమములు రెండునొక కాలమందె కలిపిచేయుట. అపుడు సాయంప్రాతర్హోమౌసమస్య కరిష్యే యని సంకల్పించి మీఁదఁజెప్పినట్లు సాయంకాల హోమాంతముజేసి చుట్టుప్రోక్షించి తిరుగ హోమద్రవ్యము సంస్కరించి సమిధ నగ్ని యందుంచి సూర్యాయ ప్రజాపతయే యని యాహుతులిచ్చి హవిష్యాంతమని యుప స్థానము జేయవలెను. హవిష్యాంతమితి పంచర్చస్య వామదేవస్సూర్య వైశ్వానరౌ త్రిష్టుప్. అని యుచ్చరించి మంత్రములు పఠించవలెను. నిత్యమువలె ప్రజాపత్యుప స్థానము.

## పక్షహోమము

ప్రతిపదయందు అద్యసాయ మారభ్య చతుర్దశీ సాయమవధికాన్ పక్షహోమాం స్తంత్రేణ కరిష్యే. యని సంకల్పించి సాయంకాలమందు బియ్యము వృద్ధిక్షయానుసార ముగ బదునాల్గు మొదలగు నాహుతులకు దగినంతేసి రెండుపాత్రలందుంచి హోమ కాలమందు అగ్నయే స్వాహాయని మొదటిపాత్రయందుంచినవన్నియు నొకమారేవేల్చి రెండవపాత్రయందుంచినవియు ప్రజాపతయే స్వాహాయని యట్లనే హోమము చేయ వలెను. ఇట్లు విదియరోజునను నుదయమున అద్యావధి పర్వప్రాతరవధికాన్ పక్ష హోమాం స్తంత్రేణకరిష్యే యని సంకల్పము మొదలుగ సాయమువలె జేయవలెను. విశేషమేమనిన; ప్రథమపాత్రయందుంచినవి సూర్యాయ స్వాహా యనియు రెండవ పాత్రములోనివి ప్రజాపతయే యనియు వేల్చి రెంటియందు సమిధయొకటియే యుపస్థానము మొదలగునవి యొకమారే చేయునది. పక్షమధ్యమందాపదవచ్చినచో నా సాయంకాలమందు జతుర్దశి సాయముపర్యంతము జేయవలసిన మిగిలిన హోమ ములన్నియు బక్షహోమమునందువలె నొకమారే చేయవలెను. ప్రాతర్హోమములు మాత్రము పర్వప్రాతఃకాలమందే చేయవలెను. సర్వప్రకారములచేతను పర్వసాయం హోమమును ప్రతిపద ప్రాతర్హోమమును వేరుగనే చేయవలెను. పక్షహోమము. పక్షమధ్యమందాపద నివర్తించినచో నతిక్రాంత హోమము లపకర్షించి తిరుగ జేయ వలెను. వరుసగా పక్షహోమములు ముమ్మారు జరిగినచో నగ్ని నాశమగును. గనుక మూఁడవపక్షమందు బ్రతిదినమును హోమము జేయునది. సర్వప్రకారములచే నాపద నివర్తించని యెడ యావజ్జీవము పక్షహోమములే జేయవలెను.

## సమారోపవిధి

అయంతేయోనిరిత్యస్య విశ్వామిత్రోగ్ని రనుష్టుప్ అగ్నిసమారోపే వినియోగః అని యుచ్చరించి అయంతేయోని యనుమంత్రముచే హోమానంతరమందరణిగాని రావిసమిధగాని యగ్నియందుగాచి యగ్ని యెక్కుటను భావింపవలెను. తిరుగ హోమాది కాలమందరణిని మథించి ప్రత్యవరోహ యనుమంత్రముచే స్థండిలమం దగ్నిని బ్రతిష్ఠించవలెను. సమిధయం దారోపించినచో శ్రోత్రియగృహము నుండి యగ్నిదెచ్చి ప్రవరోహ యనుమంత్రముచే నాసమిధ నగ్నియందు వేల్చవలెను. సూత్రాంతరమందు, ఆ జుహ్వాన, ఉద్బుధ్యస్వయను మంత్రములచే బ్రత్యవరోహణము ప్రతిదినము సమారోపాదికము పంద్రెండుదినము లేపర్వమందు సాయంకాలపర్యం తము ప్రద్యంరోహణము లేనిచో నగ్నినశించునని కొందరు సమారోపమును ప్రత్యవరోహణమును యజమానుఁడే చేయవలెను. కనుక సమారోపమైన పైని పర్వమం దాశౌచమువచ్చినచో బ్రత్యవరోహణము సంభవింపదు గావున నగ్ని నశిం చును. ఇట్లు మూఁడు దినములు హోమలోపమైనను దెలియునది. అదియు పున రాధానవిధిగల్గిన యాపస్తంబాదులకే. ఆశ్వలాయనులకైనచో బంద్రెండు రాత్రులలో పర్వమందు బ్రత్యవరోహము ఋత్విగాదులందు సమారోపాదికము గావచ్చును. కొందరు ఋత్విగాదులులేనిచో నన్యమైనగతి లేనియెడ నాశౌచమురాక కంటె పూర్వమైన హోమములతోగూడ నన్నియు నపకర్షించి హోమముల జేసియైనను జేయకయైనను సమారోపముజేసి సూతకాంతమందు బ్రత్యవరోహము జేయవచ్చును. అపుడు పర్వముదాటిన దోషములేదంద్రు అగ్ని సమారోపణమైన పైని దంపతులకు బ్రవాసము సంభవించునపుడు గ్రామసీమనైనను నదినైనను దాటవలసివచ్చినపుడు దంపతు లిద్దరునుగాని యొకరుగాని యగ్నినారోపించిన సమిధ మొదలగుదాని స్పర్శగలిగియే యుండవలెను. లేనిచో నగ్ని నశించును.

## యజమానుని ప్రవాసమందు కృత్యము

అభయం వోఽభయంమేస్తు. అని అగ్ని బ్రార్థించి ప్రవాసమునకు వెళ్లవలెను. తిరుగవచ్చునపుడు, "గృహామాబిభీతోపవస్స్వస్త్యై వోస్మాసుచ ప్రజాయధ్వం మాచవో గోపతీరిషత్" అనుమంత్ర ముచ్చరింపుచు స్వగృహమును జూచి "గృహానహాంసు మనసః ప్రపద్యేవీరఘ్నీ వీరవతస్సువీరాన్, ఇరాంవహంతోద్యూతముక్షమాణాస్తేష్వ హంసుమనాస్సంవిశామి" యని పఠింపుచు గృహమును బ్రవేశించి 'శివంశగ్మంశం యోః శంయోః' అని తిరుగ ముమ్మారుచూచి నిత్యహోమంతమందు. 'అభయంవోఽ భయం మేస్తు.' అని యగ్నులబ్రార్థించునది. జ్యేష్ఠపుత్రుని శిరస్సు హస్తముచే బట్టుకొని అంగాదంగాత్సంభవసి. యను మంత్రము జపించి ముమ్మారాఘ్రాణింపవలెను. ఇట్లితరపుత్రులకును జేయునది. వివాహమైన కన్యలకు నూరకనే యాఘ్రాణము. ప్రవాసమునుండి వచ్చినదానికి పూర్వము తమకుఁ దెలిసియున్న యప్రియ వార్త నాదినము జెప్పఁగూడదు. పతి ప్రయాణము వెల్లినచో బత్ని స్మార్తాగ్ని హోమములను

స్వయముగజేసి దర్శపూర్ణమాసస్థాలీపాక పిండపితృయజ్ఞములను బ్రాహ్మణునిచే జేయింపవలెను. అగ్ని చల్లారిపోయినచో బ్రాయశ్చిత్తము మొదలగునది పత్ని రజస్వలయై యున్నను ఋత్విగాదులు చేయవచ్చును. తిరుగ నగ్ని సంధానము మాత్రము పతి ప్రవాసములోనున్నపుడు గానేరదు. నైమిత్తికములైన జాతేష్టి గృహ దాహేష్టి మొదలగునవియును రానేరవు. ప్రాయశ్చిత్తేష్టికి బూర్ణాహుతి.

## ఔపాసనాగ్ని యుపశమించినచో ప్రాయశ్చిత్తము

"గృహ్యాగ్న్యనుగమనప్రాయశ్చిత్తం కరిష్యే" యని సంకల్పించి యగ్ని వేదిలో నున్న భస్మము దుడిచి యలుకుట మొదలగునవి జేసి యగ్నిని బ్రతిష్ఠించి యాజ్యము సంస్కరించి ఆయాశ్చా యను మంత్రముచే నొక యాజ్యాహుతి సర్వప్రాయశ్చిత్తాహుతియు వ్రేల్చిదంపతులలో నొకరు రెండవ హోమకాలపర్యంత ముపవాసము జేయునది. కొందరి ట్లుపవాసము ద్వాదశరాత్ర పర్యంతము జేయుటయైనను నయాశ్చ యనుమంత్రము నంతవరకు నాజ్యాహుతులిచ్చుటయైనను గావలెనుగాని రెండును జేయనక్కరలేదనిరి. ఇది వృత్తికారునిమతము. కొందరు అగ్ని యుపశమించిన యెడ హోమకాలద్వయము దాటినచో నష్టాగ్ని సంధానము. అందు మూఁడు రాత్రులగ్ని నశించినచో నూరు ప్రాణాయామములు. అటుపైని నిరువది రాత్రుల పర్యంతము నొక దినమందుపవాసము. ఆపైని రెండుమాసములవరకును మూఁడు రాత్రులుపవాసము, అనంతరము సంవత్సరము పర్యంతము ప్రాజాపత్య కృచ్ఛ్రము, ఆపైని సంవత్సరమొకటికి నొక కృచ్ఛ్రము చొప్పున జేయునది. ఇట్లు ప్రాయశ్చిత్తముజేసి యాధానమునకు జెప్పిన సంభారములుంచి "నష్టస్యగృహ్యాగ్నేః ప్రాయశ్చిత్తం కరిష్యే" యని సంకల్పించి ఆయా శ్చేతిమంత్రముతో స్రువముచే నాజ్యాహుతియు బత్ని యుపవాసము జేయుటయు మీఁదఁజెప్పినట్లు జేయునది. లాజహోమాదికమైనను జేయవచ్చును. ఇట్లు పండ్రెండు రాత్రులవరకు నగ్ని యుత్పత్తియని యండ్రు పండ్రెండుదినములైన పైని విచ్ఛేదప్రాయశ్చిత్తము హోమాది ద్రవ్యదానముజేసి వివాహ హోమాదివిధి తమతమ గృహ్యసూత్ర ప్రకారమున దిరుగ నగ్ని సంధానము.

## వివాహమైన పైనిగాని యాధానోత్తరమందుగాని పూర్ణిమ యందు, స్థాలీపాకము నకారంభము.

ఆహితాగ్నికి నిష్టికి మున్నగ్నిశమించెనేని అయాశ్చయని మీఁదఁ జెప్పినటు లగ్నిని సాధించి తిరుగ నన్వాధానము జేసి భూర్భువస్వః అని యుపస్థానముచేసి సర్వప్రాయశ్చిత్త హోమముచేసి స్థాలీపాకము జేయునది. అన్వాధానమైన పైని ప్రయాణము సంభవించెనేని 'తుభ్యం తా అంగిరస స్తమయని' యాజ్యాహుతి నగ్నికిచ్చి సర్వప్రాయశ్చిత్త హోమము జేసి యగ్నిని సమిధయందారోపించి వెళ్ళవలెను. ఆరోపణము జేసిన సమిధపోయినచో దిరుగ నాధానముఁ జేయునది. పునరాధేయ మనఁగా నలుకుట మొదలగుజేసి నష్టాగ్ని ప్రాయశ్చిత్తమును పునరాధేయమనఁగా నలుకుట మొదలగుజేసి నష్టాగ్ని ప్రాయశ్చిత్తమును పునరాధేయమును సంకల్పించి

యాధానమునకుఁ జెప్పిన సంభారములుంచి యగ్నిని బ్రతిష్ఠించి, ఆయాశ్చ యని స్రువము నాజ్యాహుతిని సర్వప్రాయశ్చిత్తమును వేల్చవలెనని పునరాధేయ విధి దెలియునది. తనయగ్నియే యని భ్రాంతిచే మరియొకనియగ్నిలో దాను యాగము జేసినను మరియొకరు తనయగ్నిలో యాగముజేసినను 'పథికృత్స్థాలీపాకం కరిష్యే' యని సంకల్పించి చరువును జేయవలెను. లేదా పథికృత్ స్థానమందు పూర్ణాహుతిం హోష్యామి యని సంకల్పించి స్రుక్కునందు బండ్రెండు మారులయినను నాల్గు మారులైన నాజ్యము గ్రహించి "అగ్నయేపథికృతే స్వాహా" యని వ్రేల్చవలెను. విహోత్తర మందైనను నాథానము జేసియైనను బూర్ణిమయందు స్థాలీపాకము నారంభించవలెను. ప్రతిపద యందు యాగ మతిక్రమించినచో ముందువచ్చెడు తిథులలో బూర్వ పూర్వతిథులందు జతుర్దియు, నవమి, చతుర్దశియు, ద్వితీయ పంచమి, అష్టమియు వీని విడిచి చేయవలెను. అపుడు కాలాతిక్రమణమునకు బ్రాయశ్చిత్తము లేదు. అన్వాథానమైన పైని ప్రతిపదయందిష్టి చేయనియెడ తృతీయ మొదలగు తిథులందు సర్వప్రాయశ్చిత్త హోమముజేసి తిరుగ నన్వాథానముచే యాగము జేయునంతలో రెండవపర్వము వచ్చినచో నతిక్రమించిన యిష్టిపథికృచ్చరువు మున్నుచేసి పర్వములో చేయవలెను. అపుడుగూడ నతిక్రమించినచో రెండవ ప్రతిపదయందు లోపించిన యిష్టికి పాదకృఛ్రముచేసి ప్రాప్తకాలమైన యాగము చేయునది ద్వితీయ యాగమునకు నాగామి తిథులందు లోపము గల్గినచో నాపర్వమందు పాదకృఛ్రము పథికృచ్చరువును మున్నుచేసి రెండవయాగము. అపుడు నతిక్రమించినచో మూఁడవ ప్రతిపదయందు నర్ధకృఛ్రమును యాగద్వయమునకుచేసి ప్రాప్తకాలమైన యాగము చేయునది. మూఁడవ యాగమునకు నర్ధకృఛ్ర పథికృచ్చరు పూర్వముగ జతుర్ధపర్వమందు చేయని యెడ నగ్నినవించును గనుక పునరాధేయము చేయునది. పునరాధేయవిధి యాథానోక్త సంభారములుంచి అయాశ్చయను మంత్రముతో నాజ్యాహుతి యని మీఁదఁజెప్పఁ బడినది. పునరాధానమఁగా వివాహహోమాదిరూపము పునరాధేయమున కంటె భిన్నము. శమ్యలను పైని విసర్జింపకమున్ను వేదికకు వెలపల నగ్ని పడినచో ఇదం త ఏకం అను ఋక్కులచే దానిదిరుగ నాయతనమందుంచి సర్వప్రాయశ్చిత్తము వేల్చవలెను. సర్వమందు వ్రతలోపమైనచో నగ్నయే వ్రతపతయే యని చరువైనను బూర్ణాహుతియైనను చేయునది. దంపతులలో నెవ్వరికైనను నశ్రుపాతమైనచో నగ్నయే వ్రతభృతౌ యని చరువైనను బూర్ణాహుతియైనను చేయునది. పవిత్రము నశించిన యెడ నగ్నయే పవిత్రవతే యని చరువు పూర్ణాహుతియైనను చేయునది. అన్వాథాన మునకు నిష్టికిని మధ్యమందు చంద్రగ్రహణమైనచో ఆత్రాహగోః' అని చంద్రుని కాజ్య హోమముచేసి నవోనవ యను మంత్రముచే నుపస్థానముచేసి యిద్మాధానము మొదలగుయాగము. ఇట్లు సూర్యగ్రహణమందు ఉద్వయ మనుమంత్రముచే సూర్యుని కాజ్యాహుతి యిచ్చి చిత్రం దేవానామని యుపస్థానము చేయునది. అన్వాథామైన పైని స్వప్నమందు రేతఃస్ఖలనమైనచోఇమం మే వరుణ తత్వాయామి యని వరుణునకు రెండాజ్యాహుతులును రవిపూజయు పునర్మామాయను పౌత్రమంత్రముల జపమును

బుద్ధిపూర్వముగ రేతో విసర్గమగుచో నగ్ని వ్రతపతిచరువు చేయునది. అన్వాధానము మొదలగు దినమందుగాక యితర కాలమందు స్వప్నములో రేతస్ఖల మైనచో సూర్యునికి నమస్కార త్రయము చేయునది. ఇధ్మాధానమైన పైని హవిస్సు నందు దోషము గానుపించినచో నట్టి దుష్టహవిస్సునకు బ్రతినిధిగ నాజ్యమునుంచి యాగము సమాప్తి నొందించి దుష్టహవిస్సునకు బ్రతినిధిగనాజ్యమునుంచి యాగము సమాప్తి నొందించి దుష్టహవిస్సును జలమందువిడిచి యన్వాధానము మొదలుగ నా దేవతకు దిరుగ యాగము చేయునది. ఇధ్మాధానమునకు బూర్వము హవిస్సు దుష్టమైనయెడ నా దేవతకు హవిస్సును దిరుగ బుట్టించి యాగము చేయునది. స్విష్టకృత్తు నిమిత్తమైన హవిస్సు దుష్టమైనచో నాజ్యముచే స్విష్టకృత్తు చేయవలెను. అంగమైన హవిస్సునకు దోషమైనచో నాయాజ్యమును దిరుగ బుట్టింపవలెను. హవిర్దోషము లెట్టులనిన; శరీరమునుండి తీసివ్రేసిన నఖకేశములంటినను పురుగు లున్నను రక్తము, నెముక, మలమూత్రములు, శ్లేష్మము మొదలైన హేయవస్తువులంటి నను, పిల్లి, ముంగి, కాకము, మొదలగునవి ముట్టినను,చొంగ,చెమ్మట, ముక్కు నీళ్లు, కన్నీరు, కర్ణమలము, వీనినంటినను సూతిక, రజస్వల, చండాలుఁడు మొదలగు వారు చూచినను హవిస్సు దుష్టమగును. దేవతను మంత్రమును హవిస్సును వ్యత్యాస ముగ గ్రహించినచో యద్వోదేవాయని మరుత్తుల కాజ్యహోమము. హవిస్సంతయు దహింపఁబడినచో తిరుగ బుట్టించి యదేయాగము. చేయునది. పునర్యాగ మక్కర లేదు. తూర్పు మొదలుగ నాల్గుదిక్కులను చరువురాలినచో గ్రమముగ నగ్నయే యమాయ వరుణాయ సోమాయ యని వ్రేల్చునది. అంటనురాలినచో నందరకును హోమము.కోణములనగ మూలలను రాలినచో వ్యాహృతిహోమము. ఇట్లుచేసి చరువును ఆప్యాయస్వ సంతేపయాగ్ంసియను మంత్రములచే నాజ్యముగలపి హవిస్సున కాప్యాయనము జేయునది. అగ్నియందు మిందాహుతులు రెండు వేల్చ వలెనని కొందరు. తనగృహ్యా గ్నికి మరియొకరిగృహ్యాగ్నితో సంసర్గమయ్యెనేని యిద్దరు యజమానులును నొక్కమారా యగ్ని నాత్మారోపణముజేసి తిరుగ ప్రత్యవరోహణము నిద్దరునుజేసి అగ్నయే వివిచయేయని చరువుచేయవలెను. శవాగ్నితో సంసర్గమైనచో అగ్నయే శుచయే యని చరువుచేయవలెను. శవాగ్నితో సంసర్గమైనచో అగ్నయే శుచయే యని చరువు. పాకాగ్నితో సంసర్గమేని సంపర్గా యాగ్నయే యని చరువు. సంసర్గ మందంటతను సమారోపము ప్రత్యవరోహము నైన పైనిచరువు. స్వయముగా నగ్ని ప్రజ్వలించినచో, ఉద్దీప్యస్వజాతవేదో మానోగ్ంసిజ్ఞాతవేదో గామశ్వం పురుషం జగత్, అబిభ్రదగ్న ఆగహిశ్రియామా పరిపాతయ యని రెంటిచే రెండు సమిధ లగ్నికి వ్రేల్చునది. అంతటను విధి లోపప్రాయశ్చిత్తపూర్వముగ సాంగతసిద్ధించుటకు సర్వప్రాయశ్చిత్తము అనఁగా భూర్భువస్వః అనుదానిచే నాజ్యాహుతి యీవలెననుట.

## అగ్న్యుపఘాతము - నిమిత్తములు

కుక్క, పంది, గాడిద, కాకి, నక్క, కోతి, శూద్రుడు, చండాలుడు, పతితుఁడు, శవము, సూతిక, రజస్వల, మొదలగువారి చేతను మలమూత్రములు, రేతస్సు

కన్నీరు, చీము, శేష్మము, ఎముక, మాంసము మొదలగు హేయవస్తువుల చేతను నగ్న్యారోపణముచేసిన సమిధకుగాని యగ్నికిగాని స్పర్శమైనచో నగ్ని నాశమగును. అందు మొదటి దానికి బునరాధేయము రెండవదానికి బునరాధానమును జేయునది. లేదా పునస్త్వాదిత్యా రుద్రావసవ స్సమింధతాం పునర్బ్రహ్మాణో వసునీధయజ్ఞైః ఘృతేన త్వంతనువోవర్ధయస్వ సత్యాస్సంతు యజమానస్య కామాస్స్వాహా, ఆదిత్య రుద్రవసుభ్య ఇదం నమమ యనిసమిధను హోమము చేయవలెను. స్రువముచే నాజ్యాహుతి యైనను జేయవచ్చును. అగ్నియందు జలముపడినందున శాంతించిన నిటులనే చేయునది. తాను జీవించియున్నను మృతుడను శబ్దము వినుపించినచో అగ్నయే సురభిమత్తై యనిచరువు చేయునది. పూర్ణాహుతియైనను గావలయును. ప్రధానా హుతులకు స్విష్టకృత్తుతో సంసర్గమయ్యెనేని సర్వప్రాయశ్చిత్తము పిండ పితృయమం దలి ప్రణీతనాశమైనయెడ హోమము లేనిపక్షమందు సర్వప్రాయశ్చిత్తము హోమపక్ష మందు దిరుగ ప్రణయనమును జేయవలెను. ఆపస్తంబులకు బ్రాయశ్చిత్తము జేసిన పైని ప్రణయనమే నిత్యము. పిండపితృయజ్ఞము లోపించినచో వైశ్వానరచరవు జేయ వలెను. సప్తహోతయను పేరుగల మహాహవిర్హోతా యని మొదలగు మంత్రముచే బూర్ణాహుతియైనను జేయునది. శ్రవణాకర్మయు సర్పబలియు నాశ్వయుజియు నాగ్ర యణము ప్రత్యవరోహణమునను నీకర్మలలో నెయ్యది లోపించినను ప్రాజాపత్య కృఛ్రము జేయునది. ఆగ్రయణము జేయకయే నూతనాన్నము భక్షించినచో నగ్నయే వైశానరాయయని చరువు జేయునది. అష్టకాశ్రాద్ధము లోపించినచో నుపవాసము జేయునది. పూర్వేద్యుశ్రాద్ధము లోపించినను నుపవాసమే, అశక్తిల్యో బ్రత్యామ్నాయ ముగ నొక బ్రాహ్మణునికి భోజనము పెట్టుట. అన్వష్టక శ్రాద్ధము లోపించినయెడ 'ఏభిర్ద్యుభిస్సుమనాఏభిరిందదుభిః' అను బుక్కునూరుమారులు జపించవలెను. అంత టను చరువు విధించునపుడు పూర్ణాహుతి దర్శపూర్ణమాసము లారంభించకున్నపు డలసత మొదలగు వానిచే బూర్ణాహుతిఁ చేసెనేని యాగమునకు దగునంత వ్రీహులు నాజ్యము నీనవలెనని గృహ్యాగ్ని సారగమందున్నది. నిషిద్ధమైన తిథి మొదలగు వానియందు సంగమము స్వభార్యతో జేసినను యాగము జేయింపఁగూడని వారిచే యాగము జేయించినను, ఉల్లి మొదలగునదియు గణికాన్నము మొదలగునదియు నైన యభక్ష్యము భక్షించినచో దానము గ్రహింపఁగూడనిచోట నది ప్రతిగ్రహించినను పునర్మామైత్వింద్రియం ఇమేయేధిష్ణ్యయాసః అను మంత్రములు రెండిటిచే నాజ్య హోమము జేయునది. లేదా సమిధవ్రేల్చుటయైనను నామంత్రముల జపించుట యైనను గావలెను. తనగృహముపై కపోతపక్షి ప్రవేశించెనేని దేవాః కపోతయని యైదు బుక్కులు జపించవలెను. ప్రతి బుక్కునకు నాజ్యహోమమయినను పాకయజ్ఞ తంత్రముచే జేయవలెను. దుస్స్వప్నమయినచో యోమే రాజన్యుజ్యోవా యను బుక్కుచే సూర్యప్రార్థనము జేయునది. ఆతురత్వముపోవుటకును ముంచామిత్వా యను సూక్త ముచే బ్రతిబుక్కునకు జరుహోమము జేయునది. యక్ష్మనాశాయేదంనమమ యని యైదు బుక్కులకును త్యాగము. ఆరవది స్విష్టకృత్తని తెలియునది. ప్రోక్షణి, ప్రణీత,

యను నీ రెండు పాత్రలందున్న జలము చినుకుతూలినను లేక స్రవించినను ఆపోహిష్ఠ యను మూఁడు బుక్కులచే దిరుగ జలము బూరింపవలెను. తతంమ ఆపస్తదు దాయతే యను బుక్కుచే నాజ్యాహుతి. ఇధ్మాధానము లోపించినచో నది యాజ్య భాగాంత మందు దెలిసెనేని విపర్యాస ప్రాయశ్చిత్తము జేసి యిద్మా ధానముగూడ జేసి ప్రధానత్యాగము జేయవలెను. ప్రధానయాగమైన పైని స్మరించినయెడ నగ్ని సమింధన స్వరూపమైన ద్వారము లేనందునలోపమే యగును. గనుక ప్రాయశ్చిత్తము చేతనే సిద్ధియగును. ఇతరయాగములందు నిట్లూహింపవలెను.

## అగ్నినాశకములు

దంపతులలో నెవ్వరైన నగ్ని సమీపమందుదయాస్తమయ సమయములం దుండవలయును. దంపతులిద్దరును గృహముయొక్క సరిహద్దును గ్రామము సరిహద్దు నైనను నదినైననుదాటిహోమకాలమందు బ్రాహ్యప్రదేశమున నున్నచో బునరాధానము చేయునది. అగ్నుల కెల్లపుడును హరణమైనను శమ్యలు తీసివేయకమున్ను ఉఛ్వాసము అనఁగా శమించుట గల్గినను నగ్నినాశము కర్మార్థహరణేఽ గ్ని నాం నానుఛ్వాసాది చోద్యతే. అనఁగా కర్మనిమిత్తమై హరణమైనను ననుఛ్వాసము మొదలగునవి విధింపఁ బడదు. ఇఁక నగ్నుల నాత్మారోపణముజేసినయెడ నీటిలో మునిగినను స్త్రీసంగము జేసినను శూద్రాదుల స్పృశించినను నగ్ని నాశమగును. పత్నులు పెక్కండ్రున్నను నందొకతెయైనను హోమకాలమందు గృహసీమను దాటియున్నచో నగ్ని నాశమగును. జ్యేష్ఠపత్నితో యజమానుఁడు ప్రవాసము వెళ్లినను దోషములేదు. దంపతులిద్దరును గృహసీమనుగాని గ్రామసీమనుగాని దాటియున్నప్పటికిని హోమకాలమున నగ్ని సమీపమునకు వచ్చెదరేని దోషములూదే. యజమానుఁడగ్ని సమీపమందుండినను పత్నిహోమకాలమునకు గ్రామాంతరమందున్నచో దిరుగ నాధానము జేయవలెనని చెప్పుదురు. ప్రవాసమందు నదీసీమాదులు దాటినపు డగ్ని సమారోపము గలసమిధ గాని యరణిగాని దంపతులలో నొకరు ముట్టియుండనిచో నగ్ని నాశమగును. అగ్ని విడిచి యజమానుడు నూరామడకుపైగా వెళ్ళినను సంవత్సరము వరకును స్వయముగా హోమము జరుగకున్నను నగ్ని నావము. అపుడు పునరాధానమైనను పవిత్రేష్టియైనను జేయునది. మరియు నగ్నులవిడిచి పత్ని సముద్ర గామినియగు మహానదిని దాటెనేని యగ్నినాశము. అగ్ని సమీపమందు పతిగాని మరియొకపత్ని గాని యున్నచో నదీలంఘనము దోషముగాదు. పతి ప్రవాసములోనున్నపుడగ్నులతో పత్ని సీమను దాటినచో నగ్ని నాశము. ఇట్లు పత్ని ప్రవాసములోనున్నపుడు పతియును జేయఁగూడదు. జలముచే నగ్ని శాంతమైనచో బువరాధేయము జేయునది. ఇట్లు స్వయముగా నుపశమించినను సమాధానము చేయక యజమానుడు సీమనుదాటి నను బునరాధేయము జేయవలెను. సమారోపణము లేకుండ శమ్యలు తీసివేసినపైని నగ్నుల హరించినను నాశమగును. "రజోదోషే సముత్పన్నే మృతకే సూతకేపివా, ప్రవసన్నగ్నిమాన్ విప్రః పునరాధాన మర్హతి" అనఁగా పత్ని రజస్వలయైనపుడును జాతాశౌచమృతాశౌచములందును ఆహితాగ్ని ప్రవాసము వెళ్ళినచో బునరాధానము

జేయవలెననుట, “శ్లో. బహ్వీనామపి చైకస్యా ముదర్యాయాంతు న వ్రజేత్, ఏకాదశే చతుర్థేగ్ని గంతుమిచ్ఛే న్నిమిత్తతః” అనఁగా ననేక భార్యలున్నపు డొకతె రజస్వల యైనను ప్రవాసము గూడదు. నిమిత్తమున్న యెడ నాల్గవ దినమందును నేకాదశ దినమందును వెళ్ళవచ్చును. “నచాగ్ని హోమవేలాయాం ప్రవసేన్నచ పర్వణి” అనఁగా హోమకాలమందును పర్వమందును బ్రయాణము వెళ్లగూడదనుట. హోమ ద్వయము దాటినను దర్శపూర్ణమాసములు దాటినను బునరాధేయము జేయునది యనుట యాపస్తంబాది విషయము. “శ్లో. పచనాగ్నౌ పచేదన్నం సూతకే మృతకేపి వా, అపక్త్వాతు వసేద్రాత్రిం పునరాధాన మర్హతి” అనఁగా పాకాగ్నియందు పాకము ప్రతిదినము చేయుచుండవలెను. పాకము లేక యొకరాత్రి యైన నున్నచో బునరాధానము జేయవలెనని యీ వచనము గాత్యాయనాదులపరము. పత్ని ప్రవాసము వెళ్లినచో పునరాధానము మీఁదఁ జెప్పఁబడినది. అదియొక్క భార్యగల వానికే యని తెలియవలెను. బహుభార్యలున్నచో జ్యేష్ఠభార్య ప్రవాసము వెళ్లనేని పునరాధానమని కొందరు. ఈ నిమిత్తములందు స్థితములైన యగ్నుల విడిచి యన్యాగ్నుల కాధానము. ఆరాదుపకారకములనఁగ సమీపమందు వేరుగనుండియు పఠించునంగములకు లోపమైనపుడు కర్మసమాప్తికిమున్నె తెలిసినచో ప్రాయశ్చిత్తము జేసి యా యంగము జేయునది కర్మసమాప్తియైనచో ప్రాయశ్చిత్తము మాత్రమే చేయవలెను. అంగముచేయనక్కరలేదు. ద్రవ్యసంస్కారరూపమైన సన్నిపత్యోపకారకమనఁగ వేరుగాకుండగ నంతరంగమయినది లోపించినచో దాని ప్రధానముగాకమున్నది చేయనేవచ్చును. ప్రధానమయిపోయినచో బ్రాయశ్చిత్తమే కాని ద్రవ్య సంస్కారమున కావృత్తి లేదు. పత్ని మృతినొందినచో దహించుటకు సగమగ్నినిచ్చి మిగిలిన దానియందు సాయంప్రాతర్హోమములు స్థాలీపాకము నాగ్రయణము మొదలగునవి చేయవలెను. కౌస్తుభమందు సగమగ్నియిచ్చుట మొదలగునవి చెప్పి విధురునిక పూర్వాధాన ప్రకారమును దానికి విచ్ఛేదము గల్గినచో పునరాధానప్రకారము చెప్పఁబడినది. అంతాధానము జెప్పుట మిగిలినయగ్నికి హోమము గాకమున్ను నాశమయినయెడ ననిగాని లేదా శ్రౌతాగ్నులో భార్యకు సగమిచ్చి యుత్సర్గేష్టిచే బూర్వాగ్నుల బరిత్యజించి పునరాధానముజేసి యగ్నిహోత్రము జేయవలెనని యుద్దేశించి చెప్పఁబడినది. అట్లనే యిక్కడను నుత్సర్గేష్టిచే బూర్వాగ్నుల బరిత్యజించి పునరాధానముజేసి యగ్నిహోత్రము జేయవలెనని యుద్దేశించి చెప్పఁబడినది. అట్లనే యిక్కడను నుత్సర్గేష్టిచే బూర్వాగ్నుల విడిచి యపూర్వాగ్ని కాధానము జేయుమని కౌస్తుభమునకు దాత్పర్యమని తోఁచుచున్నది. ఇఁక నరణులు స్రువము మొదలగు పాత్రలు నిర్మించుటకు లక్షణములు విధింపఁబడిన వృక్షజాతియు గ్రంథాంతరమున దెలియునది ఈవిధులకు సంకల్పాది విస్తారముతో గూడిన ప్రయోగము గృహ్యాగ్ని సాగరమందు దెలియునది. ప్రాయశ్చిత్తాది విధులు తరుచుగ సర్వసూత్రములందు సమానములే. యెక్కడనైన క్వచిత్తుగా తమతమ సూత్రములో విశేషమున్నయెడ గ్రహించునది. వివాహహోమము గృహప్రవేశనీయహోమముతో సమానతంత్రముగ జేయబడినచో ఋగ్వేదులకు

బునరాధానము. ఇతరులకు వివాహహోమమునకెంటె భిన్నమే యని విశేషము. ఇంక గాత్యాయనుల కుపయోగించునది కొంచెము జెప్పఁబడును. "పరాగ్నిపక్వం నాశ్నీయాద్గడ గోరసమంతరా, అహితాగ్నేరయంధర్మో యాజ్ఞికానాంచ సంమతః, ఇక్షుక్షీర వికారాశ్చ భ్రాష్ట భృష్టయవా అపి, పరాగ్ని పర్వం న జ్ఞేయం ప్రవాసే చాగ్ని చాగ్నిహోత్రిణః" అని యనఁగా నాహితగ్ని గుడము పాలు మొదలగునవి తప్ప దక్కినవి పరులయగ్నిచే వండఁబడినవి తినగూడదు. దీనికపవాదము. అగ్ని హోత్రికి ప్రవాసము చేయునపుడిక్షువికారమైన బెల్లము పంచదారము మొదలగునవి మంగళములోవేచిన వైపుళ్ళు పేలాలు మొదలగునవియు పరాగ్ని పక్వ మనఁబడదు. మరియును; "యదన్నం వారిహీనం చ పక్వం కేవలపావకే, తదన్నం ఫలవద్గ్రాహ్య మన్నదోషో నవిద్యతే." అనఁగా నుదకము గలియకుండగా పాలు నేయి మొదలగు వానిచే జేయఁబడినదియు కేవలవహ్నిచే బక్వమైనదియు నైనభక్ష్యము ఫలమునువలె గ్రహింపవచ్చును. దానిభక్షించిన దోషములేదు. ప్రాతర్హోమమందు "నిర్వర్త్యసముద్ధృత్య హుతాశనాత్, శేషం మహానసేకృత్వా తత్రపాకం సమాచరేత్, పూర్వేణయోజయిత్వాతు తస్మిన్ హోమో విధీయతే, అతోస్మిన్ వైశ్వదేవాది కర్మకుర్యాదతంద్రితః" అనఁగా బ్రాతఃకాలమందౌపాసన హోమమైన పైని నాయగ్నిలో నుండి కొంతదీసి వంటయింటిలో బెట్టి యందుపాకముజేసి తిరుగ నాయగ్నిని హోమాగ్నిలోగలపి యందు హోమము విధింపబడినది గనుక వైశ్వదేవాదిక మగ్నిగృహమందే చేయునది. మరియు బహ్వృచ కారికయందు. "నిత్యపాకాయ శాలాగ్నే రేకదేశస్య కార్యతః, పాకార్థముల్ము కంహృత్వా తత్ర పక్త్వామహానసే, వైశ్వదేవోగ్న్య గారేస్యా త్పాకార్థోగ్నిశ్చ లౌకిక, భూరిపాకోభవేద్యత్ర శ్రాద్ధాదా వుత్సవేషు చ, కృతేచ వైశ్వదేవేథ లౌకికో నైవకార్యతః దీపకో ధూపకశ్చైవ తాపార్థం యశ్చనీయతే, సర్వేతే లౌకికాజ్ఞేయా స్తావన్మాత్రాప వర్గతః, బహుధా విహృతో హ్యగ్ని ర వసథ్యా త్కథంచన, యావదేకోఽపి తిష్ఠేత తావదన్యో న మథ్యతే, వైశ్వదేవాత్తథా హోమాత్ప్రాక్ జ్ఞేయం నైవమంథనం, పచనాగ్నావ పక్తాహః పునరాధానమర్హతి." అనఁగా నగ్ని గృహము నుండి యొక కొరివిని వంటయించి చెట్టుపాకముజేసి తిరుగ నగ్ని గృహమందు వైశ్వదేవము చేసిన పైని పాకాగ్ని యే లౌకిక మగును. శ్రాద్ధము నుత్సవము మొదలగు వానియందు బహువిస్తృతమైన పాకమైనప్పుడును వైశ్వదేవము చేసిన వెనుకనే లౌకికమగును కాని కార్యభేదముచేగానేరదు. దీపార్థము ధూపార్థము కాచుకొనుటకును తీసినయగ్ను లన్నియు లౌకికములే, ఏమనిన నంతమాత్రమునకే యవి సమాప్తము లగును. అట్లనేక విధములుగా నగ్నిగృహమునుండి బయలువెళ్లి యొకయగ్నియే పరంపరచే బహుస్థలముల విహరించుచున్నది. గనుక వాటిలో నొకటియైననున్న చోదిరుగ మథింప నక్కరలేదు. వైశ్వదేవమునకును హోమమునకును ముఖ్ను మథింపఁగూడదు. పాకాగ్ని యందు నొకరోజునైన పాకములేనిచో బునరాధానముఁ జేయునది. మరియు; ఆరోపితారణీచోభే ఏకావాయదినశ్యతి, తత్రాగ్న్యా ధేయ మిచ్ఛంతి పునరాధేయముగాని చేయవలెను. "శ్లో. అథానా రోపి తారణ్యోః క్షయేగ్రాహ్యేనవే

పునః, తదలాభేయదో ద్వాయాదత్ర స్యాత్పునరాహితః, శూద్రోదక్యాంత్యజైశ్చైవ పతితా మేధ్యరాసభైః అనారూఢారణిస్పర్శే తేవిహాయాన్యయోర్గ్రహః" అనఁగా నగ్న్యా రోపము చేయకున్న యరణులు పోయెనేని తిరుగ గ్రొత్తవి గ్రహించునది అవి దొరకక యగ్ని చల్లారినచో బునరాధానము, శూద్రుఁడు, రజస్వల, చండాలుఁడు, పతితుఁడు అమేధ్యము, గాడిద మొదలగునవి యారోపములేని యరణులనంటినచో దిరుగ క్రొత్తవి గ్రహించునవి. అగ్నినారోపించిన యరణునే స్పృశింపఁబడినచో బునరా ధేయము మీఁదఁ జెప్పఁబడినది. క్రొత్తయరణులు గ్రహించునపుడ పాతవాటిని 'భవతం నస్సమా' యని జలమందు ముంచివేయవలెను. ఒకయరణియె దుష్టమైనచో దానినే జలమందు బారవేయవలెను. అపుడు క్రొత్తయరణి దొరుకువరకు నగ్ని యుండనిచో బునరాధానము. "నష్టాయామరణా యాదదగ్ని స్తిష్ఠతివేశ్మని, తావద్ధో మాదికం కృత్వాతన్నా శేపునరాహరేత్." అనఁగా నరణి పోయినపుడు గృహమందగ్ని యుండు వరకును హోమాదికముజేసి యది నశించినచో దిరుగ నాధానము జేయ వలెననుట. అందు నొకయరణి పోయినను మరియొక దానిమంత్రముచే గ్రహించి రెండింటిచే మథింపవలెనని కొందరు. మిగిలిన యొక యరణిని ఖండించి మథింప వలెనని మరికొందరు. ఒకయరణి దుష్టమైనచో రెండింటిని విడిచి క్రొత్తవి గ్రహింప వలెనని నారాయణవృత్తి మొదలగునవి జెప్పును.

## అరణి విచారము

శ్రౌతస్మార్త కర్మలకును సర్వశాఖలకును సమానము. అగ్ని సమారోపమైనచో గాతీయులు వైశ్వదేవమును పాకమును లౌకికాగ్ని యందే చేయవలెనంద్రు. "శ్లో. యస్యవేదశ్చ వేదీచ విచ్ఛిద్యేతే త్రిపూరుషం, సవైదుర్బ్రాహ్మణోయ స్సర్వకర్మసుగర్హిత, అగ్నిహోత్రం ప్రకుర్వీత జ్ఞానవాన్ శ్రద్ధయాన్వితః, అగ్ని హోత్రాత్పరోధర్మో నభూతో న భవిష్యతి, శ్రౌతేకర్మణినో శక్తోజ్ఞాన ద్రవ్యాద్యభావతః, స్మార్తంకుర్యాద్యథాశక్త్యా ప్రాప్యాచారం లభేత్సదా, కృతదారో నతిష్ఠేతక్షణమప్యగ్నినావినా, తిష్ఠేతచే ద్ద్విజోవ్రాత్య స్తథాచ పతితోభవేత్, న గృహ్ణీయాద్వివాహాగ్నిం గృహస్థ ఇతిమన్యతే, అన్నం తస్య న భోక్త వ్యంవృథాపాకోహి సస్మృతః, యోదద్యాత్కాంచనం మేరుం పృథివీం చ ససాగరాం, తత్సాయం ప్రాతర్హోమ్య తుల్యం భవతివానవా." అనఁగా నెవ్వనికి వంశమందు దానుగలపి ముగ్గురుపురుషులవరకును వేదము నగ్నివేదికయు లేక యుండునో నట్టివాఁడు దుర్బ్రాహ్మణుఁడనబడి సర్వకర్మలందు నిందితుఁడగును. మంచి జ్ఞానముతో శ్రద్ధగల్గి యగ్నిహోత్రముజేసినచో జాలును. అంతకంటె నుత్కృష్ట ధర్మములేదు. ఒకవేళ ద్రవ్యలోపము మొదలగువానిచే నశక్తుఁడై శ్రౌతకర్మము చేయ లేనియెడ, యథాశక్తిగ స్మార్తకర్మలైన నాచరింపవలెను. వివాహమైన పైని క్షణము పర్యంతమైన నగ్ని రహింతుడై యున్నచో ద్విజుఁడు వ్రాత్యుఁడగును. పతితుఁడనఁ బడును. వివాహాగ్ని ధరింప గూడదని యెవ్వఁడు తలంచునో వానియన్నము శిష్టులు తినగూడదు. వాఁడు వృథాపాకుఁ డనఁబడును. మేరుపర్వతమంతబలంగారును, సముద్రముద్రితమైన భూమిని యథావిధిగ దానముజేసినను సాయంప్రాతః కాలము

లందు హోమము జేయుటకు ఫలమందు సమానమగునో తక్కువగునో తెలియదు. కనుక నగ్ని గలుగుట ముఖ్యమని.

## నిత్యదానము

"శ్లో.ఏకస్మిన్న ప్యతిక్రాంతే దినే దానవివర్జితే, దస్యుభిర్మోషిత సేవ్యయుక్త మాక్రందితుం భృశం." అనఁగా నొకదినమైనను దానమీకుండ నతిక్రమించినచో దొంగలచే బరాబవింపఁబడిన పాంథునివలె మిక్కిలి మొరలిడుట తగును. కనుక విభవానుసారముగ ధనధాన్యాదికము నీయవలెను. సంభవింపనిచో తాంబూలదాన మైనను జేయవలెను. అటుపైని గోవులు బ్రాహ్మణులు మొదలగు మంగళవస్తువుల దర్శనము.

## ప్రథమభాగ కృత్యము

ఇటు లెనిమిదిభాగముల జేసినదినము యొక్క ప్రథమభాగ కృత్యము.

## ద్వితీయాభాగకృత్యము

ద్వితీయభాగమందు వేదశాస్త్రాభ్యాసము. "పఠేదధ్యాపయేద్వే దాన్జపేచ్చైవ విచారయేత్, అవేక్షేత చ శాస్త్రణి ధర్మాదీనిద్విజోత్తమః" అనఁగా వేదములబఠించుట యుపదేశించుట. విమర్శించుటయు ధర్మశాస్త్రము మొదలగునవి చూచుటయు జేయ వలెను. దేవతార్చనమును బ్రాతర్హోమమయినపైనిగాని చతుర్థభాగమందు బ్రహ్మయ జ్ఞానంతరమందుగాని చేయవలెను. "విధాయ దేవపూజాం ప్రాతర్హోమాదనంతరం, కుర్వీత దేవతాపూజాం జపయజ్ఞా దనంతరం." అని యుభయ కాలములందును విధింపఁబడినది. అపుడు విష్ణు శివ బ్రహ్మ సూర్యశక్తి వినాయకాదులలో నొకయభీష్ట దేవత నర్చింపవలెను. అందు గలియుగ మందు హరిహరులపూజ ప్రశస్తము. "శ్లో.న విష్ణ్వారాధనాత్పుణ్యం విద్యతేవైదికం క్వచిత్, తస్మాదనాది మధ్యాంతం నిత్యమారాధ యేద్ధరిం అథవా దేవమీశానం భగవంతం సనాతనం, ప్రణవేనాథ వారుద్ర గాయత్ర్యా త్ర్యేంబకేన వా, తథోన్నమశ్శివాయేతి మంత్రేణా నేనవాయజేత్." అనఁగా విష్ణు నారాధించుటకంటె బవిత్రమైన వేదోక్తకర్మలేదు. కనుక నాది మధ్యాంత ములు లేనియాహరిని నిత్యముగ బూజింపఁవలెను. లేదా పురాణపురుషుఁడు షడ్గుణై శ్వర్యవంతుడు నగు నీశ్వరుని బ్రణవముచేగాని రుద్రగాయత్రిచేగాని త్ర్యంబకమంత్ర ముచేగాని, ఓం నమశ్శివాయ యను పంచాక్షరమంత్రముచేగాని పూజింపవలెను. అందులో ప్రతియాస్థండిలాది పూజకంటె సాలగ్రామమందును బాణలింగమందును దేవతారాధనము ప్రశస్తము. ఏమనిన; నావాహనాదిక మక్కరలేకయే సదా దేవతాసాన్నిధ్య మచటనున్నది. అట్లు భాగవత వచనము. "శ్లో. ఉద్వాసావాహనేన స్తస్థిరాయా ముద్ధవార్చనే, అస్థిరాయాం వికల్పస్స్యాత్థ ్సండిలేదు భవేద్ద్వయం" అని యనఁగా నుద్ధవుఁడా యుత్పత్తిఓడనే స్వతో దేవతాసాన్నిధ్యము గలిగినవని ప్రమాణ సిద్ధములైన సాలగ్రామ బాణలింగాదులు స్థిరములు. మంత్రసంస్కారముచే దేవతాసాన్నిధ్యము దెచ్చినవి కృత్రిమములు గనుక నస్థిరములు అందు స్థిరాధిష్ఠాన

ములందు పూజముఖ్యము. అస్థిరాధిష్ఠానములందు వైకల్పికము ఏమనిన; మొదటి దానియందావాహనోద్వాసనములు చేయనక్కరలేదు. రెండవపక్షమందలి గావలె ననుట.

## సంక్షేపముగ దేవపూజావిధి

విశేష విచారము ముందు మూర్తిప్రతిష్ఠ నిరూపించునపుడు చేయఁబడును. "శ్లో॥ దేవార్చనం ప్రకర్తవ్యం త్రికాలేఽపి యథా క్రమం, అశక్తౌ విస్తరాత్ప్రాతర్మధ్యాహ్నే చందనాదితః, సాయం నీరాజనం కుర్యాత్త్రైకాలే తులసీదళం, యథా సంధ్యా తథా పూజా త్రికాలే మోక్షదాస్మృతా." అనఁగా దేవతా రాధనము మూఁడు కాలములం దును యథావిధిగఁ జేయవలెను. అది సంధ్యావందనమువలె నిత్యము. అశక్తిలో ప్రాతఃకాలమందు సవిస్తరముగఁ బూజించి సాయంకాలమున నీరాజనమిచ్చి మూఁ డు కాలములందుఁ దులసీదళము సమర్పించునది. అట్లు దేవతారాధనము నిత్యము జేసెనేని మోక్షము లభించును. అని కమలాకరుఁడు చెప్పెను. అపుడు సూర్యోదయము నకు మున్ను నిర్మాల్యము దీసివేసి యథాకాలమందనగ నెనిమిది భాగములగు దినమలలో రెండవబాగమందు పూజ నారంభించునది. అపుడు, "యేభ్యో మాతా.. ఏవాపిత్ర్యే విశ్వేదేవాయే" యను మంత్రములఁ బఠింపుచు ఘంటానాదముజేసి యాచమించి ప్రాణాయామముజేసి దేశాకాలములఁ గీర్తించి "శ్రీమహావిష్ణుపూజాం కరిష్యే" యని సంకల్పము. పంచాయతన పూజ జేయునెడ "శ్రీరుద్ర వినాయక సూర్య శక్తిసహిత శ్రీ మహావిష్ణు పూజాం కరిష్యే" యని సంకల్పము ఆపై నాసనాదుల జేసి "సహస్రశీర్షేతి షోడశర్చస్య సూక్తస్య నారాయణః పురుషోఽనుష్టుప్, అంత్యా త్రిష్టుప్ న్యాసే పూజాయాం చ వినియోగః" అని యుచ్చరించి మొదటి ఋక్కును వామహస్తమందును రెండవదాని దక్షిణహస్తమందును మూఁడవది యెడమపాద మందు నాల్గవది కుడిపాదమందు నయిదవది యెడమ మొణుకునందు నారదవి దక్షిణ నాసువునందును నేడవది యెడమ కటిభాగమందును నెనిమిదవది దక్షిణ భాగమందును దొమ్మిదవది నాభియందుఁ బదియవది హృదయమందు పదునొకండు కంఠమందు పంద్రెండవది వామబాహువు నందు పదమూఁడవది కుడిబాహువు నందు పదునాల్గవది ముఖమందును పదునైదవది నేత్రములందును పదునారవది శిరస్సునందు నున్యసింపవలెను ఇట్లు తన దేహమందును దేవతలయందును న్యాసము చేయవలెను. తుది యైదు ఋక్కులచే తను హృదయాదిన్యాసము జేయునది కలశమును శంఖమును ఘంటను పాద్యార్ఘ్యాచమనీయములచేఁ బూజించి తన్నుఁ బూజాద్రవ్యములను బ్రోక్షించి, యభీష్ట విష్ణుమూర్తిని ధ్యానించి పూజింపవలెను. అందు సహస్రశీర్షా యను మొదటి ఋక్కుచే నావాహనము. అపుడు సాలగ్రామాదు లందావాహన మక్కరలేదు. గనుక ఋగంతమందు మంత్రపుష్పము. శ్రీమహావిష్ణవే శ్రీకృష్ణాయయని యిష్టదేవతా మూర్తినామము జతుర్థితోఁ గూడ నుచ్చరింపుచు, బ్రతి ఋక్కుచే నొక్కొక్క యుపచారము చొప్పున నన్నియుపచారము లర్పించవలెను. పంచాయతనపూజయైనచో "శ్రీమహావిష్ణవే శివవినాయకసూర్యశక్తిభ్యశ్చ" యని యథా

భీష్టరూపముగ నుచ్చరింపవలెను. నైవేద్యాదులందు వేరువేరుభాగములు లేని యెడ యథాంశతః అని యుచ్చరింపవలెను. రెండవఋక్కుచే నాసనము మూఁడవదానిచే పాద్యము నాల్గవదానిచే నర్ఘ్యము నైదవదానిచే నాచమనము నారదవదానిచే స్నానము సంభవించినచోఁ బంచామృతస్నాన మాప్యాయస్వ యను మంత్రములచేఁ జేయునది. చందనము, వట్టివేళ్లు, కర్పూరము, కుంకుమపువ్వు నగురు మొదలగువానిచే వాసిత మైన జలములో సువర్ణఘర్మానువాకము మహాపురుషవిద్య పురుషసూక్తము రాజన సామము మొదలగు వాని పఠింపుచు నభిషేకము జేయునది. సప్తమ ఋక్కుచే వస్త్రము నెనిమిదవఋక్కుచే యజ్ఞోపవీతము తొమ్మిదవ ఋక్కుచే గంధము పదియవ దానిచే పుష్పములు పదునొకటిచే ధూపము పండ్రెండవ దానిచే దీపము. "స్నానే ధూపే చ దీపేచ ఘంటాదేర్నాద మాచరేత్" అనఁగా స్నానము ధూపము దీపమిచ్చుచో ఘంటాదుల మ్రోయించునది. పదుమూఁడవ దానిచే నైవేద్యము. సంభవమందు తాంబూల ఫలదక్షిణలు. పదునాల్గవదానిచే నాచమనము. పదునైదవ ఋక్కుచేఁ బ్రదక్షిణము. పదారవదానిచే విసర్జనము. లేదా పుష్పాంజలి స్థిరమూర్తికీవలెను. "స్నానే వస్త్రే చ నైవేద్యే దద్యాదాచమనం తథా, దత్వా షోడశభీర్ఋగ్భిష్షోడశాన్న స్వసాహుతీః, సూక్తేన ప్రత్యృచం పుష్పం దత్వా సూక్తేన సంస్తుయాత్" అనఁగా స్నానము వస్త్రము నైవేద్యమిచ్చునపు డాచమన మీయవలెను. ఆపైని పదారు ఋక్కులచే నన్నాహుతులీవలెను. సూక్తములోఁ బ్రతిరుక్కుచే నొక్కొకపుష్పమిచ్చి సూక్తముచే స్తోత్రము చేయునది. మరియు బురాణఋక్కులచేఁ బ్రాకృతవాక్కులచే స్తుతించి "శ్లో. శిరోమే పాదయోఃకృత్వా బాహుభ్యాం చ పరస్పరం, ప్రపన్నం పాహి మామిశ భీతం మృత్యుగ్రహార్ణవాత్" అనఁగా బాహువులచేఁ బరస్పరము నంటుచు నా శిరస్సును మీపాదములందుంచి ప్రన్నుఁడనై మృత్యుగ్రహసముద్రమునుండి భీతుఁ డనై యున్న నన్ను రక్షింపుమని పలుకుచు నమస్కరించునది. నిర్మాల్యమును దేవదత్త ముగ భావనజేసి శిరస్సున ధరింపవలెను. శంఖోదకము శిరస్సున ధరించి దేవతీర్థ మును పూజాంతమున వైశ్వదేవాంతమందు శిరస్సున ధరించి త్రాగవలెను. అపుడు క్రమము. "విప్రపాదోదకం పీత్వావిష్ణుపాదోదకం పిబేత్. సాలగ్రామ శిలాతోయమ పీత్వా యస్తు మస్తకే ప్రదేక్షపణం చ కురుతే బ్రహ్మహా సనిగద్యతే, పాత్రాంతరేణవై గ్రాహ్యం నకరేణ తదాచన" అనఁగా బ్రాహ్మణపాదోదకమును గ్రహించి యాపైని విష్ణుపాదోదకము గ్రహింపవలెను. మరియు సాలగ్రామతీర్థమును ద్రాగి శేషమును శిరస్సునందుఁ జల్లుకొనవలెను. మున్ను జల్లుకొనినయెడ బ్రహ్మహత్యాదోషము వచ్చును. ఆ తీర్థము నుద్ధరణి మొదలగు పాత్రచే గ్రహింపవలెఁగాని హస్తముచేఁ గూడదని కమలాకరభట్టుఁడు చెప్పెను. తడిపి యారవేయుచు నొకవస్త్రమునే ప్రతి దినమిచ్చినను దోషములేదు. ఇట్లు సువర్ణాదిభూషణములు నీవచ్చును. స్వర్ణయజ్ఞోప వీతమునకు నిదియే యాచారము. అట్లు దేవపూజకు ఫలము స్కాందమందు, "కామా సక్తోఽథవాశుద్ధస్సాలగ్రామశిలార్చనాత్, భక్త్యావా యదివాఽభక్త్యా కలౌముక్తి మవాప్ను యాత్ కథాం యః కురుతే విష్ణో స్సాలగ్రామ శిలాగ్రతః, వైవస్వతభయం

నాస్తితథా చ కలికాలజం. ప్రాయశ్చిత్తం హి పాపానాం కలౌ పాదోదకం హరేః, ధృతే శిరసి పీతే చ సర్వాస్తృప్యంతి దేవతాః, విష్ణుమూర్ధ్ని స్థితం పుష్పం శిరసా నవ హ్యేన్నరః" అనఁగా నరుఁడు కామాసక్తుఁడైగాని శుద్ధుఁడైగాని భక్తిగలిగి గాని లేకగాని యెటులనైన సాలగ్రామశిలార్చనము జేసెనేని గలియుగమందు ముక్తినొందును సాలగ్రామశిల యెదుట గూర్చుండి పూజాకథఁ జెప్పినను మృత్యుభయమును గలిభయమును వానికి రాదు. విష్ణుపాదోదకము సమస్త పాపములకుఁ బ్రాయశ్చిత్తము. దాని ద్రావి శిరస్సున ధరించినను సమస్త దేవతాతృప్తియగు. విష్ణు ప్రసాదమైన పుష్పమును శిరసునందు ముడువఁగూడదు. బోధాయనునిచేఁ జెప్పఁబడిన హరిహర పూజావిధి పరాశరమాధవమం దున్నది. అందు శివపూజావిధి శివరాత్రి ప్రకరణ మందుఁ జెప్పఁబడినది. గనుక నిచ్చట నిరూపింప నక్కరరలేదు. కౌర్మపురాణమందు "యో మోహా దథవాలస్యా దృకృత్వా దేవతార్చనం, భుజ్తే సయాతి నరకం సూకరేష్వ భిజాయతే." అనఁగా నజ్ఞానముచేఁగాని యలసతచేఁగాని దేవతార్చనముఁజేయక భుజించువాఁడు నరకము నొందును. తిరుగ సూకరజన్మ మెత్తునని ఇట్లు దేవపూజ చేసి తలిదండ్రులు. మొదలగు గురువులఁ బూజింపవలెను. ఏమనిన; "యస్య దేవే పరాభక్తిర్యథా దేవే తథాగురౌ" అని శ్రుతిచే దేవభక్తితో గురు భక్తిగూడ విధింపఁ బడినది. అని మాధవుడు.

## తృతీయభాగ కృత్యము

దిన తృతీయ భాగమందు పోష్యవర్గము నిమిత్తమై ధనార్జనము చేయునది. యజ్ఞముచేయుట వేదముచదువుట దానమిచ్చుటయు యజ్ఞము చేయించుట వేదము చెప్పుట దానము బట్టుటయు నీయారును బ్రాహ్మణునికర్మలు. "షణ్ణాంతు కర్మణాం మధ్యేత్రీణి కర్మాణి జీవికా, యాజనాధ్యాపనే చైవ విశుద్ధాశ్చ ప్రతిగ్రహః" అందు తుది మూఁడు కర్మలు జీవనసాధనములు. శ్రీభాగవతమందు; "ప్రతిగ్రహం మన్యమానస్తపస్తేజో యశోనుదం, అన్యాభ్యామేవ జీవేతశిలైర్వాదోషపృక్తయోః" అనఁగా దానముబట్టుట తపస్సును తేజస్సును యశస్సును నశింపఁజేయునని తలచిన యెడ యాజనాధ్యాపనములచే జీవించవలెను. వాటియందును దోషమనుబుద్ధి గలిగినచో శిలాదివృత్తులచే జీవింపవలెను. అవి యేవనిన; "వార్తావిచిత్రాశ్శాలీన యాయావర శిలోంచనం" అనఁగా నానావిధమైన వ్యవసాయము, శాలీనమనఁగ నయాచితము, యాయావరమనఁగ యాచించుట, శిలమనఁగ ధాన్యము పండినచోట వదలి పెట్టిన వెన్నులు మొదలగునవి తెచ్చుకొనుట, ఉంఛమనఁగ కణము లేరుకొనుట మొదలగునది. అందు నుత్తరోత్తరము ప్రశస్తము. శిలోంఛన వృత్తులు కలియందు నిషిద్ధములు. "కుసూలకుంభీ ధాన్యోవా త్ర్యాహికశ్శ్వస్తనోఽపివా" అనఁగా కుటుంబ పోషణమునకై పండ్రెండు దినములకు సరిపడునంత సంగ్రహము చేయువాఁడు కుసూలధాన్యుఁడు ఆరురోజులమట్టుకు సంగ్రహించు వాఁడు కుంభీధాన్యుఁడు మూఁడు దినములకు మాత్రము సంగ్రహించువాఁడు త్ర్యాహికుఁడు రేపటిమట్టుకు సంగ్రహించువాఁడు శ్వస్తనికుఁడు. "నకుర్యాత్కృషి వాణిజ్యం సేవావృత్తిం తథైవచ, బ్రాహ్మ

ణ్యార్ధీయతే తేన తస్మాత్తాని వివర్జయేత్” అనఁగా భూమిదున్నుటయు క్రయ విక్రయ వ్యవహారము దాసవృత్తియు బ్రాహ్మణ్యము పోఁగొట్టునవిగనుక వానిని విడుచునది. అని నిషేధించినందున వార్తావృత్తి యాపత్కాల మందుఁ జేయునది. “పుత్రమాంసం వరంభోక్తుం నతు రాజప్రతిగ్రహం” అని యనఁగా పుత్రునిమాంసము దినినమేలు రాజువలన బ్రతిగ్రహించుట గూడదని యున్నదిగాని యిది దుష్టరాజవిషయము. వృద్ధులైన తలిదండ్రులను పతివ్రత యగుభార్యను శిశువులైన పుత్రులను నయాజ్య యాజనము శూద్రుఁడిచ్చిన దానముబట్టుట మొదలగు నీచవృత్తులచేనైన బోషింపవలె నని యున్నదిగాని యిదియు నాపత్కాలమందే యని తెలియవలెను. ఇఁకఁ గూర, పాలు, పెరుగు, దర్భ, పువ్వులు, జలము, భూమి, యివి యాచన లేకుండఁగ సంభవించినచో కులటపతితుఁడు తప్ప నీచుఁడిచ్చినను గ్రహింపవచ్చును. “బ్రహ్మ చారీయతిశ్చైవ విద్యార్థీ గురుపోషకః అధ్వగః క్షీణవృత్తిశ్చ షట్పక్యాన్నస్య భిక్షుకాః” అనఁగా బ్రహ్మచారియు యతియు విద్యను నేర్చుకొనుటకే వచ్చినవాఁడు గురుసం రక్షణమునకే తిరుగువాఁడును మార్గస్థుఁడును బొత్తిగ గతిలేనివాఁడును నీయార్గురు వండినయన్నము నడుగువారు. శూద్రునికిఁ ద్రివర్ణసేవయే ముఖ్యవృత్తి. ఆపత్కాల మందు కృషిమొదలుగ జేయవచ్చును.

## చతుర్థభాగమందు మాధ్యాహ్నిక స్నానము

ప్రాతఃకాలమందు గోమయము బూసుకొని స్నానము. మధ్యాహ్నామందు మృత్తికను బూసుకొనే స్నానము. ఈ రెండిటికి విధి ప్రాయశ్చిత్త ప్రకరణమందుఁ జెప్పఁబడినది. తక్కినవిధి ప్రాతస్నానమునకువలె జేయునది. బ్రహ్మయజ్ఞాంగతర్పణ ముకంటె మున్ను వస్త్రము పిడువవలెనని విశేషము. ఆపైని బొట్టుపెట్టుకొని మధ్యాహ్న సంధ్యను జేయవలెను.

## మధ్యాహ్న సంధ్యావిధి

జామున్నర మొదలుగ సాయంతనమువరకు మధ్యాహ్న సంధ్యకు గాలమే సంధ్య యందు విశేషము. సూర్యశ్చ యనుమంత్రముచోట నాపఃపునంతు. అని మంత్రాచమనము ఎట్లనిన “ఆపః పునంత్విత్యస్య మంత్రస్య నారాయణ యాజ్ఞవల్క్య ఆపః పృథ్వీ బ్రహ్మనస్పతిరష్టీ, మంత్రాచమనే వినియోగః ఓం. అపః పునంతు పృథివీ పూతా పునాతుమాం, పునంతు బ్రహ్మణస్పతిః బ్రహ్మపూతా పునాతు మాం, యదుచ్ఛిష్టమభోజ్యం, యద్వాదుశ్చరితం మమ, సర్వం పునంతు మామాపోఽ సతాంచ ప్రతిగ్రహగ్ స్వాహా” యని జలము ద్రాగవలెను. అఘమర్షణమనఁగ పాపపురుషదహనమైన పైని నిల్చియుండి. “హగ్ంసశ్శుచిషత్ దిత్యస్య గౌతమస్సూర్యో జగతీ సూర్యాయార్ఘ్యదానే వినియోగః” ఓం హం సశ్శుచిషత్ అని మొదలగు మంత్ర ముచే నొకయర్ఘ్య మీయవలెను. ఆపై నుపస్థానము. బాహువులు పైకెత్తి. “ఉదుత్యమితి త్రయోదశర్చస్య సూక్తస్య కణ్వః ప్రస్కణ్వస్సూర్యో గాయత్రీ, అంత్యాశ్చత స్రోనుష్టుభః సూర్యోపస్థానే వినియోగః ” అని యుదుత్యమని మొదలగు మంత్రముచే నుపస్థానము.

కొందరు చిత్రందేవానామనునారు ఋక్కులచే నుపస్థానము చేయుదురు. ఇట్లు స్థానము తప్పఁదక్కినది ప్రాతస్సంధ్యకువలెఁ జేయునది. మధ్యాహ్న సంధ్యను రాత్రి జేయునెడ నాకృష్ణేన యను మంత్రముచే నర్ఘ్యదానము గాయత్రిచేఁ బ్రాయశ్చిత్తార్ఘ్య ము రెండవది యిచ్చి హవిష్పాతమను నైదు ఋక్కులచే నుపస్థానము. ఇఁకఁదైత్తిరీ యులకు ఆపః పునంతు. అని మంత్రాచమనముజేసి దధిక్రావ్ణ్ణో యని మొదలుగ పూర్వమువలెఁ జేసి సూర్యుని కొకయర్ఘ్యము గాయత్రిచే నిచ్చి బాహువులెత్తి నిలచి యుండి యుపస్థానము జేయునది. ఎట్లనిన; ఉద్వయం... 1. ఉదిత్యంజాతవేదసం 2. చిత్రందేవానాం ....3. తచ్చక్షుర్దేవహితం 4. య ఉదగాన్మహతోర్ణవాత్ . అని యిట్లు ఉపస్థానము తప్పఁ దక్కినది పూర్వమువలెఁ జేయవలెను.

## కాత్యాయనమాధ్యాహ్నిక సంధ్య

కాతీయులకు, ఆపః పునంతు అనునది పూర్వమువలెనే. గాయత్రిచే నొక యర్ఘ్యము. ఉద్వయమనునది మొదలుగ నాలుగింటిచే నుపస్థానము. జపాంతమందు సమర్థుఁడయినచోఁ మీఁదఁ జెప్పినటుల విభ్రాట్ అను ననువాకము మొదలగు వానిచే నుపస్థానము తప్పఁ దక్కినది పూర్వమువలెఁ జేయవలెను.

## బ్రహ్మ యజ్ఞము

అది ప్రాతఃకాలమందు హోమమైన పైనిగాని మధ్యాహ్న సంధ్యజేసిగాని వైశ్వదేవముజేసి గాని యొకమారే చేయవలెను. భట్టోజీదీక్షితీయమందు ప్రాతర్హోమా నంతరమే. బ్రహ్మయజ్ఞము శాఖాంతరీయులకనియు నాశ్వలాయనులు మధ్యాహ్న సంధ్యోత్తరమందే చేయవలెననియున్నది. బ్రహ్మయజ్ఞ ప్రయోగ మెట్లనిన, ఎండిన బట్టగాని తడిబట్టయైనచో ముమ్మారుదుడిపి కట్టుకొని యాచమనముచేసి "పరమేశ్వర ప్రీత్యర్థం బ్రహ్మయజ్ఞం కరిష్యే తదంగతయా దేవృష్యాచార్య తర్పణం కరిష్యే" యని సంకల్పము. తలిదండ్రులు లేనిచో "మృతపితృతర్పణం చ కరిష్యే" యని సంకల్పము. దర్భహస్తమందు ధరించి దర్భాసనమందు బ్రాఙ్ముఖుఁడై గూర్చుండి యెడమ ముణుకుపై కుడిపాద ముంచియైనను నెడమపాదాంగుష్ఠముపై కుడిపాదాంగుష్ఠ ముంచియైనను నుపస్థముజేసి కుడిముణుకుపై నెడమహస్తమును దూర్పు మొగమై వ్రేళ్ల యగ్రములుండు నటుల వెతికిలనుంచి యందు రెండు పవిత్రములను ప్రాగగ్ర ములుగ ధరించి కుడిహస్తము నటువలె మీఁదఁ బోరిగిలించి సంపుటముజేసి భూమ్యంతరిక్షముల సంధిని జూచుచునైనను గన్నులు మూసియైనను నోంకారమును వ్యాహృతులను నొకమారుచ్చరించి గాయత్రి, నొక్కొక్కపాదము చొప్పున నొకమారును సగము చొప్పున నొకమారును సంపూర్ణముగ నొకమారును నిట్లు ముమ్మారు జపించ వలెను. ఆపైని అగ్నిమీళే యను సూక్తము బఠించి దాని సంహితా బ్రాహ్మణషడంగ ములును ననునవి క్రమముగ నొకటి సమాప్తినొందించి రెండవది యారంభించునది. ఇట్లధ్యాయముగాని సూక్తముగాని యొక ఋక్కుగాని యథాశక్తిగ గ్రమముచేఁ బఠింప వలెను. మంత్రబ్రాహ్మణాదులు భాగములుగ నన్నియు యథాశక్తిగ ప్రతిదినము

బఠించవలెనని కొందరు. ఇట్లు చతుర్వేదాధ్యయనము చేసినవారు క్రమముగ నాల్గు వేదములగాని భాగములుగ నన్నియుగాని ఋగ్వేదము బ్రారంభించి పఠించవలెను. ఒకొక్కశాఖనే చదివినవారు తమతమ శాఖనే పఠించునది. శాఖాధ్యయనము లేనివాఁడు సూక్తముగాని ఋక్కునుగాని బఠించి యొక యజుస్సుసామము దుపనిషత్తులు నితిహాసపురాణాదులును బఠింపవలెను. ఆ మీఁద బురుషసూక్తము బఠించి యంతమున "నమోబ్రహ్మణే నమో అస్త్వగ్నయే నమః పృథివ్యై నమః ఓషధీభ్యః నమోవాచే నమో వాచస్పతయే నమో విష్ణవే బృహతే కరోమి" యని ముమ్మారు పఠించవలెను. ఋషిఛందస్సుల నపుడు స్మరింప నక్కరలేదు. విద్యుదసి యను మంత్రముల నాది యందునంతమందుఁ బఠించుట తైత్తితీయులకేగాని ఋగ్వేదులకు లేదు. కూర్చుని వేదాధ్యయనము చేయవలేనియెడ నిలువఁబడియైనను నడచుచునైనను పండుకొనియైనను జేయవచ్చును. అని యాశ్వలాయనుఁడు చెప్పెను. అనధ్యాయ దినములందు స్వల్పము పఠింపవలెను.

## తర్పణము

అందు సవ్యముచేనుండి దేవతీర్థముననగ వ్రేళ్ళకొనలనుండి యిచ్చు జలముచే దర్భాగ్రములతో దేవతర్పరణము. అది ఎట్లనిన; సాక్షతజలములచే దేవతర్పణము నువ్వులుగలపిన జలములచే నాచార్య పితృతర్పణము. "ప్రజాపతి స్తృప్యతు, బ్రహ్మా తృప్యతు, వేదాస్తృప్యంతు, దేవాస్తృప్యంతు, ఋషయస్తృప్యంతు, సర్వాణి ఛందాంసి తృప్యంతు, ఓంకారస్తృప్యతు. వషట్కారస్తృప్యతు, వ్యాహృతయస్తృప్యంతు, సావిత్రీ తృప్యతు, యజ్ఞాస్తృప్యంతు, ద్యావాపృథివీ తృప్యతాం, అంతరిక్షం తృప్యతు, అహోరాత్రాణి తృప్యంతు, సాంఖ్యా స్తృప్యంతు, సిద్ధా స్తృప్యంతు, సముద్రాస్తబృప్యంతు, నద్యస్తృప్యంతు, గిరయస్తృప్యంతు, క్షేత్రౌషధివనస్పతి గంధర్వాప్సరస్త సృప్యంతు, నాగాస్తృప్యంతు, వయాంసితృప్యంతు, గావస్తృప్యంతు, సాధ్యాస్తృప్యంతు, విప్రాస్తృప్యంతు, యక్షాస్తృప్యంతు, రక్షాంసి తృప్యంతు, భూతాని తృప్యంతు, ఎవమంతాని తృప్యంతు." అని దేవతర్పణము. ఇఁక ఋషులతర్పణము. నివీతియై కనిష్ఠిక మొదటి నుండి దర్భలమధ్యమున స్రవించుజలముచే. శతర్చినస్తృప్యంతు, మాధ్యమాస్తృప్యంతు గృత్సమదస్తృప్యంతు, విశ్వామిత్ర స్తృప్యతు, వామదేవస్తృప్యతు, అత్రిస్తృప్యతు, భరద్వాజ స్తృప్యతు, వసిష్ఠ స్తృప్యతు, ప్రగాధాస్తృప్యంతు, పావమాన్యస్తృప్యంతు, క్షుద్రసూక్తాస్తృప్యంతు, మహాసూక్తాస్తృప్యంతు. అని పదునేడు ఋషితర్పణములు చేయునది. ఆపైని బ్రాచీనావీతియనఁగ నెడమవైపున నుపవీతము ద్రిప్పి, పితృతీర్థమనఁగ నంగుష్ఠమునకు వ్రేళ్లకునడుమ నుండి ద్విగుణమైన దర్భాగ్రములచే సుమంతు జైమిని వైశంపాయనపైల సూత్రభాష్య భారత మహాభారత ధర్మాచార్యాస్తృప్యతు, జానంతిబాహవిగార్గ్య గౌతమ శాకల్య బాభ్రవ్య మాండవ్య మాండూకేయాస్తృప్యంతు, గార్గీవాచక్నవీతృప్యతు, వడవాప్రాతిధేయస్తృప్యతు, సులభా మైత్రేయీతృప్యతు, కహోలస్తృప్యతు, కౌషీతకస్తృప్యతు, మహాకౌషీతకస్తృప్యతు, పైంగ్యస్తృప్యతు, మహాపైంగ్యస్తృ

పతు, సుయజస్తృప్యతు, సాంఖ్యాయనస్తృప్యతు, ఐతరేయ స్తృప్యతు, మహైతరేయ స్తృప్యతు, సాంఖ్యాయనస్తృప్యతు, ఐతరేయ స్తృప్యతు, మహైతరేయస్తృప్యతు, శాకల స్తృప్యతు, భాస్కలస్తృప్యతు, సుజాతవక్త్ర స్తృప్యతు, ఔదవాహిస్తృప్యతు, మహౌదవాహి స్తృతు, సౌజామిస్తృప్యతు, శౌనకస్తృప్యతు, ఆశ్వలాయనస్తృప్యతు, యేచాన్యే ఆచార్యాస్తే సర్వేతృప్యంతు" అని యిట్లిరువది మూడాచార్యతర్పణము లీవలెను. ఆపైని దలిదం డ్రులు లేనియెడ పితృపితామహ ప్రపితామహులను మాతృపితామహీ ప్రపితామహు లను మాతామహ మాతృపితామహ మాతృప్రపితామహుల పత్నీయుక్తుల పత్ని మొదలగు నేకోద్దిష్టగణములకు మహాలయప్రకరణ మందు జెప్పినటుల మృతులకంద రకు దర్పణమీయవలెను. "సంబంధం ప్రథమం బ్రూయాన్నామగోత్ర మనంతరం, పశ్చాద్రూపం విజానీయాత్క్రమ ఏష సనాతనః" అనఁగా మొదటను పితరం అని మొదలుగ వానిని జెప్పు శబ్దమును ఆపైని గోత్రము పేరును అటుపైని వసురుద్రా దిత్య రూపములలో గ్రమముగ నొకరూపమును నుచ్చరించునది. దేవతలకు నొక్కొక యంజలియు ఋషులకు రెండేసి దోసిళులును పితృదేవతలకు మూఁడేసి దోసిళ్లు నను సంఖ్యావిశేష మాశ్వలాయనులకువైకల్పికము. వారి సూత్రములో సంఖ్య చెప్ప లేదు. సూత్రములో చెప్పియున్న యెడ వారికిది నిత్యమని మాధవుఁడు చెప్పెను. మాత మొదలుగ ముగ్గురు స్త్రీలుతప్ప దక్కిన స్త్రీల కొక్కదోసిలియే. ఇట్లు విస్తరించి తర్పణముజేయ నశక్తుఁడైనచో "ఆబ్రహ్మస్తంబ పర్యంతం దేవర్షి పితృమానవాః తృప్యంతు పితరస్సర్వే మాతృమాతా మహాదయః, అతీత కులకోటీనాం సప్తద్వీప నివాసినాం, ఆబ్రహ్మ భువనాల్లోకా దిదమస్తు తిలోదకం." అనఁగా బ్రహ్మ మొదలు తృణపర్యంతము దేవతలు ఋషులు పితరులు మనుష్యులు మాతృమాతా మహాదులు సప్తద్వీపస్థులై కోటులకొలది కులస్థులు నందరకు నీతిలోదకమగుగాక యని మూడేసి దోసిళ్లు జలమీవలెను. ఆ పైని "యేకేచాస్మత్కులేజాతా అపుత్రా గోత్రజామృతాః తేగృహ్ణంతు మయాదత్తం వస్త్రనిష్పీడనోదకం." అని కట్టువస్త్రము కొంగును భూమిపై పిడువవలెను. అపుడు బృహ్వృచులు ప్రాచీనావీతిగ నుండవలెను. అన్యులు నివీతిగా నుండవలెను. ఇదియు గృహమందు నిషిద్ధము. బ్రహ్మయజ్ఞము గ్రామమునకు వెలపల నుదకసమీపమందు విధింపఁబడినది. గ్రామమందు జేయుచో మనసునందె యధ్య యనము. సవ్యమనఁగ నెడమహస్తముచే స్పృశించియున్న కుడిహస్తముచేనైనను దోసిలిచేనైనను తర్పణమీవలెను. తర్పణము దర్భచేగప్పిన భూమిపై నీవలెనుగాని జలమందుగూడదు. లేదా యొకపాత్రలో విడువవలెను. "జలపూర్ణేథవాగర్తే నస్థలేతు నబర్హిషి." అనఁగా జలపూర్ణమైన యొకగోతిలో విడువవచ్చునుగాని బర్హిస్సులేని భూమియందు గూడదు. మృణ్మయపాత్రయందును గూడదు. జలమశుచియైనచో నదీజలమందు జేయునది. అనామికయందు బంగారును తర్జనియందు వెండియును గనిష్ఠికయందు ఖడ్గమృగము కొమ్మునుంగరమును ధరించెనేని పవిత్రుఁడగును. "అంగుళ్యగ్రే దైవంతీర్థం స్వల్పాంగుళ్యోః మూలేకాయం, మధ్యేంగుష్ఠాంగుళ్యోః పైత్రం మూలేహ్యంగుష్ఠస్యబ్రాహ్మం."అనఁగా వ్రేళ్లకొనలనుండి యిచ్చు జలము దైవతీర్థము.

కనిష్ఠికానామికల మొదటినుండి యిచ్చుజలము మనుష్యతీర్థము అంగుష్ఠమునకు దర్జనికి మధ్యమందిచ్చు జలము పితృతీర్థము అంగుష్ఠము మొదట నిచ్చు జలము బ్రహ్మతీర్థమని కలశముతో దెచ్చిన జలముచే పితృతర్పణము జేయుచో దిలలు జల మందు గలుపవలెను. ప్రవాహోదకముచే జేయునెడ వామహస్తమున దిలలు ధరింప వలెను. తిలతర్పణము గృహమందునిషిద్ధము. రవి భృగువారములందును సప్తమి నందాతిథులందును కృత్తికా మఘా భరణీనక్షత్రములందును మన్వాది యందు యుగాదియందును. పిండదానము మృత్తికాస్నానము తిలతర్పణము చేయగూడదు. తలిదండ్రుల శ్రాద్ధదినమందు నిత్యతర్పణము జేయునపుడు తిలలు గలపగూడదు. పర్వదినమందు తిథివారనిషేధమున్నను దిలతర్పణము జేయవచ్చును. "వికిరే పిండ దానెచ తర్పణే స్నానకర్మణి ఆచాంతస్సన్ ప్రకుర్వీత దర్భసంత్యాజనంబుధః" అనఁ గా వికిరము పిండదానము తర్పణము స్నానము దీనియందాచమనముజేసి దర్భను త్యజింపవలెను. అపుడు త్యాగమునకు మంత్రము. యేషాం పితానవాభ్రాతా నపుత్రో నాన్య గోత్రిణః, తేసర్వే తృప్తిమాయాం తు మయోత్సృష్టైః కుశోదకైః' అని యనఁ గా దండ్రియు సోదరుఁడును పుత్రుఁడును నితర సగోత్రులునులేని యగతికులకు నీదర్భల జలములచే దృప్తియగుగాక యనుట.

## హిరణ్యకేశీయుల బ్రహ్మయజ్ఞ తర్పణము

సంకల్పము మొదలుగ ముమ్మారు గాయత్రి జపాంతము పూర్వమువలె జేయు నది. అటుపైని ఇషేత్వోర్జేత్వా యని యధ్యాయమునైన యథాశక్తిగ బఠించి ఋగ్వేదమును సామమును షడంగముల నితిహాస పురాణముల బఠించి నమో బ్రహ్మణే యను దాని మూఁడుమారులు పఠించునది. ఇఁక దర్పణము. అది తైత్తిరీ యులకు బ్రహ్మయజ్ఞాంగము గాదు. కనుక బ్రహ్మయజ్ఞమైన పైని వ్యవధానముగనైనను బ్రహ్మయజ్ఞమునకు బూర్వము సహితము జేయవచ్చును. ఇట్లు కాణ్వమాధ్యందికులకు నగును. కాబట్టి 'దేవఋష్యాచార్య పితృతృప్తిద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం దేవ ఋష్యాచార్య పితృతర్పణం కరిష్యే' యని వేరుగనే సంకల్పించి మీఁదఁజెప్పినటుల నొక్కొకయంజలిచే దేవతర్పణము బ్రహ్మాణంతర్పయామి ప్రజాపతిం తర్పయామి బృహస్పతింతర్పయామి అగ్నింతర్పయామి వాయుం తర్పయామి సూర్యంతర్పయామి చంద్రమసంతర్పయామి నక్షత్రాణితర్పయామి. ఇంద్రగ్ రాజానాం ....యమగ్‌రాజా నం...వరుణగ్ రాజానాం...సోమగ్ రాజానాం ...వైశ్రవణగ్ రాజానం...వసూన్... రుద్రాన్...ఆదిత్యాన్...విశ్వాన్‌దేవాన్..సాధ్యాన్...భృగూన్...మరుతః అధర్వణః అంగి రసః తర్పయామి. యని యిచ్చినపైని ప్రాచీనావీతముగలిగి యుత్తరాభిముఖుఁడై విశ్వామిత్రంజమదగ్నిం, భరద్వాజం, గౌతమం, అత్రిం వసిష్ఠం, కశ్యపం, అరుంధతీం, అగస్త్యం, కృష్ణద్వైపాయనం, జాతూకర్ణ్యం, తరుక్షం, తృణబిందుం, వర్మిణం, వరూధి నం, వాజినం, వాజిశ్రవసం, సత్యశ్రవసం, సుశ్రవసం, సుతశ్రవసం, సోమశుష్మాయ ణం, సత్యవంతం, బృహదుక్థం, వామదేవం, వాజిరత్నం, హర్యజ్వాయనం, ఉద మయం, గౌదమం, ఋణంజయం, ఋతంజయం, కృతంజయం, ధనంజయం,

బభ్రుం, త్ర్యరుణం, త్రివర్షం, త్రిధాతుం, శిబింతం, పరాశరం, విష్ణుం, రుద్రం, స్కందం, కాశీశ్వరం, జ్వరం, ధర్మం, అర్థం, కామం, క్రోధం, వసిష్ఠం, ఇంద్రం, త్వష్టారం, కర్తారం, ధర్తారం, ధాతారం, మృత్యుం, సవితారం, సావిత్రీం, ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదం, ఇతిహాసపురాణం, తర్పయామి యని రెండేసి దోసిళ్లు జలమీయవలెను. ప్రాచీనావీతిగనుండి దక్షిణాభిముఖుఁడై వైశంపాయనం తర్పయామి. పేలిగుం, తిత్తిరం, ఉఖం, అత్రేయపదకారం, కౌండిన్యం వృత్తికారం, సూత్రకారాన్, సత్యాషాఢం, ప్రవచనకర్తౄన్, ఆచార్యాన్, ఋషీన్, వానప్రస్థాన్, ఊర్ధ్వరేతసః, ఏకపత్నీస్తర్పయామి యని మూడేసిదోసిళ్లు జలమీయవలెను. అని విశేషము తక్కిన పితృతర్పణము మొదలగునవి మీఁదఁజెప్పినటులనే. ఇఁక నాపస్తంబాదులకు, "బ్రహ్మాదయోయేదేవాస్తాన్, సర్వాన్దేవాన్, సర్వాన్దేవగణాన్, సర్వాదేవపత్నీః సర్వాన్ దేవపుత్రాన్, సర్వాన్ దేవపౌత్రాన్, భూర్దేవాగ్, భువర్దేవాగ్, సువర్దేవాగ్, భూర్భువస్సువర్దేవాగ్, కృష్ణద్వైపాయనాదయోయే ఋషయస్తానృషీన్, సర్వానృషీం, సర్వానృషిగణాన్, సర్వాఃఋషిపత్నీః, సర్వానృషిపుత్రాన్, సర్వానృషి పౌత్రాన్, భూః ఋషీన్, భువరృషీన్, సువరృషీన్, భూర్భువస్సువరృషీన్" అని ఋషి తర్పణము. ఆపైని, సోమః పితృమాన్యమోంగిరస్వా నగ్నిష్వాత్తాన్ తాన్పితౄగ్స్తర్ప యామి సర్వాన్ పితౄన్ అని మొదలుగ పితృపర్యాయములన్నియు నూహించునది. ఇట్లితరశాఖలకు నూహింపవలెను.

## కాత్యాయన బ్రహ్మయజ్ఞ తర్పణము

కాత్యాయనులకు బ్రహ్మయజ్ఞము తూర్పుమొగముగ గూర్చుండి యాచమనము పవిత్రములతో ప్రాణాయామమునుజేసి శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం బ్రహ్మయజ్ఞేన క్ష్యే యని సంకల్పించి దోసిలితో దర్భలు పట్టుకొని కుడికాలు మణుకుపై నుంచి సూత్రాంతరమునుబట్టి గాయత్రి ముమ్మారుపఠించి ఇషేత్వాయని మొదలుగ సంహి తయు బ్రాహ్మణమున మీఁద జెప్పినటుల బఠింపవలెను. అంతమందుపనిషత్తులు నితిహాసపురాణాదులు పఠించి, ఓం స్వస్తి యని యుచ్చరింపవలెను. సూత్రాంతర మందట్లు చెప్పఁబడినది. కొందరు తుదిని నమోబ్రహ్మణే యనునది ముమ్మారు పఠింతురు. ఇఁక తర్పణము. ఇది ప్రాతస్సంధ్య చేసినపైనిగాని మధ్యాహ్నామందు బ్రహ్మయజ్ఞమైన పైనిగాని యొకమారే చేయవలెను. బ్రహ్మయజ్ఞమునకు కాలత్రయము చెప్పఁబడినది. అపుడు దేవర్షి పితృదర్పణం కరిష్యే యని సంకల్పించి మొదట పూర్వోక్త ప్రకారముగ దేవతర్పణము భూమియందైనను రాగి మొదలగు పాత్రయం దైనను దర్భలుపరచి విశ్వేదేవాస ఆగతయని దేవతల నావాహనము చేసి విశ్వేదేవాః శృణుతేమమని జపించి తూర్పు మొగముగా మూడుదర్భలు ధరించి దేవతీర్థముచే బ్రహ్మాతృప్యతాం విష్ణుస్తృప్యతాం, రుద్ర, ప్రజాపతి, దేవాస్తృప్యంతాం, ఛందాగ్సి, వేదాః ఋషయః, పురాణాచార్యాః, గంధర్వాః, ఇతరాచార్యాః, సంవత్సరస్సావయవః దేవ్యస్తృప్యంతాం, అప్సరసః, దేవానుగాః, నాగాః,సాగరాః, పర్వతాః, సరితః, మనుష్యాః

, యక్షాః, రక్షాంసి, పిశాచాః, సువర్ణాః, భూతాని, పశవః, వనస్పతయః, ఓషధయ, భూతగ్రామశ్చతుర్విధస్తృప్యతాం, అని యంతటను ప్రణవముతో బ్రథమాంత ముచ్చరించి తర్పణము నిరువది తొమ్మిది. సప్తర్షయః అనుమంత్రముచే ఋషుల నావాహించి నివీతియై రెండేసి మారులు సనకస్తృప్యతు, సనందనః సనాతనః, కపిలః, ఆసురిః, వోఢుః, పంచశిఖః, అని తర్పణము చేయునది. అపసవ్య ముగ ఉశంతస్త్వాయని పితృదేవతల నావాహించి ఆయంతునః పితః అను మంత్రము ముమ్మారు జపించి పితృతీర్థముచే మూఁడేసి దోసిళ్లు కవ్యవాడనలస్తృప్య తాం, సోమః, యమః, అర్యమా, అగ్నిష్వాత్తాదిపితరస్తృవ్యంతాం, సోమపాఃపితరః, బర్హిషదః అని తర్పణముచేసి యాపైనియమాయ నమస్తర్పయామి. ధర్మరాజాయ, మృత్యవే, అంతకాయ, వైవస్వతాయ, కాలాయ, సర్వభూతక్షయాయ, ఔదుంబరాయ, దధ్నాయ, నీలాయ, పరమేష్ఠినే, వృకోదరాయ, చిత్రాయ, చిత్రగుప్తాయ, అని తర్పణములు వెనుకవియు గలపి యిరువదొకటి. అందు యమతర్పణము వైకల్పికము సూత్రమందు ఏకేయని చెప్పియున్నది. జీవత్పితృకుఁడైనను మణిబంధమనగ ముంజేయి పర్యం తమే యపసవ్యము చేయునది. మృతపితృకుఁడైనచో పిత్రాదులను ముగ్గురను మాత్రా దుల ముగ్గురనుద్దేశించి తర్పణముజేసి ఉదీరతాం అనుమొదలుగ దొమ్మిది ఋక్కులచే తర్పణము. జలస్థానమందు దోసిలిచే ధారను బోయవలెను. మంత్రములు; ఉదీర తాం. అంగిరసోనఃపితరో, ఆయంతునః, ఊర్జంవహంతీర మృతం. పితృభ్యస్స్వధా విభ్యః, యేచేహ, మధువాతా యనుమూడు ఋక్కులు వెరసి తొమ్మిది. అందు ప్రతి మండలమునకు ప్రత్యేకముగ చేయవలెను. తృప్యధ్వమనిముమ్మారు విడుచునది. అటుపైని నమోవః పితరః అను నెనిమిది యజుస్సులను బఠించి మాతా మహాదులను నేకోద్దిష్టగణములను నుద్దేశించి తర్పణము జేయునది. దేవాగాతువిదః, అను మంత్ర ముచే విసర్జింపవలెను. స్నానవస్త్రము బిడిచి యుదకమువిడుచుట మొదలగునది మీఁదఁజెప్పినట్లు చేయవలెను. ప్రాతర్హోమానంతరము దేవతార్చనము చేయనియెడ దినచతుర్థభాగమందు బ్రహ్మయజ్ఞము జేసినపైని జేయవలెను.

## పంచమభాగకృత్యము

"వైశ్వదేవః ప్రకర్తవ్యః పంచసనాపనుత్తయే, ఖండనీపేషణీ చుర్లీజలకుంభోథ మార్జనీ" యని యనఁగా కత్తిపీట మొదలగు తరుగుటకు సాధనమొకటియు, నూరు టకు రుబ్బుటకు దంపుటకు సాధనమగు సన్నెకల్లు రోలు మొదలగునవియు, ప్రొయ్యి మొదలగు వంటచేయు స్థానమును నీళ్ళుంచుట మొదలుగ నుపయోగించు బిందెలు మొదలగునవియు, తుడుచుట మొదలుగ జేయు చీపురు మొదలగునవియును నీ యైదును ప్రాణిహింసకు స్థానములు పంచసూన లనబడును. వాని శుద్ధికొరకు వైశ్వదేవ మనుకర్మ చేయవలెను. అట్టి వైశ్వదేవము ప్రాతఃకాలమందే ప్రారంభింప బడును. గాని యగ్ని హోత్రమువలె సాయంకాలమందుగాదు కనుకనే ప్రాతస్సాయం వైశ్వదేవం కరిష్యేయనియే సంకల్పము. పంచమహాయజ్ఞములు ప్రతిదినమందును జేయవలసినవే అవియేవనిన; బ్రహ్మయజ్ఞము దేవయజ్ఞము భూతయజ్ఞము పితృ

యజ్ఞము మనుష్యయజ్ఞము ననునవి. అందు బ్రహ్మయజ్ఞము మీఁదఁ జెప్పఁ బడినది. ఋగ్వేదులు మొదలగువారికి వైశ్వదేవము దేవయజ్ఞము మొదలగు మూఁడు యజ్ఞముల స్వరూపమై యున్నది. మనుష్య యజ్ఞమనఁగా మనుష్యుల కన్నముబెట్టును.

## ఋగ్వేదులకు వైశ్వదేవము

"శ్లో. గృహపక్వ హవిష్యాన్నై స్తైలక్షారాది వర్జితైః, జుహుయాత్సర్పిషాభ్యక్తైః గృహ్యాగ్నౌ లౌకికే పివా, యస్మిన్నగ్నౌపచేదన్నంతస్మిన్ హోమో విధీయతే." అనఁగా గృహమందు వండినహవిష్యాన్నము నూనె యుప్పుకారము మొదలగునవి గలియకుండ గ్రహించి నేతితోదడపి గృహ్యాగ్ని యం దనగ నిత్య మౌపాసనము జేయు వివాహాగ్ని యందు హోమము జేయవలెను. లేదా లౌకికాగ్ని యందనగ నదివండిన యగ్నియందు జేయవచ్చును. అట్టివైశ్వదేవములో జేయు పితృయజ్ఞముచేతనే నిత్య శ్రాద్ధము సిద్ధించును. గనుక నిత్యశ్రాద్ధమునకై విప్రభోజన మక్కరలేదు. ఇట్లు దీని చేతనే దర్శశ్రాద్ధమును సిద్ధించును గనుక సంవత్సరములో నెపుడైన నొకమారే దర్శ శ్రాద్ధము చేయవలెనని భట్టోజీయ గ్రంథమందున్నది. సూతకమందు పంచమహా యజ్ఞమువలకు లోపమే యని మీఁదఁజెప్పఁబడినది. అట్టివైశ్వదేవము నాత్మ సంస్కారము కొరకు నన్న సంస్కారము కొరకును జేయునది. కనుక నవిభక్తసోదరులకు పాక మొకటియే యయినచో వైశ్వదేవ మొకటియే యగును. విభక్తులైనచో వంటయొక్కటియే యైనను పాకాంతరముచే వేరుగనే వైశ్వదేవము అవిభక్తులయినను పాకమువేరగుచో వైశ్వదేవము వేరుగనే చేయవలయుననుట వైకల్పికమని భట్టోజీయమందున్నది. పాకము సంభవింపనిచో నేకాదశి మొదలగువానియందు బియ్యముచేగాని పాలు పెరుగు నేయి ఫలము జలము మొదలగువానిచేనైన జేయవలెను. 'హస్తేనాన్నాదిభిః కుర్యా దద్భిరంజలినాజలే' అనఁగా నన్నాదులతో జేయునెడ హస్తముచే చేయవలెను. జలముచే జేయునపుడు దోసిలిచే జలమందు చేయవలెను. "కోద్రవంచణకం మాషం మసూరం చ కుళుత్థకం, క్షారంచ లవణం సర్వం వైశ్వదేవేవివర్జయేత్" అనఁగా కొర్రలు సెనగలు మినుములు మొసరులు ఉలవలు, కారపు వస్తువులు, నుప్పువస్తువులన్నియు వైశ్వదేవమందు నిషిద్ధములు. ప్రవాసము వెళ్లునపుడు గృహమందు పుత్రుఁడు ఋత్విక్కు మొదలగు వారిచే జేయింపవలెను. గృహమం దెవ్వరునులేనిచో బరదేశమందు దానే చేయవలెను. ఋగ్వేదులు తైత్తిరీయులును వైశ్వదేవమును పగటియందు రాత్రియందును రెండుమారులు వేరుగచేయవలెను. అశక్తిలో నొకకాలమందె రెండుమారులుగాని కలిపిగాని చేయవచ్చును, ఋగ్వేదులకు దైత్తిరీయులకును లౌకికాగ్ని యందే పాకమును వైశ్వదేవమునని తరుచుగ నాచారము.

## ప్రాతస్సాయం వైశ్వదేవములకు సహప్రయోగము

ప్రాతస్సాయం వైశ్వదేవములు రెండునుగలపి చేయునపుడు తంత్ర ప్రయోగ మెట్లనిన, అందువైష్ణవమతస్థులు భగవంతుని పదారుగాని యైదుగాని దీపాంతముగ

నుపచారములు సమర్పించి యన్నమంతటిలోనుండి పురుషాహారపర్యాప్తమైన యన్నము నైవేద్యముగ సమర్పించి మిగిలినయన్నముచే వైశ్వదేవము చేయవలెను. ఇతర మతస్థులు వైశ్వదేవముజేసి మిగిలినయన్నము నైవేద్యముగ సమర్పించవలెను. "విష్ణోర్ని వేదితాన్నే న యష్టవ్యం దేవాతాంతరం, పితభ్యశ్చాపి తద్దేయం తదానంత్యాయ కల్పతే" యని మొదలగువచనములు వైష్ణవమత విషయములని నిబంధకారులందరు జెప్పిరి. ఇక్కడ వైష్ణవులనఁగ నారాయణాష్టాక్షరాది వైష్ణవమంత్ర దీక్షోపదేశ జపములు గలవారలె ముఖ్యులు. 'ఉపదేశః కలౌయుగె' యని యుపదేశమాత్రమే కలియుగ మందు దీక్షతో సమానమైన ఫలమిచ్చునని చెప్పఁబడినది, ఇఁకగౌణవైష్ణవులనఁగ మంత్రోపదేశశాదిదీక్షలు లేక పారంపర్యముచే నరుణోదయవిద్ధైకాదశి నుపవసింప కుండుట శుక్లకృష్ణైకాద శ్యుపవాసము మొదలగు యత్కించి ద్ధర్మము మాత్రము ప్రధానముగ నడచువారు. విచారించినచో "పాంచరాత్రాద్యాగమోక్త దీక్షాం ప్రాప్తోహి వైష్ణవః" అనియున్నందున నాగమదీక్షనుబొందక యత్కించి ద్ధర్మ మాత్రపరులైనచో వైష్ణవత్వ మెట్లు సిద్ధించుననిన; గాయత్ర్యుపదేశము నధ్యయనము మొదలగు క్షత్రియ వైశ్య సాధారణధర్మములుగ గలిగి యాజనము నధ్యాపనము ప్రతిగ్రహము మొదలగు ధర్మములువిడిచి పిత్రాదిపరంపరచే వైశ్యాదివృత్తులు చేయుచు దప్పని యేకగోత్ర త్వము మొదలగు యత్కించిద్బ్రాహ్మణధర్మ మాత్రముచే బ్రాహ్మణత్వమువలెనే తదు చిత సూతకాద్యాచారమువలెనే కలియుగమందు కించిద్ధర్మ మాత్రముచే వైష్ణవత్వ ముండవచ్చును. అట్లు తదుచితాచారమును జరుగవచ్చును. క్షత్రియులకుగదా పురో హిత భేదముచే గోత్రభేదము కనుకనే యదువంశములందు పరస్పరమును వివా హము, ఇట్లు బ్రాహ్మణులకులేదని స్పష్టము. ఇట్లు శ్రాద్ధమందును నైవేద్యము సమ ర్పించినపైని పితృదేవతల కన్న నివేదనమని తెలియవలెను. "మమాత్మాన్న సంస్కార పంచసూనాజనిత దోషపరిహారద్వారా పరమేశ్వర ప్రీత్యర్థం ప్రాతర్వైశ్వదేవం సాయం వైశ్దఏవం చ సహతం త్రేణ కరిష్యే" యని సంకల్పించి కుండమందైనను స్థండిలాదిక మందైనను పాకాగ్నిని వ్యాహృతులచేఁ బ్రతిష్ఠించి పావకుఁడనఁబడు నయ్యగ్నిని చత్వారిశృంగా యనుదానిచే ధ్యానించి చుట్టును జలము స్పృశించి ప్రోక్షించి విశ్వా నినః అనుదానిచే నర్చనాదికముజేసి ఘృతమిశ్రమైనయన్న మగ్నియందధి శ్రయణము జేసి ప్రోక్షించి దింపి యగ్నికి వెనుకనుంచి మూఁడుభాగములుచేసి మొదటిభాగము దేవతలకు హోమము చేయవలెను. అది యెట్లనిన; హృదయమందు నెడమహస్త ముంచి వెతికిలజేసిన కుడిహస్తముచే సూర్యాయ స్వాహా, సూర్యాయేదం నమమ, ప్రజాపతయే, సోమాయ, వనస్పతయే, అగ్నీ షోమాభ్యాం, ఇంద్రాగ్నిభ్యాం, ద్యావాపృథివీభ్యాం, ధన్వంతరయే ఇంద్రాయ విశ్వేపభ్యోదేవేభ్యః బ్రహ్మణే. అని ప్రాత ర్వైశ్వదేవాహుతుల పది. ఇఁకసాయం వైశ్వదేవీయములు. అగ్నయే స్వాహా యని వేల్చి ప్రజాపతయే యని మొదలుగ దొమ్మిదాహుతులు వేల్చవలెను. ఇట్లిరువది యాహుతులను వేల్చి ప్రాయశ్చిత్తమునకై వ్యస్తసమస్త వ్యాహృతులచే వేల్చియైనను వేల్చకయైనను పరిసమూహనమనగ జలముతో చుట్టును స్పృశించుట పర్యుక్షణ

మగునట్లు ప్రోక్షించుట యీ రెండును జేసి ఓం చమే యని యుపస్థానము చేయవలెను. ఇట్లు దేవయజ్ఞము.

## బలిహరణము

రెండవయన్న భాగములో గ్రహించి పరిశుద్ధమైన భూమియందు సూర్యాయ స్వాహా సూర్యాయేదం నమమ. అని యిట్లు పదియాహుతులను దూర్పుసమాప్తిగ నవ్యవధానముగా వేల్చి మధ్యమందవకాశము వదలి అద్భ్యస్స్వాహా, ఓషధివనస్పతిభ్యః గృహేభ్యః, గృహదేవతాభ్యః, వాస్తుదేవతాభ్యః, అని ప్రాక్సమాప్తిగానే వేల్చి, అద్భ్యః అను నాహుతికి వెనుక ఇంద్రాయ యనియు దానికుత్తరముగ ఇంద్రపురుషేభ్యః అనియు నంతరాళమునకు దక్షిణమందుయమాయ యని దానికుత్తరమందు యమ పురుషేభ్యః అని వేల్చి బ్రహ్మాహుతికిఁ దూర్పుగ వరుణాయ యని దానికుత్తరముగ వరుణపురుషేభ్య, యని అంతరాలమున కుత్తరమందు సోమాయ యని దానికుత్తర ముగ సోమపురుషేభ్యః అనియు నంతరాలమందు బ్రహ్మణే యనియు దానికుత్తరముగ బ్రహ్మపురుషేభ్యః, విశ్వేభ్యో దేవేభ్యః, సర్వేభ్యో భూతేభ్యః దివాచారిభ్యః అనియు సోమ పురుషుల కుత్తరమందు రక్షోభ్యః అని వేల్చవలెను. ఇట్లు సాయం వైశ్వదేవ సంబంధియైన రెండవ బలిహరణమును జేయవలెను. అపుడు సూర్యస్థానమందు మొదట నగ్నయే యని వేల్చి ప్రజాపతయే యని మొదలుగ మీఁదఁచెప్పినట్లు చేయవలెను. దివాచారిభ్య యనునపుడు నక్తం చారిభ్యస్స్వాహా యనివేల్చుట విశేషము. ఇట్లు భూతయజ్ఞము ప్రాచీనావీతియైన మూఁడవయన్నభాగమును గ్రహించి స్వధా పితృభ్యః అని యమబలికి దక్షిణమున పితృభ్య ఇదం నమమ యని త్యాగముంజెప్పి సాయం వైశ్వదేవబలిహరణమునకు దక్షిణమందు సాయంవైశ్వదేవ పితృయజ్ఞమును జేయవలెను.

## పితృయజ్ఞము

కొందరు చక్రాకారముగ బలిహరణమును జెప్పుదురు. "బలావనుద్ధ ృతే నాద్యాన్నోద్ధరేచ్చ స్వయం బలిం" అనఁగా అట్టి బలిదానము దీసివేయక మున్ను భుజింపఁగూడదు. స్వయముగా బలిదానము దీయగూడదనుట. అనంతరమున నింటివాకిట భూమియందు జలము ప్రోక్షించి "శ్లో. ఐంద్ర వారుణవాయవ్యా యామ్యా నైఋుతికాశ్చయే, తేకాకాః ప్రతిగృహ్ణంతు భూమ్యాం పిండం మయోజ్ఝితం." అనఁ గా నింద్ర యమ నిఋుఋుతి వరుణ వాయుదిక్కులను వాని సంబంధములైన కాకము లన్నియు భూమియందు నాచే నీబడిన యీపిండమును స్వీకరింపవలెనని పితృయజ్ఞము సేయగ మిగిలినయన్నము నీవలెను. శ్లో॥ వైవస్వతకులే జాతౌద్వౌశ్యా మశబలౌశునౌ, తాభ్యాంపిండో మయాదత్తో రక్షేతాం పథి మాం సదా." అనఁగా యమగృహమందు శ్యామ శబలములను రెండు శునకములున్నవి. నానికొరకీ పిండము నాచే నీబడినది. యవి నన్ను మార్గమందు సదా రక్షణము సేయవలెనని "యేభూతాః ప్రచరంతి" యను మంత్రముతో భూతయజ్ఞ శేషముచే రెండు పిండము

లీవలెను. తంత్రముచే వైశ్వదేవము జేయునపుడు యే భూతాయను మంత్రమున దివానక్తం బలిం. అని పాఠము. పగటియందు రాత్రియందును వేరుగ జేయునపుడు దివాబలిమిచ్ఛంతః అనియు, నక్తంబలిమిచ్ఛంతః అనియు వేరుగ బాఠము గ్రహించు నది. కాలుసేతులు గడగికొని యాచమించి గృహము బ్రవేశించి శాంతా పృథివీ యని మొదలుగ జపించి విష్ణుని స్మరించి కర్మము నర్పించవలెను.

## మనుష్య యజ్ఞము

అతిథి భోజనమునకు జాలునంతగాని పదారు కబలములకు నగునంతగాని నాల్గు కబలములుగాని యొకగ్రాసము మాత్రమైన నన్నము "సనకాది మనుష్యేభ్యో హంతేదం నమమ" యని యీవలెను. అనేక భిక్షులు వచ్చినపుడు శక్తుఁడు గానిచో ముగ్గురికి మూఁడు గ్రాసము లీవలెను.

## తైత్తిరీయులకు శ్రాద్ధదినమందు భిన్నపాకముచే వైశ్వదేవము

శ్రాద్ధదినమందు భిన్నపాకముచే వైశ్వదేవము దేవయజ్ఞము మొదలగు నాల్గు యజ్ఞములు నగును. కొందరు మొదట వైశ్వదేవము నంతమందు పంచమహాయజ్ఞ ములు ననిరి. "శ్లో. యాజుషా స్సామగాఃపూర్వం మధ్యే కుర్వంత్యధర్వణాః, బహ్వృచుల నఁగ ఋగ్వేదులు శ్రాద్ధశేషముచే చేయుదురు. అందులో నాహితాగ్నులు మొదట చేయుదురు. 'స్వర్గపుష్ట్యర్థ మాత్మ సంస్కారార్థం ప్రాతస్సాయం వైశ్వదేవంతం త్రేణకరిష్యే' యని సంకల్పించి ఔపాసనాగ్నిని పచనాగ్నినైనం బ్రతిష్ఠాపించి యౌపాసన మందు వలె పరిసమూహనము పరిషేచనముజేసి యన్నము నగ్నియందధిశ్రయణము చేసి ప్రోక్షించి తీసి యభిఘరించి యగ్ని బూజించి యన్నము మూఁడు భాగములు చేసి హస్తముచే వేల్చవలెను. ఎట్లనిన, అగ్నయేస్వాహా, విశ్వేభ్యో దేవేభ్య స్స్వాహా, ధ్రువాయభూమాయ, ధ్రువక్షితయే, అచ్యుతక్షితయే, అగ్నయేస్విష్టకృతే యని వేల్చి పరిసమూహనము. పర్యుక్షణముచేసి యగ్నికి వెనుకను, వ్యజనాకారముగనైనను చక్రాకారముగనైనను బలిదానము చేయవలెను. అందు దేవతలు, ధర్మాయ స్వాహా, ధర్మాయేదం, అధర్మాయ, అద్భ్యః, ఓషధివనస్పతిభ్యః, రక్షోదేవజనేభ్యః, గృహాభ్యః అవసానేభ్యః, అవసానపతిభ్యః, సర్వభూతేభ్యః, కామాయ, అంతరిక్షాయ, యదే జతిజగతియచ్చ చేష్టతినామ్నో భాగోయన్నా మ్నే స్వాహా యనివేల్చి నామ్న ఇదం. అని త్యాగము. కొందరు వాయవ ఇదం అని చెప్పుదురు. ఇట్లు పృథివ్యై, అంతరిక్షాయ, దివే, సూర్యాయ, చంద్రమసే, నక్షత్రేభ్యః, ఇంద్రాయ, బృహస్పతయే, ప్రజాపతయే, బ్రహ్మణే. యని వేల్చి యందరకొకమారే పరిషేచనము చేయవలెను. వేరువేరుగఁ బరిషేచనము చేయునెడ. "శ్లో. ద్వావేకం ద్వేచ చత్వారిప్రత్యేకం త్రీణిచైవహీ, పృధి వ్యాది దశస్వేకమత ఊర్ధ్వం పృథక్క్రమాత్." అని తెలియవలెను. అనఁగా మొదటి రెంటికొకమారు పరిషేచనము. ఆపై నొకదానికే యనఁగ నబ్దేవతకే పరిషేచనము, ఆపై రెంటికి నాపై నాల్గింటి కొక్క పరిషేచనము అటుపై మూడిటికొక పరిషేచనము. ఆ పై నొకదానికే యనఁగ నబ్దేవతకే పరిషేచనము, ఆపై రెంటికి నాపై నాల్గింటికొక్క

పరిషేచనము అటుపై మూడిటికొక పరిషేచనము. నటుపై పృథివి మొదలగు పదింటి కొకటియే యని. ఇట్లు క్రమముగ పరిషేచనము తెలియవలెను. ఆపైని ప్రాచీనావీతిగ నుండి మీఁదఁజేసిన చోటుకు దక్షిణముగ "స్వధాపితృభ్యస్స్వాహా" యనియు నుప వీతియై దానికుత్తరముగ "నమోరుద్రాయ పశుపతయే స్వాహా" యనియు వ్రేల్చి పితృ రుద్రబలులను వేరువేరుగ బరిషించవలెను. ఇట్లు వైశ్వ దేవము.

## దేవయజ్ఞాది చతుష్టయము

దేవయజ్ఞము మొదలుగ నాల్గుయజ్ఞములు దేవయజ్ఞేన యక్ష్యేయని సంక ల్పించి యగ్నినిబరిషేచించి దేవేభ్యస్స్వాహా యనియగ్ని యందు వ్రేల్చి యుత్తర పరిషేచనము సేయునది. ఆపైని ప్రాచీనావీతియై పితృయజ్ఞేన యక్ష్యేయని సంక ల్పించి దక్షిణముగ భూమియందు పితృభ్యస్స్వధాస్తు అని యిచ్చి త్యాగము చెప్పి పరిషేచింపవలెను. అటుపై నుపవీతిగ నుండి యుదకము స్పృశించి భూత యజ్ఞేన యక్ష్యేయని సంకల్పించి భూతేభ్యో నమః అని భూమియందిచ్చి పరిషించి నివీతయై మనుష్య యజ్ఞేన యక్ష్యేయని సంకల్పించి మీఁదఁజెప్పినంత యన్నము మనుష్యే భ్యో హంతా యని యీవలెను. ఈ సమస్త యజ్ఞములందును నాద్యంతములందు గ్రమముగ విద్యుదసి పృష్టిరసి యనుమంత్రములఁ బఠింపవలెను. తరుచుగ వీరికి బలియివ్వగ మిగిలినయన్నము యేభూతాః ప్రచరంతీ యను మంత్రముచే వాకిటి నాకాశమందు జల్లుట యాచారము. అటుపైని యథాచారముగ శ్వవాయసాదిబలి యీవలెను.

## కాకతీయులకు దేవయజ్ఞాదులు

కాకతీయులకు అందు సాగ్నికులకు శ్రాద్ధదినమందొక పాకముచేత మొదటనే వైశ్వదేవము ఇతరుల కంతమం దగును. అగ్ని గృహమునుండి యొకకొరివిని వంట యింటిలోఁబెట్టి యందు పాకముజేసి వంటయింటి నిప్పులను గృహ్యాగ్ని యందుంచి వండిన యన్నములోఁ గొంతదీసి నేతితోఁదడపి మీఁదఁజెప్పినట్లు 'ఆత్మాన్న సంస్కారా రార్థం వైశ్వదేవం కరిష్యే' యని సంకల్పము లేదా 'దేవభూతపితృ మనుష్య యజ్ఞాన్ వైశ్వదేవాన్నేన యక్ష్యే' యని సంకల్పించి గృహాగ్నికి బిందెలో నుదకముచే జుట్టును బ్రోక్షించి హస్తముచే నగ్నిలో వ్రేల్చవలెను. బ్రహ్మణేస్వాహా ఇదం బ్రహ్మణేనమమ ప్రజాపతయే గృహ్యాభ్యః కశ్యపాయ, అనుమతయే, యని వ్రేల్చి త్యాగము చెప్పవలెను. ఇట్లు దేవయజ్ఞము. అటుపై నీళ్ల బిందెకు సమీపమున నుదక్సమాప్తిగ రెండు బలి దానములును చేయవెను. ఎట్లనిన; ధాత్రే, విధాత్రే, యని యిచ్చి యుదకముచేఁ జతురశ్రముగ మండలముచేసి యందు పూర్వే వాయవే, దక్షిణేవాయవే, పశ్చిమే వాయవే, ఉత్తరరేవాయవే. యని యిచ్చి ప్రాగాదివాయుబలికి తూర్పుననైన నుత్తర మున నైనను ప్రాచ్యైదిశే, దక్షిణస్యైదిశే, ప్రతీచ్యైదిశే, ఉదీచ్యైదిశే, యనియు మధ్య మందు ప్రాక్సంస్థముగ బ్రహ్మణే, అంతరిక్షాయ, సూర్యాయ, యని యిచ్చి వీరికుత్తర ముగ విశ్వేభ్యో దేవేభ్యః, విశ్వేభ్యో భూతేభ్యః అని యిచ్చి వీరికుత్తరముగ ఉషసే

భూతానాంపతయే యని యీయవలెను. ఇట్లు భూతయజ్ఞము అటుపైని ప్రాచీనా వీతియై బ్రహ్మాది బలిత్రయమునకు దక్షిణమున పితృతీర్థము ననఁగా నంగుష్ఠమునకు వ్రేళ్ళకు మధ్యమునుండి పితృభ్యస్స్వధా నమ ఇదం పితృభ్యో నమమ యని యీవలెను. ఇది పితృయజ్ఞము. పాత్రముగడిగి సవ్యముచే బ్రహ్మాది బలికి వాయవ్యముగ యక్ష్మైతత్తే నిర్ణేజనమని యాజల మీవలెను. మనుష్య యజ్ఞము పూర్వమువలె చేయునది. నిరగ్ని కుఁడైనచో లౌకికాగ్నిదెచ్చి పృష్టోదివి యని ప్రతిష్ఠచేసి తత్సవితుః తాగ్ సవితుః విశ్వానిదేవ. యను మూఁడు సావిత్రమంత్రములచే జ్వలింపఁజేసియందు నిత్యోపాసన హోమము జేసి పాకముజేసి వైశ్వదేవమును జేయవలెనని గదాధరుఁడు చెప్పెను. అట్లు చేయుట కశక్తుఁడైనచో బహ్వృచాదులకు చెప్పినట్లు పచనాగ్నిని ప్రతిష్ఠించి ధ్యానముచేసి పూజించి యందు మీఁదఁజెప్పినట్లు వైశ్వదేము అపుడగ్నయే స్విష్టకృతే స్వాహా యని యైదాహుతుల కుత్తరమున హోమము నిరగ్నులకంతట నని తెలియునది. తక్కినవి పూర్వమువలె నగును. కాత్యాయనులకు పగటియందే వైశ్వదేవము రాత్రి వెరుగలేదు. సామవేదులును నథర్వణ వేదులును స్వగృహ్యా ప్రకారమున పంచమహాయజ్ఞములు చేయవలెను. తమ గృహ్య సూత్రము దొరకనిచో బహ్వృచులకు జెప్పినట్లు ఉపనయనాది సంస్కారములు పంచమహాయజ్ఞాదులను చేయవలెను. ఇట్లు నాకుఁ దెలిసినంతశాఖాంతర మతములవారి యాహ్నికము జెప్పితిని. విద్వాంసులు తెలిసి శోధింపవలెను. “ఇక్షూనపః ఫలం మూలంతాంబూలం పయ ఔషధం, భక్షయిత్వాపి కర్తవ్యా స్స్నానదానాదికాః క్రియాః” అనఁగా చెరుకు, జలము, ఫలము, దుంపలు, తాంబూలము, పాలు, ఔషధము మొదలగునవి భక్షించి యైనను నశక్తులు స్నానదానాదికము చేయవచ్చునని పంచమహాయజ్ఞములలో నెద్ది లోపించినను నుపవాసము చేయునది. ధనికుఁడు నాతురుఁడును ప్రతీయజ్ఞమునకు కృచ్ఛ్రార్థము చేయవలెను. కొంద రొక్కదినమందు లోపమైనచో మనస్వత్యాహుతియు రెండు దినములు లోపించినచో మూఁడుతంతుమతులచే హోమము నాలుగు వారుణ మంత్రముల జపమును జేయునది. పంద్రెండు దినములు లోపించినచో తంతుమతీ స్థాలీపాకమును వారుణ మంత్రములచే నాజ్యహోమమునుజేయునది. యని చెప్పుదురు.

## సర్వసాధారణ భోజనాదివిధి

బంగారు పళ్లెమునగాని వెండిపళ్లెమునగాని చూతపత్రము మొదలగువానిచే నిర్మించిన పాత్రయందుగాని భుజించుట ప్రశస్తము. కాంస్య పాత్రయనఁగ కంచు పళ్లెమందెపుడు నొకఁడే భుజించునది. అనఁగా నన్యులు భుజించిన పాత్ర గూడదనుట. “శ్లో. తాంబూలాభ్యంజనం చైవ కాంస్యపాత్రే చ భోజనం, యతిశ్చ బ్రహ్మచారీ చ విధవా చ వివర్జయేత్.” అనఁగా సన్న్యాసియు బ్రహ్మచారియు విధవయు తాంబూలమును నభ్యంగమును కంచుపాత్రయందు భుజించుటను వర్జింపవలెను. మోదు గాకులందు భోజనము యతి మొదలగువారికి ప్రశస్తము. గృహస్థునికిఁ గూడదు. చాంద్రాయణము ప్రాయశ్చిత్తము. ఇది తీఁగె మోదుగునకే నిషేధమని స్మృత్యర్థసార

మందున్నది. అరిటి, అంకుఁడు, ఇప్ప, నేరేడు, పనస, మామిడి, సంపెంగ, బొడ్డ, వీనిపత్రములు నిషిద్ధములు చతురశ్రమండలమందు గడగిన భోజన పాత్రనుంచి పంచయజ్ఞములు సేయగ మిలిగిన ఘృతాక్తమైన యన్నము వడ్డింపగ 'నిత్యమస్త్వేతత్' అని పలుకుచు నమస్కరించి గ్రంథిలేనిపవిత్రము ధరించిన కుడిహస్తము గలిగి పాదములు రెండునుగాని యొకటిటాని భూమియందుంచి వ్యాహృతులచేతను గాయత్రిచేతను నభిమంత్రించి 'సత్యంత్వర్తేన పరిషించామి' యని పగటియందును 'ఋతంత్వాసత్యేన పరిషించిచామి' యని రాత్రియందును బరిషేచ నము జేసి "శ్లో. అంతశ్చరతి భూతేషు గుహాయాం విశ్వతోముఖః, త్వం యజ్ఞస్త్వం వషట్కారస్త్వం విష్ణుః పురుషః పరః" యని యుచ్చరింపుచు పాత్రకు దక్షిణమందు భూమిపై "భూత పతయే నమః భువనపతయే నమః, భూతానాంపతయే నమః, అని మూఁడు బలుల నీయవలెను. లేదా చిత్రాయ, చిత్రగుప్తాయ, యమాయ, యమధర్మాయ, సర్వభూతేభ్యః అనియైనను వ్యస్తసమస్త వ్యాహృతులచేనైనను నాలుగు బలులీవలెను. ధర్మరాజాయ చిత్రగుప్తాయ, యని రెండైన నీవలెను. భూపతయే యని మొదలుగ మూఁడు నీ రెండును గలసియైదైన నీవలెను. హస్త పాదముఖ ములు దడపియుండఁగ నాపోశనమునకై జలము గ్రహించి "అన్నం బ్రహ్మ రసో విష్ణుః, అహం వైశ్వానరో భూత్వా" యనుదాని యర్థమును స్మరింపుచు 'అమృతోపస్త రణమసి' యని జలముద్రావి మౌనముధరించి "ఓం ప్రాణాయస్వాహా, ఓం అపనాయ స్వాహా, ఓం వ్యానాయస్వాహా, ఓం ఉదానాయస్వాహా, ఓం సమానాయ స్వాహా" యని నేతితోగాని క్షీరముతోగాని కలిపిన యాహుతు లైదును సర్వాంగుళ దీసి ఒక్కొక్క యాహుతియం తయు నొకమారుగ మ్రింగుచు ముఖమందు హోమము జేయవలెను. బ్రహ్మణే స్వాహాయని యారవది కొందరు చెప్పుదురు. ప్రాణాహుతి యగు పర్యంతము పాత్రను ముట్టియుండుటయు మౌనమును దప్పకుండవలెను. అటుపైని వైకల్పికములు. భోజనము తూర్పు మొగముగనైనను పశ్చిమాభిముఖముగ నైనను ప్రశస్తము. దక్షిణముఖముగ జేయుట కామ్యము యశస్సు నిచ్చును. ఉత్తర ముఖముగను నయినచో మధ్యమము. విదిక్కుల కభిముఖమయినచో గూడదు. అన్ని కబలములు భుజించునపుడు ముప్పది రెండని మొదలగు నియమముతోనైనను లేకుండనైనను భోజనముచేసి "అమృతాపిధానమసి" యని గండూషార్ధమును ద్రావి సగము భూమిపై విడిచి పవిత్రము వదలి ముఖమందు హస్తమందు నుచ్ఛిష్ఠము గ్రమముగ గడగికొనవలెను. అపుడు తర్జనితో ముఖము శోధింపగూడదు. కొన్ని గండూషము లైనపైని చేయిగడగికొని పదారుమారులు పుక్కిలించిన వెనుక రెండు మారు లాచమనము జేయకయే మూత్రపురీషోత్సర్గము జేయగూడదు. ఉత్తరాపోశ నము జేయకలేచినచో స్నానముచే శుద్ధియగు. ఆచమనము జేసినపైని హస్తములు తుడిచి స్రవించిన యుదకముతో నంగుష్ఠముచే నేత్రముల దడపి యిష్టదేవతను స్మరింప వలెను. జలము దోసిలితో ద్రావగూడదు. దగ్ధమైనదిగాని మోదుగుకర్రతో జేసినదిగాని యినుపమేకులు వేసినదిగాని పీటగూడదు. భుజించునపుడు శిశువులతో గూడదు.

వివాహమందుదప్ప నితరకాలమందు భార్యతో భుజింపగూడదు. బాలురకు వృద్ధులకు నన్నము బెట్టక మున్ను భుజింపఁగూడదు. పావలు దొడగిగాని పీటపై బాదములుంచి గాని కాళ్ళుచాపిగాని విదిక్కు కభిముఖుఁడైగాని దుష్టుతో నేకపఙ్క్తిగాగాని పాకగృహ మందు శూన్యగృహమందు నగ్ని గృహమందుగాని దేవాలయమందుగాని భుజింపఁ గూడదు. మరియు సంధ్యలందును, నిశీథమందును, యజ్ఞోపవీతిగా నుండ కయు నెడమహస్తముచేతను శూద్రులకు బెట్టిన యనంతరమునను భుజింపఁగూడదు. ఇఁక భుజించునపుడు మొదట మధురము మధ్యమందును పులుసు వస్తువులు నంతమందు చేదు మొదలగు వస్తువులును భుజింపవలెను. మరియు మొదట ద్రవ ద్రవ్యము మధ్యమందు కఠినవస్తువులను నంతమందు ద్రవద్రవ్యమును భుజించు నది. ఎనిమిదికబలము సన్యాసికి పదారువనస్థుతికి పదారుగాని ముప్పది రెండు గాని గృహస్థునికిని యధేష్టముగ బ్రహ్మచారికిని విధింపఁబడినవి. "సర్వం సశేష మశ్నీ యాన్నిశ్శేషం ఘృతపాయసం." అనఁగా ఘృతము పాయసమును నిశ్శేషముగ భుజింపవలెను. తక్కినవి గొంతయుండిపోయినను దోషములేదు. పాలు పెరుగు తేనెయును నిత్యము భుజింపవలెను. అట్టి భోజనము పగటియందు రాత్రి యందు నని రెండుమారులే చేయవలెనుగాని మరి భుజింపఁగూడదు. "అర్కపర్వద్వయే రాత్రౌ చతుర్ద శ్యష్టమీదివా, ఏకాదశ్యా మహోరాత్రం భుక్త్వా చాంద్రాయణం చరేత్." అనఁగా నాదిత్యవారమందును పూర్ణిమామావాస్యలందును రాత్రి భుజింపఁగూడదు. ఏకాదశియందు బగలు రాత్రియు భుజింపఁగూడదు. "శ్లో. యస్తు పాణితలే భుఙ్తే యశ్చ పూత్కారసంయుతం, ప్రసృతాంగుళిభిర్యశ్చ తస్య గోమాంసవచ్చతత్." అనఁ గా హస్తమందే భుజించినను పాత్రలో వడ్డించినప్పటికి పూత్కారమున నోటితో నూది భుజించినను వ్రేళ్లు విప్పికొని భుజించినను గోమాంసభక్షణతుల్యము. అనఁ గా నుచ్ఛిష్టమంటును గనుక గూడదని భావము. "శ్లో. నాజీర్ణే భోజనం కుర్యాత్కుర్యా న్నాతి బుభుక్షితః, నార్ద్ర వాసా నార్ద్రశిరా నపాదారోపితే కరే" అనఁగా నజీర్ణరోగమందు భుజింపఁగూడదు. గడియాకలిపడి భుజింపఁగూడదు. అట్లు తడిబట్టతో తడితలతో భుజింపఁగూడదు. పాదముపైని చేయుంచి భుజింపఁగూడదు. "శ్లో. గ్రాసశేషం న వాశ్నీయా త్పీత శేషం పిబేన్నచ, శాకమూలఫలాదీని దంతచ్ఛేదైర్న భక్షయేత్." అనఁగా నొకబలములో గొంతదినగా మిగిలినది తినగూడదు. ఇటు జలమును గొంతద్రావగ మిగిలినది ద్రాగగూడదు. కూరయు మూలము ఫలము మొదలగునవి కొరికికొనుచు దినఁగూడదు. అనఁగా నుచ్ఛిష్టమగునని భావము. తనయెంగిలి యైనను నిషిద్ధమే. "నోచ్ఛిష్టో ఘృతమాదద్యాన్నపదా భాజనం స్పృశేత్" అనఁగా నెంగిలితో నున్నపుడు ఘృతము తానే తీసుకొనగూడదు. భోజనపాత్రను గాలుతో ముట్టగూడదు. "పిబతో య త్పతేత్తోయం భాజనే ముఖనిస్సృతం, అభోజ్యం తత్" అనఁగా జలముద్రాగునపుడు ముఖమునుండి జారిన జలము పాత్రయందుఁబడినచో మిగిలినది భుజింపఁగూడదు. త్రాగి మిగిలిన జలము ద్రావినచో చాంద్రాయణము హస్తనఖములు ముంచిన జలమునుగాని యెడమచేతితోనెత్తిన జలముగాని త్రాగి

నచో సురాపానసమము. ఒకపఙ్క్తిలో బ్రాహ్మణులు భుజింపుచుండఁగ నొకఁడులేచి పోయినను నుత్తరాపోశనము జేసినను నితరులు భుజింపఁగూడదు. ఇక్కడ లేచిన వానికిని భుజించినవానికి నిద్దరకును దోషమగును. గురువునకు మాత్రము దోషము లేదు. “లవణం వ్యంజనం చైవ ఘృతం తైలం తథైవచ, లేహ్యం పేయం చ వివిధం హస్తదత్తం న భక్షయేత్.” అనఁగా నుప్పును, నూరుగాయయు, నేయి నూనెయు, పచ్చడి, ద్రవ్యద్రవ్యములు మొదలగునవి చేతితో వడ్డించినయెడ భుజింపఁగూడదు. రాగిపత్రయందు గోక్షీరము కంచుపాత్రయందు గొబ్బరి చెరకు రసమును గుడమిశ్ర మైన పెరుగు గుడమిశ్రమైన యల్లమును మధ్యసమములు. సైంధవము సాముద్రము దప్ప తక్కిన ప్రత్యక్షలవణముల భక్షించుట మృత్తును భక్షించుటయు గోమాంస సమము. “ఉదక్యామపి చాండాం శ్వానం కుక్కుటమేవ చ, భుంజానో యది పశ్యేత తదన్నంతుపరిత్యజేత్” అనఁగా భుజించునపుడు రజస్వలను చండాలుని కుక్కను గోడిని జూచినచో మిగిలినయన్నము దినగూడదు. భుజించునపుడు గుదస్థానము స్రవించినయెడ నుపవాసము; పంచగవ్యభక్షణమును జేయునది. అపోశనమైన పైని ప్రాణాహుతికంటె మున్ను స్రవించినచో స్నానము. నారు ప్రాణాయామములను జేయునది. భుజింపుచుండఁగ నాశౌచము వచ్చినచో భక్షింపుచున్న కబలము విడిచి స్నానము జేయవలెను. ఆకబలము మ్రింగినచో నుపవాసము మిగిలినది యంతయు దినినచో ద్రిరాత్రోపవాసము సేయునది. అమేధ్యము మొదలగునది స్పృశించినచో స్నానము ప్రాణాయామములు మూడును జేయునది. చండాలుఁడు పతితుఁడు రజస్వలయును వీరు పలికినమాటను వినుచు భుజించినచో నొకయుపవాసము. స్నానము జేసి శతగాయత్రి జపమైనను జేయవచ్చును. కలహము తిరగలి రోలు వీటి సంబంధమైన శబ్దము వినునంత వరకును భుజింపగూడదు. “అప్యేకపఙ్క్తౌ నాశ్నీయాద్బ్రాహ్మణైస్స్వజనైరపి, కో విజానాతి కిం కస్య ప్రచ్ఛన్నం పాతకం భవేత్.” అనగా బ్రాహ్మణులతోనైనను స్వబందువులతోనైనను నేకపఙ్క్తిలో భుజింపఁగూడదు. ఏమనిన ఎవ్వరు ప్రచ్ఛన్నముగా ననఁగా రహస్యముగ నెట్టిపాపము జేసియుందురో మనకెట్లు తెలియును? అనఁగా పాపముగలవారి పఙ్క్తిలో భుజించినయెడ బాప మంటునని తాత్పర్యము.“తతోగ్నినా భస్మనాచస్తంభేన సలిలేన చ, ద్వారేణైవ చ మార్గేణ పఙ్క్తిభేదం చరేద్బుధః.” అనఁగా కాబట్టి యగ్నిచేనైనను భస్మచేనైనను స్తంభముచేనైనను జలముపోసియైనను ద్వారముచేనైనను మధ్యమందు దారివదలి యైనను దనకు నితరులకు వ్యవధానము గలుగజేసి పఙ్క్తిలో భుజించునది. కేశము చీమలు నీగెలు మొదలగువానితో గలసి పక్వమైనయన్నము వర్జింపవలెను. వండిన పైని కేశపిపీలికాకీటమక్షికాదులంటినను గోవు మూర్కొనినను నట్టియన్నమందు జలము భస్మమృత్తికయైననువేసి వాని శుద్ధిచేయవలెను. అని విజ్ఞానేశ్వరుఁడు చెప్పెను. శూద్రుని యన్నము శూద్రునిచే వడ్డింపఁబడిన బ్రాహ్మణాన్నమును రాత్రివండి ప్రాతః కాలము వరకునుంచిన పర్యుషితాన్నమును రజస్వల చండాలుఁడు పతితుఁడు మొదలగువారు చూచినయన్నము కాకి మొదలగునవి ముట్టినయన్నము భుజింపఁ

గూడదు. తైలపక్వమును పెరుగు మీగడ మొదలగునదియు రాత్రి పర్యుషిత మైనను గ్రహింపవచ్చును. గోవు గేదే మేక వీనికి వత్సమృతినొందినను బ్రసవించిన పది దినముల లోపుగనైనను గర్భిణియై యున్నపుడు నొకపూటయే పాలు, బిదుక వలసి వచ్చినపుడును కవలుపుట్టినను సిరలము కెపుడు స్రవించిచున్నను మేకల తప్ప దక్కిన వాటికి రెండు సిరాలున్నను వాటిపాలు వర్జింపవలెను. మరియు లోటిపిట గుఱ్ఱము గొఱ్ఱెయు నడివి జంతువులు వీటిపాలు వర్జింపవలెను. శిగ్రు ఇంగువదప్ప తక్కిన యెఱ్ఱనైనచెట్టు బంకయు నపరిశుద్ధస్థలమందు బుట్టిన చిఱ్ఱికూర మొదలగునవి యును దేవతా నివేదనము నుద్దేశింపని పిండివంట పాయసము చక్కిలములు నప్పాలు పులగము మొదలగునవి వర్జింపవలెను. గోగు, కుసుంభము, ఆనబ, వంగ, నక్కెరచెట్టు, మఱ్ఱి, మొదలగువాని ఫలములును తురంజీదబ్బ పండ్లును వర్జింపవలెను. నీరుల్లి, వెల్లుల్లి, గంజాయి దీని భక్షించినచో చాంద్రాయాణము జేయునది. భుజించునపుఁడొకఁడేని ముట్టినచో నన్నము వర్జింపవలెను. అట్లుచేయక అన్న పాత్రలోనుండు నాయన్నము భక్షించినచో స్నానముజేసి నూటయెన్మిది మారులు గాయత్రి జపించునది. అధికము వడ్డించుకొని భుజించిన సహస్రగాయత్రీ జపము. భుజింపుచుండగ మైలబట్టగట్టియున్న బ్రాహ్మణుఁడు ముట్టినచో నన్నము విడువవ వెలను. భుజించి యెంగిలి గడగికొనకమున్ను పవర్ణుఁడు ముట్టినచో స్నానము, జపమైనను జేయునది. అసవర్ణుడు ముట్టినచో నుపవాసము. అందు శూద్రుఁడు ముట్టినచో నుపవసించి పంచగవ్య భక్షణమును జేయవలెను. చాకలి మొదలగువాఁ డు ముట్టినచో ద్రితాత్రోపవాసము. వడ్డించువాని భుజించువాఁడు ముట్టినచో పాలు పెరుగు నేయి మొదలగు లఘుద్రవ్యములను త్యజింపకమే యాచమనముజేసి శుద్ధుఁ డగును. భక్ష్యాద్యన్నమైనచో విడువవలెను. వస్త్రము విడుచుట వికల్పము. స్త్రీలకు వడ్డించునపుడు రజోదర్శనమైన యెడ నపుడు ముట్టినయన్నము విడువవలెను. భోజనాంతమందు భక్షింపగ మిగిలియన్నమును "రౌరవేపూయ నిలయే పర్మార్బుద నివాసినాం, ప్రాణినాం సర్వభూతానా మక్షయ్య ముపతిష్ఠతు" అని యుచ్చరింపుచు నీవలెను. "శ్లో. ఆచాంతో ప్యశుచిస్తావ ద్యావత్పాత్ర మనుద్ధృతం, ఉద్ధృతేప్య శుచిస్తావ ద్యావన్నోన్మృజ్యతేమహీ." అనఁగా దాను శుద్ధాచమనము జేసినను భోజన పాత్రము దీసివేసి భూమి యలికెడువరకు నశుచియే యగును. "శ్లో. పర్ణస్యాగ్రంచ మూలం చ సిరాం చైవ విశేషతః, చూర్ణపర్ణం వర్జయిత్వా తాంబూలం ఖాదయే ర్బుధః" అనఁగా బుధుఁడు తమ్మలపాకు తుదయు మొదలును నరములను దీసి వేసియు సున్నముంచిన యాకు విడిచియు తాంబూలము భక్షింపవలెననుట. 'అనిధాయ ముఖే పర్ణం పూగం వై భక్షయేన్నచ' అనఁగా తమలపాకు ముఖమందుంచక పోకచెక్క భక్షింపగూడదని ఇది పంచమభాగమందు జేయునది.

## సాయం సంధ్య

"ఇతిహాసపురాణాద్యైష్షష్ఠసప్తమకౌనయేత్, అష్టమే లోకయాత్రాతు బహిస్సంధ్యా తతఃపునః" అనఁగా నితిహాసపురాణాదులచే నారవభాగము నేడవభాగము నడప

వలెను. ఇఁక నెనిమిదవభాగమందు లోకయాత్ర యనఁగా బంధువులను పెద్దలను జూచుట మొదలగు లౌకిక కార్యముల జేయుట తిరుగ సాయంసంధ్యకు బాహ్యమైన జలతీరము జేరుటయు సాయంసంధ్య ప్రాతస్సంధ్యవలెనే చేయవలెను. 'అగ్నిశ్చ మాక్షన్యుశ్చ మన్యుపతయశ్చ మన్యుకృతేభ్యః, పాపేభ్యో రక్షంతాం, మనసా వాచా హస్తాభ్యాం, పద్భ్యాముదరేణశిశ్నా, అహస్తదవలుంపతు, యత్కించ దురితంమయి, ఇదమహం మామమృతయోనౌ, సత్యేజ్యోతిషిజుహోమిస్వాహా' యని మంత్రాచమన మందు విశేషము. పశ్చిమాభిముఖముగ నిలచియుండి యర్ఘ్య మియావలెను. గొంతుగ గూర్చుండి పశ్చిమముఖముగనే గాయత్రీజపము జేయవలెను. సాయం కాలహోమము మీఁదఁజెప్పబడినది. సాయంవైశ్వదేవము జేయుచో పునఃపాకము అథితిని బూజించి మూఁడుగడియలకు బైని జామువరకులోగా భుజించి శయనించు నది. భుజించునపుడు దీపము శాంతించినచో భోజనపాత్రను స్పృశించియేయుండి సూర్యుని స్మరింపుచుఁ దిరుగ దివముజూచి పాత్రలోనున్నది మాత్రమే భుజించునది. శ్రాద్ధదినమందును తత్పూర్వదినమందును వ్యతీపాతవైధృతి సంక్రాంతి దినములం దును రాత్రిభోజనము వర్జ్యము. "చతుర్థప్రథమౌ యామౌ విద్యాభ్యాసైర్నయేన్నిశి, ప్రహరద్వయశాయీతు బ్రహ్మభూయాయకల్పతే," అనఁగా రాత్రి మొదటిజామును నాల్గవజామును విద్యాభ్యాసముతో నడపి తక్కిన రెండుజాములు నిద్రించువాఁడు ముక్తికర్హుఁడగును. తూర్పుదక్షిణము పశ్చిమము తలాడగ నిద్రింపవచ్చును. ఉత్తర శిరస్సుగ నెపుడు నిద్రింపఁగూడదు. రాత్రి సూక్తము జపించి సుఖశాయుల స్మరించి విష్ణునకు నమస్కరించి నిదురింపవలెను. సుఖశాయు లెవ్వరనిన; "అగస్త్యిర్మాధవశ్చైవ ముచికుందో మహామునిః, కపిలో మునిరాస్తీకః పరచైతే సుఖశాయినః" అనఁగా నగస్తిమునియు మాధవుఁడును ముచికుందమహామునియు గపిలమునియు నస్తీకుఁ డును నీయైదుగురు సుఖశాయులు. ఇఁక సంధ్యాకాలమందును ధాన్యమందును గోస్థానమందు దేవతలకు బ్రాహ్మణులకు గురువులకు ముందుగా నున్నత ప్రదేశ మందును నెంగిలిగలిగియు నగ్నత గలిగియు పగటియందును నిద్రింపగూడదు. నిద్రించునపుడు ముఖమందు తాంబూలమును శయ్యనుండి స్త్రీని ఫాలమునుండి తిలకమును శిరసుపై పుష్పమును దొలగించి నిద్రించవలెను. గర్భాదాన ప్రకరణ మందుఁజెప్పఁబడిన ఋతుదినములలో జామున్నరయైన పైని దీపముండినను లేకున్నను నివీతమైన యుపవీతము కంఠమునజుట్టి పత్నీ సంగమము జేయునది. "అష్టమ్యాంచ చతుర్దశ్యాం దివాపర్వణి మైథునం కృత్వా సచేలం స్నాత్వాతు వారుణీ భిశ్చ మార్జయేత." పునర్మామైతు అని జపముమీఁదఁ జెప్పఁబడినదే. ఇట్లు స్నానభోజ నాది రూపమై బహువిధ నిషేధములచే నాకులమైన యాహ్నికకర్మ యందు న్యూనాధిక దోషము విధి నిషేధాతిక్రమ దోషమును బరిహరించుటకు బ్రాయశ్చిత్తము దెలియనిచో దత్సాంగతాసిద్ధికై ప్రాయశ్చిత్త సాంగతాసిద్ధికిని విష్ణునామోచ్చారణాదికము జేయునది. "ప్రాయశ్చిత్తాన్య శేషాణి తపః కర్మాత్మకాని చ, యాని తేషా మశేషాణాం కృష్ణాను స్మరణం పరం. యస్యస్మృత్యాచ నామోక్త్యా తపోహోమ క్రియాదిషు, న్యూనం సంపూ

ర్ణతాం యాతి సద్యోవందేత మచ్యుతం నామ్నోప్తి యావతీశక్తిః పాపనిర్హరణే హరేః తావత్కర్తుం సశక్నోతి పాతకం పాతకీజనః" అనగా తపఃకర్మ స్వరూపములయిన సమస్త ప్రాయశ్చిత్తములలోను కృష్ణానుస్మరణము సర్వోత్కృష్ట మనియు నేదేవుని స్మరణము నామోచ్చారణమును తపోహోమాది సమస్తకర్మలయొక్క లోపము ద్రోసి పూర్తిజేయునో యట్టి విష్ణుదేవు నమస్కరింతుననియు భగవంతుని నామోచ్చార మెంత పాపము నశింపజేయునో యంతపాపమును దుర్జనుఁడైనను జేయ సమర్థుఁడు గాడనియు దాత్పర్యము. మరియును "యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసిచ, యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణం." అనగా నేకర్మ యుచితమని చేసినను నేమి భుజించినను నేమి వ్రేల్చినను నేమి దానము జేసినను నేమి తపస్సు జేసినను నదియంతయు నాకర్పితము సేయుమని భగవద్వాక్యమున్నందున లౌకికముగాని వైదికముగాని యగు కర్మయంతయు నీశ్వరుని కర్పించవలెను. ఒక్కమారుగ సర్వకర్మ నర్పించుటకు మంత్రము. "కామతోఽ కామతోవాపి యత్కరోమి శుభాశుభం, తత్స ర్వం త్వయి సంన్యస్తం త్వత్ప్రయుక్తః కరోమ్యహం" బుద్ధిపూర్వముగనైన నబుద్ధి పూర్వముగనైన శుభాశుభ రూపమైన యేకర్మను నీచే బ్రేరితుడనై చేసితినో యది యంతయు నీ కర్పింపబడినదని తాత్పర్యము. "అపార మాహ్నికం కర్మ గహనం బహు భేదయుక్. నిశ్శేష మక్షమోవక్తుం యథా మత్యవదల్లఘు, అనంతోపాధ్యాయజనిః కాశీనాథాభిధస్సుధీః, తుష్యతాం తేన భగవాన్ శ్రీనాథో విఠ్ఠలః ప్రభుః" అనఁగా నీయాహ్నిక కర్మయపారము బహుభేదములుగలది గనుక యావత్తును జెప్పుట కశక్తుఁడనై సంక్షేపముగ జెప్పితిని యనంతోపాధ్యాయ పుత్రుడను కాశీనాథనామ దేయుడను దీనిచే విఠ్ఠలస్వామి ప్రీతినొందుగాక యని గ్రంథకర్త ప్రకరణాంతమున జేసిన మంగళము.

ఇట్లనంతోపాధ్యాయసూనుఁడగు కాశీనాథపండితునిచే రచియింపఁబడిన
ధర్మసిందు సారమున నాహ్ని కాచార ప్రకరణము ముగిసెను.

శ్రీరస్తు

# తృతీయపరిచ్ఛేదము

## కామ్యనైమిత్తిక కర్మ ప్రారంభము

శ్లో. అవశ్యం ప్రత్యహం కృత్య ముక్త్వా తచ్ఛేష ఉచ్యతే, కామ్యం నైమిత్తికం చాపి ప్రాయస్సింధుక్రమాదథ." అనఁగా నావశ్యకమైన యాహ్నిక కృత్యము జెప్పి దానికంగమైన కామ్య నైమిత్తిక కర్మలు నిర్ణయసింధూక్తమైన క్రమముచే జెప్పఃబడునని భావము.

### ఆధాన విచారము

అందు నక్షత్రాది కాలవిచారము ప్రథమపరిచ్ఛేదమందుఁ జెప్పఁబడినది. ఆవసథ్యాగ్న్యాధానము వివాహమైన పైనిగాని విభక్తులైన పైనిగాని చేయునది. "అగ్ని రైవ్వవాహికో యేన నగృహీతః ప్రమాదినా, పితర్యుపరతే తేన గృహీతవ్యః ప్రయత్నతః

" అని వచనమనఁగా వివాహాగ్ని బ్రమాదమున స్థాపించియుండకున్నను దండ్రి మృతుఁడైన పై నైనను దిరుగ గ్రహింపక దప్పదు. గృహ్యాగ్ని లేకున్నవాని యన్నము భుజింపగూడదు, తండ్రిగాని జ్యేష్ఠుఁడుగాని సాగ్నికుఁడై యున్నచో నవిభక్తకనిష్ఠున కగ్నిలేకున్నను దోషములేదు. ఇట్లు జ్ఞానాధ్యయనాదులయందు నిష్ఠగలవానికిని దోషము లేదు. గృహస్థునికి గూడ నధ్యయనము విధింపఁబడినది. స్మార్తాధానము గూడ జ్యేష్ఠుఁడు చేయక మున్నుగ గనిష్ఠుఁడు చేయఁగూడదని గార్గ్యవచనము సింధువు నం దున్నది, ఇక్కడ నిట్లు నిర్ణయము తెలియఁబడును. ఎట్లనిన; జ్యేష్ఠుఁడు దాయాద్య పక్షము నవలంబించి వివాహకాలమందు 'యావ జ్జీవమౌపాసనం కరిష్యే' యని సంకల్పముతో వివాహాగ్ని గ్రహింపని యెడ గనిష్ఠునకు నిషేధముగాని, జ్యేష్ఠుడట్లు వివాహాగ్ని గ్రహించి యనంతరమున బరిచర్య జేయలేక మానినను గనిష్ఠుఁ డగ్న్యాధానము జేయవచ్చును. దోషమేమియులేదని, అపు డాకర్మకధికారులు, జ్యేష్ఠుని యనుమతిచే గనిష్ఠుఁ డాధానము జేయవచ్చును. వివాహము మాత్రమట్లుగాదు. మరేమనిన జ్యేష్ఠునికి వివాహమైనపైనే కనిష్ఠునికి గావలెను. ఇట్లు తండ్రి యనుజ్ఞచే గూడ నాధానము గూడదు. "సన్యస్తచ్ఛిన్నహస్తాదౌ యద్వా షండాదిదూషణే, జనకే సోదరే జ్యేష్ఠేకుర్యాదేవేతరః క్రియాం" అనఁగా దండ్రిగాని జ్యేష్ఠుఁడుగాని సన్యసించి పుడును కాలుసేతులు చెడినప్పుడును నపుంసకత్వాది దోషములు గల్గియుండినను గణిష్ఠపుత్రులు నగ్నికర్మాధానము జేయవచ్చునని మీఁదఁజెప్పఁబడెను.

## శూద్రసంస్కార విచారము

అందు ద్విజునకు గర్భాధానము, పుంసవనము, అనవలోభనము, సీమంతోన్న యనము, జాతకర్మ, నామకర్మ, నిష్క్రమణము, అన్నప్రాశనము, చౌలము, ఉపనయ నము, మహానామ్న్యాది వ్రతచతుష్టయము, సమావర్తనము, వివాహము నని పదియారు సంస్కారములు ద్విజులకు విధింపఁబడినది. జాతకర్మ, నామకర్మ, నిష్క్ర మణము, అన్నప్రాశనపము, చూడాకర్మ, వివాహము నని యారు సంస్కారములు ద్విజ స్త్రీలకు విధింపఁబడినవి. అందు వివాహము మాత్రము మంత్రసమితము. ఇతరములు మంత్రరహితములు. గర్భాధానసీమంతములు స్త్రీపురుష సాధారణములు ఇఁక బదారింటిలో చూడాకర్మాంతములైన దొమ్మిదియు వివాహమునను పదికర్మలు వేదమంత్ర రహితముగాఁ జేయవలెనని శూద్రునికి విధింపఁబడినవి. అని బహుసమ్మ తము. శూద్రకమలాకరమందు శూద్రులకు పంచమహాయజ్ఞములు సహితము చెప్పఁ బడినవి. కొందరు వేదోక్తముగాని మంత్రములచే నుపనయము గూడ గూడునని చెప్పిరి. బ్రహ్మపురాణమందు 'వివాహమంత్రం సంస్కారం శూద్రోపి లభతాం సదా' అని వివాహ సంస్కారము మాత్రమే శూద్రునకు విధింపఁబడి యున్నది. అందు సద సచ్ఛూద్రుల విషయమనఁగా గుణశీలవృత్తములచే యోగ్యులగు శూద్రులకు ననేక సంస్కారములనియు నన్యులకు వివాహమాత్రమే యనియైనను పరంపరాగత వ్యవస్థ చేయునది. శూద్రునికి ద్విజసేవమాత్రమే వృత్తి యనఁగా జీవిక యని యర్థము. ఆపత్తునందు క్రయ విక్రయ వ్యవహారముగాని శిల్పాదులు గాని చేయునది.

శూద్రుఁడు లవణము మొదలగునవియు నమ్మవచ్చును గాని మద్యము మాంసమును గూడదు. మరియును, "కపిలాక్షీర పానేన, బ్రాహ్మణీ గమనేనచ, వేదాక్షర విచారేణ శూద్ర శ్చండాలతాం వ్రజేత్" అనఁగా కపిల గోవు పాలు ద్రాగినను బ్రాహ్మణ స్త్రీసంగమము జేసినను వేద మభ్యసించినను శూద్రుడు చండాలత్వమునొందునని, శూద్రవర్ణము నాల్గవదియైనప్పటికిని వర్ణమగుటచే ధర్మము చేయదగినది. వేదమంత్రము స్వధాకారము, స్వాహాకారము వషట్కారము మొదలగు వైదికోచ్చారణ ములు గూడదు. మరియెట్లనిన స్త్రీ శూద్రులు వ్రతాదిధర్మము జేయు నపుడు బ్రాహ్మనునిచే మంత్రము బఠింపఁజేయవలెను. అదియను బురాణములలో మంత్రమేకాని వేదముగాదు. భారతముగాని పురాణముగాని విప్రద్వారముగా విను టకే యధికారముగాని చదువుటకుగాదు. ఇట్లు వచనము "శ్రావయేచ్చతురోవర్ణాన్, కృత్వా బ్రాహ్మణమగ్రతః" అని. శూద్రునికి పంచమహాయజ్ఞశ్రాద్ధాదికర్మలు కాత్యాన సూత్రప్రకారముగ దగునని మయూఖమం దున్నది. ఆగమోక్తములైన విష్ణుమంత్ర ములుగాని శివమంత్రములుగాని నమశ్శబ్దమంత్రముగ నున్నవి. ప్రణవము లేకుండఁ గ నుపదేశింపవచ్చును. పురాణము మొదలగునవి వినుటచే శ్రవణము మననము నిది ధ్యాసనముజేసి బ్రహ్మజ్ఞానము స్త్రీశూద్రులు సంపాదించుకొనవచ్చును. 'ఉపనిష త్తులు' వినుటకు మాత్ర మధికారములేదని 'శుగస్యతదనాదర శ్రవణాత్తదా ద్రవణా త్సూచ్యతేహి' యను నపశూద్రాదికరణమం దుత్తరమీమాంసలో నిర్ణయింపఁబడి నది. శూద్రునికన్ని శ్రాద్ధములు నామమనఁగ బక్వముగాకుండు బియ్యము మొదలగు వాని చేతనే చేయదగును. కొందరు ప్రజలందరును గశ్యపసంతతియే కనుక శూద్రు లకు గాశ్యపగోత్రము. అదియును శ్రాద్ధము జేయునపుడెయుచ్చరింపవలెనని యంద్రు. ఇట్లు శాంతికపౌష్టిక కర్మలును బ్రాహ్మణద్వారముగ జేయవచ్చును. ఒకవేళ బ్రాహ్మణుఁడు శూద్రునికై ధనము పుచ్చుకొని వేదమంత్రములచే హోమము నభిషేకము మొదలగునవి చేసెనేని శూద్రున కా పుణ్యఫల మగునుగాని విప్రునికి బ్రత్యవాయమగునని మాధవుఁడు సెప్పెను. అహింసయు, సత్యము, చౌర్యము లేకుండుటయు, శుచిత్వము నింద్రియనిగ్రహము, దానము, శమము, దమము, క్షమయు, మొదలగునవి శూద్రులు మొదలుగ సర్వవర్ణములకు సాధారణమైన ధర్మ ములుత్తమగతి నిచ్చును. శూద్రునికి స్వస్తివాచనము మొదలగు కర్మల ప్రయోగము శూద్రకమలాకరమందు దెలియునది.

## వాపీకూపాద్యుత్సర్గము

గృహమునకు గాని గ్రామమునకుగాని యాగ్నేయ దక్షిణ నైరృతవాయవ్య దిక్కులందును మధ్యమందును గూపము ద్రవ్వినచో దుష్టఫలము. తక్కిన దిక్కుల శుభము. వాపీకూప తటాకాది ప్రతిష్ఠయుత్తరాయణమందు మాఘము మొదలారు మాసములలో శుక్లపక్షమునందు బ్రశస్తము. జలము క్షయించునని తోచినయెడ గార్తిక మార్గశీర్షములందును గూడును. ఇట్లు వచనము "నకాల నియమస్తత్ర సలిలం

కారణం పరం” అని. చాతుర్మాస్యలయందు శుక్రాస్తమయాదులందును గూడదు. అశ్విని, రోహిణి మృగశీర్ష, పుష్యము, మఘ, ఉత్తర, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర, మూల, శ్రవణము, ధనిష్ఠ, శతభిషము, హస్త, జ్యేష్ఠ, అనూరాధ, రేవతి, యీ నక్షత్రములందును విదియ, తదియ, చవితి, పంచమి, సప్తమి, దశమి, ఏకాదశి, త్రయోదశి, యీతిథులందును బుధ గురు శుక్ర సోమవారములందును జలప్రతిష్ఠ శుభము ప్రతష్ఠింపకున్న యెడ జలము గ్రహింపఁగూడదు. ఇట్లు వచనము “వాపీ కూపతటాకాదౌ యజ్జలం స్యాదసంస్కృతం, నస్ప్రష్టవ్యం న పేయం చీపత్వా, చాంద్రా యణం చరేత్” అనఁగా బ్రతిష్ఠజేసి విడువకయున్న వాపీకూపాదుల యుదకము ముట్టినను ద్రావినను చాంద్రాయణము జేయునది ప్రతిష్ఠిలకు బ్రయోగము గ్రంథాం తరమందు దెలియునది.

## తోటలు మొలిపించుట

తోటవేయుటకు అశ్విని, రోహిణి, మృగశీర్ష, పుష్యము, మఘ, ఉత్తర, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర, హస్త, చిత్త, విశాఖ, అనూరాధ, మూల, శతభిషజము, రేవతి, యీ నక్షత్రములందు యోగ్యతిథివారములందు వృక్షలతారోపణము ప్రశస్తము. “ఆశ్లేషాయాం సోమవార స్సోమేలగ్నే బలాధికః, యోగేస్మిన్ రోపయేదిక్షుం కదళీ క్రముకాదికాన్” అనఁగా నాశ్రేషా నక్షత్రమందు సోమవారమందు చంద్రుఁడు బల వంతుఁడై లగ్నమందున్నచో చెరుకు అరటిపోకచెట్టు మొదలగునవి మొలవేయవలెను. “నారికేళాన్వపేద్భూమా వశ్విన్యాం లగ్నగేరవౌ, నాగవల్లీం గురౌ లగ్నేచంద్రే చాంశస్థితే సతి.” అనఁగా నశ్వినియందు సూర్యుఁడు లగ్నమందుండఁగ కొబ్బరిచెట్లు పాతింప వలెను. బృహస్పతి లగ్నమందును చంద్రుండు లగ్నాంశయందు నున్నపుడు తమల పాకుతీగెలు మొలిపించవలెను.

## మూర్తి ప్రతిష్ఠ

“శ్లో. ప్రతిష్ఠాసర్వదేవానాం వైశాఖ జ్యేష్ఠఫాల్గుణే, చైత్రేతు స్యాద్వికల్పేన మాఘే విష్ణ్వన్యమూర్తిషు. సౌమ్యాయనే శుభాప్రోక్తా నిందితా దక్షిణాయనే” అనఁగా సమస్త దేవతా మూర్తులకును వైశాఖ జ్యేష్ఠ ఫాల్గుణమాసములందు బ్రతిష్ఠ శుభము. చైత్ర మాసమందు వైకల్పికము మాఘమందు విష్ణునకు దప్ప నన్యులకు శుభము ఉత్తరా యణమందు శుభము దక్షిణాయనమందు నిషిద్ధము. “మాతృభైరవ వారాహ నరసింహ త్రివిక్రమాః, దక్షిణేప్యయనే స్థాప్యా దేవ్యశ్చేత్యూచిరేపరే.” అనఁగా సప్తమాతృ కలు భైరవుఁడు వరాహమూర్తియు నృసింహమూర్తియు త్రివిక్రమమూర్తి దేవీమూర్తియు దక్షినాయనమందు సహితము స్థాపింపవచ్చునని కొందరు. “విష్ణోశ్చ స్థాశ్చైత్ర మాసాశ్విన శ్రావణాకా అపి, మాఘఫాల్గుణ వైశాఖ జ్యేష్ఠాషాఢ సహస్సుచ, శ్రావణేచ న భస్యే చ లింగస్థాపన ముత్తమం.” అనఁగా ‘విష్ణుస్థాపనమునకు చైత్రము నాశ్వినము శ్రావణముగూడఁ బ్రశస్తము. శివలింగము స్థాపించుటకు మాఘఫాల్గుణవైశాఖ జ్యేష్ఠాషాఢ మార్గశీర్ష శ్రావణ భాద్రపదములు ప్రశస్తములు. ‘దేవ్యామాఘేశ్వినే మాసే

ప్యుత్తమా సర్వకామదా' అనఁగా దేవీ ప్రతిష్ఠకు యుత్తరాషాఢ, యుత్తరాభాద్ర, మృగ శీర్ష, పునర్వసు, పుష్యము, హస్త, చిత్ర, స్వాతి, యనూరాధ, శ్రవణ, ధనిష్ఠ, శతభిషము, రేవతియు నీ నక్షత్రములందును శనిభౌమవారములు దప్ప తక్కిన వారములందును దర్శరిక్తాతిరిక్త తిథియందును సర్వదేవతా ప్రతిష్ఠశుభము. శ్రవణమందును కృత్తికాది విశాఖాంతనక్షత్రములందును ద్వాదశియందును విష్ణుప్రతిష్ఠ శుభము. చవితి గణేశ ప్రతిష్ఠకు శుభము. నవమియు మూలనక్షత్రమును దేవీ ప్రతిష్ఠకు మంచివి. అట్లు తమతమ నక్షత్రము లాయాదేవతలకు మంచివి, ఎట్లనిన; ఆర్ద్ర శివునికి, హస్త సూర్యునికి, నని మొదలుగ దెలియునవి. "శ్లో. హంత్యర్థహీనాకర్తారం మంత్రహీనా తు ఋత్విజం, స్త్రియం లక్షనహీనా తు న ప్రతిష్ఠాసమోరిపుః" అనఁగా ధనహీనమైన ప్రతిష్ఠకర్త కశుభము. మంత్రహీనమైనచో ఋత్విజున కనిష్ఠము ప్రతిమలక్షణహీన మైనచో స్త్రీకి హానియగు గనుక బ్రతిష్ఠవంటి శత్రువుఁడులేదని "బ్రహ్మాతు బ్రాహ్మణై స్థాప్యో గాయత్రీ సహితః ప్రభుః సర్వవర్ణైస్తథా విష్ణుః ప్రతిష్ఠాప్య స్సుఖార్థిభిః" అనఁగా బ్రహ్మదేవుఁడు గాయత్రీ దేవితో గూడినట్లు బ్రాహ్మణులచే స్థాపింపఁబడ వలెను. అట్లు విష్ణుప్రతిమయు సుఖార్థులైన సర్వజనులచే స్థాపింపఁదగును. పురాణ ప్రసిద్ధమైన జీర్ణలింగమును స్త్రీ శూద్రులు సహితము పూజింపవచ్చును. "నూతనస్థాపి తం లింగం స్త్రీ శూద్రోవాపి న స్పృశేత్." అనఁగా నవీన ప్రతిష్ఠియందు స్త్రీ శూద్రుల కధికారము. లేదు. "శూద్రోవానుపనీతోవా స్త్రియోవాపతితోపిఽ వా, కేశవంవాశివం వాపి స్పృష్ట్వా నరకమశ్నుతే" అనఁగా శూద్రుఁడు ననుపనీతుఁడు స్త్రీలు పతితులును శివవిష్ణు ప్రతిమల బూజింపఁగూడదు. స్పృశించినయెడ నరకమువచ్చును. తూర్పు మొగముగ నున్నస్థిర ప్రతిమలను దానుత్తరముఖుఁడై పూజింపవలెను. చలప్రతిమ లైనచో బ్రాహ్మణుఁడే యర్చింపవలెను. "సౌవర్ణీ రాజతీతామ్రీ మృణ్మయీ ప్రతిమా భవేత్, పాషాణ ధాతుముక్తానాం కాంస్యపిత్తల యోరపి." అనఁగా బంగారు వెండి రాగి మృత్తిక రాయి ధాతువులు ముత్తెము కంచు యిత్తడి వీటివే ప్రతిమనుజేయవలెను. "అంగుష్ఠపర్వమానా త్స్వాతస్తిం యావదేవతు, గృహేషు ప్రతిమాకార్యా నాధికాశస్యేతే బుధైః" అనఁగా నంగుష్ఠపర్వమంత పొడవు మొదలుకొని పంద్రెండంగులముల పర్యంతము పొడవుగలది ప్రతిమగృహమందు బూజింపవలసినది యధికము గూడదు. కొందరు మృత్తికయు కట్టయు లక్క గోరోచనము మైనము వీనిచే ప్రతిమను జేయవచ్చునంద్రు. శ్రీభాగవతమందు 'శైలీదారుమయీలౌహీ లేప్యా లేఖ్యాచ సైకతీ, మనోమయీ మణిమయీ ప్రతిమాష్టవిధా స్మృతా' అనఁగా శిలామయము దారువనఁ గా నిప్పకర్రచే నిర్మించినది లోహమయనఁగ సువర్ణవికారము లేప్యయన చందనాదు లచే వ్రాయఁబడినది. ఆలేఖ్యమనఁగా జిత్తరువును నిసుకచే నిర్మించినదియు నని యెనిమిది విధములు దేవతాప్రతిమ యగును. ఏడంగులములు పొడవు మొదలుకొని పంద్రెండంగులములవరకు గృహప్రతిమ నుండవలెనని దేవీపురాణమందున్నది. "అర్చకస్య తపోయోగా దర్చనస్యాతి శాయానాత్, ఆభిరూప్యాచ్చ బింబానాం దేవస్సా న్నిధ్య మృచ్ఛతి." అనఁగా పూజించువాని తపోతిశయము నుండియు పూజావిధియొక్క

విస్తారమునుండియు ప్రతిమలయొక్క సులక్షణత్వమునుండియు దేవతాసాన్నిధ్యము గలుగునని. "ప్రతిమాపట్టయంత్రాణాం నిత్యం స్నానం న కారయేత్, కారయేత్పర్వ దివసే యదా చ మలధారణం. అనఁగా ప్రతిమలకు పట్టములకు యంత్రములకును నిత్యము స్నాన మక్కరలేదు. మరి యేమనిన, పర్వములందును మాలిన్యము గలుగు నపుడును స్నానము జేయించునది. పార్థివలింగ పూజాదివిచారము ద్వితీయ పరిచ్ఛేద మందు జెప్పబడినది.

## పంచసూత్రీ నిర్ణయము

లింగముయొక్క పొడవును లింగము వెడల్పు లింగమువలమును పీఠము వెడల్పును సోమసూత్రము కొలతయు నని పంచసూత్రములు. అందు లింగము శిరస్సునందు విస్తారము లింగము పొడవుతో సమమగ జేసిదానికి మూఁడురెట్లు సూత్రము జుట్టుటకు దగునట్లు లింగము యొక్క వలముజేసి లింగముచుట్టును లింగవిస్తారముతో సమమైన విస్తారము గలిగి వర్తుల మనఁగ గుండ్రమైన పీఠముఁ జేయవలెను. పీఠము పొడవు లింగము పొడవునకు ద్విగుణమై యుండవలెను. పీఠము ప్రక్కనంటి యుత్తరభాగమున బ్రణాళియనఁగ సోమసూత్రము లింగము పొడవుతో సమమైన పొడవును మొదటిభాగమున నట్టిపొడవుతో సమమైన కొలతగల వెడల్పును గలదియై తుదిని దానిలోసగము వెడలుపుగలుగునటుల తగ్గించి కాలువ వలె సోమసూత్రముఁ జేయవలెను. పీఠము పొడవు లింగము పొడవునకు ద్విగుణమై యుండవలెను. పీఠము ప్రక్కనంటియుత్తరభాగమున బ్రణాళియనఁగ సోమ సూత్రముఁ జేయవలెను. లింగముపొడవునకు మూఁడు రెట్టులు పీఠము పొడవుండ వలెనని కొందరు. ఇంకపీఠము మధ్యమందు లింగమునకంటె రెండు రెట్టులు మాత్రము వలమగునట్లు పీఠము పొడవులో మూఁడవవంతు కంఠాకారముగఁ జేయ వలెను. కంఠమునకు మనూర్ధ్వోభాగమలందు సమమైన యొడ్డులేర్పరచి పీఠము పై భాగమున లింగవిస్తారములో నారవభాగమునకు సరిగా మేఖలవలె చుట్టును మెరకవదలి దానిప్రక్కను దానితోసమమైన లోతుగ బల్లము చేయవలెను. ప్రణాళికయందుగూడ వెలుపులో మూఁడవవంతు లోతుగలపల్లము చేయవలెను. పీఠమందువలె మేఖలయుగూడ నేర్పరచవలెనని. పంచసూత్ర నిర్ణయము. "గృహే లింగద్వయం నార్చ్యం సాలగ్రామద్వయంతథా, ద్వేచక్రే ద్వారకాయాస్తు నార్చేత్సూర్య ద్వయం తథా, శక్తిత్రయం త్రివిఘ్నేశం ద్వౌశం ఖానార్చయేత్సుధీ." అనఁగా రెండు శివలింగములును గూడదు. రెండు సాలగ్రామములును గూడదు. ద్వారకాచక్రము లును గూడదు. సూర్యాధిష్ఠానములు రెండుగూడదు. శక్త్యధిష్టానములు మూఁడు గూడదు. విఘ్నేశాధిష్ఠానములు నట్లు గూడదు. శంఖములు రెండు గూడదు. అనఁ గా గృహమందు జేయు దేవతార్చనములలో నిట్టిసంఖ్య యుంచగూడదని తాత్పర్యము గ్రంథాంతరమందు 'చక్రాంక మిథునం పూజ్యం నైకం చక్రాంక మర్చయేత్' అని యున్నది. అనఁగా ద్వారకాచక్ర మొకటిగూడదు. రెండు పూజింపవలెనని యున్నది

గనుక దాని సంఖ్యకు వికల్పమని యూహించునది. "నార్చయేచ్చ తథామత్స్య కూర్మాది దశకంగృహే" అనఁగా మత్స్యకూర్మాది దశావతారములను గృహమందేక కాలమం దర్చింపఁగూడదు 'అగ్ని దగ్ధాశ్చ భగ్నాశ్చ నపూజ్యాః ప్రతిమాగృహే, భగ్నా వాస్ఫుటితా వాపి సాలగ్రామ శిలాశుభా, సాలగ్రామా స్సమాః పూజ్యా స్సమేషు ద్వితయం నహి, విషమానైవ పూజ్యంతే విషమేష్వేక ఏవహి."అనఁగా ప్రమాదముచే దహింపఁబడి నవియు విరిగిన యవయవము గల్గినవియు ప్రతిమలు గృహమందుఁబూజింపఁ గూడదు. సాలగ్రామశిలమాత్రము భగ్నమైనను బ్రద్దలైనను పూజింపవచ్చును. సాల గ్రామములు సరిసంఖ్యగలది పూజింపవచ్చును గాని వాటిలో రెండు సాలగ్రామములు గూడదు. విషమసంఖ్యగల విపూజింపఁగూడదు గాని యందు నొక్కటియే యైనచో బూజింపవచ్చునని, సువర్ణముతో సాలగ్రామము దానమిచ్చినచో బృథివీదానఫల మగును. నూరుసాలగ్రామములు పూజించినచో ఫలమనంతము గలుగును. సోదరుల విభక్తులైనను దేవార్చనము నగ్ని హోత్రమును సంధ్యయు బ్రహ్మయజ్ఞమును వేరుగ జేయవలెను. స్త్రీగాని శూద్రుఁడు గాని స్పర్శజేయుచు సాలగ్రామము ద్వారకాచక్రము బాణలింగమును బూజింపఁగూడదు. "శూద్రోవా నుపనీతోవా సధవా విధవాంగనా, దూరాధేవా స్పృశక్ పూజాం ప్రకుర్యాచ్ఛివకృష్ణయోః" శూద్రుఁడు ననువనీతుఁడు పుణ్యస్త్రీగాని విధవస్త్రీగాని దూరమునుండి స్పృశింపకుండఁగ శివవిష్ణుపూజ జేయ వచ్చును. స్పృశింపఁగూడదు. అనఁగా సాలగ్రామము బాణలింగము నట్లు పూజింపఁ గూడదని తాత్పర్యము. ప్రతిమలైనచో బూజింపవచ్చును. అట్లు వచనము – "సర్వవర్ణైస్తు సంపూజ్యాః ప్రతిమాస్సర్వదేవతాః, లింగాన్యపితు పూజ్యాని మణిభిః కల్పితాని చ." అనఁగా స్త్రీ శూద్రులును బ్రతిమలపై సర్వదేవతలను బూజింప వచ్చును. మణులచే నిర్మించిన కృత్రిమలింగములను బూజింపవచ్చునని "సాలగ్రామ శిలాక్రీతా మధ్యమా యాచితాధమా, ఉక్తలక్షణసంపన్నా పారంపర్య క్రమాగతా, ఉత్తమాసాతు విజ్ఞేయా గురుద్త్తాతు తత్సమా." అనఁగా సాలగ్రామము ద్రవ్యమిచ్చి కొన్నది మధ్యమము. యాచింపఁబడినది యధమము. శాస్త్రోక్తలక్షణములుగల్గి పితృ పితామహపరంపరచేఁ బ్రాప్తమైనచో నుత్తమము. లేదా గురువునిచే దత్తమైన నుత్త మమే. "తత్రాప్యామలకీతుల్యా పూజ్యా సూక్ష్మైవ యా భవేత్, యథాయథా శిలాసూక్ష్మా తథా స్యాత్తు మహత్ఫలం." అనఁగా నందులో నుసిరికెకాయయంత పరిమితిగల సాలగ్రామము మరియు నుత్తమము. అట్లెంత సూక్ష్మమైన నంత మహాఫలము గలుగును. "యవమాత్రం తుగర్తస్స్యా ద్యవార్ధంలింగముచ్యతే, శివనాభి రితిఖ్యాత స్త్రిషు లోకేషు దుర్లభః" అనఁగా యవబీజముపాటి గర్తమనఁగ గోయియు నంతలో సగములింగము నున్నచో శివనాభి యనబడును. అది మిగుల దుర్లభము. 'సాలగ్రామ శిలాయాస్తు ప్రతిష్ఠానైవ విధ్యతే, మహాపూజాం తు కృత్వాదౌ పూజయేత్తం తతోబుధః " అనఁగా సాలగ్రామమునకు సంప్రోక్షనాదు లక్కరలేదు. ప్రారంభమందు మహాపూజ మాత్రము జేసి నిత్యము బూజించునది. "బాణలింగాని రాజేంద్రఖ్యాతాని భువనత్రయే, న ప్రతిష్ఠాన సంస్కారస్తేషా మావాహనం తథా" అనఁగా బాణలింగములు దేవతా

సాన్నిధ్యము గలిగి మూఁడులోకముల బ్రసిద్ధములు. కనుక వానికి బ్రాణప్రతిష్టయు సంప్రోక్షణము నావాహనము సహిత మక్కరలేదు. వాసుదేవ, సంకర్షణ ప్రద్యుమ్న, అనిరుద్ధ ఈ నామములుగల సాలగ్రామములు బ్రాహ్మణాది వర్ణములు గ్రమముగ నొక్కొక్కటి యొకరొకరు పూజింపవచ్చును. వాటి లక్షణమెట్లనిన, అయిదు చక్రము లున్నది. యనిరుద్ధమూర్తి యని విచారించినచో "ప్రణవో చ్చారణశ్చైవ సాలగ్రామ శిలార్చనాత్, బ్రాహ్మణీగమ నాచ్చైవ శూద్ర శ్చండాలతాం వ్రజేత్." అని యనఁగా నోంకారము నుచ్చరించిన ననఁగ జపించినను బ్రాహ్మణ స్త్రీసంగము జేసినను సాలగ్రామము నర్చించినను శూద్రుఁడు చండాలత్వ మొందునని యిట్లు నిషేధ మున్నది. ఐనను దీక్షాయుక్తైస్తథా శూద్రైర్మద్య పానవివర్జితైః, కర్తవ్యం బ్రాహ్మణ ద్వారా సాలగ్రామ శిలార్చనం. అనఁగా కాగమదీక్షచే సంస్కరింపఁబడి మద్యపానాది దోషములు ఏక యోగ్యులగు శూద్రులు బ్రాహ్మణుని ద్వారముగ సాలగ్రామార్చనముఁ జేయవచ్చును. "విష్ణుప్రీతికరం నిత్యం తులసీ కాష్ఠచందనం, కార్తికే కేతకీ పుష్పం యేనదత్తం హరేఃకలౌ, దీపదానంచ దేవర్షే తారితం తేన వైకులం." అనఁగా దులసీకాష్ఠముచే దీసినచందనము మొగలిపుష్పము కార్తికమందు దీపదానమును హరికి సమర్పించువాఁడు వంశము దరింపఁ జేయునది. సాలగ్రామ తీర్థమువలె ద్వారకాచక్రతీర్థముగూడ నిత్యము గ్రహింపవలెనని విధింపఁబడినందున నదియు సాలగ్రామముతో బూజిచునది. "అగ్రాహ్యం శివనిర్మాల్యం పత్రం పుష్పం ఫలం జలం, సాలగ్రామస్య సంస్పర్శా త్సర్వం యాతిపవిత్రతాం." అనఁగా కేవలము శివలింగము బూజించినచో పత్రపుష్ప ఫల స్వరూపమైన నిర్మాల్యము గ్రహింప గూడదు. సాలగ్రామముతో చూడ నర్చించినయెడ గ్రహింపవచ్చునని. "మధ్యమానామి కామధ్యే పుష్పం సంగృహ్య పూజయేత్, అంగుష్ఠ తర్జన్య గ్రాభ్యాం నిర్మాల్యమప సారయేత్." అనఁగా నడిమివ్రేలు ననామికయు రెండిటితో బుష్పము దీసి పూజింప వలెను. అంగుష్ఠము దర్జనియుగలపి నిర్మాల్యము దీసివేయవలెను. "వినాభస్మ త్రిపుండ్రేణ వినా రుద్రాక్షమాలాయా, పూజితోపి మహాదేవో నస్యాత్తస్య ఫలప్రదః" అనఁగా భస్మత్రిపుండ్రములు రుద్రాక్షమాలయు ధరించి పూజించినచో మహాదేవుఁడు ప్రసన్నుడగునని "వినామంత్రం నభిభృయాద్రుద్రాక్షాః భువిమానవః" అనఁగా మంత్రోపదేశమొందక రుద్రాక్షమాల ధరింపఁగూడదు. "పంచామృతం పంచగవ్యం స్నానకలే ప్రయోజయేత్." అనఁగా పాలు పెరుగు నేయి, పంచదార తేనె గలిపినచో బంచామృతము పంచగవ్యము ప్రసిద్ధమే అద స్నానకాలమందు వినియోగింపవలెనని "రుద్రాక్షస్య ప్రతిష్ఠాయాం మంత్రం పంచాక్షరం తథా, త్ర్యంబకాదిక మంత్రంచ, తథా తత్రప్రయోజయేత్." అనఁగా రుద్రాక్షమాల ధరించునపుడు పంచాక్షరమంత్రము చేతను త్ర్యంబకాది మంత్రములచేతను బ్రతిష్ఠజేసి ధరింపవలెను. "అష్టోత్తర శతం కుర్యాచ్చతుః పంచాశదేవతు, సప్తవింశతి మానావా మాలా హీనానయుజ్యతే." అనఁగా నూటయెనిమిదైనను నేబదినాలుగైనను నిరువదేడైనను పూసలు గలమాలిక ధరింపవలె నంతకు దక్కువఁగూడదు "సప్తవింశతి రుద్రాక్ష మాలాయా దేహసంస్థయా,

యఃకరోతి నరః పుణ్యం సర్వంకోటి గుణం భవేత్." అనఁగా నిరువదేడుపూసలు గల రుద్రాక్షమాల ధరించి పుణ్యకర్మను జేసెనేని కోటిగుణము ఫలమగునని.

## రుద్రాక్ష తులసీజపమాలా సంస్కారము

కుశోదకముగలపి పంచగవ్యముతో మాలికను గడగి ఓం హ్రీం అం – ఆం– ఇం – ఈం – ఉం – ఊం – ఋం – ౠం – ఌం– ౡం–ఎం – ఐం – ఓం – ఔం – అం – ఆః – కం – ఖం – గం – ఘం – ఙం – చం – ఛం – జం – ఝం – ఞం – టం – ఠం – డం – ఢం – ణం – తం – థం – దం – ధం – నం – పం – ఫం – బం – భం – మం – యం – రం – లం – వం – శం – షం – సం –హం – ళం – క్షం అని యేబది మాతృ కాక్షరములచేతను రావియాకులో నుంచిన మాలయందు న్యసించి ఓం సద్యోజాతం, వామదేవాయ, అఘోరేభ్యో, తత్పురుషాయ, ఈశానస్సర్వవిద్యా యను నైదుమంత్ర ములఁ జపించి సద్యోజాతమంత్రముచే పంచగవ్యమున మాలను బ్రోక్షించి చల్లని యుదకముచే గడగివామదేవ మంత్రముచే గంధమునిచ్చి యఘోరమంత్రముచే ధూపమిచ్చి తత్పురుషమంత్రముచే జందనము గస్తూరియు నంటించి యీశాన మంత్రముచే బ్రతిపూస నభిమంత్రించుట నూరుమారులైన పదిమారులైన జేసి యఘోరమంత్రముచే మేరువు నూరుమారు లభిమంత్రించవలెను. అటుపైని మంత్రము లైదింటిచే పంచోపచారములిచ్చి పూజించవలెనని బోపదేవుఁడు చెప్పెను. "శ్లో. రుద్రాక్షాన్ కంఠదేశే దశనపరిమితాన్ మస్తకేవింశతీద్వే, షట్ షట్ కర్ణప్రదేశే కరయుగళకృతే ద్వాదశ ద్వాదశైవ, బాహ్వోరిందోః కలాభిర్నయన యుగకృతే చైక మేకం శిఖాయాం వక్షస్యష్టాధికం యః కలయతిశతకం, సస్వయం నీలకంఠః"అనఁగా ముప్పదిరెండు కంఠమాలగాను శిరసునందు నలువదియును గర్ణమునందారేసి పూసలు చేతులను పండ్రెండేసి పూసలును బాహువునందు పదారేసియచు, నేత్రములకై యొకటి యొకటి, శిఖయందును వక్షస్థలమందును నూటయెనిమిదేసి పూసలను నిత్యము ధరించువాడు సాక్షాదీశ్వరుఁడే యనుట. రుద్రాక్షదానము జేసినయెడ రుద్ర పదము లభించును. "పంచవింశత్ఫలం లింగే ష్వభ్యం గంకార యేదథ, స్నాపయేత్తిల తైలైశ్చ కయంత్రోద్భవైశ్శివం." అనగా జేతుల యంత్రముచే నలిపిన నువ్వులనూనె యిరువదైదు ఫలములచే లింగమున కభ్యంగము స్నానము జేయింపవలెను. "స్నానం ఫలశతం జ్ఞేయమభ్యంగః పంచవింశతిః, పలానాం ద్విసహస్రేణ మహాస్నానం జలేనతు" అనఁగా స్నానము నూరుఫలముల చేతను నభ్యంగము నిరువదేను ఫలములచేతను దిరుగ రెండువేల ఫలములు జలములచే మహాస్నానము జేయించ వలెను."పయోదధిఘృతక్షౌద్ర శర్కరాద్యైస్తతః క్రమాత్, శివస్య సర్పిషాస్నానం ప్రోక్తం పలశతనవై తావతా మధునాచైవ దధ్నాపి పయసాపి చ, పలసార్ధ సహస్రేణ రనేనై వైక్షవేణ చ, భక్త్యా చోష్ణోదకై శ్శీతోదకై స్సంస్నాపయేచ్ఛివం." అనఁగా క్రమముగా పాలు పెరుగు నేయి తేనె పంచదార మొదలగు నవియు నూరేసి ఫలములచే స్నానము జేయించి భక్తితో నుష్ణోదకములు శీతోదకములు వీనిచే శివునకు స్నాన మర్పించునది.

శ్రీమహావిష్ణుని బూజించునపుడు. "శ్రీ విష్ణుం క్షీరదధ్యాద్యైః క్రమాద్దశ గుణోత్తరైః స్నాపయేత్కించిదుష్ణైశ్చ క్షీరాద్యైః పంచభిస్సమైః" అనఁగా క్షీరము దధి మొదలగు వస్తువులు క్రమముగ నుత్తరోత్తరము పదిరెట్టులు గలుగునట్లు స్నానము చేయించి సమభాగములై కొంచము వెచ్చలైన క్షీరాదులచే పంచామృతస్నానము జేయవలెననుట.

## విష్ణ్వాది పంచాయతనములు

"విష్ణుర్మధ్యే శివేభాస్య సూర్యార్యా ఈశదిక్క్రమాత్, శంభుర్మధ్యే విష్ణుసూర్య గజాస్యార్యాస్తథా క్రమాత్, రవౌ మధ్యగతేరుద్ర గణేశాచ్యుత శక్తయః, మధ్యే దేవీ విష్ణు శివ గణేశ రవయః క్రమాత్, మధ్యే గణపతిర్విష్ణు శివసూర్యాంబికా స్తథా, ఈశానాదిక్రమేణైవ పంచాయతన పంచకం." అనఁగా నొకమూర్తిని ప్రధానముగ మధ్యమందుంచి తక్కిన నాల్గును నీశానదిక్కు మొదలుగ నాల్గుదిక్కుల నుంచవలెను. ఎట్లనిన; విష్ణుని మధ్యమందుంచి విష్ణుపంచాయతనము. అట్లు శివుని మధ్యమం దుంచినయెడ విష్ణు సూర్యగణేశాంబికల నీశానదిక్కు మొదలుగ జుట్టు నిలుపవలెను. ఇది శివపంచాయతనము. సూర్యుని మధ్యమం దుంచునేని రుద్రగణేశ విష్ణుశక్తుల క్రమంబుగ నీశానాది దిక్కుల నుంచవలెను. నిది సూర్యపంచాయతనము. ఇట్లుదేవిని మధ్యమం దుంచునపుడు విష్ణుశివ గణేశసూర్యుల గ్రమమున నుంచవలెను. ఇది దేవీపంచాయతనము. మధ్యమందు గణపతియున్నచో విష్ణు శివసూర్యాంబికల గ్రమం బున నీశానాది దిక్కుల నుంచవలెను. ఇది గణపతి పంచాయతనము.

## కేశవాది నామకమూర్తి ధ్యానశ్లోకములు

ఇక కేశవాదులగు నిరువదినాలుగు మూర్తులకు లక్షణము దెలుపుచోట దేవ శ్లోకములు సింధువునందు వ్యాఖ్యాతములు వాని సంక్షేప మెట్లనిన; "కేశవాదేశ్చతు ర్బాహో ర్దక్షిణోర్ధ్వకరం క్రమాత్, శంఖచక్రగదాపద్మాయుధైః కేశవ ఉచ్యతే, నారాయణః పద్మగదా చక్రశంఖాయుధైః కేశవ ఉచ్యతే, నారాయణః పద్మగదా చక్రశంఖాయుధైః క్రమాత్, మాధవశ్చక్ర శంఖాభ్యాం పద్మేన గదయాభవేత్, గోవిందో గదయాపద్మ శంఖచక్రైః క్రమాద్భవేత్, విష్ణుఃపద్మేన శంఖేన చక్రేణ గదయాక్రమాత్." 3 "శంఖపద్మ గదాచక్రై ర్మధుసూదన ఈరితః, త్రివిక్రమో గదా చక్ర శంఖపద్మ రనుక్రమాత్" 4. "వామన శ్శంఖచక్రాభ్యాం పద్మేన గదయాఽపిచ, చక్రేణ గదయా శంఖఃపద్మాభ్యాం శ్రీధరస్మృతః" 5. "హృషీకేశస్మృతశ్చక్ర పద్మశంఖ గదాయుధైః పద్మనాభః పద్మచక్ర గదాశంఖైః క్రమాత్మ స్మృతః" 6. "దామోదర శ్శంఖ గదా చక్రపద్మై రుదీర్యతే, సంకర్షణ శ్శంఖపద్మ చక్రాయుధ గదాయుధైః" 7. వాసుదేవ శ్చక్రగదా పద్మశంఖాఖ్య లక్షణైః, ప్రద్యుమ్న స్స్యాచ్ఛంఖగదా పద్మచక్రైః క్రమాద్ధృతైః" అని రుద్ధోగదాశంఖ పద్మచక్రై రనుక్రమాత్, పద్మశంఖ గదాచక్రా యుధై స్స్యాత్పురుషోత్తమః9. అధోక్ష జోగదాశంఖ చక్రపద్మైః కరస్థితైః, నరసింహ, పద్మగదా శంఖచక్రాయుధై ర్భవేత్, 10. అచ్యుతః పద్మచక్రాభ్యాం శంఖేన గదయా క్రమాత్, జనార్దన శ్చక్రశంఖ గదా పద్మాఢ్య బాహుభిః 11. ఉపేంద్రో గదయాచక్ర పద్మశంఖాంచితైః కరైః, చక్రపద్మ

గదాశంఖైః కరస్థైస్స్యాత్క్రమాద్ధరిః శ్రీకృష్ణాభ్యోగదాపద్మ చక్రశంఖైః కరస్థైస్స్యాత్క్రమాద్ధరిః శ్రీకృష్ణాభ్యోగదాపద్మ చక్రశంఖై ర్మతోవిభుః, ఇతిప్రోక్తాః కేశవాది చతుర్వింశతి మూర్తయః" అనఁగా నాల్గుభుజములుగల కేశవాది మూర్తులలో మీఁది కుడి హస్తము మొదలుకొని క్రమముగ నాల్గుహస్తములందు శ్లోకములో నిర్ణయించిన శంఖచక్ర గదాపద్మముల క్రమమున్న యెడ నాయామూర్తి యని తెలిసికొనవలెను.

## దేవ ప్రతిష్ఠా ప్రయోగము

దేవ ప్రతిష్ఠాప్రయోగ మెట్లనిన, యజమానుఁడు పండ్రెండుమూరలు మొదలగు పరిమితిగల మండపము నిర్మించి యగ్నిఁ బ్రతిష్ఠించుటకుఁ దూర్పున హస్తప్రమాణముగల కుండముగాని స్థండిలముగాని చేసి మధ్యమందు వేదికను దానిపై సర్వతో భద్రమునుజేసి గ్రహముఖముఁ దలఁచినచో దూర్పునగాని యీశానదిక్కునగాని గ్రహవేదికను జేసి దేవాలయమునుగాని మంటపమునుగాని సంస్కరింపఁదలఁచినచో నైఋతి దిక్కున వాస్తుపీఠముఁజేసి, "అస్యాంమూర్తౌ లింగేవా దేవతాసాన్నిధ్యార్థం దీర్ఘాయుర్లక్ష్మీ సర్వకామ సమృద్ధక్షయ్య సుఖకామోఽ ముదేవమూర్తి ప్రతిష్ఠాం కరిష్యే" యని సంకల్పించి స్వస్తివచనము మొదలుగ నాందీశ్రాద్ధాంత మైన పూని యాచార్యుని నెనమండ్రుగాని నల్వురుగాని ఋత్విజులను వరించి పూజింపవలెను. ఆచార్యుఁడు యదుత్రయను మంత్రముచే నావాలమంతటఁజల్లి యాపోహిష్ఠ యను మంత్ర ముతో గుశోదకముచే భూమిని ప్రోక్షించి దేవా ఆయాంతు యాతుధానా ఆపయాంతు విష్ణోదేవయజనం రక్షస్వయని భూమియందు ప్రాదేశముజేసి మండల ప్రతిష్ఠ జేయునది. దానిప్రయోగవిధి. మూర్తి ప్రతిష్ఠా ప్రయోగ గ్రంథమున దెలియునది. దాని ననుసరించి మండల ప్రతిష్ఠఁ జేసియైనను జేయకయైనను, "యదత్రసంస్థితం భూతం స్థానమాశ్రిత్య తిష్ఠతి, స్థానంత్యక్త్వా తు తత్సర్వం యత్రస్థం తత్రగచ్ఛతు" ఆప్రకామంతు, అని భూశుద్ధిఁజేసి, మూర్తిని పంచగవ్యము హిరణ్యము యవలు దూర్వలు రావిమోదుగు పర్ణములు వేసిన జలకుంభములో జలముచే నాపోహిష్ఠయను మూఁడిటిచేతను, "హిరణ్యవర్ణాశ్శుచయః పావకాః యాసుజాతః కశ్యపోయాస్వింద్రః, అగ్నిం యాగర్భందధిరే విరూపాస్తాన ఆపశ్శగ్గ్ స్యోనాభవంతు, యాసాగ్ రాజావరుణో యాతిమధ్యే సత్యానృతే అవపశ్యన్ జనానాం, మదుశ్చుత శ్శుచయోయాః పావకాస్తాన ఆపశ్శగ్గ్ స్యోనాభవంతు. యాసాందేవా దివికృణ్వంతి భక్షంయా అంతరిక్షేబహుధా భవంతి, యాః పృథివీం పయసోందంతి శుక్రస్తాన ఆపశ్శగ్గ్ స్యోనాభవంతు, శివేన మాచక్షుషా పశ్యతాప శ్శివయా తనువోపస్పృశత త్వచం మే, సర్వాగ్ం అగ్నీగ్ం రప్సుష దోహువేవోమయి వర్చో బలమోజోనిధత్త, పవమానస్సువర్జనః, పవిత్రేణ విచర్షణిః, యఃపూతాస పునాతుమా, పునంతుమా దేవజనాః, పునంతు మనవోధియా, పునంతు విశ్వఆయవః, జాతవేదః పవిత్రవత్, పవిత్రేణ పునాహిమా, శుక్రేణ దేవ దీద్యత్, అగ్నేక్రత్వా క్రతూగ్ంరను యత్తేపవిత్రమర్చిషి, అగ్నేవితతమంతరా, బ్రహ్మతేన పునీమహే, ఉభాభ్యాం దేవసవితః, పవిత్రేణ సవేనచ, ఇదం బ్రహ్మ పునీమహే,

వైశ్వదేవీ పునతీదేవ్యాగాత్, యస్యై బహ్వీస్తనువో వీతపృష్ఠాః, తయామదం తస్సధ మాద్యేషు, వయగ్గ్ స్యామపతయోరయీణాం, వైశ్వానరో రశ్మిభిర్మాపునాతు, వాతః ప్రణేనేషిరోమయోభూః ద్యావ్యాపృథివీ పయసాపయోభిః ఋతావరీయజ్ఞియే మాపు నీతాం, బృహద్భిస్సవితస్తృభిః వర్షేర్దేవన్వభిః, ఆగ్నేదక్షైః పునాహిమా, యేనదేవా అపునత, యేనాపోదివ్యంకశః, తేన దివ్యేన బ్రహ్మణా, ఇదం బ్రహ్మపునీమహే, యః పావమానీరధ్యేతి, ఋషిభిస్సం భృతగ్ం రసం, సర్వగ్ం సపూతమశ్నాతి, స్వదితం మాతరిశ్వనా, పావమానీర్యో అధ్యేతి, ఋషిభిస్సంభృతగ్ రసం, తస్మై సరస్వతీ దుహే, క్షీరగ్ం సర్పిర్మధూదకం, పావమానీ స్స్వస్త్యయనీః, సుదుఘాహీపయస్వతీః ఋషిభిస్సం భృతో రసః, బ్రాహ్మణే ష్వమృతహితం, పావమానీర్దిశంతునః, ఇమంలోక మధో అముం; కామాంత్సమర్ధయంతునః దేవీర్దేవై స్సమాభృతాః పావమానీ స్స్వస్త్య యనీః సుదుఘాహి ఘృతశ్చ్యుత, ఋషిభిస్సంభృతోరసః, బ్రాహ్మణేష్వమృతగ్ం, హితం, యేన దేవాః పవితేణ, ఆత్మానంపుతేసదా, తేన సహస్రధారేణ, పావమన్యాః పునం తుమా, ప్రాజ్యాపత్యం పవిత్రం, శతోద్యామగ్ం హిరణ్మయం, తేన బ్రహ్మవిదోవయం, పూతం బ్రహ్మపునీమహే, ఇంద్ర స్సునీతీ సహమాపునాతు, సోమస్స్వస్త్యా వరుణ స్సమిచ్యా, యమోరాజా ప్రమృణాభిః పునాతుమా, జాతవేదా మోర్జయంత్యా పునాతు, అని యీయనువాకముచే నభిషేకము చేసి వ్యాహృతులచేతను ఇదం విష్ణుః అను మంత్రముచేతను ఫలయవదూర్వలను సమర్పించి రక్షోహణ మనుమంత్రమున దేవ హస్తమందు గంకణముగట్టి వస్త్రముచే గప్పి అవతేహేడో ఉదుత్తమమును మంత్రముచే జలమందు మూర్తినధివాసము చేయునది.

## స్థిర చరార్చలకు సాధారణమైన ప్రయోగము

చలమూర్తి ప్రతిష్ఠయందు నగ్ని బ్రతిష్ఠించి ధ్యానించి గ్రహాది పక్షమందు గ్రహములను వాస్తుదేవతలను నన్వాధానమందుద్దేశించి ఇంద్రం, పృథివీం, శర్వం, అగ్నిం, అగ్నిమూర్తిం, పశుపతిం, యమం, యజమానమూర్తిం, ఉగ్రం, నిఋఋతిం, సూర్యమూర్తిం, రుద్రం, వరుణం, జలమూర్తిం,భవం, వాయుం, వాయుమూర్తిం, ఈశానం, కుబేరం, సోమమూర్తిం, మహాదేవం, ఈశానం, ఆకాశం, భీమం, ఎతాః లోకపాలమూర్తి మూర్తిప్రతిదేవతాః "పలాశోదుంబరాశ్వత్థ శమ్యపామార్గసమిద్భి రాజ్యా హుతిభి స్తిలాహుతిభిశ్చ ప్రతిదైవత మష్టాష్టసంక్యాభిః అనియు స్థాప్యం దేవతా మముకాంపలా శోదుం బరాశ్వత్థశమ్య పామార్గా సమిత్తిల చర్వాజ్యాహుతిభిః ప్రతి ద్రవ్య మష్టోత్తర శతసంఖ్య యాష్టావింశతి సంఖ్యయావా యని అగ్నిర్యజుర్భిరిత్యను వాకేన విశ్వాన్ దేవాన్ తిలాజ్యాభ్యాం దశదశాహుతిభిః యనియు నిట్లు ద్వితీయ పర్యాయమందు నీ దేవతలనే యాయా సంఖ్యగల యాయాద్రవ్యములచేతనే. ఇట్లు మూఁడవపర్యాయమందు నాదేవతలకే యాయా సంఖ్యగల యాయాద్రవ్యములచేతనే యుద్దేశము. బ్రహ్మాది మండలదేవతలను తిలాజ్యా హుతులచే ప్రతిదేవతకు పదేసి చొప్పునననియు శేషముచే స్విష్టకృత్తని మొదలుగ నుద్దేశించి చేటలో ప్రధానదేవతకై యూరకే నాలుగు పిడికిళ్ళు నిరూపించి హోమమునకు దగునంతఁదీసి యాలాగుననే

బ్రోక్షించి యావుపాలతో నీవరచరువుఁ జేయవలెను. ఆజ్యభాగాంతమందు యజమానుఁడు ఇదముపకల్పిత మన్వాధానోక్త ద్రవ్యజాత మన్వాధానోక్తా హుతి పర్యాప్త మన్వాధానోక్తాభ్యో యక్ష్యమాణాభ్యోదేవతా భ్యోస్తున మమ" యని త్యాగముఁ జేసి జేయవలెను. గృహమందువండిన యన్నాదికముచే గ్రహహోమముఁజేసి లోక పాలమూర్తి మూర్తి ప్రిదేవతలకు నైదువిధముల సమిధలును తిలలు నాజ్యము వీనితో హోమము చేయవలెను. ప్రతిద్రవ్యముయొక్క హోమాంతమందును దేవుని పాద నాభి శిరస్సుల స్పృశింపుచుండవలెను. ఆజ్యహోమమం దుత్తరభాగమున జలపూర్ణ కుంభమందు సంపాతముల స్రవింపజేయవలెను. వాటికి మంత్రములు. ఇంద్రా యేందో యను మంత్రముచే నింద్రునికిని స్యోనా యను మంత్రమున బృథివీమూర్తికి నఘోరేభ్య యనుదానిచే తత్పతియగు శర్వునికిని, అగ్న ఆయాహి యని యగ్నికిని. ఆగ్నిందూత మని యగ్నిమూర్తికిని. నమశ్శర్వాయచ పశుపతయే చ యని పశుపతికిని యమాయసోమమని యమునికిని అసిహివీర యని యజమానమూర్తికిని స్తుహిశ్రుత మని తత్పతియగు రుద్రునికి, అసున్వంతమని నైఋతికిని ఆకృష్టేన యని సూర్య మూర్తికి. యోరుద్రో అగ్నౌ అని తత్పతియగు రుద్రునికి. ఇమం మే వరుణ యని వరుణుని శంనో దేవీ యని జలమూర్తికిని నమోభవాయ చ యని భవునికి ఆనోని యుద్భి, అని వాయువునకు వాత ఆవాతు యని వాయుమూర్తికిని తమీశానమని యీశానునికి ఆప్యాయస్వ యని కుబేరునికి వయసోమ యని సోమమూర్తికి తత్పురు షాయ యని మహాదేవునికి అభిత్వా దేవయని యీశానునికి ఆదిత్య ప్రత్నస్య యని యాకాశమునకు నమ ఉగ్రాయచ యని భీమునకు నని ఆపైని స్థాపించుదేవుని మంత్రముచే పలాశోదుంబరాది సమిత్పంచకము పాయస చరువు తిలలు నాజ్యము వీనిహోమము ప్రతిద్రవ్య హోమాంతమున దేవునిపాద నాభి శిరస్సుల ముట్టుటయు గావలెను. దేవమంత్రముగ దాంత్రికమైన మూలమంత్రముగా నిదేవగాయత్రి గాని వైదికమంత్రముగాని గ్రహింపవలెను. అగ్ని ర్యజుభిః, సవితాస్తోమైః, ఇంద్ర ఉక్థామదైః మిత్రావరుణా వాశిషా, అంగిరసో థిష్ణియైరగ్నిభిః, మరుతస్సదోహ విర్ధా, నాభ్యాం, ఆపః ప్రోక్షణీభిః, ఓషధయో బర్హిషా, అదితిర్వేద్యా, సోమోదీక్షయా, త్వష్టేధ్మేన, విష్ణు ర్యజ్ఞేన, వసవాజ్యేన, అదిత్యాదక్షిణాభిః, విశ్వేదేవా ఊర్జా, పుషాన్వగాకారేణ, బృహస్పతి, పురోధయా, ప్రజాపతిరుద్గీథేన, అంతరిక్షం పవిత్రేణ, వాయుఁపాత్రైః అహగ్గ్ శ్రద్ధయా స్వాహా యనుననువాకముచే తిలలచే నాజ్యముచేతను పదేసి యాహుతులీవలెను. ఆపైని దేవుని పాదములు స్పృశింపవలెను. అటుపైని సంపాతజలముచే దేవుని కభిషేకము. ఇట్లనే రెండవపర్యాయము హోమముఁజేసి దేవునినాభి ముట్టవలెను. మూఁడవ పర్యాయము వ్రేల్చి శిరసు స్పృశించునది. ప్రతిపర్యాయమందును సంపాతా భిషేకమనఁగ ధారోదకముచే స్నానము. ఒకపర్యాయమందాహుతి సంఖ్యాపలాశ సమిధలు నూట తొంబది రెండగు బొడ్డ సమిధలు నన్నియే యగును. రావిసమిధలు నన్నియే. జమ్మిసమిధలు నన్నియే దుచ్చెనసమిధలు నన్నియే యగును. ఆజ్యాహుతులు నన్నియే తిలాహుతులు నట్లనే యగును. స్థాపించెడుదేవుని కిరువ దెనిమిది పక్షమందు

నైదుజాతుల సమిధలును నూటనలువది యగును. చార్వజ్యతిలా హుతులెనుబది నాలుగు. అనువాక యిరువది వెరసివేయునేనూటయెనబి దెనిమిది యగును. మూఁడుపర్యాయములకును నాల్గువేలయేడు నూటయరువదినాలుగు గగను. ఇట్లు హోమముజేసి యర్చామూర్తిని శోధింపవలెను. దేవునకు, నమస్కరించి "స్వాగతం దేవదేవేశ విశ్వరూప నమోస్తుతే, శుద్ధేఽపి త్వదధిష్ఠానే శుద్ధిం కుర్మ స్సహస్వతాం." అనఁగా నో దేవుఁడ దేవేశ్వరుఁడ నీకు శుభాగమనము గదా, విశ్వరూపుఁడవైన నీకు నమస్కారము. నీస్థానమైన యీ మూర్తి శుద్ధమైనను శుద్ధి కొరకు యత్నించుచున్నాము. దాని క్షమింపుమని ప్రార్థించి ఉత్తిష్ఠబ్రహ్మణస్పతే యను మంత్రమున ఋత్విక్కులతో గూడ మూర్తినెత్తి యగ్న్యుత్తారణముఁ జేయునది. అగ్నిస్సప్త మనుసూక్తము నగ్ని పదహీనముగ బఠించి దత్సహితముగఁ దిరుగ పఠింపవలెను. ఇట్లు నెనిమిదినూర్లమారులుగాని యిరువదెనిమిది మారులుగాని బఠింపుచు జలము వేయవలెను. ఆపై నర్చామూర్తిని పండ్రెండుమారులు మృత్తికచే జలముచేతను గడగి మంత్రములచేఁ బంచగవ్యముఁజేసి "పయః పృథివ్యాం పయ ఓషధీషు పయో దివ్యం తరిక్షేపయోధాం, పయస్వతీః ప్రదిశస్సంతు మహ్యం, అహోరాజాన మను మంత్రములచే స్నానముఁ జేయించి ఆప్యాయస్వ యను నైదు మంత్రములచేఁ బంచామృతస్నానముఁ జేయించి లింగమైనచో నమస్తే రుద్రమన్యవయను నెనిమిదింటిచే స్నానముఁ జేయించి ఘృతముచే నభ్యంగము నలుగుబెట్టి యుష్ణోదకముచే గడగి గంధమిచ్చి సంపాదోదకముచే నభిషేకించి పల్లవములతో గూడిన నాల్గు కుంభములచేఁ గ్రమముగ ఆపోహిష్ఠా-యోవశ్శివతమోరసః, తస్మా' ఆకలశేషు అను వానిచే స్నానము జేయించి సముద్రజ్యేష్ఠయను నాలుగింటిచేతను ఆకలశేషు అను దానిచే నన్నికుంభములచేతను స్నానము జేయించి బోడ్డకర్ర పీటయందర్చామూర్తి నుంచి చుట్టు నెనిమిదిదిక్కులను జలపూర్ణకుంభములందు గంధపుష్ప దూర్వలువ్రేసి మొదటికుంభమందు సప్తమృత్తికలును రెండవదానియందు తామరజమ్మి వికంకతము అశ్మంతకవృక్షము వీనినారయు చిగుళ్ళును వ్రేసి మూఁడవ కుంభమందు సప్తధాన్యము నాల్గవదానియందు పంచరత్నములును నైదవదానియందు ఫలపుష్పములును నారవ దానియందు దర్భదూర్వలు గోరోచనమును, సప్తమమందు సంపాతోదకము నెన్మిదవ దానిలో సర్వౌషధులను వ్రేసి క్రమముగ నాపోహిష్ఠ యను మూఁడిఁడిచేతను హిరణ్యవర్ణాశ్శుచయ యని నాల్గిటిచేతను పవమానాను వాకముచేతను నభిషేకముజేసి యొక కుంభమందు జమ్మి, మోదుగు, మర్రి, చండ్ర, మారేడు, రావి, వికంకతము, పనస, మామిడి, డిశిరిపెపుచెట్టు, బొడ్డు, వీటిచిగుళ్లను వీటి రసములను వ్రేసి అశ్వత్థే యనుమంత్రముచే నభిషేకముఁజేసి పంచరత్నోదకముచే హిరణ్యవర్ణా యని స్నానము జేయించి వస్త్రములు రెండిచ్చి మీఁద చాందినీ గట్టియని కొందరు. యజ్ఞోపవీత గంధపుష్ప ధూపదీపముల నిచ్చి "హిరణ్యగర్భః య ఆత్మదా యః ప్రాణతో యస్యమే యేనద్యౌః యం క్రందసి ఆపోహయత్ యశ్చిదాపో' యను నెనిమిదింటిచే నెనిమిదిదీపములిచ్చి సువర్ణశలాక యనఁగ బంగారు తీగచే తైజసపాత్ర

మందున్న తేనెయు నేయియు దీసి "చిత్రం దేవానాం తేజోసి శుక్రమస్యమృత మసి ధామనామాసి ప్రియం దేవానామనాధృష్యం దేవయజనమను మంత్రద్వయముచే ఓం నమో భగవతే తుభ్యం శివాయ హరయే నమః, హిరణ్యరేతసే విష్ణో విశ్వరూపయ తే నమః" అను మంత్రముచే దేవుని కుడి యెడమ నేత్రములను మంత్రావృత్తిచే లిఖింపవలెను. అంజంతిత్వా యని కాటుకవెట్టి దేవస్యత్వాసవితుః ప్రసవే ఇంద్రస్యేంది యేణా నజ్మియని తేనె నేయి పంచదారలచే నంజనము వెట్టి తుదిని కాటుకయుఁ బెట్టవలెను. అటుపై నద్దము భక్ష్యము మొదలగునదియు జూపించవలెను. అపుడు యజమానుఁడా చార్యునకు గోవును ఋత్విజులకు దక్షిణనీవలెను. ఆచార్యుఁడు ప్రతి ఋక్కునకు మొదట ప్రణవము నుచ్చరింపుచు బురుషసూక్తముచే స్తుతించి వెదురుపాత్రయందు నైదు రంగులుగల యన్నముచే దేవునికి నీరాజనమిచ్చి రుద్రునికై చతుష్పథమనఁగా నాల్గుదారులుగలసినచోట విడువవలెను. అపుడు మంత్రములు. "ఓం నమో భగవతే రుద్రాయ సర్వభూతాధిపతయే దీప్తశూలధరాయో మాదయితాయ విశ్వాధిపతయే రుద్రాయవై నమోనమః, శివమగర్పితం కర్మాస్తు స్వాహా." యని రావి యాకులో భూతేభ్యో నమః యని విడువవలెను. ఆచార్యుడు సర్వతోభద్ర దేవతల నావాహనము జేయవలెను. ఎట్లనిన; మధ్యమందు బ్రహ్మను దూర్పు మొద లగు దిక్కుల నష్టదిక్పాలురను ఈశానునకు నింద్రునకు మధ్యభాగము మొదలగు నన్ని మధ్యములందుఁ గ్రమముగ వసువుల రుద్రుల నాదిత్యుల నశ్విదేవుల విశ్వేదేవుల బితృదేవతల నాగులను స్కందవృషులను నీయెనిమిదావాహనము లనునట్లు బ్రహ్మకు నీశానునకు మధ్యభాగము మొదలుగ నన్ని మధ్యములందును దక్షుని విష్ణుని దుర్గను స్వధాకారమును మృత్యురోగములను సముద్రనదులను మరుత్తులను గణపతిని నీయెనిమిది యావాహనములును మధ్యమందు మేరువును బృథివినియుంచి దేవుని నావాహించి తూర్పు మొదలగు దిక్కుల వజ్రమును శక్తిని దండమును ఖడ్గమును పాశము నంకుశమును గదను శూలమును నీ యెనిమిదింటికి పైని గౌతముని భరద్వాజుని విశ్వామిత్రుని కశ్యపుని జమదగ్నిని వసిష్ఠ నత్రిని నరుంధతిని వారికిపైని నవగ్రహములను వాటికిపైని నైంద్రియు గౌమారియు బ్రాహ్మియు వారాహియు చాముండయు వైష్ణవి మాహేశ్వరి వైనాయకి యను నెనిమిదిదేవుల నావహించి, పూజించి ప్రతిమయందు దేవుని దన్మంత్రమున నావాహించి మండలమధ్యమందు ప్రతిమను సుప్రతిష్ఠితో భవయని ప్రవేశపెట్టి పూజించి యగ్నియందు మండలదేవత లకు వారి నామములతో తిలాజ్యములచేఁ బదేసియాహుతులిచ్చి పుష్పాంజలి సమ ర్పించి నమోమహత్తను మంత్రముచే దేవునికి నమస్కరించి మండలమున కుత్తరముగ స్వస్తికపీఠమందు మంచమును దానిపై శయ్యనుజేసి ఉత్తిష్ఠ యని దేవునిలేపించి మంగళ వాద్యఘోషములతో శయ్యయందు దేవుని బ్రవేశపెట్టి పురుషసూక్తము నుత్తర మహాన్యాసము నారాయణము వీనిచే స్తుతించి దేవునియందు న్యాసము జేయవలెను. అది యెట్లనిన, పురుషాత్మనే నమః, ప్రాణాత్మనే నమః, ప్రకృతితత్త్వాత్మనే నమః బుద్ధితత్త్వాయ నమః, అహంకార తత్త్వాయ నమః, మనస్తత్త్వాయ నమః, యని

సర్వాంగములందును, ప్రకృతితత్త్వాయ బుద్ధితత్త్వాయ యనియు హృదయమందు శబ్దతత్త్వాయ యనియు, శిరసునందు స్పర్శతత్త్వాయ యనియు త్వక్కుయందు రూప తత్త్వాయ యనియు నిట్లు హృదయమందే రసగంధ శ్రోత్ర త్వక్చక్షుర్జిహ్వాఘ్రాణవాక్పాణి పాదపాయూపస్థపృథివ్యప్తేజోవా య్వాకాశసత్వరజస్తమో దేహతత్త్వములగూడ న్యసింప వలెను. అటుపైని బురుష సూక్తములో మొదటి రెండు ఋక్కుల హస్తములందును పై రెంటిని జానువులందును ఆ పై రెంటిని కటిభాగములందును ఆపై మూఁటిని నాభి మృదయకంఠములందును ఆపై రెంటిని బాహువులందును ఆపై రెంటిని నేత్రములందును తుదిఋక్కును శిరసునందును న్యసించి సుఖశాయీభవ యని శయ్యపై బండుకొనఁజేసి మండలమునకును శయ్యకును మధ్యమం దెవ్వరును నడువఁగూడదని యాజ్ఞాపించి స్విష్టకృత్తు మొదలగు హోమశేషము సమాప్తినొందించి మండలదేవతలకు వారి నామములచే బలిదానము చేయవలెను. నీవారచరుశేషముచే దిక్కులకు బలి నీవలెను. అటుపై నిధానమందే యని పూర్ణాహుతుని వేల్చవలెను. ఇట్లధివాసనము.

## స్థిరార్చయందు విశేషము

సంకల్పము మొదలుగ జలాధివాసాంతముఁజేసి దేవునికి నమస్కరించి స్వాగతం దేవదేవేశ యని మొదలగు ప్రార్థనము నుత్థాపనము నగ్న్యుత్తారణము మొదలుగ నేత్రోన్మీలనపర్యంతము పూర్వమువలెఁ జేయునది. అపుడు స్థిరమైన శివలింగమందు బంగారుతీగచే గంధము. "ఓం నమో భగవతే రుద్రాయ హిరణ్య రేతసే పరాయణ పరమాత్మనే విశ్వరూపాయో మాప్రియాయ నమ" యని పలికి నేత్రస్థానమం దంటించి యంజనాదులచే నేత్రోన్మీలనముఁ జేయవలెనని లింగమందు విశేషము. ఆపైని సూక్తముచే స్తుతించుట మొదలు మండల దేవతాస్థాపనము వరకును నాపై మండలమందు మూర్తినుంచుటయునటుపై శయ్యయందు దేవుః డు ప్రవేశించుట అటుపై స్తుతియు మీఁదఁజెప్పినటుల న్యాసములును నటుపై శయ్యయందు దేవుని శయనము అటుపైని నగ్నిస్థాపనము మొదలగు లోకపాలమూర్తి మూర్తి పతిహోమాంతము పూర్వమువలెఁ జేయునది. స్థాపించు దేవతకు హోమము నీవారచరువును లేదు. సప్తహవిస్సులే. కనుక విష్ణువు స్థిరార్చ యందు మీఁదఁ జెప్పిన సమిత్తి లాజ్యహోమానంతరము పురుష సూక్తముచే బ్రతిఋక్కున కాజ్యహోమా నంతరము పురుషసూక్తముచే బ్రతిఋక్కున కాజ్యహోమముఁజేసి 'ఇదం విష్ణుః' అను మంత్రముచేఁ బాదముల స్పృశించి తిరుగ నాహోమములఁజేసి అతో దేవయను దానిచే శిరస్సు స్పృశించి తిరుగ నాహోమములఁజేసి అతో దేవయను దానిచే శిరస్సు స్పృశించి తిరుగ నాహోమముచేసి పురుషసూక్తముచే సర్వాంగమును స్పృశింపవలెను. ఇట్లధివాసనమందు విశేషము. పరదినమందు పీఠమును స్నానము చేయించి మహీమూషు అని యావాహించి అదితిర్ద్యౌః అని స్తుతించి హ్రీం నమ యని పూజించి దానిచేతనే పూర్ణాహుతి వ్రేల్చి ఉత్తిష్ఠ బ్రహ్మణస్పతే యని దేవుని లేపించి పుష్పాంజలినిచ్చి పురుషసూక్తముచే స్తుతించి ఉదుత్యమని లేపించి కనిక్రదదితి

సూక్తముచే విష్ణువును సద్యోజాత మనుమంత్ర పరంచకముచే లింగమును గృహ మందుఁ బ్రవేశపెట్టి పీఠమం దింద్రాది నామములచే నెనిమిదిరత్నముల వ్రేసి సప్తధాన్యమును వెండియు మనశ్శిలయు వ్రేసి పాయసముచేఁ బూసి ప్రణవముచేఁ నంగన్యాసముజేసి సువర్ణశలాకయన బంగారుతీగెను మధ్యనుంచి దానిపై యుంచి లగ్నమందు ప్రతితిష్ఠ పరమేశ్వర యని అతోదేవ యని విష్ణువును రుద్రముచే లింగ మును స్థాపించవలెను. ఆపైని చరుహోమము ప్రాణప్రతిష్ఠ మొదలగునది. కాఁ బట్టి స్థిరార్చయందు నధివాసనములోను పరదినకృత్యములోను విశేషము. తక్కిన సర్వము మీఁదచెప్పి నదియు చెప్పఁబడునదియు నగు చలార్చాకృత్యమువలెఁ దెలియునది. ఇఁక చలార్చయందు నధివాసనాంతమైనపైని పరదినమందు నేకాహపక్ష మైనను సద్యస్కాలపక్షమైనను ఉత్తిష్ఠ బ్రహ్మణస్పతే యని దేవుని లేపించి పురుష సూక్తము నుత్తరనారాయణము వీనిచే స్తుతించవలెను. ఇఁకఁ దరుచుగ స్థిరచలార్చ లకు రెంటికి సాధారణమైన ప్రయోగము. “ప్రతిష్ఠాంగం పరేద్యుర్హోమం కరిష్యే” యని సంకల్పించి చక్షుషీ ఆజ్యేన యనునంతమందు స్థాపింపఁబడు దేవతకుఁ దన్మంత్రముచే ఘృతపక్వవ్రీహి చరువుచే పదియాహుతులను అగ్నిసోముని ధన్వంత రిని కుహువు ననుమతిని ప్రజాపతిని పరమేష్ఠిని బ్రహ్మను నగ్నిని సోముని అగ్నినన్నా దుని అగ్ని నన్నపతిని ప్రజాపతిని విశ్వులగు దేవులను సర్వులగుదేవుల నగ్నిని స్విష్టకృత్తునని, మరియు పూజాంగహోమములోని విష్ణుఁడైనచో సంకర్షణుఁడు మొదలగు పంద్రెండుగురు దేవతలను శార్ఙ్గని శ్రీని సరస్వతిని విష్ణువును పులగముచే నొక్కొక యాహుతిచేతను విష్ణుని వషట్కారమును కృపరమనఁగ పులగముచేతను పూజాంగహోమమందు శివుఁడైనచో భవునిశర్వుని నీశానుని పశుపతిని రుద్రుని నుగ్రుని భీముని మహత్తును కృసరమనఁగ పులగముచేతను పూజాంగహోమమందు శివుఁడైనచో భవునిశర్వుని నీశానుని పశుపతిని రుద్రుని నుగ్రుని భీముని మహత్తును కృసరము నొక్కొక్క యాహుతిచేతను భవస్యదేవస్యపత్నీమని మొదలగు నెనిమిదింటికి గుడౌదనముచే నొక్కొక యాహుతిచేతను భవస్య దేవస్యమతమని మొదలగు నెనిమిదింటికి పసుపన్నముచే నొక్కొక యాహుతిచేతను రుద్రునికి పదునేడుమారు లును శివుని శంకరుని సహమానుని శితికంఠుని కపర్దిని తామ్ర నరుణునవగు రమాణు మిరణ్య బాహు సస్పింజరు బభ్రుశు హిరణ్యుని దేవతల నప్పాలపులగముచే నొక్కొక యాహుతిచేతను శేషముచే స్విష్టకృత్తునని మొదలుగనని చేటయందు నూరకే స్థాప్యదేవతకై నాల్గుపిడికిళులు నిరూపించి యగ్న్యాదులగు పదారుగురు దేవతలకు నాలుగేసి పిడికిళ్లు నిరూపించి యట్లనే ప్రోక్షించి ఘృతముగలపిన జలముచే శ్రవణ మనఁగఁబాకముచేసి స్రుక్కుచే నవదానము చేయుచు స్థాప్యదేవతా మంత్రముచే పదియాహుతు లీవలెను. అగ్నయే స్వాహా, సోమాయ స్వాహా, ధన్వంతరయే, కుహ్వై, అనుమత్యై, ప్రజాపతయే, పరమేష్ఠినే, బ్రహ్మణే, అగ్నయే, సోమాయ, అగ్నయేన్నా దాయ, అగ్నయేన్నపతయే, ప్రజాపతయే, విశ్వేభ్యో దేవేభ్యః, సర్వేభ్యో దేవేభ్యః, భూర్భు వస్స్వరగ్నయే, స్విష్టకృతే స్వాహా, యని పదియారాహుతులు “సప్తతే స్సప్తధాత్వా

యజంతి సప్తయోనీరా పృణస్వాఘృతేన, పునస్త్వాదిత్యా రుద్రా వసవస్సమింధతాం పునర్బ్రహ్మాణో పసునీధయజ్ఞైః, ఘృతేనత్వం తన్వం వర్ధయస్వ సత్యాస్సంతు యజ మానస్య కామాః” అను మంత్రములచేఁ బూర్ణాహుతింజేసి యాచార్యుఁడు యా ఓషధీః అని పుష్పఫల సర్వౌషధులను సమర్పించి సంపాదోదకమును తామ్రపాత్ర యందు గ్రహించి దేవమంత్రముచే నూరుమారు లభిమంత్రించి దానిచే దేవుని శిరస్సు నభిషేకము చేయవలెను. ఆపైని ఉత్తిష్ఠ బ్రహ్మాణస్పతే యని దేవుని లేపించి విశ్వతశ్చక్షుః అని యుపస్థానము చేయునది. ఇట్లు త్థాపనోపస్థానములు చలార్చ యందే కాని స్థిరార్చయందక్కరలేదు. దేవుని ధ్యానించి జపించవలెను. “బ్రహ్మణే నమః విష్ణవే నమః రుద్రాయ నమః, ఇంద్రాద్యష్టభ్యో, వసుభ్యో, రుద్రేభ్యో, ఆదిత్యేభ్యో, అశ్విభ్యాం, కురుద్భ్యో, కుబేరాయ, గంగాది మహానదీభ్యో, అగ్నీషోమాభ్యాం, ఇంద్రాగ్ని భ్యాం, ద్యావాపృథివీభ్యాం, ధన్వంతరయే, సర్వేశాయ, విశ్వేభ్యో, దేవేభ్యో, బ్రహ్మణే, యని ఆపైని సంపాతోదకముచే యజమాను నభిషేకము. దేవుని ధ్యానించి ప్రతిష్ఠ పరమేశ్వరయని పుష్పాంజలిని ధరించి పరమార్థమున సచ్చిదానందరూపమైన పర బ్రహ్మయే భక్తానుగ్రహము కొరకు విగ్రహము ధరించి నిజాయుధ వాహనాదులతో గూడి తన హృదయకమలమందు ధ్యానముచే సాక్షాత్కరించి సర్వసాక్షియైనఋతర స్వరూపుఁడగు పరమేశ్వరుని పరమేష్ఠ్యసి పరమాంశ్రియం గమయ యను మంత్ర ముచే పుష్పాంజలిలో ప్రవేశించినట్లు భావనజేసి యర్చార్తి మూర్తిపై నుంచి ప్రాణ ప్రతిష్ఠను జేయవలెను. అది యెట్టులనిన; అస్య శ్రీ ప్రాణప్రతిష్ఠా మంత్రస్య బ్రహ్మా విష్ణు రుద్రాః ఋషయః ఋగ్యజుస్సామాని ఛందాంసి, క్రియామయవపుః ప్రాణాఖ్యా దేవతా, ఆం బీజం జౌం శక్తిః, ప్రాణప్రతిష్ఠాయాం వినియోగః, బ్రహ్మ విష్ణు రుద్ర ఋషిభ్యో నమః, శిరసి, ఋగ్యజుస్సామ ఛందోభ్యో నమః, ముఖే, ప్రాణాఖ్య దేవతాయై నమః, హృది, ఆం బీజాయనమః గుహ్యే, క్రౌం శక్తయే నమః, పాదయోః, ఓం కం ఖం గం ఘం ఙం అం పృథివ్యప్తేజోవాయ్వాకాశాత్మనే ఆం హృదయాయ. ఓం చం ఛం జం ఝం ఞం. ఇం శబ్దస్పర్శ రూపరసగంధాత్మనే ఈం శిరసేస్వాహా. ఓం టం ఠం డం ఢం ణం. ఉం శ్రోత్రత్వక్చక్షుర్జిహ్వాఘ్రాణాత్మనే ఊం శిఖాయైవషట్. ఓం తం థం దం ధం నం ఎంవాక్పాణి పాదపాయూపస్థాత్మనే ఐం కవచాయహుం, ఓం పం ఫం బం భం మం ఓం వచనాదాన విహరణోత్సర్గానందాత్మనే ఔం నేత్ర త్రయాయవౌషట్. ఓం యం రం లం వం శం షం సం హం ళం క్షం అం మనో బుద్ధ్యహం కారచిత్తాత్మనే, అః అస్త్రాయఫట్. అని యిట్లు తనకు దేవునికి న్యాసముజేసి దేవుని స్పృశించి జపించవలెను. ఓం ఆం హ్రీం క్రౌం యం రం లం వం శం షం సం హం ళం క్షం దేవస్య ప్రాణా ఇహప్రాణాః ఓం ఆం హ్రాం క్రౌం యం రం లం వం శం షం సం హం సః దేవస్సజీవ ఇహస్థిత, ఓం ఆం హ్రాం. హంసః దేవస్య సర్వేంద్రియాణి ఓం ఆం హ్రాం. హంసః దేవస్య వాఙ్మనశ్చక్షుశ్శ్రోత్ర ఘ్రాణప్రాణాఇహాగ త్యస్వస్తయే సుఖేన సుచిరం తిష్ఠంతు స్వాహా. యని యర్చామూర్తి హృదయమం దంగుష్ఠముంచి జపించవలెను. అస్యై ప్రాణాస్తిష్ఠంతు అస్యై ప్రాణాశ్చరంతు అస్యై

దేవత్వమర్చాయై మామహేతిచ కశ్చన, యని పలికి, ప్రణవముచే నిలిపి జీవునిగ ధ్యానించి ధ్రువాద్యోః అను మూఁడు ఋక్కులను జపించి దేవుని కర్ణమందు గాయత్రిని దేవమంత్రమును జపించి పురుషసూక్తముచే స్తుతించి పాదనాభి శిరస్సుల స్పృశించి ఇహైవైధి యని ముమ్మారు జపించవలెను. అటుపైని యజమానుఁడు "స్వాగతం దేవదేవేశ మద్భాగ్యాత్త్వ మిహాగతః, ప్రాకృతం త్వమదృష్ట్వా మాం బాలవత్పరిపాలయ, ధర్మార్థకామసిధ్యర్థం స్థిరోభవ శివాయనః, సాన్నిధ్యం తు సదా దేవ స్వర్చాయాం పరికల్పయ, యావచ్చంద్రాపనీ సూర్యా పిహంత్యప్రతిఘాతినః తావత్త్వయాత్ర దేవేశ స్థేయం భక్తానుకంపయా, దగదన్ దేవదేవేశ త్వంపితా సర్వదేహినాం, యేనరూపేణ భగవన్ త్వయావ్యాప్తం చరాచరం, తేన రూపేణ దేవేశ స్వార్చాయాం సన్నిధౌ భవ" యని యనఁగా నోదేవదేవుఁడ! నీకు శుభాగమన మగుగాక. నాభాగ్యము వలన నిట్లు దర్శనమిచ్చితివి. ప్రాకృతుఁడు నయోగ్యుఁడు వీఁడని నన్నుపేక్షింపక బాలునివలె రక్షింపుము. నాకు ధర్మార్థకామమోక్షములు సిద్ధించుటకు నీయర్చయందెల్లపుడు సాన్నిధ్యముఁ జేయుము. సూర్యచంద్రులుండువరకుఁ భక్తుల ననుగ్రహించుటకు నిలువుము. నీవు సమస్త జీవులకుఁ దండ్రివి. సర్వప్రపంచమనే రూపముచే వ్యాపించి యుంటివో యా రూపమున నీయర్చయందు సాన్నిధ్యము చేయుమని ప్రార్థించి నమస్కరింపవలెను. ఆపై నాచార్యుఁడుగాని యజమానుఁడుగాని యర్చామూర్తినైన లింగమునైనను భూః పురుషమావాహయామి. భువః, పురుషమావాహయామి, స్వః పురుషమావాహయామి, భూర్భువస్స్వః పురుషమావాహయామి యని యావాహ నముఁజేసి ప్రణవముచే నాసనమిచ్చి దూర్వలు చామరేకులు విష్ణుక్రాంతపత్రము పద్మములుగలసిన పాద్యోదకమిచ్చి ఓం ఇమా ఆపశ్శివతమా, పూతాః పూతతమా అమృతా అమృతరసాః పాద్యాస్తాజుషంతాం ప్రతిగృహ్యతాం ప్రతిగృహ్ణాతు భవాన్ మహావిష్ణుః, విష్ణవే నమః, అనిపాద్యము. భగవాన్ మహాదేవో రుద్రాయ నమ యని లింగమందు పాద్యమీవలెను. ఇమా ఆపశ్శివతమా, ఆచమనీయాస్తాఋషం తాం ప్రతిగృహ్యతాం. అని యాచమనము. ఇమా ఆపః, అర్ఘ్యాస్తాఋషంత్తాం అని యర్ఘ్యము పంచామృతస్నానము దేవమంత్రములచేఁజేసి ఇదం విష్ణుః అని విష్ణునకును నమోహస్తు నీలగ్రీవాయు యని లింగమునకును కంకణము విప్పి వస్త్రము యజ్ఞోప వీతము నిచ్చి "ఇమే గంధాస్యూస్య రశ్మిభిః" పూతాయని మొదలగు మీఁదఁజెప్పిన మంత్రము గూడఁ బఠించి గంధము నీవలెను. "ఇమే మాల్యాశ్శుభాదివ్యాస్సర్వ మాల్యై రలంకృతాః" అనియు పూతా ఇత్యాది మీదిమంత్రమును బఠించి పుష్పమాలిక లను ఇమే పుష్పా యని పుష్పమునిచ్చి. "వనస్పతిరసోద్భూతో గంధాఢ్యో గంధ ఉత్తమః, ఆఘ్రేయ స్సర్వదేవానాం ధూపోయం ప్రతిగృహ్యతాం అను మంత్ర ముచే ధూపము ప్రతి గృహ్ణాతు భవాన్ అని మొదలుగ బఠించి యీవలెను. ఓం "జ్యోతిశ్శుక్రం చ తేజశ్చ దేవానాం సతతం ప్రియం, ప్రభాకృత్సర్వభూతానాం దీపో యం ప్రతిగృహ్యతాం, ప్రతిగృహ్ణాతు భవాన్." అని దీపమును విష్ణునకు సంకర్షణాది నామములచే పుష్పములు సమర్పించి యా నామములచేతనే తర్పణముఁజేసి పాయ

సము గుడౌదనము చిత్రాన్నము పవిత్రంతే వితతమని నివేదనజేసి సంకర్షణాది నామములచేఁ బంద్రెండాహుతులు గృహసిద్ధాన్న కృసరాదులచే వ్రేల్చి కృసరమనఁగ నువ్వుల పులగముచేతనే శారిఙ్గిణే, శ్రియై, సరస్వత్యై, విష్ణవే యని వ్రేల్చి, "విష్ణోర్నుకంవీర్యాణి, తదస్య ప్రియ, ప్రతద్విష్ణుః, పరోమాత్రయా, విచక్రమే, త్రిర్దేవః పృథివీ." అను నారుమంత్రములచే వ్రేల్చునది. లింగమందైనచో దీపాంతముగఁజేసి భవాయ దేవాయ, శర్వాయదేవాయ, ఈశానాయదేవాయ, పశుపతయే దేవాయ, రుద్రాయ దేవాయ, ఉగ్రాయదేవాయ, భీమాయదేవాయ, మహతే దేవాయ, నమః అని పుష్పములు సమర్పించి యా నామములచేతనే తర్పణముచేసి పవిత్రంతే యని పాయసము గుడాన్నము నివేదించి భవాయదేవాయ స్వాహా యని మొదలగు నెనిమి దింటిచే పులగము వ్రేల్చునది. పులగమనఁగ నంతటను దిలలతో నన్నమని తెలియు నది. భవస్యదేవస్య పత్న్యై స్వాహా యని మొదలుగ నెనిమిదింటిచే గుడాన్నము వ్రేల్చి భవస్యదేవస్య సుతాయ స్వాహా యని మొదలగు నెనిమిదింటిచే పసపన్నము వ్రేల్చి "త్ర్యంబకం, మానోమహాంతం మానస్తోకే ఆరాత్తే వికిరది, సహస్రాణి సహస్రం" అను బంద్రెండు మంత్రములచే కృసరమనఁగ నువ్వుపులగము వ్రేల్చి శివాయ, శంకరాయ, సహమానాయ, శితికంఠాయ, కపర్దినే, తామ్రాయ, అరుణాయ, ఆపగురమాణాయ, హిరణ్యబాహవే, సస్పింజరాయ, బభ్రుశాయ, హిరణ్యాయ, యని ద్వాదశ నామములచే వ్రేల్చవలెను. స్విష్టకృత్తు మొదలగు హోమశేషము ముగింపఁజేసి మీఁదఁ జెప్పిన సర్వహవిస్సులచే విష్ణునకుగాని లింగమునకుగాని బలి యీవలెను. అపుడు మంత్రము. "త్వామేకమాద్యం పురుషం పురాణం నారాయణం విశ్వసృజం యజామహే, త్వమేవ యజ్ఞో విహితో విధేయస్త్వమాత్మనాత్మన్ ప్రతిగృహ్ణీష్వ హవ్యం." అని లింగప్రతిష్ఠయైన యెడ నారాయణ మనునపుడు రుద్రం శివం అని యుచ్చరింపవలెను. పదిగాని మూఁడుగాని యొకటిగాని గోవులనిచ్చి ఋత్విక్కులకు దక్షిణనిచ్చి నూర్గురగాని పంద్రెండుగురగాని విప్రుల భుజింపఁ జేయవలెను. నూతన దేవాలయమందు జలాశయమునకుఁ జెప్పిన ప్రతిష్ఠావిధిఁ జేయునది. అందు గోవున కుత్తారణము పాత్రీ ప్రక్షేపము మొదలగునది చేయఃగూడదు. వారుణ హోమస్థానమందు వాస్తు హోమముఁ జేయునది. ఇట్లు స్థిరార్చకుఁచలార్చకు బ్రతిష్ఠాప్రయోగము ముగిసెను.

## సంక్షేపముగ చలమూర్తి ప్రతిష్ఠ

సంకల్పము మొదలుగ నాందీశ్రాద్ధాంతము పూర్వమువలెఁ జేయునది. ఒక యాచార్యుని వరింపవలెను. ఆచార్యుడుఁ అముకదేవ ప్రతిస్థాకర్మ కరిష్యే యని సంకల్పించి యావాలు జల్లుట పర్యంతము సర్వతో భద్రమండలమందు పూర్వము వలె నామములచే బ్రమ్మాది మండలదేవతల నావాహించి పూజించి గృహ్యసూత్రానుసారముచే నగ్నిప్రతిష్ఠించి యన్వాధానముఁ జేయునది. ఆజ్యభాగాంతమందు స్థాప్య దేవతకు వేయుగాని నూటయెనిమిదిగాని సమిదాజ్యచరుతిల ద్రవ్యములచేతను బ్రమ్మాది మండలదేవతలకు ప్రతిదేవతకు పదేసి తిలాజ్యాహుతులచేతను శేషముచే

స్విష్టకృత్తని మొదలగునగు. ఊరకే నిర్వాపప్రోక్షణములు చేసి యాజ్యభాగాంతముగ, చెరువుగట్టు, యేట్టిగట్టు, గోశాల, అంగణము, గజశాల, అశ్వశాల, గుమి, పుట్ట, నదీసంగమస్థలము, అను నీ పదింటిమృత్తికలచే దేవునికి స్నానముచేయించి పంచగవ్య ములచేఁ గ్రమముగ స్నానము సమర్పించి దూర్వులు తెల్లయావాలు పంచపల్లవములుంచిన యెనిమిది కలశములచే నాపోహిష్ఠాది మంత్రముల నభి షేకించి యగ్న్యుత్తారణము చేయునది. సర్వతోభద్ర మందున్న పీఠమున దేవుని గూర్చుండఁబెట్టి నామము నుచ్చరింపుచు వస్త్రగంధ ధూపాదుల నిచ్చి యెనిమిది దిక్కుల పల్లవాదులతోఁగూడిన యెనిమిది దిక్కులపల్లవాదులతోఃగూడిన యెనిమిది కుంభములను నెనిమిది దీపములను నిచ్చి మీఁదఁజెప్పినటుల నేత్రోన్మీలనమును జిత్రాన్నముచే బలియునిచ్చి పురుషసూక్తముచే స్తుతించి మీఁదఁజెప్పిన ద్రవ్యములు నాల్గును స్థాపించెడి దేవతామంత్రముచే వ్రేల్చుచు నొక్కొక ద్రవ్యహోమమైనచో దేవుని స్పృశింపుచుండవలెను. ఆజ్యహోమమందుఁ గలశములో సంపాతములు వ్రేయ వలెను. మండల దేవతాహోమముఁజేసి హోమశేషము ముగించి పూర్ణాహుతిఁ జేయవలెను. అటుపైని మీఁదఁజెప్పినట్లు సూక్తన్యాసము నావాహనము ప్రాణప్రతి ష్ఠయుఁజేసి ఇహైవైధి యను మూఁడు ఋక్కులను బురుషసూక్తము జపించి మూల మంత్రము మొదలగువానిచే నావాహనాది పంచామృత స్నానాంతమున సంపాతోదక ములచే నిమా ఆపశ్శివతమా యని మొదలగుదానిచే నభిషేకము వస్త్రాదినైవేద్యాం తము వెనుకఁజెప్పినట్లు చేయునది. తాంబూల ఫలదక్షిణా నీరాజన నమః ప్రదక్షిణా దులఁ జేసి పుష్పాంజలి నిచ్చి యాచార్యుని దక్షిణ యిచ్చినపైని నెనిమిది కుంభములచే యజమాను నభిషేకము. ఆపైని విష్ణుని స్మరించి కర్మనీశ్వరార్పితముఁజేయవలెనని సంక్షేపము.

## పునః ప్రతిష్ఠ

మద్యమంటినను చండాలుఁడు స్పృశించినను వహ్నిచే దగ్ధమైనను బ్రాహ్మణుని రక్తమంటినను పాపాత్ముఁడు ముట్టినను దేవప్రతిమదిరుగ సంస్కరింప వలెను. మరియు భేదింపఁబడినను బ్రద్దలైనను స్థానమునుండి చలించినను పూజ లేకున్నను శవము గర్దభము మొదలగున శుచివస్తువులంటినను పతితుఁడు రజస్వల చోరుండు ముట్టినను పునఃప్రతిష్ఠఁ జేయవలెను. ఖండితమైనదిగాని బ్రద్దలైనదిగాని మూర్తిని విధి ప్రకారముఁదీసి మరియొకమూర్తిని స్థాపించవలెను. అట్లర్చకుభంగము చౌర్యము మొదలగునవి సంభవించి దినమందుపవాసము రాగి మొదలగు ధాతు మూర్తులకు చోర చండాలాది స్పర్శమైనచో నాలోహపాత్రకుఁ జెప్పినశుద్ధిజేసి పునః ప్రతిష్ఠః జేయవలెను. పూర్వము ప్రతిష్ఠించినమూర్తికి బుద్ధిపూర్వకముగ నొకదినము గాని యొకమాసముగాని రెండుమాసములుగాని పూజకు విచ్ఛేదము గలిగినను శూద్ర రజస్వలాదులు స్పృశించినను జలాధివాసముఁజేసి కలశముచే స్నానము జేయింపవలెను. అటుపయిని పంచగవ్యముచేతను స్నానము. అటుపయిని నెనిమిది వేలుగాని యెనిమిది నూరుమారులు గాని యిరువదెనిమిదిగాని కలశములచే పురుష

సూక్తము బఠింపుచు స్నానముఁ జేయింపవలెను. గంధపుష్పాదులచే పూజించి గుడాన్నము నివేదింపవలెనని శుద్ధి, బుద్ధి పూర్వముగ పూజకు లోపమైనచో శూద్రస్పర్శాదులు గల్గినను పునః ప్రతిష్ఠచేతనే శుద్ధియగును. కొందరొకదినము పూజ జరుగనిచోఁ ద్విగుణపూజఁ జేయవలెను. రెండు రాత్రులట్లైనచో మహాపూజఁ జేయునది. అటుపైని సంప్రోక్షణమే చేయవలెను. మాసమునకు పైగా లోపము జరిగినచోఁ బునః ప్రతిష్ఠ గాని సంప్రోక్షణముగాని చేయవచ్చుననిరి. పునః ప్రతిష్ఠ మొదలగునది మలమాసమందును శుక్రాస్తమయాదులందును జేయవచ్చును. దేవాలయము వాపీకూపతటాకాదులు భగ్నమైనచో నట్లారామసేతుసభాదులకు భంగమైనచో ఇదంవిష్ణుః, మానస్తోకే విష్ణోః కర్మాణి పాదోస్య యనునాల్గింటి నాజ్యాహుతులు వ్రేల్చి బ్రాహ్మణ భోజనము. జేయింపవలెను.

## సంప్రోక్షణ విధి

దేవుని యుద్వాసనజేసి యైదుమారులు మృజ్జలములచే గడగి పంచగవ్యములచే స్నానముజేయించి కుశోదకములచే శోధించి మూల మంత్రములచే నూట యెనిమిది మారులు ప్రోక్షించి మూలమంత్రముచే శిరసు మొదలగు పీఠాంతము స్పృశించి తత్వన్యాసము మాతృకాక్షరన్యాసము మంత్రన్యాసమునుజేసి ప్రాణప్రతిష్ఠఁ జేసి మహాపూజఁ జేయవలెను. పూజలోపము గల్గినచో నిట్లు సంప్రోక్షణము.

## జీర్ణోద్ధారము

అది లింగాదులు భగ్నమైనను దగ్ధమైనపుడును జేయునది. ఇది యనాది సిద్ధ ప్రతిష్ఠితమైన లింగాదులకు భంగముగల్గినను జేయ నక్కరలేదు. మరియేమనిన; మహాభిషేకముఁ జేయవలెను. తక్కినచోట జేయునపుడు యజమానుఁడు "అముకదేవస్య జీర్ణోద్ధారం కరిష్యే" యని సంకల్పించి నాందీశ్రాద్ధాంతముఁజేసి యా వ్యాపకేశ్వర హృదయాయ నమః "ఓం వ్యాపకేశ్వర శిరసేస్వాహా" యని మొదలుగ షడంగన్యాసముఁజేసి మరియొక దేవతామూర్తియైన యెడ మూలమంత్రముచే షడంగ న్యాసముఁ జేసి పూజింపవలెను. అఘోరమంత్రము నూటయెనిమిది మారులు జపించి యగ్ని బ్రతిష్ఠించి యఘోరమంత్రముచే నేయిగలపిన యావాలు వేయుమారులు వ్రేల్చి ఇంద్రాదులకు వారినామములచే బలియిచ్చి జీర్ణమైనదేవుని ప్రణవముచే పూజించి మండల దేవతలకుఁ దిలహోమముఁజేసి ప్రార్థించవలెను. "జీర్ణభగ్నమిదం చైవ సర్వదోషాదహం నృణాం, అస్యోద్ధారే రాష్ట్రహితావహం, తదధిష్ఠాయతాం దేవ ప్రహరామి తవాజ్ఞయా." అనఁగా నో దేవేశ్వరుఁడ! జీర్ణము భగ్నమునైన యీ మూర్తి ప్రజలకు క్షామరోగాది సర్వదోషములఁ జేయును. దీని యుద్ధారముఁజేసిన యెడ నాదోషములకు శాంతియగునని నీచేతనే శాస్త్రమందుఁ జెప్పఁబడినవి గనుక రాజులకు రాజ్యములకు క్షేమము జేయు జీర్ణోద్ధారము చేయఁబూని నీయాజ్ఞచేతనే నీ మూర్తిని దీసివేసెదను క్షమింపుమని ప్రార్థించవలెను. లింగోద్ధారముఁ జేయునపుడు క్షీరాజ్యమధు దూర్వాసమిత్తులచే మూలమంత్ర ముచ్చరింపుచు నూటయెనిమిది యాహుతులు వ్రేల్చి నువ్వులచే వేయుమారులు హోమముఁజేసి పాయసముచే నూరు

మారులు వ్రేల్చి లింగమును ప్రార్థించవలెను. "లింగరూపం సమాగత్య యేనేదం సమధిష్ఠితం, యాయాస్త్వం సంమితం స్థానం సంత్యజ్యైవ శివాజ్ఞయా, అత్రస్థానే చ యా విద్యా సర్వవిద్యేశ్వరై ర్యుతాః, శివేన సహసంతిష్ఠేయుః" అని యనఁగా నో యీశ్వరుఁడా! నీవు లింగరూపము నొంది యీ యధిష్ఠానమందుంటివి. ఇది జీర్ణ మయినది గనుక దీని విడచి నీకు సరిపడ్డ యితరాధిష్ఠానము నొందుమట్లు నీవాజ్ఞ యిచ్చి యుంచిన విద్యలను నధిష్ఠానదేవతలతో గలపుకొమ్మని ప్రార్థించి మంత్ర జలముచే నభిషేకించి విసర్జింపవలెను. అస్త్రమంత్రముచే నభిమంత్రించిన గునప ముతో ద్రవ్వి లింగమునుఁదీసి వామదేవమంత్రము బఠింపుచు నద్యాదులందు వ్రేయ వలెను. మూర్తియైనచోఁ బ్రణవ ముచ్చరింపుచు నట్లే విడువవలెను. దారులింగమైనచో తేనెబూసి యఘోరమంత్ర ముచ్చరింపుచు నగ్నిచే దహింపవలెను. సువర్ణాది మూర్తులై నచోఁ దిరుగ యోగ్యమగునట్లుచేసి యక్కడనే యుంచవలెను. అటుపైని శాంతి కొఱకు నఘోరమంత్రముచే నేయి, పాలు, తేనెయు గలపిన తిలలు వేయుమారులు వ్రేల్చి ప్రార్థించవలెను. ఎట్లనిన; "భడగవన్ భూతభవ్యేశ లోకనాథ నమోస్తుతే, జీర్ణలింగ సముద్ధారః కృతస్తవాజ్ఞయా మయా, అగ్నినా దారుజం దగ్ధం క్షిప్తం శైలాదికం జలే, ప్రాయశ్చిత్తాయ దేవేశ అఘోరాస్త్రేణ తర్పితం, జ్ఞానతోజ్ఞానతోవాఽ పి యథోక్తం న కృతం యది, తత్సర్వం పూర్ణమే వాస్తు త్వత్ప్రసాదాన్మహేశ్వర." అనగానో భగ వంతుడ! భూతభవిష్యజంతువులతోఁ గూడిన లోకములకన్నిటి కధిపతివి. నీకు నమస్కారము. నీ యాజ్ఞచేతనే జీర్ణలింగోద్ధారముఁ జేసితిని. దారులింగ మగ్నిచే దహించితిని శిలానిర్మితము జలమందు బడవైచితిని. ఇచ్చట జ్ఞానాజ్ఞానములచే నే జేయులోపము నీయనుగ్రహముచే పూర్తిగావలెను. ప్రాయశ్చిత్తమునకై యఘోరాస్త్ర ముచే తర్పణముఁ జేసితినని యాచార్యుఁడు ప్రార్థించవలెను. అటుపైని యజమానుఁ డు ప్రార్థించవలెను. ఎట్లనిన; "గోవిప్రశిల్పి భూతానా మాచార్యస్య చ యజ్వనః, శాంతిర్భవతు దేవేశ అచ్ఛిద్రం జాయతామిదం." అనఁగా నో దేవేశ్వరుఁడా! గోబ్రాహ్మ ణులకు శిల్పికి భూతములకు యజమానునికి నాచార్యునికి నరిష్టశాంతియగుఁ గాక. ఈకర్మ ఛిద్రశూన్యముగావుత యని యర్థము మూర్తి విషయమై విశేషము. శ్లో॥ "త్వత్ప్రసాదేన నిర్విఘ్నం దేహం నిర్మాపయత్యసౌ, వాసం కురు సురశ్రేష్ఠ తావత్త్వం చాల్పకేగృహే, వసక్లే శం సహిత్వేహ మూర్తిం వై తవపూర్వవత్, యావత్కార యతే భక్తః కురుతస్య చ వాంఛితం." అనఃగా నో దేవేశ్వరుఁడా! నీ ప్రసాదముచేతనే యీభక్తుఁడు నిర్విఘ్నముగ మూర్తిని నిర్మింప శక్తుఁడగును. అంతపర్యంతము స్వల్ప మైన యీ గృహమందు వాసమును సహింపుము. శీఘ్రమే పూర్వమువలె మూర్తిని జేయించుటకు నీభక్తుని వాంఛితము నెరవేర్పుమని ప్రార్థించవలెను; యటుపైని నూతన మూర్తినిగాని లింగమునుగాని నిర్మించి మీఁదఁజెప్పినవిధిచే కాలవిశేష మపేక్షించక మాసములోగానే ప్రతిష్ఠింపవలెను. ఇట్లు జీర్ణోద్ధారము. ప్రతిమకు శివలింగమునకు దేవాలయకలశమునకు మొదలగువానికి భంగము గలుగునపుడు స్వామికి మరణమగును. అపుడు శాంతియెటల్లనిన; "కుండం కృత్వా విధానేన

తతో హోమం సమాచరేత్, చరుంచ యమదైవత్యం సాధయిత్వా విధానతః, దధిక్షౌద్ర ఘృతాక్తానా మశ్వత్థసమిధాంతత, జుహుయాదష్టిశతం ప్రాజ్ఞ ఇమా రుద్రేతి మంత్ర విత్, మాషైర్ముద్గైస్తిలైశ్చైవ ఘృతేన మధునాపిచ, ఏభిః పంచసహస్రాణి శక్తిబీజేన హోమయేత్, భూమిం ధేను మనడ్వాహం స్వర్ణం ధాన్యం సదక్షిణం. దత్వాథ పంచ గవ్యేన స్నాయా ద్దేవాలయే ద్విజః బలిం దద్యాద్యమాయాథ కృసరైః పాయసైస్తథా, ఈశానాయ బలిం దత్వా కృతకృత్యో భవేన్నర." అనఁగా విధిప్రకారము కుండముఁ జేసి యమదేవతాకమైన చరువును వ్రేల్చవలెను. అటుపైని పెరుగు, తేనె, నేయి పూసిన రావిసమిధలు నూటయెనిమది మారులు ఇమా రుద్రా యనుమంత్రమున వ్రేల్చునది. ఆ పైని మినుములు, పెసలు, తిలలు, నేయి, తేనె, వీటిచే శక్తి బీజమనఁ గ హ్రీంకార ముచ్చరింపుచు నైదువేలు హోమముఁజేసి భూమిని, గోవును, వృషభ మును, సువర్ణమును, ధాన్యమును, దక్షిణతో దానముఁజేసి దేవాలయమందుఁ బంచ గవ్యముచే స్నానముఁ జేయవలెను. ఆ పైని యమునికి పాయసముచేతను పులగముచేతను యిచ్చి యీశాన బలిచేసి కృతార్థుఁడగును. ఇక్కడ మూల ప్రయోగ విధి కమలాకరమందుఁ దెలియునది. ఇఁక పూజార్హ పుష్పనిర్ణయము. "అపర్యుషిత నిశ్ఛిద్రైః ప్రోక్షితైర్జంతు వర్జితైః ఆత్మారామోద్భవైర్వాపి భక్త్యా సంపూజయే త్సురాన్, త్యజేత్కీటావపన్నాని శీర్ణపర్యుషితాని చ, స్వయం పతితపుష్పాణి మలాద్యుపహతానిచ, ముకులైర్నార్చయే ద్దేవ మపక్వైః కృమియు త్ఫలాభావే తృణగుల్మౌషధైరపి." అనఁ గా ఛిద్రములు పురుగులు లేక యాదినమందే కోసినపుష్పములు తనతోటలోనివిగాని పైని దెచ్చినవనిగాని ప్రోక్షించి వానిచే భక్తితో దేవారాధనముఁ జేయవలెను. పూర్వదిన మందు దెచ్చినవి పురుగుగొట్టినవి స్వయముగ రాలినవి బురదయంటినవి పుష్పములు వర్జింపవలెను. మొగ్గలు పక్వముగా నివి పురుగుగొట్టినవి యగు ఫలములును గూడదు. పుష్పములు దొరకనియెడ పత్రములును నవియు దొరకనిచో ఫలములచే నివేదనము చేయవలెను. అవియు లేనిచో తృణగుల్మాదులచేనైన బూజింపవలెను. "సమిత్పుష్పకుశాదీని బ్రాహ్మణస్స్వయమాహరేత్, శూద్రానీతైః క్రయక్రీతైః కర్మకుర్వన్ పతత్యధః" అనఁగా సమిధలు పుష్పములు దర్భ మొదలగునవి బ్రాహ్మణుఁడు దానే తెచ్చుకొనవలెను. శూద్రులు తెచ్చినవియు కొనినవియు నగు పుష్పములచే బూజిం చుట మొదలగు కర్మఁజేసిన పతితుఁడగును. కొందరు లక్షపుష్పార్చనము ధనమిచ్చి కొనిన పుష్పములఁ జేయుదురు. అందు వచనము "ధర్మార్జిత ధనక్రీతైర్యః కుర్యాత్కేశ వార్చనం, నవర్యుషితదోషోస్తి మాలాకార గృహేషుచ" అని యనఁగా ధర్మమార్గముచే నార్జించిన ధనముచే గొనినపుష్పములు పూజార్హములు. మరియు నట్టి పుష్పములకు పర్యుషితదోషమనఁగ పూర్వదినమందు గోసినవియైనను దోషములేదు. నిత్యపూజకై యన్యులతోటలో దెచ్చినని చౌర్యదోషము లేదు. పూజార్థమై పుష్పముల యాచింప గూడదు. "సమిత్పుష్ప కుశాదీని వహంతం నాభివాదయేత్, తద్ధారీ చైవనాన్యాహ్ని నిర్మాల్యం తద్భవేన్నరః" అనఁగా సమిధలు పుష్పములు దర్భ మొదలగువాని దెచ్చు చున్నవానికి నితరులు గాని యితరుల కతడుగాని యభివానముఁ జేయఁగూడదు.

తొలిరోజున తేగూడదు. నిర్మాల్యమై పోవునది. ఇట్లు దేవునిపూజించి నవియును యెడమచేత గ్రహించినదియును వస్త్రమందు గోసినవియు జలములో గడగినవియు పుష్పము నిర్మాల్య మనఁబడును. "వర్జంపర్యుషితం పుష్పం వర్జ్యం పర్యుషితం జలం, న వర్జ్యం తులసీపత్రం నవర్జ్యం తీర్థజం జలం." అనఁగా దినాంతరమందు దెచ్చిన జలపుష్పాదులు పర్యుషితములై నిషిద్ధములగును. తులసీవ్రతము తీర్థజలము మాత్ర మట్లుకాదు గనుక యోగ్యములగునని, "ప్రహరం తిష్ఠతేజాతీ కరవీర మహర్నిశం, నైవర్యుషితం పద్మం తులసీబిల్వపత్రకం." అనఁగా జాజిపుష్పములు జాముపైని పర్యుషితము లగును. గన్నేరు పువ్వులు పగలు రాత్రియు బనికివచ్చును. ఇఁక పద్మము తులసి బిల్వపత్రము వీటికి బర్యుషితదోషము మెపుడు తెచ్చినను లేదు. 'కుందంచ చందనం చైవాగస్త్యంచ కలికాస్తథా' అనఁగా మల్లెపువ్వులు. చందనము నగిసెపువ్వులు మొగ్గలును నట్లనే పర్యుషితములుగావు. బిల్వపత్రము మొదలగు వానికి బర్యుషితత్వము రానిదినముల సంఖ్యయెట్లనిన; బిల్వపత్రమునకు ముప్పది, దుచ్చెనపత్రమునకు మూఁడు జాజిపత్రమున కొకదినము, తులసి కారుదినములు, జమ్మికారు శతారికి బదునొకండు, మొగలికి నాలుగు, భృంగ రాజమునకు దొమ్మిది, దూర్వకు నెనిమిది, మందారమునకొకటి, పద్మమునకు నొకటి, నాగకేసరమునకు రెండు, దర్భకు ముప్పది, అగిసెకు మూఁడు, తిలపత్రమునకు నొకటి, తగరమున కారు మోదుగున కారు, కలువకు బదునొకండు, మల్లికాపుష్పమునకు నాలుగు, సంపెగ కైదు, గన్నేరున కెనిమిది, కుంభికి నొకటి, దమనమునకు బదునొకండు మరువకమునకు రెండు. వీటికిన్ని దినములపై బర్యుషితత్వదోషము గల్గును. తులసిని గ్రహించుటకు కాలము. "వైధృతౌ చ వ్యతీపాతే భౌమభార్గవ భానుషు, పర్వర్వయేచ సంక్రాంతౌ ద్వాదశ్యాం సూతకద్వయే, తులసీంయే విచిన్వంతి తేచ్ఛిందంతి హరేశ్శిరః " అనఁగా వైధృతియందు వ్యతీపాతయందు ఆదిత్యమంగళ శుక్రవారములందును పూర్ణిమామావాస్యలదును సంక్రాంతింయందును ద్వాదశియందు నాశౌచములు రెంటియందును తులసిగోయువారు భగవంతునికి ద్రోహము చేసినవారగుదురు. "నైవచ్ఛింద్యా ద్రవౌ దూర్వాంతులసీం నిశిసంధ్యయోః, ధాత్రీపత్రం కారి&తకేచ పుణ్యార్థీ మతిమాన్ నరః, ద్వాదశ్యాం చ దివాస్వా పస్తులప్యా పచయ స్తథా, విష్ణోశ్చైవ దివాస్నానం వర్జనీయంసదాబుధైః"అనఁగా రవివారమందు దూర్వలు ద్రుంచుట రాత్రియందుగాని సంధ్యాకాలములందుగాని తులసిగోయుట కార్తికమాసమందు సిరికెపత్రముగోయుట పుణ్యము గోరు వివేకి చేయఁగూడదు. మరియు ద్వాదశి బగలు నిద్రించుట తులసి గోయుట విష్ణువునకు బగలు స్నానమును వివేకి చేయఁ గూడదు ఇట్లు పగలు స్నానము నిషేధించుటచే రాత్రి స్నానాదిషోడశోపచారములచే బూజింపవచ్చును. పగటియందు గంధపుష్పాంజలివరకుఁ జేయునది. అని కమలాకరాహ్ని కమం దున్నది.విష్ణువునకు ద్వాదశి యందు నిర్మాల్యము దీయు టయుఁ గూడదని తంత్రాంతరమందున్నది. దీనికపవాదము పురుషార్థం చింతా మణిలో నారదీయవచనము. "పంచామృతేన సంస్నాప్య ఏకాదశ్యాం జనార్దనం,

ద్వాదశ్యాం పయసా స్నాప్య హరిసాయుజ్య మశ్నుతే” యని అనఁగా ఏకాదశియందు విష్ణుని బంచామృతస్నానము చేయించి ద్వాదశియందు క్షీరాభిషేకముఁ జేసినచో భగవత్సాయుజ్యము నొందునని. “దేవార్థే తులసీ ఛేదో హోమార్థే సమిధాంతథా, ఇందుక్షయేన దుష్యేత గవార్థంతు తృణస్యచ” అనఁగా దేవపూజకై తులసియు హోమ మునకై సమిధలు గోవులకై తృణమును గోసినయెడ గృష్ణామావాస్యయందు దోషము లేదని, తులసి గ్రహించుటకు మంత్రము. “తులస్యమృత నామాసి సదాత్వం కేశవ ప్రియే, కేశవార్థే విచిన్వామి వరదాభవ శోభనే” అనఁగా నో తులసీ నీవు కేశవునకు బ్రియమైనదానవు. అమృతనామముగలదానవు. నిన్ను గేశవునిపూజార్థము గోయు చున్నాను. నాకు వరమిమ్మనుట. జాజి, మల్లె, గన్నేరు, అశోకము, కలువ, సంపంగి, పగడ, మారేడు, జమ్మి, కుశ యివి సర్వదేవతలకు విహితములు. ఇఁక విహితములు ప్రతిషిద్ధములు గనుక వైకల్పికము లెవ్వియనిన, పాటల పుష్పములు శమీపత్రమును దుర్గాదేవికి, మల్లె, మోదుగు, పగడ, దూర్వ, యివి శివునికి, తెల్లగలువయు తగరపుష్ప మును సూర్యునికి తులసి, భృంగరాజము, తమాలపత్రమును శివదుర్గలకు అగిసె, కురివింద, లొద్దుగుపుష్పము విష్ణుశివులకు ఉమ్మెత్త, మందారము, విష్ణుసూర్యులకు నని వైకల్పికములు. ఇఁక విష్ణుప్రియములు. మాలతీకేతకీ మల్లికాశోక చంపక పున్నాగవకులోత్పల కుందరకరవీరపాటలా తగరపుష్పములు మొదలగు సుగంధిపుష్ప ములు విష్ణుప్రియములు. అపామార్గ భృంగరాజఖదిరశమీదూర్వాకుశదమనక బిల్వ తులసీ పత్రములుత్తరోత్తరముగ నధికప్రియములు. తులసి సర్వాధికము జాజిపువ్వుల మాల సమర్పించినచో గల్పకోటిశతము విష్ణుపురవాసము గల్గును. మామిడి పూగుత్తు లచే బూజించినచో గోటిదాన ఫలము గల్గును. ఇఁక శివునికి,“చతుర్ణాం పుష్పజాతీ నాంగంధమాఘ్రాతి శంకరః, అర్కస్య కరవీరస్య బిల్వస్య వకులస్య చ” అనఁగా ‘జిల్లేడు గన్నేరు బిల్వము పగడ’ వీని గంధము శివునికి బ్రియము. అందు శ్వేతార్క పుష్పము పదిసువర్ణదానముల ఫలము నిచ్చును. వకుల పుష్ప మంతకంటె వేయి రెట్టుల ఫలమిచ్చును. ఇట్లు దత్తూరము జమ్మిపుష్పము ద్రోణపుష్పము నీలోత్పలము వీనిలోనుత్తరోత్తరము సహస్ర గుణమధికము. “మణిముక్తా ప్రవాళైస్తురత్నై రప్యర్చనం కృతం, న గృహ్ణామి వినాదేవి బిల్వపత్రై ర్వరాననే, సర్వకామప్రదం బిల్వం దారిద్రస్య వినాశనం” అనఁగా నోపార్వతి మణి, ముక్తాప్రవాళములచే నర్చించినను బిల్వపత్ర ములు లేనిచో నట్టిపూజను గ్రహించను గనుక బిల్వపత్రము పూజలో సర్వకామముల నిచ్చును. దారిద్ర్యము పోగొట్టునని యీశ్వరవచనము. నల్లగలువల సహస్రముచే మాలికను సమర్పించినచో గల్ప కోటి సహస్రములు శివపురవాసము నిచ్చును. దత్తూరములు బృహతీ పుష్పములు పూజించెనేని లక్షగోదానఫలము. పాటలామందా రాపామార్గ జాతీచంపకోశీరతగరనాగకేసర పున్నాగజపామల్లీసహకారకుసుంభీపుష్ప ములు శివప్రియములు “దత్తూరాణికదంబాని రాత్రౌ దేయాని శంకరే” అనఁగా నుమ్మెత్తపువ్వులు కడిమిపువ్వులు రాత్రిపూజలో శివున కర్పించవలెను. కేతకాని కదం బాని యని మదనరత్నమందున్నది. “అభావేపత్రపుష్పణా మన్నాద్యే నాభిపూజయేత్,

శాలితండులభింపనిచో నన్నాదుల నివేదించి పూజింపవలెను. లేదా బియ్యము గోధూమములు యవలు వీనిచేనైన బూజింపవచ్చును. ఇఁక నిషిద్ధములు. మంకెనపుష్పములు బొండుమల్లెలు గురివిందపూలు మొగలిపువ్వు వెలగపూలు పగడపువ్వులు సిరిసెనపువ్వులు నేము చెట్టుపువ్వులు నిషిద్ధములు. పుష్పపత్రాదులు దేవుని కర్పించునపుడు తనకెదురుగ వెలికిల వేయవలెను. అట్లు వచనము. 'పత్రం పుష్పం ఫలం చైవ యథోత్పన్నం తథార్పయేత్' అని యనఁగా పత్రపుష్పాదుల యుత్పత్తినాళములు పూజకునికెదురుగ నర్పించవలెననుట. బిల్వపత్రము మాత్రము తన కెదురుగ నగ్ర ముండునటుల ముడిచి యర్పించవలెను. పండిన మామిడిపండు శివునికర్పించినచో బదివేలవత్సరములు శివపురవాసము. 'సవ్యం వ్రతేత్తతోసవ్యం ప్రణాశీం నైవలంఘయేత్' అనఁగా స్థిరలింగము ప్రదక్షిణముఁ జేయుచో సోమసూత్ర పర్యంతము సవ్యముగ నడచి తిరుగ నపసవ్యముగఁ జేయవలెనుగాని సోమసూత్రము దాఁటగూడదు. చరలింగమందు సవ్యముగనే ప్రదక్షిణము. దేవికిగూడ వకుల కుందాదులతో గూడిన మీఁదఁజెప్పిన పుష్పములే ప్రియములు. "ధాన్యానాం సర్వపత్రైశ్చ పుష్పైర్దేవీం ప్రపూజయేత్, దూర్వాంకురై స్సింధువారై ర్బంధూకాగస్తి స్తంభవైః" అనఁగా ధాన్యములయొక్క యన్నిపత్రములచేతను పుష్పములచేతను మరియు దూర్వాంకురములు వావిల పూవులు మంకెనపువ్వులు నగిసెపువ్వులు వీనిచే దేవిని బూజింపవలెను. బిల్వపత్రములచేఁ బూజించినచో రాజసూయఫలము. గన్నేరు పూలమాలిక సమర్పించెనేని యగ్నిష్టోమఫలము. పగడ పువ్వుమాలికచే వాజపేయఫల మగును. ద్రోణపుష్పమాలికచే రాజసూయ ఫలమని యిట్లు సూర్యవిఘ్నేశాదులకును, దరచుగ విష్ణునకువలెఁ దెలియునది.

## శివనిర్మాల్య గ్రహణవిధి

"అగ్రాహ్యం శివనిర్మాల్యం పత్రం పుష్పం ఫలం జలం, సాలగ్రామ శిలాసంగాత్సర్వం యాతి పవిత్రతాం" దీనియర్థము మీఁద వ్రాయఁబడినది. శైవసౌరనైవేద్యము భక్షించెనేని చాంద్రాయణముఁ జేయునది తరుచుగ భక్షించెనేని ద్విగుణముగఁ జేయునది. బుద్ధిపూర్వముగ నావృత్తియైనచో సాంతపనము ఇతర నిర్మాల్యమందును నాపద లేనిచో నిట్లనే తెలియునది. ఈ నిషేధము జ్యోతిర్లింగము స్వయంభూలింగము సిద్ధప్రతిష్ఠితలింగములు తప్ప దక్కినస్థావర లింగము స్వయంభూలింగము సిద్ధప్రతిష్ఠిత లింగములు తప్ప దక్కిన స్థావరలింగముల నివేదనకని తెలియునది. జ్యోతిర్లింగాదులందైనచో పూజకుడిచ్చు ఫలతీర్థాదికము భక్తిచే గ్రహింపవచ్చును. లోభము చేయఁ గూడదు. అనఁగా శుద్ధి నుద్దేశించియేకాని భక్షణోద్దేశము గూడదనుట. పంచాయతనములోనున్న చరలింగములు ప్రతిమలు మొదలగువానికి నివేదించిన యన్నాదికము సహితము గ్రహింపవచ్చును. జ్యోతిర్లింగాద్యతిరిక్తస్థిర లింగములందు తీర్థోదకము చందనము మాత్రము శ్రద్ధావంతులైన శివభక్తులు గ్రహింపవచ్చును. జ్యోతిర్లింగాదులందుబూజకు లిచ్చునన్నము గూడ గ్రహింపవచ్చు నని కొందరు, ఇఁక నక్షత్ర సంజ్ఞలు, ఉత్తర, ఉత్తరాషాఢ, యుత్తరాభాద్ర, రోహిణియు ధ్రువనామకములు,మఘ,

భరణి, పుబ్బ, పూర్వాషాఢ, పూర్వాభాద్రయు క్రూర సంజ్ఞిక ములు, శ్రవణము, ధనిష్ఠ, శతభిషము, పునర్వసు, స్వాతియునివి చర నక్షత్రములు, అశ్విని, హస్త, పుష్యము, నివి క్షిప్రములు. అనూరాధ, రేవతి, మృగశీర్ష, చిత్రయు, నివి మృదునక్షత్రములు. కృత్తికా, విశాఖలు, మిశ్రములు, మూలాశ్లేషా జ్యేష్ఠార్ద్రలు తీక్ష్ణ నక్షత్రములు. "యత్రనోక్తా తిథిస్తత్ర గ్రాహ్యారిక్తామమాం వినా, వారోపియత్రన ప్రోక్త స్తత్రార్కార్కి కుజాన్వినా." అనఁగా తిథి నిర్దేశింపనిచో నమావాస్యను రిక్తతిథిని విడిచి యితరము గ్రహింపవచ్చును. వారము నిర్దేశింపనియెడ రవి శని భౌమవార ములు తప్ప దక్కినవారములు గ్రహింపవచ్చును. చరనక్షత్రములు మృదునక్షత్రములు క్షిప్ర నక్షత్రములు ధ్రువనక్షత్రములు విశాఖయు మఘయు దీనియందును మంగళ వారమునందు నితర శుభవారమందును భూమిదున్నుట శుభము. సూర్యుఁడు విడచిన నక్షత్రము మొదలుకొని మూఁడు నెనిమిదియు దొమ్మిదియు నెనిమిదియు నను నక్షత్రములందును శుభం శుభమశుభం శుభమని హలచక్రము దున్నుటకుఁ జెప్పిన నక్షత్రమందే శనిభౌమవరములు తప్ప దక్కినవారములందు బీజవాసము శుభము. ఇట్లు చేనియుఱుపునకును పంటగోయుటను దెలియవలెను. కళ్ళములో మధ్యవేయు స్తంభము పాలుగలచెట్టు కట్టను మీఁదఁజెప్పిన ముహూర్తమందు పాత వలెను. ధాన్యము నూర్పు, జ్యేష్ఠ, మూల, మఘ, శ్రవణము, రేవతి, రోహిణి, అనూరాధ,పుబ్బ, పూర్వాషాఢయు వీటియందు శుభము ధాన్యము సంగ్రహించుట క్షిప్రధ్రువచరమృదునక్షత్రములందును మూలయందును బుధ గురు శుక్రవారము లందును చరముతప్ప దక్కిన లగ్నమందు శుభము. 'ఓం ధనదాయ సర్వలోకహితా యదేహిమే ధాన్యంస్వాహా యని' మంత్రమువ్రాసి ధాన్యపు కొట్టులో నుంచవలెను. అందున థాన్యవృద్ధి యగును. 'భుదమందదినేనైవ ధనధాన్య వ్యయశ్శుభః, అద్యాన్న వాన్నం సద్వారే మృదుక్షిప్ర చరే పివా' అనఁగా క్రొత్తగా ధనధాన్యములు కర్చు బుధ శనివారములు తప్ప దిక్కన మంచి వారమందు మృదక్షిప్ర నక్షత్రములందు పగటియం ప్రారంభించవలెను.

## వస్త్రాదుల ధరించుట

"వస్త్రభూషణ విధిర్ద్రవాశ్వినీహస్త పంచక పునర్వసుద్వయే, పౌష్ణవాసవ భయోశ్చ సత్తిథౌ మందభౌమ శశివాసరాన్ వినా" అనఁగా వస్త్రము భూషణము ధరించుట ధ్రువనక్షత్రములందును నశ్విని హస్తాదులైదును పునర్వసు, పుష్యము, పౌష్ణమనఁగ, రేవతి, వాసవమనఁగ ధనిష్ఠ ఈ నక్షత్రములందును మంచితిథియందు శని మంగళ సోమవారములుతప్ప దక్కిన వారమందును శుభము. "అనుక్తేపీష్టదం వస్త్రం విప్రాజ్ఞోత్సవ లబ్ధిషు, ధ్రవపుష్యాదితౌ యోషిద్ధత్తేయా వస్త్రవిప్రాజ్ఞయైనపుడు నుత్సవమైనపుడును జెప్పని నక్షత్రాదికమందు వస్త్రధారణ మిష్టమునిచ్చును. ధ్రువ నక్షత్రమునందును పుష్య పునర్వసులందును స్త్రీలు వస్త్రభూషణములు ధరింపగూడదు. శతభిషజమందు స్నానము చేయఁగూడదు. "పాదుకాసనశయ్యాదే ర్భోగస్సత్తిథివాసరే, ధ్రువక్షిప్ర మృదుశ్రోత్ర భరణీషు పునర్వసౌ." అనఁగా పాదుకలు నాసనము శయ్య

మొదలగునవి వాడుక నారంభించుట మంచి తిథి వారములందు ధ్రువక్షిప్రమృదు నక్షత్రములందును శ్రవణ భరణిపునర్వసులందును శుభము. “చేన్నవ్యవస్త్రం మధ్యాంశే దగ్ధస్ఫుటితపంకిలం, తత్త్యజేచ్ఛాంతికం కుర్యాత్త్యజే దేవాంత్యభాగయోః” అనఁగా వస్త్రమునడుమునందు ధగ్ధమైనను చిరిగినను మఱ్ఱియైనను దానివిడిచి శాంతింజేయ వలెను. చెంగుల నట్లయినచో దాని విడుచటయేకాని శాంతియక్కరలేదు. ‘విజ్ఞేయ్య మేతచ్ఛయ్యా యామాస్తృతౌ పాదుకాస్వపి.’అనఁగా శయ్యయు పరుపు దుప్పటియు పాదుకలు వీటికి నట్లనే తెలియునది. ‘సూచీకర్మాను రాధాశ్వి చిత్రామృగ పునర్వసౌ, వస్త్రంక్షాళ్యంధారణోక్తే కాలేబుధదినం వినా’ అనఁగా అనూరాధ, అశ్విని, చిత్ర, మృగశీర్ష, పునర్వసు వీటియందు కుట్టుపని చేయునది. ధారణమునకుఁ జెప్పిన ముహూర్తమందు బుధవారము మాత్రము విడిచి వస్త్రము నుదికించుట శుభము. ‘భోజనం భాజనే రౌప్య స్వర్ణకాంస్యాది నిర్మితే, కుర్యాదమృతయోగేషు చరక్షిప్రమృదు ధ్రువైః’ అనఁగా చరక్షిప్ర మృదుధ్రువనక్షత్రములందును అమృతాదియోగములందును వెండి బంగారు కంచు మొదలగు పాత్రలో భోజనమారంభించునది. “స్యాద్భూషణా నాం ఘటనా చరక్షిప్రమృదుధ్రువైః, శుభవారే రత్నవతాం మిశ్రభేపి రవౌకుజే.” అనఁగా నగలకు పట్టుమొదలగునవి గట్టుట చరక్షిప్ర మృదుధ్రువనక్షత్రములందు శుభవారమందు గావలెను. రత్నములుగల భూషణములకు మిశ్రనక్షత్రమందుగూడ రవి కుజవారములందు సహితము నమర్చుట గావచ్చును. ఇట్లు వస్త్రాది ముహూర్త విచారము. ‘శస్త్రాణాం ఘట్టనం క్రూరమిశ్రాశ్వి మృగతీక్ష్ణ భే, శస్త్రం ధార్యం ధ్రుశక్షిప్ర మృదుజ్యేష్ఠా విశాఖకే ‘అనఁగా క్రూరమిశ్రతీక్ష్ణ నక్షత్రములందును నశ్వినీ మృగశీర్షా నక్షత్రములందును కత్తులు మొదలగునవి సానబట్టవలెను. ధ్రువక్షిప్ర మృదునక్షత్రము లందును జ్యేష్ఠావిశాకల యందును శస్త్రము ధరింపవలెను. “సేవాకార్యాక్షిప్రమైత్ర ధ్రువైర్జ్ఞ జ్యార్క భార్గవే, మందేపిచే త్సేవకర్షంస్వామిభాన్న ద్వితీయకం.” అనఁగా క్షిప్రధ్రువనక్షత్రములందును మిత్రదేవతాక నక్షత్రమందును బుధ గురు శుక్రాదిత్య వారములందును నౌకరీ యారంభించునది. సేవకుని నక్షత్రము స్వామినక్షత్రమునకు రెండవది గాని యెడ శనివారమందు నారంభింపవచ్చును. “హస్తషట్కధ్రువ శ్రోత్ర రేవతీ పుష్యభే శుభం, పునర్వసౌ చ శిబికా గజాశ్వా ద్యధిరో హణం.” అనఁగా హస్త, చిత్ర, స్వాతి, విశాఖ, అనూరాధ, జ్యేష్ఠ, శ్రవణము, రేవతి, పుష్యము, పునర్వసు, వీనియందును ధ్రువనక్షత్రములందును సవారి గజము నశ్వము నెక్కుటచేయవచ్చును.

## రాజదర్శనము అంగడిపెట్టుట పశుగమనము ఋణముతీయుట

“రాజ్ఞాం విలోకనంక్షిప్ర శ్రుతిద్వయ మృదుధ్రువే” అనఁగా క్షిప్ర మృదుధ్రువ నక్షత్రములందును శ్రవణధనిష్ఠలందును రాజప్రథమదర్శనముఁ గూడును. “నృత్యారంభః పుష్యధ్రువే మృగజ్యేష్ఠా ధనిష్ఠయోః, అనూరాధా శతభిషఘ్నస్తేస్యా చ్ఛుభవాసరే” అనఁగా ధ్రువనక్షత్రములందును పుష్యము, మృగశీర్ష, జ్యేష్ఠ, ధనిష్ఠ,

అనూరాధ శతభిషజము హస్త వీనియందును శుభవారమందు నృత్యారంభము శుభము. 'విపణిస్స్యాన్మృదుక్షి ప్రధ్రువైరిక్తా కుజాన్వినా' మృదుక్షిప్ర ధ్రువనక్షత్రము లందును రిక్తాతిథి కుజవారములవిడిచి పణ్యమువీధియందుంచుట మంచిది. "క్రయః కార్యోశ్వినీస్వాతీ శ్రవశ్చిత్రాశతాం త్యభే, విక్రయో భరణీ పూర్వాత్రయాశ్లేషా సుమిత్రభే." అనఁగా నశ్విని, స్వాతి, శ్రవణము, చిత్ర, శతభిషజము, రేవతి' యీ నక్షత్రములందు గొనుట మంచిది. భరణి, పుబ్బ, పూర్వాషాఢ, పూర్వాభాద్ర, ఆశ్రేష మిత్ర దేవతాకనక్షత్రము వీటియందు వస్తువమ్ముట మంచిది. "సేతుబంధో ధ్రువే స్వాత్యాం జీవార్క శనివాసరే, నానాపశుక్రియా హస్తపుష్యార్ద్రా మృగశిశ్రభే, పునర్వసౌ ధనిష్ఠాశ్వి పూర్వాజ్యేష్ఠా శతాంత్యభే" అనఁగా ధ్రువనక్షత్రమందును స్వాతియందును గురు రవి శనివారములందును సేతువుగట్టుట మంచిది. మరియు హస్త, పుష్యము, ఆర్ద్ర, మృగశీర్ష, మిశ్రనక్షత్రము, పునర్వసు, ధనిష్ఠ, అశ్విని, పుబ్బ, జ్యేష్ఠ, శతభిషజము, రేవతి యీ నక్షత్రములు పశువుల యన్నిక్రియలకు శుభములు. "త్యక్త్వార్క భౌమేందు శనీన్ శ్రుతిచిత్రా ధ్రువాణి చ, ఆమారిక్తాష్టమీశ్చాపి గతిక్రియ ముఖాశ్శుభాః"అనఁగా రవి కుజ సోమ శనివారములను శ్రవణ చిత్రా ధ్రువనక్షత్రములను అమావాస్యయు రిక్తయు నష్టమియు దప్ప తక్కిన నక్షత్ర తిథులందు పశువులగమనము వాటి వ్యవహారము శుభము. "ద్రవ్యం లఘుచరైర్యోజ్యం వృధ్యర్థ చరలగ్నకే, ఋణంభౌమే నగృహ్ణీయా ద్వృద్ధియోగేర్క సంక్రమే, ధనిష్ఠా పంచకే హస్తే త్రిపుష్కర ద్విపుష్కరే, భౌమాదిషు ఋణచ్ఛేదం కుర్యాచ్చ ధనసంగ్రహం, బుధేధనం న ప్రదేయం సంగ్రహస్తుబుధేశుభః అనఁగా కొద్ది ద్రవ్యము వృద్ధికై చరనక్షత్రములందును చరలగ్నమందునీవలెను. భౌమవారమందును వృద్ధియను యోగమందును సూర్య సంక్రాంతి యందును ధనిష్ఠాపంచకమందును హస్తయందును త్రిపుష్కరమనఁగా శని రవి భౌమవారము లలో నొకటియు త్రిపాదనక్షత్రము భద్రాతిధియు గలసినచో ద్రిపుష్కరము. ద్విపుష్కర మనఁగా మృగశీర్ష చిత్ర ధనిష్ఠవీటిలో నొకటియు భద్రాతిథిపగలును, ద్విపుష్కరము. ఈ రెంటియందును ఋణము పుచ్చుకొనఁగూడదు. మరియేమనిన; భౌమవారము మొదలగుగ జెప్పిన వాటియందు ఋణముఁ దీర్చివేయవలెను. ధనసంగ్రహముగూడఁ జేయవలెను. బుధవారమందు ధనమీగూడదు. సంగ్రహింపవచ్చును. "శుభాశుభేషు త్రిగుణం ద్విగుణం చ ఫలం క్రమాత్, మిశ్రక్రూరేషు తీక్ష్ణేషు స్వాత్యాం ద్రవ్యం న లభ్యతే, తత్తం ప్రత్యేక్తం నిక్షిప్తం నష్టం చేత్యాహనారదః" అనఁగా నీ జెప్పిన శుభాశుభ కాలమందు శుభకాలమందు మూఁడు రెట్టులు ఫలము నశుభకాలమందు రెండు రెట్టులు ఫలమని తెలియునది. మరియు మిశ్రక్రూర తీక్ష్ణనక్షత్రములందును స్వాతియందును ధనము దత్తమైనను నెరువిచ్చినను దాచుకొన్నను నష్టమైనను దిరుగ దొరకదని నారదుఁడు చెప్పెను. "అంధం మందంచచిబిటంసులోచన మితిక్రమాత్, గణనీయం రోహిణీభాదం ధేనష్టం లభేద్రుతం, మందేయత్నాల్లభేతైష చిబిటస్వక్ష యోర్నహి, అన్విష్యం పూర్వతోంధేషు మందసంజ్ఞేషు దక్షిణే, ప్రతీచ్యాంచిబిటాఖ్యేషు సులోచన ఉదగ్గిశి" అనఁగా రోహిణి మొదలుగ గ్రమమున నాలుగేసి నక్షత్రములకు

నంధము మందము చిబిటము సులోచనము నని నాల్గు సంజ్ఞలు. అందు నంధనక్షత్ర మందు నష్టమైన ద్రవ్యము దూర్పునవెదకినఁ దొరుకును. మందనక్షత్రమున నష్ట మైనది దక్షిణమున వెదకిన యత్నముచే దొరకును. చిబిటమందు పశ్చిమముసను సులోచనమందుత్తరమునను వెతకినచో నొకవేళఁ దొరకిన దొరకవచ్చునని 'రాజాభి షేక శ్రవణే ధ్రువర్షే జ్యేష్ఠా మృగక్షిప్ర ఉదగ్రకౌస్యాత్, త్యక్త్వారిరిక్తాధిక చైత్రరాత్రీ శ్చంద్రేజ్య శుక్రాభ్యుదయే శివాయ' అనఁగా రాజులకు పట్టాభిషేకము శ్రవణము ధ్రువనక్షత్రము జ్యేష్ఠ మృగశీర్ష క్షిప్రనక్షత్రము వీనియందు నుత్తరాయణమందు రిక్తా తిథియు నధికమాసము చైత్రము రాత్రియు చంద్ర గురు శుక్రులయుదయము దప్ప తక్కిన మాసతిథులందు మంగళమగును. 'జలాశయానాం ఖననం మఘాపుష్య ధ్రువేమ్మృగే, పూర్వాషాఢానురాధాంత్య ధనిష్ఠా శతహస్తభే, జలరాశిగతేచంద్రేలగ్నస్థే చ బుధేగురౌ' అనఁగా మఘ, పుష్యము, ధ్రువనక్షత్రము, మృగశీర్ష, పూర్వాషాఢ, అనూరాధ, రేవతి, ధనిష్ఠ, శతభిషజము, హస్తయు నీ నక్షత్రములందు చంద్రుఁడు జలరాశియందును బుధగురులు లగ్నమందునుండఁగ చెరువులు మొదలగునవి త్రవ్వుటకు శుభము.

## క్షౌరమునకు విధి

"క్షౌరం చౌలోక్తనక్షత్ర వారాదిషు శుభంజగుః, పంచమే పంచమే రాజ్ఞాం దినేన్యేషాం యదృచ్ఛయా, శ్మశ్రుకర్మ భవేన్నైవ నవమే దివసేక్వచిత్' అనఁగా చూడా కర్మకుఁ జెప్పిన తిథివారనక్షత్రములందు క్షౌరము శుభము. అది రాజులకై దేసిరోజు లకు యుక్తము. ఇతరులకు స్వేచ్ఛచే నగును. తొమ్మిదవ దినమందు క్షురకర్మఁ గూడదు. 'క్షౌరంభూతే రతందర్శే వర్జయేచ్ఛ జిజీవిషుః, క్షౌరం న కుర్యాదభ్యక్త భుక్తస్నాత విభూషితాః, ప్రయాణ సమరారంభే నరాత్రౌ న చ సంధ్యయోః, శ్రాద్ధాహే ప్రతిపత్రిక్తా వ్రతాహ్నిచన వైధృతౌ' అనఁగా చతుర్దశియందు క్షౌరము నమవాస్య యందు సంగమము జీవింపఁదలచువాఁడు వర్జింపవలెను. మరియు నభ్యంగము జేసుకొనియు భుజించియు స్నానముజేసియు నలంకరించుకొనియు క్షౌరముఁ గూడదు. ఇట్లు ప్రయాణదినమున యుద్ధారంభమందును రాత్రియందును సంధ్యలం దును శ్రాద్ధదినమందును ప్రతిపత్తిథి రిక్తతిథులందును వ్రతదినమందును వైధృతి యందును క్షౌరముఁ గూడదు. "ప్రశస్తం జన్మనక్షత్రం సర్వకర్మసుకీర్తితం, క్షౌరప్రయాణ భైషజ్య వివాదేషు న శోభనం." అనఁగా జన్మనక్షత్రము క్షౌరమునకు ప్రయానమునకు నౌషధమునకు వివాదమునకు మంచిదికాదు. తక్కిన కర్మలకుఁ బ్రశస్తము. "షష్ఠ్యమా పూర్తిమాపాత చతుర్దశ్యష్టమీ తథా, ఆసుసన్నిహితం పాపం తైలేషు స్త్రీభగేక్షురే." అనఁగా రాజకార్యమందు నియోగింపఁబడు రాజోపజీవు లగునరులనకు క్షౌరమందు గాలనియమమంతయక్కరలేదు. "క్షౌరం నైమిత్తికం కార్యం నిషేధే సత్యపి ధ్రువం, యజ్ఞేమృతౌ బధమోక్షే నృపవిప్రాజ్ఞయాపిచ." అనఁగా యజ్ఞము ప్రేతకర్మ కర్తృత్వము కైదువదలుట రాజాజ్ఞయు విప్రాజ్ఞయు మొదలగు నిమిత్తములచే నగుక్షురకర్మ నిషిద్ధ దినమందును జేయవలెను. "ప్రాగ్వయస్థై స్వపితృకై ర్నకార్యం ముండనం సదా,

ముండనస్య నిషేధేపి కర్తనంతు విధీయతే.” అనఁగా పూర్వవయస్కులు తండ్రిగల వారును దరుచుగ ముండనముఁ జేయఁగూడదు. మరియేమనిన; కత్తిరించుట విధింపఁబడినది. ఉదఙ్ముఖః ప్రాఙ్ముఖోవా వపనం కారయేత్సుధీః, కేశశ్మశ్రులోమనఖాన్యుదక్సంస్థాని వాపయేత్.” అనఁగా నుత్తరముఖముగ గాని తూర్పు మొగముగ గాని కూర్చుండి క్షౌరముఁ జేయించుఁకొనవలెను. అపుడు కేశశ్మశ్రులోమనఖముల నుత్తరసమాప్తిగ గొరిగింపవలెను. “అనర్తోహి చ్ఛత్రః పాటలిపుత్రోఽదితిర్దితిశ్శ్రీశః, క్షౌరేస్మరణాదేషాం దోషానశ్యంతి నిశ్శేషాః” అనఁగా నానర్తదేశము నహిచ్ఛత్రము పాటలీపుత్రము నదితియు దితియు విష్ణువు ననువీరిని క్షౌరకాలమందు స్మరించిన యెడ సమస్తదోషములు నశించునని.

## రోగమువచ్చిన నక్షత్రముల ఫలము

అశ్వినియందు రోగముపుట్టినచో నొకరోజుగాని తొమ్మిదిగాని యిరువదైదు దినములుగాని పీడయుండును. భరణియందుపదునొకండుగాని యిరువదొకటిగాని యొకమాసముగాని మరణముగాని చేయును. కృత్తికయందు తొమ్మిది పది యిరువదొకటిపర్యంతము పీడయగును. రోహిణియందఉ పది తొమ్మిదియేడు మూఁడు దినములైనను పీడించును. మృగశీర్షయందు నైతు తొమ్మిది ముప్పది రోజులవరకుఁ బీడించును. ఆర్ద్ర యందు మరణముగాని లేదా మాసముగాని పది దినములుగాని పీడయైన నగును. పునర్వసునందు నేఁడు దినములుగాని తొమ్మిదివరకుగాని పీడయగును. లేదా మృత్యువగును పుష్యమందు నేడు దినములు పీడయైనను మృత్యువైన నగును. ఆశ్లేష యందు మృత్యువైనను యిరువది ముప్పది దినములుగాని తొమ్మిది వరకు గాని పీడయగును. మఘయందు మరణమైనను మాసమున్నరగాని మాసముగాని యిరువది దినములుగాని పీడయైనగల్గును. పుబ్బయందు మృత్యువుగాని లేదా సంవత్సరము మాసము పక్షము రెండుమాసములను పీడగానిగలుగును. ఉత్తరయందిరవదేడు పదునైతు నేడు దినములైనను బీడించును. హస్తయందు మృత్యు వైనను నెనిమిదిగాని తొమ్మిదిగాని పదేనుగాని దినములు పీడయైన నగును. చిత్ర యందు పక్షమైనను పదునొకండు పదియెనిమిది దినములైనను పీడించును. స్వాతి యందు మృత్యువైనను నొకటి రెండు నాలుగైదు మాసములుగాని పదిదినములుగాని పీడయైన గలుగును. విశాఖయందు మాసమైనను పక్షమైనను నెనిమిది యిరువది దినములైనను పీడించును. స్వాతి యందు మృత్యువైనను నొకటి రెండు నాలుగైదు మాసములుగాని పదిదినములుగాని పీడయైన గలుగును. విశాఖయందు మాస మైనను పక్షమైనను నెనిమిది యిరువది దినములైనను పీడించును. అనూరాధ యందు పదిగాని యిరువదెనిమిదిగాని మాసముగాని యిరువదొక దినముగాని పీడయైన గలుగును. మూలమందు మృత్యువైనను పక్షమైనను తొమ్మిది యిరువది దినములు పీడయైనను గలుగును. పూర్వాషాఢ యందు మృత్యువైనను రెండు మూఁడు నారు మాసములుగాని యిరువది పదేనుదినములుగాని పీడయైనను గలుగును ఉత్తరాషాఢయందు మాసమున్నరగాని యిరువది దినములుగాని మాసముగాని పీడయగును. శ్రవణమం దిరదవ

దైదు పది పదునొకండు దినములుగాని రెండు మాసములుగాని పీడించును. ధనిష్ఠ యందు పదిరాత్రులు పక్షము మాసము పదుమూఁడు రాత్రులుగాని పీడగల్గును. శతభిషజమందు పంద్రెండు పదునొకండు నెనిమిది దినములైనను పీడించును. పూర్వాభాద్ర యందు మృత్యువైనను రెండు మూఁడు మాసములుగాని పక్షముగాని పీడయైనను గల్గును. ఉత్తరాభాద్రయందు మాసమున్నరగాని పక్షముగాని పదిగాని యేడే గాని దినములు పీడించును. రేవతియందు జ్వరాదులు గల్గినచో పది యిరువ దెనిమిది దినముల పీడయగును. జన్మ నక్షత్రమందు జన్మరాశియందును చంద్రుఁ డష్టమమందుండఁగ రోగము గల్గినచో మృత్యువు. ఆదివారము మొదలుగ నొక్కొక్క వారమునకు గ్రమముగ మఘాద్వాదసులు, విశాఖైకాదసులు, చతుర్థ్యార్ద్రలు, తృతీయోత్తరాషాఢలు, శతతారాష ష్ఠులు, అష్టమ్యశ్వినులు, పూర్వాషాఢా నవములు నని రెండేసి గలసినచో మృత్యు వగును. ఇట్లు రవివారము మొదలుకొని క్రమముగ నొక్కవారమందు అనూరాధ భరణులు ఆర్ద్రోత్తరాషాఢలు మఘాశతతారలు విశాఖాశ్వి నులు జ్యేష్ఠామృగములు శ్రవణాశ్లేషలు పూర్వాభద్రాహస్తలు నను నక్షత్రములలో నొకటిగలసినను మృత్యువగును. అపుడు తిథివారనక్షత్ర శాంతుల విధిచొప్పున విస్తారముగఁ జేయునది. అందు మరణఫలము చెప్పిన నక్షత్రములకు శాంతి యావచ్ఛక్తి. తక్కినవాటికి వైకల్పికము.

## సకల నక్షత్రములకు శాంతి ప్రయోగము

అన్ని నక్షత్రములకు సాధారణమైన శాంతి ప్రయోగము దేశకాలము లుచ్చ రించి మమోత్పన్నవ్యాధేర్జ్వచ్ఛరీరావిరోధేన సమూలనాశార్థం అముకనక్షత్ర శాంతిం కరిష్యే యని సంకల్పించి గణేశపూజాదికముఁజేసి యాచార్యుని వరించి కుంభముపై పూర్ణపాత్రలో పంద్రెండు దళములుగల పద్మమందు సువర్ణముచేజేసి నక్షత్ర ప్రతిమను బూజించి ద్వాదశదలములందు సంకర్షణాది ద్వాదశమూర్తులను గాని ద్వాదశాదిత్యు లనుగాని పూజించి దూర్వలు సమిధలు తిలలు పాలు నేయి దీనిచే గాయత్రి నుచ్చ రింపుచు నాదేవతకు నూటయెనిమిదిదాహుతు లిచ్చి మరణాది పీడాధిక్యము, జెప్పిన యెడ వేయుమారులు వ్రేల్చి పెరుగన్నము బలియిచ్చి యాచార్యునికి గోవును ప్రతి మను నీవలెనని సంక్షేపముగ శాంతిమయూఖాదులందు నక్షత్ర భేదముచే హవిర్మంత్ర బలి ధూపాదిభేదము తిథివారదేవతా మంత్రాదిభేదము మొదలగు విస్తరము చూడ వలెను. కర్మవిపాకమందు జాతవేదసే యను మంత్రము పదివేలుగాని లక్షగాని జపించుటయైనను రుద్రునికిని నమకానువాకములచే సహస్ర ఘటాభిషేకమైనను విష్ణువునకు వేయుమారులు పురుషసూక్తముచే సహస్ర ఘటాభిషేకమైనను జ్వరనాశక మని యున్నది. లేదా శ్రీ భాగవతమందలి జ్వరస్తోత్రము పఠించవలెను.

## సర్వరోగములు పోగొట్టు జపాదులు

రోగముననుసరించి లఘురుద్ర మహారుద్రాతిరుద్రముల జపముగాని యభి షేకముగాని విష్ణుసహస్రనామ స్తోత్రమును నూరు వేయి పదివేలుగాని జపించుట.

సౌరజపము సూర్యనమస్కారములర్ఘ్య దానమును ముంచామి యనుసూక్తము జపించుట. అచ్యుతానంత గోవిందమయను నామత్రయజపము మృత్యుంజయజపము నని సర్వరోగహరములు. 'జ్యేష్ఠామూల శ్రుతిస్వాతీ మృదుక్షిప్ర పునర్వసౌ, గురు శుక్రేందు వారేషు శస్తంభేషజ భక్షణం' జ్యేష్ఠ, మూల, శ్రవణము, స్వాతి, పునర్వసు, మృదుక్షిప్ర నక్షత్రములు వీటియందు, గురు శుక్ర సోమవారములందు నౌషధము భక్షించుట మంచిది. రిక్తతిథి యందు చరలగ్నమందు మిశ్రక్షిప్ర నక్షత్రము లింద్ర నక్షత్రము మూల, పుబ్బ, చిత్ర, భరణి, శ్రవణాది త్రయముననువాటియందును రవి మంగళ బుధ శనివారమందు నారోగ్య స్నానముచేయునది. వైధృతి వ్యతీపాత భద్ర, సంక్రాంతి దీనియందారోగ్యస్నానము చంద్ర తారాబలము లేకున్నను జేయ వచ్చును.

## అభ్యంగన దిన నిర్ణయము

"భద్రాసంక్రమపాత వైధృతిసితే జ్యార్కార షష్ఠ్యాదిషు" శ్రాద్ధాహే ప్రతిపద్ధ్వయే పరిహారే ద్ధేతుం వినాభ్యంగనం, మాంగల్యం విజయోత్సవోద్బవదనం దీపావళీ హేతవో, భ్యంగస్యాథ బుధాంబుపర్ష పితృభాగ్యంగాత్ప తిష్ణుంగనా." అనఁగా భద్రతిథి సంక్రాంతి వ్యతీపాత వైధృతి వీటియందును శుక్ర గురు మంగళవారము లందును షష్ఠి మొదలగు తిథులందును శ్రాద్ధదినమందును శుక్ల కృష్ణ ప్రతిపదలం దును నిమిత్తము లేకుండఁగ నలుఁగు బెట్టుకొనుచు స్త్రీలకు పురుషులకును గూడదు. మంగళస్నానము విజయానంతరస్నానము వత్సరాదియు దీపావళియు నివి యభ్యంగ నిమిత్తములు. ఇఁక బుధవారమందును శతభిషఙ్నక్షత్రమందును పితృనక్షత్రమందును స్త్రీ యభ్యంగస్నానముఁ జేసినచో బతికి హానియగు ఇకనపవాదము "పార్షపం గంధతైలంచ యత్తైలం పుష్పవాసితం, ద్రవ్యాంతర యుతం తైలం పక్వతైలం నదుష్యతి."అనఁగా నావనూనెయు నత్తరువును మల్లెనూనె మొదలగునవియును మరియొక వస్తువు గలపిన నూనెయు మరిగించిన నూనెయు నంటుకొను యభ్యంగ మున కెపుడును దోషములేదు. '8కించిద్గోఘృత యుక్తం వా విప్రపాద రజోన్వితం, నిత్యాభ్యంగేచ నోదుష్టం తైలం నిత్యేహి సర్వదా." అనఁగా కించిత్తు గోఘృతముగాని బ్రాహ్మణ పాదరజస్సుగాని గలపి తైలముతో నభ్యంగమెపుడును జేసుకొనవచ్చును. లేదా నిత్యాభ్యంగ వ్రతమున్నచో గేవలతైలమును నిషిద్ధముగాదు. మరియును; "రవౌ పుష్పంగురౌ దూర్వాం భానువారేచ మృత్తికాం భార్గవే గోమయం క్షిప్త్వా తైలస్నానం సుఖావహం." అనఁగా నాదిత్యవారమందు పుష్పము గురువారమందు దూర్వను మంగళవారమందు మృత్తిను శుక్రవారమందు గోమయమును నంటించిన, నూనెతో నభ్యంగస్నానము సుఖము జేయును.

## వాస్తు ప్రకరణము

'వైశాఖే ఫాల్గునే పౌషే శ్రావణే మార్గశీర్షకే, గృహారంభ ప్రవేశౌస్తః స్తంభో ఛ్ఛాయశ్చశస్యతే' అనఁగా వైశాఖ ఫాల్గున శ్రావణ మార్గశీర్షములందు గృహముగట్ట

నారంభించుటయు గృహమందుఁ బ్రవేశించుటయు స్తంభమెత్తుటయును ప్రశస్తము. 'జ్యేష్ఠకార్తిక మాఘాంశ్చ శుభదాన్ ప్రాహనారదః' అనఁగా జ్యేష్ఠ కార్తిక మాఘములు గూడ శుభములే యని నారదుఁడు చెప్పెను. 'తృణ గేమం సర్వమాసే పౌషే ముఖ్య గృహం నహి' అనఁగా గడ్డి యిల్లు ప్రతిమాసమందును గట్టవచ్చును. పుష్యమాస మందు ముఖ్యగృహమనఁగ దాను నివసించు గృహము కట్టఁగూడదు. గవాశ్వశాలాది కముఁ గట్టవచ్చుననుట. 'హస్తత్రయధ్రువ మృదుధనిష్ఠా ద్వయపుష్యభే, రిక్తా అర్కకుజౌ త్యక్త్వా గృహంకుర్యా ద్విశేదపి' అనఁగా హస్తాదులు మూఁడిటియందును ధ్రువ మృదు నక్షత్రములందును ధనిష్ఠా శతభిషక్కులందును పుష్యమునందును, రిక్తతిథు లను రవికుజవారములను విడచి తక్కిన తిథివారములందును గృహ మారంభించు టయుఁ బ్రవేశించుటయు గూడును. "శిలాన్యాసంచ ఖాతం చ శ్రుత్యశ్విక్రూర మిత్రభైః ఆశ్లేషా మూల పుష్యార్క మృగాంత్యధ్రువ భైరపి, కేంద్రాష్టమే పాపహీనే వేశ్మకృత్యం స్థిరోదయే" అనఁగా శ్రవణము, అశ్విని, క్రూరనక్షత్రములును అనూరాధ, ఆశ్లేష, మూల, పుష్యము, హస్త, మృగశీర్ష, రేవతి, ధ్రువనక్షత్రములును వీటియందు కేంద్రాష్టమస్థానములు పాపగ్రహరహితములై యుండ స్థిరలగ్నోదయమందు శంకు స్థాపనము పునియాదులు త్రవ్వుట మొదలగు గృహారంభముఁ జేయవలెను. "ధనిష్ఠా పంచకే వర్జ్య స్తంభో ఛాయస్సవాబుధైః" అనఁగా ధనిష్ఠ మొదలగు నైదు నక్షత్రము లందు స్తంభమెత్తుటఁ గూడదు 'నేష్టాని సప్తసూర్యర్షాదిష్టా న్యేకాదశాష్టమాత్, దశ ధిష్ణ్యాని నేష్టాని చక్రేస్యుర్వృషవాస్తుని' అనఁగా వృషభాకారమైన వాస్తుచక్రమందు సూర్యుఁడున్న నక్షత్రము మొదలుకొని యేడవనక్షత్రముఁగూడదు. అటుపై యెనిమిదవ నక్షత్రము మొదలుకొని పదునొకండు నక్షత్రములు మంచివి. అటుపై నున్న పదియును మంచివికావు గృహారంభమునకును ప్రవేశమునకును నని యొక పక్షము లేదా. "యద్వాకుర్యా త్పంచదశాత్త్రియోవింశతి సంఖ్యకాత్ వేదాబ్ధి పంచనేష్టాని గృహారంభ ప్రవేశయోః" అనఁగా సూర్యుఁడున్న నక్షత్రమునకు నాల్గవ నక్షత్రము మొదలుకొని నాల్గునక్షత్రములును పదునైదవ నక్షత్రము మొదలుగ నాల్గు నక్షత్రము లును నిరువది మూడవ నక్షత్రము మొదలుకొని యైదునక్షత్రములును గృహారంభ ప్రవేశములగు సంమతములు కావని రెండవపక్షము. "స్వానపాకస్వాపముఖ్యవేశ్మనః " అనఁగా తన నివాసగృహమునకుఁ దూర్పు మొదలగు నన్నిదిక్కులను గ్రమముగ స్నానగృహము నిద్రాగృహము వస్త్రగృహము భోజనగృహము పశుగృహము ధన గృహము దేవగృహము నివి యేర్పరచవలెను. ఉదగ్దిశంధ్రువ ముఖాత్ జ్ఞాత్వాపాచీం ప్రసాధయేత్" అనఁగా ధ్రువునిబట్టి యుత్తరము నిర్ణయించి వానిఁబట్టి తూర్పు నిర్ణయింపవలెను. "కోణాధ్వ భ్రమకూపద్వాః పంకస్తంభద్రుమామరైః, విద్ధాదుష్టాద్వార్న దోషో గృహోచ్చ ద్విగుణాంతరే." అనఁగా ద్వారమున కెదురుగ మూలలు మార్గము భ్రమణము నుయ్యి మరియొక ద్వారము బురదయు స్తంభము చెట్టు దేవ గృహమును గూడదు. గృహము పొడవునకు రెండు రెట్టుల దూరమున నవియున్నను దోషము లేదు. 'సూత్రంభిత్తి శిలావ్యాసం స్తంభస్యారోపణం తథా, ఆగ్నే యాదిశమారభ్య

కుర్యాదిత్యాహ కశ్యపః' అనఁగా సూత్రముపట్టుట శంకుస్థాపనము. స్తంభమెత్తుట మొదలగునవి యాగ్నేయ దిక్కున నారంభించి గృహము కట్టవలెను. "అన్యవేశ్మస్థితం దారు నాన్యవేశ్మనియోజయేత్, నూతనే నూతనంకాష్ఠం జీర్ణేజీర్ణం ప్రశస్యతే" అనఁగా నారంభించిన క్రొత్త గృహమునకు మరియొక యింటికఱ్ఱ వేయగూడదు. జీర్ణ గృహమునకు నట్లు చేసినను దోషములేదు. "ద్వాత్రింశాధిక హస్తే చ తృణాగారే చతుర్ముఖే,న తత్ర చింతయేద్ధీమాన్ గుణానా యవ్యయాదికాన్." అనఃగా ముప్పది రెండుమూళ్ళ కధికముగనున్నను గడ్డియిల్లైనను నాల్గుద్వారముల యిల్లుగట్టినను నా యవ్యయాదిగుణముల విచారింప నక్కరలేదు.

## గృహప్రవేశము

"వాస్తుపూజా విధిః కార్యః పూర్వమేవ ప్రవేశతః, మైత్రధ్రువక్షిప్రచర మూల భైర్ధనపుత్రకృత్." అనఁగా ప్రవేశింపకమున్ను వాస్తుశాంతికర్మజేసి యనూరాధయు ధ్రువక్షిప్రచరనక్షత్రములు మూలయు వీనియందుఁ బ్రవేశించినచో ధనపుత్రలాభము గల్గును. వాస్తుశాంతి ప్రయోగము గ్రంథాంతరమున దెలియునది. "వాస్తుశాంతి ర్దివై వోక్తా ప్రవేశస్తు నిశిక్వచిత్, గృహప్రవేశః ప్రారంభ దినమాసాది కైశ్శుభః."అనఁగా వాస్తుశాంతి పగటియందే విధింపఁబడినది. గృహప్రవేశము రాత్రియందుగూఁడ గూడునని క్వచిత్తుగ నున్నది. అట్లు ప్రవేశించుట గృహారంభమునకుఁ జెప్పిన మాన తిథివారాదులందు శుభము. "క్వచిన్మాఘోర్జ శుక్రేషు కైశ్చిదుక్తో మృదుధ్రువే, శ్రేష్ఠః క్షిప్రైశ్చరై ర్మధ్యోనింద్య స్తీక్ష్ణోగ్ర మిశ్రభైః" అనగా క్వచిత్తుగా మాఘమదు నాశ్వయుజమందు జ్యేష్ఠమందును బ్రవేశము గూడునని కొందరు చెప్పిరి. మృదు ధ్రువనక్షత్రములందు శ్రేష్ఠము క్షిప్రచర నక్షత్రములందు మధ్యమము. తీక్ష్ణోగ్ర మిశ్ర నక్షత్రములందు నింద్యము. "త్రిషడాయేఖలైష్షడ్భిష్షడష్ట వ్యయవర్జితైః, శుద్ధేంబు రంధ్రేచతనౌ విజనుర్లగ్న భాష్టమే." అనఁగా మూఁడు నారు పదునొకండు స్థానముల కలగ్రహములనఁగా సూర్యుఁడు క్షీణచంద్రుఁడు మొదలగు నార్గురుండఁగ శుభులారు నెనిమిది పండ్రెండు స్థానముల లేకుండఁగ జతుర్థాష్టమ లగ్నములు గ్రహరహితములై యుండ జన్మలగ్నమున కష్టముగాని లగ్నమందు గృహప్రవేశము ప్రశస్తము. 'ఋక్షాణి పంచసూర్యర్శా న్నేష్టాన్యష్ట చతుర్దశాత్, శేషభాని శుభాన్యేవం ప్రవేశ ఘటచక్రకం' అనఁగా సూర్యుఁడున్న నక్షత్రము మొదలుకొని యైదునక్షత్రములును పదునాల్గవది మొదలుగ నెనిమిది నక్షత్రములును గూడనివి తక్కినవి శుభములని గృహప్రవేశమందు ఘటచక్రముఁ దెలియవలెను.

## యాత్రా ప్రకరణము

ధనాదుల నార్జించుటకు వెడలుట, 'శ్రుతిద్వయాశ్వి పుష్యాం త్యానూరాధా మృగహస్తభే, పునర్వసౌ గోచరేష్ట ప్రదవారే వ్రజేన్నరః' అనఁగా శ్రవణము ధనిష్ఠయు నశ్విని పుష్యము రేవతీ యనూరాధయు మృగశీర్ష హస్తయు పునర్వసువు నీ నక్షత్ర ములందు గోచారముచే నిష్టఫల మిచ్చువారమందుఁ బ్రయాణము చేయవలెను.

'అభిజిద్భంగమే శ్రేష్ఠం దక్షిణాశాం వినాక్షణః, మఘాచిత్రాయాశ్లేషాజన్మభం తథా, త్యజేద్రిక్తా పర్వషష్ఠ్యష్టమీ ద్వాదశికాస్తిథీః, అనఁగా దక్షిణదిక్కుతప్ప తక్కినదిక్కులకు వెళ్లునపు డభిజిన్నక్షత్రము శ్రేష్ఠము, మఘ, చిత్త, స్వాతి, విశాఖయు, నాశ్లేష, భరణి యార్ద్ర, కృత్తిక, పూర్వాభాద్ర, జన్మనక్షత్రము నివిప్రయాణమందు నిషిద్ధములు. రిక్త తిథియు, పర్వతిథియు, షష్టి, యష్టమి, ద్వాదశియు వర్జ్యములు, 'కృత్తికాభరణీ పూర్వా మఘానాం ఘటికాః క్రమాత్, ఏకవింశతిసప్తాథ షోడశైకాదశ త్యజేత్, జ్యేష్ఠాశ్లేషా విశాఖాసు స్వాత్యాంచాపి చతుర్దశ' అనఁగా కృత్తిక కిరువదియొక గడి యయు భరణికి నేడుగడియలు పుబ్బకు బదారును మఘకు పదునొకండుగడియలు విడిచి యాపైని వెళ్లవచ్చును. అట్లు జ్యేష్ఠ, ఆశ్లేష విశాఖ, స్వాతి యీ నక్షత్రములకు బదునాల్గుగడియలు వర్జింపవలెను. 'భృగోర్మతే సంకటేపి సర్వాంస్వాతీం మఘాం త్యజేత్, భరణ్యాః పూర్వమర్ధేచ చిత్రాశ్లేషాంత్య కోత్తరం' అనఁగా భృగుమతమందు స్వాతిని మఘను నిబ్బందిగల్గినప్పటికి నంతయు విడువవలెను. భరణికి పూర్వభాగము సగము చిత్ర ఆశ్లేష రేవతి వీటియుత్తరార్ధమును విడువవలెను. 'వారశూలస్సోమ శనీ ప్రాచ్యామిజ్యస్తు దక్షిణే, రవిశుక్రౌ ప్రతీచ్యాంస్యా దుదీచ్యాం బుధమంగళౌ'సోమ శనివారములు తూర్పునకును గురువారము దక్షిణమునకును రవి శుక్రవారములు పశ్చిమమునకును బుధమంగళవారములుత్తరమునకును నిషిద్ధములు. 'పూర్వాది దిక్షు మే షాద్యాః క్రమాత్త్రి శ్చంద్రరాశయః, సంముఖో దక్షిణోఙ్గస్సన్ పృష్ఠేవామేఽ తి నిందిత దిశియత్రోదేతి శుక్రస్తాం దిశం న వ్రజేన్నరః, న వ్రజేత్సం ముఖేజ్ఞేపి శుభం పృష్ఠోఽ పివామతః' అనఁగా దూర్పు మొదలుగ నొక్కొకదిక్కునకు మూఁ డేసి చొప్పున మేషాది రాసులు చంద్రరాసులు యెదుటగాని కుడివైపునగాని చంద్రుఁ డున్నచో శుభము. యెడమవైపునను వెనుకను నింద్యము. శుక్రుఁడుదయించు దిక్కు నకు వెళ్లగూడదు. ఇట్లు బృహస్పతి యుదయించుదిక్కును నిషిద్ధమే. వామభాగ మందును వెనుకను వారున్నచో శుభము. 'రేవతీమేషగే చంద్రే శుక్రాంధ్యా త్సంముఖం వ్రజేత్' అనఃగా రేవతియందును మేషమందును చంద్రుఁడున్నచో శుక్రునికాంధ్యము గనుక సంముఖముగ వెళ్లవచ్చును. 'ప్రయాణ శుభాః కేంద్ర కోణేషు శస్తాః ఖలాస్త్ర్యాయ షట్ఖేష్వనిష్టాశ్శనిఃఖే, కవిస్సప్తమేగ్లౌష్షడష్టాంత్యలగ్నే విలగ్నేశ్వరో వ్యస్త షష్ఠాష్టమాంత్యే' అనఁగా ప్రయాణమందు శుభగ్రహములు లగ్నము నాల్గునేడు పదియునను కేంద్ర ములందును నైదు తొమ్మిదియను కోణములందును బ్రశస్తములు. దుష్టగ్రహములు మూఁడు పదునొకండు నారు పదియు నీ స్థానములందుండుట మంచిది. పదింట శనియు నేడిఁట శుక్రుఁడును నారిట నెనిమిదింటను పంద్రెండింటను చంద్రుఁ డును గూడదు. లగ్నాధిపతియు నేడిఁటగాని యారిటగాని యెన్మిదిటగాని పంద్రెండిట గాని కూడదు. "కేంద్రే వక్రీ వక్రివర్గో లగ్నో వారశ్చవ క్రిణః, కుంభః కుంభ నవాం శశ్చ లగ్నే త్యాజ్యః ప్రయత్నతః' అనఁగా మీఁదజెప్పిన కేంద్రమందంగారకుఁడైనను అంగారకుని షడ్వర్గమైనను నతనిలగ్నమును నతనివారమును కుంభలగ్నమును లగ్నమందు కుంభనవాంశమును యత్నించి విడువవలెను. 'మీనలగ్నే తదంశేవా

యాతుర్మార్గోతిదుఃఖదః’ అనఃగా మీనలగ్నమందుగాని మీనాంశయందుగాని వెళ్లు వానికి మార్గమందతిదుఃఖము గల్గును. “శత్రులగ్నభతష్షష్ఠం తత్పతిర్వామృతిప్రదః శత్రుక్షేత్రే తదంశేవా తద్దృష్టే గమనం న సత్.” అనఁగా లగ్నమున కారవది శత్రు స్థాన మనియును తత్పతియైనను మృత్యువునిచ్చును గనుక శత్రుక్షేత్రమందును శత్రు క్షేత్రాంశ యందును శత్రుదృష్టమైన లగ్నమందును గమనము నింద్యము. “లగ్నేస్తంగతరాశిశ్చ జన్మరాశిశ్చ నోశుభః” అనఁగా లగ్నమందు అస్తంగత రాశియు జన్మరాశియు శుభములుగావు. “శశివర్గోత్తమే లగ్నే వర్గోత్తమయుతే జయః” అనఁగా చంద్రుఁడు వర్గోత్తమమందున్నను లగ్నము వర్గోత్తమముతో గూడినను జయము గల్గును. “శుక్లాది తిథివారర్ష యోగోశ్శైవరష్టభిస్త్రిభిః, త్రిస్థస్తష్టో ఉ వశిష్టశ్చే త్సర్వాంకస్సార్వకామికః, త్రిషుక్రమాద్భవేచ్ఛూన్యం దుఃఖదారిద్ర్య మృత్యుదం.” అనఁగా శుక్లపక్షాది తిథిసంఖ్యయు వారసంఖ్యయు నక్షత్రసంఖ్యయు గలసిన మొత్తము మూఁడుచోట్ల నుంచి యందు క్రమముగ నేడింటను నెనిమిదింటను మూడింటను హరించినచో మూడుస్థలములందు నంకములు మిగిలెనేని సర్వకామసిద్ధి యగును. అట్లు శేషించక శూన్యమువచ్చెనేని క్రమముగ దుఃఖము దారిద్ర్యము మృత్యువు నగునని. ‘యద్యేకస్మిన్నేవదినే పురాద్గచ్ఛేత్పురాంతరం. ప్రావేశికీ కాలశుద్ధి స్తదాజ్ఞేయా న యాత్రికీ’ అనఁగా నొక్కదినముననే బయలుదేరుటయు ప్రవేశించుటయు నగునేని యపుడు ప్రవేశమునకు మాత్రమే కాలశుద్ధి యాలోచింపవలయును. ప్రయాణమున కక్కరలేదు. “ప్రవేశాన్నిర్గమోనేష్టః ప్రవేశో నిర్గమాదపి, జిష్ణోఃకదాపినవమే ధిష్ణ్యేవారే తిథౌతథా.” అనఃగా జయశీలునికి ప్రయాణముగాని ప్రవేశముగాని పరస్పరము వాటి తొమ్మిదవ నక్షత్ర తిథివారములందుఁ గూడదని భావము. “యామ్యదిగ్గమనం శయ్యానిదానం భావనం గృహే, న కుంభ మీనగేచంద్రే తృణకాష్ఠస్య సంగ్రహః” అనఁగా దక్షిణ దిక్కునకు ప్రయాణము శయ్యను క్రొత్తగ వాడుటయు చాందినీగట్టుటయు నిల్లునేతయు తృణకాష్ఠముల సంగ్రహించుటయు కుంభమీనములందు చంద్రుఁడుండఁగ గూడదు. “తప్పితాగ్ని సుహృద్భృత్య భార్యాదిస్తృప్తిమాన్ వ్రజేత్” అనఁగా నట్లు ప్రయాణము వెళ్లునపుడగ్ని కార్యము మిత్రునికార్యము భృత్యుని, భార్యను సంతోషింపఁజేసి తాను సంతుష్టుఁడై వెళ్లవలెను. “స్వకీయాం పరకియాం వా స్త్రియం పురుషమేవవా, తాడయిత్వాతు యోగచ్ఛేద్బ్రాహ్మణా నవమాన్యచ, వ్యాధితః క్షుధితోవాపి తదంతం తస్య జీవితం.” అనఁగా తనవారినిగాని పై వారిని గాని దుఃఖింపజేసియు బ్రాహ్మణుల నవమానించియు తాను రోగియైగాని యాకలితోగాని వెళ్లినయెడ దనకే హాని యగును. ‘క్రోధంక్షారం తథావాంతిం తైలాభ్యంగాశ్రుమోచనం, మద్యం మాంసం గుడంతైలం సితాన్యతిలకంతథా, శ్వేతభిన్నంచ వసనంప్రాయేణ పరివర్జయేత్’ మరియు నపుడు క్రోధమును క్షారమును వమనమును తైలాభ్యంగమును కన్నీరును మద్యపానము మాంసభక్షణము బెల్లముదినుట నల్లనిబొట్టు రంగుబట్టయు దరుచుగా వర్జింపవలెను. “క్షౌరం పంచదినం దుగ్ధం త్రిదినం సప్తరాత్రకం, మైథునం చాపరం తైలం మధ్వాజ్యం తద్దినేత్యజేత్.” అనఁగానైదు దినముల నుండి క్షౌరము మూడు

దినములనుండి దుగ్ధము నేడుదినములనుండి మైథునము మరియొక నూనెయు తేనెయు నేయియు నాదినమందును విడువవలెను. "స్త్ర్యార్తవం బీజదానాంతం తథా కుశకునాంస్త్యజేత్" అనఁగా స్త్రీ రజస్వలయైనను ఋతుకాలములోగా నైనను దుష్ట శకునమునైనను బ్రయాణముఁగూడదు. మంచి ముహూర్తమందు దానువెడలుట సంభవించనియెడ దనకిష్టమైన వస్తువును గృహాంతరమందుంచవలెను. 'యజ్ఞోపవీత కంశస్త్రం మధుచస్థాప యేత్ఫలం, విప్రాదిః క్రమతస్సర్వై స్స్వర్ణధాన్యాంబరాదికం." అనఁగా యజ్ఞోపవీతము శస్త్రము తేనెయు ఫలమును క్రమముగ బ్రాహ్మణాది వర్ణముల వారుంచవలయును. లేదా సువర్ణము ధాన్యము వస్త్రము మొదలగునవి యందరు నుంచవచ్చును. "రాజాదశాహం పంచాహ మన్యోన్యం ప్రస్థితోవసేత్." అనఃగా నట్లు ప్రస్థానముంచిన రాజు పదిరోజులలోగా బయలుదేరవలెను. అన్యుఁడైదురోజు లలో వెళ్లవలెను. స్వయంగా వెళ్లుటకంటె ప్రస్థానముంచి వెళ్లుటలో ముహూర్తఫలము సగమే సంభవించును. ఇక వస్తువునుంచు దేశమునకవధి. 'గేహాద్గేహాతరంగర్గః సీమ్ని స్సీమాంతరం భృగుః, బాణక్షేపంభరద్వాజో వసిష్ఠోనగరాద్బహిః'అనఁగా మరియొక గృహమందలి గర్గమతము. సీమాంతరమందనిభృగుమతము. బాణము పడునంత మేరయని భరద్వాజమతము నగరమున కంటె పై నుంచవలెనని వసిష్ఠ మతము ప్రస్థానముంచినను మహాదోషము గలదినమందు వెళ్ళగూడదు. ప్రస్థాన ముంచు దినమందును మీఁదఁ జెప్పినట్లు క్రోధాదులుఁ గూడదు. ఇట్లు యాత్రా ప్రకరణము. 'జన్మరాశేః క్రూరచంద్రా స్త్రిషడ్దశమగాశ్శుభాః, సప్తాద్యగశ్చాపిచంద్ర శ్శుక్లేద్వినవ పంచసు, బుధోవ్యంత్య సమేజీవో ద్విపంచ నవసప్తమ, జన్మాదిపంచసు తథా నవాష్ట ద్వాదశేభృగుః ఏకాదశీ సర్వఖేటాః శుభాస్స్యురితి సంగ్రహః" అనఁగా జన్మరాశికి మూడింటను నారింటను పదింటనుండు క్రూర గ్రహములు చంద్రుఁ డును శుక్లపక్షమందు ద్వినవపంచమ స్థానముల నున్న చంద్రుఁడును బుధుఁడు పండ్రెండుతప్ప తక్కిన సమస్థానములనఁగ రెండు నాల్గు నారు నెనిమిది పది వీటి యందు శుభుఁడు. బృహస్పతి రెండు నైదు తొమ్మిది యేఁడు నీస్థానముల శుభుఁ డు. మరియు జన్మాదులైదింటియందును నట్లనే శుక్రుఁడు తొమ్మిది యెనిమిది పండ్రెండు వీటియందు శుభుఁడు. పదునొకండవస్థానమందు సర్వ గ్రహములు మంచివే యని సంక్షేపము. 'జన్మ సంపద్విపత్క్షేమ ప్రత్యరిస్సాధికా వధః, మైత్రాతి మైత్ర స్స్యుస్తారా స్త్రిరావృత్తాస్వజన్మభాత్." అనఁగా జన్మనక్షత్రము మొదలుకొని తొమ్మిది నక్షత్రములకీ తొమ్మిదియు ఫలములనియు నిట్లు ముమ్మారు లెక్కించినచో నిరువదేడు నక్షత్రములకు ఫలముఁ దెలియును. ఫలము లెవ్వియనిన జన్మము సంపత్తియు విపత్తియు క్షేమము ప్రతిపక్షము కార్యసాధనము మరణము మైత్రియు నతిమైత్రియు నని 'క్రమతస్సూర్యాది ఫలం నృపదర్శన సర్వకార్యయుద్ధేషు, శస్త్రకరగ్రహ యాత్రా దీక్షాసూహ్యం విశేషేణ' అనఃగా మీఁదజెప్పిన సూర్యాది గ్రహబలము క్రమముగా రాజదర్శనమందు నితరకార్యములందును యుద్ధములందును శస్త్రధారణ మందును పాణిగ్రహణమందును యాత్రయందును దీక్షయందును విశేషించి చూడ

వలెను. అనిష్టసూర్యాది గ్రహములకు దానములు ద్వితీయపరిచ్ఛేదము తుదిని జూడ వలెను. 'దక్షాంగోదరనాభి హృత్సుపతితా పల్లీవరాంగేహనుం, ముక్త్వాను శ్శుభదా స్త్రియాః ఫలమిదం వామేతరవ్యత్యయాత్, ఇత్యాహుస్సరట ప్రరోహణఫలం పాతేన్య థైకే పృథా, పల్యాతోహణకేఽపి వస్త్రసహితం స్నాత్వాచ రేచ్ఛాం తికం.' అనఁగా పురుషునికి కుడిభాగమందలి యవయవములందును హనువనఁగా కణత మాత్రము విడిచి శిరస్సు దక్షిణభాగమందును కడుపు బొడ్డు హృదయము బల్లి పడినయెడ శుభము. అట్లు స్త్రీకి యెడమభాగమని మాత్రము పురుషుని కంటె విశేషము చెప్పినవి గాక తక్కిన భాగములందైనచో నశుభము. ఇట్లు తొండపాకుటకును ఫలము తెలియు నది. కొందఱు మరియొక స్థానమందు పడినచో వ్యర్థమందురు. బల్లి పాకిరినప్పటికిని సచేలస్నానముఁజేసి శాంతిఁ జేయవలెను.

## బల్లిపడుటకు తొండ పాకుటకు శాంతి

బల్లియు తొండయు ముట్టుకొనుట మాత్రమైనచో స్నానముజేసి పంచగవ్యము భక్షించి యాజ్యముజూచి అశుభనాశార్థము శుభవృద్ధ్యర్థముగను శాంతిఁ జేయునది. బల్లిగాని తొండనుగాని సువర్ణముచే నిర్మించి యెఱ్ఱనిబట్టజుట్టి పూజించి కలశమందు రుద్రునిబూజించి మృత్యుంజయ మంత్రముచే చంద్ర సమిధలను నూటయెన్మి దాహుతులును తిలలును వ్యాహృతులచే నష్టోత్తర సహస్రముగాని నూటయెనిమిది గాని వ్రేల్చి స్విష్టకృత్తు మొదలుగ నభిషేకాంతముఁ జేసినపైని సువర్ణము వస్త్రము తిలలును దానము చేయవలెను.

## గ్రామ్యారణ్య మృగపక్షులకు వికారమందు శాంతి

గృహమందు కపోతమనఁగ పారువము ప్రవేశించినను తేనెపుట్ట బెట్టినను పింగలయను పక్షియొక్క స్వరము కాకివికారము గ్రామములోనివిగాని యరణ్యములో నివిగాని యగు మృగపక్షులకు వికారము గలిగెనేనియు శాంతి యెట్లనిన; దేవాః కపోత యను సూక్తముచే వేయుగాని నూరుగాని వ్రేల్చి "యతఇంద్రభయామహే" స్వస్తిదాః త్ర్యంబక మను మంత్రములచే వ్రేల్చి వ్యాహృతులచే నూటయెన్మిది తిలాహు తులు వ్రేల్చవలెను. లేదా యైదుగురు బ్రాహ్మణులచే 'దేవాః కపోత' యను సూక్త మును 'సుదేవో అసి' యను ఋక్కును 'కనిక్రద' త్తను శాకుంతసూక్తమును 'నమో బ్రహ్మణే నమో' యను మంత్రమును సహస్రాది సంఖ్యచే జపింపఁజేసి యుపనిష త్తుల బఠింపఁజేసి వ్యాహృతులచే దిలహోమము జేయునది.

## కాకిని ముట్టిన కాకుల సంభోగముల జూచినను శాంతి

సంకల్పము మొదలుగ నగ్ని ప్రతిష్ఠాపనారతముఁజేసి కుంభమందు నింద్రుని సువర్ణప్రతిమను లోకపాలురను బూజించి యగ్నియందు చరువును వండి మోదుగు సమిధలు చరువు నాజ్యము వీనిచే యత ఇంద్ర యను మంత్రముతో నూటయెనిమిది గాని వేయునెనిమిదిగాని యాహుతుల వ్రేల్చితోకపాలురకును నాద్రవ్యములచేతనే పదేసి గాని యొక్కొక్కటిగాని వ్రేల్చిలోకపాలబలిని కుంభాగ్రమందు కాకుల కైంద్రావ

రుణ యను మంత్రముతో నిచ్చి యజమనాభిషేకమైనపైని నూర్గురికిగాని పదుగురికి గాని బ్రాహ్మణులకు భోజనము పెట్టవలెను.

## రోలుతిరుగలి మొదలగునవి హఠాత్తుగా బ్రద్దలైనచో శాంతి

మరియు తిరుగలి, రోలు, రోకలి, సన్నెకల్లు మొదలగునవి యకస్మాత్తుగా బ్రద్దలైపోయినచో నేయితేనె యంటించిన రావి సమిధలు ప్రజాపతిదేవతకై వ్రేల్చి గాయత్రిచే వేయు నెనిమిదిమారు లభిమంత్రించవలెను. నానావిధమైన దివ్యములు భౌమములు నాంతరిక్షములు నగు నుత్పాతములందు శాంతి యెట్లనిన; సంకల్పాది కముఁ జేసి కుంభమందింద్ర రుద్రులను బూజించి యత ఇంద్ర స్వస్తిదావిశస్పతిః అఘోరేభ్యోద యను మంత్రముతో సమిదాజ్యచరు వ్రీహితిలలచే బ్రతిద్రవ్యమునకు నష్టోత్తర శతము చొప్పున వ్రేల్చి వ్యాహృతులచే కోటి హోమముగాని లక్షహోమము గాని పదివేలుగాని యందు నాల్గవవంతుగాని తిలాహుతులచే శక్త్యనుసారముగా నిమిత్తానుసారముగ నైనను నేడు దినములుగాని మూడుదినములుగాని యొక దినముగాని వ్రేల్చి సూర్యుఁడుగణేశుఁడు క్షేత్రపాలుఁడు దుర్గయు వీరి మంత్రముల జపించి పాయసాది భక్ష్యములచే బ్రాహ్మణ భోజనము చేయవలెను. లేదా దుర్గాసప్త శతి జపించునది. మరియు రుద్రమంత్రముల జపమైన నభిషేకమైనను జేయవచ్చును అశ్వత్థప్రదక్షిణములు శివపూజయు గోవిప్రపూజయు మొదలగునవియైనను గావచ్చును. ఇట్లు నానోత్పాతశాంతులు ముగిసెను.

## గాయత్రీ పురశ్చరణ ప్రయోగము

దేశకాలముల నుచ్చరించి 'కరిష్యమాణగాయత్రీ పురశ్చరణేఽ ధికార సిద్ధ్యర్థం కృచ్ఛ్రత్రయమముక ప్రత్యామ్నాయేనాహమాచరిష్యే' యని సంకల్పించి హిరణ్యాది ప్రత్యామ్నాయములచే గృచ్ఛ్రములఁజేసి "అముకశర్మణో మమగాయత్రీ పురశ్చరణేనేన కృచ్ఛ్రత్రయానుష్ఠానే నాధికారసిద్ధిరస్తు" అని బ్రాహ్మణుల బ్రార్థింపవలెను. విప్రులు నట్లనే ప్రతిబలుకవలెను ఆపైని 'కరిష్యమాణగాయత్రీ పురశ్చరణ్యాంగత్వేన విహితం గాయత్రీ జపాదికం కరిష్యే' యని సంకల్పించి స్వయముగా గాని విప్రద్వారముగ గాని చేయవలెను. అది యెట్లనిన, ప్రణవవ్యాహృతులతోగూడ గాయత్రిని పదివేలు జపించి 'ఆపోహిష్ఠ' యను సూక్తము 'ఏతోన్వింద్ర మను నాల్గను ఋతంచ' యను సూక్తము 'స్వస్తినః' అని మొదలగు స్వస్తిమతులును 'స్వాదిష్ఠయా' యని మొదలగు పావమాని ఋక్కులన్నియు నొక్కొకటి పదేసిమారులు స్వయముగనైన నన్యద్వారముగ నైన జపించి 'తత్సవితురిత్యస్యాచార్య మృసిం విశ్వామిత్రం తర్పయామి, గాయత్రీ చ్ఛందస్తర్పయామి, సవితారందేవతాం తర్పయామి' యని తర్పణముఁజేసి రుద్రుని నమస్కరించి 'కద్రుద్రాయ యని మొదలగు రుద్రసూక్తములు జపించవలెను. అటుపైని మరియొకదినమందు దేశకాలముల గీర్తించి 'మమ సకలపాపక్షయద్వారా శ్రీపర మేశ్వర ప్రీత్యర్థం చతుర్వింశతి లక్షాత్మక గాయత్రీ పురశ్చరణం స్వయం విప్రద్వారా వార్వింశతి లక్షాత్మక గాయత్రీ పురశ్చరణం స్వయం విప్రద్వారా వార కరిష్యే' యని

సంకల్పించి తదంగముగ స్వస్తివాచనమును మాతృకా పూజనమును నాందీశ్రాద్ధమును సంకల్పించవలెను. విప్రద్వారముగ జేయునేని విప్రవరణముంగూడ సంకల్పించునది. సంకల్పముగూడ ఋత్విజునిదేయైనచో "అముకవర్మణో యజమానస్య సకల పాపక్షయ"యని మొదలగు సంకల్పించునది. ఇట్లు పూర్వమందును సంకల్పమూహించునది. నాందీశ్రాద్ధాంతమునందు సవితాప్రీయతా'మని యుచ్చరించి గాయత్రీ పురశ్చరణే జపకర్తారంత్వామహం వృణే' యనివిప్రుని వరించి వస్త్రాదులచే బూజింపవలెను. లేదా నిత్యకర్మంజేయుట కొకవిప్రుని వరించి తాను దర్భాసనముసైగూరుచుండి పవిత్రము ధరించి యాచమించి ప్రాణాయామముంజేసి దేవతల బ్రార్థించ వలెను. "సూర్యస్సోమో యమఃకాల స్సంధ్యేభూతాన్యహః క్షపా, పవమానో దిక్పతిర్భూరాకాశం ఖేచరామరాః, బ్రహ్మశాసనమాస్థాయ కల్పధ్వమిహ సన్నిధిం." అని యనఁగా సూర్యుఁడు చంద్రుఁడు యముఁడు కాలుఁడు సంధ్యలు భూతములహోరాత్రములు వాయువు దిక్పతియు భూమియాకసము ఖేచరులమరులు బ్రహ్మశాసనముచే వారందరు సన్నిధి దయసేయవలెనని ప్రార్థించి యాపైని దేశకాలములనుచ్చరించి ప్రతిజనజపము సంకల్పించి "గురవేనమః, గణపతయే నమః, దుర్గాయై నమః, మాతృభ్యోనమః" అని నమస్కరించి ముమ్మారు ప్రాణాయామము జేసి "తత్సవితురితి గాయత్ర్యా విశ్వామిత్ర ఋషిః సవితాదేవతా గాయత్రీఛందః జపేవినియోగః విశ్వామిత్ర ఋషయే నమః శిరసిగాయత్రీ ఛందసేనమోముఖే సవితృ దేవతాయై నమోహృది" యని న్యసించి "తత్సవితురంగుష్ఠాభ్యాం వరేణ్యం తర్జనీభ్యాం భర్గోదేవస్య మధ్యమాభ్యాం ధీమహి అనామికాభ్యాం ధియోయోనః కనిష్ఠికాభ్యాం ప్రచోదయాత్ కరతల కరపృష్ఠాభ్యాం నమయని కరన్యాసమునుజేసి యట్లు హృదయాదిన్యాసముంజేయవలెను ఆపైని మీఁద జెప్పినరీతిని సంస్కరించిన జపమాలను పాత్రయందుంచి ప్రోక్షించి ఓం మహామాయే మహామాలే సర్వశక్తి స్వరూపిణి చతుర్వర్గస్త్వయిన్యస్తస్మాన్మే సిద్ధిదాభవ' యని ప్రార్థించి ఓం అవిఘ్నం కురుమాలేత్వం' అని మాలిక తీసుకొని మంత్రదేవతయైన సవితను ధ్యానింపుచు హృదయమందు మాలను పట్టుకొని మంత్రార్థమును స్మరించుచు మధ్యాహ్న మగువరకును జపించవలెను, అతి త్వరగల్గినచో మూడుజాములన్నర పర్యంతమును జపించి యంతమున ప్రణవము నుచ్చరించి 'త్వంమాలే సర్వదేవానాం ప్రీతిదా శుభదాభవ, శివంకురుష్వమేభద్రే యశోవీర్యంచ సర్వదా' యని మాలను శిరస్సున ధరించి ముమ్మారు ప్రాణాయామముజేసి న్యాసత్రయముంజేసి జపమీశ్వరున కర్పించవలెను. అట్లు ప్రతిదినమందును సమాన సంఖ్యయే జపమునకు గావలెనుగాని న్యూనాధికభావముంగూడదు. ఇట్లు పురశ్చరణ జపమంతయు సంపూర్ణమైన పైని హోమము, 'పురశ్చరణ సాంగతాసిద్ధ్యర్థం హోమవిధిం కరిష్యే' యని సంకల్పించి యగ్నిఁ బ్రతిష్ఠించి పీఠమందు సూర్యాది నవగ్రహ పూజానాదికము కలశస్థాపనమైన పై నన్వాధానముం జేయవలెను, 'చక్షుషీ ఆజ్యేన' యను నంతమున గ్రహపీఠముపై దేవతల కన్వాధానము. అదియెట్లనిన; 'అర్యాది సమిచ్చర్వాజ్యాహుతిభిః కృత్వా ప్రధానదేవతాం సవితారం చతుర్వింశతి

సహస్రతిలాహుతిభిస్త్రి సహస్ర సంఖ్యాకాభిః పాయసాహుతిభిర్ఘృతమిశ్రతిలాహుతిభి ర్దూర్వాహుతిభిః క్షీరద్రుమసమిదాహుతిభిశ్చ శేషేణ స్విష్టకృత’మని మొదలుగఁజేసి చరుపాయసతిలలతో నాజ్యమునకు బర్యగ్నికరణము మొదలగునది ఆజ్యభాగాంత మందు ఇదం హవనీయద్రవ్య మన్వాధానోక్త దేవతాభ్యో నమమ’ యని యజమానుఁ డు త్యాగముఁ జెప్పవలెను. హోమమందు ప్రణవముగూడి వ్యాహృతులు లేని గాయ త్రియే స్వాహాంతముగ నుచ్చరించునది. దూర్వాత్రయమున కొక యాహుతి దూర్వాస మిధులకు పెరుగు తేనె నేయి వీనితో నంజనము స్విష్టకృత్తు మొదలగు బలిదానాంత మందు ‘సముద్రజ్యేష్ఠా’ యని మొదలుగ యజమానాభిషేకము ప్రతిలక్షకు సువర్ణ నిష్కత్రయము అనఁగా మూడు వరాలుగాని యందు సగముగాని యథాశక్తిగగాని దక్షిణనిచ్చి హోమాంతమందు బలమున పవిత్ర దేవతను బూజించి హోమసంఖ్యలో పదియవభాగమనఁగ రెండువేలనన్నూ కుమారులు గాయత్రి నుచ్చరింపుచు, ‘సవితారం తర్పయామి’ యని పలికి తర్పణముఁ జేయునది. తర్పణసంఖ్యలో పదియవభాగ మనఁగ నిన్నూట నలువదిమారులు గాయత్రి నుచ్చరింపుచు ‘ఆత్మాన నభిషించామి’ యని తన శిరసునం దభిషేకము హోమతర్పణాభిషేకములలో నెద్దియే సంభవించకుండునో దాని స్థానమందు దానికి ద్విగుణముగ జపముఁ చేయవలెను. అభిషేకసంఖ్యకు పదియవభాగమైనను నధికముగనైనను బ్రాహ్మణ భోజనము. ‘పురశ్చరణం పూర్ణమస్తు’ అని బ్రాహ్మణులచే బలికించి కర్మ నీశ్వరుని కర్పించవలెను. ప్రతిదినమందును ‘యజ్జాగ్రతః’ అను శివసంకల్ప మంత్రము ముమ్మారు పఠింప వలెను. కర్త బ్రాహ్మణులతోగూడ హవిష్యము భక్షింపుచు సత్యమే పలుకుచు నధశ్శయ నము జేయ నియమించుకొనిన భూప్రదేశముఁ దాటకుండగ సంచరింపవలెను. ఇట్లనంతదేవీయ గ్రంథము ననుసరించి గాయత్రీ పురశ్చరణ విధి వ్రాయఁబడెను. ఋగ్విధానమందైనచో ‘మధ్యాహ్నేమిత భుజ్మౌ నీ త్రిస్నానార్చన తత్పరః, లక్షత్రయం జపేద్ధీమాన్’ అని అనఁగా మధ్యాహ్నమందు మితముగ భుజింపుచు కార్యాంతర మందు మౌనియై మూడుకాలముల స్నానార్చనములు చేయుచు గాయత్రీ జపము మూడులక్షలు చేయవలెనని పురశ్చరణ జపము స్వల్పముగఁ జెప్పబడినది. జప సంఖ్యకు నూరవభాగము మూడువేలు హోమమగును. ‘కలౌచతుర్గుణంప్రోక్త’ మని యున్నందున నాపక్షమందు బంద్రెండులక్షలు జపమును బంద్రెండువేలు హోమము నని సమూహింపవలెను. విష్ణుశయనమాసములనఁగ చాతుర్మాస్యమందు బురశ్చ రణముఁ జేయకూడదు. తీర్థాదులందు జేసెనేని శీఘ్రముగ సిద్ధియగును. బిల్వవృక్షం క్రిందఁ జేసినచో నొకదినమందునే సిద్ధియగునని సర్వమంత్ర ప్రచారము. ఇట్లు గాయత్రీ పురశ్చరణవిధి ముగిసెను.

## అశ్వత్థమున కుపనయనము

అది బ్రాహ్మణాదివర్ణములు క్రమముగ వృక్షము స్థాపించినది మొదలుగ నెనిమిది పదునొకండు పంద్రెండునను వర్షములలో నుపనయనమందుఁ జెప్పిన ముహూర్తము పూర్వాహ్ణమునందే చేయవలెను. శూద్రుఁడు స్థాపించిన రావిచెట్టునకు

పురాణమంత్రములచే దోటకుఁ బ్రతిష్ఠమాత్రమే చేయునదిగాని యుపనయనముఁ గూడదు. ఇట్టి యుపనయనమునకు ప్రయోగమెట్లనిన, కర్త దేశకాలములఁ గీర్తించి 'సర్వపాపక్షయ కులకోటిసముద్ధరణ పూర్వక విష్ణుసాయుజ్యప్రాప్తి కామోఽ శ్వత్థోప నయనం కరిష్యే' యని సంకల్పించి నాందీశ్రాద్ధమైన పైని యాచార్యుని వరింపవలెను. ఆచార్యుఁడు పంచామృతములచేతను శుద్ధోదకములచేతను నశ్వత్థమునకు స్నానముఁ జేయించి బుక్కగుండచే నలంకరించి దానికిఁదూర్పున స్థండిలమందగ్ని బ్రతిష్ఠించి యన్వాధానముచే 'అగ్నింవాయుం సూర్యంత్రిరగ్నిం పవమానం ప్రజాపతిం ద్విరోషధీర్వనస్పతిం పిప్పలం ప్రజాపతించ పాలాశసమిచ్చ ర్వాజ్యైః ప్రత్యేకమేకైక యాహుత్యాశేషేన స్విష్టకృత" మని మొదలగుగనుచ్చరించి నలువదెనిమిది పిడికిళ్ళను నూరకేనిర్వాపము ప్రోక్షణముఁజేసి శ్రవణము మొదలుగ నాజ్యభాగాంతము జరిగిన పైనియు "వం వస్త్రాణి" యను మంత్రముచే నశ్వత్థము రెండుబట్టలచే జుట్టి యజ్ఞోప వీత మను మంత్రముచే యజ్ఞోపవీతమిచ్చి ప్రావేపామ యని మేఖలను ముప్పేటగా జుట్టి, కృష్ణాజినమును దండము నూరకే యిచ్చి "అశ్వత్థేవ" యను ఋక్కుచే గంధ పుష్పాదులిచ్చి పూజించి "దేవస్యత్వా" యను మంత్రాంతమందు "హస్తంగృహ్ణామ్యశ్వత్థ" యని స్పృశించి ప్రణవవ్యాహృతులతో గూడ గాయత్రిని ముమ్మారు జపించి అశ్వత్థేవో నిషదన మనుసూక్తమునను వ్యాహృతులను నశ్వత్థం స్థాపయామి యని బంగారు తీగెచే ముట్టి నేయి మోదుగు సమిధలు చరువునను నీ ద్రవ్యములలో నొక్కొకటి పండ్రెండేసి మారులు మంత్రములు పండ్రెంటితో వ్రేల్చవలెను. మంత్రములేవనిన; "భూస్స్వాహా, అగ్నయే, భువస్స్వాహా, వాయవే, స్వస్స్వాహా, సూర్యాయ, భూర్భువస్స్వ స్స్వాహా ప్రజాపతయే" యను "అగ్నఅయాగ్, అగ్నిర్ఋషిః, ఆగ్నేపవస్వ" యను మూడింటికి అగ్నయే పవమానాయ యనియు ప్రజాపతేనత్వ యను దానికి ప్రజా పతయే యనియు ఓషధయస్సం అశ్వత్థేవో వీనికి ఓషధీభ్యః అనియు వనస్పతే శతయనువానికి వనస్పతయే యనియు, ద్వాసువర్ణా యనుదానికి పిప్పలాయేద మనియు, సమస్త వ్యాహృతులకు ప్రజాపతయే యనియు త్యాగములు మంత్రములును స్విష్టకృదాదిహోమశేషము సమాప్తి నొందించి అశ్వత్థేవో యని గంధపుష్ప ధూపదీప నైవేద్య ఫలతాంబూలాదులచే బూజించి యశ్వత్థము ముట్టి యాచార్యునికి గోవు నన్యులకు దక్షిణనిచ్చి యశ్వత్థవస్త్రాదుల నాచార్యునకిచ్చి యెన మండ్రువిప్రుల భుజింపఁజేయవలెనని, పుత్రులులేని పురుషుఁడుగాని స్త్రీగాని మర్రి జువ్వి మామిడి మొదలగు చెట్లను పుత్రులుగా పరిగ్రహింపవచ్చును. అపుడు దేశకాలములఁ గీర్తించి "మమ మహాపాపక్షయకుల త్రయోద్ధరణ ప్రజాపతి పురగమననిరయస్థ పితృద్ధరణ మధుధారాతృప్తి సిద్ధ్యర్థం సత్పుత్రత్వ సిద్ధ్యర్థం అముకవృక్షం ప్రతిగ్రహీష్యే" యని సంకల్పించి యుపవాసముజేసి రాత్రియం దెనమండ్రు విప్రులఁబిలచి చంద్రుని బూజించి జాగరము భూశయనమైనను జేసి ప్రాతఃకాలమందు వృక్షముబూజించి దానినీడను విప్రులకు భోజనముపెట్టి పుణ్యాహవాచనము చేయించి ప్రార్థించవలెను. ఎట్లనిన 'అపుత్రో భగవంతోత్ర పుత్రప్రతికృతిం తరుం, గ్రహిష్యామి మమానుజ్ఞాం

కర్తుమర్హథ సత్తమాః అని అనఁగా నోసత్పురుషులారా నేను పుత్రహీనుఁడ గనుక నీవృక్షమును పుత్రునిగా బరిగ్రహించెదను నా కనుజ్ఞయిండని ప్రార్థించి తామ్ర పాత్రయందైదు సువర్ణ ఫలముల బీజములైన పంచరత్నములతో గూడగ నధివాసన జేసి లోకపాలురకు బలులనీవలెను. మరునాడు తిలాజ్య చరువులచే నెనమన్నూరు మారులు వనస్పతి మంత్రముతో హోమముజేసి జాతకర్మ మొదలగు వివాహాంత సంస్కారములఁజేసి యభిషిక్తుడై యజమానుఁడు పుష్పాంజలి ధరించి ప్రార్థించునది. ఎట్లనిన; "యేశాఖినశ్శిఖరిణాం, శిరసాంవిభూషా యేనందనాదిషు వనేషు కృత ప్రతిష్ఠాః యేకామదాస్సురనరోరగ కిన్నరాణాం తేమే నతస్య దురితార్తిహరాభవంతు" అనఁగా వృక్షములు కులపర్వత శిఖరముల కలంకారములై యున్నవి మరియు స్వర్గమందు నందనము కుబేరుని చైత్రరథమందునుండి సురులకు నరులకు గిన్నరు లకు గోరికలిచ్చుచున్నవి. అట్టి వృక్షములు నమస్కరించు నాకు దురితార్తిని హరించు గాకయనుట "ఏతేద్విజావిధివదత్ర హుతోహుతాశః పశ్యత్యసౌచ హిమదీ ధితి రంతరస్థః, త్వం వృక్ష పుత్ర పరికల్పనయా వృతోసికార్యం సదైవభవతా మమపుత్ర కార్యం" అనఁగా వీరుబ్రాహ్మణోత్తములు, యధావిధిగ నగ్నికార్యము చేయఁబడి నది. ఈచంద్రుఁడు మధ్యమందుండి చూచుచున్నాడు. ఇందరు సాక్షులైయుండ నో వృక్షమా! నీవు పుత్రుఁడుగా పరిగ్రహింపఁబడితివి. కాఁబట్టి యెల్లపుడును నాకు బుత్రకార్యమును నీవు చేయవలసినదని ప్రార్థించి "అంగాదంగాత్సంభవసి" యను మంత్రముచే స్పృశించి విప్రులకు దక్షిణ లిచ్చి విడువవలెను. ఇట్లు వటాదితరువులకు బుత్రవిధి ముగిసెను.

## సకల కర్మలకు సాధారణమైన పరిభాష

"సర్వేషు పాకయజ్ఞేషు భవేద్బ్రహ్మ కృతాకృతః, పాత్రాసాదన మిచ్ఛాత ఆజ్యాది శ్రవణానిచ " అనగా పాకయజ్ఞము లన్నిటియందు బ్రహ్మవరణము వైకల్పికము పాత్రాసాదనము నాజ్యాదులకు శ్రవణము నైచ్ఛికము. 'స్రువాది మార్జనంచేధ్మ రజ్జు ప్రహరణం తథా' అనఁగా నిట్లు స్రువాది పాత్రల దుడుచుటయు నిధ్మములు గట్టిన రజ్జువు నగ్నియందు వ్రేల్చుటయు నైచ్ఛికమే 'పూర్ణపాత్రం భవేన్నిత్య మాజ్యస్యోత్ప్ల పనం తథ్యా' పూర్ణపాత్ర వినియోగము నాజ్యమున కుత్పవనసంస్కారమును నిత్య ములు. "వ్రీహీణామవఘాతశ్చ తండులేషు కృతాకృతః" ద్రవీభూత ఘృతస్యాపి విలాపన విధిస్తథా" అనఁగా వ్రీహులకుఁ జెప్పిన యవఘాతమనఁగ దంపుట తండులములనఁ గ బియ్యము వైకల్పికము ద్రవ్యముగానె యున్న ఘృతమునకు గరగించుటయు నట్లనే. హోమమం దాజ్యమునిర్దేశించి చెప్పినయెడ పరిస్తరణము వైకల్పికలము అట్లు చెప్పని యాజ్యహోమమందు నిత్యము, ఆజ్యభాగ సహితమైన కర్మకు నదిలేని కర్మకు దంత్రముగల్గినచో నాజ్యభాగానుష్ఠానము మానుటయే యుక్తము. ఏమనిన; నాజ్యభాగానుష్ఠానమంతటను వైకల్పికమే. అనేకపాయజ్ఞము లొకకాలమందుఁ జేయవలసివచ్చినపుడు సమాన తంత్రముగఁజేయును. కాఁబట్టి స్విష్టకృత్తు మొదలగు

నదియు నొకటియే. హోమద్రవ్యము జెప్పనిచో నాజ్యమే, గ్రహింపవలెను. మంత్ర మంతయు నుచ్చరించి కర్మఁజేయవలెను. మంత్రము కర్మకు ముఖ్యసాధనము గదా. గృహ్యకర్మయందు కర్మకావృత్తిఁ గల్గినచో మంత్రమునకు నావృత్తిచేయవలెను. మంత్ర ముతో హోమము విధించినపుడు నిర్వాపమూరకే చేయునది. నామముచే హోమము విధించిన యెడ నామము చేతనే నిర్వాపాదికము చేయునది. హోమమునకు నామము గాని మంత్రముగాని నిర్దేశింపనిచో నామమే గ్రహించునది. మంత్ర సహితహోమమం దనేక దేవతాకమైన చరువు లొకమారే చేసినను విభాగము నభిమర్శము నక్కరలేదు. నిర్దేశించి చెప్పనిచో గుడిహస్తమే గ్రహింపవలెను. దిక్కు నిర్దేశింపనిచో దూర్పు నుత్తరమును నీశాన దిక్కుగాని గ్రహింపవచ్చును. స్థితి నిర్దేశించి చెప్పనిచో గూర్చుం డియే చేయవలెను. కర్తృనిర్దేశము లేనిచో దానె చేయవలెను. మంత్రమునకు స్వరము తెలియనిచో సౌత్రమంత్ర మొక్క శ్రుతిగఁ జెప్పవచ్చును. హోమకాలమందు మంత్రము మొదట ప్రణవమును నంతమందు స్వాహా యనియు నుచ్చరింపవలెను. బ్రాహ్మణాదు లకు బవిత్రము రెండుదర్భలతోగావవలెను. ముడివేయుట వైకల్పికము. ఆహుతికి ప్రమాణము "కర్షప్రమాణమాజ్యా దిలాజాముష్టి మితామతాః, అన్నం గ్రాస సమం గ్రాహ్యం కందానామష్టమోంశకః, తిలసక్తు కణాదీనాం మృగీముద్రా ప్రమాణతః" అనఁగా నాజ్యము మొదలగునది పలములో నాల్గవభాగము గ్రహింపవలెను. పేలాలు పిడికెడేసి గ్రహించునది, అన్న మొక బలముగ గ్రహింపవలెను. దుంపలు మొదలగు నవి యెన్మిదవభాగము వ్రేల్చునది. నువ్వులు సత్తుపిండి కణధాన్యము మొదలగు వాని దర్జనిగనిష్ఠికను విడిచి తక్కిన వ్రేళ్ళతోబట్టి నన్ని గ్రహింపవలెను. రాగిపాత్రచే గప్పిన రాగిపాత్రయందుగాని మృన్మయమందుగాని రజతాది పాత్రమందుగాని యగ్ని ప్రణయముఁ జేయవలెను. శ్రోత్రియగృహమునుండి యగ్ని దెచ్చుట శ్రేష్ఠము. స్వ గృహమునుండి తెచ్చుట మధ్యమము; ప్రోక్షింపకుండ సమిధ నగ్నియందుంచఁ గూడదు. ఎల్లపుడు నుపవీతిగ నుండవలెను. అట్లు శిఖను ముడివేసుకొనియే యుండ వలెను. అనఁగా నట్లుండుటకర్మాంగము పురుషసంస్కారము ననుట, కనుక గర్మ జేయునపుడు శిఖాబంధము లేనియెడ ప్రాయశ్చిత్తములు రెండు చేయవలెను. వేరొ కప్పుడు డొక్కటియే యగును. దశవిధ దర్భలు మీఁద జెప్పఁబడినది. మఱ్ఱి, జువ్వి, మారెడు, వికంకతము, చందనము, దేవదారువు, సరళము వీటి సమిధలు గూడ క్వచిత్తుగా విధింపఁబడినది. "ప్రభుః ప్రథమకల్పస్య యోనుకల్పేన వర్తతే, సనాప్నోతి ఫలంతస్య పరత్రేతి శ్రుతిస్మృతిః" అనఁగా ముక్యపక్షముగఁ జేయుటకు సమర్థుఁ డై యుండియు రెండవ పక్షముగఁ గర్మజేసినచో దానిఫలము పరలోకమందు సంభ వింపదని శ్రుతిస్మృతులు చెప్పుచున్నవి. "బహ్వాల్పంవా స్వగృహ్యోక్తం యస్య యత్కర్మ చోదితం, తస్యతావతి శాస్త్రార్థే కృతే సర్వః కృతోభవేత్." అనఁగా దమ సూత్రమందుఁ జెప్పినట్లు స్వల్పముగాని యధికముగాని శాస్త్రనిర్ణీతమైన కర్మను జేసెనేని యంతయు జేసినఫలము సంభవించునని.

## కర్మభేదములలో నగ్నికి నామములు

"అగ్నిస్తు మరుతోనామ గర్భాధానేభిధీయతే, పవమానః పుంసవనే సీమంతే మంగలాభిధః, ప్రబలోజాతసంస్కారేపార్థివో నామకర్మణి, అన్నప్రాశే శుచిః ప్రోక్త స్సభ్యస్స్యాచ్చౌలకర్మణి, వ్రతాదేశే సముద్భవః, గోదానాదౌ సూర్యః, వివాహే యోజకః ఆవసధ్యేద్విజనామా, ప్రాయశ్చిత్తే విటః, పాకయజ్ఞేషు పావకః, పిత్ర్యేకవ్య వాహనః దైవే హవ్యవాహనః, శాంతికే వరదః, పౌష్టికే బలవర్ధనః మృతదాహేక్రవ్యాదః" అని యిట్లు గర్మవిశేషమందు నామభేద మగ్నికి దెలసి గృహ్యాకర్మఁ జేయవలెను. మోదుగు కఱ్ఱచే జుహూపాత్రయు చంద్ర కఱ్ఱచే స్రుక్కు స్రువమును జేయునది. అది దొరకనిచో యధాసంభవముగ యజ్ఞార్హ వృక్షముచే జేయునది. అదియు లేనియెడల మోదుగు మధ్య పర్ణములచే నైనను జువ్విపత్రములచే నైనను జేయవలెను.

## జుహువు మొదలగు యజ్ఞ పాత్రలు చేయు నిర్ణయము

అనఁగా యజ్ఞార్హవృక్షజములే కావలెను. "కామ్య ప్రతినిధి ర్నాస్తి నిత్యేనైమిత్తికే హిసః, కామ్యేప్యుపక్రమాదూర్ధ్వ మన్యే ప్రతినిధిం విదుః" అనఁగా కామ్యకర్మలయందు ప్రతినిధిఁ చేయఁగూడదు, నిత్యకర్మకు నైమిత్తిక కర్మకును మరియొకరిని ప్రతినిధిగా నుంచవచ్చును. కొందరు కామ్యకర్మయందును బ్రారంభించినపైని ప్రతినిధి యుండ వచ్చునంద్రు. "నస్యా త్ప్రతినిధిర్మంత్ర కర్మదేవాగ్ని కర్తృషు, న దేశారణి కాలేషు త్రిషు ప్రతినిధిర్మతః, నాపి ప్రతినిధాతవ్యం నిషిద్ధం వస్తుకుత్రచిత్." అనఁగా మంత్ర మునకు గర్మకు దేవతకు నగ్నికి గర్తకు బ్రతినిధి యెక్కడను గూడదు. అనఁగా నొకరు చేయవలసినది మరియొకరు తానే కర్తగా చేయఁగూడదనుట. మరియు దేశమునకు గాలమునకు నరణికిని బ్రతినిధిఁ గూడదు. వస్తువునకు బ్రతినిధిచేయు నపుడు నిషిద్ధవస్తువు నెప్పుడుఁ జేయఁగూడదు. "స్వకాలాదుత్తరోగౌణః కాలస్సర్వస్య కర్మణః" అనఁగా సర్వకర్మలకును స్వకాలముకంటె నుత్తరకాలము గౌణమని తెలియు నది. "తర్పణేష్వాసనే శ్రాద్ధే భుక్త్వా మూత్రపురీషయోః,షట్సునిర్మాల్యకాదర్భాః దర్వ్యాద్యా అభిచారకే, మంత్రోపియశ్చశూద్రార్థే బ్రాహ్మణాః ప్రేతభోజనే" అనఁగా తర్పణమైనపైని నాసనవినియోగమైనను శ్రాద్ధమైన పైని భోజనమైన పైని మూత్ర పురీషములు విడిచిన పైని నీ యారు సమయములందు దర్భలు నిర్మాల్య మగుననఁగా మరియొక కర్మకుఁబనికి రావనుట. ఇట్లు దర్వి మొదలగునవి యభిచారకర్మకు వినియోగించినచో నిర్మాల్యమగును. మంత్రముగూడ శూద్రుని నిమిత్తమై విని యోగించినచో బ్రాహ్మణుఁ డు సహితము ప్రేతకై భుజించినచో నిర్మాల్య మనఁబడును.

## కర్మాంగదేవతలు

వివాహమం దగ్ని దేవత కనుక వివాహాంగమైన స్వస్తివాచనాదులు చేసి 'కర్మాంగ దేవతాగ్నిః ప్రీయతాం'అని సమర్పింపవలెను. ఔపాసనమందగ్ని సూర్య ప్రజాపతులు దేవతలు, స్థాలీపాకమందగ్నిదేవత, గర్భాధానమందు బ్రహ్మదేవత, పుంసవనమందు బ్రజాపతి, సీమంతమందు ధాత, జాతకర్మయందు మృత్యువు,

నామకర్మ నిష్క్రమణాన్న ప్రాశనములందు సవిత కర్మాంగదేవత, చౌలకర్మయందు కేశి యనువారుదేవతలు, ఉపనయనమందు నింద్రశ్రద్ధామేధలు నంతమున సుశ్ర వసుఁడును గర్మాంగదేవతలు, పునరుపనయనమందగ్ని, సమావర్తనమందింద్రుడు, ఉపాకర్మయందును వ్రతములందును సవిత, వాస్తు హోమమందు వాస్తోష్ప తియు నంతమున బ్రజాపతియు, ఆగ్రయణమందాగ్రయణదేవతలు, సర్పబలికి సర్ప ములు, తటాకము మొదలగు జాలాధారములకువరుణుఁడు. గ్రహయజ్ఞమందు నవగ్రహ ములు, కూశ్మాండ హోమమందు చాంద్రాయణమందు నాధానమందు నగ్న్యాదులు, అగ్నిష్టోమమున కగ్ని, ఇతర యాగకర్మలకు ప్రజాపతి యని యెఱుంగునది.

## కలియుగమందు కార్యాకార్య విచారము

"గీతాగంగా తథావిష్ణుః కపిలాశ్వత్థ సేవనం, ఏకాదశీ వ్రతం చైవ సప్తమం న కలౌయుగే" అనఁగా భగవద్గీతాపాఠము గంగా విష్ణు సేవనము కపిలగోవు నశ్వత్థము సేవించుటయు నేకాదశీ వ్రతమునను నీయారును గలియుగమున బ్రశస్త ములు. "విష్ణుం శివం వా భజతాం గురోః పిత్రోశ్చసేవినాం, గోవైష్ణవ మహాశైవ తులసీసేవినామపి, నస్యాత్కలికృతోదోషః కాశ్యాంనివసతా మపి, కలౌగురూణాం భజన మీశభక్త్యధికం స్మృతం" అనఁగా హరిహరులలో నొకరిభజించుటయు గురు వును దలిదండ్రులను సేవించుటయు గోవులను విష్ణుభక్తులను శివభక్తులను తులసిని సేవించుటయు గల్గువారికి గలిదోషమంటదు. మరియు గాశీవాసము నట్టిదే కలియుగ మందీశ్వరభక్తి యధికముగ నుండవలెను. "జపాదౌ యత్రయాసంఖ్యా కలౌసాస్యాచ్చతుర్గుణా, కలౌ దానం మహాశ్రేష్ఠం శివవిష్ణ్వోశ్చ కీర్తనం" జపాదులకుఁ జెప్పిన సంఖ్య కలియుగమందు చతుర్గుణము గావలెను. కలియందు దానము శివ విష్ణుభవనమును శ్రేష్ఠములు. "కృతేయద్దశ భిర్వర్షై స్త్రేతాయాం హాయనే న తు, ద్వాపరే తత్తు మాసేన అహోరాత్రేణ తత్కలౌ" అనఁగా కృతయుగమందు పదివత్సర ములు జేసిన కర్మఫలము త్రేతాయుగమందు సంవత్సరముతో గల్గును. ద్వాపరమందు మాసముచేతను గలియుగమందొకదినముచేతనే యది గల్గును మరియు శ్రీ భాగవత మందు "కుశలాన్యాశు సిద్ధ్యంతి నేతరాణి కృతానియత్." అని. అనఁగా పుణ్యకర్మలు కలియందు సంకల్పమాత్రముచే సిద్ధించును. లేక పాపకర్మలు చేసినపైని సిద్ధించును. "స్మృత్యంతరవిరోధేతు కలౌ పారాశరస్మృతిః" అనఁగా స్మృతులకుఁ బరస్పరవిరోధ మున్నచో గలియందు బరాశరస్మృతి ప్రశస్తము. "ధ్యాయన్ కృతేయజన్యజ్ఞైస్త్రేతా యాం ద్వాపరేర్చయన్, యదాప్నోతి తదాప్నోతి కలౌ సంకీర్త్యకేశవం" అని హేమాద్రిలో వ్యాసవచనము. అనఁగా కృతయుగమందు సమాధిఁజేయుటచే త్రేత యందు యజ్ఞములుచేసినను ద్వాపరమందు భగవంతునర్చించినను గల్గుఫలము గలియుగమందు భగవన్నామసంకీర్తన మాత్రముచే గల్గునని విధింపఁబడెను. హేమా ద్రాయందు 'కలింసంభాజయంత్యార్యా గుణజ్ఞాస్సార భాగినః, యత్రసకీంర్తనే నైవ సర్వస్స్వార్థోఖిలభ్యతే' యని, అనఁగా గుణజ్ఞులు సారద్రిహులైన పెద్దలు కలియుగ

మును సత్కరింపుచున్నారు. ఏమనిన; కీర్తనమాత్రముచే సర్వార్థములు సిద్ధించును. కీర్తనమన భగవన్నామస్మరణము. "కృష్ణవర్ణం త్విషాకృష్ణం సాంగోపాంగాస్త్ర పార్షదం, యజ్ఞైస్సంకీర్తన ప్రాయైర్యజంతీహసుమేధసః" అనఁగా కాంతిచే నల్లనగు శ్రీకృష్ణుని నంగోపాంగ దేవతలతో నస్త్రములతో భక్తులతో గూడునట్లు సంకీర్తన ప్రచురములైన యజ్ఞములచే నారాధింతురు. స్వవర్ణాశ్రమోచిత కర్మములఁజేయుచు కాలమందు నామసంకీర్తన నిష్ఠులుగావలెనని తాత్పర్యము. కాఁబట్టి "యావైసాధన సంపత్తిః పురుషార్థ చతుష్టయే, తయా వినాతదాప్నోతి నరో నారాయణాశ్రయః" అని భారత వచనము. అనఁగా ధర్మార్థకామమోక్షములకుఁ జెప్పిన సాధనసంపత్తి లేకున్నను భగవంతు నాశ్రయించువారి కవి సిద్ధించును. ఇట్లు భాగవతమందును, 'ధర్మార్థ కామ మోక్షాఖ్యం య ఇచ్ఛేచ్ఛ్రేయ ఆత్మనః, ఏకం హ్యేవహరేస్తత్ర కారణం పాద సేవనం'అని. అనఁగా ధర్మార్థకామ మోక్షములకు హరిపాదసేవన మొకటియే కారణ మని యవధారణ మున్నందున భక్తియోగమున నితరసాధనములపేక్షింప కుండుటయు జ్ఞానయోగాదులకు భక్తియోగాపేక్షయు ధ్వనింపఁబడుచున్నది. అట్లైకా దశ స్కంధమునందు స్పష్టము. "తస్మాన్మద్భక్తియుక్తస్య యోగినోవై మదాత్మనః నజ్ఞానం న చ వైరాగ్యం ప్రాయశ్శ్రేయో భవేదిహ, యత్కర్మభిర్య త్తపసా జ్ఞానవైరాగ్య తశ్చయత్, యోగేనవానధర్మేణ శ్రేయోభిరితరై రపి, సర్వం మద్భక్తియోగేన మద్భక్తో లభతేఽ ంజసా, స్వర్గాపవర్గం మద్ధామ కథంచిద్యదివాంఛతి." అనఁగా నాయందు భక్తిగలిగి నేనే తన కాత్మగాదెలిసినభక్తునికి జ్ఞానముగాని వైరాగ్యముగాని శ్రేష్ఠముగాదు. మరియు గర్మవిశేషముచేతను తపస్సు చేతను జ్ఞానవైరాగ్యములచేతను యోగము చేతను దానధర్మముచేతను నితరమైన శ్రేష్ఠధర్మము లన్నిటిచేతను వచ్చుఫలమంతటిని నా భక్తుఁడు శ్రమలేకుండఁగ నొందును. అనఁగా భక్తుఁడు గోరఁడుగాని కోరినచో స్వర్గము, మాస్థానమగు నపవర్గము నతనికి హస్తగతమే యనుట. మరియు; "శ్రేయ శ్స్రుతిం భక్తిముదస్యతే విభోశ్లిష్యంతియే కేవలబోధలబ్ధయే, తేషామసౌ క్లేశలవేన శిష్యతే నాన్యద్యథాస్థూలతుషావఘాతినాం." అనఁగా నో స్వామీ! శ్రేష్ఠమైన నీభక్తుని విడిచి కేవలజ్ఞానము లభించవలెనని యెవ్వరు యత్నింతురో వారికి నట్టి బోధ క్లేశమునకే యగును. వేరేఫలమేమియులేదు. ఎట్లనిన; నట్టియుమకదంపు వారికేమి యైన దొరకునా? యని మొదలుగ వేలకొలఁది వచనములున్నవి. మరియును జ్ఞానయోగము భగవధారాధన భగవత్ప్రసాదములు లేకుండఁగ సిద్ధించు నని యెవ్వరైనను నేగ్రంథమందైనను వ్రాయఁగలిగినారా? లేదు. సరియేకదా "సర్వాపేక్షా చ యజ్ఞాది శ్రుతీనామశ్వమేధవత్" అను సూత్రాది కరణమందు జ్ఞానోత్పత్తికై యజ్ఞాది సర్వసాధనాపేక్షకంతోక్తమై యున్నది మరియు; నొకలాభమున్నది. దురాచారము గల్గినవాఁడైనను దృఢవైరాగ్యము లేకున్నను భక్తియోగమం దధికారి యగును. అట్లు వచనము "అపి చేత్సుదురాచారోభజతే మామనన్యభాక్, సాధురేవ సమంతవ్య స్సమ్యగ్వ్యవసితో హిసః, క్షిప్రంభవతి ధర్మాత్మా శశ్వచ్ఛాంతిం నిగచ్ఛతి, కౌంతేయ ప్రతిజానీ హి నమేభక్తఃప్రణస్యతి" అనఁగా మిక్కిలి దురాచారుఁడైనను పూర్వపుణ్య

ముచే నాయందనన్యభక్తిఁ గలవాఁడైనచో వానిని సాధుపురుషునిగ గమనింపవలెను. ఏలయనిన; యుత్తమ వ్యవసాయము గలిగియున్నాఁడు గదా! కావున దురాచారము పోవును. ఆతఁడు శీఘ్రముగానే ధర్మాత్ముఁడగును. శాశ్వతమైన మోక్షస్థానము నొందును. ఓయర్జునుడా ! పెక్కుమాటలేల? నీవు ప్రతిజ్ఞచేయుము. (నాభక్తుఁడు చెడిపోడనియనుట.) ఇట్లు దురాచారుఁడైనను దృఢవైరాగ్యము మొదలగు సాధనచతుష్టయ సంపత్తిలేకున్నను వేదాంత శ్రవణాదులు చేసినచో జ్ఞానయోగసిద్ధి యగునని యెచ్చటనైన వ్రాయఁబడియున్నదా? యథోక్తాధికారసంపత్తి లేకున్న నాచరించిన సాధనము ఫలించునా? కాఁబట్టి సర్వ ప్రకారములచేతను కలియుగమందు శ్రీహరిపాదసేవనము మొదలగు భక్తియోగమునే యందరు నాచరింపవలయును. అని యిట్లీ గ్రంథకర్త భక్తియోగమందభిమానము జూపించినను శ్రీశంకర భగవత్పాదులు సన్న్యాసమును గలియుగమందును స్థాపించినందున జ్ఞానయోగమునకు గూడ నవకాశమున్నది. గృహస్థులకైనను ప్రతిదినమందు వేదాంత శ్రవణముచే నశీతియనఁగ నేబదికృచ్ఛ్రములు చేసిన ఫలము సంభవించునని వచనమున్నది. మరియును; 'తేషాంజ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తి ర్విశిష్యతే' యని యతనికే సంతతభక్తి యుండుననియు 'జ్ఞానీత్వా త్మైషమేమతం' అని జ్ఞానికి యుత్కృష్టతయు 'యేత్వక్షర మనిర్దేశ్య మవ్యక్తం తద్యుపాసతే, సర్వత్ర గమచింత్యంచ కూటస్థమచలంధ్రువం, సన్నియ మ్యేం ద్రియ గ్రామం సర్వత్ర సమబుద్ధయః, తేప్రాప్నువంతి మామేవ సర్వభూత హితేరతాః'అని మోక్షప్రాప్తియందు వారికి స్వాతంత్ర్యముఁ జెప్పఁబడినది. ఇఁక నేమనిన; 'క్లేశోధిక తరస్తేషా'మ్మని జ్ఞానయోగమునకు సర్వసులభత్వము గాదని చెప్పుచు భక్తియోగమందును క్లేశ మధికముగాక తప్పదని తదప్రత్యయముచే సూచింపఁబడినది. ఇట్లు కర్మనిష్ఠ జ్ఞాననిష్ఠకు సాధనమని ద్వితీయాధ్యాయములో నిర్ణయించినదే. 'లోకేస్మిన్ ద్వివిధానిష్ఠా' యని ప్రారంభించి 'తుదిని నిష్ఠాజ్ఞానస్యయాపరా' యనియు,'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' యనియు, జ్ఞాననిష్ఠయే ఫలమని ముగించుట గీతాశాస్త్రార్థమని భాష్యాదులందు సువ్యక్తముగ నున్నది. కనుక సాధనావస్థలో భక్తియోగము ముఖ్యమని యీ గ్రంథతాత్పర్యముఁ దోఁచుచున్నది.

## కలిలో నిషిద్ధములు

'సముద్రయాత్రా స్వీకారాః కమండలు విధారణం, ద్విజానామసవర్ణాసు కన్యాసూపయమ స్తథా, దేవరాద్యై స్సుతోత్పత్తి ర్మధుపర్కే పశోర్వధః, మాంసదానం తథాశ్రాద్ధే వానప్రస్థాశ్రమ స్తథా, దత్తాక్షతాయాః కన్యాయాః పునర్దానం పరస్య చ, దీర్ఘాకాలం బ్రహ్మాచర్యం నరమేధాశ్వమేధకౌ, మహాప్రస్థానగమనం గోమేధశ్చ తథా మఖః, ఇమాన్ ధర్మాన్ కలియుగే వర్జ్యానాహుర్మనీషిణః' అనఁగా సముద్రముపై యాత్రఁజేయుట, కమండలువు ధరించుట, అనఁగా కుటీచకబహూదకాది సన్న్యాసము. ద్విజులకు విజాతీయకన్యతో వివాహమును, మరది మొదలగువారిని నియోగించి పుత్రులఁగనుటయు, మధుపర్క మిచ్చునపుడు గోవును వధించుట, శ్రాద్ధమందు మాంసముఁబెట్టుట, వానప్రస్థాశ్రమము నొందుట, ఒకరికి వివాహముఁ జేసిన

కన్యను రజస్వలగాక మున్నైనను మరియొకనికిచ్చుటయు, చాలాకాలము బ్రహ్మ చారియై యుండుటయు, నరమేధము నశ్వమేధమును, మహాప్రస్థాన మనఁగ దేహాభి మానము విడిచి మరణముఁగోరి ముక్కునకు సూటిగబోవుట, గోమేధ మను యజ్ఞ మును నివి కలియుగమందుఁ జేయఁగూడదని పెద్దలు నిర్ణయించిరి. 'మద్యంవర్జ్యం మహాపాపే మరణాంత విశోధనం, సౌత్రామణ్యాది యజ్ఞేపి సురాపాత్ర గ్రహస్తథా, మద్యభక్షాదివామాద్యా గమస్యతు న మానతా, మీమాంసా ద్వితయేసర్వశిష్టైశ్చ తదవాదరాత్, ఔరసోదత్తకశ్చైతౌ పుత్రౌ కలియుగే స్మృతౌ, అన్యాన్ దశవిధాన్ పుత్రాన్ క్రీతాద్యాన్ వర్జయేత్కలౌ అనఁగా మద్యపానము మహాపాతకమునకు మరణాంత ప్రాయశ్చిత్తము. సౌత్రామణి మొదలగు యజ్ఞమందైనను సూరాగ్రహణము. మద్య భక్షణము మొదలగు వామాచారముఁ జెప్పు నాగమము పూర్వోత్తర మీమాంసల యందాదరింపఁబడలేదు. కనుక నదియును కలియందు వర్జ్యములు. ఔరసుఁడు దత్తకుఁడు నని యిద్దరే పుత్రులు కలియుగమందు శాస్త్రముచే విధింపఁబడిరి. ఇతరు లైన పదివిధములపుత్రులు నిషేధింపఁబడిరి. కౌస్తుభమందు మాత్రము కలియుగ మందు స్వయందత్తుఁడని మరియొక పుత్రుఁడు విధింపఁబడెనని తొమ్మండ్రే కలి యందు నిషిద్ధులని యున్నది. కలియుగమందు బ్రహ్మహత్య మొదలగునవి చేసిన వారికే పతితత్వముగానివారితో సంసర్గముఁ జేసినవారికి నరకహేతువైన పాపమున్న ప్పటికి నసంవ్యవహార్యత్వ మనఁగ వెలివేయుట స్వరూపమగు పతితత్వము లేదు. కనుకనే 'సంసర్గదోషః పాపేషు' అని కలివర్జ్యములలో నున్నది. మరియును 'కృతే సంభాష్యపతతి త్రేతాయాం స్పర్శనేన చ, ద్వాపరే త్వన్నమాదాయ కలౌ పతితకర్మణా' యని అనఁగా కృతయుగమందు మహాపాతకితో సంభాషించెనేని పతితుఁడగును. త్రేతయందు స్పృశించినను ద్వాపరమందువా డిచ్చునన్నముదిన్నను పతితుఁడగును గాని సంభాషణాదులచే గాడని యర్థము. ఇట్లు చెప్పుటయులోకమందు బహిష్కార ముచే యని పాపులకని తోఁచుచున్నది. ఏమనిన; లోకద్వేషమున గలుగును గనుక నట్టివారితో తప్పని సంసర్గముఁ గల్గినను పాతిత్యములేదని తాత్పర్యము. కానిచో లోకమందుఁ బ్రచ్ఛన్నపాపులై యభక్ష్యభక్షణము నపేయపానమున గమ్యాగమనము జేయుచున్నవారి నెరిగియుండియు నెంత శిష్టుఁడైనను నరకహేతువైన వారితో సంభాషణాదులు వర్జించుటకు సమర్థుఁడగుణా? అట్లు చేసెనేని లోకద్వేషము తప్పదు గదా. కనుక లోకమందు బహిష్కృతు లైనవారితో సంభాషణాదులు కలియుగమం దును వర్జ్యములు. అట్లనే శిష్టాచారము నున్నది. కనుకనే "త్యజేద్దేశం కృతయుగే త్రేతాయాం గ్రామముత్సృజేత్, ద్వాపరే కులమేకం తు కర్తారం తు కలౌయుగే." అనఁగా కృతయుగమందు పతితుఁడున్న దేశము త్రేతయందట్టి గ్రామము ద్వాపర మందట్టి కులమును గలియుగమందు పతితుని మాత్రమే విడువవలెనని యున్నది. ఇక్కడ విడుచుట యనఁగ సంసర్గము మానుటయే మరియు నీవచనముచేతనే యొకఁడు పతితుఁడైనచో వానికులమంతయు విడుచుట ద్వాపరమందేకాని కలియుగ మందక్కరలేదని చెప్పఁబడినది. కనుక కలియందు కర్తకే బహిష్కారమని సిద్ధించినది.

దీనికి విరుద్ధముగా పతితుని సగోత్రసపిండులకు గర్మానర్హత్వము నసంవ్యవహార్యత్వ ముగఁ దెలుపువచనమే గ్రంథమందును గానరాదు. అయినను నిర్ణయసింధువునందు ఘటస్ఫోట ప్రకరణములో 'గృహేషు స్వైరమాపద్యేరన్' అను వసిష్ఠవచన సామర్థ్య ముచే పాత్రనినయనము చేయకమున్ను పతితజ్ఞాతులకు ధర్మకార్యమం దధికారము లేదని యపరార్కవ్యాఖ్యానమున నుదహరింపఁబడినది గాని యది సర్వపతితుల నుద్దేశించి కాదు. మరియేమనిన; ఘటస్ఫోటము చేయఁదగిన పాతకియై ప్రాయశ్చిత్త మంగీకరింపని పతితుని విషయమే. అట్లుగానిచో పాత్రనినయనమునకు మున్నే యని చెప్పకపోవును. ప్రాయశ్చిత్తమున కంటె పూర్వమందే యనియే చెప్పెను. మరియును 'కర్తారంతు కలౌయుగే' యని కర్తృమాత్ర బహిష్కారము ప్రత్యక్ష వచన సిద్ధమగు చుండఁగ నర్థాపత్తి మూలముగ సర్వపతితుల నుద్దేశించి కులబహిష్కారము గల్పించుట యప్రామాణికమే యగునుకదా. కనుక కలియందు కులమునకు బహిష్కారము లేదని తోఁచుచున్నది. అట్లైనచో ఘటస్ఫోటము విధించుట వ్యర్థమగునని శంకింపఁగూడదు. అది పరలోకదోషము పరిహరించుటకు గావచ్చును. లోకబహిష్కృతమైన పాతకము గలుగునపుడు సంభాషణము మొదలగు సంసర్గము పాతిత్య హేతువుగానున్నను పరలోకహాని జేయునుగదా. కనుక నా దోషము నివర్తించుటకు ఘటస్ఫోటమని దాని విధించుశాస్త్రమే యర్థాపత్తిమూలముగఁ దెలుపుచున్నది. దీని బాధించుటకు గలియందు సంసర్గదోషము పాతిత్యహేతువగునను ప్రత్యక్షవచన మెక్కడను లేదుగదా. కాఁబట్టి ఘటస్ఫోటవిధి సామర్థ్యముచే పతితుని కులమునకంతకు బహిష్కారము కల్పించుట యుక్తము గాదనితోఁచుచున్నది. మరియు సత్రయోగము గలియుగమందు నిషిద్ధము. బ్రహ్మహత్య మొదలగువానికి గలియందు బ్రాయశ్చిత్తముఁ జేసినను నీలోకమందు వ్యవహార యోగ్యతయే కల్గునుగాని పరలోక నరకనివృత్తి గానేరదు. స్వర్ణస్తేయము మొదలగు వానికైనచో ప్రాయశ్చిత్తముచే నరక నివృత్తియు వ్యవహారయోగ్యతయు రెండును గల్గును. కొందరు రహస్యకృతములైన మహాపాపములకు రహస్యముగ బ్రాయశ్చిత్తము గలియం దుపదేశింపఁగూడదండ్రు. బ్రాహ్మణాది స్త్రీసంగముచే భ్రష్టులగు శూద్రులకు బ్రాయశ్చిత్తముఁజేసినను సంసర్గము నిషిద్ధము. యజ్ఞమందు పశువిశసనము శూద్రునిచేఁ జేయింపవలెను, గాని కలియందు విప్రుఁడు స్వయముగా నది జేయఁగూడదు. సోమవిక్రయము విప్రులకు గలిలో వర్జ్యము. జ్యేష్ఠుఁడు మొదలగు సోదరులందరు పిత్ర్యధనమును సమభాగముగ బంచుకొనుటయే కలియందు యుక్తము. ఆతతాయి యనఁగ నగ్నిదుఁడు గరదుడు మొదలగు పాపలగు ద్విజులకు ధర్మయుద్ధమందైనను వధచేయుట గలియందు గూడదు. సముద్రయానము జేసిన విప్రునికి బ్రాయశ్చిత్తమైనప్పటికి సంసర్గము గలియందు నిషిద్ధము. గోవు నిమిత్తము బ్రాహ్మణుని నిమిత్తము ప్రాణము విడుచుట కలియందు నిషిద్ధము. ద్విజులకు గోపనాపితు లనఁగ గొల్లమంగలి యిండ్లలో భోజనము గలియందుఁ గూడదు. శిష్యునికి గురుపత్నియందు చిరకాలము వసించి సేవించుట కలియందు నిషిద్ధము. ఆపత్కాలమందైనను విప్రుఁడు క్షత్రియ

వైశ్యాదివృత్తులచే జీవించుట కలియందు నిషిద్ధము. ద్విజుఁడు మరునాఁడు భుజించుటకు లేకుండ జీవించుట కలియందు నిషిద్ధము. పంద్రెండు వత్సరములు గురుని యొద్ద బ్రహ్మచర్యముఁ జేయుటయు నగ్నిహోత్రము జేయునపుడు నగ్ని నూదుటయుఁ గూడదు. సన్యాసి సర్వవర్ణములందు భిక్షజేయుట గలియందుఁ గూడదు. నూతనోదకమును నిషేధించుటయు గురువుగోరిన దక్షిణనిచ్చుటయు వృద్ధులు రోగులు నైనచో వానప్రస్థులు జలాగ్న్యాదులచే మృతినొందుటయు గోవు తృప్తిఁజేయఁజాలునంత యుదక మున్నగోతులో నాచమనాదులు చేయుటయు తండ్రివాదములో నితరులకు సాక్షియగు పుత్రునికి శిక్షయు గలియందు నిషిద్ధములు. ఘృతముతో క్షీరముతో వండిన యన్నము శూద్రునింటిది గ్రహించుట కలియందుఁ గూడదు. యతి భిక్షకు దిరుగుచు పరగృహమందు నివసించుట కలియందుఁ గూడును. పొగ రోకలిచప్పుడు మొదలగునవి చాలించినపై (ననఁగా నపరాహ్ణము దాటినపైని) భిక్షయెత్తుట యతికి గలియం దక్కరలేదు. "చత్వార్యబ్ద సహస్రాణి చత్వార్యబ్ద శతాని చ, కలే ర్యదా గమిష్యంతి తదాత్రేతా పరిగ్రహః సన్యాసశ్చ న కర్తవ్యో బ్రాహ్మణే న విజానతా." అనఁగా కలియందు నాల్గువేల నన్నూరువత్సరము లైన పైని త్రేతాపరిగ్రహ మనఁగ సర్వాధానము చేయఁగనడదు. అనఁగా శ్రౌతస్మార్తాగ్నుల కైక్యముఁ జేయఁగూడదు. అట్లు వచనము "అర్ధాధానం స్మృతం శ్రౌతస్మార్తాగ్న్యో ఽస్తు పృథక్కృతిః." సర్వాధానం తయోరైక్య కృతిః పూర్వ యుగాశ్రయా." అనఁగా శ్రౌతస్మార్తాగ్నుల వేరుగ నుంచుట యర్ధాధానము. అది కలుపుట సర్వాధానము. అదిపూర్వయుగములందున్నది. ఇట్లు సన్యాసమునుఁ జేయగూడదు అని యర్థము. ఇందు కపవాదము–"యావద్వర్ణవిభాగోస్తి త్వావద్వేదః ప్రవర్తతే, సన్యాసంచాగ్ని హోత్రం చ తావత్కుర్యా త్కలౌయుగే' యని. అనఁగా బ్రాహ్మణాది వర్ణవిభాగ మున్నంతవరకును వేదము నడచును. గనుక నగ్నిహోత్ర మును సన్యాసమును నంతపర్యంతమును వేదము నడచును గనుక నగ్నిహోత్రమును సన్యాసమును నంతపర్యంతముఁ జేయ వచ్చును. 'శపథా శ్శకునాస్స్వప్నా స్సాముద్రిక ముపశ్రుతిః, దేవపూజోపహారాదే స్సంకల్పః కార్యసిద్ధయే, ప్రశ్నోత్తరం కాలవిదాం సంభవంతికలౌక్వచిత్' అనఁగా ప్రమాణముఁజేయుట యొట్టుబెట్టుకొనుట మొదలగు శపథములు శకునములు స్వప్నములు సోముద్రిక చిహ్నములును 'పశ్రుతి' యనఁగ గ్యాముఁ దలఁచునపుడు పై వారి శుభాశుభవాక్కులు వినుటయు కార్యసిద్ధికై దేవతా పూజబలి మొదలగునవి సంకల్పించి మ్రొక్కుటయు కాలజ్ఞులను ప్రశ్నజేయుట మొదలగునవి కలియుగమందు నొకానొకప్పుడు ఫలించును. అనఁగా దాఖలా పడుననుట, ఇట్లు కలియందు కర్తవ్యాకర్తవ్య నిర్ణయము.

## స్వప్న ఫలవిచారములు

స్వప్నము ఇష్టఫలము అనిష్టఫలము అని రెండు విధములు. అందు సామాన్యముగ నిష్టఫల మెట్లనిన; "నదీసముద్ర తరుణమాకాశ గమనంతథా, గ్రహనక్షత్ర మార్తాండ చంద్రమండల దర్శనం, హర్మ్యస్యారోహణం చైవ ప్రాసాద శిరసోఽపి

వా, స్వప్నేచ మదిరాపానం వసామాం సస్యభక్షణం, కృమివిష్ఠానులేప్చ రుధిరే నాభి షేచనం, భోజనం దధిభక్తస్య శ్వేతవస్త్రానులేపనం, రత్నస్యా భరణాదీని స్వప్నే దృష్ట్వా ప్రసిద్ధ్యతి, దేవతా విప్రపృథ్వీశాన్ ప్రశస్తాభరణాంగనాః, వృషభే పర్వతే క్షీర ఫలవృక్షాధి రోహణం, దర్పణామిష మాల్యాప్తిం శుక్ల పుష్పాంబరాశ్రితాన్, ద్రష్టుస్స్వప్నేర్థలాభస్స్యా ద్వ్యాధిమోక్షశ్చజాయతే." అనఃగా నదిగాని సముద్రముగాని యీదుట, ఆకాశముపై నెగిరివెళ్లుట, గ్రహనక్షత్ర సూర్యచంద్ర దర్శనము, మేడ, దేవాలయము, మొదలగునవి యెక్కుటయు, స్వప్నమందు గల్లుద్రావుట, మాంసము గుండెల మెదడు మొదలగునవి భక్షిచుట, పురుగులు నమేధ్యము మొదలగునవి పూయుట, రత్నము లాభరణములు చూచుట, రక్తములో మునుగుట, పెనుగన్నముఁ దినుట, శ్వేతవస్త్రము చందనము ధరించుట, దేవతలు బ్రాహ్మణులు రాజులు వీరిం జూచుట, అలంకరించుకొనిన స్త్రీలఁ జూచుట, వృషభమును పాలు పండ్లుగల వృక్షములు పర్వతమునెక్కుట, యద్దము మాంసము పూలదండయు లభించుట, తెల్లని పుష్పములు వస్త్రములు గలవారిఁ జూచుట మొదలగునవి స్వప్నమందైనచో ధనలాభము నారోగ్యప్రాప్తియు గల్గును.

## అనిష్టఫల స్వప్నములు

'దుష్టం కిం శుకవల్మీక పారిభద్రారోహణం, తైలకార్పాససిణ్యాక లోహప్రాప్తి ర్విపత్తయే, వివాహప్రకరణం స్వప్నే రక్తస్రగ్వస్త్రధారణం, స్రోతసాహరణం నేష్టం పక్వమా భోజనం, ఆదిత్యస్యాథచంద్రస్య నిష్ప్రభస్యావలోకం, నక్షత్రా పాత స్వప్నే మరణ శోకకృత్ అనఁగా మోదుగు వేపచెట్టు మొదలగునవి యెక్కుట, నూనె ప్రత్తి తెలికపిండి లోహము దొరకుట, స్వప్నమందైనచో విపత్తియగును. మరియు వివాహ మగుట, రక్తవస్త్రమాల్యములు ధరించుట, ప్రవాహములో గొట్టుకొనిపోవుట, పక్వమైన మాంసము భుజించుట, గ్రహణము జూచుట, నక్షత్రములు రాలుటయు స్వప్నమునఁ జూచినచో మరణశోకము లిచ్చును. అశోకము గన్నేరు మోదుగు పుష్పించినట్లు చూచిన శోకము. నావనెక్కినచో బ్రయాణమగు రక్తవస్త్ర గంధాదులు ధరించిన స్త్రీ కౌఁగలించినచో మృత్యువగు. ఘృతము తైలము మొదలగువానిచే నభ్యంగన మగుచో వ్యాధియగు. కేశములు దంతములు పడినచో ధననాము. పుత్రశోకమైనను గల్గును. గాడిద, లొటిపిట్ట, పోతు వీనినెక్కినను వాటి బూన్చిన బండినెక్కినను మృత్యువగు. ముక్కు చెవి చేయు మొదలగుగ ఖండించుటయు, బురదలో మునుగుటయు, తైలాభ్యంగము విషము భక్షించుట, శవము గౌఁగలించుట, వట్టివేళ్ళవేరులతో దిగంబరుఁడై వెళ్లుట, నల్లనిపురుషుని జూచుట, స్వప్నమందు గల్గినచో మృత్యువగు.

## జాగ్రదవస్థ యందలి అనిష్టములు

"అరుంధతీం ధ్రువం చైవ నభో మందాకినీం తథా, స్వనాసాగ్రంచ చంద్రాంక మాయుర్హీనో నపశ్యతి" అనఁగా నరుంధతిని ధ్రువుని నాకాశగంగ యనఁగ తారా పథమున తనముక్కు చివరను బాలచంద్రుని నాయుర్హీనుఁడు చూడలేడు.

"పాంసుపంకాదిషు స్వస్తం చరణం ఖండితం యది, స్నానాంబులిప్తగాత్రస్య యస్యాస్యం ప్రాక్ప్రశుష్యతి, గాత్రేష్వార్ద్రేషు సర్వేషు సూర్యాది ద్వయ దర్శనం, స్వర్ణప్రతీతి వృక్షేషు స్వపదానామ దర్శనం, పిహితే కర్ణయుగలే యస్యఘోషాను పశ్రుతిః, అదర్శనం స్వశిరసః ప్రతిబింబే జలాదిషు, ఛిద్రప్రతీతిశ్ఛాయాయాం సచిరం నైవజీవతి" అనఁగా ధూళిలోను బురదలోను లుంచిన దనపాదము ఖండితమైయున్నను స్నానముజేసినపుడు తక్కిన శరీరము తడియుండఁగ మొగము మాత్రము తడియారిపోవుట సూర్యాదులను రెండేసిచూచుట వృక్షములు బంగారు వికారములై కానుపించుట తన పాదములు దనకుఁగానుపించకుండుట చెవులు మూసికొనునపుడు లోపలి ధ్వని వినకుండుట జలము మొదలగువానిలో దన ప్రతిబింబమునకు శిరస్సులేకుండుట తన నీడయందు రంధ్రములు చూచుట గల్గినచో చిరకాలము జీవింపఁడు.

## ఇష్టఫల స్వప్నములు

"యస్తుపశ్యతి వైస్వప్నే రాజానం కుంజరం హయం, సువర్ణం వృషభంగాం వా కుటుంబం తస్యవర్ధతే." అనఁగా స్వప్నమందు రాజును గజమును గుఱ్ఱమును స్వర్ణమును వృషభమును గోవును జూచెనేని వాని కుటుంబము వృద్ధినొందును. వృషభమునుగాని వృక్షమునుగాని యెక్కి యక్కడనే మేలుకొనినచో ధనలాభమగును. తెల్లపాము దక్షినభుజము గఱచినట్లు స్వప్నమయినచో బదిరోజులో సహస్రధనము దొరకును. జలమందున్నపుడు వృశ్చికము సర్పము మ్రింగినట్లు స్వప్నమైనచో జయము పుత్రుఁడు ధనము గలుగును. మేడగాని పర్వతముగాని యెక్కినట్లు సముద్ర మీఁదినట్లు దామరాకుపైని ఘృతపాయ భుజించినట్లు స్వప్నమైనచో రాజ్యప్రాప్తము గల్గును. బెగ్గురుకోడిపెట్ట క్రౌంచియు జూచినచో భార్యాప్రాప్తి యగును. సంకిళ్లుగాని పాశములచే గట్లుగాని గల్గినచో పుత్రధనాదులు గల్గును. ఆసనము, శయ్య, సవారి, శరీరము, రథము, గృహము వీనిలోనుండి యవి మండుచుండఁగ మేల్కొనెనేని సర్వతోముఖమైన సంపద గల్గును. సూర్యచంద్రమంలములు చూచెనేని రోగికి రోగ నాశము. నితరునికి ధనమునగు, కల్లుగాని రక్తముగాని ద్రావినట్లు స్వప్నమైనచో విప్రునికి విద్య, శూద్రునికి ధనము, శుద్ధవస్త్ర గంధాదుల ధరించిన సుందరస్త్రీ యాలింగనమున సంపత్తి గల్గును. ఛత్రము పాదుకలు చెప్పులు ఖడ్గము దొరకినట్లు స్వప్నమైనచో ధనము గల్గును. వృషభయుక్తమైన బండినెక్కినచో నట్లనే యగును. పెరుగు దొరకినచో వేదప్రాప్తియగు. పాలు పెరుగు ద్రాగినను ఘృతము లభించినను కీర్తిగల్గును . ఘృతము భక్షించెనేని క్లేశము. పేగులచే జుట్టఁబడినచో రాజ్యము. మనుష్యుని పాదమాంసము భక్షించెనేని శతధనలాభము. బాహువును భక్షించెనేని సహస్రము లభించును. శిరోమాంసము భక్షించిన యెడ రాజ్యలాభము. సహస్ర ధనమైనను, నురుగుతో గూడిన పాలుఁద్రాగినచో సోమపానము. గోధుమలు చూచిన ధనలాబము. యావాలు చూచెనేని యజ్ఞము. తెల్లని యావాలు చూచినయెడల లాభము గల్గును. నాగవల్లీదళములు కర్పూరము చందనము తెల్లనిపుష్పము లభించినచో సర్వతోముఖమైన సంపద గల్గును. "సర్వాణి శుక్లాన్యతి శోభనాని కర్పాసభస్మా

దనతక్రవర్జం, సర్వాణి కృష్ణాన్యతినిందితాని గోహస్తివాజి ద్విజదేవవర్జం." అనఁగా ప్రత్తి భస్మము నన్నము చల్లవీటిని విడిచి సమస్తమైన తెల్లని దేవతయు నివిదప్ప తక్కిన నల్లనివస్తువులు నింద్యములు. 'స్వప్నస్తు ప్రథమేయామే వత్సరాంతే ఫలప్రదః " అనఁగా తొలిజామున స్వప్నమైనచో సంవత్సరాంతమందు దానిఫలము గల్గును. రెండవజాముననైనచో నెనిమిది మాసములకు మూఁడవజాముననైనచో మూఁడు మాసములకు నాల్గవజామున నయ్యేనేని మాసాంతమున ఫలము అరుణోదయ కాలమున నైనచో బదిరోజులలో గల్గును. సూర్యోదయమందైనచో దత్కాలమందే పలము గల్గును.

## దుస్స్వప్న నివారణవిధి

'యోమేరాజన్' అను ఋక్కుచే సూర్యోపస్థానముఁ జేసెనేని దుస్స్వప్నము నశించును. 'అధస్వప్నస్య' యను మంత్రము జపించినను నశించును. క్వచిత్తుగా దర్శయందువలె శ్రాద్ధముచే దుస్వప్న నాశము చండీ సప్తశతి బఠించిన నట్లగు. లేదా శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము జపించవలెను. మరియు శ్రీభారతమందుగాని శ్రీభాగవతమందుగాని చెప్పిన గజేంద్రమోక్షణము బఠించినను విన్నను దుస్వప్ననాశ మగును. "ఇత్థం గర్భాధానా దుద్వాహాంతా స్సమస్తసంస్కారాః సపరికరా నిర్ణీతాః అస్మింస్తార్తీయ పూర్వార్ధే" అనఁగా నిట్లు గర్భాధానాది వివాహాంతమైన సంస్కారము లన్నియు వాటియంగములతో నీ తృతీయపరిచ్ఛేద పూర్వార్థమందు నిర్ణయింపఁ బడినది.

"తత ఆహ్నిక ఆచారస్తత ఆధా నాదికాః ప్రకీర్ణార్థాః శాంతి కపౌష్టికముఖ్యానిత్యా నైమిత్తికాశ్చోక్తాః" అనఁగా నటుపై నాహ్నికాచారము నాపై నాధానాదులగు ప్రకీర్ణ కర్మలు శాంతికములు పౌష్టికములు నిత్యములు నైమిత్తికములును నిర్ణయింపఁబడి నవి. "శ్రాద్ధవిధి స్సాంగోప్యా శౌచే నిర్ణీతి రంత్య సంస్కారః తార్తీయాకస్యోత్తరభాగే గ్రే సంప్రవక్ష్యంతే" అనఁగ సాంగముగ శ్రాద్ధవిధియు నాశౌచమందు నిర్ణయము నంతమందైన సంస్కారమును తృతీయపరిచ్ఛేదనుత్తరభాగమందు నిరూపింపఁబడ గలవు. "మీమాంసా ధర్మశాస్త్రజ్ఞాస్సుధియోనల సాబుధాః, కృతకార్యాః, ప్రాజ్ఞిబంధై స్తదర్ధం నాయముద్యమః, యేపుని ర్మందమతయో లసాజ్ఞాతుం చ నిర్ణయం, ధర్మే వేదితు మిచ్ఛంతి రచితస్తదపేక్షయో, నిబంధోయం ధర్మసింధు సారనామా సుబోధనః ఆమునా ప్రీయతాం శ్రీమద్విఠ్ఠలో భక్తవత్సల, ప్రేమ్ణాసద్భిర్గ్రంధస్సేవ్య శ్శబ్దార్థతస్స దోషోఽ పి, సంశోధ్యవాపి హరిణాసుదామముని సతుషపృథుక ముష్టిరివ." వీని యర్థము మీఁద వ్రాయఁబడినది "శ్రీకాశ్యపాధ్యాయ వరోమహాత్మా బభూవవిద్వ ద్విజసార్వభౌమః, తస్మాదుపాధ్యాయ కులావతంసౌ యజ్ఞేశ్వరోనంత ఇమావభూతాం, యజ్ఞేశ్వరోయజ్ఞి విధానదక్షో దైవజ్ఞ వేదాంగ సుశాస్త్రశిక్షః, భక్తోత్తమోనంత గుణైకథా మానంతహ్వాయోనంత కలావతారః, ఏషోత్యజజ్జన్మ భువంస్వకీయాం తాం కౌంకణా ఖ్యాం సువిరక్తిశాలీ, శ్రీపాండురంగేవసతింవిధాయ భీమాతటే ముక్తిమగాత్సుభక్త్యా,

తస్యానంతాభిధానస్యోపాధ్యాయస్య సుతఃకృతీ, కాశీనాధాభిధోధర్మ సింధుసారం సమాతనోత్” అనఁగా నీ గ్రంథకర్తయొక్క పితామహుఁడు కాశీనాధోపాధ్యాయుఁ డనియు నతనికి యజ్ఞేశ్వరుడు ననంత భట్టు అని యిద్దరు పుత్రులనియు, నందు యజ్ఞేశ్వరుఁడు జ్యోతిశ్శాస్త్రమందు పండితుఁడనియు తన తండ్రియగు ననంతభట్టు సమస్త విద్యలు చదివి వైరాగ్యముచే దనకు జన్మస్థానమైన కొంకణ దేశము విడిచి పాండురంగ క్షేత్రమందు భీమానదీతటమందు నివాసముఁజేసి ముక్తి నొందెననియు నాయనపుత్రుఁడు కాశీనాథో పాధ్యాయుఁడగు దాను ధర్మసింధుసారమును జెసె ననియు నర్థము. ఇట్లు కాశీనాథోపాధ్యాయసూనుఁడగు ననంత భట్టునిపుత్రుఁడు కాశీనాథోపాధ్యాయునిచే రచియింపఁబడిన ధర్మసింధుసారమున దృతీయపరిచ్ఛేదము పూర్వార్థము ముగిసెను.

# ఉత్తరార్థము

## మంగళాచరణము

“శ్రీరుక్మిణీం పాండురంగం ప్రణమ్యపితరౌ గురూన్, తృతీయచ్ఛేదోత్తరార్థం తనోమి శ్రీశతుష్టయే శ్రీనాథః కరుణా సింధురిందిరా శంకరస్సతీ, విఘ్నేశో భాస్కరేం ద్రాద్యా విఘ్నాన్ఘ్నంతు సదైవమే.” అనఁగా గ్రంథకర్త జేసిన మంగళము ఎట్లనిన; శ్రీరుక్మిణీదేవిని పాండురంగువిష్ణుని తల్లిదండ్రులను గురువులను నమస్కరించి తృతీయ పరిచ్ఛేదము నుత్తరార్థము భగవత్ప్రీతికై చేసెదను. అపుడు కరుణా సముద్రుఁ డగు లక్ష్మీనాథుఁడు లక్ష్మియు శంకరుఁడు పార్వతియు విఘ్నేశుఁడు సూర్యాది గ్రహములు నింద్రాదిదిక్పాలురు నాకు విఘ్నములు నశింపఁజేతురుగాక యని. అందు శ్రాద్ధాదినిర్ణయముఁ జెప్పుటకు మొదట నధికారము నిర్ణయించుటకై జీవత్పి తృకాధికారము విమర్శింపఁబడును.

## జీవత్పితృకులకు గర్మాధికార విచారము

“పాదుకే చోత్తరీయం చ తర్జన్యాం రూప్యధారణం, నజీవత్పితృకః కుర్యాజ్జ్యేష్ఠ భ్రాతరి జీవతి.” అనఁగా తనతండ్రి జీవించియున్నను జ్యేష్ఠసోదరుఁడు జీవించి యున్నను దనకుపాదుకలనఁగ కఱ్ఱపావలు ఉత్తరీయ మనఁగ పట్టుతోజేసినది యుప వీతమువలె ధరించునదియు తర్జనివ్రేలున వెండిచుట్టులు ధరించుటయుఁ గూడదని యర్థము. ఇక్కడ నుత్తరీయమనఁగా స్మృత్యుక్తమైన తృతీయ యజ్ఞోపవీతమని కొందరు ప్రావరణరూపమైన పై వస్త్రమందరును ధరింపవలసినదే. అందు వచనము. “ఏక వస్త్రో న భుంజీత న కుర్యాద్దేవతార్చనం.” అనఁగా నొక్క వస్త్రము ధరించి భోజనము దేవతార్చనము మొదలగునవి గూడదని సర్వకర్మలయందు నేకవస్త్రత్వము నిషేధింపఁ బడినది. ఇట్లు తండ్రియు తాతయు జ్యేష్ఠభ్రాతయు నాధానము జేయకుండ జీవించి యున్న యెడ పుత్రుఁడుగాని పౌత్రుఁడుగాని కనిష్ఠభ్రాతగాని యగ్న్యాధానము చేయఁ గూడదు. జ్యేష్ఠభ్రాతయుకు వివాహము గాకమున్ను కనిష్ఠునికి వివాహము కాగూడదు. ఇందు విశేషము పూర్వార్థమందుఁ జెప్పఁబడినది. ఇట్లు తండ్రి మొదలగువారు

యజ్ఞము చేయకయున్నపుడు పుత్రాదులు సోమయాగము చేయఁగూడదు. ఇట్లు పూర్ణ మానేష్టియు దర్శేష్టియు నగ్నిహోత్ర హోమము మొదలగువానియందును దెలియు నది ఇట్లు సంన్యాసమునందును కనిష్ఠసోదరునకే దోషముగాని భిన్నోదరునికి లేదు పిత్రాదులు యాజ్ఞపైని పుత్రాదులు చేయవచ్చునని కొందరు. అధికారియైన తండ్రి జీవించియున్నపుఁ డాజ్ఞచే జేసినను దోషమే. మరియేమనిన; పాతిత్యము జాత్యంధత మొదలగు దోషములచే తండ్రియనధికారియైన యెడ నాజ్ఞచే జేయవచ్చును. పతితుఁ డైనచో నాజ్ఞలేకున్నను దోషములేదని కొందరు. అట్లు జీవత్పితృకునికి పితృకృత్యము లైన దర్శాది శ్రాద్ధము తర్పణము పిత్ర్యర్థమైన దానము మొదలగువాని యందధి కారములేదు. ఇక్కడ విశేషము. తన సంతతికి సంస్కారము జేయుటకు తనకు ద్వితీయ వివాహమందున జేయునాందీ శ్రాద్ధమందును చాతుర్మాస్యాంతర్గతమైన పితృయజ్ఞమందును సోమాంగమైన తృతీయ సవనముయొక్క పితృయజ్ఞమందును జీవత్పితృకున కధికారము. పిండ పితృయజ్ఞమందు హోమాంతముగ నధికారము. పిండపితృయజ్ఞము నారంభింపకుండుటయు గలదు. తండ్రి తండ్రి మొదలగువారి నుద్దేశించి పిండదానము చేయవచ్చునని మూఁడవపక్షమును గలదు.

కొన్ని గ్రంథములలోని ట్లష్టకాది వికృతి శ్రాద్ధములందును బక్షత్రయమని యున్నది. గయకు గార్యాంతరమున వెళ్ళినేని జీవత్పితృకుఁడైన తల్లికి గయాశ్రాద్ధము జేయవచ్చును. అది యుద్దేశించి గయకు వెళ్లుట మాత్రముఁ గూడదు. మహానదులు తీర్థము ప్రాప్తించినచో జీవత్పితృకుఁడు తండ్రియొక్క పితృమాత్రాదుల నుద్దేశించి తీర్థశ్రాద్ధముఁ జేయవలెను. నవమయందన్వష్టకాశ్రాద్ధము మృతదినమందు దల్లికి ప్రత్యాబ్దికశ్రాద్ధమును పిండసహితముగనే జీవత్పితృకుఁడును జేయునది. ఇట్లు తండ్రి సన్యసించినను పతితుఁడైనను జీవించి యున్నప్పటికి దర్శశ్రాద్ధము మహాలయము సంక్రాంతి గ్రహణాదిశ్రాద్ధములన్నియు తండ్రి తండ్రి మొదలగువారి నుద్దేశించి జీవత్పితృకుఁడును జేయవలెను కాని యివి పిండరహితములుగ సాంకల్పికవిధిచే జేయవలెను. ఏమనిన; అన్వష్టకాదు లందువలె పిండదానమునకు విశేషవచనము లేదు. అశ్విన శుక్ల ప్రతిపదయందు దౌహిత్రుఁడు జీవపితృకుఁడైనను మాతామహాదు లకు పిండసహిత శ్రాద్ధముఁ జేయవలెను. అట్లు భ్రాతృపుత్రుఁడును పుత్రులులేని పినతండ్రికి పిండసహితమైన ప్రత్యక్ష శ్రాద్ధముఁ జేయవలెను. ఇట్లు కనిష్ఠభ్రాతయు నపుత్రకుఁడైన జ్యేష్ఠ భ్రాతకు ప్రత్యాబ్దికము జేయవలెను. అట్లు సవతికొడుకు సవతి తల్లికి శ్రాద్ధము. మరియు దౌహిత్రుఁడు నపుత్రకుఁడైన మాతామహుని ప్రత్యాబ్దికముఁ జేయునది. కాఁబట్టి పితృవ్యశ్రాద్ధము మొదలుగ నాల్గు శ్రాద్ధములందు జీవపితృకున కధికారము. పితృవ్యభ్రాత్రాదుల పుత్రులైనను పత్నియున్నచో నాబిడయే యధికారిణి యగును. భాతృపుత్రాదుల కధికారములేదు. ఇట్లు పుత్రులు లేనిభార్యకు పతియే శ్రాద్ధము చేయవలెను. సవతిపుత్రుఁడున్నచో నతనికే కర్తృత్వము భర్తనక్కరలేదు దౌహిత్ర భాతృపుత్రులిద్దరు నున్నచో, విభక్తుఁడైన మృతునికి దౌహిత్రుఁడే శ్రాద్ధకర్త యగును. అవి భక్తుఁడైనచో భ్రాతృపుత్రుఁడే యగును. కొందరు భ్రాతయు దత్పుత్రుఁ

డు నున్నచో భ్రాతయే చేయవలెనంద్రు. మరియు జీవత్పితృకునకు పితృపితామహాది మనుష్య పితృతర్పణమం దధికారము లేకున్నను నగ్నిష్వాత్తాది దేవర్షి పితృతర్పణ మందు నిషేధము లేదు గనుక స్నానాంగతర్పణమందును బ్రహ్మ యజ్ఞాంగతర్పణ మందు నధికారముఁ గలదని తెలియునది. ఇట్లు దనకు కర్తృత్వము గలిగిన శ్రాద్ధ మున కంగమైన తర్పణమునందు నధికారము గలదు. "జీవత్పిత్రాపి కుర్వీత తర్పణం యమభీష్మయోః" అనఃగా జీవ పితృకుఁడయినను యమతర్పణము భీష్మునికి దర్పణ మును జేయవలయును. శ్రాద్ధాంగతర్పణము తప్ప దక్కిన తర్పణము జీవత్పితృకుఁ డు దిలలతో జేయఁగూడదు. శ్రాద్ధ ప్రయోగమందు నెడమకాలు మణుచుటయు నివీతముగ నుండుటయు నక్కరలేదు. నద్యాదులందు స్నానముజేసి యంతమున విధించిన వస్త్రనిష్పీడనము జేయఁగూడదు. మరియు ఖడ్గపాత్రమును ముత్తెపుచుట్టను ధరించి తర్పణము జీవపితృకునకక్కరలేదు. 'అపసవ్యం ద్విజాగ్రాణాం పిత్రే కర్మణి కీర్తితం, అప్రకోష్ఠాత్తుకర్తవ్య మేత త్పితరిజీవతి' అనఁగా ద్విజులకు పితృకర్మయందప సవ్య మనఁగ నుపవీతము నెడమద్రిప్పుట విధింపఁబడినవి. జీవత్పితృకుఁడైనచో, నపసవ్యమును ముంజేయువరకే చేయవలెను. సన్యాసము మొదలగునవి పొంది తండ్రి జీవించియుండఁగా తల్లియు మాతామహుఁడును మృతినొందినప్పటికిని పుత్రులు మహాలయశ్రాద్ధము జేయునపుడు "పితుః పితృపితామహ ప్రపితామహానాం, పితుర్మాతృ పితామహీ ప్రపితామహానాం, పితుర్మాతా మహమాతృపితామహ మాతృ ప్రపితామహానాం, సపత్నీకానాం" అని పార్వణ త్రయమును నేకోద్దిష్టగణములో దన తల్లికి 'పితుః పత్న్యాః' అనియు పినతండ్రికి 'పితుర్భ్రాతుః' అనియు దనమాతా మహునికి పితుశ్శ్వశురస్య యనియు నిట్లు పితృసంబంధములు బురస్కరించుకొనియే యుచ్చరించి మహాలయశ్రాద్ధముఁ జేయవలెను. ఇట్లు దర్శాదిశ్రాద్ధము లూహించు నది. తండ్రి సన్యసింపకున్నను జీవత్పితృకుఁడు తీర్థశ్రాద్ధ మిట్లనే చేయవలెను. ఇట్లు వృద్ధిశ్రాద్ధమందు నూహించునది. బ్రహ్మయజ్ఞాంతమందు నిత్యమైన పితృతర్ప ణము సన్యస్తాది రూపమున దండ్రి జీవించియున్నచో నిట్లనే పుత్రుఁడు చేయవలె నంద్రు. తల్లి యాబ్దికముగాని పుత్రులులేని మాతామహుఁడు నపుత్రుఁడగు పితృవ్యుఁ డు వీరి వార్షికశ్రాద్ధములుగాని చేయవలసివచ్చినపుడు జీవపితృవ్యుఁడు వీరి వార్షిక శ్రాద్ధములుగాని చేయవలసివచ్చినపుడు జీవపితృకుఁడు క్రమముగ "మాతృపితామహీ ప్రపితామహీనాం" అనియు "మాతా మహమాతృపితమహమాతృ ప్రపితామహా నా" మనియు పితృవ్యపితామహ ప్రపితా మహానాం" అని యుచ్చరించియే చేయవలెను. ఒకవేళ తండ్రి మొదలగు ముఖ్యకర్తలు చేయనశక్తులై ప్రతినిధిగా పుత్రుని శ్రాద్ధకర్తను నియోగించిరేని యపుడు 'పితురముక శర్మణో యజమానస్య పితృపితామహ ప్రపితా మహానాం' అని మొదలుగ శ్రాద్ధానుగణముగ నుద్దేశము సర్వపితృకార్యములందు నవి భక్తభ్రాతలలో జ్యేష్ఠునికే యధికారము. విభక్తులైనచో నెవరిది వారికే యధికారము. సవతి జ్యేష్ఠభ్రాత జీవించియున్నప్పటికిని దతతల్లి యాబ్దికము దానే పెట్టవలెను. అన్వష్టక్యాదులు నట్లనే తెలియునది. తండ్రియు తాతయు జీవించియున్నను సన్యసించి

యున్నను దనదాతయొక్క పిత్రాదులనుద్దేశించి తీర్థశ్రాద్ధము వృద్ధిశ్రాద్ధము దర్శాది శ్రాద్ధముఁ జేయవలెను. ఇఁక దండ్రి మొదలుగ ముగ్గురు జీవించియున్నను సన్యసించి యున్నను నేశ్రాద్ధము జేయనక్కరలేదు. కొందరాముగ్గిరికిపై వారినుద్దేశించి శ్రాద్ధమని చెప్పుదురు. తండ్రి మృతుఁడై తాత జీవించియున్నచో దండ్రికిని పితామహునిపై నిద్దరకును శ్రాద్ధము చేయవలెను. ఇట్లు తండ్రియు తాతయు మృతులైనపుడు ప్రపితా మహుఁడు జీవించియున్న యెడను నూహించునది. ఇఁక గృహ్యాగ్ని గలిగి జీవించిన తలిదండ్రులు గలుగువాఁడు 'పితుః పిత్రాదిభ్యః' అను మూఁడవపక్షము నాశ్రయించి పిండపితృయజ్ఞము నష్టకాన్వష్టకాశ్రాద్ధముల నారంభించి యన్వష్టకా శ్రాద్ధమందు దండ్రియొక్క పిత్రాదులను మాత్రాదులను మాతా మహాదులను నుద్దేశించి పిండ దానముఁ జేయుచునుండఁగ గొంతకాలమునకు దల్లి మృతినొందెనేని యటుపైని యన్వష్టకాశ్రాద్ధమందు దనమాత్రాదులను తండ్రియొక్క పిత్రాదులను మాతామహా దుల నుద్దేశించి శ్రాద్ధమీయవలెను. ఇఁక జీవత్పితృకుఁడు పిండపితృయజ్ఞము నష్ట న్వష్టకాదులను నారంభించని పక్షము నవలంబించినచో నైన సన్యస్తాది పితృకునకును దర్శాది శ్రాద్ధము తండ్రియొక్క పిత్రాదులనుద్దేశించియే వ్యతిషంగ మనఁగ నొగ దానితో గలుపుట లేకుండఁగనే సాంకల్పిక ప్రయోగముచే జేయవలెను. తండ్రితో నవి భక్తులైన పుత్రులు వేరుగ వైశ్వదేవముఁ జేయనక్కరలేదు. ఏమనిన; 'పితృపాకోప జీవిస్యా ద్భ్రాతృపాకోపజీవకః' అని వేరుగ పాకము నిషేధింపఁబడి యున్నది. కనుకనే గృహ్యాగ్ని యందే పాకవైశ్వదేవములను పక్షమందును దండ్రి సాగ్నికుఁడైనచో బుత్రులు గృహ్యాగ్ని గలవారైనను వేరుగ వైశ్వదేవముఁ జేయ నక్కరలేదు. ఇఁక నేమనిన; వారికి పాకములేనిచో నగ్ని లౌకికమై పోవునని శంక యుండునేని పాకము మాత్రమగ్ని సంస్కారమునకు జేయవలెనని తోఁచుచున్నది. విభక్తులైరేని వేరుగ వైశ్వదేవముఁ జేయక తీరనేతీరదు. అపుడు వైశ్వదేవము దేవయజ్ఞ భూతయజ్ఞ పితృ యజ్ఞ స్వరూపమే గనుక జీవత్పితృకుఁడును బంచమహాయజ్ఞములలో బితృ యజ్ఞముఁ జేయవలయును. తైత్తిరీయులకు బంచమహాయజ్ఞములు వైశ్వదేవమున కంటె భిన్నములు. అయినను వారును విభక్తులైరేని జీవపితృకులైనను బితృయజ్ఞముఁ జేయవలసినదే. ఏమనిన; నది దేవస్వరూపులైన పితృదేవతలు గలదిగాని మనుష్య రూపులైన పితృపితామహాదులు దేవతలు గాగలదికాదు. 'ముండనం పిండదానం చ ప్రేతకర్మంచ సర్వశః, సజీవ త్పితృకఃకుర్యాద్గుర్విణీ పతిరేవచ' అనఁగా ముండ నము పిండదానము ప్రేతకర్మ సర్వమనఁగ శవవహన దహనములు మొదలు సపిండీ కరణాంతము గ్రహింపఁబడును. ఇది జీవపితృకుఁడు చేయఁగూడదు. ఇక్కడ ముండన మనఁగ క్షౌరము విపక్షితము గనుక కత్తిరించుకొనుటకు నిషేధము లేదు. మరియును రాగప్రాప్తమైన దానికే నిషేధము. కనుక చౌలోపనయనాదులందును నాధానదర్శ పౌర్ణమాసజ్యోతిష్టోమాదులందును నిత్యప్రాప్తము తీర్థమందుఁ బ్రాయశ్చిత్త మందు భ్రాతృమరణమందు నైమిత్తిక ప్రాప్తమును నిషేధింపఁబడదు. కొందరు కామ్యమైన నాగబలి మొదలగువానియందు గామ్యక్షౌరమును గావచ్చునండ్రు. "గంగా

యాం భాస్కర క్షేత్రేమాతాపిత్రో గురోర్మృతౌ, ఆధానే సోమ పానే చ వపనం సప్త స్మృతం." అనఁగా గంగయందును భాస్కర క్షేత్రమందును తలిదంఁడ్రుల మృతి యందును గురువనఁగ నిక్కడ దత్తకుని పోషకపితయని యర్థము. కనుక దత్తునికి బూర్వాపరపితల మృతియందునని యర్థము. మఱియొకవచనమందు తీర్థములన్నిటి యందు క్షౌరమని యున్నది. కనుక నిక్కడ గంగాభాస్కర క్షేత్రముల గ్రహించుట జీవత్పితృకన కచ్చుట విశేషవిధిగ క్షౌరము నియమించుటకు తెలియవలెను. మఱియు నాధానమందును సోమయాగమందును నీయేడింటియందు వపనము విధింపఁ బడినది. జీవపితృకుఁడు పిండదానము చేయఁగూడ దను నిషేధము నాందీశ్రాద్ధ తీర్థ శ్రాద్ధములందును సన్యస్తాది స్వరూపుఁడైన తండ్రిగలవాని దర్శమహాలయాది శ్రాద్ధములందును పిండరహితమైన సాంకల్పిక శ్రాద్ధమును బోధించుట కొఱకని తెలియవలెను. పంచమహాయజ్ఞములలో పితృయజ్ఞమందును సోమయాగమందును మాతృమాతామహాదుల వార్షిక శ్రాద్ధమందును గయా శ్రాద్ధమందును నన్వష్టక్యాది శ్రాద్ధమందును పిండదానముఁ జేయవచ్చునని మీఁదఁ జెప్పఁబడినది. "పిండదానం ప్రకుర్వీత మాతాపిత్రోః క్షయాహని." అనఁగా దలిదంఁడ్రుల మృతదినమందు పిండ దానము చేయవలెనని శ్రాద్ధవిధానముచేతనే పిండదానము సిద్ధమగుచుండఁగ నిట్లు తిరుగ విధించుట తలిదంఁడ్రుల వార్షికమందు గర్భిణీపతిత్వము నిషిద్ధకాలము మొదలగు నిమిత్తములచే ప్రాప్తమైన నిషేధమును బాధించుటకని తెలియవలెను. అదియుగాక, "వివాహ వ్రతచూడాసు వర్షమర్ధం తదర్ధకం, పిండదానం మృదాస్నానం నకుర్యాత్తిలతర్పణం." అనఁగా వివాహోపనయనములు చూడాకర్మయు నైన పైని సంవత్సరము నారుమాసముల పర్యంతము పిండదానము మృత్తికాస్నానము తిల తర్పణమును జేయఁగూడ దనునిషేధము సహితము నివర్తింపఁబడును. మృత దిన మనుట సపిండీకరణ మాసికములకు నుపలక్షణము. అపుడును పిండదానము చేయవచ్చుననుట.

## ప్రేతకర్మకు ప్రతి ప్రసవము

ప్రేతకర్మను జీవత్పితృకుఁడు చేయఁగూడ దనునిషేధమున కపవాదమెట్లనిన; తనతల్లికిని పుత్రులులేని సవతితల్లికిని తనపుత్రుఁడు గాని సవతిపుత్రుఁడుగాని లేని భార్యకును పుత్రులులేని పినతండ్రికిని పుత్రులులేని మాతామహునకు మాతా మహికిని దహనము మొదలగు ప్రేతకర్మలు జీవపితృకుఁడైనను జేయకతప్పదు. ఇక్కడ పుత్రులు లేకుండుటనఁగా ముఖ్య గౌణపుత్రులును బౌత్రులు బ్రపౌత్రులును సహితము లేండుటకు వివక్షితము. తల్లికి బ్రేతకృత్యము నుపనయనము గాకున్నను జీవపితృకుఁడు చేయవచ్చును. అందు విశేషము మూఁడు సంవత్సరములలోపు వయసుగలవాఁడు చూడాకర్మ గాకున్నయెడ దహనము మాత్రము మంత్రహితముగఁ జేసి తక్కినది మరియొకనిచే జేయింపవలెను. చూడాకర్మ జరిగియున్నను లేక మూఁ డు సంవత్సరముల వయస్సు పూర్తియైయున్నను ప్రేతకర్మయంతయు మంత్రముతో దానే చేయవలెను. బ్రహ్మచారియైనయెడ తలిదంఁడ్రులకును మాతా మహునికిని

నంత్యకర్మ చేయవలెగాని యన్యులకుఁ జేయఁగూడదు. భర్తయు దౌహిత్రుఁడు నున్నచో భార్యకు దాహాదికము భర్తయే చేయవలెను గాని యతనికి ముండన మక్కరలేదు. ఇట్లు పుత్రరహితునికిఁ బత్నియు దౌహిత్రుఁడు నున్నచో బత్నియే పతికి ప్రేతకర్మ చేయునది. అపుడు దహనము మాత్రము మంత్రసహితముగఁజేసి తక్కినది సంకల్ప మాత్రము స్వయముగఁజేసి బ్రాహ్మణుని ద్వారముగఁ జేయవలెను భర్తయు సవతి కొడుకును నున్నచో సవతికొడుకే చేయవలెను గాని భర్తగూడదు. ఇట్లు సవతికొడుకును దౌహిత్రుఁడు నున్నపుడును సవతికొడుకే చేయవలెను. పుత్రులులేని విధవస్త్రీకిని నిట్టివిధురునికిని భ్రాతృపుత్రుఁడు దౌహిత్రుఁడు నున్నచో దౌహిత్రుఁడే యధికారి యగునని బహుసమ్మతము. విధవకు భర్తృసోదరపుత్రుఁడే యనియు విధురునికి దనసోదరపుత్రుఁడే యనియు జీవపితృకనిర్ణయమందు భట్టమతము. అపుత్రునికి బత్నియు భ్రాతృపుత్రుఁడు నున్నచో బత్నియే చేయవలెను. ఇట్లు పుత్ర సాన్నిధ్యము లేనిచో బౌత్రుఁడు మొదలగువారే పితామహునికి బితామహికిని గర్తలని తెలియునది. ఇట్లు జీవత్పితృకునికి పిత్ర్యకర్మయందు ముండనమందు ప్రేతకర్మాదు లందు నధికారమున నధికారము వివరింపఁబడెను. ఇక్కడ విషయము వేరగునపుడు బాలబోధకొఱకు పునరుక్తియైనను దోషముగాదని తెలియునది. సపిండులకు సగోత్రుఁ డు గాని సపిండుఁడుగాని మృతినొందినచో నొక్కొకమారు తిలలతో జలాంజలి యీవలెనని విదింపఁబడినది. అది జీవత్పితృకుఁడును జేయవలెను. ఇట్లు మాతా మహునికి నాచార్యునికి నీవలెను.

## శ్రాద్ధాధికార నిర్ణయము

అందు సాంవత్సరికము మొదలగు శ్రాద్ధమందును దాహము మొదలగు ప్రేతకృత్యమందును నౌరసపుత్రుఁడే ముఖ్యాదికారి. ఔరసపుత్రులనేకులున్నచో జ్యేష్ఠుడే యధికారి. జ్యేష్ఠుఁడు లేకున్నను సాన్నిధ్యమందుండకున్నను పతితత్వాదిదోషముచే ననధికారియై యున్నను వాని తమ్ముఁడధికారి యగును. ఇచ్చటఁ గొందరు జ్యేష్ఠుఁ డు సన్నిధిలేనిచో సర్వకనిష్ఠుఁ డధికారి యగుగాని మధ్యములు కారనియంద్రు. అది నిర్మూలము అపుడు పుత్రులు విభక్తులైయుండిరేని కనిష్ఠపుత్రులనుండి ధనముఁ బుచ్చుకొని జ్యేష్ఠుఁడే సపిండీకరణము పర్యంతము ప్రేతక్రియలు చేయవలెను. సాంవత్సరికము మొదలగునది వేరువేరుగ జేయవలెను. అవి భక్తులైనచో సాంవత్సరి కాదులు నొక్కఁడే చేయవలెను. ఒకఁడు చేసినను నందరి కాఫలము గల్గును గనుక నందరు పుత్రులు బ్రహ్మచర్యము పరాన్నవర్జనము మొదలగు నియమములు చేయ వలెను. పుత్రులొకచో నుండక దేశాంతరమందుగాని, గృహాంతరమందుగాని యున్నపుడవి భక్తులు సహితము సాంవత్సరికాది శ్రాద్ధము వేరువేరుగనే చేయవలెను. అందు జ్యేష్ఠుఁడు సన్నిధిలేనిచో గనిష్ఠుఁడు దాహాదికముఁ జేసెనేని షోడశశ్రాద్ధము పర్యంతమే చేయవలెను. ససిండీకరణముఁ జేయఁగూడదు. అట్లు సంవత్సరము వరకుఁ బ్రతీక్షింపవలెను. దానిలోపున దెలసినచో జ్యేష్ఠుఁడే చేయవలెను. సంవత్స రాంతమైనచో గనిష్ఠుఁడును జేయవచ్చును. సంవత్సరమునకులోగా నితరులచే మాసి

కాను మాసిక సపిండీకరణములు చేయఁబడినప్పటికిఁ దిరుగ బుత్రుఁడు చేయక దప్పదు. ఇట్లు కనిష్ఠుఁడు చేసినను జ్యేష్ఠుఁడు తిరుగ జేయవలెను. ఇక్కడ విశేషము ముందుఁ జెప్పఁబడును. కనిష్ఠుఁడు సాగ్నికుఁడైనయెడ సపిండీకరణమును గనిష్ఠుఁడు పంౘ్రెండవదినమందే చేయవచ్చును. ఔరసపుత్రుఁడు లేనిచో దౌహిత్రుఁడును క్షేత్రజాదిద్వాదశ విదపుత్రులు చెప్పఁబడినను కలియుగమందట్టి పుత్రుల నంగీకరించ నందున నౌరసుఁడు లేనిచో దత్తుఁడే యధికా యగు. తలిదండ్రులచేగాని యందులో నొకరిచేగాని విదిపూర్వముగ నివ్వఁబడి ప్రతిగ్రహింపఁబడిన సవర్ణపుత్రుఁడు దత్తకుఁడనఁబడును. భార్యయొక్క యనుమతిచే పతిపుత్ర దానము చేయవలెను. అదియు నాపదయం దగును. అత్యంతాపద యందు భార్యానుమతిలేకున్నను నీవచ్చును. భార్య మాత్రము పతియనుమతి లేకుండఁగ బుత్రదానము చేయఁగూడదు. ఇక్కడ విశేష విచారము మీఁదఁ జెప్పఁబడినది. దత్తుఁడు లేనిచో బౌత్రుఁడు బౌత్రుఁడు లేనియెడఁ బ్రపౌత్రుఁడు, కొందరు ఔరసుఁడు లేనిచో బౌత్రుఁడు నతఁడు లేనిచో బ్రపౌత్రుఁడు నతడునులేనిచో దత్తకుఁడని యంద్రు. ఉపనీతుఁడైన పౌత్రుడున్నప్పటికి ననుపనీతుఁడైనను బుత్రుఁడే కర్మయగును. అదియును చూడాకర్మయైనచో సంవత్సర మునకంటె నధికవయస్సుగలవానికే యగును. మూఁడువత్సరములు నిండినవయస్సు గలిగినచో చూడాకర్మ లేకున్నను  గర్తయగును. అనుపనీతుఁడైనను మంత్రోచ్చారణ పూర్వముగానే తలిదండ్రుల యంత్యక్రియలును సాంవత్సరికాది శ్రాద్ధమును జేయవలెను. అసమర్థుఁడైన యెడ దహనము మాత్రము సమంత్రముగ ననుపనీతుఁడు జేయవలెను. తక్కినది యితరులచే జేయించవచ్చును. ఇట్లు శ్రాద్ధమందు దర్శమహాలయాదులందును సంకల్పము మాత్రముఁ జేయవలెను తక్కినది యితఁడు చేయవచ్చును. కొందరు మూఁడు వత్సరములకు దక్కువవయసైనచో చూడాకర్మ, జరిగినను దహనము మాత్రమే సమంతకముగఁ జేయవలెను. తక్కినదితరులు చేయవచ్చునంద్రు. దత్తపుత్రుఁ డుపనీతుఁడయ్యెనేని యధికారి యగును. కానిచో గాడు. దత్తకుఁడుగాని ప్రపౌత్రుఁడుగానిలేనిచో భర్తకు బత్నియు బత్నికి భర్తయు దాహాద్యుత్తర క్రియలను సాంవత్సరికాది శ్రాద్ధములను జేయవలెను భర్త్కైనను సవతికొడుకున్నపుఁడధికారములేదు. అట్లు వచనము. “విదధ్యా దౌరసః పుత్రో జనన్యా జౌర్ధ్వదైహికం, తదభావే స పత్నీజః” అని యనఁగా దల్లియుత్తర క్రియలు నౌరసపుత్రుఁడే చేయవలె. అతఁడులేనిచో సవతికొడుకు చేయవలెనని. ఇఁక భర్తకు భార్యయైనను సమంత్రముగనే యుత్తర క్రియలు జేయవలెను. అశక్తిలో దహనము మాత్రము మంత్ర సహితముగఁ దానుజేసి తక్కిన దితరులచే జేయింపవలెను. ఇట్లు శ్రాద్ధమందును సంకల్ప మాత్రము దానుజేసి తక్కినది యన్యులచే జేయించునది. మరి విభక్తుఁడుగాకున్నను విభక్తుఁడై తిరుగ సంసృష్టుఁడైనను వానిధనము భ్రాతకే యగును. అయినను గర్మాధికారము పత్నికేయని తెలియవలెను విభక్తుఁడైనను తిరుగ గలియకుండినను వాని ధనమునకును గర్మకును బత్నియే యధికారమొందును. పత్నిలేనిచో గన్యయే కర్మకు ధనమునకు నధికారిణి యగును. అదియును వివాహమైన పైని పిండదానాధికారము

వివాహము గాకున్నను ధనాధికారముండవచ్చును. అట్లు దుహితయనఁగ పుత్రి లేనిచో దౌహిత్రుఁడు కర్మకర్తయు ధనాధికారియు నగును. దౌహిత్రుఁడు లేనిచో భ్రాతయతఁడును లేనిచో వానిపుత్రుఁడు. ఇఁక విభక్తుఁడు గాకున్నను విభక్తుఁడై తిరుగ సంస్పృష్టుఁడైనను వానికి బత్నిలేనిచో భ్రాతయగు సంస్పృష్టుఁడనఁగ బంచుకొన్న ధనము తిరుగ గలుపుకొని యేకపాకముచే జీవించు భ్రాతలు. అందు సోదరులు భిన్నోదరులు గలసినచో సోదరుఁడే కర్తయగు. అందు జ్యేష్ఠకనిష్ఠులున్నచో గనిష్ఠుఁడే యగును. అతఁడు లేనిచో జ్యేష్ఠుఁడు నగును. కనిష్ఠులనేకులున్నచో మృతుఁడైనవాని యనంతరుఁడు నతఁడు లేనిచో దదనంతరుఁడు మొదలుగ నెఱుంగునది. ఇట్లు జ్యేష్ఠులనేకున్నను మృతుని కవ్యవధానసామీప్య క్రమముచే గ్రహించునది. సోదర భ్రాతలేనిచో సాపత్న్యభ్రాత కర్తయగును. ఇక్కడను జ్యేష్ఠత్వాది విచారమున్న మీఁదఁజెప్పినట్లు దెలియునది. కొందరు విభక్తుఁడై సంస్పృష్టి లేకుండువానికి పుత్రికయు దౌహిత్రుఁడును ధనహరులైనప్పటికిని దాహాదికము భ్రాతయే చేయవలెను. భిన్నగోత్రునకధికారము లేదండ్రు భ్రాతలేనిచో భ్రాతృపుత్రుఁడు. అందులో సోదర భ్రాతృపుత్రుఁడు ముఖ్యుఁడు. అతఁడు లేనిచో సాపత్న్య భ్రాతపుత్రుఁడు. అతఁడును లేనిచో దండ్రి, తండ్రియు లేనిచో దల్లి. యాపెలేనిచో గోడలు. ఆపెయు లేనిచో జెలియలు. అందును జ్యేష్ఠకనిష్ఠభేదము సమానోదరభిన్నోదర భేదమును మీఁదఁ జెప్పినటుల నెఱుంగునది. భగినిలేనిచో మేనల్లుఁడు. జ్యేష్ఠకష్ఠాది సముదాయమందు భ్రాతలకువలె నెరుంగునది. తదభావమందు పినతండ్రియు నతని పుత్రుఁడు మొదలగు సపిండులు. వారులేనిచో సమానోదకులు, వారును లేనిచో సగోత్రులు వారు లేనియెడ మాతా మహుఁడు నతనిపుత్రులు మొదలగువారు అనుక్రమముగ వారు లేనిచో మేనత్త పినతల్లియు వీరిసంతతియు వారునులేనిచో దండ్రి మేనత్త పినతల్లియు వీరిసంతతియు, వారులేనిచో దండ్రి మేనత్త పినతల్లియు, మేనమామయు వారి పుత్రులు నను పితృబంధువులు, ఇట్లు తల్లి మేనత్త మొదలగు వారి సంతతి రూపులైన మాతృబంధువులు క్రమముగ నధికారులు. వారునులేనిచో శిష్యుఁడు. అతఁడు లేనిచో నల్లుఁడు మామకు నల్లునికి మామయు తదభావమందు మిత్రుఁడు. అతఁడు లేనిచో విప్రుఁడైన యెడ నెవ్వఁడైన ధనము గ్రహించి చేయునది. బ్రాహ్మణ భిన్నుఁడైన యెడ రాజు వాని ధనము గ్రహించి మరియొకనిచే జేయించవలెను. లేదా విప్రాదులు మరణము వచ్చునపుడు ధర్మపుత్రుని గ్రహించవలెను.

## స్త్రీలకు దాహాద్యధికారనిర్ణయము

వివాహముగాని స్త్రీకి దండ్రికర్త. యతఁడు లేనిచో భ్రాతమొదలగువారు, వివాహితయైన స్త్రీకి బుత్రులు లేనిచో సవతిపుత్రుఁడు. నతఁడు లేనిచో పౌత్రుఁడు ప్రపౌత్రుఁడు. వారులేనిచో భర్తయు తదభావమందు దుహిత తదభావమందు దౌహిత్రుఁడు నతఁడు లేనిచో బతిసోదరుఁడు. నతఁడు లేనిచో నతనిపుత్రుఁడు. తదభావమందు గోడలు. నాపలేనిచో దండ్రియు దండ్రిలేనియెడ భ్రాతయు, నితఁడు లేనిచో మేనల్లుఁడు మొదలగువారు మీఁదఁజెప్పినట్లధికారులు. ఈ చెప్పినయంత

టను పుత్రభిన్నులకు పుత్రాసన్నిధియందైనను పుత్రుఁడు లేకయే యుండినను గర్తృత్వ మని సిద్ధాంతము. అపుడు పుత్రుఁడు సన్నిధియందు లేనిచో నితరులు. దాహము మొదలు సపిండీకరణమునకు లోనగుకర్మలు చేయునది. సపిండీకరణము మాత్రము పుత్రుఁడు చేయవలసినది, పుత్రుఁడు లేకయేపోయినచో నన్యులును సపిండీకరణముఁ జేయవచ్చును. అందు సపిండులు మొదలుకొని రాజుపర్యంతమువారు, దాహము మొదలుగ దశాహమువరకు జరిగెడు పూర్వక్రియలు మాత్రమే చేయవలయును. ఏకాదశము మొదలు సపిండీకరణము వరకు మధ్యమ క్రియలు వాటియందు సపిండాదులకు గర్తృత్వము వైకల్పికము. అటుపై ననుమాసిక సాంవత్సరికాదు లుత్తర క్రియలు. అవి సపిండాదులుచేయనక్కరలేదు. ఇదియు స్థావరచరరూపమైన మృతునిధనము గ్రహింపనిచో నవి తెలియవలెను. ధనము గ్రహించిరేని సపిండాదు లును పుత్రునివలె నన్నిక్రియలును జేయవలెను. రాజుగూడ మృతుని ధనమున్నచో దానిచే తత్సజాతీయునిద్వారముగ సర్వక్రియలు జేయింపవలెను. ధనము లేనిచో పూర్వక్రియలు మాత్రము జేయింపవలెను. తక్కినవి యక్కరలేదు. సపిండులు మొదలు నృపాంతులైనవారు దప్ప తక్కినవారు మృతుని ధనము లేకున్నను తమ ధనము పెట్టి సపిండీకరణాంతములైన క్రియలు చేయకతప్పదు. మృతుని ధనము హరించియుఁ బ్రేతక్రియలు చేయనియెడ రాజువరకునైన కర్తలకు మృతుని సజాతీ యుని వధించిన పాపపు ప్రాయశ్చిత్తముఁ జేయవలెను. పుత్రుఁడు మొదలుకొని భ్రాతృసంతతివరకు నగువారును దౌహిత్రులును మృతుని ధనము గ్రహించినను గ్రహించకపోయినను మీఁదఁజెప్పిన పూర్వక్రియలు మధ్యక్రియలు నుత్తర క్రియలు నన్నియుఁ జేయకతప్పదు. అందు స్త్రీల కుత్తర క్రియలు మృతదినమందే గాని దర్శాదులం దక్కరలేదు. ఏమనిన; భర్తృశ్రాద్ధము చేతనే వారికిని సిద్ధించును. పూర్వ మధ్యమక్రియలు మాత్రము స్త్రీలను వేరుగ జేయవలెను కొందరు పుత్రుఁడు పతియు లేనిచో స్త్రీలను దౌహిత్రులు మొదలగువారు సపిండీకరణము లేకుండఁగనే యుత్తర క్రియలు చేయవలెను. సపిండీకరణము లేకున్నను నేకోద్దిష్టవిధిచే వార్షిక శ్రాద్ధము మొదలగునవి జరుగవచ్చుననిరి. "బ్రాహ్మణ స్త్వన్యవర్ణానాంనకుర్యాత్కర్మ పైతృకం, కామాల్లోభాద్భయాన్మోహా త్కృత్వాతజ్జాతితాం వ్రజేత్, శూద్రేణాపి బ్రాహ్మణస్య నకార్యం పైతృకం క్వచిత్" అనఁగా బ్రాహ్మణుఁ డితర జాతీయులకు బితృకర్మ చేయఁ గూడదు. కామలోభ భయమోహాదులచే జేసినయెడ తజ్జాతీయుఁడే యగును. అట్లు శూద్రుఁడును బ్రాహ్మణునికి బ్రేతకార్యము జేయఁగూడదు. దత్తకుఁడు జనక పితకు బుత్రులు లేనిచో దానే యతనికి శ్రాద్ధముచేసి యతనిధనము హరించునది. జనకపాలకులకిద్దరికి బుత్రులు లేనిచో నిద్దరికిని శ్రాద్ధముజేసి యిద్దరిధనము గ్రహించునది. ప్రతివార్షిక శ్రాద్ధము నిద్దరికిని జేయవలెను. దర్శమహాలయాదులలో నిద్దరు పిత్రాదుల నుచ్చరించి చేయవలెను. అపుడు రెండు విధముల ప్రితాదులకు వేరుగ బిండదానము, లేదా తండ్రులిద్దరికి నొకపిండము, తాతలిద్దరికి నొకటి యని మూడు పిండము లీవచ్చును. ఇట్లు దత్తుని పుత్రుఁడును దత్తక జనకునికి

బుత్రులు లేనిచో తనతండ్రిని తాతలిద్దరిని ముత్తాతలిద్దరిని నుద్దేశించి పిండ దానముఁ జేయునది. అదియు దర్శాదికమందే యని తెలియునది. ధనము నట్లనే స్వీకరించు నది. ఇట్లు దత్తకపౌత్రుఁడును తన జనకకుల మందు బ్రపితామహునికిఁ బుత్రాదులు, లేనియెడ దండ్రిని తాతను ముత్తాతలిద్దరిని యుద్దేశించి దర్శాదికముఁ జేయునది. ప్రపితామహుని ధనము హరించునది. ఇట్లు లౌగాక్షిస్మృతి వచన మున్నది. "యద్యేషాం స్వాసుభార్యా స్వపత్యం నస్యా ద్రిక్థంహరేయుః పిండం చైభ్యస్త్రిపురుషం దద్యురిత్యాది రేకపిండేద్వావనుకీర్తయే ద్గ్రహీతారం చోత్పాదయితారంచా తృతీయా త్పురుషాత్." అని మొదలగునది. జనకపాలకకుల కిద్దరికిని పుత్రాదిసంతతి యున్న యెడ దత్తుఁడిద్దరికిని జేయనక్కరలేదు. అనఁగా నంత్యక్రియలును ప్రతివార్షికమును జేయనక్కరలేదు. పాలకపితయొక్క యౌరసపుత్రునితో విభక్తుఁడైన దత్తుఁడు పాలక పిత మొదలుగ బార్వణము నుద్దేశించి దర్శమహాలయాది శ్రాద్ధము మాత్రము జేయవలెనని తోఁచుచున్నది. అవి భక్తుఁడైనచో నౌరసపుత్రుఁడు చేయు దర్శాదికము చేతనే తనకును సిద్ధియగుననియుఁదోచును. బ్రహ్మచారికి మాసికాబ్దికాది శ్రాద్ధము తలిదండ్రులకు మాతామహునికి నుపాధ్యాయునకు నాచార్యునకు దప్ప దక్కినవారికి శవనిర్హణము దహించుట మొదలగు నంత్యకర్మ చేయఁగూడదు. మాతృ పితృమాతా మహాచార్యాదులకైనను నితరాధికారులు లేనిచో దహనాదికముఁ జేయవలెను. అపుడు పది దినములకర్మఁ జేసెనేని బ్రహ్మచారికి బదిరోజు లాశౌచము. దాహము మాత్రము జేసెనేని యొకరో జాశౌచము. ఇటులాశౌచమున్నపుడును బ్రహ్మచారికి నిత్యకర్మ లోపము లేదు. దాన శుచియైనప్పటికి నాశౌచము గలవారియన్నముఁ దినగూడదు. వారితో నివసింపఁగూడదు. ఆ రెండును బ్రహ్మచారిచేసెనేని ప్రాయశ్చిత్తమును బునరుపనయనమును ముందు జెప్పఁబడును. ఇతరులకు దహనము మొదలగునవి చేసెనేని కృఛ్రత్రయమును దిరుగ నుపనయనమును జేసుకోవలెను. ధర్మార్థముగ నెవ్వరైన నెవ్వనికైన సజాతీయునికి దాహాదికము శ్రాద్ధాదికము జేసెనేని సంపత్తు మొదలగు ఫలము లభించును. మీఁదఁజెప్పిన శ్రాద్ధవిధియంతయు శూద్రులకు మంత్రహీనముగ నగును. కొందరు వైదికమంత్రము మాత్రమే శూద్రులకు వర్జింప దగినది. బౌరాణమంత్రములు పఠింపవచ్చునని యంద్రు. నిర్ణయసింధువునందు మాత్రము పురాణమంత్రములైనను శూద్రుఁడు స్వయముగ బఠింపఁగూడదు. బ్రాహ్మణ ద్వారముగ బఠింపవచ్చును. వేదమంత్రములైనచో బ్రాహ్మణునిద్వారముగ నైనను గూడదని చెప్పఁబడినది. ఇట్లు ద్విజస్త్రీలు సహితము వ్రతోద్యాపనాదులందు వలె సంకల్పమాత్రము స్వయముగఁజేసి వేదమంత్రాదికము బఠించి శ్రాద్ధమంతయు బ్రాహ్మణుని ద్వారముగఁజేసి చేయవలెనని పారిజాతకారమతము. శూద్రునికెల్లపుడు నామ మనఁగ బియ్యము మొదలగు వానితోడనే శ్రాద్ధముగాని యన్నముతో గూడదు. 'పిత్రే నమః పితామహాయనమః' అని నమశ్శబ్దాంతమైన నామమంత్రములచేత నేని మంత్రణము పాద్యము నాననము గంధము పుష్పము మొదలగువానిచే బ్రాహ్మణులఁ బూజించి యామద్రవ్యము నివేదించి సత్తుపిండిచే బిండదానము

మొదలగునవి చేసి దక్షిణాదానాదికముచే శ్రాద్ధము సమాప్తినొందించి గృహసిద్ధాన్న ముచే సజాతీయులకు భోజనము పెట్టవలెను. సింధువునందు మాత్రము నామ మంత్రములచే నావాహన మగ్నౌకరణము కాశ్యప గోత్రోచ్చరణము పూర్వముగ బిండదానతర్పణాదికము పాకముచే బిండదానమును జెప్పఁబడినదిగాని యది సచ్ఛూద్రుల కని తెలియునది. ఏడుపురుషాంతరములనుండిగాని మూఁడు పురుషాం తరముల నుండిగాని స్నానము వైశ్వదేవము తర్పణము మొదలగు ధర్మమును శూద్రకమలాకరోక్తవిధిచే నాచరింపుచున్నయెడ సచ్ఛూద్రుఁ డనఁబడును. ఇట్లు కిరాత యవనాది హీనజాతులకును బ్రాహ్మణుల కామదానము దక్షిణాదానము మొదలుగ స్వజాతి కన్నముబెట్టుట వరకునైన శ్రాద్ధముఁ దెలియునది. "రాజకార్య నియుక్తస్య బంధనగ్రహ వర్తినః, వ్యసనేషు చ సర్వేషు శ్రాద్ధం విప్రేణ కారయేత్." అనఁగా రాజకార్యమందు నియోగింపఁబడి శ్రాద్ధము దానుజేయుట కవకాశము లేనపుడును సంకిళ్లుపడి శిక్షలోనున్నపుడును దీర్ఘరోగాది మహాపదలందును శ్రాద్ధము బ్రాహ్మణునిచే జేయింపవలెననుట ఇట్లు మొదట జీవత్పితృకునికి నిర్ణయముఁ జెప్పఁ బడినది. అపుడు ప్రసంగముచే స్వల్పముగ నధికారము విచారింపఁబడినది. ఇపు డధికార విచారమంతయు సవిస్తరముగ నిరూపింపఁబడినది గనుక బాలురకు బోధ కొఱకుఁ జెప్పినది. తిరుగజెప్పినను దోషము కాదు. ఇది శ్రాద్ధాధికార దాహాద్యధికార నిర్ణయము.

## శ్రాద్ధశబ్దమున కర్థము

మృతులైన పిత్రాదులనుద్దేశించి శాస్త్రోక్తమైన కాలమందును దేశమందును పక్వాన్నముగాని యామాన్నముగాని హిరణ్యముగాని విధిప్రకారము విప్రులకు దానము చేయుట శ్రాద్ధమనఁబడును. అందగ్నౌకరణము పిండదానము బ్రాహ్మణ భోజనము నీ మూఁడును ప్రధానములు. ఇట్లు వచనము – "హూమశ్చ పిండదానం చ తథా బ్రాహ్మణ భోజనం, శ్రాద్ధశబ్దాభిధేయం స్యాదేకస్మిన్నౌపచారికం" అని దీని యర్థము స్పష్టము. క్వచిత్తుగా సంకల్పాదివిధులలో బిండదానాదులు లేకున్నను బ్రాహ్మణ భోజనాదికము మాత్రమే శ్రాద్ధపదార్థమగునని శ్రాద్ధపదమునకు నాల్గవ యర్థము. వెనుక మూఁడును బ్రత్యేకముగ నుపచారములే శ్రాద్ధపదార్థముగా వచ్చునని చెప్పఁ బడినది. ఇట్లు వచనాంతరము 'యజుషాం పిండదానం తు బహ్వృచానాం ద్విజార్చ నం, శ్రాద్ధశబ్దాభిదేయం స్యాదుభయం సామవేదినాం, అనఁగా బ్రాహ్మణార్చనము ఋగ్వేదులకు బ్రధానము. పిండదానము యజుర్వేదులకును సామవేదులకును బ్రధానములు. అశ్రద్ధయనఁగ నాస్తికత్వ బుద్ధిచే బితృదేవతలు లేరని పలికి శ్రాద్ధము చేయని వానిపేతరులు రక్తము త్రాగుదురు.

## శ్రాద్ధ భేదములు

అందు శ్రాద్ధము నాల్గువిధములు :– పార్వణ శ్రాద్ధము నేకోద్దిష్ట శ్రాద్ధము నాందీశ్రాద్ధము సపిండీకరణ శ్రాద్ధము నని. అందుదండ్రి మొదలగు ముగ్గర

నుద్దేశించి పిండత్రయమిచ్చు శ్రాద్ధము పార్వణ శ్రాద్ధము. అదియు నొకపార్వణము గలదియు రెండుపార్వణములు గలదియు మూఁడు పార్వణములు గలదియు నని త్రివిధము. అందు తండ్రి మొదలగువారికి మృతతిథియందు జేయు ప్రత్యాబ్దికము మొదటిది. మహాలయమున న్వష్టక్యశ్రాద్ధము తప్ప దక్కిన యమావాస్యాది షణ్ణవతి శ్రాద్ధములు ద్విపార్వణకములు. అనఁగా పిత్రాది త్రయము సపత్నీకమనియు మాతా మహాదిత్రయము సపత్నీకమనియు నుద్దేశించి పిండదానమనుట. అన్వష్టక్యాశ్రాద్ధము నందు బిత్రాదిత్రయము మాత్రాదిత్రయము మాతా మహాదిత్రయము సపత్నీకముగను నుద్దేశించి పిండదానము. మహాలయశ్రాద్ధము తీర్థశ్రాద్ధమును పార్వణైకోద్దిష్ట రూపము. ఏమనిన; పిత్రాదిపార్వణత్రయమును పత్న్యాద్యేకోద్దిష్టగణమును నుద్దేశించి యందుఁ బిండదానము. కొందరు రెండింటిలో మాతా మహపార్వణమును మాతా మహీపార్వణమును వేరుగఁ జేతురు. అపుడు పార్వణ చతుష్టయ మగును. కొందరి సూత్రములో దర్శశ్రాద్ధముగూడ త్రిపార్వణకము చతుఃపార్వణకము నగునని హేమా ద్రిలోనున్నది. ఒక్కరినుద్దేశించి యొక్కపిండమే యిచ్చునది. యేకొద్దిష్టము. అదియును మూఁడువిధములు. నవసంజ్ఞము పురాణ సంజ్ఞమునని. అందు మృతునికి మృత దినము మొదలుకొని దశాహపర్యంతము జేయునవి నవాహ్నిక శ్రాద్ధములు. పదు నొకండవదినమందలి శ్రాద్ధము మొదలుగ నూనాబ్దికము పర్యంతమైన శ్రాద్ధములు నవమిశ్రములు. ఇవి విశ్వేదేవహీనములు. వాటికి భిన్నములగు కనిష్ఠ తకు జేయు వార్షికము శస్త్రహతులకు జేయు చతుర్దశీశ్రాద్ధము మొందలగునవి పురాణ సంజ్ఞిక ములు. కొందరు సపిండీకరణమైన పైని జేయువానికి బురాణ సంజ్ఞను జెప్పుదురు. పుత్రజన్మ యందును పుత్రవివాహమందును జేయు వృద్ధిశ్రాద్ధము నాందీశ్రాద్ధము. ఇది పూర్వభాగమందు విస్తరముగ జెప్పఁబడినది. అదియే గర్భాధాన పుంసవన సీమంతములందును నగ్న్యాధాన సోమయాగములందు ముందు జేయునపుడు కర్మాంగము నిష్టిశ్రాద్ధమనఁబడును. అందు క్రతు దక్షసంజ్ఞికులు విశ్వేదేవులు. ఇతర కర్మలందుఁ జేయునది వృద్ధిసంజ్ఞికము. అందు విశ్వేదేవులు సత్యవసుసంజ్ఞికులు. ఇట్లు నామభేదము దేవభేదము తప్ప దక్కినవి సమానమే ఇది పార్వణ త్రయము గలది. కనుక పార్వణ శ్రాద్ధములలో నేదియైనను దర్శాదుల కంటె ననేక ధర్మము గనుక భిన్నమైయుండుటచే వేరుగఁ జెప్పఁబడినది. మృతునికి బంద్రెండవదియు మొదలగు కాలమున పిండము నర్ఘ్యము మొదలగునవి మీఁదివారితో గలపుట సపిండీకరణము. ఇదియును పార్వణైకోద్దిష్ట వికృతిరూపమే. ఇందు విశేషము ముందుఁ జెప్పఁబడును. కాఁబట్టి పార్వణము నేకోద్దిష్టము నని రెండువిధములే శ్రాద్ధము. ఇది తిరుగ మూఁడు విధములు. నిత్యము నైమిత్తికము కామ్యము నని. తప్పకుండు నిమిత&తమున విధింపఁబడునది నిత్యము దర్శాది శ్రాద్ధము. అట్లు ప్రతిదినముగ విధింపఁబడినదియు నిత్యశ్రాద్ధమే అందు పార్వణ ద్వయము విశ్వే దేవులక్కరలేదని మీఁదఁ జెప్పఁబడినది. నియతముగాని నిమిత్తమున విధింపఁబడి నది నైమిత్తికము. ఎట్లనిన; సూర్యచంద్ర గ్రహణాదులందు శ్రాద్ధము. ఇదియు

నార్గురు పితృదేవతలు గలది. ఫలమందు గోరికచే జేయునది కామ్యము. ఎట్లనిన; పంచమి మొదలగు తిథియందును గృత్తిక మొదలగు నక్షత్రమందును జేయునది.

## శ్రాద్ధ దేశములు

దక్షిణమునకు బల్లమై గోమయముచే నలికినదియు పురుగులు కేశములు నస్థులు శ్లేష్మము మొదలగు నశుచివస్తువు లంటకుండునదియు మేడ యంతస్తు; మొదలుగ కృత్రిమభూమి గాకుండునదియు నైరజస్వలాదర్శనము మొదలగు దోష ములు దగులనిదేశమందు శ్రాద్ధము చేయవలెను. మరియు గురు క్షేత్రమందును, ప్రభాస తీర్థము, పుష్కరము, ప్రయాగము, కాశి, గంగా, యమునా, నర్మదాదినదీ తీరము, నైమిశవనము, గంగాద్వారము, గయాశీర్షము, నక్షయ్యవటము మొదలగు పుణ్యస్థలములందు శ్రాద్ధముఁ జేయుట మహాఫలము. "శమీపత్ర ప్రమాణేన పిండంద ద్యాద్గయాశిరే, ఉద్ధరే త్సప్తగోత్రాణి కులమేకోత్తరం శతం." అనఁగా గయయందు జమ్మియాకంత స్వల్పమైన పిండమునిచ్చినచో దన సప్తగోత్రములు తరించును. నూటయొక పురుషుల పర్యంతము గులము తరించుననుట. సప్తగోత్రము లెవ్వియనిన; 'పితామాతా చ భార్యా చ భగినీ దుహితా తథా, పితృమాతృష్వసాచైవ సప్తగోత్రాణివై విదుః' అనఁగా తండ్రి, తల్లి, చెల్లెలు, కూతురు, మేనత్త, పినతల్లి, వీరి గోత్రములు సప్తగోత్రములు. అందు గ్రమముగ నిరువదినలుగురు నిరువదియు పదార్గురు పండ్రెండుగురు పదునొకండుగురు పదుగురు నెనమండ్రు నని పురుషుల సంఖ్య నూటయొకటి యగును. వీరలందరు దరింతురనుట. అందు పితృకుల మందు మీఁదివారు పండ్రెండుగురు క్రిందివారు పండ్రెండుగురని వెరసి యిరువది నలుగురని మొదలుగఁ దెలియవలెను. "తులసీ కాననచ్ఛాయా సాలగ్రామస్య సన్నిధిః చక్రాంకితస్య సాన్నిధ్య మేషు యత్క్రియతే నరైః, స్నానం దానం తపశ్శ్రాద్ధం సర్వ మక్షయ్యతాం వ్రజేత్." అనఁగా తులసీవనముయొక్క నీడయందును సాలగ్రామము సన్నిధిని ద్వారకాచక్రము సమీపముననను జేయుస్నానము దానము శ్రాద్ధము నక్షయ ఫలమిచ్చునని యెఱుంగునది.

## నిషిద్ధ దేశములు

గోగజాశ్వాదులచే దుష్టమైన ప్రదేశమందును మ్లేచ్ఛులు మొదలగువారి దేశ మందును శ్రాద్ధముఁ జేయఁగూడదు. వరుని గృహమందు జేసినయెడ వరుని పితృదేవతలుగూడ భాగమును హరింతురు. కనుక గృహస్వామికి మూల్యమిచ్చి శ్రాద్ధము చేయవలెను. అతని యనుజ్ఞచే జేసినను లోపములేదు. 'వనానిగిరయోనద్య స్తీర్థాణ్యాయత నానిచ, దేవఖాతాశ్చగర్తాశ్చ న స్వామ్యం తేషు కస్యచిత్.' వనములు పర్వతములు నదులు వాటితీరములు సిద్ధులగృహములు దేవఖాతము లనఁగ గుహలు గోతులు మొదలగువాని యందొకరికి స్వత్వము లేదు. అనఁగ వాటియం దెవ్వరి యనుజ్ఞయు నక్కరలేదనుట. 'నైకవాసానచ ద్వీపే నాంతరిక్షేకదాచన, శ్రుతిస్మృత్యు దితం కర్మ న కుర్యాదశుచిః క్వచిత్.' అనఁగా నొక్క వస్త్రము ధరించియు జలమధ్య

మందైన దిబ్బయందును మేడ మొదలగువాని యంతస్తులపైని తాప శుచియైయున్న పుడును శ్రాద్ధము చేయఁగూడదు. మరియు శ్రుతిస్మృతులచే విధింపఁబడిన కర్మ యెద్దియుఁ జేయఁగూడదు.

## శ్రాద్ధ కాలములు

అవి యమావాస్య సంక్రాంతి యుగాది మన్వాది మొదలుగఁ బూర్వము చెప్పఁబడినవే తరుచుగ నగును. ఇచట గొన్ని చెప్పఁబడును. మహాతీర్థము దొరకుట వ్యతీపాతము మృతదినము గ్రహణకాలము శ్రాద్ధమందాసక్తి గలుగుట శ్రోత్రియుఁ డు మొదలగు బ్రాహ్మణులు దొరకుట యర్ధోదయము గపిలాష్టమి మొదలగు నలభ్య యోగములు గ్రహపీడ దుస్స్వప్నముగనుట నూతనాన్నముదొరకుట నూతన జలము లభించుట గృహము నేయించుట మొదలగు నిమిత్తములు శ్రాద్ధకాలములు. "యదా విష్టి ర్వ్యతీపాతో భానువార స్తథైవచ, పద్మకో నామయోగోయ మయనాదే శ్చతుర్గుణః " అనఁగా విష్టియు వ్యతీపాతము రవివారము గలసినచో బద్మయోగము. అది యుత్తరాయణమునకంటె నాల్గురెట్టులు ఫలమిచ్చును. సమస్త మాసములలో గృష్ణ పక్షమందు శ్రాద్ధము విధింపఁబడినది. అపుడు ప్రతిదినమందనియు పంచమి మొదలగు తిథులందనియు శ్రాద్ధమునకుఁ దగిన యుపకరణములు సిద్ధించు దినము నందనియు మూఁడుపక్షములు. ఒక్కదినమందు నను పక్షమున దర్శయందే కావలెను. నారాయణవృత్తియందు దర్శశ్రాద్ధముచేతనే పక్షశ్రాద్ధము సిద్ధించునని చెప్పఁబడినది. సర్వమాసములందును దర్శశ్రాద్ధముఁ జేయ నశక్తుఁడైనచో కన్య యందు కుంభమందు వృషభమందును సూర్యుఁ డుండునపుడు మూఁడు దర్శల యందైనను నొకటియందైనను శ్రాద్ధముఁ జేయవలెను. సాగ్నికుఁ డశక్తుఁడైనచో బిండ పితృయజ్ఞముచేతనే దర్శశ్రాద్ధము సిద్ధించును. నిరగ్నికునికి బ్రాహ్మణ భోజనము మాత్రముచే నైనను ధాన్యము మొదలగు ద్రవ్యమిచ్చినను దర్శసిద్ధి యగును. కృష్ణ పక్షములలో మహాలయ పక్షము ప్రశస్తము. అందు పక్షమహాలయములు మొదలగు పక్షములు ద్వితీయపరిచ్ఛేదమందు విస్తరముగఁ జెప్పఁబడినవి. అందు మరియొక విశేషము కాలతత్వ వివేకమందున్నది. ఎట్లనిన; పదునైదు దినములు మహాలయ ములు జేయసంకల్పించి చేయుచుండఁగ నాశౌచము వచ్చినయెడ జేసిన మహాలయ ములు వ్యర్థములగును. గనుక శుద్ధియైనపై నొక దినమందు సకృన్మహాలయము మాత్రముఁ జేయవలెను. ఇట్లు పంచమ్యాదిపక్షములందును గ్రహించునది. మరియే దైనను బ్రతిబంధకము గల్గినచో విప్రునిచే శేష మహాలయములు చేయింపవచ్చును. పినతండ్రియు జ్యేష్ఠభ్రాతయు మొదలగు వారు పుత్రులైరేని మహాలయ పక్షమున వారి మృతతిథియందు వారి పార్వణము మాత్రమే యుద్దేశించి జీవపితృకుఁడును జేయవలెను. పండ్రెండు పూర్ణిమలు సంభవింపనిచో మాఘ శ్రావన భాద్రపద పూర్ణిమలైనను నిత్యములు. ఏదైన నొక కృష్ణపక్షమందు ప్రతిపద మొదలగు పదునైదు దినములందును కృత్తిక మొదలు భరణిపర్యంతమైన నక్షత్రములందును విష్కంభాది

యోగములందును రవ్యాదివారములందును బవ మొదలగు కరణములందును శ్రాద్ధము ఫలవిశేషమిచ్చును. కనుక నాతిథ్యాదులు కామ్య శ్రాద్ధకాలములు.

## ప్రత్యాబ్దిక మాసికాదుల నిర్ణయము

పగలు పదునైదు ముహూర్తములు మూడేసి ముహూర్తముల చొప్పున నైదు భాగములు చేసినచో మొదటిభాగము ప్రాతఃకాలము. రెండవది సంగవకాలము. మూడవది మధ్యాహ్నము. నాల్గవది యపరాహ్ణము. నైదవది సాయాహ్నము. ముహూర్తమనఁగ బగటిలో బదునైదవభాగము. అందు సప్తమముహూర్తము గంధర్వ సంజ్ఞికము. ఎనిమిదవముహూర్తము కుతపము. తొమ్మిదవది రోహిణము. అందు దర్శాదిశ్రాద్ధములకు నిర్ణయము దరుచుగ మీఁదఁజెప్పఁబడినది. విశేషము చెప్పఁబడును. సాగ్నికులైన కాత్యాయనాదులకు నన్వాధానము పిండపితృయజ్ఞము దర్శ శ్రాద్ధము నొక్కరోజుననే చేయవలెనని నియమము గనుక మూడు భాగములుగఁ జేసిన పగటియొక్క మూఁడవ భాగ మన నపరాహ్ణమందు వ్యాపించిన తిథియందే దర్శశ్రాద్ధము చేయవలెను.

## ప్రతిసాంవత్సరిక మాసికానుమాసికముల నిర్ణయము

ఇందు ఏకోద్దిష్టము సప్తమాష్టమ నవమ ముహూర్తములైన మధ్యాహ్నమందుఁ జేయవలెను. అందును గుతపరౌహిణ సంజ్ఞికములైన యష్టమ నవమ ముహూర్తములు ముఖ్యకాలము. అందు పూర్వదినమందే మధ్యాహ్న వ్యాప్తియున్నను బరదినమందే యున్నను నట్లున్న తిథియే గ్రహింపవలెను. దినద్వయమందును మధ్యాహ్న వ్యాప్తిగాని మధ్యాహ్న స్పర్శముగాని యున్నచో బూర్వదినమే యగును. దిన ద్వయమందును సమముగ నేకదేశ వ్యాప్తి యున్నచో బూర్వదినమే. ఖర్వపర్వము మొదలగు వానిచే వ్యవస్థయగునని కొందరు. విషమముగనే దేశవ్యాప్తియున్నచో నధికవ్యాప్తి యున్నదినము గ్రహించునది. పార్వణశ్రాద్ధమం దపరాహ్ణవ్యాప్తిగావలెను. అట్లు పూర్వదినమందే యపరాహ్ణవ్యాప్తి యున్నను బరదినమందే యట్లున్నను నాతిథియే గ్రహించునది. దినద్వయమందు నదిలేకున్నను నపరాహ్ణస్పర్శయైన లేకున్నను సమముగ నేకదేశవ్యాప్తి యున్నను పూర్వదినమే విషమముగ వ్యాపించినచో నధికవ్యాప్తి గ్రహించునది. ఇక్కడ మాధవాచార్యులు దినద్వయమందును బూర్ణమైన యపరాహ్ణ వ్యాప్తియున్నను సమముగ నేకదేశవ్యాప్తియున్నను నుత్తరతిథికి క్షయమగుచో బూర్వ దినమే వృద్ధిగల్గుచో బరతిథియే. అట్లు క్షయముగాని వృద్ధిగాని లేకున్నను బరదినమే యనిరి. ఈ క్షయదిననిర్ణయము ప్రత్యాబ్ధికమందును మాసికమందును మృతతిథి యందును జేయు సకృన్మహాలయమందు నని యెఱుంగునది. శ్రాద్ధమందు భరణ్యాది నక్షత్రము వ్యతీపాతాది యోగము నపరాహ్ణవ్యాప్తిగావలెనని మీఁదఁ జెప్పఁబడినది. కొందరు శుక్ల పక్షమందు నుదయ వ్యాపినక్షత్రము గావలెనంద్రు. ఈ పార్వణ శ్రాద్ధము కుతపాదులైన యైదుముహూర్తములలో జేయవలెను. సాయాహ్నమందును రాత్రి యందును ప్రాతస్సంగవములందును గూడదు. పిండపితృ యజ్ఞదినమందు

మాత్రము సాయాహ్నమందైనను బార్వణ యనుమతింపఁబడుచున్నది. ఒకవేళ విఘ్న వశముచే సాంవత్సరిక శ్రాద్ధము పగలు జరుగనియెడ రాత్రియందైనను జాము పర్యంతము చేయవచ్చును. ఏమనిన; మృతదినము నతిక్రమించినచో చండాలత్వము వచ్చునని చెప్పఁబడినది. గ్రహణదినమందు దర్శయు మాసికము ప్రతివార్షికము మొదలగు శ్రాద్ధములు ప్రాప్తించినచో నా దినమందే యన్నముచేగాని యామ ద్రవ్యముచేగాని హిరణ్యముచేగాని చేయవలెను. పరదినమందుఁ గూడదు. ప్రథమాబ్ది కము పదుమూఁడవదియగు మలమాసమందైనను జేయవచ్చునని మీఁదఁ జెప్పఁ బడినది. కాఁబట్టి పంద్రెండవమాసికము శుద్ధమాసమందైనచో బదుమూఁడవదగు నధికమాసమందే ప్రథమాబ్దికము. అట్లుగాక యధికమందే పంద్రెండవమాసికమైనచో దానికి ద్విరావృత్తిజేసి పదునాల్గవదియగు శుద్ధమందనగ నధికము వచ్చిన మాసము నకు పై మాసమందు బ్రథమాబ్దికముఁ జేయునది. ఇట్లు ద్వితీయాదిమాసికములు మలమాసమందైనచో ద్విరావృత్తిఁ జేయవలెను. ద్వితీయాదులగు ప్రత్యాబ్దికములు శుద్ధమమాసమందే చేయవలెను. ఇట్లు మహాలయముగూడ శుద్ధమాసమందే చేయవలెను. అధికమాసమందేమియుఁ జేయనక్కఱలేదు. మలమాసమందు మృతి నొందినచో దిరుగ నామాస మధికమగునపుడు మలమాసమందే ప్రత్యాబ్దికము. శుద్ధమందును గూడదు. దర్శదినమందు వార్షికము సంభవించినచో మొదట నాబ్దికముఁజేసి అటుపైని పిండపితృయజ్ఞము నాపైని పాకాంతరముచే దర్శశ్రాద్ధము జేయవెను. కొందరు మొదట పిండపితృయజ్ఞము అటుపై నాబ్దికము ననంతరమున దర్శశ్రాద్ధమునని క్రమముఁ జెప్పుదురు. ఇట్లు మాసికాదులందును దెలియునది. 'సపిండీకరణా దూర్ధ్వం యావదబ్దత్రయం భవేత్, తావదేవ నభోక్తవ్యం తదీయే శ్రాద్ధమాత్రకే' అనఁగా సపిండీకరణమైనను పైని మూఁడు సంవత్సరముల పర్యంతము నతని నుద్దేశించిన శ్రాద్ధములన్నిటియందును భుజింపఁగూడదు. ఏమనిన; "ప్రథమాబ్దేస్థ్యాదిభోజీ ద్వితీయేమాంసభక్షకః, తృతీయే రక్తభోజీ స్యాచ్ఛుద్ధం శ్రాద్ధంచతుర్థకే." అనఁగా మొదటి సంవత్సరములలో శ్రాద్ధభోక్త యస్థిభోజి యగును. ద్వితీయవత్సరమందు మాంసభోజియగును. తృతీయాబ్దమందు రక్తభోజి యగును. చతుర్థవతర్సమందు శ్రాద్ధము భుజింపవచ్చును. ఇట్లు ప్రాసంగికము విస్తరించి చెప్పఁబడినది చాలును. ప్రకృతము విచారింతము. పార్వణమైన యామశ్రాద్ధమైనను రెండువంతులుగ భాగించిన యొకటి పూర్వభాగమందే చేయవలెను. సర్వశ్రాద్ధము నాయా నిర్ణీతకాలమున నాయాతిథి స్పర్శనము లేకున్నపుడు పూర్వదినమందసలేతిథి యునట్లే యని శాస్త్రముచే నతిదేశింపఁబడినది. కనుకనే దినద్వయమంద నపరాహ్ణ మునకు తిథిస్పర్శనము లేకున్నపుడు పూర్వదినమందసలేతిథి లేకున్నను జేయ వచ్చును.సామాహ్నామందుఁ గూడదు. ఇట్లు కాలతత్వ వివేచనమందున్నది. వృద్ధి శ్రాద్ధము పాతసంగవకాలమందు జేయవలెను. మధ్యాహ్నమందు జేయుట గౌణము. అపరాహ్ణసాయాహ్నములందు నిషిద్ధము. రాత్రియందు వివాహమగుచో బ్రాతః కాలమందు వృద్ధిశ్రాద్ధము జరుగనియెడ రాత్రియైనను జేయవచ్చునని క్వచిత్తుగా

మన్నది. గ్రహణి నిమిత్తమైన పార్వణశ్రాద్ధమును పుత్రుఁడు జన్మించినపుడు జాతకర్మ కంగమైన వృద్ధిశ్రాద్ధమును రాత్రియందైనను జేయవచ్చును. ఇట్లు కాలనిర్ణయము. పుత్రాదులు పిత్రాదులను మాత్రాదులను నుద్దేశించి శ్రాద్ధమందు మంత్రపూర్వకముగ నిచ్చునన్న మట్టిపితృదేవతల నొందును. అపుడు పిత్రాదులు దేవరూపులై యుండిరేని యతని యన్నము మృత్యస్వరూపమై మంత్రబలముచే వారి నొందును. వారు గంధర్వులై యుండిరేని భోగ్యరూపమై చెందును. పశువులైరేని తృణరూపమై చెందును. సర్పజన్మమెత్తిరేని వాయురూపమై యాహారమగును. రాక్షసాది జన్మమెత్తిరేని మాంస రూపమగును. ప్రేతరూపులైరేని రక్తమై చెందును. మనుష్యులైరేని యన్నాది రూపముచే జెందును. గ్రంథాంతరమందు; "తస్యతే పితరశ్శ్రుత్వా శ్రాద్ధకాలముపస్థితం, అన్యోన్యం మనసాధ్యాత్వా సంపతంతి మనోజవాః, త్రైర్బాహ్మణైస్సహాశ్నంతి పితరో వాయు రూపిణః" అని. అనఁగా శ్రాద్ధకర్తయొక్క పితృదేవతలు శ్రాద్ధకాలము రాగానే మనస్సుచే నన్యోన్యము ధ్యానించి యందరు వాయురూపముచే మనోవేగమున వచ్చి యావాహనముచేసిన బ్రాహ్మణులతో శ్రాద్ధము భుజింతురు. కనుకనే శ్రీరామ చంద్రుడు శ్రాద్ధము జేయునపుడు సీత, బ్రాహ్మణుల యందు దశరథాదులఁ జూచెనని కథ వినఁబడుచున్నది. మఱియును; "ప్రావృష్యంతే యమః ప్రేతాన్ పితౄంశ్చాపియ మాలయత్, విసర్జయతి భూలోకం కృత్వాశూన్యం స్వకంపురం, తేపుత్రాదేః ప్రకాం క్షంతి పాయసం మధుసంయుతం, కన్యాగతే సవితరి పితరో యాంతినైసుతాన్, అమావాస్యా దినే ప్రాప్తే గృహద్వారం సమాశ్రితాః, శ్రాద్ధాభావే స్వభవనం శాపందత్వా వ్రజంతితే, అతోమూలైః ఫలైర్వాపి తథాప్యుదకరతర్పణైః, పితృతృప్తిం ప్రకుర్వీత నైవశ్రాద్ధం వివర్జయేత్." అని. అనఁగా వర్షాకాలము తుదిని యముఁడు. ప్రేతలను పితృదేవతలను దనపురమునుండి భూలోకమునకు బంపును, వారు పుత్రాదులిచ్చు పాయస మధువులఁగోరి సూర్యుఁడు కన్యయందుండఁగ పుత్త్రుల గృహ ద్వారము నాశ్రయించి యమావాస్యవరకు శ్రాద్ధముఁ జరుగనిచో శపించి వెళ్ళిపోదురు. కనుక శక్తికొలఁది మూలములు ఫలములు మొదలగువానిచేనైనను జలతర్పణములచే నైనను వారికిఁ దృప్తిజేయవలెనని యున్నది. ఇంతియేకాదు. బ్రహ్మమొదలుగ తృణము పర్యంతము భూతములకు దృప్తియగునని వినఁబడుచున్నది. ఎట్లనిన; పిశాచాది స్వరూపులకు వికిరాన్నముచేతను తృప్తి. వృక్షాదిరూపులకు స్నానవస్త్రోదకాదులచేతను, మరికొందరి కుచ్ఛిష్టపిండాదికముచేతను దృప్తియని. కనుక తండ్రి సన్యసించి బ్రహ్మీ భూతుఁడైనను పుత్రుఁడు శ్రాద్ధము జేయవలయును. అందు పితృపితామహ ప్రపితా మహులు గల యొక్కొక్క పార్వణము వసురుద్రాదిత్యరూపముచే ధ్యానింపవలెను. ఏకోద్దిష్టము వసురూపముననే యని సర్వశ్రాద్ధములందును దెలియునది. కొందరు పితృపితామహ ప్రపితామహులను ప్రద్యుమ్నసంకర్షణ వాసుదేవ రూపములుగాను కర్త దన్ను ననిరుద్ధరూపముగను ధ్యానింపవలెనంద్రు. ఇట్లు వరుణ ప్రజాపత్యగ్ని రూపులు ననికొందరు, మాస ఋతు వత్సరరూపముగ నని కొందరు. "అందు యథాచారముగ సముచ్చయముననగాని వికల్పముననగాని ధ్యానము జేయవలెనని

వ్యవస్థ జేయవలెను. "శ్లో. పిత్రాది పార్వణంయత్ర తత్రమాతా మహోయదః, సర్వత్రై వహికర్తవ్యా నాబ్దికేమాసి కేషుచ, మాసికేషు త్వాబ్దికేచ త్రిదైవత్యం ప్రకీర్తితం, వృద్ధౌతీర్థే న్వష్టకాసు గయాయాంచ మహాలయే, త్రిపార్వణకమత్రేష్టం శేషషట్పౌరుషంవిదుః" అనఁగా పిత్రాదిపార్వణ ముద్దేశించు శ్రాద్ధములలోనాబ్దికము మాసికము తప్ప దక్కిన వాటియందుదంతటను మాతామహాదిపార్వణ ముద్దేశింపకతప్పదు. మాసికము నాబ్ధికమును పిత్రాదులు ముగ్గురినిమాత్రమే యుద్దేశించిచేయునది. మఱియును వృద్ధిశ్రాద్ధమందును తీర్థశ్రాద్ధమందు నన్వష్టకాశ్రాద్ధములందును గయా శ్రాద్ధమం దును మహాలయమందును మూఁడు పార్వణముల నుద్దేశించి చేయవలెను. తక్కిన శ్రాద్ధములు సపత్నీకులైన పిత్రాదులను సపత్నీకులైన మాతామహాదులను నీయార్గురి నుద్దేశించియే చేయవలెను. "క్షయాహం వర్జయిత్వైకం స్త్రీణాం నాస్తి పృథక్క్రియా, అన్వష్టకాసు వృద్ధౌ చ గయాయాంచ క్షయేహని, అత్రమాతుః పృథక్ శ్రాద్ధ మన్యత్ర పతినాసహ"అనఁగా స్త్రీలకుమృతతిథియందు దప్ప మరియెప్పుడును వేరుగ నుద్దేశము లేదు. అనఁగా అన్వష్టకాశ్రాద్ధము వృద్ధిశ్రాద్ధము గయాశ్రాద్ధము నాబ్దికము వీటియందు మాత్రము తల్లికి వేరుగ నుద్దేశము. తక్కినవాటిలో పతితో గూడనేయుద్దేశము.

## విశ్వేదేవులు

విశ్వేదేవులకు నామభేదముచెప్పని పార్వణశ్రాద్ధములన్నింటిలో పురూరవార్ద్రవ సంజ్ఞికులే యగుదురు. కామ్యశ్రాద్ధమందును మహాలయమందును ధురివిలోచన సంజ్ఞికు లగుదురు. నైమిత్తికశ్రాద్ధమందును నష్టమియందుఁజేయు నష్టకాశ్రాద్ధ మందును కామకాలసంజ్ఞికులు ఏకోద్దిష్టము సపిండీకరణమును నైమిత్తిక శ్రాద్ధములు. నాందీ శ్రాద్ధమందు సత్యవసుసంజ్ఞికులు. అందు గర్భాధాన పుంసవనసీమంతోన్న యనము లనియెడు సంస్కారముల కంగమగు నాందీశ్రాద్ధమును నగ్న్యాధాన సోమ యాగముల కంగమగు నిష్టిశ్రాద్ధ సంజ్ఞగల నాందీ శ్రాద్ధమందును క్రతుదక్ష సంజ్ఞికులు విశ్వేదేవులు. తండ్రియు మాతామహుఁడును జీవించియుండిరేని నాందీశ్రాద్ధ మొక్క మాతృపార్వణము నుద్దేశించి చేయునపుడు విశ్వేదేవరహితముగనే చేయునది. ఇట్లు పిత్రాది పార్వణ త్రయములో వేరు వేరు దినములందు నుద్దేశించి చేయునపుడు మాతృపార్వణశ్రాద్ధము విశ్వేదేవరహితముగనే చేయవలెను. నాందీశ్రాద్ధము మూఁ డు పార్వనములను మూఁడు దినముల నుద్దేశించి చేయవలెనని విధింపఁబడి యున్నది. లేదా యొకదినమందే మూఁడు పార్వణములు వేరువేరుగ జేయవలెననియు తంత్రముచే గలపి చేయవచ్చుననియు మూఁడుపక్షములున్నవి. ఇట్లు నిత్యశ్రాద్ధము దేవరహితముగ జేయునది. ఇట్లు సపిండీకరణమునకు బూర్వముఁ జేయు నేకోద్దిష్ట శ్రాద్ధములు దేవహీనముగఁ జేయవలెను. ఇట్లు శ్రాద్ధదేవతా నిర్ణయము.

## శ్రాద్ధమందు బ్రాహ్మణులు

జాతకర్మాది సంస్కారముచే సంస్కరింపఁబడి సత్యవాదియు శుద్ధుఁడును వేదాధ్యయనము జేసినవాఁడు యజనాదిషట్కర్మపరుఁడును మూఁడు పురుషాంతరము

లచే బ్రసిద్ధుఁడగువాఁడు బ్రాహ్మణుఁ డనఁబడును. ఇది బ్రాహ్మణులకందరకును లక్షణము. అందుత్తమ మధ్యమాధమభేదముచే మూడు విధములు. అందుత్తములు, 'వేదాధ్యయన సంపన్నా వేదాంగా ధ్యాయినొపి చ, యేవైయా కరణా యేచమీ మాం సాధ్యయనే రతాః, పౌరాణికశ్చ వేదాంతీ' ధర్మశాస్త్ర రతోపిచ, ఏతేషా మపి యే పుత్రా బ్రహ్మవేత్తా తథైవచ, వేదార్థజ్ఞః కర్మనిష్ఠస్తపోనిష్ఠవ్చ యోగినః పితృమాతృ పరశ్చైవ స్వధర్మ నిరతస్తథా, శిశురప్యగ్ని హోత్రీచ సోమాది శ్రౌతకర్మవిత్, శివభక్తో విష్ణుభక్తో భార్యాయా మృతుకాలగః, గురుభక్తో జ్ఞాననిష్ఠ ప్సోమయాజీ చ సత్యవాక్, సుశీల స్స్నాతకయితి బ్రహ్మచారిణ ఉత్తమాః' అనఁగా వేదముగాని వేదాంగములు గాని చదివినవారును వ్యాకరణము మీమాంసయు జదివినవారు పురాణజ్ఞులు వేదాంతము పఠించినవారు ధర్మశాస్త్రజ్ఞులు నట్టివారి పుత్రులును బ్రహ్మజ్ఞానము గలవారు వేదార్థము దెలిసినవారు కర్మనిష్ఠులు దపోనిష్ఠులు యోగులు పితృభక్తులు స్వధర్మ నిష్ఠులు బాలుఁడైనను నగ్నిహోత్రి సోమము మొదలగు శ్రౌతకర్మను దెలసినవాఁడు శివభక్తుఁడు విష్ణుభక్తుఁడు జానియు సోమయాజియు సత్యవాదియు సుశీలుఁడు స్నాతక వ్రతస్థుడు యతియు బ్రహ్మచారియు వీరు బ్రాహ్మణోత్తములు. వీరు పిన్న వయసు మొదలగు ధర్మములు గలిగిన పిండత్వము యోని సంబంధము శిష్యత్వము మొదలగు వావులు లేక గృహస్థులైనచో బత్నీ సహితులై కుష్టనపస్మారము మొదలగు దోషములు లేనిచో నుత్తములు అందు సపిండత్వ మనఁగ దశాహాశౌచము మొదలు స్నానము వరకు నిమిత్తమైన సాపిండ్యసగోత్రత్వ సోదకత్వాదులు గ్రహించు నది. యోని సంబంధ మనఁగమేనమామ మామ స్యాలకుఁడు మొదలగు వావి యుండుట, ఆదిపదముచే గురుత్వము పర్యాయత్వము మిత్రత్వము మొదలగునవి. కాఁబట్టి సపత్నీకత్వాది గుణములు గలవారును చెప్పినట్లు వావిలేనివారును నపస్మారాంధత్వాది దోషహీనులు వేదాధ్యాయి మొదలగు నిరువదేడు విధముల వారుత్తమ విప్రులని సిద్ధము అందు విశేషము:– 'యద్యేకంభోజయేచ్ఛ్రాద్ధే ఛందోగంతత్ర పూజయేత్, ఋచోయ జూంషి సామానిత్రితయంతత్ర విద్యతే' అనఁగా శ్రాద్ధమందొక్కనికి ఋస్సామములు మూఁడునచట యున్నవి. 'ఋగ్వేదినం చ పిత్రర్థేయా జుషంతు పితామహే, ప్రపితాహే సామగంచ భోజయేచ్ఛ్రాద్ధకర్మణి, అథర్వవేదినం వైశ్వదేవే పిత్ర్యే చ భోజయేత్' అనఁగా ఋగ్వేదిని బితృస్థానమందును యజుర్వేదిని పితామహ స్థానమందును సామవేదిని బ్రపితామహస్థానమందును నథర్వ వేదిని విశ్వేదేవ స్థానమున గాని పితృస్థానమునగాని నిమంత్రింపవచ్చును. అని యిట్లుండుటచే, 'స్వశాఖీయ ద్విజాభావే ద్విజానన్యాన్ నిమంత్రయేత్'అని. అనఁగా కన్యకనిచ్చుట కర్హమైనకులము వారు హవిస్సున కర్హులను నియమముచే యోని సంబంధము గలవారలే పరశాఖీయులు శ్రాద్ధార్హులు అని చెప్పుదురు గాని యది నిర్మూలము. కొందరు శ్రాద్ధకర్తకు సగోత్రులు సమానప్రవరులు వర్జింపఁదగువారు. 'పితృపుత్రౌ భ్రాతరౌద్వానిరగ్నిం గుర్విణీపతిం, సగోత్ర ప్రవరం చైవ పర్జయే చ్ఛ్రాద్ధ కర్మణి' యని నిషేధమున్నదనిరి. వినామాంసేన మధునా వినా దక్షిణయాశిషా, పరిపూర్ణం

భవేచ్ఛ్రాద్ధం యతిషు శ్రాద్ధభోజిషు' అనఁగా శ్రాద్ధమందు యతికి భోజ నము పెట్టినయెడ మాంసము తేనెయు దక్షిణయు నాశీసునక్కరలేకుండఁగనే శ్రాద్ధము పూర్ణమైపితృతృప్తిజేయును. అనఁగా యతిభోజన మంతప్రశస్తమనుట.

మధ్యమ విప్రులు :– మాతామహుఁడు మేనమామ మేనల్లుఁడు దౌహిత్రుఁడు జామాత యనఁగ నల్లుఁడు గురువు శిష్యుఁడు యాగము చేయింపఁబడుటకు యోగ్యుఁడనగ యాగకర్త ఋత్విక్కనగ యాగము చేయించువాఁడు. శ్వశురుఁడనఁగ కన్యనిచ్చినమామ. స్యాలకుడనఁగ భార్యకు సోదరుఁడు. మేనత్తకొడుకు పినతల్లి కొడుకు మేనమాకొడుకు అతిథిసగోత్రుఁడు మిత్రుఁడు ననువీరు మధ్యములు. దౌహిత్రుఁడు నల్లుఁడు మేనల్లుఁడు మొదలగువారు విద్యాదిగుణవంతులై రేని శ్రాద్ధమందు వారి నిమంత్రింపకుండినచో దోషము. గుణహీనులైనచో దోషములేదు. 'షడ్భ్యస్తు పురుషేభ్యోర్వాక్ శ్రాద్ధార్హానైవగోత్రిణః, షడ్భ్యస్తు పరతోభోజ్యా అలాభే గోత్రజా అపి' అనఁగా నారుపురుషాంతరములలోగా సగోత్రులు శ్రాద్ధనిమంత్రణమున కర్హులు గారు. అటుపై వారు సగోత్రులైనను బ్రాహ్మణాభావమందు నిమంత్రణమున కర్హులు. ఇక్కడ విశేషము:– ఋత్విక్కు సపిండులసంబంధులు శిష్యులును విశ్వేదేవస్థానమందు నిమంత్రించవలెను. పితృస్థానపమందు గూడదు. ఇట్లన్యులును విద్యాదిగుణహీనులు విశ్వదేవస్థానమందు నిమంత్రించుట కర్హులు. ఇట్లు వచనము– "పితాపితా మహోభ్రాతా పుత్రోవాథ సపిండకాః, నపరస్పరమర్ఘ్యాస్యు ర్న్రశ్రాద్ధే ఋత్విజస్తథా, వైశ్వదేవేనియోక్తవ్యా యద్యేతే గుణవత్తరాః" అని. అనఁగా తండ్రి, తాత, సోదరుఁడు, పుత్రుఁడు, సపిండులును పరస్పరమనఁగ నొకరిచే నొకరర్చనకు శ్రాద్ధమందుదగరు. అట్లు ఋత్విక్కులును దగరు. ఒకవేళ వీరు గుణవత్తరులైరేని వైశ్వదేవస్థానమందు నిమంత్రింపవచ్చును.

వర్జింపవలసిన విప్రులు:– క్షయరోగము, శ్వాస, మూత్రకృచ్ఛ్రము, భగందరము మొదలగు మహారోగములు గలవారు, అవయవ లోపముగలవాఁడు నారవ్రేలు మొదలగు నధికాంగము గలవాఁడు, నొకకన్ను గుడ్డియగువాఁడు, చెమిటివాఁడు, మూఁగవాఁడు, శత్రువుఁడు, జూదరి, కూలికి నధ్యయనముఁ జెప్పువాఁడు, మిత్రద్రోహి, చాడీలు చెప్పువాఁడు, పుప్పిగోళ్లవాఁడు, నల్లనిపళ్లుగలవాఁడు, నపుంసకుఁడు, మాతృపితృగురువుల నతిక్రమించువాఁడు, దొంగ, నాస్తికుఁడు, పాపి, విహిత కర్మను విడిచినవాఁడు, నక్షత్రముఁజెప్పి జీవించువాఁడు, వైద్యుఁడు, రాజభృత్యుఁడు గాయకుఁడు, వ్రాతచే జీవించులౌకికుఁడు, వడ్డిచే జీవించువాఁడు, వేద మమ్ము వాఁడు, కవిత్వముచే జీవించువాఁడు, దేవార్చనముచే జీవించువాఁడు, నటుఁడు, గృహ దాసుఁడు, సముద్రమందు తిరుగుచు వ్యవహారముచే జీవించువాఁడు, శస్త్రము చేయువాఁడు, సోమము నమ్మువాఁడు, పక్షులఁ బెంచువాఁడు, పరివేత్తయన జ్యేష్ఠుని కంటె మున్ను వివాహమైనవాఁడు, మారు మనువు (అనఁగ పునర్వివాహిత) దాని వివాహమాడినవాఁడు, బడి చదువు జెప్పువాఁడు, పుత్రునియొద్ద విద్యఁజదివినవాఁడు, ద్రవ్యమునకై వేదపారాయణముఁ జేయువాఁడు, గ్రామపురోహితుఁడు, రోమ

సంబంధమైన కంబళలు మొదలగునవియు పశువులు విక్రయించువాఁడు, చిత్ర పటములు మొదలగు శిల్పములు చేయువాఁడు, తండ్రితో నతివాదము చేయువాఁడు, శూద్రులకు యాజకుఁడనఁగ హవ్యకవ్యములు చేయించువాఁడు, జటాధారియు, మీసములేని పేడియు, దయారహితుఁడు, రజస్వలకు భర్తయగువాఁడు, గర్భిణీ పతియు, కుంటివాఁడు, వామనుఁడు, నెఱ్ఱనినేత్రములుగలవాఁడు, క్రయ విక్రయము లచే జీవించువాఁడు, చినిగిన పెదవిగలవాఁడు, భేదింపఁబడ్డ లింగమువాడు, అనగా ఖొజ్జాగడుపు లనఁగ దేహమందు కాయలు కందులు నలిగిగలవాఁడు, జర్వముగల వాఁడు, గుడిపూజారి, భార్యలేనివాఁడు, నగ్నిలేనివాఁడు, శూద్రునిగురువు, శూద్రుని శిష్యుఁడు, దంభముగలవాఁడు, గోవుల నమ్మెడువాఁడు, రసద్రవ్యము లమ్మువాఁడు,వేదనిందకుఁడు, వృక్షములు మొలవేసి జీవించువాఁడు, సదా యాచకుఁడు, కృపణుఁడు, వ్యవసాయమనఁగ భూమిదున్నుకొని జీవించువాఁడు, సజ్జనులచే నిందితుఁడు, గొఱ్ఱెలు పోతులు మొదలగునవి పోషించువాఁడు, నెఱ్ఱనికొప్పుగలవాడు, వేదము మరచినవాఁడు, పరుషవచనమునే పలుకువాఁడు మొదలగు విప్రులు హవ్య కవ్యములందు నిమంత్రించుటకుఁదగరు. అందు వైద్యుఁడు ధర్మార్థముగ నౌషధములు చేసినను నిషిద్ధుఁడే. మఱియు దేవతలకుఁడనఁగా "దేవార్చన పరోనిత్యం విత్తార్థీ వత్సరత్రయం, అసౌ దేవలకోనామ దేవస్వగ్రాహకోఽపిచ, వర్జనీయస్సవిజ్ఞేయ స్సర్వ కర్మసు సర్వదా" అనఁగామూఁడు సంవత్సరములు దేవార్చనము ధనమునకై చేసెనేని దేవలకుఁడగును. మఱియు గుడిపూజజేయుచు దేవధనము హరించు పూజానియు దేవలకుఁడే ఉభయులు నిషిద్ధులే. ఇక్కడ దేవతార్చనమనఁగ మనుష్యులు ప్రతిష్ఠఁ జేసిన ప్రతిమాలింగాదుల పూజించి ద్రవ్యము గ్రహించువాఁడని తోఁచు చున్నది. ఇఁక పరివేత్తకు నిషేధము జ్యేష్ఠునియనుజ్ఞచే వివాహాడువాని విషయము గాదు. మఱియు 'జ్యేష్ఠాయాం యద్యనూఢాయాం కన్యాయా ముహ్యతేతు యా, నాచాగ్రేదిధిషూర్జ్ఞేయా పూర్వాతుదిదిషూర్మతా' అనఁగా జ్యేష్ఠకన్యకు వివాహము గాకమున్ను గనిష్ఠకన్యకు వివాహమైనచో నది యగ్రేదిధిషువు. జ్యేష్ఠకన్య దిధిషు వనఁబడును. దానిభర్తయు నిచ్చుట నిషిద్ధుఁడే. మరియు ప్రతిమా విక్రయం యోవై కరోతి పతితస్తు సః, జీవనార్థాం పరాస్థీని నయతే పతితస్స చ అనఁగా దేవతా ప్రతిమలు మొదలగునవి యమ్ముువాఁడును జీవనమునకై శవము నెముకలు తీర్థము నకు తీసుకొనివెళ్ళువాఁడును పతితు లనఁబడుదురు. వీరును నిషిద్ధులే. గానము నృత్యము జీవనార్థమైనచో నిషిద్ధము. భగవద్భక్తిచే జేసెనేని నిషేధమే లేదు. యీ ప్రకరణమందుఁ గ్రహింపఁ దగిన బ్రాహ్మణులఁ జెప్పుటచేతనే వర్జింపఁదగినవారు తెలియఁబడుచున్నను దిరుగ నిషిద్ధులను జెప్పుట యెందు నిమిత్తమనిన వీరు తప్ప దక్కినవారు నిర్గుణులైనను గ్రహింపవచ్చునని విధించుటకొరకని తెలియునది. మరి యును; విద్యయు శీలము మొదలగు విశేషగుణములున్నచో గుష్ఠరోగము పుప్పిగోరు మొదలగు శరీరదోషము లున్నను నిషేధములేదు. గయలో నచ్చటి గయావళీలు నిర్గుణులైనను వారినే శ్రాద్ధమందు నిమంత్రింపవలెను. ఏమనిన; "నవిచార్యం కులంశీం విద్యాచతప

ఏవచ, పూజితైస్తైస్తు సంతుష్టా దేవాస్స్వ పితృగృహ్యకాః, బ్రాహ్మణాన్నపరీక్షేతే తీర్థక్షేత్ర నివాసినః" అని. అనఁగా దీర్థములందును క్షేత్రములం దును నివసించుబ్రాహ్మణులను బరీక్షింపఁగూడదు. వారియందు గులము శీలము విద్య తపస్సు మొదలగునవి విమర్శింపనక్కరలేదు. వారిని పూజించిన మాత్రముచే దేవతలును బితృదేవతలు దమవారందరు తృప్తులగుదురని వచనమున్నది.

ఇఁక సామాన్యముగ బ్రాహ్మణపరీక్షయే గూడదని వచనము. యెట్లనిన; "న బ్రాహ్మణంపరీక్షేత దైవే కర్మణి ధర్మవిత్, పిత్ర్యేకర్మణితు ప్రాప్తేపరీక్షేత ప్రయత్నతః" అని యున్నదిగాని యది బ్రాహ్మణోత్తములు సంభవింపనియపుడని గ్రహింపవలెను. మఱియు, "గాయత్రీ సారమాత్రోఽపి వరం విప్రస్సుయంత్రితః, నాయంత్రిత శ్చతుర్వేదీ సర్వాశీ సర్వవిక్రయీ." అని. అనఁగా గాయత్ర్యుపదేశము మాత్రమే సారము గలిగినప్పటికిని సదాచారముగ నియమముగలిగి నడచు విప్రుఁడు శ్రేష్ఠుఁడు. మఱి నాల్గువేదములు చదివినను నంతటను విధినిషేధము లుపేక్షించి తినువాఁ డును నిట్లన్నియు విక్రయించువాఁడును నయోగ్యుఁడని హేమాద్రియందు వ్యాసవచన మున్నది. "శ్రాద్ధే కాణాదయో భోజ్యా మిశ్రితా వేదపారగైః" అనఁగా కన్నుగుడ్డి మొదలగు శరీరదోషము లున్నవారు కొందరు సంభవించినచో వేదవేత్తలైన విప్రులతో గలపి శ్రాద్ధములో బెట్టినను దోషము లేదు. బ్రాహ్మణులను నిమంత్రణము చేయక మున్నే శోధింపవలెను. అటుపైని గూడదు. ఇట్లు బ్రాహ్మణవిచారము.

## శ్రాద్ధార్హద్రవ్యములు

ఇందు గ్రహించుటకు కాలము మంత్రము దర్భలలో భేదములును ద్వితీయ పరిచ్ఛేదమందుఁ జెప్పఁబడినవి. ఇక్కడ విశేషము చెప్పఁబడును. కుశలు ముఖ్యములు. అవి దొరకనిచో రెల్లుదూర్వలు వట్టివేళ్లు తృణములు మొదలుగ గ్రహింప వచ్చును. అపుడు రెల్లు దూర్వలు వీనిచే బవిత్రము ధరించి యాచమనముఁ జేయఁ గూడదు. "ద్వాభ్యామనామికాభ్యాంతు ధార్యే దర్భ పవిత్రకే, ఏకానామి కయా వాపి ద్వయోర్మధ్యేతు పర్వణోః" అనఁగా దర్భ పవిత్రములు. రెండుచేతల ననామికలను వ్రేళ్లయందు రెండు ధరింపవలెను. లేదా కుడిచేతి యనామికయందైనను రెండు గుంపుల మధ్యమందు ధరింపవలెను. "సాగ్రౌ విదర్భౌతు కుశౌ కార్యం తాభ్యాం పవిత్రకం, ద్వాభ్యాం తత్స్యాచ్చతుర్భిర్వా గ్రంథియుక్తం నవాభవేత్." అనఁగా నగ్రములతో నున్నదియు గర్భమందు మరియొక రేకులేకున్నవియు నగు రెండుదర్భలచేగాని నాల్గింటిచేగాని పవిత్రము ముడితోనైన నది లేకుండఁగనైనఁ జేయవచ్చును. "స్నానే దానే జపే హోమే స్వాధ్యాయే పితృకర్మణి, సపవిత్రౌ సదర్భౌవా కరౌ కుర్వీతనాన్యథా, బ్రహ్మగ్రంథి పవిత్రాఢ్యో నాచామేచ్ఛ బుధస్సదా." అనఁగా స్నానము దానము జపము వేదాధ్యయనము పితృకర్మయుఁ జేయునపుడు పవిత్రములు రెండు చేతుల ధరించియే చేయవలెను. ముడివ్రేసిన పవిత్రము ధరించి యాచమనముఁ జేయఁగూడదు. కొందరు ముడివ్రేసిన పవిత్రము లేకున్నపుడు కొసలు గలిగిన రెండుదర్భలు కుడిచేతను నెడమచేతను రెండుగాని మూఁడుగాని దర్భలు ధరింపవలెనంద్రు. ఆసనార్థము

రెండు దర్భలు. పితృకర్మయందు మూలములతో గూడిన నాల్గుదర్భలు దైవకర్మ యందగ్రములుగల పిన్ననిదర్భలు. పితృకర్మ యందైనను సపిండీకరణము పర్యంతము దర్భలు ఋజువులుగానే యుండవలెను. అటుపైని ద్విగుణముగాను ముడిడినవిగాను నుండవలెను. 'యేచపిండా శ్రితాదర్భా యైఃకృతం పితృతర్పణం, మల మూత్రోత్సర్గ కాలే మలమూత్రాద్య మేధ్యగాః, మార్గేబిడా యజ్ఞభూమౌ స్థితాయే స్తరణాసనే, బ్రహ్మయజ్ఞేన యేదర్భా స్త్యాగార్హా స్సర్వఏవతే." అనఁగా పిండములకై వినియోగించినవి పితృతర్పణమందు వినియోగమైనవియు మలమూత్రోత్సర్గము లందు చేతనున్నవియు మలమూత్రములు మొదలగు నశుచివస్తువుల నంటినవియు మార్గమందుఁ బడి యున్నవి. శ్మశానమందున్నవి యజ్ఞ భూమియందుఁబడియున్నవి. అగ్ని పరిస్తరణము నకు నాసనార్థము వేసినదియు బ్రహ్మయజ్ఞమునకు వినియోగించి నవియు నగుదర్భలన్నియు విడువఁదగినవి. 'అన్యానిచ పవిత్రాణి కుశదూర్వాత్మకాని చ, హేమాత్మత పవిత్రస్య కలాం నార్హంతిషోడశీం.' అనఁగా కుశలు దూర్వలు మొదలగు వానిచే జేయఁబడిన పవిత్రములన్నియు బంగారుచే జేసిన పవిత్రమునకుఁ బదియారవయంశమునకు సరిరావు. అయిదు గురిగింజలయెత్తు గలమాషములు పదారుయెత్తున బంగారుచే బవిత్రముఁ జేయవలెనంద్రు.

## శ్రాద్ధమందు హవిస్సు

వ్రీహిధాన్యము యవలు గోధుమలు చామలు కొఱ్ఱలు పెసలు నావాలును శ్రాద్ధమందుఁ బ్రశస్తములు. సెనగలు వైకల్పితములు. జొన్నలును వికల్పితములే. 'ఇష్టాపూర్తే మృతాహెచ దర్శవృద్ధ్యష్టకాసు చ, పాత్రేభ్యస్తేషు కాలేషు నైవదేయం కుభోజనం' అనఁగా దైవకార్యములందును తోటలు చెరువులు, వీటిప్రతిష్ఠలు మొదలగు బూర్తకర్మలందును మృతతిథియందును దర్శశ్రాద్ధము వృద్ధిశ్రాద్ధము నష్టకా శ్రాద్ధములందును పాత్రమైన బ్రాహ్మణులకు దుష్టమైన భోజనమియ్యగూడదు. 'అగోధూమంచ యచ్ఛ్రాద్ధం మాషముద్గవి వర్జితం, తైలపక్వేన రహితంకృతమప్యకృతం భవేత్' అనఁగా గోధుములు, మినుములు, పెసలు, తైలముచే వండిన భక్ష్యము నివి లేకుండఁగ జేసిన శ్రాద్ధము చేయనట్లు వ్యర్థమగును. 'రాజమాషాశ్చనిష్పావా అపి శస్తాస్సతీనకాః' అనఁగా బొబ్బరలు ననుములు సతీనకములనఁగ మఠాణీలు నివి ప్రశస్తములు. అనటిపండ్లు మామిడిపండ్లు, పనసపండ్లును, మూఁడు విధములగు కర్కటీఫలము, దోసపండ్లు, బీరకాయయు ప్రశస్తములు. కొత్తిమీరి, వైకల్పికము, జేదుపొట్లకాయ, రేగుబండ్లును, సిరికెపప్పు, ఖర్జూరము, చింతపండు, నల్లము, శొంఠి, మూలకము, ద్రాక్ష, లవంగము, ఏలకులు, జాపత్రి, జీలకఱ్ఱ, యింగువ, దానిమ్మపండు, చెరుకు, చెక్కర, బెల్లము, కర్పూరము, సైంధవము, సాముద్రము నగు రెండువిధములయుప్పు, పోకచెక్కలు, తమ్మలపాకులు నివి శ్రాద్ధమందు విధింపఁ బడిన హవిస్సులు. ఆవుపాలు వాటిపెరుగు, నేయి, యావుది గేదెది గూడ గ్రహింప వచ్చును. కొందరు గేదె పెరుగుగూడ తరచి వెన్న తీయకుండునది గ్రాహ్యమంద్రు. కొందరు గేదెపాలు సహితము శర్కరగలపి గ్రహింపవచ్చునంద్రు. నీళ్ళుపోసి కలపకయే

పెరుగును గ్రహింపఁగూడదు. నిమ్మపండ్లు వైకల్పికము. (అక్షోటకమనఁగ నగురోట) అని ప్రసిద్ధమగు గింజలపలుకులు. శృంగాటమనఁగ శింఘాణాపిండి యుత్తరదేశ మందు ప్రసిద్ధము. చిర్భటమనఁగ ఖర్బూజాపండు ఇదియు నక్కడనే ప్రసిద్ధము. శీతకందలీ యనఁగ తారాళియని ప్రసిద్ధము. ఇవి శ్రాద్ధమందు విహితములు. ఆమ్రాతక మనఁగ సంబాదాపండ్లు. తండులీయకమనఁగ చిర్రికూర. యివి వైకల్పిక ములు. కొందరనుములును నల్లపెసలు నల్లబొబ్బరలు కూడదనియంద్రు. "కథం చిద్యది విప్రేభ్యో నదత్తం భోజనేమదు, పిండాస్తునైవదాతవ్యాః కదాచిన్మధునావినా, అక్షతా గోపశుశ్చైవ శ్రాద్ధేమాంసం తథామధు, దేవరాచ్చ సుతోత్పత్తిః కలౌ పంచవివర్జ యేత్" అని. అనఁగా నెటులైనను భోజనమందు బ్రాహ్మణులకు మధువు నీలేకపోయి నను పిండదానము మాత్రము మధువులేకుండఁగ జేయఁగూడదని మొదటివచన మున కర్థము. రెండవదానిలో నక్షతయనఁగ నొక వరునికిచ్చిన కన్యను రజస్వల గాకమున్న మరియొనికిచ్చుటయు, గోపశువనఁగ గోమేధము మొదలగువాటిలో గోవును జంపుట శ్రాద్ధమందు మాంసమును మధువునిచ్చుట మరదివల్లనియోగింపఁ బడి సంతతిగనుటయు నీయైదును గలియందుఁ గూడదని యిట్లు వచనద్వయముచే మధువునకు విధినిషేధము లుండుటచే నిక్కడ మధుశబ్దము మద్యపరమని తోఁచు చున్నది. కనుక మధువున కైచ్ఛికవికల్పము కొందరు "యథాచారం ప్రదేయంతు మధు మాంసాదికం తథా" అని. అనఁగ దేశకులాద్యాచారము చొప్పున మధుమాంసా దిక మీయవచ్చునని విధియున్నందున దేశాచారము ననుసరించి విధియు (నిషేధము) నాచరింప వచ్చునని (వ్యవస్థిత) వికల్పముఁ జెప్పుదురు. మరియేమనిన; మాంసము శ్రాద్ధమందుఁబెట్టఁగూడదు. ఏమనిన; కలివర్జ్యములలో మాంసము నిషేధింపఁ బడినది. మఱియును 'నదద్యాదామిషం శ్రాద్ధే న చాద్యా ద్ధర్మ తత్త్వవిత్' అని మాంస శ్రాద్ధనిషేధము. శ్రీభాగవతమందుఁగూడ నున్నది. మఱియు నిట్లు ముంజాతసేవ్యము కసేరువు కాలాగురు మొదలగు ద్రవ్యములు ననేకములు మహానిబంధములందుఁ జెప్పఁబడినది. అని ప్రసిద్ధములు గాకుండుటచేతను శ్రాద్ధమందుపయోగము నపేక్షయు వాటికవశ్యము లేకుండుటచేతను నిక్కడఁ జెప్పలేదు.

## వర్జ్యములు

విచారించినచో గ్రాహ్యవస్తువులు చెప్పుటచేతనే వర్జింపవలసినది తెలియును. అయినను వాటికి విశేషదోషముఁ దెలుపుటకును చెప్పకున్నచో నిషేధము ప్రాప్తించ దనియు నిషేధ్యములఁ జెప్పవలెను. ఉత్కోచమనఁగ పన్ను కట్నము మొదలగువానిచే బ్రాప్తించినదియు పతితుడు చండాలుఁడు మొదలగువారిచ్చినదియు కన్యనమ్ముట మొదలగు వానిచే నార్జించునదియు నగు ధనము శ్రాద్ధమున నింద్యము పితృకర్మకై నీయవలెనని యాచించిన ధనముగూడ నిషిద్ధమే. ఇట్లు కందులు ఉలవలు మొసరులు కోద్రవములు (ఆళ్లు అనేధాన్యము) రాజసర్షపము లనఁగ వర్ణావాలు మర్కటములనఁ గ సస్యభేదము ఇది వర్జ్యములు.మునగ తీయగుమ్మిడి రెండువిధములైన యనఁగ సస్యభేదము ఇది వర్జ్యములు. మునగ తీయగుమ్మిడి రెండువిధములైన యనఁగ

గుండ్రనివినిడుపాటివి యగు నానబకాయలు కరమర్దమనఁగ పెద్దయోగకాయలు అల్లము, మిరియాలు, పెండలము, కుసుంభపుష్పము, గోగు, వెదురుమొలకలు, పది విధములగు నుల్లియు, వంటయుప్పులు, రక్తబిల్వము తెల్లనిదియు నల్లనిదియు నగు వృంతాకము, వంకాయ, గృంజనమనఁగా జరగడ్డలు, శ్లేష్మాతకమనఁగ నెఱ్ఱని చెట్టుబంకలును వర్జ్యములు. 'సాముద్ర సైంధవే భక్ష్యే ప్రత్యక్షం లవణేబుధైః బిడాలోచ్ఛిష్ట మాఘ్రాతం శ్రాద్ధే ద్రవ్యం వివర్జయేత్' అనఁగా సముద్రలవణము సైంధవలవణమును సాక్షాత్తుగా భుజింపవచ్చును. పిల్లి కొరికినవియు నాఘ్రాణింపఁ బడినదియు ద్రవ్యము వర్జింపవలెను. "కరీరఫలపుష్పాణి విడంగమరి చాని చ, బీజపూరం పటోలంచ శ్రాద్ధే దత్వాపతత్యధః" అనఁగా వెణుదురుచెట్టు ఫలములు పుష్పములు వాయువిడంగాలు మిరియాలు బీజపూరమనఁగ జామిపళ్లు పటోలమనఁ గ తీయపొట్లకాయలు నివి శ్రాద్ధమందుఁ బెట్టినచో నధోలోక మొందును."కృష్ణధాన్యాని సర్వాణి వర్జయే చ్ఛ్రాద్ధకర్మణి, నవర్జయే త్తిలాంశ్చైవ ముద్గమాషాం స్త థైవచ." అనఁగా తిలలు పెసలు మినుములు తప్ప దక్కిన నల్లధాన్యములన్నియు వర్జింపవలె ననుట. "దాతుర్యద్యత్ప్రియంతత్తద్దేయం నింద్యం న చేద్ధితం, అజావిమహిషీక్షీరం తద్వికారాంశ్చ వర్జయేత్" అనఁగా శ్రాద్ధకర్మకు నేయేవస్తువు ప్రియమగునో యవి యన్నియుఁ బెట్టవచ్చును. నిషిద్ధములుకాని విహితములైనవి మాత్రము బెట్టవలెను. మేక గొఱ్ఱె గేదె వీటిపాలును, వాటివికారములైన పెరుగు మొదలగునవియును నిషిద్ధములు. ఒకమారు పండుటచే భక్షించుట కర్హమైనప్పటికిని నింగువు జీలకఱ్ఱ మొదలగువాటితో సంస్కారము కొఱకు దిరుగ వండినయెడ నది నిషిద్ధము. ఇఁక రెండుమారులు వండినయెడనే భక్షణార్హమైనది నిషిద్ధముగాదని సింధువు. చేసిన పదార్థము శ్రాద్ధమున్ను రుచిజూచినచో నిషిద్ధము. మారీషమనఁగ తోటకూరగాని దాని గింజలుగాని (రాజగిరయని యుత్తరదేశమందు బ్రసిద్ధమైనవి) నిషిద్ధములు. మట్టి, జువ్వి,బొడ్డ,వెలగ, మాతులుంగ మనఁగ తురంజీ, దబ్బ, వీటిపండ్లు నింద్య ములు. ఉప్పుగలసినపాలునురాగిపాత్రలో నావుపాలును సురాసమములు. దీనికపవాదము. "పయోనుద్ధృతసారం చ పయసాసంయుతం దధి, ఘృతం చైతాని గవ్యాని నైవదుష్టాని తామ్రకే." అనఁగా మీగడ తీసివేయనిపాలును పెరుగుతో గలసిన పాలును ఘృతమును నివి గవ్యములైనను రాగిపాత్రలోనున్నవి గ్రహింప వచ్చును. పిప్పలి మిరియాలు మొదలగునవి మరియొక వస్తువుతో గలసినయెడ నిషిద్ధములు గావు. కొబ్బరికాయ వైకల్పికము. బచ్చరికూర మొదలగునవియు పులిసి పోయినచల్ల గర్భస్రావమైన గోవుయొక్కయు నీనినపైని పదిరోజులకులోగా బితికిన వియు పాలును లేడి మొదలగువాని పాలును నురుగుగట్టిన చల్ల మొదలగునవియు సాక్షాత్తుగ చేతితో వడ్డించిన నేయి లవణము మొదలగునవియు నిత్యభోజనమందు నిషిద్ధమునైన యన్నియు శ్రాద్ధమందు నింద్యములే. మాధవీ యగ్రంథమందు నీగలు మొదలగు సూక్ష్మజంతువులు పడి మృతినొందినను, కేశములు నఖములు మొదలగు నవి పడియును నిషిద్ధమైన వస్తువులు సాధ్యమైనంత మట్టుకు విడువవలెను. లేదా

యవితీసి పారవైచి కుశజలాదులచే ప్రోక్షించి భక్షింప వచ్చునని చెప్పఁబడినది. కుక్క పిల్లి యెలుక మొదలగునవి నాకినవస్తువులు సర్వదా వర్జ్యములు. మాధవీయ మందు వీటికిని ప్రోక్షణము చెప్పఁబడినది. గారెలు బూరెలు సక్తువికారములు పాయస మప్పాలు మొదలగునవి తైలపక్వాన్నములు మరియొక దినమందుఁ జేసినను పర్యుషితత్వదోషము లేదనువచనము నిత్యభోజనపరముగాని శ్రాద్ధవిషయముగాదని శిష్టులందురు కృపణుఁడు మొదలగు వారియన్నము నిత్యభోజనమందువలె శ్రాద్ధమందును గ్రాహ్యముగాదు. వారెవ్వరనిన కృపణుఁడు, చోరుఁడు, నటుఁడు, వీణచే జీవించువాఁడు, వడ్డిచే జీవించువాఁడు, నపవాదము బొందినవాఁడు, వేశ్య, వైద్యుఁడు, కోపశీలుఁడు,రంకులాడి,మత్తుఁడు,ఘాతుకుఁడు,శత్రుఁడు, జాతిభ్రష్టుడు, పతియు, బుత్రులులేనిస్త్రీ, బంగారు వస్తువులు చేయువాఁడు, స్త్రీజితుఁడు, గ్రామ పురోహితుఁడు, చెక్కడపు పనిచేయువాఁడు, బట్టలు నేయువాఁడు, నుపకృతి మరచి హానిచేయువాఁడు, బట్టలుతికి బ్రతుకువాఁడు, సోమము నమ్మినవాఁడు, చిత్తరువులు నిర్మించువాఁడు, గాయకుఁడు మొదలగువారు త్రివర్ణములలో వారైనను వారి యన్నము గ్రహింపఁ గూడదు. అందు గృపణుఁడనఁగ “ఆత్మానం ధర్మకృత్యంచ పుత్రాదారాంశ్చ పీడయేత్, లోభాద్యః పితరౌభృత్యాన్ సకదర్య ఇతి స్మృతః”అని. అనఁగా తన్ను ధర్మమును పుత్రదారాదులను దలిదండ్రులను భృత్యులను లోభియై పీడబెట్టువాఁడు గృపణుఁడని “ద్వావేవాశ్రమిణౌ భోజ్యౌ బ్రహ్మచారీ గృహీతథా, వానప్రస్థోయతిర్లింగీ నభోజ్యాన్నాః ప్రకీర్తితాః” అనఁగా బ్రహ్మచారి గృహ స్థుఁడు వీరియన్నమును మాత్రము గ్రహింపవచ్చును. తక్కిన యాశ్రమముల వారి యన్నము గూడఁదనుట. “షణ్మాసంయో సరోభుఙ్క్తే శూద్రస్యాన్నం విగర్హితం, సతు జీవన్భవే చ్ఛూద్రో మృతశ్వాచాభిజాయతే.” అనఁగానారుమాసములు శూద్రుఁడిచ్చిన యన్నము భుజించినచో జీవించియుండఁగనే శూద్రుఁడగును. మృతుఁడై కుక్కజన్మ మెత్తుననుట. మరియు ననేక ద్రవ్యములు నిబంధములందు నిషేధింపఁబడి యున్నవి. యవి విహితములఁ జెప్పుటవలన దెలియవచ్చును. కొన్నియప్రసిద్ధములు గనుక వ్రాయ లేదు. “దుర్గంధిఫే నిలంక్షా రం పకిలం పల్వలోదకం, న భవేద్యత్రగోతృప్తి ర్నక్తం యచ్చాప్యుపాహృతం, నగ్రాహ్యం తజ్జలం శ్రాద్ధే యచ్చాభోజ్యని పానజం” అనఁగా దుర్గంధము నురుగుగల జలము నుప్పునీరును బురదనీరు చిన్నగోతిలో గోవుకు దృప్తిజేయని యుదకమురాత్రిదెచ్చినదియు నీజలములు శ్రాద్ధమునకు నిషిద్ధ ములు. మరియుఁ ద్రాగకూడని కుండు మొదలగువాని జలమునట్లనే “స్నాన మాచమనం దానం దేవతా పితృతర్పణం, శూద్రోదకైర్నకుర్వీత తథా మేఘాద్వినిస్రుతైః” అనఁ గా శూద్రోదకములచేతను వర్షధారోదకముచేతను స్నానము దానము నాచ మనము దేవపితృతర్పణమును జేయఁగూడదనుట. తులసియు బిల్వము గంగా జలము నివితప్ప దక్కిన పుష్పపత్రములు జలము పర్యుషితమైనది నింద్యములగును. “దౌహిత్రః కుతపః కాలచ్ఛాగః కృష్ణాజినం తథా, రౌప్యం దర్భాస్తిలాగావః ఖడ్గపాత్రం పితృప్రియం.” అనఁగా దౌహిత్రుఁడు కుతపముహూర్తము ఛాగసాన్నిధ్యము కృష్ణా

జనము వెండిపాత్రలు మొదలగునవి. దర్భలు తిలలు గోవులు ఖడ్గమృగము కొమ్ముచే జేసిన పాత్రయు నివి పితృదేవతలకు ప్రియములనుట. అందు దిలలారణ్యకములు ప్రశస్తములు లేనిచో గ్రామ్యములును గ్రహింపవచ్చును. మేకయొక్క సాన్నిధ్యము మిక్కిలి ప్రశస్తము. కోడి, యూరబంది, పిల్లి, కాకి, శూద్రుఁడు, నపుంసకుఁడు, రజస్వలయు వీరి సాన్నిధ్య మతిమిదితము. చండాలుఁడు రజస్వల మరుగుజ్జువాడు బొల్లి గలవాఁడు నవయవలోపము నధికాంగముగలుగువాఁడు మొదలగువారు చూచినయన్నముఁ దినగూడదు. దానివిడుచుట కసంభవమగుచో మృత్తిక భస్మము హిరణ్యము మొదలగు వాని స్పర్శచే శుద్ధిజేసి భుజించునది. పావమా నీ మంత్ర ములు తరత్సంమదీమంత్రములు గాయత్రియు నుచ్చరించి ప్రోక్షించినయెడ దుష్టాన్న శుద్ధి యగును. "పాదుకో పానహౌ ఛత్రం రక్తం చిత్రాంబరం తథా, రక్తపుష్పం చ మార్జారం శ్రాద్ధభూమౌ వివర్జయేత్." అనఁగా పావలు, చెప్పులు, గొడుగు, రంగుబట్ట, యెఱ్ఱనిపువ్వులు, పిల్లి యివి శ్రాద్ధప్రదేశమందుంచఁగూడదు. మఱియు ఘంటా నాదము, గుఱ్ఱము, నుమ్మెత్తపువ్వు, శంఖము, ముత్తెపుచిప్పయు నివియు నుంచఁ గూడదు.

**శ్రాద్ధదినమందు కృత్యము:-** గోమయాదులచే భూమిని భాండములను గడుగుట గావలెను. దేవతలకు యతులకు బ్రహ్మచారులకు శిశువులకును బిండదాన మగువరకు నన్నము బెట్టకుండవలెను. మిక్కిలి బాలురకు మరియొక గృహమం దన్నముఁ బెట్టవచ్చును. తిలలంతట జల్లవలెను. మేకను గట్టవలెను. పాకమును శ్రాద్ధకర్త్తస్వయముగానే చేయవలెను. సంభవింపనిచో బత్నియు నామెలేనిచో బంధువు లును జేయవచ్చును. "సగోత్రైర్వాసపిండై ర్వా మిత్రైర్వా సుగుణాన్వితైః" అనఁగా సగోత్రులు సపిండులైన బంధువులుగాని గుణవంతులైన మిత్రులుగాని చేయవచ్చు ననుట. "పుంశ్చలీం చ తథావంథ్యాం విధవాంచాన్య గోత్రజాం, వర్జయే చ్ఛ్రాద్ధపాకార్థ మమాతృ పితృవంశజాం, నపాకం కారయేత్పుత్రీం గర్భిణీంచాపి దుర్ముఖీం." అనఁ గా జారిణియు వంధ్యయు విధవయు భిన్నగోత్రురాలు అనఁగా మాతృపితృ వంశ సంబంధములేనిదియు నగు స్త్రీలు శ్రాద్ధపాకము చేయఁగూడదు. వంశ్యస్త్రీలలో పుత్రికయు గర్భిణియు దుష్టముఖము గలదియుఁ గూడదు. "పాకభాండాని సౌవర్ణ రౌప్యతామ్రోద్భవానిచ, కాంస్యాని మృన్మయం తూక్తం నవ్యమేవ మనీషిభిః, పైత్తలం రంగజాతం చ విహితంనోన నిందితి." అనఁగా పాకపాత్రలు బంగారు వెండి రాగి కంచు వీనితోజేసినవి విహితములు. మంటికుండలు మాత్రము క్రొత్తవియే కావలెను. ఇత్తడి సత్తుపాత్రలు విధినిషేధములులేనివి. "నకదాచి త్పచేదన్న మయస్థాలీషు పైత్రుకం." అనఁగా నినుపపాత్రలలో శ్రాద్ధమునకు వండఁగూడదు. కత్తిపీట గరిటె మొదలగు పాకసాధనములు తప్ప నితరమైనకత్తులు నినుపపాత్రలు మొదలగునవి శ్రాద్ధభూమియందు చూచుటయు నిషిద్ధము. 'పక్వాన్న స్థాపనార్థంతు శస్యంతే దారుజాన్యపి' అనఁగా వండిన పదార్థములుంచుటకు దారుపాత్రలు సహితముఁ గూడును. "గృహ్యాగ్నౌతు పచేదన్నం శ్రాద్ధీయం లౌకికేపివా, యస్మిన్నగ్నౌ పదేదన్నం

తస్మిన్ హోమో విధీయతే.” అనఁగా శ్రాద్ధపాకము గృహ్యాగ్నియందైనను లౌకికాగ్ని యందైనను జేయవచ్చునుగాని దేనియందు పాకముఁజేయుదురో దాని యందే హోమముఁ జేయవలెను. అపుఁడౌపాసనాగ్నియందు బాకముఁజేయునెడ విశేషము. ప్రాతఃకాలమందు హోమముజేసి యాయగ్నిలో గొంతభాగము ప్రొయ్యిలో వ్రేసి పాకముఁ జేయునది. పాకమైనపై నాయగ్నిలో గొంత గృహ్యాగ్నిలో గలపి యందు నగ్నౌకరణవైశ్వదేవాదికము చేయునది. ఇక్కడ నిట్లు వ్యవస్థ కాత్యాయనాదు లకు గృహ్యాగ్ని యందుఁ బాకము. ఆశ్వలాయనులకుమాత్రముపచనాగ్ని యందే పాకము. ఆగ్నౌ కరణము మాత్రము ఆశ్వలాయనులకు వ్యతిషంగముచే శ్రాద్ధమైనచో గృహ్యాగ్నియందు బక్వమైన చరువుచే గృహ్యాగ్నియందే కావలెను. వ్యతిషంగము లేనిచో పాణిహోమము ఇతర శాఖీయులకు గృహ్యాగ్ని యందే యగ్నౌకరణము. విధురునికిని విచ్ఛిన్నాగ్ని గలవానికిని పృష్ఠోవిని యనువిధానముచే దిరుగనగ్ని సంపాదింపవలెను. అది పూర్వార్థమందుఁ జెప్పఁబడినది. భోజనపాత్రములు బంగారు వెండికంచు మొదలగు లోహములచే నిర్మించిన పాత్రలుగాని మోదుగు తామర యనటి మొదలగువాని పత్రములచే జేసినవిగాని కూడును.

ఇఁక నిమంత్రణము మొదలుగ శ్రాద్ధదినమందు గర్తృభోక్తృనియమములు: భుజించినయన్నము జీర్ణించువరకు గావలసినవి. స్త్రీ సంగమము పునర్భోజనము ననృతభాషణము, నధ్యయనము చెప్పుట ద్యూతము నాయాసపడుటయు భారము విహించుటయు హింసించుట దానము ప్రతిగ్రహము చౌర్యము మార్గమునడచుట దివానిద్రకలహము మొదలగునవి వర్జించుటయు నివి కర్తృభోక్తల కిద్దరికి నాచరణీ యములు. స్త్రీసంగమము శ్రాద్ధదినమందును దాని పూర్వదినమందు ఋతుకాలమ యినను వర్జింపవలెను. తాంబూలము క్షౌరము నభ్యంగము దంతధావనముఁ గర్తకు వర్జ్యములు. భోక్తలకు తైలాభ్యంగము నలుఁగు బెట్టుకొనుటయు క్షౌరమును వైకల్పిక ములు. కర్తకు భోక్తకును ముఖ్యమైన వారుణస్నానముచేతనే యధికారము గౌణ స్నానముచే గానేరదు. “శ్రాద్ధకృచ్ఛుక్లవాసాస్స్యా న్మౌనీచ విజితేంద్రియః, ఉపవాసం పరాన్నం చ ఔషధం చ వివర్జయేత్.” అనఁగా శ్రాద్ధకర్త శుద్ధవస్త్రములు ధరించి మౌనముగలిగి జితేంద్రియుఁడై యుపవాసమును పర్నాము నౌషధమును వర్జింప వలెననుట. మఱియు వస్త్రహీనత్వము మలినవస్త్రముఁగట్టుట గోచిగట్టుట, గుండారుపోయుట, పైబట్ట లేకుండుట, నీరుకావి (రంగుబట్ట) తడిబట్టయు గట్టుట రెండు పొరలుగ మడతపెట్టికట్టుట యెఱ్ఱటిబట్టఁగట్టుట కొంత గాలినబట్టకట్టుట కుట్టినబట్టఁ గట్టుట యను నీ పదునొకండు విధముల నగ్నత్వము గర్తయు భోక్తయు వర్జింపవలెను. కర్త కూర్ధ్వ పుండ్రాదితిలకము వైకల్పికము. భోక్తకు తిలకనిషేధము లేదు. చందనతిలకము మాత్రము పిండదానమునకుమున్ను కర్తకు వర్జ్యము. భోక్తకు భోజనకాలమునకుమున్ను గూడదు. దర్భలు హస్తమందుండఁగ తిలకము దానిచే నుంచుకొనగూడదు. అట్లు చేసినచో నాచమనమును దర్భత్యాగ మును జేయవలెను. విప్రుఁడు నిమంత్రితుఁడైన పైని వాని విడువఁగూడదు. ప్రమాద ముచే విడిచినచో

ప్రార్థింపవలెను. బుద్ధిపూర్వకముగ విడిచినచో యతి చాంద్రాయ ణముఁ జేయవలెను. "ఆమంత్రితస్తు యోవిప్రో భోక్తుమన్యత్ర గచ్ఛతి, నరకాణాం శతంగత్వా చండాలేష్వ భిజాయతె. ఆమంత్రితస్తు యశ్శ్రాద్ధేవిలంబం కురుతేద్విజః' దేవద్రోహీ పితృద్రోహీ పచ్యతే నరకేషు సః" అనఁగా శ్రాద్ధమందు నియమింపబడ్డ విప్రుఁడు మరియొకచోట భుజించుటకు వెళ్ళినచో దేవద్రోహము పితృద్రోహము చేసిన దోషమునొంది నరకము లలోను యాతనబొందును. మరియు నట్లు నిమంత్రితుఁడైన విప్రుడు విలంబనము జేసినను నరకము నొంద పిదప చండాలుఁడై పుట్టును. స్త్రీసంగమమును దిరుగ భోజనమును కర్తయు భోక్తయు శ్రాద్ధదినమునకంటె పూర్వ రాత్రి యందు సహితముఁ జేయఁగూడదు. "దశకృత్వః పిబేదాపో గాయత్ర్యా శ్రాద్ధభుగ్ద్విజః, సాయంసంధ్యాము పాసీత జపేచ్చ జుహుయాదపి."మఱి యేమనిన; గాయత్రి యుచ్చరింపుచు బది మారులు జలముఁద్రాగి శ్రాద్ధభోక్త సాయంసంధ్య నుపాసింపవలెను. జపించవలెను. హోమము చేయవలెను. దీనికపవాదము. "ఔపాసనాదికం హోమం నకుర్యా త్కింతు కారయేత్" అనఁగా నౌపాసనాదిహోమము స్వయముగా జేయఁగూడదు. మరియొక రిచే జేయింపవచ్చును "నిమంత్రితస్తు న శ్రాద్ధే కుర్యాద్భార్యాదితాడనం" అనఁగా శ్రాద్ధమందు నిమంత్రితుఁడు భార్యాదులతో నెవ్వరితోనైనను గలహింపఁ గూడదనుట. అపరాహ్ణసంజ్ఞగల మూఁడు ముహూర్తము లందును వృక్షఛేదము పెరుగుదరుచు టయు నెప్పుడును గూడదు. కర్త యశక్తుడైనచో బుత్రాదులు ప్రతినిధిగ జేసినను గర్తయు పుత్రాదులును బూర్వోక్త కర్తృనియమము లాచరింపక తప్పదు. "ముక్తకచ్ఛాతు యానారీ ముక్తకేశీతథైవచ, హసతే వదతేత్యర్థం నిరాశాః పితరోగతాః" అనఁగా బాకముజేయుస్త్రీ బట్టకుండారుగ గట్టినను గొప్పు విరియబోసుకున్నను మిక్కిలి నవ్వుచున్నను మిక్కిలి భాషింపుచున్నను పితృదేవతలు నిరాశులైపోదురు. "సవర్ణం ప్రేషయేదాప్తం ద్విజానాం తునిమంత్రణే, అభోజ్యం బ్రాహ్మణస్యాన్నం వృషలేన నిమంత్రితం, తథైవ వృషలస్యాన్నం బ్రాహ్మణేన నిమంత్రి తం." అనగా బ్రాహ్మణులఁ పిలుచుటకు సజాతీయుఁడై యాప్తుని బంపవలయును. శూద్రుఁడు పిలచినచో బ్రాహ్మణాన్నమైన నభోజ్యమే. అట్లు శూద్రాన్నము బ్రాహ్మణుఁడు నిమంత్రించినప్పటి కిని దినగూడదు.

## శ్రాద్ధ బ్రాహ్మణుల సంఖ్య

విశ్వేదేవులకు సమసంఖ్యయు పితృదేవతలకు విషమసంఖ్యయు గావలెను గనుక నిద్దరు విశ్వేదేవులకు ముగ్గురు పిత్రాదులకు ననియైదుగురు గావలెను లేదా విశ్వేదేవులకు నల్గురు పితృపార్వణమున కొక్కొకరికి ముగ్గురేసి చొప్పున దొమ్మండ్రును గలసి పదుముగ్గురు గావలెను. లేదా పిత్రాదులకొక్కరికి కేడ్గురు చొప్పున నిరువదైదు గురు. ఇట్లు దర్శాదికమందు బార్వణము లెక్కుఁడగును. కనుక విప్రాధిక్యమగును. కాఁబట్టి విశ్వేదేవస్థానమందిద్దరుగాని నలుగురుగాని యుంచవలెను. పితృపార్వణమం దొక్కొకరిస్థానమందు నొకనిగాని ముగ్గురగాని యైదుగురగాని యేడ్గురగాని తొమ్మండ్రు గాని యుంచవలెనని సిద్ధించినది.

"సత్క్రియారదేశకాలౌచ ద్రవ్య బ్రాహ్మనసంపదం, శౌచంచ విస్తరంహంతి" అనఁగా సత్కారమనఁగ నర్చనయు దేశకాలశోధనముద్రవ్యబ్రాహ్మణ, సంపత్తిథియు విస్తరించి ఛాందసముగ జేసినచో జెడునను పక్షముచేనైన నశక్తిచేనైనను దేవస్థానమం దొకఁడును పితృపార్వణమందొకఁడును యిద్దరే బ్రాహ్మణులు. ఇట్లు భాగవతవచ నము. "ద్వౌ దైవే పితృకార్యే త్రీనేకైకముభయత్రవా, భోజయేత్సు సమృద్ధ్యో పి నకుర్యా చ్ఛ్రాద్ధవిస్తరం." అని. అనఁగా మీఁదజెప్పినట్లు విశ్వేదేవార్థమిద్దరుగాని యొకఁడు గాని యుండవచ్చును. సంపత్తియున్నను శ్రాద్ధవిస్తరము మాత్రము చేయఁగూడ దనుట. "దేశకాలోచితశ్రాద్ధ ద్రవ్యపాత్రార్హణానిచ, సమ్యగ్భవంతినైతాని విస్తరాత్స్వ జనార్పణాత్." అనఁగా దేశమునకుఁ గాలమునకు దగినశ్రద్ధయు ద్రవ్యము పాత్రము పూజయు లెస్సయగును. విస్తరించినను స్వజనమున కిచ్చినను నట్లుగాదనుట. ఇట్లుండగ దేవార్థమిద్దరును పిత్రర్థమొకఁడు నని ముగ్గురు విప్రులను పక్షము నిర్మూల మని తెలియవలెను. "ద్వౌదైవేఽ థర్వణౌ విప్రౌప్రాఙ్ముఖా వుపవేశయేత్, పిత్ర్యేతూద ఙ్ముఖాం స్త్రీం శ్చ ఋగ్యజుస్సామవేదినః" అనఁగా విశ్వేదేవార్థమైన యిద్దరు నథర్వణ వేదులను తూర్పు మొగముగాను పితృపార్వణమందు ముగ్గురను మూఁడు వేదముల వారిని నుత్తరాభిముఖులుగాను గూర్చుండఁబెట్టవలెను. అత్యశక్తిలో నసంభవమందు నొక్క విప్రుడే యుండవచ్చును. అపుడు విశ్వేదేవస్థానమందు శివలింగముగాని సాల గ్రామముగాని యుంచి శ్రాద్ధమంతయుఁ జేయవచ్చును. "దేవాన్నంతత్షి వేదగ్నౌ దద్యాద్వా బ్రహ్మచారిణే." అనఁగా విశ్వేదేవార్థము శివలింగాదుల కిచ్చినయన్నము నగ్నియందు వ్రేల్చవలెను. లేదా బ్రహ్మచారికి భిక్ష యీయవచ్చును. ఇట్లు పితృపార్వణ మంతటికి నొక్కవిప్రుఁడే చాలు ననుపక్షము సపిండీకరణము తప్ప తక్కిన శ్రాద్ధము లందే యని తెలియునది. సపిండికరణ మందు మాత్రము పిత్రాదులకు ముగ్గురుండక తప్పదు. వృద్ధిశ్రాద్ధమందైనచో దేవార్థ మిద్దరు ప్రతిపార్వణమునకు నిద్దరేసి యని యెనమండ్రు సంపత్తియున్నచో దైవార్థము నల్గురు ప్రతిపార్వణమునకు నల్గురేసి యని తదార్గురుగావలెను. యెట్లైనను దైవపిత్ర్యస్థానములందు సమసంఖ్యగా నుండ వలెనని విశేషము. బొత్తిగా బ్రాహ్మణులు దొరకనియెడ దర్భలచే బ్రహ్మచారులుజేసి ప్రేష యనఁగ ప్రశ్నమునను ప్రేష మనఁగ నుత్తరమును దానేచెప్పుచు శ్రాద్ధమం తయుఁ జేయవలయును. అపుడు విప్రానుకూల్యము జేయుటయను ప్రత్యక్షఫలము లేకున్నను సదృష్ట ఫలము కొరకు దక్షిణనీయవలెను. ఇట్లు యతికి శ్రాద్ధమందు భోజనము పెట్టినను దక్షిణనిచ్చి కాలాంతమందు మఱియొకరి కవి యీయవలెను. లేదా పూజింపఁబడిన లింగముగాని సాలగ్రామముగాని పీఠమందే యుంచి దేవ పిత్రావాహనము జేసి శ్రాద్ధమంతయు నడపింపవలెను. అట్లు చేసెనేని వాని పితృదేవ తలు కల్పకోటిశతములు స్వర్గమందుండుదురు. విప్రులని మంత్రణము పూర్వదిన మందైనను దత్కాలమందైనను జేయవచ్చును. అట్టి విప్రులకు నియమము లపుడే వినుపింపవలెను. ఎట్లనిన; "అక్రోధనై శ్శౌచపరై స్సతతం బ్రహ్మవాదిభిః, భవితవ్యం భవద్భిశ్చ మయా చ శ్రాద్ధకారిణా." యని అనఁగా నోబ్రాహ్మణులార! మీరు నేనును

గూడ శ్రాద్ధమందు క్రోధవర్జితులమై శుచిత్వమే ప్రధానముగ బ్రహ్మవిచారమే జేయు చుండవలెనని తాత్పర్యము.

## శ్రాద్ధములకు సాధారణ పరిభాష

"నిపాత్య దక్షిణం జానుం దేవాన్ పరిచరేత్సదా, పితౄణాం పరిచర్యాతు వామజాను నిపాతనాత్." అనఁగా విశ్వేదేవుల కర్చన జేయునపుడు కుడికాలు మణిచి చేయవలెను. పితృస్థానమందెడమకాలు మణిచి చేయవలెననుట. "ప్రదక్షిణంతు దేవానాం పితౄణామప్రదక్షిణం." అనఁగా దైవక్రియ ప్రదక్షిణముగను పితృక్రియ యప్రదక్షిణముగను జేయవలెను. "పితౄణాం ద్విగుణా భుగ్నా దర్భా దైవేబుజుత్వగాః" అనఁగా పితృస్థానమందిచ్చు దర్భలు ద్విగుణముగను మణిచి యీయవలెను. దేవస్థానమందు ముడువ నక్కరలదు."దైవేతూదఙ్ముఖఃకర్తా పిత్ర్యేస్యాద్దక్షిణాముఖః" అనఁగా దేవస్థానమందు జలాదులు విడుచునపు డుత్తరాభిముఖుఁడై యుండవలెను. సంకల్పమందును క్షణమిచ్చునపుడును పాద్యము నాసనము నావాహన మర్ఘ్యదానము గంధము మొదలుగ నాచ్ఛాదనమువరకు నైదుపచారములు నిచ్చునపుడును నన్నదానమందు బిండదానమందు నంజనాభ్యం జనములందు నక్షయ్యమందును స్వధావాచనమందును పిత్రాదులకు సంబంధనామగోత్రము లుచ్చరించుట యావశ్యకము. తక్కిన చోట్ల వైకల్పికము. అపుడు సంబంధగోత్ర నామములనియు గ్రమము చెప్పవచ్చును. అందు "సకారేణ తు వక్తవ్యం గోత్రం సర్వత్రధీమతా" యని యున్నందున కాశ్యపస గోత్రయనియు కాశ్యపగోత్రయనియు వికల్పముగ పాఠము. కొందరు శాఖాభేదముచే బాఠ భేదమంద్రు. "గోత్రస్యత్వ పరిజ్ఞానే కాశ్యపం గోత్రముచ్యతే, శర్మాంతం విప్రనామోక్తం వర్మాంతం క్షత్రియస్య తు, గుప్తాంతం చైవ వైశ్యస్య దాసాంతం శూద్రజన్మనః" అనఁగా గోత్రము మరచిపోయినయెడ గాశ్యపగోత్ర ముచ్చరించునది. నామ ముచ్చరించునపుడు బ్రాహ్మణులకు శర్మాంతముగను క్షత్రియులకు వర్మాంతముగను వైశ్యులకు గుప్తాంతముగను శూద్రులకు దాసాంతముగను నుచ్చరించునది. పిత్రాదుల నామము లెఱుఁగనిచో 'పితృపితామహ ప్రపితామహ' శబ్దము లుచ్చరింపవలెను. నామము చెప్పగూడదని యాశ్వలాయనుఁడు. తక్కిన శాఖలందు పితృనామస్థానమందు 'పృథివీషత్' అనియు పితామహునికి 'అంతరిక్షసత్' అనియు ప్రపితామహునికి 'దివిషత్ అనియు నామము లుచ్చరించునది. స్త్రీలకు దాశబ్దాంతముగ 'సావిత్రీదా' యని మొదలుగ నుచ్చరింపవలెను. కొందరు దేవీశబ్దాంతమని చెప్పుదురు. మరికొందరు 'దేవీదా' యను రెండునుగలపి చెప్పుదురు. "విభక్తి భిస్తు యత్కించిద్దీయతే పితృకర్మణి, తత్సర్వం స ఫలం జ్ఞేయం విపరీతం నిరర్థకం." అనఁగావిభక్తి నియమముతో నామోచ్చారముఁ జేసిన శ్రాద్ధక్రియలన్నియు సఫలములు. అట్టినియమము లేనిచో నిష్ఫలములు. ఆ నియమమెట్లనిన; "షష్ఠీవిభక్త్యా సంకల్పః క్షణశ్చాక్షయ్య కర్మచ, షష్ఠ్యావాస్యా చ్చతుర్థ్యావాసనదాంన ద్విజాతయే, ద్వితీయయా ఉ వాహనంస్యాద్వి భక్తిస్తుచతుర్థికా, అన్నదానే పిండపూజా స్వధాస్వస్తీతి వాచనే, పిండ

దానే తు సంబుద్ధి ర్యేచత్వేత్యా దితఃపురా, తతఃపరం చతుర్థీచే త్యుభయం సర్వసమ్మతం, శేషాణి సర్వకర్మాణి సంబుద్ధ్యం తైర్యథాయథం, ఇదంతే వా ఇదంవో వా ప్రయుజ్యైవ సమాచరేత్." అనఁగా సంకల్పము క్షణమిచ్చుటయు నక్షయ్యకర్మయు షష్ఠీవిభక్తితోడనే చేయవలెను. ఆ సనమిచ్చునపుడు షష్ఠియైనను జతుర్థియైనను గూడును. ఆవాహనము ద్వితీయచే జేయవలెను. అన్నదానము పిండపూజయు స్వధాస్వస్తి యను వాచనము దీనియందుఁ జతుర్థీవిభక్తి యుచ్చరించవలెను. పిండదానమందైె నచో 'యేచత్వామను' అనుమంత్రమునకుఁ బూర్వమందు సంబోధనైకవచనమును అనంతరమందు జతుర్థి యునని రెండును జెప్పవలెను. తక్కిన క్రియలన్నియుసంబుద్ధ్యంతము యథార్థ్వము నుచ్చరింపుచుఁ జేయవలెను. ఇదంతే యనిగాని ఇదంవో యనిగాని యుచ్చరింపుచు నర్ఘ్యాదిక మీయవలెను. "సవ్యేనవైవం కర్మస్యా దపసవ్యేన పైతృకం, విప్రప్రదక్షిణం విప్రస్వాగతం చార్ఘ్యదానకం, సూక్తస్తోత్ర జపోన్నస్య పాత్రేషు పరివేషణం, ఆహ్వానమన్న స్యాఘ్రాణం తథా చ స్వస్తివాచనం, తాంబూలదాన మారభ్యా సమాప్తే రితిపైతృకం, ప్రదక్షిణా ద్యేతదుక్తం సవ్యే నైవసమాచరేత్." అనఁగా దేవార్థమైన క్రియలు సవ్యముగ ననఁగ నెడమభుజముపై నుపవీతముండఁగఁ జేయవచ్చును. పితృక్రియలు మాత్రము కుడివైపున నుపవీత, ముంచుకొని చేయవలెను. అందు విప్రులకుఁ ద్రక్షిణము స్వాగతము నర్ఘ్యదానము అన్న సూక్త స్తోత్రజపము పాత్రలందు వడ్డించుటయు ఆవాహనము నన్నము నాఘ్రాణించుటయు స్వస్తివాచనమును తాంబూలదానము మొదలుగ సమాప్తిపర్యంతమైన పితృక్రియ సవ్యము చేతనే చేయవలెను. "దేవార్చా దక్షిణాదిస్యా త్పాదజాన్వం సమూర్ధసు, శిరోం సజానుపాదేషు వామాంగాదిషు పైతృకం." అనఁగా దేవార్చనము కుడివైపు నుండి మొదలుగ పాదములు పిక్కలు భుజములు శిరస్సు పర్యంతము క్రమముగఁ జేయవలెను. పిత్రాద్యర్చనము నెడమవైపు మొదలుగ శిరస్సు భుజములు పిక్కలు పాదముల పర్యంతముగ గ్రమముతో జేయ వలెను. అక్షయ్యము నాసనము నర్ఘ్య దానమును దప్ప తక్కిన పితృక్రియలు స్వధా శబ్దాంతముగ నీయవలయును. దేవులకు స్వాహాశబ్దాంతముగ నీయవలయును. దేవతీర్థముచే విశ్వేదేవులకును బితృతీర్థముచే పిత్రాదులకును జలమీయవలయును.

## ఆచమనములు

శ్రాద్ధ మారంభించునపుడు రెండుమారు లాచమనము విప్రుల పాదములు గడగి తనపాదములగూడఁ గడగికొని రెండుమారు లాచమనముఁ జేయునది. దేవార్చనాంతమునను పిత్రాద్యర్చనాంతమందు నొక్కొక్క యాచమనము అన్న మాఘ్రాణించినపైని నొక్కయాచమనము వికిరదానమైన పైని యొకతూరిగాని, రెండు మారులుగాని యాచమనము. శ్రాద్ధాంత మందు పాదప్రక్షాళనముఁ చేసుకొని రెండు మారు లాచమనముఁ జేయునది. కొందరు భస్మమర్యాదఁ జేసినపైని కరశుద్ధి జేసినపైని నుచ్ఛిష్టము చలింపఁ జేసినపైని వొక్కొక యాచమనముఁ జెప్పిరి. ఇఁక భోక్తకు నాచమనమనవిధి. పాదప్రక్షాళనాంతమందు రెండుమారు లాచమనము, పాణిహోమాంతమం దొకటియు భోజనాంతమందు రెండునాచమనములు.

## దర్భలు

"ఆచాంతః ప్రాక్కుశాంస్త్యక్త్వా పాణావన్యాంశ్చ ధారయేత్." అనఁగా నాచమనముఁ జేయునపుడు డంతటను పూర్వముధరిచిన దర్భలువిడిచి యన్యములు ధరింపవలెననుట కనుక, "శ్రాద్ధారంభే ధృతాన్ దర్భాన్ పాద్యాంతే చ విసర్జయేత్." అనఁగా శ్రాద్ధారంభమందు ధరించిన దర్భలు పాద్యమిచ్చిన పైని విడువవలయును. ఇట్లు దేవార్చనాంతమున పిత్రర్చనాంతమున పిండశేషాఘ్రాణ మైన పైనీ వికిరదానాంతమందును శ్రాద్ధాంతమందును పూర్వమైనదర్భలు విడువవలయునని ప్రాప్తించినది. అయినను శ్రాద్ధసాగరాద్యుక్త ప్రయోగములందు పిత్ర్యర్చనాంతమందు దర్భత్యాగము చెప్పలేదు. గనుక క్వచిత్తుగా నాచమనముఁ జేసినప్పటికి దర్భలు విడువనర్కరలేదని తోఁచుచున్నది.

## ఊహమంత్ర విచారము

పితృశబ్దము బహువచనాంతమై యున్నయెడ నదియే సర్వపితృ వాచకమగును. కనుక నపుడుమంత్రములో మాత్రాదిశబ్దము లూహింపనర్కరలేదు. ఎట్లనిన; అర్ఘ్యపాత్రమందు 'పిత్ౄనిమాన్ ప్రీణయ' యను మంత్రమందు మాతృశ్రాద్ధమైనను 'మాతౄరిమాః' ప్రీణయ యని కల్పించ నక్కరలేదనుట. అయినను శుంధనమంత్రములో 'శుంధంతా పితరః శుంధంతాంపితామహా' యనియు 'శుంధంతా మాతరః ' అని మొదలుగ నూహచేయవలెను. బహువచనమందు వచనాంతర మూహింప నక్కరలేదు. మంత్రములో మొదట పూజ్యార్థకమై బహువచనమే యున్నది. 'ఋచంనోహేత్' అని నిషేధమున్నందున ఋక్కులలో నూహ చేయఁగూడదు. పిండదానమందు 'యేచత్వా మనుతేభ్యశ్చ' యను మంత్రములో మాతృశ్రాద్ధమైనయెడ 'యాశ్చత్వా మనుతాభ్యశ్చ' యని యూహింప నక్కరలేదు. ఏమనిన; పుమాంస్త్రియా యను పాణినిసూత్రముచే నేకవేషమనఁగ పుల్లింగము శేషించును. స్త్రీలకు స్త్రీలు పురుషులకు పురుషులే యనుఁగు లగుదురు గనుక యర్థబాధయు లేదనివృత్తికారులు కొందరు. 'యాశ్చత్వా మనుతాభ్యశ్చ' యని యూహను జేయుదురు. మాత్రాదు లిద్దరైనచో బిండదానమందు 'ఏతద్వావస్మన్మాతరౌ యజ్ఞ దాశ్రీ దేయేచయు వామత్రాను' అని పిండమిచ్చి 'అస్మన్మాతృభ్యాం అయంపిండః' అని మొదలుగ నూహ చేయునది. అభ్యంజన మిచ్చునపుడు 'అస్మన్మాతరౌ – అభ్యంజాథాం' అని మొదలుగను నంజనమందు 'అస్మన్మాతరౌ – అంజాథాం' అని మొదలుగ నూహింపవలెను. ఇట్లు పితామహియు ప్రపితామహియు నిద్దరేసి యున్నచో నూహించునది. ఇఁక బహ మాతలున్నచో 'ఏతద్వోస్మన్మాతరో యజ్ఞదేశ్రీదేరుద్రదేయథా, నామగోత్రాయేచ యుష్మానత్రాను' అని మొదలుగ నూహించి యొక్కొకపిండ మీయవలెను. అభ్యంజనమందు 'అభ్యద్ధ్వం'అనియు, నంజనమందు 'అద్ధ్వం' అనియు నూహించునది. ఇద్దరికి నొకటియే నామమైనచో నదియే ద్వివచనాంతముగ బహువచనాంతముగనైన నుచ్చరింపవలెను. ఇట్లర్ఘ్యదానమందును 'అస్మన్మాతరౌ'అని మొదలుగ నూహచే

సంబోధించి 'ఇదంవా మర్ఘ్యం'అనియును 'ఇదం వో అర్ఘ్యం' అనియు నూహ చేయం దగును. కనుక 'ఆయుంతునః పితరస్సోతిలోసి సోమదేవత్యో అశంతస్త్వా' యను మంత్రములందును పిండముల వనుమంత్రించుటకు వస్త్రము కొసబద్దె పోగులు వేయునపుడు ఉపస్థానమందు ప్రవాహణమందు ప్రాశనము మొదలగు వానియందు నుచ్చరించు మంత్రముల బహూవచనాంత పితృశబ్దమున్నందున నూహ యక్కర లేదని సిద్ధము. "నాప్రోక్షితం స్పృశేద్వస్తు నవదేన్మానుషీం గిరం, నచోద్వీక్షేత భుంజా నం నచైవా శ్రుణిపాతయేత్." అనఁగా జలము ప్రోక్షించక వస్తువు ముట్టఁగూడదు. మనుష్య భాషచే మాటలాడఁగూడదు. "దైవేపిత్ర్యేచ సర్వత్ర జపహోమాది కర్మసు, మౌనం కుర్యాత్ప్రయత్నేన సకలం ఫలమాప్నుయాత్, యది మౌనస్యలోపాస్స్యాజ్జప హోమార్చనాదిషు, వ్యాహారే ద్వైష్ణవంమంత్రం స్మరేద్వావిష్ణుమవ్యయం." అనఁగా దైవకార్యమందు బితృకార్యమందును జపము హోమము నర్చన మొదలగునవి చేయు నపుడితరదృష్టిమాని మౌనము ధరింపవలెను. అట్లు మౌనమునకు లోపము వచ్చిన యెడ విష్ణుమంత్రముజపింపవలెను. లేదా విష్ణువును స్మరింపవలెను. ఎట్లనిన; "యస్యస్మృత్యాచ నామోక్తాం తపోహోమ క్రియాదిషు, న్యూనం సంపూర్ణతాం యాతి సద్యో వందేత మచ్యుతం."అని. అనఁగా నామోచ్చారణము చేతను స్మృతిమాత్రము చేతను తపోహోమక్రియలయందు లోపముదీర్చు నవ్యయుఁడైన విష్ణు నమస్కరింతు ననుట. ఇట్లు శ్రాద్ధమున కారంభమందు మధ్యమందును తుదిని పఠించునది.

## ఋగ్వేదులు మొదలగువారికి సంక్షేపముగ శ్రాద్ధప్రయోగము

సవ్యముచేగాని యపసవ్యముచేగాని దేశకాలములఁ గీర్తించి యపసవ్యముచే నాయాశ్రాద్ధమున కర్తులైన పితృదేవతల షష్ఠీవిభక్తితో 'ఏతేషా మముకశ్రాద్ధం సదైవం సపిండం పార్వణవిధినా ఏకోద్దిష్టేనవా అన్నేనామేనవాహిరణ్యే నవాశ్వస్సద్యోవాకరిష్యే' యని సంకల్పించి యథాసంభవముగఁ జేయవలెను. అంతటను 'కురుష్వ' యని మొదలగు ప్రతివచనము బ్రాహ్మణులీయవలెను. అటుపైని దేవకర్మ కుచితముగ విప్రుని కుడికాలు ముట్టి 'అముక పితౄణామముకశ్రాద్ధే అముకవిశ్వదేవార్థం త్వయా క్షణః క్రియతాం' అని క్షణమీవలెను. అనఁగా నిమంత్రించవలెను 'ఓం తథా' యని విప్రుఁడు పలుకవలెను. కర్తప్రాప్నోతుభవాన్ అనినపైని విప్రుఁడు ప్రాప్నవాని యనవలెను. ఇట్లు పితృధర్మముచే నెడమకాలు ముట్టి 'అముకశ్రాద్ధే అముకస్య స్థానే త్వయాక్షణః క్రియతాం' అని నిమంత్రించుట పూర్వమువలెనే ముగ్గురికిని గావలెను. ముగ్గురిస్థానమందు నొక్కఁడే విప్రుఁడైనచో 'పితృపితామహ ప్రపితా మహానాం స్థానేక్షణః' అని నిమంత్రించునది. 'అక్రోధనైః' అని మొదలగు శ్లోకముచే ప్రార్థన. ఇక్కడ నంతటను దైవ పూర్వముగనే క్రియలు కొన్నిచోట్ల పితృపూర్వకము ముందుఁ జెప్పఁబడును. ఇట్లు సంకల్పము క్షణదానము మొదలగునది పూర్వదినమం దయినను నాదినమందయినను గావచ్చును. అటుపైని కుతపకాలమందు స్నానముఁ జేసి భోక్తలను స్నానము జేసినపైని సన్నిధికిఁ బిలువవలెను. అటుపైని దిలోదక యవోదకములు యథాచారముగఁజేసి అటుపైని సత్యముచే శుద్ధికొఱకు బ్రాయశ్చిత్తా

ర్థము సూక్తజపము ప్రదక్షిణముఁ జేయునది. 'సమస్త సంపత్సమ' యను శ్లోకముచే నమస్కారము అపసవ్యముచే నాచారముఁబట్టి యధికారవాచనము. ఆపైని సవ్యముచే నాచమన ప్రాణాయామములుచేసి యపసవ్యముచే రెండవసంకల్పము. కొందరు తత్కాలమందుఁ జేయునపుడు ద్వితీయసంకల్పముఁ జేయరు. అనంతమందు లేచి నిలచి సవ్యముచేతనే దేవస్థానమందును పితృస్థానమందును 'భవతాం స్వాగతం' అని ప్రతివిప్రుని నడుగవలెను. పూర్వమువలె రెండవక్షణదానము ఇక్కడ బహ్వృచుల నఁగ ఋగ్వేదులు గృహ్యాగ్ని గలవారయినయెడ దర్శశ్రాద్ధము నన్వష్టకాశ్రాద్ధము పూర్వేద్యుశ్శ్రాద్ధము వీనియందు మాత్రమే పిండపితృయజ్ఞముతో వ్యతిషంగముచే శ్రాద్ధకప్రయోగము. ఇతరుల కక్కరలేదు. తక్కిన శ్రాద్ధములందు నక్కరలేదు. ఆ ప్రయోగము ద్వితీయక్షణమిచ్చిన పైని పరిసమూహన మొదలు నిధ్మాధానము వరకు పిండపితృయజ్ఞ తంత్రము తుదిని పాదప్రక్షాళనము మొదలు భస్మమర్యాదాంతము గావలెను. అగ్నయందగ్నౌకరణహోమముఁ జేసి వడ్డించుట మొదలగునది. సంపన్న వచనాంతముఁజేసి పిండదానము మొదలు పాత్రోత్సర్గమువరకుఁ జేయవలెను. అటుపైని వికిరాదిశ్రాద్ధ శేషము సమాప్తిఁ జేయవలెనని యిట్లు ప్రయోగము తెలియు నది. ఇట్లు హిరణ్య కేశీయాదులకును ప్రథమసంకల్ప మైనపైని నగ్న్యుపసమాధానము నన్వాధానము మొదలుగ నాజ్యసంస్కారాంతమందు పాద్యాదిపూజఁజేసి యా యా మంత్రముల యూహతోగూడిన యగ్నౌకరణహోమప్రయోగము తెలియవలెను.

## పాద్యము

వాకిటనైనను శ్రాద్ధదేశము ద్వారమందైనను చతురశ్రముగ రెండు మూరలయి నను లొడితెడైనను నుత్తరమునకు బల్లముగ దేవమండలముఁ జేసి దానికిఁ దక్షిణము నారంగులములు వదలి యచ్చట నాల్గుమూర లుండునటుల దక్షిణమునకుఁ బల్లమగు వర్తులమైన పితృమండలము చేయవలెను. పండ్రెండంగుళములు వెడలుపైన నుండ వలెను. ఇట్లు చేయునపుడు దేవమండలము సవ్యముచేతను ప్రదక్షిణముగను పితృ మండల మపసవ్యముచే నప్రదక్షిణముగను గోమూత్ర గోమయములచే జేయవలెను. యథార్హముగ దర్భ యవతిల గంధపుష్పములచే రెండిటి నర్చింపవలెను. మండల సమీపమందు తూర్పున కభిముఖముగఁ బీఠమందుఁ గూర్చున్న విప్రుని పాదములం దుత్తరాభిముఖుఁడైనను గాని పశ్చిమాభిముఖుఁ డైననుగాని యుండి కర్త. 'అముకసంజ్ఞికా విశ్వదేవా ఇదంవః పాద్యంస్వాహా నమః' అని యుచ్చరింపుచు యవలు గంధము పుష్పములు వీనితోగూడిన జలము దోసిలితోజల్లి 'శంవోదేవీః' అను మంత్రముచే శుద్ధజలముచే పాదముల మీఁదిభాగము గడుగవలెను. క్రింది భాగము గడుగఁగూడదు. అపుడు హస్తమున బవిత్ర ముండఁగూడదు. ఇట్లు పితృమం డలమందు నుత్తరాభిముఖుఁడై పీఠమందుఁ గూరుచున్న విప్రునిపాదమందు తాను దక్షిణాభిముఖుఁడై తిలగంధాదులతో గూడిన జలము దోసిలితో బితృతీర్థముచే 'పితః అముకనామరూపగోత్ర' ఇదంతే పాద్యం స్వధానమః' అని యుచ్చరింపుచు పిత్రాదులకు ముగ్గురికి నొక్కఁడే విప్రుఁడైనచో 'పితృపితామహ ప్రపితామహా ఇందవః

పాద్య' మని యుచ్చరింపుచు 'జల్లిశంనోదేవీః' అను మంత్రముచే గడగుట పూర్వము వలెఁ జేయునది. ఇట్లు ముందుచారము లన్నిటిలో నొక విప్రుఁడైనయెడ 'ఇదంవః' అనియు ముగ్గురైనచో 'నిదంతే' యనియు నూహ తెలియునది. ఇట్లు మాతా మహాది పార్వణమందు నూహించునది. ఇక్కడ పాద్యమునకు మున్నే పాదార్ఘ్యము పాద్యోత్తరమందును గంధపుష్పాక్షతలచే పాదములు మొదలుకొని శిరస్సు వరకు నర్చించి దైవకర్మయందు 'ఏషవః పాదార్ఘ్యః' అని యుచ్చరింపుచు నిచ్చి పితృక్రియ యందును తిలలచే శిరస్సు మొదలుగ బాదముల పర్యంత మర్చించినపైని పాదార్ఘ్య మీయవలెనని చెప్పఁబడినదిగాని యది కాత్యాయనాదులకే యాచారప్రాప్తము. బహ్వృచుల కిట్లాచారము లేదు. ఆ పైని పాద్యశేషమైన గంధ యవతిలాదికము సవ్యాపసవ్యములచే మండలముపై క్రమముగ విడిచి తన పాదముల కడిగికొని పవిత్రములు విడిచి యన్యపవిత్రములు ధరించి దేవమండలమున కుత్తరమున దానును విప్రులు నాచమనము రెండుమారులు చేసినపైని శ్రాద్ధప్రదేశమునకు వెళ్ల వలెను. పాదప్రక్షాళనోదకమునకు నాచమనోదకమునకును సంసర్గము కాగూడదు. అపసవ్యముచే 'అముకశ్రాద్ధసిద్ధిరస్తు' అని విప్రులు గూడ నట్లు పలికిన పైని నంగుష్ఠము తప్ప తక్కిన వ్రేళ్ళతో గూడ విప్రునికుడిచేతుల పట్టుకొనుచు సవ్యాపసవ్య ములచే 'భూర్భువస్వః సమాధ్వం' అని యుచ్చరించి విప్రులను దర్భయుక్తమైన పీటలపై నాలస్యముచేయక కూర్చుండఁ బెట్టవలెను. అందు వైవార్తమైన విప్రుఁడు తూర్పు మొగముగాను ప్రీత్యర్థమైన విప్రుఁడుత్తరాభిముఖముగాను గూర్చుండవలెను. అసంభవమందు దక్షిణముగాక తక్కిన దిక్కుల కభిముఖుఁడు గావచ్చును.

## ఆసనములు

బంగారు వెండి రాగి వీటిచే జేయఁబడినదిగాని చిత్రాసనముగాని కఱ్ఱపీటగాని గడ్డిచాపగాని దర్భాసనముగాని యాలనము ప్రశస్తము కఱ్ఱపీటలలో శ్రీపర్ణి యనఁ గ నేరెడు, కడిమి, మామిడి, పగడ, జమ్మి, యిరుగుడు యీచెట్లబల్లలచే జేసిన పీటలు ప్రశస్తములు. ఇనుపమేకులుగల పీట శ్రాద్ధమందు వేయఁగూడదు. కాలిన దియు విరిగినదియు వ్రేయఁగూడదు. తూర్పు సమాప్తిగాను దక్షిణసమాప్తిగాను శ్రాద్ధభోక్తల సజ్జీయుండవలెను. అందు దేవార్థమాసనముగా రెండుదర్భలు తూర్పు వైపున నగ్రము లుండునట్లు వేయవలెను. పిత్ర్యర్థమైన దక్షిణాగ్రములుగా నొక్కొక్క దర్భయుంచవలెను. "ఘృతైశ్చతిలతైలైర్వాస్థాపయేత్తు ప్రతిద్విజం, దీపం సవ్యాపసవ్యా భ్యాం దీపమేకంతు సవ్యతః" అనఁగా నేతితోగాని నూనెతోగాని దీపము ప్రతివిప్రునికిని సవ్యాపసవ్యములచే నుంచవలెను. ఒక్కదీపమే యుంచునెడ సవ్యముచేతనే గావలెను. ఇది మొదలుకొని బ్రాహ్మణులు శ్రాద్ధసమాప్తి పర్యంతము మౌనము ధరింపవలెను. పవిత్రహస్తులై యుచ్ఛిష్టులనఁగ నెంగిలిగలవారు పరస్పర స్పర్శము వర్జింపవలెను. అపుడు శాస్త్రోక్తలక్షణముగల యతిథివచ్చెనేని సవ్యముచే విష్ణుస్థానమందుఁ బూజింప వలెను. సవ్యముతో 'అపవిత్రః పవిత్రోవా' యనునది పఠించి 'వైష్ణవ్యైనమః' కాశ్య ప్యైనమః, క్షమాయైనమః' అని భూమికి నమస్కరించి 'మేదినీలోక మాతాత్వం' అని

మొదలగు శ్లోకములచే స్తుతించి శ్రాద్ధభూమిని గయాక్షేత్రముగ ధ్యానించి క్షేత్రాధిపతి యగు గదాధరుని స్మరించి ప్రాచీనావీతియై 'తద్విష్ణోః పరమం పదం తద్విప్రాసో" యను మంత్రములను గాయత్రిని జపించి సవ్యముచే ప్రాణాయామము తిథ్యాదుల కీర్తనముఁజేసి యపసవ్యముచే 'అముకపితౄణా ముపక్రాంతమ ముక శ్రాద్ధం కరిష్యే' యని సంకల్పించి యపుడాదియందు మధ్యమందు నంతమందును 'దేవతాభ్యః పితృభ్యశ్చ, ఆమూర్తానాంచ మూర్తానాం, చతుర్భిశ్చ, యస్యస్మృత్యా' అనునివి ముమ్మారు పఠింపవలెను. అటుపైని తనకుక్షి యెడనైనను గుడిపార్శ్వమందయినను తిలలతో మూఁడుదర్భలు పైఁబట్టి చెంగునగట్టి మొలకు సరిపడి మిగిలిన వస్త్రభాగ ముచే జుట్టి రక్షణమనఁబడు నీవీబంధము 'నిహన్మిసర్వం యదమేధ్యవద్భవేత్' అను శ్లోకమంత్రముచే బిగించవలెను. అంతట నపసవ్యముచే 'నపహతా'అసురా యను మంత్రముతో తిలలుజల్లవలెను. తరత్సమందీసూక్తము పావమానీమంత్రములు పఠించి యభిమంత్రించిన జలముచే బాకద్రవ్యములఁ బ్రోక్షించునది. లేదా 'తద్విష్ణో' యను మంత్రముచే గాయత్రిచేతనునభిమంత్రించిన జలముఁ జల్లవలెను. ఇతర శాఖీయులు 'యద్దేవా' యను మూఁడు మంత్రములచే నభిమంత్రింతురు. దానిచే బ్రోక్షించియే పుష్పాదులు గ్రహింతురు. పదార్థములకు శ్రాద్ధయోగ్యతను చెప్పించి విశ్వేదేవుల యర్చనముఁ జేయునది. అపుడు ప్రతియుపచారమందు నాద్యంతముల దైవార్చనమందును పిత్ర్యర్చనమందును శుద్ధోదక మిచ్చుచుండవలెను. అపుడు దేవార్థ మైన విప్రసన్నిధి నుత్తరాభిముఖుఁడై గూర్చుండి యతని కుడిహస్తమును దన యెడమ చేతితో వెతికిలనుండునట్లు పట్టుకొని తనకుడిచేతిచే యవలలో రెండుదర్భలు 'అముకే షాం విశ్వేషాం దేవానాం భూర్భువస్వరిదమాసనం స్వాహ'యని పలికి హస్తమందు జలమునుంచి కుడివైపున దర్భలాసనముగ వ్రేయవలెనుగాని హస్తమందు దర్భలనీయఁగూడదు. అట్లు వచనము "ఆసనే ష్వాసనం దద్యాన్నతు పాణౌకదాచన, పితృకర్మణి వాముచ దైవేదద్యాత్తుదక్షిణే."యని అటుపైని విప్రుఁడు 'ధర్మోసివిశిరాజా ప్రతిష్ఠితః' అనుమంత్రముచే బ్రతిగ్రహించి 'స్వాసనం' అని యుచ్చరింపవలెను. అటుపైని కర్తయాసనము స్పృశింపుచు నుదకమునిచ్చి 'ఆస్వతాం' అనిన విప్రుఁడు 'ధర్మోఽసి' యనవలెను. ఉదకమిచ్చి 'దైవేక్షణః క్రియతాం' అని యతనిచేయి యంగుష్ఠము విడిచి పట్టుకొనవలెను. అటుపై విప్రుఁడు 'ఓంతథా' యని మీఁదఁ జెప్పినటుల నుచ్చరించునది. యిది మూఁడవనిమంత్రణము.

## అర్ఘ్యము గల్పించుట

అందు పాత్రలు బంగారు వెండి రాగి కంచు మొదలగు లోహములచేగాని మోదుగు మొదలగు పత్రములచేగాని కఱ్ఱచేగాని నిర్మించినపాత్రలు, లేక శంఖములు ముత్తెపుచిప్పలు ఖడ్గపాత్రములు నర్ఘ్యమునకుఁ బ్రశస్తములు. ఇక్కడ దేవార్థము విప్రుఁడొకఁడైనను నిద్దరైనను నల్గురైనను నర్ఘ్యపాత్రములు రెండే యుంచవలెను. 'దైవేపిత్ర్యేచైకైకంవా' యనుపక్షమశక్తివిషయము. ఇట్లు రెండర్ఘ్య పాత్రలును బ్రోక్షించిన భూమియందు తూర్పున కగ్రములుగనుంచిన దర్భలపై వెతికిలనైనను బోరగించియైన

నుంచి ప్రోక్షించి రెండవపక్షమందు వెతికించి రెండుదర్భలచే గట్టిన రెండేసి పవిత్రము లుంచి 'శంనోదేవీః' అనుమంత్రము నావృత్తిజేసి రెండిటిలో జలముపోసి 'యవోసి' యను మంత్రము రెండుమారు లుచ్చరించి యవలువేసి మంత్ర మక్కరలేకయే గంధపుష్పము లిచ్చునది. కొందరు 'గంధద్వారాం, ఓషధీః ప్రతిమేదధ్వం.' అను రెండు మంత్రములచే గంధపుష్పములిత్తురు. 'దేవార్ఘ్యపాత్రే సంపన్నే' యని పలికి 'సుసంపన్నే'ని విప్రుఁడు పలికినపైని యతనికుడికాలు దన యెడమచేతితో ముట్టి 'అముక విశ్వాన్ దేవాన్ భవత్స్వావాహయిష్యే' యని అడిగి 'ఆవాహనాయ'యని యుత్తరమిచ్చెనపైని 'విశ్వేదేవాస ఆగత' యను ఋక్కుచే ప్రతి విప్రునికి కుడివైపు మొదలుగ నెడమపాదములు పిక్కలు భుజములు శిరస్సువరకును యవలు జల్లవలెను. 'విశ్వేదేవాశ్శృణుత' యను ఋక్కుచే బ్రార్థించి మిగిలిన యవలు భూమియందుఁ జల్లివేయవలెను. హిరణ్యకేశీయులు మొదలగు శాఖాంతరీయులు మీఁదఁ జెప్పిన ట్లర్ఘ్యము మొదలగు పూజయైన పైని యగ్నౌకరణముఁ జేయునపుడు 'యేదే వాసః ' అనియు 'ఆయాతపితరః' అనియు మంత్రములచే నగ్నికి దక్షిణముగ దేవపిత్రా వాహనముఁజేతురు. కాతీయు లర్ఘ్యపాత్రము లాసాపదించకమున్నే దేవపిత్రావాహ నముఁ జేయునది. అట్లు కాత్యాయన సూత్రము చెప్పుచున్నది. ఇట్లర్ఘ్యపాత్ర సంపత్తిని బలికించి అటుపై నర్ఘ్యపాత్రయందు 'స్వాహార్ఘ్యః' అని న్యసింపవలెను. విప్రునికి శుద్ధోదకమిచ్చి యర్ఘ్యపవిత్రమీయవలెను. అపుడు 'యాదివ్యా'యను మంత్రముచే హస్తమందర్ఘ్య మీయవలెను. 'విశ్వేదావా ఇదంవో అర్ఘ్యం' అని యుచ్చరింపుచు ప్రతి విప్రునికి మంత్రావృత్తిచే నర్ఘ్యమిచ్చునది. కొందరు 'యాదివ్యా' యను మంత్రముచే నిర్ఘ్యానుమంత్రణమండ్రు. మయూఖమందు కాకతీయప్రయోగములో విప్రహస్తమందర్ఘ్య దానమైన పైని నావాహనమందువలె నంగములందర్చనముఁ జేసి యర్ఘ్యదానమని యున్నది. ఒక్కఁడే విప్రుఁడైనచో నతనికే రెండుమారు లర్ఘ్యదానము నల్గురైనచో నొక్కపాత్రము విభజించి యిద్దరిద్దరి కీయవలెను. కూర్చయు నాయాపాత్రయందున్నదే. కొన్నింటిలో పాలు పెరుగు నేయి తిలలు నక్షతలు నావాలు దర్భాగ్రములు పుష్పములను నెనిమిదియు నర్ఘ్య పాత్రమందుంచవలెనని చెప్పఁ బడినది. ఇట్లాద్యంతములందు శుద్ధోదకమిచ్చుచు గంధాద్యుపచారముల నీయవలెను. 'అముకవిశ్వేదేవా అయంవో గంధస్స్వాహానమః' యని హస్తముతో నేవిప్రహస్తము లందే రెండేసిమారు లీయవలెను. ఇట్లంతట దైవకర్మలందు 'స్వాహానమ' యని యంతమున నుచ్చరింపుచు నుపచారమీయవలెను. చందనమునగురు కర్పూరము కుంకుమమునీయవలెను. 'గంధద్వారా' మనుదానిచే గంధము. 'ఆయనేతే' యని పుష్పము 'ధూరసి' యనుదానిచే ధూపము 'ఉద్దీప్యస్వ' యనుదానిచే దీపము 'యువంవస్త్రాణి' యనుదానిచే వస్త్రము నీయవలెను. ఇఁక విప్రుఁడు నాసనమిచ్చి నపుడు స్వాసన మనవలెను. అర్ఘ్యమపుడు అస్త్వర్ఘ్య మనవలెను. గంధమందు సుగంధ మనిఁయు 'సుపుష్పాణి, సుమాల్యాని, సుధూపః, సుజ్యోతిః' అని పుష్పాదులందును వస్త్రమందు స్వాచ్ఛాదనమనియు నుచ్చరింపవలెను. ఇఁక గర్త యుత్తరీయము

భుజముపై నుంచుకొని పవిత్రము విసర్జించి విప్రుని హస్తమందున్న గంధమునడిగి తీసి యతని నుదురు మొదలగు నంగములందుఁ బూయునది. విప్రునినుదుట వర్తుల పుండ్రమైనను త్రిపుండమైనను నుంచఁగూడదు. ఇక్కడ విప్రులకు గస్తూరి యిచ్చుట వైకల్పికము. 'ఆయనేతే' యనియు 'ఓషధీః ప్రతిమోదధ్వం' అనుమంత్రము లచే బుష్పమును గంధమువలె హస్తమందేయుంచవలెను. అక్కడ విధింపఁబడిన పుష్పములు. "అగస్త్యంభృంగరాజం చ తులసీ కమలం తథా, చంపకం తిలపుష్పంచ దూర్వాశ్చ పితృవల్లభాః, విహితా ప్రతిషిద్ధా చ తులసీ పిండపూజనే, సుకుమారైః కిసలయై ర్యవదూర్వాంకురై రపి, జలోద్భవైశ్చ కుసుమై ర్మల్లికాచూత పుష్పకైః అతి ముక్తైశ్చ తగరై స్సంపూజ్యాః పితరస్సదా, జాతీపుష్పైర్విప్రపూజాం కుర్యాత్పిండార్చనం తున." అనఁగా అడిగెస, భృంగారాజము, తులసి, పద్మము, సంపంగి, తిలపుష్పము, దూర్వలును, పితృప్రియములు పిండపూజయందు తులసి వైకల్పికము. మృదువులైన చిగుళ్ళు, యవాంకురములు, దూర్వాంకురములు, పద్మములు, కలువలు, మల్లెలు, మామిడిపువ్వు, గురివిందపువ్వులు, తొగరుపువ్వులు వీటిచే బూజింపవలయును. జాజిపువ్వులు పిండపూజయందు నిషిద్ధములు. విప్రపూజకు విహితములు.

## వర్జ్య పుష్పములు

గన్నేరు, ఉమ్మెత్త, బిల్వపత్రము, మొగలిపువ్వు, పగడపువ్వు, బొండుమల్లె, మోదుగు, గోరింట, మరియు నెఱ్ఱనిపువ్వులన్నియు రక్తోత్పలము తప్ప వర్జింపవల యును.

## ధూపము

గుగ్గిలము, చందనపుపొడి, అగురు, కర్పూరము, ఘృతము, తేనె మొదలగునవి గలపి ధూపమీయవలెను. "యేతుప్రాణ్యం గజాధూపాహస్త వాతాహతాశ్చయే, నతేశ్రాద్ధే నియోక్తవ్యాయేచకేచోగ్ర గంధయః, ఘృతం న కేవలం దద్యాద్దుష్టంనాతృణ గుగ్గులుం." అనఁగా కస్తూరి మొదలగు ప్రాణ్యంగజముల ధూపము హస్తముతో విసిరిన ధూపము ఉగ్రగ్రంథముగల ధూపము తృణగుగ్గులుచేగాని వట్టిఘృతముచే గాని ధూపమీయఁగూడదు. ఇచ్చునపుడు ధూపము విప్రులపాదములయొద్దను 'అయంవోధూప' యని యీయవలెను.

## దీపము

నేతితోనైనను నూనెతోనైన నీయవచ్చును. నితరతైలములచే గూడదు. ఇచ్చు నపుడు విప్రుని ముఖసమీపమందు 'ఇదం వోజ్యోతిః' అనిగాని, 'అయంవోదీపః' అనిగాని యీయవలెను. ఇఁక వస్త్రము పట్టువస్త్రమైనను నూలు బట్టయైనను విహితములు. నల్లనిది మలినమైనది వాడుకొన్నదీ ఛిద్రమున్నది బద్దెలేనిది యుతికి నదియు వర్జ్యములు. "యజ్ఞోపవీతం దాతవ్యం వస్త్రాభావే విజానతా, నిష్క్రయోవా యథాశక్తి వస్త్రాలాభే ప్రదీయతే, పితౄన్ సత్కృత్యవాసోభి ర్దద్యాద్యజ్ఞోపవీతకం, యజ్ఞోపవీత దానేన వినాశ్రాద్ధం తు నిష్ఫలం." అనఁగా వస్త్రము సంభవింపనిచో

యజ్ఞోపవీత మవశ్యమీయవలెను. లేదా దానిమూల్యమైన నీయవలెను. పిత్రాదుల కర్చనజేసి వస్త్రమునిచ్చినను యజ్ఞోపవీతముఁ గూడ నీయవలెను.

## ధాతుమయములైన ధూపదీపాది పాత్రలిచ్చుట

అట్లీవ్వనిచో శ్రాద్ధము నిష్ఫలమగును. అట్లు యజ్ఞోపవీతము యతులకు స్త్రీలకు శూద్రనికి శ్రాద్ధముఁ జేయునపుడు నీయవలయును. మరియు నీయవలసిన వస్తువులు. ధాతు వికారములైన ధూపదీపపాత్రలు రాగిదిగాని కఱ్ఱదిగాని మంటిది గాని కమండలుపు కొబ్బరి బురికియైన నీయవలెను. గొడుగు చెప్పులు నాసనము శయనము నద్దము చామరము పావలు పన్నెయు బుక్క మొదలగు సుగంధ ద్రవ్యములు కుంపటియు చేగఱ్ఱయు కంబలము కాటుక పుడకయు నీయవలెను. మఱియు శక్తి గలిగినచో సువర్ణాభరణములు హారకేయూరకంకణాంగుళీయకాదులు నీయవలెను. స్త్రీలకు స్త్రీయాభరణములు మంజీర మేఖలాకర్ణికా కటక కంకణాదులీయవలెను. బంగారు వెండి కంచు మొదలగు ధాతువులచే నిర్మించిన భోజనపాత్రము నీయవలెను. కర్పూరము తాంబూలంబుచే పొందాను డబ్బీమొదలగు వస్తువులీయవలెను. అపుడు బందికానాలో శిక్షింపఁబడువారి నుపాయముచే విడిపించినచో బితృదేవతలకు బ్రహ్మపదము. కాఁబట్టి ఇట్లు వస్త్రమిచ్చినపై యజ్ఞోపవీతము నాభరణములు నిచ్చి యపుడు ముట్టఁగూడని శయ్యాసనాదులకు సంకల్పముచే దారపోసి 'అస్తుసంకల్పసిద్ధిః' అని యుత్తరమునొంది "మంత్రహీనం క్రియాహీనం సంపద్ధీనం ద్విజోత్తమాః, శ్రాద్ధం సంపూర్ణతాం యాతు ప్రసాదా ద్భవతాం మమ." అని ప్రార్థించి 'యస్య స్మృత్యా దేవతాభ్యః పితృభ్యశ్చ' యనునవి జపించవలెను. ఇట్లాసనము మొదలగు సర్వపూజాకాండము సమాప్తినొందించి పిత్ర్యమైన యాసనాది పూజాకాండ మారంభించవలెనని కాండానుసమయక్రమమే మాధవసమ్మతము. కాకతీయులు మాత్రము పాద్యాంత ప్రయోగముపైని యాసనక్షణా వాహనార్ఘ్యములవఱకు పదార్థాను సమయక్రమముచే దైవమందు పిత్ర్యమందునుజేసి గంధాదిపూజను మాత్రము కాండాను సమయవిధిచే జేయుచున్నారు. ఒకపదార్థమును దైవపిత్ర్యస్థానములం దాచరించి యాక్రమముచే ద్వితీయాదిపదార్థముల నాచరించుట పదార్థాను సమయము. ఒకస్థలమందన్ని పదార్థములు సంపూర్ణముగజేసి రెండవ స్థలమందు సర్వపదార్థము లాచరించుట కాండానుసమయము. ఇcక నన్యపవిత్రములు ధరించి పిత్రాద్యర్చనము సంకల్పించి యాసనాద్యాచ్ఛాదనాంతమగు పూజను వైశ్వదేవస్థలమందుఁ జెప్పిన రీతిని పితృధర్మముచే ననఁగ నపసవ్యము కాలుమణుచుట మొదలగు వానిచే జేయవలెను. విశేషము చెప్పఁబడును. రెండు రెట్టులుగా మణిచి మూఁడు దర్భలు విప్రునికెడమను వ్రేయవలెను. పార్వణమునకు ముగ్గురు విప్రులైనచో 'పితుర్యధానామ గోత్రస్యేదమాసనం' అని ప్రత్యేకముగ నుచ్చరింపవలెను. ఒక విప్రుఁడే యైనచో 'పితృపితామహ ప్రపితామహానా మిదమిదమాసనం' అని యుచ్చారము. ఇట్లు ముందుపచారములందు నూహించునది. తక్కినది మీఁదఁజెప్పినట్లు

చేయునది. అటుపైని మూఁడవ నిమంత్రణముఁగూడ మీఁదఁ జెప్పినట్లు హస్తము పట్టియే చేయవలెను.

## అర్ఘ్య సాధనము

అర్ఘ్య పాత్రాసాధనము విప్రునియెదుట దక్షిణాగ్రములుగ మూఁడేసి దర్భలుంచి వాటియందాగ్నేయదిక్సమాప్తిగ ప్రతిపార్వణమునకును మూఁడేసి యర్ఘ్యపాత్రలుంచి అందు పితృపాత్రకుపశ్చిమముగ మాతామహాదిపార్వణమున కొక్కవిప్రుఁడైనను దొమ్మండ్రు విప్రులైనను మూఁడేపాత్ర లుంచవలెను. ఒకవిప్రుఁడైనచో నతని హస్త మందే యర్ఘ్యత్రయ మీయవలెను. తొమ్మండ్రు విప్రులను మొదలగు పక్షమున నొక్కొకపాత్రను విభజించి ముగ్గురు ముగ్గురి కీయవలెను. ప్రతిపాత్రపై ద్విగుణముగా నగ్రములున్నను లేకున్నను మూఁడేసిదర్భలుంచవలెను. పితృతీర్థముచే పాత్రలయందు జలమునింపి 'శంనోదేవీః' యనుమంత్రముచే సర్వపాత్రముల నొకమారభిమంత్రిం చుట ఋగ్వేదులకు గావలెను. తక్కిన శాఖలవారు కాకతీయులును 'శంనోదేవీః' అనుమంత్ర మావృత్తిఁజేయుచు ప్రతిపాత్ర మందు జలపూరణము హిరణ్యకేశీయులు 'శంనోదేవీ' యను మంత్రముఁ జెప్పరు. సర్వమంతమందును 'తిలోసి' యను మంత్రముచే ప్రతిపాత్రము నావృత్తిచేయుచు దిలలుంచుట కార్యము. ఇక్కడ పితృశబ్ద మున కూహాతేదని మీఁదజెప్పఁబడినది. గంధాదులు వ్రేయుట మునుపటివలెనే. ఆపైని 'పిత్రర్ఘ్యపాత్రం సంపన్నం' అని మొదలుగ యథాలింగముగ సంపత్తివచనముఁ బలికించి శుద్ధోదకమిచ్చి దక్షిణాభిముఖుఁడై నిలచియుండి కుశతిలలతోగూడిన యెడమ హస్తము విప్రు నెడమకాలుపై నుంచి పితృపితామహాదులను ద్వితీయాంతము లుగ నుచ్చరించి 'భవత్స్వావాహయిష్యే' యని పఙ్క్తి మొదటి విప్రునడిగి ఇట్లంతటను మొదటివానినే యడుగుట. అటుపైని 'ఆవాహనాయ' యని యనుజ్ఞ యీయబడి 'ఉశంతస్త్వా' యనుమంత్ర మావృత్తిఁజేయుచు 'అముకమముక నామగోత్ర రూప మావాహయామి' యని ప్రతివిప్రునికిని శిరస్సుమొదలుగ పాదపర్యంతము నెడమ నుంచి మొదలుగ తిలలుజల్లి యందర కిట్లావాహనమైనపైని 'ఆయుంతునః పితరః ' అనుమంత్రముచే నొకమారు స్తుతింపవలెను. ఇక్కడ కాకతీయులచే 'నమోవః పితరః' అని మొదలుగ 'ఇహంసంతస్స్యామ' యనువఱకును ఉచ్చరించి యర్చన మని చెప్పఁబడినది. ఆవాహనమందు సవ్యాపసవ్యములకు వికల్పము. హస్తమందం టినతిలలను భూమియందు దులిపి 'పిత్రర్ఘ్య పాత్రం సంపన్న'మ్మని యడిగి ప్రత్యుత్తర మిచ్చినపైని సవ్యముచే నుదకమిచ్చి క్రిందవేసినదర్భలతో నొక్కొక్క యర్ఘ్య పాత్రము రెండు చేతులతో నెత్తి విప్రులయెదుట 'స్వధార్ఘ్య' యను మంత్రమావృత్తిచేయుచు నుంచవలెను. ఒకవిప్రుఁడైనచో నతనియెదుటనే మూఁడు పాత్రలుంచునది. తొమ్మం డ్రైనచో బితృపాత్రము ముగ్గురిలో మొదటివానియెదుటను తక్కినది తక్కిన ముగ్గురిలో మొదటివానియెదుట నని స్వధార్ఘ్య' యనుమంత్రము ముమ్మారే యుచ్చరించుట ప్రతి పార్వణమందునని తెలియునది. అథర్వవేదులకు ప్రపితామహుఁడు మొదలుగ పితృపర్యంతము విపరీతముగ నుచ్చారణముఁజేసి సర్వప్రయోగ మగును. ఆపైని

'సంత్వర్ఘ్యః' అని యుత్తరమునొంది శుద్ధోదకమిచ్చి పాత్రలో పవిత్రములు విప్రులచేతి కిచ్చి ప్రథపాత్రయందుదకము కొంత శేషించినది. ఖడ్గపాత్రలోగాని పాత్రాంతర మందుగాని యుంచి 'పితరిదంతే అర్ఘ్యం, పితామహాదంతే అర్ఘ్యం' అని మొదలుగ వారి వారి నామగోత్రరూపములతో బ్రత్యేకముగ నర్ఘ్యమీయవలెను. పిత్రాదుల కొకఁడే విప్రుఁడైనచో నతనిహస్తమందే ముగ్గురి యర్ఘ్యమీయవలెను. ఆర్గురికొక విప్రుఁడైనచో నారుపాత్రలయర్ఘ్యము నతనిహస్తమందే యీయవలెను. స్థానమునకు ముగ్గురేసి యైనచో నొక్కపాత్రమే విభజించి ముగ్గురి కీయవలెను. అర్ఘ్యాంతమందు జలమిచ్చుటయు 'పితరిదంతే' అర్ఘ్యమనుటయు ప్రతివిప్రుని కావృత్తి చేయునది. ఇట్లు పితామహాది విప్రులయందును దెలియునది. ఇట్లర్ఘ్య మిచ్చిన యుదకము విప్రుని హస్తమునుండి జారునపుడు 'యాదివ్యా' యను మంత్రముచే నభిమంత్రించ వలెనని ఋగ్వేదులు. ఇతర శాఖీయులకు 'యాదివ్యా'యను మంత్రముచేతనే యర్ఘ్య మిచ్చుట. అర్ఘ్యదానంతమందు ప్రతివిప్రునికి శుద్ధోదకదానము కనుక నొకఁడే విప్రుఁ డైనచో ననుమంత్రణము శుద్ధోదకదానము నంతముననొకమారే యగును బహు విప్రులైనచో నావృత్తిఁ గల్గును. అర్ఘ్యదానమందు నామగోత్రాదుల నుచ్చరింపరు. శ్రాద్ధసాగరమందు మాత్రమట్లుచ్చరించుట యుక్తమని తోఁచుననియున్నది. అటుపైని శేషజలముతో గూడిన మొదటి యర్ఘ్యపాత్రయందుఁ దక్కిన పాత్రలలో శేషించిన యుదకముగలపి, యాజలముచే ముఖాంజనము చేయవలెను. అనఁగా నాయుష్యము గోరినవాఁడు నేత్రము లాజలముచే దడుపుకొనవలెను. 'సంప్రవాన్ సమవనీయ' యని యాశ్వలాయనసూత్రము. కొందరు విప్రహస్తమువలన జారిన యుదకస్రావమే దానికే కీరణమంద్రు. దర్శాదికమందు మాతామహపాత్రలో నుదకముతో దక్కిన రెండు పాత్రల యుదకము గలపి యాయుదకము పితృపాత్రయందున్న యర్ఘ్య సంస్రావమందు గలపునది. మాతృపార్వణము వేరుగనున్నచో మాతామహపాత్ర మందు సమవనీతమైన యుదకము మాతృపాత్రమందు సమవనీతమైన యుదకముతో గలపి, దాని పితృగోత్రం దేకీకృతమైన యుదకములోగలపి యీయవలెను. అట్టు లేకీకృతమైన యుదకముగల పాత్రము విశ్వేదేవుల కుత్తరమున బంద్రెండంగులముల దూరమున బ్రోక్షించి దర్భలుద్రేసి వాటిపైని కూర్చతో ముడిచి పితృభ్యస్థానమని యుంచవలెను. లేదా సంస్రావోదకముగల ప్రథమపాత్రను వెతికిలనుండఁగ మంత్ర ముతో నాసాదించి మూఁడవపాత్రముచే కూర్చయు పవిత్రము నుంచి మీఁదఁ గప్పవలెను. రెండు పక్షములందును గంధాదులచే నర్చించి సమాప్తిపర్యంతము గదల్పఁగూడదు. ముట్టనుగూడదు. 'కాకతీయులైనచో శుంధంతాం'అని భూమిని బ్రోక్షించి 'పితృషదనమసి' యని దర్భలఁబరచి 'పితృభ్యస్థా నమసి' యని మొదటి పాత్రను నుబ్జ మనఁగ ముడిగిన దానిజేసి గంధాదిదీపాంతోపచారములచే బూజిం తురు. ఆపైని ప్రాచీనావీతిగనుండి యాద్యంతముల శుద్ధోదకమిచ్చుచు గంధాద్యుప చారములఁ బూజింపవలెను. 'అముకశర్మణాయధానామ గోత్ర అయంతే గంధః' అనియు నొక్కఁడే విప్రుఁడైనచో 'శర్మాణోయంవోగంధః' అనియు నుచ్చరించి

ముమ్మారు గంధమీయవలెను. తక్కినది మీఁదఁజెప్పినట్లు చేయవలెను. కొందరు 'అమీతే గంధాః' అని బహువచనముఁ జెప్పుదురు. అర్ఘ్యదానము తప్పఁదక్కిన వన్నియు 'స్వధానమః' అని యంతమునఁజెప్పుచు నీయవలెను. ఇక్కడ పిత్ర్యర్థమైన విప్రులఁ బూజింపుచో గంధాదులకు పదార్థాను సమయమైనను కాండానుసమయ మైనను గావచ్చును. సంపూర్ణము అని చెప్పించుట మొదలగునది. పూర్వమువలెఁ జేయునది. అట్లుజేసి చతురశ్రముగాను వర్తులముగాను నొక్కొకమండలమైనను నుదకముచేగాని గోమయము భస్మము మొదలగువానిచేగాని దైవ పిత్ర్యస్థానములందు క్రమముగ ననేక మండలములైనను సవ్యాపసవ్యములచే జేయవలెను. అపుడు నైరృతి మొదలుకొని యీశానదిక్కువరకును దైవస్థానమందు ప్రదక్షిణముగను యీశాన దిక్కు మొదలుగ నైరృతి పర్యంతము పితృస్థలమందున ప్రదక్షిణముగను మండలములు చేసి భోజనపాత్రలు పూర్వోక్తమైనవి యాసాదింపవలెను. 'నాయసాన్యపి పాత్రాణి పైత్తలాని నతు క్వచిత్, న చ సీసమయానీహ శస్యంతే త్రపుజాన్యపి' అనఁగా నినుము, యిత్తడి, సీసము, తగరము వీనితో జేసిన పాత్రలుఁ గూడదు. కంచుపాత్ర వైకల్పికము. పర్ణపాత్రలలో మోదుగు, యిప్ప, మేడి, అంకుఁడు, జువ్వి వీటి యాకులు ప్రశస్తములు. అరటి, మామిడి, పనస, నేరేడు, సంపంగి వీటియాకులు మధ్యమ ములు. ఇట్లు పాత్రలనాసాదించి పితృస్థానము మొదలగు చుట్టును భస్మముచే మర్యాదను అనఁగ హద్దును పితృపూర్వముగనే శుద్ధోదకమును సవ్యాపసవ్యములచే నీయవలెను. అపుడు 'పింశగ' యనుమంత్రము 'తక్షాణ' యను మంత్రమును గొందరు చెప్పుదురు. ఆచమనముఁజేసి కరశుద్ధి కిచ్చిన జలమును పాదప్రక్షాళన మండలమందు విడువవలెను.

## ఆగ్నౌ కరణము

అది గృహ్యాగ్నిగల యాశ్వలాయనులకు వ్యతిషంగముచే శ్రాద్ధప్రయోగమైనచో గృహ్యాగ్నియందు వండినచరువుచే గృహ్యాగ్నియందే చేయవలెను. వ్యతిషంగము లేనిచో పాణిహోమము. శ్రౌతాగ్నిగలవారికిఁ దర్శయందు వ్యతిషంగము లేదు. కనుక పాణి హోమమే. పూర్వేద్యుశ్రాద్ధమున నన్వష్టక్యశ్రాద్ధములందును దక్షిణాగ్నియందే శ్రవణము హోమము నగును. నిరగ్నికులైనచో నంతటను పాణిహోమమే. ఆపస్తంభాదులు శ్రౌతాగ్ని గలవారును సర్వాధానులునైనచో దక్షిణాగ్నియందే యగ్నౌకరణము. అర్ధాధానులకును గృహ్యాగ్ని మాత్రము గలవారికిని గృహ్యాగ్నియందే యగ్నౌ కరణము. ప్రవాసము నొందినవారికిని నగ్నిలేనివారికిని "లయాశ్చాగ్నే, మనోజ్యోతిః. ఉద్బుధ్యధ్వం, వ్యాహృతులు" వీనిచే హోమముఁజేసి యుత్పాదించిన లౌకికాగ్నిలో హోమముఁజేసి తిరుగ నగ్నివిడుచుటగాని వీరకెప్పుడు పాణిహోమము లేదు పాక ముపచనాగ్నిలోనేయగును. ఇఁక కాకతీయులలో గృహ్యాగ్నిగలవారికి గృహ్యాగ్ని గలపిన పచనాగ్నిలో పాకము నగ్నౌకరణహోమము గృహ్యాగ్నిలోనే యగును. శ్రౌతాగ్నిఁ గలవారికి సర్వధానపక్షమందు దక్షిణాగ్నిలోనేయగును. అర్ధాధానపక్షమున గృహ్యాగ్ని లోనే యగునని కాశికలో జెప్పఁబడినది. కాకతీయుల కర్ధాధానపక్షమే యుక్తమనితోఁ

చుచున్నది. మఱియగ్నిలేని కాకతీయుల కపసవ్యము మొదలగు పితృధర్మముచే పిత్ర్యర్థమైన విప్రునిహస్తమందే యగ్నౌకరణ హోమము అక్కడ రెండుపక్షములు. దేవార్థమైన విప్రునిహస్తమందే సవ్యముచే హోమము. లేదా పిత్ర్యర్థమైన ద్విజులలో మొదటివానిహస్తమం దపసవ్యముచే హోమమని బహ్వృచులకైనచో పిత్ర్యర్థమైన విప్రులహస్తమందే ప్రతి విప్రునియొద్దను హోమము. వాజసనేయశాఖీయుల కొక హోమమే యని శ్రాద్ధకాశికలో కాకతీయసూత్రవృత్తియందున్నది. కొందఱు 'పృష్ఠోదివి' విధానముచే నగ్ని నుత్పాదించి దానియందే హోమముఁ జేతురు. ఇఁక సామవేదులు మొదలగువారు సాగ్నికులైనచో నాయగ్నియందే జేతురు. అగ్ని సన్నిధిలేకున్నచో దైవకరమందైనను పిత్ర్యకరమందైనను హోమము. అగ్నిలేనివారికి దేవద్విజహస్త మందే యగును. మృతినొందిన భార్యగల యపత్నీకునికి దేవార్థ విప్రులలో మొదటి వాని హస్తముననే హోమము. పిత్ర్యర్థవిప్రునిహస్తమందుఁ గూడదని సర్వసాధారణము.

## పాణిహోమము

బహ్వృచులకు వ్యతిషంగపక్షములో 'అగ్నావగ్నౌకరణం కరిష్యే' యని యడిగి 'క్రియతాం' అని యుత్తరమిచ్చిన పైని గృహ్యాగ్ని యందు పక్వమైన చరువునుదీసి రెండు భాగములుచేసి యపసవ్యముతో నుత్తరభాగమందు గొంతకొంత యవదానము మేక్షణముతోదీసి 'సోమాయ పితృమతేస్వధానమః, సోమాయపితృమత ఇదంన మమ' యని హోమము త్యాగమునుజేసి దక్షిణభాగమందును దిరుగనట్లనే యవదానముఁ జేసి 'అగ్నయేకవ్యవాహనాయ స్వధానమః' అని హోమము త్యాగమును జేయవలెను. నపసవ్యముచేనైన నపసవ్యముచేనైనను మేక్షణము నగ్నియందు విడుచునది. లేదా సవ్యముచే స్వాహాంతమైన యామంత్రములచే నాహుతులు రెండును సోమాగ్నులకు వ్యత్యాసముఁజేసి 'అగ్నయేకవ్యవాహనాయస్వాహానమ' యని రెండవదియు వ్రేల్చ వలెను. కాకతీయులకైనచో గృహ్యాగ్నియందు శ్రవణముచేయక గృహ మందు వండిన యన్నము గ్రహించి ఘృతముగలపి మీఁదఁజెప్పినట్లు ప్రశ్నయు ననుజ్ఞయు నైనపైని గృహ్యాగ్ని పరిస్తరణముఁజేసి మూఁడుసమిధలువ్రేసి సవ్యముచే 'అగ్నయేకవ్యవాహ నాయస్వాహా, సోమాయ పితృమతేస్వాహా' యని మేక్షణమనఁగ నభిఘరించు దర్భ పుడకలచే నాహుతులు రెండును వ్రేల్చవలెను. అపసవ్యముచేనైన గావచ్చును. పాణిహోమమందు నిట్లనేప్రయోగము విశేషము మీఁదఁజెప్పఁబడినది. ఆపస్తంబుల కైనచో నాజ్యభాగాంతమందు 'ఉద్ధ్రీయతాం అగ్నౌక్రియతాం' అని యడిగిన 'కామ ముద్ధ్రీయతాం కామమగ్నౌ క్రియతాం' అని యనుజ్ఞానము. హిరణ్య కేశీయులకైనచో 'ఉద్ధరిష్యామ్యగ్నౌ కరిష్యామి' యని ప్రశ్నము. 'యన్మేమాతా' యని మొదలగు మంత్ర ములచే సప్తాహుతులు నారు ఆజ్యాహుతులు ననిపదుమూఁడాహుతులు. మంత్ర ములు విస్తరభయమునుండి చెప్పఁబవు. హిరణ్యకేశీయుల కాజ్య భాగాంత మందు సోమాయ పితృమతే' యని మొదలగు పదారుమంత్రములచే పదియా రాజ్యాహుతులు బదియా రన్నాహుతులు ప్రతిపార్వణమునకు ననితెలియునది. మంత్రములలో పిత్రాదిపదముల కూహయు నాజ్యాన్నాదిపదముల కూహయు వారి గ్రంథములలో దెలియునది.

అపుడు 'విప్రపాణావగ్నౌ కరణంకరిష్యే'యని ప్రశ్నము. 'క్రియతాం' అని యనుజ్ఞ. 'కురుష్వ' యని యనుజ్ఞకాదని యంతట నాశ్వఆయనమతము. కాకతీయాదులకట్లు గావచ్చును. ఆశ్వలాయన సూత్రవృత్తియందు మాత్రము యెట్లయినను; ప్రశ్నము. ప్రతివచనమును జేయఁగూడదని సూచింపఁబడినది. దర్భతోగూడిన పిత్ర్యర్థ విప్రునిహస్తము సవ్యముచే జుట్టు స్పృశించి యట్లనే జలముజల్లి మేక్షణము చేతగాని హస్తముచేగాని పూర్వమువలె నాహుతులు రెండును 'సోమాయ' యని మొదలగు మంత్రములచే నపసవ్యముతో వ్రేల్చవలెను. అందు హస్తముచే హోమముఁ జేయుపక్షమున నెడమహస్తముచే దర్భగొని దక్షిణకరమందుపస్తరణముఁజేసి దక్షిణ హస్తముచే రెండుమారులు అన్నముఁదీసి వామహస్తముచే నభిఘరించి చతురవ దానము మొదలగునది సంపాదించవలెను. బహ్వృచులకు సమస్త పిత్ర్యద్విజులకరము లందును హోమము ఏకోద్దిష్ట విప్రునిహస్తమందు హోమము వైకల్పికము. హోమాంత మందు సవ్యముచే పరిసమూహనము పర్యుక్షణముఁ జేయవలెను. పాణిహోమ మందు మేక్షణము వ్రేయుటలేదు. కొందరు పాణిహోమమందు పరిసమూహనము మొదలగు నదియు మేక్షణమునుగూడ నిచ్ఛయించరు. విప్రులు పాణియందు వ్రేల్చినయన్నమును 'ఆమానుపక్వ' మనుమంత్రముచే దేవపూర్వముగ సవ్యముచే గర్త యభిఘరించిన తమ తమ పాత్రలయందుంచవలెను. అపుడు భోజనస్థానముకంటె మరియొక స్థాన మందాచమనముఁజేసి తిరుగ యథాస్థానముగ ప్రవేశించునది అగ్నౌకరణము చేయఁ గ మిగిలినది పిండార్థము గొంతయుంచి తక్కినది పితృపాత్రయందే సర్వాన్నములు వడ్డించినపైని వడ్డించవలెను. కొందరగ్నౌ కరణశేషము వడ్డించిన పైని సర్వాన్నములు వడ్డించవలెనంద్రు. అగ్నౌకరణశేషము దేవపాత్రలం దుంచఁగూడదు. కాకతీయు లైనచో సాగ్నికులు హోమశేషము దేవపూర్వముగ సర్వపాత్రలయందు వడ్డింతురు అగ్ని లేనివారు దేవవిప్రుని హస్తమందు హోమమైనచో బితృపాత్రలందే శేష దానము పిత్ర్యవిప్రుని హస్తమందైనయెడ దేవాది సర్వపాత్రలందు నుంచవలెనని కాశికా కారు లంద్రు. "శ్లో. అన్నం పాణౌ హుతం యచ్చ యచ్చాస్య త్పరివేషితం, ఏకీకృత్యైవ భోక్తవ్యం పృథగ్భక్షో న విద్యతే." అనఁగా హస్తమందు వ్రేల్చినదియు వడ్డించినదియు నన్నముకలపి భుజింపవలెను వేరుగ భుజింపఁగూడదు. బౌధాయనులకైనచో పాణి హోమముఁ జేసినయన్నము భక్షించినపై నితరాన్నము వడ్డించుట విధింపఁబడినది.

## అన్నపరివేషణము

పూర్వోక్తరీతిని దేవపూర్వముగ ఘృతముచే నభిఘరించినపాత్రలందు మీఁ దఁజెప్పిన హవిష్యాన్నము వడ్డించుట. కర్త స్వయముగనైనను బత్నియైనను నన్యుఁ డైనను జేయవచ్చును. "నా పవిత్రేణ నైకేన హస్తేన నవినాకుశం, నాయసే నాపిపాత్రేణ శ్రాద్ధేషు పరివేషయేత్." అనఁగా నశుచియై వడ్డింపఁగూడదు. ఒక్కహస్తముచే గూడదు. దర్భలు ధరింపకయుఁ గూడదు. ఇనుపపాత్రతో గూడదు. పచ్చడి మొదలగు నదియు నాకుదొప్ప మొదలగువానితో వడ్డించవలెను గాని కేవలము చేతితో వడ్డింపఁ గూడదు. ఇనుపపాత్రతో గూడదు. పచ్చడి మొదలగునదియు నాకుదొప్ప మొదలగు

వానితో వడ్డించవలెనుగాని కేవలము చేతితో వడ్డింపఁగూడదు. ఇట్లు వచనము – "దర్వ్యాదేయ ఘృతం చాన్నం సమస్త వ్యంజనాని చ, ఉదకం చైవ పక్వాన్నం నో దర్వ్యాతు కదాచన, హస్తదత్తం తు నాశ్నీయా ల్లవణ వ్యంజనాదికం, అపక్వం తైలపక్వం చ హస్తేనైవ ప్రదీయతే." అనఁగా ఘృతము నన్నము గరిటెతో వడ్డింప వలెను. సర్వవ్యజంనములు నట్లనే వడ్డించునది. ఉదకము పక్వాన్నమును గరిటెతో గూడదు. లవణము వ్యంజనములు సాక్షాత్తుగా చేతితోవడ్డించినది తినగూడదు. పచ్చి వస్తువు తైలపక్వమైనవస్తువు హస్తముతో నీయవచ్చును. ఘృతము వడ్డించిన దొప్ప భోజనపాత్రలో నుంచఁగూడదు. పై నుంచవలెను. అన్నములోగాని పరమాన్న ములోగాని దొప్పయుంచి ఘృతముపోసినచో రక్తతుల్యము. పఙ్త్తిలో నెక్కువ తక్కువలుగ వడ్డించినిచో నిష్కృతిలేని పాపమగును. తిలలు సదా గ్రాహ్యములే. పితృకార్య మందు మరియు గ్రాహ్యములు. భోజనపాత్రయందు దిలలున్నచో పితృదేవతలు నిరాశులై పోదురు. ఇంగువ, మిరియాలు, సొంఠి, పిప్పళ్లు మొదలగునవి శాకాది సంస్కారార్థ మైనవి తప్ప సాక్షాత్తుగా భుజింపఁగూడదు. బ్రాహ్మణులకు వడ్డించునపుడే పిండార్థమై సర్వాన్నములు వడ్డింపవలెనని శ్రాద్ధసాగరమందున్నది. అటుపై నుపవీతియై దైవపాత్రము చుట్టును గుశయవలు జల్లి పిత్ర్యపాత్రకు చుట్టు తిలలుజల్లి యన్నమును గాయత్రిచే బ్రోక్షించి యూరకే పరిషేచనముఁజేసి దైవపాత్రపై కుడిహస్తము దానిపై నెడమహస్తమునుంచి పిత్ర్యపాత్రయందు వామహస్తముపై కుడిచేతినుంచియు నిట్లు స్వస్తికాకారమైన చేతులతో పాత్రము ముట్టవలెను. అపుడు మంత్రము "పృథివీతే పాత్రం ద్యౌరపిధానం బ్రాహ్మణస్యాముఖేమృతం జుహోమిబ్రాహ్మణానాం వా విద్యా వతాం ప్రాణాపానయోర్జుహోమ్యక్షిత మసివామైషాం క్షేష్ఠా అముత్రాముష్మిన్‌లోకే" అని ఈ మంత్ర మాపస్తంబకాత్యాయనాదులచే నానావిధముగఁ బఠింపఁబడి యున్నది. యథాచారముగఁ జెప్పవలెను. ఇట్లభిమంత్రించి 'అతోదేవ' యనిగాని 'ఇదంవిష్ణుః' అనిగాని మంత్రము పఠించి 'విష్ణోఽ హవ్యం రక్షస్వ' యనియు పిత్ర్యమందు 'కవ్యంరక్షస్వ' యనియుఁ బలికి బోరగిలించిన హస్తముతో బోరగిలించిన విప్రుని కుడియంగుష్ఠము నఖము దగులకుండ నన్నముపైనుంచి ప్రదక్షిణముగఁ ద్రిప్పవలెను. పితృస్థానమం దప్రదక్షిణముగఁ ద్రిప్పవలెను. ఇక్కడ కాకతీయులకు 'అపహతా' యను మంత్రముచే దైవపాత్రముచుట్టు యవలును పితృపాత్రము చుట్టు తిలలును జల్లవలెనని యున్నది. అటుపైని వామహస్తముచే పాత్రను స్పృశింపుచు 'అముకేవిశ్వే దేవాదేవతా ఇదమన్నం హవ్యమయం బ్రాహ్మణ ఆహవనీయార్థే ఇయం భూర్గయా అయంభోక్తా గదాధర ఇదమన్నం బ్రహ్మాఇదం సౌవర్ణపాత్రం అక్షయ్య వటచ్ఛాయేయం అముకదేవేభ్యః ఇదమన్నం సోపస్కరం అమృతరూపం పరివిష్టం పరివేష్య మాణం చాతృప్తేస్స్వాహా హవ్యం నమోనమమ. ఓం తత్సత్'అని పఠించి యవలతో గూడినజలము కుడిచేతితో పాత్రకు నెడమవైపు భూమియందు విడువ వలెను. ఇట్లు దేవార్థము మఱియొక విప్రుఁడున్నచో నతనికిని జేయవలెను. అటుపైని 'యేదేవాస' యని యుపస్థానము. ఆపైని పితృధర్మముచే పితృపాత్రను ముట్టుటఁ

ద్విజునియంగుష్ఠము నుంచుట మొదలగునవి చేసినపైని నెడమచేతితో పాత్రను ముట్టి 'పితాదేవతా' యనియు నొక్కఁడే విప్రుఁడైనచో 'పితృపితామహాదయో యథా నామ గోత్రాదేవతా' యనియు నుచ్చరించి 'ఇద మన్నం కవ్యం' అని మొదలుగ మీఁదఁజెప్పినట్లుచ్చరించునది. 'ఇదం రాజతంపాత్ర మక్షయ్యవటచ్ఛాయేయం' అనియు 'అస్మత్పిత్రే అముకనామ గోత్రరూపాయ' యనియు విప్రుఁడొక్కఁడేయైనచో 'అస్మత్పితృపితామహ ప్రపతితామహేభ్యః అముకనామగోత్ర రూపేభ్యః ఇదమన్నం సోపస్కరమమృతరూపం పరివిష్టం పరివేష్యమాణం చాతృప్తేః స్వధాకవ్యం నమోన మమ ఓంతత్సత్' అని యుచ్చరింపుచు కుశతిల యుక్తజలమును పితృతీర్థముచే వామహస్తము క్రిందనుండు కుడిహస్తముతో పాత్రకుఁ దక్షిణభూమియందు విడువ వలెను. ఇట్లన్యస్థలమందును దైవస్థలమందుఁ జెప్పినరీతి నూహించునది. పితృస్థాన మందనేక విప్రులున్నచో ముగ్గురిపర్యంతము పిత్రే యని యేకవచనముచేతను నిట్లు 'పితామహాయ' యని ముగ్గురికి 'ప్రపితామహాయ' యని ముగ్గురికి నీయవలెను. అటుపైని 'యే చేహపితర'మ్మను మంత్రముచే నుపస్థాన మొక్కమారే చేయవలెను. అతిథియైనచో దేవస్థానమందువలె 'స్వేష్టదేవతాయై ఇదమన్నం' అని మొదలుగ నుచ్చరించి యిచ్చి 'యేదేవాస' యని యుపస్థానము చేయునది. అపసవ్యముచే 'దేవతాభ్యః పితృభ్యశ్చ, సప్తవ్యా, అమూర్తానాం, బ్రహ్మార్పణం, హవిర్దాతా, చతుర్భిశ్చ, ఓం తత్సద్బ్రహ్మార్పణమస్తు, యేషాముద్దిష్టం తేషామక్షయ్యాప్రీతిరస్తు' అని తిలోదకము విడువవలెను. సవ్యముచే "ఏకోవిష్ణుః అన్నహీనం క్రియాహీనం మంత్రహీనం చ యద్భవేత్, తత్సర్వమచ్ఛిద్రం జాయతాం" అని పలికి విప్రులు 'జాయతాం సర్వమచ్ఛిద్రం' అని పలికినపైని 'అనేన పితృయజ్ఞేన పితృరూపీజనార్దన, వాసుదేవః ప్రీయతాం' అని తిలకుశజలములు విడువవలెనని యాచారము. కొందరు బ్రహ్మార్పణమని మొదలగు సంకల్పోత్సర్గమందు సవ్యమనియు 'నేకోవిష్ణుః'అని మొదలగు దానియం దపసవ్యమనియుఁ జెప్పుదురు. అక్కడ 'బ్రహ్మార్పణం, ఏకోవిష్ణుః' అను రెంటికి విభాగమందును సవ్యాపసవ్య విభాగమందును ప్రత్యక్షవచనము గానరానందున నాచారము ననుసరించి చేయవలెను. అట్లు సంకల్పము చేయనిచో నన్నము విప్రులు స్పృశింపఁగూడదు. 'ఈశానవిష్ణు, గయాయై నమః, గదాధరాయ నమః, పుండరీ కాక్షాయనమః' అని నమస్కరించి పితృపూర్వకముగ విప్రునిహస్తములందు జలమిచ్చిన పైని విప్రులు దానిచే నన్నము ప్రోక్షించి ముమ్మారు గాయత్రిచే నభిమంత్రించవలెను. కర్త పితృస్థానము మొదలుగ నాపోశనార్థముదకమిచ్చి వ్యాహృతులతో గాయత్రిని ముమ్మారుగాని యొకమారుగాని యుచ్చరించి 'మధువాతా'యను మూఁడు బుక్కులు పఠించి 'మధుమధుమధు' అని ముమ్మారుపలికి 'ఓంతత్సత్ యథాసుఖంజుషధ్వం' అని పలుకవలెను. విప్రులు బలిదానముచేయక నిత్యమువలె నాపోశనము పట్టినపై కర్త 'శ్రద్ధాయాం ప్రాణేనివిష్టో మృతంజుహోమి, శివోమావిశాప్రదాహాయ ప్రాణాయ స్వాహా' యని మొదలుగ నైదుమంత్రము లుచ్చరింపుచుండఁగ పంచప్రాణాహుతులను చేసి 'బ్రహ్మణిమ ఆత్మామృతత్వాయ' యని యుచ్చరించునపు డారవమారు నాహుతి

చేయవలెను. ఆపైని మౌనముధరించి చాపల్యము విడిచి కొంత మిగులునట్లు భుజింపవలెను. పెరుగు పాలు ఘృతము పాయసము నిశ్శేషముగ భుజించునది. అపోశనము పాత్రకు దక్షిణభాగమందే చేయవలెను. వామమందుఁ గూడదు. ఆపోశనము హస్తమందుండఁగ సంకల్పము చేసినను ఛిద్రవాక్కులు పలికినను పితృదేవతలు నిరాశులగుదురు. తిరుగ పూజించి యాపోశనముఁ జేసినచో సురాసమము. "ఆపోశనమకృత్వాన్నం మర్దయే న్నైవకర్హిచిత్" అనఁగా నాపోశముఁజేయక యన్నముఁ గలపఁ గూడదు. విప్రులు బలిదానము చేయఁగూడదు. కొంద రాజ్యముచే జేయుదురు. అది గూడదు. యేమనిన; పాయసమాజ్యము పులగము వీనిచే బలిదానము నిషేధింపఁ బడినది. విప్రులు వామహస్తముచే నన్నము ముట్టఁగూడదు. పాదముచే పాత్ర ముట్టఁగూడదు. కర్త సంపాదించిన వస్తువునే యడుగవలెనుగాని యితర మడుగఁ గూడదు. అన్నము గుణదోషము లుచ్చరింపఁగూడదు. కర్తయు నిషిద్ధముగానిదియు భోక్తకుఁదంద్రికి తనకుబ్రియమైనదియునగు వస్తువు వడ్డింపుచు నాయాభక్ష్యముల మాధుర్యాదిగుణముల స్తుతించి రుచిబుట్టించుచు వడ్డించెదనని పలుకక యడిగినది వడ్డించుచు భుజించుచుండఁగ నట్టెచూడక యన్నగుణములనడుగక దైన్యమున శ్రుపాతము క్రోధము మొదలగునవి చేయక జలముఁ ద్రాగింపుచు మెల్లన భుజింపఁ జేయవలెను. అట్లుగాక యుప్పు మొదలగువాటిని యడుగుచున్నచో యుచ్ఛిష్టదశ తోడనే పితృదేవతలు వెళ్లిపోదురు. అనంతరమున సవ్యముచేతనే వ్యాహృతులతో గాయత్రిని ముమ్మారుచ్చరించి పురుషసూక్తము, 'కృణుష్వ పాజోరక్షోహణం' అని మొదలగు రక్షోఘ్నమంత్రములను పితృలింగములైన యింద్రేశ సోమసూక్తములను పావమానీసూక్తములను అప్రతిరథమనుసంజ్ఞగల యాశుశ్శిశానసూక్తము, విష్ణు బ్రహ్మ రుద్రార్కస్తోత్రాదికము భోక్తలైన విప్రులకు వినుపింపవలెను. సంభవింపనిచో గాయత్రీ జపముఁ జేయవలెను. "వీణాం వంశధ్వనిం చాపి విప్రేభ్య స్సన్నివేదయేత్, మండల బ్రాహ్మణం పార్యం నాచికేతత్రయం తథా, త్రిమధు త్రిసుపర్ణం చ పావమాన యజూంషి చ, ఆశుశ్శిశాన సూక్తం చ అగ్నయే కవ్యవాహనం." అనఁగా వీణాధ్వనియు వాసికట్లులుధ్వనియు మండలబ్రాహ్మణము త్రిణాచికేతము త్రిమధువు త్రిసుపర్ణము పవమాన సూక్తము ఆశుశ్శివాన సూక్తము ఆగ్నయే కవ్యవాహనసూక్తము నివి బ్రాహ్మణులకు వినుపింపవలెను. "ప్రౌఢపాదో బహిఃకక్షో బహిర్జాను కరోపి వా, అంగుష్ఠేన వినాశ్నాతి ముఖశబ్దేన వాపునః, పీతావశిష్టతోయాని పునరుద్ధృత్య వాపిబేత్, ఖాదితార్ధం పునఃఖాదే న్మోదకాది ఫలాదికం, ముఖేన వాధమేదన్నం నిష్ఠీవే ద్భాజనేపి చ, ఇత్థమవ్నన్ ద్విజశ్శ్రాద్ధం హత్వాగచ్ఛత్యథోగతిం." అనఁగా భోక్తయగు విప్రుఁడు గొంతుకగూర్చుండి భుజించినను చంకలు గనఁబడునట్లెత్తి భుజించినను పిక్కకు పైని హస్తముంచి భుజించినను అంగుష్ఠము విడిచి నాల్గువ్రేళ్ళతో భుజించినను ముఖమునందు చప్పుడుఁ జేయుచు భుజించినను సగముఁద్రాగి మిగిలినది తిరుగఁ ద్రాగినను మోదకములు ఫలములు మొదలగునవి సగము గొరికియున్నది తిరుగ కొరికినను ముఖముచే నన్నము నూదినను భాజనమందుమ్మినను నిట్లు భుజించు

విప్రుఁడు శ్రాద్ధముఁజెరిచి తా నధోగతి నొందుననుట. “శ్రాద్ధపఙ్క్తౌ తు భుంజనానో బ్రాహ్మణో బ్రాహ్మణం స్పృశన్, తదన్న మత్యజన్ భుక్త్వా గాయత్ర్యష్ట శతంజపేత్.” అనఁగా శ్రాద్ధమందు భుజించుచు పఙ్క్తిలో మరియొక విప్రుని ముట్టినచో నాయన్నము విడువక భుజించి యెనిమిదినూరులు గాయత్రీజపము చేయునది. “పాత్రే విప్రాంత రోచ్ఛిష్ట సంసర్గే తన్నిరస్యహ, హస్తం ప్రక్షాళ్య భుక్త్వాచ గాయత్రీ ద్విశతం జపేత్.” అనఁగా భుజించునపుడు మరియొకని యెంగిలి తనవిస్తరిలో పడినయెడ దాని బారవైచి హస్తముఁగడగికొని భుజించి స్నానముచేసి యిన్నూరుమారులు గాయత్రిని జపింపవలెను. “భుంజానేషు తు విప్రేషు ప్రమాదాత్స్రవతేగుదం, పాదకృచ్ఛ్రం తతః కృత్వా అన్యం విప్రం నియోజయేత్.” అనఁగా భుజింపుచున్న బ్రాహ్మణునికి ప్రమాద ముచే గుదస్రావమనఁగ విరేచనమైనచో పాదకృచ్ఛ్రముఁజేసి మరియొక బ్రాహ్మణుని నందు నియోగింపవలెను.

## శ్రాద్ధ బ్రాహ్మణునికి వమనమైనచో నిర్ణయము

విప్రునికి వమనమైనచో అందు పిత్రాద్యర్థమైన విప్రునికి వమనమైనయెడ లౌకికాగ్ని స్థాపించి యందు చరునిర్వాపము నాజ్యభాగము నైన పైని నామగోత్ర పూర్వముగ నగ్నియందు పిత్రాదుల నావాహనముఁజేసి వైశ్వదేవిక విప్రునికి వమన మగునెడ విశ్వేదేవతల నావాహనముఁజేసి పూజించి యన్నత్యాగముఁజేసి ‘ప్రాణాయ స్వాహా’ యని మొదలగు మంత్రములచే నిరువది రెండాహుతులు వ్రేల్చవలెను. లేదా పునశ్శ్రాద్ధముఁ జేయవలెనని పక్షద్వయము. పక్షద్వయమందు ‘నింద్రాయసోమ’ యను సూక్తముఁ జపించుట నిత్యము. ఈ రెండు పక్షములకు వ్యవస్థయెట్లనిన; వైశ్వదేవిక విప్రునికి వమనమైనచో హోమమేగాని పునశ్శ్రాద్ధ మక్కరలేదు. పిత్ర్యవిప్రుని కైనను పిండదానానంతరము వనమమైనయెడ హోమమే తిరుగ శ్రాద్ధమక్కరలేదు. పిండదానమునకుఁ బూర్వమే యట్లైనచో నాదినమం దుపవాసముఁజేసి మరునాఁ డు తిరుగ శ్రాద్ధము చేయలెను. ఇది సపిండీకరణము మహైకోద్దిష్టము మాసికము నాబ్దికముఁ బ్రత్యాబ్దికము నను నీ శ్రాద్ధములందే చేయవలెను. దర్శాదికమందు పిత్ర్యవిప్రునికి వమనమైనచో నాదినమందే తిరుగ నామశ్రాద్ధముఁ జేయునది. ఇట్లష్టకాన్వష్టకాపరేద్యుశ్రాద్ధము లందును జేయునది. అపుఁడామశ్రాద్ధమందు సాగ్నికుఁడైన ఋగ్వేదికివ్యతిషంగము మొదలగు యథోక్తప్రయోగము సంభవింపదు గనుక సాంకల్పికవిధిచే దర్శాన్వష్టకాపూర్వేద్యుశ్రాద్ధము లామముచే జేయునది. లేదా తత్తల్లోపప్రాయశ్చిత్తమైనను యథాశాస్త్రముగఁ జేయవలెను. వృద్ధిశ్రాద్ధమందును పిండరహితమైన సంక్రాంత్యాది శ్రాద్ధమందును నిత్యశ్రాద్ధమందును వమనమైనచో దిరుగఁ జేయవలెను. తీర్థశ్రాద్ధమందు దర్శాదులందువలె నామశ్రాద్ధమే చేయునది. మహాలయశ్రాద్ధమందు పిత్రాదిపార్వణస్థానీయ విప్రునికి వమనమైనచో నావృత్తియే చేయవలెను. ఏకోద్దిష్టస్థానీయ విప్రునికి వమనమయినచో హోమమే యని తోఁచు చున్నది. వైశ్వదేవికి విప్రుని కట్లైనచో హోమమే స్వరశ్రాద్ధములందునని మీఁదఁ జెప్పఁబడినది. హోమపక్షమందును బునఃకరణపక్షమందును సర్వసూక్త జపము

మీఁదఁజెప్పఁడినది. విప్రభోజనాంతమందు బ్రాచీనావీతియై 'తృప్తాస్థ' యని విప్రుల నడిగి 'తృప్తాస్మః'అని వారు పలికినపైని గాయత్రిని 'మధువాతా' యని మూఁడు ఋక్కులను 'అక్షన్నమీ' యను దానిని వినుపించి, లేదా 'అక్షన్నమీ' యనుదానిపై తృప్తినడిగి 'శ్రాద్ధంసంపన్నం' అని యడిగిన 'సుసంపన్న'మని యుత్తరమిచ్చిన పైని వడ్డించునపుడు పిండార్తమై యుంచనియెడ నిపుడు పిండార్థము వికిరార్థము సర్వాన్నములో నుండి తీసి 'అన్నశేషైః కింకార్యం' అని యడుగఁగా వారు 'ఇష్టైస్సహ భోక్తవ్యం' అని యుత్తరముపలుకుచు నతని కంతయు నివ్వవలెను. లేదా యథారుచిగ స్వీకరించిననుసరియే. కాకతీయులైనచో విప్రులఁదృప్తులుగా నెరిగియుండు. చెప్పబోవు విధమున దైవపిత్ర్యస్థానములందు వికిరాన్నమిచ్చి విప్రులకు పితృపూర్వక ముగ నొకమారు జలమునిచ్చి గాయత్రిని మధుమతిని వినుపించి తృప్తి ప్రశ్నము, సంపత్తి ప్రశ్నముఁ జేయవలెను. ఇట్లు శాఖాంతరమందును నుత్తరాపోశనమునకు మున్నే వికిరదానము. బహ్వృచులకుమాత్రము పిండాంతమందే వికిరము. హిరణ్యకేశీ యుల కాచమనాంతమందుఁ జెప్పఁబడినది. అటుపై 'నుచ్ఛిష్టభాగ్భ్యోన్నందీయతాం' అని పలికినచో విప్రులు పాత్రలలోనున్న భుక్తశేషమును దేవస్థానమందుఁ దక్షిణముగను పితృస్థానమందెడమవైపునను భోజనపాత్రకుపై నుంచవలెను. అటుపైని పితృ పూర్వకముగనిచ్చిన యుత్తం పోశనము 'నమృతాసిధానమసి'యని జేతురు. పిండ దానము విప్రులాచమనముఁ జేసిన పైనిగాని పూర్వముగాని చేయవచ్చును. విప్రులు మొఖముగడుగుట పూర్వపూర్వముగ గరప్రక్షాళనము శరావమనఁగ మూఁకుడు మొదలగువానిలోఁ జేయవలెను. కంచు రాగి మొదలగు పాత్రలందుఁగూడదు. శుద్ధోదకముచే నాచమించి 'కయానశ్చిత్ర'యను మంత్రముఁ జపించునది.

## పిండదానము

దానికి నర్చనానంతరమునగ్నౌకరణోత్తరము భోజనోత్తరము వికిరోత్తరము స్వధావచనోత్తరము విప్రవిసర్జనోత్తరమని యారుపక్షములు. వీటికి శాఖాభేదముచే వ్యవస్థ యని నిర్ణయసింధువు. అం దాశ్వలాయనులకు భోక్తలాచమనము చేయక మున్నుగాని వెనుకగాని పిండదానము నాపై వికిరము. ఆపస్తంబ హిరణ్యకేశీయాదు లకు విప్ర విసర్జనమైన పైని బిండదానము. కాకతీయులకు వికిరోత్తరమాచమనము లకు మున్నైనను నాచమనముఁజేసి వారు వచ్చినపైనైనను బిండదానము. అం దగ్నియందు హోమమైనచో నగ్నిసమీపమందే. పాణి హోమమయినచో విప్ర సమీప మందే పిండదానము. బహ్వృచులకు ఇతర శాఖీయులకైనచో దరుచుగ విప్రసమీప మందే, అపుడు ద్విజుల యుచ్ఛిష్టమున కుత్తరముగ నొకబారగాని మూరగాని దూర మున పిండదానము సంకల్పించి యందు బహ్వృచుల కొకహస్తముచేతను ఇతర శాఖీయులు రెండిఁటిచేతను కఱ్ఱగాని కత్తిగాని చంద్రపుల్లగాని దర్భ మొదలుగాని పట్టుకొని 'అపహతా అసురా' యను మంత్రమును ప్రతిగీత గీయునపుడు బఠింపుచు నాగ్నేయదిక్కు మొదలుగ పశ్చిమసమాప్తిగ పార్వణమున కొకటిగాని మూఁడుగాని రేఖలుగీసి ప్రత్యేకముగ నభ్యుక్షణముఁ జేయునది. పిండసంకల్పమందును రేఖాలేఖన

మందును సవ్యాపసవ్యములకు వికల్పము. అపుడు కాకతీయులకు 'యేరూపాణి' యను మంత్రముచే నగ్నౌకరణము చేసిన యగ్నిలో కొరవిని రేఖకుఁ దక్షిణముగ నుంచుట విహితము. అపుడు రేఖలపై సకృదాచ్ఛిన్నమనఁగ నొక్కమారే మొదళ్లుకోసిన దర్భలు దక్షిణము నగ్రములుగఁ బరచి 'శుంధంతాపితరః శుంధంతాం పితామహా' యని మొదలగు మంత్రములచే తిలోదకము దర్భలపై నీయవలెను. ఇక్కడ కాకతీయులకు 'పితరముకనామగోత్రావనే నింక్ష్వ' యని మొదలగు మంత్రములు. ఇతరశాఖీయులకు 'మార్జయంతాం పితరః సోమ్యాసః' అని మొదలగునది. అగ్నౌకరణశేషముతో గూడిన సర్వాన్నముచేతను మధువు ఘృతము తిలలును గలపి పత్నిచే బిండములు చేయించి రేఖయందు వెతికించిన హస్తముతో నంగుష్ఠాంగుళుల మధ్యమునుండి పిత్రాదుల కీయవలెను. 'ఏతత్తేస్మత్పితర్యథా నామగోత్రరూపయే చత్వామను. పిత్రే అముకనామగోత్ర రూపాయాయం పిండస్స్వధాన మస్తేభ్యశ్చ గయాయాం శ్రీరుద్రపాదే దత్తమస్తు' అని మొదలగు మంత్రములచే నూహచేయునది. ఇక్కడ గొందరు పిండపాత్రను దడపి బోర్లింతురు. కొందరు మాషాన్నముతో బిండములు చేయరు. ఆపైని లేపభాక్కులతృప్తికై హస్తమందంటినది పిండదర్భల మొదటనంటించి 'అత్ర పితరోమాదయధ్వం యథాభాగ మావృషాయధ్వం' అని పిండముల నొకమారను మంత్రించి యెడమపార్శ్వమునుండి యుత్తరమునకుఁ దిరిగి యథాశక్తి ప్రాణాయా మముఁ జేసి యెప్పటివైపుఁ దిరిగి 'అమీమదంతపితరః' అని యట్లనే యభి మంత్రించి సవ్యముచే బిండశేషము నాఘ్రాణించి యాచమించి యన్యపవిత్రములు ధరించి సవ్యముచే 'శుంధతాం' అని మొదలుగ యథాసూత్రముగఁ జలము విడుచుట పూర్వమువలెఁ జేయునది. ఇక్కడ భుక్తశేషాన్నములేనిచో మరియొక ద్రవ్యముచే బిండదానము, వెలగపండు మారేడుపండు కోడిగ్రుడ్డు ఉసిరికకాయ రేగుపండు వీనిలో నొకదాని యంతపరిమితిగ యథాశక్తిగ బిండములు చేయవలెను. కొందరు పార్వణపిండములు మూఁడు క్రమముగ నధిక ప్రమాణములు గావలెనందురు. అట్లు హస్తలేపము లేకున్నను దర్భలయందు హస్తము వ్రాయవలెనని మేథాతిథి. ఏకోద్దిష్ట శ్రాద్ధములందు దర్భలేపమక్కరలేదని సుమంతుఁడు. ఇక్కడ నీవీబంధము విప్పి యభ్యంజనాదులు చేయవలెనని కొందరు. పిండపూజనమైన పైని యుపస్థానమునకు మున్ను నీవీ విసర్జనమని శ్రాద్ధసాగరమందున్నది. ఇఁక 'అస్మత్పితరముక నామగోత్రరూప అభ్యఙ్క్ష్వ' యని యథాలింగముగ మంత్రావృత్తిచే పిండములందు తైలమునుగాని ఘృతమునుగాని యంటించుట దర్భలు రెండిచ్చి యట్లనే 'అఙ్క్ష్వ' యని కాటుక నీయవలెను. ఆపస్తంబుల కాదియందే యంజనమాపై నభ్యంజనము. 'ఏతత్వః పితరోవాస' యని మంత్రమును ప్రతిపిండముగఁ బఠించుచు వస్త్రముగాని దాని కొసబద్దెగాని త్రిగుణమైన దారముగాని యీయవలెనని హేమాద్రి ఒకమారే పఠించి యొకమారే యీయవలెనని యన్యులు. కాకతీయులైనచో ప్రతిపిండముగ నామగోత్రములుచ్చరించి ముప్పోగుదార మిత్తురు. అటుపైని పరుపు తలాడ మొదలగునవి నివేదించి 'అస్మత్పితృభ్యః' అని చతుర్థ్యంతముతో గంధపుష్ప ధూపదీప సర్వప్రకార

నైవేద్యతాంబూల దక్షిణాదులచే పిండపూజను సవ్యముచేగాని యపసవ్య ముచేగాని చేయవలెను. యత్కించి త్పచ్యతే భక్ష్యంభోజ్యమన్నమ గర్హితకం, అని వేద్యన భోక్తవ్యం పిండమూలే కథంచన' అనఁగా వండిన భక్ష్యభోజ్య పదార్థము లన్నియు పిండములకు నివేదింపక భుజింపఁ గూడదనుట. అటుపై 'నమోవః పితరః' ఇషేత్వాదిమంత్రములచే పిండములస్తుతించి వెతికిలించిన హస్తముచే 'పరేతన'యను మంత్రమొకమారు పఠించి యొకమారుగ ప్రవాహణము చేయవలెను. అటుపైఁ దక్షిణాగ్నిహోమముఁ జేయునెడ 'అగ్నేతమద్యాశ్వ' మనుమంత్రముఁ బఠిం పుచు నగ్ని సమీపమునకు వచ్చి 'యదంతరిక్ష' మను మంత్రముచే గార్హపత్యపదము లేకుండఁగ నామంత్రముచే నుపస్థానము ఇదియు బహ్వృచులకే పాణిహోమమైనచో వారికిని లేదు. 'వీరంమే ధత్తపితర' యనుమంత్రముచే మధ్యమ పిండమైనను పిండద్వయమైనను నన్వష్టక్యాదులందు మధ్యమ పిండత్రయమునుదీసి పత్నికీయవలెను. పత్నియు 'ఆధత్త పితర'యను మంత్రముచే నొకటిగాని యనేకముగాని యిచ్చి నవి భక్షింపవలెను. ఆపస్తంబులు 'అపాంత్వోష ధీనాంరసంప్రాశయామి భూతకృతం గర్భంధత్స్వ'యని మధ్యమపిండము నీయవలెను. భక్షణమంత్రము మీఁదఁజెప్పినదే 'యధేహపురుషో ఆసత్' అని పాఠము మాత్రము భేదించుననిరి. కాకతీయులకు నిట్లనేయున్నది. ఇట్లు పిండమునిచ్చుట సంతానకామ మున్నపుడే నిత్యమనికొందరు. భార్యలనేకులయి నచో బిండము విభజించి మంత్రముతో నందఱి కీయవలెను. పార్వణ ద్వయమైనచో రెండుపిండము లిద్దరి కీయవలెను. లేదా పత్నులనేకులయినచో గుణముచే వయస్సుచే నధికురాలికీయవలెను. ఆలాగంటివారనేకులైనచో నొకదర్భయందొకతెకు మఱియొక దర్భయందు మఱియొకతె కీయవలెను. పత్ని రోగిణియైన నన్యదేశమందున్నను గర్భిణియైనను నాపిండము ముసలియెద్దునకుగాని మేకకుగాని యీయవలెను తక్కిన రెండును జలమందు వ్రేయవలెను. ఇట్లు పుత్రాదికామన లేకున్నను నగ్నియందుగాని జలమందుగాని వ్రేయవచ్చును. లేదా గోవునకు బ్రాహ్మణునికి నగ్నికి మేకకు కాకులకైన నీయవచ్చును. తీర్థశ్రాద్ధమందు పిండములు తీర్థమందే వ్రేయవలెను.

## పిండోపఘాతమందు ప్రాయశ్చిత్తము

"శ్వసృగాలఖరై స్పృష్టః పిండోభిన్నః ప్రమాదతః, మార్జారమూషకై స్పృష్టః చండాల పతితాదిభిః, ప్రాజాపత్యం చ రేత్స్నాత్వా పునః పిండాన్యథావిధి" అనఁగా కుక్క నక్క గాడిద పిల్లి యెలుక చండాలుఁడు పతితుఁడు మొదలగువారు ముట్టినను ప్రమాదమున పిండము భిన్నమైనను వాటినివిడిచి ప్రాజాపత్య కృఛ్రముఁజేసి తిరిగి యాపాకములోగాని పాకాంతరమునగాని పిండదానము మాత్రము చేయవలెను. శ్రాద్ధము తిరుగఁజేయ నక్కరలేదని సర్వసమ్మతము. కాకిముట్టినచో దోషములేదు.

## పిండనిషేధము

'వివాహ వ్రతచూడాసు వర్షమర్ధం తదర్ధకం, సంస్కారేషు తథాన్యేషు వృద్ధిమాత్రే చ మాసకం, పిండదానం మృతాస్నానంనకుర్యాత్తిలతర్పణం' అనఁగా

వివాహోపయనయ చూడాకర్మలు జరిగిన పైని క్రమముగ సంవత్సరము నారుమాస ములును మూఁడుమాసములును తక్కిన గర్భాధానాది సంస్కారములందును నన్ని వృద్ధిశ్రాద్ధములందును మాసముపర్యంతమును బిండదానమును మృత్తికాస్నానము నిత్యతర్పణ శ్రాద్ధాంగతర్పణములు తిలలతోడను జేయఁగూడదు. మహాలయము గయా శ్రాద్ధము తల్లిదండ్రుల ప్రత్యాబ్దికము యెవ్వనిదైనను సపిండీకరణమును షోడశమాసిక పర్యంతమైన ప్రేతకృత్యములందును మంగళానంతర మైనప్పటికిని బిండదానము చేయవలెను. కొందఱు సోదరుఁడు మొదలగువారి వార్షికమందును గూడుననిరి. జీవపితృకత్వము గర్భిణీపతిత్వము మొదలగువానిచే పిండదాన నిషేధమునకు ప్రతిప్రసవము మీఁదఁజెప్పఁబడినది. పిండపితృయజ్ఞమందును యజ్ఞ మందును సపిండీకరణమందును పిండమీవచ్చునని వచనము. అట్లు వికృతియగు నన్వష్టక్యాదులందు పిండదాన విధియున్నను పిండపితృ యజ్ఞ వికృతియగు పూర్వేద్యు శ్రాద్ధమందును పిండదాన నిషేధము లేదని సింధువు. కనుక నష్టకాశ్రాద్ధమందును నిషేధములేదని తోఁచుచున్నది. ఇట్లు మంగళోత్తరమందు పిండదాన నిషేధము త్రిపురుష పిండులకనితోఁచుచున్నది. ఇఁక పిండోద్వాసనమైన వైని వికిరము నీయవలెను. ఉపవీతియై దైవిక విప్రుని సన్నిధియందు దర్భలుప్రేసి 'అసోమపాశ్చయే దేవా' యను మంత్రముచే యవలు జలము నన్నములోగలిపి దర్భలపై జల్లవలెను. ప్రాచీనావీతియై పిత్ర్యద్విజుల సన్నిధిని దర్భనుప్రేసి 'యే అగ్నిదగ్ధాయే నగ్నిదగ్ధా' యనుఋక్కుచే తిలలుగలపిన యన్నము జల్లవలెను. ఆపైని "అగ్నిదగ్ధాశ్చయే జీవా యేప్యదగ్ధాః కులేమమ, భూమౌదత్తేన తృప్యంతు తృప్తాయాం తు పరాంగతిం." అని కాకతీయ సూత్రమంత్రముచే తిలోదకము నీయవలెను. పిండమువలె వికిర మును సర్వాన్నముచే జేయునది. కొందఱు 'అసోమపా'యని దైవికమిచ్చి 'అసంస్కృత ప్రమీతాయే'యను పురాణమంత్రముచే పిత్ర్యమునిచ్చి 'యేఅగ్నిదగ్ధా' యను ఋక్కుచే వేరుగ నుచ్ఛిష్టపిడమును దర్భపై నీయవలెనంద్రు. చేతులు గడిగికొని రెండుమారు లాచమించి యన్యపవిత్రములు ధరించి హరిని స్మరింపవలెను. వికిరాన్నము వేరుగ దీసి కాకులకీయవలెనని కాశికాకారులు. దైవ విప్రహస్తమందు 'శివాఆపస్సంతు' అని మొదలగుమంత్రమున నుదకము గంధము పుష్పము యవలు నిచ్చి భూమి యందు వాని విడిచినపైని మరికొన్ని యక్షతలు నాశీర్వచనమునకై యీయవలెను. ఇట్లు పిత్ర్యహస్తములందు నుదక గంధ పుష్పతిలదానాదికమపసవ్యముగఁజేసి 'అముక గోత్ర శర్మాహమభివాదయామి అస్మద్గోత్రం వర్ధతాం' అని మొదలుగఁజేయునది. కొందరిక్కడ పిత్ర్యహస్తమందు గంధతిలాది దానము సవ్యముచేసనిరి. కాకతీయు లైనచో హస్తమందక్షత లిచ్చినపైని అక్ష్య్యయోదకమిచ్చి 'అఘోరాః పితరః సంతు' అని పలికి యభివాదనము 'దాతారోనోభివర్ధంతా' అని మొదలుగఁబఠింపవలెనంద్రు. ఇట్లాశీర్వాదము గ్రహించి యక్షతలు శిరసుపై నుంచుకొని స్వయముగాగాని శిష్యాదు లచేగాని భోజనపాత్రలు దీయించి యాచమనము చేయవలెను. అనుపనీతుడు గాని స్త్రీగాని సజాతీయుడుగాని తీయంగూడదు. దైవమందును పిత్ర్యమందును స్వస్తివాచ

నము సవ్యముచేతనే 'దేవేభ్య స్వస్తీతిబ్రూత పిత్రాదిభ్యోముకనామ గోత్రాదిభ్యస్స్వస్తీతి బ్రూత' యని పలుకవలయును. ఆపైని సవ్యాపసవ్యములచే నాయాయుచ్చారములు చేయుచు నక్షయ్యోదక మీయవలెను. అటుపైని మూతవేసిన యర్చనపాత్రను దెరచి యటు తక్కినక్రియలన్నియు సవ్యముచే జేయవలెను. ద్విజులకు గర్పూరతాంబూలాదు లిచ్చి పితృపూర్వకముగ నామగోత్రాదు లుచ్చరించి దక్షిన నీయవలయునది. అపుడు 'అముకశర్మాహమముక నామగోత్రాపి స్థానీయవిప్రాయరజత దక్షిణాం ప్రతిపాద యామి' యని మొదలుగ దైవమందు సువర్ణమని యుచ్చరించునది. అశక్తిలో రెండు స్థానములకు యజ్ఞోపవీతము దక్షిణగా నీయవలెను. 'దక్షిణాఃపాంతు' అని పలికి 'స్వథాంవాచయిష్యే' యని యడిగి 'వాచ్యతాం' అన్నపైని పితృపితామహ యని మొదలుగ నుచ్చరించి 'స్వధోచ్యతా' మని పలికి 'అస్తుస్వథా' యన్న పైని పిండసమీప మం దాజ్యముఁవేసి 'స్వధాసంపద్యతా'మని సంపత్తిఁ జెప్పింపవలెను. కాకతీయ సూత్రమందు 'దాతరో నోభివర్ధంతా'మని యాశీః ప్రార్థనము స్వధావాచనము మూసిన పాత్ర దెరుచుటయు దక్షిణాదానమునని క్రమమున్నది. అనంతరమందు దేవాది ప్రీతిని బలికించి పిండస్థానమందక్షతాదులుఁవేసి సవ్యముచేతనే 'వాజేవాజే' యను మంత్రముచే 'ఉత్తిష్ఠంతు పితరో విశ్వేదేవైస్సహ' యని యొక్కమారే దర్భచే పితృపూర్వక ముగ విప్రులముట్టి విసర్జింపవలెను. 'ఆమావాజస్య' యను మంత్రముచే బ్రదక్షిణముఁ జేసి యాపైని 'దాతారోనోభివర్ధంతాం' అని వరములు యాచించుట. ఇఁక విసర్జనాంతమందు పిండదానము చేయువారికి విప్రులాచమించిన పైని సౌమనస్యము దక్షిణయు నక్షయ్యము స్వధావాచన మైనపైని 'దాతారో నోభివర్ధంతాం' అని మొదలగునది. ఆపై పిండదానాదికమునని క్రమము. హిరణ్యకేశీయులకు బిండ దానాది ప్రయోగ మతివిస్తృతముగనుక జెప్పఁబడదు. విప్రులు వరమిచ్చిన పైని 'స్వాదుషగ్ం సబ్రాహ్మణాసః పితరః' అనుమంత్రములు పఠింపవలెను. విప్రులు 'ఇహైవస్తం, ఆయుః ప్రజాం' అని పలుకవలెను. ఇట్లాశీర్వాదములచే తోషితుఁడై విప్రులను పాదాభ్యంగాదులచే సంతుష్టులఁజేసి 'అద్యమేసఫలంజన్మ, మంత్రహీనం, యస్యస్మృత్యా' యని విష్ణుస్మరణ పూర్వకముగఁ గర్మనర్పించి విప్రులక్షమను బ్రార్థింప వలెను. ఎనిమిదడుగులవరకు నంపి ప్రదక్షిణముగ దిరిగివచ్చి దీపమును హస్తముచే జల్లార్చి పవిత్రములు విడిచి పాదశుద్ధిఁ జేసుకొని రెండుమారు లాచమనముఁజేసి యుచ్ఛిష్టముఁ దీసివేసి యాపైని బహ్వృచుఁడు వైశ్వదేవము యథావిధిగఁ జేయునది. ఆపైని భృత్యులు పుత్రులు బంధువులు నతిథులు దానును పితృశేషమును భుజించు నది. శ్రాద్ధశేషాన్నమును శిష్యులకు జ్ఞాతులకు నీయవలెగాని శూద్రుల కీయగూడదు. ఇఁక బ్రాహ్మణులు భుజింపఁగ మిగిలిన భోజన పాత్రమందలి యుచ్ఛిష్టము పవిత్ర మైన భూమితో పాతిపెట్టవలెను. శ్రాద్ధమందు పర్వాదులలో నిషిద్ధమైన మాషాదులు సహితము భుజింపవచ్చును. ఏమనిన; విధి ప్రాప్తమందు నిషేధము ప్రవర్తింపదని కొందరు, శ్రాద్ధశేషము భుజింపవలెనను విధి నిషిద్ధముకాని వస్తువు భుజించినను సఫలమగును. కనుక నిషిద్ధము భుజింపఁగూడదని యితరులు. శ్రాద్ధశేషము

భుజింపనిచో దోషము. శ్రాద్ధదినమం దుపవాసము నిషేధింపఁబడినందున శ్రాద్ధ శేషము లేనిచో బాకాంతరముచే భోజనము. ఏకాదశి మొదలగు వ్రతదినమందప ఘ్రాణము ఉపవాస మన్యావశ్యకమైనచో నేకభుక్తము శ్రాద్ధశేషమును పగటి యందే భుజించునది. రాత్రిగూడదు. కనుక నక్తవ్రతదినమైనను నవఘ్రాణమే "శ్రాద్ధావశిష్ట భోక్తార స్తేవై నిరయగామినః, సగోత్రాణాం సకుల్యానాం జ్ఞాదీనాం చ న దోషకృత్." అనఁగా సగోత్రులు మాతృపితృవంశ్యులు జ్ఞాతులు తప్పఁదక్కినవార లితరశ్రాద్ధ శేషము భుజించిరేని నరకము నొందుదురు. ఈ నిషేధము బ్రహ్మచారి యతివిధవ లకు నిత్యము. జ్ఞాతి గోత్రసంబంధములేని గృహమందలి శ్రాద్ధశేషము భుజించినచో ప్రాజాపత్య కృచ్ఛ్రము చేయవలెను. యతులకు వపనము లక్షప్రణవజపమును విహిత ములు. గురువుయొక్కయు యోగియొక్కయు శ్రాద్ధశేషము గృహస్థునికి దోషము చేయదు. శూద్రునిమాత్రము యత్నముచే శ్రాద్ధదినమందు భుజింపఁ జేయ గూడదు. "శ్రాద్ధశేషం న శూద్రేభ్యః ప్రదద్యా దఖిలేష్వపి." అనఁగానే శ్రాద్ధమందును శేషము శూద్రుని కీయగూడదనుట.

## శ్రాద్ధదినమందు వైశ్వదేవనిర్ణయము

ఇందు శ్రౌతాగ్నిగల బహ్వృచులకు శ్రాద్ధమునకంటే బూర్వమే పృథక్పాకముచే వైశ్వదేవము. స్మార్తాగ్ని గలవారు నిరగ్నులు నగు బహ్వృచులకు శ్రాద్ధాంతమందే శ్రాద్ధశేషముచేగాని పాకాంతరముచే గాని యగును. కాకతీయులకైనచో, స్మార్తశ్రౌతా గ్నులు గలవారికి శ్రాద్ధము నిమిత్తమైన పాకముచే శ్రాద్ధమునకుఁబూర్వమే యగును. నిరగ్నికుల కంతమందు శ్రాద్ధశేషముచేతనైనను పృథక్పాకముచేనైన నగును. తైత్తిరీ యులు సాగ్నికులైనచో నంతటను శ్రాద్ధమునకుఁ బూర్వమే వైశ్వదేవము. పంచమహా యజ్ఞములు మాత్ర మంతమందగును. ఇతరుల కాదియందైన నంతమందైన నవి వికల్పము. తైత్తిరీయులకు మాత్రమే వైశ్వదేవమునకు వేరుగ పంచమహాయజ్ఞము లుండును. సర్వశాఖీయులకును వృద్ధిశ్రాద్ధము పాకముచే జేయునెడ పూర్వమే వైశ్వ దేవము. ఋగ్వేదుల కంతమందైనను పూర్వమందైనను గావచ్చును. ఆమాదులచే వృద్ధిశ్రాద్ధముఁ జరుగునపు డంతమందైనను పూర్వమందైన నందరకు గావచ్చునని తోఁచుచున్నది. నిత్యశ్రాద్ధమందుఁ బూర్వమే చేయునది. ఏకాదశాహము మొదలగు నేకోద్దిష్టమందుఁ బూర్వమే చేయునది. ఏకాదశాహము మొదలగు నేకోద్దిష్టముల నిరగ్నియు సాగ్నియు నందరు శ్రాద్ధశేషము ద్విజాధీనమేచేసి పాకాంతరముచే వైశ్వ దేవాదులు చేయునది.

## నిత్యశ్రాద్ధము

వర్షికాది శ్రాద్ధదినమందు శ్రాద్ధాంతమం దాపాకముచేతనే గాని పాకాంతరము చేతగాని నిత్యశ్రాద్ధముఁ జేయునది. నిత్యశ్రాద్ధమందలి దేవతలు ప్రథమశ్రాద్ధమం దుండినచో ప్రసంగసిద్ధి యనఁగ దానిచే నిదియు సిద్ధించును గనుక దర్శాదులందును మహాలయాన్వష్టకాదులందును నిత్యశ్రాద్ధము వేరుగఁజేయ నక్కరలేదు. ఇదియు

దైవహీనము నార్గురే దేవతలు. ఒకనిగాని యిద్దరనుగాని విప్రుల నిమంత్రించి దేశకాలాన్న నియమము లక్కరచేయక పునర్భోజన బ్రహ్మచర్యాది కర్తృభోక్తృ నియమములు లేకయే యథాసంభవమైన యనిషిద్ధాన్నముచే పగటియందును రాత్రి జాములోగానైనను జేయవచ్చును. తన కశక్తియగుచో బుత్రాదులు చేయవచ్చును. సూతక మందపోద్వాసన మగువరకును సపిండులు దీనికి జేయఁగూడదు. నిత్య వైశ్వదేవములో పితృయజ్ఞమైన పైని మనుష్య యజ్ఞమునకు ముందు దీనిఁ జేయవలెనని తోఁచుచున్నది. అపుడు దర్శకువలె నార్గురు పితృదేవతలను మాత్రమే విశ్వేదేవు లక్కరలేదు. యుచ్చరించి 'నిత్యశ్రాద్ధం కరిష్యే' యనియు శిష్యాదులు చేయునెడ 'యజమానస్య పితృపితామహ' యని మొదలుగ నుచ్చరించియును సంకల్పము. 'పితౄణామిదమాసనం' అని యాసనము. 'నిత్యశ్రాద్ధేక్షణః క్రియతాం' అని క్షణము నియవలెను. 'పూర్వోచ్చారితపితరః అమీవోగంథా' యని మొదలుగ విప్రునికి గంధాదులిచ్చి వర్తులముగ గాని చతురశ్రముగ గాని మండలమందు పాత్రయందు వడ్డించి 'పృథివీతేపాత్రం' అని మొదలుగ బ్రహ్మార్పణాంతము దర్శకు వలెఁ జేయునది. భోజనాంతమందుఁ దక్షిణనిచ్చిగాని యివ్వకగాని నమస్కరించి విసర్జింపవలెను. విప్రుఁడుగాని యన్నాదులుగాని సంభవింపనియెడ యథాశక్తిగ నన్నముదీసి యారుభాగములుజేసి 'యుస్మత్పితృ పితామహ' యని మొదలగు 'షడ్దేవతల చతుర్థ్యంత' ముగ నుచ్చరించి 'ఇదమన్నం స్వధాన మమ' యని త్యజింప వలెను ఆ యన్నము బ్రాహ్మణునికిగాని గోవునకుగాని యీయవలెను. లేదా జలములో వేయవలెను. అన్న త్యాగము గూడ లోపించినచో 'అర్చన్నత్రమరుతః 'మ అను ఋక్కులను పదిమారులు జపింపవలెను.

## శ్రాద్ధాను కల్పములు

అనేక విప్రులు దొరకనిచో 'దేవస్థానమందు సాలగ్రామాదిక ముంచి యొక విప్రునియందు పిత్రాది త్రయమును మాతా మహాదిత్రయమును నావాహించి సర్వ శ్రాద్ధముఁ జేయవచ్చునని మీఁదఁజెప్పఁబడినది. విప్రుఁడొకఁడును దొరకనిచో దర్భవటు శ్రాద్ధమనియుఁ జెప్పఁబడినది.

## నామ శ్రాద్ధము

ఇందేదైననిబ్బందిచే బాకము సంభవింపనిచో జాతకర్మయందును గ్రహణాదు లందును నామశ్రాద్ధముఁ జేయునది. సపిండీకరణము మాసికము ప్రత్యాబ్దికము మహాలయము నష్టకాన్వష్టకాదిశ్రాద్ధము నామముచే జేయఁగూడదు. శూద్రునికైనచో దశాహసపిండాదులు మొదలగు నన్ని శ్రాద్ధములు నామముచే జేయవలెను గాని పాకముచేఁ గూడదు. అట్లామశ్రాద్ధముఁ జేయునపుడు 'పిత్రాదుల నుద్దేశించి 'అముక శ్రాద్ధం సదైవం సపిండమామే నహవిషా కరిష్యే' యని సంకల్పము. తక్కిన ప్రయో గము పూర్వమువలెఁ జేయునది. పాకప్రోక్షణ మగునపుడామప్రోక్షణమే యగును. ఆవాహనమందు 'ఉశంతస్త్వా' యను మంత్రమున 'హవిషేఅత్తవే' యనునపుడు

'స్వీకర్తవే' యని యూహ చేయునది. భస్మమర్యాదాంతము మునుపటివలెనే చేయ వలెను. విప్రహస్తములందు బియ్యముచే నగ్నౌకరణముఁ జేయునది. అన్నమునకంటె ద్విగుణముగ చతుర్గుణముగ లేదా సమముగనైనను పాత్రలయం దామద్రవ్యము వడ్డించి పాణి హోమశేషమును పిండార్థము గొంతయు పాత్రలయందుఁ గొంతయు నుంచి 'పృథివీతేపాత్రం' అని మొదలుగ 'ఇదమామంహవ్యం కవ్య' మనియుఁ జెప్ప వలెను. 'ఇదమామ మమృతరూపం స్వాహా' యనియు దేవపితృధర్మము ననుసరించి 'మధు' అనుపర్యంతము మునుపటివలెనే. ఇఁక నేమనిన 'యథాసుఖం జుషధ్వం' అనునదియు నాపోశనము ప్రాణాహుతులు తృప్తిప్రశ్నము నక్కరలేదు. సంపన్న వాచనమైన పైని యన్న శేషప్రశ్న మక్కరలేదు. సత్తుపిండి చేతగాని బియ్యము చేతగాని పిండదానము సర్వసమ్మతము. కొందరు గృహసిద్ధాన్నముచే గాని పాయస ముచేగాని పిండదానమంద్రు. ఇట్లు విప్రసమీపమందు పిండదానమైన పైని 'నమోవః పితర ఇషే' యను నుపస్థానమంత్రమున 'ఇషే' యనునపుడు 'అమద్రవ్యాయ' యని యూహచేయవలెను. పిండోద్వాసనమైనపైని పిండజాతీయద్రవ్యముచే వికిర దానము, ఆమశ్రాద్ధమందు 'స్వస్తీతిబ్రూత' యనునది వర్జ్యము. 'వాజేవాజే' యను మంత్రమున 'తృప్తాయాత' యనునపుడు 'తర్ప్స్యధయాత' యని యూహచేయవలెను. ఆమశ్రాద్ధము ద్విజులు పూర్వాహ్ణమందే చేయవలెను. శూద్రులపరాహ్ణమునందే చేయవలెను. ఆమాన్నము దొరకనిచో హిరణ్య శ్రాద్ధము నిట్లనే చేయవలెను. సంకల్పాదులలో నంతట నామపదస్థానమందు హిరణ్యపద ముచ్చరించునది. ఆమ్లమునకువలె హేమమునకును ప్రోక్షణము. 'అత్తవే' యని మొదలగు మూఁడు స్థలమందును మునుపటివలె నూహచేయునది. తండులాదులచే హస్తమం దగ్నౌకర ణము.

## హిరణ్య శ్రాద్ధము

హిరణ్య మన్నమునకంటె నెనిమిదిరెట్లుగాని చతుర్గుణముగాని ద్విగుణముగాని లేదా సమమైనను గావలెను. హిరణ్యశ్రాద్ధమందుఁ దక్షిణ వేరుగ నీయవలెను. శ్రాద్ధమందుఁ ద్విజుఁడిచ్చిన యామద్రవ్యముగాని హిరణ్యముగాని యథేష్టముగ భుజింప వచ్చును. శూద్రుఁడిచ్చినది భోజనము తప్పఁ దక్కిన కర్చుచేయవచ్చును. శ్రాద్ధమందిచ్చిన యామముచే బంచయజ్ఞములు. శ్రాద్ధమును జేయఁగూడదు. హేమ శ్రాద్ధమందు నామశ్రాద్ధమందును పిండదానము వికల్పితము. కనుక నివి సంకల్ప విధిచేఁగూడ జేయవచ్చును. సాంకల్పికవిధిలో సమంత్రకముగ నావాహనమర్ఘ్యము నగ్నౌకరణము పిండదానము వికిరము నక్షయ్యము స్వధావాచనము ప్రశ్నము నను నివి యన్నియు వర్జ్యములు. అపుడు 'అముక శ్రాద్ధమామేన హవిషాహిరణ్యేన వాసాం కల్పికవిధినా కరిష్యే' యని సంకల్పము. శూద్రగృహమందు మరియొకరి వస్తువైనను క్షీరాదికమైనను భుజింపఁగూడదు. ఇఁక శూద్రుఁడిచ్చినది గూడదని చెప్పనక్కరలేదు. కనుక శూద్రుఁడిచ్చునది ద్విజగృహమందు వండి భుజింపవచ్చును.

## సాంకల్పికవిధి

ఇందు పిండదానము నిషేధించిన సంక్రాంతి యుగమన్వాది శ్రాద్ధములం దును వృద్ధికర్మఁ జరిగినపైని వచ్చు దర్శాదులందును సాంకల్పిక విధిఁజేయవలెను. మరియు పిండదానాదులు విస్తరించి యున్నపుఁడశక్తుఁడైనచో సాంకల్పికవిధిఁ జేయ వచ్చును. ఎట్లనిన; 'అముకంశ్రాద్ధం సంకల్ప విధినాన్నేన హవిషాకరిష్యే'యని సంక ల్పించి మూఁడవక్షణమిచ్చు వరకును బూర్వమువలెజేసి యర్ఘ్య దానము సమంత్రకా వాహనమును వర్జింపవలెను. 'దేవానావాహయామి పితౄనావాహయామి' యనియే యావాహించి గంధాదిపూజనము మొదలుగభస్మమర్యాదాంతమందు నగ్నౌకరణము విడిచి పరివేషణము మొదలగునదిజేసి సంపన్న వచనమైనపైని ఉత్తరాపోశనము వికిరపిండదానవర్జ్యముగ నక్షయ్యవచనాంతముఁజేసి 'స్వధాంవాచయిష్యే స్వధోచ్య తాం' అను వాక్యముల వర్జించి తక్కినది పూర్వమువలెఁ జేయునది. ఇట్లు సాంకల్పిక ప్రయోగము.

## అనుకల్పములు

విప్రాదులు దొరకనపుడు దర్భవటు విధానముచే పిండదానము మాత్రము చెప్పఁబడినది. లేదా ద్రవ్యము విప్రుఁడును లభింపనిచో పక్వాన్నముచే పితృసూక్త ముతో హోమము చేయవలెను. అదియును గానిచో శ్రాద్ధదినమం దుపవాసము చేయునది బ్రాహ్మణునకుఁ జలపూర్ణఘటమిచ్చునది. గోవునకు గడ్డివ్రేయునది. దేనితో నైన పిండములుచేసి యర్పించునది. లేదా స్నానముఁజేసి తిలలు దర్భలుగలపితర్ప ణము చేయునది. లేదా గడ్డి రుప్పగాల్చవలెను. ధాన్యము తిలలు స్వల్పమైన దక్షిణను గాని యీయవలెను. లేదా సంకల్పము మొదలుగ సర్వశ్రాద్ధ ప్రయోగముఁ బఠించ వలెను. ఏదియుఁ జేయలేనపుడు వనమునకుఁబోయి చేతులు పైకెత్తి చంకలుచూపుచు నిది పఠించవలెను. "నమేస్తివిత్తంనధనం న చాన్య చ్ఛ్రాద్ధోపయోగిస్వపితౄన్నతోస్మి, తృప్యంతు భక్త్యాపితరో మయైతౌ భుజౌకృతౌ వర్తనిమారుతస్య." అని. అనఁగా నాకు ధనము శ్రాద్ధానుకూలమైన వస్తువు దొరకలేదు. భక్తిచే నాకాశమందు చేతులు చాపి నమస్కరించితిని. దీనిచే పితరులు తృప్తులగుదురుగాక యనుట. ప్రధానఖండ ములో మరికొన్ని శ్లోకములందిట్లున్నవి.

## శ్రాద్ధభోజనమందు ప్రాయశ్చిత్తములు

దర్శశ్రాద్ధభోక్త యారు ప్రాణాయామములు చేయునది. మహాలయాది శ్రాద్ధము లందును మూఁడువత్సరములైన పైని ప్రత్యాబ్దికమందును నారు ప్రాణాయామములే. పదిమారులు గాయత్రిచే నభిమంత్రించి జలముద్రాగినను సరియే. ఇట్లు ప్రాయ శ్చిత్తము విధింపని శ్రాద్ధములందంతటఁ జేయునది. వృద్ధిశ్రాద్ధమందు మూఁడు ప్రాణాయామములు. జాతకర్మ మొదలుగ చూడాకర్మాంతమైన సంస్కారముల కంగమైన వృద్ధి శ్రాద్ధమందు సాంతపవకృచ్ఛ్రము. జాతకర్మాంగమందు చాంద్రాయణ మైనను గావచ్చును. ఇతర సంస్కారముల కంగమగు శ్రాద్ధమందు నుపవాసము.

సీమంత సంస్కారమందుగాని తదంగశ్రాద్ధమందుగాని భోక్తకు చాంద్రాయణము ఆపదయందు దశాహములోగా నవాహ్నికములందుగాని యేకాదశ శ్రాద్ధమందు గాని భోక్తకు ప్రాజాపత్యకృచ్ఛ్రము. ద్వాదశాహము మొదలగు సపిండీశ్రాద్ధమందు నూనమాసికమందును పాదోనకృచ్ఛ్రము, ద్వితీయమాసికము త్రైపక్షికము నూనమాసికమునూ నాబ్దికము వీనియందుదర్ధ కృచ్ఛ్రము. ఇతరమాసికములందు ప్రథమాబ్దికమందును, సాంవత్సర విమోకమందును పాదకృచ్ఛ్రము. ఉపవాసమైనను గావచ్చును. గురువునకుఁ ద్రవ్యమిచ్చుటకైనను జపశీలుఁడైనను నంతటఁ జెప్పినదానిలో సగము చేయునది. ఆపదలేనిచో నూనమాసికము పర్యంతము చెప్పినవాటిలో చాంద్రాయణము, ప్రాజాపత్యమును, ద్వితీయమాసికము మొదలుగ నాల్గింటియందును పాదోనకృచ్ఛ్రము. త్రిమాసాదులలో నర్ధకృచ్ఛ్రము ప్రథమాబ్దికమందు పాదోనకృచ్ఛ్రమే. రెండవ మూఁడవ ప్రత్యాబ్దికములందు నొకయుపవాసము. క్షత్రియశ్రాద్ధమైనచో మీఁదఁ జెప్పినది ద్విగుణముగ జేయవలెను వైశ్యుఁడు చేయుచో త్రిగుణము. శూద్రుఁడు చేసినచో నంతటను భోక్తకు చతుర్గుణము ప్రాయశ్చిత్తము. చండాల విషజల సర్ప పశ్వాదులచే హతులగువారికిని పతితక్లీబాదులకును జేయు నవాహ్నికములందు చాంద్రాయణము. ఏకాదశ్యాహశ్రాద్ధమందు పరాకము చాంద్రాయణమును ద్వాదశాహాదులందు పరాకము. ద్విమాసాదులు నాల్గింట నతికృచ్ఛ్రము. ఇతరమాసికములందు కృచ్ఛ్రము. ఆబ్దికమందు పాదకృచ్ఛ్రము. అనేక పర్యాయములు భోక్తయైనచో నంతటఁ ద్విగుణము. ఆమహేమశ్రాద్ధములందు సాంకల్పికమునందును నాయాశ్రాద్ధ ప్రాయశ్చిత్తములో సగము. యతియు బ్రహ్మచారియు నాయా ప్రాయశ్చిత్తముఁజేసి యుపవాస త్రయమును ప్రాణాయామములు నూరును ఘృతప్రాశనమును జేయవలెను. ఆపదలేనిచో ద్విగుణముగ జేయవలెను. దర్శాదులందు గృహస్థుఁడువలె బ్రహ్మచారియు ప్రాయశ్చిత్తముఁ జేయునది. చౌలసంస్కారమందు భుజించినచో కృచ్ఛ్రము, సీమంతమందు చాంద్రాయణము అన్యములందుపవాసము, ఏకాదశాహ శ్రాద్ధమందు భుజించెనేని చాంద్రాయణము పునస్సంస్కారమునని హేమాద్రి.

## మృతిదిన శ్రాద్ధమందు విశేషము

మృతదినమన నేమాసమందేపక్షమున నేతిథియందు దనపిత్రాదులు మృతినొందెనో యాదినము మృతాహస్సనఁబడును. అపుడు పిత్రాదులు ముగ్గురినే యుద్దేశించి వార్షిక శ్రాద్ధము పురూరరవార్ద్రవదే వసహితముగఁ జేయవలెను. ఇక్కడ పిత్రాదులకు సపత్నీకత్వము రానేరదు. మాతామహాదులురారు. ఇక్కడ తిథిఖండమైనచో నిర్ణయము. రాత్రియందును జేయఁదగుటయు గ్రహణదినమం దదివచ్చినను నిర్ణయము. మలమాసాదినిర్ణయము దర్శయం దిదివచ్చినచో నిర్ణయము. శుద్ధిశ్రాద్ధ నిర్ణయము. శ్రాద్ధకాలనిర్ణయ ప్రసంగములో మీఁదఁజెప్పినరీతిని దెలియవలెను. 'పారణె మరణే చైవతిథి స్తాత్కాలికీమతా' యనియున్నందున మరణతిథి కపరాహ్ణవ్యాప్తి మొదలగుదానిచే నాబ్దికశ్రాద్ధ నిర్ణయము తెలియునది. తలిదండ్రుల ప్రథమాబ్దికము సోదరులు విభక్తులైనచో వేరుగఁజేయవలెను అవి భక్తులైనచో జ్యేష్ఠుఁడే చేయవలెను.

ఇట్లు మాతృమృత దినమందు మాత్రాదిత్రితయమునే యుద్దేశించి శ్రాద్ధము. తలి దండ్రుల మృతదినమొక్కటియే యైనచో మొదట పితృ శ్రాద్ధముఁజేసి స్నానముఁ జేసి మాతృశ్రాద్ధముఁ జేయునది. ఇట్లు తలిదండ్రు లొక్కదినమందు మృతులై యొక్క మారుగఁదహనము చేయఁబడినను దెలియునది. సహగమనమందు మాత్రము పాక మొక్కటిచే చేసి పితృపార్వణము మాతృపార్వణమును రెండిటితో నొక్క శ్రాద్ధమే చేయునది. పిండములారు అర్ఘ్యములు నారు విశ్వేదేవులు భిన్నులుగారు. సహగమనమందును సువాసినియై మృతినొందినపుడును విప్రపంక్తిలో సువాసినిని గూడ భుజింపఁజేయునది. సువాసినికి కుంకుమాది స్త్రీయలంకారము లీయవలెను. స్త్రీల శ్రాద్ధములం దంతటను విప్రులకు వస్త్రయజ్ఞోపవీత గంధపుష్పాదులనే యీయ వలెనుగాని కుంకుమాదులక్కరలేదు. ఇట్లు సవతితల్లికి, మాతామహునికి, మాతామహికి భ్రాతకు, నత్తకు, మామకు, గురువునకు, మేనత్తకు, పినతల్లికి, భార్యకు, నాడుబిడ్డకు, పుత్రులు లేనియెడ పార్వణవిధిచేతనే శ్రాద్ధముచేయునది. కొందరు పితృ మాతృ మాతామహ మాతామహీ వ్యతిరిక్తుల కందరకు నేకోద్దిష్ట విధానము చేతనే జేయవలెనండ్రు. ఇక్కడ దేవాచారమునుబట్టి వ్యవస్థఁ దెలియునది. పిత్రాది వార్షిక దినమందు పినతండ్రి మొదలగువాని వార్షికము ప్రాప్తించినచో పిత్రాది శ్రాద్ధము స్వయముగఁజేసి రెండవది శిష్యాదులచేఁ జేయింపవలెను మరియొక్క దినమందైనను స్వయముగఁ జేయవచ్చును. తండ్రి సన్యసించినను పుత్రుఁడాబ్ది కాదులు పార్వణముతోఁ జేయవలెను. ప్రథమవత్సరమందు వర్షాంతమందు సపిండనముఁ జేయుపక్షమున మృతాహస్సున కంటెఁ బూర్వదినమందు సపిండనము సాంవత్సరిక శ్రాద్ధమును చేసి పరదినమందు వార్షికముఁ జేయునది.

## మృతాహస్సుఁ దెలియనిచో నిర్ణయము

దేశాంతరమందు మృతుఁడగుటచే మాసము మాత్రముఁ దెలిసి మృతిదినము తెలియనిచో నామాసమం దమావాస్యయందైనను శుక్లకృష్ణైకాదశులందైనను ప్రతి వార్షిక శ్రాద్ధము. మృతదినము తెలిసి మాసము తెలియనిచో మార్గశీర్షము మాఘము భాద్రపదము నాషాఢము వీనిలో నొకదానియందాతిథిలో వార్షికశ్రాద్ధము. మాసము తిథియు రెండును దెలియనిచో నింటినుండి బయలుదేరిన తిథియు మాసఁము గ్రహించునది. మరి ప్రయాణమందలితిథి మాసములుఁ దెలియనిచో మృతవార్త వినుపించిన తిథిమాసములుఁ గ్రహించునది. ప్రయాణమందును మృతవార్తయం దును మాసముఁ దెలిసి తిథి దెలియనిచో నా మాసమందలి దర్శాదికమందు వార్షి కము. ప్రయాణాదులందు తిథిమాత్రముఁదెలిసి మాసముఁ దెలియనిచో మీఁదఁ జెప్పిన మార్గశీర్షాదులలో నొకమాసమందాతిథి యందు వార్షికము. ప్రస్థాన మరణ తచ్ఛ్రవణములలో దినము మాసము నెరుగనియెడ మాఘమందుగాని మార్గశీర్ష మందుగాని దర్శయందు వార్షికముఁ జేయునది. పండ్రెండు మొదలుగ సంవత్సర ములు ప్రతీక్షించి పాలాశవిధిచే శ్రాద్ధము జేసెనేని దాహదినమందే వార్షికమని తెలియునది.

## శ్రాద్ధవిఘ్నమందు నిర్ణయము

నిమంత్రణముఁ జేసినపైని విప్రునికిఁ జాతాశౌచముగాని మృతాశౌచముగాని వచ్చినయెడ నాశౌచము లేదు. నిమంత్రణమనఁగ రెండుమారు క్షణమిచ్చుట సమంత్రకముగనైనచో ననితోఁచుచున్నది. లౌకికమైన పిలుచుటమాత్రముకాదు. కర్తకు పాక పరిక్రియఁ జరిగినపైని నాశౌచ మంటదు. పరిక్రియ యనఁగ మంత్రసహితముగ పాకము ప్రోక్షించుట యని యంద్రు. కర్తగృహమందు భోజనారంభమైన పైని జననముగాని మరణముగాని ప్రాప్తించినచో భోజనశేషము విడిచి పరగృహమం దాచమనముఁ జేయునది. ఇఁకనేమనిన; సర్వమయిన యపవాదశాస్త్రములును గతిలేనిచోట ప్రవర్తించును గనుక పాకప్రోక్షణమయినపైని నాశౌచము వచ్చినను నాశౌచ శుద్ధ్యంతమందు శ్రాద్ధము చేయవలెనని నాకుఁ దోఁచుచున్నది. భోక్తకయినచో భోజనారంభమునకు ముందుఁ దెలిసెనేని మరియొకని నిమంత్రింపవలెను. భోజన మారంభించినపైని దెలిసినచో నట్లనే శ్రాద్ధము పూర్తిఁజేయునది. భోక్తమాత్రము భోజనాంతరమందు నాశౌచప్రకరణమందుఁ జెప్పఁబోయెడు ప్రాయశ్చిత్తముఁ జేయవలెను. అనఁగా భోజనకాలమందు సూతకమువచ్చినచో నాయన్నము భుజించెనేని ప్రాయశ్చిత్తము ముందుఁ జెప్పఁబడినది యిచ్చట గ్రహింపవలెనని తాత్పర్యము. సంకటమందైనచో మీఁదఁ జెప్పఁబడినది యని యుక్తముగఁ గ్రహించునది. నిర్ణయ సింధువునందు పాకానంతర మాశౌచము లేదనువచనము కర్తృమాత్రపరము గనుక భోక్తకు ప్రాయశ్చిత్తము నాశౌచమును జెప్పఁబడినది. అది యెట్లనిన; బ్రాహ్మణుని కాశౌచమువచ్చినపుడు శ్రాద్ధమందొకమారు కామపూర్వముగ ననఁగ తెలిసి భుజించినచో సాంతపనకృచ్ఛ్రము అసకృద్భోజనమైనచో మాసపర్యంతము కృచ్ఛ్రము చేయునది. అజ్ఞానమునుండి విప్రాదుల కాశౌచముఁ దెలసివారియన్నము భక్షించినచో నొకదినము, మూఁడుదినములు నైదుదినములు నేఁడుదినములు క్రమముగ నభోజనము నంతమందు పంచగవ్యప్రాశనమును, అసకృత్తుగానైనచో ద్విగుణము బ్రాహ్మణాదుల యాశౌచమందొకమారైనను భుజించువానికి వారియాశౌచము శుద్ధివరకు నాశౌచమగునని విష్ణూక్తమైనదియే యాశౌచమని తెలియునది. శ్రాద్ధకాలము నందు నన్యకాలమునందు నిది సమమే యని తెలియునది. దాతకు భోక్తకు నిద్దరకు నాశౌచము తెలియనియెడ దోషములేదు. ఆశౌచమధ్యమందు శ్రాద్ధదినము వచ్చినచో నాశౌచమున కంతమైన పదునొకండవదినమందు చేయవలెను. అది దాటినచో శుద్ధమాసమందు చేయవలెను. అనఁగా మలమాసమైనచో జేయఁగూడదని తాత్పర్యము ఇది మాసికమందు ప్రతివార్షికమందును దెలియునది దర్శాదులకు పంచమహాయజ్ఞాదులకువలె లోపమే యగును. ఆశౌచాంతమందు చేయనక్కర లేదనుట. అట్లు ప్రాయశ్చిత్తము నక్కరలేదు. ఆశౌచాదికము లేకుండఁగ దర్శాదులకు లోపమువచ్చినను నుపవాసము ప్రాయశ్చిత్తమేగాని కాలాంతరమందు తిరుగఁజేయ నక్కరలేదు; పదునొకండవదినమందు సంభవింపనిచో నమావాస్యయందుగాని శుక్ల

కృష్ణైకాదశియందుగాని వార్షికము. ఇట్లు మరికొన్నిటికి వచనము. "మాసికంచోద కుంభంచ యద్య దంతరితం భవేత్, తత్తదుత్తరసాం తంత్ర్యా దనుష్ఠేయం ప్రచక్షతే." అనఁగా మాసికము నుదకుంభము మొదలగునది విఘ్నమైనచో నుత్తరమందైన దానిలో గలపి చేయవలెను. కొందరు ప్రత్యాబ్దికముగూడ విఘ్నముఁ గలుగునపుడు దర్శాదికాలము సంభవించినపుడు ముందుమాసమం దాతిథియందుఁ జేయవలె నంద్రు. ఆశౌచముగాక వ్యాధి మొదలగునవి యైనను మరచిపోయినను నట్లనే జేయవలెను. కొందరు వ్యాధి మొదలగునవి వచ్చునపుడు పుత్రాదులచే నాదినమందే యాబ్దికముఁ జేయింపవలెనంద్రు.

## భార్యకు రజోదోషమందు శ్రాద్ధనిర్ణయము

అందు దర్శయుగాది మన్వాద్యష్టకాన్వష్ట కాదిశ్రాద్ధములు పాకముఁ జేయుట కన్యులు లభించిరేని యన్నముచే నా దినమందే చేయవచ్చును. లేనియెడ నామముచేఁ జేయవలెను. కాలాదర్శమందు దర్శశ్రాద్ధము నైదవదినమందు చేయవచ్చునని పక్షాం తరమున్నది. సకృన్మహాలయము దర్శయందు భార్య రజస్వలయైనను ముఖ్యకాల మతిక్రమించునను భయముచే నపుడే చేయవలెను. ఇట్లాశ్విన శుక్లపంచమి యందు నూహించునది. అష్టమి మొదలగు దినములందు సకృన్మహాలయము భార్య రజస్వల యైనచో జేయఁగూడదు. కాలాంతరము సంభవించునని మొదలుగ మహాలయ ప్రకరణోక్తము స్మరించునది. ప్రత్యాబ్దికము మాసికమును రజోదోషమైనప్పటికి నా దినమందే చేయవలెనని యొకపక్షము. అయిదవ దినమందు చేయవలెనని రెండవ పక్షము. ఈ రెంటియందును గ్రంథసమ్మతియు శిష్టాచారసమ్మతియుఁ గలదు. భార్యాంతరమున్నచో నాదినమందే యని సర్వసమ్మతము. ఆ దినమందు చేయు నపుడు శ్రాద్ధకాలమందు రజస్వలాదర్శనాదికము వర్జ్యము. కనుక నట్టి గృహము సంభవించకపోయినను పాకముచేయువారు దొఱకకున్నను పంచమదినమందునను పక్షము శ్రేష్ఠము. అపుత్రురాలగు స్త్రీ రజోదోషమందు భర్త యాబ్దికము మొదలగునది పంచమదినమందే చేయవలెనుగాని యాదినమందే మరియొకరిచే జేయింపఁ గూడదు. ఇఁక పతినుద్దేశించి యగ్ని ప్రవేశమైనచో నందు సహగమనమే విప్రస్త్రీలకు, క్షత్రియాదులకు సహగమనము ననుగమనమును నగును. ఒక్కచితిపై యొక్కమారే దంపతులకు మంత్రయుక్తముగ దహనము సహగమనము. భర్తకు సమంత్రకదాహ మైన పైని వేరుగ చితిలో నగ్నిప్రవేశ మనుగమనము. ఈ రెంటియందును తిథి యొక్కటియైనచోనపుడే తంత్రముచే పాకాదికముఁజేసి దర్శకువలె షట్పిండములు షడర్ఘ్యములు విప్రభేదము గలిగి పితృపార్వణము మాతృపార్వణమును గల్గిన యొక శ్రాద్ధము చేయునది. విశ్వేదేవులకు భేదము వికల్పితము. తిథి భేదమున్నను శ్రాద్ధ దినము భేదించినచో వేరుగనే చేయవలెను. కొందరు సహగమనమందు తిథి భేద మున్నను భర్తయొక్క మృతతిథియందే పత్నికిని శ్రాద్ధముగాని దినాంతరమందు గాదంద్రు. అది స్వల్పకాలవ్యవధానమైనపుడని తెలియునది. రెండు మూఁడుదిన ములు వ్యవధానమైనచో నట్లు గూడదు.

# శ్రాద్ధసంపాతమందు నిర్ణయము

తలిదండ్రులకు మృతతిథి యొకటియే యైనచో పాకభేదముచే పితృశ్రాద్ధానంతరము మాతృశ్రాద్ధమని మీఁదఁ జెప్పఁబడినది. గృహదాహాదికముచే సపిండులకు యుగపన్మరణము ప్రాప్తించినచో సంబంధ సామీప్య క్రమముచే శ్రాద్ధములను పాకభేదముచే వేరువేరుగఁ జేయవలెను. అట్లు జేయ నశక్తుఁడైనచో దంత్రముచే నొక్కమారే పాకముఁజేసి శ్రాద్ధములు వేర్వేరుగఁ జేయునది. క్రమముగ నొకదినమందే మరణమొందిరేని మరణక్రమముచే జేయవలెను. అపుఁడొకదినమందు మూఁడు శ్రాద్ధము లొక్కఁడు చేయఁగూడదు. వార్షిక శ్రాద్ధములు మూఁడు సంభవించినచో రెండిఁటిని స్వయముగాజేసి యొకటి యన్యునిచే జేయించునది. లేదా మరునాఁడు దానే చేయవచ్చును. తలిదండ్రులకును సపిండునికిని శ్రాద్ధములు వచ్చినచో మీఁదఁజెప్పఁబడినది. "శ్రాద్ధంకృత్వాతు తస్యైవ పునశ్శ్రాద్ధం న తద్దినే, నైమిత్తికం తు కర్తవ్యం నిమిత్తో త్పత్త్యనుక్రమాత్" అనఁగా ఒకశ్రాద్ధ మొకనికిఁజేసి తిరుగ నతనికీ శ్రాద్ధము నాదినమందుఁగూడదు. నైమిత్తిక శ్రాద్ధమైనచో నిమిత్తక్రమము ననుసరించి చేయవచ్చును. అట్లు షణ్ణవతిశ్రాద్ధములలో సమాన దేవతాకములైనవి తంత్రముచే జేయవచ్చును. అధిక దేవతలున్నచో వేర్వేరుగఁ జేయునది. వార్షికము మాసికము నుదకుంభశ్రాద్ధము వీనిఁ జేయునపుడు నిత్యశ్రాద్ధము దర్శశ్రాద్ధమును దేవతాభేదమున్నందున వేర్వేరుగఁజేయవలెను. మహాలయమందును తీర్థశ్రాద్ధమందును దర్శాది షణ్ణవతులందును నిత్యశ్రాద్ధము వేరుగఁజేయ నక్కరలేదు వాటిచే దీనికి ప్రసంగసిద్ధియగు. మాసికముచే నుదకుంభశ్రాద్ధమునకు ప్రసంగసిద్ధి యగును. ప్రసంగసిద్ధియగు స్థలమందు ప్రసంగియగు దర్శాదికము సంకల్పించి చేయవలెను గాని ప్రసంగసిద్ధమగు నిత్యశ్రాద్ధమునకపుడు సంకల్పాదులలో నుచ్చారమైన నక్కర లేదు. కనుక లోపమనుటయే తాత్పర్యము. మంత్రసిద్ధిలో రెండువిధములు తోఁచును. దర్శవ్యతీపాత శ్రాద్ధముల తంత్రముచే ననుష్ఠించునెడ 'షట్పురుషానుద్దిశ్య దర్శశ్రాద్ధం వ్యతీపాత శ్రాద్ధం చ తంత్రేణ కరిష్యే' యని సంకల్పించి 'దర్శపాత శ్రాద్ధయోర్దేవార్థంక్షణః కరణీయః' అని వర్గద్వయమున కిద్దరు మొదలుగ విప్రుల నిమంత్రించి యొకటిగనే శ్రాద్ధము చేయవలెనని యొకవిధము. లేదా పూర్వమువలె సంకల్పించి దేవార్థము తంత్రముచే నొకవిప్రుని నిమంత్రించి షోడశమాసికముల తంత్రమువలె 'దర్శశ్రాద్ధేక్షణః కరణీయః' అని మరియొక విప్రుని నిమంత్రించి విప్ర చతుష్టయము మొదలుగఁ గూడినదియు పాతశ్రాద్ధమందు పిండములు లేవు గనుక షడర్ఘ్యపిండములతో గూడిన శ్రాద్ధమొక్కటియే కపాకముచే జేయవలెనని రెండవ విధము. ఇట్లు మూఁడు నాల్గు శ్రాద్ధములు గలసినచో నూహించునది. ఇందు పక్షద్వయమును విచారించి యుక్తపక్షము సత్పురుషు లాచరింపవలెను. మయూఖమందు సపిండకమైన దర్శశ్రాద్ధముచే బిండరహితమైన వ్యతీపాతాది శ్రాద్ధమేక దేవతాకము ప్రసంగముచేసి సిద్ధించును. తంత్రసిద్ధి యిక్కడలేదనియు తంత్రమున కుదాహరణము పాత సంక్రాంత్యాదులుఁ గలసినచో ననియుఁ జెప్పఁబడినది.

# శ్రాద్ధములు అనేకములుగలసినచో నిర్ణయము

నష్టకృశ్రాద్ధముచే పితృమాతృవార్షిక మాసిక శ్రాద్ధములకు ప్రసంగసిద్ధి యని చెప్పఁబడినది గాని యట్లైనచో మహాలయముచే వార్షికశ్రాద్ధము సిద్ధించునని యాపత్తి వచ్చును గనుక నది బహుగ్రంథవిరుద్ధము. మఱియు దేవతాభేదముచే భిన్నములగు దర్శవార్షికాదులందు "నిమిత్తాని యతిశ్చాత్ర పూర్వానుష్ఠాన కారణం" అను వచన మున మొదటవార్షికము నటుపైని దర్శయునగును. అనఁగా నందరకు నేకరూపముచే నొక్క కాలమందు ప్రాప్తించనిది. నియతనిమిత్తకము గాదు. ఏమనిన; వార్షికము మాసికమును గనుక నది పూర్వము చేయవలెనని వచనమున కర్థము. దర్శ యందరికి నొకరూపమున నొక్కకాలమందు ప్రాప్తించును. కనుక నియతమైన నిమిత్తముగలది. కాఁబట్టి యది వెనుకఁ జేయవలెననుట వార్షికమాసికాదులకు సంపాతమనఁగ నేకకాలప్రాప్తియైనచో పితృపూర్వకత్వము సంబంధ సామీప్యాది కముఁ గ్రహింపవలెనని మీఁదఁజెప్పఁబడినది. దర్శమహాలయములకు సంపాత మైనచో బూర్వము మహాలయము నటుపైని దర్శయ దర్శయందు వార్షిక మహా లయము ప్రాప్తించినచో బూర్వము వార్షిక మాపైనిమహాలయము నటుపైని దర్శయు నని మూఁడును పాకభేదముచే గావలెను. విస్తరము మహాలయ ప్రకరణమందుఁ దెలియునది. తథా "కామ్యతంత్రేణ నిత్యస్య తంత్రం శ్రాద్ధస్య సిద్ధ్యతి" అనఁగా కామ్య శ్రాద్ధతంత్రముతో నిత్యశ్రాద్ధమునకు దంత్రసిద్ధి యగుననుట. ఇఁక సంక్రాం తులు దక్షిణాయనోత్తరాయణములు తులామేషములను విషువద్వయము యుగాదులు మన్వాదులు భాద్రపద కృష్ణత్రయోదశి శ్రోత్రియుఁడు దొరకుట. మఘ, భరణి, మఘాయుత త్రయోదశి, వైధృతి, వ్యతీపాత, గ్రహణము, పుత్రోత్పత్తి, అలభ్యయోగము మొదలగు నిమిత్తములచే నగు శ్రాద్ధములును భాద్రపద పూర్ణిమతప్పఁ దక్కిన పూర్ణిమా శ్రాద్ధములన్నియు పిండరహితముగ సంకల్పవిధిచే జేయవలసినది. దర్శకువలె వీటికిని నార్గురుపురుషుల నుద్దేశించుటయే కనుక నివి యొకదినమందు ప్రాప్తమగు నపుడు తంత్రముచే సిద్ధియగును నిత్యశ్రాద్ధమునకు ప్రసంగసిద్ధియే యగును. గ్రహణ శ్రాద్ధము భిన్నకాలమైనచో వేరుగజేయునది. గ్రహణశ్రాద్ధముచే సంక్రాంతి దర్శాది శ్రాద్ధములకు ప్రసంగసిద్ధియని ప్రథమపరిచ్ఛేదమందు జెప్పఁబడినది. మతాంతరము, పుత్రోత్పత్తి నిమిత్తక శ్రాద్ధము తొమ్మండ్రుదేవతలుగలది గనుక వేరుగ జేయునది. ఆదియు హిరణ్యశ్రాద్ధమేగాని ఆమద్రవ్యము గూడదు. అన్నము బొత్తిగా గూడదు.

## తిలతర్పణమును

శ్రాద్ధములో నుద్దేశించిన పితరులనందర నుద్దేశించి తిలలచే దర్పణము శ్రాద్ధాంగము చేయునది. అపుడు కాలనియమము. 'పూర్వం తిలోదకందర్శే ప్రత్యబ్దేతు పరేహని' యనఁగా దర్శశ్రాద్ధమందు శ్రాద్ధమునకు బూర్వమే శ్రాద్ధాంగతిల తర్పణము. అందు విప్ర నిమంత్రణమైన పైనిగాని పాకారంభోత్తరముగాని బ్రహ్మయజ్ఞము జేసి నచో బ్రహ్మయజ్ఞాంగ నిత్యతర్పణముచేతనే దర్శాంగతిల తర్పణమునకు సిద్ధి లేక యంతకుబూర్వముగాని వైశ్వదేవోత్తరమందుగాని బ్రహ్మయజ్ఞముజేయునెడ శ్రాద్ధీయ

షట్పురుషుల నుద్దేశించి శ్రాద్ధాంగతర్పణముజేసి శ్రాద్ధారంభము జేయునది ప్రత్యహము జేయునిత్యతర్పణము బ్రహ్మయజ్ఞకాలమందే చేయవలెను. ఇట్లు యుగాది మన్వాది సంక్రాంతి వైధృతివ్యతీపాతాది శ్రాద్ధములందును దర్శయందును దర్శయందు వలె బూర్వమే తిలతర్పణము 'తీర్థశ్రాద్ధమందు సర్వపితృద్దేశముచే బూర్వమే చేయ వలెను. వార్షిక శ్రాద్ధమందు పరదినమందే పిత్రాదిత్రయము నుద్దేశించి శ్రాద్ధాంగ తిలతర్పణము. వార్షికదినమందు నిత్యతర్పణము తిలలతో జేయcగూడదు. సకృన్మహాలయమందును నందరు పితరుల నుద్దేశించి పరదినమందే జేయవలయును. ఇతర మహాలయశ్రాద్ధములందును అష్టకాన్వష్టకాపూర్వేద్యు శ్రాద్ధములందును మాఘ పూర్ణిమయు నర్ధోదయము గజచ్ఛాయషష్ఠి భరణిమఘయు వీని శ్రాద్ధములందును హిరణ్యశ్రాద్ధమందును విప్ర విసర్జనానంతరమే శ్రాద్ధీయదేవతల నుద్దేశించి తర్పణము. శ్రాద్ధసంపాతమందు ప్రసంగసిద్ధియైన యెడ ప్రసంగిశ్రాద్ధమున కంగ మగుతర్పణము మాత్రమే కావలెను. తంత్రముగ జేయవలసినయెడ పూర్వమందు దర్పణము విధించినదియు పరమందు దర్పణము విధింపcబడినవియు సమాన సంఖ్యగలవియైనచో నాదియందైను వంతమందైనను దర్పణము విషమసంఖ్య గలదైన యెడ నాధిక్యమునుబట్టి నిర్ణయము. సంక్రాంతులందు గ్రహణమందును తలిదండ్రుల శ్రాద్ధమందును వ్యతీపాతమందును పినతండ్రి మొదలగువారి శ్రాద్ధమందును మహాలయమందును నిషిద్ధమగు తిథియైనను శ్రాద్ధాంగ తిలతర్పణము జేయవచ్చునని కొందరు ఇతరుల శ్రాద్ధాంగ తిలతర్పణమందంతటను తిథ్యాది నిషేధములేదనిరి.

## శ్రాద్ధాంగమైన తిలతర్పణములు

'వృద్ధిశ్రాద్ధేసపిండ్యాంచ ప్రేతశ్రాద్ధేను మాసికే, సంవత్సర విమోకేచ నకుర్యాత్తి లతర్పణం.' దీనియర్థము స్పష్టము. తర్పణముజేయు విధానము. పరదినమందు తర్పణముజేయునెడ స్నానముజేసి శ్రాద్ధాంగతర్పణము జేసినపైని నిత్యస్నానముజేసి సంధ్యావందనము జేయునది. లేదా నిత్యస్నానము ప్రాతస్సంధ్యయుజేసి తర్పణము జేయవచ్చును. అపుడు సంబంధనామగోత్ర రూపములను ద్వితీయాంతములుగ నుచ్చరించి ఋగ్వేదులు 'స్వధా నమస్తర్పయామి' యని కుడిహస్తముచేతను నితర శాఖీయులు దోసిలిచేతను మూcడేసి మారు లీయవలెను. ప్రతిదోసిలికిమంత్ర ముచ్చరించునది. ఇట్లు నిత్యతర్పణమందును దెలియునది ఇcక బ్రహ్మయజ్ఞాంగమైన నిత్యతర్పణమందు తిలతర్పణము నిషేధించుకాలము. రవిభౌమ భృగువారములం దును ప్రతిపద, షష్ఠి, ఏకాదశి, సప్తమి, త్రయోదశి ఈతిథులందును; భరణి, కృత్తిక, మఘ ఈ నక్షత్రములందును రాత్రి సంధ్యలందును గృహమందును జన్మనక్షత్ర మందును శుభకార్యదినమందు శుభముజేయు నన్యగృహమందును మన్వాదియుగా దులందును గజచ్ఛాయయందు రెండయవములందును తిలతర్పణము మృత్తికా స్నానము పిండదానమును జేయcగూడదు. కొందరు యుగాది మన్వాదులందు నయనద్వయమందును తిలతర్పణము జేయవచ్చునండ్రు. వివాహ వ్రతచూడాకర్మ లందు గ్రమముగ సంవత్సరము నారుమాసములు మూcడుమాసములును నితర

సంస్కారములందు మాసమును దానిలో సగమైనను తిలతర్పణాదికము మహాలయ ముగ యాశ్రాద్ధము ప్రత్యాబ్దికము తప్ప తక్కిన శ్రాద్ధములకు జేయఁగూడదని మీఁద జెప్పఁబడినది. అపుడు నిషిద్ధదినమందును తిలలు దొరకనపుడును హేమరౌప్యము లనఁగ బంగరు దర్భ ముడియుంగరము. వెండితర్జనిచుట్లను ధరించిగాని దర్భలు ఉధరించిగాని నిత్యతర్పణము జేయునది.

## తిథ్యాది నిషేధముల కపవాదము

"తీర్థే తిథి విశేషేచ గయాయాం ప్రేతపక్షకే, నిషిద్ధేపి దినేకుర్యాత్తర్పణం తిల మిశ్రితం." అనగా తీర్థము సంభవించినను పుణ్యదినమందును, గయయందును మహాలయపక్షమందును నిషిద్ధదినమైనప్పటికిని తిలతర్పణము జేయవచ్చుననుట. ఇక్కడ తిథి విశేషమనఁగ నష్టకాదికమని మయూఖమందున్నది. ఇకను కాకతీయు లకు కొందరికి వార్షికాదికమందు పరదినమందును భరణ్యాదుల విసర్జనాంత మందును శ్రాద్ధాంగతర్పణముజేయు నాచారము గానరాదు. అందు ప్రమాణము వెతకవలెను. మృతాహశ్రాద్ధదినమందు నిత్యతర్పణములో దిలలు గ్రహించుట బహు గ్రంథవిరుద్ధము.

## నాందీ శ్రాద్ధ ప్రయోగము

నాందీ శ్రాద్ధమందుఁ జెప్పవలసినది పూర్వార్థమందుఁ జెప్పఁబడినది. ఇదియు నుపనయనాదులందు పూర్వదినమందే చేయవలెను. జాతకర్మ మొదలగు స్వల్పకర్మ లందు నాదినమందే చేయునది. అపుడు దేశకాలములంగీర్తించి 'సత్యవసు సంజ్ఞికా విశ్వేదేవాః నాందీముఖాః మాతృపితామహీ ప్రపితామహ్యో నాందీముఖ్యః పితృ పితామహ ప్రపితామహా నాందీముఖా మాతామహమాతుః=పత్నీ సహితానాందీ ముఖా ఏతానుద్దిశ్య పార్వణ విధానేన సపిండ నాందీశ్రాద్ధం కరిష్యే' యని సంక ల్పము. అర్ఘ్య కాలమందు తొమ్మిదేపాత్ర లాసాదించి వాటి యందు రెండేసి దర్భలుంచి 'యవోసి సోమదేవత్య' యని పూర్వోక్తమంత్ర మూహజేసి యవలనుంచి 'ఉశంతస్త్వా' యను మంత్రముచే నిద్దరిద్దర నావాహించి 'అముకవిశ్వేదేవాః ప్రీయంతాం నాందీ ముఖామాతరః ప్రీయంతాం నాందీముఖాః పితమహ్యః ప్రీయంతాం' అని మొదలుగ యథాలింగముగ పాత్రలు ముందుంచవలెను. 'నాందీముఖా మాతర ఇదంవోర్ఘ్య' మని మొదలుగ నుచ్చరించి యర్ఘ్యపాత్రమును విభజించి యిద్దరికీయవలెను. రెండుమారులు గంధదానము చతుర్థ్యంతముగ నుద్దేశించి 'స్వాహాహ్రవ్యం న మమ' యని యుచ్చరించి దేవస్థానమందువలెనే యన్నదానము, పిండదానకాలమందు 'నాందీముఖాభ్యో మాతృభ్య స్స్వాహా. నాందీ ముఖాభ్యః పితామహీభ్యస్స్వాహా' యని మొదలుగ నుచ్చరించి ప్రత్యేకముగ రెండేసి పిండముల చొప్పున బదునెనిమిది పిండము లీయవలెను. ఇక్కడ ననుమంత్రణము వైకల్పికము. ఇట్లు సర్వపిత్ర్యకర్మయు సవ్యము మొదలగు దేవధర్మముచేతనే జేయవలెనని పూర్వార్థమున జూచునది. విశేషమిచ్చుట జెప్పఁబడినది.

## విభక్తా విభక్తనిర్ణయము

అది జీవత్పితృక నిర్ణయమందును శ్రాద్ధాధికారి నిర్ణయమందును చాలా మట్టుకు జెప్పఁబడినది. ఇఁక విశేషమేమనిన; విభక్తధనులైన సోదరులకు సర్వధర్మములును వేర్వేరుగ నగును. సపిండీకరణాంతమైన ప్రేతకర్మయు షోడశమాసికములును, నొకడే చేయవలెనని మీఁదఁజెప్పఁబడినది. అవిభక్తులకైనను ధనాపేక్షలేని స్నాన సంధ్యా బ్రహ్మయజ్ఞమంత్ర జపోపవాస పారాయణాదులగు నిత్యనైమిత్తిక కామ్యకర్మలు వేర్వేరుగ నేయగును. అగ్ని సాధ్యమైన శ్రౌతస్మార్తనిత్యకర్మయు వేరుగనే యగును. "శ్లో॥ పితృపాకోప జీవిస్యాద్భ్రాతృపాకోపజీవికః" అను పక్షాంతరము. కాత్యాయనాదులకుగాని యితరులకుఁగాదు. పంచమహాయజ్ఞములలో దేవభూతపితృమనుష్య యజ్ఞములు జ్యేష్ఠుని పాకభేదమున్నచో ఋగ్వేదులకు వైశ్వదేవభేదము వైకల్పికము. అనఁగా జ్యేష్ఠుఁడు వైశ్వదేవముఁజేసినను గనిష్ఠునికి వేరుగ బాకమున్నచో నూరక కొంతయన్న మగ్నియందు వ్రేల్చి విప్రునికిచ్చి భుజింపవలెనని కొందరు, దేవపూజ వేరుగనైనను నొకచోటనైన గావచ్చును. ప్రతివార్షిక దర్శసంక్రాంతి గ్రహణాది శ్రాద్ధములు జ్యేష్ఠునికే తీర్థశ్రాద్ధాదికముగూడ నందరి కొక్కమారు ప్రాప్తించెనేని యవిభక్తులలో నొకడే చేయవచ్చును. వేరువేరుగ బ్రాప్తించినచో వేరుగఁ జేయవలెను. ఇట్లు గయాశ్రాద్ధమున దెలియునది. కామ్యమైన దానము హోమము మొదలగువానియందుఁ జ్యేష్ఠుని యనుమతిపై నధికారము. మఘాత్రయోదశీశ్రాద్ధము వేరుగనే చేయవలెనని మీఁదఁజెప్పఁబడినది.

## తీర్థ శ్రాద్ధము

అందు గంగాదిపుణ్యతీర్థము లభించినపుడు అర్ఘ్యావాహనద్విజాంగుష్ఠ నివేదనతృప్తి ప్రశ్నవికిర విసర్జనదిగ్బంధములు లేకుండగఁ సకృన్మహాలయ మందువలె సర్వపితృగణముల నుద్దేశించి ధూర్విలోచనసంజ్ఞికులైన విశ్వేదేవులతోగూడ తీర్థ శ్రాద్ధముఁ జేయునది. అగ్నౌకరణము వైకల్పికము చేయునపుడు తీర్థసమీపమందైనచో బ్రాకృతమంత్రములచే దీర్థమునందే చేయవలెను. లేనిచో హస్తాదులందే చేయునది. పిండములు తీర్థమందు వ్రేయుటయే ప్రతిపత్తి. అపుడు తీర్థవాసులే విప్రులు, గుణహీనులైనను ముఖ్యులు. వారు లేనిచో నన్యులు. అందు శ్రాద్ధదేశము నన్నాదికము కాకాదులచేఁ జూడఁబడినను దోషములేదు. తీర్థశ్రాద్ధాంగతర్పణము దర్శకువలెఁ దానికిఁ బూర్వమే చేయవలెను. దేశకాలములఁ గీర్తించి సర్వపితృగణము నుచ్చరించి 'ఏతేషామముక తీర్థప్రాప్తి నిమిత్తకం తీర్థశ్రాద్ధం సపిండం సదైవం సద్యః కరిష్యే' యని సంకల్పము. ధూర్విలోచన విశ్వేదేవాది సర్వము సకృన్మహాలయమునకువలె నగును. తీర్థయాత్ర యందు సాగ్నికుఁడైన పత్నీసహితునకే యధికారము. నిరగ్నికుఁడైనచో బత్ని లేకుండఁగను గావచ్చును. స్త్రీకి స్నానదాన తీర్థయాత్రానామస్మరణాదికము పుత్రాద్యనుమతిచేతనే చేయవలెను. పుణ్యస్త్రీకిఁ బతితోడనే తీర్థయాత్రాదికము.

# తీర్థయాత్రకు విధి

తీర్థయాత్రఁ జేయఁదలఁచినవాఁడు తొలిరోజున నుపవాసముఁజేసి పారణ దినమందు గృహమందే ఘృతశ్రాద్ధమును వృద్ధిధర్మముతో జేయవలెను. అనఁగా నార్గురుగాని తొమ్మండ్రుగాని పండ్రెండుగురుగాని పిత్రాదిదేవతల నుద్దేశించి ఘృత ప్రాయమైన యన్నముతో శ్రాద్ధము చేయవలెను. నివేదనము చేయునపుడు 'ఇదం ఘృతం స్నాన్నం దత్తం దాస్యమానం చ" యని యుచ్చరింపవలెను. గణేశుని బ్రాహ్మ ణులను సాధువులను బూజించి యాత్రను సంకల్పించి శ్రాద్ధశేషముచే బారణఁజేసి వెళ్లవలెనని కొందరు ఇతరులైనచో శ్రాద్ధాంతమందు సంకల్పముఁజేసి శ్రాద్ధ శేషమును ఘృతమును మాత్రము తీసుకొని క్రోసునకులోగా వెళ్లి యక్కడ నా ఘృతముతో నన్నమువండి భుజింపవలెనండ్రు. 'శ్రీపరమేశ్వర ప్రీతికామః పితృముక్తికామోవా అముక ప్రాయశ్చిత్తార్థం వా తీర్థయాత్రాం కరిష్యే' యని సంకల్పము. ఉపవాసమున కంటె మున్ను క్షౌరముఁ జేసుకొనవలెనని కొందరు, ఇతరులు ప్రాయశ్చిత్తార్థమయిన యాత్రలోనే ముండన మండ్రు. ఇట్లు గయాయాత్ర యందును ముండనమునకు వికల్పము 'ఉద్యతస్తుగయాం గంతుం శ్రాద్ధం కృత్వా ఘృతాదికం, విధాయ కార్పటీ వేషం గ్రామం కృత్వా ప్రదక్షిణం, తతః ప్రతిదినం గచ్ఛేత్ప్రతిగ్రహ వివర్జితః' అనఁ గా గయాయాత్ర చేయఁదలఁచినవాఁడు ఘృతశ్రాద్ధముచేసి వైరాగ్యవేషముతో గ్రామము ప్రదక్షిణముఁజేసి ప్రతిదినమందును ప్రతిగ్రహము చేయకుండఁగ వెళ్లవలెను "యశ్చాన్యంకార యేచ్చక్త్యా తీర్థయాత్రాం నరేశ్వర, స్వకీయ ద్రవ్యయానాభ్యాం తస్య పుణ్యం చతుర్గుణం' అనఁగా తాను ద్రవ్యము యానమునిచ్చి యొకరికి తీర్థయాత్రను జేయించినచో తాను చేసినదానికంటె చతుర్గుణము ఫలము లభించుననుట. యాత్రా మధ్యమం దాశౌచముగాని రజోదోషముగాని సంభవించినచో నది శుద్ధియగు వరకు నిల్చియాపైని వెళ్ళవలెను. మార్గము విషమయినచో దోషములేదు. సంకల్పించిన తీర్థమునకు వెళ్లుచుండఁగ మధ్యమందు మఱియొకతీర్థము లభించినచో శ్రాద్ధాదికము చేయవలయును. వ్యవహారము కొఱకు వెళ్లినను ముండనోపవాసాదికము చేయక తప్పదు. కార్యాంతరప్రసక్తిచే తీర్థమునకు వెళ్లినయెడ సగము ఫలము లభించును. వ్యవహారమునకై వెళ్లినయెడ పాదఫలము. మార్గమందు రెండుమారులు భుజించినను గొడుగును చెప్పులు ధరించినను నొకపాదమువంతు ఫలముతగ్గును యానము నెక్కి వెళ్లినచో సగము లభించును. కారణాంతరముచే దీర్థమునొంది స్నానముఁ జేసెనేని స్నానఫలము మాత్రమే సంభవించును గాని తీర్థయాత్రాఫలము రాదు. "మార్గేపర నదీప్రాప్తౌ స్నానాది పరపారతః, అర్వాగేవ సరస్వత్యా ఇతిమార్గ గతోవిధిః " అనఁగా యాత్రమార్గమందు మఱియొకనది సంభవించినచో నది యవ్వలితీరమున స్నానాదికముఁ జేయునది. సరస్వతీనదియందు మాత్ర మిత్వలితీరమునందే స్నానాదిక మనుట. తీర్థసామీప్యము నొందినచో విధి. "యానాని తు పరిత్యజ్య భావ్యం పాదచరైర్నరైః భక్త్యా చ విలుతేత్తత్ర కుర్యాద్వేషం చ కార్పటం" అనఁగా నంతవరకు

యానమెక్కి వచ్చినను నపుడు యానముడిగి పాదచారి గావలెను. భక్తితో తీర్థ దేశ మందు పొర్లి బైరాగివలె గానుపించవలెను అట్లు తీర్థమునొందుటకు పూర్వదిన మందైనను నాదినమందైనను నుపవాసము చేయునది. తీర్థమందు ముసలస్నానముఁ జేసి అనఁగా విధియేదియు నక్కరలేకుండఁగ నొకమారు పడిమునిగి లేచుటఁజేసి ఉత్తరాభిముఖముగగాని పూర్వాభిముఖముగగాని కేశశ్మశ్రు నఖలోమములను పరిసమాప్తిగ క్షౌరముఁ జేసుకొని యాఁపై సమంత్రకముగ స్నానము. అపుడు ప్రణవ ముచ్చరింపుచు తీర్థముగలపి యావాహనముఁజేసి "ఓం నమోస్తుదేవ దేవాయ శితికంఠాయ దండినే, రుద్రాయ చాపహస్తాయ చక్రిణే వేధసే నమః, సరస్వతీ చ సావిత్రీ వేదమాతా గరీయసీ, సన్నిధాత్రీ భవత్వత్ర తీర్థే పాపప్రణాశినీ' యని యుచ్చ రింపుచు స్నానమాడవలెను. తక్కిన స్నానవిధి నిత్యమందువలెఁ జేయునది. అటుపైని తర్పణాదికము తీర్థశ్రాద్ధము. శ్రాద్ధోత్తర దినమం దక్కడనుండే వెళ్లవలెను గాని యాదినమందుఁగూడదు. "ముండనం చోపవాసశ్చ సర్వతీర్థేష్వయం విధిః, వర్జయిత్వా కురుక్షేత్రం విశాలాం విరజంగయాం" అనఁగా గురుక్షేత్రము నుజ్జయని విరజక్షేత్రము గయయు దప్పఁ దక్కిన తీర్థములం దంతటను క్షౌరము నుపవాసము తప్పదని. ఇచట ప్రసిద్ధమహాతీర్థములందని యర్థము. తిరుగవచ్చుట పదిమాసములపై నైనచో ముండనాదితీర్థవిధిఁ దిరుగఁజేయవలెను. ప్రయాగమందైనచో మూడామడదూరము నుండి పదిమాసములకులోగా వచ్చినను తీర్థవిధిఁ జేయవలెను. ప్రయాగమందు జీవత్పితృకుఁడైనను గర్భిణీపతియైనను చూడాకర్మఁజేసిన బాలుఁడైనను సభర్తృక స్త్రీలకు కొప్పంతయు నెత్తిపట్టుకొని రెండంగులములు ఖండింపవలెనంద్రు. అపుడు వేణీదానము విధిద్వితీయ పరిచ్ఛేదమునఁ జెప్పఁబడినది. యతులైనచో తీర్థమందును ఋతుసంధులయందే కక్షోపస్థములు వర్జించి వపనముఁ జేయించవలెను. తీర్థము నొంది యాలస్యముఁజేయక స్నానపితృతర్పణ శ్రాద్ధాదులఁ జేయవలెను. అపుడు పర్వాదికాలముల విచారింపనక్కరలేదు. ఆకస్మికముగ మహాతీర్థము లభించెనేని రెండు మూఁడు రోజులుండుట కసంభవమైనచో భుజించియున్నను రాత్రియైనను సూతకియైనను గ్రహణపర్వమందువలె స్నానము హిరణ్యాదికముచే దీర్థశ్రాద్ధముఁ జేయవచ్చును. ఇట్లు మలమాసమందును నూహింపవలెను.

## తీర్థమందు పరులకై స్నానము

"మాతరం పితరం జాయాం భ్రాతరం సుహృదం గురుం, తీర్థేస్నాయాద్య ముద్దిశ్య సోష్టమాంశం లభేన్నరః, యద్వాప్రతికృతిం దర్భమయీం సత్తీర్థవారిషు, మజ్జయే చ్చయముద్దిశ్య సోష్టమాంశం ఫలం లభేత్." అనఁగా తల్లిని తండ్రినిభార్యను సోదరుని మిత్రుని గురుని ఈమొదలగువారి నెవ్వరి నుద్దేశించి తీర్థమందు స్నానముఁ జేసినను, లేదా దర్భమయమైన ప్రతికృతిని తీర్థమందు ముంచినను వారి కష్టమాంశ పుణ్యఫలము సంభవించును. అన్నముచే తీర్థశ్రాద్ధముఁ జేసినచో దానిచేతనే పిండ దానము హిరణ్యముచే జేసెనేని పిండద్రవ్యములు సత్తుపిండిపాయసము సంయావమనఁగ, ఘృతపక్వమైన గోధుమచూర్ణము అనఁగ సిరా తిలకపిండి బెల్లము

ఇతర ప్రతిపత్తి కూడదు. ఇదియు పుత్రహీనురాలగువిధవ చేయవచ్చును. పుత్రు లున్నచో గూడదని నిషేధము. సపుత్ర యానకర్తవ్యం భర్తుశ్శ్రాద్ధం కదాచన’ అని అనుపనీతుఁడును జేయవచ్చును. సన్యాసి చేయఁగూడదు. “దండ ప్రదర్శయేద్భిక్షు ర్గయాం గత్వా న పిండదః, దండస్పర్శా ద్విష్ణు పదే పితృభి స్సహముచ్యతే” అనఁగా సన్యాసి గయకువెళ్ళినచో విష్ణుపాదమందు దండము ముట్టింపవలెను. పిండమీయ గూడదు. దండస్పర్శముచేతనే పితృగణముతో దానును ముక్తినిందునని ఇట్లు కూప గయయందు నక్షయ్యవటాదులందును దండ ప్రదర్శనమే చేయవలెను. జీవనార్థము తీర్థమందు ప్రతిగ్రహముఁ జేసెనేని యెనిమిదవ భాగము దానమిచ్చినచో శుద్ధుఁ డగును.

## ఆశౌచ నిర్ణయము

“శ్రీవిఠ్ఠలం రుక్మిణీం చ పితరౌ దీనవత్సలౌ, ధ్యాత్వేష్ట సిద్ధయే నత్వా వక్ష్యేథా శౌచ నిర్ణయం.” అనఁగా నిట్లు శ్రాద్ధవిధి ముగించి గ్రంథకర్త విఠ్ఠలేశ్వరుని రుక్మిణిని తలిదండ్రులను నమస్కరించి ధ్యానముఁజేసియాశౌచనిర్ణయమునుజెప్పుచున్నాఁడు.

## గర్భనాశ జననాద్యాశౌచము

“ఆచతుర్థా ద్భవేత్స్రావః పాతః పంచమ షష్ఠయోః, అతూర్ధ్వం ప్రసూతిస్స్యాత్తత్రా శౌచం వివిచ్యతే.” అనఁగా గర్భమైన నాల్గుమాసములోగా చెడినచో స్రావమనఁ బడును. అటుపైని ప్రసూతియే యనఁబడును. వాటివిషయమై యాశౌచము నిర్ణ యింపఁబడును. అందు గర్భస్రావమందు మూఁడు మాసములలోగా మూఁడు రోజులు తల్లి కస్పృశ్యత్వరూప మగునాశౌచము నాలుగైనచో నాల్గురోజులు. పిత్రాది సపిండులకు స్రావమంతటను స్నానముచే శుద్ధియగును. అయిదు నారు మాసము లలో గర్భపాతమైనచో దల్లికి మాససమసంఖ్య దినములస్పృశ్చత్వము పిత్రాదులకు మూఁడు రోజులు జననాశౌచము. మృతాశౌచము లేదు. ఈ స్రావపాతములందలి యాశౌచము సర్వవర్ణసాధారణము. సప్తమమాసము మొదలుగ ప్రసూతియందుఁ దల్లికిని దండ్రి మొదలగు సపిండులకును సంపూర్ణముగఁ జననాశౌచము. అది విప్రులకు పదిరోజులు క్షత్రియులకుఁ బండ్రెండు రోజులు వైశ్యులకు పదునైదు, శూద్రులకు మాసము. సంకరజాతుల కాశౌచమే లేదు. స్నానమాత్రమే యనెను. సర్వవర్ణములకు బదిదినములైన గావచ్చును. జననాశౌచమనఁగ పురుఁడునందు గర్భిణికి పదిదినము లస్పృశ్యత్వము కర్మకనధికారము కన్యగల్గినచో నిరువదిరోజులు. ఇదియు వారివారి యాశౌచదినములపై నని తెలియునది. కనుక విప్రస్త్రీకి క్రమముగ ముప్పది నలుబది దినములు కర్మానధికారము. తండ్రికి సవతితల్లియందు కన్యగాని పుత్రుఁడుగాని గల్గినచో సచేలస్నానమునకు మున్నే యస్పృశ్యత్వము. పిత్రాది సపిండు లకు జననాశౌచమందు గర్మానధకారము మాత్రమే కనుక తాను గర్మఁజేయుచు మడిగానుండనపుడు వారిని ముట్టినను స్పర్శదోషములేదు. జాతకర్మయందును దాన మందును బొడ్డుగోయకమున్ను తండ్రి కధికారము. ఇట్లు పంచమషష్ఠదశమ

దినములందుఁ దానమునకును జన్మదాదుల పూజయందు నధికారము కనుక నపుడు విప్రులు ప్రతిగ్రహించినను దోషములేదు. కూటస్థుఁడు మొదలుగ నేడ్డురిపర్యంతము సపిండు లనఁబడుదురు అటుపై నేడ్డురి పర్యంతము సమానోదకు లనఁబడుదురు. అటుపై సపిండులకు పదిదినములని చెప్పఁబడినది. సోదకులకు మూఁడు రాత్రులు. సగోత్రుల కొకరాత్రి యని నాగోజీభట్టీయమందున్నది. కొందరు సగోత్రుల కాశౌచ ములే దంద్రు. ఇఁక సపిండులకు సోదరులకు నాశౌచము వేరగుట జననమందును మరణమందు సమానమే యని తెలియునది. మరియేమనిన; మరణమందా శౌచము విచ్ఛిన్నమైనను నేకకులత్వముఁ దెలసినంత వరకును స్నానము తప్పదు. ఇఁక విశేషమేమనిన; కూటస్థుఁడు మొదలగు సంతతి భేదించునపు డొకసంతతి నొక దష్టముఁడు రెండవసంతతిలో నొకఁడు సప్తముఁడు. వారిద్దరికి నొకవైపునుండి సాపిండ్యము నివర్తించినను మరియొకవైపు సాపిండ్యముండునని మీఁదఁ జెప్పఁ బడినది. అపు దష్టమునికి సాపిండ్యము నివర్తించినను రెండవసంతతిలో సప్తమాదుల జనన మరణములందు మూఁడుదినములాశౌచముబట్టునది. ఇఁక సప్తమునికి సాపిండ్యము నివర్తించినను రెండవసంతతిలో సప్తమాదుల జననమరణములందు మూఁడు దినము లాశౌచముబట్టునది. ఇఁక సప్తమునికి సాపిండ్యమనువర్తించి యున్నది గనుక రెండవసంతతిలో నష్టముని జననమరణములందుఁ బదిదినము లాశౌచము తప్పదు. ఇట్లు సమానోదకుల త్రిరాత్రాశౌచమందును కన్యావిషయమైన త్రిపురుష సాపిండ్యమందు నూహించునది. అందష్టముఁడు జీవత్పితృకుఁడైనను మృతపితృకుఁడైనను మూఁడుదినములే ఏమనిన; త్ర్యంబకీయము భట్టజీయము నాగోఈయము మొదలగు గ్రంథములందాశౌచ ప్రకరణమందెచ్చటనైనను పితృజీవనా జీవనములచే నాశౌచభేదము గానరాదని కొందరు, ఇతరులు నిర్ణయ సింధువునందు సాపిండ్య ప్రకరణమున దశముఁడు మొదలుగ ధర్మవిచ్ఛేదమగునని మొదలగు సుమంతువాక్యమునకు శూలపాణివ్యాఖ్యానమునందు ఏకపిండదాన క్రియలో సంబంధించుటకు మాత్రమే సాపిండ్య మనులక్షణము ననుసరించి జీవించిన పితృపితామహ ప్రపితామహులు గలవానికి ప్రపితామహునికంటె పైవారు ముగ్గురు పిండభాక్కులు నటుపై ముగ్గురనఁగ దొమ్మంద్రు పర్యంతము లేపభాక్కులు శ్రాద్ధకర్త దశముఁడు గనుక వాని యుత్తరమందు సాపిండ్యనివృత్తి యగును. పితృపితామహులు మాత్రమే జీవించినచో దొమ్మంద్రపర్యంతము సాపిండ్యము. తండ్రి మాత్రము జీవించినచో నెనమంద్రపర్యంతమే సాపిండ్యమని చెప్పియున్నందున నష్టమాదులకు పిత్రాదులు జీవించియున్నచో దశాహమే మాశౌచము. పిత్రాదుల మరణానంతరమే త్రిదినమని చెప్పుదురు. అందు రెండవపక్షమే యుక్తమని నాకుఁదోఁచుచున్నది. పితృ గృహమందు పుత్రిక ప్రసవించినచో దలిదంద్రులకును నాగృహమందున్న భ్రాతలకు నొకదినము పితృగృహమందున్న పినతండ్రి మొదలగు సర్వ సపిండులకును నొకదినమే యని స్మృత్యర్థసారమందున్నది. ఇట్లు భ్రాత్రాదులగృహమందుఁ జెలియలు బిడ్డఁగనినయెడ వారికొకదినము మాధవమత్తమందు పితృగృహమందు పుత్రిబిడ్డను

గన్నచో దలిదండ్రులకు త్రిరాత్రము. నాగృహమందున్న భ్రాత్రాదుల కొకదినమని యున్నది. పుత్రిక పతిగృహమందుఁ బ్రసవించినచో బిత్రాదుల కాశౌచములేదు. మృతుఁడైన శిశువుపుట్టినచో సపిండులకు సంపూర్ణముగ జననాశౌచము. అనఁగా పురుఁడేగాని మృతాశౌచమనఁగ మైలపట్టనక్కరలేదు. పుట్టినపైని బొడ్డుగోయక మున్ను శిశువు మృతినొందెనేని పిత్రాది సపిండులకు త్రిదినము జననాశౌచము. తల్లికి బదిరోజులుండును. మృతాశౌచములేదు. బొడ్డుగోసిన పైని పదిరోజులలోగా శిశువు మృతినొందినచో సపిండులకందరకు సంపూర్ణముగ జననాశౌచమే మృతా శౌచము లేదు.

## మృతాశౌచనిర్ణయము

అందు మృతాశౌచము గలవారి కస్పృశ్యత్వము గర్మానధికారమును గూడ నగును. దశాహానంతరమందు నామకరణము గాకమున్ను శిశువు మృతినొందినచో సపిండాదులకు స్నానముమాత్రము. తలిదండ్రులకు పుత్రుఁడైనచో ద్రిరాత్రము. కన్యయైనచో నొకదినము సవతి తల్లికి నంతటను దండ్రికివలెనా శౌచము. నామకరణ మునకు పూర్వము ఖననమే నిత్యము. నామకరణానంతరము చూడాకర్మ పర్యంతముగాని మూఁడు సంవత్సరములు పూర్తియగు పర్యంతముకాని దహనఖనన ములకు వికల్పము. నామకరణోత్తరమందుఁ దంతములు పుట్టకమున్ను పుత్రుఁడు మృతినొందినచో దహనముఁ జేసిరేని సపిండుల కొకదినము. ఖననమైనచో స్నాన ముచే శుద్ధి. తలిదండ్రులకు రెండిటిలో త్రిరాత్రమే. కన్యామృతిలో ద్రిపురుష సపిండు లకు రెండిటియందు స్నానముచే శుద్ధి. తలిదండ్రులకు గన్యామృతిలో దంతములు పుట్టువరకును రెంటియందునొకదినము. ఇక్కడ నామకరణమనఁగా పండ్రెండవ దినమని గ్రహించునది. దంతోత్పత్తియనఁగ మూడుమాసములని తెలియునది. కనుక పండ్రెండవదినము మొదలుగ నారవమాసము పర్యంతమొక దినము మొదలగు నాశౌచమని తాత్పర్యము. సప్తమమాసము మొదలుగ చూడాకర్మ యనఁగ మూఁ డు వత్సరముల పూర్తిపర్యంతము దాహఖననముల రెండిటియందును సపిండుల కొకదినము. కొందరుఖననమందొక రోజును దాహమందు త్రిరాత్రమునండ్రు. తలిదండ్రులకు రెండింటిలో త్రిరాత్రము. ఇదియు పుత్రమృతియందే కన్యామృతి యైనచో మూఁడువత్సరముల పర్యంతము సపిండులకు స్నానముచే శుద్ధి. తలిదండ్రు లకు గన్యామృతిలో నేఁడుమాసములు మొదలుకొని త్రిరాత్రము విజ్ఞానేశ్వరుఁడు పదునొకండవ రోజుమొదలుకొని యుపనయనము పర్యంతము పుత్రమృతిలోను కన్యామృతిలో వివాహపర్యంతమును తలిదండ్రులకు త్రిరాత్రమే యని చెప్పెను. ప్రథమవత్సరము మొదలగువానిలో చూడాకర్మఁ జేసినపుత్రుని మరణమందు పిత్రాదుల కందరకును త్రిదినము నిత్యము దాహమును నిత్యమే. మూఁడువర్షము లైనపైని చూడాకర్మఁ జరిగినను లేకున్నను నుపనయనమునకు మున్ను మృతినొంది నచో పిత్రాది సర్వసపిండులకుఁ ద్రిదినమే. దాహము నిత్యము. సమానోదకుల కనుపనీత మృతియందును వివాహిత కన్యా మరణమందును స్నానము మాత్రమే.

అనుపనీతుఁడైన భ్రాతమృతియందుఁ జెలియలికి నాశౌచములేదు. రెండు సంవత్సర ములలోపున శిశుమృతి లోఖననము ముఖ్యము. అనుగమనమనఁగ నాస్థలమునకు వెళ్లుట వైకల్పికము. రెండువత్సరములుఁ దాటినచో దాహము ముఖ్యము. అనుగ మనము నిత్యము. ఇక్కడ దాహము నుదకదానము నూరకే చేయవలెను. చూడాకర్మఁ జరిగినను మూఁడువత్సరములు పూర్తియైనను భూమియందు పిండదానము. దంతోత్పత్తి పర్యంతము మృతినొందినవాని నుద్దేశించి సమానవయస్కులగు శిశువు లగు దుగ్ధదానము చేయునది. త్రివర్షాంతము చౌలాంతమందు సమానవయస్కులకు భోజనదానము. స్త్రీ శూద్రులకైనచో చూడాకర్మయైనను నుదకదానాదికము వైకల్పి కము. శూద్రునికి మూఁడువత్సరముల పర్యంతమిదియే యాశౌచము. శూద్రుని కుపనయనస్థానమందు వివాహమే గ్రహించునది. కనుక త్రివర్షానంతరము వివాహ పర్యంతమనఁగ పదారువత్సరములవఱకు శూద్రునికి మరణమందు త్రిదినము. ఆపైని జాతికిఁదగిన యాశౌచము కన్యకు మూఁడువత్సరములైన పైని వాగ్దానము నకు మున్ను మృతియైనచో త్రిపురుష సపిండుల కొకదినము. తలిదండ్రులకు త్రిదినము. దాహాదిక మూరకే చేయునది. వాగ్దానమైన పైని వివాహమునకు మున్ను కన్యకు మృతియైనచో పితృసపిండులకును భర్తృసపిండులకును త్రిదినము. ఇక్కడ కులద్వయములందును సప్తపురుష పర్యంతమైన సాపిండ్యము. దాహాదిక మూరకే చేయునది. జననమందు ననుపనీతమరణమందు నతిక్రాంతాశౌచములేదు. తండ్రికి సంతతిగలుగుట దేశాంతరమున కాలాంతరమున వినినప్పటికి స్నానము తప్పదు. అనుపనీతమరణ మతిక్రమించి వినినను స్నానము తప్పదని స్మృత్యర్థసారము. ఇఁ క ననుసనీతునికిని నవివాహితకన్యకును దలిదండ్రుల మృతియందే దశాహాశౌచము. ఇతర మృతియందేమియు నక్కరలేదు. ఉపనయనానంతరము మృతుఁడైనచో సపిండు లకు దశాహము. సోదరులకు త్రిరాత్రము సగోత్రుల కొకదినముగాని స్నానమాత్రము గాని యని మీఁదఁజెప్పినట్లూహించునది. స్త్రీశూద్రులకు వివాహానంతరము మృతి యైనచో బదిదినములు. శూద్రునికి వివాహము లేకున్నను పదారువర్షములని మీఁ దజెప్పఁబడినది. వివాహమై కన్య పితృగృహమందు మృతినొందినచో దలిదండ్రు లకు సవతితల్లికి సవతిసోదరునికి తన సోదరునికిని త్రిరాత్రమే ఆగృహమందున్నచో పినతండ్రి మొదలగువారి కొకదినము. ఆ గృహమందుండు సపిండులకు నొకదినమే యని కొందరు. తలిదండ్రులుగాని సవతితల్లిగాని మృతినొందినచో గన్యకు పదిరోజు లలోగా ద్రిరాత్రముగాని తొమ్మిదవ పదియవదినములలో వినినచో పుత్రునికివలె శేషముచే శుద్ధియనుట యుక్తము. దశాహానంతరము కాలాంతరమందు వత్సరాంతర మయినను పక్షిణీ ఉపవినీతుఁడైన భ్రాతకు వివాహిత భగినికిని పరస్పరగృహము లందు మృతియైనచో సరస్పరము త్రిరాత్రాశౌచముఁ గల్గును. వేరొక గృహమందైై నచో పరస్పరమునకు పక్షిణి యగును. గ్రామాంతరమందైనచో నొకదినము. మిక్కిలి గుణహీనులైనచో నొకగ్రామమైనను స్నానమే. ఇట్లు సవితి యన్న జెలియండ్రకుఁ దెలియునది. చెలియలు మృతినొందినచో భగిని నిట్లనే తెలియునది. వివాహితయైన

కన్యకు పితామహుండు పినతండ్రి మొదలగువారి మరణమందు స్నానమే. మేనమామ మృతియందు మేనల్లునికి మేనగోడలికిని పక్షిణీ. ఉపకారకుండైన మాతులుండు మృతుండైనను స్వగృహమందు మాతులునికి మృతియైనను త్రిరాత్రము. మాతులుం డనుపనీతుండై మృతుండైనను గ్రామాంతరమందు మృతియైనను నొకదినము ఇట్లు సవతి మేనమామ మృతుండైనను తెలియునది. మేనమామ భార్య మృతినొందినచో నామెభర్త మేనల్లుడు మేనగోడండ్రు నగువారికి పక్షిణీ. సవతిమేనమామ భార్య మృతినొందినచో నేమియు లేదు. ఉనీతుండైన మేనల్లుండు మృతుండయ్యేనేని మాతులునికి మాతులభగినికిని ద్రిరాత్రము. ఇట్లు సవతిమేనల్లుండు మృతుండైనను దెలియునది. అనుపనీతుండు మేనల్లుడు మృతుండైనచో మాతులునికి నతని చెలియలికి పక్షిణి. ఇట్లు సవతిమేనల్లుండు మృతుండైన నూహించునది. అనుపనీతుం డనంగ చూడాకర్మం జరిగినవాండుగాని లేక మూండువత్సరములు నిండినవయసు గలవాండుగాని గ్రహింపంబడును. ఇట్లు ముందును దెలియవలెను. మేనగోడలు మృతినొందిన స్నానమాత్రమని తోంచుచున్నది. మాతామహుండు మృతినొందినచో పుత్రత్వాభిమతుండైన దౌహిత్రునికిని దౌహిత్రికిని త్రిరాత్రము. గ్రామాంతరమందైనచో బక్షిణి. మాతామహి మృతినొందినచో దౌహిత్రునికి దౌహిత్రికిని బక్షిణి. ఈ చెప్పిన వాటియందు పురుషుం డుపనీతుండైనవానికిని స్త్రీకి వివాహతయైన దానికిని మాతా పిత్రతిరిక్తాశౌచమందధికారము. ఇక్కడ మాతులుండు నతనిభార్యయు మాతామహుం డు మొదలగువారి మృతియందు స్త్రీ సంతానమునకు నాశౌచముం జెప్పుట త్ర్యంబకీ యము ననుసరించిగాని యితర గ్రంథములందట్లు స్పష్టముగలేదు. ఉపనీతుండైన దౌహిత్రుండు మృతుండైనచో మాతామహునికి మాతామహినికి త్రిరాత్రము. అనుప నీతుండట్లయినచో వారికి పక్షిణియగును. దౌహిత్రి మృతినొందినచో నాశౌచములేదని తోంచుచున్నది. అత్తమామయు మృతినొందినచో నల్లునికి సన్నిధినున్నచో ద్రిరాత్రము దూరముగనున్నచో బక్షిణి ఉపకారకులైనచో నసన్నిధియైన త్రిరాత్రమే గ్రామాంతర మైన నొకరాత్రియే. భార్యామరణముచే సంబంధము వదలిపోయి యనుపకారకులైన శ్వశ్రూశ్వశురుల మృతిలో పక్షిణిగాని యొకదినమనిగాని తోంచుచున్నది. అల్లుండు మృతినొందినచో నత్తమామలకు నేకరాత్రమైనను స్నానముచే శుద్ధియైన నగును. స్వగృహందల్లుని మృతియైనచో ద్రిరాత్రము. ఉపనీతుండైన స్యాలకుండు మృతుం డైనచో నతనిభగిని భర్తకొకదినము. అనుపనీతుండై యతండు మృతినొందెనేని స్నానమే. ఇట్లు గ్రామాంతరమందు మృతుండైనను నెఱుంగునిది. భార్య మృతనొందు టచే సంబంధము వదలిపోయిన స్యాలకుండు మృతినొందినచో స్నానమే యని నాగోజీభట్టీయము. స్యాలకునిపుత్రుండు మృతుండైనను స్నానము. భార్య సోదరి మృతియందును స్యాలకునికివలె నేకాహాదికముం జేయవలెనని క్వచిత్పక్షము. తన తల్లిచెలియలు మృతినొందినచో దాని సోదరికి సంతతియైన స్త్రీకిగాని పురుషునికిగాని పక్షిణీ. ఇట్లు సవతితల్లికి చెలియలు మృతిలో నెఱుంగునది. మేనత్త మృతినొందినచో భ్రాతృసంతతియైన కన్యాపుత్రులకుంబక్షిణి యగును. తండ్రి సవతి చెలియలు మృతి

నొందినచో స్నానము మాత్రమే. తన తమ్ముని సంతతి మృతినొందినచో మేనత్తకు స్నానమే. స్వగృహమందు మేనత్తగాని పినతల్లిగాని మృతినొందినచో మూఁడు దినములు. బంధుత్రయములో నుపనీతుఁడు మృతినొందెనేని పక్షిణి యగు. అనునీతుఁడుగాని గుణహీనుఁడుగాని బంధుత్రయములోవాఁడు మృతుఁడయ్యెనేని నొకదినము. స్వగృమమందైనచో ద్రిరాత్రము ఇక్కడ బంధుత్రయమనఁగ నాత్మబంధుత్రయము, పితృబంధుత్రయము మాతృబంధుత్రయమునని తొమ్మండ్రు బంధువులు గ్రాహ్యులు. వారెవ్వరనిన; తన మేనత్తపుత్రులు తన పినతల్లిపుత్రులు తన మేనమామ పుత్రులును నాత్మబంధువులు. ఇట్లు తండ్రి మేనత్తయు తండ్రి పినతల్లియు తండ్రి మేనమామయు నను వీరిపుత్రులు పితృబంధువులు. అట్లనే తల్లి మేనత్తయు తల్లి పినతల్లియు తల్లి మేన మామయు నను వీరిపుత్రులు మాతృబంధువులు. ఇట్టి బంధుత్రయములలో మేనత్త మొదలగువారి కన్యకలు వివాహితలై మృతులైనచో 'తద్బంధువర్గస్త్వేకేన' యను వచనముచే నొకదినమాశౌచము. అవివాహితలై మృతులై మృతినొదిరేని స్నానమాత్రమే యని నిర్ణయసింధ్వాదులు. నాగోజీభట్టులు మాత్రము బంధుత్రయ వాక్యములో పుత్రపదము కన్యలనుగూడఁ జెప్పువండ్రు. ఆమతమందు పితృష్వస్రాది కన్యకలు వివాహితులై మృతినొదిరేని పక్షిణి అవివాహితలైనచో నొకదినము మొదలగునది. మేనత్తకూతురు మొదలగువారికి బంధుత్రయ మృతియందు స్నానమాత్రమే చేయదగునని నిర్ణయసింధు తాత్పర్యముచే సిద్ధించుచున్నది. నాగోజీభట్టమతమందు పుత్రపదమువలె నాత్మపదముగూడ కన్యాపరముగావచ్చును. గనుక కన్యలు గూడ బంధుత్రయాశౌచముఁ బట్టవలసివచ్చును. అది బహుశిష్టాచార విరుద్ధము. కాఁబట్టి సింధ్వాశయమే యుక్తమని తోచుచున్నది. ఇక్కడ నిది తత్వము. దేవదత్తుని బంధునవకములో నాత్మ బంధుత్రయమునకు సంబంధము సమానము గనుక పరస్పర మాశౌచముండును తక్కిన బంధుషట్కమందైనచో బంధుషట్కములో మృతియందు దేవదత్తుని కాశౌచము. దేవదత్తుఁడు మృతుఁడైనచో నాబంధుషట్కమున కాశౌచములేదు. సంబంధములేదు గనుక ననిబుద్ధిమంతు లూహించునది. దత్తపుత్రుని మృతియందు జనకపాలకులగు తలితండ్రులకు త్రిరాత్ర మాశౌచము. సపిండుల కొకదినము. నీలకంఠీయమున దత్తకనిర్ణయమందుమాత్రముపనీత దత్తక మరణమందు పాలక పిత్రాదిసపిండులకు దశాహము మొదలుగ నాశౌచమని యున్నది. దత్తకునికిని జనకపాలకులగు తండ్రుల మృతిలో ద్రిరాత్రమాశౌచము. పూర్వాపరసపిండులకు మృతియైనచో నొకదినము. తండ్రుల కంత్యక్రియలు జేసినచో గర్మాంగమైన యాశౌచము దశాహమే. దత్తకునికి పుత్ర పౌత్రాదులు పుట్టినను మృతి నొందినను పూర్వాపర సపిండులకొకదినము. ఇట్లు పూర్వాపర సపిండులు మృతినొందినపుడు దత్తుని పుత్రపౌత్రాదులకు నొకదినమే ఇటులాశౌచము సపిండుఁడు సమానోదకుఁడైనగాని వాని దత్తునిగ గ్రహించినపుడని తెలియునది.సపిండ సోదరులలో నొకని దత్తునిగఁ గ్రహించినచో నెప్పటివలె దశాహ త్రిరాత్రాదికమే యాశౌచమని యెఱుంగునది. ఆచార్యుఁడు మృతుఁడైనచో ద్రిరాత్రము గ్రామంతర

మందైనయెడఁ బక్షిణియగు. ఉపనయనముఁజేసి వేదాధ్యయనము చేయించిన వాడాచార్యుఁడనఁబడును. మఱియును స్మార్త కర్మలఁదనకు నిర్వహించువాఁడు నాచార్యుఁ డనబడును. అట్లాచార్యునిభార్యకుగాని, పుత్రునికిగాని మృతియగుచో నొకదినము మంత్రము నుపదేశించిన గురునికి మృతిగల్గినచో ద్రిరాత్రము. గ్రామాంతరమందైనచో పక్షిణి, వ్యాకరణము జ్యౌతిషము మొదలగు నంగశాస్త్రముల నధ్యయనముఁ జేయించినవాఁ డనూచానుఁ డనఁబడును. వాని మరణమందు నొకదినము. సకల వేదముఁ జెప్పినగురునికి మరణమందుఁ బక్షిణి. వేదము గొంత చెప్పినవాఁడుపాధ్యాయుఁడతని మృతియం దొకదినము. ఉపనయనముఁజేసి యధ్యయనముఁ జెప్పిన శిష్యుఁడు మృతినొందినచో గురువునకును ద్రిరాత్రము. అధ్యయనము చాలించినపై మృతినందినచో బక్షిణి. అన్యునిచే నుపనీతుఁడై బహుకాలము తనయొద్దఁజదివిన వాని మృతియందొక దినము. సహాధ్యాయి మృతుఁడైనచో బక్షిణి. తన శ్రౌతకర్మకుపయోగింపుచున్న ఋత్విక్కు మృతినొందినచో త్రిరాత్రము. గ్రామాంతరమందైనచో బక్షిణి. కర్మచేయుట చాలించి గ్రామాంతరమందు మృతుఁడైనచో నొకదినము. నొకగ్రామమందే యగుచో బక్షిణి ఇట్లు యాజ్యుఁడు మృతినొందినచో ఋత్విక్కునకు నూహించునది. వేదము వేదార్థముఁ దెలిసినను శ్రౌతస్మార్తకర్మ నిష్ఠుఁడగువాఁడును శ్రోత్రియుఁ డతనిమృతియందు మైత్రియు గృహసామీప్యము మొదలగు సంబంధమున్నచో ద్రిరాత్రము. ఒక సంబంధమున్నచో బక్షిణి. సంబంధమే లేనిచో నొక దినము సన్యాసిమృతుఁడైనచో వాని సపిండుల కందఱకును స్నానముమాత్రమే. స్వగృహమందును దాసీనుఁడైన యసపిండుఁడు మృతినొందినచో నొకదినము. తాను కాపురమున్న యింటిలో మృతుఁడైనచో మూఁడుదినములు. ఉదాసీనుఁడుగాక యాశౌచముఁ బట్టఁదగినవాడు స్వగృహమందు మృతినొందెనేని ద్రిరాత్రము. గ్రామాధిపుఁడుగాని దేశాధిపుఁడుగాని మృతినొందినచో నక్షత్రదర్శన పర్యంతము. అనఁగా పగటియందైనచో రాత్రి స్నానముచే శుద్ధి. రాత్రియందైనచో పగలు శుద్ధి యననుట. పక్షిణి యనఁగ పగటియందు మరణమగుచో నాపగలు నారాత్రియు మరునాఁడు నక్షత్ర దర్శనము వరకు ననుట. రాత్రి మృతియైనచో నా రాత్రియు మరునాఁ డహోరాత్రులును ననుట యగును. కొందరు రాత్రిమృతియైనను మరణ దినమునకు రెండదినమందు నక్షత్ర దర్శనము వరకే పక్షిణియంద్రు. ఇట్లతిక్రమించిన విషయమందును తనకుఁదెలియుట రాత్రియంగుగాని పగటియందుగాని యగును. కనుక దానిబట్టి వ్యవస్థయూహించునది. ఆచార్యుఁడు మేనమామ మొదలగువారికి త్రిరాత్రాద్యాశౌచముఁ జెప్పుట కర్మ కర్తవేరే యున్నపుడని తెలియవలెను. శిష్యాదులంత్య కర్మఁజేసినపుడు నిట్లనే దశాహాద్యాశౌచముఁ గ్రహించునది. గ్రామమధ్యమందు శవమున్నంతమట్టును గ్రామమున కాయాశౌచమగును. పట్టణమందిదిలేదు. గ్రామమునకు నగరమునకును భేదము గ్రంథాంతరమందుఁదెలియునది. గృహమందు గోవు మొదలగునవి మృతినొందినచో నాశనము గృహమందున్నంతవరకు గృహమున కాశౌచము. ద్విజులగృహమందు కుక్క మృతినొందినచో బది దినము

లాశౌచము. ద్విజులగృహమందు కుక్క మృతినొందినచో బది దినము లాశౌచము. శూద్రుఁడు మృతినొందెనేని మాసపర్యంత మాశౌచము. జాతిభ్రష్టుఁడు. మృతుఁ డైనచో గృహమునకు మాసద్వయ మాశౌచము. ప్లేచ్ఛాదులు మృతులైనచో నాల్గుమాస ములు ఇఁక గృహమందుఁ బుట్టినవాడయినను ద్రవ్యము చేగొన్నవాఁడును ఋణముఁదీర్చి చేర్చుకొన్నవాఁడును దొరికినవాఁడు నగుదాసునికి స్వామిమరణ మందు వానిజాతికి తగినయాశౌచము. యుద్ధమందు శస్త్రఘాతముచే నపుడే మృతి నొందినచో స్నానమాత్రమే. యాశౌచములేదు. వాని కంత్యకర్మయులేదు. దశాహాదిక మపుడే కావలెను. యుద్ధమందుఁ గొట్టఁబడి కాలాంతరమందు మృతుఁడైనచో నొక దినము. యుద్ధమందు శస్త్రఘాతము నొంది మూఁడురోజులపైని మృతినొంది నను పారిపోవునపుడు చంపఁబడినను యుద్ధమందు గపటముచే జంపఁబడినను త్రిరాత్ర మాశౌచము. యుద్ధక్షతుఁడై యేడుదినములపైని మృతినొందెనేని దశదినము లండ్రు శిష్టులైనవారు యుద్ధహతునికి సద్యశ్శౌచము లోకవిద్విష్టము గనుక చెప్పరు. ప్రయోగాది తీర్థములందు బుద్ధిపూర్వకముగ గామ్యమరణము నొందినచో స్నాన మాత్రము ప్రాయశ్చిత్తము కొరకు నగ్న్యాదులచే మృతినొందెనేని నొకదినము. మహా రోగపీడను సహింపలేక జలాదులందు మృతినొందినచో ద్రిరాత్రము. ఇట్లాశౌచ సంకోచమందును శిష్టసమ్మతి లేదు. ఇట్లు కారాగృహమందు మృతినొందినవారి కొక రాత్రి యనునదియును శిష్టసమ్మతముగాదు.

## క్రాంతాశౌచము

అందు జననాశౌచమం దాతిక్రాంతా శౌచములేదు. తండ్రికి స్నానము మాత్ర మచ్చుటను గావలసినది. మృతాశౌచమందైనను అనుపనీత మరణాది నిమిత్తము కాశౌచములగు త్రిరాత్రైక రాత్రాదులందును మేనమామ మొదలగు నన్యగోత్రీయుల మరణము నిమిత్తమైన పక్షిణి. త్రిరాత్రము మొదలైనవానియందును నతిక్రాంతా శౌచము లేదు. అందు వివాహితకన్యకు పితృమరణమందు ద్రిరాత్రమతిక్రమించినప్ప టికిన దశ్శాహములోపున మూఁడుదినములు. ఆపై వత్సరాంతరమందైనను బక్షిణి యని మీఁదఁ జెప్పఁబడినది. ఇట్లు సమానోదకులు మొదలగువారి విషయమైన త్రిరాత్రాదులందు నతిక్రాంతాశౌచములేదు. స్నానము మాత్ర మచ్చుటను గాలాంతర మందునుగాక తప్పదు. మరియేమనిన; దశాహము మొదలగు మృతాశౌచము విషయమై యతిక్రాంతాశౌచము చేయవలసినది. అందు దశాహాద్యాశౌచములకును త్రిరాత్రాదులకును నాయాశౌచము మధ్యమందుఁ దెలిసినచో మిగిలిన దినములచే శుద్ధి. పుత్రాదులకు సహితము శేషదినములచేతనే శుద్ధియగును. అంత్యకర్మయు గూడ మిగిలిన దినములలోగానే సమాప్తిఁజేయవలెను. ఇట్లు అస్థిసంస్కారము పాలాశ విధిగాని శరసంస్కార మనఁగ దర్భప్రతికృతి సంస్కారమైనను శేషదినములచేతనే ఇట్లు సోదకత్రిరాత్రమునందును మాతులుని త్రిరాత్రపక్షిణ్యాదులందు నవశిష్టదిన ములచేతనే శుద్ధిమూఁడు రోజులుదాటిన పైని పదిరోజులకుఁ దక్కువైన యాశౌచ ములు దశాహమధ్యమందుఁ దెలిసినను నతిక్రాంతాశౌచము లేదు. మరియేమనిన;

స్నానమాత్రమే కావలెను. తలిదండ్రుల మరణమున దూరదేశమందైనను వత్సరముఁ దాటినను విన్నది మొదలుకొని పుత్రునికి దశాహము మొదలుగా బూర్ణాశౌచమే. దంపతులకు పరస్పరము దేశాంతరము కాలాంతరమైనను బూర్ణాశౌచమే. దంపతు లకు పరస్పరము దేశాంతరము కాలాంతరమైనను బూర్ణముగఁ బదిదినములే. సవతులకుఁ బరస్పరము దేశకాలవిశేష మక్కరలేకయే పది దినము లాశౌచము. సవతితల్లికి మృతియైనచో బుత్రునికి దశాహోత్తరమందును దేశకాలము లపేక్షింపక మూఁడుదినములు. ఔరసపుత్రుని మృతిలో తల్లితండ్రులకు వత్సరాంతరమందైనను త్రిరాత్రముఁ దప్పదు. సపిండుని మరణము దేశాంతరమందు గానిచో దశాహానంత రము వినినను మూఁడు మాసముల పర్యంతము త్రిరాత్రము. ఆరుమాసముల పర్యంతము పక్షిణి. అటుపైని తొమ్మిదిమాసముల పర్యంత మొకరాత్రి. ఆపై సంవత్సర మువరకును సజ్యోతియైనను స్నానమాత్రమైనను మాధవమతమందు మూఁడు పక్షముల పర్యంతము త్రిరాత్రము. ఆరుమాసముల పర్యంతము పక్షిణి సంవత్సరము వరకు నొకరాత్రి అటుపైని స్నానమాత్రమని. ఇక్కడ నాద్విషయమున నాపద్విషయము నని వ్యవస్థఁ దెలియునది. ఇఁక దేశాంతరమందు సపిండమరణ మైనచో దశాహోత్తర మందుఁ దెలిసినయెడ మూఁడు పక్షములవరకు ద్రిరాత్రము. నారుమాసములవరకు బక్షిణి. తొమ్మిదిమాసముల వరకు నొకదినము. వత్సరము పర్యంతము సజ్యోతి యని మాధవమతము. విజ్ఞానేశ్వరుఁడు దేశాంతరమందైన సపిండమరణము దశాహా నంతరముఁ దెలిసినచో స్నానముమాత్రమే యనెను. ఇక్కడ మాధవమతమే యుక్తము. అతిక్రాంతాశౌచమును వయోవస్థానిమిత్తకమైన యాశౌచము సర్వవర్ణములకును సాధారణము. దేశాంతరము విప్రుని కిరువదియామడలకు పైదేశము క్షత్రియాదుల కైనచో గ్రమముగ నిరువదినాలుగు ముప్పది యరువదియు నామడలు దూరము గలదేశమని యెఱుంగునది. కొందఱు విప్రునికే ముప్పది యామడగావలెనంద్రు. భాషవేరై మహాపర్వతముగాని మహానదిగాని వ్యవధానమైనచో దేశాంతర మగును. ఇఁక భాష వేరుగాకున్నను మహాగిరి నద్యాదుల వ్యవధానము మాత్రమున దేశాంతర మని చెప్పుట మీఁద జెప్పిన యిరువది ముప్పది మొదలగు సంఖ్యలో రెండుమూఁ డామడలు దక్కువైనను దేశాంతరమని సిద్ధించుటకొరకని తోఁచుచున్నది. అట్లు గానిచో మహానదికి రెండుతీరముల నున్నవారికి యామడకు లోపుగనైనను దేశాంత రము గావలసివచ్చును. అందు సగోత్రవిషయమైన యాశౌచములు మాత్రమే భార్యా పతిపుత్త్రాదులందరును నాచరింపవలసినది. మరి మేనమామ చెల్లెలు మొదలుగ నిమిత్తమైన భిన్నగోత్రుల యాశౌచములలో జాయాపతిపుత్రాదులలో తమతమ సంబంధమయిన యాశౌచము నెవ్వరిది వారేపట్టుదురు. రాత్రియందు జననముగాని మరణముగాని యవి తెలియుటగాని జరిగినచో రాత్రి మూఁడు భాగములు జేసి మొదటి రెండుభాగములలో నైనచో బూర్వదినమనియు మూఁడవభాగమందైనచో బరదినమనియు మొదలుచేయవలెను. లేదా అర్ధరాత్రమునకు మున్ను పూర్వదినము నటుపైని బరదినమనియైనను దేశాచారము చొప్పున వ్యవస్థ యగును. ఆహితాగ్ని

యైనచో మంత్రయుక్తముగ దహనముఁ జరిగినదినము ప్రారంభించి పుత్రాదుల కాశౌచము. ఆహితాగ్ని యనఁగ శ్రౌతాగ్నులు గలవాఁడని గ్రహించునది. ఇతరుఁడు గృహ్యాగ్నిఁ గలిగియున్న నిక్కడ యానాహితాగ్ని యనఁబడును. ఆహితాగ్ని విదేశమందు మృతుఁడైనచో మంత్రయుక్తదహనమునకుఁ బూర్వమును బుత్రాదుల కాశౌచము లేదు. సంధ్యాది నిత్యకర్మలకు లోపమును కానేరదు. మంత్రవద్దాహమైన పైని పుత్రాదిసపిండులకును ద్రౌహిత్రాది భిన్నగోత్రులకును నాశౌచము తప్పదు. మఱి యతిక్రాంత నిమిత్తకాశౌచము లేకుండుటగాని దానికి సంకోచముగాని లేదు. కనుకనే ఆహితాగ్నికి దేశాంతరమందును గాలాంతరమందును బర్ణశరదాహముఁ జేసినను పదిరోజు లాశౌచమని సిద్ధింపుచున్నది. అనాహితాగ్నికి మరణదినము నారంభించి పుత్రాదు లాశౌచము ధరించునది. అనాహితాగ్నికి దేశాంతరమందు మృతియైనచో నతిక్రాంతాశౌచము మరణము విన్నపైననే మున్ను చెప్పిన వ్యవస్థచే జేయవలెను. అనాహితాగ్నికి నస్థిదాహము పర్ణశరదాహ మగునప్పుడు మొదట నాశౌచముఁ బట్టని భార్యాపుత్రులకు దశాహమే యాశౌచము. పూర్వమందాశౌచముఁ బట్టిరేని సంస్కారముఁ జేసినకర్త తప్పఁ దక్కినవారికి దాహకాలమందు త్రిదినమే యగును. సవతులకిద్దరికి పరస్పరము నిట్లనే యగును. పత్నికి సంస్కారముఁ జేయునపుడు పతికి నట్లనే యగును. తక్కిన సపిండులకు పూర్వమం దాశౌచము గ్రహింపరేని దాహ మనాహితాగ్నికిఁ జేయుచో త్రిరాత్రము. గృహీతాశౌచులైరేని సపిండులకు దాహకాలమందు స్నానమాత్రమే. ఇట్లు సపిండులకు ద్రిరాత్రాదికమును పుత్రాదులకు దశాహాదికమును దశదినాంతరమున సంస్కారముఁ జేయవలసి వచ్చినపుడే యని తెలియునది. అట్లుగాక పదిరోజులకు లోగానైనచో మిగిలిన దినములచే శుద్ధియు గర్మ సమాప్తియునని యెఱుంగునది. ఆహితాగ్నికి మాత్రము దశాహమధ్యమందు శరీరదాహమైనను నస్థిదాహము పర్ణశరదాహమైనను మిగిలినదినముచే శుద్ధి లేదు. ఏమనిన; నాతనికి సమంత్రకదాహదినమే ప్రథమదినమని మీఁదఁ జెప్పఁబడినది. దశాహానంతరమందు మృతినొందిన యనాహితాగ్నియొక్క వార్త వినినది మొదలుగ మూఁడురోజు లాశౌచముఁబట్టి నసపిండులకు జతుర్థదినము మొదలుకొని యాతనికి సంస్కార మారంభింపఁబడినను దాహకాలమందు స్నానము మాత్రముఁ జేయవలెను. పూర్వ మాశౌచముఁబట్టకుండిరేని సపిండులకు త్రిదినమే. భార్యాపుత్రాదులకు శ్రవణ దినము మొదలుగ పదిదినములు. రెండవ దినమందారంభించినను నాల్గవనాఁడు సపిండులకు శుద్ధియగును. భార్యాదులకు పదిదినములు శ్రవణదినము మొదలుగ నాశౌచమని యూహించునది. దేశాంతరమందున్న వానికి పండ్రెండు వత్సరములు ప్రతీక్షించినపైని పర్ణశరదహనముఁ జేసినను నిట్లూహించునది. అనఁగా పుత్రాదులకు దశరాత్రము సపిండులకు ద్రిరాత్రమనుట దేశాంతరస్థునికి గాలప్రతీక్షణ మెట్లనిన; వార్త వినబడని సమయము మొదలుకొని పదునైదు సంవత్సరముల వరకును దలిదండ్రులకును నితరులకును పూర్వవయస్సుఁ గల్గియున్నచో నిరువదియును మధ్యమ వయస్సునందు పదునైదును నుత్తరవయస్సు నందు పండ్రెండును వత్సరములు.

యుక్తి మొదలగువానిచే మరణము నిశ్చయింప శక్యముగానిచో బ్రతీక్షింపవలెను.

## అనేక శౌచములుగలసినచో నిర్ణయము

పదిరోజుల పట్టెడు మృతాశౌచములో నట్టి మరియొక దశాహాశౌచముగాని యంతకు తక్కువగు త్రిరాత్రాద్యాశౌచముగాని వచ్చినచో మొదట ప్రవర్తించిన దశాహాశౌచముతో వానికిని శుద్ధియగును. ఇట్లు పది దినములు పట్టవలసిన పురిటిలో నట్టి పురుఁడుగాని యంతకు తక్కువ పురుఁడుగాని పడినచో మొదట ప్రవర్తించిన పురిటియంతముతో వీనికిని శుద్ధియగును. మరియును దశదినముల మృతాశౌచములో పదిదినముల పురుఁడుగాని యంతకు తక్కువ పురుఁడుగాని పడినచో మృతాశౌచముగాని యంతకు తక్కువదిగాని పడినను, లేక త్రిదినజననాశౌచము పడినను ప్రథమ ప్రవృత్తమైన మృతాశౌచశుద్ధితో వీనికిని శుద్ధియగును. మూఁడు దినముల మరియొక పురుఁడు పడినను మొదట పుటిరి యంతముతో శుద్ధియగును. పక్షిణి యను మృతాశౌచమందును మరియొక పక్షిణిగాని యొకదినము మొదలగు తక్కువ మృతాశౌచముగాని పడినను మొదట పక్షిణి యంతముతో వీనికిని శుద్ధియగు మరియే మనిన; పురుడు సమమైనది యైనను నెక్కుడు దినములుండునదియైనను దనలోవచ్చు మృతాశౌచమును శుద్ధిచేయలేదు. మరియును పక్షిణి మొదలగు మృతాశౌచమైనను మూడుదినములు పదిదినములు నుండెడు జాతాశౌచమును శుద్ధిచేయలేదు. అట్లు మూడురోజుల మృతాశౌచముచే పదిరోజులు పురుడుపోదని బహుసమ్మతము క్వచిత్తుగా మృతాశౌచము తక్కువైనను నెక్కువ జాతాశౌచమును శుద్ధిచేయునని యున్నది. త్రిదిన మృతాశౌచముచే దశదిన మృతాశౌచము శుద్ధిముగాదు. ఇట్లు పక్షిణిచే త్రిదినము నేకాహముచే బక్షిణియు నివర్తింపదు. ఇక్కడ నిట్లు తెలియవలెను ఎట్లనిన; సంపాతమనగ నాశౌచవంతులకు నొకయాశౌచము నొందినను జ్ఞానముం డగ మరియొక యాశౌచము నొందితినను జ్ఞానము. కాఁబట్టి పూర్వాశౌచ మధ్య మందు పుట్టినదైనను పరాశౌచము పూర్వాశౌచాంతమందు దెలిసినచో పూర్వముచే నివర్తింపదు. ఏమనిన; సంపాతములేదు. పూర్వత్వ పరత్వ ములు జన్మచే సిద్ధించుగాని జ్ఞానముచే సిద్ధింపవు. కనుక పూర్వమందుబుట్టినది యుత్తరమందు పుట్టిన యాశౌచము దెలసిన యనంతరమందు ఎప్పుడైనను పూర్వో త్పన్నముచే బరమందు బుట్టినయాశౌచము దానిమధ్యమందు దెలియఁబడినచో నివర్తించును. సంపాతమే జ్ఞానమున సిద్ధించును. పూర్వత్వాదికము రాదని సిద్ధాంతము. పదిరోజల కొకరాత్రి యందు నివర్తింపదగిన మరియొక దశాహాశౌచ మనగ జాతాశౌచములో నిమృతాశౌచము తప్ప దక్కనదనుట. అట్టిది వచ్చినచో మరిరెండు దినము లధికము చేయవలయును. పదియవరాత్రి నాల్గవజాముడ నట్లైనచో మూడుదినములధికముగ జేయవలయును. అట్లు దశమరాత్రి యందుగాని నాల్గవజామునగాని నిర్తింపదగిన త్రిరాత్రాశౌచము వచ్చినచో పూర్వాశౌచాంతమందే శుద్ధియగును. మీఁదఁ జెప్పినట్లు రెండు మొదలగువృద్ధి యక్కరలేదు. ఇట్లు త్రిరాత్రాశౌచము వచ్చినచో పూర్వాశౌచాంత మందే శుద్ధియగును. మీఁదఁ జెప్పినట్లు రెండు మొదలగు వృద్ధి యక్కరలేదు.

ఇట్లు త్రిరాత్రాద్యాశౌచములకును మూడవరాత్రి యందు గానిదాని నాల్గవజామున గాని నివర్తింపయోగ్యమగు త్రిరాత్రాద్యాశౌచము వచ్చినను పూర్వాంతమందు దానికిని శుద్ధియేకాని వృద్ధి యక్కరలేదు. మరియును మీదజెప్పిన వృద్ధిదినములలో మరియొక దశాహాశౌచము వచ్చినచో పూర్వముచే నివర్తింపదని తెలియునది. అయినను వృద్ధిచే వచ్చిన రెండు మూడుదినములలో బక్షిణి నివర్తించును. మరియును మూఁడుదిన ములు వృద్ధియగునపుడు మరియొక త్రిరాత్రాశౌచము పడినను నివర్తించును అయినను మేనమామ మొదలగువారికి మేనల్లుడు మొదలగు వారంత్యకర్మ కర్తృ త్వము నొంది చేయుచున్నపుడు సపిండమరణాదికముచే మరియొక దశాహాశౌచము పడినచో నది పూర్వముచే నివర్తింపదు. ఏమనిన; గర్మాంగమైన యాశౌచ మస్పృశ్యత్వ రూపమే గనుక నిత్యకర్మలోపము చేయలేనిదగుటచే లఘువై నది యట్టిది గురువైన దశాహాశౌచము నెట్లు నివర్తింపఁజేయును. ఇట్లు త్రిరాత్రమందుఁ బడినపుడును జననత్రిరాత్రాశౌచము నివర్తించును. మృతత్రి రాత్రము నివర్తింపదని మొదలుగ నూహించునది. పుత్రునికి సపిండమృతాశౌచము పడినను తలిదండ్రుల యాశౌచము నివర్తింపదు భార్యకు భర్త్రాశౌచమును నివర్తింపదు. కొందరు పతికి భార్యాశౌచము గూడ నిట్లు నివర్తింపదండ్రు మాత్రాశౌచమధ్య మందు పిత్రాశౌచము పడినను పూర్వాంతమందు శుద్ధియగును. స్మృత్యర్థసారము మొదలగు వాని యందు మాత్రము పిత్రాశౌచము సంపూర్ణముగ నగుననియున్నది. పిత్రాశౌచ మందుఁ దల్లి మృతియైనచో పిత్రాశౌచము సమాప్తినొందించి పక్షిణి యధికముగఁబట్టవలయును. ఈ పక్షిణీ వృద్ధియు పదివయరాత్రికిలోగా మరణముఁజరిగి తెలిసినచో నగును. దశమరాత్రి యందుగాని దాని చతుర్థయామమందుగాని మర ణముఁ జరిగినచో ద్విరాత్రము త్రిరాత్రము నగునుగాని పక్షిణి గానేరదు. తల్లి యనాహితాగ్ని యగుభర్త మృతినొందిన రెండుమూఁడు దినములలో సహగమనముఁ జేసెనేని యధికముగ బక్షిణిపట్ట నక్కరలేదు. భర్త్రాశౌచాంతమునందే శుద్ధియగు, నవాహ్నిక శ్రాద్ధపిండాదులునొకమారే సమాప్తిఁ జేయవచ్చును. ఆశౌచోత్తరమందను గమనమైనచో ద్రిరాత్రము. ఈ త్రిరా త్రము సపిండులకే పుత్రునికి మాత్రాశౌచము సంపూర్ణమే యని తోచుచున్నది. సహగమనమందని గౌడులు ఇవియే యుక్తము. ఇట్లు సంపాతముఁ గల్గినచో పూర్వా శౌచముచే శుద్ధియగుట సూతికకును సమంత్రక ముగఁ దహించినకర్తకును లేదు. ఇఁక దేశాంతరమందు మృతుఁడైన తండ్రి యొక్క వార్తవిని పుత్రులు దశాహాశౌచ మును బట్టియు నస్థులు సంభవింపక సంస్కారమపుడు చేయలేదు. దశాహానంతరమం దతనికి సంస్కార మారంభించునపుడు కర్తయగు పుత్రునికి కర్మాంగమైన దశాహా శౌచము తప్పదు. అపుడు సపిండుని మృతిచే మరి యొక దశాహాశౌచము పడినను పూర్వ ప్రవృత్తముచే నివర్తింపదు. మాత మృతినొందినను అధికముగ పక్షిణి యక్కర లేదు. మరియేమనిన; సపిండాశౌచము మాత్రా శౌచమును సంపూర్ణముగఁ బట్టవల యును. ఏమనిన; అతివత్సరములు ప్రతీక్షించి పుత్రాదులు పిత్రాదులకు చేయు సంస్కారాంగమైన దశాహాశౌచమందు మరియొక సపిండాశౌచము పడినప్పటికిని

పూర్వముచే శుద్ధిగాదు. ఇట్లసంపాతమందు పూర్వ ముచే శుద్ధికపవాదము సింధువు నందుఁ జెప్పఁబడినది. జననాశౌచమందును మృతా శౌచమందును మరియొక మృతాశౌచము పడినప్పటికిని పిండదానాద్యంత మగు కర్మకు లోపములేదు. మృతా శౌచమందుగాని జాతాశౌచమందుగాని తనకు పుత్రుఁడు గల్గినచో జాతకర్మాదు లకును ప్రతిబంధములేదని కొందరు పూర్వశౌచాంతమందే జాతకర్మయని యితరులు తల్లి కధికముగ మీఁదఁజెప్పిన పక్షిణిలో దండ్రికి మహైకో ద్దిష్టమందును వృషోత్సర్జన మందును శయ్యాదానాదికమందు నధికారమున్నందున నపుడు చేయవలెను. ఇతర సపిండుల యాశౌచమందు నేకాదశ దినకృత్యము చేయఁగూడదని బహుసమ్మతము. చేయవచ్చునని క్వాచిత్కము.

## శవస్పర్శానుగమనాదులచే నాశౌచ నిర్ణయము

అట్టి సంసర్గాశౌచమందు నిత్యకర్మకు ప్రతిబంధములేదు. మరి యస్పృశ్య త్వము మాత్రముండును. అదియును నతని భార్యాపుత్రాదులకు లేదు. మరి సంస ర్గముఁ జేయువానిరి మాత్రమే. కనుక నతని గృహందున్నట్టి యతని యన్నాదులకు నిషేధము లేదు అందు సజాతీయశవమును ముట్టినచో నక్షత్రదర్శన పర్యంతము. హీనవర్ణశవమును ముట్టినచో నధికము కల్పింపవలెను. ఇఁక శవానుగమనము సజాతిగాని విజాతిగాని శవము ననుసరించి వెళ్ళినచో స్నానముఁజేసి ప్రాణా యామము చేయవలెను. విప్రుఁడు శూద్రశవము ననుసరించి వెళ్లినచో ద్రిరాత్రము నదియందు స్నానముఁజేసి ఘృతప్రాశనము ప్రాణాయామములు నూరును జేయ వలెను. నిత్యకర్మకు లోపమే లేదు.

## శవమును మోయుచో నాశౌచము

స్నేహముచే సజాతీయశవమును మోసినను తదన్నము దిన్నను తద్గృహమందు నివాసముఁ జేసినను దశాహ మాశౌచము. తద్గృహవాసము మాత్రముగాని తదన్న భక్షణ మాత్రముగాని చేసినచో ద్రిరాత్రము అన్నముఁ దినుటయు గృహవాసము లేనిచో నొకదినము. మరియొక గ్రామమందు శవము మోసివచ్చినచో సజ్యోతి యనఁగ నక్షత్రాది దర్శనము. ద్రవ్యము గ్రహించి సజాతీయశవము మోసినచో దశాహము. విజాతీయశవము మోసినచో నాజాతిమయిల వచ్చును. మూల్యమున కట్లు చేసినచో ద్విగుణము. సోదకశవము మోసినను దశాహమే. శవాలంకారముఁ జేసినచో పాదకృచ్ఛ్రము. అజ్ఞానమున జేసినచో నుపవాసము. అశక్తిలో స్నానము, ధర్మార్థము దిక్కులేని ద్విజశవమును మోసినచో నశ్వమేధపుణ్యము. స్నానమాత్రముచే శుద్ధియు నగును. అగ్నిస్పర్శము ఘృతప్రాశనముఁగూడ గావలెను. ధర్మార్థమైనను శూద్రశవమును మోసినచో నొకదినము. ధర్మార్థమనాథశవము ననుగమించినను దోషములేదు. బ్రహ్మచారి పితృమాతృమాతా మహాచార్యోపాధ్యాయులు తప్ప దక్కిన శవము మోసెనేని నుపనయనమునకు లోపము. మీఁదఁ జెప్పినరీతి నాశౌచము నగును. కనుక నతఁడు కృచ్ఛ్రప్రాయశ్చిత్తము పునరుపనయనమును జేసుకొనవలెను.

పిత్రాదిశవము మోసినను బ్రహ్మచారి యాశౌచాన్నము దినగూడదు. మైలవారిని స్పృశింపఁగూడదు. అట్లు చేసినచో నతనికి నిత్యకర్మలోపము లేదు. ఇఁక దాహాదులం దాశౌచము సమముగాని యుత్కృష్టముగాని యగువర్ణమందలి శవమును స్నేహాదిక ముచే దహించి యుదకదానము మొదలగు సకల సంస్కారములు చేసినచో నాజాతి యాశౌచమువచ్చును. దానియంతమందు స్నేహలోభాదుల ననుసరించి గురు లఘ ప్రాజాపత్యములు మొదలుగ మూఁడు చేయునది. స్నేహాదికముచే సజాతీయ శవముఁ దహించి తద్గృహమందున్నచో త్రిరాత్రము. తదన్నమును భుజించినచో దశాహము. ఆ రెండును లేనిచో నొకదినము. హీనవర్ణుఁడు ఉత్తమ వర్ణునిశవము దహించుట మాత్రమే జేసినచో శవజాతీయయాశౌచము. మూల్యము గ్రహించి సజాతిశవముఁ దహించుట మాత్రముఁ జేసినను దశాహాదికమే యగును. మూల్యముచే నుత్తమ వర్ణశవము దహించినచో ద్విగుణము. ఉత్తమవర్ణుఁడధమజాతిశవము మోసినను దహించినను తజ్జాత్యాశౌచము నొందు నతఁడంతమందు గ్రమముగ ద్విగుణము చతుర్గుణము ప్రాయశ్చిత్తము మూల్యము గ్రహించి హీనవర్ణశవము దహనము మొదలగునవి జేసినచో జెప్పినయాశౌచము ప్రాయశ్చిత్తము ద్విగుణము గావలెను. ధర్మార్థమై సమోత్కృష్టవర్ణముల ప్రేతకు దాహము మొదలు సకలసంస్కారములు చేసినను నాశౌచములేదు. నిత్యము పిండదానాదులు చేసినపైని స్నానముచే శుద్ధి యగును. ద్విజుఁడు ధర్మార్థమైనను శూద్రశవమునకు దాహాదికముఁ జేయఁ గూడదు. ఇఁక బ్రహ్మచారి పితృమాతృమాతామహాదులకు నన్యకర్తలు లేనియెడ దాహాదిప్రేత కర్మఁజేయునది. అపుడు కర్మాంగమైన యస్పృశ్యత్వరూపమైన దశాహాశౌచము ధరింప వలెను. అయిన నాశౌచము గలవారియన్నము తినఁగూడదు. వారిని ముట్టుకొనుచు వాసము చేయఁగూడదు. ఆ రెండును జేసెనేని ప్రాయశ్చిత్తము పునరుపనయనము గావలెను. అట్లు బ్రహ్మచారి మీఁదఁజెప్పిన వారికి దప్ప దక్కిన వారి కంత్యకర్మఁ జేసినచో కృచ్ఛ్రత్రయము ప్రాయశ్చిత్తము. పునరుపనయనమును నాశౌచాంతమున జేయునది. పిత్రాదులకు దాహమాత్రముఁ జేసినచో నొకదిన మాశౌచము. అట్టియాశౌ చము లన్నిటిలో బ్రహ్మచారికి నిత్యకర్మ ప్రతిబంధములేదు. బ్రహ్మచారి భిన్నుఁ డును దాహాది నిమిత్తకమైన సంసర్గా శౌచమందు నిత్యకర్మ బ్రహ్మ యజ్ఞాదికముఁ జేయవచ్చును. మరి దేవపూజయు వైశ్వదేవము నన్యునిచే జేయింపవలెను. తాను జేయుటకుఁదగినది తానే చేయవలెను. బ్రహ్మచారి పిత్రాదుల కంత్య కర్మఁ జేయనిచో నాశౌచమును లేదు. సమావర్తన మైన పైని పూర్వము మృతులైన పిత్రాది సపిండులకు త్రిరాత్రా శౌచముఁ జేయవలెను.

## రోదనమం దాశౌచ విచారము

విప్రాదులకు సవర్ణమరణమునం దస్థిసంచయనముఁ గాకమున్ను పరామర్శ రోదనముఁ జేసినచో స్నానము నాపై నాచమనము. అట్లు శూద్రుని విషయమై యస్థిసంచయనముగాకమున్ను పరామర్శరోదనము జేసిన విప్రునికి త్రిరాత్రము, శూద్రుని గృహమందు నివాసము మొదలగు సంబంధమున్న యెడ నస్థిసంచయనము

నకు మున్ను రోదనమైనచో నొకరాత్రి అటుపైనగుచో స్నానము సపిండమృతిలో ననుగమనరోదనాదులు చేసినను దోషములేదు. ఈ యాశౌచమందును గర్మలోపము లేదు. ఈ చెప్పిన సర్వాశౌచనములలో నాయాకాలమైన పైని స్నానముచే శుద్ధి యగును. అంత్యకర్మకు నస్థిసంచయనములోపున స్త్రీ సంగమమయినచో చాంద్రా యణము అటుపైనైనచో ప్రాజాపత్య త్రయము. తక్కినయాశౌచము గలవారికి నస్థి సంచయనమునకు మున్ను స్త్రీ సంగమయినచో మూఁడురాత్రులుపవాసము ఆపై నైనయెడ నొకరాత్రి యుపవాసము.

## ఆశౌచాన్నముదిన్నచో బ్రాయశ్చిత్తము

అసగోత్రుఁ డాపదలేకున్నను బుద్ధిపూర్వకముగ నాశౌచముగల వారి యన్నముఁ దినినచో వారి యాశౌచాంతమువరకు నాశౌచము నొందును. ఆశౌచాంత మందును విప్రాశౌచమయినచో సాంతపన కృఛ్రము ప్రాయశ్చిత్తము శూద్రాశౌచ మందు చాంద్రాయణము క్షత్రియాదులకు కలియందు లేకుండుటచే వ్రాయలేదు. వ్యవస్థ కొరకు క్వచిత్తుగా వ్రాసినను నుపయోగింపనందున నుపేక్షింపఁబడినది. బుద్ధిపూర్వకముగ నావృత్తిఁ జేసెనేని విప్రాశౌచ శూద్రాశౌచములకు గ్రమముగ మాసపర్యంత మారుమాసముల పర్యంతమును గృఛ్రవ్రతాచరణము అజ్ఞానముచే సకృద్భోజనమైనచో నాయన్నము జీర్ణమగువరకును క్రమముగ నొకదినము నేఁడు దినములు నుపవాసము వేయు ప్రాణాయామములను జేయునది. ప్రమాదముచే నావృత్తియైనచో ద్విగుణము, ఆపదయందు ప్రమాదమున భుజించెనేని నాపగలు వరకు నాశౌచము. నొకప్రాణాయామముఁ జేయునది. శూద్రాశౌచమందు వేయు నెనిమిదిమారులు గాయత్రీ జపము. బుద్ధిపూర్వకముగ నాపదయందట్ల చేసినచో మూఁడుమారు లఘుమర్షణ స్నానముఁజేసి వేయునెనిమిదిమారులు గాయత్రీ జప మును చేయునది. శూద్రాశౌచ మందు ప్రాజాపత్య కృఛ్రము శూద్రునికి ద్విజాశౌచ మందు స్నానము పంచగవ్య ప్రాశనమును, ఈ చెప్పిన ప్రాయశ్చిత్తమంతయు జననాశౌచమందును తక్కిన ప్రాయశ్చిత్త మూహించునది యని స్మృత్యర్థసారము. ఈ చెప్పినదియంతయు నాశౌచవంతు నన్నము భుజించినపుఁడని యెఱుంగునది. మరి యాశౌచవంతుఁడు ముట్టిన శుద్ధాన్నముఁ దినుచో బుద్ధి పూర్వమయినయెడ కృఛ్రము. అబుద్ధి పూర్వకమైనచో నర్ధకృఛ్రమని స్మృత్యర్థసారమందున్నది. ఆశౌచ వంతుని యన్నము నాశౌచియగువాఁడు ముట్టినదానిని భుజించినచో నాశౌచి యన్నము దిన్నందునకు నాశౌచి ముట్టినయన్నము భక్షించినందులకును రెండు ప్రాయశ్చిత్తములు దంత్రముచే జేయునది. ఆశౌచవంతుఁడిచ్చిన యామాన్నము గ్రహించునపుడు చెప్పినదానిలో సగము చేయవలెను. ఆశౌచము లేదు. దాతయు భోక్తయు నిద్దరును జననమరణాదుల వచ్చిన సంగతి నెరుగనిచో దోషమేలేదు ఒకరెరింగినను దోషము. అందు దాతకుఁ దెలిసి భోక్తకుఁ దెలియనిచో భోక్తకల్పమైన ప్రాయశ్చిత్తము. దాతకుఁ దెలియకున్నను భోక్తకుఁ దెలిసినయెడ బూర్ణప్రాయశ్చిత్తమే. భోజననిమిత్త కాశౌచము వచ్చినను కర్మకు లోపములేదు. "అధతు కథమపి స్వల్ప

సంబంధయుక్తే స్నానం వాసోయుతంస్యాత్” అని త్రింశచ్ఛ్లోకి. ఇట్లు స్మృత్యర్థ సారమందున్నది. దీని యర్థమేమనిన; స్వల్పమైననే కాహాద్యాశౌచమునకు నిమిత్తమైన సంబంధము గలస్యాలకుఁడు నల్లుఁడు మొదలగువారు మృతినొందినచో సచేల స్నానము చేయవలెను. అనఁగా గురువైనదిగాని లఘువైనదిగాని యాశౌచమువచ్చి సమాప్తి యగునపుడంతటను స్నానము చేయవలెననుట. లేదా స్వల్పములైన దశాహ భిన్నములగు పక్షిణీత్రిరాత్రము మొదలగు నాశౌచములకు నిమిత్తములైన సంబంధ ములు గలబంధుత్రయమందలి మేనమామయు ననుపనీతసపిండుఁడు మొదలగు వారు మృతులగునపుడు దేశాంతరమైనను గాలాంతరమైనను స్నానముచేయక తప్పదు. కనుక సన్నిహితకాలమందాశౌచప్రాప్తి గలాని కతిక్రాంత కాలమయినచో స్నానము. సన్నిహితకాలమందు స్నానమాత్రమే యగువానికి గాలాంతర మయిన యెడ స్నానముఁగూడ నక్కరలేదనుట. లేదా స్వల్పమయిన యనఁగా నాశౌచ నిమిత్త ముగాని సంబంధము ఎట్లనిన; స్యాలకునిపుత్రుఁ డగుటయు వివాహితకన్యకు పిన తండ్రి పుత్రుఁడగుటయు భగినికి సోదరపుత్రుఁడగుటయు మొదలగునవి. అదిగలవాని కాశౌచము లేకున్నను స్నానమాత్రము కాఁదగినదే. అనఁగా స్వల్ప సంబంధమయి నందున యాశౌచము లేకున్నప్పటికిని సన్నిధియందు స్నానమాత్రమంతటను చేయ వలెననుట. ఇట్లు పక్షత్రయమును శిష్టాచారసమ్మతము గనుక యుక్తమే యని తోఁ చుచున్నది.

## అయిదు విధముల యాశౌచము

ఇది యైదువిధములు కర్తృభేదమగుట కర్మభేదమగుట ద్రవ్య భేదమగుట ద్రవ్యభేదమగుట విధానభేదమగుట యని. అందు గర్తృభేదమగుట యనునది యెట్లనిన; యతులకు బ్రహ్మచారులకును సపిండుని జననమందు మరణమందు నాశౌచము లేదు. తలిదండ్రుల మృతియందు మాత్రము యతి బ్రహ్మచారులకు సచేలస్నానము మాత్రము తప్పదు. బ్రహ్మచారికి సమావర్తనమైనపైని దన బ్రహ్మచర్య దశయందు మృతులైన పిత్రాది సపిండులకు త్రిరాత్రాశౌచము నుదకదానమును చేయవలెను. శవానుగమనము నిర్హరణము మొదలగు నిమిత్తములచే నాశౌచము బ్రహ్మచారికి తప్పదు. పిత్రాదుల కంత్యకర్మఁ జేసినచో నాశౌచము నుండకతీరదు. ప్రాయశ్చిత్త మారంభించినపైని ప్రాయశ్చిత్తముఁ జేయునపుడు వచ్చు నాశౌచమం టదు. ప్రాయశ్చిత్తము సమాప్తమైన పైని ద్రిరాత్రమతిక్రాంతాశౌచము. ఇట్లు కర్మాంగ నాందీశ్రాద్ధము. జేసినపైని యాకర్మ సమాప్తియగు వరకును దానికి చేయు కార్యమం దాశౌచములేదు. మరియు నార్తి మొదలగు నుపద్రవములం దాశౌచము లేదు. జాతాశౌచ మృతాశౌచములు గలవానికి మరణకాలమందాశౌచ ముండదు. కనుక దానాదికమందును వైరాగ్యముఁ గల్గెనేని యాతురసన్యాస మందు నధికారముఁ గలదని సింధ్వాదులు దేశోపద్రవము దుర్భిక్షము మొదలగు మహాపత్తులందు సద్యశౌచ మగును. ఆపదఁదాటిని నాశౌచము మిగిలినచో నవశిష్టాశౌచముఁ బట్టవలయును. ఇఁక కర్మవిశేషమునుబట్టి యెట్లనిన; అన్నసత్రము వేసినవారి కన్నాది దానమం

దాశౌచము లేదు. ప్రతిగ్రహించినవానికిని బియ్యము మొదలగు నామాన్నముఁ గ్రహించినచో దోషములేదు. పక్వాన్నము భుజించినచో ద్రిరాత్రము. క్షీరపానము ఆరంభించిన యనంత వ్రతాదులందును నేకాదశ్యాదికమందును నట్టి కృఛ్రాది వ్రతమందును నాశౌచములేదు. అందు స్నానాది శారీరనియమములను స్వయముగా జేయవలెను. అనంతపూజ మొదలగునది యన్యునిచే జేయింపవలెను. బ్రాహ్మణ భోజనాదికము మాత్ర మాశౌశాంతమునందుఁ జేయునది. ఇట్లు రాజు మొదలగు వారికి ప్రజాపాలనము మొదలగుకర్మలందాశౌచము లేదు. ఋత్విక్కులకు మధుపర్క పూజయైనపై నాకర్మయందాశౌచము లేదు. కనుక మధుపక్కమే విధింపని యాధా నము. పశుబంధము మొదలగు కర్మలందు వరించుట యైనప్పటికిని నాశౌచము వచ్చినచో నాతనివిడిచి మరియొక ఋత్విక్కును వరింపవచ్చును. దీక్షితులకు దీక్షణీ యోత్తరమందు నవభృథస్నాన పర్యంతము యజ్ఞకర్మయందాశౌచము లేదు. అట్టి దీక్షితుఁడు ఋత్విక్కును కర్మమధ్యమందు స్నానమాత్రము చేయునది. అవభృథమున కంటె పూర్వమే యాశౌచము నివర్తించును గనుక నవభృథము కావలను గాదని సింధువు. అపుడును గర్మాంతమందు ద్రిరాత్రముఁ జేయవలెను. మీఁదఁ జెప్పిన రీతినే రోగభయము రాజభయము పోవుటకుఁ జేయుశాంతి కర్మయందాశౌచ మంటదు. ఆకలిచే పీడింపఁబడు కుటుంబముగలవానికిఁ బ్రతిగ్రహమందాశౌచ ముండదు. విస్మృతివచ్చునను భయము శీలముగలవాని కధీతమైన వేదశాస్త్రాధ్యయన మందాశౌచ ముండదు. వైద్యునికి నాడీస్పర్శమనఁగ ధాతువును విచారించుటలో నాశౌచముండదు. శ్రాద్ధమందు మీఁదఁ జెప్పఁబడినది. దేవమూర్తి ప్రతిష్ఠించుట చూడాకర్మ యుపనయనము వివాహము మొదలగు నుత్సవములందును తటాకము మొదలగువాని ప్రతిష్ఠయు కోటిహోమము తులాపురుష దానము మొదలగు కర్మ లందును నాందీశ్రాద్ధమైనపై నాశౌచమంటదు. సంకల్పించిన పురశ్చరణజపమందును నవిచ్ఛిన్నముగ సంకల్పించిన హరివంశ శ్రవణాదులందును నారంభోత్తరమందాశౌచ మంటదు కాలనియమము సంకల్పింపనిచో స్తోత్రహరివంశాదికమును జరుపఁ గూడదు. ఈ సమస్తమైన యాశౌచాపవాదముగతి వేరుగ లేనపుడును సంకటమం దును నవలంబింపవలెనని సింధువునందును నాగోజీయమందు నున్నది. కనుక నన్యగతికత్వము నాలోచించియే యాశౌచాభావముఁ గూర్చవలెనని ఇక్కడ జెప్పవలసినది. పూర్వార్థమం దక్కడక్కడఁ జెప్పఁబడియే యున్నది. కొందరు వ్రతము లందువలె దీక్షితులగు ఋత్విక్కులకు నారంభించిన యుత్సవాదులకును స్వరూపము నుండియు నారంభమునుండియు యావశ్యకము లగుటవలన నాపదలేకున్న నాశౌచము లేదంద్రు. కన్య ఋతుమతియగు ననుశంకఁగల్గినచో ముహూర్తాంతరము లేనియపుడు జాతాశౌచమున్నను గూశ్మాండహోమాదికముఁజేసి వివాహ మారంభించ వచ్చునని మీఁదఁ జెప్పఁబడినది. వివాహాదులందు నాందీశ్రాద్ధోత్తరమం దాశౌచ ముపడినచో బూర్వసంకల్పితమైన యన్నమును సగోత్రులు వడ్డింపవచ్చును. బ్రాహ్మ ణులు భుజింపవచ్చును. మరి యన్నము వారిని సూటీకి ముట్టఁగూడదు. వివాహాదు

లందుగాని మరియొకప్పుడుగాని విప్రులు భుజింపుచుండఁగ దాతకు సూతకాద్యాశౌచము వచ్చినచో నాయన్నము విడిచి మరియొక గృహమం దాచముఁ జేయవలెనని మొదలగునది మీఁదఁ జెప్పబడినది. ఇట్లే సహస్ర భోజనాదికమందును పూర్వ సంకల్పితమైన యన్నాదులందుఁ గ్రహించునది. పార్థివశివపూజయం దాశౌచముండదు. ఆశౌచమందు సంధ్యాశ్రౌతస్మార్తహోమాదులకు పూర్వార్ధమందుఁ జెప్పఁబడినది. అగ్నిసమారోపణము ప్రత్యవరోపణమును జాతాశౌచ మృతాశౌచములందుఁ గూడదు. కనుక నాత్మారోపణముఁ జేసినపై నాశౌచము వచ్చినచో బునరాధానమే చేయవలెను. సమారోపప్రత్యవరోపము లొకఁడే చేయవలెనుగాని యిది యొకఁడు నది యొకఁడు చేయవచ్చునుగాని యాశౌచమున కపవాదముగాని గానరాదు. ఇట్లు పునరాధానము బహ్వృచులకు బంద్రెండుదినములు హోమలోపమగు నపుడును నితరులకు మూఁడుదినములట్లగునపుడే యని తెలియునని గ్రహణనిమిత్తమైన స్నానము శ్రాద్ధముదానము మొదలగు వాని విషయమై యాశౌచముండదు. స్నానమాత్రముగాని శ్రాద్ధాదులు గూడదని కొందరు, సంక్రాంతి స్నానాదికమందును నాశౌచము లేదు. నిత్యకృత్యములైన స్నానాచమనభోజన నియమములు నస్పృశ్యస్పర్శనాది నియమములందు నాశౌచము లేదు. అనఁగా నాశౌచి యగునపుడు నానియమము లెప్పటివలె నడుపవలెననుట. తక్కిన వైశ్వదేవము బ్రహ్మయజ్ఞము దేవపూజ మొదలగు నిత్యనైమిత్తిక కామ్యములు చేయఁగూడదు. భోజనముఁ జేయుచుండగ జననమరణాది ప్రయుక్తమైన యాశౌచము వినినచో ముఖమందున్నికబనొకయుపవాసము. సర్వాన్నము భుజించినచో ద్విరాత్రోపవాసము. ఇట్లు కర్మవిశేషమునుండి యాశౌచాపవాద విచారము. ఇఁక ద్రవ్యవిశేషముఁబట్టి యెట్లనిన; పుష్పములు ఫలములు మూలములనగఁ దుంపలు మొదలగునది లవణము మధువు మాంసము కూరయు గడ్డికర్రలు నీళ్ళు క్షీరము పెరుగు నేయియు నౌషధము తిలలు వానివికృతులు చెరుకులు వానివికృతులు పేలాలు మొదలగు వేచిన వస్తువులు లడ్డులు మొదలగు భక్ష్యములు నాశౌచి స్వామికములైనను వాని గృహమందున్నను గ్రహింపవచ్చును. ఆశౌచవంతుఁడు తనహస్తముతో నిచ్చెనేని నిదియేదియుఁ గూడదు. బాజారులో కొనునప్పుడమ్మెఁడువా డాశౌచియైనను వానిహస్తమునుండి లవణాదులు గ్రహించినను క్రయముచే శుద్ధియగు. లాజాతులగు వేచినవస్తువులు మొదలగు వానికి క్రయముచేనైనను శుద్ధిలేదు గనుక వానిహస్తముచే గ్రహింపఁగూడదు. ఇఁక మరణదోషమున నాశౌచాపవాదమెట్లనిన; శాస్త్రవిహితముగాక శస్త్రాగ్నివిషజలభృగు పాతానశనాదులచే బుద్ధిపూర్వకముగ నాత్మఘాతను జేసికొన్నవారికి నాశౌచములేదు. అట్టి యాత్మఘాతము క్రోధాదులచేగాని పరుని నుద్దేశించిగాని స్వకీయేష్ట సాధనభ్రమముచేగాని యగుగాక. అట్లు శౌర్యాదిదోషమందు రాజశిక్షచే హతులైనను పరస్త్రీ సంగమమున తత్పుత్యాదులచే హతులైనను పిడుగులు మొదలగు వానిచే హతులైనను వారికి నాశౌచము లేదు. మరియు నితరులవద్దని నిషేధింపుచున్నను గర్వమున నదీతరణము కూపప్రవేశము మొదలగువానిచే మృతులగు

వారికిని గోవులు మొదలగునవి దొంగిలుటకు ప్రవర్తించిన చోరులు గోవులచే గాని సర్పములు కొమ్ములుగల జంతువులు కోరలుగల జంతువులు గజములు చోరులు విప్రులు చండాలులు మొదలగు వారిచేగాని హతులైన వారికిని నాశౌచము లేదు. మహాపాతకములు చేసినవారికిని వారితో సహవాసముఁ జేయువారికిని తత్తుల్యులైన పతితులకును నపుంసకులను మరణముఁ గల్గినచో నాశౌచములేదు. ఇఁక స్త్రీలలోను పతిపుత్రాదులఁ జంపినవారికిని హీనజాతులతో సంగమముఁ జేసినవారికిని గర్భము దింపుకొన్న వారికిని వ్యభిచరించు స్త్రీలకును మీఁదరిజెప్పిన యాత్మఘాతము మొదలగు పాపముఁ జేయువారికిని మరణమందాశౌచము లేదు. అట్టివారి శవముల స్పృశించుట మోయుట కన్నీరు గార్చుట దహించుట మొదలగు నంత్యకర్మలు చేయఁగూడదు. అట్టి స్పర్శాదులు జ్ఞానాజ్ఞానములచే సకృదభ్యాసాదులఁ జేయుచో దారతమ్యమున గృఛ్రాతికృఛ్ర సాంతపన చాంద్రాయాణాది ప్రాయశ్చిత్తములు సింధ్వాదులందుఁ దెలియునది. మఱియు వారిశవములకుఁ జలమందుఁ బడవేయుటకుఁ గూడదు. అటుపైని సంవత్సరోత్తరమందు పుత్రాదులు వారివారి యాత్మఘాతాదిప్రాయశ్చిత్తములు వారికిఁజేసి నారాయణబలిఁజేసి పర్ణశరదాహము మొదలుగ నాశౌచము నంత్యకర్మయును జేయునది. కొందరు ప్రేతశరీరము దహించి యందులకు చాంద్రాయణత్రయముఁజేసి యస్థులుదాఁచి సంవత్సరాంతమందు మీఁదఁజెప్పిన ట్లంత్యకర్మ్మఁ జేయవలెనంద్రు. లేదా లౌకికాగ్నిచే సూరకే దహించి స్వజీవనమందు సందేహము నుండిగాని భక్తిచేగాని సంవత్సరమునకు లోపుననైనను వారి యాత్మభూతాదులకు విధించిన ప్రాయశ్చిత్తము ద్విగుణముగఁజేసి నారాయణ బలి నాచరించి పర్ణశరదాహము నస్థిదాహము మొదలుగ నౌర్ధ్వదైహికము నాశౌచమును జేయవచ్చును. ఇట్లు జేయుటయును ప్రాయశ్చిత్తార్హులకే. ఇఁక ప్రాయశ్చిత్తానర్హులకైనచో ఘటస్ఫోటముచే బహిస్కృతులైనవారికి నగుచో దాసీద్వారమున పతితోదకవిధిఁ జేసినపైని, సపిండీకరణము లేకుండఁగ నంత్యకర్మ్మఁ జేయవలయును. కనుక సాంవత్సరికము నేకోద్దిష్టవిధిచేతనే చేయవలెను. లేదా యాత్మ ఘాతముఁ జేసుకొనినవారికి పుత్రాదులు మృతజాతీయుని వధకుఁజెప్పిన బ్రహ్మహత్యాది ప్రాయశ్చిత్తముతో చాంద్రాయణము. తప్తకృఛ్రద్వయమును జేసి నారాయణ బలిపూర్వ ముగఁ దహింపవలెను కాఁబట్టి యాత్మ ఘాతులకును గోగజవ్యాఘ్రసర్పాది హతుల కును పతితులు మొదలగువారికిని మీఁదఁజెప్పిన వారికందరకును మరణ దినము నారంభించి యాశౌచములేదు. మరియేమనిన; తత్తత్ప్రాయశ్చిత్త నారాయణ బలిపూర్వ ముగ సమంజలాగ్న్యాదులచే ప్రమాదమున మృతినొందినవారికి మరణదినము మొదలుగనే యాశౌచము. అదియు త్రిరాత్రమే యని కొందరు పదిదినములని బహుసమ్మతము. మరియేమనిన; ప్రమాదమరణముఁ గూడ దుర్మరణమే గనుక ప్రాయశ్చిత్తపూర్వముగనే దాహాదికముఁ జేయవలెను. అట్లు స్మృత్యర్థసారమందున్నది. “చండాల గోబ్రాహ్మణ చోర పశుదంష్ట్రి సర్పాగ్న్యుదకాదిభిః ప్రమాదాన్మరణే చాంద్రాయణం తప్త కృఛ్రద్వయం చ తత్ప్రాయశ్చిత్తం కృత్వాయద్వా పంచదశ కృఛ్రాణి కృత్వా

విధి వద్దహనాశౌచోదక దానాదికార్యం”యని అనఁగా ప్రమాదముచే దుర్మరణమైనపుడు చాంద్రాయణము రెండు తప్తకృచ్ఛ్రములనుగాని, లేక పదునైదుకృచ్ఛ్రములుగాని ప్రాయశ్చిత్తముగఁజేసి యథావిధిగ దాహాదికృత్యములు చేయవలెనని ప్రాణాంతఫలకమగు ప్రాయశ్చిత్తముచే మృతుఁడగు వానికి దశదినము లాశౌచము సర్వప్రేతకర్మలు జేయవలసినవే. ఏమనిన; ప్రాయశ్చిత్తముచే నతఁడు శుద్ధుఁడయ్యెను. ఇట్లు ప్రాయశ్చిత్తము నారంభించి మధ్యమందు మృతుఁడైనను శుద్ధుఁడని యెరుంగునది. ఆహితాగ్ని పతితుఁడై మృతినొందినను, లేదా దర్పాదికముచే చండాలశృంగిచోరాదులచే హతుఁడైనను విశేషమున్నది. ఎట్లనిన; “త్రేతాగ్నీన్ ప్రక్షిపేదప్సు ఆవనసథ్యం చతుష్పథే, పాత్రాణితు దహేదగ్నౌ సాగ్నికే పాపకర్మణి” అనఁగా త్రేతాగ్నుల నుదకమందును నావసథ్యాగ్నిని నాల్గుమార్గములు గలసినచోటను బడవేసి పాత్రల నగ్నిలో దహింపవలెను. అటుపైని ప్రాయశ్చిత్తమున కర్హుఁడో యనర్హుఁడో యాలోచించి మీఁదఁజెప్పినవ్యవస్థచే నగ్నిమథించి దాహాద్యంతకర్మఁ జేయవలెనని వచనములు. ‘మహాపాతక సంయుక్త స్సాగ్నికోయది జీవతి, పుత్రాదిః పాలయేదగ్నీన్ ప్రాయశ్చిత్త క్రియావధి’ యనఁగా నాహితాగ్ని పతితుఁడై జీవించియున్నచో నతని యగ్నులను పుత్రాదులతనికి ప్రాయశ్చిత్తమగునంతకు సంరక్షింపవలెననుట. “ప్రాయశ్చిత్తం న కుర్యాద్యః కుర్వన్ వా మ్రియతే యది, జలేగ్నీన్ ప్రక్షిపేదగ్నౌ పాత్రాణి తు జలేషువా.” అనఁగా నట్లు పతితుఁడగు నాహితాగ్నికి ప్రాయశ్చిత్తము గాకున్నను ప్రాయశ్చిత్తముఁ జేయుచు మృతినొందినను వానియగ్నులను జలమందును పాత్రలగ్నియందైనను జలమందైనను విడువవలెను. మాధవీయమం దాహితాగ్నికి దుర్మరణమైనను నాత్మఘాతమైనను లౌకికాగ్నిచే వాని నూరకే దహించి వానియస్థులు క్షీరముచే గడిగి యాప్రాయశ్చిత్తముఁజేసి శ్రౌతాగ్నులచేతనే మంత్రయుక్తముగ దాహాదులు చేయవచ్చునని చెప్పియున్నది. ఇది యగ్నిలేనివానికి దుర్మరణము వచ్చినను గూర్చు కొనవలెను. ఇఁక సర్పముచే హతుఁడగు వానికి విశేషము ప్రమాదముచే గాని దర్పాదులచేగాని సర్పదష్టుఁడై మృతినొందువాని కాశౌచాదికముఁ జేయఁగూడదు. మరియేమనిన; ముందు జెప్పెడు నాగపూజాదికముఁజేసి నారాయణబలియు సువర్ణ నాగదానము ప్రత్యక్ష గోదానాదికముఁ జేసినపైని దాహము నాశౌచము చేయునది. సర్వవిధ దుర్మరణమునందును పతితాదిమరణమందును బ్రాయశ్చిత్తముఁజేసి దాహాదికముఁజేయవలెనని మీఁదఁ జెప్పఁబడినది. అందు ప్రాయశ్చిత్తములు ప్రసంగించుటచే జెప్పఁబడును. బుద్ధి పూర్వకముగ నాత్మఘాతముచే మృతినొందినచో ముప్పది కృచ్ఛ్రములు ప్రాయశ్చిత్తము. ఇదియును జాతివధ ప్రాయశ్చిత్తముఁ జేసినపైని జేయవలెను. అదియెట్లనిన; బ్రాహ్మణు డాత్మఘాతముచే మృతినొందెనేని బంద్రెండువత్సరములు బ్రహ్మహత్యా ప్రాయశ్చిత్తమును ముప్పదికృచ్ఛ్రములును ప్రాయశ్చిత్తముగఁ బుత్రాదులు చేయవలెను. బ్రాహ్మణస్త్రీ యాత్మఘాతముచే మృతినొందెనేని బ్రాహ్మణ స్త్రీవధ ప్రాయశ్చిత్తము ముప్పది కృచ్ఛ్రములును, ఇట్లు శూద్రాదుల యాత్మఘాతమునందు నూహించునది. అశక్తిలో నాత్మఘాతమునకు జాంద్రాయణద్వయమును నాల్గు

తప్తకృచ్ఛ్రములును, ప్రమాదమున జలాదులచే మృతినొందెనేని పదునైదు కృచ్ఛ్రములు గాని చాంద్రాయణ ముపై తప్తకృచ్ఛ్రద్వయమైనను గావచ్చును పతితుఁడై మృతినొంది నచో బదారు కృచ్ఛ్రములు బ్రహ్మహత్యాది పాతకులు ప్రాయశ్చిత్తము లేకయే మృతు లైనచో నాయా ప్రాయశ్చిత్తము పుత్రాదులు చేయవలెను. ప్రాయశ్చిత్తానర్హులకు పతితోదకదానమేగాని ప్రాయశ్చిత్తాదిక మక్కరలేదు. నిర్ణయసింధువునందు మాత్రము ప్రాయశ్చిత్తానర్హుల కును పుత్రాదులు నారాయణబలిఁజేసి సర్వమైన యంత్యకర్మను సపిండీకరణమును, దర్శాదికమును గయాశ్రాద్ధమును జేయవచ్చును. ఇట్లు జాతి భ్రష్టునికిని జేయవచ్చును. పతితోదకదానము మొదలగునది పుత్రుఁడు లేనివానికని యున్నది. ఇదియే యుక్తమని తోఁచినది. మరియేమనిన; స్వల్పకాలము పతితుఁడై ప్రాయశ్చిత్తము పుత్రుఁడు చేసి పర్ణశరదాహాదులు చేయవలెను. ప్రమాదమరణము తప్ప దక్కిన శౌర్య పారదార్యా దినిమిత్తములచే మృతినొందెనేని చాంద్రాయణ ద్వయముగాని తప్తకృచ్ఛ్రద్వయముగాని శాస్త్రముచే విచారించి విధింపవలెను. మఱియును వ్యాఘ్రాదినిమిత్తములచే దుర్మరణ మందు శాతాతప్తునిచే చెప్పఁబడిన దానాది విధియును జేయవలెను. అది యెట్లనిన; వ్యాఘ్రహతుఁడైనచో విప్రకన్యకు వివాహముఁ జేయుట గజముచే మృతుఁడైనచో నాల్గు నిష్కముల బంగారు గజమును దానమిచ్చుట రాజశిక్షచే హతుఁడైన సువర్ణ పురుషదానము చోరహతి యందు ప్రత్యక్షగోదానము వైరిహతిగలిగిన వృషభ దానము వృషభముచే హత్తిలో యథాశక్తి సువర్ణదానము శయ్యయందు మృతినొందెనేని నిష్క పరిమిత సువర్ణ విష్ణుప్రతిమగల శయ్యాదానము శౌచహీనుఁడై మృతినొందెనేని రెండు నిష్కముల సువర్ణ విష్ణుప్రతిమా దానము. సంస్కారహీనుఁడై మృతినొందినచో విప్రపుత్రుని కుపనయనము. అశ్వముచే మృతుఁడగునేని మూఁడునిష్కముల సువర్ణాశ్వదానము. కుక్కచే మృతినొందెనేని క్షేత్రపాలుని స్థాపించుట. సూకర హతి యందు మహిషదానము. కృమిచే హతుఁ డైనచో నైదుపుట్ల గోధూమదానము. వృక్ష ముచే జచ్చినచో సువర్ణవృక్షదానము. కొమ్ములుగల జంతువుచే మృతినొందిన వస్త్ర యుక్తవృషభదానము. బండిచే హతుఁ డైన చక్రము మొదలగు రథావయవముతో స్వల్పద్రవ్యమిచ్చుట. గండశిలనుండి పడి మృతుండగునేని ధాన్యపర్వత దానము. అగ్నిచే మృతుఁడైన చలివెందర వాపీ కూపాదులు ప్రతిష్ఠించుట. కల్లుపడి మృతుఁడైనచ ధర్మార్థమై సభాగృహము నిర్మించుట. శస్త్రహతిలో మహిషీదానము. రాతిచే మృతుఁడయ్యేనేని వత్సతో గోదానము. విషముచే జచ్చినచో సువర్ణ పృథ్వీ ప్రతిమాదానము. ఉరిచే జచ్చినచో సువర్ణకపిదానము. జలమందు మృతియగుచో సువర్ణ వరుణ ప్రతిమనిచ్చుట. విషూచిచే మృతుఁడయ్యేనేని మృష్టాన్నముచే శతవిప్ర భోజ నము. కంఠమందన్న కబళముండఁగ మృతినొందెనేని ఘృతధేనుదానము. కాసరోగ ముచే మృతిలో నెనిమిది కృచ్ఛ్రములు. అతిసారముచే మృతిలో లక్షగాయత్రీ జపము. శాకిని మొదలగు గ్రహములచే మృతిలో రుద్రైకాదశిని జపించుట. విద్యుత్పాతముచే మృతిలో విద్యాదానము. మేడ మొదలగువాని యంతస్థు లలో మృతినొందెనేని వేద పారాయణము. పతితుఁడైమృతిలో పదియారు కృచ్ఛ్రములు.

అస్పృశ్యముల స్పృశించిన మైలతో మృతినొందెనేని పచ్ఛాస్త్ర పుస్తకదానము నని మొదలగునవి. అందు శయ్యామరణము శౌచహీన సంస్కార హీనమరణము కృమివిష విషూచీకంఠ కబల కాశాతిసారరోగ గ్రహగ్రహణములచే మృతియందును నంతరిక్ష మృతియందు నస్పృశ్యస్పర్శమృతియందును దానాదికమేగాని ప్రాయశ్చిత్తము నారాయణబలియు సంవత్సరాదికాల ప్రతీక్షయు నక్కరలేదు. మరి వ్యాఘ్రాదులచేగాని విషజల శస్త్రాదులచేగాని మరణము ప్రమాదముననుు గర్వాదులచేతను నబుద్ధిపూర్వక ముగ మొదలుగ ననేకవిధములై సంభవించును. అపుడు యథాయోగ్యముగఁ బ్రాయశ్చిత్తము నారాయణబలియు దానవిధియు గలపుట యూహింపవలెను. ఒకవేళ పిత్రాదులు బ్రహ్మహత్యాది ప్రాయశ్చిత్తము దుర్మరణ ప్రాయశ్చిత్తము నాత్మఘాత ప్రాయశ్చిత్తము నాచరించుట కశక్తులేని నారాయణబలిని చెప్పినవిధిని మాత్రముఁ జేసి యత్యంత క్రియలు చేసిననువారు శుద్ధులగుదురు. పిత్రాదులకు మాత్రము నరకవాసము తప్పదని తెలియవలెను. ఇఁక విధి విహితమైన జలాది మరణమందుఁ జెప్పఁబడును. అందు ప్రయాగమందు సర్వవర్ణములవారికిని రోగులకుగాని యరోగులకు గాని భాగీరథీ ప్రవేశముచే మృతినొందు వారికెల్లను మహాఫలము. శూద్రునికి రోగము లేకున్నను ప్రయాగభిన్నస్థలమునందు సహితము జలాదిమరణ మను మతింపబడినది. "వ్యాధితోభిషజాత్యక్తో విప్రోవృద్ధోఽథవాయువా, తనుంత్యజేజ్జ లగ్న్యా ద్యైస్సయథేష్టం ఫలంలభేత్, దుశ్చికిత్సైర్మహారోగైః పీడితో జీవనాక్షమః, ప్రవిశేజ్జ్వలనం దీప్తం కరోత్యనశనం తథా, అగాధతోయరాశిం చ భృగోః పాతనమేవ చ , గచ్ఛేన్మహాపథం వాఽపి తుషార గిరిమాదరాత్, ప్రయాగవటశాఖాగ్రా ద్దేహత్యాగం కరోతి చ, ఉత్తమాన్ ప్రాప్నుయాల్లోకాన్ నాత్మఘాతీ భవేత్క్వచిత్"అనఁగా రోగముచే పీడితుఁడై వైద్యులచే విడువఁబడినవాఁడు వృద్ధుఁడుగాని యౌవనస్థుఁడుగాని విప్రుడు జలాగ్న్యాదులచే మృతినొందెనేని యథేష్టఫలము నొందును. లేదా చికిత్సకు రాని రోగములచే పీడనొంది జీవించుట కసమర్థుఁడు మండుచున్న యగ్నిని ప్రవేశించునది. లేదా ప్రాయోపవేశమునగాని యగాధమైన జలరాశిని ప్రవేశించిగాని యున్నతమైన రాతిపై నుండి పడియైనను మృతినొందునది. లేదా హిమవంతముదాక మహాపథము పోవలెను. సంభవమైనచో నుత్తమలోకముల నొందును. ఆత్మఘాత దోషములేదు "నరాణా మథనారీణాం సర్వవర్ణేషు సర్వదా, ఆశౌచం స్యాత్త్ర్యహం తేషాం వజ్రానల హతే తథా." అనఁగా స్త్రీలకుఁగాని పురుషులకుఁగాని యట్ల మృతినొందిన సర్వ వర్ణములవారికి మూఁడు దినములే యాశౌచము బట్టవలెను. ఇట్లు విద్యుత్పాతముచే మృతినొందువారికి నని తెలియవలెను. "వారాణస్యాం మ్రియేద్యస్తు ప్రత్యాఖ్యాత భిషక్క్రియః కాష్ఠపాషాణ మధ్యస్థో జాహ్నవీ జలమధ్యగః, అవిముక్తోన్ముఖస్తస్య కర్ణ మూలగతో హరః, ప్రణవం తారకం బ్రూతే ఇత్యాది వచనాచ్ఛ్రయః" అనఁగా రోగ మునకు బ్రతిక్రియమానుకొని కఱ్ఱలు పాషాణము మధ్యమందు గూర్చుండి వారాణ సిలో జాహ్నవీజలమధ్యమందు బ్రవేశించి మృతినొందెనేని వానికర్ణమందు బరమేశ్వ రుఁడు తారకమంత్రము ప్రణవము నుపదేశించునని మొదలగువచనములు

మాధవాదినిబంధములు దున్నవి. ఇట్లు శాస్త్రముచే ననుమతింపఁబడిన యాత్మ ఘాతమందు గృహస్థులకే యధికారము. సన్యాసులకు లేదు. ఏమనిన; మూఁడు రోజు లాశౌచము విధింపఁబడినది. మఱియును యతికి గామ్యకర్మయం దధికారము లేదని సింధువు. ఇప్పటి శిష్టులైన చోరరోగాది పీడితులై జీవింపలేక సన్యాసము స్వీకరించి తీర్థాదులందు నాత్మఘాతము చేయుచున్నారు. గృహస్థుడు విదురుఁడు మొదలగు వారు చేయరు. కొందరట్టి మహారోగగ్రస్థులైన వృద్ధాదులకు జలాగ్న్యాదులచే నాత్మఘాతము ప్రయాగ భిన్న స్థలమందు కలియుగమందు గూడదు. "భృగ్వగ్నిపత నంచైవ వృద్ధాది మరణం తథా" యని కలివర్జ్యములలో నున్నది యంద్రు. ఈ మతమందు మరణాంత ప్రాయశ్చిత్తవిధులు కాశీఖండాదులందు విప్రాదులకు దేహ త్యాగవిధులును యుగాంతర విషయములగును. ప్రయోగమరణమును స్త్రీలకు సహగమనమును కలియందును సర్వసమ్మతము. ఇక్కడ నంతట సహగమనము తప్ప దక్కిన విధివాక్యాను మతములైన దేహత్యాగములందు ద్రిరాత్రమాశౌచమని బహు సమ్మతము. దశధివసములని కొందఱు ఇట్లు ఫలకామనచే విహితమైనప్పటికిని ప్రయాగ మరణమందు బక్షద్వయము దెలియునది. ఇక పతితులు మూడువిధములు: ఘటస్ఫోటము బహిష్కృతుఁడు మ్లేచ్ఛీకృతుఁడు ప్రాయశ్చిత్తానర్హుఁడైన పాపియు నని ఈమూఁడువిధముల వారిలో దలిదండ్రులకు దప్ప దక్కినవారికి బతితోదకవిధి జేసిన పైని సపిండీకరణ వర్జ్యముగ నంత్యకర్మగావచ్చును. తలిదండ్రులకు మాత్ర మీమూఁడు విధములలో నున్నప్పటికిని నారాయణబలి పూర్వముగ సపిండీకరణ ముతో సకలమైన యంత్యకర్మయు జరుపవచ్చునని జెప్పఁబడినది. అందు పతితోదక దానవిధి యెట్లనిన; అంతటదిరుగు నీచదాసిని బిలిచి దానికి ద్రవ్యమిచ్చి యశుద్ధపూర్ణ మైన ఘటముధరింపఁజేసి దానితో నిట్లనిచెప్పవలెను. "ఓసీ దాసీ! నీవు వెళ్ళి తిలలు కొని యీ ఘటముతో నీళ్లును శీఘ్రముగదెమ్ము అటుపైని దక్షిణాభిముఖులై గూర్చుండి యెడమకాలిచే నా ఘటములో నీళ్లు పడిపోవునట్లు తన్నుము. అపుడు 'అముకసంజ్ఞిక పతిత ప్రేతబిబ–పిబ' యని మాటికి నుచ్చరింపు" మని చెప్పిన నాదాసియు వాక్యము విని మూల్యము దీసుకొని యట్లు చేయవలెను. ఇట్లు జేసినచో బతిత తృప్తియగును. మఱియే విధముగను గాదు. ఇదియు పతితుని మృతిదిన మందు జేయునది. ఇది పతితోదకవిధి. ఇట్లు మృతిదోషమున నా శౌచాపవాదము ననియెఱుంగునది.

ఇక విధానమున నాశౌచాపవాద మెట్లనిన; యతిమృతుఁడైనచో నాశౌచము లేదు. ఏమనిన నతనికి ప్రేతక్రియ యుదకదానము నాశౌచము సపిండీకరణము మొదలగునవి నిషేధింపబడినవి సపిండీకరణమునకు ప్రతిగా నేకాదశదినమందు బార్వణ శ్రాద్ధము మాత్రము జేయవలెను. ప్రత్యాబ్దికము దర్శశ్రాద్ధాదికమును బార్వణ విధిచే సపిండకముగనే జేయవలెను. ఇక్కడ విస్తరము గ్రంథాంతర మందు జెప్పఁ బడును. ఇది త్రిదండులకు నేకదండులకును హంసపరమహంసాదులకు నిట్లనే యని తెలియునది. ఇట్లు వానప్రస్థుఁడు మృతినొందినను నాశౌచములేదు. జీవించి యుండగ నంత్యక్రియజరిగినపై నతఁడు మృతుఁడైనచో నాశౌచాదికము వికల్పి

తము. బ్రహ్మచారిమరణమం దాశౌచము తప్పదు. యుద్ధమృతియందాశౌచములేదని యన్ని గ్రంథములలోనున్న గాని యిట్లు శిష్టాచారముగానరాదు. ఇట్లు పంచవిధాశౌచ నిరూపణము దెలిసినంతజేసివిర్థలస్వామి కర్పితమైనది. ఆశౌచప్రకరణము ముగిసెను.

ఇఁక నంత్యకర్మనారంభించుటకు నుపయోగించు నారాయణబలి మొదలగు వాని ప్రకారము చెప్పఁబడును.

## నారాయణబలి

దుర్మరణమందును జలాదులచే నాత్మఘాతమందును బతితాది మరణ మందును మీఁదఁజెప్పిన వ్యవస్థచే. 'అముకగోత్ర స్యాముక శర్మణోముకదోష నాశార్థ మౌర్ధ్వదైహికే సంప్రయనత్వయోగ్యతా సిద్ధ్యర్థమముక ప్రాయశ్చిత్తమము దానం వా కరిష్యే'యని సంకల్పించి ప్రాయశ్చిత్తము దానమును జేయునది. అశక్తిలో దానమే చేయునది. అటుపైని 'అముకగోత్రాముకశర్మణోముక దుర్మరణదోష నాశార్థమౌర్ధ్వ దైహిక సంప్రదానత్వ యోగ్యతా సిద్ధ్యర్థం చ నారాయణబలింకరిష్యే' యని సంకల్పించి పూర్వార్థమందు జెప్పిన సంతతిఫలకమైన కామ్యనారాయణ బలివలెనే సర్వము జేయవలెను. ఇదియు వర్షాంతమందు జేయఁదలఁచునపుడ నిగ్రహించునది, సద్యః కరణమే తలంచినచో మీఁదఁజెప్పిన ప్రాయశ్చిత్తము ద్విగుణ ముగ సంకల్పించి శుక్లైకాదశి మొదలగు కాలము నపేక్షింపకయే రెండవ సంకల్ప మును జేసి యథావిధిగ స్థాపించిన రెండు కలశములందును సువర్ణ ప్రతిమలందు విష్ణుని వైవస్వతయముని నావాహించి పురుషసూక్తముచేతను 'యమాయసోమమ'ను మంత్రముచేతను గ్రమ ముగ షోడశోపచారములచే బూజించి వారికి బూర్వభాగ మందు రేఖగీసి దక్షిణాగ్రము లుగ దర్భలుంచి 'శుంధంతాం విష్ణురూప్యముక ప్రేత' యనుచు పదిస్థానములందుద కము విడిచి మధుఘృత తిలలు గలపి యన్నపిండములు పతి 'అముకగోత్రాముక శర్మన్ప్రేత విష్ణు దేవతా యంతే పిండః' అనియుచ్చరింపుచు దక్షిణాసమాప్తిగ ప్రాచీనావీతము మొదలగు పితృధర్మముచే నీయవలెను. గంధాదులచే బూజించి ప్రవాహణాంతము జేసినదిలో పడవ్రేయవలెను. మారునాడుగాని యపుడేగాని పూర్వము స్థాపించిన విష్ణుని బూజించి విప్రుఁడొకడును దొరకనిచో దర్భవటువునందై నను పాదప్రక్షాళనాది తృప్తిప్రశాంతముగ విష్ణురూప ప్రేతావాహన పూర్వముగజేసి విప్రసమీపమందూరకే రేఖలుగీసి దర్భలుపరచి యుదకము విడిచి దర్భలపై సవ్యముతో 'విష్ణవే,బ్రహ్మణే,శివాయ, సపరివారాయ, యమాయచ' యని యుచ్చరిం పుచు నల్గురికి నాల్గు పిండములిచ్చి 'విష్ణురూపప్రేత అముకగోత్ర నామన్నయంతే పిండః అని యైదవపిండమిచ్చి యట్లనే పూజించి ప్రవాహణమైన పైని విప్రుని యాచమనము మొదలగు శ్రాద్ధశేషము సమాప్తి నొందించి ప్రేతనుద్దేశించి విప్రునికి వస్త్రాభరణాదులిచ్చి విప్రునిచే ప్రేతకు తిలాంజలినిప్పింపవలెను. 'అముక గోత్రాయా ముక శర్మణే విష్ణురూపిణే ప్రేతాయాయం తిలతోయాంజలి" అని యపు దుచ్చరింప వలెను విప్రుడుదొరకనిచో దానేయీయవలెను. అటుపైని బ్రాహ్మణులచే నిట్లనిపించ వలెను. "అనేన నారాయణబలి కర్మణా భగవాన్విష్ణురముకం ప్రేతం శుద్ధమపాపమర్హం

కరోతు.” అని ఇట్లు కామ్యప్రయోగమందును నిచ్చటి ప్రయోగమందును సంకల్పనామ గోత్రోచ్చార భేదము స్పష్టమే. పూర్వమందు కాశ్యపగోత్రదేవదత్త యని యుచ్చారము. ఇపుడు దుర్మనణ మృతుని నామ గోత్రములు దెలసియుండుటచే నవియే యుచ్చరింప వలెనని సంకల్పమందు విశేషమునకును హేతువు స్పష్టమే. ఇట్లు దుర్మరణమందౌర్ధ్వ దైహిక హేతువగు నారాయణబలి ప్రయోగము.

## సర్పహతునికి వ్రతము

ప్రతిమాసమందును శుక్లపంచమియందుపవాసమైన నుపయుక్తమైననుజేసి పిండిచే నైదుపడగల సర్పమునిర్మించి యనంతవాసుకి, శంఖ, పద్మ కంబల, కర్కోటక, అశ్వతర, ధృతరాష్ట్ర, శంఖపాల, కాళియ, తక్షక, కపిల యను నామములచే పండ్రెండు మాసములు పూజించి పాయసముచే బ్రాహ్మణ భోజనమును సంవత్సరాంతమందు సువర్ణనాగమును ప్రత్యక్షగోవును దానముజేసి నారాయణబలి పూర్వముగ దాహాది కము జేయునది. లేదా ‘నమో అస్తుసర్పేభ్యః’ అను మంత్రముచే మూడాజ్యాహుతులు వ్రేల్చవలెను. పంచమియందు సువర్ణనాగమునుజేసి క్షీరాజ్య పాత్రలోనుంచి దానము చేయునది. ఇట్లు సర్పదష్టునికి ప్రాయశ్చిత్త మీశ్వరోక్తమని యున్నది. ఆపైని నారాయణబలి మొదలగునవి.

## పాలాశవిధిచే దహనాదివిధి

దేశాంతరమందు మృతియైనచో రెండు పరాకములు నెనిమిది కృచ్ఛ్రములును జేసి యస్థులు దహింపవలెను. అస్థులకు చండాలశున కాదిస్పర్శగల్గినచో బంచగవ్య ముచే గడిగి దహింపవలెను. ఆస్థులు బొత్తిగా దొరకనిచో బర్ణశరదాహము చేయునది. ఎట్లనిన! “కుర్యాద్దర్భమయం ప్రేతం కుశైస్త్రిశతషష్టిభిః, పాలాశీభి స్సమిద్భిర్వా సంఖ్యా చైవం ప్రకీర్తితా.” అనఁగా మున్నూటయరువది దర్భలచేగాని మోదుగు సమిధలన్నిటిచే గాని ప్రేతను నిర్మించవలెను. ఎట్లనిన; భూమియందు కృష్ణాజినముపరచి దానిపై శమును దక్షిణాగ్రముగనుంచి దానిపై మోదుగుమూడి కెలుంచవలెను. శిరస్థానమందు నలుబదియును కంఠస్థానమందు బదియును బాహుస్థానమందు బ్రత్యేకముగ నేబదే సియు హస్తాంగుళులకు పదియు గుండెపైనిరువదియు కడుపునందు ముప్పదియు శిశ్నమందు నాలుగు నండములందు మూడేసియు తొడలకొక్కొకటికి నేబదేసి చొప్పున నూరును పిక్క మొదలు పాదముల వరకును ప్రత్యేకము పదునైదుచొప్పున ముప్పది యును పాదాంగుళులకు పదియును. ఇట్లు మున్నూటయరువది దర్భలుగాని మోదుగు మూడికెలు గానియుంచి శరీరము నిర్మించి గొంగళితోగట్టి నీళ్లతో గలపినపిండి పూయవలెను. శక్తియున్నచో నారికేళములు మొదలగునవి యుంచవలెను. ఎట్లనిన; శిరస్తానమందు గొబ్బరికాయయు గుండ్రని యానబగాయయైనను లలాటమందు కదలీపత్రము దంతములకు దానిమ్మగింజలు కర్ణములకు కంకణపత్రమైనను బ్రహ్మా మేడిపత్రమైనను నేత్రములకు గవ్వలు ముక్కనకు దిలపుష్పము. నాభియందు పద్మము స్తనములకు నిమ్మపళ్లు వాతమునకు మనశ్శిలయు పైత్యమునకు హరిదళము కఫము

నకు సముద్ర ఫేనము రక్తమునకు దేనెయు పురీషమందు గోమయమును మూత్ర మునకు గోమూత్రము రేతస్సునకు పాదరసము వృషణములకు వంకాయలు, శిశ్న మందు గృంజనమనగ గంజాయి వెన్నను కేశములకు నేదుబందిముళ్ళుగాని మట్టి యూడలుగాని రోమములకు గొట్టెబొచ్చును మాంసమునకు మినుములపిండితో లేపము నుంచి పంచగవ్యము పంచామృతము నంతటజల్లి 'పునర్నో అసు, అసునీతే' యను ఋక్కులచే బ్రాణప్రతిష్ఠను భావింపవలెను. లేదా 'యత్తేయం' అను సూక్త ముచే 'శుక్రమసి' యని పాదరసముజల్లి 'అక్షీభ్యా'మను మంత్రముచే శరీరము స్పృశింపవలెను. ఆపైని స్నానము జేయించి చందనముబూసి వస్త్రము నుపవీదము గట్టించి ఇతడే యాదేవదత్తుడని స్పృశించి 'ఇదంచాన'మని స్యోపాసధ్యానించి యథా విధిగ దాహాదికము చేయవలెను. అపుడా హితాగ్ని కస్థిదాహమైనను బర్ణశర దాహ మైనను బదిదినములాశౌచము. ఆహితాగ్ని గానిచో మూఁడు దినము లాశౌచమని మీఁదఁజెప్పఁబడినది. పండ్రెండు వత్సరములు ప్రతీక్షించి పర్ణశరదాహాదికము జేయునెడ ముప్పదికృచ్ఛ్రములు మూఁడు చాంద్రాయణము లైననుజేసి చేయవలెను.

## అతీత ప్రేతునికి సంస్కారకాలము

ప్రత్యక్షశవమును సంస్కరించునపుడు దినము శోధింపనక్కఱలేదు. అశౌచము మధ్యమందు సంస్కారమునకు సంభవమైనచో శోధింపవలెను. దశాహానంతరమందు శోధింపక తప్పదు. అపుడు వత్సరముపైని జేయు ప్రతేకర్మ కుత్తరాయణము శ్రేష్ఠము. అందులో గృష్ణపక్షము అందు నందాత్రయోదశీ చతుర్దశీ దినక్షయముల విడువవలెను. శుక్ర శనివారములు వర్జ్యములు, మంగళవారమును వర్జింపవలెనని కొందఱు, భరణి, కృత్తిక, ఆర్ద్ర, ఆశ్లేష, మఘ, జ్యేష్ఠ, మూల, ధనిష్ఠయుత్తరార్ధము, శతభిషము మొదలగు నాలుగు నక్షత్రములును త్రిపుష్కర యోగమును నతిదుష్టములు. కృత్తిక, పునర్వసు, ఉత్తర, విశాఖ,ఉత్తరాషాఢ, పూర్వాభాద్ర, ఇవి త్రిపాదనక్షత్రములు. ద్వితీయ సప్తమి, ద్వాదశి, తిథులు కుజ వని రవివారములు నని యీ మూఁడును గలసినచో ద్రిపుష్కరము. కొందఱు రవివారమందు గురువారము నుంచుదురు. ఈ చెప్పిన తిథివారములందే మృగశీర్ష,చిత్ర,ధనిష్ఠ, గలసినచో ద్విపుష్కరము త్రిపుష్కర యోగము వృద్ధియందు లాభమందు నష్టమందు హరణమందు మృతియం దును త్రిగుణఫల మిచ్చును ద్విపుష్కరయోగము ద్విగుణఫలమిచ్చును గనుక ప్రేతకార్య మందు రెండును వర్జ్యములే. రెండు గలసినచో ద్విపుష్కరమని కొందరు. గురు శుక్రాస్తముల పౌర్ణమాసి మల మాసము వైధృతి వ్యతీపాత పరిఘయోగములు విష్టి కరణము చతుర్థాష్టమ ద్వాదశములందు చంద్రుడును వర్జింపవలెను. రోహిణి, మృగశీర్ష, పునర్వసు, పుబ్బ, యుత్తరా, చిత్ర, విశాఖ, అనూరాధ, పూర్వోత్తరాషాఢలు ధనిష్ఠయునను నివి కించిద్దుష్ట ములు సంభవములో విడువవలెను. మంగళవారమును త్యాజ్యమని కొందఱు కర్తకు జన్మనక్షత్రమందును దానికి దశమనక్షత్ర మందును దానికి పందొమ్మిదవ నక్షత్రమం దును ప్రత్యరితారయనఁగ నైదవతార యందు పర్ణశరాది దాహముఁగూడదు. కనుక

నర్క గురు చంద్రవారములును, అశ్విని పుష్యము, హస్త, స్వాతి, శ్రవణము నివి ప్రశస్తములు. తక్కినవి కొన్ని మధ్య ములు గొన్ని దుష్టములని చెప్పఁబడినది. నందతిథి శుక్రవారము చతుర్దశి జన్మతార ప్రత్యక్తార వీనియందు నేకోద్దిష్ట శ్రాద్ధము నిషిద్ధము. సాక్షాత్తుగా పదునొకండవ దినమైనచో నిషేధమేమియులేదు. ఇఁక నిషేమున కపవాదము. "యుగమన్వాది సంక్రాంతి దర్శేషు ప్రేతకర్మణి, పునస్సంస్కారాదికేపి నక్షత్రాది న శోధయేత్, గురు భార్గవయోర్మౌఢ్యే పౌషమాసేమలిమ్లుచే, నాతీతః పితృమేధస్స్యాద్గయాం గోదావరీం వినా" అనఁగా యుగాది మన్వాదిసంక్రమణ దర్శలందును ప్రేతకర్మ యందును పునస్సంస్కారమందును నక్షత్రాదులు శోధింపనక్కరలేదు. గురుశుక్ర మూఢములందును పుష్యమాసమందును మలమాస మందు గయయు గోదావరియు దప్ప తక్కిన స్థలమందుఁ బితృకర్మజేయగూడదు.

## పునస్సంస్కార కాలము

సాగ్నికునికి పర్ణశరదాహమందైన మైనపైని నతనిశవముఁదొరికినచో పర్ణశర దాహమందైన కొరవులు పెట్టి దహింపవలెను. అవిలేనిచో లౌకికాగ్నిచే దహించి యస్థుల మహాజలమందు వ్రేయవలెను. ఇట్లు నిరగ్నులకును బర్ణశరదాహమైన పైని శవము దొరికినచో నస్థులు దొరికినను యోజింపవలెను. "అమృతం' మృత మాకర్ణ్యకృతం యస్యౌర్ధ్వ దైహికం, ప్రాయశ్చిత్త మసౌస్మార్తం కృత్వాగ్ని నాదధీతచ' అనఁగా మృతిలేకున్న మృతుఁడయ్యెనని యసత్యవార్తనుఁ నమ్మియంత్య కర్మను జేసినచోవాడు పునస్సంస్కారము నొంది యగ్న్యాధానము చేయవలెనని. పునస్సం స్కార ప్రకారము పూర్వార్ధమందుఁ జెప్పఁబడినది. ఆధానాంతమం దాయుష్మ త్రేష్టి చేయవలెను. అనాహితాగ్నికి చరువు చేయునది. అట్లు అసత్యమైన భర్తృ మరణ వార్తనునమ్మి స్త్రీసహగమనము చేసెనేని యదియ శాస్త్రీయము. ఏమనిన; భర్తృ మరణము స్పష్టముగఁ దెలియునదియె సహగమనమునకు నిమిత్తము. వార్తా మాత్రముగాదు. కనుక నట్లు చేసిన స్త్రీకిఁ బుత్రాదు లాత్మఘాత ప్రాయశ్చిత్తముఁ జేసి నారాయణ బలిపూర్వముగ నంత్యకర్మచేయునది. భర్తకు పునస్సంస్కారముఁ జేసి యంత్యకర్మయోగ్యత చేయవలెను. ఒకానొకచో జీవించినవాని కంత్య కర్మ విధింపఁ బడినది. ఎట్లనిన; ప్రాయశ్చిత్తము నంగీకరింపని పతితునికి ఘటస్ఫోట మందు అనఁగా మహాపాతకముచేగాని యుపపాతకముచేగాని పతితుఁడై ప్రాయశ్చి త్తముఁ జేసుకొనుమని మాటిమాటికిఁజెప్పి యతఁడప్పటికి నంగీకరింపనిచో రిక్తాది నింద్యతిథిలో సాయాహ్నమందు సపిండులు బంధువులునుగూడి దాసిచేన మేధ్య జలపూర్ణఘటముఁ దెప్పించి యందఱు దాసినిముట్టుచు నగ్రము ఛేదించిన దర్భలపై నాఘటముఁ బోరగిలపడునట్లు దాసియొక్క యెడమకాలిచే దన్నించి ప్రాచీనావీతిగ నుండి యతనినామ గ్రహణముఁ జేయుచుదాసియు తారును 'అముకమనుదకంక రోమి' యని జుట్టులు విరియబోసుకొని యొక్కమారు నుచ్చరింపవలెను. అటుపై నతనికిఁ గర్మజేయ నధికారియగువాఁడు జీవించియున్న యతనినుద్దేశించి దాహము తప్ప దక్కినయంత్యకర్మ పిండోదకదానాదికమంతయు చేయవలెను. అదియు

నేకాదశాహస్సు వఱకు నగును. మితాక్షరయందు ప్రేతకార్యమైన పైని ఘటనిన యనము జెప్పఁబడినది. అందఱకు నొకదినమాశౌచము. ఇట్లు ఘటస్ఫోటమయిన పైని వానితో నెవ్వరుని సంభాషణ స్పర్శాదికము జేయఁగూడదు. అట్లు చేసినచో పతితతుల్యుఁ డగును.

## ఘటస్ఫోటమైనను దిరుగ కలుపుకొనువిధి

ఘటస్ఫోటము నిశ్చయించినపై నది జేయకమున్ను పతితజ్ఞాతులకు ధర్మ కార్యములందధికారము లేదని కొందఱు ఘటస్ఫోటము జేసినపైని వానికి పశ్చా త్తాపము గల్గి ప్రార్థించినచో పాప ప్రాయశ్చిత్తాంతమందు వానిగలపుకొను ప్రకార మెట్లనిన; అందు మొదట శుద్ధిని పరీక్షించుటకు ప్రాయశ్చిత్తము జేసుకొన్న వానిచే గడ్డిగోవునకు వేయించవలెను. అదిగోవు భక్షించినచో శుద్ధియయ్యెనని తెలియునది. భక్షింపనియెడ దిరుగ బ్రాయశ్చిత్తము జేయవలెను. ఇట్లు శుద్ధి నిశ్చయించి క్రొత్త ఘటముఁ దెప్పించవలెను. యదిమృన్మయముగాని సువర్ణమయముగాని గావచ్చు నందులో పవిత్రజలము పూరించి సపిండులందఱు నాఘటము ముట్టి యభి మంత్రించి యాజలములచే పావమానులు నాపోహిష్ఠాయను ఋక్కులు దరత్సమందీ ఋక్కులచేతను పాపినభిషేకించి యతనితో గూడి యందరు స్నానముజేసి యాఘటమ తని కీయవలెను. అతఁడును "శాంతాద్యౌశ్శాంతాపృథివీశాంతం విశ్వమంతరిక్షంయో రోచనస్త మిహగృహ్ణామి" యను యజుర్మంత్రములచే నాఘటము గ్రహించునది. అటుపై నాయుదకమందరు నతనితో ద్రాగవలెను. ఆ పైని గూశ్మాండమంత్రములచే నాజ్యహోమముఁజేసి సువర్ణగోవును దానమిచ్చునది. అటుపై నతనికి జాతకర్మ మొదలుగ నుపనయనము వరకుగాని వివాహము వరకుగాని సంస్కారములు చేయ వలెను. ఇట్లుచేసి శుద్ధుఁడయిన యతనితో సంభాషణ స్పర్శనభోజనాది వ్యవహారము చేయవచ్చును. ఇట్లు మహాపాతకోపపాతకముల ఘటస్ఫోటముఁ జేసినవారికి శుద్ధి తెలియునది.

## పతితునకు ఘటస్ఫోటవిధి

"శ్రీ విఠ్ఠలం నమస్కృత్య విఘన్నకక్షహుతాశం, అంత్యేష్టి నిర్ణయం వక్ష్యే సర్వశాఖోపయోగినం." అనఁగా నిపుడు గ్రంథకర్త విఠ్ఠలస్వామిని నమస్కరించుటచే నిర్విఘ్నముగ అంత్యకర్మనిర్ణయము సర్వశాఖలకుపయోగించునట్లు చేయు చున్నాఁ డు అందంత్యకర్మ చేయునదికారులు మొదటనే చెప్పఁబడిరి. ఎవ్వరును లేనిచో ధర్మ పుత్రుని గ్రహించునది.

## పిత్రాదుల మృతికాలమందు పుత్రాదుల సార్ధాబ్ధ ప్రాయశ్చిత్తవిధి

అందు పుత్రాద్యధికారులాసన్న మరణులైన పిత్రాదులఁజూచి సంవత్సరము న్నర మొదలగు ప్రాయశ్చిత్తము మోక్షధేనుదానము మొదలగునవియును పిత్రాదులచే జేయింపవలెను.లేదా వారినుద్దేశించి తానైనను జేయవలెను. అందుప్రాయశ్చిత్త

ప్రయోగము ప్రాయశ్చిత్త ప్రకరణమందుఁ జూడవలెను. శక్తియున్నచో ప్రాయశ్చిత్తాంత మందు దశదానములు చేయునది అందు "గవామంగేషు తిష్ఠంతి" యని గోదాన మంత్రము. "సర్వభూతాశ్రయాభూమి ర్వరాహేణ సముద్ధృతా, అనంత సస్యఫలదాత తశ్శాంతిం ప్రయచ్ఛమే" యని భూదానమంత్రము. "మహర్షేర్గోత్ర సంభూతాః కాశ్యపస్య తిలాస్స్మృతాః, తస్మాదేషాం ప్రదానేన మమ పాపం వ్యపోహతు." అని తిలదాన మంత్రము. "హిరణ్యగర్భగర్భస్థం" అనునది హిరణ్యదానమునకు "కామధేను షుసం భూతం సర్వక్రతుషు సంస్థితం, దేవానా మాజ్యమాహార మతశ్శాంతిం ప్రయ చ్ఛమే" అని యాజ్యదానమునకు "శరణం సర్వలోకానాం లజ్జాయా రక్షణం పరం, సువేష ధారివస్త్రత్వ మతశ్శాంతిం ప్రయచ్ఛమే" అని వస్త్రదానమునకు, "సర్వదేవ మయం ధాన్యం సర్వోత్పత్తి కరంమహత్, ప్రాణినాంజీవనోపాయ మతశ్శాంతిం ప్రయచ్ఛమే."అని ధాన్యదానమునకును "తదారసానాం ప్రవరస్సదై వేక్షుర సోమతః , మమతస్మాత్పరాం లక్ష్మీం దదస్వగుడసర్వదా" యని గుడదానమునకును, "ప్రీతిర్యతః పిత్రూణాం చ విష్ణుశంకరయో స్సదా, శివనేత్రోద్భవం రూప్యమతశ్శాంతిం ప్రయ చ్ఛమే." అని రజతదానమునకును– "యస్మాదన్న రసాస్సర్వే నోత్కృష్టా లవణం వినా, శంభోః ప్రీతికరంనిత్య మనశ్శాంతిం ప్రయచ్ఛమే." అని లవణాదనమునకును మంత్రములు దానమిచ్చు భూమి మొదలగువానికిఁ బరిమాణములు జననశాంతి ప్రకరణమందుఁ జెప్పఁబడినవి. ప్రాయశ్చిత్తాదికర్మలందు విష్ణ్వాదినామకీర్తనముఁ జేసినచో సాంగతాసిద్ధియగు. ప్రయాశ్చిత్తాదులు లేకున్నను శివవిష్ణ్వాదినామకీర్తనము మరణకాలమందుఁ జేసినచో సర్వపాపహరణము మోక్షమునని సర్వపురాణ సిద్ధాం తము. అట్లు భాగవతమందున్నది. "యస్యావతార గుణకర్మవిడంబనాని నామాని యేసువిగమే వివశాగృణంతి, తేనైకజన్మశమలం సహసైవ హిత్వాసంయాంత్య పావృత మృతం తమజం ప్రపద్యే" అనఁగానే భగవంతుని యవతారగుణ కర్మలను దెలుపు నామములను బ్రాణత్యాగకాలమందుఁ బరవశులైయైనను గీర్తించువారు నానాజన్మ లచే సిద్ధమైన పాపముపోయి యడ్డము లేక మోక్షము నొందుదునో యాసర్వేశ్వరు నాశ్రయించెదననుట. "ముమూర్షుం పితరం పుత్రో యదిదానం ప్రదాపయేత్, తద్విశిష్టం గయా శ్రాద్ధా దశ్వమేధశతాదపి" అనఁగా మరణకాలమందు దండ్రిచే దానము చేయించినచో బుత్రుఁడు గయాశ్రాద్ధము చేసినదానికంటెను నశ్వమేధ శతము కంటెను నధికఫలము నిచ్చినవాఁడగును. అట్టి దానము లేవనిన; తిల పాత్ర దానమును ఋణధేను మోక్షధేను పాపధేను వైతరణీధేనూ త్ర్కాంతి ధేను దానములునని అందువచనములు. "వ్యతీపాతోథ సంక్రాంతి స్తథైవ గ్రహణంరవేః పుణ్యకాలాస్తథా సర్వే యదా మృత్యురుపస్థితః, ఆసన్న మృత్యునాదేయా గౌస్సవత్సా తు పూర్వవత్. తదభావే తు గౌరేవ నరోత్తారణాయవై, శుక్లపక్షే దివా భూమౌ గంగాయాం చోత్తరాయణే, ధన్యాస్తాతమరిష్యంతి హృదయస్థే జనార్ధనే" అనఁగా వ్యతీపాత సంక్రాంతియు సూర్యగ్రహణము మొదలగు పుణ్యకాలములన్నియు గూడిన ఫలమిచ్చును. మరణకాలమందుఁ జేసినదానము గనుక మరణము సమీపించిన

వాఁడు వత్ససహితమైన గోవును మీఁదఁజెప్పినట్లు దానమీయవలెను. సంభవింప నిచో వట్టిగోవునైనను నరకోత్తారణమునకీయవలెను. మఱియు శుక్లపక్షము పగలు భూమియందుగాని యుత్తరాయణమందు గంగయందుగాని హృదయమందు భగవంతుని ధ్యానింపుచు మృతి నొందువారు ధన్యులని తాత్పర్యము. దానాదులు చేయుటకు అపుడు తండ్రి యశక్తుఁడైన యెడ బుత్రాదులు చేయవలెను.

## తిలపాత్ర దాన విధి

యథాశక్తిగ గంచుపాత్రయందైనను రాగిపాత్రయందైనను తిలలునింపి యందు హిరణ్యముంచి "మమజన్మ ప్రభృతిమరణాంతకృత నానావిధపాప ప్రణాశార్థం తిలపాత్రదానం కరిష్యే" యని సంకల్పించి విప్రుని బూజించి "మమ జన్మ ప్రభృతి మరణాంత కృతపాప ప్రణాశార్థమిదం తిల పాత్రం ససువర్ణదక్షిణం అముకశర్మణే తుభ్యం సంప్రదదే, తిలాః పుణ్యాః పవిత్రాశ్చ తిలాస్సర్వ కరాస్మృతాః, శుక్లావా యది వాకృష్ణా ఋషిగోత్ర సముద్భవాః, యానికానిచ పాపాని బ్రహ్మహత్యా సమానిచ, తిలపాత్ర ప్రదానేన మమ పాపం వ్యపోహతు నమమ." యని విప్రుని హస్తమందు జలము విడువవలెను. పుత్రాదులు చేయునెడ "అస్య జన్మప్రభృతి" యని మొదలుగ సంకల్పము 'అస్య పాపం వ్యపోహతు' యని మంత్రము నూహచేయునది. "ఐహికా ముష్మికం యచ్చ సప్తజన్మార్జితం ఋణం, తత్సర్వం శుద్ధిమాయాతు గామేకాందదతో మమ" యని ఋణధేను దానమంత్రము తక్కినన ప్రయోగము సామాన్య గోదానము నకు వలె దెలియునది. అది ద్వితీయ పరిచ్ఛేదమందున్నది. 'మోక్షందేహి హృషీకేశ మోక్షం దేహి జనార్దన, మోక్షంధేను ప్రదానేన ముకుందః ప్రీయతాం మమ' యిన మోక్షధేను దానమంత్రము.'ఆజన్మోపార్జితం పాపం మనోవాక్కాయకర్మభిః, తత్సర్వం నాశమాయాతు గోప్రదానేవ కేశవ' యని పాపధేనుదానమంత్రము.

## వైతరణీ దానవిధి

అద్య యని మొదలుగ దేశకాలములగీర్తించి "అముకస్య మమ యమద్వార స్థితవైతరణ్యాఖ్య నద్యుత్తరణార్థం గోదానం కరిష్యే" యని సంకల్పించి విప్రునికి పాద ప్రక్షాళన గంధమాల్యాదులిచ్చి బూజించి యతని హస్తమందు 'శివాఆపస్సంతు సౌమనస్యమస్తు అక్షతం చారిష్టంచాస్తు యచ్ఛ్రేయ స్తదస్తు యత్పాపం తత్ప్రతిహత మస్తు' అని జలమిచ్చి "ధేనుకేత్వం ప్రతీక్షస్వయమద్వారే మహాపథే,ఉత్తితీర్షురహం దేవి వైతరణ్యైనమోస్తుతే." అని ధేనువును బ్రోక్షించి 'విష్ణురూప ద్విజశ్రేష్ఠ భూదేవ ద్విజపావన, తర్తుం వైతరణీమేతాం కృష్ణాంగాం ప్రదదామ్యహం' అని విప్రుని బ్రోక్షించి "వైతరణీ సంతారణార్థమిమాంగాం కృష్ణవస్త్ర రక్తకూల్యాద్యలంకృతాం యథాశక్తి దక్షిణాయుతాం తుభ్యమహంసంప్రదదే. యమద్వారపథేఘోరే ఘోరావైతరణీనదీ, తాం తర్తుకామో యచ్ఛామి కృష్ణాం వైతరణీం తు గాంనమమ" అని విప్రుని హస్త మందు జలము విడువవలెను. నల్లనిది దొరకకరనిచో మఱియొకరంగుది యీవచ్చును గోవుదొరకనిచో గోనిష్క్రయద్రవ్యమీవచ్చును. పుత్రాదులిచ్చుచో ప్రథమమంత్ర మందు

'ఉత్తితీర్షరయం' అని పఠింపవలెను. ద్వితీయ మంత్రమందు 'తర్తుం వైతరణీమస్య యని పఠించునది. తృతీయమందు 'తాం' తర్తుమస్య యని యూహించునది.

## ఉత్క్రాంతి ధేనుదానము

అద్య యనిమొదలుగ దేశకాలములగీర్తించి "అముకస్య సుఖేన ప్రాణోత్క్రమణ ప్రతిబంధక సకలపాపక్షయ ద్వారా సుఖేన ప్రాణోత్క్రమణాయ యథాశక్త్యల్యం కృతా మిమా ముత్క్రాంతి ధేనుంరుద్ర దైవత్యామముక శర్మణే తుభ్యం సంప్రదదే, గవామంగేషు తిష్ఠంతి" యను మంత్రము పఠించి 'నమమ'యని యుచ్చరించునది. ధేనువు దొరకనిచో మూల్యమీయవలెను. ఇట్లు ప్రాయశ్చిత్తదానాదుల కవకాశము లేనిచో బుత్రుడు ప్రాయశ్చిత్తముజేసి దానాదులు చేయవలెను. దానములు పదునొకం డవ దినమందు జేయవలయును. తండ్రికి పాపము లేదను నిశ్చయముండెనేని ప్రాయశ్చిత్తమక్కఱలేదు. కొందఱు ఉత్క్రాంతివై తరణి గోదానములు దశదానములును మృతుఁడైనపై నైననుజేసి దహింపవలెనండ్రు. మఱియు తులసియు సాలగ్రామమును సన్నిధియందుంచవలెను. కొందఱు తిలరోహ హేమకార్పాసలవణ భూమి ధేను సప్తధాన్యములను నెనిమిదిదానములు చేయవలెనండ్రు. కొన్నిటిలో మరణ కాల మందు మధుపర్కదానము చెప్పఁబడినది. పుత్రుఁడు మొదలగు కర్తయంత్య కర్మాధి కారము తనకు సిద్ధించుటకై మూఁడు కృచ్ఛ్రములును వపనమును జేయవెలను. అందు దలిదండ్రులకును సవతి తల్లికిని పినతండ్రికిని జ్యేష్ఠభ్రాత మొదలగు వారికి నంత్యకర్మ జేయునపుడు క్షౌరమావశ్యకము. కర్తకంటె వేరగుపుత్రులకును క్షౌరము నిత్యము. ఇట్లు భార్యకును మొదటిదినమందుగాని దశదినమందుగాని క్షౌరము నిత్యము. అట్లు దత్తకునికి జనకపాలక పితృమాతల మరణమందు క్షౌరము."రాత్రౌ తుదగ్ధ్వా పిండాంతం కృత్వా వపనవర్జితం, వపనం వర్జితం రాత్రౌ స్వస్తనీవపన క్రియా" అనగా రాత్రియందు వపనము నిషిద్ధము. మరునాడు వపనము జేసుకొన వలెను. పత్నికి బుత్రునికి కనిష్ఠభ్రాత మొదలగువారికిని నంత్యకర్మ జేయుచో క్షౌరము గూడదు. తక్కినచోట్ల వైకల్పికము.

## శవమునకు శూద్రాదులు ముట్టినచో శుద్ధి

శ్మశానమునకు తీసుకొని వెళ్లేశవమును శూద్రుఁడు మోసినను స్పృశించినను "కుంభే సలిలమాదాయ పంచగవ్యం తథైవచ, సుమంత్రైరభి మంత్ర్యాపస్తేన సంస్నాప్య దాహయేత్" అనగా ఘటములో నుదకము పంచగవ్యమునుంచి మంత్రములచే నభిమంత్రించి దానిచే స్నానముచేయించి దహింపవలెను. కృచ్ఛ్రయము జేయవలెను. సూతికాస్త్రీయు రజస్వలయు ముట్టినచో నట్లు చేయవలయును. ప్రాయశ్చిత్తము మాత్రము పదునైదు కృచ్ఛ్రములు. శూద్రుడు ద్విజశవమును దహించినచో చాంద్రా యణము పరాకము ప్రాజాపత్యమును బుత్రాదులు చేసి యస్థులు తిరుగ దహింప వలెను. అస్థులు దొరకనిచో పాలాశవిధి జేయునది. "ఊర్ధ్వోచ్ఛిష్టాధోచ్ఛిష్టోభయోచ్ఛి ష్టమ్" అనఁగా నెంగిలి మూతితోగాని మూత్రపురీషోత్సర్గముజేసి శుద్ధిచేసుకొనక

మున్నుగాని రెండిటిగలిగిగాని మృతినొందెనేని కృఛ్రత్రయము జేయునది. స్పృశింప గూడని వాని ముట్టినయెడ నారు కృఛ్రములు. భూమ్యంతరిక్షముల మధ్యమందు మృతినొందెనేని తొమ్మిది కృఛ్రములు. మంచముపై మృతియైనయెడ బంర్రెండు కృఛ్రములు. కైదులో మృతియగునేని బదునైదు కృఛ్రములు. రజకుడు మొదలగు సప్తవిధముల యంత్యజులస్పర్శయైనచో ముప్పదియొక కృఛ్రములు చేయునది. దేశాంతరమందు మరణమైనచో పరాకద్వయముగాని యెనిమిది కృఛ్రములుగాని చేయునది ఆశౌచముతో మృతినొందెనేని మూడుకృఛ్రములు శవము కాలుచుండగ చితికి స్పృశింపగూడని వారి స్పర్శయైనచో గృఛ్రత్రయము. ఇట్లు పుత్రాదులు పిత్రా దులకు దత్తత్పాపానుసారముగ బ్రాయశ్చిత్తమును దర్మరణాత్మ ఘాతాదులందు మీఁదఁజెప్పిన ప్రాయశ్చిత్తము నారాయణబల్యాదికమును జేసియే యంత్యకర్మ జేయునది. అట్లు చేయక దాహాదికము జేసెనేని వ్యర్థమేయగును. ఇద్దరికి నరక మగును. లౌకికాగ్నిచే దహింపదగువారికి భర్తకును భార్యకు నొకమారే దహించుట సంభవించెనేని భార్యాపతులను గ్రమముగ ద్వివచనాంతముగ నుచ్చరింపుచు మంత్రమట్లూహజేయుచు దహింపవలెను. పిండాదికము మాత్రము పతిపూర్వముగ వేరుగజేయవలెను. ఇట్లు సవతులొక్క కాలమందును మరణమొందిరేని నొక్కమారే దహించునది. పిండాదికము జ్యేష్ఠానుక్రమమున వేరుగానే చేయునది. ఇట్లు సవతు లొక్క కాలమందును మరణమొందిరేని నొక్కమారే దహించునది. పిండాదికము జ్యేష్ఠాను క్రమమున వేరుగానే చేయునది. ఇట్లు పితృపుత్రులకును సోదరులకు నేక కాలమృతిలోనట్లనే చేయవలెను. పిండాదికమును తోడనే పితృపూర్వకముగను జ్యేష్ఠ పూర్వకముగను జేయునది. నాగోజీభట్టీయమందు మాత్రము పుంబాలురకును స్త్రీ బాలురకును వేరుగనే చేయవలెను. దహనఖననములు సహితమట్లనే చేయవలెనని యున్నది. రజస్వలగర్భిణి మొదలగువారి మరణమందును సహగమనమందును ముందుజెప్పబడును. ఇకగోమయముచే నలికిన భూమియందు దర్భలపై గూర్చుండి గాని దక్షిణశిరస్సుగ బండుకొనిగాని గోపీచందనాదులచే దిలకము ధరించి శ్రీవిష్ణుని స్మరింపుచు పుణ్యసూక్తమును గీతను సహస్రనామ స్తోత్రమును బఠించునది. లేదా "అమృతత్వ ప్రాప్త్యర్థం పుణ్యసూక్త స్తోత్రాదీనాం పాఠం శ్రవణం వా కరిష్యే" యని సంకల్పము. అట్లుసంకల్పించుట కశక్తుఁడైనచో వినుపించువారైనను "అస్యాముక శర్మణోఽ మృతత్వ ప్రాప్తయేఽ ముకం శ్రావయిష్యే" యని సంకల్పింపవలెను. నా దానమను సూక్తము పురుషసూక్తము విష్ణుసూక్తము నుపనిషద్భాగము మొదలగునవి పుణ్యసూక్తములు. రామకృష్ణాదినామము లుచ్చరించుట కన్నిజాతుల కధికారమున్నది.

## అగ్నిహోత్రికి విశేషము

గృహ్యాగ్నిగల్గినచో దానిచేతనే శ్రౌతాగ్నులున్నచో వాటిచేతనే దాహము. అందు గృహ్యాగ్ని గలవానికి శ్రౌతాగ్నిగలవానికిని గృష్ణపక్షమందు మరణమగుచో నపుడే దర్శ సాయంకాలమువఱకు నన్నిసాయమాహుతులను సకృద్గ్రహణము చేతనే పక్ష

హోమమందువలె వ్రేల్చి తిరుగ సంకల్పించి ప్రాతరాహుతులను ప్రతిపద ప్రాతః కాలపర్యంతమైన వానినట్లనే వ్రేల్చి దర్శయాగము జేయునది. యాగము సంభవింపని యెడ నాజ్యము సంస్కరించి స్రుక్కునందు నాల్గుమారులు గ్రహించి పురోను వాక్యను యాజ్యనుచ్చరింపుచు నొక్కొక ప్రధానాహుతిని వ్రేల్చవలెను. స్మార్తాగ్నియందు జతుర్గృ హీతమైన యాజ్యముచే "అగ్నయే స్వాహా ఇంద్రాగ్నిభ్యాం స్వాహా" యని ఆమముచేతనే ప్రధానాహుతిద్వయము. శుక్లపక్షమున రాత్రియందు మరణమైనచో సాయం హోమము చేయబడినది. కనుక ప్రాతర్హోమము మాత్రమపకర్షించియపుడు చేయ వలెను. అపుడు పూర్ణిమాంతముగగాని యమాంతముగగాని యాహుతులకపకర్షము నిష్టిప్రధానాహుతులు వ్రేల్చుటయు నక్కరలేదు. శుక్లపక్షమందు పగటియందే మరణ మైనచో నేహోమమున కపకర్షమక్కఱలేదు. ఇట్లు కృష్ణపక్షమందు మరణమైనను బూర్ణమానేష్టి జరుగనియెడ హోమాపకర్షము ప్రధానపూర్ణాహుతి మొదలగునది కృతాకృతము. ఏమనిన; ఆరంభమే కాకుండుటచేనని తోచుచున్నది. చేయు పక్షము నందు నతిక్రాంతమైన పూర్ణమాస పూర్ణాహుతులు వ్రేల్చి పక్షహోమములజేసి దర్శ పూర్ణాహుతులీయవలెను.

## ప్రేతాధానము

శ్లో॥ "అగ్నావరణ్యో రారూఢే ప్రమీయేత పతిర్యది, ప్రేతం స్పృష్ట్వామధి త్వాగ్నిం జప్త్వాచోపావరోహణం, ఘృతంచ ద్వాదశోపాత్తం తూష్ణీం హుత్వాశవక్రియా" అనగా నగ్ని నరణులయందారోపించి పతి మృతుండైనచో ప్రేతినుస్పృశింపుచు నగ్నిమథించియు పావరోహమంత్రము జపించి పండ్రెండు మారులు గ్రహించిన యాజ్యము నూరకేవ్రేల్చి శవసంస్కారము జేయునది. విచ్ఛిన్నమైన శ్రౌతాగ్నులు గలవాడు మృతుడైనచో ప్రేతాధానము జేయునది. అది యెట్లనిన; ప్రేత నతనియగ్ని గృహములోపలనుంచి యరణులుతెచ్చి "యస్యాగ్న యోజుహ్వాతో మాంసకామాస్సం కల్పయంతే యజమానమాంసం, జాయంతుతే హవిషే సాధితాయస్వర్గం లోక మిమం ప్రేతం నయంతు" అను యజుర్మంత్రముచే మథించి యగ్నిని వేదికలో నుంచి పండ్రెండు మారులు గ్రహించిన యాజ్యముచే నూరకవ్రేల్చి యాయగ్ని చేదాహాదులు చేయవలెను. అగ్నియు నరణులుగూడ నష్టమైనచో మృతియైనయెడ క్రొత్తయరణులు తెచ్చి 'మనోజ్యోతిః' అను ఋక్కుచే మథించి పూర్వమువలె జేయునది. స్మార్తాగ్ని గలవాని కది విచ్ఛిన్నమైనచో నెన్నిదినములనుండి విచ్ఛిన్నమైనదో లెక్కబెట్టి పూర్వార్ధ మందు జెప్పినరీతినపుడు చేయవలెను. లేదా సంకల్పింపవలెను. ప్రాయశ్చిత్తాంత మందు హోమద్రవ్యము స్థాలీపాక ద్రవ్యమును నన్నిరోజులకు సరిపడునవి యాయ వలెను. అటుపై నరణిపక్షమందు పూర్వమువలె మథించునది. పక్షాంతరమందు "అముకశర్మణోఽగ్ని 'విచ్ఛేదనిమిత్తకందాహాయాగ్ని సిద్ధ్యర్థం ప్రేతాధానం కరిష్యే" యని సంకల్పించి యగ్ని గృహమందు సంభారములన్నియు నుంచి లౌకికాగ్ని ప్రతిష్ఠించి యాజ్యము సంస్కరించి 'అయాశ్చ' యను మంత్రముచే 'యస్యాగ్నయః ' అనుమీద చెప్పిన మంత్రముచేతను హోమముజేసి వ్యాహృతులచే నాల్గువ్రేల్చవలెను. ఇట్లు ఔపాసనముచే సిద్ధమగును. పత్నీమరణమందు నిట్లనేయని భట్టులు చెప్పిరి.

ఇట్లు విదురునికిని శ్రౌతాగ్నియున్నచో యథాయథముగ నాయగ్నులచే దాహము. విదురుని కగ్నిపరిగ్రహమైన పైని దానివిచ్ఛేదమైనచో పూర్వోక్తరీతులచే తత్తదగ్నుల కాధానము. గృహ్యాగ్ని నిదాయాద్యపక్షాశ్రయణముచే బరిగ్రహింపని సభార్యునికిని విదురునికిని బ్రహ్మచారి సమావృత్తులకును, అనుపనీత పుత్రునకు నవివాహిత కన్యకునునిరగ్నికుని భార్యకును విధవకును కపాలాగ్నిచేగాని లౌకికాగ్నిచేగానిము. అగ్నివహదాలె నెట్టగగాల్చిన పెంకులో నేరుపిడకనిప్పుచే సిద్ధించి 'భూర్భువస్స్వస్వాహా' యని యుజ్యాహుతిచే సంస్కరించినయగ్ని కపాలాగ్ని యనఁబడును. లౌకికాగ్ని యనగా నంత్యజాగ్ని, పతితాగ్ని, సూతికాగ్ని, చితాగ్ని, అమేధ్యాగ్నియు ననువీనికంటె భిన్నమైనది. గ్రహించునది. శ్లో॥ "యస్యానయతి శూద్రోఽగ్నిం తృణకాష్ఠహవీంషి చ, ప్రేతత్వంచ సదాతస్య శూద్రః పాపేనలిప్యతే" అనగా శూద్రుడు తృణకాష్ఠ హవిస్సులనుగాని యగ్నినిగాని మృతునివిషయము తెచ్చినచో వానికి బ్రేతత్వమెప్పటికిని వదలదు. శూద్రునికి పాపమువచ్చును. ఆహితాగ్ని దంపతులలో మొదట పతి మృతినొందెనేని సర్వాగ్నులచే నతని దహింపవలెను. ఆ వెనుక భార్య మృతినొందినచో నిర్మంథ్యాగ్నిచేగాని కపాలాగ్నిచేగాని దహనము పూర్వమందే భార్య మృతినొందెనేని యామెనే సర్వాగ్నులచే దహింపవలెను. సర్వపాత్రలు నామెకిచ్చివేయవలెను. ఆపైని మృతుడైన యామెభర్తకు బునరాధానముచే త్రేతాగ్ని సిద్ధిజేసి వానిచే దాహము.ఆ ధానము చేయకున్నను నిర్మథ్యాగ్నిచేగాని లౌకికాగ్నిచేగాని దాహమని కొందరు, యాజ్ఞికుల యాచారమును దరుచుగ నిట్లనే జరుగుచున్నది. ఇక్కడ నిర్ణయ సింధువు. ఆహితాగ్నిచో నాయగ్నులన్నిటిచే నాభార్యను దహించి తిరుగవివాహమై యాధానము తిరుగజేయవలెనని యొకపక్షము. "దాహయిత్వాగ్ని హోత్రేణ స్త్రియం వృత్తవతీం పతిః" అనువచనము లీపక్షమందేయని. ఇక దిరుగ వివాహమం దశక్తుడైనచో నిర్మథ్యాగ్నియందామెను దహించి పూర్వాగ్నులయందే యగ్నిహోత్ర హోమము నిష్టియు చాతుర్మాస్యాదికము జేయునది. సోమయాగము జేయఁగూడదు. పూర్వాగ్నిలో నేకదేశముచే దహింపవలెనని యజ్ఞపార్శ్వ దేవయాజ్ఞికాదులు. ఇఁక "తస్మాదపత్నీకో ప్యగ్నిహోత్ర నూహరేత్" అని మొదలగు శ్రుతిస్మృతివచనములు పూర్వాగ్నియందే యగ్నిహోత్రము విధింపుచున్నవిగాని యపత్నీకుని కాధానము విధింపనేరవు. అపత్నీకుని కాధానము విధించెడు మూలవచన మెచ్చటను గానరాదు. అట్లు "దారకర్మణ్యశక్త ఆత్మార్థమగ్న్యాధేయం" అను నాపస్తంబసూత్రముగూడ దిరుగ వివాహము జేసుకొన నశక్తుఁడైనచో బూర్వమందైన యగ్న్యాధేయము నాత్మార్థమై స్థాపించవలెనుగాని పత్నికిగూడదను తాత్పర్యమునే చెప్పుచున్నది. మఱియును బ్రాహ్మణ భాష్యం పరార్క శార్కరామాండారాదులమతము నిట్లనేయున్నది. కనుక సపత్నీకునికి బునరాధానము జెప్పెడు వారితాత్పర్యము మనకు దెలియదు. అనియిట్లు చెప్పిన నిర్ణయ సింధుమత మేయుక్తమని తోచుచున్నది. ఇఁక యాజ్ఞికుల యాచారమైనచో నంతర్గూఢమైన వివాహేచ్ఛ మూలముగ నడచినది యది ప్రామాణ్యము నీయజాలదు. పునర్వివాహాశదే సర్వాగ్నుల బత్నికిచ్చినచో నటుపైని వివాహము సంభవింపనిచో సింధుమత మందాధానములేనందున నిర్మంథ్యాగ్నియే శరణముగావలెను. కొందఱిమతమందు బునరాధానము. అందు నిర్మంథ్యము మొదలగుదానిచే మొదట మృతినొందిన

భార్యను దహించుపక్షమందు బూర్వాగ్నుల కుత్సర్గేష్టిచే త్యాగముజేసి పునరాధానమున నగ్నిహోత్రము జేయవలెనని కొందరంద్రు. ఇట్లు స్మార్తాగ్నిగలవారికి పూర్వమందు భార్య మృతినొందినను గృహ్యాగ్నిలో నేకదేశముచే నామెను దహించి యవశిష్టాగ్నిలో నిత్యహోమస్థాలీపాకములు నాగ్రయణమును గావలెను. ఇక్కడ మూలమంత్యేష్టి పద్ధతి యందున్నది. మఱియే మనిన; నింతమట్టున కిక్కడనున్నది "దగ్ధానిర్మంధ్యవహ్నినా, ఉత్సర్గేష్ట్యాత్యజేదగ్నీన్ పునస్తానాదధీతచ, శవాగ్నయోవా ఏతేయేపత్నాం మృతాయాం ధార్యంతే." యనికఠశ్రుతి. సింధ్వాదులలో నీపక్షము జెప్పకుండుటవే నేకదేశి మతముగ నిది చెప్పఁబడినది. ఈమతద్వయము స్మార్తాగ్నియందు నూహించునది. ఇచ్చట నంతటను శ్రౌతమందుగాని స్మార్తమందుగాని కుశపత్నీ విధానముచేతనే యాధానాది కర్మాధికారము. బహుభార్యలుగలవానికి జ్యేష్ఠభార్య జీవించియుండగ గనిష్ఠ భార్య మృతినొందినచో నిర్మథ్యాగ్నిచే నామెను దహింపవలెను గాని శ్రౌతస్మార్తాగ్నులచే గూడదు కొందఱు సర్వాగ్నులచే గనిష్ఠ భార్యను దహించి జ్యేష్ఠభార్యతో బునరాధానము జేయవలెనంద్రు. అట్లుచేయుట యగ్నిద్వయ సంసర్గతాత్పర్యముచే గాని మతాంతరమని గాని చెప్పఁబడినది. దహింపుచుండగ నగ్నినశించినచో 'యజమానేచితారూఢే పాత్రన్యాసేకృతేసతి, వర్షాద్యభిహతే వహ్నౌచితాగ్ని స్థే కథంచన, తదార్ధదగ్ధ కాష్టాని తాని నిర్మథ్యతం దహేత్' అనఁగా నాహితాగ్ని నిచితిపై నుంచి పాత్ర న్యాసపూర్వకముగ దహింపుచుండగ వర్షాధిక్యముచే నగ్నినశించినయెడ దానిలో కొరవులు తీసి మథించి దహింపవలెను.

## శవమును గొనిపోవు ప్రకారము

విప్రశవమును నగరపశ్చిమద్వారముననను శూద్రశవమును దక్షిణద్వారము నను శవసజాతీయులు శవముఖమునుగప్పి దాహదేశమును బూర్వశిరస్సుగా నొందింపవలెను. మీఁదఁజెప్పినయగ్నిని మఱియొకరు శవమునకు ముందుగ బట్టుకొని వెళ్లవలెను. ప్రేతకునగ్నికి మధ్యమందు మరియొకరునడువవలెను. అందరు సపిండాదులు నుపవీతముల క్రిందుగనుంచి కొప్పులు వీడియుండఁగ జ్యేష్ఠానుక్రమ ముగ ప్రేతననుసనించి నడువవలెను ప్రేతను నగ్నముగా దహింపవలెను. నిశ్శేష ముగా దహింపగూడదు. శవవస్త్రము శ్మశానవాసుల కీయవలెను. ప్రేతకు కేశనఖ ముల వపనముజేయించి స్నానము జేయించినపైని గంధపుష్పాదులచే నలంకరించి దహింపవలెను. పగలు మృతినొందినచో బగలే? రాత్రియైనచో నపుడేదహింపవలెను. అట్లుగానిచో బర్యుషితమనబడును. శవము పర్యుషితమైనచో బంచగవ్యముచే గడిగి మూడుప్రాజాపత్యకృచ్ఛ్రములుజేసి దహించునది. ముఖమందైన నేత్రములు మొదలగు సప్తఛిద్రములును సువర్ణశకలములచే గప్పవలెను. అపుడు యజ్ఞపాత్రలు న్యసించు టయు మంత్రయుక్తముగదాహమొనర్చుటయు వారి వారి గృహ్యసూత్రముననుసరించి శ్రౌతస్మార్తాంత్యేష్టి పద్ధతిలో జూడవలెను ఆపైని దాహాంతమందు ఘటస్ఫోటాదికము చేయవలెను. శిలకు విపర్యయమందును ఘటస్ఫోటమున కావృత్తిలేదు. అనగా పోయినను మరియొకశిల గ్రహింపవచ్చును. అటుపైని చితియ ప్రదక్షిణముజేసి సచేల స్నానమైనపైని సగోత్ర సపిండసమానోదకులకును మాతామహీ మాతామహుల కును నాచార్యాదులకును దుహితకు జెలియలికిని తిలాంజలినివ్వకతప్పదు. అదియెట్ల

నిన; వృద్ధానుక్రమముగ దక్షిణాభిముఖులై 'అముకగోత్రనామాప్రేత స్తృప్యతు' అను మంత్రముచే తిలాంజలి నొక్కొకమారే పాషాణమందు విడువవలెను. ఇక్కడ స్నానో దకదానమందు 'అపనశ్శోశుచదఘ్ధ' మను మంత్రముచే జేయవలెను. ఈ మంత్రముచే స్నానమేయని కొందరు స్త్రీలకు మంత్రనక్కరలేదు. మేనమామ మేనత్త పినతల్లి మేనల్లుడు మామగారు మిత్రుడు మొదలగువారికి నుదకదానము వైకల్పికము చేసిన పక్షమందును రాత్రియందే యను నియమములేదు. వ్రాత్యుడుపతితుడు బ్రహ్మా చారియు నపుంసకుడు చోరుడును నుదకదానమున కనర్హులు. అందు వ్రాత్యులనగ యథాకాలముగ నుపనయనములేని ప్రాయశ్చిత్త మొందుచున్న బ్రహ్మాచారులు చోరు లనఁగ సువర్ణముగాని తత్సమద్రవ్యముగాని యపహరించువారు. బ్రహ్మాచారులు తలిదండ్రులకును తాతకును మాతామహగుర్వాచార్యులకును నుదకదానము చేయ వలెను. ప్రాయశ్చిత్తమారంభించినవారు దానియంతమున నుదకదానము త్రిరాత్రా శౌచమును జేయవలెను. వ్రాత్యాదులు మాత్రము శవమునకు స్పర్శము మోయుట యుదకదానము పిండదానమును జేయఁగూడదు. ఇతరులులేనిచో బ్రహ్మాచారియైనను దాహోశౌచములు జేయవచ్చును. నిత్యకర్మకు లోపములేదని మీఁదఁజెప్పఁబడినది. ఈ యుదకదాన మొక్క వస్త్రముతో నపసవ్యముగ జేయునది. ఉదకదానమైన పైని దిరుగస్నానముజేసి వస్త్రములు పిడుచుకొని కులవృద్ధులు పుత్రాదులకు పూర్వవృత్తాంత ములచే నూరార్చి విప్రులయను మతిచే గనిష్ఠులు మున్నుగా బయలుదేరి గృహ సమీపమున వేపాకు గొంచెము భక్షించి యాచమనముజేసి యగ్ని నుదకము గోమయము మొదలగువానిని స్పృశించి ద్వారమునందలి రాయిత్రొక్కి గృహము ప్రవేశించునది. అందు వేపాకుఁదినుట వైకల్పికము. ఆపై నాదినముపవాసము చేయునది. అశక్తిలో నయాచితముగ నవ్యగృహమున వండిన హవిష్యాన్నము దొరికి నచో నది మాత్రము దిని యుండవలెను. అపుడాశౌచ మధ్యమందు మాషము మాంసము నపూపములు మధురవస్తువులు లవణము పాలునభ్యంగము తాంబూ లము క్షారమును విడువవలెను. క్షారము లేవనిన; "తిలముద్గాదృతే శైబ్యం సస్యే గోధూమకోద్రవౌ, ధన్యాకం దేవధాన్యంచ శమీధాన్యం తథైవచ, స్విన్న ధాన్యం తథాపణ్యం మూలం క్షారగణస్మృతః" అనగా తిలలు పెసలు తప్ప దక్కిన శిబి ధాన్యము నస్యమందు గోధూమములు కొర్రలు ధనియాలు దేవధాన్యము శమీ ధాన్యము నుడికించిన ధాన్యము బాజారుకొనుబడిన వస్తువులు దుంపలు నివి క్షారగణ మనబడును. కొందరు సంధవము భక్షింపవచ్చునంద్రు. అద్దము స్త్రీసంగముద్యూతము నవ్వుట రోదనము కుర్చీకవాచీ మొదలగు నున్నతాసనము నిత్యముగ వర్జించునది. బాలవృద్ధాతురులు తప్ప దక్కినవారు తృణములు చాపమొదలగునవి పరచని భూమి యందే వేర్వేరుగ బండుకొనవలెను. తివాసీలు మొదలగునవి పరచుకొన గూడదు. మార్జనాదులు లేకుండగనే స్నానము జేయునది. అస్తిసంచయనమైన పైని భార్య పుత్రుడు మొదలగువారు తప్ప దక్కినవారు శయ్యాసనములపై నుండవచ్చును. స్త్రీ సంగము మాత్రము గూడదు. అస్థిసంచయనమైనపైని భార్య పుత్రుడు మొదలగువారు తప్ప దక్కినవారు శయ్యాసనములపై నుండవచ్చును. స్త్రీ సంగము మాత్రము గూడదు. అస్థిసంచయనము మంత్రాగ్నిచే దహించినదినము మొదలుగ ప్రథమద్వితీయ తృతీయ చతుర్థసప్తమ నవమదినములలో నొకదినమందు గోత్రజులతో తమ గృహసూత్రోక్త

ప్రకారముచే జేయవలెను. అందు త్రిపాదద్విపాద నక్షత్రములును కర్త జన్మనక్షత్రమును వర్జ్యములు. సంభవమందు రవిమంగళ శనివారములు వర్జ్యములు. పాలాశ దాహ మందు నస్థులు దహించునపుడును దత్కాలమందే యస్థిసంచయనము. అనగా నస్థులు గంగోదకమందుగాని తీర్థాంతరమందుగాని విసర్జించుట. ఆ విధి ముందు జెప్పబడును. లేదా అరణ్యమందు వృక్షమూలమున బాతిపెట్టవలెను. అన్యకులస్థుని యస్థులు తీర్థమునకు తీసికొనివెళ్లిన వాడు చాంద్రాయణము జేయునది. ధర్మార్థమై యట్లు జేసెనేని మహాపుణ్యముగల్గును. అస్థులకు శునకము పంది శూద్రుడు వీరి స్పర్శగలిగినచో పంచగవ్యము సాలగ్రామతీర్థము తులస్యుదకము దీనిచే గడుగవలెను ఆశౌచమధ్యమందు సగోత్రులతో భోజనము చేయవలెను. అదియు పగటియందే, భోజనముమృణ్మయ పాత్రలలోగాని యాకుదొప్పెలలో గాని కావలెను. ధాతుపాత్ర లందు కూడదు. దాహదినము మొదలు పదిదినములందును పదిపిండములు మంత్రము లేకుండనే యీవలెను. క్షత్రియాదులకు తొమ్మిదేతొమ్మిది దినములందీ వలెను. పదియవది యాశౌచాంత్యదినమందే. ప్రథమదినమందే యేదేశమో యెవరు కర్తయో యేతండులాది ద్రవ్యమో యేది శిలయో యేది పాకపాత్రమో అది మొదలుగ పదిదినములవరకు నవియే గావలెను. ఇందులో యేదైనను మార్చినచో నదిమొదలుగ బునరావృత్తి చేయునది. శిలపోయినప్పటికిని ఘటస్ఫోటాదికమున కావృత్తి లేదని మీాద జెప్పినందున లౌకికశిల గ్రహించునది. కనుక పిండదానతిలాంజలులు మొద లగువానికే యావృత్తిగాని దాహమున కదిలేదు. కొందరు చేయించు నాచార్యుడు మారిన నావృత్తి యగునంద్రు. ఇక నొకవేళ పుత్రాది ముఖ్యకర్త సన్నిధిలేనందున గౌణకర్త యారంభించి చేయుచో పుత్రాది ముఖ్యకర్త వచ్చినప్పటికిని గౌణకర్తయే దశాహాంత క్రియను జేయవలెను. మరియేకాదశాహాదికము ముఖ్యర్తయే చేయవలెను. మంత్రయుక్తమైన దాహము మాత్ర మన్యులచే జేయఁబడినచో బిండదానము మొదలు దశాహకృత్యము సన్నిధియందున్న ముఖ్యకర్త చేయవలయునని మితాక్షర మొదలయి నవి. అన్యులు సగోత్రుడుగాని యపగోత్రుడుగాని సమంత్రక దహనము జేసినయతడే దశ్శాహాంతకర్మ జేయవలెనంద్రు. పత్నికర్తయైనపుడు రజోదర్శనమగునో నామెయే శుద్ధియైనపై జేయునది. కర్తకు నస్వాస్థ్యమున్నచో నన్యునిచే సర్వక్రియలు తిరుగ జేయింపవలెను. పిండద్రవ్యములలో బియ్యము ముఖ్యము. అవిలేనిచో ఫలములు మూలములు శాకములు తిలమిశ్రమైన సత్తుపిండియు గావచ్చును. ప్రేతశ్రాద్ధము లందు పితృశబ్దము స్వధాశబ్దము వాని ననుసరించిన గోత్రనామాది శబ్దములెవ్వి యును గంధధూపదీపదానాదులందు మంత్రములు నుచ్చరింపఁగూడదు. పర్ణశరదా హాదికమందు త్ర్యహాశౌచమున మొదలిట్టి దినమందొక్క పిండములు నని క్రమము దెలియ వలెను. పుత్రుఁడే పర్ణశరదాహము జేయుచో దశాహాశౌచముండును. కనుక మూఁడు దినములలో పిండముల సమాప్తి జేయఁగూడదు. అందు మొదలిటి పిండముచే ప్రేతకు శిరస్సు గలుగును. రెండదానిచే కన్నులు ముక్కు చెవులు గలుగును. మూఁడవదానిచే గంఠము భుజములు మూపులు వక్షస్థలము గలుగును. నాల్గవదానిచే నాభియు లింగము గుహ్యము గలుగును. పంచమపిండముచే మోఁకా కులు పిక్కలు పాదములును గల్గును. ఆరవ దానిచే మర్మములు సప్తమముచే నాడులు.

యెన్మిదవదానిచే దంతములు రోమములును గల్గును. తొమ్మిదవదానిచే వీర్యము. పదియవ దానిచే బూర్ణత్వము తృప్తియు క్షున్ని వృత్తియుగల్గును. పదిరోజులలో 'ప్రేతా త్రస్నాహి' యని జల మాకాశమునందును 'ప్రేతాత్రపిబ' యని మృణ్మయ మందు క్షీరమును విడువవలె ననువిధి కృతా కృతము. "తతః ప్రేతోపకృతయే దశరాత్రమ ఖండితం, కుర్యాత్ప్రదీపకం తైలే వారిపాత్రం చ మార్తికం, భోజ్యాద్భోజన కాలేదు భక్త ముష్టించ నిర్వపేత్, నామగోత్రేణ సంబుధ్య ధరిత్ర్యాం పితృయజ్ఞవత్, భూలోకా త్ప్రేతలోకం తు గంతుం శ్రాద్ధం సమాచరేత్, తత్పాధేయం హి భవతి మృతస్య మనుజస్యచ." అనఁగా పదిరాత్రుల పర్యంతమును మృతినొందిన స్థలమందు నూనెచే నఖండదీపముంచవలెను. మఱియు నాస్థలమందు ధారగానీళ్లు పడునట్లు కుండతో నీళ్ళు కట్టవలెను. భోజనకాలమందొకపిడికెడన్నము నామగోత్రములచే ప్రేతనుపిలిచి పితృయజ్ఞమువలె నక్కడ వేయవలెను. మఱియును శ్రాద్ధమంతయు భూలోకమునుండి ప్రేతలోకము నతఁడు పొందుటకే త్రోవకర్చుకై యుపయోగించును కనుక బూర్ణముగ జేయవలెను.

## పదిరోజులలోపున నమావాస్య వచ్చినచో నిర్ణయము

పిండదానాదికము ప్రారంభించినపైని దర్శ వచ్చినయెడ తలిదండ్రులు తప్ప దక్కినవారి ప్రేతకృత్య మైనచో దశాహకృత్యమంతయు నాకర్షించి దర్శయందు సమాప్తి జేయవలెను. తలిదండ్రుల విషయమైనచో మూఁడు రోజులలోగా దర్శ వచ్చేనేని నట్లపకర్ష మక్కరలేదు. అటుపైని వచ్చినచో సర్వము దర్శయందే చేయలెనని కొందరు. ఇతరులు మూఁడు దినములపైని వచ్చినను నౌరసపుత్రుఁడు తల్లిదండ్రుల ప్రేతకృత్య మును నపకర్షించి జేయఁగూడదండ్రు. అందు దేశాచారముచే వ్యవస్థయని సింథ్వాదులు. ఒకవేళ దర్శకంటె మున్ను పిండదానాది తంత్రారంభము సంభవింపని యెడ సమంత్రకముగ దాహమాత్రము జరిగినప్పటికిని దర్శయందే తంత్ర సమాప్తి చేయవలె నను నియమమక్కరలేదని తోఁచుచున్నది. దర్శానంతరమందే తంత్ర మున కారంభము సమాప్తియు సంభవించును గనుక 'ద్విరైందవేతుకుర్వాణః పునశ్శావం సమశ్నుతే" యని. అనఁగా నమావాస్యలో గొంతయు పైని గొంతయు జేసెనేని తిరుగ జేయవలసివచ్చునను దోషము రానేరదు. ఇట్లు దర్శయం దపకర్షించి తంత్రమునంత పుచ్చునపుడును నగ్నిని పిండము నిచ్చుకర్తకు దశాహాశౌచము తప్పదు. పుత్రాదిసపిండులకు బొత్తిగా దప్పదు. దశదినములలో ప్రేతపిండము నిచ్చి స్నానము జేసి భుజించెనేని యసపిండుడు త్రిరాత్రోపవాసము చేయవలెను. సపిండు డొక్క యుపవాసమే బుద్ధిపూర్వకముగ జేసినచో ద్విగుణము. ప్రేతకృత్యము జేయువాఁడు సంచయమునమునకు మున్ను స్త్రీసంగము చేసినచో చాంద్రాయణము అటుపైనైనచో మూఁడు కృచ్ఛ్రములుచేయవలెను. తక్కిన యాశౌచవంతులకు సంచయనము లోపున ద్రిరాత్రౌపవాసము నటుపై నొకయుపవాసము.

## ప్రథమదినాది కృత్యము నవశ్రాద్ధము

ప్రథమ తృతీయపంచమ సప్తమ నవ మైకాదశదినములందు నవశ్రాద్ధము గావలెను. 'నవశ్రాద్ధానిపంచాహు రాశ్వలాయనశాఖినః, ఆపస్తంబా ష్షడిత్యాహు

రితిరేషాం విభాషయా' అనఁగా నీనవశ్రాద్ధములు ఋగ్వేదులకైదు నాపస్తంబుల కారును నితరులకు వికల్పముగ నొకపక్షమని యంద్రు అయినను వారు పదునొకం డవ దినమందు జేయరు. ఇవియే విషమశ్రాద్ధము లనఁబడును. 'నవశ్రాద్ధం దశా హాంతర్నవమిశ్రంతు వత్సరే' అని యున్నది. అనఁగా పదునొకండవ దినమందలి నవ శ్రాద్ధము మానుట కిది ప్రయాణమని తాత్పర్యము తోఁచుచున్నది. దశాహములో గాన నశ్రాద్ధమనియు వత్సరపర్యంతము జేయు మాసికముల నవమిశ్రములనియు నర్థము. మఱియును 'అకృత్వాతు నవశ్రాద్ధం ప్రేతత్వా న్నైవముచ్యతే, నవశ్రాద్ధం త్రిపక్షంచ షాణ్మాసిక మాసికానిచ, నకరోతి సుతో యస్తు తస్యాధః పితరోగతాః" అని. అనఁగా నవశ్రాద్ధములు చేయనియెడ ప్రేతత్వము వదలదనియు నవశ్రాద్ధము త్రైపక్షికము నూనషాణ్మాసికము మాసికములును చేయనిచో నతని పిత్రాదు లధోగతి నొందుదురనియు నర్థము.

## శ్రాద్ధవిధి

'నవశ్రాద్ధమమంత్రంస్యా దవనేజనవర్జితం, ఆశషోద్విగుణాదర్భా జపాశీ స్స్వస్తివాచనం, పితృశబ్దస్స్వ సంబంధశ్శర్మశబ్ద స్తథైవచ, పాత్రాలంభోవగాహశ్చ ఉల్ముకోల్లేఖనాదికం, తృప్తి ప్రశ్నశ్చ వికిరశ్శేష ప్రశ్నస్తథైవచ, ప్రదక్షిణా విసర్గశ్చ సీమాంతగమనం తథా, అష్టాదశ పదార్థాంశ్చ ప్రేతశ్రాద్ధే వివర్జయేత్" అనఁగా నవశ్రాద్ధమందు మంత్రము పాదప్రక్షాళనము నాశీర్వచనములు ద్విగుణదర్భలు జపము స్వస్తివాచనము పితృశబ్దము తనవానిని జెప్పు శబ్దము శర్మశబ్దము పాత్రను ముట్టుట ద్విజాంగుష్ఠనివేదనము కొరవితో వ్రాయుట మొదలగునదియు తృప్తి ప్రశ్నము వికిరము శేషప్రశ్నము ప్రదక్షిణముజేయుట విసర్జనము సీమాంతము వరకు ననుసరించుటయు ననుపదునెనిమిది పదార్థములను వర్జింపవలెను. 'తిలోసి' యను మంత్రమున 'స్వధానమః' పితృశబ్దములు చెప్పఁగూడదు. మఱియేమనిన; ప్రేత శబ్దము నూహజేసి తిలల నూరకేయుంచునది. అర్ఘ్యదానము నూరకచేయునది. 'అముష్మైస్వాహా' యని ప్రేతనామము నుచ్చరించియే పాణిహోమము బహ్వృచులకు సర్వమైన యేకోద్దిష్టములందును నగ్నౌకరణము తప్పదు. దాని నిషేధమన్యశాఖీయుల కని తెలియునది. నామచే నొక్కపిండమే విడువవలెను. నినయనమంత్రమం దూహను జేయవలెను. అనుమంత్రణము మొదలగునది మంత్రహీనమునగును. 'అభిరమ్యతాం' అని పల్కియే విసర్జింపవలెను. ఇట్లు నవశ్రాద్ధము తప్ప దక్కిన యేకోద్దిష్టములందగును. నవశ్రాద్ధమైనచో సర్వము మంత్రహీనమే యని నారాయణ వృత్తి. "ఉత్తానం స్థాపయే త్పాత్ర మేకోద్దిష్టేసదాబుధః, న్యుబ్జంతు పార్వణేకుర్యా త్తస్యోపరి కుశాన్న్యసేత్." అనఁగా నేకోద్దిష్ట శ్రాద్ధమందు నెప్పుడును పాత్రను వెతికిల వేయవలెను. బోర్లించుట పార్వణ శ్రాద్ధమందే చేయవలెను. దానిపై దర్భలు వేయ వలెను. సపిండీకరణాంతమైన ప్రేతశ్రాద్ధములు లౌకికాగ్నియందే చేయవలెనని యాశ్వలాయన మతము. నవశ్రాద్ధాదికము, సంభవమైనచో నన్నముచే జేయవలెను. లేనిచో నామాన్నముచేతనే విఘ్నమైనచో నవశ్రాద్ధము మాసికమును పై శ్రాద్ధముతో గలపి తంత్రముచే జేయవచ్చును. మృతాశౌచము మరియొకటి యపుడు వచ్చినను

నవశ్రాద్ధములు చేయవలసినవే సహగమనము జరిగినచో నవశ్రాద్ధములును సపిండీకరణమును ప్రత్యేకముగనే జేయవలెను. వృషోత్సర్గము గోదానము నొక్కటియే యగును. శూద్రునికి మంత్రహీనముగ సర్వము జేయవలెనని స్మృత్యర్థసారము. ఇక్కడ వయోధికుఁడు మృతినొందినచో గనిష్ఠులైనసపిండులందరును, బదియవదిన మందు క్షౌరము జేయించుకొనవలెనని కొందరంద్రు. తలిదండ్రులు నాచార్యుఁడు మృతులైనచో దశమదినమందు ముండనము తప్పదు. ఇట్లు భర్తమృతుఁడైనచో బత్నికి ముండనముతప్పదు. పుత్రులకందరికిని దాహాంతముగ బ్రథమదినమందును, దశమదినమందును ముండనము ఇక్కడ దేశాచారముబట్టి వ్యవస్థ జేయునది. అపుడు రాత్రి మృతియగుచో రాత్రియందే దహించినను బరదినమందు ముండన మని చెప్పఁబడినది. అటుపైని పదియవదినమందు పూర్వవస్త్రములకును గృహమునకును శుద్ధిజేసి తెల్లావపిండియు తెలకపిండియు బూసుకొని శిరస్నానముజేసి క్రొత్త బట్టను గట్టుకొని విడిచిన వస్త్రములును ప్రేతవస్త్రములును నంత్యజులకు గాని భృత్యులకుగాని యిచ్చి సువర్ణము మొదలగు మంగళవస్తువులు స్పృశించి గృహము ప్రవేశించునది.

## అస్థులుంచెడు విధి

మొదటసంచయనదినమం దస్థిస్థాపనప్రకారము శ్మశానమందు బలినిచ్చి క్షీరములచే బ్రోక్షించి వాఙ్నియమముతో ప్రేతయొక్క ప్రధానాంగములందైన యస్థుల సంగ్రహించి పంచగవ్యముచే గడిగి పట్టువస్త్రమున గట్టి క్రొత్తకుండలోనుంచి మూత వేసి అరణ్యమున వృక్షము మొదటగాని మఱి యేదైనను శుద్ధప్రదేశమందుగాని పాతిపెట్టవలెను. తక్కిన సూక్ష్మాస్థులు బుగ్గియు జలమందు బాఱవైవవలెను. ఆపైని గోమయోదకముచే నా స్థలము బ్రోక్షించి పుష్పధూపాదులచే బలులచేతను బూజింప వలెను. అనంతరమున బూర్వము స్థాపించినయస్థులను తీర్థమందుగాని గంగాజల మందుగాని పుత్రుఁడు దౌహిత్రుఁడు సహోదరుఁడు వీరిలో నొకరు తీసికొనివెళ్లి పడవ్రేయవలయును. మాతృపితృవంశస్థుఁడు గాక తక్కినవాడు తీసికొని వెళ్ళిన పక్షమందు చాంద్రాయణము – శ్లో॥ "గంగాతోయేషు యస్యాస్థి క్షిప్యతే శుభకర్మణః నతస్య పునరావృత్తి బ్రహ్మలోకా త్సనాతనాత్" అనఁగా ప్రవాహమందు నెవ్వనియస్థులు వేయఁబడునో యతనికి బ్రహ్మలోకవాసము శాశ్వతముగ గలుగుననుట. శ్లో "అస్తం గతే గురౌ శుక్రే తథామాసే మలిమ్లుచే, గంగాయా మస్థినిక్షేపం నకుర్యా దితి గౌతమః" అనఁగా గురు శుక్రాస్తములందు నధికమాసమందును గంగోదకమందస్థులు వేయఁగూడదని గౌతమమతము. దశాహములోగానస్థులు వ్రేసినచో నస్తాదిదోషము లేదు. శ్లో॥ "దశాహాభ్యంతరే యస్య గంగాతోయే స్థిమజ్జతి, గంగాయాం మరణం యాదృక్తాదృక్ఫలమవాప్నుయాత్" అనఁగా దశాహములోగా దనయస్థులు గంగలో బడినయెడ గంగయందు మృతినొందినవానికి గల్గుఫల మనఁగ మోక్షము నొందును. ఇక తీర్థమందస్థులుంచుటకు పూర్వాంగ విధి. మొదట పాతివస్థలమున సచేల స్నాన పూర్వకముగ గోమూత్రాదులచేఁ బ్రోక్షింపవలెను. అందు గాయత్రితో గోమూత్రముచేతను 'గంధద్వారా' మనుమంత్రముతో గోమయముచేతను 'అప్యా యస్వ' యను మంత్రముతో క్షీరముచేతను 'దధిక్రావణ్ణ్'యను మంత్రమున పెరుగు చేతను 'ఘృతంమిమిక్షిరే' యను మంత్రమున ఘృతముచేతను 'ఉపసర్ప' యను

నాల్గు ఋక్కులకును "శంఖఃపితరస్త్రిష్టుప్ భూ ప్రార్తన ఖనన మృదుద్ధరణాస్థి గ్రహణేషు క్రమేణ వినియోగః" అని ఋషిచ్ఛందస్సులు వినియోగమును జెప్పి నాల్గు ఋక్కులచే గ్రమముగ నస్థిగ్రహణాంతములైన కర్మలుచేసి తాను జలాశయమందు గృహ్యోక్త విధిచే స్నానము జేయునది. అటుపై నస్థుల శుద్ధిజేయునది. ఎట్లనిన; అస్థులస్పృశించి 'ఏతోన్వింద్ర' మను మూఁడు ఋక్కులావృత్తిజేయుచు పంచగవ్యములచే స్నానముజేసి స్పృశించిచే దశస్నానములు చేయవలెను. అందు గాయత్రి మొదలగు నైదు మంత్రములచే గోమయము క్షీరము దధి నేయి వీనిచే స్నానములు చేసి 'దేవస్యత్వా' యను దానితో గుశోదకముచేతను 'మానస్తోకే' యనుదానితో భస్మస్నానము. 'అశ్వక్రాంతే రథక్రాంతే' యను దానితో మృత్తికచేతను 'మధువాతా' యనుదానితో మధువుచేతను 'ఆపోహిష్ఠ' యని శుద్ధోదకముచేతను స్నానము చేయునది. ఇట్లు పదిస్నానములు చేసి యస్థులకు మార్జనము చేయునది. అందు మంత్రములు :- 'అతోదేవా' యను ఋక్కును ఆపైని సప్తసూక్తములును 'ఏతోన్వింద్ర' మనునది యొకటి 'శుచీవో' యనునది యొకటి 'నతమం హోన' యునునవి యెనిమిది. 'ఇతివా' యనునవి పదుమూఁడు. 'స్వాదిష్ఠయా' యనునవి పది. 'మమాగ్నేవర్చోవిహవే' యనునవి తొమ్మిది. 'కద్రుద్రాయప్రచేతసే,' యను నవి తొమ్మిది. ఈ మంత్రములతో జేయునది. అటుపైని సపిండీకరణము నొందిన యాయస్థులుగలవాని నుద్దేశించి పార్వణవిధిచే నస్థి క్షేపము నంగముగ శ్రాద్ధమును హిరణ్యముచే జేయవలెను. సత్తుపిండిచే బిండ దానము జేయునది. దశాహములోపున నస్థులు వ్రేసినచో నేకోద్దిష్టవిధిచేతనే శ్రాద్ధము. ఆపై దిలతర్పణముజేసి పంచగవ్యములు పంచామృత శుద్ధోదకమును వీనిచే నస్థులు గడిగి కలపముబూసి పుష్పములబూజించి కృష్ణాజినము కంబళి భూర్జపత్రము గోనెయు భూర్జపత్రము తాళపత్రమును గ్రమముగ నేడేసిమారులు చుట్టి రాగిగబ్బిలో నుంచవలెను. అందుకలపము లక్షణము:- పండ్రెండుకర్షములు చందనము, కుంకుమ మారుకర్షములు, కర్పూరము నాల్గుకర్షములు, కస్తూరి నాల్గుకర్షములు గలపినచో గలపమనఁబడును. అటుప నస్థులలో బంగారు వెండికలశములును ముత్తెములు పగడములు నీలములు నుంచి తమతమ సూత్రోక్తవిధిచే స్థండిలమందగ్ని బ్రతిష్ఠించి నూటయెనిమిది తిలాజ్యాహుతులు వ్రేల్చవలెను. "ఉదీరతాం శంఖః పితరస్త్రిష్టుప్ అస్థిప్రక్షేపాంగతిలా జ్యహోమే వినియోగః" అని 'యుదీరతా' మను సూక్తము యొక్క పదునాల్గు ఋక్కులచే పదునాల్గాహుతులు చొప్పున సూక్తము నేడు మారు లావృత్తిజేసియు మిగిలిన పదియాహుతులును ప్రథమఋక్కునావృత్తి జేసియు నిట్లు నూటయెనిమిది తిలాహుతులు నన్నియే యాజ్యాహుతులును వ్రేల్చునది. అటుపై నట్లమర్చిన యస్థుల డబ్బీని పట్టుకొని తీర్థమునకు వెళ్ళవలెను. అప్పుడు నియమములు : మూత్రపురీషోత్సర్గ కాలమందును ఉనాచమనకాలమందును నస్థులు ధరింపగూడదు. శూద్రులు యవనులు నంత్యజులు మొదలగు తనకు తక్కువ జాతులను నస్థులు ధరించునపుడు ముట్టగూడదు. అని కాశీఖండమందున్నది. ఆపైని తీర్థమునొంది తీర్థప్రాప్తి నిమిత్తకమైన స్నానదానాదులుచేసి యస్థులు దడపి 'అముకగోత్రస్యాముక శర్మణో బ్రహ్మలోకాది ప్రాప్తయేఽ ముక తీర్థేక్షిప్రక్షేపమహం కరిష్యే' యని సంకల్పించి, మోదుగాకు దొప్పలో నుంచి పంచగవ్యముచే నస్థుల

దడిపి హిరణ్యశకలమాల్య ఘృతతిలమిశ్రితమైన యస్థులను మృత్పిండమునందుంచి దక్షిణదిక్కును జూచుచు 'నమోస్తుధర్మాయ'యని పలుకుచు దీర్థమందు దిగి బొడ్డుబంటి నీటిలో నిలచియుండి 'సమేప్రీతోస్తు' అని తీర్థమందు విడువవలెను. ఆపైని స్నానముజేసి యొడ్డుజేరి సూర్యునిజూచి హరిస్మరణజేసి యథాశక్తి రజతము బ్రాహ్మణునికీయవలెను అపుడు మంత్రము 'అముకస్యాస్థిక్షేపః కృతస్తత్సాంగతా సిద్ధ్యర్థ మిదం రజతం తుభ్యమహం సంప్రదదే' యని ఇట్లస్థిక్షేపవిధి.

## పదునొకొండవ దినమందు కృత్యము

ఆ దినమందు బ్రాతఃకాలమున లేచి గృహశుద్ధిజేసి ముట్టినయన్ని బట్టలుదడపి సపిండులందరు సచేలస్నానముజేసినపైని సంధ్యాపంచమహా యజ్ఞముల జేయుటకు శుద్ధియగును. ఆదినమందు సంగవకాలమున స్నానముజేసినచో శుద్ధియని కొందరు, ఏకాదశదినమందు బుత్రాదికర్తకు సహితము బంచమహాయజ్ఞాధికారము సపిండులకు దర్శవార్షిక శ్రాద్ధములందు నధికారము. నాందీశ్రాద్ధము మాత్రము నల్గురు పురుషుల లోని సపిండులు సపిండీకరణమునకు మున్ను చేయఁగూడదు. అటుపైని దశాహాంత కర్మనుజేసిన యముఖ్యకర్తగాని ముఖ్యకర్తయగు పుత్రాదికముగాని వృషోత్సర్గము మొదలగు నేకాదశాహకర్మను జేయవలెను. "ఏకాదశాహే ప్రేతస్య యస్యనో త్సృజ్యతే వృషః, ప్రేతత్వం సుస్థిరం తస్య దత్తైశ్శ్రాద్ధశతై రపి."

అనఁగా బదునొకొండవ దినమందు వృషోత్సర్గము జేయనియెడ శ్రాద్ధములు నూరుజేసినను బ్రేతత్వము వదల దనుట. అపుడు స్వయముగానే సర్వమును జేయు నది గాని కామ్యవృషోత్సర్గమందువలె నాచార్యుని వరింప నక్కరలేదు. ఇది గృహ మందు జేయఁగూడదు. ఇది ద్వాదశదినమందును విధింపఁబడినది. క్వచిత్తుగా మృతదినమందును జెప్పఁబడినది. "విషువ ద్వితయే చైవ మృతాహే బాంధవస్యచ" యని. అనఁగా మేషతులా సంక్రాంతులందును బంధుమృత దినమందును వృషోత్స ర్గము జేయవలెననుట. "వత్సరాభ్యంతరే పిత్రోర్వబృషస్యో త్సర్గకర్మణి, వృద్ధిశ్రాద్ధం నకుర్వీత తన్యత్ర సమారభేత్." అనఁగా దలిదండ్రుల కర్మకు సంవత్సరములోపు నను వృషోత్సర్గమందును వృద్ధిశ్రాద్ధము గూడదు. మరియొకప్పుడైనచో జేయవలె ననుట, వృషలక్షణము : "లోహితోయస్తు వర్ణేన ముఖేపుచ్ఛే చ పాండరః శ్వేతః ఖురవిషాణాభ్యాం సనీలో వృష ఉచ్యతే.' అనఁగా దేహమంతట నెర్రనిదై ముఖము తోఁకయు డెక్కలు కొమ్ములు తెల్లనిదైయుండునది నీలవృషమని చెప్పబడును. లేదా తెల్లనిదానికి ముఖపుచ్ఛాదులు నల్లనివైనయెడ నీలమనబడును. ఇట్లు నల్లని దానిని ముఖాదులు తెల్లవినచో నీలమనఁబడును. కొందరు వృషభము దొరకకున్నను మన్నుచే గాని పిండిచేగాని వృషభముజేసి హోమాదివిధిచే వృషోత్సర్గము జేయవచ్చు నంద్రు. యథోక్తమైన వృషభము దొరకనియెడ యథాలాభముగ రెండువర్షములది గాని యొకవర్షముదిగాని వృషభమైనను సంవత్సరముదాటిని వత్సతరు లనగ నావు పడ్డలునాలుగైనను నొకటియైనను నచ్చువిడువగూడును. ఇక దాని ప్రయోగము తమతమ సూత్రానుసారముగ దెలియవలెను. ఎడమచేతితో దోఁకఁబట్టుకొని కుడిచేతితో గుశతిలయుక్తమైన జలముపట్టుకొని ప్రేత గోత్రమునుచ్చరించి "అముకస్మై వృష ఏషమయాదత్త స్తంతారయతు" అని సువర్ణముతోగూడ జలము భూమి యందు

విడువవలెను. “విధారయే న్నతం కశ్చి న్న కశ్చన వాహయేత్, నదోహ యేచ్చ తాం ధేనుం నచ కశ్చన బంధయేత్.” అనగా నచ్చువిడిచిన వృషభము నెవ్వఁడును గట్టఁగూడదు. భారము మోయింపఁగూడదు. ఆపైనచో బితుకఁగూడదు. దాని గట్టఁగూడదు. పతిపుత్రులుగల సువాసిని మృతినొందినచో వృషోత్సర్గమక్కర లేదు. దానికి బదులుగా గోదానము జేయునది. పతిపుత్రులతలో నొక్కఁడు లేకున్నచో స్త్రీలకు సహితము వృషోత్సర్గము గావలయును. సహగమనమందు స్త్రీలకు వృషోత్సర్గ స్థానమందు గోదానమే. వృషోత్సర్గ సాంగతాసిద్ధికై తిలోదకుంభధేను వస్త్ర హిరణ్య దానము లైదును జేయునది. ఏకాదశ దినమందు మఱియొక యాశౌచము వచ్చినను వృషోత్సర్గము నాద్యమాసికము శయ్యా దినదానములును జేయవచ్చును. ఇట్లు యథావిధిగ నీలవృషోత్సర్గము జేసినచో నశ్వమేధఫలమగును. మృత్యు నుద్దేశించి చేసినచో నతని కుత్కృష్టగతి గల్గును. ఇట్లు వృషోత్సర్గము.

## ఏకాదశాహమ హైకోద్దిష్టము

ఇది షోడశశ్రాద్ధములకంటె భిన్నము. కనుకనే ముందుజేయఁబోయెడు సర్వై కోద్దిష్టములకు బ్రకృతి యనఁబడును. ఇదియు పాకముచేతనే చేయునది. అందు సంభవించినచో విప్రునికిఁబెట్టవలెను. లేనిచో నగ్నియందుహోమము. ఇట్లు వచనము –1 ‘బ్రాహ్మణం భోజయేదాద్యే హోతవ్యమనలేఽథవా’ యని అపుడు విప్రునికి క్షౌరము నఖచ్ఛేదము జేయించి స్నానాభ్యంజనములిచ్చి యాపైని క్షణము పాద్యము నర్ఘ్య మాసనము గంధము పుష్పము వస్త్రమును మాత్ర మీయవలెను. ధూప దీపము లక్కరలేదు. ‘ఏకోద్దిష్టం దేవహీన’మని యున్నందున నొక్కడే విప్రుఁడు పగలే నిమంత్ర ణము, ఒకటియే యర్ఘ్యపాత్రము. ‘స్వధానమః’ పితృశబ్దము లుచ్చరింపఁ గూఁ డదు. కనుక ‘ప్రత్తఃప్రేత ఇమాన్ లోకాన్ ప్రీణయాహినః’ అని మంత్రమం దూహయు నర్ఘ్య పాత్రమందుగావలెను. అభిశ్రవణ మక్కరలేదు. సర్వము ప్రాచీనావీతిగనే చేయ వలెను. అగ్నౌకరణము వికల్పము. అపుడు పాణిహోమము జేసినను నదిభక్షింపఁ గూడదు. అగ్నియందుఁ బడవ్రేయునది. ఒక్కటిచే పిండము. అను మంత్రణాదు లన్నియు మంత్రహీనముగనే, స్వదితమనితృప్తి ప్రశ్నము కాత్యాయనులకే అక్షయస్థాన మందు ‘నుపతిష్ఠతాం’ అనవలెను. ‘అభిరమ్యతాం’ అని విసర్జనము.

‘అభిరతాస్మ్స’ యని ప్రతివచనము. శ్రాద్ధ శేష భోజనమక్కరలేదు. అంత మందు స్నానము చేయునది. నవశ్రాద్ధేకోద్దిష్ట మందు సర్వమును మంత్రహీనమని చెప్పఁబడినది. విప్రుఁడు దొరకనిచో నగ్నియందేకోద్దిష్ట మెట్లనిన; అగ్నియందుఁ బాయసమును వండి యాజ్యభాగాంతమందు నగ్ని కగ్ని శ్రాద్ధ ప్రయోగముజేసి యగ్ని యందు బ్రేతనావాహించి గంధాదులచే బూజించి, ‘పృథ్వీతేపాత్ర’ యని మొదలగు దానిచే నన్నము సంకల్పించి ‘ఉదీరతామవర’ యని మొదలగు నెనిమిదిం టిచే నాలుగావృత్తులుచేసి ముప్పది రెండు నాహుతులను వ్రేల్చి పిండదానము మొద లుగ శ్రాద్ధము సమాప్తిజేయవలెను. ఇట్లు యేకోద్దిష్టము స్త్రీలకును చేయునది. ఇక నాద్యమాసీకము. ఉదానికి ‘మాసాదౌమాసికంకార్య’ మని యున్నందున మృతదినమే ముఖ్యము. అది యాశౌచ ప్రతిబంధకముచే దాటిపోయినందున నేకాదశ దినమందు జేయవలయును. కనుకనే “బ్రాహ్మణం భోజయే దాద్యే హోత్రవ్య మనలేథవా, పునశ్చ

భోజయేద్విప్రం ద్విరావృత్తిర్భవే దిహ." యని ప్రథమ మాసికము నిమిత్తమే ద్విరావృత్తి చెప్పఁబడినది. ఇట్లు 'ద్విరావృత్తిర్భవే దిహ' యని చెప్పుటయు సపిండీకరణాధికారము కొఱకపకర్షించిన షోడశమాసికములు పండ్రెండవ రోజునజేయు పక్షమందే యని తెలియునది. అట్లుగాక యేకాదశాహమందు జేయుపక్షముననైనచో షోడశమాసికము లకు షోడశావృత్తులు నొకటి మహైకోద్దిష్టము నని పదునేడావృత్తులు గలుగుచుండఁ గ ద్విరావృత్తియనుట యసంగతమగును. కాఁబట్టి సపిండ్యధికారసిద్ధికై యపకర్షిం చిన మాసికములు ద్వాదశాహదినమందును జేయుపక్షమున నేకాదశ దినమందు మహైకోద్దిష్ట మైనపైని 'నతిక్రాంతాద్య మాసికం కరిష్యే' యని సంకల్పించి యాద్య మాసికము మాత్రమన్నముచే గాని యామముచే గాని విప్రునియందైనను దర్భవటువు నందైనను ప్రేత నావాహించి చేయవలెనుగాని యాద్యమాసికము నగ్నియందు హోమము జేయఁగూడదు. ఏమనిన; 'పునశ్చభోజయే ద్విప్ర'మని విశేషవచనమున్నది. కనుక నాద్యమాసిక మొదటియు మహైకోద్దిష్ట మొకటియు నని యేకోద్దిష్టమునకు ద్విరావృత్తి స్పష్టమే. ఇఁక నాద్యమాసికము విడచి యేకోద్దిష్టమునకే ద్విరావృత్తి యనువారు భ్రాంతులు. కొందరాద్యాబ్దికమునకును మృతదినమే ముఖ్యకాలమది దాటిపోయినందున నేకాదశ దినమందు 'నాద్యమాసికమాద్యాబ్ధికంచ తంత్రేణ కరిష్యే' యని సంకల్పించి రెండును దంత్రముచే జేయవలెనంద్రు. ఇతరులు 'మాసాదౌ మాసికం కార్యమాబ్దికం వత్సరేగతే' యని యున్నందున రెండవ సంవత్సరము మొదటనే యాబ్దికము దాని యేకాదశాహమందు గూఁడ దంద్రు. ఇట్లు తృతీయ పక్షమందు సపిండీకరణముజేయునెడ నేకాదశ దినమందు నాద్యమాసికము నూన మాసమందూన మాసికమును ద్వితీయమాసారంభమందు ద్వితీయమాసికమును దృతీయపక్షమందు త్రైపక్షికము నేకోద్దిష్టవిధిచే జేసి మిగిలిన పండ్రెండు మాసికములు నపకర్షించి యట్లుజేసి సపిండీకరణము చేయవలయును. ఇట్లు పక్షాంతరములందు నూహించునది. ఏకాదశదినమందు షోడశమాసికముల దంత్రముచే జేయు పక్షమున కును హైకోద్దిష్టమైన పైని దేశకాలములఁగీర్తించి 'అతిక్రాంతమాద్యమాసికం సపిండ్యధి కారార్థ మపకృష్యోన మాసికాదీ న్యూనాబికాం తాని పంచదశ మాసికానిచ తంత్రేణై కోద్దిష్టేన విధినాకరిష్యే' యని సంకల్పించి తంత్రముచే బదారును జేయవలెను. మీఁదఁజెప్పిన కేచిన్మతమంద్రై నచో 'అతిక్రాంతే ఆద్యమాసికాద్యాబ్దికే ఊనాదిమాసికా దీని చ ' యని మొదలగు సంకల్పము. మాసికము లెవ్వియనిన; ఆద్యమాసికం 1. ఊనామాసికం 2. ద్వితీయ మాసికం 3. త్రైపక్షికం 4. తృతీయమాసికం 5. చతుర్థ మాసికం 6. పంచమ మాసికం 7.షష్ఠం 8. ఊనషాణ్మాసికం 9. సప్తమాసికం 10. అష్టమం 11. నవమం 12. దశమం 13. ఏకాదశం 14. ద్వాదశం 15. ఊనాబ్దికం 16 నని యివి క్రమముగఁ దెలియునది.

## రుద్ర గణశ్రాద్ధము

ఆ దినమందే యేకాదశరుద్రుల నుద్దేశించి రుద్రరూపిగా బ్రేతనుద్దేశించి గాని చేయవలెను. రుద్రోద్దేశ్యమునజేయుచో సవ్యముచేతను ప్రేతరూపతోద్దేశ్యమున నపసవ్యముచేతను చేయవలెను. వీరభద్రుఁడు శంభుఁడు, గిరీశుఁడు, అజైకపాత్తు, అహిర్బుధ్న్యుఁడు, పినాకి, అపరాజితుఁడు, భువనాధీశ్వరుఁడు, కపాలి, యుపస్థాణువు,

భగుఁడునని యేకాదశరుద్రులు. అందు శక్తుఁడైనచో నొక్కొకరుద్రనామముచే నొక్కొక విప్రుఁడని యేకాదశవిప్రుల భుజింపజేయవలెను. అశక్తిలో సర్వోద్దేశ్యముచే నొక విప్రునినైన భుజింపఁజేయవలెను. ఆమాన్నములు పదునొకండైనను నొకటియైె నను నీయవలెను. ఈశ్రాద్ధమందు పిండదానము నర్ఘ్యమగ్నౌకరణము వికిరము వర్జ్యములు.

## అష్టవసు శ్రాద్ధము.

ఇది కృతాకృతము. వసునామములను గ్రంథాంతరమందుఁ దెలియునది. ఇది యేకాదశాహకృత్యము. మూడురోజులే యాశౌచమైనచో నాల్గవదినమందు జేయవలెను. ద్వితీయ దినమందుగాని ప్రథమదినమందుగాని యస్థిసంచయనము గావలెను. అయిదవదినము సపిండీకరణము. ఇక్కడ నేకాదశ దినమందుగాని ద్వాదశ దినమందుగాని పదిదానములు చేయవలెను. అట్లైనచో ప్రేతకుమార్గమందు సుఖ గమనమగును. "ఆసనోపానహచ్ఛత్రం ముద్రికాచక మండలుః, యజ్ఞోపవీతాజ్యవస్త్రం భోజనంచాన్న భాజనం, దశకం పదమేతత్స్యా త్పదాన్యేవం త్రయోదశ, దేయాని వాయథాశక్తితేనా సౌప్రీణితోభవేత్." అనఁగా నాసనము పాదరక్షలు గొడుగు నుంగ రము కమండలువు యజ్ఞోపవీతమాజ్యము వస్త్రము భోజనము నన్నపాత్రయునను పదియును పదసంజ్ఞికములు. ఇవి పదుమూడుగాని యథాశక్తిగగాని జేసినచో ప్రేత ప్రీతుడగును. 'అన్నంచైవోదకుంభంచో పానహౌచకమండలుః, ఛత్రం వస్త్రం తథా యష్టిం లోహదండం చ దాపయేత్, అగ్నిష్టికాం ప్రదీపంచ తిలాం స్తాంబూల మేవ చ, చందనం పుష్పమాలాంచో పదానాని చతుర్దశః" అనఁగా అన్నమును దకుంభము పాదరక్షలు కమండలువు ఛత్రము వస్త్రము గఱ్ఱయు లోహదండము కొఱవియు దీపము తిలలు తాంబూలము చందనము పుష్పమాల యివి పదునాల్గు నుపదాన ములు. మరియు వైతరణీ ధేనూత్క్రాంతి ధేనుమోక్ష ధేన్వాది దానములు గోభూతిలాది దశదానములును తిలపాత్ర దానము మొదలగునవియు మరణకాలము నందు జేయనియెడ నేకాదశాది దినములందు జేయవలయును. "అశ్వం రథం గజం ధేనుం మహిషీంశిబికాదికం, సాలగ్రామం పుస్తకంచ కస్తూరీ కుంకుమాదికం, దాసీం రత్నం భూషణాది శయ్యాం ఛత్రం చ చామరం, దద్యా ద్విత్తానుసారేణ ప్రేతస్తత్తత్సుఖం లభేత్." అనఁగా దీనిలో చెప్పినవానిని యథాశక్తిగ దానము జేసినచో నాయా సుఖములను ప్రేతపొందును.

## శయ్యాదానము

"ఏకాదశాహే శయ్యాయా దాన ఏష విధిస్మృతః, తేనోప భుక్తం యత్కించి ద్వస్త్ర వాహన భాజనం, యద్యదిష్టంచ తస్యాసీత్తత్సర్వం పరికల్పయేత్, ప్రేతం చ పురుషం హైమంతస్యాంసంస్థాపయేత్తదా, పూజయిత్వా ప్రదాతవ్యా మృతశయ్యా యథోదితా, తస్మాచ్ఛయ్యాం సమాసాద్య సారదారు మయీాం దృఢాం "దంతపత్ర చితాం రమ్యాం హేమపట్టై రలంకృతాం, హంసతూలీ పరిచ్ఛన్నాం శుభగండోపధాని కాం, ప్రచ్ఛాదనపటీ యుక్తాం గంధరూపాది వాసితాం, ఉచ్ఛీర్షకే ఘృతభృతం కలశం పరికల్పయేత్, తాంబూల కుంకుమక్షోద కర్పూరాగరుచందనం, దీపికోపానహచ్ఛత్ర చామరాసనభాజవం, పార్శ్వేషు స్థాపయే ద్భక్త్యా సప్తధాన్యానిచైవ హి, శయసస్థస్యభవతి

యదన్య దుపకారకం, భృంగారు కరకాద్యంత త్పంచవర్ణ వితానకం, సంపూజ్య ద్విజదాంపత్యం నానాభరణభూషితం, ఉపవేశ్యతు శయ్యాయాం మధుపర్కంతతో వదేత్.” అనఁగా శయ్యాదానవిధి నిట్లు దెలియవలెను. మృతుఁడైన వానిచే జీవించి యున్నపుడు ననుభవింపబడిన వస్త్రములు వాహనములు భూషణములును, మఱియు నేదియేది యతనికిష్టమైయుండెనో యావస్తువులన్నియు సిద్ధముజేసి సువర్ణ ముచే ప్రేత పురుషుని నిర్మించి శయ్యయందుంచి పూజించి మృతశయ్యను దానమీయ వలెను. కనుక సారమైన కట్టుచేజేసిన దృఢమైన శయ్యకు దంతపుకోళ్లు బంగారు రేకులతాపడము హంసతూలికాతల్పము మంగళమైనలోడులు తలాడలుపట్టు దుప్పట్లు గంధధూపములచే వాసనలు మొదలగు నుపకరణములన్నియు మంచివి గలుగజేసి పార్శ్వములందు తాంబూలము కుంకుపువ్వు కర్పూరము నగురు చందనముతో నింపినపాత్రలు దీపములు పాదరక్షలు గొడుగు చామరములు కుర్చీలు పాత్రలు మొదలగునవియు సప్తధాన్యములును తలయంపిని ఘృతపూర్ణమైన కలశము నమర్చి మఱియు శయ్యపై నుండు వారి కుపచరించెడు గిన్నెలును పన్నీరుబుడ్లు. చెంబులు మొదలగునవియు నుంచి యైదురంగుల జూలుగల పందిరితో గూడునట్లుజేసి ద్విజదంపతులను నానామణి భూషణములచే నలంకరించి పూజించి యాశయ్య యందు గూర్చుండబెట్టి మధుపర్క మీయవలెను. అపుడు దానమంత్రము. “యథాన కృష్ణశయనం శూన్యం సాగరజాతయా, శయ్యా తస్యాప్య శూన్యాతుతధాజన్మనిజన్మని.” శ్లో॥ తస్మాదశూన్యం శయనం కేశవస్య శివస్యచ శయ్యా తస్యాప్య శూన్యాస్యాత్తథా జన్మనిజన్మని” అని యుచ్చరింపుచు మీఁదఁజెప్పినవి యన్నియునిచ్చి నమస్కరించి పపంవలెను. పద్మపురాణమందు “అస్థిలాలాటకం గృహ్యాసూక్ష్మం కృత్వా సపాయసం, భోజయేద్ద్విజ దాంపత్యం విధిరేషసనాతనః” అని. యనఁగా మృతునిలలాటాస్థిని చూర్ణముజేసి పాయసముతో ద్విజదంపతులకు బెట్టవలెను. ఇది ప్రాచీనమైన విధియని యున్నదిగాని మహారాష్ట్రాది దేశములందలి శిష్టులు దీనినాదరించలేదు. పోనిమ్ము ఏదేశమందట్టి యాచారమున్నదో యక్కడ గావచ్చును. శ్లో॥“స్వర్గే పురందర పురే లోకపాలాలయేతథా, సుఖేవసత్య సౌజంతు శ్శయ్యాదానిప్రభావతః” అనఁగా నట్లు శయ్యాదానము ప్రేతనుద్దేశించి చేసినయెడ స్వర్గమను నింద్రపట్టణ మందును దిక్పాలురపట్టణములందును నతఁడు సుఖించును. మఱియును బ్రళయ పర్యంత మచ్చటనే యుండును.“శ్లో॥ ప్రేతశయ్యా ప్రతిగ్రాహీ నభూయః పురుషో జన్మాత్ గృహీతాయాంతు తస్యాంవై పునస్సంస్కారమర్హతి.” అనఁగానట్టి ప్రేతశయ్యా దానముఁ బట్టినవాఁడు తిరుగబురుషజన్మమెత్తడు దానముఁబట్టగానేపునరుప నయనము గావలెను. ఇక నుదకుంభదానము. శ్లో॥“ఏకాదశాహాత్ప్రభృతి ఘటస్తోయాన్న సం యుతః దినేదినే ప్రదాతవ్యో యావత్సంవత్సరంసుతైః, యస్య సంవత్సరాదర్వాక్ సపిండీకరణం భవేత్, మాసికంచోదకుంభంచ దేయంతస్యాపివత్సరం, అపిశ్రౌద్ధ శతైర్దత్తైరుదకుంభం వినానరాః, దరిద్రాదుఃఖినస్తాత భ్రమంతి చ భవార్ణవే, యావదబ్దంచ యో దద్యాదుదకుంభం విమత్సరః, ప్రేతాయాన్ని సమా యుక్తం సోశ్వమేధఫలం లభేత్.” అనఁగా పదునొకండవదినము మొదలుకొని యుదక ముతో నన్నముతో గూడిన ఘటము సంవత్సర పర్యంతము ప్రతిదినమందు నీయ వలెను.

సంవత్సరములోపున సపిండీకరణము జేసినను నుదకుంభము వత్సరపర్యంత మీయ వలెను. ఉదకుంభ శ్రాద్ధము మాని నూరుశ్రాద్ధములు చేసినను మృతులు దరిద్రులు దుఃఖవంతులునై సంసార సముద్రమున దిరుగుదురు.

## ఉదకుంభ శ్రాద్ధము

మఱియు నట్లుదకుంభ శ్రాద్ధము జేసిన కర్తయు నశ్వమేధఫలము నొందును. ఈయుదకుంభ శ్రాద్ధము సపిండీకరణమునకు మున్నేకోద్దిష్ట విధిచేతను నటుపైని పార్వణవిధిచేతను గావలెను. ఇది పదుమూడవ దినము మొదలుగ జేయవలెనని భట్టమతము. ఇక్కడ పిండదానము కృతాకృతము దేవహీనము గూఁడనగును. అట్లు వచనము– 'అదైవంపార్వణం శ్రాద్ధం సోదకుంభమధర్మకం, కుర్యాత్ప్రత్యాబ్దికా ఛ్రాద్ధాత్సం కల్పవిధినాన్వహం' అని యనఁగా నుదకుంభశ్రాద్ధము పార్వణవిధిచే దేవహీనముగను సంకల్పవిధి గనుక ధర్మహీనముగను ప్రత్యాబ్దికము ప్రతిదినమం దునుఁ జేయునదియనుట. అనఁగా ప్రాయశ్చిత్తమున కంగమైన విష్ణుశ్రాద్ధమువలె సర్వశ్రాద్ధధర్మము లిక్కడ నుండవు. మరియేమనిన; చెప్పినవి మాత్రమే చేయవలెను. కనుక సంకల్పము క్షణదానము పాద్యాసనగంధఆచ్ఛాదనాంతపూజయు నన్నము వడ్డించినపైని 'పృథ్వీ తేపాత్ర' మను మంత్రముచే 'ఏషుదకుంభ ఇదమన్నందత్తం చ' యని త్యాగముజేసి యంతమున తాంబూల దక్షిణాదికమీయవలెను. ఇక్కడ బ్రహ్మచర్యము తిరుగ భోజనము లేకుండుట మొదలగు నియమములక్కరలేదు. వృద్ధి శ్రాద్ధముజేయనుద్దేశించి మాసికముల నపకర్షించినచో నుదకుంభ శ్రాద్ధములకు నపకర్షముజేయునది. అనఁగా నుదకుంభశ్రాద్ధములును ప్రేతశ్రాద్ధములే గనుక ప్రతిదినమును జేయ నశక్తుడైనను నొక దినమందన్ని శ్రాద్ధముకు దగినంతయామ ద్రవ్యములు నుదకుంభములును లేదా వానికి దగిన నిష్క్రయద్రవ్యమైనను నీయ వలెను. ప్రతిదినమును జేయుపక్షమున మధ్యమందు నాశౌచమువచ్చినచో నాదిన ముల శ్రాద్ధములకు లోపమేయగును. అట్లుగాక యితర ప్రతిబంధకముచే మానిన యెడ ముందుజేయు నుదకుంభములలోగలిపి యతిక్రమించిన వాని దంత్రముచే జేయునది. 'అపుడతిక్రాంతోదకుంభ శ్రాద్ధాన్యద్యత నోదకుంభశ్రాద్ధే నసహతంత్రేణ కరిష్యే' యని సంకల్పము. ఇట్లు ప్రతమాబ్దమందు దీపదానము గూడఁజెప్పబడినది. ఎట్లనిన; శ్లో॥ "ప్రత్యహందీపకోదేయో మార్గేతువిషమేనరైః, యావత్సంవత్సరంవాపి ప్రేతస్య సుఖలిప్సయా, ప్రాఙ్ముఖోతఙ్ముఖందీపం దేవాగారేద్విజాలయే, కుర్యాద్యామ్య ముఖిం పిత్రైఆద్భిస్సంకల్ప్య సుస్థిరం" అని. యనఁగా సంవత్సరం పర్యంతము ప్రతి దినమును విషమమార్గమందు ప్రేతనుద్దేశించి దీపముంచినచో నతనికి సుఖ మగును. దీపము దేవాలయమందును ద్విజగృహమందును తూర్పునకు నుత్తర మునకు నభిముఖముగా నుంచవలెను. పితృకర్మయందు దక్షిణముఖముగ నుంచునది.

## పదియారు మాసికములు

ఊనమాసికము, త్రైపక్షికము, నూనషాణ్మాసికము, నూనాబ్దికమను నాల్గునుఁ బంద్రెండు మాసికములును గలసి పదారనిగ్రహించునది. ఇక్కడ మతాంతరములు నిర్ణయసింధువునఁ జూడవలెను. ఇక వీనికి గాలనిర్ణయము. శ్లో. "మాసాదౌమాసికం కార్య మాద్యం త్వేకాదశేహని, ఏకద్విత్రిదినైరూనేత్రిభాగేనోన ఏనవా, ఊనమాసిక

మూనాబ్దమూన షాణ్మాసికంచరేత్, త్రైపక్షికంత్రిపక్షేచోనమాస్యంద్వాదశేహ్నివా" అనఁగా మాసము మొదలిటిదినముందు మాసికశ్రాద్ధముఁ జేయునది. ఆద్యమాసికమేకాదశ దినమందుఁ జేయునది. ఊనమాసికము నూనషాణ్మాసికము నూనాబ్ధికమును నొకదినము రెండుదినములు మూడుదినములు తక్కువగానైన దినములందుఁ జేయలెను. లేదా మూఁడవభాగము తక్కువగానైనఁ జేయవచ్చును. త్రైపక్షికము మూడవ పక్షమున జేయునది. ఊనమాసికము పంద్రెండవదినమందును జేయవచ్చును. అందు నూనమాసికాదులకు నొకదినము తక్కువయనుపక్షమున బంచమియందు మృతుఁడైనవానికి తిరుగవచ్చు తదియయందగును. రెండు దినములు తక్కువ యనుపక్షమున విదియ యందగును. మూఁడు దినములు తక్కువఁ జేయునపుడు ప్రతిపదయందగును అనిగొందరు. మాధవుడుమాత్ర మూనషాణ్మాసికము నూనాబ్దికమును మృతాహస్సునకంటె బూర్వదినమందేఁ జేయవలెననియే. త్రైపక్షికము మూడవపక్షము దాటినపైని మృతదినమందు జేయునది. ఇక్కడ నాహితాగ్నికి విశేషము. త్రైపక్షిక పర్యంతమైనది. సంస్కారతిథియందును నాపై శ్రాద్ధములు ప్రత్యాబ్దికమును మృతతిథియందును జేయవలెనని కనుక నాద్యమాసికము దాహదినమునకు నేకాదశ దినమందగును. మూఁడు మాసములపైని సంస్కారమగునో నిట్లుతోఁచుచున్నది. త్రైపక్షిక పర్యంతమైనవి దాహతిథియందు జేసి తక్కినవి యతిక్రమించినచో మృతతిథియందు ప్రాప్తమైన మాసికముతో గలపి చేయవలెనని భావము.

## నూనశ్రాద్ధములలో వర్జ్యములు

"త్రిపుష్కరేషు నందాసు సినీవాల్యాం భృగోర్దినే, చతుర్దశ్యాంచ నోనానికృత్తికాసు ద్విపుష్కరే." అనఁగా త్రిపుష్కరద్విపుష్కరయోగములు మీఁదఁ జెప్పఁబడినవి. వానియందును నందతిథులందును సినీవాలియను నమావాస్య యందును శుక్రవారమునందును చతుర్దశియందును కృత్తికయందును నూనమాసికముచేయఁగూడదు. ఆద్యమాసికమాద్యాబ్దికమును పదునొకండవ దినమందలి యొకమతము. ఆద్యమాసికము మాత్రమేకాదశ దినమందుగాని ప్రథమాబ్దికము ద్వితీయ వర్షారంభమందే యని రెండవ మతముఁ జెప్పఁబడినది. ఈషోడశ శ్రాద్ధములును వత్సరాంతమందు సపిండీకరణము జేయుపక్షమందు నాయాతిథులందేకోద్దిష్టవిధిచే జేయవలెను. పంద్రెండవ దినము మొదలగు వానిలో నపకర్షించి సపిండీకరణము జేయునెడ నన్నియు నపకర్షించి యొకదినమందే యొకమారే యేకోద్దిష్టవిధిచేఁ జేయవలెను. ఏమనిన; 'శ్రాద్ధాని షోడశాదత్వానతుకుర్యాత్సపిండనం' అని షోడశశ్రాద్ధములు చేయనిచో సపిండీకరణమునకే యధికారములేదు. ఇవి పక్వాన్నముచేగాని యామాన్నముచే గాని, చేయవచ్చును. పాకము జేయునపుడన్నిటికి నొకపాకమే. విప్రులు నర్ఘ్యములు పిండములు బదియారేసి గావలెను. ఇట్లు సపిండీకరణమునకై యపకర్షించి చేసినను నటుపైని వానివాని కాలమందు పార్వణ విధిచే దిరుగ జేయవలెను. అట్లు వచనములు. "యస్య సంవత్సరాదర్వాగ్వి హితాతు సపిండతా, విధివత్తాని కుర్వీత పునశ్రాద్ధానిషోడశ, అర్వాక్సం వత్సరాద్యస్య సపిండీకరణం కృతం, షోడశానాం ద్విరావృత్తిం కుర్యాదిత్యాహ గౌతమః" అని యిట్లు పదియారుమాసికములకు ద్విరావృత్తి జెప్పుట పదునొకండవ దినమందు సపిండీకరణముజేయు పక్షమున నని తెలియవలెను.

అపుడాద్యమాసికమునకు గాలమున్నది. పంౘ్రెండవదినమందు సపిండీకరణమైనచో బదునైదిటికే ద్విరావృత్తి యగును. మూడవపక్షమందు సపిండీకరణము జేయునెడ నాద్యమాసికమును నూనమాసికము ద్వితీయమాసికమును యథాకాలమున జేయ బడును గనుక నపకర్షించి చేయువానికే ద్విరావృత్తి విధించినందునను వానికి యథోక్త కాలము లేనందునను పదుమూడు మాసికములకే పునరావృత్తియగును. ఇట్లితర పక్షములందును యథాసంభవముగ నూహించునది. ఇఁక ద్వాదశదినమందు సపిండనముజేసి త్రయోదశ దినము మొదలగు వానియందు నాద్యమాసికముతో షోడశమాసికముల కావృత్తిని గొందరు జేసిరేని వారు భ్రాంతులు. ఇఁక సంవత్సర మధ్యం దధికమాసము వచ్చునేని యాయాసమందైన మాసికము నధికమందును శుద్ధమందు నావృత్తిచే జేయవలెను గనుక నపుడు పదునేడు మాసికములగును. మల మాసమందు మృతుడైనయెడ నేకాదశ దినమందాద్య మాసికముజేసి రెండవ మాసమందు మృతతిథియందు నది తిరుగఁజేసి కొంచెము తక్కువగా ద్వితీయమాస మందు నూనమాసికమును మూఁడవమాసము మొదట ద్వితీయమాసికమును రెండు మాసములన్నరయైన యంతమున ద్రైపక్షికమునుగావలెను. సపిండనానంతరమున మిగిలిన మాసికములు స్వస్వకాలమందే చేయవలెను. నలుగురు పురుషులలోగానైన సపిండులందు వృద్ధిశ్రాద్ధము సంభవించినచో నట్లునట్లు సంభవించు మాసములో నొకరోజుననే యన్నిమాసికములు నపకర్షించి చేయవచ్చును. అట్లువచనము–"ప్రేత శ్రాద్ధాని సర్వాణి సపిండీకరణంతథా, అపకృష్యాపికుర్వీత కర్తుంనాందీ ముఖంద్విజః " అని యున్నది. అందొక్కటియే పాకము. షోడశ శ్రాద్ధములైనచో బదార్గురు బ్రాహ్మ ణులు నలువదెనిమిది పిండములు. పురూరవార్ద్రవిశ్వేదేవార్థముగ నొకవిప్రుఁడు నట్లన్నియు జేయునది. ఇట్లు పక్షాంతరములందు శ్రాద్ధసంఖ్య ననుసరించి బ్రాహ్మ ణాదుల నూహించునది. కొందరు పాకము వేర్వేరుగ జేయవలెనంద్రు. ఉదకుంభ శ్రాద్ధములును ప్రేతోద్దేశ్యకములగుటచే నపకర్షింపవలెనని చెప్పఁబడినది. వృద్ధి శ్రాద్ధము లేకయే మాసికముల నపకర్షించినచో దోషమని యుశనుడు. "వృద్ధిశ్రాద్ధ విహీనస్తు ప్రేతశ్రాద్ధానియశ్చరేత్, సశ్రాద్ధీనరకే ఘోరే పితృభిస్సహమజ్జతి." యని నలుగురు పురుషుల సపిండులలో నాధానాదులు సంభవించిన నపకర్షము చేయ వలెను. ఇక్కడ విశేషము పూర్వార్ధమందుఁ జెప్పఁబడినది. ఇఁక సూతకాదులచే నతిక్రమించిన మాసికములన్నియు నుత్తర మాసికముతో గలిపి పెట్టవలెనని చెప్పఁ బడినది. అపుడూనమాసికముగలవి నక్కరలేదు. అట్లు వచనము – 'ఊనేన మాసికం కార్యం నతూనం మాసికే నతు' అని.

## సపిండీకరణ విచారము

అందు సపిండమునకు గాలము – "నసపింద్యాగ్నిమాన్ పుత్రః పితృయజ్ఞం సమాచరేత్" అని యున్నందున పిత్రాదులు ముగ్గురిలోగాని మాత్రాదులు ముగ్గురిలో గాని యొకరికి మృతిగల్గినచో సాగ్నికుడైన పుత్రుడు పంౘ్రెండవదినమందు సపిండ నముజేసి ముందువచ్చెడి దర్శయందు పిండపితృయజ్ఞాదికము జేయునది. ఇక్కడ స్మార్తాగ్ని యున్నను సాగ్నికుడే యని తోచుచున్నది. అతనికిని పిండపితృయజ్ఞ మావశ్య కముగదా ప్రేతసాగ్నికుడైనచో మూడవపక్షమందే సపిండము. అట్లు వచనము.

"ప్రేతశ్చే దాహిదాగ్ని స్స్యా త్కర్తానగ్ని ర్యదాభవేత్, సపిండీకరణం తస్య కుర్యాత్పక్షే తృతీయకే" అని ఇక్కడ శ్రౌతాగ్నిగల వానినే యాహితాగ్ని పదము చెప్పును. కర్తృప్రేత లిద్దరు సాగ్నికులైనచో ద్దాశదినమందే సాపిండ్యము. అట్లువచనము. "సాగ్నికస్తు యదా కర్తా ప్రేతోవా ప్యగ్నిమాన్ భవేత్, ద్వాదశా హేతదాకుర్యాత్స పిండీకరణంపితుః " అని యున్నది. ఇద్దరు నిరగ్నికులైనచో, సపిండనకాలములనేకము."సపిండీకరణం కుర్యాద్యజమానస్త్వనగ్నిమాన్, అనాహితాగ్నేః ప్రేతస్య పూర్ణే సంవత్సరేథవా, ఏకాదశే మాసిషష్ఠే త్రిమాసేవాత్రిపక్షికే, మాసాం తేద్వాదశేవాహ్ని కుర్యా దేకాదశేహని, యద హర్వృద్ధిరాపన్నా తదహారేతి నిశ్చితం." అనఁగా ప్రేతయుగగర్తయు నాహితాగ్నులు గానియెడ సంవత్సరాంతమందుగాని పదునొకండవ మాసమందుగాని యారవమాస మందుగాని మూఁడవమాసమందుగాని మూఁడవపక్షమందుగాని ప్రథమమాసాంత మందుగాని పంద్రెండవదినమందుగాని పదునొకండవ దినమందుగాని సపిండీకర ణము చేయునది. మఱియును వృద్ధినిజేయు దినమందునగును. ఇట్లిచట వృద్ధి శ్రాద్ధము నిమిత్తమగునపకర్షము నిరగ్నికి జెప్పఁబడినదిగాని సంభవించినచో సాగ్నికి నిని యెఱుంగునది. ఇక్కడ వృద్ధియనఁగ చౌలోపనయన వివాదములు. సీమంతాది సంస్కరమందు వృద్ధిశ్రాద్ధమునకు లోపమేగాని యపకర్ష మక్కరలేదని కొందరు. ఇతరులు గర్భాధానము మొదలగు నన్నప్రాశనాంత సంస్కారములందు వృద్ధిశ్రాద్ధము జేయనిచో దోషముచెప్పియున్నందున నది యావశ్యకముగను సపిండనాపకర్షము చేయవలెనంద్రు కనుక చతుష్పురుష సపిండులలో గర్భాధానాదికమును జేయగూడ దంద్రు. కనుక పితామహుడు మృతినొందెనేని పౌత్రునికి వృద్ధిప్రాప్తమైనచో నప కర్షము సపిండీకరణాదులకు సిద్ధించును. ఇట్లావశ్యక వృద్ధికర్మ ప్రాప్తించినచో కనిష్ఠపుత్రుఁడు నన్యసపిండుడు శిష్యుఁడు మొదలగు గౌణకర్తలు గులమందు ప్రాప్తించిన వృద్ధికొఱకు సపిండనాదుల కపకర్షము చేయవచ్చును. అట్లు చేసినపైని ముఖ్యుడైన పుత్రుఁడు మొదలగుకర్త తిరుగ జేయనక్కరలేదు. వృద్ధినిమిత్తముగా నపకర్షము జేయుచో బునఃకరణము లేదు. ఏమనిన 'యేవాభద్రం దూషయంతి స్వధాభిః' అని శ్రుతిచే నిషిద్ధము. వృద్ధినిమిత్తము లేకుండగ గనిష్ఠాది గౌణకర్త లపకర్షించి చేసినను ముఖ్యకర్తలకు పుత్రాదులు తిరుగ జేయవలెను. ఏకాదశాహాంత కర్మకు బునరావృత్తిలేదని మీఁదఁజెప్పఁబడినది. మఱియు నావశ్యక వృద్ధికర్మయనఁ గ గత్యంతరము లేనిదనియర్థము. కనుక నవకాశ ముండెడు నిస్టాపూర్తములందుగాని సగతికములైన యుపనయన వివాహాదులందుగాని యపకర్షముఁ గూడదు. అగతిక మైనచో వివాహాదికమందును నపకర్షముఁ జేయవచ్చునని వ్యవస్థతెలియునది. "మఱియు ఆనంత్యాత్కులధర్మాణాం పుంసాంచైవా యుషఃక్షయాత్, అస్థిర త్వాచ్ఛరీరస్య ద్వాదశాహః ప్రశస్యతే" అనఁగా గులధర్మముల నంతములగుట నుండియు ననఁ గానిచట నుపనయన వివాహాదులే కులధర్మములు. పంచమహాయజ్ఞ దేవపూజాదులు గావు. అవివర్ణధర్మములగుటచే నిత్యములు గనుక సపిండీకరణము లేకుండుటచే వానికి ప్రతిబంధములేదు. సపిండనమునకుఁబూర్వము చేయఁగూడదనువచన మునుఁ గానరాదు కనుక సపిండీకరణములేనిచో సపిండులకందరకు బంచమహా యజ్ఞ దేవపూజాదులు నిల్చిపోవలసి వచ్చునను వారు ఉపేక్ష్యులు కనుక నట్టియుప నయనాదుల కొఱకును మఱియు నాయుష్యమింత యని నిశ్చయింప శక్యముగా

కుండుటచేతనైనను పోనిమ్ము శరీర స్వాస్థ్యమైనను స్థిరముగా నుండునని నిశ్చయింప వలను గాకున్నందుననైనను పండ్రెండవ దినమందనగా నాశౌచ సమాప్తియైన మరునాడు సపిండీకరణము ప్రశస్తము.

## పండ్రెండవ దినమున కృత్యము

పండ్రెండవ దినమందేయనినయెడ త్రిరాత్రాశౌచమందు చతుర్థ దినమందే సపిండీకరణముగావలసి యున్నది సిద్ధింపదు. "ద్వాదశాహాది కాలేషు ప్రమాదాద ననుష్ఠితం, సపిండీకరణం కుర్యాత్కాలేషూత్తర భావిషు" అనగా పండ్రెండవదినము మొదలగువానిలో సపిండీకరణ మొకవేళ ప్రమాదముచే జరుగకుండెనేని తదుత్తర కాలములందు గావచ్చును. ఇట్లుత్తర కాలమందు విధించుటసాగ్ని నిరగ్నులకు సాధారణము. "సపిండీకరణ శ్రాద్ధముక్తకాలే కృతంనచేత్, హస్తార్ద్రా రోహిణీభేవా నురాధాయాంచ తచ్చరేత్" అనఁగా కాలమందు సపిండము జరుగనిచో హస్త, ఆర్ద్ర, రోహిణి, అనూరాధయు నీ నక్షత్రములందు జేయవచ్చును. ఇదియు నుభయులకు సాధారణమే. స్మృత్యర్థ సారమందు వత్సరాంతమందు సపిండనము జేయునపుడు వర్షాంతదినమందు సంవత్సర విమోక్ష శ్రాద్ధము సపిండీకరణమునుఁ జేసి మరునాడు మృతదినమందు వార్షికము జేయవలెనని యున్నది. ఇట్లు కాల విచారము. సపిండీకరణము పుత్రుఁడు దేశాంతరస్థుఁడై యుండినను గనిష్ఠుఁడు చేయఁగూడదు. ఇట్లు జ్యేష్ఠపుత్రుఁడు విదేశస్థుఁడై యుండినను గనిష్ఠుఁడు చేయఁగూడదు. షోడశ శ్రాద్ధమును మాత్రము జ్యేష్ఠుఁడు సన్నిధియందులేనిచో గనిష్ఠుఁడు చేయునది. తిరుగజ్యేష్ఠుఁడు చేయనక్కరలేదు. కనిష్ఠుఁడాహితాగ్నియైనచో సపిండీకరణమును జేయవచ్చును. వృద్ధినిమిత్తమైనచో గనిష్ఠాదులును సపిండనము జేయవచ్చునని మీఁదఁజెప్పఁబడినది. వృద్ధినిమిత్తము లేకుండ గనిష్ఠుఁడు జేసినను జ్యేష్ఠుఁడు తిరుగజేయవలెను. ఆహితాగ్నియగు కనిష్ఠుఁడు పితృయజ్ఞము కొఱకు సపిండనము జేసినను జ్యేష్ఠుఁడు తిరుగజేయవలెనని తోచుచున్నది. తిరుగజేయునపుడు ప్రేతశబ్దము నుచ్చరింపగూడదు. 'దేశాంతరస్థ పుత్రాణాం శ్రుత్వాతు వపసంభవేత్, దశాహం సూతకంచైవ తదంతేచ స పిండనం' అనఁగా దేశాంతరమందున్న పుత్రులు పిత్రాదిమరణము వినగానే క్షౌరము జేయించుకొని పదిరోజు లాశౌచముఁ బట్టి యంతమున సపిండనముఁ జేయునది.

## వ్యుత్క్రమమృతిలో విచారము

'మృతే పితరియస్యాథ విద్యతే చ పితామహః, తేన దేయాస్త్రయః పిండాః ప్రపితామహ పూర్వకాః, తేభ్యశ్చ పైతృకః పిండోనియోక్తవ్యస్తు పూర్వతతస్తు కార్యస్త్రాప్యయం విధిః' అనఁగా దండ్రి మృతినొందినను పితామహుఁడు జీవించి యున్నచో బ్రపితామహుఁడు మొదలుగ ముగ్గుర నుద్దేశించి మూఁడు పిండము లుంచి వానితో బితృపిండము పూర్వమువలె గలపవలెను. ఇట్లు తల్లి మృతినొందినను పితామహి జీవించియున్నచో బ్రపితామహి మొదలుగ మూఁడు పిండములతో మాతృ పిండము గలపవలెను. ఇట్లు ప్రపితామహుఁడు జీవించినపుడును దత్పిత్రాదులతో గలపవలెను. కనుక "వ్యుత్క్రమాత్తు ప్రమీతానాం నైవకార్యా స పిండనా" యను నిషేధము మాతా

పితృ భర్తృవ్యతిరిక్తులకని తెలియవలెను. ఇట్లు ప్రపితామహాదులతో దండ్రికి సపిండన మైనను పితామహుఁడు మృతినొందెనేని దిరుగ నతనితో దండ్రిని గలుపవచ్చును. ఇఁక పితృసపిండనముగాకమున్ను పితామహుడు మృతినొందెనేని పితామహుని సపిండనము మొదటఁజేసి పితామహాదులతో దండ్రికి సపిండనముఁజేయునది. ఒకవేళ దండ్రి మృతుఁడు కాగానే పితామహుఁడైనను ప్రపితామహుఁడై నను మృతి నొందగ నతనికి మఱియొక పుత్రుడు సపిండనాధికారి దేశాంతరమందున్న యెడ సపిండనము గాకుండినను వారిద్దరితోడను దండ్రికి సపిండనముఁ జేయ వచ్చును. అట్లు సపిండనాధికారి మఱియొకఁడు వారికిలేనిచో పౌత్రుఁడుగాని ప్రపౌ త్రుఁ డుగానియగు తాను మున్ను వారికి సపిండనముఁజేసి యటుపైని దండ్రి సపిండ నముఁజేయునది. పితామహునికి మఱియొకపుత్రుఁడు లేనందున పౌత్రుఁడు సపిండనము షోడశాను మాసికములు మాత్రమే చేయవలెను. పితామహుని వార్షికాదులు వేరుగజేయ నక్కరలేదు. ఇష్టమై చేసెనేని ఫలాతిశయము గలుగును. తండ్రికి దశాహాంతకర్మఁ జేయుచు పుత్రుఁడు మృతినొందినచో నతనిపుత్రుఁడు తండ్రి యౌర్ధ్వదైహికమంతయుఁజేసి పితామహుని యౌర్ధ్వదైహికమంతయు దిరుగఁ జేయవలెను. దశాహము దాటినచో గర్మకుఁ దిరుగ నావృత్తిలేదు. పితామహునికిఁ బుత్రాంతరములేనిచో బితామహ సపిండనముఁజేసి పితృసపిండనముఁ జేయవలెనని చెప్పఁబడినది. తండ్రి యశక్తుఁడై పుత్రుని కనుజ్ఞయిచ్చినచో పితామహకర్మ నతఁ డాచరింపుచుండగ దండ్రి మృతుఁడైనచో బిత్రాశౌచము వహింపుచునే పౌత్రుఁడు పితామహునికి మొదట నారంభించిన యౌర్ధ్వదైహికముఁ జేయునది. ప్రాప్తకాలమై నందున తండ్రి దశాహాంతకర్మయునుఁ జేయవలెను.

## స్త్రీలకు విశేషము

పితామహి మొదలగు ముగ్గురితో దల్లికి సపిండనముఁ జేయవలెను. కొందరు పితృమరణోత్తరమందు మాతకు మృతియైనచో దండ్రితోడనే తల్లికి సపిండనమండ్రు. దౌహిత్రుఁడు సపిండీకరణమునకుఁ గర్తయైనచో మాతామహునితో సపిండనమండ్రు. సహగమనమందు భర్తతోడనే సపిండనము. ఎవ్వనితో సపిండనముఁ జేసినను నన్వష్టక్య ప్రతివార్షికాది శ్రాద్ధములందు బితామహి మొదలగువారితోడనే తల్లికి బార్వణముఁ జేయునది. ఇక్కడ గొందరు పుత్రుఁడు సవతిపుత్రుఁడు భర్తయులేనిచో స్త్రీలకు సపిండనము లేదండ్రు. ఇక్కడ సహగమన మందు భర్తతో బత్నికి సంయోజన మనుపక్షము నమతద్వయము. పితృపిండమును బితామహాదులు ముగ్గురిలో గలపి యటుపైని మాతృపిండము దండ్రితోగలపి యట్లు మాతృపిండముతో గలసిన పితృ పిండము దండ్రితోగలపి యట్లు మాతృపిండముతో గలసిన పితృపిండము పితామహా దులతో గలపవలెనని రెండవపక్షము. అందు రెండవపక్షమే యుక్తము. కొందఱు సహగమనమైనను నొక్కదినమందే మరణమైనను స్త్రీకి సపిండనము లేదు. భర్తకు సపిండనముఁ జేయుటచే తనే భార్యకు సపిండనముఁ జేయఁబడినదే యగునండ్రు. "సర్వాభావే స్వయంపత్న్యః స్వభర్తౄణామమంత్రకం, సపిండీకరణం కుర్యుస్తతః పార్వణమేవచ." అనఁగా నెవ్వరును లేనిచో భార్యయే పతికి సపిండీకరణము నాపై పార్వణమును జేయవలెను. బ్రహ్మచారులకును సంతతిహీనులకును క్రమము తప్పి

మృతినొందువారికిని సపిండనములేదని మతాంతరము. ఇక్కడ నంతటను సపిండ నము మానివేయుపక్షము శిష్టాచారమందెచ్చటనుగానరాదు. మరి యతులకు మాత్రము సపిండనములేదుగాని దాని స్థానమందు బార్వణముఁ జేయునది. అదియు నేకాదశదినమందు గావలెను. ఈ సపిండీకరణ శ్రాద్ధము పార్వణైకోద్దిష్ట రూపమైనది. కనుక పితామహుఁడు మొదలగు ముగ్గురికై ముగ్గురు బ్రాహ్మణులు అర్ఘ్యములు పిండములు మూడేసి కావలెను. ప్రేతకై యొకవిప్రుఁడు నొకపిండము నొక యర్ఘ్యమును, దేవార్థ మిద్దరు లేదా పార్వణమున కొకఁడు ప్రేతకై యొకఁడు దేవార్థమై యొక విప్రుఁడు. ఇక్కడ విశ్వేదేవులు కాలకామసంజ్ఞికులు ప్రేతయగు పిత్రాదికము యొక్క యర్ఘ్యపాత్రము పితామహాదుల యర్ఘ్య పాత్రత్రయమందును గలుపవలెను. అట్లు ప్రేతపిండము పితామహాదుల పిండత్రయముతో గలుపవలెను. పితృస్థానమందైన విప్రుని హస్తమందు హోమము సాగ్నికునికి నగును. సపిండీకరణ శ్రాద్ధమన్నము చేతనే చేయవలెను. ఆమద్రవ్యముచే గూడదు.

## అనుమాసికములు

అనుమాసికములుగూడ నన్నముచేతనే చేయవలెను. "ప్రేతస్సపిండనాదూర్ధ్వం పితృలోకం స గచ్ఛతి, కుర్యాత్తస్య చ పాథేయం ద్వితీయేహ్ని సపిండనాత్." అని యున్నందున బదుమూఁడవ రోజున పితృలోకము నొందు ప్రేతకు మార్గమం దుపకరించుటకు ప్రాథేయశ్రాద్ధముఁజేసి పుణ్యాహవాచనాదికము నాచరించి వత్సర పర్యంతము నుదకుంభ శ్రాద్ధము ప్రత్యహమును జేయవలెను. అశక్తిలో మాసిక శ్రాద్ధములందొక యుదకకుంభ మీవలెను. సపిండనోత్తరమందును మాసికములకు పార్వణవిధిచే ననుష్ఠానము వృద్ధి ప్రాప్తించినచో నపకర్షము చతుష్పురుష సపిండులందే యని మీఁదఁ జెప్పఁబడినది. ఇట్లు వత్సరపర్యంతముఁజేసి యంతమున వర్షమోక్షశ్రాద్ధము బార్వణ విధిచే జేయునది. ఇదియే యబ్దపూర్తిశ్రాద్ధ మనఁబడును. "వృద్ధిశ్రాద్ధే సపిండ్యాం చ ప్రేత శ్రాద్ధేసుమాసికే, సంవత్సర విమాకే చ న కుర్యాత్తిల తర్పణం." అనఁగా నిందులో జెప్పిన శ్రాద్ధములందు దిలలచే దర్పణ మీయ గూడదనుట. ఇది ఊనాబ్దికమువలకైన షోడశశ్రాద్ధములకంటే భిన్నమైనది. కనుకనే యిది ప్రేతశ్రాద్ధము గాదు. కావున వృద్ధి ప్రాప్తమగుచో నపకర్షము దీనికిలేదు. కాఁబట్టి వర్షాంతదినమందు యథాశక్తిగ భూరి బ్రాహ్మణభోజనము చేయవలెనని భట్టులు. అదియుక్తమే. "జీవతో ర్వాక్యకరణా త్ప్రత్యబ్దం భూరిభోజనాత్, గయా యాం పిండదానేన త్రిభిః పుత్రస్య పుత్రతా." అనఁగా జీవించియున్నపుడు తలిదండ్రుల యాజ్ఞలో మెలఁగుటయు తలిదండ్రుల యాబ్దికమందు భూరి భోజనమును జేయుటయు గయలో బిండమిచ్చుటయు నీమూడిటిచే బుత్రునికి గృతార్థత యగు ననుట. ఇందు భూరి భోజనము విధింపఁబడినది. అది శ్రాద్ధమునకంటె వ్యతిరిక్తమైన యనేక బ్రాహ్మణభోజనము. 'న కుర్యాచ్ఛ్రాద్ధవిస్తర'మని నిషేధింపఁబడినందున శ్రాద్ధము భూరిభోజనమని యెట్లనఁబడును.

## ప్రథమాబ్దమందు నిషిద్ధములు

మాతా పితృమరణమునందు వర్ష పర్యంతము పరాన్నము గంధమాల్యాది భోగములను మైథునము నభ్యంగస్నానమును వర్జింపవలయును. ఋతుకాలమందు

భార్యతో సంగమముఁ జేయవచ్చును. ఋత్విక్కర్మయు లక్షహోమము మహాదానములు మొదలగు కామ్యకర్మలు తీర్థయాత్ర వివాహము మొదలగు వృద్ధిశ్రాద్ధ యుక్తమైన కర్మలు శివపూజయు వర్జింపవలెను. సంధ్యోపాసన దేవపూజా పంచమహాయజ్ఞాతిరిక్తములైన కర్మలెల్లను వర్జ్యములు. అందుకువచనము. "ప్రమీతౌ పితరౌయస్య దేహస్తస్యా శుచిర్భవేత్, న దైవనాపి వా పిత్ర్యం యావత్పూర్ణో న వత్సరః" అని. అనఁగా దలిదండ్రులు మృతులైనపుడు పుత్రునిదేహమశుచియగును. కనుక వత్సర పర్యంతము దైవకర్మలు నన్యపితృకర్మలును జేయఁగూడదు. అని యున్నదని కొందరు. "మహాతీర్థస్య గమన ముపవాసవ్రతానిచ, సపిండీశ్రాద్ధమన్యేషాంవర్జయే ద్వత్సరంబుధః" అనఁగా తీర్థయాత్రయు నుపవాసవ్రతములు నితరుల సపిండీకరణమును వత్సరమధ్యమందుఁ జేయఁగూడదనుట. దీనికపవాదము. "పత్నీ పుత్రస్తథా పౌత్రో భ్రాతాత్తనయస్నుషా, మాతాపితృవ్యశ్చైతేషాం మహాగురు నిపాతనే, కుర్యాత్సపిండన శ్రాద్ధం నాన్యేషాం తు కదాచన" అనఁగా;దండ్రి మృతివత్సరము నందు భార్యపుత్రుఁడు పౌత్రుఁడు సోదరుఁడు తత్పుత్రుఁడు కోడలు తల్లి పినతండ్రియు నను వీరికిఁదప్ప నితరులకు సపిండనముఁ జేయగూడదనుట. మరియును; "ఏకాదశాహ పర్యంతం ప్రాతశ్శ్రాద్ధం చరేత్సదా, పిత్రోర్మృతౌ చ నాన్యేషాం కుర్యాచ్ఛ్రాద్ధం తు పార్వణం" అనఁగా దలిదండ్రుల మృతాశౌచదినములలో నితరులకు నేకాదశాహ పర్యంతమైన ప్రేతకర్మఁ జేయవచ్చునుగాని పార్వణముఁ జేయగూడదనుట. మఱియు; "గయాశ్రాద్ధం మృతానాం తు పూర్ణేత్వబ్దే ప్రశస్యతే" గారుడే తీర్థశ్రాద్ధం గయాశ్రాద్ధం శ్రాద్ధమన్యచ్చ పైతృకం, అబ్దమధ్యే న కుర్వీత మహాగురు విపత్తిషు" అనఁగా మృతి నొందినవారికి బ్రథమాబ్దికముఁ జేసినపైని గయాశ్రాద్ధము ప్రశస్తము. ఏమనిన; గారుడమందట్లు నిషేధము. తీర్థశ్రాద్ధము గయాశ్రాద్ధము నితరమైన మహాలయాది పైతృక శ్రాద్ధమును తలిదండ్రుల మృతియందు ప్రథమాబ్దములోగా జేయఁగూడదు. కొందరీనిషేధములన్నియు వర్షాంత సపిండనమందేయని చెప్పుదురు. మరియు; గొందరు ద్వాదశాహ సపిండన పక్షమందును నీనిషేధములగునంద్రు. ఇక్కడనిట్లు వ్యవస్థఁజేయవచ్చునున. వృద్ధి కర్మప్రాప్తింపకుండఁగ నపకర్షఁజేసి ద్వాదశదినమునందు సపిండనముఁ జేసినప్ప టికిని ప్రేతకు బితృదేహము వర్షాంతమందే కలుగును. అట్లువచనము– "కృతే సపిండీకరణే నరస్సంవత్సరాత్పరం, ప్రేతదేహం పరిత్యజ్య భోగదేహం ప్రపద్యతే"అని. కనుక సపిండీకరణమైనప్పటికిని వృద్ధి దైవపిత్ర్యకర్మలయం దధికారములేదు. వృద్ధినిమిత్తమై యపకర్షముఁ జేయునెడ వృద్ధాదులందధికారము గల్గునని. కనుకనే కాలతత్వనిర్ణయమందు సంకటాదులలో దండ్రిలేని పుత్రులకు సంస్కారాభ్యుదయిక కర్మజేయుటగాని తలిదండ్రుల మృతిలో తన పుత్రులకు సంసారము జేయుటగాని సంవత్సరములోపుననైనను గావచ్చునని యున్నది. దర్శ మహాలయ నిత్య తర్పణాదులందును నిట్లు వ్యవస్థ అనఁగా వృద్ధ్యర్థముగా నపకర్షముఁ జేసినచో జేసెనేని దర్శాద్యాభ్యుదయికముఁ జేయవచ్చును ఇచ్ఛచే నపకర్షముఁజేసినచో గూడదని నిర్ణయింపవచ్చును. ఇక విధానములు. అందు పంచకమృతి యందనఁగా ధనిష్ఠ రెండవసగము మొదలుగ రేవతివరకును నాల్గునక్షత్రములు నరయు బంచకమనఁబడును. అపుడు మృతినొందినచో దాహము నిషిద్ధము. కనుక దర్భమయమైన బొమ్మలకు యవలపిండి బూసి యైదు కంబళిపోగులుచుట్టి వాటితో

శవమును దహించవలెను. అపుడు దేశకాలములగీర్తించి 'అముకస్య ధనిష్ఠాపంచకాది మరణ సూచితవంశారిష్ట వినాశార్థం పంచకవిధిం కరిష్యే' యని సంకల్పించి మీఁద చెప్పిన ప్రతిమలు నక్షత్రమంత్రముచే నభిమంత్రించి గంధపుష్పాదులచే బూజించి దాహ సమయమందు ప్రేతపై నుంచవలెను. ఎట్లనిన; మొదలిటి ప్రతిమను శిరస్సునందును రెండవదాని నేత్రములందును మూఁడవదాని కుక్షియందెడమ పార్శ్వమందును నాల్గవగాని నిభియందును నైదవదాని బాదమునందును నుంచి యటుపైని నామ మంత్రములచే నాజ్యాహుతులు వ్రేల్చవలెను. నామము లేవనిన; ప్రేత వాహుఁడు ప్రేతసఖుఁడు ప్రేతపుఁడు ప్రేతభూమిపుఁడు ప్రేతహర్తయునని క్రమముగఁ దెలియునది ఆపై నుదకమిచ్చి 'యమాయసోమం, త్ర్యంబకం' అను మంత్రములచే ప్రత్యేకముగ ప్రతిమలయందాజ్యాహుతలీయవలెను. అటుపైని ప్రేతముఖమందుఁ బంచరత్నములుంచి బొమ్మలతోగూడ శవము దహించునది. ఆశౌచాంతమందు తిలలు సువర్ణము ఘృతమును దానమిచ్చి కంచుగిన్నెలో నూనెబోసి యందు దన ప్రతిబింబముఁజూచి విప్రునికి దానము చేయునది. శాంతియుగూడఁ జేయవలెను. ఇక్కడనిది విశేషము. వేరొక నక్షత్రమందు మృతుఁడగువానికి బంచకమందు దహనము ప్రాప్తించినచో దర్భ ప్రతిమావిధిమాత్రమే చేయవలెను. శాంతి యక్కరలేదు. పంచకమందు మృతినొందిన వాని కశ్వినిలో దహనము ప్రాప్తించినచో శాంతికర్మ మాత్రము చేయవలెను. ప్రతిమావిధి యక్కరలేదు. శాంతియు లక్షహోమము రుద్ర జపము మొదలగునది యథాశక్తిగఁ జేయునది. లేదా కుంభమందు యమప్రతిమను బూజించి స్వగృహసూత్ర ప్రకారమున నగ్ని బ్రతిష్ఠించి యన్వాధానము మొదలు చరుశ్రవణాంతముఁజేసి యాజ్యభాగాంతమందు నామములచే బదునాల్గు చర్వాహుతుల వ్రేల్చవలెను. ఎట్లనిన; యమాయస్వాహా 1.ధర్మరాజాయ 2. మృత్యవే 3. అంతకాయ 4. వైవస్వతాయ 5. కాలాయ 6. సర్వభూతక్షయాయ 7. ఔదుంబరాయ 8. దధ్నాయ 9. నీలాయ 10. పరమేష్ఠినే 11. వృకోదరాయ 12. చిత్రాయ 13. చిత్రగుప్తాయ 14. ఇట్లు వ్రేల్చి హోమశేషము సమాప్తినొందించి నల్లని యావును సువర్ణముచే నలంకరించి 'యమోమే ప్రీయతాం'అని శాంతుఁడైన విప్రుని కీయవలెను. త్రిపాద నక్షత్రమునందు మృతియైన నిట్లనే శాంతిఁజేయవలెను. "యదిభద్రాతి దీనాంస్యాద్భాను భౌమశనైశ్చరైః, త్రిపాదృక్షైశ్చ సంయోగ స్తదాయోగ స్త్రిపుష్కరః ద్విపుష్కర ద్వయోర్యోగేఽ ధవాయంస్యా ద్విపాభైః" అనఁగా భద్రాతిథియు భాను భౌమ శనివారములలో నొకటియు త్రిపాదనక్షత్రముఁ గలసినచో త్రిపుష్కరయోగము. అందు రెండేకలసినచో ద్విపుష్కరయోగము. లేదా ద్విపాదనక్షత్రము గలసినచో ద్విపుష్కర యోగము. త్రిపాదనక్షత్రము లెవ్వియనిన; "పునర్వసూత్తరషాఢా కృత్తికోత్తర ఫల్గునీ, పూర్వాభాద్ర విశాఖా చజ్ఞేయమేతత్త్రిపాదభం" అనఁగా నివి త్రిపాద నక్షత్రములు. ఇట్లు త్రిపుష్కర యోగమందుగాని ద్విపుష్కర యోగమందుగాని మృతినొందినచో మూఁడు కృచ్ఛ్రములు ప్రాయశ్చిత్తముఁజేసి యవపిష్టముచే మూఁడు బొమ్మలు నిర్మించి వానితో బ్రేతను దహించవలెను. ప్రతిమలనుంచుటయు నాజ్యాహుతులను బూర్వమువలె జేయవలెను. సువర్ణము వజ్రము నీలము కెంపుముత్తెమునను పంచ రత్నములుంచుటయుఁ దెలియునది. రత్నము లేనియెడ కర్షములో సగము స్వర్ణము.

అదియులేనిచో ఘృతము. ఇట్లు పూర్వమందును దెలియునది. దహనమందును మరణమందును త్రిపుష్కరమైనచో త్రిగుణఫలము. ద్విపుష్కరమందు ద్విగుణ ఫలములు. ఖననమందును దోషశాంతికై యిట్లు చేయవలెను. లేదా సువర్ణ దక్షిణనీయవలెను. నల్లనివస్త్రమునైన నీయవలెను. ఆశౌచాంతమందు బూర్వోక్తశాంతినైన జేయవలెను. మంగలమగును. మృతుని శ్మశానమందు దీసుకొని వెళ్ళినపైని దిరుగఁ బ్రతికినచో నతెడవ్వరి గృహమందు బ్రవేశించునో యతనికి మరణము గల్గును. కనుక క్షీరముచే ఘృతముచే దడపిన మేడి సమిధలు గాయత్రితో వేయునెనిమిది మారులు వ్రేల్చవలెను. అంతమందు గపిలగోదానము తిలలనింపి చేనకంచు పాత్ర దానమును జేయునది. ఎనుబదియొకపలముగాని యందుసగముగాని సగములో సగముగాని కంచుపాత్ర యుండవలెను. అయిదారుపలములు గూడదు.

## బ్రహ్మచారి మృతినొందినచో విధి

బ్రహ్మచారి మృతియందు పండ్రెండుగాని యారుగాని మూఁడుగాని సంవత్సరములు ప్రాయశ్చిత్తముఁజేసి దేశకాలములఁగీర్తించి 'యముకగోత్రనామ్నో బ్రహ్మచారిణో మృతస్య వ్రతవిసర్గం కరిష్యే తదంగ నాందీశ్రాద్ధం కరిష్యే' యని సంకల్పించి హిరణ్యముచే నాందీ శ్రాద్ధముజేసి యగ్ని ప్రతిష్ఠాపనము మొదలుగ నాఘారాంతముఁజేసి వ్యాహృతులచేనాజ్యహోమముఁజేసి 'అగ్నయే వ్రతపతయేస్వాహా, అగ్నయే వ్రతానుష్ఠానఫల సంపాదకాయస్వాహా, విశ్వేభ్యో దేవేభ్యస్స్వాహా' అగ్నయే వ్రతానుష్ఠానఫల సంపాదకాయస్వాహా, విశ్వేభ్యో దేవేభ్యస్స్వాహా' యని మూఁడాహుతులిచ్చి స్విష్టకృత్తు మొదలగునది సమాప్తిఁ జేయవలెను. తిరుగ దేశకాలములఁ గీర్తించి 'అముక స్యార్ధ్వ, దైహికాధికారోర్ధమర్క వివాహం కరిష్యే' యని సంకల్పించి హిరణ్యముచే నాందీశ్రాద్ధాంతమందు జిల్లేడుచెట్టు సమీపమునకు వెళ్లిగాని, లేక దాని కొమ్మనుబట్టుకొని గాని యర్క బ్రహ్మచారులకుఁ బసుపుబూసి పచ్చని సూత్రముగట్టి వస్త్రయుగ్మమున గప్పి యగ్ని బ్రతిష్ఠించి యాఘారాంతమందాజ్య హోమము.'అగ్నయే స్వాహా, బృహస్పతయే, వివాహవిధి యోజకాయ స్వాహా, యస్మైత్వా కామాయవయం సమ్రాద్య జామహేతమస్మభ్యం కామందత్వాఽథేదంఘృతం పిబస్వాహా, కామాయేదం' ఇట్లు వ్రేల్చి వ్యస్తసమస్త వ్యాహృతులచే హోమము. ఇట్లెనిమిదాహుతులైన పైని స్విష్టకృత్తు మొదలుగఁజేసి యర్కశాఖను బ్రహ్మచారి శవమును దుషాగ్నియనఁగ నుముకనిప్పుచే దహింపవలెను. స్నాతకవ్రతస్థుఁడు మృతినొందిన నిట్లనే చేయవలెనని కొందరు. అది నిర్మూలమని యితరులు. ఆశౌచాంతమందు ముప్పదుగురు బ్రహ్మచారులకు గౌపీనములు గృష్ణాజినములు వరభూషణములు పాదుకలు ఛత్రములు గోపీచందనము మాల్యము మణులు పగడములుగట్టిన మాలికలు యజ్ఞోపవీతములు యథాసంభవముగ నీయవలెను.

## కుష్ఠరోగముచే మృతినొందినచో విధి

'మృతస్య కుష్ఠినోదేహం తీర్థేవా భువివాక్షిపేత్, న దాహం నోదకం పిండం న చదానం క్రియాంచరేత్, యదిస్నేహాచ్చరేద్దాహం యతి చాంద్రాయణం చరేత్' అనఁగా గుష్ఠరోగముచే మృతినొందిన వాని దేహము తీర్థమందు వ్రేయవలెను. లేదా భూమిపై బారవైవవలెను. దహనము నుదకదానము పిండము నేక్రియయుఁ

జేయగూడదు. స్నేహముచే జేసినచో యతిచాంద్రాయణముఁ జేయవలెను. కాఁబట్టి యథాశక్తిగ షడబ్దాదిప్రాయశ్చిత్తముఁజేసి కుష్ఠాదిమహారోగముచే మృతుఁడైన వానికి దాహాదిక్రియలు జేయవలెను. గాని యూరకయే చేయగూడదు.

## రజస్వలాది మరణమందు విధి

సంస్కారాదులు చేయగూడదు. మఱియేమనిన; మూఁడురోజులైన పైని స్నానము చేయించి శవధర్మముచే దహించవలెను. లేదా రజస్వలను సూతికను మలముగడగి యమంత్రకముగ గర్రనుగాల్చినట్లు దహించి యస్థులను మంత్రాగ్నిచే దహింపవలెను. ఎట్లు దహించినను చాంద్రాయణము తప్పదు. లేదా యపుడే మంత్రాగ్నిచే దహింపవలెనని తలచినచో దేశకాలములఁ గీర్తించి 'అముకగోత్రాయా రజస్వలావస్థాది మరణ నిమిత్త ప్రత్యవాయ పరిహారార్థ మౌర్ధ్వ దైహికయోగ్యత్వార్థం చ చాంద్రాయణ త్రయపూర్వకం శూర్పేణాష్టోత్తర శతస్నానాని కారయిష్యే' యని సంకల్పించి మూఁడు చాంద్రాయణములు ప్రత్యామ్నాయముచేజేసి యవపిష్టముచే శవమునుమూసి తాను స్నానముఁజేసి చేటచే నూటయెనిమిదిమారులు స్నానము చేయించవలెను. అటుపైని భస్మగోమయమృత్తికాకుశోదకములచే తను పంచగవ్యములచేతను శుద్ధోదకములచేతను స్నానముఁజేయించి 'యదంతి యచ్చదూరకః 'అని మొదలగు పావమానులచే 'నాపోహిష్ఠ'యను మూఁడు ఋక్కులచేతను 'యాన' ఇత్యాదులచేతను స్నానముఁ జేయించి పూర్వవస్త్రము విడిపించి యన్యవస్త్రముఁ జుట్టి దహించునది. సూతికకు నిట్లు చేయవచ్చును. సూతికకు మొదటి మూఁడు రోజులలో మరణమైనచో మూఁడు సంవత్సరములు ప్రాయశ్చిత్తము. అటుపైని మూఁడు రోజుల పర్యంతము రెండు సంవత్సరములు. ఆపైని మూఁడు రోజులలో నైనచో నొకసంవత్సరము ప్రాయశ్చిత్తము. పదియవ దినమున నైనచో గృచ్ఛత్రయము మాసపర్యంతమైనను గృచ్ఛత్రయమని కొందరు, మితాక్షర గ్రంథమందు కుంభములో జలముపోసి పంచగవ్యమువేసి పుణ్యమంత్రము లనఁగ వాపోహిష్ఠ, వామదేవ్య, వారుణాదులు వీనిచే నభిమంత్రించి మీఁదజెప్పిన మంత్రములచే స్నానముఁ జేయించి యథావిధిగా సూతికను దహింపవలెనని విశేషమున్నది. ఇట్లు రజస్వలా సూతికలకు విధి.

## గర్భిణీ మృతియందు విధి

గర్భిణీ మరణమందు మృతయగు గర్భిణికి శుద్ధికై ముప్పది మూఁడు కృచ్ఛములుచేసి గోవును భూమిని సువర్ణమును దానముచేసి కడుపులోనిపిల్లను వేరుగదీసి యామెను దహించునది. గర్భముతోగూడ దహించినచో శిశువధ ప్రాయశ్చిత్తము. మరియు నట్లు దహించెనేని గర్తకు మూఁడువత్సరములు ప్రాయశ్చిత్తము. 'అథాన్వారోహణం స్త్రీణా మాత్మనో భర్తురేవ చ, సర్వపాపక్షయకరం నిరయోత్తారణం పరం, అనేక స్వర్గఫలదం ముక్తిదం చ తథైవచ, జన్మాంతరే చ సౌభాగ్య ధనపుత్రాది వృద్ధిదం, తిస్రః కోట్యర్ధ కోటీ చ యావంత్యం గరుహాణివై, తావంత్యబ్ద సహస్రాణి స్వర్గలోకే మహీయతే, మాతృకం పైతృకం చైవ యత్రకన్యా ప్రదీయతే, మలత్రయం పునాత్యేషా భర్తారం యానుగచ్ఛతి' అనఁగా సహగమనము స్త్రీలకును భర్తకును

సమస్త పాపములు నశింపఁజేసి నరకము దాటించి యనేకకాలము స్వర్గమిచ్చును. లేదా మోక్షమునిచ్చును. మఱియును జన్మాంతరమందు సౌభాగ్య ధనపుత్రాది వృద్ధిఁ గలుగజేయును. యెన్ని రోమకూటములున్నవో యన్నియనఁగా మూఁడుకోట్లున్నర సంవత్సరములు స్వర్గవాసము నిచ్చును. పితృమాతృకులములు నత్తవారికులమును మూఁడింటిని పవిత్రముఁ జేయునని మొదలుగ సహగమన మహిమ మితాక్షర యందుఁ జూచునది. ఇక్కడ కోరికలేనిచో ముక్తియు గోరికయున్నచో స్వర్గాదిఫలమని వ్యవస్థ యెఱుంగునది.

## సహగమనమునకు విధి

దేశకాలముల స్మరించి 'మాతృపితృశ్వశురాది కులపూతత్వ బ్రహ్మహత్యాది దోషదూషితపతి పూతత్వ పత్యవియోగారుంధతీ సమాచారత్వ సార్ధకోటిత్రయ సహస్ర సంఖ్య సంవత్సరస్వర్గ మహీయ మానత్వాది పురాణోక్తానేక ఫలావాప్తయే శ్రీలక్ష్మీనారాయణ ప్రసాద ద్వారా ముక్తిప్రాప్తయే వాపతిచితాన్వారోహణం కరిష్యే'యని సంకల్పించి పసుపు కుంకుమ వస్త్రములు ఫలములతోగూడిన చేటలను పుణ్యస్త్రీల కీయవలెను. అపుడు మంత్రము; "లక్ష్మీనారాయణో దేవో బలసత్వ గుణాశ్రయః, గాఢం సత్వం చ మేదేయా ద్వాయనైః పరితోషితః, సోపస్కరాణి శూర్పాణి వాయవైః సంయుతాని చ, లక్ష్మీనారాయణ ప్రీత్యై సత్యకామాదదామ్యహం. అనేన సోపస్కరశూర్పదానేన లక్ష్మీనారాయణౌ ప్రియేతాం." అని యుచ్చరింపవలెను. అటుపైని కొంగున బంచ రత్నములును నీలాంజనమునుఁగట్టి ముఖములో ముత్తెముంచి యగ్ని సమీపమునకు వెళ్లి యగ్నిని బ్రార్థించునది. "స్వాహా సంశ్లేషనిర్విణ్ణ శర్వగోత్ర హుతాశన, సత్వమార్గ ప్రదానేన నయమాం పత్యురంతికం." అని యనఁగా స్వాహాదేవిచే నిత్య మాలింగితుఁడనై శర్వగోత్రమునొందిన యో హుతాశనుడ! నాకు సత్వగుణ మార్గముఁ దయచేసి నాపతితో గలపవలయుననుట. అటుపై నగ్నియం దాజ్యముచే వ్రేల్చవలెను. "అగ్నియే తేజోధిపతయే స్వాహా,విష్ణవే సత్వాధిపతయే స్వాహా, కాలాయ ధర్మాధిపతయే స్వాహా, పృథివ్యై లోకాధిష్ఠాత్ర్యై, అద్భ్యోరసాధిష్ఠాత్రీభ్యః, వాయవే బలాధిపతయే, ఆకాశాయ సర్వాధిపతయే, కాలాయ ధర్మాధిష్ఠాత్రే, అద్భ్యస్సర్వ సాక్షిణీభ్యః, బ్రహ్మణే వేదాధిపతయే, రుద్రాయ శ్మశానాధిపతయేస్వాహా" యని యేకాదశాహుతులు వ్రేల్చి యగ్ని బ్రదక్షిణముఁజేసి సన్నెకల్లు పొత్తరమును బూజించి పుష్పాంజలిఁ గ్రహించి యగ్ని బ్రార్థింపవలెను."త్వమగ్నే సర్వభూతానా మంతశ్చరసి సాక్షివత్, త్వమేవ దేవజానీషే నవిదుర్యాని మానుషాః, అనుగచ్ఛామి భర్తారంవైధవ్య భయపీడితా, సత్వమార్గ ప్రదానేన నయమాం భర్తురంతికం." అనఁగా నో యగ్నిదేవుడ! నీవు సర్వభూతములలోపల సాక్షివైయున్నావు. మనుష్యుల కగోచరమైన గతులు నీకుఁ దెలియును. నేను వైధవ్యభయముచేత భర్త ననుసరింపగోరితిని. సత్వమార్గముఁ దయచేసి నన్ను భర్తతోగలపుమని ప్రార్థించి మంత్రముచ్చరించి మెల్లనగా నగ్నిలో బ్రవేశింపవలెను. విప్రుఁడపుడు 'ఇమానారీరవిధవా' యను ఋక్కును 'ఇమాః పతివ్రతాః పుణ్యాస్త్రీయోయాయాస్సుశోభనాః, సహభర్తృ శరీరేణ సంవిశంతు విభావసుం' అను శ్లోకమును బఠింపవలెను. భయపడి శవము ప్రక్కను బడియున్న స్త్రీని మరదిగాని శిష్యుఁడుగాని 'ఉదీర్ష్వ'యను మంత్రములచే లేపవలెను. "ఉదీర్ష్వ

నార్యభి జీవలోక మితాసుమేత ముపశేష ఏహి, హస్తగ్రాహస్యదిధిషోస్త్వ మేతత్ప త్యుర్జనిత్వ మభిసంబభూవ.” అనఁగా నోనారీ! ప్రాణములు వెడలిపోయిన యీ శవము సమీపమున బండియుంటివి. ఇది పనిగాదు. మరి యేమనిన; నీకు పతియైన జీవుడు వెళ్లిన లోకమున కభిముఖముగ మీదు జూడుమనఁగ ముందుగతి యాలోచింపుము. ఎట్లుపాయమనిన; సహగమనముఁజేసితివేని తిరుగ నీ హస్తమును గ్రహించి దిధిషుఁడనబడు నీపతియొక్క యీజాయాత్వమునే పొందెదవు. అని యర్థము. “అనువ్రజతి భర్తారం శ్మశానం యాగృహన్ముదా, పదేపదేశ్వమేధస్య ఫలం ప్రాప్నోతిసాధ్రువం.” అనఁగా భర్తవెళ్లిన శ్మశానమునకు యేస్త్రీ కన్నీరులేక ధైర్యముతో సహగమనమును నుద్దేశించితోడనేవెళ్లునో యామెకు ప్రతియడుగునకు నశ్వమేధ ఫలము వచ్చుననుట ఇట్లున్నది గనుక “యాస్త్రీ బ్రాహ్మణజాతీయా మృతం పతిమను వ్రజేత్, సా స్వర్గమాత్మఘాతేన నాత్మానం న పతింనయేత్.”అని. యనఁగా బ్రాహ్మణస్త్రీ పతితో ననుగమనముఁ జేసెనేని, ఆత్మఘాతదోషముచే స్వర్గమునకు దానే వెళ్లలేదు. పతినెట్లు తోడ్కుకొని వెళ్లునని యిట్లు బ్రాహ్మణస్త్రీకి నిషేధము పృథక్చితితాత్పర్యముచే జెప్పినది. పృథక్చితి యనఁగ భర్తకు మంత్రాగ్నిచే దాహమైన పై ననుగమనము. మంత్రాగ్ని దాహములేనిచో నస్థులతోగాని పర్ణశరముతోగాని సహగమనమేకచితియే యనఁబడును. అస్థ్యాదికము పతి ప్రతినిధియగుటచే భర్తృ శరీరతుల్యమే యగును. ఇది సర్వవర్ణముల స్త్రీలకును విధింపఁబడినది. పృథక్చితి యైనచో క్షత్రియ వైశ్య శూద్రజాతీయస్త్రీలకే విధింపఁబడినదిగాని బ్రాహ్మణస్త్రీలకు గాదు. పృథిక్చితివిధి యెట్లనిన; “దేశాంతరమృతే పత్యౌ సాధ్వీత త్పాదుకాద్వయం, నిధాయోరసి సంశుద్ధా ప్రవిశేజ్జాత వేదసం” అని. యనఁగా భర్త దేశాంతరమందు మృతుఁడైనచో బతివ్రత యతనిపాదుకల హృదయమందు ధరించి యగ్ని ప్రవేశము గావలెననుట. పతితుఁ డై మృతుఁడైనను ప్రాయశ్చిత్తమునకై మృతుఁడైనను నట్టి భర్తతో సహగమనము గాదు. ఇఁక “బ్రహ్మఘ్నోవా కృతఘ్నోవా మిత్రఘ్నో వాభవేత్పతిః', పునాత్యవిదవానారీ.” యని మొదలగు వాక్యమున్నది గాని యది జన్మాంత రీపాపము శుద్ధిజేయునిన తాత్పర్యముఁ గ్రహించునది. “దినైకగమ్యదేశస్థ సాధ్వీచేత్కృతనిశ్చయా, నదహేత్స్వా మినంతస్యా యావదాగమనం భవేత్.” అనఁగా సహగమనమందు నిశ్చయముగల భార్య పతిమృతికాలమందొక దినమునకు రాదగిన దేశమందున్న యెడ నామె వచ్చు పర్యంతము శవము నుంచవలెను. ‘తృతీయేహ్ని ఉదక్యాయా మృతే భర్తరి వైద్విజాః, తస్యాస్సహగమార్థంతం స్థాపయే దేకరాత్రకం’ అనఁగా రజస్వలయైన మూఁడవదినమందుఁ బతి మృతుఁడైనచో నామె సహగమ నము నిమిత్తమొకరాత్రి యుంచవలెను. రజస్వలయైన ప్రతమ దినమందు రెండవ దినమందును మృతియగు నపుడు మంత్రహీనముగ నతని దహించి యైదవదినమం దస్థులతో నన్వారోహణము చేయునది. ఒకవేళ దేశకాలవశముచేనపుడే సహగమనము గావలెనని రజస్వల గోరెనేని యొక కుంచెడు ధాన్యమును రోకలిచే దంపి సర్వ రజోనివృత్తి గలిగినపైని బంచమృత్తికములచే శుద్ధిఁజేసి దినక్రమమున ముప్పది యిరువది పదియైనను గోదానములుచేసి బ్రాహ్మణానుజ్ఞచే శుద్ధినొంది సహగమనము చేయునది. ఇక్కడ దంపుటచే రజోనివృత్తియే గోచరము గనుక నిది యుగాంతర విషయమని తోఁ

చుచున్నది. జననమృతా శౌచములందు సహగమనము నిషిద్ధమని కొందరు. కాల తత్త్వవివేచన మందు మొదట ప్రారంభించిన యాశౌచమధ్యమందు భర్తృమరణ మైనచో నాశౌచముఁగలవారికిని సహగమనముఁ గావచ్చును.రజస్వలా సూతికలకుఁ గూడదని యున్నది. ఇదియే యుక్తము. ఈ సహగమనము గర్భిణికి శిశుసంతతిఁ గల దానికి సూతికకు రజస్వలకు పతితురాలికి వ్యభిచారిణికి భర్తతో విరోధించిన దానికిఁగూడదు. కొందరిక్కడ పతివ్రతలకే యధికారము. కనుక; "వర్తంతే యాస్య సతతం భర్తౄణాం ప్రతికూలతః, కామాత్క్రోధా ద్భయాన్మోహా త్సర్వాః పూతా భవం తితాః" అని. యనఁగా కామక్రోధభయమోహాదులచే స్త్రీలు భర్తకు ప్రతికూలముగ నుండువారు సహితము సహగమనముచే బవిత్రులగుదురనుట యర్థవాదమంద్రు. అందు పృథక్చితిలో ననుగమనముఁ జేసెనేని త్రిరాత్ర మాశౌచములేదు. వేరుగనే పిండములునగు. సహగమనమైనచో "తస్యాః పిండాదికం శౌచం పతిపిండాదితః క్రమాత్, అన్వాదరోహేతు నారీణాం పత్యుశ్చైకోదక క్రియా, పిండదానే క్రియాతద్వ చ్ఛ్రాద్ధం ప్రత్యాబ్దికం తథా, అన్వారోహే కృతేపత్న్యాః పృథక్పిండాం స్తిలాంజలీన్, పృథక్‌శిలే న కుర్వీత దద్యా దేకశిలేతథా, తత్రావయవ పిండార్థం పాకైక్యం భిన్నపిండతా, నవశ్రాద్ధాని భిన్నాని సపిండీకరణం పృథక్, ఏక ఏవ వృషోత్సర్గో గౌరేకా తత్రదీయతే" అనఁగా భార్యకు పిండాదికము శౌచము పతిపిండాదిపూర్వ ముగ జేయునది. ఇట్లుదకదానము పిండదానము శ్రాద్ధము ప్రత్యాబ్దికముగూడఁ బతితోడనే గావలెను. అయినను పిండములు తిలాంజలులును బత్నికివేరుగా బతి కిచ్చిన శిలయందే యీయవలెను. వేరుశిలకూడదు. అందవయవపిండములకై వేరుగ పిండదానము పాకమొక్కటియే.నవశ్రాద్ధములు వేరుగఁజేయవలెను. సపిండీ కరణము నట్లనే. వృషోత్సర్గమొకటియే తత్స్థానమందు గోదానముఁగూడ జేయవలెను. ఇక్కడ సపిండీకరణము చేయగూడదనియు లేక భర్తతోడనే చేయవలెననియు భర్త్రా దులు ముగ్గురితో జేయవలెననియు పక్షభేదములు చెప్పఁబడినవి. మాసిక సాంవత్సరి కాదులలో పాకైక్యము కాలైక్యము మొదలుగ వ్యవస్థ శ్రాద్ధ ప్రకరణమందుఁ జెప్పఁ బడినది. ఇట్లుసహగమన నిర్ణయము. ఇట్లు కాశీనాథోపాధ్యాయునిచే నంత్యేష్టి విధి నిర్ణయముఁజేసి శుద్ధికై విఠ్ఠలస్వామికి సమర్పింపఁబడినది. ఇది యంత్యేష్టి నిర్ణయము.

## విధవ స్త్రీకి ధర్మములు

"పత్యౌమృతేతుభార్యాణాం విధాద్వయ ముదీరితం, వైధవ్యం పాలయేత్సమ్య క్సహాగ్ని గమనంతు వా, పత్యౌ మృతేచ యా యోషిద్వైధవ్యం పాలయేత్సదా, సాపునః ప్రాప్య భర్తారం స్వర్గలోకం సమశ్నుతే, విధవా పాలయేచ్ఛీలం శీలభంగా త్పతత్యధః ,తద్వైగుణ్యాదపి స్వర్గాత్పతిః పతతిసర్వధా, తస్యాః పితాచ మాతాచ భ్రాతృవర్గస్తథైవచ, విధవా కబరీబందో భర్తృబంధాయ జాయతే; శిరసో వపనం తస్మాత్కార్యం విధవయా సదా, ఏకవారం సదాభుక్తి రుపవాస వ్రతానిచ, పర్యంక శయానాన్నారీ విధా పాత యేత్పతిం, నైవాంగోద్వర్తనం కార్యం గంధ ద్రవ్యస్య సేవనం, నాధిరోహే దనడ్వాహం ప్రాణైః కంటగతైరపి, కంచుకం న పరీదధ్యా ద్వాసోన వికృతం వసేత్, వైశాఖే కార్తికే మాఘే తదుక్త నియమంచరేత్, తాంబూలా భ్యంజనే చైవ కాంస్యపాత్రే చ భోజనం, యతిశ్చ విధవా చైవ వర్జయే చ్చందనాదికం" అనఁగా భర్త మృతినొందిన

పైని భార్యకు రెండేగతులు విధింపఁబడినవి. భర్తతోగూడ సహగమనమైనను లేదా వైధవ్యమును యథావిధిగ బరిపాలించుటయైనను గావలను. అట్లు వైధవ్యము పాలించు స్త్రీ తిరుగ దనభర్తను బొంది స్వర్గమున సుఖించును. ఎట్లనిన; విధవ సద్వృత్తమును రక్షించుకొనవలెను. దానికి భంగమువచ్చినచో నధోగతి నొందును. సరియే కదా స్వర్గమొందిన భర్తయు పితృమాతృ భ్రాతృవర్గములును దానివైగుణ్యముచే నధోగతి నొందుదురు. మఱియును విధవకేశబంధముఁ గట్టినచో భర్తకు బంధ మగును. కనుక క్షౌరము విధింపఁబడినది. దినములో నొకమారే భుజింపవలెను. ఉపవాసవ్రతము లాచరింపుచుండవలెను. మంచముపై బండుకొనగూడదు. నలుగు బెట్టుకొని యభ్యంగస్నానము గూడదు. సుగంధము గలయత్తరువు పన్నీరు మొదలగు భోగ్యములందాసక్తిఁగూడదు. ఎడ్లబండిపై నెప్పుడు నెక్కగూడదు. కంచుకమును రంగుచీరలును గట్టగూడదు. వైశాఖ కార్తికమాఘ మాసములందుఁ జెప్పిన విశేష నియమములాచరింపుచుండవలెను. తాంబూలము నభ్యంగము గంచుపాత్రలో భోజన మును యతికి విధవకును గూడదు. ఇట్లు చందనాదికము గూడదు. పుత్రహీనురాలైన విధవ భర్త్రాదుల నుద్దేశించి ప్రతిదినము దిలకుశోదకములచే దర్పణముచేయవలెను. శ్రాద్ధాదులందు మీఁదఁజెప్పఁబడినది.

## సన్న్యాసము

అందు బ్రహ్మచర్యముఁజేసి సమావర్తనమైనపైని వివాహమై పుత్రులగని వాన ప్రస్థాశ్రమమందుండి సన్యసింపవలెనని యాశ్రమ సముచ్చయపక్షము. "బ్రహ్మచర్యా దేపప్రవ్రజేద్గృహాద్వావనాద్వా అథ పునరవ్రతీ వావ్రతీవా స్నాతకోస్నాతకోవా ఉత్స న్నాగ్ని రసగ్నికోవాయదహరేవవిరజేత్తదహరేవప్రవ్రజేత్' అనఁగా బ్రహ్మచర్య మాత్రము నుండిగాని సమావర్తనముఁ జేసిగానిఁజేయకగాని స్నాతకుఁడైగాని గాకగాని గృహస్థుఁ డైగాని సాగ్నికుఁడై గాని యనగ్నికుడైఁగాని వనస్థుఁడై గానియే దినమందు వైరాగ్యముఁ గల్గునో యాదినమందే సన్యసింపవచ్చునని యాశ్రమ వికల్పపక్షము. మఱియును; "ప్రవ్రజే బ్రహ్మచర్యాద్వా ప్రవవ్రజేచ్చ గృహాదపి, వనాద్వా ప్రవ్రజేద్విద్వా నాతురోవాథ దుఃఖితః" అనువాక్యమందాతురుఁడనగ నాసన్నమరణుఁడు దుఃఖితుఁడనఁగ చోరాదిపీడితుఁడు వీరికిఁ గూడ సన్యాసమందధికారము. అందాతుర సంన్యాసమందు విధియాచరింప నక్కరలేదు. ప్రైషమాత్రము నుచ్చరింపఁజేసి సన్న్యాసముఁ జేయింపవలెను. దండగ్రహణము మొదలగు విధులతోగూడినవి వివిదిషాసన్న్యాస మందు బ్రాహ్మణులకే యధికారము. విద్వత్సన్న్యాసము క్షత్రియ వైశ్యులుగూడ జేయవచ్చును. కలియుగమందు సన్న్యాసనిషేధము త్రిదండి సన్న్యాస్యసమునకని ప్రాచీనులు చెప్పుదురు. సన్న్యాసము నాల్గువిధములు. కుటీచకుఁడు బహూదకుఁ డు హంసయు పరమహంసయునని అందుత్తరోత్తరము శ్రేష్ఠము. గ్రామముపైని గుడిసెలోగాని లేక గృహమందుగాని యుండి కాషాయవస్త్రములు ధరించి త్రిదండ ములు ధరించి శిఖాయజ్ఞోపవీతములతో బంధుగృహమందు భుజింపుచు నాత్మనిష్ఠుఁ డగువాడు కుచీచకుఁడు. పుత్రాది కుటుంబము వదలి యేడుగృహములందు నియమముతో భేక్షముగొనుచు మీఁదఁజెప్పిన కాషాయవస్త్రాది వేషముతో నుండువాఁడు బహూదకుఁడు హంససన్న్యాసి మీఁదఁజెప్పిన వేషముగల్గి యొక్క

దండమే ధరించువాఁడని తెలియునది. శిఖా యజ్ఞోపవీతములు విడిచి మీఁదఁ జెప్పిన ధర్మములతో నొకదండమునే ధరించువాఁడు పరమహంస యనఁబడును. అందు గాషాయవస్త్రము నల్గురికి సమానము. శిఖాయజ్ఞోపవీతములుండుట లేకుం డట హంసపరమహంసలకు భేదము. ఏకదండ మిద్దరికి సమానము. అందు బరమ హంసకు దండధారణము. వివిధిషాదశయందే నిత్యము. విద్వత్తాదశయందు గృతా కృతము. అందు వచనము. 'నదండం న శిఖానాంఛా దనంచరతి పరమహంసః' అని యున్నది. వైరాగ్యము లేక జీవనాదులకై సన్న్యసించెనేని నరకములగు అట్లు వచనము – శ్లో "ఏకదండం సమాశ్రిత్య జీవంతి బహవోనరాః, నరకే రౌరవే ఘోరే కర్మత్యాగా త్పతంతితే, కాష్ఠదండో ధృతేయేన సర్వాశీ జ్ఞానవర్జితః, సయాతి నరకం ఘోరం" అని యున్నది.

## సన్న్యాసము గ్రహించు విధి

అందుత్తరాయణము ప్రశస్తము. ఆతురసన్న్యాసమునకు దక్షిణాయనముఁ గూడ నగును. అందు గృహ్యాగ్ని గలవానికి నట్టివిధురునికిని బ్రయోగము. అపుడు శాంతి దాంతి మొదలగు లక్షణములుగల సద్గురువును వెదకి యాతనివద్ద మూఁ డు మాసములు యతిధర్మములఁ దెలిసికొని గాయత్రీ జపము రుద్రజపము కూశ్మాండ హోమములునుజేసి శుద్ధుఁడై రిక్తతిథియందు దేశకాలముల స్మరించి 'అముకస్య మమ కరిష్యమాణ సన్న్యాసేనేఽ ధికారార్థం చతుః కృచ్ఛ్రాత్మకం ప్రాయశ్చిత్తం ప్రతి కృచ్ఛ్రం తత్ప్రత్యామ్నాయైకైకగోనిష్క్రయ ద్వారాహ మాచరిష్యే కృచ్ఛ్రప్రత్యామ్నాయ గో నిష్క్రయద్రవ్యం విప్రేభ్యో దాతుమహముత్సృజే' యని సంకల్పించి రజతనిష్కము గాని తదర్థముగాని, లేక సగములో సగముగాని ప్రతిగోవునకు బ్రత్యామ్నాయముగ నీయవెలను. ఏకాదశియందుగాని ద్వాదశియందుగాని బ్రహ్మరాత్రియగునట్లు శ్రాద్ధము లారంభించవలెను. అందనా శ్రమస్థునికి చతుఃకృచ్ఛ్రము లితరునికి దప్తకృచ్ఛ్ర మని నిర్ణయసింధువు. తన నవశ్రాద్ధమునకు షోడశశ్రాద్ధసపిండీకరణములు సాగ్నికుఁ డైనచో బార్వణవిధిచేతను నిరగ్నికుఁడైనచో నేకోద్దిష్ట విధిచేతను జేయవలెనని కొందరు. కాదని యితరులు ఇఁక నెనిమితిశ్రాద్ధములు. అందాపస్తంబులకు హిరణ్య కేశీయులకును నగ్నౌకరణపిండాదులు లేకుండగ బార్వణవిధిచే బ్రయోగము. అశ్వ లాయనాదులకు సపిండముగ బార్వణవిధిచే బ్రయోగము:– అందు మొదట సవ్యముచే యవమిశ్రజలముతో శ్రాద్ధాంగతర్పణము. ఎట్లనిన; "బ్రహ్మాణం తర్ప యామి,విష్ణుం,మహేశ్వరం, దేవర్షీన్, బ్రహ్మర్షీన్, క్షత్రర్షీన్, వసూన్, రుద్రాన్, ఆది త్యాన్, సనకం, సనందనం, సనాతనం, పంచమహాభూతాని, చక్షురాదికరణాని, భూతగ్రామం, పితరం, పితామహం, ప్రపితామహం, మాతరం, పితామహీం, ఆత్మా నం, పితరం, పితామహం" అని యిట్లు నద్యాదులందుఁజేసి గృహమునకువచ్చి దేశకాలములఁ గీర్తించి "కరిష్యమాణ సన్న్యాసాంగత్వే నాష్టౌశ్రాద్ధానిపార్వణ విధి నాన్నే నామేనవా కరిష్యే."యని సంకల్పించి క్షణము నీయవలెను. ఇక్కడ సర్వము నాందీశ్రాద్ధమునకువలె నగును. కనుక నపసవ్య మక్కరలేదు. తిలస్థానమందు యవలు, ఇద్దరు మొదలుగ సరిసంఖ్యయే విప్రులకు గనుక విశ్వేదేవార్థ మిద్దరును నెనిమిది శ్రాద్ధములకు పదార్గురునని పదునెనమండ్రు విప్రులు. అందు సత్యవ

సుసంజ్ఞికులు విశ్వేదేవులు నాందీముఖులు 'స్థానేక్షణః కర్తవ్యః' అని యొకనివరించి రెండవదాని వరించునది. ఇట్లు ముందును గ్రహించునది. ప్రథమదేవ శ్రాద్ధమందు 'బ్రహ్మవిష్ణు మహేశ్వరా నాందీముఖాః స్థానేక్షణః ప్రియతాం' అనియు రెండవ ఋషి శ్రాద్ధమందు 'దేవర్షి, బ్రహ్మర్షి, క్షత్రర్షి,యోనాందీ...' అనియు, 'మూఁడవది దివ్యశ్రాద్ధమందు వసురుద్రాదిత్యరూపా నాందీ...' అనియు, మనుష్య శ్రాద్ధమందు 'పృథివ్యాది పంచమహాభూతా న్యేకాదశ చక్షురాది కరణాదిచతుర్విధ భూతగ్రామా నాందీ' అనియు, నారవపిత్ప శ్రాద్ధమందు 'పితృపితామహ ప్రపితామహానాందీ' అనియు, మాతృశ్రాద్ధమందు 'మాతృపితామహీ ప్రపితామహ్యోనాందీ' అనియు, నెనిమిదవయాత్మ శ్రాద్ధమందాత్మ పితృపితామహా నాందీముఖాస్థానేక్షణః క్రియతాం' అని యుచ్చరించునది. ఆత్మాంతరాత్మ పరమాత్మానః నాందీ' అని యుచ్చరింపవలె నని కొందరు ఇట్లిద్దరేసి విప్రులవరించి యంతటను 'నాందీముఖా' యనవలెను. సత్యవసు సంజ్ఞికులైనను దక్షక్రతు సంజ్ఞికులైనను విశ్వేదేవులు ఆపై నందరకు పాద్యమిచ్చి తూర్పు మొగముగ నుత్తర సమాప్తిగ గూర్చుండబెట్టి ప్రార్థింపవలెను. 'సంన్యాసార్థ మహంశ్రాద్ధం కుర్వేబ్రూత ద్విజోత్తమాః, అనుజ్ఞాం ప్రాప్యయుష్మాకం సిద్ధిం ప్రాప్స్యామి శాశ్వతీం' అని ప్రార్థించి 'కురు'అని ప్రతివచన మొంది యవలతో గూడిన తిన్నటి దూర్వాదియుగ్మములచే నుదకదాన పూర్వముగ సంబోధించితే 'ఇదమాసన' మని మొదలుగ బదునెనమంద్రకు నాసన మీయవలెను. ఆపై నాశ్వ లాయనుల కర్ఘ్య పాత్రాసాదనము ఆపస్తంబాదులకు సాంకల్పికమగుటచే నర్ఘ్యము లేదు. దేవార్థమొకటియు నెనిమిది పార్వణములకు నెనిమిదని తొమ్మిదియర్ఘ్య పాత్రలు. పవిత్రద్వయముచే గప్పిన యన్నిపాత్రలందును 'శంనోదేవీః' అని యుదకమువోసి విశ్వేదేవపాత్రయందు 'యవోసి'యని యవలును తక్కిన యెనిమిది పాత్రలందును 'తిలోసి' యని మంత్రమున కూహచే యవల నుంచి గంధాది పూజనము ఊహ యెట్లనిన; యవోసి సోమదేవత్యో గోసవేదేవ నిర్మితః ప్రత్నవద్భిః ప్రత్తః పృష్ట్యానాందీ ముఖాన్దేవాన్ ప్రీణయాహినః స్వాహా నమః' అని ప్రథమపాత్రమందును రెండవదాని యందు 'నాందీముఖాన్ ఋషీన్ ప్రీణయాహినః స్వాహా నమః' అని మూఁడవపాత్ర యందు 'నాందీముఖాన్ దివ్యాన్ ప్రీణయాహినః స్వాహా నమః' అనియు, చతుర్థమందు 'నాందీముఖాన్ మనుష్యాన్ ప్రీణయాహినః స్వాహా నమః' అనియు; పంచమమందు 'నాందీముఖాని భూతాని ప్రీణయాహినః స్వాహా నమః' అనియు; షష్ఠమందు సప్తమ మందు నష్టమమందును 'నాందీముఖాన్ పితౄన్ ప్రీణాయాహిన స్వాహా నమః' యనియు నుచ్చరించునది. ఒక్కొకపాత్రను రెండేసి భాగములుచేసి 'యాదివ్యా' యను మంత్రముచే నంతమున 'విశ్వేదేవా నాందీముఖా ఇదంవో అర్ఘ్య' మని యిచ్చి 'బ్రహ్మా విష్ణు మహేశ్వరా నాందీముఖా ఇదంవో అర్ఘ్య' మని యిచ్చి 'బ్రహ్మా విష్ణు మహేశ్వరా నాందీముఖా ఇదంవో అర్ఘ్యం స్వాహా నమమ'యని మొదలుగ నెవ్వరిది వారికి పదార్ఘరిహస్తములం దర్ఘ్య మీయవలెను. 'యాదివ్యా' యనునది వారిచేతి యుదకము జారుచుండఁగ ననుమంత్రణము పాత్రము బోర్లించి గంధము మొదలాచ్ఛాదనాంత పూజయు నందంతటను సంబుద్ధ్యంతముగ నాందీముఖ విశేషణ యుక్తముగ నుచ్చారణము భోజనపాత్రలు వ్రేసి బ్రహ్మ మొదలగు పదార్ఘరు విప్రుల

హస్తములందు 'అగ్నయే కవ్యవాహనాయ స్వాహా, సోమాయ పితృమతేస్వాహా' యను మంత్రములచే రెండేసి యాహుతు యవలెను. ఇట్లాపస్తంబాదుల కక్కరలేదు. పాత్రలు పరచి యన్నముగాని, లేక యామముగాని, లేక తన్నిష్క్రయద్రవ్యముగాని యుంచి ప్రోక్షించి పృధ్వీతేపాత్ర మనుమంత్రముచే యథాదైవతముగ నన్నాది త్యాగము. 'యేదేవాసః ప్రజాపతేన బ్రహ్మార్పణం, అనే నాష్టశ్రాద్ధేనవాం. దీముఖాదేవాః ప్రీయతాం' ఆపోశనమిచ్చిన పైని బలిదానము లేకుండ భుజింపవలెను. తృప్తులైన పైని 'ఉపాస్మై, అక్షన్నమీా, సంపన్న'మని యడుగగా రుచితమని ప్రతివచన మీయ వలెను. ఇద యామాన్నమందక్కరలేదు. విప్రులాచమించినపైనియవలు పేలాలు పెరుగు రేగుల బండ్లు గలపినయన్నముచే నలువదెనిమిది పిండములుచేసి తూర్పు మొదలుగ నుత్తరసమాప్తిగ నెనిమిది రేఖలుగీసి ప్రోక్షించి దర్భలుగాని దూర్వలుగాని పరచి పిండస్థానము లిరువదినాల్గింటియందును జలము విడువవలెను. అది యెట్లనిన; 'శుంధంతాం బ్రహ్మాణో నాందీముఖాః శుంధంతాం, విష్ణవో నాందీముఖాః శుంధం తాం, మహేశ్వరా నాందీముఖాః' అని ప్రథమరేఖయందును, దానికుత్తర మగురేఖ లందు 'శుంధంతాం దేవర్షయోనాం, శుంధంతాం బ్రహ్మర్షయోనాం' అని మొదలుగ నూహఁ దెలియునది. ఆపైని 'బ్రహ్మణేనాందీముఖాయ స్వాహా' యని యొకపిండ మిచ్చి రెండవదియు నిట్లనేయీయవలెను. లేదా యూరకయీయ వలెను. ఇట్లు ప్రతిదైవతమునకును రెండేసి అట్లుముందును 'విష్ణవేనాందీముఖాయ స్వాహా' యని మొదలుగ పిండదానమంత్రములూహించునది. 'అత్రపితరోమాద యధ్వ'మను మొద లగునది. తిరుగు 'శుంధంతా' మను తంత్రమంజనాభ్యంజనమును గృతాకృతము. పిండములను గంధాదులచే బూజించి నమస్కరించి యుపసంపన్న మని విసర్జించి విప్రులకు దక్షిణాదికము. ఇట్లు పిండదానాదిక మాపస్తంబాదులకు లేదు. కాత్యాయనుల కాశ్వలాయనులకు వలెనని యెఱుంగునది. అష్టశ్రాద్ధానంతర మాదినమందేయైనను ద్వితీయ దినమందైనను శిఖలో వెంద్రుక లారుమాత్రముంచి పక్షములు నుపస్థయుఁదప్పఁ దక్కిన కేశములను మీసము గడ్డము. గోళ్లునుదీయించు కొని స్నానముజేసి కౌపీనము నాచ్ఛాదనము హోమద్రవ్యము దప్ప తక్కిన యాస్తి యంతయు విప్రులకు బుత్రులకునిచ్చి వేయవలెను. కౌపీనము మొదలగునదియు జేగురు మొదలగువానిచే రంగువేసి వెదురుగట్టి త్వక్కుతోగూడినది శిరస్సు బొమలు లలాటము వీనిలో నొకదాని పర్యంతము పొడవైనది మొదలుతో గూడినది వ్రేలంత బలముగలది విప్రుఁడు తెచ్చినది పదునొకండుగాని తొమ్మిదిగాని నాల్గుగాని యేదు గాని గుంపులుగలది గుపులయందుండెడి ముండ్లతోగూడ ముద్రాయుక్తమైన దాని దండమునిమిత్తము సంపాదించి శంనోదకముచే ప్రణవము పురుషసూక్తము గేశవాది నామములు నుచ్చరింపుచు నభిషేకరించి యుంచవలెను. అటుపైని కమండలువు కౌపీనము నాచ్ఛాదనవస్త్రము కంథ యనఁగ నొక బొంతయు పాదుకలు నుంచవలెను. ఉట్టియు పాత్ర మొదలగునదియు నని కొందరు. ఇట్లుంచి దేశకాలములఁ గీర్తించి 'శేషదుఃఖ నివృత్తి నిరతిశయానంద ప్రాప్తిరూప పరమపురుషార్థ ప్రాప్తయే పరమహంస సన్న్యాసగ్రహణం కరిష్యే' తదంగతయా గణపతిపూజన పుణ్యాహవాచన మాతృకా పూజన నాంగీశ్రాద్ధాని కరిష్యే' యని సంకల్పించి యవి యాచరించి జపించవలెను.

ఎట్లనిన; 'బ్రహ్మణే నమః విష్ణవే నమః రుద్రాయ నమః సూర్యాయ, సోమాయ, ఆత్మనే, అంతరాత్మనే, అగ్నిమీళే,ఇషేత్వోర్జేత్వా, అగ్న ఆయాహి 'శంనోదేవీః' అను మంత్రములజపించి సత్తుపిండి మూఁడు పిడికిళ్లు ప్రణవమునుచ్చరింపుచు ముమ్మారు దిని నాభిని స్పృశింపవలెను. అపుడు 'ఆత్మనేస్వాహా అంతరాత్మనే పరమాత్మనే ప్రజపతయే స్వాహా' యను మంత్రములుచ్చరించునది. అటుపైని పాలు పెరుగును గలపిన యాజ్యముగాని జలము మాత్రముగాని త్రివృదసి యని యొకమారును ప్రవృదసి యని రెండవమారును దివృదసి యని యొక మారును ప్రవృదసి యని రెండవమారును దివృదసి యని మూఁడవ మారును భక్షించి ఆపః పునంతు అని జలముద్రావి 'ఉపవాసం కరిష్యే' యని సంకల్పించవలెను. ఇఁక సావిత్రీప్రవేశము. 'ఓం భూః సావిత్రీం ప్రవిశామి. ఓం తత్సవితుర్వరేణ్యం ఓంభువః సావిత్రీం ప్రవిశామి. భర్గోదేవస్య ధీమహి ఓంస్వః సావిత్రీం ప్రవిశామి. ధియోయోనః ప్రచోదయాత్ ఓం భూర్భువస్వః సావిత్రీం ప్రవిశామి. తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్యధీమహి ధియోయోనః ప్రచోదయాత్' అని యుచ్చరించి యటుపై సూర్యాస్తమయమునకు మున్ను గృహాగ్ని బ్రణయించి విచ్ఛిణ్నాగ్నికుఁడైనచో బునస్సంధానవిధిచేతను నిరగ్నికుఁడు గాని విదురుఁడుగాని పృష్టోదివివిధానము చేతనునగ్నిని సంపాదించునది. పృష్టోదివి విధానము కాత్యాయన వైశ్వదేవ ప్రకరణమందు బూర్వార్థములో జెప్పఁబడినది. ఇక నస్తమునకు బూర్వమే బ్రహ్మాన్వాధానము. ఎట్లనిన; 'సన్న్యాసంకరుర్తరం బ్రహ్మాన్వా ధానం కరిష్యే' యని సంకల్పించి యగ్నిధ్యానాదులు నాజ్యసంస్కారముజేసి స్రుక్స్రువ మును దుడిచి స్రుక్కునందు నాల్గు మారులాజ్యము గ్రహించి. 'ఓం స్వాహా పరమాత్మనే ఇదం' అని హోమము త్యాగ మును జేసి పరిషేచనము మొదలగునది చేయునది. ఇట్లు బ్రహ్మాన్వాధానము. అటు పైని సాయంసంధ్యయుహోమము వైశ్వదేవమునుజేసి యగ్ని సమీపమున జాగర ణముఁజేయునది. ప్రాతఃకాలమందు నిత్యహోమమై పైని వైశ్వదేవము మొదలుగ జేసి యాగ్నేయముగాని వైశ్వానరముగాని స్థాలీపాకముఁ జేయవలెను. అపుడు 'కరిష్య మాణసన్న్యాస పూర్వాంగభూతమాగ్నేయ స్తాలీపాకం కరిష్యే' యని సంకల్పము. అగ్నిని ధ్యానించి చక్షుషీ ఆజ్యేన యనునంతముజేసి 'అత్ర ప్రధాన మగ్నిం చరుణా శేషేణస్విష్టకృత' మని మొదలగునవి. అగ్నయే త్వాజుష్టం నిర్వపామి యని మొదలుగ నామచేతనే నిర్వాపము మొదలగునది నామచేతనే ప్రధానహోమము. ఇట్లు వైశ్వానర పక్షమందు నూహించునది. ఆపైని 'తరత్సమ్మదీ' యను నది జపించి కుశసువర్ణ రజతములలో గూడిన జలములచే స్నానముఁజేసి దేశకాలములు స్మరించి సన్న్యా సాంగమైన ప్రాణాదిహోమము పురుషసూక్తహోమము విరజాహోమమును 'తంత్రేణ కరిష్యే' యని సంకల్పించి అన్వాధానమందాజ్యేన యను నంతమందు 'ప్రాణాదిపంచ దేవతా స్సమిచ్చర్వాజ్యైః పురుషం పురుషసూక్తేన ప్రత్యృచం షోడశారం సమిచ్చర్వాజ్యైః ప్రాణాద్యేకోన వింశతి దేవతాః విరజామంత్రైః ప్రతిద్రవ్య మేకైక సంఖ్య సమిచ్చర్వాజ్యా హుతిభిః ప్రజాపతిం సకృదాజ్యేన శేషేణే త్యాదిగా నుచ్చరించి నూటయిరువదిమారు లూరకే నిరూపించి యట్లనే ప్రోక్షించి యుడికించి యాజ్యభాగాంత మందు 'ప్రాణాయ స్వాహా' యని మొదలుగ నైదు మంత్రములలో ద్రవ్యత్రయమనగ సమిచ్చ ర్వాజ్యములచే నొక్కొక్క యాహుతిచ్చి యథాదైవముగ త్యజించి 'సహస్రీర్షాయని మొదలు పదారు బుక్కులలో ప్రతిబుక్కు

నను వేర్వేరుగ ద్రవ్య త్రయమును వ్రేల్చి 'పురుషాయేదం నమమ' యని అంతటను త్యాగముఁ జెప్పవలెను. ఆపైని విరజా హోమము: "ప్రాణాపానవ్యానోదానసమానా మేశుధ్యంతాంజ్యోతిరహం విరజావిపాప్మా భూయాసం స్వాహా, ప్రాణాదిభ్య ఇదం, వాఙ్మనశ్చక్షుశ్శ్రోత్ర జిహ్వాఘ్రాణరేతో బుద్ధ్యాకూతి సంకల్పామే శుధ్యంతాం జ్యోతిరహం స్వాహా, వాగాదిభ్యఇదం, త్వక్చర్మమాంస రుధిరమేదో మజ్జాస్నాయవోస్తీని మేశుధ్యం తాం జ్యోతిరహం, స్వాహా త్వగాదిభ్యఇదం, శిరః పాణి పాదపార్శ్వపృష్ఠో రూదర జంఘాశిశ్నోపస్థ పాయవో మేశుద్ధ్యంతాం జోతి రహం, స్వాహా శిర ఆదిభ్య ఇదం, ఉత్తిష్ఠపురుషహరితపింగలలోహితాక్షదేహి దేహి దదాపయితామే శుధ్యంతాం జ్యోతి, స్వాహా, పురుషాదిభ్య ఇదం, పృథివ్యాపస్తేజో వాయురాకాశోమేశుధ్యంతాం, స్వాహా, పృథివ్యాదిభ్య ఇదం, శబ్దస్పర్శరూప రసగంధా మేశుధ్యంతాం,స్వాహా, శబ్దాదిభ్య ఇదం, మనోవాక్కాయకర్మాణి మేశుధ్యం తాం జ్యోతిరహం, స్వాహా మన ఆదికర్మభ్య ఇదం, అవ్యక్తభావై రహంకారై ర్జ్యోతిరహం, స్వాహా, అవ్యక్తాదిభ్య ఇదం, ఆత్మామే శుధ్యంతాం స్వాహా, అంతరాత్మన ఇదం, పరమాత్మామే శుధ్యంతాం, స్వాహా, పరమాత్మన ఇద, క్షుధే స్వాహా క్షద ఇదం, క్షుత్పిపాసాయ స్వాహా,క్షుత్పిపాఆయేదం వినిద్యైస్వాహా, వినిద్యా ఇదం, ఋగ్విధానాయ, కర్షోత్కాయస్వాహా, క్షుత్పిపాసామలాం జ్యేష్ఠా మలక్ష్మీంనాశయామ్యహం, అభూతి మసమృద్ధిం చ సర్వాంనిర్ణుదమే పాప్మానం స్వాహా, అగ్నయ ఇదం.అన్నమయ ప్రాణమయ మనోమయ విజ్ఞానమయానందమయ ఆత్మామేశుధ్యంతాం,స్వాహా, అన్నమయాదిభ్య ఇదం" అని యిట్లు సమిచ్చర్వాజ్యము లచే ప్రతి ద్రవ్యమును నలుబది యాహుతులు వ్రేల్చి 'యదిష్టం యచ్చపూర్తం యచ్చాపద్యనాపది. ప్రజాపతౌ తన్మనసి జుహోమి విముక్తోహం దేవకిల్బిషాత్స్వాహా' యని యాజ్యమువేల్చి 'ప్రజాపతయ ఇదం' అని త్యాగము జెప్పవలెను. అటుపైని పురుషసూక్తము 'నగ్నిమీళే' ఇత్యాది వేదచతుష్టయమును జపించి స్విష్టకృత్తు మొదలగు హోమశేషము సమాప్తినొందించి బ్రహ్మాచార్యాదులకు గోహిరణ్య వస్త్రాదులిచ్చి 'సం మాసించంతు మరుతః' అను మంత్రముచే గృహ్యాగ్నిని స్తుతించి యందు దారు పాత్రలు దహించవలెను. లోహ పాత్రలు గురునకీయవలెను. ఆపై నాత్మయందగ్ని సమారోపమును 'అయంతే యోనిః' అను ఋక్కును 'యాతే అగ్నేయజ్ఞియాతనూస్త యేహ్యారోహత్మాన'మను యజుస్సును ముమ్మారు పఠింపుచు నగ్నిజ్వాలను నోటితో గ్రహించుచు జేయవలయును. ఆపైని గృష్ణాజినముఁ దీసుకొని గృహమునుండి బయలుదేరి 'సర్వేభవంతు వేదాద్యా స్సర్వే భవంతు సోమపాః, సర్వేపుత్ర ముఖం దృష్ట్వా సర్వేభవంతు భిక్షుకాః' అని పుత్రాదుల కాశీర్వాదమిచ్చి 'నమేకశ్చిన్నాహం కస్యచిత్.' అని పుత్రాదులతో బలికి విడువవలెను. సరస్సునుఁజేరి దోసిలితో జలము గ్రహించి 'ఆశుశ్శిశాన' యను సూక్తముచే నభి మంత్రించి 'సర్వాభ్యో దేవతాభ్య స్స్వాహా'యని విడువవలెను. తిథ్యాదులస్మరించి 'అపరోక్ష బ్రహ్మావాప్తయే సన్న్యాసం కరోమి' యని జలాంజలి గ్రహించి 'ఏషహవా అగ్నిస్సూర్యః ప్రాణంగచ్ఛస్వాహా, ఓం స్వాం యోనిం గచ్ఛస్వాహా, ఓంఆపో వైగచ్ఛస్వాహా' యనుమంత్రమున జలాశయ ములో మూఁడుదోసిళ్లు జలము విడువవలెను. 'పుత్రేషణా విత్తేషణా లోకేషణా సర్వేషణా మయాత్యక్తా అభయం సర్వభూతేభ్యో మత్త స్స్వాహ' యని జలాంజలి

జలమందుఁ జల్లవలెను. తిరుగనిట్లభయమిచ్చి పలుక వలెను. "యత్కించి ద్భ్రంధనం కర్మ కృతమజ్ఞానతోమయా, ప్రమాదాలస్య దోషోత్థం తత్సర్వం సంత్యజామ్యహం త్యక్త సర్వోవిశుద్ధాత్మా గతస్నేహ శుభశుభః, ఏషత్యాజ్యామ్యహం సర్వం కామభోగ సుఖాదికం, రోషం తోషం వివాదం చ గంధమాల్యాను లేపనం, భూషణం నర్తనం గేయం దానమాదాన మేవచ, నమస్కారం జపం హోమం యాశ్చ నిత్యక్రియా మమ, నిత్యం నైమిత్తికం కామ్యం వర్ణధర్మాశ్ర మాశ్చయే, సర్వమేవ పరిత్యజ్య దదామ్య భయదక్షిణాం, పద్భ్యాంకరాభ్యాం విహర న్నాహం వాక్కాయ మానసైః కరిష్యే ప్రాణినాం పీడాం ప్రాణిన స్సంతునిర్భయాః" అనఁగా నజ్ఞానమున బ్రమాదాలస్య దోషములచే నిదివరకుఁ జేసిన కర్మబంధము విడిచితిని. సర్వమువిడిచి శుద్ధాంతః కరణముతో శుభాశుభములు స్నేహము వదలినందున నిప్పటినుండి నామభోగ సుఖములను దోషతోషములను వివాదము లను గంధమాల్య చందనాదులను నలంకారమును నృత్యము గానము దానము స్వీకారము నమస్కారము. జలము హోమము నిత్యనైమిత్తిక కామ్యకర్మలు వర్ణాశ్రమ ధర్మాభిమానము నీ సర్వము విడిచి భూతముల కభయదక్షిణ నిచ్చితిని పాదములచే హస్తములచే వాక్కాయ మనస్సులచే ప్రాణిపీడను జేయను, ప్రాణులు నిర్భయములై యుండవచ్చునని సూర్యాదిదేవతలను విప్రులను సాక్షిగ ధ్యానించి జలమందు నాభిపర్యంతముగ దిగి తూర్పు మొగముగ సావిత్రీ ప్రవేశము పూర్వమువలెఁ జేసి తరత్సమందీమంత్రములఁ బఠించి 'పుత్రేష ణాయా విత్తేషనాయా లోకేషణాయాశ్చ వ్యుత్థితోఽహం భిక్షాచర్యంచరామి యని జలమందు జలము విడువవలెను. ఇఁక ప్రైషోచ్చారము "ఓం భూః సంన్యస్తంమయా, ఓం భువః సంన్యస్తంమయా, ఓం స్వః సంన్యస్తంమయా, ఓం భూర్భువస్వః సంన్యస్తం మయా' యని ముమ్మారు మందమధ్యమోచ్చస్వరములచే బలికి 'అభయం సర్వభూతేభ్యో మత్తస్స్వాహా' యని జలమందు జలము విడువవలెను. శిఖ నూడదీసి యజ్ఞోపవీతము పైకెత్తి తీసి హస్తమున ధరించి 'ఆపోవై సర్వాదేవతాః సర్వాభ్యో దేవతాభ్యో జుహోమిస్వాహా, ఓంభూస్స్వాహా'యని జలముతో జలమందు వ్రేల్చవలెను. ఆపై నిట్లు ప్రార్థించునది. "త్రాహిమాం సర్వలోకేశ వాసుదేవ సనాతన, సన్న్యస్తం మేజగద్యోనే పుండరీకాక్ష మోక్షద, యుష్మచ్ఛరణ మాపన్నం త్రాహిమాం పురుషోత్తమ" అని యటుపై దిగంబరుఁడై యుత్తరముగ నైదడుగులు నడువవలెను. అపుడు వివిదిషుఁడనఁగ నాత్మజ్ఞానముబూర్ణముగ గోరువాఁడైనచో నాచార్యుఁడు నమస్కరించి కౌపీనాచ్ఛాదనములు దండము నీయవలెను. ఆపై నతఁడు కౌపీనమనఁగ గోచియు నుపవస్త్రమును గట్టుకొని "ఓంఇంద్రస్య వజ్రోసిసఖేమాం గోపాయ" యని దండమును గ్రహింపవలెను. వార్త్రఘ్న శర్మమేభవయత్పాపంతన్నివారయ' యని పలికి ప్రణవముచే గాని గాయత్రిచేగాని కమండలువును 'ఇదంవిష్ణుః' అను మంత్రముచే నాసనమును గ్రహింపవలెను. ఆపైని సమిధలు హస్తమందు ధరించి గురునకు నమస్కరించి గురుఁడాసనమనఁగ గాళ్ళు వెనుకకు మణిచి చేతులు జోడించి గూరుచుండి గురుని ప్రార్థించునది. "త్రాయస్వభో జగన్నాథ గురో సంసారవహ్నినా, దగ్ధం మాం కాలదష్టం చ త్వామహం శరణంగతః, యోబ్రహ్మాణం విదధాతిపూర్వం యోవైవేదాంశ్చ ప్రహిణోతి తస్మై, తం హ దేవ మాత్మ బుద్ధిప్రకాశం ముముక్షుర్వైశరణ మహంప్రపద్యే" అని గురుని బ్రార్థించి కుడిమణుకు వంచి గురుపాదములు గ్రహించి 'అధీహి భగవో

బ్రహ్మన్' యని యడుగవలెను. ఆపైని గురుఁడాత్మను బ్రహ్మరూపముగ ధ్యానించి జలపూర్ణమైన శంఖమును బంద్రెండుమారులు ప్రణవముచే నభిమంత్రించి దానిచే శిష్యు నభిషేకించి 'శంనోమిత్ర' యని శాంతిని బఠించి యతని శిరస్సుపై హస్తముంచి పురుష సూక్తముఁ జపించి హృదయమందు హస్తముంచి 'మమవ్రతే హృదయంతే దధామి' యనుమంత్రముఁ బఠించి కుడిచెవిలో బ్రణవము నుపదేశించి దానియర్థమైన పంచీకరణాదులు బోధించి 'ప్రజ్ఞానం బ్రహ్మ,అయమాత్మా బ్రహ్మ, తత్త్వమసి, అహం బ్రహ్మాస్మి' యను ఋగ్వేదాది మహావాక్యములలో నొకటి శిష్యుని శాఖ ననుసరించి యుపదేశించి దాని యర్థముఁ దెలుపవలెను. ఆపైని సంప్ర దాయము ననుసరించి తీర్థులనిగాని యాశ్రములనిగాని మొదలగువానిలో నొకనామముంచవలెను. అటుపైని పర్యంకశౌచముఁ జేయించి యోగపట్ట మీయవలెను.

## పర్యంకాశౌచ ప్రయోగము

ఒకానొక పుణ్యదినమందొక గృహస్థుఁడు తనయెదుట పీఠముపై యతిని గూర్చుండబెట్టి గురుననుజ్ఞచే 'యతయేపర్యంకశౌచం కరిష్యే' యని సంకల్పించి వామభాగమందు పూర్వసమాప్తిగ నైదు మంటిపోగులును కుడివైపు నట్లనే యైదుంచి రెండువైపులను చెంబులతో నుదకమునుంచి యెడమపోగులలో మొదటిభాగముచే నైదుమారులు జలముగలపి యతియొక్క తొడలు రెండుచేతులతో నొక్కమారే కడుగ వలెను. ఇట్లైదవమారు గడుగుటతో మృద్భాగము సరిపోవలెను. ఇట్లముందును దెలియవెలను. ఆపైని కుడివైపుభాగములలో మొదటిభాగము సగముచే దన యెడమ చేతిని మృజ్జలములచే బదిమారులు గడిగి రెండవసగముచే తన రెండుచేతులు నుదకముతో నేడుమారులు గడుగవలెను. ఇట్ల ముందును తెలియునది. సంఖ్యలో భేదము మాత్రము చెప్పఁబడును. ఎడమవైపు రెంవమంటిపోగుచే యతి యొక్క పిక్కలు రెండును రెండుచేతులతో మీఁదఁజెప్పినట్లై దుమారులు గడిగియట్లు కుడివైపు రెండవభాగములలో సగముచే దన యెడమహస్తము నేడుమారులునునాల్గుమారులు రెండుచేతులును గడిగికొనవలెను. అట్లు వామమందలి తృతీయమృత్తికచే యతి గుల్ఫములనఁగ బాదములగుత్తులు రెండును రెండుచేతులతో ముమ్మారు గడిగి కుడివైపు మృద్భాగము సగమున నారుమారులును దనయెడమచేతిని నాల్గుమారులు తక్కిన సగముచే రెండుచేతులును గడగికొనవలెను. ఇఁక నెడమ నాల్గవభాగముచే యతి యొక్క మీగాళ్లు రెండును రెండుచేతులతో రెండుమారులు గడిగి కుడివైపు మంటిలో సగమున దనయెడమ చేయి నాల్గుమారులును రెండుచేతులు గలపి దక్కిన సగముచే రెండుమారులు గడగికొనవలెను. ఇఁక నెడమ యైదవభాగముచే యతియొక్క యరికాళ్ళు రెండును రెండుచేతులతో నొక్కమారే గడిగి కుడివైపు మంటిలో సగముచే దనయెడమచేయి రెండుమారులును తక్కిన సగముచే రెండు హస్తములు నొకమారును గడగికొనవలెను. ఇఁక యోగపట్టము. ఇట్లు పర్యంక శౌచముఁ జేయింపఁబడిన యతి కటిశౌచముఁ జేసుకొని కటిసూత్రము గోచియు ధరించి వస్త్రముచే ముసుకువేసుకొని గుర్వనుజ్ఞచే బీఠముపై గూరుచుండి సభ్యులతో గూడ వేదాంతమందు గొంచె ముపన్యసింపవలెను. గురువు శిష్యుఁడైన యతి శిరస్సున శంఖముచే పురుషసూక్తము నభిషేకించి వస్త్రగంధ పుష్పధూపదీపనైవేద్యములచే

బూజించి వస్త్రము మీఁదఁబట్టి యతులతోగూడ విశ్వరూపాధ్యాయమును 'పశ్యామి దేవాన్' అని మొదలుగ 'భుంక్ష్వ రాజ్యం సమృద్ధం' అనుదాని పర్యంతముఁ బఠించి పూర్వమందు గల్పించిన నామము నీయవలెను. ఆపైని శిష్యునితో నిట్లు చెప్పవలెను. ఇక్కడినుంచి నీవు సన్న్యాసాధికారులకు సన్న్యాసమీయవచ్చును. దీక్షాయోగ పట్టాదికము చేయవలెను. మున్ను సన్న్యసించిన పెద్దలకు నమస్కరింపుము. అని గురుఁడు కటిసూత్రమును పంచముద్రలతోగూడిన దండమీఁదఁ జెప్పినదియు నీయవలెను. ఆపైని శిష్యునికి సంప్రదాయముననుసరించి నమస్కరించవలెను. తక్కిన యతులును గృహస్థులును నమస్కరించునది. శిష్యుఁడు 'నారాయణ' యని యుచ్చరించి పీఠము దిగియందు గురుని గూరుచుండఁబెట్టి యథావిధిగ నమస్కరించి తక్కిన యతులకును నమస్కరింపవలెను. ఇట్లు గృహ్యాగ్నిఁ గలవానికి విధురాదులకును సన్న్యాసప్రయోగవిధి.

## శ్రౌతాగ్ని గలవానికి విశేషము

అందు శ్రౌతాగ్నులు విచ్ఛిన్నమైన యెడ పురాధానమును పావమానేష్టి పర్యంతముఁజేసి లేక పూర్ణాహుతిపర్యంతముఁజేసి ప్రాయశ్చిత్తము మొదలుగ సావిత్రీ ప్రవేశ పర్యంతము పూర్వమువలెఁ జేసి యిక బ్రహ్మాన్వాధానముఁ జేయునది. అగ్నిత్రయముఁ బ్రణయించి స్రుక్కునం దాజ్యము సంస్కరించునది. పలుమారు గ్రహించి ఆహవనీయాగ్ని యందు బూర్ణాహుతిని "ఓం స్వాహా పరమాత్మన" అని వేల్చవలెను. సాయంసంధ్యాగ్ని హోత్రముఁజేసి గార్హపత్యాగ్ని కుత్తరముగ రెండేసి పాత్రలనాసాదించి హవనీయాగ్నికిఁ దక్షిణముగ గౌపీనదండాదుల నాసాదించవలెను. రాత్రి జాగరమైన పైని పాత్రహోమముఁజేసి పౌర్ణమాసియందు బ్రహ్మాన్వాధానమైనచోఁబౌర్నమాసీనిష్టి జేసి దర్శేష్టియు పక్షహోమాకపకర్ష పూర్వముగ నపకర్షించి యపుడే చేయవలెను. దర్శయందే బ్రహ్మాన్వాధానమైనచో దర్శేష్టియే చేయవలెను. దర్శఆపైని పూర్ణిమయందుగాని దర్శయందు గాని దేశకాలములఁకీర్తించి 'సన్న్యాస పూర్వాంగ భూతయా ప్రాజాపత్యేష్ట్యా వైశ్వానర్యేష్ట్యా చమానతం త్రయా యక్ష్యే' యని సంకల్పించి సముచ్చయముచే నిష్టిద్వయముఁ జేయునది. ఇక్కడ వైశ్వానరము ద్వాదశకపాలపురోడాశము ప్రాజాపత్యచరువు విష్ణుదేవతాకము నవకపాలము పురోడాశము లేదా కేవల ప్రాజాపత్యేష్టియుగావచ్చును. అందుఁ బ్రయోగము దమతమ సూత్రముననుసరించిఁ దెలియునది.బౌధాయన సూద్రము ననుసరించి కొంచెము చెప్పఁబడును. పవన పావన పుణ్యాహవాచనాది పూర్వాంగములుచేసి కేవల వైశ్వానరేష్టికిగాని కేవల ప్రాజాపత్యేష్టికిగాని సంకల్పము. వ్రీహిమయపురోడాశము ద్రవ్యముప్రయాజలైదు వైశ్వానరాగ్నిదాని ప్రజాపతిగాని పదునైదుసమిదెలు వ్రతగ్రహణమైన పైని నధ్వర్యుఁ డాజ్యము సంస్కరించి స్రుక్కునందు పలుమారు గ్రహించి 'పృథివీహోతా'యని మొదలగు చతుర్హోతృ హోమమును కూశ్మాండహోమ సారస్వతహోమములును జేసి నిర్వాపాదికము, వైశ్వానరము, ద్వాదశకపాల పురోఢాము, ప్రాజాపత్యము, చరువు 'వైశ్వానరాయ ప్రతివేదయామః' అనునది 'పురోనువాక్య' వైశ్వానరః పవమానః పవిత్రైః అనునదియాజ్య, ప్రాజపత్యేష్టియందు ప్రధానము, ఉపాంశుధర్మము, 'సుభూః స్వయంభూః అని మొదలగునదిపురోనువాక్యలు. 'ప్రజాపత్యే నత్వదేతాన్యను

నదియాజ్య' ఇఁకస్రువముచే నెనిమిది యుపహోమము లుభయమందుఁ జేయవలెను. ఎట్లనిన; వైశ్వానరోన ఉత్యాప్రయాతు పరావతః,అగ్నిరేక్థేన వాహసాస్వాహా వైశ్వానరాయేదం, ఋతానవాం వైశ్వానరమృతస్య జ్యోతిష్పతి, అజ్జస్రం ధర్మమీ మహేస్వాహా, వైశ్వానరస్య దశస్వాహా, పృష్టోదివి పృష్టోఅగ్నిః స్వాహా, జాతోయ ద్ని స్వాహా, త్వమగ్నేశోచిషా స్వాహా, అస్మాకమగ్నేస్వాహా, వైశ్వానరస్య సుమతౌ దగ్ని స్వాహా, వైశ్వానరాయేదం' అనియిట్లు హోమము త్యాగముఁ జేయవలెను. ఆపైని 'సహస్రశీర్షా' యను సూక్తముచే స్తుతించి స్విష్టకృత్తు మొదలగు శేషము సమాప్తి నొందింపవలెను. 'సర్వోవైరుద్రః విశ్వంభూతం' అని రెంటిచే నగ్నికుత్సర్గము. 'ఆయుర్దా అగ్నేయను మంత్రముతోదర్భ స్తంభమందున్న యజమాన భాగములో గొంచెము దీసి 'సహస్రీర్షా' యనునసువాకముచే బరక్షించి "ఓమిత్రి బ్రహ్మా, ఓమితీగ్ం సర్వ'మను ననువాకముచే హుతశేషము నాహవనీయమందు విడువవలెను. ఇట్లు రెంటిలో నొకయిష్టిని జేసి ఔపాసనాగ్ని యందుగాని, సర్వాధానమైనచో దక్షిణాగ్ని యందుగాని ప్రాణాది హోమము మొదలుగ విరజాహోమాంతముఁ జేయవలెను. తక్కిన పాత్రలన్నియు నాహవనీయాగ్నిలో దహించి దానినాత్మయిం దారోపించుట పూర్వమువలెఁ జేయునది. అరణలు రెండును గార్హపత్యాగ్నిలో దహించి దాని కాత్మా రోపణముఁజేసి రోకలి రోలులు నను పాత్రలు రెండును, దక్షినాగ్నిలో దహించి దానికి నాత్మరోపమని క్రమము ఇక్కడ విశేషము గ్రంథాంతరమందుఁ దెలియునది. స్నాతకుని కగ్నిలేదు. కనుక బ్రహ్మాన్వాధాన విరజాహోమాదులు ఏలకుండగనే ప్రయోగము గావచ్చును.

## ఆతురసన్న్యాస విధి

ఆతురసన్న్యాసమందు సంకల్పము ప్రేషోచ్చారణము నభయదానము నీ మూడును బ్రధానముగఁ జేయునది. అష్టశ్రాద్ధము మొదలుగ దండ గ్రహణాంతము నంగము యథాసంభవముగఁ జేయునది. ఇఁక దాని ప్రయోగము. మంత్ర స్నానముఁ జేసి శుద్ధవస్త్రము ధరించి 'జ్ఞానప్రాప్తి ద్వారా మోక్షసిద్ధ్యర్థమాతుర విధినాసన్న్యాసమహం కరిష్యే' యని సంకల్పించి శిఖలో నారువెంద్రుకలు మాత్రముంచి క్షౌరముఁ జేసు కొని స్నానానంతర మౌపాసనాంతము యథాసంభవముగఁజేసి యాయగ్ని నాత్మా రోగముగఁ జేయవలెనని భావము. అగ్నిహోత్రి యైనచో బ్రాజాపత్య స్థానమందు : బూర్ణాహుతిఁజేసి శ్రౌతాగ్నికి నాత్మారోపముఁజేయునది. విచ్ఛిన్నాగ్నికులకుఁబున రాధానము సంభవించినయెడ నాత్మారోపములేనిచో లేదు. విధురాదుల కగ్నియే లేదు గనుక సమారోపమక్కరలేదు. అటుపై నుదకము గ్రహించి యుదకమందే హోమము. శ్లో॥"ఏషహవా అగ్నేర్యోనిర్యః ప్రాణః ప్రాణంగచ్ఛస్వాహా, ఆపోవైసర్వా దేవతా స్సర్వాభ్యో దేవతాభ్యో జుహోమిస్వాహ భూస్వాహా." యని జలమందు జల ముచే వ్రేల్చి హుతశేషమైన జలమాశుశ్శికానయను మంత్రానువాకముచే నభిమం త్రించి 'పుత్రేషణావిత్తేషణాలోకేషణా మయాత్యక్తా' యని కొంచముఁ ద్రాగవలెను. 'అభయం సర్వభూతేభ్యో మత్తస్స్వాహా' యని తక్కినది గొంత ద్రాగవలెను. 'సన్న్యస్తం మమాయా' యని మూఁడవ మారు నిశ్శేషము ద్రాగవలెను. ఆపైని సావిత్రీ ప్రవేశము.

ఆపైని ప్రాఙ్ముఖుఁడై బాహువులనెత్తి ప్రేషోచ్చారణము పూర్వమువలెఁ జేయునది. 'అభయం సర్వభూతేభ్యో మత్తస్స్వాహా' యని తూర్పు మొగమై జలముజల్లి వేయ వలెను. శిఖనుబీకి యజ్ఞోపవీతముఁ దెంపి 'భూస్స్వాహా' యని జలమందు వ్రేల్చి పుత్ర గృహమందు వసింపఁగూడదు. మిక్కిలి యాతురుఁడైనచో పైషమాత్రమైనను నుచ్చరింపవలెను. జీవించెనేని స్వస్థుఁడై మహావాక్యోపదేశము దండగ్రహణాదికముఁ జేయవలెను. ఇట్లాతురవిధిచే సన్న్యసించి మృతుఁడైనచో సన్న్యాసికివలె సంస్కారముఁ జేయునది.

## మృతినొందిన యతికి సంస్కారము

పుత్రుఁడుగాని శిష్యుఁడుగాని స్నానముఁజేసి క్షౌరము కృచ్ఛ్రత్రయములు నధికార సిద్ధికై చేయవలెను. పుత్రునికిఁదప్ప తక్కినవారికి వపనము కృతాకృతము దేశకాలములు స్మరించి' బ్రహ్మీభూతస్యయతే శ్శౌనకోక్తవిధినా సంస్కారం కరిష్యే' యని సంకల్పించి క్రొత్తకలశము తీర్థముచే నింపి 'గంగేచ యమునేచైవ, నారాయణ పరం బ్రహ్మ, యచ్చకించి జ్జగత్సర్వం' అను మంత్రములచే నభిమంత్రించి రుద్ర సూక్తము విష్ణు సూక్తము నాపోహిష్ఠాదులు వీనిచే యతికి స్నానముఁజేయించి చంద నాదులచే బూజించి మాల్యాదులచే నలంకరించి వాద్యఘోషాదులతో శుద్ధదేశము నొందింపవలెను. జలమందుగాని స్థలమందుగాని సమాధినిష్ఠునిఁ జేయవలెను. స్థల మందుఁ జేయునెడ గోతిలో వ్యాహృతులచే బ్రోక్షింపుచు దండము పరిమితిగ ద్రవ్వినదానిలో సూక్ష్మముగ మూరెడున్నర గోయిత్రవ్వి సప్తవ్యాహృతులతో పంచ గవ్యముచే ముమ్మారు బ్రోక్షించి నదియందైనను నిట్లు బ్రోక్షించి దర్భలుపరచి సావిత్రిచే దేహము ప్రోక్షించి శంఖోదకముచే పురుషసూక్తము నూటయెనిమిదిమారులు ప్రణ వము నుచ్చరించుచు స్నానముఁ జేయించి యష్టాక్షరమంత్రముచే షోడశోపచార ములఁ బూజించి తులసీమాలాదుల నలంకరించి 'విష్ణోహవ్యంరక్షస్వ' యని దేహ మును గర్తమందైనను నది యందైనను విడువవలెను. 'ఇదం విష్ణుః' అను మంత్ర ముచే దండము మూఁడు ముక్కలుగ విరిచి హస్తమందుంచవలెను. "హగ్ం సశ్శుచి షత్, పరేణనాకం నిహితం గుహాయాం, విభ్రాజదేతదత్యతయోవిశంతి, వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థా స్సన్న్యాసయోగా ద్యతయశ్శుద్ధసత్వాః" అని హృదయమందును పురుషసూక్తమును భ్రూమధ్యమందును జపింపవలెను. బ్రహ్మజిజ్ఞానం అని శిరస్సు నందును భూర్భువస్స్వశ్చ యని శంఖముచే శిరస్సును బ్రద్ధలుగఁ గొట్టవలెను. లేదా "భూమిర్భూమి మగన్మాతా మాతరమప్యగాత్ భూయాన్మేపుత్రైః పశుభిర్యో నోద్వేష్టి సభిద్యతాం." అనుమంత్రముచే పరశువనఁగ గండ్రగొడ్డలి మొదలగువానిచే భేదింప వలెను. శిరస్సునుగొట్టుట కశక్తుఁడైనచో శిరసునందుంచిన గుడపిష్ఠాదిపిండమును భేదించునది. పురుషసూక్తముఁ బఠింపుచు నుప్పుబోసి గోతిని పూడ్చవలెను. కుక్కలు నక్కలు దీయకుండ నిసుక మొదలగునవి పైఁ గప్పవలెను. నద్యాదులందుఁ జేయునెడ శిరోభేదసమైన పైని దర్భలచే నాచ్ఛాదించి వ్యాహృతులతో నభిమంత్రించి యొక రాయిగట్టి "ఓం స్వాహా"యని మడుగులో విడువవలెను. ఆపైని "అగ్నినాగ్నిస్సం,

త్వంహ్యగ్నేగ్నినా, తం మర్జయంతసుక్రతుం, యజ్ఞేన యజ్ఞమయజంత” యను నాల్గు ఋక్కులచేతను ‘చిత్తిస్రుక్’ అని మొదలుగ దశహోత్రాది సంజ్ఞిక యజుర్మంత్రముల చేతను నభిమంత్రించవలెను. ‘అతోదేవా’ యనునది జపించి ‘పాపైర్ముక్తా అశ్వమేధాదిఫల భాగినోవయం’ అని భావింపుచు నవభృథ మనుమనుబుద్ధిచే నందరు ననుగమించి స్నానముఁజేసి గంధపుష్పాదుల ధరించి యుత్సవముతో గృహమునకు వెళ్లవలెను. ఇచ్చట పరమహంసునికి స్థలమందు సమాధియే ముఖ్యము. జలమందు మధ్యమము. అట్లు వచనము – “కుటీచకంతు ప్రదహే త్పూరయేచ్చ బహూదకం, హంసోజలేదు నిక్షేప్యః పరహంసం ప్రపూరయేత్.” అని యనఁగా కుటీచకసన్న్యాసిని దహింపవలెను. బహూదకసన్న్యాసిని యనఁగా కుటీచకసన్న్యాసిని జలమందుంచ వలెను. పరమహంస సన్న్యాసిని మీఁదఁజెప్పినవిధిచే స్థలమందుంచవలెనని యర్థము. ఇక్కడ ‘పరమహంసం ప్రకీర్తయేత్’ అని కొన్ని గ్రంథములలో పాఠము. అనఁగా స్థాపించవలెనని యర్థము. “ఏకోద్దిష్టం జలంపిండ మాశౌచం ప్రేతసత్క్రియాం, న కుర్యా ద్వార్షికాదన్య ద్బ్రహ్మీభూతాయభిక్షవే, కుటీచ కాతిరేకేణ న దహేద్యతినం క్వచిత్” అనఁగా సన్న్యసించి బ్రహ్మీ భూతుఁడైన వానిని వార్షిక శ్రాద్ధము తప్పఁ దక్కినయే కోద్దిష్ట శ్రాద్ధము నుదకదానము పిండము ప్రేతసత్కారము మొదలగునవి యేదియుఁ జేయఁగూడదు. కుటీచకుఁడు తప్ప దక్కి యతినెవ్వరినిఁ దహింపఁ గూడదు. అటుపైని గర్త స్నానముఁజేసి యాచమనపూర్వముగ ‘సిద్ధింగతస్య బ్రహ్మీ భూతభిక్షో స్తృపత్యర్థంతర్పణం కరిష్యే యని సంకల్పించి సవ్యముగనే దేవతీర్థము చేతనే ఆత్మానంతర్పయామి; అంతరాత్మానం తర్పయామి, పరమాత్మానం తర్పయామి, అని నాలుగేసి మారులు తర్పణముఁజేసి శుక్లపక్షమందు మృతుఁడైనచో కేశాది ద్వాదశనామములచేతను కేశవంతర్పయామి యని మొదలుగ ద్వితీయాంతములుగ నుచ్చరింపుచు తర్పణముఁ జేయవెలను. ఈతర్పణము క్షీరముచేత ననికొందరు. ఆపైని ‘సిద్ధింగతస్య భిక్షోస్తృప్త్యర్థం నారాయణపూజనం బలిదానం ఘృతదీపదానం చ కరిష్యే’ యని సంకల్పించి దేవయజనస్థలమందైనను తీరమందైనను మృన్మయ లింగముఁజేసి పురుషసూక్తముచే నష్టాక్షర మంత్రముచేతను షోడశోపచార పూజను జేసి ఘృతమిశ్రపాయసము బలినిచ్చి, ఘృతదీపము సమర్పించి పాయసబలిని జల మందు విడువవలెను. ఆపైని “ఓంనమోబ్రహ్మణేనమః” అని సంకల్పముచే నెనిమి దర్ఘ్యములిచ్చి గృహమునకు వెళ్లవలెను. ఇది ప్రథమదినకృత్యము. ఇట్లు పదిదినముల పర్యంతము ప్రత్యహమును తర్పణము లింగపూజయు పాయసబలి దీపదానాదిక మును జేయవలెను. ఇఁక నేకాదశదినమున బార్వణ శ్రాద్ధము,. అపుడు మధ్యాహ్న మందు నద్యాదులలో దిలతర్పణము శ్రాద్ధాంగముగఁజేసి దేశకాలముల స్మరించి ప్రాచీనావీతియై ‘అముకగోత్రస్యాముకశ్మరణో బ్రహ్మీ భూతస్యా స్మత్పితుః కరిష్యమాణ దర్శ్యాది సర్వశ్రాద్ధాదిక కారార్థం ఆద్యపార్వణ శ్రాద్ధంకరిష్యే’ అని పుత్రాది కర్తలు సంకల్పించునది. శిష్యుఁడైనచో ‘బ్రహ్మీభూతస్య గురోః ప్రత్యబ్దాదిశ్రాద్ధాదికారార్థం తత్పితృసంబంధి నామగోత్రోద్దేశ్యతాసిద్ధ్యర్థం చ పార్వణ శ్రాద్ధం కరిష్యే’ యని

సంకల్పించునది. తక్కినది సమానము. పురూరవార్ద్ర వసంజ్ఞికులు విశ్వేదేవులు. పితృపితామహ ప్రపితామహులను నామగోత్రాదులతో నుచ్చరింపవలెను. అంతటను పితకు బ్రహ్మీభూతయని విశేషణ మధికము. తక్కినది ప్రత్యాబ్దికమువలెఁ జేయునది. కొందరు శిష్యుఁడు కర్తయైనచో నాత్మాంతరాత్మ పరమాత్మలనుద్దేశించి సాధురురు సంజ్ఞిక విశ్వేదేవులతో సర్వము చేతనే దేవధర్మముతో నాందీశ్రాద్ధమువలె నేకాదశ దినమందుఁ బార్వణ శ్రాద్ధముఁ జేయవలెనంద్రు. ఇక్కడ నంతట విస్తరము సన్న్యాస పద్ధతి యను గ్రంథమున దెలియునది.

## నారాయణబలి

దేశకాలములస్మరించి 'సిద్ధింగతస్య భిక్షోస్సంభావిత సర్వపాప క్షయపూర్వకం విష్ణులోకావాప్తిద్వారా శ్రీనారాయణ ప్రీత్యర్థం నారాయణబలిం కరిష్యే' యని సంకల్పించి పదుమగ్గురు యతులను గాని విప్రులనుగాని నిమింత్రించి శుక్లపక్షమైనచో 'గేశవరూపి గుర్వర్థేత్వ యాక్షణః కర్తవ్యః' అని మొదలుగ దామోదరాంతములైన కేశవాదినామములచే క్షణమీయవలెను. కృష్ణపక్షమైనయెడ సంకర్షణాది నామములు పంద్రెండింటిచే క్షణము. పదుమూఁడవ విప్రునికి 'విష్ణ్వర్థంత్వ యాక్షణః కర్తవ్యః' అని మొదలుగ దామోదరాంతములైన కేశవాదినామములచే క్షణ మీయవలెను. కృష్ణపక్షమైనయెడ సంకర్షణాది నామములు పంద్రెండింటిచే క్షణము. పదుమూఁడవ విప్రునికి 'విష్ణ్వర్థంత్వ యాక్షణః కర్తవ్యః' అని నిమంత్రించి పాదములు గడిగి యందరను బ్రాఙ్ముఖులుగా గూర్చుండఁబెట్టవలెను. విప్రులయెదుట స్థండిలమందగ్ని ప్రతిష్ఠాపనము మొదలగునది అన్వాధానమం చక్షుషీ ఆజ్యేన యను నంతమున 'నగ్నింవాయుం సూర్యం ప్రజాపతిం చ వ్యస్త సమస్త వ్యాహృతి భిరేకకయాపాయ సాహుత్యా విష్ణుమతోదేవా ఇతిషడ్భిః ప్రత్యృచమేకైక పాయసాహుత్యా నారాయణం పురుష సూక్తేన ప్రత్యృచమేకైక పాయసాహుత్యా శుక్లేకేశవాది ద్వాదశ దేవతాః కృష్ణే సంకర్షణాది దేవతాః ఏకైక పాయసాహుత్యా శేషేణస్విష్టకృతమని'యుచ్చరించి నూట యేబది రెండుపిడికిళ్లను నిరోపించి బలికిఁదగినంత బియ్యమునుంచి ముప్పది మూడాహుతులకును పురుషాహార పరిమితమైన విష్ణునైవేద్యమునకును తగునంత క్షీరముచే వండి యాజ్యభాగాంతమందు నగ్నికిఁ బూర్వముగ సాలగ్రామమందు విష్ణుని బురుష సూక్తమునను అష్టాక్షరమంత్రమునను షోడశోపచారములచే బూజించి స్రుక్కుచే గాని హస్తముచేగాని యన్వాధానానుసారముగ హోమత్యాగములు చేయునది. ఇట్లు శుక్ల పక్షమందు గేశవాది దామోదరాంత ద్వాదశాహుతలవరకుగాని కృష్ణపక్షమందు సంకర్షణాది ద్వాదశాహుతుల పర్యంతముగాని ముప్పదియెనిమిదాహుతుల వ్రేల్చి స్విష్టకృత్తు మొదలుగ హోమశేషము సమాప్తినొందించి తిరుగ సాలగ్రామమును బూజించి విష్ణుగాయత్రిచే విష్ణున కర్ఘ్యమిచ్చి హుతశేషపాయసముచే విష్ణునికి బలియిచ్చినిమంత్రించిన పదుముగ్గురు విప్రులను కేశవాది రూపులను కేశవరూప గురవే ఇదమాసనమని మొదలుగ నాసన గంధపుష్ప ధూపదీపాచ్ఛాదనముల నిచ్చి పదుమూఁడవ విప్రులనందుఁ బురుషసూక్తముచే బ్రతిఋుక్కు నంతమునను 'విష్ణవే

నమః' అని యిట్లుచ్చరింపుచు దీపాంతోపచారములచే విష్ణుని బూజించునది. చతురశ్రమండలములుచేసి వానియందు పదుమూఁడు భోజనపాత్రలమర్చి యుపస్తరణముఁజేసి యన్నము పరిషేకించి 'పృథివీతేపాత్రం'అని మొదలగుదానిచే కేశవాదుల బండ్రెండుగురను విష్ణును నుద్దేశించి యన్న త్యాగముఁజేసి అతోదేవాః 'ఓం తద్బ్రహ్మ ఓంతద్వాయుః, బ్రహ్మార్పణం అని మొదలుగ బఠించి యాపోశనము ప్రాణాహుతులునైన పైని నారాయణా ద్యుపనిషత్తులుఁ బఠించునది. తృప్తిప్రశ్నాంత మందు వారాచమనముఁజేసిన పైని తూర్పున కగ్రములుగ దర్భలు పరచి యష్టాక్షరమంత్రమున నక్షతోదకమిచ్చి 'కేశవరూపిణేగురవేఽ యం పిండ స్వాహా నమమ' యని యిట్లు ద్వాదశనామములచే నుద్దేశింపుచు ద్వాదశపిండము లీయవలెను. కృష్ణపక్షమందు సంకర్షణాది నామములచే నని తెలియునది. పిండములందు విష్ణుని బూజించి పురుష సూక్తముచే స్తుతించి విసర్జింపవలెను. 'నాభ్యాఆసీత్' అని మొదలగు ఋక్కులు మూడింటిచే దాంబూలదక్షిణ నిల్చి నమస్కరించి యాసాలగ్రామ మూర్తి నాచార్యుని కీయవలెను.

## ఆచారము చొప్పున నారాధనము

ద్వాదశదినమందుగాని త్రయోదశదినమందుగాని యారాధనము. దాని ప్రయోగమెట్లనిన; దేశకాలముల గీర్తించి 'శ్రీనారాయణ ప్రీత్యర్థ మారాధనం కరిష్యే' యని సంకల్పించి 'గుర్వర్థేక్షణః కర్తవ్యః' అనియు నిట్లు. 'పరగుర్వర్థే పరమేష్ఠి గుర్వర్థే' యనియు నల్గురు బ్రాహ్మణుల నిమంత్రించి శుక్లపక్షమందు కేశవాది నామములచే తను కృష్ణపక్షమందు సంకర్షణాది నామములచేతను బండ్రెండుగురు విప్రులను నిమంత్రించునది. ఇట్లు పదార్గురు విప్రులనుగాని యతులనుగాని నిమంత్రించవలెను. అశక్తిలో యథాశక్తి విప్రులను నిమంత్రించి యథాయథముగఁ బదారు క్షణములిచ్చి యందఱకు బాదప్రక్షాళనముఁజేసి యాచమించి పాదప్రక్షాళనోదకమును పాత్రాంతరమందుంచి గంధపుష్పాదులచే బూజింపవలెను. విప్రులను దూర్పునకైన నుత్తరమునకైన నభిముఖులుగ గూర్చుండబెట్టి, షోడశోపచారములచేగాని గంధాది పంచోపచారములచేగాని పూజించి వ్యంజనములతోగూడ నన్నము వడ్డించి గాయత్రిచే బ్రోక్షించి 'గురవే ఇదమన్నం పరివిష్టం పరివేష్యమాణం చాతృప్తేస్వాహా హవ్యం నమమ' యని యిట్లు పరమగురువు మొదలగు పదునైదుగురికి నన్న త్యాగముఁజేసి బ్రహ్మార్పణమని మొదలుగఁబఠించి భోజనానంతర యాచమనముఁ జేసినపైని తాంబూల దక్షిణావస్త్రాదులచే బూజింపవలెను. ఇక్కడ గొందరు పూర్వ పాదోదక పూజను జేయుదురు. అది యెట్లనిన; తీర్థపాత్రను తండులాదులచే జేసిన మండలమందుంచి పురుషసూక్తముచే 'దీర్ఘరాజాయనమః' అని షోడశోపచారములఁ బూజించి తత్పాత్రమును శిరస్సున ధరించి బంధువులతో విప్రులను దక్షిణముఁ జేసి 'గురుర్బ్రహ్మా గురుర్విష్ణు' అని నమస్కరించి మొదలిటివిప్రుని హస్తముచే నాతీర్థము గ్రహించునది. అపుడు మంత్రము 'అవిద్యా మూలశమనం సర్వపాప ప్రణాశనం, పిబామి గురుపత్తీర్థం పుత్రపౌత్ర ప్రవర్ధనం'అని యుచ్చరింపుచుఁ ద్రాగవలెను.

కర్మ నీశ్వరార్పితముఁజేసి మిత్రులతో భుజించునది. వర్షపర్యంతము ప్రతిమాస మందును మృతతిథియందిట్లారాధనముఁ జేయవలెను. మాసికశ్రాద్ధ మక్కరలేదు. ప్రతిసంవత్సరమును బార్వణశ్రాద్ధముఁజేసి యారాధనముగూడఁ జేయవలెను. అటు పైని దర్శమహాలయాది శ్రాద్ధములును నెప్పటియట్లఁ జేయునది. కాని యపుడు విశేష మేమియులేదు. ఇట్లు యత్యారాధనవిధి. ఇక్కడ నారాయణబలియు బార్వణ శ్రాద్ధము నొకదినమందే చేయుపక్షమున నేకాదశదినమందైనను ద్వాదశమందైనను మొదట నారాయణ బలిఁజేసి యాపై పార్వణశ్రాద్ధముఁ జేయునది. రెండుదినముఁ జేయునెడ నేకాదశమందుఁ బార్వణ శ్రాద్ధము ద్వాదశదినమున నారాయణబలియుఁ జేయునది. ద్వాదశమందైనను త్రయోదశదినమున నారాయణ బలియుఁ జేయునది. ద్వాదశమందైనను త్రయోదశమందైనను నారాధనము. ఊనమాసికాది కాలమందు నారాధనమే యని కొందరు. ప్రతిమాసమందారాధన మని యితరులు. పార్వణ శ్రాద్ధము పదునొకండవ దినమందును ప్రత్యబ్దమందునే చేయవలెను. అదియును పుత్రాదులకే నియతము. శిష్యాదుల కక్కరలేదు. పుత్రులు లేనియెడ శిష్యుఁడును ప్రత్యబ్దము పార్వణశ్రాద్ధమే చేయునది. అందునిమిత్తమున నామగోత్రాద్యుద్దేశాధి కారమునకు నేకాదశదినమందును శిష్యుఁడు పార్వణ శ్రాద్ధమునే చేయునది. నారాయణబలి మొదలగునది ద్వాదశ దినాదులందు సంభవించినచో శుక్లపక్షమందు పంచమిశ్రవణము ద్వాదశి యమావాస్య యనునివి గౌణకాలములు. ఇందు పూర్వ పూర్వము శ్రేష్ఠము. భార్యగాని కన్యగాని కోడలుగాని యతిసంస్కారమునకు గర్తయైనచో విధవకు క్షౌరముఁజేయించి కృచ్ఛ్రత్రయము చేయించునది. సువాసిని యైనచో గృచ్ఛ్రములు మాత్రమే. పుత్రుఁడు దేశాంతరస్థుడై తండ్రియైన యతి మరణము వినినచో క్షౌరపూర్వముగ స్నానముఁజేసి క్షీరతర్పణము పూజనము మొదలగునది దశాహాంతముఁజేసి, యేకాదశాదిదినముల బార్వణము నారాయణ బలి మొదలగు నది యెల్లను జేయవలెను. జ్యేష్ఠుఁడు సన్నిధానమందుండి చేసెనేని గనిష్ఠుఁడు దూరమందుండినను జేయనక్కరలేదు. శుక్లకృష్ణాది భేదమున గేశవాది నామభేదము మృతతిథి ననుసరించియే గ్రహించవలెను. వార్తాశ్రవణ తిథినిబట్టి కూడదు. మృతతిథి తెలియనిచోనదియుఁ గూడును. యతికి సంస్కారముఁ జేయు టచే నశ్వమేధ సహస్ర ఫలము. యతిదేహము సంస్కారము లేక చెడిపోయినచో నాదేశమునందు దుర్భిక్షము నధర్మము మరణమును సంభవించును. “దివంగతే గురౌ శిష్య ఉపవాసం తదాచరేత్, న స్నానమాచరే ద్భిక్షుః పుత్రాది నిధనేశ్రుతే. పిత్రు మాతృ క్షయం శ్రుత్వా స్నానాచ్ఛుధ్యతి సాంబరాత్.” అనఁగా శిష్యుఁడైన యతియు గురుమృతియందాదిన ముపవాసముఁ జేయునది. పుత్రాదుల మృతియందు స్నానమైన నక్కరలేదు. తలిదండ్రుల మరణ మందు మాత్రముపచేలస్నానము జేయునది.

## యతిధర్మములు

ప్రాతఃకాలమునలేచి బ్రహ్మణస్పతే యని జపించి దండాదులు మృత్తికయు దీసుకొని మూత్రపురీషోత్సర్గమందు గృహస్థులకంటె నాల్గురెట్టులు శుద్ధిజేసుకొని

యాచమించి పర్వము ద్వాదశితప్పఁ దక్కినదినముల ప్రణవముతో దంతధావనముఁ జేసి మృత్తికచే కటిప్రదేశమునకు పైని గడిగి జలతర్పణము లేకుండఁగ స్నానముఁ జేసి తిరుగఁ బిక్కలను గడగి వస్త్రాదులు గ్రహించి ప్రణవముచే మార్జనాదికముఁ జేసి కేశవాది నమ్మబ్దాంతనామములచే దర్పణముఁజేసి 'భూస్తర్పయామి' యని మొద లుగ వ్యస్తసమస్త వ్యాహృతులచేతను 'మహర్జనస్తర్పయామి' యను నంతముగ తర్ప ణముఁ జేయునది. ఇక్కడ విశేషము మాధవాదులందును విశ్వేశ్వరి మొదలగు దానియందును గ్రహించునది. సూర్యోపస్థానము మొదలగునదియు ద్వికాల విష్ణు పూజాదికమును నిర్ణయసింధువునందుఁ దెలియునది. "విధూమేసన్నముసలే వ్యగారే భుక్తవర్జనే, కాలేపరాహ్ణే భూయిష్ఠే నిత్యం భిక్షాం యతిశ్చరేత్." అనఁగా గృహస్థుల యిండ్లలో భోజనములైనపైని యపరాహ్ణముఁ దాటుననఁగా భిక్షకు వెళ్ళవలెను. అనగా దనకై వారు యత్నింప గూడదని తాత్పర్యము. ఇక్కడ భిక్షాభేదములు గ్రంథాం తరమున దెలియునది. అందాత్మజ్ఞానము గోరినయతికి మాధుకరభిక్ష ముఖ్యము. దండవస్త్రాదులయందు సహితము విరక్తుఁడయినవానికి గరపాత్రము ముఖ్యము. అనఁగా గృహస్థు లిచ్చుకబలము నపుడే తినుట. తిక్కనపక్షము లశక్త విషయములు. అందు మాధుకరీపక్షమందు దండాదులు గ్రహించి యయిదుగాని యేడుగాని గృహ ముల భిక్షను యాచించి తెచ్చి యన్నము ప్రోక్షించి 'భూస్స్వధానమ' యని మొదలుగ వ్యస్తసమస్తవ్యాహృతులచే సూర్యాదిదేవతలకును సర్వభూతములకును భూమియందుఁ గొంతయిచ్చి తక్కిన యన్నము విష్ణునకు నివేదించి భుజించునది. చండీ వినాయకాదు లకు నివేదనజేసినది. భుజింపఁగూడదు. ఇట్లు భుజించి యాచమనము జేసి పదారు ప్రాణాయామములుఁ జేయవలెనని సంక్షేపము. శ్లో॥ "యతిహస్తే జలం దద్యా చ్ఛిక్షాందద్యా త్పునర్జలం భైక్షం పర్వతమాత్రం స్యాత్తజలం సాగరోపమం'. అనఁగా గృహస్థులు యతిహస్తమందు ముందు జలమిచ్చి యటుపైని భిక్షాకబలమిచ్చి తిరుగ జలమిచ్చినచో నాభిక్షాకబలము పర్వతమంత పరిమాణముగలది వలెను. నాజలము సాగర మంతదివలెను ఫలమిచ్చును. "ఏకరాత్రం వసేద్గ్రామే నగరే పంచరాత్రకం, వర్షాభ్యోన్యత్రవర్షాసు మాసాంస్తు చతురోవసేత్, అష్టౌమాసా న్విహారస్స్యా ద్యతీనాం సంయతాత్మనాం, మహాక్షేత్ర ప్రవిష్టానాం విహారస్తు న విద్యతే." అనఁగా వర్షాకాలము నాల్గుమాసములు తప్ప దక్కిన యెనిమిది మాసములును సంచారము చేయునది. చేయునపుడు గ్రామమునందొక రాత్రము నగరమందు బంచరాత్రము నివసించు నది. మహాక్షేత్రమందుఁ బ్రవేశించిన యతికిట్లు నియమ మక్కరలేదు. శ్లో. "భిక్షాటనం జపస్స్నానం ధ్యానం శౌచం సురార్చనం, కర్తవ్యా నిషడేతాని సర్వథానృప దండవత్, మంచకం శుక్లవస్త్రం చ స్త్రీ కథా లౌల్యమేవచ దివాస్వాపశ్చయానం చ యతీనాం పతనానిషట్, వృథాజల్పం పాత్రలోభం సంచయం శిష్యసంగ్రహం, హవ్యం కవ్యం తథాన్నంచ వర్జయేచ్చ సదాయతిః" అనఁగా భిక్షాటనము జపము స్నానము ధ్యానము శుద్ధి దేవార్చనము నను నీయారును రాజాజ్ఞవలె నాచరించునది. మంచముపై బండుకొనుటయు శుద్ధవస్త్రము స్త్రీలకథలు వస్తువులందు లోలతయు దివానిద్రయు యానమెక్కుటయు నీయారును యతులకు పాతముఁ గలుగజేయునవి. మరియు వృదా సంభాషణము పాత్రాదులందు లోభము ద్రవ్యము సంపాదించుటయు శిష్యుల

సంగ్రహించుటయు హవ్యకవ్యములు వానియన్నము నెల్లపుడు వర్జింపవలెను. శ్లో॥ యతిపాత్రాణి మృద్వేణు దార్వలా బుమయానిచ, న తీర్థవాసీ నిత్యంస్యా న్నో పవాస పరోయతిః” న చాధ్యయన శీల స్స్యాన్నవ్యాఖ్యాన పరోభవేత్.” అనఁగా యతికి మృన్మయములు వెదురుది కఱ్ఱవి యానబతుంబిలు మొదలగునవియే పాత్రలుండ వలెను ఎల్లపుడును దీర్థవాసమును దీర్ఘకాల ముపవాసములు వేదార్థము తప్ప నితర గ్రంథములు చదువుటగాని చెప్పుటగాని మొదలగునవి గూడదు. ఇట్లు సంక్షేప ముగ యతిధర్మములు విస్తరము మాధవీయమితాక్షరాదులందుఁ దెలియునది. శ్లో॥ “ప్రథమేత్రపరిచ్ఛేదే కాలసా మాన్య నిర్ణయః ద్వితీయేథ పరిచ్ఛేదే విశేషాత్కాల నిర్ణయః తృతీయస్య చ పూర్వార్ధే గర్భాధానాది సంస్క్రియాః, ఆహ్నికం చ ప్రకీర్ణార్థా ఆధానాద్యా స్సవిస్తరాః, దేవప్రతిష్ఠా శాంత్యాదినిత్యం నైమిత్తికం తథా,తార్తి యీకోత్తరా ర్ధేస్మిన్ జీవత్పితృక నిర్ణయః శ్రాద్ధాధికారకాలాదే ర్నిర్ణయ శ్శ్రాద్ధపద్ధతేః, సూతకాదే ర్నిర్ణయశ్చ నిర్ణయో దుర్మృతావపి, అంత్యేష్టి సంస్కారవిధి స్సన్న్యాస స్సహవిస్తరః, ప్రాయశ్చిత్తం వ్యవహృతిం సర్వదాన విధింవినా, కృత్స్నోపి ధర్మశాస్త్రార్థ స్సంక్షేపేణాత్ర కీర్తితః విబుధానాం చ బాలానాం తుష్టయే కష్టహానయే, మూలాభూతాని పద్యాని వికృతాని క్వచిత్క్వచిత్, నిర్వికారాణ్యపినవా నప్యుక్తా న్యత్ర కానిచిత్.” అనఁగా నీ గ్రంథమందుఁ జెప్పిన విషయముల సూచి యిట్లు చెప్పబడెను. శ్లో. “మీమాంసా ధర్మశాస్త్రజ్ఞా స్సుధియో నలసాబుధాః, కృతకార్యాః ప్రాజ్ఞ్ని బంధై స్తదర్థై నాయముద్యమః యేపున ర్మందమతయోలసా అజ్ఞాశ్చ నిర్ణయం, ధర్మేవేదితు మిచ్ఛంతి రచితస్తదపేక్షయా, నిబంధోయం ధర్మసింధు సారనామా సుబోధనః, అమునా ప్రీయతాం శ్రీమద్విఠ్ఠలో భక్తవత్సలః ప్రేమ్ణాసర్భిస్యేవ్యో గ్రంథస్సుద్భిశ్శబ్దార్థత స్సదోషోపి, సంశోధ్యవాపి హరిణా సుదామముని దత్తపృథుక ముష్టిరివః” ఈ శ్లోకముల యర్థము మీఁద వ్రాయబడినది. అనఁగా పండితులును శాస్త్రార్థనిశ్చయముఁ జేయుట కలసతలేనివారును గొందరుం డుదురుగాక! వారికైనను శ్రమ లేకుండఁగ శాస్త్రార్థనిర్ణయముఁ దెలియుటకును చిరకాలము విద్యాభ్యాసము చేయుట కలసులై ధర్మనిశ్చయము సులభముగఁ దెలియఁ గోరెదు తక్కినవారికందరకు మనోరథ పూర్తి కొరకు నీ ధర్మసింధుసారము రచియింపఁ బడియెను.

ఇది శ్రీకాశ్యుపాధ్యాయ పౌత్రుడు ననంతపాధ్యాయ పుత్రుడు నగు కాశీనాథోపాధ్యాయునిచే రచియింపఁ బడిన ధర్మసింధుసారమున దృతీయపరిచ్ఛేదోత్తరార్ధము

ఇట్లు కలికాలదుర్బలాయుశ్శ్రద్ధామేధా విజ్ఞానబల సకలమనుష్య సంగ సముద్ధరణ నిర్వ్యాజదయామూర్తులును శ్రీమద్విజయనగర సంస్థాన నిరతిశ యోదయ ప్రతిష్ఠాపననిష్ఠాగరిష్ఠులును శ్రీమత్పూషవాడ్వంశ పయః పారావార రాకా సుధాకరులును స్వప్రతిభాదృషన్నికషకషితా శేష భాషావిశేషశాస్త్ర ప్రవరులును హిజ్ హైనెస్ ది మహారాజా ఆఫ్ విజయనగరం, కే.సి. ఐ.ఇ. వారగు శ్రీమదానంద గజపతి మహారాజచంద్రులచే నాజ్ఞప్తుఁడై తత్సభాస్థానమాన్య మానుఁడైన కొల్లూరు కామశాస్త్రిచే రచియింపఁబడిన యాంధ్రధర్మసింధు సారమున దృతీయ పరిచ్ఛేదోత్త రార్ధము సర్వము సంపూర్ణము.

ధర్మసింధు సంపూర్ణము. DURGA CHARAN

OWNER OF BOOK : DURGA CHARAN NELABHOTLA

## మావద్ద లభించు గ్రంథములు

### 1. వ్రతకథలు - పూజలు

| | | |
|---|---|---|
| 1. | శ్రీ వినాయక వ్రతం వెల రూ. | 7-50 |
| 2. | శ్రీ విఘ్నేశ్వరపూజా-పుణ్యాహవాచనం | 25-00 |
| 3. | శ్రీ విఘ్నేశ్వరపూజ (కాణిపాకక్షేత్రమాహాత్మ్యంతో) | 10-00 |
| 4. | సంకష్టహరచతుర్థి శ్రీమహాగణపతి వ్రతం | 25-00 |
| 5. | వరలక్ష్మి వ్రతం | 7-50 |
| 6. | కేదారేశ్వర వ్రతం | 7-50 |
| 7. | త్రినాధ వ్రతం(కలర్) | 7-50 |
| 8. | త్రినాధవ్రతం(సాదా) | 5-00 |
| 9. | క్షీరాబ్ధి వ్రతం | 10-00 |
| 10. | మంగళ గౌరీవ్రతం | 10-00 |
| 11. | వైభవలక్ష్మి వ్రతం ఫోటో యంత్రంతో | 18-00 |
| 12. | శ్రీలక్ష్మి కుబేర వ్రతం (ఫోటో యంత్రంతో) | 18-00 |
| 13. | కనకమహాలక్ష్మి వ్రతం (కామేశ్వరీపాటతో) | 20-00 |
| 14. | సంతోషీమాతా వ్రతం | 20-00 |
| 15. | ఏడు శనివారాల వ్రతం | 20-00 |
| 16. | సత్యనారాయణవ్రతం | 20-00 |
| 17. | శ్రీ సువర్చలాహనుమద్దీక్ష | 20-00 |
| 18. | శివదీక్ష | 10-00 |
| 19. | కాత్యాయనీ వ్రతం | 20-00 |
| 20. | సౌభాగ్య గౌరీవ్రతం | 20-00 |
| 21. | తిరుప్పావై (ధనుర్మాసవ్రతం) | 36-00 |
| 22. | స్త్రీల వ్రతకథలు | 30-00 |
| 23. | స్త్రీలవ్రతకథలుస్థూలాక్షరి(నేదునూరిగంగాధరరావుగారి) | 54-00 |

| | | |
|---|---|---|
| 24. | స్త్రీలపాటలు (కామేశ్వరీపాటతో) | 36-00 |
| 25. | సర్వదేవతా పూజావిధానం | 20-00 |
| 26. | ఆరువ్రతాలు | 30-00 |
| 27. | ధన్వంతరీ వ్రతకల్పం | 10-00 |
| 28. | రాహుకాలంలోదుర్గాదేవీపూజా | 10-00 |
| 29. | తులసి నిత్యపూజ, తులసీఉపయోగాలు | 10-00 |
| 30. | శ్రీ చక్రపూజ | 10-00 |
| 31. | శ్రీ చక్ర రహస్య విజ్ఞానమ్ | 36-00 |
| 32. | శ్రీచక్ర పూజావిధానం(పెద్దది) | 36-00 |
| 33. | లక్ష్మీ - గౌరీ నిత్యపూజ | 10-00 |
| 34. | శ్రీలలితానిత్యపూజ(లలితాసహస్రనామస్తోత్రంతో) | 10-00 |
| 35. | శ్రీ గాయత్రీ నిత్యపూజ | 10-00 |
| 36. | అన్నపూర్ణ నిత్యపూజ | 10-00 |
| 37. | శ్రీ సరస్వతీ నిత్యపూజ | 10-00 |
| 38. | మహిషాసుర మర్ధనీపూజ | 10-00 |
| 39. | రాజరాజేశ్వరీ నిత్యపూజ | 10-00 |
| 40. | శ్రీ దుర్గానిత్యపూజ | 10-00 |
| 41. | కాలభైరవ నిత్యపూజ | 10-00 |
| 42. | శివపూజ | 10-00 |
| 43. | వీరభద్ర పూజ | 10-00 |
| 44. | ఆంజనేయ నిత్యపూజ | 10-00 |
| 45. | నాగేంద్ర స్వామి పూజ | 10-00 |
| 46. | సుబ్రహ్మణ్య నిత్యపూజ | 10-00 |
| 47. | రామదేవుని కథ | 10-00 |
| 48. | శివదేవుని కథ | 10-00 |

| | |
|---|---|
| **49.** లక్ష్మీనరసింహపూజ | **10-00** |
| **50.** వేంకటేశ్వరపూజ | **10-00** |
| **51.** బ్రహ్మంగారి నిత్యపూజ | **10-00** |
| **52.** సూర్య నిత్యపూజ | **10-00** |
| **53.** నవగ్రహ నిత్యపూజ | **10-00** |
| **54.** రుక్మిణీ కల్యాణం | **20-00** |
| **55.** ఉమామహేశ్వర వ్రతం | **20-00** |
| **56.** శ్రీ కామేశ్వరీ వ్రతం | **20-00** |
| **57. 16** సోమవారముల వ్రతము | **20-00** |
| **58.** పార్వతీకల్యాణం | **20-00** |
| **59.** సహస్రకమలవర్తి వ్రతము | **20-00** |
| **60.** పంచముఖ ఆంజనేయనిత్యపూజ | **20-00** |
| **61.** అష్టనాగపూజ | **36-00** |
| **62.** పూజలు ఎందుకుచేయాలి ? | **36-00** |
| **63.** ఏ దేవునికి ఏపుష్పాలతో పూజించాలి? | **36-00** |
| **64.** ఏ దేవునికి ఏప్రసాదం నైవేద్యం పెట్టాలి? | **36-00** |
| **65.** ఏదేవునికి ఏవిధముగాదీపారాధనచెయ్యాలి? | **36-00** |
| **66.** ఏదేవునికి ఎన్ని ప్రదక్షిణలుచేయాలి ? | **36-00** |
| **67.** హనుమద్ వ్రతం | **36-00** |
| **68.** పంచాయతన పూజ | **45-00** |
| **69. 28** వ్రతములు | **108-00** |
| **70.** కలశపూజలు **(9**ఒకేసారి**)** | **150-00** |
| **71.** కలశపూజలు **(**విడివిడిగా**)** (ప్రింటులో) | **150-00** |
| **72.** హ్రీంకార మహాయజ్ఞం (ప్రింటులో) | **150-00** |
| **73.** అర్చన | **40-00** |

74. శ్రీరామ కర్ణామృతము 99-00
75. శ్రీ దేవీ భాగవతం 99-00
76. శ్రీ దేవీ భాగవతం (కేస్‌బైండ్) 360-00

## 2. స్తోత్రాలు-సుప్రభాతములు సహస్రనామములు

1. శ్రీ లలితా విష్ణు సహస్రనామస్తోత్రాలు 40-00
పురాణపండ రాధాకృష్ణమూర్తిగారి సంకలనం
2. లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (హిందీ) ,, 40-00
3. లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (ఇంగ్లీషు) ,, 40-00
4. స్థూలాక్షరిలలితావిష్ణుసహస్రనామస్తోత్రములు
(పత్రికసైజ్ బైండ్) 99-00
5. సర్వదేవతా స్తోత్రమంజరి 108-00
6. సకలదేవతా అష్టోత్తరశతనామావళిః (63) 20-00
7. విష్ణుసహస్రనామస్తోత్రమ్ (క్రౌన్) 20-00
8. లలితా సహస్రనామ స్తోత్రమ్(క్రౌన్) 36-00
9. లలితా సహస్రనామములు 20-00
10. లక్ష్మీ సహస్రనామములు 20-00
11. దుర్గా సహస్రనామములు 20-00
12. ఆంజనేయ సహస్రనామములు 20-00
13. శివ సహస్రనామములు 20-00
14. విష్ణు సహస్రనామములు 20-00
15. గణపతి సహస్రనామములు 20-00
16. సుబ్రహ్మణ్య సహస్రనామములు 20-00
17. గాయత్రి సహస్రనామములు 20-00
18. లలితావిష్ణు సహస్రనామస్తోత్రాలు 20-00
19. శ్రీరామా సహస్రనామములు 20-00

| | |
|---|---|
| **20. లక్ష్మీనృసింహసహస్రనామములు** | **20-00** |
| **21. సరస్వతి సహస్రనామములు** | **20-00** |
| **22. లక్ష్మీగణపతి సహస్రనామములు** | **...** |
| **23. సూర్యసహస్రనామములు &ఆదిత్యహృదయం** | **20-00** |
| **24. శ్రీవేంకటేశ్వరసహస్రనామములు** | **20-00** |
| **25. మణిద్వీపవర్ణన (పెద్దది)** | **20-00** |
| **26. సంధ్యావందనం** | **20-00** |
| **27. మంత్రపుష్పమ్** | **20-00** |
| **28. త్రిభాషా హనుమాన్‌చాలీసా** | **10-00** |
| **29. హనుమాన్ చాలీసా** | **9-00** |
| **30. మణిద్వీపవర్ణన** (పాకెట్) | **10-00** |
| **31. ఆరు చాలీసాలు** | **10-00** |
| **32. శివారాధన** (శివస్తోత్రాలు) | **10-00** |
| **33. వేంకటేశ్వర సుప్రభాతం** (పాకెట్) | **10-00** |
| **34. ఆరుదండకాలు** | **6-00** |
| **35. వేంకటేశ్వర గోవిందనామములు** | **6-00** |
| **36. అష్టలక్ష్మి స్తోత్రమ్ కనకధారాస్తోత్రమ్** | **10-00** |
| **37. దేవీఖడ్గమాలాస్తోత్రమ్** (మహిషాసురమర్దనీస్తోత్రంతో) | **10-00** |
| **38. బాలాత్రిపుర సుందరీ నిత్యపూజ** | **10-00** |
| **39. సుందరకాండ** (పాకెట్) | **10-00** |
| **40. భగవద్గీత మూలం** | **20-00** |
| **41. రామరక్షాస్తోత్రమ్** | **15-00** |
| **42. స్తోత్ర రత్నావళి** | **36-00** |
| **43.** పురాణపండ**లలితా-** | |

| | | |
|---|---|---|
| | విష్ణు సహస్రనామస్తోత్రమ్(మినీ) | 10-00 |
| 44. | పురాణపండ లలితాసహస్రనామస్తోత్రమ్(మినీ) | 10-00 |
| 45. | పురాణపండ విష్ణు సహస్రనామస్తోత్రమ్ | 10-00 |
| 46. | పురాణపండ ఆదిత్య హృదయం | 10-00 |
| 47. | మంత్రపుష్పం (మినీ) | 10-00 |
| 48. | శివానందలహరి-సౌందర్యలహరి | 36-00 |
| 49. | కుజదోషం | 10-00 |
| 50. | కాలసర్ప దోషం | 10-00 |
| 51. | మీ అప్పులు తీరాలా? | 10-00 |
| 52. | దృష్టిదోషాలు నివారణ | 10-00 |
| 53. | సర్వదేవతా ధ్యానశ్లోకములు | 10-00 |
| 54. | పంచసూక్తములు | 10-00 |
| 55. | సంధ్యావందనం | 10-00 |
| 56. | రుద్రనమకమ్-చమకమ్ | 10-00 |
| 57. | గాయత్రీమంత్రాలు | 10-00 |
| 58. | జపమంత్రాలు | 10-00 |
| 59. | హయగ్రీవ స్తోత్రమాల | 10-00 |
| 60. | దక్షిణామూర్తి స్తోత్రమాల | 10-00 |
| 61. | ద్వాదశ జ్యోతిర్లింగాలు-పంచారామాలతో | 10-00 |
| 62. | శ్రీసూక్తం పురుష సూక్తం | 10-00 |
| 63. | నవదుర్గలు | 10-00 |
| 64. | నవగ్రహస్తోత్రమాల | 36-00 |
| 65. | మహాన్యాసమ్ | 36-00 |
| 66. | సుందరకాండ గానామృతం | 36-00 |
| 67. | సంధ్యా వందనం (పెద్దది) | 36-00 |

68. గోమాతపూజావిధానము 10-00

69. ఆనందసిద్ధి - శ్రీదేవీ స్తోత్రమాల 108-00

70. ఆనందసిద్ధి - 2 ఏ సమస్యకు
ఏ స్తోత్రమ్ పారాయణచేయాలి 108-00

71. శ్రీ లలితా విష్ణుసహస్రనామ స్తోత్రములు (కేస్‌బైండ్) 72-00

72. నిత్యదేవతార్చన 45-00

73. శ్రీలలితా సహస్రనామములు-విపులవివరణసహితం 144-00

74. శ్రీ దుర్గాసప్తశతి-(చండీ) హోమవిధానము 250-00

## 3. శ్రీ సాయి దత్త గ్రంథములు

1. శ్రీ సాయిబాబా సచ్ఛరిత్ర 99-00
2. సంపూర్ణ శ్రీ గురు చరిత్ర 99-00
3. శ్రీ సాయిఆరాధన-షిర్డీవైభవం 99-00
4. శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర (క్రౌన్) 54-00
5. శ్రీ గురుచరిత్ర (క్రౌన్) 54-00
6. దాసగణకృత శ్రీసాయి చరిత్ర 36-00
7. నవనాధ చరిత్ర 99-00
8. శ్రీసాయిచరిత్ర(బైండు)
ప్రయాణపుపారాయణగ్రంథం 54-00
9. శ్రీగురుచరిత్ర (బైండు)
ప్రయాణపుపారాయణగ్రంథం 54-00
10. సత్యదత్తవ్రతం దత్తాత్రేయపూజాకల్పం,సహస్రంతో 20-00
11. అనఘాదేవీ వ్రతం 20-00
12. భక్తుల ప్రశ్నలకు బాబా జవాబులు 30-00
13. మనసులోనిప్రశ్నకుశ్రీసాయిబాబాజవాబులు 30-00
14. అక్షరక్రమములో శ్రీసాయిసూక్తులు 30-00

| | |
|---|---|
| **15.** శ్రీ సాయిపూజాకల్పం (సహస్రంతో) | **20-00** |
| **16.** శ్రీ సాయిభజనమాల | **20-00** |
| **17.** శ్రీ సాయి భజన్స్ | **20-00** |
| **18.** శ్రీ సాయిభక్తి గీతాలు | **20-00** |
| **19.** శిరిడిహారతులు (భావంతో) | **20-00** |
| **20.** "శ్రీసాయి"కోటి | **25-00** |
| **21.** "శ్రీసాయిరామ్"కోటి | **36-00** |
| **22.** శ్రీ సాయినాథ స్తోత్రమంజరి | **10-00** |
| **23.** శ్రీ సాయివేయినామాలు | **3-50** |
| **24.** శ్రీ సాయి సహస్ర నామావళి | **10-00** |
| **25.** శ్రీ సాయి చాలీసా-సుప్రభాతం | **10-00** |
| **26.** శ్రీ సాయినాథ చాలీసా | **10-00** |
| **27.** శ్రీ సాయి హారతులు (పాకెట్) | **10-00** |
| **28.** శ్రీ సాయి నిత్యపూజ (పాకెట్) | **10-00** |
| **29.** శ్రీ సాయి సూక్తులు | **10-00** |
| **30.** శ్రీ సాయి స్తవనమంజరి-దత్తచాలీసా | **10-00** |
| **31.** శ్రీసాయి నక్షత్రమాలిక | **10-00** |
| **32.** హిందీ శ్రీ సాయి హారతులు | **12-00** |
| **33.** శని సింగణాపూర్ క్షేత్రమాహాత్మ్యం | **45-00** |
| **34.** ఇంగ్లీషు శ్రీ సాయిహారతులు | **12-00** |
| **35.** షిరిడి దర్శనం-శ్రీసాయి వైభవం | **99-00** |
| **36.** సాయిసత్యవ్రతం | **20-00** |
| **37.** సాయి అనుగ్రహమ్ | **108-00** |
| **38.** నవగురువారాల వ్రతకల్పము | **15-00** |
| **39.** శ్రీదత్తలీలామృతము | **99-00** |

| | |
|---|---|
| **40.** హృదయంలో సాయి | **12-00** |
| **41.** శ్రీషిరిడీసాయి లీలామృతం(శ్రీసచ్ఛరిత్ర) | **99-00** |
| **42.** గజాననమహరాజ్ చరిత్ర | **99-00** |

## 4. జ్యోతిషాలు

| | |
|---|---|
| **1.** 'శుభసమయ' గంటల పంచాంగం | **40-00** |
| **2.** సనాతన వైదిక బ్రాహ్మణ పంచాంగం (వంగిపురపువారి పత్రికసైజ్‌పంచాంగం) | **75-00** |
| **3.** 'కాలచక్రం' గంటలపంచాంగం (గార్గేయ) | **60-00** |
| **4.** చిత్రాలగురుమూర్తిగుప్తాపంచాంగము | **60-00** |
| **5.** గ్రహభూమి పంచాంగము (గార్గేయ) | **116-00** |
| **6.** ఆనందసిద్ధి పంచాంగం (వై.వి.శాస్త్రి) | **60-00** |
| **7.** శ్రీచక్ర పంచాంగము (రాష్ట్రతొలిమహిళపంచాంగకర్త) | **40-00** |
| **8.** ములుగువారిరాశిఫలితాలు(12రాశులువారికి) | **40-00** |
| **9.** ములుగువారిరాశిఫలితాలు విడివిడిగాఒక్కొక్కటి | **10-00** |
| **10.** కాలచక్రం జ్యోతిష క్యాలండర్ | **25-00** |
| **11.** గ్రహబలం క్యాలండర్(శ్రీనివాసగార్గేయ-భక్తిటివి) | **25-00** |
| **12.** శుభలగ్నం (తంగిరాల) క్యాలండర్ | **25-00** |
| **13.** శుభమస్తు (పిడపర్తి) క్యాలండర్ | **25-00** |
| **14.** సాదా క్యాలండర్ | **5-00** |
| **15.** పాకెట్ క్యాలండర్ | **15-00** |
| **16.** తాజకనీలకంఠీయమ్ | **100-00** |
| **17.** కేరళ జ్యోతిష రహస్యాలు | **150-00** |
| **18.** జ్యోతిష బ్రహ్మ రహస్యాలు | **150-00** |
| **19.** మానసాగరి జాతకపద్ధతి | **150-00** |

| | | |
|---|---|---|
| **20.** | వరాహమిహిర జాతకపద్ధతి | **150-00** |
| **21.** | వధూవర వివాహమైత్రిద్వాదశకూటములు | **99-00** |
| **22.** | సింపుల్ రెమిడీస్ | **250-00** |
| **23.** | శంభు హోరప్రకాశిక | **250-00** |
| **24.** | పూర్వ పరాశరి | **100-00** |
| **25.** | పరాశర జ్యోతిషవిజ్ఞాన సర్వస్వం | **200-00** |
| **26.** | ప్రశ్న సింధు | **99-00** |
| **27.** | నక్షత్ర విశేష ఫలితాలు | **45-00** |
| **28.** | సర్వార్థ ఫలచంద్రిక | **99-00** |
| **29.** | సూర్యసిద్ధాంతపంచాంగగణితంచేయడంఎలా? | **150-00** |
| **30.** | దృక్సిద్ధాంతపంచాంగగణితం చేయడంఎలా? | **150-00** |
| **31.** | ఆయుర్దాయ నిర్ణయం | **45-00** |
| **32.** | జాతక గణిత ప్రవేశిక | **50-00** |
| **33.** | జ్యోతిషమర్మబోధిని | **50-00** |
| **34.** | జ్యోతిష ప్రశ్నోత్తరమాల | **50-00** |
| **35.** | ముహూర్తం నిర్ణయించడంఎలా? | **50-00** |
| **36.** | జాతక మకరందం | **36-00** |
| **37.** | జ్యోతిష సరస్వతి | **36-00** |
| **38.** | మీజననకాల విశేషాలు | **36-00** |
| **39.** | ముహూర్త విజ్ఞాన భాస్కరం | **36-00** |
| **40.** | జ్యోతిష స్వయంబోధిని | **36-00** |
| **41.** | శుభముహూర్త శిరోమణి | **36-00** |
| **42.** | నక్షత్ర ఫలమంజరి | **36-00** |
| **43.** | పంచాంగం చూసే విధానం | **36-00** |
| **44.** | సర్వార్థ జ్యోతిషం | **36-00** |

| | |
|---|---|
| **45. ప్రాథమిక జ్యోతిషం** | **36-00** |
| **46. నవరత్నములు శుభయోగములు** | **36-00** |
| **47. శుభశకునాలు** | **25-00** |
| **48. హస్తరేఖాఫలితాలు** | **36-00** |
| **49. సంఖ్యల్లో భవిష్యత్** | **36-00** |
| **50. ముహూర్త దీపిక** | **99-00** |
| **51. పుట్టుమచ్చలు ఫలితాలు** | **25-00** |
| **52. కలలు ఫలితాలు** | **25-00** |
| **53. జాతక చక్రం వేయడం ఎలా?** | **36-00** |
| **54. మానసాగరి** (ప్రాచీనజ్యోతిషగ్రంథం) -పుచ్చాశ్రీనివాసరావు | **250-00** |
| **55. జ్యోతిషశాస్త్ర చిట్కాలు** | **108-00** |
| **56. గుప్తా శతాబ్ది పంచాంగం**(1940-2050) | **1000-00** |
| **57. ప్రశ్నచండేశ్వరమ్** | **50-00** |
| **58. ద్వాదశభావ ఫలచంద్రిక** | **250-00** |
| **59. జాతకచక్రం మీరే వేసుకోవచ్చు** | **36-00** |
| **60. జ్యోతిష శతయోగరత్నావళి** (నూరుయోగాలఫలితాలు) | **108-00** |
| **61. అంగసాముద్రికం** | **36-00** |
| **62. హస్త సాముద్రికం** | **50-00** |
| **63. లాల్ కితాబ్** | **99-00** |
| **64. శకునశాస్త్రం** | **80-00** |
| **65. ఆధునికప్రశ్నశాస్త్రం** | **120-00** |
| **66. పరాశరజ్యోతిష ప్రశ్నజ్యోతిషం** | **150-00** |
| **67. అష్టకవర్గు** | **50-00** |

| | |
|---|---|
| **68.** బృహత్‌జాతకం(ప్రాచీనప్రతికిపునర్ముద్రణ) | **200-00** |
| **69.** లగ్నరత్నాకరం | **45-00** |
| **70.** షట్పంచాశిక | **120-00** |
| **71.** 40 రోజుల్లో జ్యోతిషంనేర్చుకొనండి | **270-00** |
| **72.** 40 రోజుల్లో సాముద్రికంనేర్చుకొనండి | **150-00** |
| **73.** 40 రోజుల్లో సంఖ్యాశాస్త్రం | **150-00** |
| **74.** 40 రోజుల్లో నక్షత్ర (నాడీ) ఫలితములు | **270-00** |
| **75.** 40 రోజుల్లో వైద్యజ్యోతిషం నేర్చుకోండి | **250-00** |
| **76.** మీ పుట్టినతేదీ అద్భుతరహస్యాలు(Numarolgy) | **270-00** |
| **77.** కె.పి.జ్యోతిషం (పరిచయం) | **50-00** |
| **78.** ముహూర్తచింతామణి | **99-00** |
| **79.** సూర్యచంద్ర గ్రహణములు | **50-00** |
| **80.** ప్రసిద్ధవ్యక్తుల జాతకాలు (వేరేకొండప్ప) | **150-00** |
| **81.** అదృష్టరెమెడీస్ | **120-00** |
| **82.** గ్రహసంచార ఫలనిర్ణయదీపిక | **50-00** |
| **83.** జ్యోతిష రెమిడీస్ | **300-00** |
| **84.** జాతకమార్తాండం పాతప్రతికి యథాతథం(కొండపల్లి) | **250-00** |
| **85.** జ్యోతిషవిద్యాప్రకాశిక పాతప్రతికి యథాతథం(కొండపల్లి) | **250-00** |
| **86.** నాడీజ్యోతిషం | **50-00** |
| **87.** గార్గేయం మీ గ్రహబలం రెమిడీస్ | **250-00** |
| **88.** నక్షత్రపారిజాతం (గోరసవీరభద్రాచార్య) | **50-00** |
| **89.** లగ్నపారిజాతం (గోరసవీరభద్రాచార్య) | **50-00** |
| **90.** గౌతమసంహిత | **50-00** |

**91.** హోరరత్నమాల **50-00**

**92.** జాతకఫల మణిమంజరి **200-00**

**93.** పుష్కర పంచాంగం **540-00**

**94.** దశాభుక్తిఫల నిర్ణయం **250-00**

**95.** వింత జోష్యములు **50-00**

**96.** షోడశవర్గులు **200-00**

**97-105.** రవి/చంద్ర/కుజ/బుధ/గురు/శుక్ర/శని/రాహుకేతు

-నవగ్రహములకు ఒక్కొక్క పుస్తకం **99-00**

**106.** ముహూర్తమార్తాండం **50-00**

**107.** లఘుజాతకం **50-00**

**108.** జాతకాలంకారము **50-00**

**109-120.** మేషాది మీనం-12 లగ్నాలు

ఒక్కొక్క లగ్నం గ్రంథం **99-00**

**121.** నారద సంహిత **200-00**

**122.** పంచాంగపీఠికలేఖికాగణితం **250-00**

**123.** తారాబలం - చంద్రబలం (వేరే కొండప్ప) **99-00**

**124.** సులభలగ్న సాధన (చిత్రాలగురుమూర్తిగుప్తా) **200-00**

**125.** రమలశాస్త్రం **108-00**

**126.** ముహూర్త రత్నావళి **250-00**

<u>బి.వి.రామన్ గారి గ్రంథములు</u>

**125.** జ్యోతిష విద్యారంభం **50-00**

**126.** గ్రహభావ బలములు **50-00**

**127.** కాలచక్రదశ **50-00**

**128.** అనుభవ ప్రశ్నాజ్యోతిషం **50-00**

**129.** జ్యోతిషశాస్త్రంలో వాతావరణ భూకంపాలు **50-00**

| | | |
|---|---|---|
| 130. | పురోగామి జాతకం | 50-00 |
| 131. | భావార్ధరత్నాకరం | 75-00 |
| 132. | భారతీయజ్యోతిష సర్వస్వం | 75-00 |
| 133. | అష్టకవర్గ పద్ధతిః | 75-00 |
| 134. | జ్యోతిషశాస్త్రంలో సందేహాలు,సమాధానాలు | 75-00 |
| 135. | ప్రశ్నతంత్ర | 75-00 |
| 136. | ముహూర్తం | 75-00 |
| 137. | విశిష్ట జాతకములు | 125-00 |
| 138. | భారతీయఫలితజ్యోతిషం | 125-00 |
| 139. | 300 ముఖ్యమైన యోగములు | 125-00 |
| 140. | జాతకంపరిశీలించడంఎలా ? | 300-00 |

**రాష్ట్రపతి అవార్డుగ్రహీత, మహామహోపాధ్యాయ, వాచస్పతి**

**శ్రీ మధురకృష్ణమూర్తిగారి గ్రంథములు**

| | | |
|---|---|---|
| 141. | బృహత్పరాశరహోరాశాస్త్రము-1 | 200-00 |
| 142. | బృహత్పరాశరహోరాశాస్త్రము-2 | 200-00 |
| 143. | బృహత్పరాశరహోరాశాస్త్రము-3 | 200-00 |
| 144. | బృహత్పరాశరహోరాశాస్త్రము-4 | 200-00 |
| 145. | భావార్ధరత్నాకరము | 100-00 |
| 146. | ముహూర్త చింతామణి | 100-00 |
| 147. | ముహూర్త చింతామణి-పార్టు2 | 200-00 |
| 148. | స్వప్న శాస్త్రము | 50-00 |
| 149. | శతయోగమంజరి | 33-00 |
| 150. | వ్రతనిర్ణయకల్పవల్లి | 165-00 |
| 151. | దైవజ్ఞవల్లభం | 50-00 |
| 152. | వసంతరాజశకునమ్(బృహత్శకునశాస్త్రం) | .... |

| | | |
|---|---|---|
| **153.** | వాస్తుశాస్త్రవివేకము-1 | **50-00** |
| **154.** | వాస్తుశాస్త్రవివేకము-2 | **200-00** |
| **155.** | వాస్తుశాస్త్రవివేకము-3 | **50-00** |
| **156.** | వాస్తుశాస్త్రవివేకము-4 | **200-00** |
| **157.** | అనుభవసులభవాస్తు - 1 | **50-00** |
| **158.** | అనుభవసులభవాస్తు - 2 | **66-00** |

## 5. వాస్తులు

| | | |
|---|---|---|
| **1.** | 40 రోజుల్లో **"వాస్తువిద్య"** నేర్చుకొనండి | **180-00** |
| **2.** | వాస్తుశాస్త్ర రహస్యములు (బైండు) | **108-00** |
| **3.** | వాస్తునుబట్టి మీ ఇల్లు | **50-00** |
| **4.** | మీరూ మీ వాస్తు | **50-00** |
| **5.** | గృహవాస్తు చిట్కాలు | **50-00** |
| **6.** | వాస్తు పూజ | **50-00** |
| **7.** | వాస్తు సూత్రములు | **50-00** |
| **8.** | వాస్తుశాస్త్ర రహస్యాలు | **50-00** |
| **9.** | గృహవాస్తు వర్గులు | **99-00** |
| **10.** | విశ్వకర్మవాస్తు శాస్త్రరీత్యా మీ ఇంటి ప్లానులు | **50-00** |
| **11.** | విశ్వకర్మ వాస్తుశాస్త్రరీత్యా మీఇండ్లఆయములు | **99-00** |
| **12.** | విశ్వకర్మ వాస్తు శాస్త్రం(చిత్రాలగురుమూర్తిగుప్తా) | **180-00** |
| **13.** | ఆధునిక గృహవాస్తు | **99-00** |
| **14.** | శుభవాస్తు | **270-00** |
| **15.** | వాస్తుయంత్ర రత్నావళి | **108-00** |
| **16.** | వాస్తుశాస్త్రం | **50-00** |
| **17.** | హౌస్ ప్లాన్లు | **50-00** |
| **18.** | గృహవాస్తుసారం | **50-00** |

| | | |
|---|---|---|
| **19.** గృహవాస్తు చంద్రిక | | **50-00** |
| **20.** గృహవాస్తు దర్పణం | | **50-00** |
| **21.** జ్యోతిష-గృహవాస్తుచంద్రిక | | **50-00** |
| **22.** వాస్తురత్నాకరం | (కొండపల్లి) | **50-00** |
| **23.** వాస్తుశిరోమణి | ,, | **50-00** |
| **24.** శ్రీకృష్ణవాస్తు | ,, | **50-00** |
| **25.** పంచవాస్తు పారిజాతం | ,, | **108-00** |
| **26.** వాస్తుడిండిమమ్ | ,, | **50-00** |
| **27.** వాస్తుదుందిభి | ,, | **108-00** |
| **28.** విశ్వకర్మవాస్తుప్రకాశిక | | **99-00** |
| **29.** కృష్ణవాస్తుశాస్త్రము | | **50-00** |
| **30.** జలవాస్తు,శల్యవాస్తు(దంతూరిపండరీనాథ్) | | **75-00** |
| **31.** మయవాస్తు (గోరసవీరభద్రాచార్య) | | **120-00** |
| **32.** వాస్తుజ్యోతి | | **54-00** |

## 6. మంత్రశాస్త్రాలు

| | |
|---|---|
| **1.** మంత్రసాధన | **50-00** |
| **2.** తంత్రజాలం | **50-00** |
| **3.** మంత్రశక్తి | **50-00** |
| **4.** దత్తాత్రేయ తంత్రవిద్య | **50-00** |
| **5.** దత్తాత్రేయ మూలికాతంత్రమ్ | **50-00** |
| **6.** తాంత్రిక పంచాంగం | **50-00** |
| **7.** యక్షిణీ తంత్రం | **50-00** |
| **8.** మంత్రానుష్ఠాన చంద్రిక | **50-00** |
| **9.** సర్వదేవతా మంత్రకవచములు | **50-00** |
| **10.** మంత్రాక్షరాలరహస్యం(బీజాక్షరనిఘంటువు) | **50-00** |

| | | |
|---|---|---|
| **11.** | సర్వదేవతా మంత్రరత్నావళి | **50-00** |
| **12.** | సదాచార దీపిక | **50-00** |
| **13.** | యోగినీ-వామకేశ్వరతంత్రం | **50-00** |
| **14.** | ప్రపంచసారతంత్రం | **50-00** |
| **15.** | బదనిక తంత్రమ్ | **50-00** |
| **16.** | ఉచ్ఛిష్ట గణపతి తంత్రమ్ | **50-00** |
| **17.** | గుప్త సాధన తంత్రం | **50-00** |
| **18.** | గంధర్వ తంత్రమ్ | **50-00** |
| **19.** | సౌందర్యలహరి (మంత్రయంత్రరత్నావళి) | **50-00** |
| **20.** | యంత్ర మంత్ర తంత్ర | **50-00** |
| **21.** | పాశుపత తంత్రం | **99-00** |
| **22.** | పంచదశ మహాఖడ్గ తంత్రం | **99-00** |
| **23.** | రుద్రాష్టాధ్యాయః | **99-00** |
| **24.** | మంత్రసిద్ధి | **108-00** |
| **25.** | పరశురామతంత్రమ్ | **108-00** |
| **26.** | శ్రీలలితావిలోమ పంచదశీ | **108-00** |
| **27.** | శ్రీ గురు తంత్రం | **108-00** |
| **28.** | గాయత్రీ తంత్రమ్ | **108-00** |
| **29.** | శూలినీదుర్గాతంత్రం (చిన్నది) | **100-00** |
| **30.** | మహాశక్తి మంత్ర తంత్ర రహస్యాలు | **200-00** |
| **31.** | శ్రీ దుర్గ తంత్రమ్ | **200-00** |
| **32.** | మహామృత్యుంజయఅమృతపాశుపతమ్ | **200-00** |
| **33.** | సర్ప (నాగ)తంత్రం | **250-00** |
| **34.** | హవన తంత్రం | **250-00** |
| **35.** | షోడశనిత్యతంత్రం | **250-00** |

| | |
|---|---|
| 36. శాక్తేయతంత్రం | 250-00 |
| 37. రుద్రయామళతంత్రం | 250-00 |
| 38. లక్ష్మీప్రత్యంగిరా తంత్రమ్ | 250-00 |
| 39. హిరణ్యశూలినీ తంత్రమ్ | 250-00 |
| 40. మాయాప్రత్యంగిరా తంత్రమ్ | 250-00 |
| 41. శ్రీ విశ్వరూప ప్రత్యంగిరా తంత్రమ్ | 250-00 |
| 42. స్వర్ణాకర్షణభైరవతంత్రం | 250-00 |
| 43. కాశీవిశాలాక్షి తంత్రం | 250-00 |
| 44. శాంతితంత్రమ్ | 250-00 |
| 45. యంత్రసిద్ధి | 330-00 |
| 46. శ్రీ లక్ష్మీ తంత్రమ్ | 360-00 |
| 47. మంత్రమహోదధి (స్త్రీదేవతాఃకల్పమ్) | 360-00 |
| 48. మంత్రమహోదధి (పురుషదేవతాఃకల్పమ్) | 360-00 |
| 49. మంత్రశాస్త్రం (గ్రంథము) | 360-00 |
| 50. ప్రత్యంగిరాకృత్యాతంత్రం | 360-00 |
| 51. కామధేనువు తంత్రం | 360-00 |
| 52. శూలినీదుర్గాతంత్రం | 360-00 |

## 7. గ్రంథాలు - ఆరాధనలు

| | |
|---|---|
| 1. భగవద్గీత శ్లోక తాత్పర్య సహితం | 40-00 |
| 2. గణేశ ఆరాధన 1 | 99-00 |
| 3. గణేశోపాసన 2 | 99-00 |
| 4. నవగ్రహవైభవం | 99-00 |
| 5. నవగ్రహ రెమెడీస్ | 99-00 |
| 6. నవగ్రహ వేదం | 99-00 |
| 7. శనిగ్రహారాధన | 99-00 |

| | | |
|---|---|---|
| 8. | ఆదిత్యారాధన | 99-00 |
| 9. | సుబ్రహ్మణ్యారాధన | 99-00 |
| 10. | శ్రీ శివ ఆరాధన | 99-00 |
| 11. | లక్ష్మీ ఆరాధన | 99-00 |
| 12. | హనుమదారాధన | 99-00 |
| 13. | లలితారాధన | 99-00 |
| 14. | శ్రీ చక్రారాధన | 99-00 |
| 15. | గాయత్రీ ఆరాధన | 99-00 |
| 16. | వీరభద్రారాధన | 99-00 |
| 17. | కుజగ్రహారాధన | 99-00 |
| 18. | భైరవారాధన | 99-00 |
| 19. | దైవారాధన | 99-00 |
| 20. | గీతారాధన | 99-00 |
| 21. | శ్రీవేంకటేశ్వరాధన | 99-00 |
| 22. | హయగ్రీవారాధన | 99-00 |
| 23. | లక్ష్మీనరసింహారాధన | 99-00 |
| 24. | శ్రీ బాలాత్రిపురసుందరీ స్తోత్ర కదంబం | 99-00 |
| 25. | దేవీ లీలామృతం | 99-00 |
| 26. | పురాణపండ సుందరకాండ వచనం | 99-00 |
| 27. | పురాణపండ రామాయణం | 99-00 |
| 28. | పురాణపండ భారతం | 99-00 |
| 29. | పురాణపండ భాగవతం | 99-00 |
| 30. | (సూరి) వాల్మీకి రామాయణం | 99-00 |
| 31. | కాలసర్ప యోగం | 99-00 |
| 32. | నిత్య జీవితములో రుద్రాక్షలు | 99-00 |

| | |
|---|---|
| **33.** నిత్య జీవితములో నవరత్నాలు | **99-00** |
| **34.** వేదసూక్తములు | **99-00** |
| **35.** వేమన పద్యసారామృతం | **99-00** |
| **36.** పండగలు పర్వదినాలు | **99-00** |
| **37.** సూక్తిరత్నాలు | **99-00** |
| **38.** హనుమచ్ఛరిత్ర | **99-00** |
| **39.** నవగ్రహ దర్శనమ్ | **99-00** |
| **40.** నిత్యజీవితంలో నవగ్రహాలు | **99-00** |
| **41.** సాలగ్రామములు | **99-00** |
| **42.** గురుశుక్ర ప్రభావము చంద్రకళానాడీ | **99-00** |
| **43.** శనిగ్రహరెమిడీస్ | **99-00** |
| **44.** జాతకసుధాసారము-జాతకమోక్షప్రదాయిని | **99-00** |
| **45.** వివాహ జ్యోతిషమంజరి-<br>మ్యారేజ్‌మ్యాచింగ్‌గైడ్ (సాయిగణపతిరెడ్డి) | **99-00** |
| **46.** మీపుట్టినతేదీనిబట్టి మీజీవితరహస్యాలు<br>(న్యూమరాలజీ లైఫ్‌గైడ్) ,, | **99-00** |
| **47.** మీఅదృష్టానికి (పేరు) నేమ్‌కరక్షన్ | **99-00** |
| **48.** మూకపంచశతీ | **99-00** |
| **49.** పంచమవేదం మహాభారతం | **99-00** |
| **50.** దేవుళ్ళు డాట్ కామ్ | **99-00** |
| **51.** గణపతిభాష్యం | **99-00** |
| **52.** యజుర్వేద ఉపనయనవివాహప్రయోగమంజరి | **99-00** |
| **53.** నవయోగులు | **99-00** |
| **54.** ఆంధ్రప్రదేశ్‌లోనిదర్శించవలసిన ప్రముఖదర్గాలు | **99-00** |
| **55.** సకలదేవతాఅష్టోత్తరాలు(పెద్దది)- | |

| | |
|---|---|
| (180అష్టోత్తరశతనామావళులతో) | 99-00 |
| **56.** సకలదేవతా సహస్రనామములు | 99-00 |
| **57.** ఆధ్యాత్మిక సూక్తి నిధి | 99-00 |
| **58.** బ్రాహ్మణులు గోత్రాలు,ప్రవరలు | 99-00 |
| **59.** సర్వదేవతాస్వరూపుడు శ్రీ వేంకటేశ్వరుడు | 99-00 |
| **60.** శ్రీ లక్ష్మీసన్నిధి | 99-00 |
| **61.** శ్రీలక్ష్మీ గణపతి హోమకల్పం | 99-00 |
| **62.** మార్షల్ఆర్ట్స్ (కరాటే,కుంగ్ఫూనేర్చుకోండి) | 99-00 |
| **63.** మ్యాజిక్గైడ్ | 99-00 |
| **64.** చదరంగం | 99-00 |
| **65.** పంచముఖ హనుమత్ వైభవం | 54-00 |
| **66.** గరుడపురాణం | 40-00 |
| **67.** మాఘపురాణం | 30-00 |
| **68.** శివపురాణం | 30-00 |
| **69.** వైశాఖపురాణం | 30-00 |
| **70.** స్థూలాక్షరి మాఘపురాణం | 54-00 |
| **71.** స్థూలాక్షరి శివపురాణం | 54-00 |
| **72.** స్థూలాక్షరి వైశాఖపురాణం | 54-00 |
| **73.** కార్తీక పురాణం | 30-00 |
| **74.** కార్తీక పురాణం (చిన్నది) | 25-00 |
| **75.** సర్వకార్యసిద్ధికి రామాయణపారాయణ | 50-00 |
| **76.** పెద్దబాలశిక్ష | 40-00 |
| **77.** గాయత్రీ మహిమ | 36-00 |
| **78.** మత్స్య యంత్ర మహిమ | 50-00 |
| **79.** వృక్షదేవతలు | 50-00 |

| | |
|---|---|
| **80.** యాజుష స్మార్త సంస్కార చంద్రిక | **150-00** |
| **81.** సనాతనవైదిక బ్రాహ్మణస్మార్తాగమకల్పమ్ | **150-00** |
| **82. చతుర్వేదములు** | **144-00** |
| **83.** నవగ్రహారాధన | **144-00** |
| **84.** తాళపత్ర సమాహార **గోపురం** | **144-00** |
| **85. మనుధర్మ శాస్త్రం** (వచనంలో...) | **144-00** |
| **86. వేదమంత్ర సంహిత** | **144-00** |
| **87.** సహస్రలింగార్చన | **144-00** |
| **88. శ్రీ శివగీత** | **144-00** |
| **89. ద్వాదశఉపనిషత్తులు** | **144-00** |
| **90.** పురాణపండవారి **సౌందర్యలహరి** (శ్లోకతాత్పర్యసహిత విపులవ్యాఖ్యతో) | **250-00** |
| **100.** బృహత్ శివ స్తోత్ర రత్నాకరము | **216-00** |
| **101.** బృహత్ దేవీ స్తోత్రరత్నాకరము | **216-00** |
| **102.** బృహత్ విష్ణు స్తోత్రరత్నాకరము | **216-00** |
| **103. కేదారనాథ్ బదరీనాథ్ యాత్రాగైడు** | **40-00** |
| **104. దక్షిణావృత శంఖములు** | **50-00** |
| **105. 108 దివ్యదేశాల విష్ణుక్షేత్రదర్శని** | **36-00** |
| **106. ధర్మసింధువు(కేస్‌బైండింగ్)** | **270-00** |
| **107. భారతీయ శైవక్షేత్రయాత్రాదర్శిని** | **108-00** |
| **108. చిలుకూరి బాలాజీచరిత్ర** | **36-00** |
| **109. భగవత్‌స్తుతి** | **...** |
| **110. సూర్యోపాసన** | **36-00** |
| **111. సనాతన సంప్రదాయాలు-ఆచారవ్యవహారాలు** | **...** |
| **112. కాశీఖండం** | **250-00** |

113. దేవీభాగవతం(కేస్‌బైండ్) ....

## 8. వైద్య గ్రంథాలు

| | | |
|---|---|---|
| 1. | ఆహారం ఆరోగ్యం | 36-00 |
| 2. | మూలికావైద్య చిట్కాలు | 36-00 |
| 3. | ఆయుర్వేద వైద్య చిట్కాలు | 25-00 |
| 4. | ఆయుర్వేద వైద్యం | 36-00 |
| 5. | గృహవైద్య రహస్యాలు | 36-00 |
| 6. | ఆయుర్వేద వైద్యచింతామణి - సెట్ | 400-00 |
| 7. | గృహవైద్యసారం | 36-00 |
| 8. | హోమియోవైద్యం (ద్వాదశలవణచికిత్స) | 54-00 |
| 9. | ప్రకృతివైద్యం | 36-00 |
| 10. | ఆహారం-వైద్యం | 99-00 |
| 11. | సంపూర్ణ ఆయుర్వేద-చిట్కా వైద్యం | 99-00 |
| 12. | ఆయుర్వేదమ్ | 36-00 |
| 13. | ఆయుర్వేద మూలికావైద్యదీపిక | 99-00 |
| 14. | దుంపకూరలు, ఆకుకూరలు, కాయగూరలు వాడకం - ఉపయోగాలు | 99-00 |
| 15. | వనమూలికావైద్యం | 300-00 |
| 16. | ఏకమూలికావైద్యం | 99-00 |
| 17. | అష్టాంగ హృదయం(4భాగాలు) | 1200-00 |
| 18. | రహస్యసిద్ధయోగవైద్యసారమ్ | 99-00 |
| 19. | ప్రాథమిక హోమియోవైద్యం | 99-00 |
| 20. | ఒబెసిటి | 99-00 |
| 21. | హెల్త్‌గైడ్ | 99-00 |
| 22. | ఆయుర్వేదం-జీవనవేదం | 99-00 |

| | |
|---|---|
| 23. ఫుడ్‌థెరపి | 99-00 |
| 24. న్యాచురల్‌థెరపి | 99-00 |
| 25. సంపూర్ణఆరోగ్యానికి 20ని॥ | 99-00 |
| 26. కీళ్ళనొప్పులు మీ సమస్యలైతే... | 99-00 |
| 27. యోగామంత్ర | 99-00 |
| 28. యోగా సండే టు మండే | 99-00 |
| 29. హెర్బల్ మెడిసిన్-హెల్త్‌టుడే | 99-00 |
| 30. హెల్త్‌ఫైల్ | 108-00 |
| 31. వస్తుగుణపాఠం | 250-00 |
| 32. రసాయన వాజీకరణ తంత్రం | 150-00 |
| 33. సిద్ధమూలికా రహస్యం | 99-00 |
| 34. నాటువైద్యం | 360-00 |

## 9. అయ్యప్ప - భవానీ రకాలు

| | |
|---|---|
| 1. శ్రీ అయ్యప్ప లీలామృతం | 36-00 |
| 2. శ్రీ అయ్యప్ప ఆరాధన | 54-00 |
| 3. శ్రీ అయ్యప్ప భజనపాటలు | 54-00 |
| 4. శ్రీ అయ్యప్ప పూజాకల్పం | 20-00 |
| 5. శ్రీ అయ్యప్ప భక్తి గీతాలు | 20-00 |
| 6. శ్రీ అయ్యప్ప దీక్ష F | 10-00 |
| 7. శ్రీ అయ్యప్ప భజనమాల F | 10-00 |
| 8. శ్రీ అయ్యప్ప నిత్యపూజ P | 10-00 |
| 9. శ్రీ అయ్యప్ప నిత్యనియమావళి P | 8-00 |
| 10. శ్రీ భవానీ లీలామృతం(దుర్గాభవానీదీక్ష) | 36-00 |
| 11. దేవీలీలామృతం | 99-00 |
| 12. శ్రీ దేవీ పూజాకల్పం | 20-00 |

| | | |
|---|---|---|
| 13. దేవీ భక్తిగీతాలు | 20-00 |
| 14. జై భవానీదీక్ష F | 10-00 |
| 15. భవానీదీక్ష P | 8-00 |
| 16. దేవీ భక్తిమాల | 10-00 |
| 17. శ్రీ అయ్యప్ప భజనావళి | 108-00 |
| 18. అయ్యప్పపూజావిధి (జేసుదాసుసాంగ్స్‌తో) | 20-00 |

## 10. భజనలు - కీర్తనలు

| | |
|---|---|
| 1. అన్నమయ్య కీర్తనలు | 25-00 |
| 2. శ్రీరామదాసు కీర్తనలు | 25-00 |
| 3. సర్వదేవతా మంగళహారతులు | 20-00 |
| 4. వసుంధర మంగళ హారతులు | 25-00 |
| 5. సౌభాగ్య దేవతా మంగళహారతులు | 36-00 |
| 6. సర్వదేవతా భజనలు | 36-00 |
| 7. చిట్టి పొట్టి పాటలు | 10-00 |
| 8. జాతీయ గీతాలు | 10-00 |
| 9. దేశభక్తి గీతాలు | 36-00 |
| 10. పండుగలు-పుణ్యక్షేత్రాలు భక్తిగీతాలు | 36-00 |
| 11. గొబ్బిళ్ళపాటలు,లాలిపాటలు,కోలాటపాటలు | 36-00 |
| 12. అన్నమయ్య సంకీర్తనలు | 99-00 |
| 13. పెళ్ళిపాటలు-స్త్రీలపాటలు | 36-00 |
| 14. భక్తానంద భజనకీర్తనలు(ఓల్డ్‌సినీస్టైల్) | 36-00 |
| 15. సర్వదేవతాభక్తిమణిమాల | 36-00 |
| 16. బతుకమ్మ ఉయ్యాల పాటలు | 36-00 |
| 17. అన్నమయ్య సంకీర్తనానిధి(1000కీర్తనలు) | 270-00 |

## 11. హిట్స్ సాంగ్స్

| | | |
|---|---|---|
| 1. | ఘంటసాల భక్తిగీతాలు-భగవద్గీత | 36-00 |
| 2. | ఎస్.పి.బాలు భక్తిగీతాలు | 36-00 |
| 3. | ఘంటసాల సుమధురగీతాలు | 99-00 |
| 4. | పి. సుశీల సుమధురగీతాలు | 99-00 |
| 5. | ఎస్.పి. బాలు సుమధురగీతాలు | 99-00 |
| 6. | ఎస్.జానకి సుమధురగీతాలు | 99-00 |
| 7. | వేటూరి సుందరరామమూర్తిహిట్స్ | 99-00 |
| 8. | సర్వదేవతా సినీభక్తిగీతాలు | 99-00 |

## 12. స్త్రీలకు ఉపయుక్త పుస్తకములు

| | | |
|---|---|---|
| 1. | శ్రీకాంతామణి వంటలు (వెజ్) | 54-00 |
| 2. | శ్రీకాంతామణి వంటలు (నాన్‌వెజ్) | 54-00 |
| 3. | శాకాహార వంటలు | 25-00 |
| 4. | మాంసాహారవంటలు | 25-00 |
| 5. | చిట్టిచిట్కాలు | 25-00 |
| 6. | అందానికి చిట్కాలు | 25-00 |
| 7. | పిల్లల పేర్లు (పెద్దది) | 25-00 |
| 8. | పిల్లల పేర్లు (చిన్నది) | 10-00 |
| 9. | లేటెస్ట్ ఎంబ్రాయిడరీ శారీబోర్డర్స్ | 36-00 |
| 10. | లేటెస్ట్ ఎంబ్రాయిడరీ డిజైన్స్ | 36-00 |
| 11. | చిన్నారులకు చిరుతిళ్ళు | 25-00 |
| 12. | పసందైన ఫాస్ట్‌ఫుడ్ వంటలు | 25-00 |
| 13. | పలావ్‌లు, ఫ్రైడ్ రైస్‌లు, వెరైటీరైస్‌లు | 25-00 |
| 14. | వేపుళ్ళు-ఇగుర్లు | 25-00 |
| 15. | ఇంగ్లీషులోఆడపిల్లలపేర్లు | 54-00 |

| | |
|---|---|
| **16.** ఇంగ్లీషులో మగపిల్లలపేర్లు | **54-00** |
| **17.** బ్రేక్‌ఫాస్ట్ వంటలు | **25-00** |
| **18.** పండుగలలో చేసుకొనే పిండివంటలు | **25-00** |
| **19.** మైక్రోవోవెన్ వంటలు | **99-00** |
| **20.** సర్వదేవతాభక్తిమాల | **36-00** |
| **21.** పిల్లలపేర్లు (బాబు) | **36-00** |
| **22.** పిల్లలపేర్లు (పాప) | **36-00** |
| **23.** మోడ్రన్ మెహందీ (గోరింటాకు డిజైన్స్) | **36-00** |
| **24.** మోడ్రన్ పిల్లలపేర్లు | **99-00** |
| **25.** నోరూరించే నాన్‌వెజ్‌వంటలు | **99-00** |
| **26.** మోడ్రన్ టైలరింగ్ (లేడీస్ & జంట్స్) | **99-00** |

## వివిధ రకాలు

| | |
|---|---|
| ఎందరోమహానుభావులు | **200-00** |
| యోగాసనాలు | **36-00** |
| ప్రాణాయామము-యోగా (పతంజలిశ్రీనివాస్) | **63-00** |
| సూర్యనమస్కారములు | **36-00** |
| పొడుపు కథలు (చిన్నవి) | **7-50** |
| కాలజ్ఞాన తత్త్వాలు | **36-00** |
| హిందీ-తెలుగు-స్వబోధిని | **20-00** |
| ఇంగ్లీషు-తెలుగు-స్వబోధిని | **20-00** |
| జనరల్ నాలెడ్జ్ | **20-00** |
| నూరు ఎక్కాలు | **10-00** |
| 1-100 టేబుల్ బుక్ | **10-00** |
| 1-100 టేబుల్‌బుక్ (క్రౌన్‌సైజు) | **10-00** |
| శ్రీరామకోటి | **25-00** |

| | |
|---|---|
| **శ్రీశివకోటి** | **25-00** |
| **మేజిక్** | **25-00** |
| **అంకెలతో గారడీ** | **25-00** |
| **ప్రేమకథలు** | **25-00** |
| **యువతరంగాలు** (యువతరంకోసం) | **25-00** |
| **ప్రేమా నీకు జోహార్లు** (లవ్‌డిక్షనరీ) | **25-00** |
| **హృదయస్పందన** (కవితలు) | **25-00** |
| **వాత్స్యాయన కామసూత్రాలు** | **36-00** |
| **ఎ.పి.టూరిస్ట్ గైడు** | **36-00** |
| **ఇంద్రజాల రహస్యాలు** | **25-00** |
| **మహేంద్రజాల రహస్యాలు** | **25-00** |
| **శరీరభాష (బాడీ లాంగ్వేజ్)** | **99-00** |
| **క్రియాయోగం** | **36-00** |
| **ఆనందంగా జీవిద్దాం** | **99-00** |
| **హరిశ్చంద్ర నాటకం** | **50-00** |
| **వాత్సాయనకామసూత్రాలు** | **99-00** |
| **పంచసాయకం** | **99-00** |
| **రతిరహస్యాలు** | **99-00** |
| **అనంగరంగం** (కంభంపాటి స్వయంప్రకాష్) | **99-00** |
| **శృంగారకేళి** (కంభంపాటి స్వయంప్రకాష్) | **99-00** |
| **అసతోమయ సద్గమయ** | **45-00** |
| **గాయత్రీవిజ్ఞాన్** | **99-00** |
| **చింతామణి** (నాటకం) | **50-00** |
| **బాలనాగమ్మ** | **50-00** |
| **పాండవ ఉద్యోగము** | **50-00** |
| కాళహస్తి **స్త్రీల వ్రతకథలు** | **36-00** |

| | |
|---|---|
| కాళహస్తి రామాంజనేయ యుద్ధం(బదిరెడ్డి) | 50-00 |
| కాళహస్తి గోవింద నామాల భగవద్గీత | 36-00 |
| కాళహస్తి గృహవాస్తు చింతామణి | 99-00 |
| కాళహస్తి గృహవాస్తు మర్మాలు (బైండు) | 50-00 |
| **శివపురాణం** | .... |
| **దేవీభాగవతం** | .... |
| **కులార్ణవ తంత్రమ్** | 150-00 |
| **ఆచార్య సిద్ధ నాగార్జునతంత్రం(ఒరిజనల్)** | 300-00 |
| **యోగాసనాలు (VG/TNL)** | 36-00 |
| **రామరాయవాస్తుశాస్త్రం**(ముద్రగడరామారావు) | 99-00 |
| ఎం.ఎస్.ఆర్.హనుమాన్‌చాలీసా | 10-00 |
| ఎం.ఎస్.ఆర్.సుందరకాండ | 70-00 |
| **అష్టముఖ గండభేరుండతంత్రం** | 75-00 |
| బ్రహ్మంగారిజీవితచరిత్ర (జవంగుల) | 99-00 |
| **శ్రీ ఆదిశంకరాచార్య దివ్యచరితామృతం** | 45-00 |
| **గీతాంజలి (రవీంద్రనాథ్‌ఠాగూర్)** | 50-00 |
| **కాశీరామేశ్వర మజిలీ కథలు** | 50-00 |
| **శ్రీలలితాసహస్రనామము(భాస్కరభాష్యం)** | 500-00 |
| **ప్రకృతిసిద్ధాంతములు-వేదవిజ్ఞానము-** | |
| **ఫలితజాతక సూత్రములు** | 540-00 |
| **వివాహదీపిక (వేదోక్త విధిః)** | .... |

**ముదుండి విశ్వనాథరాజుగారి గ్రంథములు**

| | | |
|---|---|---|
| **విశ్వకర్మ ప్రకాశము** | | 80-00 |
| **ప్రాచీనవాస్తుశాస్త్రాలు-ఆధునికవాస్తుపరిశీలన** | ,, | 250-00 |
| **నారద సంహిత** | ,, | 150-00 |

| | | |
|---|---|---|
| వాస్తురాజవల్లభము-మూలానువాదము | ,, | 60-00 |
| మయమతము - వచనము | ,, | 80-00 |
| బృహత్సంహిత - వచనము | ,, | 160-00 |
| గుప్తవాస్తు వాస్తువిజ్ఞానజ్యోతి | | .... |
| రాహుకేతువులు సమస్త ప్రభావములు | | 150-00 |
| అంగారకుడు (కుజుడు) | | 90-00 |
| శుక్రుడు | | 75-00 |
| పురోహిత దర్శని (గోరసవీరభద్రాచార్య) | | .... |
| విశ్వకర్మవాస్తువిద్యారహస్యములు | ,, | .... |
| వాస్తు విజ్ఞాన చంద్రిక | ,, | .... |
| మహాదశా పారిజాతం | ,, | .... |
| జాతక నారాయణీయం(వాద్రేవువారివి) | | 150-00 |
| వాస్తు నారాయణీయం | ,, | 120-00 |
| యోగావళీఖండం | ,, | 120-00 |
| సర్వార్ధచంద్రిక (4భాగాలు) | | |
| మీరే న్యూమరాలజిస్ట్ (దావూద్) | | 370-00 |
| నిర్ణయసింధు (2భాగాలు) | | 500-00 |
| జయహే...జయహే...(పురాణపండశ్రీనివాస్) | | 27-00 |
| సాయి... | ,, | 27-00 |
| శ్రీ దుర్గానందలహరి | ,, | 200-00 |
| శ్రీమాలిక | ,, | 25-00 |
| ఆరతిసాయిబాబా | ,, | 7-00 |
| మాతృశ్రీస్తోత్రరత్నాకరము | | 100-00 |
| ఆరోగ్యసంహిత | | 250-50 |
| ప్రతిష్ఠకల్పః(సాగి నరసింహమూర్తి) | | 500-00 |
| తాజుద్దీన్‌బాబా సచ్చరిత్ర | | 100-00 |

**సుమారు 100 సం॥రాలునాటి ప్రాచీన ప్రతులు తిరిగి ఈ క్రింది గ్రంథములు ప్రచురించబడినవి.**

జాతకామృతతసారం

జాతక బోధిని

సంగీత విద్యాదర్పణం

సంగీత సర్వార్థసారసంగ్రహం

ముహూర్త మార్తాండం

జాతకరహస్యం

రాజమార్తాండం

ఆయుర్దాయదీపిక

వైద్యామృతం

అనుపానమంజరీ

నవగ్రహశాంతి విధానం

చికిత్సరత్నము

స్వరచింతామణి

ద్వాదశలోహ భస్మవిధానం

దైవజ్ఞయజో విభూషణం

అనుపాన రత్నకరము

కాలామృతము

దైవజ్ఞకర్ణామృతము

రసేంద్ర చింతామణి

రసరత్న సముత్యయము

వస్తుగుణరత్నాకరము

హోరానుదర్పణము

విశ్వకర్మ వాస్తుప్రకాశిక

స్త్రీజన కల్పవల్లి

సంగీత సర్వార్థ సంగ్రహం

వైద్యకల్పతరువు

రసప్రదీపిక

గణకానందము

శ్రీ లలితాసహస్రనామావళిః–వివరణాత్మక భావంతో

నవచండీ వేదోక్త శ్రీ దేవీ పూజాకల్పం

శ్రీ గాయత్రీ అనుష్ఠాన తత్త్వప్రకాశిక

సంగీతమార్తాండము

సారావళి

భేషజకల్పము

గురుశిష్య వైద్యచింతామణి

జాతకమణి

సర్వశకున ప్రకాశిక

యాజుష ప్రయోగ చంద్రిక

శిక్షావల్లీ–ఆనందవల్లీ–భృగువల్లీ

వసంతరాజ శకునము

తొట్టి వైద్యం

జ్యోతిష సిద్ధాంత సంగ్రహము (పంచాంగ గణితం)

సహస్ర యోగప్రకాశిక

OWNER OF BOOK: DURGA CHARAN N

కాపీలు కావలసినవారు :

**మోహన్ పబ్లికేషన్స్,**

**ఆధ్యాత్మిక గ్రంథనిలయం**

**కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదుట,**

**రాజమండ్రి.**

**అరుదైన పాత పంచాంగములు, వ్రతకథలు,**
**పురాణములు,ఆరాధన గ్రంథములు,**
**సుప్రభాతములు,మహాత్మ్యములు, సహస్రనామములు,**
**పూజావిధానములు, స్తోత్రాలు, ప్రామాణిక గ్రంథములు,**
**కథలు, జ్యోతిష, వాస్తు, వైద్య, మంత్రశాస్త్రాది ఆధ్యాత్మిక**
**గ్రంథములకు**

# మోహన్ పబ్లికేషన్స్,

## ఆధ్యాత్మిక గ్రంథనిలయం

**కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదుట,**

**రాజమండ్రి. ఫోన్ :** (0883) 246 25 65

Cell : 903 246 25 65


***From :*** **☎ : 0883-246 25 65**

**MOHAN PUBLICATIONS**

**Fort Gate, Opp : Ajanta Hotel**

**RAJAHMUNDRY-533 101 (A.P.)**

**WWW.MOHANPUBLICATIONS.COM**
***WWW.GRANTHANIDHI.COM***


OWNER OF BOOK : DURGA CHARAN NELABHOTLA

google play store / mohan publications
facebook Like us to follow /Mohanpublications

DURGA CHARAN OWNER OF BOOK